మన తెలంగాణం - తెలుగు మాగాణం

ప్రపంచ తెలుగు మహాసభలు



# తెలంగాణ తేజోమూర్తులు

తెలంగాణ ప్రభుత్వం

భాషా సాంస్కృతిక శాఖ

# తెలంగాణ తేజోమూర్తులు

(153 మంది ప్రముఖుల జీవన చిత్రాలు)

**సంపాదకులు**

మామిడి హరికృష్ణ

విష్ణుభట్ల ఉదయశంకర్

**సలహామండలి**

డా. అమ్మంగి వేణుగోపాల్

డా. సంగిశెట్టి శ్రీనివాస్

డా. నాగబాల సురేష్ కుమార్

డా. ఎస్.వి. రామారావు

శ్రీరామోజు హరగోపాల్

చావలి దేవదాస్

ఎన్. విజయ రాఘవరెడ్డి

డా. సంగనభట్ల నర్సయ్య

డా. ఆర్. కమల

సి.ఎస్. రాంబాబు

**నిర్వహణ - కూర్పు**

అయినంపూడి శ్రీలక్ష్మి



**డైరెక్టర్**

భాషా సాంస్కృతిక శాఖ

కళాభవన్, రవీంద్రభారతి, హైదరాబాద్. ఫోన్ : 040-23212832

**TELANGANA TEJOMURTHULU**

(A Biographical collection of AIR Talks on 153 Luminaries of Telangana)


***Edited by***
**Mamidi Harikrishna,** Director
Dept. of Language and Culture, Telangana.

**V. Udaya Sankar,** Director
All India Radio, Hyderabad.



© Dept. of Language and Culture



***First Edition :***
2017 December
1000 copies

**ISBN : 978-81-936345-7-8**

Price : Rs. 950/-

***Layout & Design***
Padma, Raja Kishore

***Publisher***
The Director, Dept. of Language and Culture,
Kalabhavan, Ravindra Bharathi,
Hyderabad.

***Printed at***
Rainbow Print Pack
Hyderabad. Ph : 040-23731620

***For Copies***
The Director, Dept. of Language and Culture,
Kalabhavan, Ravindra Bharathi,
Hyderabad. Ph : 040-23212832

***Cover***
Cheryala Ravi Shankar



## తెలుగు సాహితీ జగతి - తెలంగాణ ఘనకీర్తి

తెలంగాణలో పరిఢవిల్లిన తెలుగు భాషా సాహిత్య వైభవాన్ని చాటి చెప్పాలనే ఆశయంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ తెలుగు మహాసభలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నది. అజంత భాషగా, సంగీతాత్మకమైన భాషగా, సుసంపన్న సాహిత్య వారసత్వం కలిగిన భాషగా తెలుగుభాష కీర్తి పొందింది. నికోలె డి కాంటి అనే పాశ్చాత్య పండితుడు తెలుగును 'ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్'గా కొనియాడారు. తమిళ జాతీయ కవి సుబ్రహ్మణ్య భారతి 'సుందర తెలుంగు' అని కీర్తించారు.

మన తెలంగాణ ప్రాచీనకాలం నుంచి విభిన్న ప్రక్రియల్లో తెలుగు సారస్వత సంపదను వెలయించిన సాహితీ సుక్షేత్రం. చరిత్రకు అందినంత వరకు తెలంగాణలో 2000 ఏండ్ల పూర్వం నుంచే తెలుగు భాషా పదాల ప్రయోగం ఉన్నట్టు చారిత్రక ఆధారాలు నిరూపిస్తున్నాయి. క్రీ.శ. ఒకటవ శతాబ్దానికి చెందిన హాలుని 'గాథా సప్తశతి'లో తెలుగుకు సంబంధించిన మౌలిక పద ప్రయోగాలు కనిపిస్తున్నాయి.

కరీంనగర్ జిల్లా కురిక్యాల వద్ద బొమ్మలమ్మ గుట్టపై ఉన్న జినవల్లభుని శాసనం కంద పద్యాలలో ఉండటం విశేషం. దీనిని బట్టి క్రీ. శ. 947 నాటికే తెలంగాణలో ఛందోబద్ధ సాహిత్యం ఉన్నదని చరిత్ర చాటి చెబుతున్నది. ఎలుగెత్తి పాడుకునే ద్విపద వంటి దేశీయ ఛందస్సులకు తెలంగాణనే జన్మభూమి. ఉరుతర గద్య పద్యోక్తుల కన్న సరసమైన పరగిన జాను తెనుగులో కావ్యసృష్టి చేస్తానని ప్రతిజ్ఞ చేసి, అచ్చ తెలుగు పలుకుబడికి పట్టం కట్టిన పాల్కురికి సోమన మన జనగామ జిల్లా పాలకుర్తి నివాసి.

### అనేక సాహిత్య ప్రక్రియలకు తెలంగాణనే ఆదిగా నిలిచింది

తెలుగులో అనేక సాహిత్య ప్రక్రియలకు తెలంగాణనే ఆదిగా నిలిచింది. తెలుగులో తొలి స్వతంత్ర రచన 'బసవ పురాణం' తొలి శతకం 'వృషాధిప శతకం', తొలి ఉదాహరణ కావ్యం బసవోదాహరణం పాల్కురికి సోమన వెలువరించిన అనర్ఘ కావ్యరత్నాలు, తొలిగా సోమన చేసిన విభిన్న సాహిత్య ప్రయోగాలే తర్వాత కాలానికి ప్రామాణికాలుగా నిలిచాయి. దీనిని బట్టి తెలుగు భాషా సాహిత్య ప్రస్థానానికి తెలంగాణనే మార్గదర్శకంగా నిలిచిందన్నది నిర్వివాదాంశం.

తేట తెలుగు నుడికారపు సొంపును వెలయిస్తూ గోన బుద్ధారెడ్డి వెలువరించిన 'రంగనాథ రామాయణం' తెలుగులో తొలి 'ద్విపదకావ్యం'. మెదక్ జిల్లా పటాన్ చెరువు నివాసి పొన్నిగంటి తెలగన రచించిన 'యయాతి చరిత్రం' తొలి అచ్చ తెలుగు కావ్యం. సకల నీతి సమ్మతం అనే తొలి నీతిశాస్త్ర గ్రంథాన్ని రచించిన మడికి సింగన పెద్దపల్లి జిల్లా రామగిరి నివాసి. తొలి కథాసంకలన కావ్యం 'సింహాసన ద్వాత్రింశిక'ను రచించిన కొఱవి గోపరాజు నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ నివాసి. చాటు పద్యాలతో ప్రసిద్ధుడైన వేములవాడ భీమకవిది వేములవాడ.

'వాణి నా రాణి' అని ప్రకటించిన 'జైమినీ భారత' కర్త పిల్లలమర్రి పినవీరభద్రుడు నల్లగొండ జిల్లా వాసి. రాచకొండనేలిన సర్వజ్ఞ సింగభూపాలుడు రాజు మాత్రమే కాదు కవిరాజు కూడా. తెలుగువారి పుణ్యపేటిగా భావించే బమ్మెర పోతన రచించిన 'శ్రీమద్భాగవతం' మధురభక్తికి, మంజుల పదవిన్యాసానికి, మనోహరమైన అలంకారిక శైలికి అలవాలమై అజరామర కీర్తి పొందింది. ఆ మహనీయుడు జీవించిన బమ్మెర తెలంగాణ ప్రజల సుసంపన్న సాహిత్య వారసత్వానికి గొప్ప ప్రతీక. ద్వ్యర్థి, త్ర్యర్థి, చతురర్థి కావ్యాలు, చిత్ర, బంధ అవధాన పదవిద్యకు తెలంగాణ ఆలవాలంగా నిలిచింది. శిష్ట సాహిత్యంతో పాటు జానపద జీవధారలకు తెలంగాణ పుట్టినిల్లు.

నిరక్షరాస్యులైన శ్రామికుల నోటి నుంచి ఆశువుగా వెలువడి, అలవోకగా అందమైన తెలుగు పరిమళాలు వెదజల్లే జానపద గీతాలు తెలంగాణ కాపాడుకుంటున్న సజీవ నిధులు. ఆయా శ్రమ సందర్భాల్లో పాడుకునే నాటుపాటలు, రాటుపాటలు, మోటపాటలు, కల్లాలదగ్గర పాడుకునే పాటలు, దంపుడు పాటలు, ఇసుర్రాయి పాటల్లో పల్లె జనుల హృదయ సౌందర్యం ప్రతిఫలిస్తుంది. వివిధ పండుగల సందర్భంగా సామూహికంగా ఆడిపాడే బతుకమ్మ పాటలు, కాముని పున్నమి పాటలు, అసోయి ధూల అని పాడే పీరీల పాటలు ప్రజల సంఘజీవన సంస్కృతిని చాటుతున్నాయి.

ఒకతరం నుంచి మరోతరానికి సజీవమైన తెలుగు పద సంపదను, నుడికారపు సొగసును వారసత్వంగా అందిస్తున్నాయి. చిరుతల రామాయణం, హరికథ, యక్షగానాలు, ఒగ్గు కథలు, బుడిగ జంగాల శారద కథలు, బాలసంతుల పాటలు ఇంకా ఎన్నో విశిష్ట, విలక్షణ కళారూపాల్లో నిండుగా పండిన తెలంగాణ తెలుగు భాష దర్శనమిస్తుంది.

### సమైక్య రాష్ట్రంలో తెలంగాణ సాహిత్య ప్రశస్తి మసకబారింది

పాక్షిక దృష్టితో రాసిన సాహిత్య చరిత్రే చరిత్రగా చలామణి అయింది. మన సాహితీమూర్తుల కృతులు మట్టిలో మాణిక్యాలుగా మిగిలిపోయాయి. వేములవాడ భీమకవి, బమ్మెర పోతన వంటి కవీశ్వరుల జన్మస్థలాల గురించిన చరిత్ర వక్రీకరణకు గురైంది. ఒకదశలో 'తెలంగాణలో కవులే లేరు' అనే స్థాయిలో వాదన చెలరేగిన విపరీతాలు చోటుచేసుకున్నాయి.

ఆ సందర్భంలోనే మహోన్నత చారిత్రక పరిశోధకుడు, తెలుగు సాహిత్య శిఖరంగా వెలుగొందిన కవి, పండితుడు సురవరం ప్రతాపరెడ్డి తెలంగాణ సాహిత్య ప్రతిపత్తిని ప్రపంచానికి చాటాలనే సంకల్పంతో శ్రమకోర్చి, తెలంగాణ నాలుగు చెరుగులా తిరిగి, 354 మంది కవుల రచనలతో 'గోలకొండ కవుల సంచిక'ను వెలువరించారు. అది మన స్వాభిమాన ప్రతీక. సాహిత్య జయపతాక, జలపాత సదృశమైన ధారతో, అద్భుతమైన ప్రౌఢిమతో 'అగ్నిధార', 'రుద్రవీణ' వంటి పద్య కావ్యాలను సృజించిన మహాకవి దాశరథి 'నా తెలంగాణ తల్లి కంజాత వల్లి' అని మాతృభూమిని అపూర్వంగా అభివర్ణించారు. 'భూగర్భమున గనులు, పొంగిపారే నదులు నా తల్లి తెలంగాణరా! వెలలేని నందనోద్యానమ్మురా!' అంటూ ఖమ్మం జిల్లాకు చెందిన రావెళ్ల వెంకట రామారావు తెలంగాణ తల్లి యశస్సును అద్భుతంగా గానం చేశారు.

### వెక్కిరించిన వారికి కాళోజీ కవితలు దీటైన సమాధానం

ప్రజాకవి కాళోజీ తన కవితలతో తెలంగాణ ప్రజల జీవద్భాష గొప్పతనాన్ని ప్రకటిస్తూనే, తెలంగాణ ప్రజల తెలుగును వెక్కిరించినవారికి దీటైన సమాధానమిచ్చారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ప్రజలు తమపై అన్ని రంగాల్లో అమలవుతున్న వివక్ష నుంచి బయటపడేందుకు ఉద్యమించి రాష్ట్రాన్ని సాధించుకున్నారు. ప్రజల ఆకాంక్షలు సాకారం చేస్తూ ఏర్పడిన స్వరాష్ట్రంలో తెలంగాణలో వెలుగొందిన తెలుగు భాషా వైదుష్యాన్ని విశ్వవ్యాప్తం చేసేందుకు ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉన్నది.

నేటి తరానికి మాతృభాష విశిష్టతను తెలిజేయాలని, మన సాహిత్య వారసత్వాన్ని అందించాలని కృత నిశ్చయంతో కృషి చేస్తున్నది. తెలంగాణ సాహిత్యంపై నిరంతర అధ్యయనం, పరిశోధన, విశ్లేషణ, ప్రచురణ, ప్రచారం జరుగవలసిన అవసరాన్ని గుర్తించిన ప్రభుత్వం ఇందుకోసం తెలంగాణ సాహిత్య అకాడమీని ఏర్పాటు చేసింది. అకాడమీ అధ్యక్షుడిగా ప్రసిద్ధ కవి నందిని సిధారెడ్డిని నియమించి, సారథ్య బాధ్యతలు అప్పగించింది.

అలాగే, డిసెంబర్ 15 నుంచి 19 వరకు (ఐదు రోజులపాటు) తెలంగాణలో మహోత్సవంగా ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించాలని భావించింది. ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా వివిధ అంశాలపై పుస్తకాల్ని ప్రచురించడం అత్యావశ్యకం. ఈ పుస్తకాలు వివిధ రంగాలలో తెలంగాణ జాతి వైభవాన్ని ప్రపంచానికి చాటి చెప్పే దిక్సూచిగా ఉంటాయి. ఈ దిశగా చొరవ చూపి అందంగా, హృద్యంగా ప్రచురించిన భాషా సాంస్కృతిక శాఖను అభినందిస్తున్నాను.

గౌ॥ శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖరరావు
ముఖ్యమంత్రి
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం

# కృతజ్ఞతలు



**శ్రీ అజ్మీరా చందూలాల్ గారు**
మంత్రివర్యులు



**డా॥ కె.వి. రమణాచారి,** ఐ.ఎ.యస్.(రి)
ప్రభుత్వ సలహాదారు



**శ్రీ రసమయి బాలకిషన్**
అధ్యక్షులు, సాంస్కృతిక సారథి



**డా॥ నందిని సిధారెడ్డి**
చైర్మన్, సాహిత్య అకాడమి



**శ్రీ బుర్రా వెంకటేశం,** ఐ.ఎ.యస్.
ప్రభుత్వ కార్యదర్శి



**శ్రీ దేశపతి శ్రీనివాస్**
ముఖ్యమంత్రి కార్యాలయ ప్రత్యేకాధికారి

- మామిడి హరికృష్ణ

# ధన్యవాదాలు

'తెలంగాణ తేజోమూర్తులు' పేరుతో వస్తున్న ఈ 153 వ్యాసాల సంకలనం ఓ అరుదైన, అపురూప ప్రయత్నం. దీనిని సాకారం చేసి చూపించిన తెలంగాణ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ, ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం సిబ్బందికి కృతజ్ఞతలు.

తెలంగాణ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ నిరంతరం చేస్తున్న సాహితీ సేద్యానికి నిత్యస్ఫూర్తి ప్రధాతగా ఉన్న గౌరవ ముఖ్యమంత్రి **శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖరరావు** గారికి ధన్యవాదాలు!

రవీంద్ర భారతి ప్రాంగణానికి సరికొత్త సొబగును అద్దుతూ 2017 ఏప్రిల్ 4వ తేదీన తెలంగాణ తేజోమూర్తుల్ని (చిత్ర పటాల్ని) ఆవిష్కరించిన నిజామాబాద్ పార్లమెంటు సభ్యురాలు **శ్రీమతి కల్వకుంట్ల కవిత** గారికి ప్రత్యేక ధన్యవాదాలు.

సాహితీ, సాంస్కృతిక, కళారంగాలలో తెలంగాణ రాష్ట్రం ప్రస్తుతం జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందడంలో మా శాఖ చేస్తున్న కృషికి నిరంతర ప్రోత్సాహాన్ని అందిస్తున్న మంత్రివర్యులు శ్రీ **అజ్మీరా చందూలాల్** గారికి, ప్రభుత్వ సలహాదారు **డా. కె.వి. రమణాచారి** ఐ.ఎ.యస్.(రి) గారికి, సాంస్కృతిక సారథి అధ్యక్షులు శ్రీ **రసమయి బాలకిషన్** గారికి, సాహిత్య అకాడమి చైర్మన్ శ్రీ **నందిని సిధారెడ్డి** గారికి, ప్రభుత్వ కార్యదర్శి శ్రీ **బుర్రా వెంకటేశం** ఐ.ఎ.యస్.గారికి, ముఖ్యమంత్రి కార్యాలయ ప్రత్యేకాధికారి శ్రీ **దేశపతి శ్రీనివాస్** గారికి కృతజ్ఞతలు.

ఈ సాంస్కృతిక యజ్ఞంలో తమవంతు పాత్రను విజయవంతంగా పోషించిన ఆకాశవాణి సిబ్బందికి ముఖ్యంగా చావలి దేవదాసు గారు, సి.యస్. రాంబాబు గారు, ఎన్. విజయ రాఘవ రెడ్డి గారికి ధన్యవాదాలు. పుస్తక కూర్పులోను, నిర్వహణలోను అంతా తానై నిలబడ్డ అయినంపూడి శ్రీలక్ష్మి గారికి ధన్యవాదాలు

సహకారం అందించిన జమ్ముల శ్రీహర్ష, ధాత్రిక సాయి రఘునాథచరణ్, తమనం నాగేశ్వరావు, గోపిశెట్టి కార్యవర్ధి, పి.వి.జి. సతీష్ లకు ధన్యవాదాలు.

ఈ సంపుటిలోని పరిశోధనా వ్యాసాలను రచించడమే కాకుండా అవసరమైన సమాచారాన్ని కూడా అందించిన పరిశోధకులు, రచయిత (త్రు) లకీ, ప్రూఫ్ చూసిన మధుకర్ వైద్యుల, సౌమ్య, శ్రీధర్‌లకు, ప్రచురించిన రైన్‌బో ప్రింట్ ప్యాక్ నరేంద్రగారికి, భాషా సాంస్కృతిక శాఖ సిబ్బంది రఘునందన్, నాగరాజు, ప్రసాద్, స్రవంతి, ఇతరులకి ధన్యవాదాలు....

**– మామిడి హరికృష్ణ**
**విష్ణుభట్ల ఉదయశంకర్**
(సంపాదకులు)

# ప్రాతః స్మరణీయులు!



తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత, తెలంగాణ రాష్ట్ర వైభవాన్ని మనం ఒక్కసారి సింహావలోకనం చేసుకుంటే – తెలంగాణలో ఎంతో మంది కవులు, పండితులు, కళాకారులు, సాహితీ మిత్రులు, సాంస్కృతిక మిత్రులు ఈ తెలంగాణా జాతిని జాగృతం చేసిన మహనీయులు ఎంతో మంది ఉన్నారు. వారందరినీ కూడా ఈ తరం వారు, భావితరం వారు స్మరించుకోవాల్సిన అవసరం ఉంది. వాళ్ళందరూ కూడా ప్రాత: స్మరణీయులు, చిరస్మరణీయులు.

ఎవరు తెలంగాణా వైతాళికులు, తేజోమూర్తులు అనే విషయం మీద మనం ముందు తెలుసుకోవాల్సిన బాధ్యత ఉంది. ఈ వైతాళికులు అనే పదమే ఎంత పవిత్రమో! ఎంత ఉదాత్తమో! ఎంత సమున్నతమైన పదమో మనం అర్థం చేసుకోవలసిన అవసరం ఉంది. ఎవరైతే ఒక జాతిని సుసంపన్నం చేస్తారో, జాగృతం చేస్తారో, చైతన్య పరుస్తారో, ఎవరి ద్వారా సమాజంలో ఒక పెద్ద కదలిక వస్తుందో ఆ మార్పుకి కారణమైన వారే వైతాళికులు. ఆ రకంగా తెలంగాణాలో ఎంతో మంది వైతాళికులు ఉన్నారు. అందరినీ మనం ఒకేసారి చెప్పడానికి గాని, చూపడానికి గాని, తెలపడానికి గాని ఇబ్బంది కలగొచ్చు. అందుకే ఒక చిరు ప్రయత్నం. అందుకే ఈ మంచి ప్రయత్నంలో ఎంతోమంది మన దృష్టిలో ఉన్నా, కొద్ది మందినైనా ముందు మనం పరిచయం చేసి ఈ తరం వారు, భావితరాల వారు తలచుకొనేట్టుగా, మదిలో పదిల పరచుకునేట్టుగా జీవిత పరిచయ వ్యాస సంకలనాన్ని భాషా సాంస్కృతిక శాఖ, ఆకాశవాణి కలిసి ఈ కార్యక్రమాన్ని రూపొందించడం జరిగింది.

తెలంగాణా తేజోమూర్తులలో ముఖ్యంగా మనం చెప్పుకోవాల్సిన వారు ప్రతాపరెడ్డి గారు. సురవరం ప్రతాపరెడ్డి గారంటేనే మనకు "గోల్కొండ" పత్రిక జ్ఞాపకం వస్తుంది. సురవరం ప్రతాపరెడ్డి గారంటేనే నిజాం రాష్ట్ర ప్రథమాంధ్ర మహాసభకు అధ్యక్షత వహించినటువంటి ఆ 1930వ సంవత్సరం గుర్తొస్తుంటుంది. "గోల్కొండ" కవుల సంచిక గుర్తొస్తుంది. ఆనాటి నగర కొత్వాల్‌గా ఉన్న రాజ్ బహదూర్ వెంకట్రామిరెడ్డి గారి కోరిక మేరకు "హిందువుల పండుగలు" అనే గ్రంథాన్ని వ్రాయడమనేది, ముస్లిం పరిపాలనలో ఒక గొప్పనైన విషయం! అన్నిటికంటే మించి 1949లో "ఆంధ్రుల సాంఘిక చరిత్ర"ను మనకందించి, మన సమాజం యొక్క స్థితిగతులెలా ఉన్నాయి…ఆనాటి పండుగలు ఎలా ఉన్నాయి… ఆనాటి పరిస్థితులు ఎలా ఉన్నాయి… అని చెప్పిన సురవరం ప్రతాపరెడ్డి ఒక పండితుడు, ఒక కవి, ఒక దార్శనికుడు, ఒక విమర్శకుడు, ఒక సంపాదకుడు, ఒక సామాజిక చైతన్య శీలి. అందుకే సురవరం ప్రతాపరెడ్డి తెలంగాణ తేజోమూర్తి.

అలాగే డా. బూర్గుల రామకృష్ణా రావు గారు! నిజానికి రామకృష్ణారావు గారింటి పేరు పుల్లంరాజు. ఊరిపేరే ఇంటిపేరుగా మారినంత స్థాయిలో బూర్గుల రామకృష్ణారావు సేవజేశారు. అందుకే వారిని పుల్లంరాజు రామకృష్ణారావు గారని అంటే తెలియకపోవచ్చు గాని డా. బూర్గుల రామకృష్ణారావు గారని అంటే మనకందరికీ తెలుస్తుంది. హైదరాబాద్ రాష్ట్రంలో మొట్టమొదటి ముఖ్యమంత్రిగా ఉన్న వీరు ముఖ్యమంత్రిగా భూ సంస్కరణలను అమల్లోకి తీసుకొచ్చిన మహానుభావుడు డా. బూర్గుల రామకృష్ణా రావు.

అలాగే డా.మాడపాటి హనుమంతరావు గారు, ఎంత తపించారో తెలంగాణా కోసం, ఎంత తపించారో మహిళల్లో విద్యావ్యాప్తి కోసం, ఎంత తపించారో ఆనాటి నిజాం కాలంలో ఆంధ్ర రాష్ట్ర ఉద్యమం కోసమని. ఆయన 1935లో నిజాం రాష్ట్ర చతుర్థాంధ్ర మహాసభకి సిరిసిల్లలో అధ్యక్షత వహించారు. అందరినీ చాలా చైతన్యవంతుల్ని చేశారు. 1951లో హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్‌కి మేయర్‌గా ఎన్నికయ్యారు. 1958-64 సంవత్సరాల మధ్య కాలంలో శాసనమండలికి అధ్యక్షులయ్యారు. అడుగడుగునా, అణువణువునా ఈ సమాజానికి నేనుగా ఎంత వరకు తోడ్పడతాను అని ఆలోచించిన ఆ మహానుభావుడు మన తెలంగాణా తేజోమూర్తుల్లో ఒకరు. అందుకే... అప్పుడే డా. మాడపాటి హనుమంతరావు గారిని భారత ప్రభుత్వం 'పద్మభూషణ్' బిరుదునిచ్చి సత్కరించింది. అలాగే కొండా వెంకట రంగారెడ్డి గారు. ఆయన నిజాం రాష్ట్ర 5వ మహాసభకి షాద్ నగర్‌లో 1936లో అధ్యక్షత వహించారు.

వీరంతా ఆ రోజుల్లో ఆంధ్ర భాషా ఉద్యమం, జాతీయోద్యమం, గ్రంథాలయోద్యమం - అన్నిటినీ ఉద్యమ స్ఫూర్తితో నిర్వహించిన మహానుభావులు అధ్యక్షత వహించి అందర్నీ కూడా చైతన్య వంతుల్ని చేశారు. అలాగే 1943వ సంవత్సరంలో కూడా హైదరాబాద్‌లో ఏర్పడిన 7వ సభకి అధ్యక్షత వహించిన కొండా వెంకట రంగారెడ్డి మొదట్నుంచీ ప్రత్యేక తెలంగాణా కోసం కృషి చేసినవారు. 'పెద్ద మనుషుల ఒప్పందం'లో భాగస్వామిగా ఉన్నారు. అప్పటి నుంచే ప్రత్యేక తెలంగాణా ఉద్యమం గురించి ఆలోచించిన మహానుభావుల్లో మెదక్ జిల్లా కందిలో నిర్వహింపబడిన 13వ సభకు అధ్యక్షత వహించినవారు సర్దార్ జమలాపురం కేశవరావు. వీళ్ళందరితో పాటు షోయబుల్లాఖాన్ గురించి కూడా మనం చెప్పుకోవాల్సిన అవసరం ఉంది. పత్రికా రచయిత షోయబుల్లాఖాన్ 'తేజ్' అనే పత్రికను నిర్వహిస్తున్నప్పుడు దాన్ని ఆనాటి నిజాం ప్రభుత్వం నిషేధించింది. తర్వాత 'రయత్' అనే పత్రికలో పనిచేస్తే ఆ పత్రికను కూడా నిషేధించారు. ఆ తర్వాత 'ఇమ్రోజ్' పత్రికను ప్రారంభించి, 1948 ఆగష్టు 21వ తేదీ నాటి రాత్రి 12 గంటల ప్రాంతంలో తుపాకీ కాల్పులకు, కత్తిపోట్లకు గురైన షోయబుల్లాఖాన్ మత సమైక్యత కోసం కృషి చేసిన అమరజీవిగా మనం స్మరించుకోవలసిన అవసరం ఉంది. మరొక తేజోమూర్తి ముఖ్యంగా చెప్పుకోదగ్గవారు శ్రీమతి జె.ఈశ్వరీబాయి! పుట్టింది, పెరిగింది పేదరికంలో అయినా, అంబేద్కర్ సిద్ధాంతాల్ని పరివ్యాప్తి చేయడానికి నాలుగు దశాబ్దాల పాటు రాజకీయ రంగంలో తన యొక్క చతురతతో, వక్తృత్వ ధోరణితో, వాక్చాతుర్యంతో అందరిని కూడా అలరింపజేసిన నాయకురాలు ఈశ్వరీబాయి! ఇక రావి నారాయణ రెడ్డి గారు! భువనగిరిలో నిర్వహించబడిన ఆంధ్రమహాసభకు అధ్యక్షత వహించడమేకాక; ఆ తరువాత జాతీయ ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు ఆంధ్రమహాసభ అని రెండుగా చీలిపోయిన రోజుల్లో అజ్ఞాతవాసం చేసి, ఆంధ్ర రాష్ట్ర ఉద్యమం కోసం పాటు పడిన వాళ్ళలో అగ్రగణ్యుడిగా రావి నారాయణ రెడ్డి గారిని మనం పేర్కోవాల్సిన అవసరం ఉంది. 1952వ సంవత్సరంలో ఆయన నల్గొండ నియోజకవర్గం నుండి పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నిక కావడం మరో గొప్ప విషయం.

నిత్య స్మరణీయులుగా ఉండేవారు మాదిరి భాగ్యరెడ్డి వర్మ. మాదిరి భాగ్యరెడ్డి వర్మ కూడా చాలా పేదరికంలో హైదరాబాద్ లో పుట్టి తన తోటి వారందరిని కూడా చూసి ఈ అంటరాని తనమేమిటి? ఈ బాల్య వివాహాలేమిటి? ఈ అంధవిశ్వాసాలేమిటి? ఈ మూఢాచారాలేమిటి? అని నిరసిస్తూ, వాటిని రూపుమాపడానికి ఒక సంఘ సంస్కర్తలాగా నిలబడి జీవితాన్నంతా సామాజిక చైతన్యం కోసం తెలంగాణా జాగృతి కోసం పాటుపడిన మాననీయుల్లో భాగ్యరెడ్డి వర్మ గారొకరు. వారు తలచుకొని ఒక సంకల్పశుద్ధిగా నిర్మించిన 'ఆది హిందూ భవనం' చాదర్ ఘాట్ వంతెన దగ్గర ఇవ్వాల్టికి కూడా సజీవంగా నిలిచి ఉంది అనేటువంటి విషయాన్ని ఈ నాటి విద్యార్థులు, ఈనాటి యువత తెలుసుకోవాల్సిన బాధ్యత ఉంది.

దాశరథి స్వాతంత్ర్య సమరయోధుడు, గొప్ప కవి, పండితుడు. శ్రీ వైష్ణవ సంప్రదాయం నుంచి వచ్చిన వాడు. అయినా వేటినీ లెక్కచేయకుండా తెలంగాణా కోసం, తెలుగు భాష కోసం జీవించినంత కాలం పాటుపడిన దాశరథి... మనం జనం, జనం మనం / జనం లేంది మనం లేము అని చెప్పి జనాన్ని ఉద్రూతలూగించి తన కవిత్వంతో చైతన్యపరచిన జనకవి. తెలంగాణా బిడ్డగా ఆనాడు నిజాం, రజాకార్లకి వ్యతిరేకంగా పోరాడి నిజామాబాద్ జైల్లో గోడమీద "నా తెలంగాణా కోటి రతనాల వీణ" అని రాసిన దాశరథి - తెలంగాణా ఉద్యమకారులకి, తెలంగాణా ప్రజలకి ప్రతి ఒక్కరికీ ఆరాధ్యుడు. "నా గీతావళి ఎంత దూరం ప్రయాణంబవునో అందాక ఈ భూగోళమ్మునకు అగ్గిపెట్టెను" అని చెప్పిన విప్లవకవి దాశరథి. ఎంత వామనుడో - అంతటి త్రివిక్రముడు!

మరొకరు వందేమాతరం రామచంద్రరావు గారు! ఆయన పేరులోనే వందేమాతరం నిలిచిపోయింది. నిజానికి వారు వావిలాల రామచంద్రరావు. జైల్లో వందేమాతరం అని అన్నప్పుడు ఆ జైలు సూపరింటెండెంట్ చెంప దెబ్బ కొడితే 'వందేమాతరం' అన్నాడు. కొరడాదెబ్బ కొడితే 'వందేమాతరం' అన్నాడు. 24, 25 దెబ్బలు కొడితే 24, 25 సార్లు వందేమాతరం, వందేమాతరం అంటూ నినదించిన ఆయన బయటకొచ్చాక వందేమాతరం రామచంద్రరావుగా వెలిగిపోయాడు. ఇవ్వాల్టికి వందేమాతరం రామచంద్రరావు గారంటేనే రోమాంచితమవుతుంది మనకు. ఆయన ఆర్య సమాజ నిర్మాణానికి, తెలంగాణాలో చాలా ప్రయత్నం చేశారు. అలాగే తెలంగాణా ప్రత్యేక రాష్ట్రంగా కావాలని, చిన్న రాష్ట్రాలవల్ల మనకెంతో మేలు జరుగుతుందని చెప్పిన వారిలో వందేమాతరం రామచంద్రరావు గారు కూడా ప్రముఖులు.

తెలుగు భాషకు సముచిత స్థానం లేని రోజుల్లో తెలుగు భాషకోసం పాటుపడిన వారిలో శ్రీ దేవులపల్లి రామానుజరావు గారు కూడా ఒకరు. దేవులపల్లి రామానుజరావు గారు ఆంధ్రసారస్వత పరిషత్‌ను 1943వ సంవత్సరంలో ఏర్పరచినారు. పరిషత్ దీపమే లేకుంటే తెలంగాణా అంతా చీకటే అనే రీతిలో తెలంగాణాలో ఎంతో మందిని విద్యావంతుల్ని చేయడానికి ఆయన చేసిన కృషి చాలా గొప్పది. ఎంత నిరాడంబరుడో అంతగా ఈ సమాజం కోసం పాటుబడిన మహానుభావుడు. ఈ సంవత్సరం దేవులపల్లి రామానుజరావు గారి శతజయంతి ఉత్సవాలని భాషా సాంస్కృతిక శాఖ అత్యంత వైభవంగా రవీంద్రభారతిలో నిర్వహించినందుకు ప్రభుత్వ చొరవను అభినందించాలి.

మరొక తేజోమూర్తి కాళోజి! ఆయన నిండా ఆవేశపరులు. ఉద్వేగంతో, ఉత్సాహంతో, ఉత్తేజంతో తన జీవితాన్నంతా ఈ సమాజానికి సమర్పించుకోవాలనే సమర్పణా భావంతో ఉండే నిజమైన మనిషి కాళోజి! తన కవితలన్నీ కూడా తానేదో ఆలోచించో, భావన జేసో, రాత్రింబవళ్ళు కష్టపడి రాసినటువంటివి కావు. తన నోటినుంచి అన్నమాట ప్రతిదీ కూడా ఒక కవితలాగా, నా గొడవనే కవితలై పోయినాయి అని చెప్పినటువంటి కాళోజి, 1969 తెలంగాణా ఉద్యమం నుంచి తెలంగాణా కోసమనే పాటుపడిన మహానుభావుడు. తెలుగు కవుల్లో 'పద్మవిభూషణ్'గా పేరెన్నికగన్న ఏకైక కవి కాళోజి! ఒక పక్క సాహిత్యాన్ని బట్టి చూసినా, మరోపక్కన సామాజిక చైతన్యవంతుడిగా చూసినా అన్ని రకాలుగా కూడా కాళోజిని తెలంగాణా వైతాళికుడిగా మనం తప్పకుండా స్మరించుకోవాలి.

ఒక పి.వి.నరసింహారావుగారు బహుభాషా కోవిదుడు, పండితుడు, సున్నిత మనస్కుడు, సాత్వికుడు, నిరాడంబరుడు. దేశం కోసం, సమాజం కోసం పాటుపడాలని, చిన్నప్పటి నుంచి కూడా అహరహం కృషి చేసినవారు. వారు జైళ్ళ శాఖా మంత్రిగా ఉన్నప్పుడు 'ఓపెన్ ఎయిర్ జైల్' సిస్టంను ప్రవేశపెట్టారు, అప్పటి ఆంధ్రప్రదేశ్‌లో. అప్పటి ఆంధ్రప్రదేశ్‌లో విద్యా మంత్రిగా తెలుగును అధికార భాషగా తీర్చిదిద్దారు. తెలుగు అకాడమీని స్థాపింపజేశారు. దేవాదాయ శాఖా మంత్రిగా ఉంటే సర్వశ్రేయోనిధిని ఏర్పరచి వేదపండితులను, పండితులను, అర్చకులను గౌరవించే స్థితిని కల్పించారు. ముఖ్యమంత్రిగా ఉంటే భూ సంస్కరణలు తీసుకొచ్చారు. ప్రధాన మంత్రిగా సరళీకృత విధానం తీసుకొచ్చి, ఇవ్వాళ భారతదేశంలో ఒక గొప్పనైన విప్లవాన్ని తీసుకొచ్చి ప్రపంచమంతా ఒకటే అనేటువంటి రీతిలో భారతదేశం ప్రవర్తించడానికి మూలకారణమైన వారు, మన తెలంగాణా బిడ్డ శ్రీ పి.వి. నరసింహారావు!

ఇలాంటి మరెంతోమంది తెలంగాణ తేజోమూర్తుల జీవిత చరిత్రలను ఒక్కచోట చేర్చి బృహత్ వ్యాస సంకలనంగా తీసుకురావడంలో భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు చిరంజీవి మామిడి హరికృష్ణ చూపిన చొరవను, వ్యక్తిగత శ్రద్ధను అభినందిస్తున్నాను. తెలంగాణ మహనీయులందరికీ మరొక్కసారి సవినయంగా నమస్సులర్పిస్తూ...

**డా. కె.వి రమణాచారి**, ఐ.ఎ.ఎస్.(రి)
ప్రభుత్వ సలహాదారు

ముందు మాట



## స్ఫూర్తివంతమైన జీవన చిత్రం!

**పుట్టుకతోనే ఎవరూ గొప్పవారు కారు!**

కానీ వారు పెరుగుతున్న క్రమంలో వారికి ఎదురైన పరిస్థితులు, సంఘటనలు, వారిని ప్రభావితం చేసిన వ్యక్తులు, సిద్ధాంతాలు, వారిలో అంతర్గతంగా ఎదిగిన ఆలోచనారీతులు, ఆచరణ తీరులు... అన్నీ కలిసి వారిని ఇతర మనుషుల కన్నా భిన్నమైనవారిగా, ఉన్నతమైన వారిగా గుర్తింపునిస్తాయి.

మనిషి మనిషిగా ఎదగడానికి కావలసిన అన్ని రకాల జీవనానుభవాలు కోకొల్లలుగా ఉన్న నేల – తెలంగాణ!

**ఏ వ్యక్తీ ఒక్కరోజులో గొప్పవాడు కాలేదు!**

ఒక మనిషి తను నమ్మిన, తనకు నచ్చిన మార్గంలో మొక్కవోని దీక్షతో నిరంతరం కొనసాగి, ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా తలొగ్గకుండా తన వ్యక్తిత్వాన్ని నిలుపుకుంటూ నిశ్చలంగా ముందుకెళ్ళినపుడే ఆ మనిషికి తనదైన ముద్ర రూపొందుతుంది.

వ్యక్తిత్వముద్ర ఇన్‌స్టెంట్ కాదు.... కాలాతీతంగా కాన్‌స్టెంట్‌గా కొనసాగే మానవ ప్రవర్తన!

మనుషులలో నిరంతరత్వాన్ని, నిలకడతత్వాన్ని కొనసాగించగలిగే నేపథ్యాన్ని సృష్టించగలిగిన జీవగడ్డ – తెలంగాణ!!

ఇపుడు చూస్తున్న మహావృక్షపు చిటారు కొమ్మల చిగురుటాకులు ఇప్పటివి కావు.... ఎన్నో ఏళ్ళుగా ఎదిగి ఒదిగిన కనిపించని వేళ్ళలో దాని తొలి ఆనవాలు దాగి ఉంది!

ఇపుడు మనం స్మరిస్తున్న, తలచుకుంటున్న మహనీయుల కీర్తి ఈ క్షణానిది కాదు... ఎన్నో ఏళ్ళ క్రితమే మొదలైన వారి ప్రయాణంలోని తొలి అడుగులలో, ఈనాటి వారి ప్రభ ఉంది!

అలాంటి జీవతత్వాన్ని జన్యువుల పరంగా సైతం అందించగలిగిన పోరుగడ్డ – తెలంగాణ!!!

భౌగోళికంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా, సాహిత్యపరంగా, చారిత్రకంగా, ఆధ్యాత్మికంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎన్ని వైవిధ్యతలు, విభిన్నతలు భారతదేశంలో ఉన్నాయో అవన్నీ ఒక్కచోట కలబోసిన విశిష్టప్రాంతం – తెలంగాణ!

ప్రపంచాన్నంతా ఒక్కచోట చూడాలనుకుంటే భారతదేశాన్ని చూస్తేచాలు అని అంటారు! అదే కోవలో, భారతదేశాన్ని ఒక్క దగ్గర చూడాలనుకుంటే తెలంగాణలో అడుగుపెడితే చాలు అనేంతగా అనాది కాలం నుంచీ అనంతమైన ప్రత్యేకతని కలిగిన భూమి – తెలంగాణ!

అందుకే ఈ నేల, ప్రపంచపు రెండు భిన్నమైన దిగంతాలను ఒక్కచోట సృష్టించింది. సంఘర్షణను ఎంతగా అనుభవించిందో, సమృద్ధతను అంతగానే అనుభూతి చెందింది! మహా విషాదానికి – మహదానందానికీ సాక్షిగా నిలిచింది! దోపిడీకి – శ్రామిక స్వర్గానికి ప్రయోగశాలగా మిగిలింది!

దీనికంతటికీ కారణం ఇక్కడ జీవితం ఉంది! జీవితంలోని బహు పార్శ్వాలు ఇక్కడ దర్శనమిస్తాయి!

అందుకే వ్యక్తులు చరిత్రను నిర్మిస్తారా? లేక చారిత్రక పరిస్థితులు వ్యక్తులను తయారు చేస్తాయా? అంటే ఈ రెండూ జరుగుతాయి అని చెప్పడానికి ఈ భూమిమీద లభించే అద్భుతమైన సాక్ష్యం తెలంగాణ!

చాలా సందర్భాలలో ఈ నేలమీద కొనసాగిన చారిత్రక సందర్భాలు, పరిస్థితులు ఆయా కాలాలలో, ప్రదేశాలలో వ్యక్తులను తయారుచేసి ఉండవచ్చు. అదే సమయంలో, అలాంటి వ్యక్తులు తమవెంట, తమ అడుగుల వెంట చరిత్రను కూడా తీస్కెళ్ళారు. సమాజ పథగామిగా దిశా నిర్దేశం చేసారు. ఇలాంటి అద్భుత ఘట్టాలెన్నింటినో తన గుండె పొరల్లో భద్రంగా నిక్షిప్తం చేస్తున్న అపురూప ప్రాంతం – తెలంగాణ!

ఇదే సందర్భంలో మరో ముఖ్య విషయాన్ని కూడా ప్రస్తావించుకోవాలి...! అసలు ఈ 'తేజోమూర్తులు' భావన పుట్టుకకు సంబంధించిన తెర వెనుక కథ...!

భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుని కార్యాలయంలో సమావేశాలు ఏర్పాటు చేసుకోవడానికి గాను ఒక హాల్ ఉంది. ఉమ్మడి రాష్ట్రకాలంలో అందులో తెలుగు సాహితీ కళామూర్తుల ఛాయాచిత్రాలతో 'కీర్తిహాల్' పేరిట 'హాల్ ఆఫ్ ఫేమ్'ను ఏర్పాటు చేసారు. ఆ హాల్‌లో తెలంగాణ సాహితీ కళామూర్తుల చిత్రాలను అలంకరించాలనే సంకల్పం ఏర్పడిన తర్వాత శ్రీ దేశపతి శ్రీనివాస్ గారు, సంగిశెట్టి శ్రీనివాస్ గారు, నందిని సిధారెడ్డి గారు వంటి కొందరు ప్రముఖుల సూచనల (తెలుగు అకాడెమీ వారి జాబితాను కూడా పరిశీలించి) మేరకు ఓ జాబితాను రూపొందించుకొని, ఆ జాబితాలోని ప్రముఖుల ఛాయా చిత్రాలను సేకరించి, వాటి ఆధారంగా తైలవర్ణ చిత్రాలను వేయించాలని నిర్ణయించాము. ఆ మేరకు సిద్ధిపేటకు చెందిన చిత్రకారుడు అహోబలం ప్రభాకర్‌కు ఆ బాధ్యతను అప్పగించాం. దాదాపు సంవత్సర కాలపు ప్రాజెక్టు అది.

ఆ తరువాత 2017 తెలంగాణ రాష్ట్ర అవతరణ ఉత్సవాల నాటికి మొదటి దశగా దాదాపు 32మంది సాహితీ కళామూర్తుల తైలవర్ణ చిత్రాలను సిద్ధంచేసి గోడలపై అందంగా ప్రతిష్ఠించాం. దానికి 'తేజోమూర్తుల హాల్'గా నామకరణం చేసి 2017 ఏప్రిల్ 4వ తేదీన శ్రీమతి కల్వకుంట్ల కవిత, పార్లమెంట్ సభ్యులు గారి చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది.

మొదటి దశలో 32 మందివి మాత్రమే చిత్రించడం జరిగింది. మిగతా తేజోమూర్తుల తైలవర్ణ చిత్రాలు పూర్తి చేయాల్సివుంది.

ఈ తేజోమూర్తులకు సంబంధించిన చర్చ ఆంతరంగికంగా మా మధ్య జరుగుతున్నకాలంలోనే ఈ మహనీయుల జీవన చిత్రాలను కూడా ఒకే సమగ్ర పుస్తకరూపంలో తీసుకురావాలని భావించాం. అలా ఎన్నో మేధోమథనాలు, చర్చోపచర్చల ఫలితమే ప్రస్తుత ఈ గ్రంథం! అందుకే ఈ గ్రంథంలోని కొందరు మహనీయుల చిత్రాలకు భాషా సాంస్కృతిక శాఖ వేయించిన తైలవర్ణ చిత్రాలనే ఉపయోగించడం జరిగింది. అలాగే 'తేజోమూర్తుల హాల్' ఆవిష్కరణ సందర్భ ఛాయాచిత్రాలను కూడా ఈ పుస్తకంలో ప్రచురించాం.

తెలంగాణ ముఖచిత్రాన్ని లిఖించడంలో తమదైన పాత్ర పోషించిన మహనీయుల జీవన పరిచయాన్ని గ్రంథస్తం చేయాలనే సంకల్పమే ప్రస్తుత “తెలంగాణ తేజోమూర్తులు” పుస్తక రచనకు అంకురం! సమీప గతంలో అంటే 19, 20 శతాబ్దాలలో తెలంగాణ బతుకు చిత్రాన్ని ప్రభావితం చేసిన ప్రాతఃస్మరణీయుల జీవనరేఖల్ని ఒడిసిపట్టే ప్రయత్నమే ఈ పుస్తకం!

ఇక, ఈ పుస్తకంలోని 153 మంది తేజోమూర్తుల జీవిత ప్రస్థానాన్ని ఒక్కచోట చదవడం ద్వారా పైన చెప్పిన విషయాలలోని వాస్తవికత మనకు సుబోధకం అవుతుంది. వీరిలో చరిత్ర గమనాన్ని బట్టి తమ మార్గాన్ని నిర్దేశించుకున్నవారు... చరిత్రని కొత్తగా రాసినవారు... చరిత్రను పక్కకు పెట్టి తామే చరిత్రగా మారినవారు కూడా ఉన్నారు!

అయినా, తమదైన మార్గంలో, తమదైన ముద్రతో వెలిగి ఇప్పటికీ, ఎప్పటికీ చిరస్మరణీయ స్థాయిని, స్థానాన్ని సంపాదించుకున్నవారు ఉన్నారు. అయితే వీరి చరిత్ర, కృషి, సేవలు, ప్రత్యేకతలు ఇంతకాలం ‘మబ్బుపట్టిన ఆకాశం’ లాగా ఉన్న స్థితి ఉండేది! కానీ తెలంగాణ రాష్ట్ర అవతరణ తర్వాత మన చరిత్ర పురుషులు – స్త్రీమూర్తుల గురించిన అన్వేషణను, వీక్షణను ఆవిష్కరించాల్సిన ఆవశ్యకతను భాషా సాంస్కృతిక శాఖ గుర్తించింది. అందుకే ఈ తేజోమూర్తుల ప్రాజెక్ట్‌ను ప్రతిష్ఠాత్మకంగా, సుదీర్ఘ కాల పరిశోధనలోంచి ఇప్పుడు ఆవిష్కరిస్తోంది. దాదాపు 18 నెలల కృషి, నిపుణులతో చర్చోపచర్చల ఫలితంగా వస్తున్న ఈ బృహత్ గ్రంథం, ఆయా మహనీయుల జీవన చరిత్రలను పరిచయం చేసే ప్రయత్నం చేసింది. ఆ దిశగా ఇది ఓ అపూర్వ, అపురూప ప్రయత్నం!

ఇందులోని, తేజోమూర్తుల జీవిత ఘట్టాలని, జీవన గమనాలని చదివిన తర్వాత, మనలో ఖచ్చితంగా వారిపట్ల గౌరవభావం ఎంతగా పెరుగుతుందో, ఈ తెలంగాణ నేలపట్ల అంతకంటే ఎక్కువ అభిమానం పెరుగుతుందనడంలో ఆశ్చర్యంలేదు.

ఎందుకంటే ఈ భూమిపుత్రులందరూ తమ జీవితాన్ని, ఈ నేల భవిష్యత్తునూ వేరుగా చూడలేదు...!

ఈ మట్టినే తమ జీవితంగా చూసారు...!

తమ జీవితాలనే ఈ మట్టికోసం అంకితం చేసారు...!

అలాంటి త్యాగధనులకి, తేజోమూర్తులకి సవినయంగా భాషా సాంస్కృతిక శాఖ చేస్తున్న సాష్టాంగ ప్రణామం – ఈగ్రంథం!

– మామిడి హరికృష్ణ

# తెలంగాణ తేజోమూర్తులు – ఓ సాంస్కృతిక ప్రయాణం!

ఇది చాలా ఆసక్తిదాయకమైన ప్రయాణం!

తెలంగాణ ఉద్యమకాలంలో ప్రారంభమై, రాష్ట్రం అవతరించిన తర్వాత తెలంగాణకు సంబంధించిన కళలు, కళారూపాలు, కళాకారులు, వైతాళికులు, చారిత్రక విషయాలు గురించిన చర్చ, పరిశోధన, ప్రచారం అనివార్యం అయింది. అయితే సాంస్కృతికశాఖ పక్షాన ఆ పరిశోధనను, ప్రచారాన్ని విస్తృతం చేయడం, శాస్త్రీయంగా నిర్వహించడం అవసరమైంది. అదే సమయంలో చాలామంది వ్యక్తులు, కళలు, కళాకారులు, చిరస్మరణీయులకు సంబంధించిన వివరాలు దొరకని పరిస్థితి కూడా నెలకొంది.

ఈ పరిస్థితిని గమనించిన సాంస్కృతికశాఖ ఈ అంశాలను డేటా బ్యాంక్‌లా తయారుచేయడం కోసం అనేక ప్రయత్నాలు చేసింది. అవన్నీ అసంపూర్ణంగానే కనిపించాయి. 'ఆకాశవాణి' వంటి జాతీయ ప్రసారసంస్థతో కలిసి ఈ బృహత్ యజ్ఞాన్ని నిర్వహించాలని భావించాము. దాన్లోంచే ఆకాశవాణి, హైదరాబాద్ కేంద్రం డైరెక్టర్ శ్రీ ఉదయశంకర్ తో కల్సి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. తెలంగాణ అవతరణ నుంచి 'భాషా సాంస్కృతికశాఖ – ఆకాశవాణి' సంయుక్తంగా కొన్ని జానపద, సంగీత ఉత్సవాలను నిర్వహించడం జరిగింది. అవి మంచి విజయాన్ని, ప్రజాదరణను చూరగొన్నాయి. ఆ నేపథ్యాన్ని పురస్కరించుకుని 'తెలంగాణ వైభవం' కార్యక్రమాన్ని ఆరంభించాం.

అలా ఆకాశవాణిలో 2017, ఏప్రిల్ 2వ తేదినుంచి పూర్తిగా తెలంగాణ కేంద్రీకృతంగా ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించి, ప్రసారం చేయాలని నిర్ణయం తీసుకున్నాము. తెలంగాణాకు సంబంధించి ఈ క్రింది అంశాలను కూడా నిర్ధారణ చేసాము.

1. వైతాళికులు / చిరస్మరణీయులు / తేజోమూర్తులు – వారికి సంబంధించిన జీవిత విశేషాలు, వివిధ రంగాలలోవారు చేసిన కృషి.
2. కళలు – కళారూపాలు – వాటి ప్రత్యేకత
3. పర్యాటక, చారిత్రక ప్రదేశాలు – వాటి విశిష్టత

స్థూలంగా ఈ క్యాటగిరీలను నిర్ధారించిన తర్వాత, ఆయా క్యాటగిరీలలోని మౌలికాంశాలను ఎంపిక చేయడానికి, తెలంగాణాకు సంబంధించిన లబ్ధప్రతిష్టులైన ప్రముఖులతో కమిటీలను వేసాం. వారితో సుదీర్ఘంగా చర్చలు జరిపి, మేధోమథనం చేసి అంశాలను, వాటిగురించి రాయగలిగిన నిపుణలను కూడా ఎంపిక చేసి, ఆయా అంశాల రచనా బాధ్యతలను వారికి అప్పగించడం జరిగింది. ఇలా వచ్చిన పరిశోధనా పత్రాలను ఆకాశవాణి నుండి ప్రసారం చేయడం ప్రారంభించాం.

ఇక పుస్తకం ప్రచురణ బాధ్యతను పూర్తిగా భాషాసాంస్కృతికశాఖ చేపట్టింది. ఒక్కచోట చేర్చి గ్రంథస్థం చేసే మహా యజ్ఞానికి శ్రీకారం చుట్టింది.

ఆవిధంగా ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో 2017 ఏప్రిల్ 2వ తేదీ నుంచి ప్రతిరోజూ ఉదయం గం. 7.15 ని.ల నుండి గం. 7.30 ని.ల వరకు, రైన్‌బో ఎఫ్.ఎమ్ కేంద్రం నుండి మధ్యాహ్నం 2.45 ని.ల నుండి 3.00 గంటల వరకు (శనివారం మినహాయించి) ప్రసారం చేస్తూనే ఉన్నాం. ఈ మొత్తం వ్యవహారాలను ఉదయశంకర్ (డైరెక్టర్) గారి సారథ్యంలో శ్రీమతి అయినంపూడి శ్రీలక్ష్మి, చావలి దేవదాస్, సి.ఎస్. రాంబాబు, ఎన్. విజయరాఘవరెడ్డి బృందం సమర్థవంతంగా రేడియో ప్రసారాలు చేసి తెలంగాణాకు సంబంధించి ప్రజలకు తెలియని ఎన్నెన్నో విషయాలను, విశేషాలను అందించాము.

ఇక ఈ రేడియో ప్రసంగాలను పుస్తకంగా ప్రచురించే బాధ్యతను భాషా సాంస్కృతిక శాఖ మొదలుపెట్టి, వాటిని 'ప్రపంచ తెలుగు మహాసభల'లో ఆవిష్కరించే ప్రణాళికను రూపొందించింది.

మొత్తంగా దీనికి సంబంధించి ఆకాశవాణి ప్రసారాల విషయంలోనూ, పుస్తక ప్రచురణ విషయంలోనూ సమన్వయం, నిర్వహణ – కూర్పు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించినవారు శ్రీమతి అయినంపూడి శ్రీలక్ష్మిగారు.

అలా ఈ పుస్తకంలోని ఆయా అంశాలను పరిచయం చేయడంలో, వాటి విశిష్టతలను అద్దం పట్టడంలో రెండు శాఖలూ సఫలీకృతం అయ్యాయి. వీటిని రాసిన రచయితలు కూడా ఆయా రంగాలలో లబ్ధ ప్రతిష్టులు, విశేష కృషి చేసినవారు కనుక, ఈ పరిశోధనా, పరిశీలనా వ్యాసాలకు సాధికారత కూడా సమకూరిందని భావిస్తున్నాం. అందువల్ల భవిష్యత్‌లో ఇంకా లోతుగా జరిగే పరిశోధనలకు ఈ గ్రంథం ఒక ఆధార భూమికను, ఒక విశాల అవగాహనను కలిగిస్తుందని కూడా నమ్ముతాము. దాదాపు 18 నెలల నిరంతర కృషి ఫలితంగా వెలువడుతున్న ఈ గ్రంథం ఈ వరుసలో మొదటి సంపుటిగానే భావిస్తూ, మరింత విస్తృత పరిశోధనతో రాబోయే కాలంలో మరిన్ని పుస్తకాలుగా రావాలని దానికి తగిన ప్రయత్నాలను కూడా భాషాసాంస్కృతికశాఖ, ఆకాశవాణి సంయుక్తంగా పూనుకుంటాయని సవినయంగా మనవి చేస్తున్నాము.

ఇలా ఎన్నెన్నో వ్యయ ప్రయాసలకోర్చి వెలువడుతున్న ఈ గ్రంథం తెలంగాణా పునర్నిర్మాణ ప్రస్థానంలో, సాంస్కృతిక కళారంగంలో ఓ అపురూప డాక్యుమెంట్ అని చెప్పడంలో ఎలాంటి సందేహంలేదు.

ఇలాంటి అపూర్వ గ్రంథం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ప్రపంచ తెలుగు మహాసభలు'లో ఆవిష్కృతం కావడం ఆనందంగా భావిస్తున్నాము.

– సంపాదకులు

4వతేది ఏప్రియల్ 2017న తేజోమూర్తుల చిత్ర పటాల్ని ఆవిష్కరిస్తున్న
నిజామాబాద్ పార్లమెంటు సభ్యురాలు శ్రీమతి కల్వకుంట్ల కవిత గారు,
డా. కె.వి రమణాచారి గారు, దేశపతి శ్రీనివాస్ గారు,
సుద్దాల అశోక్ తేజ గారు, మామిడి హరికృష్ణ మున్నగు వారు.















# ఇవీ తేజస్సులు


| | | | |
|---|---|---|---|
| 1. | అబిద్ హసన్ సఫ్రానీ | జి. వెంకటరామారావు | 1 |
| 2. | ఆదిరాజు వీరభద్రరావు | డా. వెలుదండ నిత్యానందరావు | 3 |
| 3. | అజిత్ | వారాల ఆనంద్ | 7 |
| 4. | అలిశెట్టి ప్రభాకర్ | డా. నాళేశ్వరం శంకరం | 10 |
| 5. | అంబటిపూడి వేంకటరత్నం | డా॥ తిరునగరి | 13 |
| 6. | ఆనందాంబ | డా. ఆర్. కమల | 16 |
| 7. | ఆనందరావు తోట | డా. వెలిచాల కొండలరావు | 19 |
| 8. | అనంతోజు బ్రహ్మయ్య | వడ్ల సాయిలూచారి | 23 |
| 9. | అనుముల కృష్ణమూర్తి | వి.ఆర్. విద్యార్థి | 26 |
| 10. | ఆరుట్ల కమలాదేవి | డా. తిరునగరి దేవకీదేవి | 29 |
| 11. | ఆవుల పిచ్చయ్య | ఎ.ఎం. తాయారు | 32 |
| 12. | బి. భానుప్రకాష్ | శ్రీధర్ బీచరాజు | 36 |
| 13. | బి.యన్. శాస్త్రి | డా. జె. చెన్నయ్య | 39 |
| 14. | బి.యస్. నారాయణ | వారాల ఆనంద్ | 43 |
| 15. | భండారు అచ్చమాంబ | డా. సంగిశెట్టి శ్రీనివాస్ | 46 |
| 16. | భావానంద భారతీస్వామీవార్లు | డా. ఎం. దత్తాత్రేయశర్మ | 50 |
| 17. | భీంరెడ్డి నరసింహారెడ్డి- | డా. ఏనుగు నరసింహారెడ్డి | 54 |
| 18. | భూపతి కృష్ణమూర్తి | డా. రామా చంద్రమౌళి | 57 |
| 19. | భాగ్యరెడ్డి వర్మ | డా. సంగిశెట్టి శ్రీనివాస్ | 60 |
| 20. | బిరుదురాజు రామరాజు | డా. అమ్మంగి వేణుగోపాల్ | 63 |
| 21. | బొమ్మ హేమాదేవి | శాంతి ప్రబోధ | 68 |
| 22. | బూర్గుల రామకృష్ణారావు | డా. ఎస్.వి. రామారావు | 72 |
| 23. | బోయ జంగయ్య | డా. మేరెడ్డి యాదగిరిరెడ్డి | 77 |
| 24. | బూర్గుల రంగనాథరావు | డా. ఎస్.వి. రామారావు | 81 |
| 25. | సి. నారాయణరెడ్డి | డా. జె. చెన్నయ్య | 84 |
| 26. | చందా కాంతయ్య శ్రేష్ఠి | డా. రామా చంద్రమౌళి | 88 |
| 27. | చందాల కేశవదాసు | డా. యం. పురుషోత్తమాచార్య | 92 |
| 28. | చెర్విరాల భాగయ్య | డా. నోరి రాజేశ్వరరావు | 95 |
| 29. | చిదిరెమఠం వీరభద్రశర్మ | దోరవేటి | 98 |
| 30 | చిలువేరు రామలింగం | అయినంపూడి శ్రీలక్ష్మి | 101 |
| 31. | చిందుల యల్లమ్మ | వి. పద్మ | 105 |
| 32. | చొప్పకట్ల చంద్రమౌళి | వారాల ఆనంద్ | 108 |
| 33. | చుక్క సత్తయ్య | డా. జె. చెన్నయ్య | 110 |
| 34. | డి. రామలింగం | డా. దేవరాజు మహారాజు | 114 |
| 35. | దాశరథి కృష్ణమాచార్య | డా. తిరుమల శ్రీనివాసాచార్య | 117 |
| 36. | దాశరథి రంగాచార్య | డా. వి. జయప్రకాష్ | 121 |

| | | | |
|---|---|---|---|
| 37. | దేవులపల్లి రామానుజరావు | దేవులపల్లి ప్రభాకరరావు | 125 |
| 38. | దేవులపల్లి వెంకటేశ్వరరావు | డా. ఎస్. జతిన్‌కుమార్ | 129 |
| 39. | ధవళా శ్రీనివాసరావు | పున్నా అంజయ్య | 133 |
| 40. | దొడ్డి కొమురయ్య | డా. ననుమాస స్వామి | 135 |
| 41. | దోకూరుకోట్ల బాలబ్రహ్మచారి | డా. మావిశ్రీ మాణిక్యం | 138 |
| 42. | ఎదిరె చెన్నకేశవులు | డా. భీంపల్లి శ్రీకాంత్ | 141 |
| 43. | ఈశ్వరీబాయి | డా. ముక్తేవి భారతి | 146 |
| 44. | ఈటూరి లక్ష్మణరావు | డా. వెలుదండ నిత్యానందరావు | 149 |
| 45. | గడ్డం రాంరెడ్డి | డా. రాయారావు సూర్యప్రకాశరావు | 153 |
| 46. | గడియారం రామకృష్ణశర్మ | డా. జి. గిరిజా మనోహరబాబు | 157 |
| 47. | గణపతి రామచంద్రరావు | గన్ను కృష్ణమూర్తి | 161 |
| 48. | గోపాలరాజ్ భట్ | రాయప్రోలు రమణ | 164 |
| 49. | గూడ అంజన్న | డా. పసునూరి రవీందర్ | 168 |
| 50. | గూడూరి సీతారాం | డా. పత్తిపాక మోహన్ | 172 |
| 51. | గులాం అహ్మద్ | ఎస్. భాను శ్రీదేవి | 175 |
| 52. | గుమ్మన్నగారి లక్ష్మీనరసింహశర్మ | డా. చెప్పెల హరినాథశర్మ | 179 |
| 53. | గుండేరావు హర్కారే | డా. మసన చెన్నప్ప | 184 |
| 54. | ఇల్లిందల సరస్వతీ దేవి | షబ్నవీజ్ ఇందిర | 187 |
| 55. | జమలాపురం కేశవరావు | డా. చవ్వా వెంకటరెడ్డి | 191 |
| 56. | జమాలుద్దీన్ | డా. దేవరాజు మహారాజు | 194 |
| 57. | జయశంకర్ సర్ | దేశపతి శ్రీనివాస్ | 197 |
| 58. | జొన్నవాడ రాఘవమ్మ | డా. భీంపల్లి శ్రీకాంత్ | 201 |
| 59. | జుల్ఫీకరుద్దీన్ | పి.వి. రామమోహన్ నాయుడు | 206 |
| 60. | జువ్వాడి గౌతమ్‌రావు | డా. గంద్ర లక్ష్మణ్‌రావు | 209 |
| 61. | జ్వాలాముఖి | నిఖిలేశ్వర్ | 214 |
| 62. | కె.వి. రాఘవాచార్యులు | డా. సి.హెచ్. లక్ష్మణ చక్రవర్తి | 218 |
| 63. | కాళోజి నారాయణరావు | నాగిళ్ళ రామశాస్త్రి | 222 |
| 64. | కాళోజి రామేశ్వరావు (షాద్) | వి.ఆర్. విద్యార్థి | 226 |
| 65. | కాల్వ బాలయ్య | ఉండ్రాల రాజేశం | 230 |
| 66. | కనపర్తి రామచంద్రుడు | డా. దాసోజు పద్మావతి | 234 |
| 67. | కాంచనపల్లి చినవెంకటరామారావు | వేణు సంకోజు | 238 |
| 68. | కాపు రాజయ్య | డా. సురభి వాణీదేవి | 241 |
| 69. | కాటం లక్ష్మీనారాయణ | డా. వెలుదండ నిత్యానందరావు | 244 |
| 70. | కేశనకుర్తి వీరభద్రాచారి | కందాళై రాఘవాచార్యులు | 247 |
| 71. | కేవల్ కిషన్ | డా. బెల్లంకొండ సంపత్‌కుమార్ | 250 |
| 72. | ఖండవల్లి లక్ష్మీరంజనం | డా. గుమ్మన్నగారి బాలశ్రీనివాసమూర్తి | 254 |
| 73. | కోదాటి నారాయణరావు | డా. టి. గౌరీశంకర్ | 259 |
| 74. | కుమ్రం భీం | డా. ఎస్.ఎం. ప్రాణ్‌రావు | 262 |
| 75. | కొమర్రాజు వెంకటలక్ష్మణరావు | డా. వి. జయప్రకాష్ | 266 |

| | | | |
|---|---|---|---|
| 76. | కొండా లక్ష్మణ్ బాపూజీ | డా. బి.యస్. రాములు | 270 |
| 77. | కొండపల్లి శేషగిరిరావు | డా. సురభి వాణీదేవి | 276 |
| 78. | కోవెల సంపత్‌కుమారాచార్య | డా. గంద్ర లక్ష్మణరావు | 279 |
| 79. | కృష్ణమాచార్య శతావధాని | డా. సి. హెచ్. లక్ష్మణ చక్రవర్తి | 283 |
| 80. | కొత్తూర్ సీతయ్య గుప్త | డా. కర్నాటి లింగయ్య | 286 |
| 81. | కుమారయ్య (జస్టిస్) | అన్నవరం దేవేందర్ | 290 |
| 82. | ఎం.ఎల్. జయసింహ | పి.వి. రాంమోహన్ నాయుడు | 292 |
| 83. | ఎం. ఎస్. ఆచార్య | డా. రామా చంద్రమౌళి | 295 |
| 84. | మచ్చ వీరయ్య | డా. బి.వి.యన్. స్వామి | 298 |
| 85. | మాడపాటి హనుమంతరావు | డా. టి. గౌరీశంకర్ | 302 |
| 86. | మడికొండ సత్యనారాయణ శాస్త్రి | డా. మోత్కూరి మాణిక్యరావు | 305 |
| 87. | మామిడిపల్లి సాంబశివ శర్మ | డా. విష్ణువందనాదేవి | 308 |
| 88. | మందపాటి వెంకటరాజు | డా. ఎం. పురుషోత్తమాచార్య | 312 |
| 89. | మందముల నరసింగరావు | షబ్నవీజ్ వెంకట రంగారావు | 315 |
| 90. | మఖ్దూం మొహియుద్దీన్ | డా. ఎస్.వి. సత్యనారాయణ | 319 |
| 91. | మంత్రి శ్రీనివాసరావు | డా. జె. విజయ కుమార్ | 322 |
| 92. | మాటేటి రామప్ప | డా. దేవేంద్ర | 326 |
| 93. | మిద్దె రాములు | డా. ననుమాస స్వామి | 329 |
| 94. | మోత్కూరి మధుసూదనరావు | డా. మడికొండ శ్యామ్‌సుందర్ | 332 |
| 95. | ముకురాల రామారెడ్డి | డా. జి. చెన్నకేశవరెడ్డి | 335 |
| 96. | నల్లా నరసింహులు | డా. రామా చంద్రమౌళి | 339 |
| 97. | నటరాజ రామకృష్ణ | కళాకృష్ణ | 343 |
| 98. | నెల్లూరి కేశవస్వామి | డా. పత్తిపాక మోహన్ | 348 |
| 99. | నీలా జంగయ్య | డా. చెన్నకేశవరెడ్డి | 353 |
| 100. | ఒద్దిరాజు సోదరులు | డా. కొండపల్లి నీహారిణి | 356 |
| 101. | పి.వి. నరసింహారావు | డా. వి.వి. రామారావు | 360 |
| 102. | పైడి జయరాజ్ | పొన్నం రవిచంద్ర | 363 |
| 103. | పైడిమర్రి వెంకటసుబ్బారావు | మేరెడ్డి యాదగిరిరెడ్డి | 367 |
| 104. | పాకాల యశోదారెడ్డి | డా. సుంకిరెడ్డి నారాయణరెడ్డి | 370 |
| 105. | పాలకుర్తి ఐలమ్మ | డా. తిరునగరి దేవకీదేవి | 373 |
| 106. | పల్లా దుర్గయ్య | డా. మసన చెన్నప్ప | 376 |
| 107. | పల్లెర్ల హనుమంతరావు | డా. అమ్మంగి వేణుగోపాల్ | 380 |
| 108. | పందిళ్ల శేఖర్‌బాబు | డా. గిరిజా మనోహర్‌బాబు | 384 |
| 109. | పార్వెళ్ళ గోపాలకృష్ణశర్మ | డా. జి.వి. కృష్ణమూర్తి | 387 |
| 110. | పేర్వారం జగన్నాథం | డా. తిరునగరి | 390 |
| 111. | పొట్లపల్లి రామారావు | వి.ఆర్. విద్యార్థి | 393 |
| 112. | ప్రభాకరరెడ్డి | హెచ్. రమేష్‌బాబు | 396 |
| 113. | పులిజాల గోపాలరావు | పున్న అంజయ్య | 400 |
| 114. | పులిజాల వెంకట రంగారావు | వేణు సంకోజు | 402 |

| | | | |
|---|---|---|---|
| 115. | ఆర్. విద్యాసాగర్ | డా. జె. విజయకుమార్‌జీ | 404 |
| 116. | రాజా బహదూర్ వెంకటరామిరెడ్డి | డా. టి. గౌరీశంకర్ | 408 |
| 117. | రాజన్ బాబు | పి.వి. రాంమోహన్ నాయుడు | 412 |
| 118. | రామానంద తీర్థ | డా. టి. గౌరీశంకర్ | 415 |
| 119. | రావెళ్ళ వెంకటరామారావు | జ్వలిత | 419 |
| 120. | రావి నారాయణ రెడ్డి | డా. సుంకిరెడ్డి నారాయణరెడ్డి | 421 |
| 121. | సదాశివుడు | వర్ఝుల శివ కుమార్ | 424 |
| 122. | సాహు | అన్నవరం దేవేందర్ | 427 |
| 123. | సైబ పరంధాములు | కందాళై రాఘవాచార్యులు | 430 |
| 124. | సామల సదాశివ (యాది) | తుమ్మూరి రాంమోహన్‌రావు | 433 |
| 125. | శంకర్ (జైకిషన్) | హెచ్. రమేష్‌బాబు | 436 |
| 126. | శేఖర్ (కార్టూనిస్ట్) | చేతన కె. | 440 |
| 127. | షోయబుల్లాఖాన్ | డా. దేవులపల్లి ప్రభాకరరావు | 443 |
| 128. | సిద్దప్ప వరకవి | డా. బి.వి.ఎన్. స్వామి | 446 |
| 129. | సిరికొండ వెంకట్రావు | వెల్చాల కొండలరావు | 449 |
| 130. | సిరిప్రెగడ భార్గవరావు | డా. తిరునగరి | 452 |
| 131. | సుద్దాల హనుమంతు | శ్రీరామోజు హరగోపాల్ | 455 |
| 132. | సుమిత్రాదేవి | డా. ముక్తేవి భారతి | 459 |
| 133. | సురవరం ప్రతాపరెడ్డి | డా. ఎల్లూరి శివారెడ్డి | 462 |
| 134. | టి. మాధవరావు | వారాల ఆనంద్ | 465 |
| 135. | తాడేపల్లి లక్ష్మీ కాంతారావు | హెచ్. రమేష్‌బాబు | 468 |
| 136. | తెలకపల్లి రామచంద్రశాస్త్రి | వేదార్థం మధుసూదనశర్మ | 472 |
| 137. | తోటపల్లి సుబ్రహ్మణ్యం | జి. వెంకటరామారావు | 474 |
| 138. | తుర్రేబాజ్ ఖాన్ | డా. ఏనుగు నరసింహారెడ్డి | 476 |
| 139. | ఉత్పల సత్యనారాయణాచార్యులు | డా. జి. చెన్నకేశవరెడ్డి | 479 |
| 140. | వద్దేపల్లి సోదరులు | డా. బెల్లంకొండ సంపత్‌కుమార్ | 484 |
| 141. | వడ్లకొండ నరసింహారావు | డా. చీదెళ్ళ సీతామహాలక్ష్మి | 486 |
| 142. | వానమామలై జగన్నాథాచార్యులు | డా. రావికంటి వసునందన్ | 488 |
| 143. | వానమామలై వరదాచార్యులు | డా. రావికంటి వసునందన్ | 492 |
| 144. | వందేమాతరం రామచంద్రరావు | డా. ఎం. దేవేంద్ర | 496 |
| 145. | వాంకుడోత్ జోగ్యానాయక్ | డా. వి. రామకోటి | 499 |
| 146. | వరహాల భీమయ్య | డా. రంగి కమల | 502 |
| 147. | వట్టికోట ఆళ్వార్‌స్వామి | డా. ఎస్.వి. సత్యనారాయణ | 505 |
| 148. | వెలిచాల కేశవరావు | వి.కె. ప్రేమ్‌చంద్ | 508 |
| 149. | వెల్దుర్తి మాణిక్యరావు | డా. గుమ్మన్నగారి బాలశ్రీనివాసమూర్తి | 512 |
| 150. | వేముగంటి నరసింహాచార్యులు | డా. చెప్పెల హరినాథశర్మ | 517 |
| 151. | వేముల పెరుమాళ్ళు | డా. దేవరాజు మహారాజు | 522 |
| 152. | వేంకట రాజన్న అవధాని | ప్రమోద్ అవధాని | 525 |
| 153. | వేంకట రామ నరసింహారావు | షబ్బీర్ ఇందిర | 528 |

# 1 అబిద్ హసన్ సఫ్రానీ

**– జి. వెంకట రామారావు**

జై హింద్! అనే నినాదం జాతీయమైనది. అది భారతీయులకు ఎంతో పవిత్రమైనది. ఈ పవిత్ర నినాద సృష్టికర్త మేజర్ ఆబిద్ హసన్ సఫ్రానీ. ఆయన హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి. ఆబిద్ హసన్ హైదరాబాద్ నగరంలోని ఒక ఉన్నతమైన కుటుంబంలో 1912వ సంవత్సరంలో జన్మించాడు. ఆయన తల్లి ఫక్రున్నిసా బేగం. ఆమెకు సరోజిని నాయుడు సాంగత్యంలో దేశభక్తి నరనరాన జీర్ణించుకుపోయింది. విదేశీ వస్త్రాలను తగులబెట్టిన మొదటి హైదరాబాద్ మహిళగా ఆమె అందరి మన్ననలను పొందగలిగింది.

మహాత్మాగాంధీ, నెహ్రూ, ఆజాద్ మొదలైన అగ్రనాయకులు ఆమెను **'అమ్మాజీన్'** అని పిలిచేవారు. ఆమెకు ముగ్గురు కుమారులు. అందరూ విద్యావంతులే. మత సామరస్యాన్ని కాపాడడానికి వీరంతా కృషి చేసినవారే. వీరు వార్ధాకో, సబర్మతికో పోయినపుడు ఆ విషయం ముందుగా గాంధీజీకి తెలియజేసేవారు. వీరిపై గల గౌరవం చేత తన ప్రియ శిష్యుడైన ప్యారేలాల్‌ను వారికి స్వాగతం పలకడానికి రైల్వేస్టేషన్‌కు పంపేవారు. తన సోదరులలో జేష్ఠుడైన బమరుల్ హసన్ గాంధీజీ నడిపిన **'యంగ్ ఇండియా'** పత్రికలో పనిచేశారు.

సీనియర్ గేంబ్రిసీ పరీక్షలో ఉత్తీర్ణుడైన ఆబిద్ హసన్ 1931లో సబర్మతీ ఆశ్రమం చేరుకుని దండి ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని ఒక సంవత్సరం జైలు శిక్ష అనుభవించాడు. జైల్లో ఉన్నప్పుడు కాంగ్రెస్ నాయకులైన ఉమాశంకర్ దీక్షిత్, వెస్లేపాటిల్‌తో స్నేహమేర్పడింది. సఫ్రానీ ఆశ్రమంలో ఉన్నప్పుడు 'రఘుపతి రాఘవ రాజారాం' ప్రార్థనలో 'ఈశ్వర్ అల్లా తేరేనాం' ఉండాలని వాదించి గాంధీజీని ఒప్పించాడు.

ఆబిద్ హసన్ జైలు నుంచి విడుదలై రాగానే జర్మనీ వెళ్లి ఇంజినీరింగ్ చదువుకున్నాడు. అక్కడే ఆయనకు మేజర్ స్వామితో పరిచయమేర్పడింది. అప్పటినుంచి వీరిద్దరి జీవితాలు ఒకే తాటిపై నడిచాయి. వీరి విద్య పూర్తవుతున్న సమయంలో రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభమైంది. మిత్రులిద్దరూ అక్కడే ఉండిపోయారు. ఆబిద్ హసన్ జర్మనీ, ఫ్రెంచ్, ఇంగ్లీష్, అరబిక్, సంస్కృతం, పర్సియన్, హిందీ, ఉర్దూ భాషలలో ప్రవీణుడు. తెలుగు సరేసరి.

దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న సుభాష్ చంద్రబోస్ 1941వ సంవత్సరం మూడోవారంలో తన కలకత్తా నివాసం నుంచి తప్పించుకునిపోయిన సంగతి తెలియగానే యావద్దేశం విస్తుపోయింది. అనేక సాహసాలతో నేతాజీ జర్మనీ చేరుకోగానే ఆయనకు ఘనస్వాగతం పలికిన వారిలో సఫ్రానీ, ఆయన మిత్రుడు స్వామీ ముందున్నారు. ఈ ఇద్దరికీ జర్మనీయులతో పరిచయం ఉండడంతో నేతాజీకి జర్మనీ పరిస్థితులు తెలియచేయగలిగారు. భారత స్వేచ్ఛ

కోరిన పేరుతో సైనికుల అభినందనలందుకున్న సుభాష్ చంద్రబోస్‌ను **'నేతాజీ'** అని మొదటిసారి పిలిచింది జర్మనీలోనే. నేతాజీ జర్మనీలో ఉన్నప్పుడు భారత స్వాతంత్ర్య ప్రభుత్వ స్థాపన, పతాకం మొదలైన విషయాలపై చర్చలు జరిగాయి. ఆనాడు జరిగిన చర్చల్లో 'నమస్తే' స్థానంలో 'జైహింద్' ఉండాలని సూచన చేసింది సఫ్రానీయే. దీన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. ఆనాటి నుంచి ఇది ప్రజలకు తారకమంత్రమైంది.

దూర ప్రాచ్య భారతీయుల పిలుపు మేరకు నేతాజీ జలాంతర్గామిలో ప్రయాణమైనప్పుడు తన వెంట ఆబిద్ హసన్ ఒక్కడినే తీసుకువెళ్లాడు. సుదీర్ఘ ప్రయాణం చేసుకుంటూ 40 రోజుల తర్వాత ఆ జలాంతర్గామి హిందూ మహాసముద్రంలో ప్రవేశించింది. అక్కడనే జర్మనీ జలాంతర్గామి నుంచి నేతాజీ, ఆబిద్ హసన్ జపాన్ జలాంతర్గామిలోకి చేరవలసి ఉంది. రెండు జలాంతర్గాముల మధ్య దూరం ఎక్కువగానే ఉంది. రెండింటిని కలపడానికి ఒక తాడు బిగించి ఆ తాడు పట్టుకుని సఫ్రానీ రెండో జలాంతర్గామిలోకి దూకినారు. రెండు జలాంతర్గాములను కలపడం అత్యంత సాహసమైన, ప్రమాదకరమైన కార్యం. ఈ కార్యం సాధించినందుకు జర్మనీ, జపాన్ నావికులు సఫ్రానీని ఎంతో అభినందించారు. ఆజాద్ హింద్ సైన్యంలో సఫ్రానీ కల్నల్ హోదాలో ఉండేవాడు.

భారత జాతీయ సైన్యం రంగూన్ సరిహద్దు దాటి భారత భూభాగంలోకి ప్రవేశించినపుడు గాంధీజీ, గౌస్‌కు సఫ్రానీ రెండో కమాండెంట్‌గా ఉండేవాడు. కోహిమా స్వాధీనం చేసుకోవడానికి ఆయన సైన్యాలు నడిపించాడు. కొన్ని గంటలలో ఇంఫాల్‌ను భారత సైన్యం హస్తగతం చేసుకుంటుందని, భారత దేశంలో బ్రిటిష్ పాలన దెబ్బతిందని అనుకున్నారు. కానీ జయాపజయాలు దైవాధీనాలు. వాతావరణం అనుకూలించనందున భారత జాతీయ సైన్యాన్ని తప్పనిసరిగా ఉపసంహరించుకోవలసి వచ్చింది.

ప్రధాని నెహ్రూ ఆహ్వానంపై స్వతంత్ర భారతదేశ ప్రభుత్వంలో సఫ్రానీ విదేశాంగ శాఖలో చేరిపోయారు. 18 సంవత్సరాలు ఆ శాఖలో వివిధ హోదాలలో పనిచేశారు. సర్దార్ ఫణిల్లాల్ చైనాలో భారత రాయబారిగా ఉన్నప్పుడు ఆ కార్యాలయంలో మొదటి కార్యదర్శిగా పనిచేశాడు. 1967 నుంచి 1969 వరకు డెన్మార్క్‌లో భారత రాయబారిగా పనిచేసి పదవీ విరమణ చేశాడు. అనంతరం జన్మస్థలమైన హైదరాబాద్‌కు వచ్చి సమీపంలో వ్యవసాయ క్షేత్రం పెట్టుకొని విరామ జీవితం గడిపాడు. ఆయన బ్రహ్మచారి. కుటుంబ బాదర బందీలు, బస్తీ వ్యాసంగాలు లేవు.

సఫ్రానీ ప్రతి సంవత్సరం జనవరి నెలలో కలకత్తాలోని నేతాజీ నివాసాన్ని సందర్శించేవాడు. భగవద్గీతను ఆయన ఉర్దూ భాషలో తర్జుమా చేశాడు. చివరిరోజుల్లో ఎంతో ప్రశాంతమైన జీవితం గడిపిన సఫ్రానీ 1984 ఏప్రిల్ 11వ తేదీన తన నివాసంలో 73వ ఏట మరణించాడు. ఆయన సృష్టించిన **'జైహింద్'** నినాదం భారత ప్రజలకు తారకమంత్రమైంది.

# 2 ఆదిరాజు వీరభద్రరావు

**– ఆచార్య వెలుదండ నిత్యానందరావు**

ఆంధ్రజనులయందు ఘనీభవించియున్న అవిద్యను, అజ్ఞానమును, మూఢత్వమును, నిస్పృహత్వమును, దాస్యభావమును పటాపంచలు గావించు టెట్లు?" – అని అహరహం తపిస్తూ మహనీయులెందరో తెలుగువారి వికాసం కోసం రాజకీయంగా, తాత్వికంగా, సాహిత్యపరంగా సర్వశక్తులు ధారపోసి కృషి చేశారు. రాజకీయ పోరాటం చేస్తున్న మాడపాటి హనుమంతరావు గారికి విశ్వసనీయమైన సహచరునిగా ఉంటూ, సాహిత్య చైతన్యాన్ని రగిలిస్తూ, సాంస్కృతిక పోరాటం సాగించినవారు శ్రీ వీరభద్రరావు. ఒక చారిత్రక పరిశోధన దృక్పథానికి, పరిశ్రమ శీలానికి ప్రతీకగా నిలిచి నిరాడంబరంగా, మౌనంగా అచంచలంగా ఒక నిశ్శబ్ద విప్లవాన్నే నడిపిన మహనీయుడాయన.

ఆదిరారాజు వీరభద్రరావు గారు సంగ్రహాంధ్ర విజ్ఞానకోశ నిర్మాతగా, శాసన పరిశీలకునిగా, బాలవాఙ్మయ కర్తగా, ఉత్తమ అధ్యాపకునిగా తెలంగాణ వికాస చరిత్రలో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు.

ఆదిరాజు వీరభద్రరావు 1892 నవంబర్ 16న ఖమ్మం జిల్లా దెందుకూరులో జన్మించారు. వీరి తల్లిదండ్రులు వెంకమ్మ, లింగయ్య పంతులు. వీరిది సదాచార సంపన్నమైన నియోగిబ్రాహ్మణ కుటుంబం. ఆదిరాజు వారికి ఐదేళ్ళ పసి ప్రాయంలోనే పితృవియోగం సంభవించింది. దాంతో పెదనాన్న ఆదిరాజు రామకృష్ణారావు ప్రాపకంలో చింతకాణి, కొణిజెర్ల గ్రామాలలో ప్రాథమిక విద్యాభ్యాసం చేశారు. తరువాత శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం స్థాపకులైన రావిచెట్టు రంగారావు ఆదిరాజువారిని చేరదీశారు. దాంతో హైదరాబాదులోని చాదర్‌ఘాట్ హైస్కూలులో మెట్రిక్ చదివారు. అనారోగ్య కారణాల వల్ల చదువుకు కొంత అవాంతరమేర్పడింది. అప్పుడే (1901) కొత్తగా స్థాపించిన శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం నిర్వహణలో భాగస్వామ్యం వహించే అవకాశం వీరభద్రరావుగారికి లభించింది. దాంతో వారికి విజ్ఞాన కవాటాలు తెరుచు కొన్నట్లయింది. వారి విస్తృత గ్రంథాధ్యయనశీలానికి, రచనా వ్యాసంగానికి ఈ గ్రంథాలయమే పాదులు నిర్మించింది.

శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం స్థాపితమైన 1-9-1901 నాడు విద్యార్థిగా ఆహ్వానితులైన పెద్దలకు చందన తాంబూలాదులను సమర్పించే అవకాశం నాకు కలగడం నా అదృష్టమని చెప్పేవారు. అంతేగాక ఆ రోజుల్లో కృష్ణరాయ భాషానిలయం ఒక ఉద్యమ వేదిక, నిజాం వ్యతిరేకోద్యమానికి కేంద్రస్థానం కావడంతో రాజకీయ నాయకులతో, ఉద్యమకారులతో సహజీవన సౌభాగ్యం కూడా ఆదిరాజు వారికి సిద్ధించింది. తర్వాతికాలంలో కృష్ణదేవ రాయాంధ్ర భాషానిలయం శాశ్వతభవన నిర్మాణానికి ఆనాటి పెద్దలతో కలిసి కృషి చేశారు. ఆ గ్రంథాలయ రజతోత్సవ, స్వర్ణోత్సవ, వజ్రోత్సవ సంచికలు వెలువడడానికి కారణభూతులయ్యారు.

విఖ్యాత పరిశోధకులు కొమర్రాజు వెంకటలక్ష్మారావు హైదరాబాదులో 1905లో విజ్ఞాన చంద్రికా గ్రంథమాలను స్థాపించారు. ఆదిరాజువారు దానిలో సహాయకునిగా చేరారు. 1907లో లక్ష్మీనరసమ్మతో వివాహమైంది. స్థానిక రాజకీయాల అననుకూల పరిస్థితులవల్ల కొమర్రాజు వారు విజ్ఞాన చంద్రికా గ్రంథమాలను 1908లో బ్రిటీషాంధ్ర రాజధాని మద్రాసు (నేటి చెన్నై)కి తరలించారు. ఆదిరాజువారు కూడ భార్యతోసహా మద్రాసుకు మారారు.

మద్రాసులో విజ్ఞాన చంద్రికా గ్రంథమాలలో సహాయకునిగా చేరడం వీరభద్రరావుగారి జీవితాన్ని మలుపు తిప్పింది. ఒక రాటుదేలిన పరిశోధకునిగా మారడానికి ఈ అవకాశం ఎంతగానో తోడ్పడింది. "మద్రాసు నివాసముతో నేను మహావిద్వత్ప్రపంచము లోనికి దూకినవాడనయినాను. విజ్ఞాన చంద్రికా గ్రంథమాల నన్ను తీర్చిదిద్దినది" అని ఆదిరాజువారు ఎంతో కృతజ్ఞతాపూర్వకంగా చెప్పారు. కందుకూరి వీరేశలింగం, కొమర్రాజు లక్ష్మణరావు, చిలుకూరి వీరభద్రరావు, చిలకమర్తి లక్ష్మీనరసింహం తనకు స్ఫూర్తిదాతలని, వారి మార్గంలో చరిత్ర పరిశోధన, సాహిత్య పరిశోధన, స్వస్థాన వేష భాషాభివృద్ధి, కార్యదీక్ష తనకు అలవడ్డాయని ఆదిరాజు వారు చెప్పుకున్నారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నవారు కావడం చేత విషయాన్ని సవివరంగా సులభంగా విడమర్చి చెప్పే నైపుణ్యం సిద్ధించింది. 1914లో విజ్ఞాన చంద్రికా గ్రంథమాల హైదరాబాదుకు మారడంతో ఆదిరాజువారు తిరిగి హైదరాబాదుకు చేరుకున్నారు.

ఆదిరాజు వారికి బాగా పేరు తెచ్చిన గ్రంథాల్లో ప్రాచీనాంధ్ర నగరములు, తెలంగాణా అనేవి ప్రధానమైనవి. అలంపురం, ఆనెగొంది, కళ్యాణి, కొండాపురం, కొలనుపాక, గోలకొండ, పానుగల్లు, ప్రతిష్ఠానం, బోనగిరి, రాచకొండ, వరంగల్లు, వేల్పుగొండ అనే ప్రసిద్ధ నగరాలకు సంబంధించిన పూర్వరాజుల, రాణుల, మంత్రుల, శిల్పుల, గాయకుల, కవుల జీవిత చారిత్రక విశేషాలతో పాటు భౌగోళిక, సాంఘిక ఆర్థిక మత విషయాలను, ఆ పట్టణాల పతన హేతువులను నిష్పక్షపాతంగా వివేచించి ఎన్నో అపూర్వ విషయాలను వెలుగులోనికి తెచ్చారు.

తెలంగాణకు సంబంధించిన విభిన్న అంశాలను సత్యదృష్టితో పరిశీలిస్తూ వెలువరించిన గ్రంథం మన తెలంగాణం. దీనిలో పది వ్యాసాలున్నాయి. ప్రతి వ్యాసంలోనూ ఏదో ఒక కొత్త ప్రతిపాదన లేదా పదిమంది దృష్టికి రాని అంశం కనిపిస్తుంది. తెలంగాణా నేలిన కాకతీయుల చారిత్రక, సాంఘిక, మత, విశేషాలు, శైవ వైష్ణవ, జైన సంఘర్షణలు ఒక వ్యాసంలో వివరించారు. తాళపత్ర.. సస్వరూపభావాలు తెలంగాణములో ఇంకను చాలా గ్రంథములున్నవి. "వనపర్తి గద్వాల సంస్థానములలో దిక్కుమొక్కు లేకుండా నున్న అనేక గ్రంథాలలో చారిత్రక, భాష, మతము, సంప్రదాయము మొదలగు వానికి సంబంధించిన అమూల్యాంశులున్నవని చాలామందికి తెలియ"దన్నారు.

ఆదిరాజువారు ఆనాడు పేర్కొన్న కొన్ని తాళపత్ర గ్రంథాలు – శ్రీకృష్ణశతానందీయం, తాలాంకనందినీ పరిణయం, దశరథరాజనందినీ పరిణయం లాంటి కావ్యాలు పండిత పరిష్కృతాలయి వెలుగులోకి వచ్చాయి. నాణెములను గురించి, చరిత్ర పునర్నిర్మాణంలో వాటి పాత్ర గురించి వివరిస్తూ భారతదేశంలో అతి ప్రాచీన నాణేలు తొలిసారిగా తెలంగాణ ప్రాంతమైన కరీంనగర్‌లో దొరికాయని, నాణేలు ముద్రించే టంకసాలలు సైతం తెలంగాణలో ఉండేవని ఒకటి కొండాపూర్‌లో, రెండవది కోయిలకొండలో ఉండేదని చారిత్రకాధారాలతో నిరూపించారు. ఆదిరాజు వీరభద్రరావుగారు తెలంగాణలోని తొమ్మిది జిల్లాలలోనున్న 641 దేవాలయాల్లోని శిల్ప విశేషాలు, నిర్మాణ విశేషాలు, జాతరలు, ఉత్సవాలు, ఇతర విశేషాలు వివరించారు.

నల్లగొండ జిల్లాలోని ఛాయా సోమేశ్వరాలయంలో శివలింగంపై పడే నీడ సూర్యోదయం నుండి సూర్యాస్తమయం దాక స్థిరంగా కదలకుండా ఒకే చోట ఉంటుందని ఆదిరాజువారు ఒక ఆశ్చర్యకరమైన విషయాన్ని తెలిపారు. తెలంగాణా జిల్లాల భౌగోళిక స్వరూపం, జనసాంద్రత, ఏలిన రాజవంశాలు వ్యవసాయ, పంటలు, దర్శనీయ ప్రాంతాలు, ప్రముఖ కవులను వివరిస్తూ రాసిన సమాచారాత్మక గ్రంథం తెలంగాణ.

ఆదిరాజు వారికి బాగా పేరు తెచ్చిన మరో గ్రంథం షితాబుఖాన్ లేక సీతాపతిరాజు చరిత్ర. షితాబుఖాన్ హిందూ చరిత్రకారుల చేత మహ్మదీయునిగాను, మహ్మదీయ చరిత్రకారులచేత హిందువుగా వర్ణింపబడి అందరి

నిరాదరణకు గురియైనవాడు. షితాబుఖాన్ వేయించిన శాసనాన్ని మొదట కొమర్రాజు లక్ష్మణరావు గారు గుర్తించి ఇతను హిందూ రాజై వుంటాడని అనుమానించాడు. కాని వారి అకాల మరణంతో షితాబ్ ఖాన్ మీద ఆదిరాజువారు విస్తృత పరిశోధనకు నడుం కట్టారు.

1440 ప్రాంతంలో నాగయాఖ్యుడనే నాయకుని మనుమడు సీతాపతి అతని ప్రియపత్నులు దేవాంబిక, అనుమాంబలనీ, బహుమనీ వంశీయుల కింద సర్దారుగా ఉండడం వల్ల ఖాన్ అని బిరుదుతో సత్కరింపబడినట్లు ఈ సీతాపతిఖాన్ 1504లో ఏక్కాలాపురి విజేత అయి 1512లో ఈ గోల్కొండ నవాబుతో జరిగిన యుద్ధంలో చనిపోయాడని ఆదిరాజు వారు నిర్ధారించారు. షితాబ్ అంటే అభ్యుదయం, ఖాన్ అంటే శూరుడని అర్థం. సీతాపతి అన్న హిందూ నామానికి దగ్గరగా ఉండేటట్లు షితాబ్ ఖాన్ అని వ్యవహరించారే తప్ప అతను మహ్మదీయుడు కాడనీ హిందూ రాజే అన్నది ఆదిరాజు వారి నిష్కర్ష. అట్లాగే మహ్మదీయుడైన మరో షితాబ్ ఖాన్ కూడా ఉన్నాడని మరో కొత్త విషయాన్ని తెలిపారు.

ఆదిరాజు వీరభద్రరావు గారు ఒకసారి తరగతిలో పాఠం చెబుతున్నపుడు ఒక విద్యార్థి ఏదో సందేహాన్ని వెలుబుచ్చాడట. దాంతో వారి దృష్టి అతి ప్రాచీన నాగరికతలైన గ్రీకు రోమనుల పురాణ గాథలను వివరించే గ్రంథం తెలుగులో ఏదైనా ఉందా అని అన్వేషించారు. కాని తెలుగులో ఒక్క పుస్తకం కూడా లేకపోవడంతో బాధ కలిగింది. 68 గ్రీకు పురాణ దేవతలకు సంబంధించిన కథలను, హిందూ దేవతలతో పోల్చి బాలురకీ అర్థమయ్యే రీతిలో సులభ వ్యావహారిక శైలిలో గ్రీకు పురాణ కథలు పేరుతో ప్రచురించారు. ఇంకా విద్యార్థుల కోసం రఘునాథనాయుకుడు, మార్కోపోలో, మీరాబాయి, శ్రీహర్షుల సంక్షిప్త జీవిత చరిత్రలు ప్రచురించారు.

జానపద సాహిత్యం, గ్రామనామాలు, వ్యక్తిచరిత్రలు, శాసనాలు, చరిత్రలు, దర్శనీయ స్థలాలు, సంస్కృతి సంబంధాలు, ఆచార వ్యవహారాలు, సామెతల జాతీయాల వివరణ, మహబూబునగర్, మెదక్, నల్లగొండ లాంటి వివిధ జిల్లాల స్వరూప స్వభావాల గురించిన వ్యాసాలు, ఈవిధంగా రెండు వందలకు పైచిలుకు వ్యాసాలు రాశారు. సంగ్రహాంధ్ర విజ్ఞాన కోశం కోసం, రేడియో కోసం రాసినవే ఎక్కువ కావడం వల్ల అవన్నీ సంక్షిప్తంగా సూటిగా విషయ ప్రతిపాదకాలై ఉంటాయి. ఆ రోజుల్లో రేడియో స్టేషన్‌కు దక్కన్ రేడియో అని పేరు. దక్కన్ రేడియోలో మొదటిసారి తెలుగులో ప్రసంగించిన వ్యక్తి ఆదిరాజువారే. దాదాపు 150 రేడియో ప్రసంగాలు చేశారు.

హైదరాబాదులో ఆ కాలంలో వెలసిన ప్రతీ సాహిత్య సాంస్కృతిక సంస్థకు వెన్నుదన్నుగా నిలిచిన ఆదిరాజువారు 1914 నుండి 1921 దాకా చాదర్‌ఘాట్ హైస్కూలులో ఆతర్వాత 1949 నుండి 1953 దాక నారాయణగూడా బాలికోన్నత పాఠశాలలో పనిచేశారు. ఆ తర్వాత సంగ్రహాంధ్ర విజ్ఞాన కోశానికి ప్రధాన సంగ్రాహకులుగా వ్యవహరించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో ఆచార్య ఎస్.వి. రామారావు గారి పర్యవేక్షణలో ఆదిరాజు వీరభద్రరావు వాఙ్మయ సేవను గురించి చేసిన ఎం.ఫిల్ పరిశోధనలో సి. రాధాకిషన్ గారు ఆదిరాజు వారి జీవిత సాహిత్య వ్యాసంగాలను గురించి అనేకాంశాలను కుప్పబోశారు. 1973 సెప్టెంబర్ 28న అస్తమించిన ఆదిరాజు వారి కృషిని గురించి ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనంగారి పలుకులతో ఆ మహానుభావుని స్మృతికి నివాళులర్పిద్దాం.

“వీరిది నూటికి నూరు పాళ్ళు విద్యా చారిత్రక రంగం. విద్య అంటే విద్యాసంస్థలు, గ్రంథాలయ నిర్వహణ, సారస్వత సంస్థల స్థాపన, నిర్వహణ మున్నగు బహుళ కార్యకలాపము. చరిత్ర అనగా ఆంధ్రదేశపు చారిత్రక పరిశోధనము. ఇవేమి వీరకార్యములు కావు, వట్టి పేలపిండి పనులుగా తోస్తున్నాయని ఇప్పటి యువకులు భావింపవచ్చును. భావనా బలం చేత నలభై, యాభై సంవత్సరములు వెనుకకు వెళ్ళండి. అక్కడ చూడండని సమాధానమిస్తాం. అలా చూడగలిగితే కీ.శే. ఆదిరాజు వీరభద్రరావు తెలంగాణా వికాసానికి చేసిన సేవ చిరస్మరణీయమని గుర్తించగల్గుతాం”.

రావుగారిదొక ప్రత్యేకమైన విశిష్టమైన వ్యక్తిత్వము. వారు అజాత శత్రువు. పురిటింట్లోనే వారు ప్రకృతి నలవరుచుకున్నట్టు కనబడుతుంది. తుఫాను వస్తున్నా తనను కాదన్నట్లు వారు తానెన్నుకొన్న దారిలో నడువగలరు. వీరి నిఘంటువులో విజృంభణమన్న పదము లేదు. అడుగడుగునా

బావుటాలెత్తాలని వారు అభిలషించలేదు. నలుగురి ఎదుట నిలబడి తన ప్రాధాన్యతను వెలిబుచ్చాలన్న ఇచ్ఛలేదు. అనుకున్నప్పుడల్లా వేదికలెక్కే అవకాశాలు ఎన్నో ఉన్నా వాటిని ఉపయోగించుకోవాలన్న కోరిక లేదు. వారికి ఒక్కటే అభిలాష ఏదయినా గట్టిపని చేసి చూపించాలని.

'నిప్పచ్చరమున బుట్టినగాని కాక్రమములైన ఎవరూ మహాపురుషులు కాలేరని' అనుభవజ్ఞుల నాడి. కఠిన దారిద్ర్యములో పుట్టినవాడే కఠిన నియమాలతో క్రమశిక్షణతో తన జీవితాన్ని క్రమబద్ధం చేసుకొని ప్రపంచములోని చీకట్లను పారద్రోలుతాడన్న నుడిని రావుగారు సార్థక్యము చేశారు.

రావుగారు రంగారు బంగారు స్వప్నాలు కనలేదు. ఒకనాడు పట్టుపరుపుల మీద పరుండనూ లేదు. కష్టమొచ్చినదని కటికినేల నాశ్రయించనూ లేదు. రావుగారికి ఉగ్గుపాల నిచ్చింది దారిద్ర్యము. అక్షరాస్యుని చేసినదీ దారిద్ర్యమే. ఇబ్బందుల చెలిమి కలిమి నందుకునే రావుగారు మహాపురుషులైనారు.

రావుగారు లక్ష్మీప్రసన్నుల మధ్య మెలిగినారు. కాని వారికి లక్ష్మీ మీద తృష్ణ కలుగలేదు. పదవులకై మోకరించడం గాని – చేతులు నులుపుకోవడంగాని రావుగారు ఎరుగరు.

రావుగారు స్నేహశీలి. స్నేహలతను పెంచుకోవడానికి కులమత వర్గ భాషా భేదాలెరుగని అమృతమూర్తి. చెప్పబోయే విషయములో చక్కని పాండితినలవరుచుకున్న సాహితీ విశారదుడే మంచి వక్త కాగలడు. వక్తృత్వానికీ, రచనలకూ ఒకేరీతి విజ్ఞాన సంపత్తి అవసరము. అవి రెండూ రావుగారికి పుష్కలంగా ఉన్నాయి.

రావుగారు విజ్ఞాని – వ్యవహర్త – చేతలందున భావాలందున పెద్ద – మాటలలో నేర్పరి – ప్రవక్త – నేత – వ్రాతకాడు.

3

# అజిత్

– వారాల ఆనంద్

మోనా డార్లింగ్, లిల్లీ డోంట్ బి సిల్లీ, సారా షహర్ ముఝే లయన్ కె నామ్ పే జాన్తే హై... అంటూ ఒక విలక్షణ సంభాషణ సరళి, మార్ధవం నిండిన గొంతుతో అనేక దశాబ్దాలపాటు హింది చలనచిత్ర సీమకు ఒక ఒరవడిని సృష్టించిన నటుడు అజిత్.

హీరోగానూ, ప్రతినాయకుడిగానూ 200కు పైగా సినిమాల్లో నటించి ఒక నటుడిగా భారతీయ సినీ చరిత్రలో తన స్థానాన్ని నిలుపుకొన్న నటుడు అజిత్. ఆధునిక పాశ్చాత్య ఆహార్యంతో ఆయన విలన్ పాత్రలకు గొప్ప హుందాతనాన్ని తెచ్చాడు. సనాతనంగా భారతీయ సినీరంగంలో విలన్ అంటే ఇట్లా వుండాలనే ఒక నిర్దుష్టమైన లక్షణాలుండేవి. ముఖంమీద గాట్లు, భాషలో రఫ్‌నెస్ మొదలయిన లక్షణాలన్నీ కనిపించేవి కానీ అవేవీ లేకుండా ఉన్నత విద్యావంతుడి లక్షణాలతో స్ఫురద్రూపంతో మంచి అందగాడిగా ఆరడుగుల వాడిగా హుందాగా కనిపించే విలనీని ప్రదర్శించిన వాడు అజిత్. ఫుల్‌సూట్, తెల్లని బూట్లు ఇలా పూర్తిస్థాయి ఆధునిక విలన్ పాత్రలకు అజిత్ పెట్టింది పేరు.

అజిత్ మొదట హీరోగా తన సినీ ప్రస్థానం ప్రారంభించినప్పటికీ విలన్‌గా తనదైన ప్రత్యేకతని చాటుకున్నాడు. అలా హీరో నుంచి విలన్‌గా ఎదిగి క్రమశిక్షణ కలిగిన నటుడిగా పేరు తెచ్చుకున్న నటుడు అజిత్. తన సినీ జీవితంలో మూడుతరాల ప్రేక్షకుల్ని మెప్పించిన అజిత్ హైదరాబాద్ వాసి. ఆయన అసలు పేరు అజిత్ హమీద్ అలీఖాన్. 1922 జనవరి 27న గోల్కొండలో జన్మించాడు.

ఆయన తండ్రి బషీర్ అలీఖాన్ పఠాన్ నిజామ్ సైన్యంలోనూ, పరిపాలనా విభాగంలోనూ పనిచేశాడు. అజిత్ ప్రాథమిక విద్యాభ్యాసం మొదట గోల్కొండ మిడిల్ స్కూల్‌లో జరిగింది. నాంపల్లి హైస్కూల్‌లో హెచ్.ఎస్సీ పూర్తయిన తర్వాత వరంగల్ గవర్నమెంట్ కాలేజీలో చేరాడు. అక్కడ చదువుతోపాటు ఆటల్లో కూడా గొప్ప ప్రతిభ కనబరిచేవాడు. సినిమాల్లో చేరాలనే ఆలోచనకు అక్కడే పాదులు పడ్డాయి.

తోటి విద్యార్థులు, అధ్యాపకులూ అజిత్‌ను సినిమాల్లోకి వెళ్ళమని ప్రోత్సహించేవారు. వరంగల్‌లో వుండి కాలం వృధా చేసుకోకూడదని పోరు పెట్టేవారు. వాళ్ళ మాటలు అజిత్‌ను ఆలోచనలో పడేశాయి. కానీ తండ్రికి అజిత్ సినిమాల్లో చేరడం అంతగా ఇష్టం వుండేది కాదు. కానీ అజిత్ ఒకరోజు తన పుస్తకాలు అమ్మేసి (1943లో) బొంబాయి రైలెక్కేశాడు. వెంట హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ కవి షాహిద్ సిద్దీకీ బోంబేలో ప్రముఖ దర్శకుడు రఫీక్ ఘజ్నవీకి రాసిన ఉత్తరాన్ని తీసుకుని వెళ్ళాడు. బోంబే వెళ్ళగానే రఫీక్ ఘజ్నవీని కలిసి పరిచయం చేసుకున్నాడు అజిత్. కానీ అప్పటికే ఆర్థికంగా ఇబ్బందుల్లో వున్న రఫీక్ తాను సినిమాలు తీయడం లేదని చెప్పడంతో ఇక తాను

ఎక్స్ట్రా వేషాలకు ప్రయత్నాలు ప్రారంభించాడు. అక్కడి పరిస్థితి అంత అనుకూలంగా వుండేది కాదు. అనేకమంది లైన్‌లో వుండేవాళ్ళు. అయినా ఓపిగ్గా తనకు లభించిన పాత్రల్లో నటిస్తూ గడిపాడు. రోజుకు కేవలం రెండో మూడో రూపాయలు వస్తే దాంతో గడపడం అలవాటు చేసుకున్నాడు. అలా మూడేళ్ళు గడిచాక 1946లో ఇన్ఫర్మేషన్ ఫిల్మ్స్ ఆఫ్ ఇండియా సంస్థ నిర్మించే డాక్యుమెంటరీ సినిమాలల్లో పనిచేసే అవకాశం వచ్చింది. ఒక్కో ఫిల్మ్‌కు అజిత్‌కు 125 రూపాయల పారితోషికం లభించేది.

అలా అజిత్ వేస్తున్న పాత్రలు, అతనిలోని ప్రతిభ కొంతమంది సినీ నిర్మాతల దృష్టిలో పడింది. క్రమంగా అవకాశాలు పెరుగుతూ పోయాయి. 1946లో గీతాబాలి హీరోయిన్‌గా అజిత్ హీరోగా 'షా-ఏ-మిశ్రా' సినిమా రూపొందింది. అలా అజిత్ సినీ ప్రస్థానం హీరోగా మొదలయింది. తర్వాత 'హాథీమ్ థాయి (1947), పతంగా, జీవన్ సాతీ(1949), బేకసూర్ (1950)' తదితర సినిమాలతో అజిత్ క్రమంగా నటుడిగా స్థిరపడ్డాడు. గీతాబాలి లాంటి ప్రముఖ హీరోయిన్‌తో కెరీర్ ప్రారంభించిన అజిత్ 'సికిందర్'లో వనమాల సరసన, 'ఆఫ్ బీటీ'లో ఖుర్షీద్‌తో, 'సోకే చూడియా'లో లీలాకుమారితో, 'ఢోలక్'లో మోనాసూరితో, 'చందాకి చాంద్‌నీ'లో మోనికాదేశాయిలు హీరోయిన్లుగా నటించగా అజిత్ హీరోగా రాణించాడు.

అలా 1945లో ప్రారంభమయిన అజిత్ 'సర్కార్, సయ్యా, ఢోలక్(1951), వాస్నా, తరంగ్, మోతీమహల్ (1952), మాస్, సామ్రాట్(1954), షఃజాదే, నాకాభ్, హలాక్, దుర్గేష్ నందిని, ఆస్‌బాస్ (1956) తదితర సినిమాల్లో నటించాడు.

1945లో వచ్చిన 'నాస్తిక్' సినిమా ఆర్థికంగా గొప్ప విజయం సాధించడంతో అజిత్ బొంబేలో నటుడిగానూ, అటు ఆర్థికంగానూ స్థిరపడ్డాడు. 1955లో విడుదల అయిన 'మరైన్ డ్రైవ్' సినిమా 50 వారాలు ఆడి సాధించిన విజయం అజిత్‌లో నూతనోత్సాహాన్ని నింపింది. అందులో బీనారాయ్ హీరోయిన్. తర్వాత '26 జనవరి' 1956లో విడుదల అయింది. అందులో నళినీ జయంత్ నాయకి పాత్ర పోషించింది. అజిత్ హీరోగా నళిని జయంత్‌తోనే అధిక సినిమాల్లో నటించాడు. 1957లో బి.ఆర్.చోప్రా హిట్ సినిమా 'నయా దౌర్'లో అజిత్ దిలీప్‌కుమార్‌కు ప్రాణ స్నేహితుడిగా నటించి మెప్పించాడు.

నటుడిగా 'నాస్తిక్'లో అజిత్ సంభాషణలు లేని పాత్రలో చూపిన నటన విశేష ప్రశంశలు అందుకుంది. దేశవిభజన కాలంలోని ఒక కాందిశీకుని పాత్రలో అజిత్ జీవించాడనే చెప్పాలి. తర్వాత బాదాభాయి, మిలన్ సినిమాల్లో కూడా మంచి పాత్రల్లో మంచి నటనను ప్రదర్శించి విమర్శకులతో మన్ననల్ని అందుకున్నాడు. తర్వాత 'కిత్నా బాదల్, గయా ఇన్సాస్, మెహెన్దీ గెస్ట్ హౌస్, బారాత్ , ఒపెరా హౌస్, టవర్ హౌస్, బర్మా రోడ్, శికారి, నమస్తే జీ, మైహూ, అల్లావుద్దీన్, హిమాలయ్ కి గోద్ మే' లాంటి సినిమాల్లో అజిత్ మెప్పించాడు.

హిందీ సినిమా రంగానికి సంబంధించిన నటన, నిర్మాణ, దర్శకత్వ తదితర అన్ని రంగాల్లో ప్రధాన భూమికను పోషించిన కపూర్ వంశంతో అజిత్‌కు మంచి సంబంధాలు వుండేవి. 1960లో 'మొఘల్ ఏ ఆజం'లో సలీం పాత్రకు వుండే రాజ్‌పుట్ మిత్రుడి పాత్రను అజిత్ పోషించి మెప్పించాడు. ఆపాత్ర నటనకు పృథ్వీరాజ్ కపూర్, దిలీప్ కుమార్‌లతో సమానంగా ఆదరణ లభించింది. అలా కపూర్ వంశంతో వున్న అనుబంధంతో అజిత్ వారి నాలుగు తరాల వారితో నటించాడు. 'ఆనంద్ మఠ్'లో పృథ్వీరాజ్ కపూర్‌తో, 'చార్ దిల్ చార్ రాహే'లో రాజ్ కపూర్‌తో, 'హీరాలాల్ పన్నాలాల్'లో రణధీర్ కపూర్‌తో, 'పోలీస్ ఆఫీసర్లో' కరిష్మాకపూర్‌తో కలిసి నటించాడు అజిత్. మొత్తం 80కి పైగా సినిమాల్లో హీరోగా నటించిన అజిత్ టవర్ హౌస్ లాంటి సినిమాలతో హీరో ప్రస్థానం ముగిసిందనే చెప్పుకోవాలి.

1966లో రాజేంద్రకపూర్ హీరోగా వచ్చిన 'సూరజ్'లో విలన్‌గా నటించి తన నూతన అధ్యాయాన్ని ఆరంభించాడు అజిత్. అప్పటికే విలన్లుగా పలువురు నటులు స్థిరపడి వున్నప్పటికీ అజిత్ తనదయిన ప్రత్యేకతతో 'ప్రిన్స్' లాంటి పలు సినిమాలతో విలన్‌గా నిలదొక్కుకోగలిగాడు. ఆద్మీ ఔర్ ఇంసాస్, పతంగా, ధర్తీ లాంటి సినిమాలు అజిత్‌ని విలన్‌గా నిలబెట్టాయి కానీ 1973లో వచ్చిన 'జంజీర్' ఆయన విలనీ పాత్రలకు స్థిరమయిన స్థానాన్ని ఇచ్చింది. జంజీర్ ఎట్లయితే అమితాబ్‌కు యాంగ్రీ యంగ్‌మాన్ ఇమేజ్

ఇచ్చి స్టార్‌గా నిలబెట్టిందో అజిత్‌ని విలక్షణమైన విలన్ నిలబెట్టిందనే చెప్పుకోవాలి. ఆ చిత్ర రచయితలు సలీమ్ జావేద్‌లు అప్పటిదాకా వున్న హీరోపాత్రల ఒరవడిని మార్చినట్టే విలన్ తీరును కూడా మార్చేశారు. తక్కువ మాటలు, ఆధునిక వేషధారణ, విలనీ అంతా మాటలు ముఖ కవళికల్లోనే వుండేలా పాత్రని సృష్టించారు. ఆ పాత్రకు అజిత్ గొప్పగా సరిపోవడంతో హిందీ సినిమాల్లో సరికొత్త విలన్ పాత్రల సరళి ఆరంభమయింది. జంజీర్, కాళీచరణ్, యాదొంకి బారాత్ లాంటి సినిమాల్లో అజిత్ విలనీ ప్రదర్శన చిరస్థాయిగా వుండిపోయింది.

అలా అజిత్ 57కు పైగా సినిమాల్లో విలన్ పాత్రల్ని పోషించారు. ఆయన నటించిన విలన్ పాత్రల్లో స్మగ్లర్‌లని విలన్లుగా చూపించాడు. అనేక సినిమాల్లో బంగారం స్మగ్లింగ్ చేసే పాత్రలే ఎక్కువగా పోషించాడు. ఇక ఆయన గాంగ్‌లో వున్న వారి పేర్లు అధికంగా క్రిస్టియన్ పేర్లే వుండేవి. రాబర్ట్, మైకేల్, పీటర్ లాంటి పేర్లు మనకు ఎక్కువగా వినిపిస్తాయి.

అలా విలన్‌గా కెరీర్ కొనసాగుతూ వుండగానే అజిత్ 1985లో సినిమాల్ని మానుకుని కుటుంబంతో సహా హైదరాబాద్ చేరుకున్నారు. తర్వాత అడపా దడపా సినిమాతో సంబంధాలు కొనసాగించినప్పటికీ అజిత్ 1995లో హఠాత్తుగా వచ్చిన గుండెపోటుతో ఇక సినిమా నటనకు స్వస్తి చెప్పి హైదరాబాదులోనే వుండిపోయారు.

1998 అక్టోబర్ 21న తన 76వ ఏట తాను అమితంగా ఇష్టపడే హైదరాబాద్ నగరంలోనే తుది శ్వాస విడిచారు. ఆయన మరణంతో హిందీ చలన చిత్రసీమ ఒక విలక్షణమయిన విలన్‌ని కోల్పోయింది. ఆయన మరణం హిందీ చలనచిత్రసీమని దుఃఖంలో ముంచెత్తింది. ప్రముఖ నటుడు అమ్రీష్‌పురి ఆయన మరణం తరువాత మాట్లాడుతూ 'అజిత్ తనదయిన నటనని సంభాషణ సరళిని ఏర్పరచుకున్నారని, ఆయన భావినటులకు మార్గదర్శి' అని అన్నారు.

ప్రేమ్‌చోప్రా మాట్లాడుతూ అజిత్ తన వృత్తికి అంకితమయిన వాడని అన్నారు. అజిత్‌కు మంచి హాస్యచతురత వుండేదని కూడా ప్రేమ్ చోప్రా గుర్తు చేసుకున్నాడు. ఇలా అందరి మనసుల్నీ ఆకట్టుకున్న ప్రత్యేకనటుడూ, హీరో నుంచి విలన్‌దాకా మారి దక్షిణాది నుంచి వెళ్ళి హిందీ సినీరంగంలో నిలదొక్కుకుని హైదరాబాద్ కీర్తిప్రతిష్ఠల్ని నిలబెట్టిన మంచి నటుడు అజిత్. తెలంగాణలో పుట్టి జాతీయస్థాయిలో మంచి నటుడిగా, గొప్ప విలన్ పాత్రధారిగా అజిత్ గురించి చెప్పుకోవచ్చు.

# 4 అలిశెట్టి ప్రభాకర్

- డా॥ నాళేశ్వరం శంకరం

అలిశెట్టి ప్రభాకర్ (12.1.1954 – 12.1.1993) చిత్రకారుడిగా, కవిగా, ఫోటోగ్రాఫర్‌గా సాహిత్యోద్యమ కవుల్లో ముందువరుసలో నిలిచిన ప్రజాకవి. ఎర్ర పావురాలు, మంటల జెండాలు, చురకలు, రక్తరేఖ, సంక్షోభగీతం, సిటీలైఫ్, మరణం నా చివరి చరణం కాదు వంటి కవితా సంపుటాలను 'అలిశెట్టి ప్రభాకర్ కవిత'గా ఆయన మిత్రులు 2013లో ప్రచురించారు. ఆయన ముప్పైతొమ్మిది సంవత్సరాలే జీవించిన క్షయవాది ఆయనను అపహరించి ఎత్తుకెళ్ళినా ఆయన కవిత్వం మాత్రం మన మనోరాజ్యాన్ని నేటికి పాలిస్తూనే ఉంది. అలిశెట్టి మిత్రులు ఆయన కవిత్వాన్ని, స్మృతి సుగంధాల్ని కలుసుకున్నప్పుడల్లా తలపోస్తూ ఉంటారు.

అలిశెట్టి గరీబ్ కావచ్చు గానీ కవిత్వంలో ఆయన అమీరే. పారితోషికంతో పత్రికలకు రాసి బతకాలనుకున్నాడు గానీ పాలకులిచ్చే ధనసహాయంతో బతకాలనుకోలేదు. తెరవెనుక క్షయవ్యాధి మృత్యుద్వారాలు తెరచి ఉంచినా నమ్ముకున్న భార్యను, కాంక్షించిన ఆశయాలను రక్తబంధాలకన్నా ఎక్కువే ప్రేమించాడు.

అలిశెట్టి కవిత్వం వేదనలోంచి పుట్టింది. అలజడిలోంచి అడుగులేసింది. ఆయుధాన్ని అక్కున చేర్చుకుంది. అందుకే మరణం నా చివరి చరణం కాదని చెప్పాడు. కన్నీళ్ళతోనే కర్తవ్యాన్ని తన దిక్సూచిగా ఎత్తిచూపాడు. ఆయనొక యుద్ధగీతం. అక్షర క్షిపణి. ఒక మందుపాతర. ఆయనలో అరణ్యమెంత వుందో అరణ్యసౌందర్యం అంతే ఉంది. పీడితుడే ఆయన కవితాస్త్రం. అణ్వస్త్రం కూడా.

అలిశెట్టి దీర్ఘ కవిత్వాలు, కావ్యాలు రాయలేదు. రహస్సంధ్యలాంటి ఒకటి రెండు మాత్రమే రాశాడు. దీర్ఘ కవిత రాసినా పొట్టి పొడవుల్లేని కవిత రాసినా అందులోని భాష, దానికుండే భావోద్వేగం ఎంత సరళంగా ఉంటుందో అంత సూటిగాను, స్పష్టంగాను ఉంటుంది. ఆయన వ్యక్తీకరణ నిద్రపుచ్చదు. నిద్రపోయేవాణ్ణి, నిద్రను నటిస్తున్న వాణ్ణి మేల్కొలుపుతుంది. దీర్ఘకవితగా అగుపించే 'రహస్సంధ్య' పదహారు పేజీల కవిత. ఇది జీవధారలా సాగుతుందే తప్ప, ఎక్కడా తెగిపోదు. కవిత్వంలోని తత్త్వం జీవనదిలా ప్రవహించింది.

అలిశెట్టి కవిత్వం విప్లవ కవిత్వంలాగే స్పష్టత, సరళత, సూటిదనం, గాఢత, తీవ్రతను సంతరించుకుంది. ఆయన కవితా శిల్పం సగటు పాఠకున్ని మేల్కొలుపుతుంది. అలిశెట్టి చిత్రకారుడు, ఫోటోగ్రాఫర్ కావడం వల్ల వాటి కళానైపుణ్యం ఆయన కవిత్వంలో ఇమిడి పోయాయి. ఆయన 'పోస్టర్' కవిత్వం నిరక్షరాస్యునికి చేరువయింది.

అలిశెట్టి సరళమైన భాషను కవిత్వభాషగా మలిచిన కవి. ఆయన రాసిన ప్రతి కవిత ప్రజల మనోభావాలకు స్ఫూర్తినిస్తుంది. ప్రజలకు అనువైన ఫ్యాషన్లను కవిత్వానికి

నేర్పాడు. ఆయన కవిత్వం ఆయనలోంచి పలుకుతుందా? ప్రజల హృదయాలలోంచి పలుకుతుందా?అంటే రెంటిలోంచి పలికించిన ప్రజాకవి ఆయన.

అలిశెట్టి సిటీలైఫ్‌లోని 417 టుమిరీలు, 66 చురకలు ప్రజల నాలుకల మీద నేటికీ ఉన్నాయి. వేమన పద్యాల్లా అవి గుర్తుకు వస్తాయి. అలిశెట్టి నిబద్ధకవి. మార్క్సిస్టు కవి. ఉద్యమ కవి. అక్షరాల నిండా చైతన్యాన్ని నింపిన కవి. ఆయన జీవితం ఎన్నెన్ని గాయాలమయమైనా రాసిన ప్రతి కవిత దివ్వెలా వెలుగుతుంది. జీవితానికి వెలుగుల్ని ప్రసాదిస్తుంది. ఆయన జీవితకాలం స్వల్పమే అయినా ఆయన కవిత్వం మాత్రం యెల్లకాలం బతుకుతుంది.

అలిశెట్టి కవిత్వం స్థూలమైన జీవన లోతులతో పాటు, జీవితంలో ఎదురయ్యే సంఘటనలు, సందర్భాలు గతం లోంచి వర్తమానంలోకి ప్రయాణించిన వివిధ పార్శ్వాలు వ్యక్తమయ్యాయి. చివరిదాక ప్రజల పక్షాన్నే ఉన్నాడు.

అలిశెట్టి కవిత్వంలో వేశ్యల మీద రాసిన కవితను ప్రధానంగా ఉటంకించకుండా ఉండలేరు.

'తను శవమై, ఒకరికి వశమై, తనువు పుండై
ఒకడికి పండై, ఎప్పుడూ ఎడారై,
ఎందరికో ఓయాసిస్సై'

వంటి పాదాలు ఒక్కసారి చదివితే చాలు ఎల్లకాలం గుర్తుండిపోతాయి.

అలిశెట్టి కవిత్వంలో జిమ్మిక్కుల కన్న భావగాఢత ఎక్కువ. ఫ్యాషన్స్‌కు లొంగే స్త్రీలను 'ఎవరీ హై హీల్సు'లో వ్యంగ్యం అద్భుతంగా పండింది. మనకో కొత్త థాట్‌ను ప్రొవోక్ చేస్తుంది.

'సాయంత్రం సుల్తాన్ బజారే స్త్రీల సెలయేరు,
ఆ మెరిసే రంగురంగుల గులకరాళ్లే కలవారు'

అని ఒక పద్ధతిగల వ్యాఖ్యాన కవిత్వం రాశారు. చివరికంటాడు – 'రాజకీయాల్లో ఆమె ఎటువైపు మొగ్గినా అందాల మొగ్గేనట'. పాలకస్త్రీల స్వభావాలను ఎత్తిపొడుస్తాడు. అంతలోనే శ్రామికస్త్రీల పక్షాన నిలుచుని రాస్తాడు.

స్త్రీమాంసం ముక్కలుముక్కలుగా కోసి విఫణి వీధుల్లో రాసులుగా పోసినా అందాల రాసులుగా పేర్చినా అది దహన దృశ్యమే అంటాడు. మరోచోట వేశ్యను గూర్చి రాస్తూ 'నువ్వీ నాగరిక ప్రపంచంలో స్పృహ కోల్పోయినంతకాలం నీ చీర – వెండితెర, నీ పైట – ప్రకటనల కాన్వాసు, నీ ప్రేమ – రాసలీల' అంటూ దుఃఖపడతాడు.

కవులు ప్రజల పక్షాన నిలవాలని బలంగా కోరాడు. ప్రభుత్వ మెతుకులకు ఆశపడేవాళ్ళు, అవార్డులకు, సన్మానాలకు దారులు వెతుక్కునే వాళ్ళంటే ఆయనకు కోపం. ద్వంద్వ ప్రవృత్తిగల కవుల్ని ఎత్తి పొడిచాడు. చెప్పేదానికి ఆచరించేదానికి పొంతన లేని కవుల్ని నిలదీయాలన్నాడు.

"అర్భకుడైన కవి ఒకడు అవార్డులు సన్మానాల కోసం దేబిరించడం తప్ప, నగరంలో నేడు అవాంఛనీయ సంఘటనలేవీ జరగలేదు" అంటూ వ్యంగ్యంగా ఎత్తిపొడిచి రాశాడు.

'ఎందుకురా కవీ గజిబిజి ఇమేజి. అస్పష్ట కవిత్వం కన్నా ఆల్జీబ్రా ఈజీ' కాదా అంటూ కవుల్లోని ద్వంద్వ ప్రమాణాలను ఎద్దేవ చేస్తాడు.

అలిశెట్టి రాజకీయ నాయకుల స్వభావాల్నీ, స్వార్థబుద్ధుల్ని వ్యతిరేకిస్తూ ఎన్నో కవితలు రాశాడు. నాయకుల వాగ్దానాలకు ప్రజలు బలికావద్దని హెచ్చరికలు జారీ చేశాడు.

'విరివిగా నాయకుల నాలుకలపై నాచు పేరుకుంటుంది. కనుక తరుచూ మాటలు జారుతుంటాయ్' అని నాయకుల్ని వ్యంగ్యంగా ఎత్తి పొడిచాడు.

'వేల సంవత్సరాలుగా వేలి ముద్రల్లోంచి వెలికి తీయలేని హంతకుడే రాజకీయు'డని నాయకుల్ని నిర్వచించాడు.

'రైళ్ళయినా రాజకీయాలైనా పట్టాలు తప్పితే ఎప్పుడూ జనానికే జీవన్మరణ సమస్య' అని ప్రజలకు హితబోధ చేస్తాడు.

అలిశెట్టి కవిత్వంలో డెబ్బై అయిదుశాతం కవిత్వం ఉద్యమ కవిత్వమే. ప్రజల్ని మేల్కొలిపి ఉద్యమాల బాట పట్టించే కవిత్వం మనల్ని ఎప్పటికప్పుడు ఆలోచింపచేస్తుంది.

కవిత్వాన్ని ఎరుపెక్కిస్తుంది. ఎప్పటికప్పుడు విప్లవోద్యమాలలో శ్రమిస్తున్న వాళ్లను ఆవాహనం చేసుకొమ్మంటాడు.

'తమ్ముడూ నువ్వొచ్చేటప్పుడు తప్పక పిడికెడు కల్లోలిత ప్రాంతాల మట్టినైనా తీసుకురా, పోరుదారిలో నేలకొరిగిన ఒక అమరవీరుని జ్ఞాపకమైనా మోసుకురా, మళ్ళీ మళ్ళీ నాకు జగిత్యాల గుర్తొస్తుంది. జైత్రయాత్ర నన్ను కలవరపెడుతోంది' అని జ్ఞాపకం చేస్తాడు. ఉద్యమకారులే ప్రజల మనుషులని నమ్ముతాడు.

'గొంతుకోసే పాట ఆగిపోదు. అది ముక్తకంఠం, గొలుసులేస్తే పోరు నిలిచిపోదు. అది ప్రజాయుద్ధం' అని ఉద్యమకారుల్ని ఎత్తి చూపుతాడు.

అలిశెట్టి కవిత్వం చదువుతుంటే జనం నాడి దొరుకుతుంది. భూస్వాములు, పెట్టుబడిదారులు రాజీలేని నాయకులు అవతారాలెత్తుతున్నారనీ, కవులు వాళ్ళ వ్యూహాలు ఎప్పటికప్పుడు కనిపెట్టి కవిత్వం రాయాలని ఆకాంక్షించాడు. అలిశెట్టి ప్రధానంగా కార్టూన్ కవిత్వం రాసి ప్రజల్ని మేల్కొల్పాడు. కవిత్వానికి బాధ్యత ఉంది. ప్రయోజనముంది అని చివరిదాక నమ్మి ప్రజల పక్షాన, ఉద్యమాల పక్కన నిలబడ్డాడు. శ్రమిస్తూ శ్రమిస్తూనే కన్నుమూశాడు. నమ్ముకున్న విలువలకోసం, ఆశయాల కోసం నిబద్ధంగా నిజాయితీగా నిలువెత్తుగా నిలిచిన అలిశెట్టి నాకు అత్యంత ఆత్మీయుడు కావడం నాకెంతో గర్వకారణం.

# 5 అంబటిపూడి వేంకటరత్నం

**– డా॥ తిరునగరి**

తెల్లని గడ్డమున్ మీసిమిదేలిన మీసము మందహాసమున్
చల్లని చూపులున్ విరియ చక్కని మాటలతో వారిపై
మల్లెలు కుప్పవోసిన క్రమంబున నెయ్యము గ్రుమ్మరించనీ
యుల్లమజ్ఞప్తికెక్కి నేవియో మధురస్మృతలాహపించెడన్

అని సాటికవుల కవితా నీరాజనాలందుకున్న మహాకవి. సంస్కృతాంధ్రాంగ్ల భాషా విశారదులు, వాగ్మి స్వర్గీయ అంబటిపూడి వేంకటరత్నంగారు పుట్టింది ప్రకాశంజిల్లా, ఏదుబాదులోనైనా కాలు పెట్టింది నల్లగొండ జిల్లా'. చండూరులో తెలంగాణ సారస్వత సాంస్కృతిక వికాసానికి తన జీవితాన్నే ధారపోసిన మనిషి, సాహితీ తపస్వి అంబటిపూడివారు. 1908 జూలై 15న వేంకటరత్నంగారు జన్మించారు. సుబ్బమ్మ, సుబ్రహ్మణ్యం ఆయన జననీ జనకులు.

ప్రాథమిక విద్య ఏదుబాదులోను, తరువాత పరిసరప్రాంతాలలోనూ ఉన్నత పాఠశాల విద్యనభ్యసించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి ఎం.ఏ. పట్టభద్రులైన తరువాత జీవితకాలం ఉపాధ్యాయులుగా పనిచేశారు. నల్లగొండ జిల్లా చండూరులో 1934లో 'సాహితీ మేఖల'ను స్థాపించి ఆ ప్రాంతంలోని యువకులకు భాషాసాహిత్యాలను బోధించారు. కవితా వ్యవసాయం చేయించారు ఎందరినో ప్రసిద్ధ కవులుగా తీర్చిదిద్దారు. విద్యార్థిగా ఉన్న కాలంలో ఆయనను తీర్చిదిద్దిన గురువులు ప్రతాపకృష్ణమూర్తి, బండ్లమూడి వేంకయ్య గార్లు, శతావధాని వేలూరి శివరామశాస్త్రి, పళ్ళపూర్ణ ప్రజ్ఞాచార్యులు గార్లు అంబటిపూడివారిని కవిగా, సాహితీవేత్తగా వృద్ధిలోకి తెచ్చిన మహాత్ములు. అంబటిపూడివారు కృష్ణభక్తులు.

చండూరులో శ్రీ కృష్ణభక్త సమాజాన్ని స్థాపించారు. పరిసర గ్రామాల ప్రజలను కృష్ణభక్తులను చేశారు. ప్రజలందరి చేత చండూరుసారు, అన్న గౌరవాన్ని పొందారు. సాహితీ తపస్వి ఐన అంబటిపూడి వారివలన చండూరు, నల్లగొండజిల్లా నిరంతర స్మరణీయాలుగా విరజిల్లుతూనే 'సాహితీమేఖల'లో అనేకమంది కవుల కావ్యాలను, గ్రంథాలను, సంస్థ పక్షాన ప్రచురించి ప్రతిభామూర్తులుగా తీర్చిదిద్దింది.

మహాకవి దాశరథిగారి అగ్నిధారను తొలిసారిగా ప్రచురించింది 'సాహితీమేఖల' సంస్థ. చండూరులో జరిగిన అగ్నిధార, ఆవిష్కరణ సభను నేటికీ తల పండిన సాహితీ పరులు మరచిపోలేదు. అదో సాహిత్య మహోత్సవం. పద్యకవిత్వ పరమావధిని, సాహిత్య ప్రయోజనాన్ని సాహితీపరులకు, సాహితీవ్రతులకు తెలిపినవారు అంబటిపూడివారు. వివిధ సాహిత్యప్రక్రియలో రచనలను ప్రచురించి ఓ కొత్త అధ్యాయాన్ని ప్రారంభించిన సంస్థ సాహితీమేఖల.

ప్రణయవాహిని, వత్సలుడు, మైనాదేవి, మొరాన్‌కన్య, ఇంద్రధనువు, చంద్రశీల (సంస్కృతాంధ్రాలలో ఆంగ్లంలో), బ్రహ్మ సూత్రములు, షడ్దర్శనామాలు కృష్ణప్రభ శతకం, గోపీకావ్యం, ఉత్తరరామచరిత్ర వచనం. కృష్ణకథ, తాత్త్వికతరంగాలు, దక్షిణకీమోదకి నాటకాలు, కథావళి కథలు రాశారు. ఎన్నో వ్యాసాలు రాశారు అంబటి వారు. 'తవనార్థంబుదయించితిన్ సుకవితా కార్యంబె నా వృత్తి' అన్న చెళ్ళపిళ్ళవారి మార్గంలో జీవయాత్ర సాగించారు.

పద్య రచనలో విజ్ఞాని అంబటిపూడివారు. ఆయన భావనలోనూ అభివ్యక్తిలో ఓ విశిష్టత ఉండేది. ఆయన పద్యాన్ని ప్రేమించారు. ప్రబంధకవుల మార్గంలో ఆయన రచన రసరమ్యంగా సాగింది.

పద్యంలో చదువుకోటానికి సౌందర్యం, ఇంపు, రాగయుక్తంగా పాడుకొనడానికి యతిలు ప్రాసలు. పద్యం గుర్తుంచుకోటానికి సులభత్, పాఠకుడు వెంటనేవల్లె వేసుకొనడానికి సౌలభ్యం ఉంటుందన్నది ఆయన భావన. ఆయన గీత రచనకు కూడా ప్రాధాన్యమిచ్చారు. అంబటిపూడివారి పద్యం శిల్పాభారామునిగా ఉంటుంది.

'భాష లేకున్న జనులొక్క పనులమరి
భాషచేగదమానవత్వమ్మునిలుచు
సభల పూజింపబడదెభాషావిదుండ
ప్రతిభగల వానిలో పట్టుభాషయేగద' అంటారు.

**మనిషిగా అంబటిపూడి**

దేశాన్ని, దేశ ప్రజలను ముఖ్యంగా దరిద్ర నారాయుణులను మరవకుండా వారి సేవచూస్తూ సాహితీ సేవ చేసిన మనిషి. ప్రజల మధ్య ఉంటూ కవిత రాశారు. నిరాడంబరమూర్తి, ప్రచారదృష్టి లేనివారు ఉదాత్త హృదయులు, వేదాంతసారం తెలిసినవారు తెలంగాణలో స్థిరపడి తెలంగాణ సాహిత్య సముజ్జ్వలతకు తన సర్వస్వాన్ని అర్పించినవారు. భారతీయతను గుండెలో పదిలంగా దాచుకొన్నా, పాశ్చాత్య సంస్కృతిని గౌరవించిన సమదర్శి.

**కవిగా, సాహితీవేత్తగా**

ప్రతిభా వ్యుత్పత్తి అభ్యాసాలు పరిణితి పొందిన కవి వేంకటరత్నంగారు 'నానృషిః కురుతే కావ్యమ్' అన్న వాక్యం ఆయనపట్ల సార్థకమైంది. పోతనలాగా పద్యాలను పోతపోయటంలో ఆయన శిల్పం అనర్ఘం.

శతావధాని వేటూరి శివరామశాస్త్రి గారు ఆయన గురువు. సంస్కృతం ఆయనవద్ద నేర్చుకున్నాడు. పాణిని వ్యాకరణాన్ని పుక్కిటబట్టారు. ఆ గురువును 'తెనుగు కవిత్వ మాధులతేనె పెరన్ సృజించి యిచ్చిపోయిన తిరుపత్యభిజ్ఞుని యభీషము దీర్చు రసార్ద్ర సాహితీ వనమునమాలి, మా గురుని వ్యాకరణాబ్ధి నమోధు కావ్యదాతను శివరామ సత్కవిని తత్పదపద్మములన్ స్మరించెదన్' అంటూ స్తుతించి ప్రణమిల్లారు.

అంబటిపూడివారు తమ జీవితకాలములో 49 గ్రంథాలు రచించారు. ఆయన కవిత్వంలోని శైలీ రమ్యతకు 'మురళినేబట్టిమాను హరామృతరవమ్ముల్ సేయునీమాజు సుందర గోపాలక రూపమా యమున చెంతన్ బృందము బూర్ణిమా శరదానందముతో జరించుచు జగత్సమ్మోదము గూర్చవే గిరపాటొంది నినున్ భజింపదలయొగ్గెన్ సృష్టికృష్ణప్రభూ!' అన్న పదం ఉదాహరణ.

వేంకటరత్నం గారి రచనలలో కృష్ణప్రభుశతకం ప్రశస్తికెక్కింది. అంబటిపూడి కావ్యాలలో వారు విశిష్టకృతి గోపికావ్యం. ఈ కృతిలో వస్తువు ప్రాచీనమైనదైనా చందోరీ ప్రాచీనమైంది. నూరు విభిన్న వృత్తములతో కావ్యం రచింపబడింది. 1936 లో 'ప్రణయవాహిని' తొలి కావ్యం వెలువడింది.

'మైనాదేవి' దేశభక్తిని ప్రబోధించే మలికావ్యం 1940లో ప్రచురింపబడింది.

'ఇచటి ప్రతిరేణువును ప్రాణమిచ్చి నన్ను పెంచి పెద్దగజేసిన వీరమాత కృప వహించమా ఆత్మవెల్లించుకొనవా' నా యెడలు కాల్చి నిలువుమన్నావు గృహము వంటి పద్యాలు హృదయాన్ని ద్రవింపజేస్తే చంద్రశీల, ఆంధ్రసంస్కృతం, ఆంగ్ల భాషలలో వెలువడిన దాంపత్య ధర్మాన్ని తెలిపే కావ్యం. వేంకటరత్నం గారు సంస్కృతాంధ్రాలలోనేకాక ఆంగ్లంలోనూ చేయి తిరిగిన కవులని తెలియజేస్తుంది.

ఈ కావ్యంపైన పాశ్చాత్య కవిత్వ ప్రభావం కన్పిస్తుంది.

'వత్సలుడు' రాయప్రోలువారి అమలిన శృంగార సిద్ధాంతాన్ని ఆధారం చేసుకొని రచింపబడిన కావ్యం.

'వనవాటి, వారు విశిష్ట ఖండకావ్యసంపుటి. అంబటిపూడి సుదీర్ఘ సాహితీ జీవితంలో 48 గ్రంథాలు రచించారు. అన్నీ వస్తువైవిధ్యంగల రచనలే, అంబడిపూడి వారు నిత్యప్రయోగశీలి. ప్రాచీన కవితను, సంప్రదాయ రీతిని ఎంత గౌరవించారో ఆధునిక కవితను, నవ్యఫణితిని అంతగా ప్రేమించారు. గురజాడ మాటలలో అంబటిపూడి కవిత్వం, సాహిత్యం క్రొమ్మెరుసులు చిమ్మే కొత్త పాత మేలుకలయిక. అన్యభాషా వ్యామోహంలో పడిపోతున్న, మాతృభాష తెలుగును మరచిపోతున్న వారినుద్దేశించి రాస్తూ...

'తల్లియొసగెడి పాలు తెలుగే
తండ్రి గరపెడి పలుకు తెలుగే
తరుణి చూపెడి వలపు తెలుగే – తెలియదా
మన బ్రతుకు బ్రతుకే తెలుగురా, అని ప్రబోధించారు.
'కలి మనస్సును రవ్వంత కలచవలదు
వ్యర్థ వాదమ్ములన్ పెంచిరి
కవి మనస్సును సూతైన కలచవలన
తెలియలేవోయి దానిలో తలకు కొలత' అన్నారు వారు.

అంబటిపూడి సంస్కృతంలోనూ మధుర కవితలు వెలయించారు 'జగద్దర్శనము' కవితలో

'ఆదంభే శిశుర్వే శిక్షత మతః జాతోమనుష్యస్తతః
శిక్షాదక్ష మతః లేకకుశలో జాతస్యదేవోపరః
శిక్షాభ్రష్ట విలేక దాష్టమతయః క్రూరాహితుల్సారిసః
దూర్గైస్సాధుభిరుద్గరంతి విషమిత్సేతజ్జగద్దర్శనమ్'

పశుసమానుడైన మానవుడు జ్ఞానం వలన మానవుడౌతాడన్న సందేశం పై శ్లోకములో ఉంది.

అంబటిపూడి వారు కవి, వ్యాసకర్త, కథకులు, నవలారచయిత ఆయన చేపట్టని ప్రక్రియలేదు. పట్టినదాన్నల్లా కవితామయం చేయగల రసవేది ఆయన రవీంద్రుని గీతాంజలిలోని ఖండాలను తెలియజేశారు. డమర్ఖయామ్ రుబాయాలను 'మధురయాత్ర' పేరుతో ఆంధ్రీకరించారు. ఆనందాచార్యులు ఆంగ్లంలో రాసిన శతస్మ, గ్రంథాన్ని ఆధారం చేసుకొని 'శాంతితీరాలకు' అనే అధునాతన సందేశ కావ్యాన్ని అంబటిపూడివారు రచించారు.

తెలంగాణను సాహితీపరంగా సుసంపన్నంచేసిన అంబటిపూడి వారిని తెలంగాణ ప్రజలు 'కవిరత్న' బిరుదుతో ఘనంగా సత్కరించుకున్నారు. తెలుగు కవితా గంగను తెలంగాణ ప్రజల గుండెలమీదుగా దండిగా ప్రవహింపజేసి ప్రతిభావంతమైన సాహిత్య వ్యవసాయాన్ని సాగించిన వ్యక్తి అంబటిపూడి వేంకటరత్నం గారు.

సిరిప్రెగడ భార్గవరావు, ధవళ శ్రీనివాసరావు. వంగల చలపతిరావు, మద్దోజూ సత్యనారాయణ వంటి లబ్ద ప్రతిష్ఠులైన తెలంగాణ కవులకు గురుమూర్తి అంబటిపూడి వారు.

'ఈ తెలుగు నాలుక నిచ్చిన మీ ఋణమ్ము ధాత్రి సకలమిచ్చినప్పటికీ తీరదు' అని వేలూరి గురుదేవులకు చేతులెత్తి నమస్కరించిన గురుమౌళి అంబటిపూడివారు.

అంబటిపూడి వేంకటరత్నంగారి శతజయంతి ఉత్సవాలు 2008లో నల్లగొండ జిల్లా చండూరులో ఘనంగా జరిగినై. ఆయన తెలంగాణకు ప్రధానంగా నల్లగొండ జిల్లాకు చేసిన బహుముఖ సేవలకు గుర్తింపుగా చండూరులో ఆయన కాంస్య విగ్రహాన్ని కవులు, సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు, ప్రజలు ప్రతిష్ఠించారు. జాషువా గారన్నట్లు అంబటిపూడి ప్రజల నాలుకలయందు జీవించిన నతని 'కులం పవిత్రం జననీ కృతార్థం.

హైదరాబాదు శ్రీకృష్ణదేవరాయాంధ్ర నిలయంలో రాజాబహద్దూర్ వేంకటరామారెడ్డి గారి ఆధ్వర్యంలో రాయప్రోలు సుబ్బారావు గారి అధ్యక్షతన అంబటిపూడి వేంకటరత్నం గారికి అపురూపమైన సత్కారసభ జరిగింది. ఆ సభలో తన శిష్యులైన అంబటిపూడిని శతావధాని వేలూరి శివరామశాస్త్రి గారు ఆశీర్వదించినది ఈ పద్యం.

'విద్యావంశము పేరు నిల్పగదలే విద్యారతీయాచిన
య్యాద్యాహిప్రతిమల్లుడల్ల తిరుపత్యాచర్య దేవుడుతా
విద్యాదేవికి నన్నుజూపి సభలో విజ్ఞప్తి గావించెనా
విద్యాదేవికి నేడు గుర్తొదవెజూవే శిష్యచూడామణి!'

# 6 ఆనందాంబ

– డా॥ ఆర్. కమల

పూర్వ కవుల చరిత్ర తెలుసుకోవాలంటే వారు రాసిన గ్రంథావతారికలు గానీ, వారి గురించి ఇతరులు తెలిపిన విషయాలే ప్రమాణాలు. విద్యయే మృగ్యమై ఉన్న నైజాం రాష్ట్రంలో తెలంగాణలోని మారుమూల గ్రామంలో పుట్టిపెరిగిన ఆణిముత్యం ఆనందాంబ. బాలకవయిత్రి, అష్టావధాని పన్నెండేళ్ల కాలంలో 1934వ సంవత్సరంలో 28 పుటాల పద్యకావ్యం **'సతీలలామ'** పేరుతో ఆనందాంబ రచించారు. అంతకుముందే వెలమవీర, మాదవ పంచాసత్ కావ్యాలు రాసినట్టు గోల్కొండ కవుల సంచికలో పేర్కొనబడింది.

ఉపోద్ఘాతంలో ఈమెను గురించి విద్వాన్ వెంకట నృసింహాచార్య శాస్త్రి గారు స్వయాన ఆమె గురువు సిరి శెనహల్ శ్రీకృష్ణమాచార్యులు, శతావధాని మోర్తాడ్ తాలూకా ఆర్మూర్ వారు 1934లో వెలువర్చిన అభిప్రాయం సిరిసిల్ల వాస్తవ్యులు పదిరే కృష్ణశాస్త్రి అందించిన అభినందన పద్యాల వల్ల కరీంనగర్ జిల్లా మొట్టమొదటి కవయిత్రిగా తెలుస్తోంది.

ఆనందాంబ వారు వెలమ స్త్రీ. వీరి తండ్రి మహారాజశ్రీ పునుగోటి మంగారావు గారు. తల్లి నరసాంబ. పుట్టిల్లు జగిత్యాల తాలూకా కొడిమ్యాల అని నృసింహశాస్త్రి తెలియజేశారు. అంతేగాక. సంస్కృతాంధ్రములు, చవిదప్పిన ఇక్కాలమున ద్వాదశి వర్ష అగ్ని ఈ కన్యారత్నం మాతృభాష అందలి గౌరవంచే శ్లాఘ్యమగు గ్రంథాన్ని రచించుట అత్యంత ప్రశంసాపత్రము. ఈ కవయిత్రికి కవితా సంపద సహజమని తోచుచున్నది. గణయతి ప్రాసలకై కష్టము లేకయే పద్యములు రచిస్తున్నది. సులభ శైలి కలిగిన వర్ణనలు, విసర్గ రమణీయములు.

విషయం భారతీయ నారీరత్నముకేది పరమ ధర్మమో, దేనినవలంభించిన ఇహపర లోకములు కరతలామలకములో, ఏది కులాంగనులకు తలమానికమో అట్టి పాతివ్రత్య నీతి యందు కీర్తింపబడినది. ఈమె బాల్యము నుంచే అమూల్యమగు అభిప్రాయములతో నలరారుచున్నది. ఇకముందు అఖిలాంధ్ర స్త్రీలలో మేటి కాగలదనుట నిర్వివాదాంశం. 'పరమాత్ముడే వైదుష్యము ఆయురారోగ్యం ప్రసాదించుగాక' అని దీవించారు. నేడు పురుషులలో చాలామంది స్త్రీ విద్యల గూర్చి వేదికపై గంభీరోపన్యాసము లిచ్చుచున్నారు. కానీ చెప్పినరీతి ఆచరించుట లేదు. ఈ గ్రంథకర్త తండ్రి తమ పుత్రికకాంధ్ర సారస్వతముల నభ్యసింపజేయుచున్నందుకు ధన్యవాదములు. వీరు మన ఆంధ్ర లోకమునకొక మార్గదర్శకులని అభినందించా.

ప్రతివారు మహిళా జాతిని పవిత్రోద్దేశములతో సన్మానించి పూర్వవైభవం కలిగేటట్లు స్త్రీ విద్యను ప్రోత్సహించాలని, 'భారతీయ సౌభాగ్యం ఫలించుగాక' అన్న విద్వాన్ వేంకట నృసింహశాస్త్రి గారి మాటలు ముత్యాల మూటలు. 'స్వీయ కవితానుజీవనమ్' అనే పుస్తకంలో ఒక

పేజీలో శతావధాని కృష్ణమాచారి కోరుట్ల వారు ఇలా రాశారు. 'క్రీ.శ. 1934 భవ నామ సంవత్సరం నేను సకుటుంబంగా మూడేళ్లు కొడిమ్యాలలోనుంటిని. శ్రీ మంగారావు గారి సతీమణి నరసమ్మ దొరసాని మమ్ము ప్రత్యేక గృహములో ఉంచి, భక్తితో అన్ని సౌకర్యాలు కల్పిస్తూ మా కుటుంబం సాపాటునకు పోగా నెలకిరువది రూపాయలిచ్చేవారు. కాలక్షేపమునకు భగవత్ కథలు విని, సేవించి అప్పుడా దంపతులు సత్కారములు చేయుచుండిరి. ఆనందమ్మప్పుడు 12 సంవత్సరాల బాలిక. చాలా మేధావిని. మిక్కిలి భయ భక్తులు కలది. పంచకావ్యములు, శాకుంతలము, ఉత్తరరామ చరిత్ర నాటకం చెప్పితిని. సంస్కృతమున మంచి జ్ఞానం సంపాదించినది. తెలుగులో అదివరకే పద్యములు రాయుచుండెను. వెలమవీర, మాధవ పంచాశత్‌లను పుస్తకములను శ్రీ మాధవరావు ముద్రించి ప్రకటించారు'.

చలిగంటి శ్రీ ధర్మజగపతి రావు గారు ఈ అమ్మాయికి మేనమామ కనుక ఆహ్వానించి బండ లింగాపురాస్థానాధీశు లగు రాజా అనంత కిషన్ రావు గారి అధ్యక్షతన 'ఆనందాంబ'తో అష్టావధానం చేయించారు. అప్పుడాయన సంతోషించి **'బాల సరస్వతి'** బిరుదునిచ్చారు. ఆ తర్వాత లింగాపురం రాజా గారి మేనల్లుడు వేములకుర్తి వాస్తవ్యులు మాకులూరు భీమారావు(బి.ఎ.) గారితో వివాహమైంది.

కొడిమ్యాలలో శ్రీమతి ఆనందమ్మ చదువుతున్నప్పుడు తిరుమంత్రార్థము మొదలగు గ్రంథములను జెప్పుమనగా పంచ సంస్కారములు కానిది పనికి రాదంటిని. అందువలన తల్లిదండ్రులతో నిర్బంధమాడి పంచ సంస్కారములు పొందెను. తర్వాత మంత్రార్థము మొదలుకొని.. భగవద్విషయము వరకు సంప్రదాయ గ్రంథములన్నింటిని పఠించెను. కొడిమ్యాలలో మేమున్నప్పుడే ఆమెకు ఒక కూతురు కలిగెను.

అవధానమున నేనాశీర్వాద పద్యములందించితిని. **'సతీలలామ'** పుస్తకమునందందించిన పద్యములివి.

కం : హృద్యములు విభుదులకు నా
సాధ్యములు కులాంగనలకు, సరసులకివి సం
సాధ్యములు గుణగణ వదన
పద్యములానందమాంబ, పద్యములరయన్.

కం : చిలుకల కొలుకుల మేల్బం
తుల కిక తేనియల నొలుకు, తోరపు చరకుల్
కలికాంతల కివిడాటపు
ములుకులు నానందాంబ ముద్దుల పలుకుల్'

– ఇట్లు విద్వాన్

శిరశనహల్ శ్రీ కృష్ణమాచార్యులు శతావధాని గారు, మోర్తాడు తాలూకా ఆరమూరు నైజం 3–4–1934.

పదిరె కృష్ణశాస్త్రి గారు తన అభిప్రాయాన్ని అభినందన పద్యంలో ఇలా రాశారు.

చం : 'అతివల మిన్నవై బుధులందరిలన్ దలలూప
జాతు నీ
చతుర కవిత్వ మాధురికి, సంతసమొంది
ప్రియంబుచే భవ
న్మతి నెపుడున్ దలంచగను, మంజుల
పద్యమునొక్క దానినం
దిత హృదయుండనై యొసిగితిన్ గయి
కొమ్ముదె బాలికా మన్'

అని అభినందించారు.

కార్యేషు దాసి, కరణేషు మంత్రి
భోజ్యేషు మాతా, శయనేషు రంభ
రూపేచ లక్ష్మీ, క్షమయా ధరిత్రీ
షట్కర్మ యుక్తా కుల ధర్మపత్నీ

అని మన పూర్వులు తెలిపారు. దాన్నే **'సతీలలామ'** రచనలో శ్రీమతి ఆనందాంబ ఇలా వర్ణించారు.

పతికెట్టి కర్జంబు, బడసిన నద్దాని
నేర్పుతో నొనరించు నెలతమిన్న
నీతి నూహించెటి, నాతి మిన్న
హితుని కాహారంబు, నిడుచున్న వేళల
కన్నతల్లిని మీరు, కలికిమిన్న
ప్రాచేను తోడుత, పాన్పునందున జేర
రంభాదులను గెలుచు రమణి మిన్న
వరుని సేమంబు గోరెడు వలతి మిన్న
పుడమిలో నట్టి చిగురాకు బోడికన్న
తపసి వేరుండగలది నెత్తరిని గన్న
పరగనదాదిదల్వ పాపంబుసున్న – అన్నారు.

కష్టసుఖాల్లో భర్తకు చేదోడువాదోడుగా ఉండేది భార్య అంటూ...

*ఓపలేనట్టి కురూపుడైనను భర్త*
*వలరాజువలె నెంచు పొలతులెవరో*
*పతి భుజించేది పల్చటి గంజైనా*
*అమృతం వలె భావించే భార్యే భార్య*

అన్నారామె.

బాల్యంలో తొలి గురువు తల్లే అందరికి. కనుక ఆమె నుంచే సంక్రమించేట్టు తల్లిదండ్రులుండాలని, పసిప్రాయంలోనే ఏదిచెప్పినా చక్కగా వింటారు కనుక ఇంట్లోని వారితో, ఇరుగుపొరుగు వారితో ఎలా ఉండాలో తల్లే చెప్పాలని స్త్రీలకు ఉద్బోధించారు. ఇంటికి దీపం ఇల్లాలు కనుక ఇల్లు, ఇల్లాలు బాగుండాలని ఆకాంక్షించారు.

ఆమె తన చుట్టుపక్కల చదువుల పేరుతో పరభాషను, పాశ్చాత్య నాగరికతను అనుసరిస్తున్న వాళ్లను నిరసించింది. కట్టుబొట్టు భారతీయ సంస్కృతి, సంప్రదాయం కనుక దానికి మనం విలువ ఇచ్చినపుడే ఎదుటివారు గౌరవిస్తారని విన్నవించారు. సుతిమెత్తని భావాలను సరళ భాషలో పద్యాలు రాసి మనకందించిన మహిళా లలామ ఆనందాంబ. సర్వకాల సర్వావస్థల్లో ఆచరించతగ్గవి ఆమె సూక్తులు. అన్ని పద్యాలు ఆణిముత్యాలే.

తన కృతితో జువ్వాడి వంశ సంజాతుడైన కృష్ణారావు, చక్కని గుణగణాలతో నేర్పి పెంచి పెద్దచేసిన తల్లి నరసాంబను, తననెంతో ప్రేమగా చూసి, తన కృతిని ముద్రింపజేసిన అమ్మమ్మ అంతామాంబకు జోహారు లర్పించినది.

**'సతీలలామ'** కావ్యం భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టింది. అడుగడుగునా స్త్రీ ధర్మాన్ని పాతివ్రత్య ప్రభావాన్ని నీతిని కీర్తింపజేసింది. ప్రాచీన కవుల వలె కావ్య రచనను శ్రీకారంతో మొదలుపెట్టి ఇష్ట దేవతాస్తుతి, వాణీస్తుతి చేస్తూ 'కచ్చిములు గూర్చగా శక్తి కలుగజేయు, మమ్మ మాయమ్మ నినుదలతు నమ్మ వాణీ' అని భక్తితో పలికింది. ఉభయ వేదాంత శిఖామణి యతిరాజు, ఆంధ్ర గీర్వాణ విద్యల ప్రౌఢి, అవధాన వైఖరి, జ్యోతిష్యము, తర్కమునందు తగు పాండిత్యము సముపార్జించి ఎదుటివారిని తన వాదనతో మెప్పించి కీర్తిగాంచిన తన గురువు కృష్ణమాచార్యుని తలచినది. అంతేకాక ప్రాచీన కవుల స్తుతి చేసింది. పునుగోటి వంశాబ్ధి పూర్ణేందు శేఖరుడు సమభావకుడగు జనకుడు మంగారావును, తల్లి సౌభాగ్యవతి నరసమాంబకు నమస్కరించింది. నిజాం ప్రభుత్వంలో రజాకార్ల జమానాలో ఉర్దూ మదర్సాలున్న కాలంలో తన తండ్రి శాస్త్రీయ విద్యాబుద్ధులను నేర్పుట గొప్ప విషయమని, తన పూర్వజన్మ సుకృతమని తెలిపినది. ఎంత ఎదిగితే అంత ఒదగాలనే గుణాన్ని ఇలా తెలియజేసింది.

*"సకల కావ్యంబుల సంపూర్తిగా గనలేదు*
*ఛందస్సును బాల చదవలేదు,*
*నాటకాలంకార పాటవం లేదని"*

విద్యా వినయ సంపన్నురాలిగా పన్నెండేళ్ల ప్రాయంలో పలికింది. భూతలమందనేక జాతులున్నా అందు ముఖ్యమైనది స్త్రీ, పురుషులని, నాతికి పతి సేవయే పరమ ధర్మమని తెలిపింది.

అడవిలో పండుటాకులు తిని, ముక్కు మూసుకున్న తాపసులకన్నా, గంగాది తీర్థయాత్రలు చేసి, ఉపవాసము లుండి, పూజలు, నోములు చేసేవారికంటే పతి సేవ చేసే మగువ పుణ్యం గొప్పదని తెలియజేశారు ఆనందాంబ గారు.

# 7 ఆనందరావు తోట

**– డా॥ వెలిచాల కొండలరావు**

నల్గొండకు చెందిన భువనగిరి వాడు, వికాస వంతుల్లో కూడా చాలా అరుదుగా లభించే వికాసవంతుడు, ఉన్నత, ఉదార, సాంఘిక, సామాజిక, సామ్యవాద దృష్టి దృక్పథం కలవాడు. A gentle poet, a gentle human being ఆనందరావు తోట.

ఆ రోజుల్లో, అంటే ఒక మూడు దశాబ్దాల క్రితం అతని గురించి చెబితే ఎందరో "ఔను ఔననే"వారు. నిండుగా, నిటారుగా ఎంతో కలుపుగోలుగా, కమ్మగా మాట్లాడేవాడు. వివేకానందుని కళ్ళలాంటి దార్శనిక తాత్విక కళ్ళు గలవాడు. తెలంగాణా గురించి ఎవరైనా ఏదైనా చెడ్డగా మాట్లాడితే 'ఖబడ్దార్!' అని ఉరిమి, తరిమేవాడు. అలాంటివారితో గట్టిగా వాదించి వారిని వేదించి, వారితో విభేదించి వారిని వదిలేవాడు కాదు. మరీ మాట్లాడితే, నీ అంతు తేలుస్తానని కళ్ళు నిప్పులుగా తెరచి అరిచేవాడు. చూస్తేనే, మాట్లాడితేనే ఒక rebelలా, ఒక revolutionaryలా అనిపించేవాడు, కనిపించేవాడు.

అతనితో అందరూ ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడేవారు. మ్యానర్స్ లేక ఎవరైనా మాట్లాడితే, పోట్లాడితే వారెవరైనా ఎంతవారైనా సరే 'మతిపోయిందా!' అని మందలించేవాడు. మేధావి. మేధావులలో భాషెక్కువ భావం తక్కువ కల మేధావి కాదు. భాషాభావాలు రెండూ కలిపి ఉత్తమంగా ఉన్నతంగా, ఉద్రేకంగా ఉద్వేగంగా మాట్లాడే మేధావి. ఎలా పసందుగా మాట్లాడేవాడో అలాగే పసందుగా రాసేవాడు, చర్చించేవాడు, ఉపన్యసించేవాడు, సువక్త. 'ఇంటలెక్చువల్' గానే కాక Socialగా కూడా అందరినాకట్టుకునే ప్రతిభ కలవాడు. రంగులో నల్లవాడే కాని హంగులో బహు తెల్లవాడు. అతని మాటంటే మాటే. అది అందరికీ వేదం లాంటిదే. అతడు మాట్లాడే దానిలో, రాసేదానిలో వాదన తక్కువ వేదనెక్కువ, పాతదనం తక్కువ, కొత్తతనమెక్కువ, పొల్లు తక్కువ చెల్లెక్కువుండేవి. అందుకే అతనితో మాట్లాడడమే, మహదావకాశంగా ఎంచే, భావించేవారు ఎందరో.

అతడు ఎన్ని పుస్తకాలు ఎన్నిసార్లు చదివాడో ఆ దేవుడెరుగు. అతనికి వివేకానందుడు హీరో. అతని కళ్ళు కూడా వివేకానందుని కళ్లలాగుండేవి. భౌతిక కళ్ళలా కాక ఆత్మిక కళ్ళలా, ఆధ్యాత్మిక కళ్ళలా.

సత్యం తప్ప అసత్యం, ధర్మం తప్ప అధర్మమెరగని వాడు. సామాజిక దృష్టి దప్ప స్వంత దృష్టి లేనివాడు. సింపుల్‌గానే కాక స్వీట్‌గా, నీట్‌గా ఉండేవాడు. ఎపుడూ సభలలో సమావేశాలలో ఎవరైనా అసభ్యంగా అసందర్భంగా మాట్లాడితే అడ్డుకొని అదరగొట్టి వారి నోర్లు మూయించేవాడు.

చాలామంది జైశంకర్‌ను అతని గురువనుకునేవారు కాని నేను మాత్రం ఆనందరావు తోటానే అతని

గురువనుకునేవాన్ని. నాకు తెలిసినంతవరకు జైశంకర్‌కూడా అతనిని అలాగే భావించేవాడు. తోటా లేకపోతే జైశంకర్ లేడు. జైశంకర్ లేకపోతే తోటా లేడని అనుకునేవారం. బహుశా అందరూ వారినలాగే అనుకునేవారేమో, నాకు తెలియదు. జైశంకర్‌ది తత్వదృష్టి, తోటది తాత్విక దృష్టి అనిపించేది. తోట వాదిస్తే ఒక యోగిలా అనిపించేవాడు. జైశంకర్ వాదిస్తే ఒక వ్యూహకర్తలా, వారి మాటా, బాటా, వాటా ఒకరిది సిద్ధాంతంలాగుంటే, ఒకరిది వ్యూహం లాగుండెడిది. ఇద్దరూ ఇద్దరే. తెలంగాణా విషయంగా అతివాదులు, ఇతర విషయాలలో మితవాదులు.

జైశంకర్‌కు "సిద్ధాంతకర్త" అని ఎవరు పెట్టారో పేరు కాని, అది ఎన్నో అలాంటి పేర్లు ఎందరికో కుదరనట్లు అతనికీ కుదరలేదు. నా అభిప్రాయంలో అతడు గొప్ప వ్యూహకర్తే కాని సిద్ధాంతకర్త కాదు. యుద్ధానికీ, విజయానికీ, సిద్ధాంతమూ, వ్యూహమూ రెండూ అవసరమే కదా మరీ! అవి రెండూ రెండు కళ్లలాంటివే కదామరి! వారిద్దరిని బాగా ఎరిగిన నాకు వారినెప్పుడు విన్నా, కన్నా, వారు నాకలాగే అనిపించేవారు, వినిపించేవారు.

ఎప్పుడూ ఒక పుస్తకం చేతిలో బూనే పుస్తకప్రియుడైన తోట నాకు వివేకనందుని లాంటి సిద్ధాంతకర్తగా అనిపించేవాడు. జైశంకర్ ఎప్పుడూ ఏదో వెదుకుతున్న చాణుక్యుని లాంటి వ్యూహకర్తగా, ఇద్దరూ పరమ మిత్రుల్లా, జంటకవుల్లాగుండేవారు. ఇద్దరూ సాంఘిక సామాజిక దృక్పథం కలవారే కనుక ఎప్పుడూ ఏవేవో ఆలోచించేవారు, ఏవేవో చేసేవారు, ఇతరులతో చేయించేవారు. వారిరువురూ ప్రత్యేక తెలంగాణ వాదానికి, పోరాటానికి బీజాల్లాంటి వాళ్ళు.

మొదటి తెలంగాణ ఉద్యమం రోజుల్లో జైశంకర్, ఆనందరావు తోట ఇరువురూ ఎంతో ఉద్వేగంగా, ఉత్సాహంగా, వారు ఉగ్రూతలూగుతూ, వారి ఉపన్యాసాలతో ఇతరులనుగ్రూతలూగిస్తూ, ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎన్నో వర్క్‌షాప్‌లు, చర్చాగోష్టులు నిర్వహించి, అనేకానేక ప్రచురణలు తీసుకొచ్చి, తెలంగాణ వారినందరినీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రానికి సుముఖులను చేసేవారు. యువకులను, విద్యార్థులను, ఉద్యోగులను, డైరెక్ట్‌గా, ఇన్‌డైరెక్ట్‌గా ఉద్యమంలో పాల్గొనునట్లు పలు వ్యూహాలు తయారు చేసేవారు. వారి ప్రపథమ ప్రచురణల, ప్రచారాల వలననే మొదటి తెలంగాణ ఉద్యమానికి అంత పెద్ద ఊపొచ్చింది. అది అనేకానేక కారణాల వలన అటు తదుపరి ఆరిపోయిన దానిలా అనిపించినా, కనిపించానా అది నివురుగప్పిన నిప్పులా అలాగే ఉండి రెండవ ఉద్యమానికి పురుడు పోసింది, పునాది వేసింది. అందులో ఏ సందేహమూ లేదు. ఆ రెండవ ఉద్యమానికి సరియైన రథసారథిగా కె.సి.ఆర్.గారు ఉండకపోతే, వెనకాల జైశంకర్‌లాంటి రాజకీయరీతులు, వ్యూహాలు తెలిసిన వారధిగా ఉండకపోతే నిస్సందేహంగా, నిర్వివాదంగా ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం ఎన్నటికీ వచ్చేది కాదు.

ఆరోజుల్లో నేనూ, తోటా, జైశంకర్, మా తమ్ముడు జగపతిరావు ఇంట్లో తరచుగా కలుసుకునేవారం. అపుడపుడు శ్రీధర్‌స్వామి కూడా మాతో చేరేవాడు. మా చర్చలు కూడా చాలా ఉల్లాసంగా, ఉద్వేగంగా, వికాస వంతంగా, వివేకంగా సాగేవి. మా అనుభవాలే కాక మా అందరి అధ్యయనాలు కూడా మా చర్చలతో ముడిబడేవి. ఆనందరావు తోట సోషలిస్టు కాకపోయినా అతనికి సోషలిస్ట్ పార్టీలోని మేధావులతో చాలా దగ్గరి సంబంధాలుండేవి. అలాగే కాంగ్రెస్, ఆర్యసమాజ్, కమ్యూనిస్టు పార్టీలోని మేధావులతో కూడా.

అతనినెరిగిన ఆనాటివాళ్లు అతనిని ఈనాటికీ జ్ఞాపకం చేస్తుంటారు. 'మనమొక పెద్ద తెలంగాణా మేధావిని కోల్పోయామని'. అది అక్షరాలా నిజం. He was a gem of a man. A gem of an orator, writer and a thinker. హైదరాబాద్ పట్టణంలోని ఆనాటి కొంతమంది మేధావుల్లో తోటా ఒకడని చెప్పక తప్పదు. తమాషా ఏమిటంటే, తోటా బైట ఎంత ఔట్‌వర్డ్‌గా కనిపించేవాడో, లోపల అంత ఇన్వర్డ్‌గా ఉండేవాడు. బైట ఎంత 'అసర్టివ్' లోపల అంత 'రిఫ్లెక్టివ్'. అందుకే – అతడు తుట్టతుదకు 'స్పిరిచువాలిటీ' వైపుకు మరిలాడు. స్వామీ వివేకానంద అతనికి more than a religious hero, a spiritual hero. బహుశా అతని ప్రభావమే అతనిని ఆవైపునకు ప్రేరేపించిందేమో?

విద్యే అన్నిటికన్నా ముఖ్యమని భావించిన ఆనందరావు తోటా మొదట రిలిజియన్ వైపునకు, ఆ పిదప రాజకీయాల వైపునకు, ఆ పిదప విద్య వైపునకు వెళ్లి ఓ.యూ. ఇంగ్లీష్

డిపార్ట్‌మెంట్‌లో ప్రొఫెసర్‌గా చేరాడు. చేరిన స్వల్పకాలంలోనే మరణించాడు.

ఓ.యూ. నుండి అతడు ఇంగ్లీషులో పి.హెచ్.డి పట్టా పుచ్చుకొని అందరి ప్రశంసలందుకున్నాడు. ఓ.యూ. సిండికేట్ ఎన్నికల్లో పోటీ చేసినపుడు జైశంకర్, ఆనందరావు తోటా, శ్రీధర్‌స్వామి ముగ్గురూ నాతోకూడా ప్రతి తెలంగాణా జిల్లాలలోని కళాశాలలకు తిరిగి ప్రచారం చేసి నన్ను అత్యధిక ఓట్లతో గెలిపించారు.

తోటా మనిషిగా ఎంత ఎత్తైనవాడో కవిగా కూడా అంత ఎత్తైనవాడని నాకు అతడు ప్రచురించిన ఒకే కావ్యం Plato's Pulse చదివితే తెలిసింది. అతడు కవిత్వంలో అడుగు పెట్టాక అతి త్వరగానే చనిపోయాడు. అందుకే చాలా పుస్తకాలు రచించలేదు. కనుక చాలామందికి అతడు మంచికవి అని కూడా తెలియదు.

బహుశా డా.లోహియా, డా.అంబేద్కర్, సెన్సిబిలిటీ గల కవి. ఇంకా బతికుంటే బ్రహ్మాండమైన కవితలు రాసేవాడు. ఆయనలో అంతపాటి సెన్సివిటీ, సెన్సిబిలిటీ లేకపోతే Emily Dickinson పోయెట్రీమీద పి.హెచ్.డి చేసేవాడా మరి? Emily Dickinson ఎంత ప్రకృతిని పరవశించి ప్రేమించేదో అంతే ప్రేమతో, ప్రసన్నతతో, పరవశంతో ప్రకృతిపై కవితలు రాసేది. ఆమె కవితలు ఆమె ప్రకృతిలో చూసిన, వెలలు, వెలుగులు, కన్నకలలు, ఆమె ఎంత నేచర్ అడ్మైరో అంత నేచర్‌పై కవితలు రాసిన నేచురల్ కవయిత్రి. ప్రతి మొక్కను, దాని ఆకును, దాని పుష్పాన్ని, దానిపై రాలిన మంచు బిందువులను, దానిపై తిరిగే తుమ్మెదలను చూసి తాను ముగ్ధురాలై, మనలను ముగ్ధులను చేసే ఎన్నో అందమైన కవితలు రాసేది ఆవిడ. అంత ప్రకృతిని ప్రేమించిన కవయిత్రి కవిత్వంపై పరిశోధన చేసిన ఆనందరావు తోట ఎంత అందమైన సుగుంధమైన హృదయం కలవాడో మనమూహించుకోవచ్చు.

తోటాను ఎపుడు చూచినా ఒక 'సర్దార్'ను యోధున్ని చూసినట్లే ఉండేది నాకు. నిజంగా ఆయన ఆ పదానికి తగినవాడే. ఒక యోధునిగా నడిచేవాడు. మాట్లాడేవాడు, చర్చించేవాడు, ఉపన్యసించేవాడు. పదిమందిలో కూడా ఒకే ఒకడుగా సెక్లూజివ్‌గా కాక ఎక్స్‌క్లూజివ్‌గా అనిపించేవాడు.

అతడు చాలానాళ్లు సికింద్రాబాద్‌లోని సర్దార్ పటేల్ కాలేజ్‌లో లెక్చరర్‌గా పనిచేసి ఆ పిదప ఓ.యూ. నుండి పి.హెచ్.డి. చేసి ఆర్ట్స్ కాలేజ్‌లో ప్రొఫెసర్‌గా పనిచేశాడు.

సుప్రసిద్ధ రచయిత్రి కనకదుర్గ తోట అతని సతీమణి. ఇపుడు ఓ.యూ.లో ఇంగ్లీష్ డిపార్ట్‌మెంట్‌లో రీడర్‌గా పనిచేస్తుంది. వారిరువురిది సాంఘిక దృక్పథంతో కూడిన లవ్ మ్యారేజ్, ఇంటర్ కాస్ట్ మ్యారేజ్. కాని అదేమిటో నాకు తెలియదు. నేను తెలుసుకోలేదు కాని ఆమె వ్యాసాలు రాసినపుడు తన పేరు అంచున 'తోట' అని ముగించక 'దంతు' అని ముగిస్తుంది. ఆనందరావు తోటకు ముత్యాల లాంటి ఇద్దరు పిల్లలు.

తోట రచించిన కావ్యం Platos Pulse చదివితే మనకు అతడు ఎంత లోతైన ప్రకృతి శ్రోతో, ప్రజాశ్రోతో అంత లోతైన 'ప్రకృతికవి', 'ప్రజాకవి' యని తెలుస్తుంది. ఆయన రాసిన వాటిలో మచ్చుకు కొన్ని పంక్తులు మీముందుంచుతున్నాను.

'Green seas of wavy groves
covering slowly sliding streams
Across the curvaceous ranges
That entice it like lasses dressed in emeralds
That is Malayaalam, Keralam'.

అని అంటూ కేరళ ప్రాంత అందాన్ని మనకందిస్తాడు.

'Count not Thota life in digital simplicity
Each life is its own model of complexity'

అను నిత్యసత్యాన్ని ఆవిష్కరిస్తాడు.

'How are you living Thota in this heartless world
How can you relate yourself to this
de-humanised world'

అని భరించలేని ఈనాటి అతని బతుకును అతడే ప్రశ్నించుకుంటాడు.

'Given a chance Thota, welcome an enemy
He is an angle, if not tainted by jealousy'

అంటూ విరోధుడైనా అతడు అసూయుడు కాకపోతే అతనికి స్నేహితుడేయని చెబుతాడు.

' When the music of the blood spurs a dance
In the grey cells,
Words flow in a flood
Leaving behind a train of stars-
Teasing and yet pleasing perceptions;
We see rising before eyes.
P-o-e-m-s.
When words burst at their seams
Cracking the fossiled formulas
Into cascading configurations of
Intertwined ideas
Forcing us to experience the enigma of ex
perience,
We see rising before our eyes
P-o-e-m-s'. అని కవితల గురించి రాస్తాడు.

అలాంటివాన్ని, ప్రత్యేక తెలంగాణ పోరాటంలో అంత ప్రధాన పాత్ర వహించిన వాన్ని, మాట్లాడితే సర్దార్ పటేల్‌లా మాట్లాడేవాన్ని, యోధుడైన "తెలంగాణ సర్దార్"ని మన ఆనందరావు తోటని ఎప్పటికీ మరచిపోదు తెలంగాణ మాగాణం. అతని జ్ఞాపకార్థం సముచితమైన దానికి దేనికైనా అతని పేరు పెడితే సమంజసంగా ఉంటుందని భావిస్తున్నాను.

# 8 అనంతోజు బ్రహ్మయ్య

**– వడ్ల సాయిలుచారి**

తెలంగాణ సాయుధ పోరాటంలో మొదటిదళ కమాండర్‌గా నిలిచినవారే మన ఈ అనంతోజు బ్రహ్మయ్య అలియాస్ కమ్మరి బ్రహ్మయ్య. చిన్ననాడే కుల వివక్షతను ఎదుర్కొన్న బ్రహ్మయ్య ఆనాడే ఈ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడాలని నిశ్చయించుకున్నారు. శ్రీరామోజు హరగోపాల్ గారు మొదలు రికార్డు చేయగా విశ్వనాథుల పుష్పగిరి గారు అక్షరీకరించిన కథలోని సమాచారమే ఈ మరుగున పడిన మాణిక్యం కథ.

పాలకుర్తిలో కమ్మరి బ్రహ్మయ్య, చాకలి ఐలమ్మల ఇండ్లను రజాకార్లు తగులబెడుతుంటే 'ఫికర్ చేయకు మన రాజ్యం వచ్చినాక బంగ్లాలు కట్టుకుందాం' అంటూ చక్కిలం యాదగిరిరావు గారు వారిని ఓదార్చినారట. పోరాట యోధుడు అయిన మన కమ్మరి బ్రహ్మయ్య, 2007 ఆగస్టు 23న పాలకుర్తిలోని తన పూరి గుడిసెలోనే తుది శ్వాస విడిశారు.

స్వరాష్ట్రం సిద్ధించింది. కనీసం ఇప్పుడైనా దళకమాండర్ కమ్మరి బ్రహ్మయ్యకు ఆయనతోటి వీరయోధులకు దక్కాల్సినంత గౌరవం దక్కాల్సివుందని తెలంగాణ ప్రజలు ఎదురు చూసేంత గొప్ప పనులు చేశారు వీరు.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ప్రపంచ విప్లవాల పోరాటాల చరిత్రలో చుక్కానిగా నిలబడింది. ఈ వీరోచిత పోరాటానికి ముందే పాలకుర్తిలో ప్రజల తిరుగుబాటు మొలకెత్తింది. అటువంటి చారిత్రక తిరుగుబాటును నడిపిన విప్లవకారుడు అనంతోజు బ్రహ్మయ్య. ప్రజల ప్రేమతో తమ గుండెలలో దాచుకున్న పేరు కమ్మరి బ్రహ్మయ్య. చరిత్ర ఎన్నడూ మరువని సాయుధ పోరాటాన్ని నిర్మించి, వీరోచితంగా ముందుకు నడిపిన ఘనత మన బ్రహ్మయ్యదే. మతోన్మాద ఫాసిస్టు ప్రభుత్వాన్ని మట్టిలో కలిపేవరకు నిదురపోలేదు.

దేవరుప్పల అడవిలో బ్రహ్మయ్య కమాండర్‌గా 12 మంది దళ సభ్యులతో సాయుధ దళం ఏర్పాటు అయిననాటి నుండి దొరలకు కంటికి కునుకు కరువైంది. ఆనాడు పాలకుర్తిలో సంఘం మీటింగుకని వచ్చిన ఆరుట్ల రామచంద్రారెడ్డిని చంపాలని చూసినప్పుడు బ్రహ్మయ్యనే రెడ్డిగారిని చాకలివారి ఇంట్లో దాచివుంచి, ఆడవేషం వేయించి రాత్రికి రాత్రే ఎడ్లబండిపై పంపించడంలో బ్రహ్మయ్య ధైర్యం, ఎత్తుగడలు తెలుసుకోవచ్చు.

బ్రహ్మయ్య మంచి కళాకారుడు కూడా ఆ రోజుల్లో పాలకుర్తిలో సాతొల్ల శంకర్ కథకుడుగా సాగే బుర్రకథలతో బ్రహ్మయ్య వంతకుడిగా ఉండేవాడు.

దొరల దగ్గర అన్ని కులాల జనం వెట్టిచాకిరి చేసేది. సబ్బండ కులాలవారు కాయాకష్టం చేసి కూలి అడిగే ధైర్యం చేయలేని రోజులవి. బ్రహ్మయ్య తన కులవృత్తి కమ్మరం పనిచేసేవాడు. తను అన్నమాట జవదాటేవాడుకాదు. అన్న

ఏ పని చెప్పినా కాదనకుండా చేసేవాడు. పశువులను కాశాడు. వ్యవసాయం చేశాడు. బ్రహ్మయ్య పశువుల దొడ్డికి ఆనుకునే పోలీస్ పటేల్ కంచె ఉండేది. జనమంతా కంచెలో నుంచి నడవడంతో బాట పడింది. దానితో నా కంచెలో నుండె బాట పెడతారా అని పోలీస్ పటేల్ ప్రజలపై ఆవేశం పెంచుకున్నాడు. ఒకరోజు బ్రహ్మయ్య తన అన్న తన కోసం తెచ్చిన కొత్త చెప్పులు వేసుకొని సెల్కలకు వెళ్తుంటే బ్రహ్మయ్యను అడ్డగించాడు పోలీసు పటేల్. “నీ గొడ్లను నా కంచెలో మేపుతావురా? నా ముందే నువు కుచ్చు చెప్పులు తొడుగుతావురా?” అని విపరీతంగా తిడుతూ కాళ్ళు వాసిపోయేలా కొట్టిండు. ఈ సంఘటన బ్రహ్మయ్యను సాయుధ పోరాటం వైపు నడిచేలా చేసింది.

చక్కిలం యాదగిరిరావు కమ్యూనిస్టుల గురించి బ్రహ్మయ్యకు చెప్పారు. ఈ దేశం కోసం మాతో కలిసి పని చేయాలని కోరారు. అందరం కలిసి స్వతంత్రరాజ్యం తెచ్చుకుందామన్నారు. ఈ విధంగా ఉద్యమంలో భాగం అయినారు బ్రహ్మయ్య.

ఉద్యమంలో చేరేనాటికే బ్రహ్మయ్యకు పాలకుర్తి దగ్గరి వాల్మిడి గ్రామానికి చెందిన లక్ష్మీతో వివాహం అయింది. సాయుధ శిక్షణలో తుపాకీ కాల్చడం నేర్చిన తరువాత కడవెండి, దేవరుప్పల అడవిలో 12 మంది దళ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి పోలీస్ పటేల్, మాలీ పటేల్ ఇళ్ళలో నుండి తుపాకులు ఎత్తుకొచ్చే కార్యక్రమం చేపట్టాడు. దడిదేపల్లి, రేగుల, అవుశాపురం, ఏరియాకు దళ కమాండరుగా బ్రహ్మయ్య నిలిచారు. ఆ రోజుల్లో మహిళలు ప్రత్యక్షంగా దళాల్లో పాల్గొనకున్నా గెరిల్లాలకు మాత్రం పరోక్షంగా సహాయం చేసేవారు. ఇంటింటికి తిరిగి అన్నం అడుక్కు తెచ్చి దళానికి పెట్టేవారు. ఒక్క విస్నూరు తప్ప, దడిదేపల్లి మల్లంపల్లి, వావిలాల, అవుశాపురం, మత్తారు, వల్మిడి, లక్ష్మాపురం, చీరారం, తొర్రూరు, వీరెంటి, జొమ్మెర, గూడూరు, ఇప్పగూడెం, గ్రామాలన్నింటిని ఆరుట్ల. రాంచంద్రారెడ్డి, యాదగిరిరావులతో కలసి బ్రహ్మయ్య తరతమ బేధాలు లేకుండా ఊళ్ళన్నీ తిరిగేవారు.

బ్రహ్మయ్య దళాల్లో తిరుగుతున్నారని రజాకార్లు ఆయన ఇంటికి నిప్పు పెట్టారు. భార్యను ఎత్తుకుపోవాలని చూశారు. కాని ఊరి ప్రజలు ఆమెను గొళ్ళవారి ఇంట్లో దాచిపెట్టారు. బ్రహ్మయ్య తన దళ సభ్యులు యాదగిరిరావు, నల్లనర్శింలు, చాకలి లచ్చమ్మ, మంగలి నర్శింలుతో కలిసి కోలుకొండ ఊరిలోకి వెళ్ళిండు. దొర అనుచరులైన అబ్దుల్, రంగడు, చాకలి సోమన్నలను పట్టుకొని కొడితే వాళ్ళు చేసిన సంఘ వ్యతిరేక చర్య బయటపడింది. వాళ్ళ దగ్గర పోలీసు బలగాలను పంపమని కోరుతూ దొర నైజాంకు రాసిన ఉత్తరం దొరికింది. దానితో కోపోద్రుక్తులైన బ్రహ్మయ్యదళం దొర అనుచరులను అక్కడికక్కడే కాల్చి చంపింది. అందులో నుండి చాకలి సోమన్న మాత్రం తప్పించుకొని పారిపోయాడు. దొర రజాకార్లను కోలుకొండ గ్రామానికి పంపి ఆ ఊరును మొత్తం తగులపెట్టించాడు.

దళం అంతా నల్ల నర్శింలు నాయకత్వాన బయలు దేరింది. గ్రామ గ్రామాన ప్రవేశించింది. పటేల్ పట్వారీల ఇండ్లలోకి సొచ్చుకుపోయింది. దొరికింది దొరికినట్లు తీసుకుంది. వారి దగ్గర ఉన్న దస్త్రాలను రాఘవాపురం దగ్గర తగులబెట్టిండ్రు. ముఖ్యంగా అప్పు పత్రాలను కూడా ఒక్కటి మిగలకుండా కాల్చి బూడిద చేశారు. ఆ సమయంలో ప్రజల ముఖాలలో సూర్యుడు ఉదయించాడు. వాళ్ళ ఆనందానికి హద్దులేలేవు. దళం అంతటితో ఆగకుండా మల్లపల్లి దొర బంగ్లాను కూల గొట్టిండ్రు. భూస్వాముల దగ్గరవున్న ఎకరాలకొద్ది భూములను పేదలకు పంచి పెట్టిండ్రు.

ఆ రోజుల్లో కమ్యూనిస్టులు ఎవరైనా దొరికినారంటే పటేల్, పట్వారీలు, దొరలు, భూస్వాములు వారిని రకరకాలుగా చిత్రహింసలు పెట్టేవారు. రౌడీలతో కొట్టించేవారు. పెద్ద పెద్ద బండరాళ్ళను వీపున మోపి ఎండలో వంగబెట్టేవారు. కొరడాలతో కొట్టేవారు. ఈ విధంగా కష్టాలకు గురి చేసేవారు. బ్రహ్మయ్య రజాకార్ల నుండి ఎన్నోసార్లు తప్పించుకున్నాడు. ఒకసారి చెఱువు దగ్గర ఉన్నపుడు అటునుండి వస్తున్న రజాకార్లను చూసి తన తుపాకీని నీళ్ళలో వేసి ఒక చాకలి బట్టలు ఉతుకుతున్నట్లు అక్కడి చాకలివారితో కలిసి బట్టలు ఉతికాడు. చాకలివాడిలా నటించి తప్పించుకున్నాడు. దళంలో సభ్యులందరూ క్రమశిక్షణ పాటించేవారు. ఎవరైనా దళానికి సంబంధించిన

సమాచారాన్ని రజాకార్లకు చేరవేస్తే వారిని గుర్తించి తగిన శిక్ష వేసేవారు.

విసునూరి దొర రాంచంద్రారెడ్డి పెద్ద భూస్వామి. తాను ఎక్కడకు వెళ్ళాలన్నా భుజాన తుపాకీ వేసుకొని, గుర్రం మీద ఎక్కి తిరిగేవాడు. ఆయనవెంట ఒక 200 మంది వరకు ఉండేవారు. ఒకసారి దొర రాంచంద్రారెడ్డి తన అనుచరులు 200 మందితో వెళ్ళే సమయంలో దేవరుప్పుల వద్ద అడవిలో బ్రహ్మయ్య దళానికి ఎదురుపడి వారికి వీరికి మధ్య హోరాహోరి పోరు జరిగింది. బ్రహ్మయ్య దళం పెనుప్రమాదం నుండి తృటిలో తప్పించుకుంది. బ్రహ్మయ్య దళం గ్రామాలలోకి వచ్చిందంటే పండుగ చేసుకున్నంత ఆనందించేవారు.

పేదలు తమ కష్టసుఖాలను వారితో పంచుకునేవారు. ప్రజల సమస్యలను ఓపికగా విన్న దళం సభ్యులు అక్కడికక్కడే కొన్ని పరిష్కార మార్గాలను చూపేవారు.

ఈ విధంగా భూస్వాములను, దొరలను ఎదిరిస్తూ ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ అత్యధిక సమయాన్ని మాత్రం అడవిలోనే గడిపేవారు. ఎప్పుడైతే నిజాంరాజు లొంగిపోయి తన రాజ్యాన్ని భారత యూనియన్‌లో కలిపాడో బ్రహ్మయ్య దళం ప్రజాక్షేత్రంలోకి వచ్చింది. తుపాకులను వదిలేసింది. మంచితనంతో ప్రజలతో కలిసిపోయింది. అలా బ్రహ్మయ్య తన స్వగ్రామంలో ఒక పూరిగుడిసె వేసుకొని ఆ గుడిసెలోనే తన జీవిత చరమాంకాన్ని పూర్తి చేశాడు.

# 9 అనుముల కృష్ణమూర్తి

– వి.ఆర్. విద్యార్థి

ఎవని మనసు శిశు స్వచ్ఛమెవని బుద్ధి
జాతి చైతన్య సంపన్నమెవని యాత్మ
సర్వతో ముఖ కల్యాణ సవనకుండ
మట్టివాని గుండెల నుండి బుట్టు కవిత"

అని కవికి కవితోత్రికి భాష్యం చెప్పిన అనుముల కృష్ణమూర్తి గారు కొద్దికృతులు మాత్రమే వెలువరించినా కవులలో మహాకవి. పండితులలో మహా పండితులు.

ఆంధ్రనగరికి (ఓరుగల్లుకు) అనుబంధంగా మణిగిరి (మడికొండ) అనే గ్రామమున్నది. అది తెలుగుదేశంలోనే ప్రఖ్యాతిగాంచిన గ్రామం. ఎందుకంటే ఆ గ్రామం నిండా పండితులు, కవులే. కాళోజీ సోదరులు, వానమామలై సోదరులు, పల్లా దుర్గయ్య గారు, బిరుదురాజు రామరాజు, అనుముల వంశం, మోత్కూరి వంశం ఇలా.. ఎన్ని కవి పండిత కుటుంబాలో. అలాంటి గ్రామంలో మే 16, 1923న ఒక అనుముల వంశంలో శ్యామలాదేవి, పండరినాథ శాస్త్రి దంపతులకు అనుముల కృష్ణమూర్తి గారు జన్మించారు.

వీరి వంశంలో పూర్వీకులు కృష్ణయ్య గారు ఎక్కడి నుండో వచ్చి వరంగల్‌కు కొంతదూరంలో ఉన్న 'ఉప్పుల' గ్రామంలో స్థిరపడ్డారు. వీరి పెద్దకుమారులు రామకృష్ణయ్య గారు. అనుముల కృష్ణమూర్తి తాతగారు (పితామహులు) భాగవత పారాయణం చేస్తుండేవారు. వేద పండితులు, మంత్రశాస్త్రాన్ని అధ్యయనం చేసినవారు.

సాహిత్యంపై అపార గౌరవమున్న మడికొండ దొర తౌటంరెడ్డి గోపాలరెడ్డి గారు రామకృష్ణయ్య గారిని మడికొండకు ఆహ్వానించి వారి జీవిక కోసం కొంత భూమినిచ్చారు. అట్లా రామకృష్ణయ్య గారు మడికొండలో స్థిరపడ్డారు. అనేక ధార్మికపరమైన కార్యక్రమాలు నిర్వహిస్తూ గ్రామవాసుల గౌరవాభిమానాలను పొందారు.

గ్రామానికి తూర్పున ఉన్న పొడవాటి మెట్టుగుట్టపై రామలింగేశ్వరాలయం వారికి భక్తిదాయకమైనవది. అనుముల కృష్ణమూర్తి గారు మెట్టు రామలింగేశ్వర శతకం రాశారందుకే. క్రమం తప్పకుండా మడికొండలో భాగవత సప్తాహాలు జరిపి అన్నదాన కార్యక్రమాలు జరుపుతుండే వారు.

రామకృష్ణయ్య గారికి ఐదుగురు కుమారులు. పెద్దకొడుకు సీతారామయ్య వేదాధ్యయన పరులు. రెండోకొడుకు జగన్నాథం, మూడో కుమారుడు లక్ష్మణశాస్త్రి. సంస్కృతాంధ్ర భాషల్లో పండితులు. వేదం నేర్చుకున్నారు. నాలుగో కొడుకు విశ్వనాథశాస్త్రి (అనుముల కృష్ణమూర్తి గారిని దత్తత తీసుకున్నవారు). ఐదో కొడుకు పండరినాథ శాస్త్రి (కృష్ణమూర్తి గారి కన్నతండ్రి) ఉభయ వేదాంతా చార్యులు. వీరు హిందీ, సంస్కృతం, కన్నడ భాషల్లో పండితులు. చిత్రమేమిటంటే పండరినాథ శాస్త్రి గారికి పంతొమ్మిదేళ్ల వయస్సొచ్చేవరకు కూడా చదువు సంధ్యలు

లేవు. బలాదూరుగా తిరిగేవారు. కానీ ఇరుగుపొరుగు, బంధువులు, కుటుంబ సభ్యులు వీరిని చదువురాని వాడవని ఎగతాళి చేస్తుంటే తట్టుకోలేక తల్లి నగలు దొంగిలించి కాశీకి పారిపోయారు. అక్కడ సద్గురువుల ఆశీస్సులు పొంది సంస్కృతం నేర్చుకున్నారు. బహుశాస్త్ర కోవిదులయ్యారు.

ఇది తెలిసి పండరినాథ శాస్త్రి గారి అన్నలు కాశీకి వెళ్లి తమ్ముడిని కలుసుకొని నచ్చజెప్పి మడికొండకు తీసుకువచ్చారు. పెళ్ళి చేసి వారికి స్థిరనివాసం ఏర్పాటు చేశారు. పండరినాథ శాస్త్రి గారికి ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు. వీరిలో రెండవ కుమారులే అనుముల కృష్ణమూర్తి గారు.

కృష్ణమూర్తి గారు చదువులో చాలా చురుకు. అందుకే సంస్కృతం, ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ భాషల్లో పండితులు. ఫార్సీ, అరబీలలో మంచి ప్రవేశం ఉంది. సంస్కృతం వానమామలై వరదాచార్ల తండ్రి బక్కయ్య శాస్త్రి గారి వద్ద నేర్చుకున్నారు. ఫార్సీ, అరబీ మౌల్వీ సమయుజ్జీమా వద్ద నేర్చుకున్నారు. ఉర్దూ భాష పరిసరాల ప్రభావంతో సహజంగా అబ్బిందే. మెట్రిక్యులేషన్ (సంస్కృతం)లో హైదరాబాద్ స్టేట్‌కు డొమినియన్ ఫస్ట్ వచ్చారు.

మడికొండకు చెందిన ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆచార్యులు పల్లా దుర్గయ్య గారి ఇంట్లో ఉంటూ బీఏ, బీకాం, బీఈడీ చేశారు. ఆదిలాబాద్ జిల్లా చేన్నూరులో ప్రప్రథమంగా ఉపాధ్యాయులుగా ఉద్యోగంలో చేరి మధిర, ఖిలా వరంగల్, కోస్గి, మానుకోట, నిర్మల్, భువనగిరిలోనూ తిరిగి హన్మకొండ, వరంగల్‌లలో పనిచేసి ప్రమోషన్‌పై పెద్దపల్లి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా వెళ్లారు. ఆ తర్వాత పర్కాలా, సుల్తానాబాద్‌లలో పనిచేసి సుల్తానాబాద్ నుండే 1978లో రిటైర్ అయ్యారు.

కృష్ణమూర్తి గారి వివాహం 1942లో మేనమామ కూతురు నర్సమాంబ గారితో అయ్యింది. వీరికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. పెద్దకుమార్తె డాక్టర్ సరస్వతి, ప్రభుత్వ డాక్టర్‌గా పనిచేసి రిటైరయ్యారు. రెండోకూతురు ఉమ చదువుకున్నా ఉద్యోగంలో చేరలేదు. మూడో కూతురు రమ మదనపల్లిలోని రిషీ వ్యాలీ స్కూలులో (జిడ్డు కృష్ణమూర్తి స్థాపించిన) అధ్యాపకురాలిగా ఉద్యోగం చేస్తూ గ్లోబల్ లెవల్ కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. కుమారుడు వెంకట రమణ అధ్యాపక వృత్తిలో స్థిరపడ్డారు. 'మోష'ను వివాహమాడినారు. మోష వరంగల్ సంగీత కళాశాలలో ఉపన్యాసకురాలు. ఈమెది చాలా అరుదైన గళం. హిందుస్థానీలో గానం చేస్తుంటే శ్రోతలంతా తన్మయ లోకంలోకి వెళ్లిపోతారు. మోష అనుముల కృష్ణమూర్తి గారి సరస్వతీ సాక్షాత్కారం హిందుస్థానీలో పాడుతున్నప్పుడు విని తీరవలసిందే.

అనుముల కృష్ణమూర్తి గారికి కాళోజీ సోదరులంటే భక్తి. వారు కూడా కృష్ణమూర్తి గారిని స్వంత తమ్ముడిగా భావించేవారు. కాళోజీ సోదరులతో పాటు.. దాశరథి, బిరుదురాజు రామరాజు, వానమామలై వరదాచార్యులు మొదటినుండి సన్నిహితులు. గుంటూరు శేషేంద్రశర్మ గారు వీరిని ఎంతో అభిమానించేవారు. విశ్వనాథ సత్యనారాయణ గారు కృష్ణమూర్తి గారికి గౌరవనీయులు. కవిత్వ శక్తిలో విశ్వనాథ వారిని ఒప్పుకునేవారు. జువ్వాది కాంతమరావు గారు మంచి మిత్రులు. కృష్ణమూర్తి గారి సతీమణి నర్సమాంబ 1983లో జబ్బు చేసి మరణించడంతో ఆయన జీవితమంతా ఆగమైపోయింది. సాహిత్యం తప్ప ఏమీ ఎరుగని, దేన్నీ పట్టించుకోని వ్యక్తి ఆయన. ఇల్లును నడపడం ఆమె పని. అంతేకాదు కృష్ణమూర్తి గారు తాము రచించిన పద్యాలకు మొదట శ్రోత ఆమె. కాళోజీ రామేశ్వరరావు గారు, నర్సమాంబ గారు ఇద్దరూ రసచక్షువులాయనకు.

తర్వాత కాలమంతా నిరాసక్తంగా, నైరాశ్యంగా బతికారు. బహుశా నర్సమాంబ గారు పోయిఉండకపోతే కృష్ణమూర్తి జీవితం వేరేగా ఉండేదేమో! అనేక కావ్యాలు రాస్తూ జీవితంపై మక్కువతో బతికేవారు. వారి సతీమణి నర్సమాంబ గారు మరణించిన పదమూడు సంవత్సరాలకు 1996 మార్చి 31న అనుముల కృష్ణమూర్తి తీవ్ర అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు.

అనుముల కృష్ణమూర్తి గారు కుదురులేని మనిషి. ఎంతో గొప్ప కవితాధార ఉండి, పాండిత్యముండి విస్తృతమైన అధ్యయనం చేసినవారై ఉండి రచనలు చేసింది తక్కువే. చిత్తు కాగితాలపై ఎక్కడపడితే అక్కడ రాసి పారవేసుకునే వారు. అసువుగా చెప్పేవారు. పోగా మిగిలిన కవితలు (పద్యాలు) ఇవాళ మనం చదువుకుంటున్న 'సరస్వతీ సాక్షాత్కారము శబరి, ఇతర ఖండికలు' అనే గ్రంథం. ఈ

కావ్యాన్ని కాళోజీ ప్రమేయంతో 1967లో యువభారతి వారు తమ మొదటి ప్రచురణగా ప్రచురించారు. మళ్లీ రెండవ ముద్రణ కూడా వచ్చింది.

1967లో ప్రచురించబడిన 'సరస్వతీ సాక్షాత్కారము' కావ్యం శబరి ఇతర ఖండికలతో కలిసి 2007 వారి పిల్లల చొరవ, శ్రమతో మళ్లీ ప్రచురణకు నోచుకున్నది. ఈ ప్రచురణకు వారికి సహకరించిన వారు నాగిళ్ళ రామశాస్త్రి, ఆచార్య ఎస్.లక్ష్మణమూర్తి గారు. సరస్వతీ సాక్షాత్కారము ఒక గొప్ప రసకావ్యం. ఈ రచనతో అనుముల కృష్ణమూర్తి గారిలో మహాకవి లక్షణాలు ఉన్నట్లు విద్వత్ ప్రతిభ ఉన్నవారందరూ అభిప్రాయపడ్డారు.

అనుముల కృష్ణమూర్తి గారి రూపమే కాదు.. గాత్రం కూడా గొప్పగా ఉండేది. ఆయన ఏ పద్యం చదివినా శ్రోతలు తన్మయంలో ఊగిపోయేవారు. 'నాయహంకార మర్మం' శీర్షికన రచించిన పద్యాల్లో ఒకటి –

**"ఈ యావేశము నాది ఈ పృథ్వీ నాదే. సర్వమున్**
**నాది న**
**న్నేయావేశము బూనెనేని లయమొదింతున్ పునసృష్టికై**
**సాయంప్రాతరుపాసనా సయమ నిష్టా క్రూరుదే**
**కృష్ణమూ**
**ర్తేయల్పిష్మల గోష్ఠిలో బడ**
**మహోర్తింబొందుముల్లోకముల్"**

అంటారు. మామూలుగానైతే అనుముల కృష్ణమూర్తి గారు అంతర్ముఖులు. ప్రచారానికి దూరంగా ఉండేవారు. రచించిన పద్యాల విషయంలో ఏ మాత్రమూ శ్రద్ధ లేక వారి కవిత్వంలో చాలా భాగం వెలుగులోకి రాలేదు. కానీ వీరికి సరస్వతీ సాక్షాత్కారము జరిగినది. అట్లా జరిగినట్లు వారే 'స్వయం సమీక్ష'లో ఇలా చెప్పుకున్నారు.

"ఒక అర్ధరాత్రి అకస్మాత్తుగా మనశ్చక్షువునకు గోచరించిన చీరంచు, స్త్రీ యాకృతి రూపొంది కన్నుల నుండి కాళ్ల వరకు కరుణామయమైమ వాగ్దేవతా కృతిగా భాసించినది. అది సర్వ రసాత్మకమై మహేంద్ర జననిమైనది"

"భావ పరిధిలు, ఆలోచనా పరిధులు, కల్పనా పరిధులూ విశాలమైనట్లే మన తరంలో రసప్రపంచ పరిదులు విశాలమైనవి'' అని అంటారు కృష్ణమూర్తి గారు. రసలోకమును కనుగొన్న కృష్ణమూర్తి గారు రసబ్రహ్మ అయినారు.

'సరస్వతీ సాక్షాత్కారము' శ్రీశ్రీ **'కవితా ఓ కవితా'** లాంటిది. అనుముల కృష్ణమూర్తి గారు ఆ పద్యాల్ని ఓ మహేంద్ర సరస్వతీ అంటూ ప్రారంభించి గానం చేస్తుంటే పుట్టపర్తి నారాయణా చార్యులు 'శివతాండవం' గానం చేసినట్టుండేదని మిత్రులన్నారు.

ఇక **'శబరి'** కావ్యం విషయానికొస్తే కృష్ణమూర్తి గారు ఒక కొత్త కాన్సెప్ట్‌తో ఆరంభించారు. ఆ కావ్యాన్ని 'ప్రజాస్వామి శబరి' అన్నారు. ఇందులో వారే అన్నట్లు 'రాముడు'ను ప్రజాస్వామ్య గత సర్వ సమాన సర్వజన సౌఖ్య భావన ప్రతీక'గా, **'శబరి'** ని పరంపరా పీడిత సామాన్య మానవతకు ప్రతీకగా తీసుకున్నారు.

కోవెల సంపత్ కుమార్ గారు అనుముల కృష్ణమూర్తి ఒక అందమైన పద్యం అన్నారు. కాళోజీ అనుముల వారి గురించి 'వాడు తింగడి మనిషేగాని అంగడి మనిషి కాలేదు' అన్నారు. కావ్యగానంలో ఆయన తనువెల్లా కవితా రసావేశంతో నిండి ఉండేది. అందుకే మేమంతా వారిని **'రసబ్రహ్మ'**గా పిలిచేవాళ్లమని పేర్వారం జగన్నాథం గారన్నారు.

గుంటూరు శేషేంద్రశర్మ గారు **'అన్నా నీ నాలుకపై ఎన్నో వేదంబులున్న వెన్నో కావ్యాంబులున్నవి నన్నల్పజ్ఞుని అన్నామని పిలువెట్టి అంభోనిదివో'** అని వినమ్రంగా అనుముల కృష్ణమూర్తి గారికి నమస్కరించారు.

మిత్రమండలి మిత్రుల చేతనావర్తం కవుల్లో ఒకరు వేణుముద్దల నర్సింహారెడ్డి. 'ఓయన సరస్వతియు ఓహోమని మారాడు నెవనికో వానికి నీకీ అక్షర సన్మానంబు' అని కీర్తించారు. రామేశ్వరరావు షాద్ గారు అనుముల కృష్ణమూర్తిని 'కవిత్వ దేవత' ఆవహించిందన్నారు.

# 10

# ఆరుట్ల కమలాదేవి

**– డా॥ తిరునగరి దేవకీదేవి**

జనసంద్రంలో విరిసిన అరుణారుణ కమలం, నల్లగొండ నుండి వీరవిహారం చేసిన ఓరుగల్లు రుద్రమకు ప్రతిరూపం. విప్లవాల ముగ్గుపరిచిన నవనవోన్మేష క్రాంతి. మానవత్వానికి నిలువెత్తు తార్కాణం. నిర్మల స్వభావం, అన్యాయాన్నెదిరించే అగ్నిశిఖ. వీరోచిత సాహసాలకు ఎక్కుపెట్టిన ఆయుధం. పోరాట కాన్వాస్‌పై చెరగని చిత్రం. హక్కులకై కదం తొక్కిన ధీశాలి. సాయుధ పోరాటంలో వికసించిన అగ్నిపుష్పం. ఆమెనే ఆరుట్ల కమలాదేవి.

ఆరుట్ల రామచంద్రారెడ్డికి జీవిత సహచరి అయిన కమలాదేవి రాజకీయప్రస్థానంలోనూ అతని సాహచర్యాన్ని వదలలేదు. తల్లిదండ్రులు లక్ష్మీనర్సమ్మ వేంకటేశ్వర రెడ్డిలు. వారి గ్రామం మంతపురి, మండలం ఆలేరు. జిల్లా కొండంత చైతన్యం కల్గిన నల్గొండ. ఆమె అసలు పేరు రుక్మిణి. జననం 1920. పుట్టిన ఊరే పెద్దబాలశిక్ష వరకు చదువుకునే అవకాశం కల్పించింది. పెద్దబాలశిక్షంటే జీవితానికి ప్రాథమికంగా ఉపయోగపడే లెక్కలు భాషాపరిజ్ఞానం, నిత్యవ్యవహారంలో ఉన్న సామాజికాంశాలు. నిజాం పాలనలో భూస్వాములు పేద ప్రజల అవసరాలను అదునుగా భావించి వెట్టి చాకిరీతో పాటు అధికశాతం వడ్డీనో చక్రవడ్డీనో ఆధారంగా అప్పులు యిచ్చేవారు. లెక్కలన్నీ తప్పుల తడకలు. ఎంత డబ్బు చెల్లించినా చాకిరెంత చేసిన అప్పు అప్పుగానే ఉండేది. పైగా అవకాశం కల్పించుకొని ఆ సన్నకారు రైతులను భూమి నుండి బేదఖల్ చేసేవారు. భూమిలేని వారిని తరతరాలుగా వెట్టి చాకిరీకి ఉపయోగించుకునేవారు. ఈ దోపిడీకి అనుకూలంగా గ్రామాల్లో పాఠశాలలపై గ్రంథాలయాలపై నిషేధాన్ని కొనసాగిస్తూ వచ్చారు. పాఠశాలలు అందుబాటులో లేకపోవడం వల్ల రుక్మిణి చదువు పెద్దబాలశిక్షతో ఆగిపోయింది. ఆనాటి వాతావరణం స్త్రీ విద్యను ఏ మాత్రం ప్రోత్సహించలేదు కూడా.

తెల్లదొరతనం ఒళ్ళు విరుచుకున్న వేళనే నల్ల దొరతనం కుళ్ళు పెంచుకున్నది. అధికారం అహంకారం వల్ల పూనకం దాల్చింది. వాళ్ళకు అరాచకం ఆత్మగా మారింది. అహంకారాధికారాలు జోడెద్దుల జంటైనాయి. స్త్రీలపై అత్యాచారాల బాకులను గుచ్చినారు. ప్రజల అమాయకత్వం వారికి అలుసైంది. కరువు రక్కసి తాడిత పీడిత జనం కడుపులను కాల్చేసింది. దగాపడ్డ జీవితాలు బానిస విషవలయంలో చిక్కినవి. కుక్కిన పేనులా బతుకులను వెళ్ళబోసుకున్నవి. బూర్జువా పెత్తందారీ వ్యవస్థలో ఆ జీవితాల శ్వాస ఇంకిపోయింది. గుండె బరువెక్కింది. కన్నీటి బిందువులు కళ్ళలోనే ఆగిపోయినవి. ఆ పరిస్థితుల్లో ఆకాశం ఎర్రటి ఛాయలను పీల్చుకుంది. చీకట్లను తరుముకుంటూ క్రాంతి కిరణం వెలిగింది. ప్రజల కోసం దగాపడిన వాళ్ళకోసం ఆరుట్ల మట్టి పొత్తిళ్ళ నుంచి రామచంద్రారెడ్డి ఉదయించినాడు. విద్య వినయానికి దక్షతకూ

మానవతాదృక్పథాలకు పెన్నిధి. విద్యావంతుడైన రామచంద్రారెడ్డిని ఆంధ్రమహాసభ ఆకర్షించింది. చురుకైన నాయకుడిగా ఎదుగుదలనిచ్చింది. రామచంద్రారెడ్డి పెళ్ళే కూడదను కున్నాడు. అది సంఘకార్యకలాపాలకు అంతరాయమని భావించినాడు. అందువల్ల ఆ ఆలోచనలను అల్లంత దూరంగా ఉంచినాడు. కాని మేనమామ కూతురు రుక్మిణిని చేసుకోమని తల్లిదండ్రుల ఆదేశం. సందిగ్ధంలో పడ్డా షరతులతో పెళ్ళికి సన్నద్ధమయ్యాడు. కట్నప్రసక్తి లేకపోవడం, వివాహ సమయంలో ఖద్దరు వస్త్రధారణ, వివాహానంతరం సహచరి విద్యాభ్యాసం కొనసాగింపు. ఆ చదువు కొనసాగింపులో భాగంగా సహచరిని తన వెంట హైదరాబాదుకు పంపించడం. ఇవే ఆ షరతులు. ఇరుపక్షాలకు షరతులు సమ్మతమైనవి. పెళ్ళి జరిగిపోయింది.

రామచంద్రారెడ్డికి జాతీయోద్యమ నాయకురాలు కమలాదేవి చటోపాధ్యాయ అంటే ఎనలేని గౌరవం, అభిమానం. అందువల్ల పెళ్ళిపీటల మీదే రుక్మిణి పేరు కమలాదేవిగా రామచంద్రారెడ్డి మార్చినాడు. పెళ్ళవుతూనే మకాంను హైదరాబాదుకు మార్చినాడు.

కమలాబాయి ఛటోపాధ్యాయిలా తన సహచరిలోనూ చైతన్యస్రవంతిని ఆశించాడు. మాడపాటి హన్మంతరావు స్థాపించిన బాలికల ఉన్నత పాఠశాలలో కమలాబాయి ఉరఫ్ రుక్మిణిని చేర్పించినాడు. స్కూళ్ళే అంతంత మాత్రంగా ఉన్న ఆ రోజుల్లో వసతి గృహాల విషయం చెప్పాల్సిన పనిలేదు. అవి గగన కుసుమాలే. రామచంద్రారెడ్డి రాజ బహద్దూర్ వెంకటరామరెడ్డిని ఒప్పించి రెడ్డి వసతి గృహానికి అనుబంధంగా బాలికల వసతి గృహాన్ని ఏర్పాటు చేయించినాడు. అందువల్ల కమలాదేవి మెట్రిక్‌లేషన్ వరకు తన చదువును కొనసాగించింది.

చదువు పూర్తికాగానే కమలాదేవి కొలనుపాక చేరుకుంది. కమలాబాయి చదువుతో రామచంద్రారెడ్డికి సంతృప్తి కలుగలేదు. ఆమెద్వారా ఎందరినో విద్యావంతులను చేయాలని ఆరాటపడ్డాడు. కొలనుపాకలోనే వంటశాలగా ఉన్న ఓ గదిలో కన్యాపాఠశాలను ప్రారంభించినాడు. ఈ సమాచారం ఊరి జాగీర్దారుకు చేరుకుంది. అతని హుకుంతో పాఠశాల మూతపడింది. అన్నీ వెంట వెంటనే జరిగి పోయాయి. రామచంద్రారెడ్డి పాఠశాల నిర్వహణకై పరిపరివిధాల ఆలోచన చేస్తున్న సమయంలో జైనమందిర యాజమాన్యం ఉదారత్వంతో కొంత స్థలాన్ని పాఠశాలకై ఇచ్చింది. ఆ స్థలం రామచంద్రారెడ్డి కమలాదేవిల చొరవతో పాఠశాలగా పురుడు పోసుకుంది. కమలాదేవి సారథ్యంలో ఎంతోమందికి అక్షరజ్ఞానం లభించింది.

ఒకవైపు గ్రామప్రజలకు విద్యాబోధన చేస్తూనే సంఘకార్యకలాపాల వైపూ దృష్టి పెట్టింది కమలాదేవి. సంఘానికి సంబంధించిన విషయాలను ఆకళింపు చేసుకొంది. అందులోనూ క్రియాశీలకపాత్రను పోషించింది. 1943లో విజయవాడలో సంఘం ఆధ్వర్యంలో నిర్వహించ బడిన ఆత్మరక్షణా శిబిరంలో సైనిక శిక్షణను పొందింది. 1944లో కమలాదేవి ఒక కొడుకుకు జన్మనిచ్చింది. జీవిత సహచరులిద్దరూ విప్లవోద్యమం నిప్పుకణికలే. తమ భావాలకనుగుణంగా ఆ బాలునికి విప్లవరెడ్డి అని నామకరణం చేసుకున్నారు. అది నిజాం ప్రభుత్వం మార్షల్ లా విధించిన కాలం. కన్న మమకారాన్ని అధిగమిస్తూ పసిబిడ్డను ఇంటివద్దే వదిలి రామచంద్రారెడ్డితో పాటు అజ్ఞాతంలోకి వెళ్ళిపోయింది కమలాదేవి.

అజ్ఞాతంలో ఉన్న సమయంలోనే (1948) కమలాదేవి ఆరోగ్యం దెబ్బతిన్నది. వైద్యం తప్పనిసరైన పరిస్థితి. ఇద్దరూ మంత్రపురికి బయలు దేరినారు. ఆలేరు శివారులో కమ్మగూడెం వద్ద మాటు వేసిన పోలీసులు వారిద్దరినీ అరెస్టు చేసినారు. రామచంద్రారెడ్డిని ఖమ్మం జైలుకు, కమలాదేవిని ఔరంగాబాదు జైలుకు పంపించినారు. తర్వాతి కాలంలో ఆమెను హైదరాబాదు జైలుకు తరలించినారు. జైల్లోనూ కమలాదేవి స్త్రీల హక్కులకై పోరాడేది. 1951లో అంటే రెండున్నరేళ్ళ కారాగార శిక్ష అనంతరం ఆమె విడుదలైంది.

ఆమె సంఘకార్యకలాపాల్లో ఏనాడూ గుండె నిబ్బరాన్ని కోల్పోలేదు. పైగా అవసరమైనప్పుడు రామచంద్రారెడ్డికే ధైర్యాన్ని నూరిపోసిన ధీశాలి. చల్లూరు బేగంపేట గుట్టల్లో సైనికుల కళ్ళు గప్పి ఇబ్రహీంపురం చేరుకోవడం ఆమె పోరాట ఎత్తుగడకు ఓ మచ్చుతునక. 1946–48న అంటే సాయుధపోరాటం జరిగిన కాలంలో రజాకార్ల దుర్మార్గాలను దౌర్జన్యాన్ని ఎదిరించడానికి మహిళా గెరిల్లాదళాన్ని ఏర్పాటు చేసిన పోరాట యోధురాలు.

1952లో హైదరాబాదు నియోజక వర్గం నుండి, ఆ తర్వాత అంటే 1957, 1962లలో భువనగిరి నియోజకవర్గం నుండి యం.యల్.ఎ. గా పోటీచేసి విజయదుందుభిని మ్రోగించింది. శాసనసభలో ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న పుచ్చలపల్లి సుందరయ్య విదేశాలకు వెళ్ళిన సందర్భంగా (వైద్య చికిత్స నిమిత్తం) కమలాదేవి ప్రతిపక్ష ఉపనాయకురాలుగా బాధ్యతలు చేపట్టింది. పదిహేను సంవత్సరాలు యం.యల్.ఏగా రాజకీయ జీవితాన్ని గడిపిన ఈమె పలు సందర్భాలలో అవకాశం కలిసి రాగా బల్గేరియా, జెకోస్లవేకియా, రష్యా వంటి దేశాలలో పర్యటించింది. ఆ తర్వాత కాలంలో స్వచ్ఛందంగా రాజకీయాల నుండి తప్పుకుంది.

1998లో కాకతీయ విశ్వవిద్యాలయం ఆమెకు గౌరవ డాక్టరేటు బిరుదుతో సత్కరించింది. మొత్తంగా కమలాదేవి చరిత్రను పరికించినపుడు ఎన్నెన్నో ఆలోచనలు, మరెన్నెన్నో భావాలు.

ఆమె జీవితం ఎత్తిన పిడికిలే కాదు తోటి స్త్రీలలో పౌరుష పాటవాలను నాటి పిడికిలెత్తించి పల్లెపల్లెకు పరుగులెత్తించిన పటుశాలి. ఆమె చరితే ఓ ఎర్రజెండా. భూమికోసం, భుక్తికోసం వెట్టిచాకిరి. విముక్తికోసం అగ్నిపూలై వికసించిన ఎర్ర మందారం. రైతుకూలీ పోరాటంలో రాటుతేలిన స్త్రీ వజ్రం. బడుగు జీవుల బతుకు బాటకై భూస్వాముల గుండెల్లో నిదురించి గడగడలాడించిన అపరకాళిక. ప్రతిక్షణం ప్రజల క్షేమంకై పరితపించిన ప్రజాబంధు. బ్రతుకుప్పెన పెనుతుఫానుగ పరిఢవిల్లగ పోరాటమే ఊపిరిగా పదం పాడుతూ కదం తొక్కిన వీరవనిత.

ఆశయాల నావను విప్లవాగ్నుల కొలనులో నడిపిస్తూ ఉద్యమాంబలి తాగిన వీరవనిత. పోరు వనిత. కాశీం రజ్వీ దురాగతాలను తుదముట్టింప కానె బిగించిన ఖలేజా. కాశిం రజ్వీ తొత్తులతో రణం సల్పి గ్రామ ప్రజల నిశాచరియై పోరుసల్పిన తెలుగు బిడ్డ. కులకంచెను పెరికివేసిన సామ్యవాది. చంద్రకాంతిలో విరిసిన ఎర్రెర్రని కలువ. ఆమె కార్యేషుదాసి కాదు. కరణేషు మంత్రి. సహచరుడికి వెన్నుదన్ను. ఈ కమలాచంద్రుల జీవితం ప్రపంచానికే ఆదర్శం. నిరాడంబర జీవితానికి నిలువెత్తు సాక్ష్యం. వారి జీవితమో కలినేత. విడివిడిగా చూడడం కష్టసాధ్యం. ప్రజలను జాగృతపరిచిన అరుణారుణ కేతనాలు. జనవరి ఒకటి 2001న ఆమె తుదిశ్వాస విడిచింది.

## 11

# ఆవుల పిచ్చయ్య

**- ఎ.ఎం. తాయారు**

ఆగమై తప్పిపోయిన కుటుంబ వ్యక్తి పత్తా దొరికితే ఎంత సంబురమవుతదో, విస్మృతికి గురైన ఆవుల పిచ్చయ్య గురించిన సమాచారం దొరికినంతనే తెలంగాణ సమాజం అంత ఆనందపడ్డది. తెలంగాణా అస్తిత్వపోయితో ఇలా ఎందరినో కనుగొన్నాం. వారి సేవలను రికార్డు చేసుకుంటున్నాం. అలాంటి వారిలో ఆవుల పిచ్చయ్యకు సముచిత స్థానం ఉంది.

ఆవుల పిచ్చయ్య తెలంగాణ పోరాట కథలను తెలంగాణ రీసెర్చ్ అండ్ రెఫరాల్ సెంటర్ 2010లో పదిరూపాయల అతి స్వల్ప ధరకు 32 పేజీలతో ఒక పుస్తకాన్ని తెచ్చింది. ఈ పుస్తకానికి సంగిశెట్టి శ్రీనివాస్ సంపాదకత్వం వహించాడు. ఆవుల పిచ్చయ్య ఏ విధంగా దొరికిండో, దేవులపల్లి కృష్ణమూర్తి అమూల్య జ్ఞాపకాలు రాసాడు. ముదిగంటి సుజాతారెడ్డి కథానాల నేపథ్య సందర్భాలను, కథలను విశ్లేషించి చూపారు. కాసుల ప్రతాపరెడ్డి కథల సమయ, సందర్భ, సమకాలీనతలను పరిశీలించాడు.

ఆవుల పిచ్చయ్య గురించి తెలిసిన విషయాలు చాలా తక్కువ. ఆయన ఇరవయో శతాబ్ది తొలినాళ్లలో 1919 సంవత్సరంలో సూర్యాపేటలో జన్మించాడు. వారిది బీదరిక కుటుంబం. తాను యువకుడుగా ఉన్న దశనుండే భూపోరాటంలో పాల్గొన్నాడు. ఆయన విద్యావకాశాలు లేని ఆ రోజులలో పెద్దగా చదువుకున్నవాడు కూడా కాదు. ఉర్దూ ఎక్కువగా చెలామణిలో ఉండడం వల్ల, బతుకు దెరువే ఒక భారమైనందున, మాతృభాషలో పాఠశాలలు లేనందున ఎందరో చదువుకు దూరమైనారు. ఆవుల పిచ్చయ్య అలాంటి వాతావరణంలో సమాజాన్ని, స్థానీయతను అధ్యయనం చేసిన జ్ఞాని. ఆయన నిజాంను వ్యతిరేకిస్తూ జరిగిన ఆంధ్రమహాసభ లలో పాల్గొన్నాడు. నిరంకుశమైన పాలననూ, భూస్వామ్య వ్యవస్థను వ్యతిరేకించి భూపోరాటంలో పాల్గొన్నాడు. నిర్భందానికి గురయ్యాడు. ఆయన పోలీసులకు పట్టుబడి 23-మే-1947 నుండి 30-జూన్-1949 వరకు హైదరాబాద్, నల్లగొండ, జైళ్ళలో రెండు సంవత్సరాలు కఠిన కారాగార శిక్షను అనుభవించాడు. ఆయన లోకజ్ఞానాన్ని, సమాజాన్ని అధ్యయనం చేస్తూ ఆంధ్రమహాసభల చైతన్యాన్ని, గ్రంథాలయోద్యమం, గ్రంథమాల స్ఫూర్తిని అందుకొని రాయడం, చదవడం నేర్చుకున్న అనివార్య పరిస్థితిని ముందుమాటలో తెల్పారు.

ఆనాటి సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు దుర్భరమైనవి. ప్రజలకు స్వేచ్ఛ లేదు. విద్య అభ్యసించే సౌలభ్యాలు, హక్కులు లేవు. భూస్వామ్య విధానం, వెట్టి, భయంకరంగా అమలయినాయి. వీటిని కాపాడుతూ పాలనాపరమైన నిర్భందాలు మనిషి జీవితాన్ని అతలా కుతలం చేశాయి. ఆ సందర్భంలో ధిక్కార స్వరాన్ని వినిపించిన పిచ్చయ్య చివరకు ప్రాణత్యాగాలను కూడా

లెక్కచేయలేదు. ఆలోచన, ఆవేశం జతకలిసి ఎందరో ఉద్యమం, సాహిత్యాన్ని రెండూ రెండు ఆయుధాలుగా మలచుకున్నారు. అలాంటి తొలితరం కథాసాహిత్యంలో ఆవుల పిచ్చయ్య కథలు విశిష్టమైనవి. ఆయన కథలు 'మీజాన్ పత్రిక(1946-47)' లో అచ్చయినాయి. ఆవుల పిచ్చయ్య 1944 నుండి అతివాద పక్షంలో చేరాడు. కమ్యూనిజాన్ని ఒంట బట్టించుకున్నాడు. దేశంలో పేదరికం రూపుమాప బడాలన్నా, సమసమాజం ఏర్పడాలన్నా, అన్యాయాలు, దోపిడీలు, మనిషిని మనిషి హింసించే-వ్యవస్థ పోవాలన్నా ఆ ఆలోచనా విధానమే మార్గమని నమ్మాడు. ఆయన ఆనాటి గ్రామీణ జీవన చిత్రణలో భాగంగా కథలను కళ్లకు కట్టినట్టు రాసిన అరుదైన కథారచయిత. కథల్లో సూటిదనానికి పదునెక్కిన భాష తోడ్పడింది. కథలో అనవసరం, డొంక తిరుగుడుతనం ఎక్కడా లేదు. అక్షరాక్షరాలలో నిబద్ధత ఉంది. తెలంగాణలో కథ ఇతర ప్రాంతాల కన్నా ఎలా భిన్నమైందో అధ్యయనం చేయడానికి ఆవుల పిచ్చయ్య కథలు బాగా ఉపకరిస్తాయి. అరుదుగా రాయబడ్డ వెట్టి కథలలో ఆవుల పిచ్చయ్య కథలు ముందువరసలో ఉంటాయని చెప్పడం అతిశయోక్తి కాదు. సంగిశెట్టి శ్రీనివాస్ తనకు లభించిన ఆవుల పిచ్చయ్య కథలను పుస్తకంగా వేయడంతో తెలంగాణ కథకు బలం చేకూరింది. ఇలా లభిస్తున్న ఐదు కథలలో వెట్టి చాకిరి, దిన చర్య, దౌరా, చపరాసి దినచర్య, ఊరేగింపులు పూర్తికథలు. "ఈతగింజ ఇచ్చి తాటిగింజ లాగిన జమీందారు" కథ అసంపూర్ణమైంది.

వెట్టి చాకిరి దినచర్య చిన్న కథనే అయినా ఆనాటి యెట్టి జీవితాన్ని కళ్లముందు నిల్పుతుంది. గిర్దావరు జనాబ్ గారు గ్రామంలోకి వస్తే ఎంత హడావుడి ఉంటుందో కథలో వర్ణితమైంది. మంచాలు తెమ్మంటే ఆలస్యమైందని జవాను చాకలిని కొడుతాడు. చాకలి భార్య చంటిపిల్ల తల్లి. రాత్రి పూటన్న మెతుకు తినకుంటే పిల్లకు పాలు ఎట్లాని దిగులుపడుతుంది. మధ్యాహ్నం పోయిన భర్త గిన్ని జొన్నగింజలన్న తెస్తాడని ఆశపడుతుంది. కాని, భర్తను జనాబ్ యెట్టి సేవలు చేయించుకుంటూ ఉండడం వలన ఆలస్యమవుతుంది. గడ్డం చేసే మంగలి వెంకడు కూడా యెట్టి పనులలో ఉంటాడు. అందువల్ల "చాకలి మంగలి పొత్తులు ఇంటికి రాని విత్తులు" అన్నట్టు రచయిత భార్యనోట సామెత పలికిస్తాడు. జనాబ్‌ను మంచంమీద కూర్చోబెట్టి 'గరంపాని'తో స్నానం చేయించడం వీపు రుద్దడం, తుడ్చుకోవడానికి చాకలి తన భుజం మీద కండువా సిద్ధంగా ఉంచుకోవడం ఆనాటి పరిస్థితులకు అద్దంపడుతుంది. భర్తను వెతుక్కుంటూ భార్య వస్తుంది. చివరకు వారికి ఏమీ మిగలదు. ఇద్దరు కలిసి తెచ్చిన మంచాన్ని ఇంటికి మోసుకపోతారు. వర్షం పడుతుంది. గుడిసెలోకి నీళ్లు చేరుతాయి. చంటిపిల్లను పడుకోబెడుదామన్నా మంచం తడిసి ఉంటుంది. బీద ప్రజలను పీల్చిపిప్పి చేసే వీరి ఖానును ఒకటి చేసే అన్యాయమొకటని తడిసిమోపెడయిన కష్టానికి భార్యాభర్తలు చింతిస్తారు. ఈ కథలో కర్మసిద్ధాంతాన్ని వ్యతిరేకించడం అభ్యుదయం. "దేవుడు మన కర్మను యింతే చేశాడా?" అని ప్రశ్నిస్తూనే 'మానవుడు చేసిన కర్మం గాని దేవుడు చేసిందికాదని' రచయిత స్పష్టం చేశాడు.

'దౌరా' కథలోనూ వెట్టి జీవితాల ప్రస్తావన ఉంది. ప్రభుత్వాధికార్ల నిర్లక్ష్యం, ప్రజల పట్ల బాధ్యతా రాహిత్యం, సామాన్యుని పాట్లు జమీందారు పరపతి, ఆయన లబ్దిపొందిన విధం చిత్రించబడ్డది. గ్రామంలోకి తహసిల్దారు దౌరాకు వస్తాడు. ఆయనకు సేవలు చేయడానికి గ్రామంలో ఉన్న త్రిమూర్తులు పోలీసు పటేలు, మాలిపటేలు, పట్వారి రహస్యంగా మాట్లాడుకొని కార్యక్రమాలు మొదలుపెడుతారు. హరిజనులను పిలిచి అధికారి తోవ తప్పకుండా 5 మైళ్ళ నుండి గ్రామందాక సున్నం వేసిన రాళ్ళ గుర్తులు పెట్టమని ఆజ్ఞాపిస్తారు. కొందర్ని పొయిల కట్టెలకు పంపుతారు. కొందర్ని చావిడికి మందడి కట్టాలని రైతుల వద్ద నుంచి చొప్ప తెమ్మని వెళ్ళగొడ్తారు. చావడిలో పర్దాలకు దుప్పట్లు తెమ్మని పంపుతారు. మంగలి వారిని పిలిచి కత్తులు సానపెట్టుకొని క్షౌరాలకు సిద్ధంగా ఉండుమని, కమ్మరి వారిని నీళ్ళ కుండలు తెమ్మని, మస్కూరిని గొర్రెపిల్ల, కోడిపిల్ల, పాలుపెరుగు ఇంతెజాం చేయిమని, కోమట్లను సామానుకోసం పురమాయిస్తారు.

దొంగలు పడ్డ ఆరు నెలలకు కుక్కలు మొరిగినట్లు పంట పండక పాడైన ఎంతో కాలానికి ఆ దౌరా కొనసాగు తుంది. కంచుగంటల జమీందారు గారి బండిలో తహసిల్దారు వస్తాడు. బండికి ఇరువైపుల జవాన్లు వెనకా ముందు వెట్టి బేగారీలు సకల సేవలతో వస్తూ ఉంటాడు. ఆయన మొకం

చూసి పీటలు వేస్తాడు కాని న్యాయసమ్మతంగా ప్రవర్తించడు. వచ్చిన రోజు విశ్రాంతితో సరిపోతుంది. రెండో రోజు జమీందారు ఇచ్చిన దావతు, మూడోరోజు ప్రయాణమై వెళ్ళిపోవడం, సామాన్యుని బాధలు విననిచ్చేవారు కూడా లేకపోవడం దురదృష్టకరం.

తహసిల్దారు వెళ్ళిపోతున్న దారిలో తనిఖీ నామ మాత్రంగా జరుగుతుంది. ఒక సామాన్య రైతు పొలం అంతా ఎండిపోయి మొదటిభాగంలో కాస్త పచ్చగా కనబడితే బాగుందని రిపోర్టు రాసుకుంటాడు. జమీందారు పొలం అంతా పచ్చగా ఉండి ఒక చిన్న భాగంలో ఎండుగడ్డి కనబడితే జమీందారు పంట పాడై పోయిందని రిపోర్టు రాస్తాడు.

సామాన్యుడు తన మొర చెప్పుకుందామని ప్రయత్నించినా వెంట ఉన్నావారు అంతా మేము చెపుతామని నివారిస్తారు. ఈ కథలో దారికి సున్నం వేసిన రాళ్ళగుర్తులు పెట్టడం, అధికారులకు పాలకులకు సామాన్యుని మాట చేరకపోవడం, నిర్లక్ష్యపు రిపోర్టులు, తప్పుడు రిపోర్టులు తర్వాతి కాలానికి కూడా ప్రాసంగికత కల్గిఉన్నాయి. ఆనాటి దుర్మార్గమైన వ్యవస్థను "దౌరా" ద్వారా చిత్రించడంలో ఆవుల పిచ్చయ్య కృతకృత్యుడైనాడు.

'చపరాసి దినచర్య' కథ విలక్షణమైంది. నిజాం ఫ్యూడల్ వ్యవస్థలో ఆఫీసుల్లో కిందిస్థాయి నుండి పై స్థాయి దాకా ఉన్న అవినీతిని కండ్లకు గట్టాడు. ఒక రైతు ఆఫీసులో ఉన్న అధికారికి దరఖాస్తు ఇవ్వడానికి వెళుతాడు. అక్కడ డ్యూటీలో ఉన్న చపరాసి మాకు తెల్వకుండా దరఖాస్తు ఇస్తే నీ పని నెరవేరదని అంటాడు. మామూలు చెల్లించుమని దాని అర్థం. మామూలు ఇచ్చిన తర్వాతనే ఆ దరఖాస్తు అధికారికి చేరుతుంది. అధికారి దర్శనార్థం ఎవరు వెళ్ళాలన్నా చపరాసికి మామూలు ఇవ్వవలసిందే. ఈ విషయం తెలిసి అధికారి చపరాసిని బర్తరఫ్ చేస్తాడు. ఉద్యోగులు ఇనాం, లంచం పేరిట ప్రజలను పీడించడాన్ని ఆవుల పిచ్చయ్య కండ్లముందుంచాడు.

ఆవుల పిచ్చయ్య కథలు వాస్తవ పరిస్థితులలోంచి ఉద్భవించినవే. "ఊరేగింపులు" కథ నిలువెత్తు నిజాలకు దర్పణం వంటిది. నలగొండ జిల్లా కడివెండిలో దొడ్డి కొమరయ్య విసునూరు దొర గూండాల కాల్పులలో నేలకొరిగాడు. వేలాది జనంతో అంతిమ యాత్ర మొదలయింది. ఆవుల పిచ్చయ్య ఈ కథకు "ఊరేగింపులు" అని పేరు పెట్టారు.

ఊరేగింపు కథలో రచయిత ఆనాటి వాస్తవాలను ఆవిష్కరించాడు. పొలాల దగ్గర పనిచేసే రైతులు, కూలీలు తమ పనులు వదిలి ఊరేగింపులో కలిసారు. కారుమబ్బులు కమ్ముకున్నా లెక్కచేయలేదు. స్త్రీ పురుషులు, చిన్న పెద్దలు అందరూ కదిలి వచ్చారు. ఉడికే జొన్నన్నం పొయి మీదనే మాడుతున్నది.

దంచేవారు లేక సజ్జలు రోట్లోనే మిగిలిపోయాయి. చివరికి గ్రామాధికారి కూడా ఆ ఊర్లో ఉంటే రిపోర్టు రాయవలసి వస్తుందని అక్కడి నుండి జారుకున్నాడు. అందరి చేతిలో ఎర్రజెండాలు రెపరెపలాడుతున్నాయి. కులమత బేధాలు లేకుండా ప్రజలు ఊరేగింపుకు తరలివచ్చారు. కొమురయ్యకు జై అని, కమ్యూనిస్టు పార్టీకి, స్వాతంత్ర భారత్ కీ జై అని ప్రజలు ఉప్పెనలా విరుచుకుపడి ఊరేగింపులో భాగస్వాములయినారు.

ఆనాటి దొరలకు ఆంధ్రమహాసభల ప్రేరణలతో ప్రజలు చైతన్యం కావడం నచ్చలేదు. వెట్టిమానడాన్ని, జీతగాళ్ళ సమ్మెను సంఘం కార్యకర్తలు ఎదిరించడం, దొరల గడీలలోని ధాన్యాన్ని సామాన్యులు జప్తు చేయడం ఏ మాత్రం నచ్చని విషయాలు. చైతన్యం పెరిగిపోతున్న దశలో దొరరౌడీలు ఊరేగింపును ఎదుర్కొన్నారు. సరిగ్గా దొరగడీ దగ్గర తుపాకులు పేలినాయి. ఈ చారిత్రాత్మక ఘటనను ఆవుల పిచ్చయ్య కథగా రూపొందించాడు.

"ఈతగింజలు యిచ్చి తాటిగింజలాగిన జమీందారు" కథకు ఈ పేరు పెట్టడం లోనే రచయిత ఔచిత్యం స్పష్టమవుతుంది. ఈ కథ గురించి మీజాన్ పత్రిక సంపాదకుడు అడవి బాపిరాజు రాసిన ఇంట్రో వాక్యాలు పేర్కొనదగినవి. ఆయన "గ్రామ జీవన నేపథ్యానికి బంగరు రంగులు సింగారించే సిద్ధహస్తులు శ్రీ పిచ్చయ్య గారు. భాషలో పాండిత్యపటిమ, భావాల్లో వైవిధ్యం రచనలో చతురత పరిమితమైనా వారిని సిద్ధహస్తులనక తప్పదు. హృదయంలో మెత్తని ప్రదేశాలను కలచివేసే ఆవేశమూ సుఖ స్వర్గ సీమలకు

రాజమార్గాలు తీర్చే ఆశయాలూ కాచినట్లల్లా కళలీనే భావాల ముడి బంగారు సానపెట్టినప్పుడల్లా తళతళ మెరిసే జాను తెనుగు రవ్వలూ వారి రచనలో నిండారినవి." అని రాశాడు.

అసంపూర్ణంగా లభించిన ఈ కథలో పేద రైతుల కష్టాలు, చిత్రించబడ్డాయి. ఈ కథలో జోగయ్య, గోపయ్య అన్నదమ్ములు. వారికి గల ఐదెకరాల భూమిని దున్నుకొని బతుకుతుంటారు. జోగయ్యకు జబ్బు చేయడం, గోపయ్య అప్పు కోసం షాహుకారు దగ్గరికి వెళ్ళి అర్థించడం, అంతకు ముందే యాభైరూపాయల అప్పు ఇచ్చాను ఇక ఇవ్వలేనని షావుకారు డబ్బులేదని జమీందారు దగ్గరికి తీసుకపోవడం ఈ కథలో ఉంది. జమీందారు మనుషులు నోరులేని వ్యవసాయ మూగ పశువులను రాత్రి పూట కొట్టంలోంచి తీసుకుపోయి కొట్టి పొడిచి పొడిచి రక్తాలు కారంగ దున్నించి ఎండిన డొక్కలతో ఆకలి జీవాలను తెచ్చి కట్టేయడం, బలమున్న వానిదే రాజ్యమన్న చందంగా వ్యవహరించడం ఈ కథలో చిత్రితమైంది. పశువులను వాడుకున్నంత దౌర్జన్యంగా మనుషులను వాడుకోవడం గురించి కథా రచయిత చెప్పదలచాడు.

ఆయన తెలంగాణ భాషలో కథ రాశాడు. ఆనాటి నిజ జీవన చిత్రణ చేశాడు. ఆయనది నాటకీయ సజీవ చిత్ర శిల్పం. దౌరా, దస్త్రం, చప్రాసి, చపరాసి, బిస్తరు, కజానా, గిర్దావరు, బేగారీ, జవాను వంటి అన్యదేశ పదాలతో తెలుగు భాషను సుసంపన్నం చేస్తూ కథ రాశాడు. చాకలి, మంగలి, కుమ్మరి వంటి సకల కుల వృత్తుల ప్రస్తావన గ్రామ పరిస్థితులు చిత్రంలో చూపాడు. ఇలా కుల వృత్తుల వారిని దేశబంధు పత్రిక నడిపిన వద్దేపల్లి సోదరులు కూడా తమ కథలలో పేర్కొన్నారు. దీన్ని బట్టి ఆనాటి కుల వ్యవస్థ తీరుతెన్నులు సంపన్నుల ఆధిపత్యం, అధికారుల ఆగడాలు తెలియవస్తున్నాయి.

కార్యశీలిగా తన అనుభవంలోంచి రాసిన రచయిత ఆవుల పిచ్చయ్య తొలినాళ్ళ కథకులలో విశిష్టమైనవాడు. విశేషంగా చెప్పుకోదగ్గ ఇతివృత్తాలతో కథలు రాసాడు.

12

# బి. భానుప్రకాష్

– శ్రీధర్ బీచరాజు

బొల్లంపల్లి భానుప్రకాష్ – తెలంగాణ రాష్ట్రానికి చెందిన సుప్రసిద్ధ నటులు, దర్శకులు. 1950 నుండి 2009 వరకు తెలుగు రంగస్థలాన్ని ఏలిన కళాకారుల్లో భానుప్రకాష్ ఒకరు. 50 సంవత్సరాలకు పైగా రంగస్థలం మీద తన ప్రతిభతో ప్రేక్షకలోకాన్ని అలరించిన నటరాజ మూర్తి భానుప్రకాష్. వెయ్యికి పైగా నాటకాల్లో నటించి, వందకుపైగా నాటకాలకు దర్శకత్వం వహించి తెలుగు నాటకరంగానికి విశేష సేవ చేసిన తెలంగాణ బిడ్డ.

1939 ఏప్రిల్ 21న నల్లగొండ పట్టణంలో కీ.శే. ఆండాళమ్మ వేంకటహరి దంపతులకు తృతీయ సంతానంగా ఆయన జన్మించారు. వారి కుటుంబం చాలా పెద్దది. ఇద్దరు అక్కయ్యలు, నలుగురు తమ్ముళ్ళు, ఒక చెల్లెలు. తండ్రి తహసిల్ ఆఫీసులో పర్సనల్ అసిస్టెంట్‌గా చేసేవారు. ఆయనకు సెక్రటేరియట్ బదిలీ కావడంతో ఆ కుటుబం హైదరాబాద్‌కు వచ్చి స్థిరపడింది. తన ఇంట్లో ఉన్న గ్రామ్‌ఫోన్ రికార్డుల్లో ఎక్కువగా రంగస్థల నాటకాలుండేవి. అవంటే భానుప్రకాష్‌కి మక్కువ పెరిగి వాటిని అనేకసార్లు వింటూ అందులోని కంఠాలను అనుకరిస్తూ ఆయన ఇంట్లోవాళ్ళని అలరించేవారు. అందులోని 'కంసవథ' అనే నాటకాన్ని విని విని ఆ స్ఫూర్తితో సొంతగా స్క్రిప్టు రాసుకుని వేసవి సెలవుల్లో అమ్మమ్మ ఊరైన అమ్మనబ్రోలు వెళ్ళినప్పుడు తాతగారి ఆదేశంతో అక్కడి పిల్లలందరిని చేర్చి కంసవథ నాటకం తయారుచేయించి బొగ్గుల్ని, సున్నాన్ని మేకప్‌గా, లాంతర్లను లైట్లుగా ఉపయోగించి వారి తాతగారి గడిలోనే తొలి ప్రదర్శన వేశారు. అలా ఆ కుర్రవాడి తొలి అడుగు రంగస్థలంవైపు పడింది.

ఆ ఉత్సాహం, ఆ ప్రోత్సాహం స్కూల్‌డే ఫంక్షన్లో 'తారుమారు' అనే నాటకం వేసేలా పనికి వచ్చింది. ఆ నాటకం కూడా విజయవంతం కావడం, ప్రశంసలు లభించటంతో ఇక వెనుతిరిగి చూడలేదు – నాటకరంగంలో ప్రస్థానం ఆగలేదు. డిగ్రీ చేసి లాపట్టా తీసుకుని ఉద్యోగ అన్వేషణలో ఉన్నా ఎక్కడా నాటకాభిలాష తగ్గలేదు. అన్ని సందర్భాల్లోనూ నాటకాలు వేస్తూ, తెలుసుకుంటూ, పరిశీలిస్తూ గడిపేవారు. 1967 జూన్ 11న శ్రీమతి సరస్వతితో వివాహం అయింది. అప్పటికే HAL లో ఉద్యోగంలో చేరారు. అక్కడే 'రాయ్‌చోరీ' అనే బెంగాలీ థియేటర్ ఇన్‌చార్జ్‌గా ఉండేవారు. ఆయన పరిచయం, ప్రోత్సాహంతో RVS రామస్వామితో కలసి 'కళారాధన' అనే నాటక కళాసమితిని ఏర్పాటు చేసారు. 'కళారాధన' సంస్థ ఆవిర్భావం తరువాత భానుప్రకాష్ గారి రంగస్థల ప్రయాణం మరో మలుపు తిరిగి వేగం పుంజుకుంది.

1960 లో ఏర్పాటు అయిన కళారాధన సంస్థలో RVS రామస్వామి గారు నాటకాల్ని రచించడం, భానుప్రకాష్ గారు దర్శకత్వంలో పరిషత్తులకు వెళ్ళడం బహుమతులు గెల్చుకోవడం ఒక అలవాటుగా మారింది. ఆ తరువాత

వేరే నాటక రచయిత రాసిన నాటకాలకు కూడా దర్శకత్వం చేయడం మొదలుపెట్టారు భానుప్రకాష్ గారు. 'చీకటి కోణాలు, వలయం, సుడిగాలి, గాలివాన, కెరటాలు, వెల్లువ, శ్రీమాన్ శ్రీపతి, కళారాధన' వంటి నాటకాలు RVS రామస్వామి రచనలో దర్శకత్వం వహించగా, 'ప్రతిధ్వనులు, ప్రతిబింబాలు' మాత్రం శ్రీరంగ శ్రీధరాచార్య కలం నుంచి పుట్టినది. 20 సంవత్సరాలకుపైగా కళారాధన సంస్థ ద్వారా ప్రదర్శించిన అనేక నాటకాలు తెలుగు నాటక రంగస్థలంపై ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. అనేక పరిషత్తులలో ప్రేక్షకులు భానుప్రకాష్ నాటకం ఉందా లేదా అని వాకబు చేసేవారంటే అతిశయోక్తిలేదు. రాజమండ్రిలో పరిషత్తు నిర్వహణకు ఒకసారి నిర్వాహకులు దాతలను విరాళాలు అడిగితే భానుప్రకాష్ గారు అంతకుముందు అక్కడ ప్రదర్శించిన 'సుడిగాలి' నాటకాన్ని దృష్టిలో పెట్టుకుని, ఆ నాటకబృందం ప్రదర్శించే నాటకం ఉంటేనే మేం విరాళాలు ఇస్తాం అన్నారట. భానుప్రకాష్ గారి నాటకాలకి అంతటి ఆదరణ.

తెలుగు నాటకరంగ చరిత్రలో 'గాలివాన' సృష్టించిన సునామి మామూలిదికాదు. భానుప్రకాష్ వెయ్యి నాటకాలను ప్రదర్శించినా నాటక ప్రేక్షకులందరికీ 'గాలివాన' భానుప్రకాష్ గానే గుర్తుండిపోయారంటే ఆ నాటకం సృష్టించిన రికార్డులు అలాంటివి. ఒక్క కళారాధన నాటక సమితి నుండే వందసార్లకు పైగా 'గాలివాన' ప్రదర్శింప బడింది. పాల్గొన్న అన్ని పోటీల్లో అనేక బహుమతులు 'గాలివాన'కి దక్కేవి. 'గాలివాన' నాటకం నాలుగు దశాబ్దాలుగా ఏ సమాజం ఎప్పుడు ఎక్కడ ప్రదర్శించినా ప్రజాదరణ పొందుతూనే ఉంది. అంతలా ఆ నాటకాన్ని శాశ్వతం చేసారు భానుప్రకాష్ గారు.

భానుప్రకాష్ అద్భుత నటుడు. అసమాన ప్రతిభా పాటవాలు తనలో ఇముడ్చుకున్న దర్శకుడు. ఈ రెండింటి మేలు సంగమంలో పుట్టిన నాటక సృష్టి కళా హృదయులను మెప్పించకుండా ఉంటుందా? అందుకే ఆయన నాటక ప్రదర్శనలు చూసిన ప్రేక్షకులు ఆయన్ని ఎప్పటికీ మరచిపోలేరు. వారి హృదయ కమలంపై చెరగనిముద్ర వేసి మనల్ని ఇంటికి సాగనంపుతారు భానుప్రకాష్.

ఆయన నట ప్రస్థానం కేవలం రంగస్థలానికే పరిమితం కాలేదు. ఎన్నో రేడియో నాటకాల్లో నటించారు. గంభీరమైన కంఠస్వరం. సంభాషణలను అలవోకగా పలుకగలనేర్పు, నవరస సృష్టి చేయగలిగే నటరాజు ఆయన. అందుకే రేడియో నాటక ఉద్దండులైన శారదా శ్రీనివాసన్, నండూరి కె. చిరంజీవి వంటి వారితో పోటీపడి నటించి మెప్పించే వారు. సినిమా రంగంలోకి వెళ్ళాలన్న కుతూహలం లేకపోయినా సినిమాల్లోనూ ఆయన తన నటనాకౌశల్యంతో ఆకట్టుకున్న సందర్భాలు అనేకం. పాత్ర చిన్నదైనా, పెద్దదైనా ఇది భాను బాగా చేయగలడు అని ప్రేమగా పిలిస్తే వెళ్ళి వేషం వేసి వచ్చేవారాయన. దుక్కిపాటి మధుసూదన్‌రావు గారి దర్శకత్వంలో 'చదువుకున్న అమ్మాయిలు, డా. చక్రవర్తి, పూలరంగడు' లాంటి చిత్రాల్లోనేకాక 'బుద్ధిమంతుడు, ఆత్మీయుడు, అమాయకురాలు, దయామయుడు, చిల్లరదేవుళ్ళు, ఆహుతి' లాంటి ఎన్నో సినిమాల్లో, ఎందరో ప్రముఖ దర్శకుల దర్శకత్వంలో నటించినా ఎప్పుడూ సినిమా రంగంలో స్థిరపడాలనో, పేరు, డబ్బు సంపాదించాలనో తాపత్రయపడలేదు ఆయన. నా ఊపిరి రంగస్థలం అనుకున్నారు. అలాగే జీవితాంతం రంగస్థలానికే సేవ చేసారు.

50 ఏళ్ళకు పైగా అవిశ్రాంతంగా సాగిన భానుప్రకాష్ రంగస్థల ప్రస్థానంలో ఆయన్ని వరించని అవార్డులు, బిరుదులు, ఆయన గెలుపొందని బహుమతులు లేవంటే అతిశయోక్తికాదు. నటవిశారద, నాటక కృషీవలుడు, బళ్ళారి రాఘవ అవార్డు, NTR అవార్డు... ఒక్కటేమిటి రాష్ట్ర వ్యాప్తంగా, దేశవ్యాప్తంగా ఎక్కడ నాటకం ప్రదర్శించినా, ఏ నాటక కళా సంస్థ పురస్కారమయినా భానుప్రకాష్ ఇంట అవార్డుగా కొలువు తీరవలసిందే. తెలుగు నాటకరంగంలోని ఒక అగ్రశ్రేణి దర్శకుడు రాసినట్లుగా–

అతని నటనలో ఒక నిండుతనం ఉండేది!
అతని దర్శకత్వంలో ఒక క్రమశిక్షణ ఉండేది!
అతని ప్రదర్శనలో కొత్తదనం ఉండేది!!
అతని న్యాయనిర్ణయంలో నిజాయితీ ఉండేది!
అతని సమక్షంలో ఒక ఆప్యాయత ఉండేది!!

భానుప్రకాష్ నటజీవిత ప్రస్థానం ఎందరో రంగస్థల కళాకారులకు ఆదర్శం. ఆధునిక తెలుగు సాంఘిక నాటక

చరిత్రలో ఆయన ఒక లెజెండ్ నటుడిగా, దర్శకుడిగా భానుప్రకాష్ ప్రసిద్ధుడు, ప్రఖ్యాతుడు అయితే వ్యక్తిగా ఉన్నతుడు, మనసున్న మనిషి, నిగర్వి, నిరాడంబరుడు. 50 ఏళ్ళకు పైగా నట ప్రయాణం సాగించినా ఎప్పుడూ ఒకేలా ఎలా ఉండగలిగాడు అంటే ఆయన జీవితం మొత్తం రంగస్థలానికే అంకితం చేసాడు – నటన, దర్శకత్వం ఇవే ఉచ్ఛ్వాస నిశ్వాసలుగా బ్రతికాడు. డైలాగ్ చెప్పుతూనే ఈ లోకం నుంచి నిష్క్రమించాలనే సంకల్పంతో బ్రతికారు. అలాగే జీవిత చరమాంకం వరకు రంగస్థలానికి దగ్గరగానే గడిపారు. ఆయన సంపూర్ణ కళాకారుడు – ఆ కళాకారుడి శకం ఒక చరిత్ర – ఆ చరిత్ర నేటి తరానికి, రాబోయే తరానికి స్ఫూర్తిగా నిలుస్తుందనటంలో ఎలాంటి సందేహంలేదు. ఆ స్ఫూర్తి వెలుగులను ఇప్పటి తరం అందిపుచ్చుకోవాలి– ముఖ్యంగా తెలంగాణ నాటకరంగ యువతకు ఆయన కళాజీవన ప్రస్థానం ఒక ఊతం కావాలి. అది తెలుగు నాటక రంగంలో తెలంగాణ నాటక రంగ ఉనికికి, ఉన్నతికి బలమైన స్ఫూర్తిరూపంగా నిలవాలి.

తెలంగాణ నాటకరంగం భానుప్రకాష్‌ను, అతని నాటక జీవితాన్ని రెండింటిని పదిలంగా పొదివిపట్టుకుని ముందుకు సాగాలి. ఆధునిక తెలుగు సాంఘిక నాటకరంగంలో తెలంగాణ నుంచి అంత బలమైన ముద్రవేసిన వ్యక్తి, సుదీర్ఘ నాటకానుభవం, ఆదర్శవంతమైన జీవనశైలి ఉన్న మరో ప్రత్యామ్నాయం కనిపించదు. తెలంగాణ నాటకరంగం గతకాలపు గాయాల్ని కాదు– ఘనమైన గతాన్ని మనకిచ్చిన మహనీయుల్ని వారి అడుగుజాడల గుర్తుల్ని గుర్తుచేసుకుంటూ మనలో మనం స్ఫూర్తిని నింపుకుంటూ ముందుకు సాగితే తెలుగు నాటకరంగ యవనికపై తెలంగాణ జెండా గర్వంగా రెపరెపలాడే రోజు తొందరలోనే వస్తుంది.

# 13 బి.ఎన్. శాస్త్రి

– డా॥ జె. చెన్నయ్య

చరిత్రకారునిగా, శాస్త్ర పరిశోధకునిగా, సృజనాత్మక రచయితగా, బహుగ్రంథకర్తగా శ్రీ బి.ఎన్. శాస్త్రి చేసిన సేవలు నిరూపమానమైనవి. మహా సంస్థలు భారీగా నిధులు వెచ్చించి ఎంతో మంది నిపుణుల సహాయంతో చేయలేనన్ని పనులను శాస్త్రి ఒంటిచేతిమీద చేశారు. ఇదంతా కీర్తి కోసమో, ధనలాభం కోసమో చేసిందికాదు. తెలుగువారి చరిత్రకోసం, భారతదేశ చరిత్రను తెలుగు వారికి తెలియపరచడం కోసం. తన కృషిని కొనసాగించేందుకు కావలసిన సహాయకులు లేకున్నా, ఆర్థిక వనరులు అసలే లేకున్నా వాటికోసం ఎవరినీ యాచించకుండా, ఏ ప్రభుత్వాన్నీ అడగకుండా అలుపెరుగని కృషిని కొనసాగించారు. నేటి తరానికి ఆయన పరిశ్రమ గురించి తెలియాలి.

1932 డిసెంబర్ 10న నల్లగొండ జిల్లా, తుమ్ములగూడెంలో జన్మించిన బి.ఎన్. శాస్త్రి పూర్తిపేరు భిన్నూరి నరసింహ శాస్త్రి. తల్లిదండ్రులు శ్రీమతి సరస్వతమ్మ, శ్రీ రామకృష్ణయ్య. వారి స్వస్థలం అదే జిల్లాలోని నల్లగొండ. ఇద్దరక్కల తర్వాత కలిగిన ఎనిమిది మంది మగపిల్లల్లో శాస్త్రి పెద్దవారు. విద్యార్థి దశలో ఉన్నప్పుడు నల్లగొండ తెలంగాణ సాయుధ పోరాటానికి కేంద్ర స్థానంగా ఉంది. నిజాం నిరంకుశ పాలన, ఆ పాలనకు నిజాం విధానాలకు, రజాకార్లు, జాగీర్దార్లు వత్తాసు పలుకుతూ ప్రజల్ని తీవ్రమైన దోపిడీకి గురిచేస్తున్న కాలమది. ప్రతిఘటన కూడా ఆ స్థాయిలోనే కొనసాగింది. నిజాంకు వ్యతిరేకంగా దండు నడిపిన రావినారాయణ రెడ్డి బి.ఎన్. శాస్త్రికి స్ఫూర్తి ప్రదాత అయ్యారు. నారాయణరెడ్డి అడుగుజాడల్లో నడిచి సాయుధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు బి.ఎన్. శాస్త్రి. ఉద్యమంలో పాల్గొంటూ చదువు పూర్తిగా నిర్లక్ష్యం చేసే దశలో పెద్దలు ఆయన్ను గుంటూరు జిల్లా దాచేపల్లిలో తమ బంధువుల ఇంట్లో ఉంచారు. చిన్నవాడైన శాస్త్రి చేసేదిలేక అక్కడే చదువుకొన్నారు. కొంతకాలానికి హైదరాబాదు వచ్చి ఆంధ్ర విద్యాలయ ఉన్నత పాఠశాలలో 9, 10, 11 తరగతులు చదివారు. మొత్తం మీద విద్యాభ్యాసం పూర్తి చేసి ఉపాధ్యాయ వృత్తి చేపట్టారు. ఆ కాలంలోనే పుస్తక పఠనం, రచనలు చేయడం ప్రారంభించారు.

ఉస్మానియా విద్యాలయం తెలుగు శాఖలో ఎం.ఎ తెలుగులో చేరడంతో తెలుగు భాషా సాహిత్యాల అధ్యయనం మరింత ఉధృతమైంది. అక్కడ దివాకర్ల వెంకటావధాని, బిరుదురాజు రామరాజు, పల్లాదుర్గయ్య వంటివారు బి.ఎన్. శాస్త్రికి గురువులు. రచనలు చేయడం, అధ్యయనం చేసిన అంశాలపై విద్యార్థులను సమీకరించి సదస్సులు నిర్వహించడం, సదస్సుల్లో చదివిన పత్రాలను పుస్తకంగా తేవడం ఇవన్నీ శాస్త్రిని తీరికలేకుండా చేశాయి. అప్పటికే నవలలు, గేయ, వచన, నాటికలు రాసిన బిఎన్ శాస్త్రి 'కాశీ ఖండం దాని ప్రాశస్త్యం' గ్రంథ రచన చేపట్టారు. పీ.హెచ్.డీ. లో ప్రవేశించి "శాసనములలో తెలుగు భాషా పరిణామము" అనే అంశంపై పరిశోధన ప్రారంభించారు. అయితే ఎం.ఎ.

తెలుగు చదివినవారు పరిశోధన చేయడానికి పనికిరారని పుట్టపర్తి శ్రీనివాసాచార్యులు అన్నారు. అయినా బిఎన్ వెనక్కి తగ్గలేదు. శాసనాలపై మక్కువతో, పట్టుదలతో పరిశోధన కొనసాగించారు. నిర్ణీత కాలపరిమితిలో పరిశోధనాంశాన్ని పది అధ్యాయాలుగా విభజించుకుని తాము కనుగొన్న శాసనాల ఆధారంగా పరిశోధన గ్రంథాన్ని పూర్తి చేశారు. తన పరిశోదనల్లో భాగంగా నన్నయ్య పూర్వం నుండే వున్న శాసనాలను విశ్లేషించారు. నన్నయ్య ఆదికవి అని అప్పటి వరకూ వున్న వాదాన్ని తిరస్కరిస్తూ తెలుగు సాహిత్యానికి నన్నిచోడుడు ఆదికవి అని నిరూపించారు. సిద్ధాంత గ్రంథాన్ని తిరగ రాసి నన్నయ ఆదికవిగా పేర్కొనాలని అధ్యాపకులు చేసిన సూచనలు అంగీకరించనందుకు బిఎన్ శాస్త్రికి డాక్టరేట్ రాలేదు. కాని ఎవరికీ లొంగక తన కృషిని కొనసాగించి ఎవరూ చేయలేనన్ని పనులు చేయడం వల్ల అనేక డాక్టరేట్లకు తూగే పనితో ప్రశంసలందుకున్నారు.

1965లో విష్ణు కుండినుల కాలానికి చెందిన రెండు తామ్ర శాసనాలను విశ్లేషించి పరిష్కరించి ప్రకటించడంతో బిఎన్ శాస్త్రి శాసన పరిశోధనాకృషి ప్రారంభమైంది. ఆ రెండు శాసనాలు తాను జన్మించిన తుమ్మలగూడేనికి చెందినవి. తుమ్మలగూడెం అలనాటి విష్ణుకుండినుల రాజధాని ఇంద్రపాల నగరం గురించి, శాసనాలను గురించి 'భారతి'లో ప్రకటించి, విష్ణుకుండినులకు చెందిన కొత్త విశేషాల్ని వ్యాసరూపంలో రాయడంతో కొందరు ఆక్షేపించారు. కాని భారతి సంపాదకులు శివలెంక శంభుప్రసాద్ మద్దతుగా నిలిచారు. బి.ఎన్. శాస్త్రిగారికి కొత్త విశేషాల్ని ఆంగ్ల వ్యాసాలుగా కూడా చరిత్రకారులకు పంపారు.

శాసనాల కోసం తెలుగునాట ఆంధ్ర, తెలంగాణ అన్న తేడా లేకుండా శాస్త్రిగారు ఊరూరా తిరిగారు. 1974లో రెండు సంపుటాలుగా శాసనాల్ని ప్రకటించారు. కందూరు చోళులవి 10, కళ్యాణి చాళుక్యులవి 10, కాకతీయులవి 10, గోలకొండ ప్రభులవి 2, మొత్తం 32 శాసనాల్ని వెలికి తీశారు. అప్పటి వరకు విష్ణుకుండినులు అమరావతి, విజయవాడ, దెందులూరు, కంగీలను రాజధానులుగా పాలించినారు అనే అభిప్రాయం వుండేది. కానీ శాస్త్రిగారు వెలుగులోకి తెచ్చిన కొత్త విశేషాల వల్ల విష్ణుకుండినులు మహబూబ్‌నగర్ మండలంలోని శ్రీ పర్వత ప్రాంతంలోని ఇక్ష్వాకులకు సామంతులుగా వున్న వీరు ఇంద్ర పాలనగరం (తుమ్మలగూడెం)ని రాజధానిగా చేసుకొని దక్షిణ పథాన్ని పాలించారని తేలింది. ఈ విధంగా విష్ణుకుండినులు, మరాఠ వంశీయులు, కళిగగాంగులు, కందూరి చోళులు, కళ్యాణి చాళుక్యులు, కాకతీయ ప్రభువుల శాసనాలను పరిశీలించి సంపుటిగా లోకానికి అందించారు.

వీటితో పాటు త్రిపురాంతకం ఆలయ గోడలపై వున్న వందకుపైగా శాసనాలను బి.ఎన్. శాస్త్రి సేకరించారు. క్రీ.శ. 1106 నుంచి 1386 వరకు అంటే సుమారు 280 సంవత్సరాల చారిత్రక ఆధారాలను పట్టుకున్నారు. వీటికి అదనంగా మరో 15 శాసనాలను విశ్లేషించడం ద్వారా త్రిపురాంతక దేవాలయ చరిత్ర, శ్రీపర్వతపురం, అగ్రహారాలు, భూములు, త్రిపురాంతక శాసనాల సాంఘిక చరిత్ర అని విడివిడిగా విభజించి అనేక విశేషాలను వెలుగులోనికి తెచ్చారు. 1984లో ప్రచురితమైన ఈ గ్రంథాన్ని పుష్పగిరి పీఠాధిపతి శ్రీ విద్యానృసింహ భారతీ స్వామికి అంకిత మిచ్చారు.

తర్వాత 'కందుకూరి రాజుల శాసనములు–చరిత్ర–సంస్క ృతి', 'ముఖలింగదేవాలయ చరిత్ర–శాసనములు', 'బెజవాడ దుర్గామల్లీశ్వరాలయ శాసనములు', 'గోల్కొండ చరిత్ర–సంస్కృతి–శాసనములు', 'చెరకురెడ్డి వంశచరిత్ర–శాసనములు', 'రేచర్లరెడ్డివంశ చరిత్ర–శాసనములు', 'కాయస్థ రాజులు', 'రేచర్ల పద్మనాయకులు', 'వేములవాడ చరిత్ర–శాసనములు', 'మల్యాలవంశచరిత్ర–శాసనములు' ఇట్లా 12 శాసన సంపుటాలను వెల్వరించి తెలుగువారి చరిత్రను సమగ్రం చేశారు.

బి.ఎన్. శాస్త్రిగారు సమగ్రచరిత్ర నిర్మాణం కోసం చేసిన పరిశ్రమ ఎంత విలువైందో స్థానిక చరిత్ర నిర్మాణం కోసం చేసిన కృషి కూడా గొప్పగా చెప్పుకోదగింది. ఈనాడు జిల్లాలుగా చెప్పుకొనేవి ఒకప్పుడు మండలాలుగా పేర్కొనేవారు. వీరు నల్లగొండ, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ మండల సర్వస్వాలను బృహత్ సంపుటాలుగా అందించారు. ఈ మూడు మండల సర్వస్వాలు తెలంగాణ చారిత్రక వైభవాన్ని లోకానికి వెల్లడిచేసేవి. నల్లగొండ జిల్లాలో బి.ఎన్. శాస్త్రి జరిపిన శాసన పరిశోధన వల్ల విష్ణుకుండినుల

తెలంగాణ చరిత్ర బయల్పడింది. ఇక్ష్వాకులు, బాదామీ చాళుక్యుల నుండి అసఫ్ జాహీల వరకు క్రీస్తు పూర్వం నుండి ఆధునిక కాలం వరకు 4500 సంవత్సరాల నల్లగొండ ప్రాంతపు చరిత్ర సంస్కృతి, కళలు, సాహిత్యాలు విస్తృతంగా నల్లగొండ మండల సర్వస్వంలో చేరాయి. ముఖ్యంగా నిజాం విముక్తి పోరాట చరిత్ర విశేషాలు ఇందులో ఉన్నాయి. మూడు జిల్లా సర్వస్వాల్లో మహబూబ్‌నగర్ సర్వస్వం అతి పెద్దది. మహబూబ్‌నగర్‌కు ఆ పేరు ఎలా వచ్చిందో ఈ సంపుటి తెలుపుతుంది. ఆరవ నిజాం మీర్ మహబూబ్ అలీఖాన్ పేరు మీద పాలమూరు జిల్లాకు ఆ పేరువచ్చింది. క్రీ.పూ 2500 నుండి పాలమూరి చరిత్ర కానవస్తున్నదని, అపూర్వ చారిత్రక సంపద కలిగినదని, శాతవాహన కాకతీయాది రాజవంశముల పాలనను చవిచూసిందని, ఆధునిక కాలంలో సంస్థానాల వైభవం కానవస్తుందని తెలిపారు.

బి.ఎన్.శాస్త్రి చేసిన మంచి పనుల్లో రెడ్డి రాజ్య సర్వస్వము, బ్రాహ్మణ రాజ సర్వస్వములు చెప్పుకోదగినవి. రెడ్డి బ్రాహ్మణ రాజ్య సర్వస్వాలంటే కులపరంగా పరిగణించదగినవికావు. విస్తృతార్థంలో పరిశీలించదగినవి. రేచెర్ల, చెరకు, మలాల, విరిమాస, వావిలాల కొరకొండ, కొండవీటి, రాజమహేంద్రవరం, కందుకూరు తదితర రెడ్డి రాజ్యాలు తెలుగు వారి చరిత్రను సుసంపన్నం చేశాయి. ఆయాకాలాల్లో సాహిత్య, సాంస్కృతిక, సాంఘిక చరిత్రను వెలికితీసి చూపారు. 600 పుటలున్న రెడ్డి రాజ్య సర్వస్వంలో 174 శాసనాల పాఠాలు, విశ్లేషణ వీటి ఆధారంగా సాధికారికమైన చారిత్రక రచనను బిఎన్ శాస్త్రి అందించారు. అట్లానే 26 బ్రాహ్మణ రాజవంశాల చరిత్రను శోధించి సరస్వాన్ని రచించారు.

ఆంధ్రుల సాంఘిక చరిత్ర పేరు వినగానే సురవరం ప్రతాపరెడ్డి గారి పేరు అందరికీ గుర్తొస్తుంది. క్రీ.శ 11వ శతాబ్దం నుండి 1907 వరకు ప్రతాపరెడ్డి గారు తెలుగు చరిత్ర సంస్కృతుల వైభవాన్ని ఎంతో శ్రమకోర్చి తమ పరిశోధనా పటిమను రంగరించి రచించారు. ఈ గ్రంథం స్ఫూర్తితో బి.ఎన్. శాస్త్రి సురవరం రచనకు పూర్వభాగాన్ని ఎంచుకున్నారు. లిఖితరూప ఆధారాలేవి లభ్యం కాని కాలాన్ని పరిశోధనాత్మక రచనకు స్వీకరించారు. అంటే క్రీస్తు పూర్వం నుండి శ్రీ.శ 11 వ శతాబ్దం వరకు తెలుగు వారి చరిత్ర, సంస్కృతిని ముఖ్యంగా సాంఘిక చరిత్రను గ్రంథస్థం చేయ సంకల్పించారు. ఈ రచనకు ప్రధానంగా పూర్వపు చరిత్ర పరిశోధకుల రచనలతోపాటు పూర్వశాతవాహనుల, శాతవాహనులు, ఇక్ష్వాకులు, పల్లవులు, బృహత్పలాయనులు, కళింగాంధ్రులు, రేనాటి చోళులు, చాళుక్యుల కాలం నాటి శాసనాలను సేకరించి వీరు ఆంధ్రుల సాంఘిక చరిత్రను రచించారు.

'ఆంధ్రుల సాంఘిక చరిత్ర' రచన తర్వాత 1990లో బిఎన్ శాస్త్రి గారు తమ చారిత్రక రచనా పరంపరలో 'ఆంధ్రదేశ చరిత్ర'ను మూడు భాగాలుగా రచించాలని సంకల్పించారు. సుసంపన్నమైన, సుప్రతిష్ఠితమైన, సువిస్తృతమైన తెలుగుదేశ చరిత్రను సమగ్రంగా రాయాలని భావించారు. క్రీ.శ 1323 వరకు మొదటి భాగంలో రాశారు. రెండవ భాగంలో రేచర్ల రెడ్డి, చెఱకురెడ్డి, కాయస్థ, మల్యాల, విరియాల, యాదవ, నతనాడి, పెనుగొండ వంశీయుల చరిత్ర నుంచి రెడ్డి రాజులు, విజయనగర రాజులు, గజపతులు, నాయక రాజుల వరకు పరిపాలన, భాషా సంస్కృతులు మొదలైన అనేక అంశాలను రాశారు. మూడోభాగం కీలకమైంది. క్రీ.శ.1518 నుండి 1990 వరకు కుతుబ్ షాహీలు, గోరాజులు, మొగలులు, అసఫ్‌షాహీలు, తెలుగు నాట బ్రిటీషు వారి పాలన, స్వాతంత్ర్య పోరాటం, విశాలాంధ్ర ఉద్యమం, ఆంధ్రప్రదేశ్ వరకు అన్ని అంశాలను బి.ఎన్. శాస్త్రి స్పృశించారు.

ఎప్పుడో 1970లో ప్రారంభించిన చరిత్ర పరిశోధనా కృషి, శాసనాల అన్వేషణ, వాటి విశ్లేషణ, చరిత్ర రచన జీవిత పర్యంతం కొనసాగడం అసాధారణమైన విషయం. తొలుత వివిధ రాజవంశాల కాలంలోని శాసనాలను వెలికితీసి అధ్యయనం చేసిన శాస్త్రి గారు శాసనాల సంపుటాలను రాశారు. స్థానిక చరిత్రలను ప్రధాన స్రవంతి చరిత్రకు అందించే లక్ష్యముతో మండల సర్వసాలు వెలువరించారు. రాజ్య సర్వసాలు అందించారు. ఆ దిశలో అత్యున్నతంగా చిరస్థాయిగా చెప్పుకోదగినది భారతదేశ చరిత్ర. బిఎన్ శాస్త్రి గారు 21 సంపుటాల్లో భారతదేశ చరిత్ర రాశారు. ఆరోగ్య సమస్యలున్నా, ఆర్థిక సమస్యలున్నా, ఇంత పెద్ద పనిలో సహాయం చేసేవారు లేకున్నా చేపట్టిన

బృహత్కార్యం ఆగలేదు. ఇంత పని తలపెట్టిన వ్యక్తులు దేశ చరిత్రలో అరుదుగా వుంటారేమో. వేదయుగం మొదలుకొని సంస్థానాల యుగం వరకు 21 భాగాలుగా భారతదేశ చరిత్ర రాశారు. మొత్తం పుటల సంఖ్య సుమారు 10 వేలు.

తొలుత సృజనాత్మక రచయితగానే సాహితీ కృషి ప్రారంభించిన బిఎన్‌శాస్త్రి 7 సాంఘిక నవలలు రాశారు. రాధ, జీవన పథం, తీరని కోరిక, పరివర్తన, జీవితం–గమనం, సంధ్యారాగం, విప్లవజ్వాల, తెలంగాణ పోరాటాన్ని ముఖ్య కథావస్తువుగా చిత్రించిన విప్లవజ్వాల బిఎన్ శాస్త్రికి ఎనలేని కీర్తిని తెచ్చిపెట్టింది. వాకాటక మహాదేవి, తుక్కా దేవి అనే చారిత్రక నవలలు రాశారు. ఇంకా నాటికలు 'తపోభంగం' అనే గేయకావ్యం, 'పాపాయి పతకం' అనే బాల గేయకావ్యం, పులిజాలరంగారావు జీవితచరిత్ర మొదలైన రచనలు చేశారు. తమ రచనల్ని వ్యయ ప్రయాసలకోర్చి తామే ముద్రించి ప్రచారపరిచేందుకు పుస్తక ప్రచురణ సంస్థల్ని నెలకొల్ప నిర్ణయించారు.

'భారతి' పత్రిక స్ఫూర్తితో మూసీపత్రికను నెలకొల్పారు. తెలుగు సాహిత్యం, సంస్కృతి, చరిత్ర మొదలైన అంశాలపై మౌళికమైన పరిశోధనను ప్రోత్సహించేందుకు బి.ఎన్. శాస్త్రి మూసీ పత్రికను నడిపారు. పరిశోధకులు మూసీని ఎంతగానో ఆదరించారు. వారి అనంతరం డా. కమలాకరశర్మ నేటికీ మూసీ పత్రికను నడుపుతున్నారు.

బిఎన్ శాస్త్రి ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ ఎంతెంతో దూరం ప్రయాణిస్తూ తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల్లో మారు మూలల్లో పర్యటించారు. సుమారు 2000 శాసనాలను ముద్రించారు. 400 శాసనాలను స్వయంగా ఆయన పరిష్కరించి తొలిసారి ప్రచురించారు. తెలుగు చరిత్రకు ముఖ్యంగా తెలంగాణ చరిత్రన్నా ప్రాణమిచ్చేవారు. శాస్త్రి గారి చారిత్రక రచనల్ని ఒక్కచోట చేర్చి అందులోని విశేషాలను లోతుగా అధ్యయనం చేసే సమగ్ర తెలంగాణ చరిత్ర నిర్మాణానికి ఎంతో ఉపకారం జరుగుతుంది. అనారోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా శాసనాలను అన్వేషిస్తూ వాటిలోని విశేషాలను కాగితాలకెక్కిస్తూనే ఆయన కన్నుమూశారు.

బిఎన్ శాస్త్రి గారి 'ఆంధ్రదేశ చరిత్ర–సంస్కృతి' గ్రంథానికి తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారాన్ని అందించింది. జీవన సాఫల్య పురస్కారంతో పోల్చదగిన విశిష్టపురస్కారాన్ని అందించి సత్కరించింది. శ్రీ కృష్ణ దేవరాయాంధ్ర భాషానిలయం బూర్గుల సాహితీ పురస్కారం ప్రదానం చేసింది. యువకళావాహిని, మహా మంత్రి మాదన్న ట్రస్టు పురస్కారం వంటి గౌరవాలు అందుకున్నారు.

# 14 బి.ఎస్. నారాయణ

– వారాల ఆనంద్

తెలంగాణకు భౌతికంగా సుదూరంలో ఎక్కడో మద్రాస్‌లో వేళ్లూనుకొని మానసికంగా మరెంతో దూరంగా వుండిపోయిన ఆంధ్ర సినిమా రంగంలోకి 1952లో ఓ తెలంగాణా యువకుడు కాలుపెట్టి తనదయిన ముద్రవేసుకుని జాతీయస్థాయిలో రెండు అవార్డులు సాధించాడు. అంతేకాదు తెలుగు సినిమా ప్రపంచానికి మొట్టమొదటి సారి జాతీయ ఉత్తమ నటి అవార్డ్‌ను నటి శారదకు సాధించి పెట్టిన మహా దర్శకుడు బి.ఎస్. నారాయణ. 'నిమజ్జనం' సినిమా బెంగళూరు అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో పనోరమా విభాగంలో ప్రదర్శించబడి విశేషంగా మన్ననల్ని అందుకుంది. ఆయన దర్శకత్వం వహించిన నిమజ్జనం, ఊరుమ్మడిబతుకులు సినిమాలు మాస్కో, బెర్లిన్, ఫ్రాన్స్ తదితర అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలల్లో ప్రదర్శించబడి మొట్టమొదటిసారిగా తెలంగాణ దర్శకుడి జెండా ఎగురవేసిన తెలంగాణ బిడ్డ ఆయన.

బి.ఎస్. నారాయణ కరీంనగర్ జిల్లాలోని కొత్తపల్లి గ్రామంలో 1929లో ఫిబ్రవరి 17న జన్మించాడు. మొదట ఆయన నైజాంకు వ్యతిరేకంగా హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్‌లో పనిచేశాడు. జమలాపురం కేశవరావు, హయగ్రీవాచారి లాంటి వారితో కలిసి పనిచేశారు.స్వతహాగా కళాకారుడయిన బి.ఎస్. నారాయణ రాజకీయాలల్లో ఇమడలేక తనకు గల సినిమా ఆసక్తి మేరకు మద్రాస్ పయనమయ్యాడు. వెనుకబడిన తరగతులకు చెందిన బి.ఎస్. సినిమా గురించి గొప్ప కలగన్నాడు. ఆ కల నెరవేర్చుకోవడానికి మాద్రాస్ పయనమయ్యాడు. 1952లో సినీ రంగ ప్రవేశం చేసిన ఆయన మొదట హెచ్.వి. బాబు వద్ద అసిస్టెంట్‌గా 'ఆదర్శం' సినిమాకు పనిచేశాడు. తరువాత కె.ఎస్. ప్రకాశరావు, కె.బి. తిలక్‌ల వద్ద అసిస్టెంట్‌గాను, అసోసియేట్‌గాను పనిచేశాడు.

1960 తర్వాత స్వంతంగా దర్శకత్వ బాధ్యతలు చేపట్టాడు. ఆయన మొట్టమొదట తీసిన సినిమా 'మాంగల్యం', రెండవ సినిమా 1963లో 'ఎదురీత'. ఇక అప్పటినుండి ఆయన వెనుదిరిగి చూసుకోలేదు. జాతీయ అవార్డులు అందుకున్న 'నిమజ్జనం, ఊరుమ్మడి బతుకు'తోపాటు ఆయన 'శ్రీదేవి, పెళ్లినాటి ప్రమాణాలు, ఎదురీత, తిరుపతమ్మ కథ, ఆమె ఎవరు, శ్రీవారు మావారు, ఆనంద నిలయం, ఆడవాళ్ళు అపనిందలు, ఆడది గడప దాటితే' లాంటి 32 చిత్రాలకు పైగా దర్శకత్వం వహించారు.

ఎన్.టి.ఆర్., కృష్ణలాంటి అప్పటి స్టార్ హీరోలతో సినిమాలు తీశాడు. తెలుగు మాత్రమే కాకుండా తమిళంలో 'ఉల్లాస పయనం యార్నీ, తేదీవంద, తిరుమగల్, దైవీగరవు' తదితర సినిమాల్ని తీశాడు.. ఇక హిందీలో 20 సూత్రాల పథకం ఆధారంగా హేమమాలిని, వినోద్ మెహ్రా తదితరులతో 'ఏక్ నయీ ఇతిహాస్' సినిమా తీశాడు.

బి.ఎస్. నారాయణ తీసిన దాదాపు అన్ని సినిమాలు

ప్రధానంగా మధ్యతరగతి స్త్రీ సమస్యల పైననే కేంద్రీకృతమయ్యాయి. అందుకే ఆయన సినిమాల్లో స్త్రీ పాత్రలన్నీ విలక్షణతను సంతరించుకొని వుంటాయి.

మృణాలిని సేన (ఒక ఊరి కథ), శ్యాం బెనెగల్ (అనుగ్రహం) లాంటి చిత్రాలతో తెలుగులో సమాంతర చిత్రాల నిర్మాణానికి పాదులు వేసిన నేపథ్యంలో బి.ఎస్. నారాయణ తీసిన 'నిమజ్జనం, ఊరుమ్మడి బతుకులు' జాతీయస్థాయిలో ఆర్ట్ సినిమా విభాగంలో ప్రతినిధులుగా నిలిచాయి. 'ఊరుమ్మడి బతుకులు' 1977లో తీశాడు. ప్రముఖ రచయిత సి.ఎస్. రావు రాసిన నవల ఆధారం చేసుకుని తీసిన ఈ సినిమా ఆనాటి వ్యవస్థలో పెత్తందార్ల ఆగడాలను వారి ఆకృత్యాలకు బలయిపోయిన సాధారణ జనజీవితాల ఆధారంగా ఈ సినిమా రూపొందించబడింది. కామాంధుడయిన ఓ వూరి పెత్తందారు పేదలకు అప్పులిచ్చి ఆడవారిపై అత్యాచారం చేయడం, ఆస్తులు కాజేయడం చేస్తూ వుంటాడు. ఒకరోజు కుమ్మరి వాడయిన గన్నయ్య అమాయకత్వాన్ని ఆధారం చేసుకొని అతన్ని పట్నం పంపి అతని భార్యపైన అత్యాచారం చేసేందుకు పూనుకుంటారు. ఆ సమయానికి తిరిగి వచ్చిన గన్నయ్య వారిపై దాడి చేసి హతమారుస్తాడు. అదొక గొప్ప మార్పును సూచిస్తుంది. అత్యంత సహజంగా నిర్మించబడ్డ వూరుమ్మడి బతుకులు లో మాధవి సత్యేంద్రకుమార్ తదితరులు నటించారు. ఇది జాతీయస్థాయిలో ప్రాంతీయ ఉత్తమ చిత్రంగా బహుమతి గెలుచుకొంది. రాష్ట్రస్థాయిలో నంది అవార్డును కూడా అందుకుంది.

తర్వాత 1979లో బి.ఎస్. నారాయణ తీసిన మరో గొప్ప సినిమా 'నిమజ్జనం'. ఇందులోని నటనకు నటి శారదకు జాతీయస్థాయిలో ఉత్తమ నటి అవార్డు వచ్చింది. సినిమాకు జాతీయస్థాయిలో ఉత్తమ ప్రాంతీయ చిత్రం అవార్డు కూడా వచ్చింది. ఇది మనుషుల మానసిక సంఘర్షణని, చేసిన తప్పు దహించి వేస్తున్నప్పుడు కలిగే అంతర్మథనాన్ని గొప్పగా చిత్రీకరించాడు బి.ఎస్. నారాయణ. ప్రముఖ రాజకీయ నాయకుడు కె. కేశవరావు, ప్రేం ప్రకాశ్, పి. రాంరెడ్డిలు నిర్మాతలుగా నిర్మించిన నిమజ్జనం రోడ్ మూవీగా చెప్పుకోవచ్చు. సినిమా ప్రధానంగా బండిమీద కాశీకి వెళ్తున్న ఒక జంట, వారితోపాటు బండివాడు ప్రధాన పాత్రధారులుగా వుంటారు. వ్యాపార సినిమా ఉధృతంగా ఉన్న తెలుగు సినిమా రంగంలో ఇలాంటి ప్రయత్నం చేయడం సాహసంగానే చెప్పుకోవచ్చు. శ్రీకాంత్ తన తండ్రి అస్తికల్ని గంగలో నిమజ్జనం చేయడానికి భార్య భారతితో కలిసి బయలుదేరతాడు. రైల్వేస్టేషన్ దూరంగా వుండడంతో బండిలో బయలుదేరతాడు. బండివాడు గోవిందు భారతిని చూసి వివశుడు అవుతాడు. ఇంతలో బండికి కట్టబడిన అస్తికల మూట దారిలో పడిపోతుంది. దాన్ని వెతుకుతూ శ్రీకాంత్ వెనక్కి వెళతాడు. గోవిందు భారతిపైన అత్యాచారం చేస్తాడు. తర్వాత ఏమీ జరగనట్టు వుండిపోతాడు. జరిగిన అవమానాన్ని దిగమింగుతూ లోలోపలే కుమిలిపోతూ భారతి మౌనంగా వుండిపోతుంది. ఆమె అంతర్మథనం నిలువనీయదు. కాశీకి వెళ్ళిన తర్వాత అస్తికలు నిమజ్జనం చేస్తుండగానే భారతి గంగానదిలో స్నానానికని నీటిలో దిగి మునిగిపోతుంది. గంగలో తానే నిమజ్జనం అయిపోతుంది. శ్రీకాంత్ ఎంత వెతికినా లభించదు. అదేమీ తెలియని అర్థముగాని శ్రీకాంత్ అది ప్రమాదంగా భావించి దుఃఖంతో తిరుగుముఖం పడతాడు.

ఊరు చేరింతర్వాత తిరిగి అదే బండివాడు గోవిందు బండిలో ఎక్కుతాడు. అమ్మేదయ్యా అని అడుగుతాడు గోవిందు. కాశీ గంగలో నిమజ్జనమయి పోయిందని చెబుతాడు శ్రీకాంత్. తాను చేసిన అత్యాచారం వల్లే ఈ ఘోరం జరిగిందని ఆమెది ప్రమాదం కాదని తన నేరానికి తనలో తానే దహించుకుపోతాడు. తీవ్రమయిన ఉద్వేగానికి గురవుతాడు. శ్రీకాంత్ కాశీ నుంచి తెచ్చిన గంగాజలం నోట్లోపోయగా గుండె ఆగి మరణిస్తాడు. శ్రీకాంత్ ఇంటికి పోయింతర్వాత మననం చేస్కుంటే ఏదో జరిగిందని అర్థమవుతుంది. అలా ఒక సంఘటన. అపరాధ భావన జీవితాల్లో ఎన్ని మార్పులకు గురి చేస్తుందో అత్యంత సహజంగా అంతర్జాతీయస్థాయిలో రియలిస్టిక్‌గానూ రూపొందించాడీ సినిమాని బి.ఎస్. నారాయణ.

తెలంగాణ మట్టి చాళ్ళల్లోంచి ఎదిగినవాడు కనుక బి.ఎన్. నారాయణ మద్రాస్‌లో కేవలం సినిమాల నిర్మాణంలోని సినీ కార్మిక సంఘంలో చురుకైన పాత్రను పోషించారు. దక్షిణ భారత సినీదర్శకుల సంఘానికి వ్యవస్థాపక అధ్యక్షుడిగా పనిచేశారు. సినీ దర్శకుల కోసం

ఒక సంఘాన్ని స్థాపించి వారికోసం 'రాజారామ్ డైరెక్టర్స్ కాలనీ' ఏర్పాటు చేశాడు. మొదటినుంచీ ఉత్తమ కళా విలువలపైన, చిన్న చిత్రాలపైన మక్కువ కలిగిన బి.ఎస్. మద్రాసులోనే ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. పిల్లలు లేని బి.ఎస్. ఎంతోమంది కళాకారుల్ని చేరదీసి వృద్ధిలోకి తెచ్చారు.

నిరంతరం కళా కార్మిక చైతన్యంతో జీవించిన బి.ఎస్.కు ఫిల్మ్ సొసైటీ ఉద్యమంతో కూడా సన్నిహిత సంబంధాలున్నాయి. 1990 ప్రాంతంలో షుగర్ వ్యాధి తీవ్రం కావడంతో ఆయన దృష్టిని కోల్పోయారు. అయినప్పటికీ ధైర్యాన్ని కోల్పోకుండా కరీంనగర్‌లో వున్న లయన్స్ కంటి ఆసుపత్రిపైన 'తమసోమా జ్యోతిర్గమయ' డాక్యుమెంటరీ చిత్రం తీశాడు. 1991లో కరీంనగర్‌లో కొంతమంది యువకుల్ని సమీకరించి 'మార్గదర్శి' చిత్రాన్ని తీశాడు. మార్గదర్శి నిర్మాణానికి సంబంధించి కరీంనగర్‌కు చెందిన అనేకమందికి సినిమాలో అవకాశం కల్పించారాయన. శ్రీరాముల సత్యనారాయణ స్క్రిప్ట్ రచన చేయగా ఈ సినిమా రూపొందింది. అంధుడిగా వుండి సినిమా నిర్మించిన నేపథ్యంలో లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో బి.ఎస్.కి చోటు దక్కింది. అంతేకాదు ఆ సినిమాకు రాష్ట్రస్థాయిలో జాతీయ సమైఖ్యతా చిత్రంగా కూడా నంది అవార్డ్‌ను అందుకుంది.

అలా ఆంధ్ర వ్యాపార సినిమాకు సమాంతరంగా ఆర్ట్ సినిమాల్ని తీసిన మొదటితరం దర్శకుడిగా బి.ఎస్. నారాయణ చరిత్రలో మిగిలిపోయాడు. 1994 నవంబర్ 23న తనువు చాలించాడు. బి.ఎస్. నారాయణకు సినిమాపట్ల దాని కళాత్మకత, వ్యాపార లక్షణాలపట్ల స్పష్టమయిన అభిప్రాయాలుండేవి. ప్రభుత్వం సినిమాను కళగా చూడడం లేదు. కేవలం ట్రేడ్‌గా చూస్తున్నది. పరిశ్రమగా కూడా పరిగణించడం లేదు. దాంతో తెలుగు సినిమా ఇండస్ట్రీ బాగుపడడం కాదు గదా కేవలం జూదంలాగా తయారవుతున్నదని ఆయన చెప్పేవారు. అంతేకాదు చిన్న సినిమాలు ప్రయోగాత్మక సమాంతర సినిమాల పట్ల కూడా ఆయనకు నిర్దిష్టమైన భావాలుండేవి. అవి చిన్న మొక్కల్లాంటివి వాటిని పోషిస్తే మహావృక్షాలవుతాయి. అలాంటి ప్రయోగాల్ని కాపాడుకుంటేనే మంచి సినిమాకు భవిష్యత్తు వుంటుందని ఆయన అభిప్రాయపడేవారు. అది ఇప్పటికీ అక్షరసత్యం.

తెలుగు సినిమా ప్రపంచం మాత్రం పెత్తందారీతనంతో తెలంగాణ ప్రతిభకు సముచిత స్థానం ఇవ్వలేదు. 1980లో ఫాల్కే అవార్డ్‌ను అందుకున్న పైడి జయరాజ్‌ను మరుగున పెట్టినట్టే జాతీయస్థాయిలో మొట్టమొదటిసారి ఉత్తమ నటి అవార్డ్‌ను, రెండు జాతీయ అవార్డులను అందించిన బి.ఎస్. నారాయణను కూడా మర్చిపోయింది. అది తెలుగు సినిమా దౌర్భాగ్యం. తెలంగాణ రాష్ట్రంలోనయినా బి.ఎస్.కి సముచిత స్థానం ఇవ్వాల్సివుందని అభిమానులు ఆశిస్తున్నారు.

15

# భండారు అచ్చమాంబ

– డా॥ సంగిశెట్టి శ్రీనివాస్

ఒక జాతి జీవన స్థితిగతులు, ఆచార వ్యవహారాలు, మెరుగైన జీవితం కోసం చేసిన పోరాటాలు – వాటి ద్వారా సాధించిన ఫలితాలు సాహిత్యంలో ప్రతిఫలించిన నాడే వాటికి శాశ్వతత్వం ఏర్పడుతుంది. తెలుగు వారి జీవితాల్ని సాంస్కృతిక పునర్వికాస వెలుగులో కథా సాహిత్యంలో రికార్డు చేసిన వారిలో అగ్రగణ్యులు, ఆద్యులు భండారు అచ్చమాంబ. తెలంగాణ, ఆంధ్ర, విదర్భ, చత్తీస్‌ఘడ్ ప్రాంతాల్లోని జీవితాలతో లోతైన సంబంధాలు కలిగిన అచ్చమాంబ 19వ శతాబ్దంలోనే తాను చూసిన జీవితాలను, వాటిలో రావాల్సిన మార్పుల్ని కథా సాహిత్యంలో రికార్డు చేశారు.

ఆధునిక కథానిక ప్రక్రియకు అక్షరార్పణ చేసింది, పునాది వేసింది భండారు అచ్చమాంబే. ఆమెకన్నా ముందు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ పోషణలోని పండితుడు తాతాచార్యులు, కందుకూరి వీరేశలింగాలు రాసినవే తొలి కథలని 'తెలుగు కథకు వందేళ్ళు' సందర్భంగా పండితులు కొత్త వాదనలు ముందుకు తీసుకు వస్తున్నారు. ఆధునిక కథకు ఉండాల్సిన కథ, కథనం, శైలి, శిల్పం, సారం, జీవితం లాంటి అంశాలు ఏవీ లేకుండా తాతాచార్యులు రాసిన 'పరమానందయ్య శిష్యుల' లాంటి ఉబుసుపోక కబుర్లని కథలుగా చెప్పడానికి వీలులేదు. సి.పి.బ్రౌన్, ఆయన పోషణలోని పండిత వర్గాన్ని రంజింపచేయడానికి చెప్పిన కబుర్లలో అక్కడక్కడ సమకాలీన అంశాలు కూడా చోటు చేసుకోవచ్చు. అంతమాత్రాన వాటిని ఆధునిక కథలుగా అంగీకరించడానికి వీల్లేదు. వాటిని కథలుగా కన్నా తెలుగు నేర్చుకునే ఇంగ్లీషువారికి పనికొచ్చే సంభాషణల కూర్పుగా చెప్పుకుంటే బాగుంటుంది. ఉబుసు పోకకు, బ్రౌన్– ఆయన పండితుల మెప్పుకోసం చెప్పిన కబుర్లని 'ఆధునిక కథలు'గా చిత్రించడమంటే నిజమైన కథలకు, కథకులకు అన్యాయం చేయడమే. స్వయంగా సి.పి. బ్రౌన్ 'యూస్‌లెస్' అని పేర్కొన్న వాటిని కథలుగా చెప్పడం విడ్డూరంగా ఉంది.

ఇక రెండో వ్యక్తి కందుకూరి వీరేశలింగం. దాదాపు తాతాచార్యుల కథల్ని 1974లో శ్రీవెంకటేశ్వర విశ్వ విద్యాలయం బ్రౌన్ ప్రాజెక్టులో భాగంగా అచ్చేసిన(రీప్రింట్) కాలంలోనే కందుకూరి వీరేశలింగం సాహిత్యంపై సమగ్ర పరిశోధన చేసిన అక్కిరాజు రమాపతిరావు ఇటీవల 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో వ్యాసం రాస్తూ తెలుగు కథానికకు ఆద్యుడు – కందుకూరి అని పేర్కొన్నాడు. ఒకవేళ నిజంగా ఆయనే ఆద్యుడైనట్లయితే 35 యేండ్ల కింద తాను 'కందుకూరి వీరేశలింగంపై సమగ్ర పరిశోధన' చేసిన సమయంలో ఈ విషయం ఎక్కడా పేర్కొనలేదు.

పై విషయాన్ని దృష్టిలో పెట్టుకున్నట్లయితే తెలుగులో మొట్టమొదటిసారిగా ఆధునిక పద్ధతిలో కథలు రాసిన వారిలో భండారు అచ్చమాంబ ఆద్యులు. ఆవిడ రచనలు ఆనాటి ప్రజల జీవితాల్ని అధ్యయనం చేసి వాటిలో మెరుగైన

మార్పులు తీసుకురావాలనే ఉద్దేశంతో పాత్రలను సృష్టించి వాటిద్వారా కథని నడిపించిన తీరు ఆధునికతకు అద్దం పట్టింది.

19వ శతాబ్దిలో సాహిత్య దృష్టితో పత్రికలని నడిపించిన వారిలో కొక్కొండ వెంకటరత్నం పంతులు, కందుకూరి వీరేశలింగం పంతులు, రాయసం వెంకట శివుడు తదితరులు ముఖ్యులు. అయితే వీరంతా సాహిత్య విమర్శ పరిశోధన, ప్రాచీన సాహిత్యానికి, ప్రక్రియలకు ప్రాధాన్యమివ్వగా పులుగుర్తి లక్ష్మీనరసమాంబ, మొసలికంటి రాంబాయమ్మల సంపాదకత్వంలో నడిచిన పత్రికలు స్త్రీల సమస్యలకు, ఆధునిక ప్రక్రియలకు ప్రాధాన్య మిచ్చాయి. భండారు అచ్చమాంబ మొట్టమొదటి కథ రాయసం వెంకటశివుడు సంపాదకత్వంలో వెలువడిన 'తెలుగు జనానా' పత్రికలో 1898 జూలైలో 'ప్రేమ పరీక్షణము', 1898 సెప్టెంబరులో 'ఎఱువు సొమ్ము పరువు చేటు' పేరిట అచ్చయ్యాయి. ఈ విషయాన్ని స్వయంగా వెంకటశివుడు 1945లో హైదరాబాద్ నుంచి వెలువడ్డ 'తెలుగు తల్లి' కొమర్రాజు లక్ష్మణరావు స్మారక సంచికలో రాసిండు. అయితే ఇప్పటికీ 'తెలుగు జనానా' పత్రిక సంచికలు పూర్తిగా అందుబాటులో లేనందున ఇదే పత్రికలో 'మే'లో అచ్చయిన 'గుణవతియగు స్త్రీ' మొట్టమొదటి కథగా స్వీకరించాల్సి ఉంటుంది. భండారు అచ్చమాంబ రాశారని తెలుస్తున్న మొత్తం 12 కథల్లో పది కథలతో ఈ పుస్తకం వెలువడుతోంది. ఇందులో 1. గుణవతియగు స్త్రీ, 2. లలితా శారదలు, 3. జానకమ్మ, 4. దంపతుల ప్రథమ కలహం,
5. సత్పాత్ర దానము, 6. స్త్రీవిద్య, 7. ధనత్రయోదశి, 8. భార్యభర్తల సంవాదం, 9. అద్దమును, సత్యవతియును, 10. బీద కుటుంబము. ఇందులో స్త్రీ విద్య, ధనత్రయోదశి రెండు కథలు మాత్రమే ఇంతవరకు తెలుగు పాఠకులకు అందుబాటులో ఉన్నాయి.

మొసలికంటి రాంబాయమ్మ సంపాదకత్వంలో వెలువడ్డ 'హిందూ సుందరి' పత్రికలోనూ, పులుగుర్తి లక్ష్మీనరసమాంబ సంపాదకత్వంలోని 'సావిత్రి' పత్రికల్లో అచ్చమాంబ రచనలు చాలా అచ్చయ్యాయి. ఇందులో 'అబలా సచ్చరిత్ర రత్నమాల' దేశ విదేశాల్లోని వీర, ధీర వనితల ఉదాత్త చరిత్రల వ్యాస సమాహారం. ఆనాటి మహిళల్లో స్ఫూర్తి, రచనా ప్రేరణను కలిగించిందంటే అతిశయోక్తి కాదు. క్రోషా అల్లికలు మొదలు, వంటల వరకు అనేక విషయాలపై ఆయా పత్రికల్లో ఆమె రాసిన వ్యాసాలు ఇప్పటికీ అచ్చుకు నోచుకోలేదంటే తెలుగునాట మహిళల రచనలపై వెలుగు ప్రసరిస్తున్న తీరు తెలుస్తుంది.

తెలుగునాట పదుల కొలదిగా గల విశ్వవిద్యాలయాలు, స్వచ్ఛంద పరిశోధన సంస్థలు, మహిళాభివృద్ధి సంస్థలు, స్త్రీల కోసం పనిచేస్తున్న ఎన్జీవోలు భండారు అచ్చమాంబ కథలపై దృష్టి కేంద్రీకరించక పోవడం దురదృష్టకరం. తెలుగునాట పునర్వికాసోద్యమానికి 20వ శతాబ్ది ఆరంభం నుండి విస్తృతంగా పనిచేసిన అచ్చమాంబ ఆంధ్రదేశంలో మొట్టమొదటిసారిగా 1901 బృందావనీ స్త్రీ సమాజాన్ని మచిలీపట్నంలో నెలకొలిపారు. ఆ మరుసటి సంవత్సరం అక్కడే కృష్ణాపత్రిక స్థాపించబడింది. ఇదే సమయంలో తెలంగాణలో పునర్వికాసోద్యమానికి పునాదులు పడ్డాయి. అచ్చమాంబ తమ్ముడు కొమర్రాజు లక్ష్మణరావు పూనిక మేరకు హైదరాబాద్‌లో శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం స్థాపించబడింది. హైదరాబాద్ నుంచి నాగపూర్, మద్రాసు, బొంబాయిలకు రైలు సదుపాయాలు విస్తృతం కావడంతో ఈ ప్రాంతాలకు రాకపోకలు తరచుగా జరిగాయి. వీటివల్ల అచ్చమాంబ, తెలంగాణ, తెలుగు సాహిత్యం, పునర్వికాసోద్యమాలు లబ్ధిపొందాయి.

అచ్చమాంబ రాసిన కథలన్నీ ఆధునిక భావాలతో పాత్రల సంభాషణలతో, సమాజాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని రాసినవే. స్త్రీల చదువే సర్వ సమస్యలకు పరిష్కార మార్గమని నేటి 'పాపులేషన్ సిద్ధాంత' కర్తలు చెబుతున్న విషయాన్ని వందేళ్ళ క్రితమే ఆచరణకు ప్రయత్నించిన సాహసి అచ్చమాంబ. అటు బొంబాయి, ఇటు బిలాస్‌పూర్, నాగపూర్, హైదరాబాద్, మచిలీపట్నం, రాజమండ్రి, వారణాసి ఇలా చాలా ప్రదేశాలు తిరిగి తమ భావాల్ని ఉపన్యాసాలు, రచనలు, ఉత్తరాలు, పుస్తకాలు, ప్రయివేట్ టాక్స్ ద్వారా బహుళ ప్రచారంలోకి తెచ్చిన ఆమె చైతన్యం ఆచరణ నేటికీ స్ఫూర్తిదాయకం.

అచ్చమాంబ కథలన్నీ ఆధునిక భావాలకు వేదికలు. ప్రతి కథలోనూ సమాజోద్ధరణ, మహిళాభ్యున్నతి, మెరుగైన సమాజం కోసం తహతహ ప్రతి అక్షరంలో ప్రత్యక్షమయ్యేవి.

గుణవతియగు స్త్రీ కథలో పురాణకథను తీసుకొని ఆధునికతను ఆపాదించి పొదుపు ద్వారా సంసారాన్ని స్వర్గంగా ఎలా మార్చుకోవచ్చో చెప్పింది. మూడు పేజీల ఈ చిన్న కథలో అన్ని వృత్తుల్లో అభినివేషం ఉన్నట్లయితే లోకాన్ని ఎలా జయించగలమో చెప్పింది. స్త్రీ సహజ సహనం గురించి ఆమెచెప్పిన తీరు బాగుంది. లలితాశారదలు అనే పిల్లల కథలో క్షమాగుణం ఎంతటి ఉదాత్తమైందో వివరించింది. అపకారికి సైతం ఉపకారం చేయడం, నైతిక విలువలకు సంబంధించిన గుణపాఠాలు ఇందులో ఉన్నాయి. ఈర్ష్య, గర్వం ఉన్న మిత్రురాలిలో మార్పు తీసుకొచ్చిన తీరు ఆదర్శనీయం. ఇక జానకమ్మ కథలో అమ్మాయిలకు చదువు చెప్పించాలనే నినాదాన్నిచ్చింది. చదువుకోవడం వల్ల మంచి జీవితమే గాదు, మంచి వరుడు గూడా వస్తాడని ఆనాటి తల్లిదండ్రుల్లో చైతన్యాన్ని ఈ కథ ద్వారా కలిగించింది. చదువుంటే కట్నకానుకలు అవసరం లేదని 'స్త్రీవిద్య' ప్రాధాన్యతని వివరించింది. చిన్నచిన్న పొరపొచ్చాలు నిండు జీవితాలను ఎలా ఛిద్ర పరుస్తాయో తెలుపుతూ దాన్ని ఎలా అధిగమించాలో తెలిపే కథ 'దంపతుల ప్రథమ కలహం', హైద్రాబాదు జీవితాన్ని కూడా ప్రస్తావించి నిజంగా అవరమున్న వానికే దానం చేయాలని తన 'సత్పాత్రదానం' కథ ద్వారా చెప్పింది.

సంవాద రూపంలో ఉన్న 'స్త్రీవిద్య' కథలో భిన్నకోణాల్లో స్త్రీల చదువు ప్రాధాన్యతను వివరించింది. స్త్రీలు అజ్ఞానాంధ కారంలో ఉన్నట్లయితే కుటుంబం ఉన్నతికి రాదనే భావనను ఈ కథలో చెప్పింది. ఇక ధనత్రయోదశి కథలో బొంబాయికి వలసవెళ్ళిన బతికి చెడ్డ బిడ్డ మానసిక సంఘర్షణ, నిజాయితీ, నైతికత ఎన్నటికైనా మేలు చేకూరుస్తుందని చెప్పింది. దారిద్ర్యంలో ఉన్నప్పటికీ ఉన్నత గుణాలను విడువకూడదని కథ ద్వారా చెప్పింది. భార్యభర్తల సంవాదం కథలో స్త్రీలకు బంగారు ఆభరణాలకన్నా సద్గుణాలే మిన్న అనే భావనను బలంగా చిత్రీకరించింది. నిజంగా జరిగిన వృత్తాంతాన్ని తీసుకొని బీదకుటుంబం కథ ద్వారా స్త్రీ ద్వారానే కుటుంబం పరువు మర్యాదలు నిలబడతాయని చెప్పింది. గౌరవం కూడా ఆమె వల్లనే దక్కుతాయనే విషయాన్ని ఇందులో వివరించింది. 20వ శతాబ్ది ఆరంభంలో తన కథలద్వారా తెలుగు సమాజంలో ముఖ్యంగా మహిళల్లో ఆమె చెదరని ముద్ర వేశారు. ఆనాడు చదువుకున్న ప్రతి స్త్రీ ఏప్రాంతం వారైనా ఆమె ప్రభావానికి గురయ్యారంటే అతిశయోక్తి కాదు. ఎందుకంటే ఆమె కార్యాచరణ, వాక్చాతుర్యం వీటికి తోడు భిన్న ప్రదేశాల్లో వివిధ సభలు, సమావేశాల్లో పాల్గొనడం ద్వారా వారిలో ఒకరిగా కలిసి పోయారు.

వీటన్నింటితోపాటు పట్టించుకోవాల్సిన మరో ప్రధాన విషయం అచ్చమాంబ ప్రాంతం. అచ్చమాంబను ఏఒక్క ప్రాంతానికి పరిమితం చేయలేం. ఎందుకంటే ఇప్పటి నల్లగొండ జిల్లాలోని, ఒకప్పటి కృష్ణాజిల్లాలోని మునగాల పరగణా మేనేజరు కొమర్రాజు వెంకటప్పయ్య – గంగమ్మల సంతానంగా ఆమె పుట్టింది. అయితే ఆమె ఎక్కువ భాగం జీవితం గడిపింది తెలంగాణలో. రాజా నాయని వెంకట రంగారావు ప్రభావం ఆమెపై ఎక్కువగానే ఉండింది. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకున్నట్లయితే ఆవిడపై మిగతా ఏ ప్రాంతంతో పోల్చుకున్నా తెలంగాణ వారికే ఎక్కువ హక్కుంది. అచ్చమాంబ మూలాలు మాత్రం ఆంధ్ర ప్రాంతంలోనే ఉన్నాయి. 1874లో అచ్చమాంబ తాత (తల్లి–తండ్రి) వ్యాపార లావాదేవీల కారణంగా నందిగామలో ఉండిపోయారు. వీరితోపాటు గంగమ్మ కూడా అక్కడే ఉండడంతో అచ్చమాంబ నందిగామలో జన్మించింది. అయితే అచ్చమాంబ ఆరేండ్ల వయసులోనే తండ్రి చనిపోవడంతో వారి మకాం సవతి తల్లి కొడుకు కొమర్రాజు శంకరరావు దగ్గరికి మారింది. అప్పుడాయన ఉద్యోగరీత్యా నల్లగొండ జిల్లా దేవరకొండలో ఉండేవాడు. దీంతో ఈసారి పూర్తిగా ఆమె నల్లగొండ వాసిగా మారారు. ఇక్కడున్న సమయంలోనే ఓనమాలు నేర్చుకున్నారు. మేనమామ భండారు మాధవరావుతో వివాహం కూడా ఇక్కడే 1884లో జరిగింది.

వివాహం తరువాత ఆమె మకాం విదర్భకు మారింది. అక్కడ తమ్ముడితోపాటు నాగపూర్, బిలాస్‌పూర్‌లలో విద్యాభ్యాసం జరిగింది. ఇక్కడున్న కాలంలోనే గుజరాతీ, మరాఠీ, తెలుగు, హిందీ భాషలు నేర్చుకుంది. ఆయా భాషల్లోని అపారమైన సాహిత్యాన్ని తమ్ముని తోడ్పాటుతో చదవడానికి వీలయింది. భర్తతోపాటుగా ప్రతి సంవత్సరం తెలుగు ప్రాంతమంతా పర్యటించి ఉపన్యాసాలు, సభలు, సమావేశాలు నిర్వహించేది. బొంబాయిలాంటి ప్రాంతాల్లో

జరిగే అఖిలభారత కాంగ్రెస్ సమావేశాల్లో కూడా పాల్గొని విషయాల్ని తెలుసుకునేది. ఒకవైపు సోదరుడు మునగాల జమిందారీలో ఉద్యోగం చేస్తూ ఆంధ్ర-తెలంగాణ-మద్రాసు ప్రాంతాల్లో సమానంగా సాహిత్య ప్రచారాన్ని, సాంస్కృతిక పునర్వికాసానికి పునాదులు వేయగా, మరోవైపు అచ్చమాంబ మహిళాలోకంలో తిరుగులేని మార్పుల్ని తీసుకువచ్చింది.

తన కథల ద్వారా సమాజంలో మార్పులు తీసుకు రావడానికి విశేషమైన కృషి చేసిన భండారు అచ్చమాంబ గురించి ఈనాడు ఏ పాఠ్యపుస్తకంలోనూ ఆమె గురించి లేదు. కేవలం కథలే గాకుండా అబలా సచ్చరిత్ర రత్నమాల పేరిట తెలుగులో మొట్టమొదటి సారిగా మహిళల జీవిత చరిత్రల్ని రాసింది. క్రోషా అల్లిక, వంటలు, కుట్లు వంటి మహిళలకు సంబంధించిన విషయాల్ని పట్టించుకొని వాటి ప్రచారానికోసం తన జీవితాన్ని వెచ్చించారు. కేవలం రాతలకే పరిమితం గాకుండా ఆచరణలో అనాథ పిల్లల్ని ఆదుకున్నారు. తనకు పుట్టిన పిల్లలు దక్కలేదు. దాంతో ఆవిడ అనాథ పిల్లల్లోనే తన పిల్లల్ని చూసుకుంటూ వారి బాగోగుల్ని పట్టించుకునేవారు. 1904 చివర్లో బిలాస్‌పూర్‌లో ప్లేగువ్యాధి వచ్చిన సందర్భంలో అనాథ పిల్లల్ని చేరదీసి వారి ఆలన పాలన చూశారు. పిల్లల నుంచి ఆ వ్యాధి ఆమెకు సోకి వారి సేవలోనే 1905 జనవరి 19న అచ్చమాంబ మరణించారు. కేవలం 30 ఏండ్ల జీవితంలోనే కొన్ని వందల సంవత్సరాలకు సరిపడా కృషిని, ఆచరణను మనందరికీ అందించిన అచ్చమాంబ ఆశయాలను అమలు పరచడమే ఆవిడకు నిజమైన నివాళి.

# 16 భావానంద భారతీ స్వామివారు

– డా॥ ఎం. దత్తాత్రేయ శర్మ

ఇరవయ్యవ శతాబ్దపు తొలి ఉషోదయ రేఖలు జగతిని జాగృతం చేస్తున్నవేళ, నైజాం కరకు నిరంకుశ నియంతృత్వ పాలనలో, రజాకార్ల భయంతో తెలంగాణ ప్రజలు మలమలా మాడుతున్నవేళ, ఒక ఆధ్యాత్మిక తేజోమూర్తి అవతరించి కొత్త శతాబ్దానికి జ్ఞానభిక్షనందించి తన కర్తవ్యాన్ని నిర్మలంగా నిర్వహించారు.

మారుతున్న సామాజిక విలువల నేపథ్యంలో భారతీయుల భక్తిభావనా బలసంపదను తెలంగాణ ప్రజల హృదయాంతరాలలో నింపి సక్రమ పథ నిర్దేశకులై నిష్క్రమించిన ఆ పరివ్రాజక శ్రేష్ఠులే శ్రీ భావానంద భారతీ స్వామివారు.

నాటి మెదక్ జిల్లా(నేటి సిద్దిపేట జిల్లా)లోని మరుకూకు ప్రాంతంలో అపర పండరీ పురమునందున శ్రీ పాండురంగా శ్రమ వ్యవస్థాపకులై, నిరతాన్నదానం, నిరంతర నామ సంకీర్తనలతో ఆర్తజనపరాయణతను, భక్తిభావ తత్పరతను ఏక కాలంలో చాటిన స్వామి వారి జీవితం – తరతరాలకు ఆదర్శప్రాయం.

"నాదం-సాదం" అన్నవి స్వామి వారి నినాదాలు. నిత్య భక్తి సంకీర్తనలతో అపర పండరీపురాన్ని, నిరతాన్నదానంతో అపర కాశీక్షేత్రాన్ని ఆశ్రమంలో ఆవిష్కరించిన స్వామి వారి ఆదర్శనం అందరికీ అనుసరణీయం.

తెలంగాణను ఆధ్మాత్మిక భక్తిభావంతో ఓలలాడించిన భావానంద భారతీ స్వాముల జీవనం అతిపవిత్రమైనది. తమ భక్తులనేకాక సమస్త ప్రజానీకాన్ని నిర్వ్యాజ ప్రేమతో అలరించిన స్వామివారి జీవితం మహోన్నత మానవతా దర్శాలకు నిలయమైనది. అఖండ వైరాగ్య సంపన్నులు, అపార త్యాగధనులు, భావనాబల సంపన్నులు భావానంద యతీంద్రులు. దీనజన బాంధవులుగా అన్నార్తుల పాలిట నిరతాన్నదాతగా, నిలిచిన స్వామివారు శ్రీ మహావిష్ణ్వంశ సంభూతులుగా అవతరించినారని భక్తులందరి ప్రగాఢ విశ్వాసం.

తీర్చి దిద్దినట్లుండే అయన సౌష్టవం, నిలిమేఘు చ్ఛాయతో అలరారే దేహం, అపారకరుణామృతాన్ని ప్రసరింపజేసే నేత్రద్వయం, అంతులేని ప్రశాంతతకు ఆలవాలమైన వదనారవిందంతోబాటుగా వక్షస్థలంపై శ్రీవత్స లాంఛనమైన పెద్ద పుట్టుమచ్చతో సాక్షాత్తుగా భూమిపై చరించే "విష్ణువితడే" అనిపించేవారు భావానందుల వారు. వారి పూర్వాశ్రమ నామధేయం అప్పాల సత్యనారాయణ. అందుకే భావంలోను, ప్రభావంలోనూ పూర్వాశ్రమ నామంలోనూ అక్షరాలా విష్ణుకల్పుడై, విశుద్ధమనస్కుడై భావానందుల వారు భాసిల్లినారు. కారణజన్ముడైన, శ్రీవారిని భక్తులంతా ఏకాదశావతారంగా సంభావించి వారి సందేశాలను అనుసరించేవారు.

తెలంగాణ సీమలోని వరంగల్లులో (నేటి వర్గల్ మండల కేంద్రం) సనాతన వైదిక బ్రాహ్మణ దంపతులైన

శంభయ్య రత్నమ్మల గర్భశుక్తి ముక్తాఫలంగా జన్మించారు సత్యనారాయణగారు. రత్నమ్మగారి కలలో ఒక దివ్య పురుషుడు కనబడి మామిడి పళ్ళ గంపనందించి 'ఇవన్నీ నువ్వేతిను' అంటూ మాయమైపోయాడట. ఆ దివ్య స్వప్న విశేషఫలమేమో అదే నెల ఆమె గర్భాన్ని దాల్చింది. శంభయ్యగారి నిరంతర శంభు సేవాఫలితంగా 1899వ సంవత్సరం అక్టోబర్ నెలలో పండంటి బిడ్డడు కలిగాడు. అతడే మహాత్ముడైన భావానంద భారతీ స్వామిగా పరిణతి చెందాడు.

ముద్దులొలికే పసివాని ఛాతీపై అరచేయంత పుట్టుమచ్చను చూసి అందరూ ఆశ్చర్యచకితులయ్యేవారు. జాతక చక్రం వేయిస్తే ఈ బాలుడొక మహాత్ముడౌతాడని, గురూత్తముడై యతిశ్రేష్ఠుడౌతాడని తేలింది. దీర్ఘాయుష్షు కలిగి ఉంటాడని, తాను తరించి లోకాన్ని తరింపజేసి బ్రహ్మ సాయుజ్యాన్ని చేరుకుంటాడని తెలిపిన యోగలక్షణాలు తల్లిదండ్రులను ఆనంద పరవశుల్ని చేశాయి.

చిన్నతనం నుండే సత్యనారాయణుడి ఆదర్శ నడవడిక ఆహ్లాదాన్ని పంచేది. అల్లారు ముద్దులతోనే హరిసంకీర్తనం అందరినీ ఆనందాంబుధితో ఓలలాడించేది. బంధు హితులందరికీ సత్యనారాయణ అంటే వల్లమాలిన అభిమానం ఏర్పడింది.

ఆనాటి మ్లేచ్ఛపాలనలో భక్తి రహితమైన జీవనాన్ని గడిపే స్థితిలో మన మహాత్ముని జననం ఒక చారిత్రక ఆవశ్యకతగా మారింది.

తల్లిదండ్రులతో బాటే వరగల్లు నుండి మరుకూకుకు మకాం మారింది. ఐదవయేటనే సత్యనారాయణకు అక్షరాభ్యాసం మొదలైంది. ఏకసంథాగ్రాహిగా, కమ్మని కంఠంతో పద్యాలు-పాటలు ఆలపించేవారు. గర్భాష్టమంలో ఉపనయన సంస్కారం జరిగింది. తండ్రిగారి వద్ద పొందిన బ్రహ్మోపదేశంతో నిత్యం త్రికాల సంధ్యావందనం, వేలకొలది గాయత్రీ మంత్రానుష్ఠానం గావించేవాడు బాల సత్యనారాయణ.

''త్యాగేనైకే అమృతత్వమానశుః'' అన్నట్లుగా తమకున్నదాంట్లోనే అందరికీ అన్నీ పంచిపెట్టే తత్వం సత్యనారాయణునిది. తమ సంసారం కోసం కాక విశ్వసంసారం కోసం పసితనం నుండే పరితపించే వారాయన.

తమ సమీప బంధువు మాముదాల రామచంద్రయ్య గారి వద్ద వైదిక విద్యనభ్యసించారు కొంతకాలం. కేవలం రెండేళ్ళలోనే షోడశసంస్కార విద్యనవపోశన పట్టి, మృదుమధుర గాత్రంతో గురువుగారి మనసునాకట్టి వారి కుమార్తె యశోదమ్మను తమ ఇల్లాలిగా చేసుకున్నారు. సహజసిద్ధమైన కవితాధార అలవడింది. దానితోబాటే నిత్యం భజన సంకీర్తనలు నెరిపేవారు.

"సంసారంలో నరుడు ఉండవచ్చును కానీ నరునిలో సంసారం ఉండరాదు. హరి ఉండాలి" అన్నది శ్రీవారి సందేశం. ఇందుకు వారి జీవితమే ఆదర్శం. నిస్సార సంసార విజృంభణా తిరస్కార శుద్ధాంతరంగులు సత్యనారాయణ గారు. "సంసారమునందు నేనే కర్తనని అభిమానించేవాడు బద్ధుడు. భగవంతుడే మహాకర్తయని సంసారమున నిరహంకారముగా అనాసక్తితో మెలగువాడు ముక్తుడు" అన్నది వారి అభిమతం.

'భార్యతో కాపురం చేయాల్సిన వయస్సులో ఈ వైరాగ్య చింతనమెందుకని' తండ్రిగారి వాదనను సున్నితంగా తిరస్కరించి నిరంతర భగవదారాధనతో, భజనలతో కాలం గడిపేవారు.

మరుకూకు గ్రామంలో ప్లేగు వ్యాధి ప్రబలింది. గ్రామస్థులంతా ఊరికి దూరంగా గుడిసెలు వేసుకొని ఆరుబయట నివసించసాగారు. సత్యనారాయణగారు కూడా ఓ గుడిసెలో ఉంటూ గ్రామస్థులతో భజనలు చేయించ సాగారు. మృత్యుభయంతో అల్లాడిపోతున్న వారికి ఈ భజనలు ఊరటనివ్వసాగాయి. కొందరేమో ఈ భజనలకు రాక దూరంగా ఉండి విమర్శలు చేయసాగారు.

భగవంతునిపై భారం వేసి సత్యనారాయణ గారిచ్చిన అభయంతో ప్లేగు వ్యాధి భయాన్ని వీడిన వారెందరో. ఒక ఆంతరంగిక శిష్యుడు శివయ్య ప్లేగు బారిన పడగా శ్రీవారు ఆధ్యాత్మరామాయణ పారాయణతో వ్యాధిని పోగొట్టి రక్షించారు. కాని విధివశాత్తు శ్రీవారి తండ్రిగారు ఈ వ్యాధికే గురై తుదిశ్వాస విడిచారు.

ఆనాటి గ్రామీణ ప్రజానీకం దుస్థితిని చూసి నారాయణ గారు చాలా బాధపడేవారు. నైజాం నిరంకుశ పాలనలో గ్రామాధికారులు, నవాబులు, జమీందార్లు ప్రజలతో వెట్టిచాకిరీ చేయించుకొనే దుర్దినాలవి. పెద్దల హుకుంల

కింద నలిగిపోయే పేదలను చూసి గుండెలవిసేలా రోదించేవారు నారాయణ గారు. ఉత్తమ సంస్కారం లేక, చదువు సంధ్యలు రాక, కటిక దారిద్ర్యంతో అలమటించే ప్రజలను చూసి వారు విలవిలలాడిపోయేవారు.

"నీకున్నదంతా ఈశ్వరునిదే అని భావించి, రేపటికి ఉంచుకోకుండా, లేనివారికి పేద ప్రజలకు దయాభావంతో పంచిపెట్టు-నీ కొరకై చింతించకు" అని ఉద్బోధించేవారు.

ఈశ్వరుని పట్ల విశ్వాసంతో నిరంతర భగవన్నామ సంకీర్తనలతో తాళ నృత్య లయగతులతో బిడియాన్ని వదలి గొంతెత్తి బిగ్గరగా ప్రేమతో భజనలు చేస్తూ, చేయిస్తూ గ్రామస్థులందరినీ ఆకట్టుకొన్నారు. ప్రతి వ్యక్తిలో పరమాత్మను దర్శించి ఆదరించేవారు. నిరక్షరకుక్షులైన గ్రామీణులు సైతం శ్రీవారి ఉపదేశాలతో, భజన సంకీర్తనలతో తన్మయులై పోయేవారు. 1922-23 నుండి 1932-33 వరకు మెదక్, రంగారెడ్డి, నల్లగొండ, హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ జిల్లాలలో గల అనేక గ్రామాలకు ఈ భక్తి ఉద్యమం వ్యాపించింది. అప్పట్లో నారాయణగారిని ఒక మహాత్మునిగా, ఒక భక్తునిగా, ఒక దైవాంశ సంభూతునిగా, ఒక అవతార పురుషునిగా, ఒక ఆధ్యాత్మికవేత్తగా, ఒక నవయుగ వైతాళికునిగా ఆనాటి పండితులు, పామరులు, కవులు, శాస్త్రవేత్తలు, వేదవిదులు, జమీందారులు, సామాన్య ప్రజలందరూ గుర్తించి గురూత్తమునిగా శ్రద్ధాభక్తులతో వారిని పూజించేవారు. ఆరాధించేవారు. అప్పటినుండి సత్యనారాయణగారు 'నారాయణ బాబా'గా ఆరాధనీయులయ్యారు.

గ్రామంలోని కొందరికిది కంటగింపు కలిగించింది. 'మీరు చేసే భజనల వల్ల రాత్రంతా మేల్కొని ఉండాల్సి వస్తుంది. తెల్లారి వ్యవసాయ పనులకు వెళ్ళలేకపోతున్నాం. తత్ఫలితంగా ప్రజలు సోమరులయ్యే అవకాశం ఉంది. మీ భజనలు మానుకోండి. లేదా మా గ్రామాన్ని వీడి వెళ్ళండి' అని గ్రామ పెద్ద హెచ్చరించారట.

అఖండ వైరాగ్య సంపన్నులైన నారాయణ బాబా గారు ఏ మాత్రం జాగుచేయక గ్రామం వదిలి వెళ్ళడానికి సిద్ధమయ్యారు. కానీ సజ్జనులైన కొందరు భక్తుల విజ్ఞప్తి మేరకు గ్రామానికి 5 కి.మీ దూరంలోని నిర్జరారణ్యంలో ఒక ప్రాంతాన్ని ఎన్నుకొని ఈశ్వరాజ్ఞతో అక్కడే నివసించసాగారు. తాము స్వయంగా కాలినడకన పండరీపురం వెళ్ళి తెచ్చిన శ్రీ రుక్మిణీ పాండురంగ స్వామి విగ్రహాలను ఒక వేదికపై నిలిపి వేరే గుడిసెలో భార్యా బిడ్డలతో నివసించసాగారు. ఆ నిర్జరారణ్యమే శ్రీపాండు రంగాశ్రమమైంది. అక్కడి నుండి శ్రీవారి ఆధ్యాత్మిక భక్తిభావ తరంగాలు అంతటా వ్యాపించసాగాయి.

ప్రతియేటా ఆషాఢ మాసంలో ఆషాఢి ఉత్సవాలు ఘనంగా జరుపసాగారు. తొలి ఏకాదశి (ఆషాఢశుద్ధ ఏకాదశి) రోజున వేలాది మంది భక్తులు రోజంతా ఉపవాసం, జాగరణ జరిపి, ద్వాదశి ఉదయాన తృప్తిగా భోజనాలు చేస్తారు. 1932లో ప్రారంభమైన ఆషాఢి ఉత్సవాలు నేటి వరకు నిరాఘాటంగా సాగుతున్నాయి. దినదినాభివృద్ధి గాంచిన ఈ ఉత్సవాలు రంగరంగవైభవంతో కూడిన భక్తోత్సవాలుగా మారిపోయి వేలాది మంది భక్తులకు అన్నసంతర్పణ జరుగుతుంది. ఒక్క ఆషాఢ శుద్ధ ద్వాదశి రోజునే 25 వేల మంది వరకు భోజనాలు చేస్తారు. నిత్యాన్నదానం ఈ ఆశ్రమంలో నేటికీ నిరుపమానంగా కొనసాగుతోంది.

"దేహ పోషణకై ఎక్కువ ఆశపడకండి-రుచికై తినకండి. ఆకలికై భుజించండి. బీదలను కన్నబిడ్డలవలె ఒక కంట చూడండి. భోజనం దుర్వినియోగం కానివ్వకండి. తల్లిదండ్రులను సేవించండి" అని చాటిన శ్రీవారి ఉపదేశం వెనుక సర్వోపనిషత్తుల సారమంతా నిబిడీకృతమై ఉంది. అన్నాన్ని పరబ్రహ్మ స్వరూపంగా భావించడమేకాకుండా అన్నదాన వ్రతాన్ని జీవన కర్తవ్యంగా ఆచరించి తమ ఆర్తత్రాణ పరాయణతను చాటుకొన్నారు.

44 ఏళ్ళ జీవితకాలంలోనే బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ ఆశ్రమాలను ఆచరించిన నారాయణ బాబా గారు 1943 మే నెల 6వ తేదీన తురీయాశ్రమమైన సన్న్యాస ఆశ్రమాన్ని స్వీకరించారు. నాటి నుండి వారు శ్రీశ్రీశ్రీ భావానంద భారతీ స్వామిగా లోకవిఖ్యాతులయ్యారు. వారికి దైవిక ప్రేరణతో సన్యాస దీక్షనిచ్చింది శ్రీ పాండురంగడే. ఆశ్రమ స్వీకారానికి కాషాయాంబరాలను అందించినది కాసుల రామచంద్రయ్యగారనే మరొక మహనీయుడు. ఈ రామచంద్రయ్య గారే తదనంతరం అఖండానంద సరస్వతీ స్వామిగా తురీయాశ్రమాన్ని స్వీకరించారు. అదే విధంగా దండకమండలాదులు అన్నీ అసంకల్పితంగా భావానంద

భారతీ స్వాములకు లభించడం విశేషం.

పాండురంగాశ్రమంలోనే ఒక పెంకుటింట్లో స్వామివారు నిరాడంబరంగా నివసించేవారు. జీవన్ముక్తులైన యశోదమ్మగారు (శ్రీవారి పూర్వాశ్రమ సతీమణి), నరసమాంబ(శ్రీవారి పూర్వాశ్రమ సోదరీమణి), ఈశ్వరయ్య(శ్రీవారి ఆంతరంగిక సేవకుడు), విశ్వనాథశర్మ(శ్రీవారి పూర్వాశ్రమ పుత్రుడు)మొదలైన వారంతా ఆశ్రమంలో నివసిస్తూ శ్రీవారి ఆధ్యాత్మ సేవాతత్పరులై జీవించేవారు.

నిరంతర హరినామస్మరణాన్ని 'నాదం'గా-నిత్యాన్న దానవ్రతాన్ని 'సాదం'గా ఆచరించిన స్వామివారు ఆశ్రమ పంటపొలాలను సేద్యం చేసి, ఫలించిన ధాన్యాన్నే అన్నదానంగా వచ్చిన అతిథులకు సంతర్పణం గావించేవారు. అనంతరం వారి కష్టసుఖాలను గూర్చి అత్యంత ఆత్మీయులుగా ప్రశ్నించి తెలుసుకొని తగు ఉపాయాలను తెలుపుతూ భగవన్నామాన్ని స్మరించమని, భవతరణకు భగవన్నామమే శరణమని తెలిపేవారు. "ప్రతి శ్వాసలో ఈశ్వరునిపై విశ్వాసము కల్గి ఉండమని ప్రతి శ్వాసను తుదిశ్వాసగా భావించి ఈశ్వర నామ జపము చేయ"మని ప్రబోధించేవారు.

ఒక్క భావనాశక్తితో సర్వమూ సాధించవచ్చని స్వానుభవ పూర్వకంగా చాటి చెప్పారు.

రజాకార్ల విజృంభణతో తెలంగాణలోని పల్లెసీమలో కాలరాత్రులు విలయతాండవమాడిన వేళలో శ్రీ స్వామివారు 'రానున్నది ఘోరకాలము, మనకందరికీ పరమాత్ముడే దిక్కు-భగవన్నామాన్ని సామూహికంగా జపించండి. ఈశ్వర శరణాగతి తప్ప వేరొక దిక్కులేదు' అని ఎలుగెత్తి చాటి చెప్పారు.

ఆశ్రమాన్ని ధ్వంసం చేయాలనే కుత్సితంతో వచ్చిన రజాకార్లు – దోపిడీకై వచ్చిన కమ్యూనిస్టులు అందరూ కూడా ఆశ్రమంలోకి అడుగు పెట్టగానే భక్తిభావ పులకితాంగులై... కమ్మగా భోజనం చేసి వచ్చిన పని మర్చిపోయేవారట.

రామకృష్ణ పరమహంస మాదిరిగానే సాక్షాత్తు ఈశ్వర సందర్శనం గావించుకొన్న ధన్యాత్ములు భావానందభారతీ స్వామివారు. పలుమారులు రాధాకృష్ణుల దర్శనాలతో అలౌకికానంద తన్మయత్వాలలో మునిగితేలిన లీలాలోలురు శ్రీ స్వామివారు. 'సంసార సాగరాన్ని దాటి స్వామిని చేరుటకు నామస్మరణమే నావ' అంటూ కృత, త్రేతాయుగాలలో కఠినోపాసులకే కనిపించేవాడు భగవంతుడు. మరి ఇప్పుడో సులభమైన 'నామస్మరణ'కే తన పరమపదాన్ని ఇస్తాడని సులభతరుణోపాయాన్ని సూచించారు.

'యద్భావం తద్భవతి' అన్న మాటను నిరూపిస్తూ సచ్ఛీలసద్భావ పరంపరలతో భగవదనుగ్రహాన్ని పొందవచ్చునని స్వానుభవంగా చాటుతూ 'భావమేబలం' అన్నారు భావానందుల వారు.

ఈ సద్భావం ఎలా కలుగుతుందంటే 'మహాత్ములు స్పర్శవేది లాంటివారు. స్పర్శవేదివల్ల ఇనుము బంగారంగా మారినట్లు మహాత్ముల హస్తమస్తక సంయోగంతో పతిత జీవులు సైతం సద్భావాన్ని కలిగి తరిస్తారన్నారు. నిజంగా అలాంటి సద్భావాన్ని కలిగించే స్పర్శవేది శ్రీ భావానంద భారతీ స్వామివారు.

ప్రయత్నం, ప్రారబ్ధం అనే రెండింటిలో ప్రయత్నాన్ని పరమాత్మ సేవకు, ప్రారబ్ధాన్ని సంసారానికి వాడుకొమ్మని చెప్పిన స్వామివారి మాటలు అనర్ఘరత్నాలు. తపశ్చక్రవర్తిగా, పరిపూర్ణ జీవితానుభవ సంపన్నులుగా, అపార భక్తవాత్సల్య మూర్తిగా, కృష్ణాద్వైత సిద్ధాంత స్థాపకులైన యతీశ్వరులుగా ఈ భువిపై నడయాడిన భావానంద భారతీస్వామి 1960వ సంవత్సరం ఆగస్టునెల 10వ తేదీ శార్వరీ శ్రావణమాసం చతుర్థినాడు 60 వసంతాలను పూర్తిచేసుకుని తన చిన్మయ సచ్చిదానందలోకానికి చేరుకున్నారు.

స్వామి వారు స్థాపించిన శ్రీ పాండురంగ ఆశ్రమం నేటికీ ఒక పవిత్ర తపోవనంగా అలరారుతుంది. రుక్మిణీ పాండురంగస్వాముల, శ్రీ సీతారామలక్ష్మణులు, శివపంచాయతన ఆలయాలతో క్షేత్ర పాలకుడైన ఆంజనేయస్వామి వారితో ఈ ఆశ్రమం పరమ రమణీయంగా ఉంటుంది.

17

# భీంరెడ్డి నరసింహారెడ్డి

–డా॥ ఏనుగు నరసింహారెడ్డి

భారతదేశపు 20వ శతాబ్దం ఎన్ని మార్పుల్ని చవిచూసిందో హైదరాబాద్ సంస్థానం, తెలంగాణ అంతకు రెట్టింపు అలజడుల్ని ఎదుర్కొన్నది. 1930లలోనే దేశ స్వాతంత్ర్యం ఖాయమైపోయిన సంగతి ఒకవైపు రాజకీయ నాయకులకు, మరోవైపు స్వదేశీ సంస్థానాధీశులకు అవగతమైపోయింది. 1942 తర్వాత స్వతంత్ర భారతంలో తమతమ స్థానాల్ని ప్రధాన స్రవంతి రాజకీయ నాయకులు, సంస్థాన ధీశులు ఊహించుకుంటూ వచ్చారు. చాలామంది స్వతంత్ర రాజవంశీకులు, సంస్థానాధీశుల వంశీకులు ఢిల్లీ పాలకవర్గాలలో సర్దుబాటుకు ప్రయత్నించారు. ఒక్క కాశ్మీరు నవాబు, నిజాం నవాబు ఇందుకు భిన్నం. స్వాతంత్ర్యం వచ్చిన రోజున నిజాం నవాబు ఒక ప్రకటన చేస్తూ హైదరాబాద్ సంస్థానం అటు పాకిస్తాన్‌లో కానీ, ఇటు ఇండియాలో కానీ విలీనం కాదని హైదరాబాద్ ఒక స్వతంత్ర దేశంగా ఉంటుందని ప్రకటించాడు. ఆగస్టు 15, 1947 నాటి ఈ ప్రకటనకు పూర్తి భిన్నంగా సెప్టెంబర్ 17, 1948 రోజున స్వయంగా ఏడవ నిజాం ఒకప్రకటన చేస్తూ హైదరాబాద్ సంస్థానం స్వతంత్ర భారతదేశంలో విలీనమవుతున్నట్లు ప్రకటించాడు.

ఈ రెండు ప్రకటనలకు మధ్య కాలంలో హైదరాబాద్ సంస్థానం అనేక అలజడులతో అట్టుడికింది. ఒకవైపు స్టేట్ కాంగ్రెస్ సత్యాగ్రహాలు విలీనం దిశగా ఒత్తిడి చేస్తుంటే, మరోవైపు ఖాసీం రజ్వీ నడిపిన రజాకార్ ఉద్యమం హైదరాబాద్‌ను ఇస్లామిక్ స్టేట్‌గా ఉంచాలని పోరాడింది. ఈ రెండింటి కన్నా ఎక్కువ తక్షణ కారణాలతో భూస్వామ్య వ్యవస్థ పతనానికి సాయుధపోరాటం నడిచింది. కమ్యూనిజం ఆలంబనగా నడిచిన ఈ రైతాంగ పోరాటం ప్రపంచానికి ఒక నమూనాగా చరిత్రచెక్కింది. ప్రజల త్యాగాలే ఈ పోరాటాన్ని ముందుకు నడిపించాయి. ఈ పోరాటమే ప్రజల నుండి నాయకుల్ని తయారుచేసింది. రావి నారాయణ రెడ్డి, సుందరయ్య, నల్లా నర్సింలు, ధర్మభిక్షం, మల్లు స్వరాజ్యం ప్రజానాయకులుగా ఉద్భవించారు. అలాంటి నాయకుల్లో ఆణిముత్యం భీంరెడ్డి. ఆయన గుత్పబట్టిండు, తుపాకీ బట్టిండు, ఎంతో మంది దొరల సంతతిని, రజాకార్లను చంపిండు. చావును మెరుపువేగంతో తప్పించుకుండు. చిత్రహింసలు భరించిండు. ఎమ్మెల్యే, ఎంపీ అయినా ప్రజారాజకీయం చేసిండు.

ఆపివేయవలసి ఉండిందని ఒక వర్గం వాదన. ఇంకొక వర్గం వాదన ప్రకారం మహోత్తుంగ తరంగంలాగా నడుస్తున్న సాయుధ పోరాటాన్ని ఒక ప్రణాళికాబద్ధంగా, ప్రభుత్వంతో పరస్పర చర్చల ద్వారా విరమించినట్లయితే అజ్ఞాతంలో ఉన్న యోధులు ఎలాంటి చిక్కులు లేకుండా ప్రజాజీవితంలోకి రాగలగడంతో పాటు పేదలకు పంచిన భూములకు చట్టబద్ధత వస్తుంది. ఈ రెండవ వాదనకే బి.ఎన్. మొగ్గుచూపారు. కానీ ఆయనకు ఎలాంటి సమాచారం లేకుండానే పోరోటం అలా కొనసాగించవలసి ఉండెనని

మరొక వర్గం వాదన కూడా ఉంది. ఏది ఏమైనా తెలంగాణ సాయుధపోరాటం కమ్యునిస్టుపార్టీకి దొరికిన ఒక గీటురాయి. దాన్ని వాళ్ళెంత బాగా ఉపయోగించుకున్నారు? వామపక్ష ఉద్యమాన్ని నిర్మించడానికి, మార్క్స్ సిద్ధాంతాన్ని ప్రయోగం చేయడానికి కమ్యూనిస్టు పార్టీకి ఆయాచితంగా కలిసి వచ్చిన అవకాశం తెలంగాణ రైతాంగ పోరాటం. అలాంటి చారిత్రక సందర్భంలో తప్పనిసరై ఇచ్చిన సాయుధపోరాటం పిలుపును ఉపసంహరించుకోవడానికి సమయం వచ్చినప్పుడల్లా ప్రయత్నించింది ఆంధ్రమహాసభ. భువనగిరిలో జరిగిన మహాసభ నుండి ప్రారంభమైన 'గుత్పసంఘాలు' 1949-50ల వరకైనా కొనసాగినాయంటే అందుకు కారణం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం కాదు. నాయకత్వాన్ని తమ త్యాగమయపోరాటాలతో ఒప్పించిన పోరాట యోధులదే. అందులో అగ్రగణ్యుడు భీంరెడ్డి నరసింహారెడ్డి.

భారత యూనియన్ సైన్యాలు 1948 సెప్టెంబర్‌లో సంస్థానంలోకి ప్రవేశించినప్పుడు ఏక పక్షంగా సాయుధ పోరాటాన్ని విరమించాలని నిర్ణయం తీసుకుంది పార్టీ నాయకత్వం. అప్పటికి అందరికీ కమ్యూనికేషన్ చేయలేని స్థితిలో ఉన్న పార్టీ సగంలో ఉన్న భూపంపిణీ, వందల గ్రామాలలో ఏర్పాటైన గ్రామకమిటీల భవిష్యత్తును వారు పణంగా పెడుతున్నారని భావించిన పోరాట యోధుడు భీంరెడ్డి అతి కష్టం మీద 1950 తర్వాత కానీ పోరాటాన్ని విరమించలేదు. పోరాటాన్ని విరమించినప్పటికీ, దాన్ని విరమించిన విధానంపై భీంరెడ్డికి సంతృప్తి లేదు. ఈ విషయాన్ని ప్రతి సందర్భంలో ఆయన ప్రస్తావిస్తూ ఉండేవారు. పార్టీ రెండుగా విడిపోవడం ఆ తర్వాత ఎం.ఎల్.పార్టీ ఏర్పడడం ఈ నేపథ్యంలోంచి వచ్చిన సంగతి తెలిసిందే.

ప్రత్యక్షంగా తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని పోరాడిన బి.ఎన్.ఎన్నో దాడులకు రూపకల్పన చేసిండు. కొన్ని వందల మంది పోలీసులను, భూస్వాముల గూండాలను చంపే ప్రణాళికలు వేసిండు. వేలాది మంది పోరాటయోధులను, సహచరులను తయారు చేసిండు. తన కళ్ళెదుటే వాళ్ళు చనిపోయిన దయనీయ సంఘటనలను జీర్ణించుకుండు.

భూమికోసం, భుక్తి కోసం ప్రాణాల్ని ఫణంగా పెట్టే పోరాటం చేయాల్సివచ్చిన ఆకాలపు విషాదాన్ని ఎదురొడ్డి నిలిచిండు. ఆయన జ్ఞాపకాలు మరుపురాని చరిత్ర.

సుందరయ్య, రావి నారాయణ రెడ్డి పుస్తకాల్లో నామమాత్రంగా భీంరెడ్డి పోరాటం గురించిన వివరాలున్నాయి. కానీ వాళ్ళు పోరాటకాలంలో గ్రామాల్లో తిరిగింది ప్రత్యక్ష తిరుగుబాట్లలో పాల్గొంది తక్కువ. అలాగే భీంరెడ్డి పార్టీ సభల్లో సమావేశాల్లో హాజరైంది, గ్రూపులు కట్టిందీ తక్కువ. అందుకే ఆయన గురించిన సమగ్రమైన వివరాలు ఏ గ్రంథంలోనూ లభించవు. కేవలం కట్టె శంకర్రావు ఇటీవల తీసుకువచ్చిన 'భీంరెడ్డి నరసింహారెడ్డి అనుభవాలు' అనే పుస్తకంలో తప్ప. చివరికి ఆ గ్రంథంలోనూ శ్రీ బి.ఎన్. చెప్పిన అనుభవాల్లో కల్పనలు, తమ పోరాటాన్ని గ్లోరిఫై చెయ్యడాలు అక్కడ కనిపించవు. సుమారు ముప్పై అధ్యాయాల క్రింద రికార్డు చేయబడ్డ ఈ పుస్తకంలో కొండావెంకటరంగా రెడ్డి గ్రూపుకూ, రావి నారాయణ రెడ్డి గ్రూపుకూ మధ్య విభేధాల గురించి, ఆంధ్రమహాసభలో ఆధిపత్యం కోసం దొంగ సభ్యత్వాల్ని తయారు చేయడం లాంటి కుట్రల గురించి స్పష్టంగా వివరించిండు. వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా కోసుకు వీసం చెల్లించాలని ఉన్న ప్రభుత్వాదేశాల్ని సబ్ ఇన్‌స్పెక్టర్‌కు గుర్తు చేసిన సంఘటన ఆనాటికి సాహసమే. ఆ సాహసానికి ప్రతిఫలమే దొంగరాత్రి భీంరెడ్డి ఇంటిపై పోలీసుల దాడి, తెల్లారి అరెస్టు. ఇలాంటి అనేకానేక చిన్నచిన్న సంఘటనాల నుండి చాకలి ఐలమ్మ పంట రక్షణ కోసం పోరాటం చేసి తీరాలనే నిర్ణయం తీసుకుంది సంఘం. అందులో భీంరెడ్డి తీసుకున్న చొరవకు, ధిక్కారానికి విసునూరు రాంచంద్రారెడ్డి నుండి పెద్ద దాడి ఎదురైంది. భీంరెడ్డితోపాటు కట్కూరి రాంచంద్రారెడ్డి, చకిలం యాదగిరి రావు, నల్లు ప్రతాపరెడ్డి, వెంకటేశ్వర రావు, కోట వెంకటరెడ్డిలపై దొమ్మి కేసు పెట్టి అరెస్టు చేశారు. విపరీతంగా హింసించారు. ఎంతఘోరమైన హింసకు గురిచేశారంటే 'ఆసనంలో కారం చల్లి రూళ్ళకర్రతో కూర్చారు'.

భీంరెడ్డి కళ్ళెదురుగానే దొడ్డి కొమరయ్యను తుపాకీతో కాల్చి చంపారు విసునూరు దేశ్‌ముఖ్ గూండాలు. ఇక అప్పటి నుండి తిరుగుబాటు, అణచివేత తీవ్రరూపం దాల్చాయి. నిజాం సైన్యం, పోలీసులు, స్థానిక దేశ్‌ముఖ్‌ల

గూండాలు వందలాది మందిని హతమార్చాయి. బి.ఎన్. అనుభవాలు చదువుతుంటే కళ్ళు చెమర్చుతాయి. ఆనాటి పోరాట గమనాన్ని చూస్తే కొంత ఆవేశం, ఆవేదనా కలుగుతాయి. సుప్రతిష్టమైన నిజాం ప్రభుత్వంలోని భూస్వాములు దేశ్‌ముఖ్‌లపై పోరాటం చేయడమే అతి పెద్ద సాహసం. దానికి భారత ప్రభుత్వ సహకారం కోసం ప్రయత్నం చేసే ఏ వేదికా లేకపోవడం పెద్ద విషాదంగా భావించవచ్చు. పైగా భారత ప్రభుత్వసైన్యం కూడా రజాకార్లపై దాడి మిషతో సాయుధ పోరాటయోధుల్ని వేటాడడం చూస్తే ఒకింత విషాధం ఆవరిస్తుంది.

నిజాయితీకి, పోరాట పటిమకూ నిలువుటద్దమైన భీంరెడ్డి అనుభవాల్ని చదువుతుంటే అంతర్లీనంగా దిక్కుతోచని అయోమయంలో కొట్టుమిట్టాడుతున్న నిజామాంధ్ర ప్రజానీకం కనిపిస్తుంది. చేతినిండా పని ఉండదు. ఎవరి బతుకుదెరువు కోసం వాళ్ళు పాటు పడే పరిస్థితి ఉండదు. భూములన్నీ దొరలవే, కౌలుకు తీసుకున్న పేద రైతులు పన్ను, కౌలు కట్టలేని దైన్యం. శిక్షలకు వీపులు చాచే దీనత్వం ఆనాటిది. బతికి ఉండడంకోసమే పోరాటం చేయాల్సిన దుర్మార్గపు పరిస్థితుల్లో సాయుధపోరాటం సాగింది.

సుదీర్ఘ రాజకీయ, పోరాట అనుభవం గలిగిన భీంరెడ్డికి సాయుధపోరాటమే ఎల్లకాలం గుర్తుండే జీవితంగా మారింది. ఆయన ఏ సభలో మాట్లాడినా ఆ జ్ఞాపకాలే నెమరు వేసుకునేవారు. ఆయన పోరాట పటిమ గురించి కుర్రా జితేంద్రబాబు ఒక చోట ఇలా రాస్తాడు.

“16 సెప్టెంబర్ 1948లో యూనియన్ సైన్యాలు నిజాం రాజ్యంలో సూర్యాపేట ద్వారా ప్రవేశించినప్పుడు బి.ఎన్. తన దళాలతో నెల్లికుదురులో ఉన్న అతిపెద్ద రజాకారు క్యాంపుపై దాడి జరుపుతూ ఉన్నారు. యూనియన్ సైన్యాలు వచ్చే నాటికి ముందుగా మూడురోజుల నుంచి ఈ దాడి జరుగుతూ వస్తున్నది. యూనియన్ సైన్యాలు ఈ దాడి జరిగే ప్రదేశానికి వచ్చి మొదటగా రజాకార్లపై కాక, బి.ఎన్. పైన, కమ్యూనిస్టులపైన కాల్పులు జరుపడంతో వెంటనే బి.ఎన్. తెలంగాణ పోరాట ప్రాంతంలో ఉన్న దళాలన్నింటికీ కబురుపెట్టి ఎల్లంపేట వద్ద సమావేశం ఏర్పాటు చేసి దళాలను మైదాన ప్రాంతాల నుంచి అరణ్య ప్రాంతాలకు తరలించే నిర్ణయం తీసుకొన్నారు. దాదాపు మూడు సంవత్సరాలు యూనియన్ సైన్యాలను ధిక్కరిస్తూ సాయుధ పోరాటంలో సాధించుకున్న విజయాల్ని రక్షించుకోవడానికి పోరాటాన్ని కొనసాగించారు బి.ఎన్.” ప్రజల మనిషి భీంరెడ్డి.

# 18 భూపతి కృష్ణమూర్తి

– డా॥ రామా చంద్రమౌళి

ప్రజాకవి కాళోజీ ప్రజల గొడవను తన గొడవగా అక్షరబద్ధం చేసి చెప్పిన జీవిత సత్యాల్లో రెండు ప్రవచనాలను పూర్తిగా సార్థకం చేస్తూ బతికి చూపించిన 20వ శతాబ్దపు రాజకీయ విలువలున్న చిట్టచివరి ఆనవాలు, మహా మానవుడు భూపతి కృష్ణమూర్తి.

కాళోజీ అన్నాడు "పరిస్థితులెట్లా ఉన్నాయని కాదు
ఆ పరిస్థితుల్లో మనమెట్లా ఉన్నామనేది ప్రశ్న"

ప్రతి జీవన సంక్లిష్ట సందర్భంలోనూ సమాజంలో తానేమిటి, తన విధులేమిటి .. తనలో ఉండవలసిన సమాజ బాధ్యతలు, పౌర బాధ్యతలు ఏమిటి అన్న స్పృహతో... అనుక్షణం తనను తాను ప్రశ్నించుకుంటూ జీవితాంతం అలుపెరుగని ఒంటరి పోరాటం చేస్తూ ఒక 'చరిత్ర'గా వరంగల్లు ప్రజల హృదయాల్లో శాశ్వతుడై మిగిలిపోయిన ఉన్నత మానవుడు భూపతి కృష్ణమూర్తి. మనిషి ధరించేది తెల్లని మల్లెపూవు వంటి బట్టలు... మనిషివి సకల మానవ సమాజ శ్రేయస్సును కాంక్షించే మచ్చలేని మల్లెపూవు వంటి ఆలోచనలు. మనిషి ఎన్నుకున్నది మల్లెపూవువలెనే పరిమళాన్ని గుబాళించే రాజీ ఎరుగని ఒంటరి పోరాట మార్గం . జీవితాంతం స్వప్నించింది 'ప్రత్యేక తెలంగాణా ఆవిర్భావ' శ్వేతస్వప్నం. చిట్టచివరికి తను కన్న కలను సాకారపర్చుకొని తన సర్వస్వాన్నీ కోల్పోయి తెలంగాణా ముద్దుబిడ్డగా, యోధునిగా ఒక నిరామయ యోగిలా తెల్లని వెండి మేఘాల్లోకి మల్లెపూవువలెనే మనిషి ఎంత పరిమళ భరితంగా జీవించవచ్చునో భావితరాలకు తెలియజెప్పుతూ నిష్క్రమించిన అమరవీరుడూ కృష్ణమూర్తే.

ఒక పవిత్ర లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఒంటరిగానే ఒక జెండాను చేతబూని ముళ్ళబాటల వెంటా, రాళ్ల బాటల వెంటా, ఒంటరిగా, నిర్విరామంగా తోడుగా ఎవరు వచ్చినా రాకున్నా 'వన్ మ్యాన్ ఆర్మీ' వలె గమ్యం చేరేదాకా నిరంతరం స్వప్నించినవాడు కృష్ణమూర్తి.

చాలామంది జీవితాన్ని ఎట్ల చేతికి అందితే అట్లనే జీవిస్తూ పోతారు. ఫలానా రకంగా, ఫలానా పద్ధతిలోనే, ఫలానా లక్ష్యంతో మాత్రమే జీవించాలె అన్న 'ఎరుక'తో జీవించరు. జీవితాన్ని డబ్బు సంపాదనతో, ఉన్నత పదవులతో, అధికార సముపార్జనతో, కొన్నిసార్లు సమాజంలో ఒక గుర్తింపుతో మాత్రమే నిర్వచించుకుంటారు. కాని అసలు తన అభిరుచులేమిటి, తను ఈ సమాజానికి చేయగల మేలు ఏమిటి? భవిష్యత్తులో తన సహమానవ సమాజం తనవల్ల ఏమైనా ఉన్నతీకరించబడి వృద్ధి చెందగలుగుతుందా... అందుకు తనేమైనా చేయగలడా... అని చాలా తక్కువ మంది మాత్రమే ఆలోచిస్తారు. వాళ్ళు అందరిలా అలా ఊర్కే జీవించరు. తమ జీవితాలను తమ లక్ష్యాలను సాధించడానికి అనువుగా నిర్మించుకుంటారు. తన దారిని తాను సృష్టించుకుంటారు. ఒకసారి పద నిర్దేశం జరిగిన తర్వాత

ఇక ఏ రాజీ పడకుండా అకుంఠిత దీక్షతో అదే దారిలో ధైర్యంగా పయనిస్తారు.

భూపతి కృష్ణమూర్తి గారు... తన బాల్యంలోనే తనను తాను మూర్తిగా అర్థంచేసుకొని తన జీవితాన్ని నిర్మించుకున్నాడు. తన పూర్వీకులు ములుకనూరుకు చెందినా ఆయన వరంగల్లులో 21-02-1926లో భూపతి రాఘవులు, భ్రమరాంభ గార్లకు జన్మించిన తర్వాత మళ్ళీ ములుకనూరులోనే చదువును కొనసాగిస్తూ... మొదట తన గురువులు అలిగిరెడ్డి రాజారెడ్డి, డా. చెన్నారెడ్డి, గన్ను బుచ్చయ్యల ప్రభావంతో తనను తాను తెలుసుకున్నారు. అద్భుతమైన క్రమశిక్షణ, అధ్యాత్మిక చింతన, దేశభక్తి, నిస్వార్థ ప్రజాసేవ... ఇవే తన తత్వానికి సరిపడే కృత్యాలుగా ఆత్మావలోకనతో గ్రహించాడు. ఇక ఆ 'ఎరుక'తోనే అడుగులు వేయడం ప్రారంభించాడు.

**కృష్ణమూర్తి గారి మూల చింతన 'సమిష్టి జీవనం'**

అందుకే... మొట్టమొదట 1970- 1974 లలో ఆసియాలోనే అతి పెద్ద సహకార బ్యాంక్‌గా ప్రసిద్ధి చెందిన 'ది ములుకనూరు కో ఆపరేటివ్ బ్యాంక్' వ్యవస్థాపక అధ్యక్షునిగా, సభ్యునిగా ప్రజా జీవితాన్ని ప్రారంభించి గ్రామీణ రైతుల సంక్షేమానికి కృషి చేయడంతో మొదటి అడుగు పడింది. తదాదిగా ఒక అరశతాబ్ద కాలంపాటు ఏ అధికార కాంక్ష లేకుండా ప్రజాసేవకే అంకితం కావడం ఋషితుల్యుడైన కృష్ణమూర్తి గారికే చెల్లింది. ములుకనూరు సహకార బ్యాంక్ స్థాపనకు ముందు... ఆయన తనలో నిరంతర ప్రజ్వలనగా రగిలే దేశ విముక్త స్పృహతో 1944లో గాంధీజీ ఆలోచనలను పుణికిపుచ్చుకొని వార్థాలోని గాంధీజీ ఆశ్రమానికి వెళ్ళిపోయారు. గాంధీజీ పరిచయం, కొద్దికాల సాహచర్యం కృష్ణమూర్తి గారిని నికరమైన లక్ష్య దర్శనంవైపు నడిపించి స్వాతంత్ర్య పోరాట దీక్ష దిక్కు మళ్ళించింది. వరంగల్లు వచ్చి అప్పుడు నిజాం దుష్ట నిరంకుశ పాలనకూ, రజాకార్ల అరాచక హింసకూ, 'అనల్ మలిక్' అంటే ప్రతి ముస్లిమూ రాజే అన్న నినాదంతో హిందువులపై మతమార్పిడి ఉధృతంగా జరుపుతున్న కాలంలో... అటు ఆర్య సమాజీయులూ, ఇటు స్టేట్ కాంగ్రెస్ వాళ్ళూ జాతీయ భావంతో ప్రతిఘటిస్తున్న తరుణంలో భూపతి కృష్ణమూర్తి 1941 నుంది 1946 వరకు వరంగల్లు కాంగ్రెస్‌లో కోశాధికారిగా పని చేస్తూ హయగ్రీవాచారి, ఎం.ఎస్. రాజలింగం, మదూరి రాజలింగం, బి. రంగనాయకులు, కాళోజీ నారాయణరావు వంటి ఉద్ధండులతో కలిసి వ్యాయామశాలలను నిర్వహిస్తూ, జాతీయ భావం పెంపొందించే జాతీయ జెండా పండుగను ఊరూరా నిర్వహిస్తూ, రజాకార్లతో తలపడ్తూ, యువజనులతో స్వాతంత్ర్య సముపార్జనకోసం సంఘాలను నిర్మిస్తూ... చేసిన కార్యక్రమాలెన్నో.

ఆ పరంపరలో రజాకార్లచేత జరుపబడిన మొట్టమొదటి యువ కిశోరం, తూర్పు వరంగల్లు కోటకు చెందిన బత్తిని మొగిలయ్య గౌడ్ హత్య, ఆ హత్య తాలూకు ఘటనలో ప్రత్యక్ష సాక్షిగా పాల్గొన్న భూపతి కృష్ణమూర్తిగారి ధైర్యంతో కూడిన పాత్ర గణనీయమైంది. సాహసోపేతమైంది కూడా.

ముఖ్యంగా... వరంగల్లు చార్‌బౌళీ ప్రాంతానికి చెందిన ముస్లిం రజాకార్ గూండా లక్డీమాస్టర్ పహిల్వాన్ అని పిలువబడే ఖాసిం షరీఫ్ నగరంలో చేస్తున్న అరాచకాలకు ఎదురొడ్డి వరంగల్లు తూర్పు కోట నుండి స్తంభంపల్లె దాకా అనేక గ్రామాలను ఏకీకృతం చేసి ప్రోది చేయడంలో, అందుకు ప్రతివారం గ్రామాల్లో జరిపే 'జెండా పండుగ'ను నిర్వహిస్తూ... ఆగస్ట్ 11, 1946న వరంగల్లు కోటలో జెండా ఎత్తిన హయగ్రీవాచారి, కె. సమ్మయ్య, పంచాయితీ ఇన్స్పెక్టర్ వెంకట్రామనర్సయ్య, మదూరి శంకరలింగం, భూపతి కృష్ణమూర్తి , మొగిలయ్య అన్న మల్లయ్య, ఆరెల్లి బుచ్చయ్య గార్లు మొగిలయ్య ఇంట్లో చాయ్ తాగుతుండగా దాదాపు రెండు వందలమంది రజాకార్ గూండాలతో వచ్చిన లక్డీ మాస్టర్ పాశవికంగా చేసిన దాడిలో... అందరూ హతులయ్యేవారే. కాని మెరుపులా వచ్చిన వీరుడు మొగిలయ్య గౌడ్ చూరులోని బరిసెతో శత్రువులపై సింహంలా దూకి ఎందరినో చంపి చివరికి అమరుడయ్యాడు. ఈ ఘటనలో ప్రత్యక్ష సాక్షి ఐన కృష్ణమూర్తి గారు 'ఈ శేష జీవితం మొగిలయ్య ప్రసాదించిందే' అని దుఃఖిస్తూ చెప్పారు అనేక సభల్లో. చిన్న పిల్లాడి మనస్తత్వం ఆయనది.

ఇక తర్వాత రెట్టించిన ఉత్సాహంతో 1947 నుండి 1948 వరకు హైదరాబాద్ విమోచన ఉద్యమంలో పాల్గొని అరెస్టయి. తర్వాత అజ్ఞాతంలోకి కూడా వెళ్ళి, తర్వాతి కాలంలో 1953 నుండి 1985 వరకు వరంగల్ వ్యవసాయ

గ్రెయిన్ మార్కెట్‌కు చైర్మన్‌గా ఉండి, మధ్యలో 1967లో మునిసిపల్ కౌన్సెలర్‌గా కూడా పని చేసి, 1967 తన వియ్యంకుడు ప్రముఖ వదాన్యులు శ్రీ చందా కాంతయ్య గారి అభీష్టంమేరకు అతని విద్యాసంస్థలు ఎ.వి.వి హైస్కూల్‌ను కాలేజీగా చేయుట, సి.కె.ఎం కాలేజీని పి.జి. స్థాయికి వృద్ధి చేయుట, 1972 నుండి 1977 వరకు వరంగల్లు పట్టణ వైశ్య సంఘం అధ్యక్షులుగా, మరొకమారు 1987లో జిల్లా అధ్యక్షులుగా పదవీ బాధ్యతలను నిర్వహించుట... 1970 నుండి 1973 వరకు వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శిగా వ్యవహరించుట, ఇవన్నీ చేసి చేసి చివరికి అసలు తన అంతిమ లక్ష్యమేమిటనే 'అంతర్మథనం'లోకి వెళ్లిపోయాడాయన.

జవాబును కనుక్కొని ఇక ఆ ఒక్క మార్గం లోనే నడవడం ప్రారంభించాడు. అదే 'ప్రత్యేక తెలంగాణ ఆవిర్భావ ఆకాంక్ష'. తెలంగాణ వెనుకబడి సకల దరిద్రాలను అనుభవించడానికి మూల కారణం 'ఆంధ్రప్రదేశ్ అవతరణ' అన్న దుష్ట ఘటన అని తెలంగాణా సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ వంటి మేధావుల సంపర్కంతో గ్రహించి, శాస్త్రీయంగా నిర్ధారణ చేసుకొని 1968లో 'తెలంగాణ ప్రజా సమితి'ని స్థాపించి తొలి ఉద్యమంలో ఎంతో కీలకమైన పాత్ర వహించి, అనేక సార్లు జైలుకెళ్ళి విడుదలై ఇక ఒకటే దారి, ఒకటే గమనం, ఒకటే గమ్యంగా నడక కొనసాగించాడు.

మధ్యలో పి.వి. నరసింహారావు కాంగ్రెస్ నుండి శాసనసభ్యునిగా పోటీ చేయమని ప్రతిపాదన, తిరస్కరణ. 1977లో జనతా పార్టీ 'తెలంగాణ' ఆశ్వాసనపై శాసన సభ్యునిగా పోటీ, 1983లో తెలుగుదేశం పార్టీ నుండి టికెట్, ఐదు లక్షల రూపాయలతో ఒక ప్రతిపాదన, తిరస్కరణ. తర్వాత వరంగల్లు జె.పి.ఎన్ రోడ్ ఆకారపు నరసింగం పెట్రోల్ పంపు ముందు 'తెలంగాణా ప్రజా సమితి' గద్దె, జెండా స్థంభ నిర్మాణం. ఇక ఆయనది నిరంతర ఒంటరి పోరాటమే, సహచర ఆలోచనాపరులతో నిర్విరామ విస్ఫోటనమే. మనసూ, శరీరం, తపనా, తపస్సూ అన్నీ 'తెలంగాణే'.

1986 లో ఆయన షష్ఠ్యబ్ది సందర్భంగా "ప్రజాబంధు" బిరుదు ప్రధానం, తర్వాత బహుముఖంగా తెలంగాణ రాష్ట్ర సాధనకోసం ఉద్యమాలు జరుగుతున్నా తనదైన పంథాలో విజృంభిస్తున్న కృష్ణమూర్తి గారి నిస్వార్థ పోరాట పటిమకు కృతజ్ఞతాపూర్వకంగా తెలంగాణా ప్రజలు వరంగల్లు వేదికగా ప్రముఖులనేకులు ఒక అభినందన కమిటీగా ఏర్పడి 'తెలంగాణ గాంధీ' అన్న బిరుదునిచ్చి నోరార అతిప్రియంగా ఆయన్ను పిలుచుకొని స్థిర ప్రతిష్ఠితుణ్ణి చేశారు. ఆ పిలుపుకు అతను పూర్తిగా అర్హుడు. సంపూర్తిగా తగినవాడు. నిజానికతడు తెలంగాణ ఋషి.

తెలంగాణా కోసమే జీవించి, తెలంగాణానే స్వప్నించి, తెలంగాణానే శ్వాసించి, చివరికి జూన్ 2, 2014న వేలాది అమరవీరుల ప్రాణత్యాగాలతో సిద్ధించిన "ప్రత్యేక తెలంగాణా" 29వ రాష్ట్ర ఆవిర్భావంతో భూపతి కృష్ణమూర్తి గారి చిరకాల వాంఛ నెరవేరి, ఆయన తన అంతిమ దశలో తృప్తుడైనాడు. తర్వాత వయోగ్రస్తులైన కృష్ణమూర్తిగారు కొద్ది నెలలకే, అంటే 15-02-2015న తన స్వప్నం సాకారమైన పరిపూర్ణ తృప్తితో స్వర్గస్తులైనారు. అతని సుదీర్ఘ, నిరంతర 'తెలంగాణ ఆవిర్భావ కాంక్షను' గుర్తించిన 'తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం' సకల ప్రభుత్వ లాంఛనాలతో ఆయన అంత్యక్రియలను సగౌరవంగా నిర్వహించింది.

ఒక వ్యక్తి జీవితాంతం తను లక్ష్యించిన గమ్యాన్ని చేరడానికి పడ్డ తపన, చేసిన తపస్సు, మనిషికి అంతిమంగా తప్పక సాఫల్యతను ప్రసాదిస్తుంది. శ్రీ భూపతి కృష్ణమూర్తి గారి నిస్వార్థ జీవితం రాబోయే తరాలకు ఒక స్ఫూర్తిదాయకమైన పాఠాన్ని నిరంతరం వినిపిస్తూనే ఉంటుంది .

19

# భాగ్యరెడ్డి వర్మ

**– డా॥ సంగిశెట్టి శ్రీనివాస్**

అంబేద్కర్ 125వ జయంత్యుత్సవాలు దేశ, విదేశాల్లో ఘనంగా జరుపుకొంటున్నాం. ఆయన రచనలన్నీ ఇప్పుడు వివిధ భాషల్లో ఉచితంగా అందరికీ అందుబాటులోకి వచ్చాయి. తెలుగు యూనివర్సిటీ ప్రచురించిన తెలుగు సంపుటాలు కూడా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయి. అంబేద్కర్‌ని భిన్న పార్శ్వాల్లో దర్శించడానికి ఆయన రచనలు దారి చూపిస్తున్నాయి.

అయితే అంబేద్కర్ కన్నా ముందే దేశవ్యాప్తంగా 'ఆది హిందువు'ల, నిమ్నజాతుల (హరిజన అనే పదాన్ని భాగ్యరెడ్డి వర్మ నిర్ద్వందంగా వ్యతిరేకించిండు) వారి నాయకుడిగా గుర్తింపు పొందినవాడు భాగ్యరెడ్డి వర్మ. కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు మొదలు ఎం.సి. రాజా వరకు ఎందరో మన్ననలు అందుకున్న ఆయన 128వ జయంతి మే 22న జరుపుకుంటున్నాం. తెలంగాణ ఉద్యమం పుణ్యమా అని భాగ్యరెడ్డి వర్మ గురించి కొంత సమాచారం వెలుగులోకి వచ్చింది. భాగ్యరెడ్డి వర్మ కుమారుడు 1952లోనే హైదరాబాద్ అసెంబ్లీకి ఎన్నికైన గౌతమ్ 'భాగ్యోదయం' పేరిట ఇంగ్లీషులో చిన్న పుస్తకాన్ని వెలువరించాడు. ఈ పుస్తకానికి మాతృక అంతకుముందు 1921లోనే వడ్లకొండ నరసింహారావు రాసిన రచన. ఈ పుస్తకం ఇప్పుడు తెలుగు పాఠకులకు కూడా అందుబాటులోకి వచ్చింది. సంతోషం.

అయితే భాగ్యరెడ్డి వర్మ రచనలు, ఉపన్యాసాలు, సంపాదకీయాలు, సృజనాత్మక రచనలు ఇంతవరకూ పుస్తక రూపంలో రాలేదు. వాటి గురించి చాలా తక్కువ మందికి తెలుసు. గతంలో ఒకరిద్దరు భాగ్యరెడ్డి వర్మ రచనల్ని ఈ వ్యాసకర్త నుంచి తీసుకొని ముద్రించడానికి ప్రయత్నం చేసినారు కాని అది ముందుకు సాగలేదు. ఆ రచనల్ని ఆంగ్లంలోకి కూడా తర్జుమా చేసి ఆయన గొప్పతనాన్ని జాతికి చాటి చెప్పాలి.

నిజానికి ఈ దేశ మూలవాసులు దళితులేనని బోధిస్తూ, వారి పట్ల సమాజం చూపిస్తున్న వివక్షా వైఖరిని ఖండిస్తూ ప్రజల్ని చైతన్యవంతుల్ని చేసే ఉద్దేశంతో 1906లోనే 'జగన్మిత్రమండలి' అనే సంస్థను నెలకొల్పి దాని ద్వారా కృషి చేసిండు. 50 సంవత్సరాల జీవితంలో 32 యేండ్లు ప్రజాశ్రేయస్సుకోసం వినియోగించిన భాగ్యరెడ్డి వర్మ చేసిన సేవలు చిరస్మరణీయమైనవి. నిజాం ప్రభుత్వంతో పోరాడి దళితుల కోసం ప్రత్యేక పాఠశాలలు, బ్రహ్మసమాజ్, ఆర్యసమాజ్, సంఘసంస్కార నాటక మండలి, దేవదాసీ నిర్మూలనోద్యమం, ఆదిహిందువుల ఐక్యత, రాజకీయ వాటా కోసం, దళితుల ఆర్థిక, సామాజిక ప్రగతి కోసం ఆయన చేసిన కృషి ఇప్పటికీ గుర్తింపుకు నోచుకోలేదు.

ఇక అసలు విషయానికొస్తే నేను ఎంతో శ్రమకోర్చి సేకరించిన/ కాపాడిన భాగ్యరెడ్డి వర్మ రచనలు త్వరలో పుస్తక రూపం దాల్చనున్నాయి. నిజానికి ఇప్పటి వరకు

భాగ్యరెడ్డి వర్మ ఒక దళితోద్యమ నాయకుడిగానే అందరికీ తెలుసు. అయితే ఈయన భాగ్యనగర్, ఆదిహిందూ పత్రికల్ని నడిపించడమే గాకుండా దళితుల హక్కుల కోసం పోరాటం చేసిన తొలి నాయకుల్లో ప్రథముడు. హక్కులు కాపాడడంలో భాగంగానే 1938లోనే ఆదిహిందూ పత్రికలో 'ప్రాథమిక హక్కులు' అనే సంపాదకీయం రాసిండు.

ఆ కాలంలో తెలంగాణాలో మొత్తం చదువుకున్న తెలుగువారి జనాభా ఐదారు శాతానికి మించదు. అందులో దళితుల అక్షరాస్యతా శాతం మరీ అధ్వాన్నం. అయితే నిమ్నజాతుల వారి గోడు అగ్రకులాల వారికి కూడా తెలియాలి. ముందు వారు సమస్యను సానుకూలంగా అర్థం చేసుకునేందుకు పత్రికా రచన ఉపయోగ పడుతుందని నమ్మి దాన్ని నిర్వహించిన వినయ సంపాదకుడు భాగ్యరెడ్డి వర్మ. పత్రికల్లో రాజరామ్‌మోహన్‌రాయ్, బ్రహ్మసమాజ్, బుద్ధ జయంతి సందర్భంగా రాసిన సంపాదకీయాలు ఆనాటి అనేక విషయాల్ని కళ్లకు కట్టినట్లు చూపిస్తాయి.

"గ్రామహిందువులు, ఆదిహిందువుల బాలురను స్కూలునకు పంపించినందున వారి బావులలో గాజునూనెను పోసి పారదోలిరి. మరొకచోట నూనెతో భక్ష్యములు చేసుకొనినందున అతనిని చావతన్ని అన్న ఆహారములతో మన్నుగప్పిరి. ఇంకొకచోట సర్కారువారితో ఆజ్ఞను పొంది గోధుమ రొట్టెలు చేసుకొని విందారగించు సమయమున హిందువులు తండోపతండాలుగా వచ్చి ఆహారమునంతయు మట్టిలో కలిపి దుడ్డుకర్రలతో చావమోదిరి.

మరొకచోట కూరలలో నెయ్యిని వాడినందులకు, ఊరేగింపులో గుర్రమెక్కినందులకు, సైకిళ్ళపైనెక్కి దారి పోవుచుండ ఆవులను చూచి దిగిదండము పెట్టనందులకు, మొన్న నర్సాపురం తాలూక తూర్పుతాళ్ళ శివారు శిరంశెట్టిల యింట్లో జరిగిన ఆదిమాంధ్రుల వివాహ సందర్భమున పెండ్లి వారు పీటలపై కూర్చొని యుండగా, 'గడ్డిబుట్టలతో పోవు కాపులను కండ్లు కనబడుటలేదాయని' దుర్భాషలాడుతూ ఊరుకాపులందరు యేకమై వచ్చి తలుపులు విరగగొట్టి దాగుకొనిన వారందరినీ చావమోదిరి. ఆదేకులను గాయములొర్చిరి. కొల్లాబత్తుల వెంకన్న తల పగులగొట్టిరి. కుండలమధ్య దాగుకొనిన 80 సం॥ల ముసలమ్మ నడుము విరగగొట్టిరి. చేతులు జోడించి మొక్కబోయినవారికి చేతులు విరగగొట్టిరి. స్త్రీలను, వృద్ధులను, పిల్లలను వారి ఇష్టము వచ్చినట్లు కొట్టగా గాయములు పొందిననాడు ఆసుపత్రిలో చికిత్స బడయుచున్నట్లు స్థలాంతరమున ప్రకటించిన వార్తవలన తెలియుచున్నది" అని ఆంధ్రా ప్రాంతంలో జరిగిన దాడులను ఏకరువు పెడుతూనే , అలాంటివి తెలంగాణలో జరుగకుండా నిజాం ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ప్రాథమిక హక్కులు పేరిట రాసిన సంపాదకీయంలో అభిప్రాయ పడ్డారు.

దీనితో పాటుగా ఆదిహిందూ వార్షిక సభల సందర్భంగా చేసిన సుదీర్ఘ వ్యాసాలు ఇది వరకే కొన్ని చిన్న చిన్న బుక్‌లెట్స్‌గా ప్రచురింపబడ్డాయి. వాటిలో పోలీసు, సైనిక విభాగాల్లో ఆదిహిందువులను చేర్చుకోవడంలో చూపిస్తున్న వివక్ష, వెట్టి చాకిరీలను విమర్శిస్తూ చేసిన ఉపన్యాసాలు తర్వాతి కాలంలో వ్యాసాలుగా పత్రికల్లో అచ్చయ్యాయి.

అలాగే ఆంధ్రమహాసభ వాళ్ళు ప్రతి యేటా 1930 నుంచి నిర్వహించిన సభలకు భాగ్యరెడ్డి వర్మ తప్పనిసరిగా హాజరయ్యేవారు. ఆయా సభల్లో ఆయన చేసిన ప్రసంగాలు కూడా ఆ కాలంలో పత్రికల్లో అచ్చయ్యాయి. ఖమ్మం సభకు తాను వెళ్ళలేక పోయినప్పటికీ తన ఉపన్యాసాన్ని రాసి పంపించడంతో అక్కడ చదవడం జరిగింది. ఇవేగాకుండా సందర్భానుసారంగా వివిధ విషయాలపై భాగ్యరెడ్డి వర్మ దాదాపు 1911 నాటి నుంచి వివిధ పత్రికలకు వ్యాసాలు రాసేవారు. అలా ఆయన రాసిన మొదటి వ్యాసం ఆంధ్రపత్రిక ఉగాది సంచికలో 1911లో అచ్చయింది.

వీటితో పాటుగా మొత్తం తెలుగులోనే మొట్టమొదటిసారిగా కథలు రాసిన దళితుడు భాగ్యరెడ్డి వర్మ. మాదిగల వెట్టి చాకిరి జీవితాల పట్ల చలించి 'అజ్ఞాతవాసి' అనే పేరిట 1931లోనే 'వెట్టి మాదిగ' అనే కథను భాగ్యరెడ్డి వర్మ రాసిండు. వీటితో పాటుగా గణపతి తత్వం అనే సెటైరికల్ నాటికను కూడా ఈయన రాసిండు.

నిజానికి భాగ్యరెడ్డి వర్మ రచనలు చాలా వరకు అలభ్యంగా ఉన్నాయి. భాగ్యరెడ్డి వర్మ తన పేరు, హైదరాబాద్ పేరూ రెండూ వచ్చే విధంగా ఏర్పాటు చేసిన 'భాగ్యనగర్' పత్రిక ప్రతులు నాలుగైదు సంచికలు మించి ఇప్పుడు

అందుబాటులో లేవు. నిజానికి ఈ భాగ్యనగర్ ప్రతులన్నింటినీ ఆంధ్రా ప్రాంతానికి చెందిన కుసుమ ధర్మన్నకు ఇచ్చినట్లు ఈ వ్యాసకర్తతో గతంలో గౌతమ్ గారు చెప్పారు. అయితే ఆ ప్రతులన్నీ అగ్ని ప్రమాదంలో కాలిపోయి ఉండవచ్చనే అనుమానాన్ని కూడా ఆయన వ్యక్తం జేసిండు. భాగ్యనగర్, ఆదిహిందూ పత్రికా ప్రతులు దొరికినట్లయితే భాగ్యరెడ్డి వర్మ రచనలపై మరింత లోతుగా పరిశీలన చేయడానికి వీలవుతుంది.

ఇప్పటికే ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి భాగ్యరెడ్డి వర్మ మీద ఒక ఎంఫిల్ పరిశోధన జరిగింది. నిజానికి నాలుగైదు పిహెచ్‌డీలు చేయగలిగినంత సమాచారం, ఉన్నతి ఉన్న వ్యక్తి భాగ్యరెడ్డి వర్మ.

20

# బిరుదురాజు రామరాజు

– డా॥ అమ్మంగి వేణుగోపాల్

బిరుదురాజు రామరాజు 1925 ఏప్రిల్ 16న జన్మించారు. తల్లిదండ్రులు లక్ష్మీదేవమ్మ, నారాయణ రాజుగార్లు. స్వగ్రామం వరంగల్ జిల్లా దేవనూరు. ఇక్కడ కొంత ప్రాథమిక విద్యాభ్యాసం జరిగిన తర్వాత, కవిపండితులకు కాణాచిగా పేరుపొందిన మడికొండకు వెళ్ళారు. అక్కడ తమ పెదనాయిన రాఘవరాజు గారి పోషణలో వుంటూ చదువులో మరికొన్ని మెట్లు ఎక్కారు. హన్మకొండలో హెచ్చెస్సీ పరీక్షలోను, ఇంటర్మీడియెట్ పరీక్షలోను ఉత్తీర్ణులైనారు. హైదరాబాదులోని నిజాం కళాశాలలో బి.ఏ చదివి పట్టభద్రులయ్యారు.

రామరాజుగారిది మొదటినుండి స్వతంత్ర వ్యక్తిత్వం. నిజాం కాలేజీలో జరిగిన ఒక కవి సమ్మేళనంలో 'ఉస్మానియా విశ్వవిద్యాలయ నిర్మాణంలో ప్రతి నాలుగు ఇటికెలలో మూడు ఇటికెలు తెలుగువాళ్ళవే' అని అర్థం వచ్చే కవిత చదివితే ప్రిన్సిపాల్ అభ్యంతరం చెప్పి క్షమాపణ కోరినాడు. కాని రామరాజు తనవాదనకే కట్టుబడి వున్నారు. ఆ తర్వాత జరిగిన సత్యాగ్రహంలో పాల్గొని, నిజాం ప్రభుత్వం పట్ల వ్యతిరేకతను ప్రకటించారు. ఫలితంగా జైలు శిక్ష అనుభవించి, స్వాతంత్ర్య సమరయోధుడన్న ఖ్యాతి గడించారు.

దీంతో 1952 ఎన్నికలలో శాసనసభ్యులుగా పోటీ చేయడానికి బూర్గుల రామకృష్ణారావు, రామరాజుగారికి పార్టీ టికెట్టు ఇచ్చారు. అయితే సురవరం ప్రతాపరెడ్డి గారు జోక్యం చేసుకొని, "విశ్వవిద్యాలయంలో ఆచార్యుడిగా పనిచేస్తూ సాహిత్య పరిశోధన చేయడమే నీకూ, జాతికీ మంచిద"ని సలహా ఇవ్వడంతో రాజకీయాలలోకి రాలేదు. రామరాజు తల్లిదండ్రులకు తమ కొడుకు ISS పరీక్షలో ఉత్తీర్ణుడై పెద్ద అధికారి కావాలని ఉండేది. అందుకు అనుగుణంగా వీరు ISS అనే 'హైదరాబాద్ సివిల్ సర్వీస్' పరీక్షలో ఉత్తీర్ణులై 'పంచాయత్ ఆఫీసర్' అన్న గెజిటెడ్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. అప్పుడు కూడా సురవరం ప్రతాపరెడ్డి గారి సలహామేరకు ఆ ఉద్యోగంలో చేరకుండా తమ దృష్టిని సాహిత్య పరిశోధనవైపు మళ్లించారు.

ఎం.ఏలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన తర్వాత వారు 'తెలుగులో జానపద సాహిత్యం' మీద పరిశోధన చేసి పి.హెచ్.డి. పట్టా పొందాలని కోరుకున్నారు. కాని పల్లెపట్టుల్లో పామరులు పాడుకునే లొల్లాయి పదాలు పరిశోధనాంశంగా తగవన్న అభ్యంతరం వచ్చింది. కాని ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం, సురవరం ప్రతాపరెడ్డి గార్ల సిఫార్సుతో పరిస్థితులు చక్కబడ్డాయి. తెలంగాణలోని అనేక మారుమూల గ్రామాలు తిరుగుతూ జానపదుల నోట విన్న వేల పాటలను రాసుకున్నారు. ఇదే సమయంలో కొన్ని వేల తాళపత్రగ్రంథాలను, కాగితపు ప్రతులను సేకరించారు. ఖండవల్లి లక్ష్మీరంజనం గారి పర్యవేక్షణలో 1955లో తమ

సిద్ధాంతగ్రంథానికి సమగ్రరూపం ఇచ్చి విశ్వవిద్యాలయానికి సమర్పించారు. 1956లో పి.హెచ్.డి.ని సాధించారు. ఈ పట్టాకు రెండు ప్రత్యేకతలున్నాయి. ఒకటి–ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ నుంచి ఇదే మొట్టమొదటి పి.హెచ్.డి. కావడం. రెండవది – దక్షిణ భారతదేశంలోనే ఇది మొట్టమొదటి పి.హెచ్.డి కావడం. రామరాజుగారి కృషి మూలంగానే ఆ తర్వాత తుళు, మలయాళం, తమిళం, కన్నడం – వంటి దాక్షిణాత్య భాషల్లో జానపద సాహిత్యం మీద పరిశోధనలు ఊపందుకున్నాయి. వీరి స్ఫూర్తితోనే ఆచార్య నాయని కృష్ణకుమారి మొదలు వందలాది పరిశోధకులు జానపద సాహిత్యం పట్ల ఆసక్తి ప్రదర్శించారు. దీంతో జానపదసాహిత్య పరిశోధన శాఖోపశాఖలుగా విస్తరించింది. 'జానపద సాహిత్య పరిషత్తు' వంటి సంస్థలు ఏర్పడ్డాయి.

రాష్ట్రంలో మాత్రమే కాదు, దేశంలోని వివిధ ప్రాంతాలలోను, విదేశాలలోను జానపద సాహిత్యం మీద సెమినార్లు జరిగాయి. అట్లాంటి ఎన్నో సెమినార్లకు రామరాజుగారు అధ్యక్షులుగా, ముఖ్య అతిథిగా హాజరై ఎన్నో అమూల్యమైన అంశాలను వెల్లడించారు. దీంతో అనాదృత పామర సాహిత్యంగా పేరున్న జానపద సాహిత్యానికి పండిత సభలలో కూడా ఆదరణ పెరుగుతూ వచ్చింది.

రామరాజుగారి పరిశోధన కేవలం జానపద సాహిత్యానికే పరిమితం కాలేదు. వారి నిరంతర కృషికి మరెన్నో కోణాలున్నాయి. ప్రతిభావంతులై వుండి ప్రచారానికి నోచుకోని ప్రాచీన కవుల కావ్యాలమీద వారి దృష్టిపడింది. జానపద సాహిత్య పరిశోధనకన్నా మూడేండ్ల ముందు నుంచే 'మరుగున పడిన మాణిక్యాలు' పేరుతో ఈ పరిశోధన చేయసాగారు. 1950 నుండి ఈ వ్యాసాలు గోలకొండ పత్రికలో ప్రచురితమవుతూ వచ్చాయి. 'మరుగున పడిన మాణిక్యాలు' సంపుటిలోని వ్యాసాలను, తర్వాత వచ్చిన మరికొన్ని వ్యాసాలను కలిపి 'బి. రామరాజు షష్ట్యబ్దిపూర్తి సంఘం' వారు 1985లో 'చరిత్రకెక్కని చరితార్థులు' అన్న పేరుతో ప్రచురించారు.

ఇందులో తెలుగు విభాగంలో 22 మంది కవులను గూర్చి, వారి కావ్యాలను గూర్చి, సంస్కృత విభాగంలో 12 మంది కవులను గూర్చి, వారి కావ్యాలను గూర్చి రామరాజుగారు పరిశోధనాత్మకంగా రాశారు. ఎంత చిన్న వ్యాసంలోనైనా వారి పరిశోధనాత్మను పాఠకుడు దర్శించగలడు. 18వ శతాబ్దానికి చెందిన రాజా బహిరీ పామనాయక భూపాలుని గూర్చి, అతడు రచించిన 'భార్గవ పురాణం' అనే వైష్ణవ ప్రబంధం గూర్చి ఈ గ్రంథంలోని మొదటి వ్యాసంలో రామరాజుగారు వివరించారు. అచ్చులో కేవలం ఐదు పేజీలు మాత్రమే ఉన్న ఈ వ్యాసాన్ని రాయడానికి – 'లక్ష్మణరాయ వ్యాసావళి', 'శ్రీ కృష్ణ దేవరాయాంధ్ర భాషానిలయ రజతోత్సవ సంచిక', 'ఆంధ్రేతిహాస పరిశోధక మండలి వారి 13వ సంపుటం', ఇతర సాధారణ చరిత్ర గ్రంథాలను రామరాజుగారు సంప్రదించడం జరిగింది. ఇక 'భార్గవపురాణం' అన్న కావ్యం సంగతి సరేసరి! ఇది రామరాజు గారి పద్ధతి!

సంస్కృత విభాగంలో నాగదీయ పురాణంలోని 'హరిభక్తి సుధోదయం' అనే 20 అధ్యాయాల పెద్ద గ్రంథానికి 'భక్తి సంజీవని' అన్న వ్యాఖ్యను రచించిన వాడు సారంగు తమ్మయ. ఇతడు తెలుగులో 'వైజయంతీ విలాసము' అనే వైష్ణవ ప్రబంధాన్ని రచించి ప్రసిద్ధి పొందాడు. కుతుబ్ షాహీ రాజులలో సుప్రసిద్ధుడైన మహమ్మద్ కులీకుతుబ్ షాకు సన్నిహితుడు.

గోల్కొండ గ్రామ కరణంగా పేరు పొందినవాడు. ఆ రోజుల్లో 'కరణం' అన్నది మంత్రితో సమానమైన పదవి. తెలుగుకవిగా ముద్రపడిన సారంగు తమ్మయ రామరాజు గారు చెప్పడం మూలంగా సంస్కృత వ్యాఖ్యాత అని కూడా లోకానికి వెల్లడి అయింది.

రామరాజు గారు ఉత్తమ స్థాయి గ్రంథ పరిష్కర్త కూడా. తాము సేకరించిన తాళపత్రగ్రంథాలలో గాని ఇతరులు సేకరించిన తాళపత్ర గ్రంథాలలోగాని ఉత్తమ గ్రంథం కనిపిస్తే, దాన్ని నిర్దుష్టంగా పరిష్కరించి, విపుల పీఠికను రాసి ప్రచురించేవారు. ఇందువల్ల ఆయా భాషల సాహిత్య చరిత్రలకు ఎంతో లాభం చేకూరింది. శ్రీనాథుని శివరాత్రి మహత్మ్య కావ్యం చాలా కాలంగా 4 అశ్వాసాల కావ్యంగానే, అసంపూర్ణ రచనగానే ఉంటూ వచ్చింది. శ్రీనాథుడు అంతే రాశాడని కొందరు, పూర్తి కావ్యం రాసినా చివరి అశ్వాసాలు అలభ్యంగా వున్నాయని మరి కొందరు భావిస్తూ వచ్చారు. ఇదిలా వుండగా రామరాజుగారు మెదక్‌జిల్లాలో పర్యటిస్తూ

వుండగా 5 అశ్వాసాల సమగ్ర శివరాత్రి మహాత్మ్యము రామరాజుగారికి దొరికింది. దీన్ని వారు 1968లో పరిష్కరించి విపుల పీఠిక ప్రచురించారు. ఇది సాహిత్య ప్రపంచంలో పెనుసంచలనం సృష్టించింది.

పూర్వపరిశోధకుల పొరపాట్లను సవరించడం కూడా పరిశోధకుల బాధ్యత. వేటూరి ప్రభాకరశాస్త్రి గారు తమ 'చాటు పద్య మణిమంజరి'లో చతురంగ విద్యలో శ్రీకృష్ణదేవరాయలను మెప్పించిన బొడ్డుచర్ల తిమ్మనను, 'ప్రసన్నరాఘవ నాట్య ప్రబంధ' రచయిత అయిన బొడ్డుచర్ల తిమ్మయను ఒకరుగానే పొరపడ్డారు. కాని ఈ ప్రబంధాన్ని 1962లో పరిష్కరించిన రామరాజుగారు వాళ్ళిద్దరు వేరువేరు వ్యక్తులని ఆధారాలు చూపుతూ నిరూపించారు. వీరి 'ప్రరోచన' అన్న పీఠిక విలువైనది.

వీరు పరిష్కరించి వెలుగులోకి తెచ్చిన కావ్యాలలో సాయప వెంకటాద్రినాయకుని 'సకల సంజీవనము' ఒకటి. ఇది విశిష్ట అద్వైత మత ప్రవక్త అయిన రామానుజాచార్యుల వారి జీవితానికి పద్యరూపగ్రంథం. జీవితంలో సమకాలీన స్థితిగతుల మీద రామానుజులవారు చేసిన తిరుగుబాటు, శైవుల నుండి వచ్చిన ప్రతిఘటన, సామాన్య జనుల పట్ల కులాతీతంగా వ్యవహరించిన తీరు– మొదలైనవి కూడా ఈ కావ్యంలో చిత్రించబడ్డాయి. విశిష్ట అద్వైత తాత్వికతను కూడా కవి నిరూపించాడు.

ఈ గ్రంథాలనే కాక – తెలుగులో ఛాయాపతి రచించిన 'రాణవాభ్యుదయము', పాల్కురికి సోమన రచించిన 'పండితారాధ్య ఉదాహరణ', రఘునాథ నాయకుడు రచించిన 'వాల్మీకి చరిత్ర', పాలవేకరి కదిరీపతి రచించిన 'శుకసప్తతి', మడికి సింగన రచించిన 'పద్మపురాణం' మొదలైన కావ్యాలను వెలుగులోకి తెచ్చారు.

ఇకపోతే రామరాజు గారు పరిష్కరించిన సంస్కృత కావ్యాలలో – కాళహస్తి కవి రచించిన సంస్కృత వసుచరిత్ర, శ్రీ కృష్ణదేవరాయల జాంబవతీ పరిణయమ్, కాకతీయ ప్రతాపరుద్రుడు రచించిన ఉషారాగోదయమ్ – ముఖ్యమైనవి.

రామరాజుగారు సంస్కృత భాషా సాహిత్యాలలో విశేష కృషి చేసిన పండితులు. ముదిగొండ వీరేశలింగ శాస్త్రి, నల్లాన్ చక్రవర్తుల రఘునాథాచార్యుల శిష్యరికంలో వారు సంస్కృతాన్ని నేర్చుకుని, ఎం.ఏ.సంస్కృతం పట్టా సాధించారు. తెలుగు కవిపండితుల సంస్కృత రచనల ద్వారా సంస్కృత సాహిత్యానికెంత మేలు జరిగిందనేది నిర్వివాదమైన అంశం. ఈ అంశానికి "CONTRIBUTION OF ANDHRA TO SAMSKRIT LITERATURE" అన్న ఆంగ్లరూపం ఇచ్చి పీ.హెచ్.డీ పట్టాకై పరిశోధన ప్రారంభించారు. సకాలంలో వారు విశ్వవిద్యాలయానికి సమర్పించలేకపోవడంతో పట్టా రాలేదు.

అయినా తమ దశాబ్దాల కృషికి 800 పేజీల ఆంగ్ల గ్రంథంగా 2002లో ప్రచురించారు. దీనితో తెలుగు కవులకు సంస్కృత భాషా సాహిత్యాలలో వున్న ప్రతిభావిశేషాలు జాతీయంగానే కాక అంతర్జాతీయంగా కూడా వెల్లడి అయ్యాయని చెప్పవచ్చు. తెలుగు వర్ణ క్రమంలో నిఘంటు పద్ధతిలో కూర్చబడ్డ ఈ గ్రంథంలో ఆగస్త్యుడు తొలి కవిగా, పంచాగ్నుల హనుమనార్యుడు చివరి కవిగా పేర్కొనబడ్డారు.

అగస్త్యుడు కాకతీయ ప్రతాపరుద్రుని (క్రీ.శ. 1295–1325) ఆస్థానకవి. ఈయన 74 గ్రంథాలు రచించారు. కాని మనకు ఇప్పుడు దొరుకుతున్నవి ఐదారే. వీటిని పరిశీలించి ఈ కవి మీద మహాకవి కాళిదాసు ప్రభావం వుందని రామరాజుగారు నిరూపించారు. వీరి రచనలలో 'కృష్ణ చరిత్ర' అన్న గద్యకావ్యం, 'నలకీర్తి కౌముది' అనే నాలుగంకాల నాటకం ముఖ్యమైనవి.

హైదరాబాద్ రాష్ట్రంలో ఒకప్పుడు భాగంగా వున్న, ధైర్య శౌర్యాలకు ప్రతీక అయిన 'సురాపురం' ఆస్థాన కవి అన్నమార్యుడు 18వ శతాబ్దానికి చెందినవాడు. ఆయన 'తత్వగుణాధర్మ', 'ఆతార్యవింశతి', 'దేశికయశోభూషణం' వంటి ఏడు గ్రంథాలను రచించారని రామరాజుగారు తెలియజేస్తున్నారు. ఈ కవి వంశవృక్షాన్ని కూడా పొందుపరచుట మరొక విశేషం.

'మధురా విజయం' కావ్యాన్ని రచించిన గంగాదేవిని కాకతీయ రాజవంశానికి చెందిన స్త్రీగా రామరాజు గుర్తిస్తున్నారు. ఈమె 14వ శతాబ్దానికి చెందిన కవయిత్రి. ఈమె రచించిన మధురావిజయ కావ్యాన్ని దక్షిణ భారత దేశంలో తొట్ట తొలి చారిత్రక కావ్యంగా పరిశోధకులు

గుర్తిస్తున్నారు. ఈమె భర్త వీరకంపరాయలు తన శత్రువుల మీద దండయాత్రకు బయలుదేరుతాడు. సాంబువరాయల ఆధీనంలో వున్న కంచిని, సుల్తాన్ గుప్పిట్లో వున్న మధుర రాజ్యాన్ని జయిస్తాడు. (ఈ దండయాత్రలో రాణి హెూదాలో గంగాదేవి కూడా పాల్గొని వుంటుంది. అందుకే తన కళ్ళముందు జరిగిన పరిణామాలను, యుద్ధ దృశ్యాలను సజీవంగా చిత్రీకరించగలిగింది)

13, 14 శతాబ్దాలకు చెందిన కాకతీయ ప్రతాప రుద్రుని ఆస్థానంలో వున్న విద్యా నాథుడు, మహాపండితుడు. అలంకార శాస్త్ర వేత్త. ఈయన రచించిన 'ప్రతాపరుద్ర యశోభూషణము'ను దేశంలోనే సుప్రసిద్ధమైన, మొదటి అలంకార గ్రంథంగా సాహితీ వేత్తలు గుర్తిస్తున్నారు. దీనికి అనేక వ్యాఖ్యానాలు వచ్చాయి. వీటిలో కాళిదాస కావ్యాల వ్యాఖ్యాత అయిన మల్లినాథసూరి కుమారుడైన కుమారస్వామి రచించిన 'రత్నాపణ' వ్యాఖ్య ప్రసిద్ధమైనది.

ఇట్లా 224 మంది కవి పండితులను గూర్చి అనేక విశేషాలను తెలియజేసిన, రామరాజుగారు వివిధ తెలుగు కవులు తమ తెలుగు కావ్యాలలో సందర్భోచితంగా రాసిన సంస్కృత శ్లోకాలను కూడా రెండవ అనుబంధంలో రామరాజుగారు పేర్కొనడం జరిగింది. హనుమకొండలోని సుప్రసిద్ధమైన వేయిస్తంభాల గుడి ఎదురుగా క్రీ.శ.1163వ సంవత్సరంలో రుద్రదేవ భూపతి నెలకొల్పిన శిలాశాసనం వుంది. ఇందులో 166 పంక్తులున్నాయి. పద్యం తక్కువగా సంస్కృత శ్లోకాలు ఎక్కువగా వున్నాయి. వీటిలో కొన్నింటిని రామరాజు అనుబంధంలో ఇచ్చారు. శాసనాన్ని రచించిన కవి రాజును, రాజు తండ్రిని ప్రశంసించటం జరిగింది.

అట్లే రెండవ అరికేసరి (క్రీ.శ.930-955) వేయించిన వేములవాడ శాసనాన్ని చూడవచ్చు. రాజు 100 నివర్తనాల భూమిని రాజరాజేశ్వర స్వామి దేవాలయానికి దానం చేసిన సందర్భంలో వేయబడిన శిలాశాసనమిది. గద్య పంక్తులతో పాటు శ్లోకాలు కూడా చెక్కబడ్డాయి. శాసనస్తంభం నలువైపులా 109 పంక్తులున్నాయని రామరాజుగారు లెక్కతేల్చారు.

తెలుగువారు సంస్కృత భాషాసాహిత్యాలకు చేసిన సేవలను ఆంగ్లంలో రాసినట్లే, FOLK SONGS OF ANDHRA PRADESH, FOLK TALES OF ANDHRA PRADESH, MOHARRAM FOLK SONGS అన్న పుస్తకాలను కూడా రామరాజుగారు ప్రచురించారు. అంతేకాదు, వారు ఉజ్జయిని కలకత్తా, కటక్, రాంచీ వంటి నగరాలలో జానపద విజ్ఞానం మీద ఆంగ్లంలో పత్ర సమర్పణ చేశారు. అవన్నీ 'GLIMPSES INTO TELUGU FOLKLORE' అన్న పుస్తకంగా 1991లో అచ్చువేయడం జరిగింది. 'జానపద సాహిత్యంలో రామాయణ కథలు', 'జానపద సాహిత్యంలో మహాభారత కథలు', 'తెలుగులో మార్మిక లక్షణాలున్న జానపద గేయాలు', 'జానపద కళారూపాలు', 'జానపద వైద్యవిధానం', వంటి ఎన్నో ఆసక్తికరమైన అంశాలపైన ఆంగ్లంలో వారు సమర్పించిన పత్రాలు విలువైనవి.

సదాశివారెడ్డి వంటి తెలుగువీరుల కథలు, సంస్థానాధీశుల కథలు, రాణుల కథలు, స్థానిక విశేషాలతో కూడిన ఎన్నో ఉదంతాలు కూడా వారు తెలియజేశారు. కుతుబ్‌షాహీ రాజులన్నా, ఆకాలం నాటి సంస్కృతి అన్నా రామరాజుగారికి ఎంతో అభిమానం. అందుకే విషయజ్ఞులైన పండితులతో ప్రత్యేకంగా వ్యాసాలు రాయించి పుస్తకం ప్రచురించారు.

1976 నుంచి రామరాజుగారు, వారి కుటుంబ సభ్యులు సత్యసాయి భక్తులు. బాబాగారి పూర్వ అవతారం షిర్డీసాయి బాబా అని భావించే భక్తులు షిర్డీకి వెళ్ళి దర్శనం చేసుకుంటారు. రామరాజుగారు అట్లా షిర్డీ వెళ్ళినప్పుడు శాంతారాం అనే వ్యక్తితో స్నేహం ఏర్పడింది. ఆయన గ్రంథాలయంలో 'SAINTS OF BENGAL', 'SAINTS OF TAMILNADU', 'SAINTS OF MAHARASTRA' ఇట్లా అనేక భాషలలో అనేక ప్రాంతాలకు సంబంధించిన మహాయోగుల గ్రంథాలున్నాయి. కాని తెలుగులో యోగుల గ్రంథాలు లేవు. 'బహుశా మీ తెలుగులో యోగులు లేరేమో' అన్న ఎత్తిపొడుపుతో కూడిన మాట శాంతారాం అన్నాడట. ఇది రామరాజుగారికి శూలపు పోటువలె తాకింది.

'త్రైలింగస్వామి వంటి మహాయోగి పుంగవుణ్ణి' గూర్చి వారికి తెలియనందుకు బాధపడ్డాడు. అంతే ఇక శేష జీవితాన్ని తెలుగు యోగి పుంగవులకు అంకితం చేశారు.

వారి జీవితాలు, వారి మహత్త్వాలు ప్రకటించడమే తమ ధ్యేయమని సంకల్పించుకున్నారు.

సురవరం ప్రతాపరెడ్డి గారు తమ సాంఘిక చరిత్రలో 20 మంది యోగులను ప్రస్తావించారు. రామరాజుగారు 'ఆంధ్రయోగులు' మొదటి సంపుటంలో 50 మంది యోగులను, రెండవ సంపుటంలో 50 మంది యోగులను, మూడవ సంపుటంలో 50 మంది యోగులను, నాలుగవ సంపుటంలో 60 మంది యోగులను పరిచయం చేశారు. వీటిలో మొదటి సంపుటం ఆంగ్లంలోనికి అనువదింప బడింది. ఇంకో వంద వరకు యోగుల చరిత్రలను రామరాజుగారు వయోభారం బాధిస్తున్నా, తమ కుమార్తె డాక్టర్ బి.రుక్మిణి సహకారంతో పూర్తిచేశారు.

తాము ప్రత్యక్ష దైవంగా నమ్మిన సత్యసాయిబాబా గారిని గూర్చిన 20 గ్రంథాలకు సంపాదకత్వం వహించారు. స్వయంగా వారిని గూర్చి రాశారు. రామరాజుగారు రష్యా, కెనడా, మలేషియా వంటి విదేశాలను కూడా పర్యటించి వచ్చారు. కాకతీయ విశ్వవిద్యాలయం పి.జి సెంటర్‌ను, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖను తీర్చిదిద్దిన పరిపాలనా దక్షులు. అనేక గ్రంథాలను, సాహితీ సంస్థలను వికాస పథంలో నడిపించిన కార్యదక్షులు. ఆచార్య బిరుదురాజు రామరాజుగారు స్వల్ప అనారోగ్యం కారణంగా 2010 ఫిబ్రవరి 8వ తేదీనాడు తుదిశ్వాస విడిచారు. దీనితో సాహిత్యలోకం చీకటిపల్లిగా మారింది.

## 21

# బొమ్మ హేమాదేవి

**– వి. శాంతి ప్రబోధ**

తెలంగాణ మలితరం రచయిత్రులలో బొమ్మ హేమాదేవి ఒకరు. మొట్ట మొదటి బహుజన రచయిత్రి. 1960–1980 మధ్యకాలంలో మహిళల నుండి సాహిత్యం వెల్లువయింది. చదువుకునే వారి సంఖ్య పెరగడంతోపాటే రాసేవారి సంఖ్యా పెరిగింది. జీవితానుభవాలు, సంఘటనల నుండి కథలు, నవలలుగా మలిచారు మహిళలు, అందులో ఒకరు బొమ్మ హేమాదేవి.

ఆమె అసలు పేరు రుక్మిణీదేవితోపాటు యమున అనే పేరు కూడా ఉంది. రాయడం ఆరంభం చేసినప్పుడు 'దేవీరమ' అని ఇంకో పేరు పెట్టుకున్నారు. ఆ పేరుతో 20 నవలలు, 40 వరకు కథలు అచ్చయ్యాయి. ఆ తర్వాత ఆమె రాసినవి ప్రింటు కావడం అకస్మాత్తుగా ఆగిపోయాయి. అప్పుడు 'బొమ్మ హేమాదేవి' అని కోడలు హేమ పేరు పెట్టుకున్నారు. ఆ పేరుతో రాసిన 'కుంకుమ పూలు' కథకు మొదటి బహుమతి వచ్చింది. అప్పటినుండి ఆమె ఆ పేరుతోనే తన రచనలు కొనసాగించారు. అలా బొమ్మ హేమాదేవి పేరు స్థిరపడిపోయింది.

హేమాదేవి రాసే నవలలకు కథలకి ఆధారం తనకు తెలిసిన కొందరి జీవితాలు, ఆమె భర్త నారాయణ.

'ఆయన ఏదో ఒకటి మాట్లాడతారు. నాకు థీమ్ దొరికిపోతుంది. ఆ అన్నయ్య కూడా ఓ పత్రికకి సంపాదకులు. నేను రాసే ఆ రకం కథల్ని చాలావరకు ఆ పత్రికలోనే పడుతూ ఉంటాయి' అంటూ తన కథలకు ముడిసరుకు ఎలా అందుతుందో కుంకుమపూలు కథకి బహుమతి వచ్చిన సందర్భంలో బొమ్మ హేమాదేవి చెప్పారు.

హేమాదేవి సాహితీ ప్రయాణం 1950లో ఆరంభించారు. అచ్చులో వచ్చిన మొదటి నవల భావన భార్గవి. అది 1960లో అచ్చయింది. ఆ తర్వాత నవధాన్యాలు, లవ్‌స్టోరీ, తపస్విని, సంభారతి వంటి నవలలు మొదలైనవెన్నో వచ్చాయి. ఆమె చివరి నవల వనజ అడవిపుత్రిక. 1995లో రాశారు. ఇది విప్లవోద్యమంలో, దళాలలో పనిచేసిన ఒక మహిళ ఆత్మకథ. వనజ ఉద్యమ జీవితాన్ని ఈ నవలలో చక్కని శైలిలో చిత్రించారు.

నవలా ప్రక్రియలో తెలంగాణా రచయిత్రుల్ని వేళ్ళపై లెక్కపెట్టొచ్చు. చాలా తక్కువమంది నవలలు రాశారు. అందులో బొమ్మ హేమాదేవి ఒకరు.

తరుణ పత్రిక నవంబరు 1974 సంచిక ముఖచిత్రంగా బొమ్మ హేమాదేవి ఫొటోతో ప్రచురించారు. ఆ సందర్భంగా వెనుక అట్టపై ఆమె గురించి ఆ పత్రిక ఎడిటర్ ఏ విధంగా వ్యాఖ్యానించారో చూద్దాం.

'లోగడ పది నవలలకు పైగా రాసినా ఆ తర్వాత ఎందుకో ఆమె రాయలేదు. పాఠకుల నుంచి, రచయితలు దూరంగా ఉండడం మంచిది కాదన్న సలహాపై 'కుంకుమ పూలు' కథ రాసి ఆంధ్రజ్యోతి 1973 దీపావళి కథల పోటీలో

మొదటి బహుమతి పొందారు. ఆ ప్రోత్సాహంతో ఇప్పుడు మళ్ళీ రాయడం - విజృంభించారు. ఆమె పుట్టింది నిజామాబాద్‌లో, ఉండేది హైదరాబాద్‌లో, డిగ్రీలు గొప్పవిగాలేవు. జీవితానికి కావలసినంత సంస్కారం జీర్ణించుకున్నారు. “కథలు రాయడం నా వృత్తికాదు. హాబీ’ అనే హేమాదేవి గారు ఆత్మీయుల జీవితాల్లోకి, తోటి మనుష్యుల జీవితాల్లోకి సానుభూతిపూర్వకంగా తొంగి చూస్తారు. ఏమైనా కనిపిస్తే ఏదో ఒక కథ సిద్ధం చేస్తారు. పాఠకులతో తమ భావాలను పంచుకుంటారు.

‘బంగారు గూడు’ నవల చాలా రోజుల తర్వాత శ్రీమతి హేమాదేవిగారు రాసిన హుషారైన చిన్న నవల.

ఆంధ్రభూమి డైలీలో సీరియల్‌గా వచ్చిన ‘ఆరాధన’ అశేష తెలుగు పాఠకుల ఆదరణ పొందింది. కథానాయకురాలు పార్వతి పాత్రను మహిళలకు ఆదర్శవంతంగా దిద్దారని అంటారు ఆనాటి పాఠకులు. మహిళా పాఠకులేకాదు పురుషుల్లోనూ ఆమె అభిమానులు ఎక్కువే. మీ రచన చదువుతుంటే సినిమా చూస్తున్న అనుభూతి కలుగుతుందని కొందరు అంటే, రచయిత్రి శైలి కవితా ధోరణిలో సాగుతోందని, సంభాషణలు చాలా చక్కగా ఉన్నాయని, వాస్తవ గాథను రాస్తున్నట్లున్నారని, ఉత్కంఠ కలిగిస్తూ, కథలోనూ కథనంలోనూ కొత్తదనం నింపుకుందని అంటారు. ‘ఆరాధన’ సీరియల్ ఒక అసాధారణ ప్రేమ కావ్యంలా సాగిందని, అవధులులేని ప్రేమకు ఈ సీరియల్ అద్దం పడుతోందని పాఠకులు లేఖలు పత్రికాఫీసుకు పంపేవారు. భగవాన్ పబ్లికేషన్స్, మద్రాసు వారు ఆరాధన ప్రచురించారు. ఆ పుస్తకం వెనుక అట్టపై పాఠకుల అభిప్రాయాలకు చోటిచ్చారు.

‘నవధాన్యాలు’ అనే నవల వీరి సునిశిత దృష్టికి నిదర్శనంగా నిలుస్తుంది.

భార్యాభర్తలు బయటికి వెళ్ళినప్పుడు భర్త ఎదురుగానే భార్యని సంఘవిద్రోహ శక్తులు కిడ్నాప్ చేసిన వాస్తవ సంఘటన తీసుకుని నవల రాశారు. నేరస్థుడ్ని పట్టుకుంటారు భర్త. కానీ భార్యను ఏలుకోలేను. ఏలుకుని చుట్టుపక్కల తలెత్తుకుని బతకలేను. కాబట్టి ఆమెను పుట్టింటికి పంపించెయ్యమని తల్లితో చెప్తాడు అతను. అప్పుడా తల్లి కోడలు పక్షాన నిలబడి మాట్లాడుతుంది. ఆమె కిడ్నాప్ అవడానికి కారణం ఆమెనా, ఆమె తప్పు చేసినట్లా, కాదు. అటువంటప్పుడు ఆమె ఇంటినుండి ఎందుకు వెళ్ళిపోవాలి అని కొడుకుని నిలదీస్తుంది. తన కోడలు ఇల్లు విడిచి వెళ్ళేదిలేదని కొడుకుకు స్పష్టం చేస్తుంది. నీవు ఇక్కడ తలెత్తుకోలేను అనుకుంటే ఈ ఊరి నుండి మారిపోవచ్చు అని కొడుక్కి సలహా ఇస్తుంది.

తన పాత్రల ద్వారా, తాను సృష్టించిన సాహిత్యం ద్వారా సమాజాన్ని సంస్కరించాలనే తాపత్రయం కనిపిస్తుంది రచయిత్రి బొమ్మ హేమాదేవి రచనల్లో.

స్త్రీలకు జరిగే అన్యాయాలపట్ల స్త్రీ సమస్యలపట్ల ఎంతో ముందు చూపుతో రచనలు చేశారామె. తమ రచనల ద్వారా స్త్రీలపట్ల జరిగే అన్యాయాలకు, అఘాయిత్యాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి అని ఉద్బోధిస్తున్నట్లుగా ఉంటుంది బొమ్మ హేమాదేవి సాహిత్యం.

సామాజికమైన ఇతివృత్తాలతో, ఆకర్షణీయమైన ప్రకృతి వర్ణనలు, ఆహ్లాదకరమైన అలంకారాలతో తెలుగునాట ఎంతోమంది హృదయాలు దోచుకున్న రచయిత్రి బొమ్మ హేమాదేవి. ఆమె రచనల్లో నైపుణ్యత చదువరులను ఆకట్టుకుంటుంది. ఆమె కథల్లో, నవలల్లో పాత్రల సంభాషణలు సూటిగా ప్రశ్నిస్తుంటాయి. ఆమె రచనలు ప్రధానంగా మహిళలకు సంబంధించినవో, సమాజంలో ఉన్న మహిళల వివిధ సమస్యలను తీసుకునో రాసినవై ఉంటాయి. అతి సాధారణంగా కనిపించే అంశాలను తీసుకుని అద్భుతమైన శైలితో వాస్తవిక దృష్టితో తెలుగు సాహితీసీమలో సౌరభాలు అద్దారు రచయిత్రి.

1973లో వచ్చిన ‘కుంకుమపూలు’ కథలో ప్రధానంగా కనిపించే అంశాలు... భర్త చనిపోతే భార్య కుంకుమపూలు ఎందుకు తీసేయకుండా ఉండడం ఒకటయితే, భర్త చనిపోయిన ఆమెకు మళ్ళీ పెళ్ళి చేయడం. భర్త చనిపోయాక చిన్నప్పటినుండి పెట్టుకున్న కుంకుమపువ్వులను తీసేయడం తగదనే అభ్యుదయ దృక్పథం కనిపిస్తుంది. ఆమె విశాల దృష్టిని తెలుపుతుంది.

**మచ్చుకు కథలో డైలాగ్స్ చూద్దాం**

తన భర్త పోయినప్పుడు కుంకుమ, పూలు తీసేసిన మొహాన్ని నలుగురికీ చూపలేక తల్లడిల్లిన తల్లి తన కూతురు శారద భర్త చనిపోతే కుంకుమ, పూలు తీయలేదని కొడుకుతో ఈ విధంగా అంటుంది.

'నీ చెల్లెలు చూడూ తన మొగుడు చచ్చినా కుంకుమ, పూలు, గాజులు పెట్టుకుని నన్ను చూడు నా వేషం చూడు అంటూ తిరుగుతోందిరా' అని కోపంతో కొడుకు ముందు అరుస్తుంది.

'కోపం తెచ్చుకోకుండా శాంతంగా వినమ్మా. పూలు కుంకుమకు భర్తకు ఏరకమైన సంబంధంలేదమ్మా. ఇవన్నీ మన భావనలు. పువ్వుల్లో కుంకుమల్లో అంత మహత్తు ఉంటె మరి ముస్లిమ్స్ ఎవరూ కుంకుమ పెట్టుకోరు. వాళ్ళ మగాళ్ళకుగాని, వాళ్ళింట్లోగాని ఆపద రాదెందుకు? క్రిస్టియన్స్ కొంతమంది గాజులు వేసుకోరు. చాలా దేశాల్లో పూలుకూడా పెట్టుకోరు.

'నుదిటి నిండా కుంకుమ, చేతినిండా గాజులు, ఒక్క తలలోనే రెండు తలలకు సరిపోయే పూలు పెట్టుకున్న వాళ్ళ భర్తలు తొందరగా పోయినవాళ్ళున్నారు. అలాంటప్పుడు కుంకుమ, పూలు, గాజులు ఏదో మహత్తు కాదని స్పష్టం కావడంలేదా' తల్లికి విశదం చేయ ప్రయత్నిస్తాడు ఆమె కొడుకు రవి.

మరో సంభాషణలో 'భార్య పోయిన రఘుని శారద పెళ్ళి చేసుకుంది. భర్త పోయిన శారదని విష్ణు పెళ్ళి చేసుకుంటాడు' అందులో తప్పేముంది అంటూ తల్లికి అర్థమయ్యేలా చెప్పడానికి ప్రయత్నించడం కనిపిస్తుంది.

పెళ్ళిచూపులు సాధారణంగా అమ్మాయి ఇంట్లోనో, గుళ్ళోనో మరెవరి ఇంట్లోనో ఏర్పాటు చేస్తారు. ఇది అందరికీ తెలిసిన విషయం. 1984 ఆంధ్రభూమి వారపత్రిలో వచ్చిన 'అభయ' కథలో అందుకు భిన్నంగా అమ్మాయికి తెలియకుండా రైలులో ఏర్పాటయ్యాయి పెళ్ళిచూపులు. ఆ విషయం తెలియని అమ్మాయి, అబ్బాయి ఎదురు బొదురు బెర్తుల్లో బెంగుళూరు నుండి హైదరాబాద్‌కు వస్తారు. ప్రయాణంలో వారు తమ సొంత పేర్లతో పరిచయం చేసుకోరు. కానీ వారి అభిప్రాయాల్ని నిర్మొహమాటంగా వెల్లడించుకుంటారు.

'మా ఇంట్లో కట్నాలు ఇవ్వము తీసుకోము. ఐనా ఈ చేతగానితనాన్ని ఓ సబ్జెక్టుగా తీసుకుని దాని గురించి చర్చించడం అంటే అసహ్యం నాకు 'తల్లిదండ్రులను ఆడవాళ్ళే ఎందుకు వదులుకోవాలి. మగవాళ్ళు ఎందుకు వదులు కోకూడదు' అంటుంది నా భార్య.

'ఆవిడ తల్లిదండ్రుల దగ్గర ఉంటుంది. తనకు ఇక్కడికి రావాలనిపించినప్పుడు వస్తుంది. నాకు వెళ్ళాలనిపించి నప్పుడు నేను వెళ్తాను' అని చెప్తాడు అతను.

మనం ఇక్కడ తడిమి చూసిన రెండు కథల్లోనూ నూతనత్వం కనిపిస్తుంది. సరికొత్త ఆలోచనాధోరణికి బాటలు వేయడం కనిపిస్తుంది.

ఇవేకాకుండా 'బాంచెన్ దొరసాని' అనే కథ వీరి కథన కౌశల్యానికి ఓ మచ్చుతునక. కనికరం చూపిన కారుణ్య హస్తాల అంతరంగ విశ్లేషణ ఈ కథలో కనిపిస్తుంది.

'హైదరాబాద్ టు మంథని' అనే కథ చాలా సుప్రసిద్ధమైంది.

'అన్నపూర్ణ, అభయ, ఆలింగనము, ఇజా జబ్ హై, ఏక్ స్కూటర్‌కీ వాపసీ, కమ్ లీ, కుంజ్ కిషోర్, చిరుదీపం, చోటీ చోటీ బాత్, నవతరం, పాక్స్ ప్రైడ్, మానవులు, మేఘన, మిస్టర్ అనంత్, రామాయణంలో రెండు ఉత్తరాలు, బంగారు గూడు, శాంతి నిలయం వంటి కథలు ఎన్నో ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి, తరుణ, జయశ్రీ, ప్రజాతంత్ర, కళాసాగర్, ప్రభవ, అనామిక, సౌమ్య, మొదలైన పత్రికల్లో వచ్చాయి.

'అప్పుడప్పుడూ మా ఆయన ఎంతో ఉదారంగా షాపింగ్ కోసం ఇచ్చే కొద్దిపాటి సొమ్ముల్ని నేను కథలు రాసుకోవడానికి తెల్లకాయితాలు తెచ్చుకోవడానికి ఉపయోగించుకుంటాను' అని బొమ్మ హేమాదేవి చెప్పినట్లు సీనియర్ రచయిత్రి నిడదవోలు మాలతి మహిళా రచయిత్రులపై రాసిన వ్యాసంలో పేర్కొన్నారు.

'కుంకుమ పూలుకు ఫస్ట్ ప్రైజ్ రావడం నా సంతోషం మాట ఎలా ఉన్నా చాలా ఆశ్చర్యంగా ఉంది' అన్నారంటుంది.

1973 ఆంధ్రజ్యోతి వారపత్రికలో తన గురించి చెబుతూ 'నా జీవితం గురించి ఏం రాయను మీకు, అతి సాధారణమైన జీవితాల్లో ఏం ఉంటాయని, పోతే కొన్ని రోజుల క్రితం మా చిన్నన్నయ్య పబ్లికేషన్స్ నుండి నేను రాసిన నవలలు కొన్ని ప్రింటయ్యాయి. నాకు పెళ్ళయ్యేంత వరకు చదువుకున్నాను. మా బావకి అంటే మా ఆయనకి, పిల్లలకి ఆయా పని చేస్తాను. హాబీస్ ఏమున్నాయి? వంట, పిల్లల్ని తిట్టడం, బావతో పోట్లాడ్డంతప్ప!' అని అన్నారు.

అమ్మ రాసే కథలకు, నవలలకు మొదటి పాఠకురాలు తామేనని చెబుతారు ఆమె పెద్ద కూతురు శోభారాణి.

నిజామాబాద్‌కు చెందిన రామాగౌడ్, గంగాదేవిల మొదటి సంతానం ఆమె. 1932 సెప్టెంబర్ 14 తేదీన నిజామాబాదులో జన్మించారు. హైదరాబాదులోని నారాయణగూడ బాలికోన్నత పాఠశాలలో మెట్రిక్యులేషన్ చదివారు. ఆమెకు చిన్న వయసులోనే అంటే 15వ ఏటనే వివాహం అయింది. ఆర్థికంగా ఉన్నత స్థాయి కుటుంబం. పేద ఇంటికోడలై ఆ యింటి పరిస్థితులకనుగుణంగానే నడుచుకునేది. ఆరుగురు పిల్లలతో సంసార బాధ్యతలతో తలమునకలవుతూనే రచనా వ్యాసంగం చేయడం గమనించదగ్గది. ఏ మాత్రం సమయం చిక్కినా ఆ సమయాన్ని రచనా వ్యాసంగానికి వినియోగించుకునేవారు హేమాదేవి. పని మధ్యలో పది పదిహేను నిముషాలు సమయం చిక్కినా కూర్చొని రాసుకునేవారు. రాసుకోవడానికి ప్రత్యేక సదుపాయాలు, వసతులు ఏమీలేవు. మూడ్ వస్తే రాయడం వంటివి ఏమి లేవు. సమయం దొరికితే చాలు కలం అందుకునేవారావిడ అని అంటారు శోభారాణి.

గుడిపాటి వెంకటాచలంతో ఎప్పుడూ ఉత్తరప్రత్యుత్తరాలు జరుపుతుండేవారనీ, సినారె. దేవులపల్లి కృష్ణశాస్త్రి వంటి కవులతో సాహితీ సాంగత్యం అమ్మతో సాహితీ ప్రయాణం చేయించాయి అంటారామె.

నిత్యం తన చుట్టూ ఉన్న సమాజాన్ని పరిశీలిస్తూ సాగే బొమ్మ హేమాదేవి రచనల్లో, ఆలోచనల్లో నవ్యత మనసును అబ్బురపరుస్తుంది. నూతన పోకడలకు బాటలు వేసే ఆమె రచనలు ప్రగతిశీలంగా ఉంటాయి. మధ్య తరగతి కుటుంబాల ఆర్థిక సమస్యలు, కుటుంబ సమస్యలు చాలా నేర్పరితనంతో కథలుగా అల్లారు ఆవిడ. చదువుకుని ఎదుగుతున్న యువతరం బాలబాలికలు స్త్రీలలో నూతన జీవితాన్ని సాకారం చేసుకోవడమే తాము ఉన్నత చదువులు చదువుకోవడానికి స్ఫూర్తినిస్తాయి. ఉత్తేజం కలిగిస్తాయి. ఆలోచింపచేస్తాయి. పాఠకలోకపు జీవితాలను మలుపు తిప్పడంలో దోహదం చేస్తాయి ఆమె రచనలు.

ఒకనాడు స్త్రీల సాహిత్యాన్ని వంటింటి సాహిత్యమని పేర్లు పెట్టారు. ఎద్దేవా చేశారు. కానీ చక్కని శైలిలో ఎంతో నైపుణ్యంతో మానవ జీవితాలకు అద్దంపెట్టి రచనలు చేశారు మహిళలు. బొమ్మ హేమాదేవి కూడా గతశీలమైన సమాజాన్ని పరిశీలిస్తూ, మానవ జీవితపు లోతుపాతుల్ని అంచనావేస్తూ, మనిషిలో జరిగే సంఘర్షణల్ని ఒడిసి పట్టుకుంటూ నిజ జీవితానికి దగ్గరగా రచనలు చేసేవారు. సమాజంలో జరిగే సంఘటనలు సన్నివేశాలు, కళ్ళముందు కదలాడే వ్యక్తుల జీవితాలు బొమ్మ హేమాదేవి కథల్లో ఇమిడిపోయేవి. అందుకే ఆమె రచనలు వాస్తవానికి చాలా దగ్గరగా కనిపిస్తాయి.

50కి పైగా ప్రజాదరణ పొందిన నవలలు, 100కు పైగా కథలు ముద్రణ అయినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ సంకలనాల్లో, రచయిత్రుల డైరెక్టరీల్లో ఈ రచయిత్రి పేరు ఎందుకు చేరలేదో ఆశ్చర్యం కలుగుతుంది. ఆమె తన రచనలను భద్రపరచి సంకలనం వేసే ఉంటే భవిష్యత్ తరాల వారికి ఎంతో సౌలభ్యంగా ఉండేది. అందుకు ఆమె ఆర్థిక పరిస్థితులు సహకరించి ఉండకపోవచ్చు. లేదా ఆవిడకే తన రచనలను భద్రపరచాలన్న ఆలోచన లేకపోవచ్చు. ఈ రోజుకీ ఆమె ఆలోచనల్లోని కొత్తదనం, చైతన్యం మాసిపోలేదు. నేటి సమాజానికి మార్పుకు దోహదం చేసే ఆమె రచనలు అవసరమే. ఏదేమైనా ఇప్పటికైనా ఆమె రచనలు భద్రపరచాల్సిన అవసరం, భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

22

# బూర్గుల రామకృష్ణారావు

**– డా॥ ఎస్.వి. రామారావు**

మహబూబ్‌నగర్ జిల్లా వాస్తవ్యులైన శ్రీ బూర్గుల యావదాంధ్రమునే గాక సువిశాల భారతావనిని సైతం తేజోవంతం చేసిన జ్యోతిర్మయుడు. ఆయన రాజనీతి దురంధరుడు. బహు భాషా కోవిదుడు. ఉత్తమ సాహితీవేత్త. సంస్కృతిజ్ఞుడు. గొప్ప సంస్కర్త. అనేక రంగాల్లో ఆరితేరిన ప్రతిభావంతుడు.

రామకృష్ణారావు గారు విళంబి సంవత్సరం ఫాల్గుణ శుద్ధ విదియ (13.03.1899) నాడు కల్వకుర్తి తాలూకా పడకల్లు గ్రామంలో తమ మాతామహులైన వెల్దండ శేషారావు గారి ఇంట జన్మించారు. వారి స్వస్థలం షాద్‌నగర్ తాలూకా బూర్గుల గ్రామం. చెట్లు అధికంగా ఉండడంతో దానికి ఆ పేరు వచ్చిందట. వీరి పూర్వీకులు దేశ పాండ్యాలు. జాగీర్‌దారులుగానే కాక పండితులుగా కూడా వాసికెక్కారు. వీరి ముత్తాత నరసింగరావు, తాత వెంకటేశ్వరరావు ఈ వంశంలో ప్రసిద్ధికెక్కినవారు. నియోగి బ్రాహ్మణులైన వీరు కౌండిన్యస గోత్రులు. రామకృష్ణారావు గారి తండ్రి పుల్లమరాజు నరసింగరావు. తల్లి రంగనాయకమ్మ. ఊరిపేరు ఇంటిపేరుగా పెట్టుకొనడం మహారాష్ట్ర సంప్రదాయం. రామకృష్ణారావు మహారాష్ట్ర దేశంలో విద్యాభ్యాసం చేసిన వారవడం చేత మహారాష్ట్ర సాహిత్యంలో గడపడం వల్ల ఈ సంప్రదాయాన్ని అవలంభించి ఉండవచ్చును.

వారి ప్రాథమిక విద్య ఇంటివద్దనే జరిగింది. అప్పటి కాలానికి అనుగుణంగా తెలుగు, ఉర్దూ, పార్సీ, ఉర్దూ భాషలు నేర్చుకుని తమ 11వ యేట హైదరాబాద్ ధర్మవంత్ ఉన్నత పాఠశాలలో మాధ్యమిక విద్యనభ్యసించారు. 1913లో మూడో ఫారం పరీక్షలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన పిదప కేస్కార్ (కేంద్ర మంత్రిగా ఉన్న కేస్కార్ తండ్రి)చే స్థాపించబడిన ఎక్స్.ఎల్.సి.ఎల్. ట్యుటోరియల్ కళాశాలలో చేరి 1915లో బొంబాయి విశ్వ విద్యాలయం వారి మెట్రిక్యులేషన్ పరీక్షలో ప్రథమ శ్రేణిలో కృతార్థులైనారు. మద్రాసు విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న నిజాం కళాశాల నుంచి 1918లో ఇంటర్మీడియెట్ పరీక్షలో ప్రథమ శ్రేణిలో విజయంపొందారు. ఇంటర్‌లో పార్సీ ద్వితీయ భాషగా చరిత్ర, తర్క శాస్త్రాలు ఐచ్ఛికములుగానూ ఉన్నాయి. తర్వాత పుణెలోని ఫెర్గూసన్ కళాశాలలో తర్క శాస్త్రం ఐచ్ఛికంగా బి.ఎ.ఆనర్స్‌లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై ఎల్లీస్ విద్యార్థి వేతనాన్ని పొందినారు. పట్టభద్రులైన పిదప బొంబాయి విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రం అభ్యసించి ఎల్.ఎల్.బి. పట్టాను పొందారు.

విద్యాభ్యాసం ముగించిన తర్వాత రామకృష్ణారావు గారు హైదరాబాద్‌లో 1923 నుంచి న్యాయవాద వృత్తిని అవలంభించారు. మొదట బారిస్టర్ మహ్మద్ అజ్ఘర్ వద్ద నాలుగు సంవత్సరాలు పనిచేసి తర్వాత హైదరాబాద్ (ఉర్దూ), సికింద్రాబాద్ (ఇంగ్లీష్) న్యాయస్థానాల్లో

స్వతంత్రంగా న్యాయవాద వృత్తిని కొనసాగించారు. విద్యార్థి దశలోనే (1912) వారి వివాహం జరిగింది. అనంతరం వారి భార్య మరణించగా... వారి దగ్గర బంధువులైన శ్రీమందుముల నరసింగరావు సోదరి అనంత లక్ష్మమ్మను వివాహమాడారు. తర్వాత వీరిరువురూ వియ్యంకులైనారు.

రామకృష్ణారావు గారి విశిష్ట వ్యక్తిత్వం చిన్ననాటి నుంచే వికసింపనారంభించింది. ఇంటర్ విద్యార్థిగా ఉన్నప్పుడే వారు తమ బంధుమిత్రులతో కలిసి యువక సంఘ్ (యంగ్‌మెన్స్ యూనియన్) స్థాపించారు. ఈ సంఘం ఆధ్వర్యంలో గ్రంథాలయం నిర్వహింపబడుతుండేది. అందు ఉపన్యాసాలు కొనసాగుతుండేవి. 1921లో హైదరాబాద్‌లో బాధ్యతా యుతమైన ప్రభుత్వం ఏర్పడాలని, రాజకీయ సంస్కరణలు జరగాలని మాడపాటి హన్మంతరావు, డాక్టర్ రంగారావు ప్రభృతులతో కలిసి సంస్కరణ సంఘ (స్టేట్ రీఫార్మ్స్ అసోసియేషన్) నివేదికను తయారుచేశారు. ఈ సంఘ సభ్యులుగా 1921లో అకోలాలో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. న్యాయశాస్త్ర విద్యార్థిగా ఉన్నప్పుడు ఇండియన్ సోషల్ రీఫార్మర్ పత్రికలో వరకట్న దురాచారాన్ని ఖండిస్తూ ఆంగ్లంలో వ్యాసాలు రాసి పాఠకులు, సంపాదకులు మన్ననలు పొందారు. 1922లో ఆంగ్ల ప్రభుత్వం వారు బీరార్‌ను నిజాంకు ఇచ్చివేయాలని కూడా పై పత్రికల్లోనూ, ఉర్దూ పత్రికల్లోనూ వ్యాసాలు రాశారు. వాటిని మెచ్చుకుని హైదరాబాద్ దివాను సర్ నిజామత్ జంగ్ వారికి పెద్ద ఉద్యోగం ఇస్తానని ఆహ్వానించారు. అయినా దేశభక్తుడైన రామకృష్ణారావు గారు ప్రలోభపడక నిరాకరించారు. న్యాయవాదిగా చాలా కేసులు ఉచితంగా వాదించి విశాల హృదయాన్ని ప్రదర్శించారు. న్యాయ పరిరక్షణకు పాటుపడడమే కాకుండా గొప్ప న్యాయవాదిగా ప్రఖ్యాతి గడించారు. పి.వి.నరసింహారావు వీరివద్ద జూనియర్‌గా పనిచేశారు.

నిజాం పరిపాలనలో అణచి ఉంచబడ్డ తెలుగు ప్రజలలో రాజకీయ చైతన్యానికి, సాంస్కృతిక వికాసానికి పునాది వేసిన మహనీయుడు శ్రీ బూర్గుల. 1926-27 సంవత్సరాలలో హైదరాబాద్‌లోని శ్రీకృష్ణదేవరాంధ్రాయ గ్రంథాలయానికి కార్యదర్శిగా ఉండి రజతోత్సవాలను ఘనంగా నిర్వహించారు. దేవరకొండలో 2వ ఆంధ్ర మహాసభకు (1931) అధ్యక్షత వహించారు. హైదరాబాద్ స్వదేశీ లీగ్, నిజాం సబ్జెక్ట్స్ లీగ్ మొదలైన వానికి కార్యదర్శిగా పనిచేశారు. నిజాం ప్రభుత్వాజ్ఞలను ఉల్లంఘించడం వలన 1942లోనూ, మరియు ఐదు సంవత్సరాల తర్వాతను కారాగారవాసం చేశారు. 1948 జనవరిలో భారత ప్రభుత్వ ఏజెంట్ జనరల్‌గా హైదరాబాద్‌కు వచ్చిన కె.ఎం. మున్షీ గారిని నిజాం ఆజ్ఞలకు విరుద్ధంగా అందరికన్నా ముమ్మందుగా సందర్శించి పరిపాలకుల ఆగ్రహానికి గురయ్యారు. ఆ సంవత్సరంలోనే కాంగ్రెస్ ప్రజాపక్షానికి నాయకునిగా నియమించబడి ప్రజాఉద్యమానికి సారథ్యం వహించారు. హైదరాబాద్ రాజ్యం భారతదేశంలో విలీనం కావడానికి కృషి సల్పిన నాయకుల్లో వీరు అగ్రగణ్యుడు.

రజాకార్ల అల్లర్లు, కమ్యూనిస్టుల అరాచక చర్యల్లో నలిగిపోయిన తెలంగాణ ప్రాంతంలో సుస్థిరత ఏర్పడటంలో కూడా వారు ప్రముఖ పాత్ర వహించారు. పోలీసు చర్య తర్వాత ఏర్పడిన వెల్లోడి ప్రభుత్వంలో (1950) రెవెన్యూ, విద్యా శాఖల మంత్రిగానూ, 1952లో జరిగిన ప్రథమ సార్వత్రిక ఎన్నికల్లో అఖండ విజయం పొంది ముఖ్యమంత్రి గానూ వారు హైదరాబాద్‌కు చేసిన సేవ సువర్ణాక్షరాలతో లిఖింపదగినది. నిజాం ప్రభువుల నిరంకుశ పాలన అంతమైన అచిరకాలంలోనే వారు తమ పరిపాలనా దక్షతతో సుస్థిరమైన ప్రజాస్వామ్య వ్యవస్థను ఏర్పర్చారు. జాగీర్‌దారు, మక్తేదారు పద్ధతులను నిర్మూలించి కౌలుదారీ చట్టం ప్రవేశపెట్టి భూసంస్కరణలు అమలు పరిచారు. ప్రాంతీయ భాషలో విద్యా బోధనకు పునాదులు వేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రమే ఉండి ఉంటే వారు చిరకాల ముఖ్యమంత్రి గా ఉండి ఉండేవారు. కానీ స్వార్థాన్ని పరిత్యజించి విశాల హృదయంతో ముక్కోటి ఆంధ్రుల ఐక్యత కోసం పాటుపడ్డారు.

తెలుగుదేశమే గాక ఇతర ప్రాంతాలు కూడా వారి సేవా భాగ్యాన్ని పొందాయి. 1956లో ఆంధ్రప్రదేశ్ అవతరణ అనంతరం కేరళ రాష్ట్ర గవర్నర్‌గా (నవంబర్ 56, జూన్ 60) వారు కనబర్చిన రాజనీతిజ్ఞత రాజకీయ మన్ననలు చూరగొన్నాయి. తర్వాత సువిశాలమైన ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి కూడా (జూన్ 60, ఏప్రిల్ 62)

గవర్నర్‌గా నియమింపబడి 1962 ఎన్నికల్లో రాజ్యసభ సభ్యుడిగా (62-66) ఎన్నికయ్యారు. 1967 ఎన్నికల నుంచే వారు రాజకీయ సన్యాసం చేశారని చెప్పవచ్చు.

రాజకీయ రంగంలోనే కాక సాంఘిక, సాంస్కృతిక రంగాలలో కూడా వారు చేసిన సేవ ప్రత్యేకంగా చెప్పుకోవల్సిందే. ఖాదీ బోర్డు విచారణ సంఘం, మధ్యప్రదేశ్ విషయ పరిశీలన సంఘం, ఆంధ్రప్రదేశ్ భారత్ సేవక సమాజం మొదలైన వానికి వారు అధ్యక్షులుగా ఉన్నారు. చరిత్ర, శాస్త్ర విజ్ఞానాల, తెలుగు, ఉర్దూ అకాడమీ, భారతీయ విద్యా భవన్ (ఆంధ్రప్రదేశ్ సంఘం), ప్రశాంతి విద్వత్ పరిషత్ (ఆంధ్రప్రభుత్వ శాఖ) అధ్యక్షులుగా వారు సలిపిన సాంస్కృతిక సేవ ప్రశంసనీయం. క్లాసికల్ లాంగ్వేజీ కమిషన్ అధ్యక్షులుగా, దక్షిణ భారత హిందీ ప్రచార సభ (మద్రాసు కేంద్రం), సంస్కృత విశ్వపరిషత్‌ల ఉపాధ్యక్షులుగా భాషా రంగంలో కూడా వీరు అపారమైన కృషిచేశారు.

శ్రీ బూర్గుల బహు భాషావేత్త. ఆంగ్లం, పార్సీ, ఉర్దూ, సంస్కృతం, మహారాష్ట్రం, కన్నడం తెలుగు భాషల్లో పండితుడు. కేరళలో ఉన్న రోజుల్లో మలయాళం కూడా అభ్యసించారు. ఆయా భాషాల్లో అనర్గళంగా ఉపన్యసించ గలిగేవారు. న్యాయవాద వృత్తిలో ఉన్నా, స్వాతంత్రోద్యమంలో ఉన్నా, రాజకీయంగా ఉన్నత పదవులు నిర్వహించినా, రామకృష్ణారావు గారిలోని సాహిత్యాభిలాష అనవరతం ద్యోతకమవుతూనే ఉంది. అధ్యయనం, సాహిత్య సృజన ఆయనకు నిత్య వ్యాపకాలు. వివిధ సందర్భాల్లో వివిధ భాషలలో వీరు రచించిన కవితలు, వ్యాసాలు, అనువాద రచనలే అందుకు సాక్ష్యాలు.

సమకాలీన సాహిత్య రంగంలోని ఉద్యమాల చేత ప్రేరేతులైన బూర్గుల కలం నుంచి తరుణ వయస్సులో భావగీతాలు వెలువడ్డాయి. కృష్ణశాస్త్రి, నండూరి మొదలగు కవుల చేత ప్రభావితులై ప్రణయ భావ రమ్యమైన పద్య, గేయ ఖండికలు వెలువరించారు. వారి తొలికావ్యం శ్రీకృష్ణ శతకం (1956), రామకృష్ణారావు గారు పుట్టపర్తి భగవాన్ శ్రీ సత్యసాయిబాబా గారి అనుగ్రహానికి పాత్రులై ప్రశాంత జీవితం గడిపిన ధన్యజీవి. బాబా భక్తులై ఆర్తితో రచించిన భక్తిపూరిత పద్యాలు 'పుష్పాంజలి' పేరుతో (1984) ప్రచురితమైనాయి. బూర్గుల పద్యాలు భావానుగుణమైన శైలితో సమాస బంధలములై, లలిత పద నిశితములై చక్కని ధార శుద్ధితో కొనసాగుతాయి. తొలిచుక్క (1990), నివేదన (1994) అనంతర కాలంలో వెలువడిన ఆయన కవితా సంపుటాలు.

భారతీయ విజ్ఞానానికి మూలకందమైన సంస్కృత భాషను రామకృష్ణారావు గారు ఆ కాలంలోనే సంప్రదాయ సిద్ధంగా అభ్యసించారు. కాళిదాసు మున్నగు కవుల సాహిత్యాన్ని గాఢంగా అధ్యయనం చేశారు. వైష్ణవ మత సంప్రదాయంలో జన్మించిన బూర్గుల ఆది నుంచి ఆధ్యాత్మిక పథంలో పయనించారనడానికి ఆయన రచించిన భక్తిరస పూరిత రచనలే తార్కాణం. శ్రీ వేంకటేశ్వర సుప్రభాతం, శ్రీ శృంగగిరి శారదాకృతి, శ్రీరామస్తవం, శ్రీనివాస పంచశతి మొదలగు సంస్కృత భాషా కవితలు. 'కవితామంజరి' (1992) సంపుటిలో సంకలితమైనాయి. ఆదిశంకరుల కనకధారా స్థవము (1964), సౌందర్య లహరి (1962), జగన్నాథుని పండితారాజ పంచామృతం (1965)లను ప్రౌఢశైలి పూరితమైన పద్యాలలో అనువదించి పండితుల ఆదరం పొందారు. భక్తి ప్రపత్తులతో పాటు వారి కవితా మాధుర్యాన్ని కూడా ఇవి వెదజల్లుతాయి.

పార్సీ భాషలో సౌష్టవ పరిజ్ఞానం గల బూర్గుల సూఫీ కవిగా పేరొందిన సర్ మద్ రుబాయిలను (124) 'నర్మద్ గీతము'లుగా (1984) అనువదించారు. తాత్విక కవిగా విశ్వవిఖ్యాతమైన ఉమర్ ఖయ్యాం రుబాయిలను (101) కూడా (1987) తెనుగించారు. ఆంగ్లం నుంచి కాకుండా నేరుగా పార్సీ నుంచి ఉమర్ ఖయ్యాంను అనువదించిన వారిలో దువ్వూరి రామిరెడ్డి తర్వాత గణనీయుడు బూర్గుల.

రామకృష్ణారావు గారు పూణేలో చదువుతున్నప్పుడే ఆంగ్లంలో కవితలు, సానెట్లు, వ్యాసాలు రాసి కాలేజీ సంచికల్లో ప్రచురించారు. థామస్ గ్రే ఎలిజీని 'మృత సంస్మృతి' పేరుతో స్వతంత్ర రచన అనిపించే విధంగా అనువదించారు. ఆంగ్ల భాషలో ఆయన స్వయంగా రచించిన భావగీతాలు 'ద డ్రీమ్ ఆఫ్ పొయెట్రీస్ అండ్ అదర్ పోయెమ్స్' పేరుతో వెలువడ్డాయి.

సృజనాత్మక రచయితగానే గాక సూక్ష్మ పరిశీలన దృష్టి గల విమర్శకులుగా కూడా రామకృష్ణారావు గారు

వాసికెక్కారు. వారి కవితా రచనలన్నీ ఒక ఎత్తు – సారస్వత విమర్శలు, వచనా రచనలు మరో ఎత్తు. తెలంగాణ నుంచి వెలువడుతుండిన 'శోభ, సుజాత, గోల్కొండ పత్రిక' మొదలగు సమకాలీన పత్రికల్లో వెలువరించిన వ్యాసాలు, వివిధ రచయితల గ్రంథాలకు కూర్చిన పీఠికలు బూర్గుల వివేచనాత్మక ఆలోచనలకు నిదర్శనాలు. వారి వ్యాస సంపుటి 'సారస్వత వ్యాస ముక్తావళి' (1956) పాఠ్యగ్రంథంగా ప్రశస్తి వహించింది.

ప్రాచీన, ఆధునిక సాహిత్యాలపై ఆయినది సమదృష్టి. అప్పకవీయం అంటే ఎంత అభినివేశమో ఎంకి పాటలన్నా అంతే అభిమానం. కాకునూరి అప్పకవి నివాసం గురించి చర్చలో అతను మహబూబ్‌నగర్ జిల్లా వాడని సోపపక్తికంగా నిరూపించారు. అప్పకవి పేరుకున్న నవచూతకురి, నవదళపురి గ్రామాలు తమ స్వస్థలమైన బూర్గులకు సమీపంలోని లేమా విల్లా, తొమ్మిది రేకులకు సంస్కృతీ కరణలు అని లెస్సగా గుర్తించారు. ఎంకి పాటలపై చెలరేగిన వాదాల గాలి దుమారాన్ని చెదరగొట్టి వాటి విశిష్టతను లోకానికి వెల్లడించారు. ఇంకా 'రెడ్డిరాజుల పాలపు మత సంస్కృతులు', 'ఉమర్ ఖయ్యాం' మొదలగు వ్యాసాలు కూడా పేర్కొనదగినవి.

ఉర్దూ, పార్సీ కవుల రచనల్లోని మేలి నిగ్గులను ప్రకాశం చేసిన వ్యాసాలు కూడా ఆయన కలం నుంచే వెలువడ్డాయి. 'పారశీక వాఙ్మయ చరిత్ర'ను తెలుగు విశ్వవిద్యాలయం ప్రకటించింది. దాశరథి 'గాలిబ్ గీతాల'కు సమకూర్చిన విపుల పీఠికలో గాలి జీవిత విశేషాలు, కవితా వైభవంతో పాటు గజల్ ప్రక్రియ వైశిష్టం హృద్యంగా వ్యాఖ్యాతమైనాయి. మానవ జీవితంలో శృంగారానికి నైసర్గిక ప్రాధాన్యం ఉందని, సాహిత్యం నుంచి శృంగారాన్ని విడదీయలేమని ఈ పీఠికలో ఆయన పేర్కొన్నారు.

రామకృష్ణారావు గారి పీఠికలు విజ్ఞాన పేటికలు అంటే అత్యుక్తి కాదు. కవియిత్రి అయిన ఔరంగజేబు కుమార్తె జేఉన్నిసా జీవిత చరిత్ర కవితా సౌందర్యాన్ని వివరించే వ్యాసం 'జేఉన్నిసా గేయ సంపుటి' సరోజిని దేవి అనువాద గ్రంథం (1982) పీఠికలుగా జతపర్చబడ్డాయి. దాశరథి 'మహేంద్రోదయం' గంగాపురం, హనుమచ్ఛర్మ 'దుంధుభి' ఆత్మకూరు గోవిందాచార్యుల 'గోవింద రామాయణం' మొదలగు కృతుల పీఠికలు కవి హృదయ ప్రకాశకంగా ఒప్పుతున్నాయి. ఇవన్నీ సేకరించి జ్యోతిర్మయి సాహిత్య సంస్థ 'బూర్గుల పీఠికలు' (1955)గా ప్రకటించింది.

బూర్గుల వ్యాస ముక్తావళిని చదివి స్పందించిన శ్రీశ్రీ ' మీ వ్యాసాలు చాలా బాగున్నాయి. గాఢమైన మీ పాండిత్యం, హృదార దృక్పథం నన్ను ఆకర్షించాయి. ముఖ్యంగా ఎంకిపాటల మీద మీరు రాసిన వ్యాసం ప్రశంసనీయమైనది' అని ఆంగ్లంలో లేఖ రాశారు. బూర్గుల పీఠికలను సమీక్షిస్తూ ఊట్ల కొండయ్య గారు 'బూర్గుల వారి వ్యాసాలు చదువుతుంటే సముద్రం ఒడ్డు నుంచి లోపలికి నడుస్తు న్నట్లుంది. కొంతదూరం వెళ్లిన తర్వాత మునిగి పోతాం, కొట్టుకు పోతాం మనం ఉండం. సముద్రం ఒక్కటే ఉ ంటుంది. అంత విశాలమూలమైనది వారి విద్వత్తు, విషయజ్ఞత అని ఉద్ఘాటించారు.

రామకృష్ణారావు గారి ఆంగ్లోపన్యాసాలు ఆయన భాష పటిమకే కాక గాఢమైన విషయ వివేచనకు కూడా తార్కాణాలు. కేరళ గవర్నర్‌గా ఉన్నప్పుడు చేసిన ఆంగ్ల ఉపన్యాసాలను 'ర్యాండమ్ రిఫ్లక్షన్స్' పేరిట ఆ రాష్ట్రప్రభుత్వం ప్రచురించింది. భారతీయ సంస్కృతి వైశిష్ట్యాన్ని చాటిచెప్పే మరొక గ్రంథం 'కల్చరల్ సింథసీస్ ఆఫ్ ఇండియా'గా ప్రకటితమైంది. ఆంధ్ర మహాభాగవతాన్ని సమీక్షిస్తూ హిందీలో రాసిన వ్యాసాలు గణనీయమైనవి.

బూర్గుల గ్రంథాలన్నీ ఆయన పరమపదించిన తర్వాతనే ముద్రితమై వెలుగులోకి వచ్చాయి. ఈ ప్రచురణల కృషిలో ప్రథమ స్మరణీయులు వారి పుత్రులు రంగనాథరావు, లక్ష్మీనారాయణ రావు గారు. వారి సహాయంతోనే కవితా సంపుటిని (నివేదన), పది పీఠికల సంకలనాన్ని (బూర్గుల పీఠికలు) ఈ వ్యాసకర్త జ్యోతిర్మయి సాహిత్య సంస్థ పక్షాన ప్రచురించగలిగారు. అంతకుముందే ఆచార్య వి.రామరాజు గారి సహకారంతో శ్రీరంగాపురం, శ్రీ సత్యసాయి భజన మండలి పక్షాన 'పుష్పాంజలి'ని ముద్రించారు. అసంపూర్ణంగా ఉన్న ఈ శతకాన్ని రంగనాథరావు గారు తమ పద్యాలతో పూర్తి కావించగలిగారు.

బూర్గుల సాహిత్యంపై పరిశోధన చేసి కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి పి.హెచ్.డి. పట్టా పొందిన డాక్టర్ మద్దాలి నాగభూషణం గారు, డాక్టర్ ఎం.పూర్ణానంద శర్మ

ఆధ్వర్యంలో తెలుగు, సంస్కృతం కవితా సంపుటాలు (తొలిచుక్క, కవితామంజరి) వెలువడ్డాయి. తెలంగాణలో విశిష్టమైన సారస్వత సేవ గావించిన ఆంధ్ర సారస్వత పరిషత్ రామకృష్ణాగారి జీవితకాలంలోనే శ్రీకృష్ణ శతకం, సారస్వత వ్యాస ముక్తావళి ప్రకటించింది. పారశీక వాంగ్మయ చరిత్రను ముద్రించిన తెలుగు విశ్వవిద్యాలయం వారు డి.రామలింగం రచించిన బూర్గుల జీవిత చరిత్రను (బహుముఖ ప్రజ్ఞాశాలి బూర్గుల 1989) ప్రచురించి ఆయన కీర్తి సౌరభాన్ని పరిమళింపజేశారు. దీని ఆంగ్ల అనువాదం కూడా (దేవులపల్లి సుదర్శనరావు) జ్యోతిర్మయి పక్షాన ప్రకటితమైంది.

విద్యార్థిగా ఉన్న పల్లవ దశ నుంచి అంతిమ శ్వాస వీడిన ప్రౌఢ పరిపక్వ దశ వరకు అవిచ్ఛిన్నంగా కొనసాగిన బూర్గుల రచనా వ్యాసాంగం ఆయనకు ప్రతిష్ఠను గడింపజేసింది. బహుముఖీయమైన ప్రజ్ఞాపాటవాలను ప్రతిఫలించే రామకృష్ణారావు గారు సారస్వత జగత్తులో సంప్రదాయం ప్రత్యయంతో పాటు అంతర్జాతీయ భావన కూడా ప్రస్ఫుటంగా గోచరిస్తుంది. ఆయన ఎంత లోకజ్ఞుడో అంత తత్వజ్ఞుడు.

'సంస్కృత శ్లోకం, పార్సీ గజల్, తెలుగు పద్యం'
– వెరసి బూర్గుల – దాశరథి

# 23 బోయ జంగయ్య

– మేరెడ్డి యాదగిరి రెడ్డి

కృషి వుంటే మనుష్యులు ఋషులౌతారు మహా పురుషులౌతారు' అన్నది డా॥ బోయ జంగయ్య విషయంలో అక్షరసత్యం. కవి, కథకుడు, నాటకకర్త, నవలాకారుడు, బాలసాహిత్య రచయిత ఎన్నెన్నో ప్రక్రియలల్లో దిట్ట జంగయ్య. అతి సామాన్య నిరుపేద దళిత కుటుంబంలో పుట్టి ఇంతింతై వటుడింతై అన్నట్లు అంచెలంచెలుగా ఎదిగి తెలుగు సాహితీ చరిత్రలో ఆణిముత్యంలా నిలిచారు.

నిజాం నిరంకుశపాలన, రజాకార్ల దౌర్జన్యాలు, దొరలు, దేశ్‌ముఖ్‌ల ఆగడాలు ప్రజలను భయభ్రాంతులు చేస్తున్న రోజులు. 1 అక్టోబర్ 1942లో నల్లగొండ జిల్లాలోని పంతంగి అనే మారుమూల గ్రామంలో జంగయ్య జన్మించాడు. వీరి తల్లిదండ్రులు ఎల్లమ్మ, మల్లయ్య. రెక్కాడితే డొక్కాడె కుటుంబం. నిత్యం కూలి కెళితే గాని పూట గడవని పరిస్థితి. అతిపేద దళిత కుటుంబంలో పుట్టి స్వయంకృషితో సాహిత్య శిఖరాగ్రం చేరాడు జంగయ్య.

పల్లెటూళ్లో పుట్టి పెరగడం వల్ల గ్రామీణ వాతావరణం తన జాతి జనుల బాధలను అర్థం చేసుకున్నాడు. అంటరానితనం, కుల వివక్ష కారణంగా జంగయ్యను పాఠశాలలో దూరంగా కూర్చోబెట్టేవారు. ఎన్ని అవమానాలు ఎదురైనా ఎదుర్కొని జంగయ్య నల్లగొండలో డిగ్రీ చదువు పూర్తిచేశాడు. బస్సు కిరాయిలేక నల్లగొండకు నడిచివెళ్లి చదువుకున్నాడు. సెలవురోజుల్లో తల్లిదండ్రులతో కూలికి వెళ్లేవాడు. ఇన్ని కష్టాలు పడ్డాడు కనుకనే తన రచనల్లో దళితుల జీవితాలను కళ్లకు కట్టినట్లు చూపించాడు. పేదల వేదనలు చూసిన జంగయ్య చదువుకునే రోజుల్లోనే 'కష్టసుఖాలు' నాటిక రాశాడు. డిగ్రీ పూర్తికాగానే నల్లగొండ ట్రెజరీ కార్యాలయంలో క్లర్క్ ఉద్యోగంలో చేరాడు. ఎ.టి.వో.గా పదవీ విరమణ చేశాడు.

తెలుగు సాహిత్యంలో జంగయ్యది విశిష్టస్థానం. అన్ని సాహితీ ప్రక్రియలలో అందెవేసిన చేయి. అందరిలాగే జంగయ్య ముందుగా కవిత్వం రాశాడు. ఆ తర్వాత కథలు, నవలలు, నాటికలు, బాలసాహిత్యం తనదైన శైలిలో రాశాడు. ఏది రాసినా తను నమ్మింది నిక్కచ్చిగా, నిర్భయంగా రాసి పాఠకుల మన్ననలను పొందాడు. వారు రాసిన సాహితీ ప్రక్రియల్లో ఒక్కోదాని గురించి పరిశీలిద్దాం.

నడుస్తున్న చరిత్ర, వెలుతురు, భోజకవితలు, పంచనామా ఇవి వారు రాసిన కవితా సంపుటాలు.

ఇక కథల విషయానికొస్తే లోకం, గొర్రెలు, ఎచ్చరిక, దున్న రంగులు, చీమలు, తెలంగాణ వెతలు, భోజ కథలు, బొమ్మలు, ఉప్పునీరు, ఇప్పపూలు, ఆమె, అడవిపూలు, బొగ్గులు దాదాపు 14 కథల పుస్తకాలు వెలువరించాడు జంగయ్య. 200పై చిలుకు కథలు వీరి కలం నుండి వెలువడ్డాయి.

ఇక నవలా సాహిత్యంలో జాతర 1978లో, ఓగడం 2003లో, పుట్టుమచ్చ 2011లో వచ్చాయి.

బాలసాహిత్యంలో బడిలో చెప్పని పాఠాలు, గుజ్జన గూళ్ళు, ఆటలపాటలు, మాటల ఆటలు, కొత్త పాఠాలు, మన నేతలు, టీవీ ముచ్చట్లు, మొదలగు పిల్లల పుస్తకాలు పిల్లల మనసులను రంజింప చేశాయి.

జీవిత చరిత్రల విషయానికొస్తే భారతరత్న అంబేద్కర్, సమతావాది జగజీవన్‌రామ్, కె.ఆర్. నారాయణన్, గుఱ్ఱం జాషువా పుస్తకాలు రాశారు. దాదాపు యాభై పైచిలుకు పుస్తకాలు వెలువరించాడు. వయోజన సాహిత్యంలో ముందుచూపు, తోటోడు తొడగోసుకుంటే, స్వయం నిర్ణయం, న్యూమోనియా మొదలైనవి. ఇలా అన్ని ప్రక్రియలల్లో తనదైన శైలిలో అట్టడుగు వర్గాల రచయతగా నిలిచాడు జంగయ్య. ఇక ఒక్కొక్క ప్రక్రియ గురించి పరిశీలిద్దాం.

ముందుగా కవిత్వం గురించి చూద్దాం. జంగయ్యది సరళమైన కవిత్వం. ముఖ్యంగా మినీ కవిత్వం ఆయన కత్యంత ఇష్టం. సామాజిక స్పృహ వున్న కవిత్వం, మూఢ నమ్మకాలు, కుల వివక్ష, దోపిడీల మీద ఎక్కుబెట్టిన సాహితీ బాణం జంగయ్య కవిత్వం.

వారి 'పావురాలు' కవిత ఆణిముత్యం. ఎంతో పేరు తెచ్చింది.

ఆలయ గోపురాల నుండి ఎగిరిన పావురాలు
ప్రభువు ప్రార్థన కోసం ఫాస్టర్ తలుపు తెరిచినపుడు
ఎగిరిన పావురాలు
అల్లాహెూ అక్బర్ మౌజమ్ పిలుపుకు ఎగిరిన
పావురాలు
అన్నీ కలిసి తిరుగుతున్నాయి అన్నీ కల్సి తింటున్నాయి
కాని పూజారి ఫాస్టర్ మౌజమ్ !!!?

ఇక్కడె ప్రశ్నార్థకంతో కవితను ముగిస్తాడు జంగయ్య.

ఇంకో కవితలో

'అమ్మా కుంటోన్ని పోయిరా – తల్లీ గుడ్డోన్ని వెళ్లిరా
మా తల్లి ముసలోన్ని పోపో!
ఏడుకొండలవాడా! వెంకటరమణా!
వస్తున్నా వుండు.' మినీ కవితా వుద్యమంలో అందరినోట వినిపించిన కవిత ఇది.

నల్లగొండ జిల్లాలో దొరలు, దేశ్‌ముఖ్‌లు రజాకార్లని నిరసిస్తూ రాసిన మరో కవిత

'భూమికోసం భుక్తికోసం తుపాకుల రొమ్ము లొడ్డి
వడిసేలు రువ్విన నేల గుండ్రాపల్లి రజాకార్ల
గుండాగిరికి గోరికట్టి పటేల్ పాశం పుల్లారెడ్డి
పనిపట్టిన ప్రాంతమిది'

తెలంగాణా సాయుధ పోరాటంలో ప్రజల పోరాట పటిమ ఈ కవితలో వివరించారు జంగయ్య. మతం గురించి రాసిన మరో కవిత

'ఎక్కడ ఈ మొగ్గలు పరిమళాన్ని విరజిమ్ముతాయోనని
వెలుతురు చూడకుండా చుట్టూరా
మూఢనమ్మకాల ముల్లపొదలు అజ్ఞానపు చీకటి తెరలు'

ఇలా జంగయ్య రాసిన కవితలన్నీ ప్రజలపక్షాన నిలబడి నిబద్ధతతో రాసిన కవితలే. తన కవితల్లో బలమైన వస్తువు, శిల్పానికి ప్రాధాన్యత నిచ్చాడు బోయ జంగయ్య.

కథల విషయానికొస్తే 14 కథల పుస్తకాలు అందులోని కథలు ఒక్కో కథ ఒక్కో ఆణిముత్యం. నిత్యం తాను చూసిన అనుభవించిన తన చుట్టూ వున్న బాదాతప్త బడుగు జీవులు, అట్టడుగు దళితులు, బహుజనుల జీవిత చిత్రాలే జంగయ్య కథలు. తన కథలల్లో మూఢవిశ్వాసాలు, కుల వివక్ష, స్త్రీలు, పిల్లలపై అత్యాచారాలు వీటన్నిటిని చీల్చి చెండాడాడు. జంగయ్య కథలలో తెలంగాణా మట్టివాసనలు కన్పిస్తాయి. గ్రామీణ జీవితాలు మన కళ్ల ముందు కదులుతాయి. జాతిని జాగృతం చేసి కళ్లు తెరిపించేవి జంగయ్య కథలు.

ముఖ్యంగా భోజ కథలలో బొమ్మలు, ఒయాసిస్ కథలు ఆలోచింప చేస్తాయి. కులంమతం అడ్డుగోడలు, పరస్పర విద్వేషాలు, మారణహెూమానికి కారణమనే విషయం తెలియజేస్తాయి. 'బొమ్మలు' కథ దేవుడు చేసిన మనిషి కంటే మనిషి చేసిన దేవుని బొమ్మకు ఎక్కువ విలువనిస్తూ వందలు, వేలు దేవునికి సమర్పిస్తూ, ఆకలితో నకనకలాడే మనిషిని ఈసడించుకుంటూ ఒక్కరూపాయి కూడా ఇవ్వని వైనం ఈ కథలో మన ముందుంచాడు జంగయ్య.

బోయ జంగయ్య 'ఎర' కథలో బడుగు జీవులకోసం

పనిచేస్తున్నామని గొప్పలు చెప్పుకునే రాజకీయ నాయకులను ఎండగడితే, 'సుడిగాలి' కథలో దేవతలుగా పూజలందుకునే ఆదస్వాముల కథలు బయటపెడతాడు.

ఎచ్చరిక కథలో రచయిత వెట్టిచాకిరి, శ్రమదోపిడిపై తిరుగుబాటు చేయమంటాడు. 'దొంగలు' కథలో లంచగొండులైన ఆఫీసర్ల భరతం పట్టమంటాడు. 'గత్తర' కథలో గత్తరపేరుతో గ్రామాల్లో జరిగే అమానుష కృత్యాలను బట్టబయలు చేస్తాడు. 'ఇప్పపూలు' కథలో పోలీసుల దౌర్జన్యాలను నిరసిస్తాడు. 'గొర్రెలు' కథలో రాజకీయ నాయకులు ఏ కులానికి చెందినా కార్యకర్తలను గొర్రెల్లా వాడుకుంటారని చెబుతాడు జంగయ్య.

జంగయ్య ప్రతి కథలోను సామాజిక స్పృహ గోచరిస్తుంది. బోయ జంగయ్య రాళ్ళని చీల్చుకొని వచ్చిన మొలక లాగ ఆవిర్భవించి ఆనాటి సామాజిక ప్రతిఘటనలు ఎదుర్కొని తెలుగు సాహిత్యంలో మహావృక్షంలా స్థిరపడ్డాడు. వీరి కథలు పలు యూనివర్శిటీలు ఉపవాచకాలుగా నిర్ణయించాయి.

ఇక నవలల విషయానికొస్తే జాతర, జగడం, పుట్టుమచ్చ. ఈ నవలల్లో సమకాలీన సమాజముంది. వాస్తవ చిత్రీకరణ వుంది. మూఢనమ్మకాలు మనుష్యుల జీవితాలతో ఎలా ఆడుకుంటాయో 'జాతర' నవల తెలియజేస్తుంది. భక్తిపేరుతో సాగిన మోసాలకు అక్షరరూపం 'జాతర'. దేవుడి పేరు చెప్పి తమ అవసరాలు తీర్చుకోవడం ఈ నవలలో అడుగడుగునా కన్పిస్తుంది. ఈ నవల ఆరు ముద్రణలు పొందింది. మైసూరు విశ్వవిద్యాలయం ఉపవాచకంగా నిర్ణయించింది. 2003లో తెలుగు యూనివర్శిటీ ఈ నవలకు పురస్కారం యిచ్చి జంగయ్యకు గౌరవ డాక్టరేట్ ప్రధానం చేసింది.

'జగడం' నవల నైజాం పరిపాలన, రజాకార్ల దుష్కృత్యాలు ఎదుర్కొని రాజం అనే దళిత యువకుడు యూనివర్శిటీ దాకా చదివి ప్రయోజకుడైన విషయం ఇందులో వుంది. ఇక మూడో నవల 'పుట్టుమచ్చ'లో ఓ దళిత గిరిజన యువతి 'మోతీ' కథ. ఇందులో రాజకీయ నాయకుల అకృత్యాలు, ఆఫీసర్ల ఆగడాలు, ఆడవారి వైపు వెకిలి చూపులు, అన్నిటిని ఎదిరించిన 'మోతీ' అనే లంబాడా ఆడపిల్ల కథ. మూడునవలలు ఆణిముత్యాలే.

ఇక నాటక రంగంలో మొదటిది 'కష్టసుఖాలు', తర్వాత 'కొత్తబాట, దేశం కోసం', ఎయిడ్స్ మీద రాసిన 'ఆలోచించండి'. ఈ నాటకాలన్నీ దేశభక్తి, జనహితం కోసం వ్రాయబడ్డాయి. కొన్ని నాటకాలలో జంగయ్య స్వయంగా నటించాడు కూడా!

బాలసాహిత్యంలో వీరివి ఐదుపుస్తకాలు వచ్చాయి. ఇవి పిల్లల మనస్సులు రంజింప చేశాయి. 'అంబేద్కర్' కవిత 8వ తరగతి తెలుగు విద్యార్థులకు పాఠ్యాంశంగా చేర్చబడింది. నూతన అక్షరాస్యుల కోసం ఐదు పుస్తకాలు రాశాడు జంగయ్య. అంబేద్కర్, జగ్జీవన్‌రామ్, కె.ఆర్. నారాయణ్ 'జాషువా' జీవితచరిత్రలు మనముందుంచాడు. వీరి కవితా కథల ప్రసంగాలు రేడియోలో వచ్చాయి. టి.వి.లో వీరి రచనలు ప్రసారమయ్యాయి.

ఏది రాసినా ఏది చెప్పినా అట్టడుగు వర్గాల పీడితులు, తాడితులు సమాజంచే వెలివేయబడ్డవాళ్లు, మూఢనమ్మకాలు, అంగవిన్యాసాలపై తిరుగుబాటు బావుటా బోయ జంగయ్య.

తొలినాళ్లలో ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు సాహితీవేత్త కాంచనపల్లి చిన వెంకట రామారావు మార్గదర్శకంలో రచనా వ్యాసాంగం చేశాడు. సాహితీ మిత్రులు, యువ రచయితల సమితి, జిల్లా రచయితల సంఘాలలో క్రియాశీలక పాత్ర పోషించాడు. నాలుగుసార్లు జరిగిన జిల్లా రచయితల సభల ప్రధాన కార్యదర్శిగా పనిచేశాడు.

బోయ జంగయ్యకు వచ్చిన అవార్డులు రివార్డులు లెక్కలేనన్ని. ఎచ్చరికకు శ్రీశ్రీ మెమోరియల్ పురాస్కారం, 'జాతర'కు తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం, చా.సో.(చాగంటి సోమయాజులు) స్ఫూర్తి అవార్డు, స్వరాజ్యలక్ష్మీ అవార్డు, మలయశ్రీ పురస్కారం, విశాల సాహితీ పురస్కారం, జాషువా పురస్కారం ఇలా ఎన్నో.

దేశవిదేశాలలో సాహితీకార్యక్రమాలలో పాల్గొన్నారు జంగయ్య. మలేషియాలో జరిగిన ప్రపంచ తెలుగు మహా సభలలో పాల్గొన్నారు. ఢిల్లీ, బెంగుళూరు, చెన్నైలలో అనేక

కథా సదస్సులలో పాల్గొన్నారు. చివరి రోజులలో తన శరీరం సహకరించకున్నా 'అవసరం' పేరిట తన ఆత్మకథను పుస్తకరూపంలో మనముందుంచారు. సాహితీ మిత్రులు తన పుస్తకాలను ప్రచురించారు.

అంచెలంచెలుగా ఎదిగి తెలుగు సాహితీరంగంలో అగ్రభాగాన నిలిచిన అభ్యుదయ రచయిత జంగయ్య. అందుకే ఆయన రచనలు శ్రీశ్రీ రావిశాస్త్రిలాంటి వారి ప్రశంసలు పొందాయి. డా॥ బోయ జంగయ్య 2016 మే నెల 7వ తేదీన పరమపదించి సాహితీలోకాన్ని దుఃఖసాగరంలో ముంచాడు. ఆయన లేకపోయినా ఆయన రచనలు సజీవంగా వున్నాయి. తెలుగు సాహిత్యం వున్నంతవరకు జంగయ్య రచనలు సజీవంగా వుంటాయి. తెలంగాణా సాహితీరంగంలో ధృవతార జంగయ్య.

# 24 బూర్గుల రంగనాథరావు

**- ఆచార్య ఎస్.వి. రామారావు**

తొలితరం కథా రచయితగా, సంస్థా నిర్వాహకుడిగా సాహితీసేవ గావించిన మహనీయుడు బూర్గుల రంగనాథరావు. తెలంగాణ వైతాళికుడు బూర్గుల రామకృష్ణారావు గారి జ్యేష్ఠ పుత్రుడైన రంగనాథరావు హైదరాబాద్‌లో స్థిరనివాసం ఏర్పర్చుకున్నారు. బి.ఎ., ఎల్.ఎల్.బి. పట్టభద్రులై ప్రభుత్వ ఉపకార్యదర్శి పదవిలో కొనసాగారు. తెలుగుతో పాటు.. సంస్కృతం, ఉర్దూ, ఇంగ్లీష్, హిందీ, మరాఠీ భాషల్లో ప్రావీణ్యం సంపాదించారు. దేవులపల్లి రామానుజరావు 'శోభ' పత్రికా నిర్వహణలో తోడ్పడడమే కాక.. 'దక్కన్ క్రానికల్' ఆంగ్ల దినపత్రికకు వార్తలు రాసేవారు. సంగీతం, నాటక ప్రియులైన ఆయన రెండు, మూడు నాటకాల్లో పాత్రలను కూడా అభినయించారు.

పిన్న వయస్సులోనే సాహిత్య సంఘాలను స్థాపించి సమకాలీన రచయితలకు ప్రోత్సాహాన్ని అందించిన విశాల హృదయులు ఆయన. 'ఆంధ్రకేసరి' సంఘ స్థాపకుల్లో ఒకరై ఐదారు సంవత్సరాలు 'ఆంధ్రకేసరి' లిఖిత మాసపత్రికను నిర్వహించారు. ఆంధ్రకేసరి గ్రంథమాల ప్రచురణల్లో ముఖ్యపాత్ర వహించారు. ఆయన స్థాపకాధ్యక్షులుగా ఉన్న 'సాధన సమితి' (1939-50) తెలంగాణ ఆంధ్రోద్యమంలో ప్రముఖ పాత్ర వహించింది. 'ప్రత్యూష' పేరుతో ఒక లిఖిత మాసపత్రిక ఈ సంస్థ పక్షాన నాలుగైదు సంవత్సరాలు వెలువడింది. యువ రచయితల రచనలు 'ప్రత్యూష ప్రచురణలు' పేరిట వేసేవారు. 1950 నాటికి 18 గ్రంథాలు ఈ సంస్థ పక్షాన ప్రచురితమైనాయి. వీటిలో కవితా సంకలనాలు (అంజలి, ప్రత్యూష), కథా సంకలనాలు (పాలవెల్లి, రంగవల్లి) పేర్కొనదగినవి. 1950లో ప్రచురితమైన 'ప్రత్యూష' తెలంగాణ కవుల కవితా సంకలనంగా (28 కవులు) ప్రశస్తి వహించింది. రంగనాథరావు ఆంధ్ర (తెలంగాణ) సారస్వత పరిషత్తు స్థాపనలో కూడా ముఖ్యపాత్ర వహించి సహాయ కార్యదర్శిగా కొనసాగారు.

రంగరాథరావు తొలి గ్రంథం 'వ్యాహ్యాళి' కథాసంపుటి 1943లో ప్రత్యూష ప్రచురణగా ప్రకటితమైంది. 1940-52 మధ్య సమకాలీన పత్రికల్లో (చిత్రగుప్త, గృహలక్ష్మి, భారతి, శోభ, ఆంధ్రకేసరి, భాగ్యనగర్, సారథి, ఆంధ్రభూమి మొదలగు) ఆయన కథలు వెలువడ్డాయి. పాలవెల్లి (1944), సాధన కథల సంపుటి (1953), పరిసరాలు (1వ భాగం, 1956)లో వీరి కథలు గోచరిస్తాయి. ఆకాశవాణి నుంచి కథలు, నాటికలు ప్రసారమైనాయి.

వ్యాహ్యాళిలో విముక్తి, సత్యం, రాజేశ్వరి ప్రమాదం, కళాజీవి కన్నీళ్లు, ప్రభ శీర్షికలతో ఆరు కథలున్నాయి. వీటితో పాటు పత్రికల్లో ప్రచురితమైన మరో పన్నెండు కథలు సేకరించి తెలుగు సాహిత్య పరిశోధనా కేంద్రం వారు 'బూర్గుల రంగనాథరావు సాహిత్య ప్రథమ సంపుటిగా ఇటీవలే ప్రచురించారు. వ్యాహ్యాళికి పరిచయ వాక్యం రాసింది ప్రముఖ కథకులు అడవి బాపిరాజు గారు.

'బూర్గుల రంగనాథరావు గారు నవ యవ్వనుడైన కథకుడు. నవయవ్వనుల వేడి రక్తము మనకు నాడీ పరీక్షకై ఇచ్చాడు. వైద్యులవడానికి బదులు మనమే ఉష్ణవాహక పూరిత హృదయాలతో ఆయా పాత్రలమైపోతున్నాం. భాషలోనూ, కథల కూర్పులోనూ చాలా ఉత్తమ స్థితికి పోయే కవి. పాశ్చాత్య కావ్య లక్షణాల ప్రకారంగా కథానికానికి ఉండవలసిన లక్షణాలు ఈ రచయిత కథల్లో చాలా ఉన్నవి' అని ప్రశంసించారు. 1949 ఏప్రిల్ 16 నాటి కృష్ణాపత్రికలో 'కాంతం కథారచయిత' మునిమాణిక్యం, నరసింహారావు, ఈ వ్యాస సంపుటిని సమీక్షిస్తూ ఇలా పేర్కొన్నారు.

'నిస్సారమైన, నిరుత్సాహమైన జీవితాన్ని సారవంతం గానూ, ప్రోత్సాహంగానూ చేసుకోగల భావకుడు ఇతడు. అందుకనే ప్రకృతిలో ఉన్న రమణీయమైన వస్తువులన్నింటిని తెచ్చి పెట్టుకున్నాడు. ఈయన హృదయంలో మిక్కిలి సౌందర్యమైన వస్తువులను ప్రకృతిలోంచి దొంగిలించిన రమణీయకతనూ దాచి పెట్టుకున్నాడు' అంటారు.

ఈతని హృదయంలో 'దిక్కులను చప్పరిస్తూ వచ్చే ఎండపొలుపులు, వెచ్చని మధ్యాహ్నంలో గంభీరమైన నిశీధాలు' ఉన్నాయి. మెలికలు చుట్టుకున్న పొగమంచులా ఉన్నవి. 'తన కాంతికి తానే దిగ్భ్రమచెంది ఆశ్చర్యంతో చూస్తున్న చంద్రుడూ' ఉన్నాడు. ఇంకా సున్నితమైన వస్తువులు ఉన్నవి'.

తరుణ వయసులోనే రంగనాథరావు పద్యాలు, గేయాలు రచించారు. భావకవితా యుగప్రభావం వీరి కవితా రచనలపై కనిపిస్తుంది. లయాత్మకంగా వాడుక భాషలో గేయాలు వ్రాశారు. ప్రణయం, దేశభక్తి వీరి కవితలలోని ప్రధాన వస్తువులు. సాహిత్య రచనల పట్ల ఉన్న ఉత్సాహం వాటి ముద్రణపై కనబరచలేదు. వారి కవితలు, అనువాద కావ్యాలు, చివరిదశలోనే ముద్రణ పొందాయి. 1934-44 మధ్య రాసిన పద్యాలలో కొన్నింటిని ఏరి 'అభిమానం' పేరుతో 1995లో ప్రచురించారు. వివిధ వస్తు విషయకము లైన కొన్నింటిని 30 ఖండికలలో సుమారు నూరు పద్యాలున్నాయి. ఇది వీరి స్వతంత్ర కావ్యం.

'రంగనాథరావు గారి కవితాభిమానం ముప్పది పాయలుగా సాగినది. ఇందులో కొన్ని కన్నీటి కాలువలు, కొన్ని పన్నీటి జల్లులు, కొన్ని నిరాశ నిస్పృహలు, మరికొన్ని భక్తి రసనిర్భరాలు. భగవన్మహిమాను భావనలు, ఆత్మవేదన శీలములు ఇంకొన్ని. ఇందులో ఉగాదుల కవితలతో పాటు దేశభక్తుల స్మరణలు, దురంతాల యెడల ప్రతిస్పందనలు, మతోన్మాదులకు మందలింపులు, చమత్కార చారువులైన చాటువులు, రవీంద్ర కవీంద్రునికి అనువాదాలు కూడా చోటు చేసుకున్నవి. అంత చిన్న వయసులోనే ఇంత చక్కని ధారా శుద్ధి భావ గాంభీర్యము నిసర్గ రమణీయాలంకారపూర కవితా వ్యాసంగం చేయడం రంగనాథరావు గారి పూర్వజన్మ సుకృతమని చెప్పవలెను' అని ఆచార్య బి.రామరాజు గారు ఈ కవితా సంపుటికి 'ఆమోదం' తెలిపినారు.

రకరకాల పూలతో అల్లిన కదంబమాల సరస్వతికి కంఠహారంగా అలంకరించినట్లు, ఈ కవితా కదంబమాలను రంగనాథరావు గారు సాహిత్య సరస్వతికి అలంకరించారు.

ఈ కవితా సంపుటిలో ఒక యువకవి, ఒక విద్యార్థి, ఒక సంస్కర్త, ఒక భావకవి, ఒక అభ్యుదయ కవి... ఇలా భిన్నభిన్న ఛాయలలో తరుణ భాస్కరునిలా ప్రభాసించారు కవి.

'ఈ కవితలు ఏ నాటివి! అరవై వసంతాల నాటివి. అయినా ఈనాటికీ సార్థకమై, చైతన్య దీప్తివంతమై అలరారడం విశేషం' అని ముక్తేవి భారతి ఉగ్గడించారు.

'నిత్య జీవితము నే నిర్వచించుటయైన
భావనా శక్తిచే బలుకువారు
రసరంగమందు పెంపనగ సుద్రేకంబు
కలముతో బోరాడగలుగువారు
శైలిధారాశుద్ధి శబ్దార్థ శక్తుల
శీలవృత్తిని విమర్శించువారు
విజ్ఞాన శాస్త్రీయ విషయంబులను దెల్పు
వ్యాసముల్ ఘనంగా వ్రాయువారు'

వంటి పద్యాలు శ్రీనాథుని సీసపద్య రచనను తలుపునకు తెస్తాయి. వారి కవితా శైలికి కొన్ని ఉదాహరణలు.

'ఆశ చేతనె మానిసి యడుగుబెట్టు
జీవితమ్ముకు ఆశయే జీవగఱ్ఱ
అనుదినము ఆశ కొట్టుకలాడుచుండు
ముందు క్షణమున యానంద ముందుననుచు'

'గ్రుంకు సూర్యుడు నొక్కొక్క సంకటమును
వెంటగొని పోవ గండము వెళ్లెననుచు
ఉదయభానుడు క్రొత్త సంపదల దెచ్చు
ననుచు పెన్నాస మనుజుల నావహించు'

వైష్ణవ భక్తాగ్రగణ్యులైన రంగనాథరావు భక్తి తత్పరతతో కూడిన దివ్య ప్రబంధాలను పద్యరూపంలో ఆంధ్రీకరించారు. ఆండాళ్ 'తిరుప్పావై', యమునాచార్యుల 'శ్రీ ఆళవన్దార్ స్తోత్రం', వేదాంత దేశికుల 'శ్రీ హయగ్రీవ స్తోత్రం' వారి వైష్ణవ సంప్రదాయ పరిజ్ఞానానికి, సరళమైన పద్యరచనా శైలికి నిదర్శనంగా ఉన్నాయి. సీస, గీత మాలికలలో విరచితమైన 'తిరుప్పావై'లో (1994) తమిళ మూలం కూడా చేర్చబడింది. ఆలవందారు అను నామాంతరం గల యమునా చార్యులు సంస్కృతంలో రచించిన స్తోత్ర రత్నాలను మార్గ, దేశి వృత్తాలలో యథామూలంగా అనువదించారు. వేదాంత దేశికులుగా ప్రసిద్ధికెక్కిన వేంకటనాథుల 'హయగ్రీవ శతకము'ను మూలశ్లోక సహితంగా తెనుగించారు. ఇవేకాక, దేశికుల వారి లఘుస్తుతి రచనలు – శ్రీ భూస్తుతి, శ్రీ గోదాస్తుతి, శ్రీ స్తుతిలు, ముకుందమాల మున్నగు కృతులను కూడా ఆంధ్రీకరించారు. శంకర భగవత్పాదుల 'భజగోవిందం' (మోహ ముద్గరం) పద్యానువాదం వెలువరించారు.

తమ రచనలకంటే తమ తండ్రిగారైన బూర్గుల రామకృష్ణారావు గారి అముద్రిత గ్రంథాలను వెలుగులోకి తేవడానికి రంగనాథరావు ఎంతో శ్రమించారు. వారి సహకారంతో 'బూర్గుల పీఠికలు' 'నివేదన' 'కవితా సంపుటి' మొదలైన రచనలు ఆయన సంపాదకత్వంలో వెలువడ్డాయి. ఆఖరు క్షణం వరకు సాహిత్యసేవకావించి తమ 90వ ఏట 2008 జూలై 2న పరమపదించిన రంగనాథరావు గారు 'జీవితానుభవంతో పాటు వేదాంత, సాహిత్యానుభావాలు పుష్కలంగా పండించుకున్న సాహితీమూర్తులు'.

# 25 సి. నారాయణరెడ్డి

– డా॥ జె. చెన్నయ్య

అక్షరాస్యత కాదు విద్యాగంధం సైతం అంతంత మాత్రంగా వున్న తెలంగాణ జానపదంలో పుట్టి జానపదుల మాట, ఆట, పాటల బడిలో పెరిగి ఇంతింతై విరామ్మూర్తిగా ఎదిగి జ్ఞానపీఠాన్ని అధిరోహించినవాడు డా. సి. నారాయణరెడ్డి. ఆయన జీవనగాథ స్ఫూర్తి దాయకమైంది. ఆయన నడిచివచ్చినదారి కవితాకర్పూర కళికలమయమైంది.

1931 జూలై 29న కరీంనగర్ జిల్లా సిరిసిల్ల తాలూకా హనుమాజీ పేటలో నారాయణరెడ్డి జన్మించారు. తల్లిదండ్రులు బుచ్చమ్మ, సింగిరెడ్డి మల్లారెడ్డి. తనకంటే ముందు ఒక కొడుకు చనిపోతే ఊళ్ళో ఒక ఇంట్లో సత్యనారాయణవ్రతం జరుగుతున్నప్పుడు బుచ్చమ్మ మొక్కుకున్నది. నాకు కొడుకు పుట్టి క్షేమంగా ఉంటే నీ పేరు పెట్టుకొంటానని. అలా జన్మించిన కొడుకుకు సత్యనారాయణరెడ్డి అని పెట్టుకుంది. పేరులోని సత్యం కవిత్వంలోకి, జీవితంలోకి ప్రవహించింది. నారాయణరెడ్డి లోకప్రసిద్ధుడైనాడు.

ఖాన్గీబడిలో అక్షరాలు దిద్దుకొని, సిరిసిల్లలో మాధ్యమిక విద్య, కరీంనగర్‌లో ఉన్నత పాఠశాల విద్య, అనంతరం హైదరాబాద్ చాదర్‌ఘాట్ కళాశాలలో ఇంటర్, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బి.ఎ, ఎం.ఎ. పూర్తి చేశారు. నారాయణరెడ్డి పాఠశాలలో చదువుతున్నప్పుడే నిజాం వ్యతిరేకపోరాటంలో పాల్గొన్నారు. 'సత్యాగ్రహం చేశారు. సైనికులం మేం సైనికులం' అని పాటలు పాడుతూ ఊరేగింపులో పాల్గొన్నారు. 'క్విట్ స్కూల్' ఉద్యమంలో పాఠశాల కొంతకాలం మానేశారు.

సాహిత్య వాతావరణంలేని కుటుంబ నేపథ్యంలో జన్మించినా, ఉర్దూ మాధ్యమంలో డిగ్రీవరకు విద్యాభ్యాసం చేసినా తెలుగుమూర్తిగా వికసించిన సినారె ఒక అసాధారణ ప్రతిభాశాలి. చిన్నప్పుడు పల్లెప్రజల నిసర్గసుందరమైన సంభాషణారీతి, జానపద కళారూపాలు నారాయణరెడ్డిని భాషా సాంస్కృతిక వ్యక్తిత్వాన్ని మలిచాయి. హరికథలను మైమరచి వినేవారు. ఆ సమాహార కళలోని పాటలు, పద్యాలు, చతుర కథారీతి, కథన చలనం ఆకట్టుకోవటమే కాదు పాటలు, నాటకాలు ఆశువుగా అల్లే అభిరుచిని నూరిపోశాయి. 6, 7 తరగతుల్లో వున్నప్పుడే భక్తప్రహ్లాద, సీతాపహరణం, రఘుదేవ రాజీయం వంటి నాటికలు రాసి మిత్రులతో కలిసి ప్రదర్శించారు. 'ఒకనాడు ఒక నక్క ఒక అడివిలోపల' అంటూ సీసపద్యం రాస్తే, ఉపాధ్యాయుడు ధూపాటి వెంకటరమణా చార్యులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మరికొన్ని మెలకువలు చెప్పారు. ఇంటర్మీడియెట్‌లో ఉండగా జువ్వాడి గౌతమరావు 'జనశక్తి' పత్రికలో తొలికవిత ప్రచురితమైంది. బి.ఎ.లో ఉండగా పాములపర్తి సదాశివరావు సంపాదకత్వంలో వెలువడే కాకతీయ పత్రికలో

రచనలు ప్రచురితమయ్యాయి. ఇది 1950కి ముందే జరిగింది.

21 ఏళ్ళ వయసులో నారాయణరెడ్డికి రేడియోతో అనుబంధం ఏర్పడింది. 1952లో బి.ఎ విద్యార్థిగా ఉస్మానియా విశ్వవిద్యాలయములో విద్యాభ్యాసం చేస్తున్నప్పుడు హైదరాబాద్‌లో ఖైరతాబాద్‌లో వున్న దక్కన్ రేడియోలో ప్రసారమైన 'సాగుమా ఓ నీలమేఘమా గగనవీణా మృదులరావమా' అన్న గీతం నారాయణరెడ్డి పరిణత కవిగా ఎదిగేదశలో తొలిమెట్టుగా నిలిచింది. 'పూలపాటలు', 'చిరుగజ్జెలు' ఉపద్రేష్ట కృష్ణమూర్తి సంగీత దర్శకత్వంలో రూపొంది ప్రసారమయ్యాయి. 'నవ్వనిపువ్వు' గేయనాటిక ప్రసారమైంది. బుచ్చిబాబుగారు ప్రత్యేకంగా రాయించిన 'అజంతా సుందరి', ఆ తర్వాత 'రామప్ప' సంగీతరూపకం ఆకాశవాణి జాతీయ పోటీల్లో ప్రథమ బహుమతి తెచ్చి పెట్టింది. 12 భాషల్లోకి అనువాదమైంది.

ఇంటర్ రెండో సంవత్సరంలో ఉండగా రెడ్డి హాస్టల్‌లో జరిగిన అఖిలాంధ్ర కవి సమ్మేళనంలో విద్యార్థి కవిగా వానమామలై, దాశరథి, తల్లావఝుల, కృష్ణశాస్త్రి, జాషువా తదితర అగ్రశ్రేణి కవుల సరసన పాల్గొన్నారు సినారె. దాశరథితో పరిచయం అదే తొలిసారి. అదిమొదలు దాశరథి ప్రోత్సాహం తనను మునుముందుకు నడిపించిందని చెప్పుకున్నారు సినారె. ఆ సోదరప్రేమకు గుర్తుగా 'జలపాతం' కవితాసంపుటిని దాశరథికి అంకితం చేశారు.

1952లో బి.ఏ. ఫైనల్ విద్యార్థిగా వున్నప్పుడే తెలంగాణ రచయితల సంఘాన్ని స్థాపించి కార్యదర్శిగా వున్నారు. సంఘానికి తర్వాత అధ్యక్షుడయ్యారు. తెలంగాణ జిల్లాల్లో అంతటా పర్యటించి కవితా పఠనాలు, కవితాత్మక ప్రసంగాలు చేసి ఆనాడే ఈ ప్రాంతంలో కవితా చైతన్యాన్ని పెంపొందించేందుకు కృషి చేశారు సినారె.

ఉస్మానియా విశ్వవిద్యాలయం నారాయణరెడ్డి కవితామూర్తిని అంచెలంచెలుగా సమున్నతస్థాయికి తీసుకువెళ్ళింది. 1954లో బి.ఏ, ఎం.ఏ. పూర్తి చేసి సికింద్రాబాద్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో తెలుగు అధ్యాపకునిగా ప్రవేశించారు. తర్వాత నిజాం కళాశాలలో, ఆ తర్వాత ఆర్ట్స్ కళాశాలలో ఆచార్యత్వం, తనకు సాహిత్య విద్యనేర్పిన గురువులు కె. గోపాలకృష్ణారావు, దివాకర్ల వేంకటావధానితో కలిసి ఆచార్యులుగా పనిచేసిన అరుదైన ఖ్యాతి సినారెకు ఆనాడే దక్కింది. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో డిగ్రీ తరగతులకు కూడా తెలుగు పాఠాలు చెప్పారు. ఆ రోజుల్లో డిగ్రీలో ఇతర అధ్యయనాంశాలు చదువుతున్న విద్యార్థులు సైతం సినారె పాఠాలు వినేందుకు గుంపులు గుంపులుగా వచ్చేవారు. ప్రాచీన, ఆధునిక సాహిత్యంలో ఏ పాఠం చెప్పినా అది విద్యార్థుల పాలిటి కళాప్రదర్శనగా ఉండేది. పాఠం చెప్పడానికి అన్ని విధాలా సిద్ధమైపోవడం, సమయానికి తరగతి గదిలో ప్రవేశించడం, అనర్గళంగా గంటన్నరసేపు పాఠం చెప్పడం, తనకిచ్చిన వ్యవధిపూర్తవుతుండగానే గది నుంచి నిష్క్రమించడం అదంతా ఒక మరువలేని అనుభవం. ఆయన పాఠాలు విన్న మధురానుభవాన్ని ఈనాటికీ గుర్తుచేసుకొనే విద్యార్థులెందరో! ఖండవల్లి లక్ష్మీరంజనం పర్యవేక్షణలో 'ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయములు - ప్రయోగములు' అన్న అంశంపై పీ.హెచ్.డి. చేశారు. పరిశోధనాంశాన్ని సూచించిన వారు దేవులపల్లి కృష్ణశాస్త్రి.

1961లో సినీ గీతరచన ప్రారంభమైంది. హైదరాబాద్ సారథీ స్టూడియోలో ఒక సినిమా చిత్రీకరణలో వున్న నందమూరి తారకరామారావు సినారెతో ప్రస్తావన చేశారు. అప్పటికే తాను రాసిన పాటల్ని ఎన్టీఆర్‌కు వినిపించారు. తొలిచిత్రంలో అన్ని పాటలు తనవే ఉండాలన్న కోరికను వ్యక్తపరచారు. గులేబకావళి కథ సినిమాకు అప్పటికే ఒకరిచేత ఒక పాట రాయించి వున్నారు ఎన్టీఆర్. అయినా సినారె అభిమతాన్ని అనుసరించి ఆ కవికి నచ్చజెప్పి అన్నిపాటలు రాయించారు. పాటలు రాసేందుకు మద్రాసు రైల్లో వెళ్ళిన సినారెను ఎన్టీఆర్ స్వయంగా స్టేషన్‌లో స్వాగతించారు. ఆనాడే పెద్ద వాహనశ్రేణి అంటే కాన్వాయ్‌తో సినారెను ఘనంగా గౌరవించారు. తొలుత రాసిన పాట 'కలల అలలపై తేలెను'. కాని తొలుత రికార్డయ్యింది 'నన్ను దోచుకుందువటె వన్నెల దొరసాని'. ఎన్టీఆర్, జమునలపై చిత్రీకరించారు. నాటి నుంచి ఎన్టీఆర్‌తో గీతానుబంధం, గాఢమైన స్నేహానుబంధం. ఎన్టీఆర్ చివరి దశవరకూ అవిచ్ఛిన్నంగా కొనసాగింది. 1961 నుండి 1990 వరకు డా. సి. నారాయణరెడ్డి సినీగీత రచన ఒక స్వర్ణయుగం.

ప్రాచీనాధునిక కవిత్వధ్యయనానుభవం వల్ల సినారె ప్రతిపాటలో తన కవిత్వముద్రను నిలిపారు. పేర్కొనదగ్గ పాటలు ఎన్నో...! మొత్తం సుమారు 3వేల పాటలు రాశారు.

నిజానికి సినీ గీతరచన సినారె బహుముఖప్రజ్ఞల్లో ఒక పార్శ్వం మాత్రమే. తను ఎదుగుతున్న నాటికే తెలుగు కవితా రంగంలో ఎందరో గొప్పగొప్ప కవులున్నారు. అప్పటికే అగ్రకవులతో పోటీపడుతూ పద్యకృతులు, గేయకృతులు వెలువరిస్తున్న ఏదో మథనం జరిగింది ఆయనలో. ఏదో ప్రత్యేకత సాధించాలి అనుకున్నారు. అంతే ప్రౌఢతరమైన పద్యకృతికి తుల్యంగా కథాత్మక గేయకావ్యం 'నాగార్జున సాగరం' రాశారు. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ వంటి విద్వన్మణుల ప్రశంసలు లభించాయి. తర్వాత 'కర్పూర వసంత రాయలు' రాశారు. దేశవిదేశాల్లో కావ్యగానం చేశారు. నాటి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు ప్రత్యేకంగా షామంజిల్‌లో 'నాగార్జునసాగరం' కావ్యగానం ఏర్పాటు చేసి సత్కరించారు. మద్రాసులో అక్కినేని అధ్యక్షతన జరిగిన 'కర్పూర వసంతరాయలు' కావ్యగానం అద్భుత స్పందన కలిగించింది.

గేయకావ్యాలలోనే మహాకవి అనిపించుకున్న సినారె అంతటితో ఆగలేదు. భావకవిత్వం, అభ్యుదయ కవిత్వం ప్రాబల్యం సాగుతున్న కాలంతో పోటీపడాలని నిర్ణయించుకొన్నారు. సృజన పౌరుషంతో వచన కవిత రచనను ఉద్ధృతం చేశారు. 'మంటలూ మానవుడు', 'తేజస్సు నా తపస్సు', 'అక్షరాల గవాక్షాలు', 'మధ్యతరగతి మందహాసం'. 'విశ్వంభర' ఇలా కవితాయాత్ర కొనసాగింది. భారతీయ సాహిత్యంలో అత్యున్నతమైన జ్ఞానపీఠ పురస్కారం 'విశ్వంభర'కు దీర్ఘకవిత. ఆదిమకాలం నుంచి ఆధునిక కాలందాకా సాగిన మానవ విజయ మహేతిశ్వాసకు విశ్వంభర.

పద్యం, గేయం, వచన కావ్యాలు, నాటికలు, గజళ్ళు, ముక్తకాలు, అనువాదాలు, విమర్శ, పరిశోధన, బుర్రకథ, యాత్రాసాహిత్యం, ఇలా అనేక ప్రక్రియల్లో 20వ శతాబ్దం నుండి 21వ శతాబ్దం దాకా విస్తరించి కాలంతోపాటే సాగుతూ వర్తమాన తరపు కవులతోనూ పోటీపడుతూ సాహితీ సృజన చేశారు సినారె. 86 ఏళ్ళ వయసు, 86 రచనల సొగసు ఆయనది.

కవితారచన ఒకవైపు, విశ్వవిద్యాలయ ఆచార్యత్వం ఒకవైపు, సినీ గీతరచన ఇంకోవైపు, సాహితీ సాంస్కృతిక సదస్సుల్లో అద్భుత ప్రసంగ పరంపర మరోవైపు అన్నట్లుగా సాగుతున్న దశలో – 50వ పుట్టినరోజు అప్పటి ముఖ్యమంత్రి టి. అంజయ్య సినారెను అధికారభాషా సంఘానికి అధ్యక్షునిగా నియమిస్తున్నట్లు ప్రకటించారు. ఆచార్యత్వాన్ని అయిష్టంగా వదలవలసి వచ్చింది. పరిపాలనా పదవుల్లో సినారె దక్షతముద్ర ప్రారంభమైంది. ఆ తర్వాత ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయ్యారు. ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షునిగా సినారెను గౌరవించారు. ఆ పదవీకాలం పూర్తికాగానే తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులుగా నియమించారు. తర్వాత సాంస్కృతిక మండలి అధ్యక్షులయ్యారు. భాషా సాంస్కృతిక సలహాదారులయ్యారు. కవులు, కళాకారుల తరపున రాష్ట్రపతిచేత రాజ్యసభ సభ్యులుగా నియమితులయ్యారు. కవితారచన కొనసాగిస్తూనే విద్యా సాంస్కృతిక సంస్థల పరిపాలనా పదవులనూ వెలిగించారు సినారె.

ఏడు దశాబ్దాల కవితా సృజనానుభవాన్ని పండించుకున్న మహాకవి డా. సి. నారాయణరెడ్డి తెలంగాణ బిడ్డ కావడం గర్వకారణం. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, కేంద్ర సాహిత్య అకాడమి పురస్కారాలు అందుకున్నారు. మేరట్ విశ్వవిద్యాలయం, నాగార్జున, కాకతీయ, సార్వత్రిక విశ్వవిద్యాలయాలు గౌరవ డాక్టరేట్లు అందించాయి. ఆంధ్ర విశ్వవిద్యాలయం కళాప్రపూర్ణతో సత్కరించింది. సోవియెట్‌ల్యాండ్ నెహ్రూ అవార్డు, రాజాలక్ష్మీ అవార్డు, తెలుగు విశ్వవిద్యాలయ విశిష్టపురస్కారం, కేంద్రసాహిత్య అకాడమీ ఫెలో పురస్కారం... వంటి ఎన్నో ప్రతిష్ఠాత్మక పురస్కారాలు, లెక్కలేనన్ని సత్కారాలు సినారెను గౌరవించాయి.

చనిపోయేంతవరకు(జూన్ 2017) రాశారు. ఔత్సాహిక, ప్రముఖ కవుల రచనలకు ఆశీస్సులందిస్తూనే వున్నారు. తమకు ఎవరైనా లేఖరాస్తే దానికి ప్రత్యుత్తరం రాయకపోవడం ఏనాడూ లేదు. విద్యారంగంలో, పాలనారంగంలో, జనవ్యవహారంలో తెలుగు పరిఢవిల్లాలని వేదికలపైన గట్టిగా చెబుతూనే వచ్చారు. మునుపటి ఆంధ్ర సారస్వత పరిషత్తు, నేటి తెలంగాణ సారస్వత పరిషత్తుకు

చనిపోయే వరకు అధ్యక్షులుగా వుంటూ తెలుగు భాషా సంస్కృతుల వికాసకృషిని అవిరళంగా కొనసాగించారు.

ఒక కవితలో ఆయన అన్న పంక్తులు....

“అది తెలుగుకీర్తి ... కదిలే కిరణమూర్తి ... సాగరాల్ దాటిపోయిందిరా...

నయాగరాల్ మీటివచ్చిందిరా...”

ఈ మాటలు తెలుగు కవిత్వాకీర్తికి, తెలుగు వ్యక్తి కీర్తికి ... డా. సి.నా.రె. సాహితీ మూర్తికి, ఆయన వ్యక్తిత్వ కీర్తికీ వర్తిస్తాయి.

ఇంతటి మహోన్నత కవితామూర్తి తెలంగాణలో జన్మించడం గర్వకారణం.

# 26 చందా కాంతయ్య శ్రేష్ఠి

– డా॥ రామా చంద్రమౌళి

వరంగల్లు నగర గత శతాబ్ద ప్రజా జీవితం ఎలా సాగిందో అధ్యయనం చేస్తే అందులోని అనేక సందర్భాల్లో చందా కాంతయ్య గారే కనిపిస్తారు. అంతగా ఆయన జీవితం, ఈ నగర చరిత్రా కలగలిసి మమేకమై పోయాయి. ఆంధ్ర విద్యాభివర్ధినీ పాఠశాల, చందా కాంతయ్య మెమోరియల్ కళాశాల, చందా కాంతయ్య మెమోరియల్ ప్రసూతి దవాఖాన లేని వరంగల్లు నగరాన్ని ఊహిస్తే అది చాలా అసమగ్రంగా దర్శనమిస్తుంది. ఈ ప్రసిద్ధ సంస్థల ఆవిర్భావ వికాసాల చరిత్రలను తెలుసు కుంటున్నప్పుడు.. ఒక మనిషి ఆ ప్రాంత జనజీవితాలను ఎంతగా ప్రభావితం చేసి ఒక శాశ్వత జ్ఞాపకంగా, జాడగా, స్మృతిగా ప్రకాశిస్తూ మిగిలిపోగలడో తెలుస్తుంది. మనిషి తన జీవితాన్ని తనే ఎంత ప్రయోజనకరంగా నిర్వచించుకుని ఎంత ప్రజోపయోగకరంగా జీవించవచ్చో కూడా అవగతమౌతుంది.

చందా కాంతయ్య గారు కష్టాల్లో, ఎంతో వేదనతో అల్లల్లాడిపోయినప్పుడు కూడా ఆయన కంటి వెంట కన్నీరు చూచినవారెవ్వరూ లేరు. కాని సమాజంలో ఏ ఒక్కరు కంటతడి పెట్టినా కాంతయ్యగారు అల్లాడిపోయేవారు. పెను తుఫాను వంటి కష్టాల్లో కూడా స్థితప్రజ్ఞుడై, పెదవులపై చిరుదరహాసంతో సామాజిక వికాసానికీ, ధార్మిక కార్యాచరణకు మాత్రం ముందుకు దూసుకొచ్చేవారు. ఆయన ఒక 'యోగి'గా దర్శనమిస్తూనే మరో కోణంలో పరిపూర్ణ 'వ్యాపారి'గా కనిపించేవారు. 'దాతృత్వమే' ఆయన జీవిత పరమావధి అనుకుంటూంటే ఆయన మరుక్షణమే ఒక 'వేదాంతి'గా గోచరించేవారు. అదే మనిషి మరు క్షణం పెళ్ళిళ్ళలో, ఆచారాలలో ఒక సంస్కర్తగా కనిపించేవారు. గొప్ప తాత్వికునిగా, ధర్మమూర్తిగా, దేశ భక్తునిగా, త్యాగశీలిగా సూర్యుడొక్కడే ఒక్కొక్క మనిషికి ఒక్కో విధంగా దర్శన మిచ్చినట్టు. వ్యక్తి ఒక్కడే ఒక్కో వరంగల్లు వ్యక్తికి ఒక్కో రకంగా కనబడి మనిషి తన 'జీవితాన్ని ఇంత ఉదాత్తంగా, మహోన్నతంగా, స్ఫూర్తిదాయకంగా జీవించవచ్చా!' అని అందరూ ఆశ్చర్యపోయేట్టు జీవించి మెరుపులా మాయమైనవాడు చందా కాంతయ్య.

28-11-1904న చందా రత్నయ్య, జగ్గమ్మ దంపతులకు వరంగల్లులో జన్మించారు కాంతయ్య గారు. ఆయన బాల్యం చాలామంది మహామహుల్లాగానే సాఫీగా ఏమీ సాగలేదు.. అంతగా ఆర్థికంగా పరిపుష్టంగా కాని కుటుంబం, పెద్దగా విద్యావంతం కాని నేపథ్యం, వ్యాపార పునాదులేవీ లేని వ్యవస్థ.. ఇవీ అప్పుడతని బలాబలాలు. మొదట బావగారైన నేరెళ్ల జగన్నాథం గారితో వ్యాపార రంగంలోకి ప్రవేశం, తర్వాత్తర్వాత శ్రీరాం నారాయణ్ బాలకిషన్ వద్ద పనిచేస్తూ చురుగ్గా వ్యాపార మెళకువలన్నీ ఆకళింపు చేసుకుని స్వయంగా ఎదిగారు. ఇక రెక్కలొచ్చిన

పక్షి కూన ఆకాశాన్ని ఈదేందుకు సంసిద్ధమైనట్టు.. దక్షతతో వ్యాపారంలోకి దిగారు.

చాలామంది చిన్న ఉద్యోగాల్లో కేవలం జీతంకోసం ఉదరపోషణార్థమే చేరి దానితోనే ఇక జీవికను కొనసాగిస్తారు. కాని తెలివిగలవారు ఆ ఉద్యోగం రూపంలో చేతికి అందివచ్చిన 'పెయిడ్ అవకాశాన్ని' ఒక అప్రెంటిస్‌గా స్వీకరించి ఆ రంగంలోని మెళకువలనూ, రహస్యాలనూ అవపోశనపట్టి దక్షులుగా రూపొందుతారు. కాంతయ్యగారు చేసిందదే. ఆ తొలి యవ్వన కాలంలో పని చేసిన ప్రతి చోటులోనూ గ్రహింపుతో తనను తాను ఒక తెలివైన వ్యాపారవేత్తగా మలుచుకున్నారు. తర్వాత పబ్బా రోహిణి గారితో పెళ్ళి. ఇంతవరకు చందా కాంతయ్య జీవితం అతి సాధారణమైందే.

తర్వాత జీవితానికీ, వ్యాపారానికీ ఆధారభూతమైన మూలాన్ని గ్రహించారాయన. అదేమిటంటే.. 'సమాజ నిర్మాణానికీ జీవిత సౌద నిర్మాణానికి కూడా కావలసింది మొదట ధనం. కాబట్టి ధనార్జన అనేది అవశ్యకమైన తక్షణ క్రియ. అందుకు తనను తాను సన్నద్ధుణ్ని చేసుకుంటూ తన 'రైస్ మిల్లు' వ్యాపారాన్ని సంసిద్ధం చేశాడు. ఇంకో ప్రధాన వ్యాపార కీలక సూత్రాన్ని కూడా తెలుసుకున్నాడు. అది 'ముందు వ్యాపారంలో నీతి, నిజాయితీ, కీర్తీ (good will) సంపాదించుకుంటే, తర్వాత ధనం దానంతటదే మనల్ని వెదుక్కుంటూ వస్తుంది' అని.

ఆ ఆత్మజ్ఞానంతో అతను మొట్టమొదట సంపాదించు కున్నది నీతీ నిజాయితీ నిండిన కీర్తి. అదే ముమ్ముందు అతను చేయవలసిన దానధర్మాలకు కావలసిన ధనాన్ని ధారా పాతంగా సమకూర్చిపెట్టింది.

ప్రపంచ చరిత్రల్లో చాలామంది మహనీయుల జీవితాలను ఏదో ఒకే ఒక్క ఘటన మలుపు తిప్పిన సందర్భాలు కనిపిస్తాయి మనకు. కాంతయ్య గారి విషయంలో కూడా అటువంటిదే ఒక సంఘటన జరిగింది. అది ఆయన ప్రథమ పుత్రిక ఓంకారేశ్వరి జనన సమయం. భార్యను ప్రసవం కోసం అప్పటి నిజాం ప్రభుత్వ దవాఖాన 'నిజాం సర్కారియా హాస్పిటల్'కు తీసుకెళ్ళారు. అప్పుడక్కడి పరిస్థితులు అతి దారుణంగా ఉన్నాయి. ఒక పక్కన ప్రసవ వేదనతో అల్లాడే తల్లులు.. మరోపక్క అప్పుడే పుట్టిన శిశు వుల రోదనలు.. కనీసావసరాలూ, సిబ్బందీ కరువైన దిక్కుమొక్కు లేని జనం. చలించిపోయారాయన. కంట తడిపెట్టుకున్నారు. ద్రవించిపోయారు. అక్కడి ప్రతి బిడ్డా తన బిడ్డే అనుకున్నాడు. తక్షణం రోగులకోసం రెండు జనరల్ వార్డులు, సేవ చేసే నర్సులకోసం రెండు క్వార్టర్‌లు, డాక్టర్ల కోసం క్వార్టర్‌లు కట్టించాడు. తర్వాత కూడా అవసరమైన సహాయాన్ని ఎప్పుడూ అందిస్తూ పోయాడు. అందుకే చందా కాంతయ్య మరణానంతరం 1969లో అప్పటి రాష్ట్ర మంత్రి శ్రీ పి.వి. నరసింహారావు ఆ దవాఖానకు 'చందా కాంతయ్య స్మారక ప్రసూతి దవాఖాన' అని నామకరణం చేశారు. ఒక ప్రభుత్వ దవాఖానకు ఒక స్థానిక వ్యక్తి పేరును పెట్టడం చరిత్రలో ఒక అపురూప ఘట్టమే.

రోగుల సేవ ఎంత ప్రధానమైందో గ్రహించిన కాంతయ్య గారు, అప్పుడే ఇప్పటి ఎం.జి.ఎం ఆస్పత్రి ఉన్న ప్రాంగణం కోసం ఐదు ఎకరాల స్థలాన్ని దానం చేశారు.

మనిషి హృదయం నిష్కళంకమై స్వచ్ఛతను సంతరించుకున్నపుడు సత్యభరితమూ, స్వార్థరహితమూ, నిష్కామమూ ఐన వాక్కు ఖడ్గ తుల్యమౌతుంది. ఈ కర్మాచరణతో అడుగులు వేస్తున్న కాంతయ్య గారు 1940 ప్రాంతంలోనే లక్షలు సంపాదిస్తూ లక్షలకు లక్షలను దానం చేసే స్థితికి చేరుకున్నారు.

తర్వాత ఆయన దృష్టి విద్యా రంగంవైపు మళ్ళింది. నిజాం ప్రభుత్వ నిరంకుశ పాలనలో 'తెలుగు బోధనా భాషగా' అసలు పాఠశాలలే లేవు. అందుచేత అకస్మాత్తుగా 1944లో ఒక తలంపు కలిగి అప్పటికప్పుడు పట్టణంలో ప్రముఖులైన మేధావులను ఇంటికి ఆహ్వానించి మాదిరాజు రామకోటేశ్వరరావు, ఒద్దిరాజు రాజేశ్వరరావు, తాండ్ర వెంకటరామ నర్సయ్య, కాళోజీ నారాయణరావు గార్లతో ఒక సమావేశం ఏర్పాటు చేసి తన మనసులోని మాటను వాళ్ళతో పంచుకుని పాఠశాల స్థాపన కోసం సహకరించవలసిందిగా అభ్యర్థిస్తూ తన బావమరిది ఆగయ్యతో వెంటనే చెక్కును తెప్పించాడు. ఆ బృహత్ కార్యానికీ, ఆలోచనకూ ఆశ్చర్య పోయిన ఒద్దిరాజు రాజేశ్వరరావు గారు "కాంతయ్యా.. తొందరెందుకు.. రేపో, ఎల్లుండో ఆలోచిద్దాంలే" అని అంటే అతనిచ్చిన జవాబు

అందరినీ ముగ్ధుల్ని చేసింది. ఆయనన్నాడు "తొందర ఎందుకా.. ఒక గంట తర్వాత నా మనసు మారితే, నేను దివాళా తీస్తే.. లేదా నేను మరణిస్తే" అని తక్షణమే రూ. 50,000/-ల చెక్కునూ, తన రైస్ మిల్లులో పాఠశాల శాశ్వత నిర్వహణకు గాను 0-8-3 వాటానూ రాసి ఇచ్చాడు. నిష్ఠా గరిష్టుడాయన. ఆ రకంగా పుట్టి ఈ రోజువరకు ఒక డిగ్రీ మరియు పి.జి. కాలేజిగా ప్రవర్ధమానమైన విద్యా సంస్థే 'ఆంధ్ర విద్యాభివర్ధని కళాశాల'. దీన్ని 1945 నవంబర్ 29వ తేదీన అప్పటి నిజాం ప్రభుత్వంలోని విద్యాశాఖ మంత్రి ఆజం జంగ్ గారిచే ప్రారంభింప జేశారు.

1946 ఫిబ్రవరి 5వ తేదీన మహాత్మాగాంధీ దక్షిణ భారత హిందీ ప్రచార సభ సమావేశాల నిమిత్తం మదరాసు వెళ్లి తిరిగి వార్ధా ఆశ్రమానికి వెళ్తూ వరంగల్లులో పది నిముషాలు ఆగినప్పుడు పట్టణ కాంగ్రెస్ పక్షాన హయగ్రీవాచారి, ఎం.ఎస్. రాజలింగం ప్రభృతులు ప్రజల నుండి సేకరించిన విరాళం మొత్తం రూ. 15000/- గాంధీ గారి హరిజన నిధికి ఇవ్వగా.. ఒక లక్షా యాభై వేల మంది హాజరైన ఆ సభలో ఒక్క చందా కాంతయ్యా గారే రూ. 5000/- ఇచ్చి తన భార్యవైపు చూడగా రోహిణమ్మ తక్షణమే తన ఒంటిపైనున్న సకల స్వర్ణాభరణాలనూ తీసి గాంధీగారి జోలెలో వేసింది. అదే విధంగా 1948లో పోలీస్ చర్య జరిగి, నిజాం భారత ప్రభుత్వానికి లొంగిపోయినప్పుడు హైదరాబాద్ వచ్చిన జవాహర్ లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభబాయ్ పటేల్ ఒక సభలో కొలువుతీరి 'భారత స్వాతంత్ర్య నిధి' కోసం విరాళాలను అర్థించగా కాంతయ్య గారి కనురెప్పల కదలికలను గ్రహించి ఆ మహాసాధ్వి రోహిణమ్మ తన ఒంటిపైనున్న ఆభరణాలన్నింటినీ అప్పటికప్పుడు ఒలిచి ఇచ్చారు. ఇటువంటి దానాలను ఆ దంపతులెన్ని చేశారో.

ఒకసారి కాంతయ్య గారికి అత్యంత ఆప్తుడూ, ప్రాణస్నేహితుడూ ఐన డా.టి.ఎస్.మూర్తి గారు నవ్వుతూ "కాంతయ్యగారూ.. అందరికీ దానధర్మాలు ఎన్నో చేశారని అంతా చెప్పుకుంటారు.. నాకేం చేశారండీ" అని చలోక్తిగా అంటే కాంతయ్య గారు మందహాసం చేస్తూ "ఈ రోజు నా సంపాదనంతా నీదే.. ఇల్లు కట్టుకోండి" అన్నారట. కాంతయ్య గారి మాటలను సరదాగా తీసుకున్న డా. మూర్తి గారు ఆ రోజు రాత్రికల్లా ధనం ప్రత్యక్షమయ్యేసరికి నిశ్చేష్టులయ్యారు. ఆ ధనంతోనే ఆయన నూతన గృహ ప్రవేశం చేశారు.

మరోసారి 1954లో భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ రాజా బహద్దూర్ వెంకట్రామారెడ్డి మహిళా కళాశాల భవన శంఖుస్థాపనకు హైదరాబాద్ విచ్చేసినప్పుడు నెహ్రూగారికి కాంతయ్య గారు రత్నమాణిక్యాలు పొదిగిన నెక్లెస్‌ను బహూకరించారు. దాన్ని అక్కడే వేలం వేయగా రూ. 5000/- లభించిందట. ఆంధ్ర విద్యాభివర్ధని గ్రంథాలయం ఒక జ్ఞాన కేంద్రం. వరంగల్లు నగరంలో అతి పురాతనమైన 'వాసవీ గ్రంథాలయం' కాంతయ్య గారు స్థాపించిందే. రాష్ట్రం బయట కూడా అంటే మదన్ మోహన్ మాలవీయ స్థాపించిన బెనారస్ హిందూ విశ్వవిద్యాలయానికి కూడా క్రమం తప్పకుండా విరాళాన్ని అందజేశారు. కాశీలో సత్రాలు.. శాశ్వత నిర్మాణాలు.. ఇటువంటివెన్నో.

నిజాం పెట్టిన ఒక అజ్ఞాత పరీక్షలో నెగ్గి ఆయన నుండి 'నిజాం రాజ్య చందమామ' (దర్జే అవ్వల్) అన్న బిరుదును పొందారు కాంతయ్యగారు. వణిక్ ప్రముఖులచేత 'ఆచార్య', ఇంకో సందర్భంలో 'శ్రేష్ఠి' అన్న గౌరవ సంబోధననూ.. ఎన్నో ఆత్మీయ పదాలంకారాలను కాంతయ్యగారు ప్రజలనుండి పొందారు.

1955 నుండి కాంతయ్య గారిలో ఆధ్యాత్మిక పిపాస తీవ్రతరమైంది. వ్యాపారానికి స్వస్తి చెప్పారు. తన కుమారుడు విజయకుమార్‌కు మెడిసిన్‌లో సీట్ వచ్చినా, తన కూతురు పెళ్ళి భూపతి కృష్ణమూర్తి గారి కుమారుడితో నిశ్చితమైనా.. డబ్బు గురించి ఏదీ ఆలోచించని వైరాగ్య భావనేదో ఆయనను ఆవరించింది. నిరంతర భగవత్ చింతనతో, భాగవత పారాయణతో, యోగ నిష్టతో గడపడం చేసేవారు. మనిషి మనీషిగా మారి మహానుభావుడై మహర్షిగా పరివర్తన చెందడం ఆయనలో కనిపించేది. ఎందరెందరో జ్ఞానులనూ, వేద పండితులనూ, బ్రహ్మజ్ఞానులనూ పిలిపించుకుని సన్మానించి తరించేవాడు. కళ్యాణ్ సేవక్ మహారాజ్ గారి ఆధ్యాత్మిక ప్రవచనాల చేత ప్రభావితులయ్యారు. పండిత్ ఫకీర్ చంద్ మహారాజ్ హోషియార్ పూర్ ఆఫ్ పంజాబ్ గారి ప్రవచనాలను వింటూ తదనుగుణంగా జీవితం గడిపేవారు.

చందా కాంతయ్య దేశభక్తిని కలిగి దేశసేవ కోసం సకల దానాలను చేశారుగాని, ఎప్పుడూ రాజకీయాధికారం కోసం పరితపించలేదు. 1967లో తన మిత్రుడు డా.టి.ఎస్. మూర్తి గారిని స్వతంత్ర ఎమ్మెల్యేగా గెలిపించి ఆనందించారు. ప్రతి నిత్యం ఎ.వి.వి. పాఠశాలకు వెళ్ళినప్పుడు భాగవతం లోని 'ఎవ్వనిచే జనించు.. జగమెవ్వని 'పద్యాన్ని స్వయంగా గానం చేసి పరమానందాన్ని పొందేవారు.

28-08-1967న తన అంతిమ ఘడియలని తెలుసుకున్న కాంతయ్య గారు.. స్వతంత్ర సమర యోధుడూ, వియ్యంకుడూ ఐన భూపతి కృష్ణమూర్తి గారిని పిలిపించుకుని తన మానస పుత్రికలైన ఎ.వి.వి.. సి.కె.ఎం విద్యాసంస్థల వృద్ధికి పాటుపడవలసిందిగా చెప్పి.. తన కిష్టమైన 'ఎవ్వనిచే జనించు' భాగవత పద్యాన్ని ఉచ్ఛైస్వరంతో చదువుతూ పరమాత్మునిలో లీనమైపోయారు.

బతుకంతా తన సర్వస్వాన్నీ దానం చేస్తూ చేస్తూ చివరికి తన జీవితాన్నే సమాజానికి చందాగా సమర్పించిన అపర దాన కర్ణుడు ఆచార్య చందా కాంతయ్య శ్రేష్ఠిగారు.

# 27 చందాల కేశవదాసు

– డా॥ ఎం. పురుషోత్తమాచార్య

విలక్షణమైన సంస్కృతి విలువలను పరిరక్షించడానికి మన భారతదేశంలో జన్మించిన మహానుభావులలో కవులు, కళాకారులు ఎంతో బాధ్యతగా వ్యవహరించి, పరోపకారం, త్యాగం వంటి ఆదర్శ లక్షణాలతో మానవత్వపు విలువలకు కొత్త ఊపిరిపోశారు. అలాంటివారిలో "తెలంగాణా మునీశ్వరుడు" అనదగినవారు ప్రసిద్ధ కళానుశీలి, బహుముఖ ప్రజ్ఞాశాలి శ్రీ చందాల కేశవదాసు. నిర్మోహత్వంతో, సేవాపరాయణతతో, కళావైదుష్యంతో, తాత్త్వికచింతనతో తెలుగువారిని మేలుకొలిపి, సత్య పరిశోధనా కరదీపికలను చేతికందించిన మహనీయమూర్తి ఆయన.

పాపమ్మ, లక్ష్మీనారాయణ దంపతులకు 1876 జూన్ 20న ఖమ్మం జిల్లా జక్కేపల్లి గ్రామంలో కేశవదాసు జన్మించారు. తండ్రి దగ్గరే చదువులో తొలి పాఠాలు నేర్చుకున్నారు. కాని చాలా చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయి పెద్దన్న వెంకట్రామయ్య దగ్గరికి వెళ్ళి ఆధ్యాత్మికవిద్యను అభ్యసించారు. కొంతకాలం తరువాత కేశవదాసు తిరువూరులోని 'కాబోలు రామయ్య' గారి కూతురు చిట్టెమ్మను వివాహం చేసుకున్నారు. జక్కేపల్లి వదిలేసి ఖమ్మంలో కాపురం పెట్టారు. కేశవదాసుకు రామకవి, కృష్ణమూర్తి, సీతారామయ్య అనే కుమారులు, ఆండాళ్ళు అనే కూతురు జన్మించారు.

కేశవదాసు తండ్రి నుండి వైద్యవృత్తిని స్వీకరించి ప్రజలకు ఉచిత వైద్యసేవను ప్రారంభించారు. ఆ వృత్తిలో ఉంటూనే కవిగా, గాయకునిగా కూడా పేరు తెచ్చుకున్నారు. అంతేగాక హరికథాగానం ప్రారంభించి హరిదాసుగా ప్రసిద్ధికెక్కారు. వారు హరికథాగానాన్ని విన్న సుప్రసిద్ధ రచయిత శ్రీపాద కృష్ణమూర్తిగారు పరమానందంతో "అభినవసూత" బిరుదుతో దాసుగారిని సత్కరించారు.

నల్లగొండ జిల్లా కోదాడ మండంలోని తమ్మర గ్రామానికి వెళ్ళిన కేశవదాసుకు అక్కడి ప్రధానార్చకులైన నరహరి నరసింహాచార్యగారితో పరిచయం కుదిరాక కేశవ శతకం, స్తోత్రాలు, హెచ్చరికలు, మంగళహారతులు, సంకీర్తనలు మొదలైన సాహిత్య ప్రక్రియలను విరివిగా చేపట్టారు. అంతేకాదు, అక్కడే 1907లో "భాగవత సప్తాహయజ్ఞం" ప్రారంభించి వరసగా 108 సప్తాహాలు నిర్వహించారు. ప్రతి సప్తాహంలోనూ వారం రోజులపాటు పేదవారికి అన్నదానం, వస్త్రదానం వగైరా నిర్వహించేవారు. ధనవంతులు, జమీందారులు అందించే ఆర్థికసహకారం సరిపోక, తాను కళారంగం ద్వారా సంపాదించిన సొమ్మంతటిని, బంగారు వస్తువులను అందుకు వినియోగించేవారు. తమ్మర శ్రీసీతారామాలయం జీర్ణోద్ధరణ కోసం తన భార్య దగ్గరున్న విలువైన వస్తువులను కూడా తెగనమ్మి వినియోగించగలిగిన మహోదాత్త హృదయులైన కేశవదాసును ఇప్పటికీ "తమ్మర రామదాసు" అని సంభావించడం అక్కడివారి హృదయసంస్కారానికి నిలువెత్తు నిదర్శనం.

మైలవరం రాజావారి బాలభారతి నాటకసమాజంలో కేశవదాసు 'ప్రాంపర్టు'గా ప్రవేశించారు. అక్కడే "స్వరనిధి, స్వరమూర్తి" బిరుదాంకితులైన సుప్రసిద్ధ సంగీత విద్వాంసులు బాపట్ల లక్ష్మీకాంతయ్యగారితో పరిచయం ఏర్పడింది. ఆయనను తన సంగీత గురువుగా గౌరవించిన కేశవదాసు ఎన్నో చక్కని కీర్తనలు రచించారు. ఆ ఇద్దరూ కలిసి యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాలలో సంగీత, ధార్మిక కార్యక్రమాలను మొట్టమొదటిసారిగా ప్రవేశపెట్టి ధర్మ ప్రచారానికి ఎంతగానో దోహదం చేశారు.

బాపట్ల లక్ష్మీకాంతయ్యగారికి జబ్బుచేసినపుడు కేశవదాసు ఆయనతో కలిసి యాదగిరిగుట్టకు వెళ్ళి, నరసింహస్వామిని దర్శించుకుని, స్వామిని పద్యాలతో, పాటలతో స్తుతించి ప్రార్థించాడు. గురువుగారి అనారోగ్య బాధకు స్పందించిన కేశవదాసు "పరబ్రహ్మ సచ్చిదానంద" అనే కీర్తనను గురునామాంకితముద్రతో రచించారు. అది విన్న బాపట్లవారికి ఒక ఆలోచన స్ఫురించింది. వెంటనే తన ఆలోచనను కేశవదాసుకు చెప్పారు. కేశవదాసు పరమానందంతో త్రిమూర్త్యాత్మికమైన "పరబ్రహ్మ పరమేశ్వర" పాటను రచించగా, అప్పటికప్పుడే బాపట్లవారు దాన్ని కల్యాణిరాగంలో, రూపకతాళంలో స్వరపరిచారు. దీన్ని నాటకప్రదర్శనకు ముందు ప్రార్థనగా పాడిద్దామని లక్ష్మీకాంతయ్యగారు సంకల్పించి నాటకసంస్థలవారికి తెలియజేశారు. ఎన్నో నాటకసంస్థలవారికి గురుస్థానంలో ఉన్న లక్ష్మీకాంతయ్యగారి సంకల్పాన్ని ఎంతో భక్తిశ్రద్ధలతో అందరూ అమలు చేశారు. ఇప్పటికీ ఎన్నో నాటకసంస్థలు, పరిషత్తులు, విశేషించి సురభి నాటకసంఘాల వారు ఈ గీతాన్ని మధురంగా ఆలపించడం ఎంతో ఆనందదాయకం. మరో విశేషం ఏమిటంటే ఈ గీతం పల్లవిని మాత్రమే స్వీకరించి 1937లో తీసిన 'భక్తధ్రువ' అనే హిందీ సినిమా టైటిల్స్ నేపథ్యంలో వినిపించారు. ఈ సినిమాకు పండిట్ శాంతిలాల్ దర్శకుడు; శంకర్ వ్యాస్ సంగీతకర్త.

బాలభారతి సమాజంలో కేశవదాసు పనిచేస్తున్నప్పుడే 'కనకతార', 'బలిబంధనం' అనే రెండు పద్యనాటకాలను రచించారు. వాటిలో 'కనకతార' నాటకం విపరీతమైన జనాదరణ పొందింది. 1911లో రచింపబడిన 'కనకతార' నాటకం సుమారు రెండువేలకు పైగా ప్రదర్శనలు పొంది దాసుగారిని ప్రముఖనాటక రచయితల జాబితాలోకి చేర్చింది. ఈ నాటకం మన రాష్ట్రంలోనేకాక బెంగళూరు, పూనా, రంగూన్, బొంబాయి, కలకత్తా మొదలైన ఇతర నగరాల్లోకూడా ప్రశస్తమైన పేరు తెచ్చింది. దీన్ని జగ్గయ్యపేటలో ప్రదర్శిస్తున్నప్పుడు క్రూరసేన పాత్రధారి రాలేకపోతే కేశవదాసే ఆ పాత్రను ధరించి నాటకాన్ని రక్తి కట్టించారు. కుదరవల్లి నాటక సమాజంవారు ఈ నాటకాన్ని ప్రదర్శించినప్పుడు పద్మశ్రీ డా॥ అక్కినేని నాగేశ్వరరావు గారు తార పాత్రను ధరించి ప్రేక్షకుల ప్రశంసలు పొందారు. మరో సందర్భంలో పుట్టపర్తి సత్యసాయిబాబావారు తన చిన్నతనంలో ఈ కనకతార నాటకంలోని 'తార' వేషంవేసి తల్లియైన ఈశ్వరాంబను మురిపింపజేశారు.

'కనకతార' నాటకానికున్న ప్రశస్తిని గమనించి సరస్వతీ టాకీసువారు 1937లో ఈ నాటక ఇతివృత్తాన్ని సినిమాగా తీశారు. ఈ సినిమాద్వారా సముద్రాల రాఘవాచార్యులుగారు మాటల రచయితగా పరిచయమయ్యారు. ఈ సినిమాకు హెచ్.వి.బాబు దర్శకుడు. దీన్నే 1956లో గోకుల్ ప్రొడక్షన్‌వారు రజనీకాంత్ దర్శకత్వంలో తీసినప్పుడు ఘంటసాల స్వరకర్తగా పనిచేసి కమ్మని బాణీలు వినిపించారు. అయితే కేశవదాసుగారి 'కనకతార' నాటకంలోంచి మూడు పాటలు, రెండు పద్యాలను మాత్రమే ఈ రెండు సినిమాల్లోను ఉపయోగించుకున్నారు.

1922 నుండి నిరాఘాటంగా సాగిపోతున్న ముత్తరాజు సుబ్బారావుగారి 'శ్రీకృష్ణతులాభారం' నాటకంలోని 22 పాటలను కేశవదాసే రాశారు. ఈ పాటలను కురుకూరి సుబ్బారావు 1929లో పుస్తకంగా అచ్చువేశారు. ఆ పాటలలో "భలే మంచి చౌకబేరము" అనే పాట ఎంతో ప్రసిద్ధి పొందింది. దీనితోపాటు "మునివరా ఇటుల్", "కొట్టు కొట్టండి" పాటలు కూడా ప్రజల మెప్పు పొందాయి. అందుకే 1935, 1955, 1966 సం॥లలో వరసగా తీసిన మూడు 'శ్రీకృష్ణతులాభారం' సినిమాలలోనూ ఈ పాటలు చోటు సంపాదించడం, విశేషించి 'భలే మంచి చౌకబేరము' పాటను తుంగల చలపతిరావు, కె. రఘురామయ్యగారలే కాక ఘంటసాలగారు కూడా పాడడం చెప్పుకోదగిన ప్రత్యేక విశేషాంశాలు.

'భలే మంచి చౌకబేరము' పాట పల్లవి సులభ గ్రాహ్యంగా ఉండి సమాజంలోకి బాగా చొచ్చుకుపోయింది. దీనికి వ్యాపార, ప్రచార ప్రకటనలలో ఎన్నో ప్యారడీలు కూడా వచ్చాయి. ఇప్పటికీ పత్రికారంగంలో ప్రధానశీర్షికలకు ఈ పల్లవి ఉపయోగపడుతూనే ఉంది, దాని సార్వజనీనతను నిరూపించుకుంటూనే ఉంది. 'కనక్తార' నాటకం, శ్రీకృష్ణతులాభారం పాటలు కళాభిమానుల మనస్సులను దోచుకుని విజయపతాకాన్ని ఎగరవేస్తూ కేశవదాసుగారి కీర్తిప్రతిష్ఠలను కలకత్తాదాకా వ్యాపింప జేశాయి. మద్రాసు, బొంబాయి నగరాల్లో యశస్సౌరభాల్ని గుబాళింపజేశాయి. గాంధీజీ, మోతీలాల్‌నెహ్రూలను స్తుతిస్తూ కేశవదాసు రచించిన పాటలను ఆకుల నరసింహారావుగారు ఆలపించి రికార్డుగా విడుదల చేశారు.

1931లో మొదటిసారిగా తెలుగు టాకీ 'భక్తప్రహ్లాద' తీస్తున్న హెచ్.ఎం. రెడ్డిగారు హిరణ్యకశిపుడు లీలావతిచేత ప్రహ్లాదునికి విషం ఇప్పించే సన్నివేశాన్ని కల్పించి, అందులో రసోద్దీపకమైన పాట ఒకటి చిత్రించాలనుకున్నారు. దాన్ని రాయించుకోవడానికి; మాటలు, పాటలు రాసిన ధర్మవరము రామకృష్ణమాచార్యులు గారు జీవించిలేరు కనుక అప్పటికే కనక్తార నాటకరచయితగా పేరు మారు మ్రోగుతున్న చందాల కేశవదాసుగారిని హెచ్.ఎం. రెడ్డిగారు పిలిపించుకుని తన ఆలోచన చెప్పారు.

వెంటనే దాసుగారు "పరితాపభారంబు భరియింప తరమా?" అనే పాట రాసి ఇచ్చారు. దీన్ని ఆ సినిమాలో లీలావతిగా నటించిన సురభి కమలాబాయి మధురంగా ఆలపించారు. అదేవిధంగా "తనయా! ఇటులన్" అనే పాటను కూడా ఆమె పాడారు. ''భీకరంబగు నా ప్రతాపంబునకు" అనే పాటను మునిపల్లె సుబ్బయ్య ఆలపించారు. ఈ మూడు పాటలను తమ నాటకంలో కూడా చేర్చుకుని సురభి నాటకసంస్థవారు ఇప్పటికీ తమ "ప్రహ్లాద" నాటకంలో ఆలపిస్తూ ఉండడం గమనార్హం.

1935లో కలకత్తాలోని అరోరా ఫిలిం కార్పొరేషన్ వారు దాసరి కోటిరత్నం సహకారంతో తీసిన "సతీ అనసూయ" సినిమాకు కథ, మాటలు, పాటలు, పద్యాలు మొదలైన రచనలు చేశారు. కందిబండ, హుజూర్‌నగర్, బేతవోలు, సూర్యాపేట పట్టణాలలో అష్టావధానాలు చేశారు. పానుగంటి లక్ష్మీనరసింహారావుగారి ''రాధాకృష్ణ'' నాటకానికి, సోమరాజు రామానుజరావుగారి ''సతీ సక్కుబాయి" నాటకానికి అన్ని పాటలు రాశారు. "బాలరాజు, లంకాదహనం" సినిమాలకు రచన చేశారు.

ఘనచరిత్ర కలిగిన తెలుగు నాటక రంగస్థలం ఇప్పటికీ 'పరబ్రహ్మ పరమేశ్వర' అని ఆలపిస్తూ రసాత్మక ప్రదర్శనలకు తెరలేపుతూ ఉన్నదంటే, అందుకు ఆ సంగీత సాహిత్యాల "సజీవ సుధామాధుర్యమే" కారణమవుతుందని చెప్పడం ఎంతమాత్రం అతిశయోక్తి గాదు.

కేశవదాసుగారు అన్ని ప్రాంతాలు పర్యటిస్తూ నట, దర్శక, గాయక, కథక, అవధాన, వైద్య, సంఘసేవక, సప్తాహనిర్వాహక పాత్రలను నిర్వహిస్తూ 1948 తరువాత ఖమ్మం నుండి, సూర్యాపేటకు దగ్గరగా ఉన్న నాయకన్‌గూడెం చేరారు. పిల్లలు ఎక్కడివారక్కడ స్థిరపడ్డారు. దాసుగారు, యువకళాకారునిగా అప్పటికే ప్రసిద్ధిపొందిన శ్రీ గంధం నర్సయ్యగారితో ఆండాళ్ళుకు వివాహం జరిపించినారు. ఆ దంపతులు మునగాలలో స్థిరపడ్డారు.

ఎవరూ తోడులేని ఒంటరి జీవితాన్ని తపస్సులాగా గడిపి కేశవదాసుగారు 1956 మే 14న తనువు చాలించినారు. ఇప్పటికీ వారి సమాధి నాయకన్‌గూడెంలో ఉంది. ఎవరైనా మహానుభావులు ఉదారంగా ముందుకు వచ్చి ఆ సమాధిని పుణ్యస్థలంగా తీర్చిదిద్దగలిగితే అక్కడ ప్రతి సంవత్సరం సంగీతం, సాహిత్య కార్యక్రమాలను నిర్వహించాలని ఎందరో అభిమానులు భావిస్తున్నారు. అపూర్వ ప్రతిభాశాలి, బహుముఖప్రజ్ఞాశీలియైన కేశవదాసుగారికి నివాళులర్పించుకోవడం మన తెలుగువారి విద్యుక్తధర్మం.

28

# చెర్విరాల భాగయ్య

– డా॥ నోరి రాజేశ్వరరావ్

యక్ష శబ్దం వేదమంత్ర ప్రమాణంగా చూస్తే దైవానికి అనువర్తిత పదంగా చెప్పబడింది. యక్షుజంటి పరమాత్మ అనే అర్థం కూడా నిఘంటువులు తెలియజేశాయి.

యక్షగానం అంటే యక్షులు పాడే పాట అని, మరొక అర్థంలో దైవాన్ని స్తుతిస్తూ చేసే గానం అని కూడా చెప్పుకోవచ్చు.

ఈ యక్ష గాన ప్రక్రియ 15వ శతాబ్దం ఉత్తరార్థం నుండి కన్పిస్తోంది. ఇది చారిత్రంగా స్పష్టమైన నిజం. దక్షిణాంధ్ర యుగంలో విశ్వవిఖ్యాతమైన ఈ ఆహార్య ప్రక్రియ తెలంగాణ కీర్తి తలమానికంగా స్థిరపడింది. తెలంగాణ యక్షగానం అనగానే వినిపించే పేరు చెర్విరాల భాగయ్య. తెలంగాణ సంస్కృతి విఖ్యాతం కావడానికీ, ఉర్దూ ప్రాబల్యంతో ఉగ్రతలూగిన కాలంలో ఆ భాషకు దీటుగా తెలుగు సంస్కృత వైభవానికి మూలకంగా చెర్విరాల భాగయ్య యక్షగాన ప్రక్రియ నెంచుకుని రాసి స్వయంగా ప్రదర్శించారు. నిజాం ప్రభుత్వంపై తన నిరసనను తెలియజేయడానికి కూడా ఈ ప్రక్రియను వాడుకున్నారు.

చెర్విరాల భాగయ్య పూర్వీకులు మెదక్ జిల్లా వారైనా హైదరాబాద్ మశూరాబాద్‌లో స్థిరపడ్డారు. భాగయ్య గారు మెదక్ జిల్లా నర్సపూర్ తాలుకాలోని 'గుమ్మడిదల' గ్రామంలో 1904లో జన్మించారు.

చెర్విరాల భాగయ్య జీవితం పుట్టక నుండి మరణం వరకూ గల మధ్య కాలం అంతా పోరాటాల మయం. దురదృష్టం అడుగడుగునా తన ప్రభావం చూపిస్తున్నా మొండి ధైర్యంతో బ్రతుకీదారు.

భాగయ్యగారి జీవితం తెరిచిన పుస్తకం. పరిశీలిస్తే వారి బొంబాయి జీవితం ఒక పార్శ్వమైతే, హైదరాబాద్ జీవితం మరొక పార్శ్వంగా పేర్కొనవచ్చు. భాగయ్య గారు నమ్మిన సత్యాన్ని సిద్ధాంతాన్ని జీవితం చివరి వరకూ అనుసరించారు. ఆవేశం, ఆధ్యాత్మికత, హృదయవాద తత్వం, నిరంతర శ్రమ వారికి జీవితంలో కలిగిన కష్టాల కడలిని ఎదురీదేలా చేశాయి.

భాగయ్య గారు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ తాలూకా కొత్తురు గ్రామంలో తీర్థగిరి అనంతాచార్యులు గారి నుండి దీక్ష తీసుకున్నారు. భాగయ్యగారు సామాజిక జీవితంలో చదివిన దానిని ఒక క్వాలిఫికేషన్‌గా భావిస్తే సమాజాన్ని ఆమూలాగ్రం చదివి అర్థం చేసుకున్న వైనాలు వారు స్వయంకృషితో ఎదిగేలా చేశాయి.

భాగయ్య గారికి బాసర జ్ఞానసరస్వతి అనుగ్రహం 14వ ఏటనే కలిగి వారిని కవిగా కవిత్వాన్ని చెప్పేలా చేసింది. బొంబాయిలో మిల్లులో పనిచేసిన రోజుల్లోనే రచనకు పూనుకున్నారు.

పసిప్రాయంలోనే తండ్రి దూరమైతే తల్లితో కలిసి బొంబాయిలో బట్టల మిల్లులో పనిచేశారు. మిల్లు మూత పడినప్పుడు కూలిపని చేయడానికి సైతం వెనుదీయలేదు.

బొంబాయిలో వున్నప్పుడు మారుతి అనుగ్రహం కలిగిందని స్వయంగా స్వామి తమ నాల్కపై బీజాక్షరాలు వ్రాశారని తమ జీవిత చరిత్రలో రాసుకున్నారు.

భాగయ్య గారు బహుభాష కోవిదులు. అందులో ప్రత్యేకంగా మరాఠి, తెలుగు, సంస్కృతం హిందీ భాషల్లో రచనలు చేసే ప్రతిభను అలవరచుకున్నారు. వీరి జీవితంలో ఎదుగుదల, విషాదాలు సమానంగా చోటుచేసుకున్నాయి.

తెలంగాణలో తొలి యక్షగాన కర్త సుగ్రీవ విజయం పేరుతో కందుకూరి రుద్ర కవి కావడం ఒక విశేషమైతే అదే వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని యక్షగానాల ప్రభతో తెలంగాణకు స్థిర, చిర యశస్సు తెచ్చిపెట్టిన వారు చెర్విరాల భాగయ్య గారు కావడం తెలంగాణ ప్రజల అదృష్టంగా పేర్కొనవచ్చు. అలాగే భాగయ్య గారు వ్రాసిన 'సుగ్రీవ విజయం' యక్షగానం కూడా అనేక ప్రదర్శనలకు నోచుకోవడంతోపాటు ముద్రితమై ఆకాలంలో లక్ష కాపీలు అమ్ముడుపోవడం విశేషం.

భాగయ్య గారు తెలుగు సాహిత్యంలో యక్షగాన ప్రక్రియకే పరిమితం కాక హరికథలు కూడా చెప్పారు. వీటితోపాటు మంత్ర, తంత్ర, జ్యోతీష్యాలలో నిరుపమాన ప్రతిభ కనబరిచారు.

'లక్షణ సారం' అనే లక్షణ గ్రంథాన్ని రాసి లాక్షణికుల సరసన స్థానం పొందారు. భాగయ్య గారు జీవితం ఎటు తీసుకెళితే అటు వెళ్ళారు. కూలిపని నుండి ప్రారంభించి ప్రూఫ్ రీడర్ పని చేశారు. బండిపై కూరగాయలు, పిప్పరమెంట్లు అమ్మారు. వారి నినాదం శ్రమయేవ జయతే.

భాగయ్య గారు నాటి దక్కన్ రేడియోకి 'నరకాసుర వధ' అనే బుర్రకథను రాసి స్వయంగా ప్రదర్శించారు. భాగయ్య గారికి లౌకిక జీవితం కన్నా, ఆధ్యాత్మిక జీవితం పట్ల యిష్టత మెండుగా వుండేది. వారు 'మాణిక్ ప్రభు' సంప్రదాయాన్ని అనుసరించారు. బహుశా ఈ చింతనే వారిని వారి జీవితాన్ని సమతౌల్య స్థితిలో నిలబెట్టిందని గట్టిగా విశ్వసించవచ్చు.

భాగయ్య గారు శత గ్రంథకర్తలు, అర్థ శతయక్షగాన కర్తలు, పరిష్కర్తలు అంతకుమించి మానవతా వాది. నాడు తెలంగాణలో జనగామ, జడ్చర్ల రైలు ప్రమాదాలపై స్పందించి బుర్రకథలు రాయడం వల్ల వారికి గల సామాజిక స్పృహ ఏమిటో మనకు అవగతమౌతుంది.

చెర్విరాల భాగయ్యగారి వ్యక్తిగత జీవితంలో కళత్ర విషాదం పూడ్చలేని లోటుగా పేర్కొనవచ్చు. వారికి సంతానం లేకపోయినా వారి వంశజుల్లో ఒకరైన నాగలింగయ్యను పెంపకానికి తెచ్చుకున్నారు.

రజాకార్ల అల్లర్ల సమయంలో హైదరాబాద్ విడిచి గుమ్మడిదల గ్రామానికి వెళ్లినా అల్లర్ల తర్వాత తిరిగి హైదరాబాద్‌కు వచ్చారు భాగయ్య. వచ్చిన దాంట్లో గడుపుకోవాలని, వ్యాపారం చేసి బతకాలని హితం చెప్పారు. పెంచుకున్న కొడుకు నాగలింగయ్యకు దీని వల్ల భాగయ్య గారికి జీవితం దాని తాలూకా విలువలపై అపార నమ్మకం ఉందని అవగతం అవుతుంది.

వీరు మరాఠి బాష నుండి తెలుగు చేసిన గ్రంథాలు వీరిని అనువాదకులుగా నిలబెట్టాయి. భాగయ్యగారు 'వీర దవళ' అనే నవలను కూడా రాశారు. దాసబోద గ్రంథంలో ఆధ్యాత్మిక వివరాలను అందించారు. కొన్ని మంత్రశాస్త్ర గ్రంథాలు కూడా రాశారు. భజనలు, కీర్తనలు రాశారు. సామాజిక స్పృహతో రజాకార్ల ఉద్యమాన్ని వ్యతిరేకిస్తూ ఎన్నో చైతన్య గీతాలను రాశారు. వీరు 'రాజలింగ శతకాన్ని' కూడా రాసి శతక కర్తలయ్యారు. భాగయ్య గారు తమ సాహిత్యాన్నంతా ప్రజాప్రయోజనానికే ఉపయోగించారు. డబ్బు సంపాదించినా అంతకంటే దానాలు ఎక్కువ చేశారు. వీరి రచనా ఆంతర్యం గమనిస్తే పుట్టిన నేల, ప్రాంతం, భాష, సంస్కృతులు నవాబుల పాలనలో అంతరించి పోకుండా వాటిని సుస్థిరం చేసి రాబోయే తరాలకు అందివ్వాలనే లక్ష్యం ప్రధానంగా కనిపిస్తుంది.

భాగయ్య గారు తమ యక్షగానాల్లో దేశీ చందస్సులను ప్రయోగించారు. వృత్తాలను యక్షగానాల్లో చందోబద్దంగా రచించారు. సీసం, కందం, తేటగీతి, పంచ చామరాలను రచించారు.

వీరి 'నలధమయంతి' యక్షగానంలో చంపకమాల

వృత్త పద్యాన్ని తేలికగా రచించారు. భాష విషయంలో సరళ గ్రాంథికానికి పెద్ద పీట వేశారు. పాత్రోచిత సంభాషణలతో పాటు అన్య దేశ్యాలను ప్రయోగించారు. వారి యక్షగానాలలో దాదాపు అర్థాలంకారాలను ప్రయోగిస్తూనే, ఒకే పద్యంలో రెండు, మూడు అలంకారాలను ప్రయోగించారు. కవిత్వ ప్రారంభంలో చిత్ర కవిత్వం, బంధ కవిత్వం, కమల బంధం, కఠారి బంధం వంటి బంధ కవిత్వాలు రాశారు.

భాగయ్య గారు 1966 సంవత్సరం జనవరి 6వ తేదీ పుష్య శుద్ధ పౌర్ణమి నాడు పరమపదించారు. 62 సంవత్సరాలు జీవించిన భాగయ్య గారు జీవితంలో ఓడి సాహిత్యంలో గెలిచారు.

తెలంగాణ యక్షగాన పితామహునిగా వాసికెక్కి రాసిన గ్రంథాలను వాసిగా రచించిన చెర్విరాల భాగయ్య గారు ప్రాతః స్మరణీయులు. వారి స్మరణార్చననకు ఈ పద్యం చిరు పుష్పం.

ఎవ్వని వాకిటి పాసరశారద ఒనరుగనిల్చి
సాహిత్య సంపదలందజేసె
ఎవ్వని కీర్తినివ్వటిల్లెదుచూడ్కి
మానితసంపదలీశుచుండు
ఎవ్వాని గుణలత దువారీసుల
కడపటికొండపై తెగయబ్రాకు
ఎవ్వని కలముబలముకల్పవృక్షంపై
తెలంగాణ నేలయక్షగానం ఫలములొసగి
అతడు భూరిజ్ఞాన ప్రకాశవిహాయస
ఆధ్యాత్మిక స్థితి ప్రజ్ఞ పరమహంస
ఆనంద ప్రదాత ఆత్మ గౌరవ సుప్రభాస
అతడెచెర్విరాల వంశధీమణి భాగయ్య
నార్యుసన్నుతించెదన్

# 29 చిదిరెమఠం వీరభద్రశర్మ

**– దోరవేటి**

నల్లగొండ జిల్లా మారుమూల గ్రామంలో జన్మించి, అనాథగా జీవితాన్ని ప్రారంభించి, నల్లగొండ జిల్లా బాలకవిగా గుర్తింపు పొంది, బహు భాషావేత్తయై, కవిగా, విమర్శకుడిగా, వక్తగా, పత్రికా సంపాదకుడిగా, ఆచార్యుడిగా అనేక విధులను నిర్వర్తించి, అత్యున్నత విద్య నభ్యసించి, జగద్గురు శివాచార్యులుగా కాశీజ్ఞాన సింహాసనాన్ని అధిష్టించి వీరశైవ సమాజానికి ఎనలేని సేవలందించిన మహనీయుడు చిదిరెమఠం వీరభద్రశర్మ.

నల్లగొండ జిల్లాలోని చర్లపల్లె అనే కుగ్రామంలో 1904 ఆగస్ట్ 8న చిదిరెమఠం నాగభూషణయ్య, శ్యామలాంబ దంపతులకు వీరభద్రశర్మ జన్మించినాడు. తల్లిదండ్రులు నిర్ణయించిన పేరు వీరభద్రయ్య. చిదిరెమఠం వంశీయులు మఠస్థ జంగమయ్యల పరంపరకు చెందినవారు. వీళ్ళు వీరశైవ పంచాచార్యుల్లో రంభాపురీ పీఠానికి సంబంధించిన వాళ్ళు. వీరభద్రయ్యకు చిన్ననాటనే సంస్కృతాంధ్ర కన్నడ భాషలతో పరిచయమేర్పడ్డది. నిజాం పాలనాకాలంలో ప్రభుత్వ పాఠశాలలో ఉర్దూ కూడా అబ్బింది. కాని పదేండ్లైనా నిండకముందే స్వల్ప వ్యవధిలో తల్లిదండ్రులిద్దరూ లింగైక్యం చెందడంతో చెల్లెలితో కూడా అనాథ అయిపోయినాడు వీరభద్రయ్య.

మహేశ్వరుల కుటుంబానికి చెందినవారు కావడంచేత బంధువులు, ఆత్మీయులు, వీరశైవ వదాన్యులు వీళ్ళను ఆదుకునే ప్రయత్నం చేసినారు. ఇతరుల దయాభిక్ష మీద జీవనం సాగించడం రుచించని వీరభద్రయ్య చెల్లెలిని ఆత్మీయుల సంరక్షణలో వదిలి హైదరాబాదుకు చేరుకున్నాడు. అంటే వీరభద్రయ్య చిన్ననాటి నుండి విద్యాధ్యయనశీలి. ఇతని ఆసక్తిని గమనించి భక్తులు నీరడగుంభ శ్రీమన్నిరంజన స్వరూప సిద్ధిలింగ స్వాములవారి సంస్కృత పాఠశాలలో చేర్పించినారు. అక్కడ మూడు (3) సంవత్సరాలపాటు వీరశైవ సంస్కృతీ సంప్రదాయాలను, సంస్కృత శాస్త్రాలనూ అధ్యయనం చేసినాడు. తర్వాత నారాయణపేటలోని చోళేంద్ర సంస్కృత పాఠశాలలో 2 సం॥లు చదువుకున్నారు. అక్కడ కావ్య నాటకాలంకార వ్యాకరణ న్యాయ, యోగ, జ్యోతిష శాస్త్ర పరిజ్ఞానం సంపాదించాడు. గురుదేవులు సిద్ధరాముల అనుగ్రహంతో కవితారచనకు అక్కడనే శ్రీకారం చుట్టినాడు. సంస్కృతాంధ్రాల్లో ఆశువుగా కవితలల్లి, 'నల్లగొండ బాలకవి'గా పేరు తెచ్చుకున్నాడు.

కావ్య రచనకు సమాయత్తమవుతున్న సందర్భంలోనే ఉన్న ఒక బంధం చెల్లెలు అకాల మృత్యువాత పడటంతో – తన జీవితాన్ని సమస్తమూ మహోన్నత ఆశయసిద్ధికే అంకితం చేయాలని, జీవితమంతా బ్రహ్మచర్యం పాటించాలని నిర్ణయించుకున్నాడు. ఆ రకంగా వీరశైవ జాతి సముద్ధరణ కోసం తన జీవితాన్ని సమర్పించిన త్యాగధనుడు వీరభద్రయ్య.

'వీరశైవ వివాహవిధి' అనే చిన్ని గ్రంథం వీరి తొలి పుస్తకం. కన్నడం నుండి తెలుగులోకి అనువదించిన ఈ

పుస్తకంలో పురోహితుల కవసరమైన అనేక విషయాలనూ అదనంగా చేర్చినాడు.

వీరభద్రయ్యకు ఆత్మగౌరవం, ఆత్మాభిమానం ఎక్కువ. శాస్త్ర పాండిత్యాన్ని, కవితాశక్తినీ వశీకరించుకున్న తనను 'శర్మ' అనే గౌరవవాచకంతో పిలిపించుకోవడం ఇష్టపడేవాడు. అందుకే వీరభద్రశర్మగానే తదనంతర కాలంలో గుర్తింపు పొందినాడు.

1924లో నిజాం రాష్ట్రంలోని ఇటిగీలో వీరశైవ మహాసభ మొట్టమొదటిసారి జరిగింది. ఈ సభను గుర్మిట్‌కల్ శ్రీ శాంత వీరమహాస్వాములవారు నిర్వహించినారు. ఇందులో జాతీయస్థాయి వీరశైవ పీఠాధిపతులు, స్వాములు పాల్గొన్నారు. ఈ వేదిక మీద వీరభద్రశర్మకు మాట్లాడే అవకాశం లభించింది. కుర్రవాడైన వీరభద్రశర్మ ప్రసంగం సభలోని వాళ్ళందరినీ ఆశ్చర్యానంద పరవశులను గావించింది. 'వీరశైవ సమాజానికి వెలుగుదీప' మని అభివర్ణించి, ఆశీర్వదించినారు పెద్దలందరూ.

పరళీలోని వైద్యనాథేశ్వరాలయంలో వీరశైవులకు వేదాధికారంగానీ, వైదికార్చనాధికారం గానీ లేవన్న వివాదం చెలరేగినప్పుడు సుప్రసిద్ధ న్యాయవాది, వీరశైవుల్లో ప్రప్రథమ వేదతీర్థ పట్టభద్రులైన శ్రీ విరూపాక్ష ఒడయరుగారు వాదించడానికి సిద్ధపడ్డారు. ఆయనకు అవసరమైన శృతి, స్మృతి, పురాణాదుల నుండి ఆధారాలనందించే బాధ్యత యువకుడైన చిదిరెమఠం వీరభద్రశర్మకు అప్పగించినారు. ఎప్పటికైనా తాను 'వేదతీర్థ' కావాలన్న సంకల్పం వీరభద్రశర్మ మనసులో నాటుకున్నది. ఆ రకంగా 1925 డిసెంబర్ 13న కాశీలోని విశ్వారాధ్య గురుకులంలో ప్రవేశించినాడు. తర్వాత కలకత్తా సంస్కృత అసోసియేషన్ నుండి వేదతీర్థ, కావ్యతీర్థ, స్మృతి తీర్థపట్టాలను వరుసగా సాధించినాడు. అదే సమయంలో వ్రజమండలి నుండి ధర్మాచార్య, సాహిత్య విశారద పరీక్షల్లోనూ ఉత్తమశ్రేణిలో ఉత్తీర్ణుడైనాడు. ఈ నేపథ్యంలోనే హిందీ, మరాఠీ భాషలను చక్కగా నేర్చుకున్నాడు.

బహుభాషాభిజ్ఞత, బహుశాస్త్ర విజ్ఞానం, అన్వేషణ జిజ్ఞాస వీరభద్రశర్మను పరిశోధనకు ప్రేరేపించినాయి. తత్ఫలితంగా 1929లో ఉత్తరకాశిలోని శక్తిస్తంభన లేఖను వెలుగులోకి తెచ్చినాడు.

శాస్త్రాధ్యయనంతోపాటు సామాజిక సాంస్కృతిక కార్యక్రమాల్లో, శాస్త్రచర్చల్లో, విద్వద్గోష్ఠుల్లో, సభల్లో సమావేశాల్లో పాల్గొంటూ శాస్త్రపరిజ్ఞానాన్ని, విద్వత్తునూ జగతికి చాటుకున్నాడు. వీరభద్రశర్మ కాశీలో ఉన్నప్పుడే జంగమవాడిలోని జగద్గురు జ్ఞానసింహాసన పీఠానికి సార్థకత చేకూర్చుతూ గ్రంథాలయం ఏర్పాటుకు కృషి చేసినాడు. కాశీలోని సంస్కృత సమాజం వీరభద్రశర్మ శాస్త్ర విజ్ఞానాన్ని, విద్వత్తును, సేవాభావాన్ని గుర్తించి- వార్షిక విద్వాంసం, విద్యారత్న, విద్యానిధి అనే బిరుదులతో గౌరవించింది. ఈవిధంగా సశాస్త్రీయ విమర్శ, పరిశోధనా పటిమ, వాక్చాతుర్యం, రసప్రపూర్ణ మృదుమధుర కావ్య నిర్మాణశైలి, లోతైన శాస్త్ర విజ్ఞానం సాధించి, కాశీ పండితులందరి మన్ననలందుకొని ఒక విశిష్టమైన వ్యక్తిగా మరల హైదరాబాదు రాష్ట్రానికి చేరుకున్నాడు వీరభద్రశర్మ.

మొదట యాదగిరి శంకర సంస్కృత కళాశాలలో కొన్నాళ్ళు ప్రధాన అధ్యాపకులుగా పని చేసినారు. తర్వాత సికింద్రాబాదులో మటికె నాగయ్య దంపతుల ఆర్థిక సహకారంతో 1936లో వీరశైవ గురుకులాన్ని స్థాపించి, యోగ్యులైన వీరశైవ విద్యార్థులకు ఉచిత భోజన వసతులతో సంస్కృతాధ్యాపనం ప్రారంభించినారు. అదే సమయంలో ఉర్దూ అధికార భాషగా ఉన్నకారణంగా తెలుగువారిలో ధార్మిక, ఆధ్యాత్మిక జ్ఞానచైతన్య దీప్తిని, భాషాభిమానాన్నీ కలిగించేందుకు ఒక పత్రిక రూపొందిస్తే బాగుంటుందని భావించినాడు. ఆ ఆలోచన 1939 కి సాకారమైంది. ఆ సం॥ శివరాత్రికి 'విభూతి' పత్రిక తొలిసంచిక విడుదలైంది.

'విభూతి' పత్రిక ప్రాచీన భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు సాహిత్య ప్రక్రియలకు విశేష ప్రాధాన్యమీయడంవల్ల సామాన్యులతోపాటు పండితులను విశేషంగా ఆకట్టుకున్నది. సశాస్త్రీయమైన, పరిశోధనాత్మక, సవిమర్శక వ్యాసాలు, వీరభద్ర శర్మగారు అందులో వేర్వేరు పేర్లతో ప్రకటించేవారు. కాలజ్ఞుడు, విద్యానిధి, మంగళగిరి రాఘవమ్మ, రాజహంస అనే కలంపేర్లు, తన పేరు, తన పేరు సంక్షిప్త రూపాలు అంటే చి.మ.వీ., చి.వీ.శ. అనే పొడి అక్షరాలూ అప్పుడప్పుడు ఉపయోగించేవారు. సహజంగానే విభూతిలో శివకవులకు, శైవసాహిత్యానికి విశేష ప్రాధాన్యముండేది. ఎందరో దిగ్గంతులైన కవులు –

విమర్శకులు కూడా 'విభూతి'కి వ్యాసాలు రాసేవారు. వారిలో సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రి, నిడదవోలు వెంకట్రావు, బండారు తమ్మయ్య, సురవరం ప్రతాపరెడ్డి వంటి ప్రముఖులున్నారు. 'శివధర్మ గ్రంథమాల' అనే సంస్థను స్థాపించి శైవధార్మిక ఆధ్యాత్మిక గ్రంథ ప్రకాశానికి పూనుకున్నారు. సుమారు 5 సంవత్సరాలు సాహిత్య ధార్మిక ఆధ్యాత్మిక చింతనలకు ఆనందాన్ని, జ్ఞానాన్ని పంచిన 'విభూతి' పత్రిక చిదిరెమఠం వీరభద్రశర్మ కాశీజ్ఞాన సింహాసన పీఠానికి ఉత్తరాధికారిగా వెళ్ళవలసి రావడంతో 1944లో ఆగిపోయింది.

జగద్గురు కాశీజ్ఞాన సింహాసన పీఠానికి 84వ పీఠాధిపతులుగా 1944 సెప్టెంబర్ 27న చిదిరెమఠం వీరభద్రశర్మ పీఠాధిపతులుగా నియమితులైనారు. అప్పటి నుండి వారి నామధేయం శ్రీశ్రీశ్రీ జగద్గురు శ్రీ వీరభద్ర శివాచార్యులుగా మారింది.

శ్రీశ్రీశ్రీ వీరభద్ర శివాచార్యులు జ్ఞానపీఠాన్ని అధిరోహించే నాటికి జంగమవాడి మఠం దయనీయమైన స్థితిలో ఉన్నది. ఒకప్పుడు వారణాసి నగరంలోనే అత్యంత సంపన్నమైన పీఠంగా పేరున్న కాశీజ్ఞానపీఠం స్వార్థపరుల అపసవ్య మార్గదర్శనంలో వైభవమంతా కోల్పోయి, దైనందిన విధులు కూడా నిర్వహించుకోలేని స్థితి వీరభద్రశివాచార్యులను కలచివేసింది. తన మేధస్సుకు – సహృదయులు, ధార్మిక నిష్ఠగల వీరశైవుల సహకారాన్ని జతచేసి, అనతికాలంలోనే మఠాన్ని పూర్వవైభవస్థితికి చేరుకునేటట్లు చేసిన ఘనత వీరభద్రశివాచార్యులదే. మొదట అనవసర వ్యాజ్యాల్లో ఇరుక్కున్న పీఠాన్ని ఓపికతో, దీక్షతో, చతురతతో సమస్యల నుండి బయట పడవేసినారు. తర్వాత జ్ఞానమందిరం నిర్మించినారు. శివధర్మ గ్రంథమాలను శైవ భారతీ ప్రతిష్ఠానంలో విలీనం చేసి విలువైన సంస్కృత గ్రంథాలను సేకరించి, ముద్రించి, వాటిని భారతీయ భాషలన్నిటిలోకి అనువదింపజేయడానికి యోచన చేసినారు. అయితే పీఠం పునఃరుద్ధరణ కార్యక్రమంలో ఆరోగ్యాన్ని కూడా లెక్కచేయకుండా శ్రమించిన వీరభద్ర శివాచార్యులు తన 44వ ఏటనే అర్థాంతరంగా దేహయాత్ర చాలించి శివసాయుజ్యం చేరుకున్నారు.

ఎక్కడో నల్లగొండలోని చర్లపల్లె అనే కుగ్రామంలో జన్మించిన చిదిరెమఠం వీరభద్రశర్మ జీవితంలోని ఆటుపోట్లన్నిటినీ ఎదుర్కుంటూ, విద్యాతపస్వియై, బహు భాషా కోవిదుడై, కవియై, పరిశోధనా జిజ్ఞాసువై, ధార్మిక, ఆధ్యాత్మిక, సాహిత్య జ్ఞాన సంపన్నుడై పత్రికా సంపాదకుడై, నలభయ్యేండ్ల వయస్సులోనే కాశీజ్ఞాన సింహాసనాన్ని అధివసించి, అచిరకాలంలోనే చిరస్మరణీయమైన సేవలందించిన కారణజన్ముడు. దివ్యచరితుడు, వైతాళికుడు చిదిరెమఠం వీరభద్రశర్మ.

# 30 చిలువేరు రామలింగం

**– అయినంపూడి శ్రీలక్ష్మి**

'నువ్వు పట్టుచీర కడితేను పుత్తడిబొమ్మ
ఆ కట్టుబడికి తరించేను పట్టుపురుగు జన్మ!'
అన్నాడో సినీకవి.

రామలింగం నేసిన చీర కడితే తప్ప అమ్మవారికి 'బోనాల' పండుగ ముగిసినట్లుగా అన్పించేది కాదు. రామలింగం నేసిన నూలుదండ పడితే తప్ప రాజకీయ నేతలికి సత్కారంలా అన్పించేది కాదు. రామలింగం వేసిచ్చిన పొట్రెయిట్ వుంటే తప్ప ఏ ఇంటికైనా, ఏ కళాకారుడి మనసుకైనా అంతటి ఆనందం చేకూరేదికాదు. అంతటి చరిత్ర అల్లిన నేతగాడు మన రామలింగం. సంప్రదాయాన్ని, నమ్మకాల్ని, గ్రామీణ జీవన విధానాన్ని, భారతీయ పురాణ ఇతిహాసాల్ని వంటపట్టించుకున్న రామలింగం, మనం మళ్ళీ మళ్ళీ గుర్తుచేసుకుని భవిష్యత్ తరాలకు పాఠ్యగ్రంథంగా చెప్పాల్సినంత గొప్ప నేతకారుడు.

అప్పుడెప్పుడో అగ్గిపెట్టెలో పట్టే చీర గురించి, ఉంగరంలోంచి దూరిపోయే 9 గజాల చీర గురించి వింతగా చెప్పుకున్నాం. కానీ యావత్ భారతదేశమే చేతులెత్తి మొక్కే సినీ దిగ్గజం శ్యాంబెనగల్ ఓ పల్లెటూరికి ఎడ్లబండిని కట్టుకుని మరీ వచ్చి నేలమీద కూర్చొని ఆ వ్యక్తి చెప్పే విశేషాల్ని ఆసక్తిగా రాసుకుని వెళ్ళేవాడని ఎందరికో తెలుసు?

గొప్పవాళ్ళు అందరికీ తెలియరు. తెల్సిన వాళ్ళందరూ గొప్పవాళ్ళనుకుని పోవడం తప్ప చరిత్రను శోధించి తెల్సుకోవాలన్న తపన చాలా తక్కువమందిలో వుంటుంది. అందుకు మన తెలుగువాళ్ళేం మినహాయింపు కాదు. ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, స్విట్జర్లాండ్ వంటి సుదూర దేశాల ప్రజలకు తెలిసిన మన సాటి కళాకారుడి ప్రతిభ గురించి మనవాళ్ళు మాత్రం మర్చిపోయారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక మరుగునపడ్డ ఇలాంటి మాణిక్యాలను వెలుగులోకి తీసుకొస్తుందిప్పుడు. అలాంటి నేతరత్నమే మన చిలువేరు రామలింగం.

అప్పటి నల్లగొండ (ఇప్పటి యాదాద్రి భువనగిరి) జిల్లా, జూలూర్ గ్రామంలో 1942వ సంవత్సరం జూన్ నెలలో జన్మించారు. వీరి తండ్రి రామస్వామి, తల్లి మణెమ్మ. పద్మశాలి కుటుంబంలో పుట్టిన రామలింగం చిన్నప్పటినుండి వినూత్నమైన వాటిపట్ల ఎక్కువగా ఆసక్తి కనబరిచేవారు.

పుట్టి పెరిగింది అంతా పోరాటాల పోతుగడ్డ భూదాన్ పోచంపల్లి గ్రామంలోనే. ఉమ్మడి పద్మశాలీ కుటుంబంగా వున్న ఆ గ్రామంలో భుక్తి కోసం అందరూ చీరలు నేస్తుంటే రామలింగం మాత్రం కళల పట్ల అనురక్తిని పెంచుకున్నారు. తనకు తాను గురువుగా, మగ్గమే ప్రయోగశాలగా ఎంచుకుని ఎన్నెన్నో ప్రయోగాలు చేశారు. కళాకృతులకు ప్రాణం పోశారు. తన వృత్తి కడుపుకింత కూడు పెట్టలేదు. మేడలు కట్టే రూకలు ఇవ్వలేదు. కానీ ప్రపంచం యావత్తు గుర్తుంచుకునే ఖ్యాతిని అందించింది. భారతదేశ

చిత్రపటంలో 'పోచంపల్లి' ఎక్కడుందో అని వెతుక్కునే పరిస్థితిని విదేశీయులకి కలిగించింది.

చిత్రమైన విషయం ఒకటి ఇక్కడ ప్రస్తావించాలి. రామలింగంకి ఐదుగురు కొడుకులు. అందులో ఇద్దరు ఆర్టిస్టులే. ఒకరు మృత్యుంజయ్ – కార్టునిస్ట్, రెండవవారు యానిమేషన్ ఆర్టిస్ట్. మృత్యుంజయ్ ఇంటర్నెట్‌లో కార్టూనిస్ట్‌ల కేరికేచర్లు వేసే ప్రఖ్యాత కళాకరుల సైట్‌లు చూస్తూ వారితో చాట్ చేస్తూ కార్టూన్ల మీద అధారిటీ సంపాదిస్తున్న రోజుల్లో బెల్జియం ఆర్టిస్ట్ 'జాన్ అబ్టివిక్' సైట్‌లో చక్కని కేరికేచర్లు వుండటాన్ని చూసి వారితో సంభాషించటం ప్రారంభించారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన వ్యక్తి అయినప్పటికీ జాన్‌కి ఎంతో ఓపిక వుండేది. కొంతకాలం తరువాత మృత్యుంజయ్ కేరికేచర్ కూడా గీసిచ్చాడు జాన్. కృతజ్ఞతగా మృత్యుంజయ్ ' మా ఇండియాలో ఇంకా మీకెవరన్నా తెల్సా, మీకేదన్నా కావాలా?' అని అడిగాడు. అందుకు సమాధానంగా జాన్ 'నేను ఓ వ్యక్తి గురించి నెట్‌లో చదివాను. మిత్రుల దగ్గర విన్నాను. మంచి ఆర్టిస్ట్ అని 'తెలియా రుమాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' అనే సచిత్ర వ్యాసం వుంది. దాన్ని చదివి నేను ఎంతో ఇంప్రెస్ అయ్యాను. ఆ టెక్నిక్స్ గురించి తెలుసుకోవాలని వుంది." అన్నాడు. ఈసారి ఆశ్చర్య పడటం మృత్యుంజయ్ వంతైంది. ఆనందంతో 'వారు మానాన్నగారే' అని జాన్‌తో చెప్పారు. 'అంత గొప్ప ఆర్టిస్ట్ కొడుకువా నువ్వు' అని ఆనందపడ్డారట జాన్‌గారు.

ఎవరు మెచ్చుకున్నా – ఎందరు అనుసరిస్తున్నా అవేమి పట్టని నిరాడంబరులు రామలింగం గారు. గాంధీ, నెహ్రూ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, ఎన్టీఆర్, అంజయ్య ఇలా ఎందరివో పొర్ట్రెయిట్‌లు వేశారు. అవి వారికి బహూకరించడం తనకిష్టం. నిజానికి పేదరికంలో పుట్టిన రామలింగానికి అవి తలకు మించిన భారమే అయ్యేది. ఒక్కో బొమ్మ నేయాలంటే 2,3 నెలలు పట్టేది. తానే కనుక్కున్న స్వంత టెక్నిక్‌తో వాటిని తయారు చేసేవాడు. పోచంపల్లికి ఏ రాజకీయనేత వచ్చినా, రామలింగం పూలదండలకు బదులు నూలు దండలతో ఆహ్వానం పలికేవాడు.

మూడు కొంగుల చీర, కుట్టులేకుండా షర్ట్, కత్తిరింపులు, అతికింపులు లేకుండా కుర్తా పైజమా, గాంధీ టోపీలు తయారు చేయడం అలవాటుగా చేసుకున్నాడు. గొడుగు నేయటం రామలింగానికి ఎంతో ఇష్టం. 'టై అండ్ డై పద్ధతి' అంటే రామలింగమే అన్నంత గుర్తింపును తెచ్చుకున్నారు. విదేశాల నుండి కేవలం ఆయన పనితనాన్ని చూసేందుకు ఆర్టిస్టులు పోచంపల్లికి వచ్చే వారంటే మనం అర్థం చేసుకోవాలి ఆయనెంత గొప్ప నేతగాడో!

ఉత్తరాదిలో ఎక్కడ ఏ ఎగ్జిబిషన్ జరిగినా రామలింగానికి అవార్డ్ తప్పకుండా వచ్చేది. ప్రశంసలు వర్షంలా కురిసేవి. వైట్‌హౌస్‌ను సైతం ఆకర్షించిన డిజైన్ల సృష్టికర్త రామలింగం కావటం మనం గర్వించాల్సిన అంశం. ఢిల్లీ, హర్యానా, సూరజ్‌కుండ్, గుజరాత్, కలకత్తా, మద్రాస్, బెంగుళూరు, హైదరాబాద్‌లలో జరిగే చేనేత ప్రదర్శనల్లో ఎన్నెన్నో ప్రశంశలు పొందారు.

ఆస్ట్రేలియా నుండి వచ్చిన ఓ టెక్స్‌టైల్ నిపుణుడు 'డానామెకౌన్' రామలింగం పనితనాన్ని నిశితంగా పరిశీలించి ఓ పెద్ద వ్యాసాన్ని రాశాడు. అది 'అలి జారిన్ డైతో' ప్రత్యేకంగా రంగులు దిద్దే రామలింగం పనితనం మీద ఈ వ్యాసం ఉండటం విశేషం. ఎంతోమంది వీరు సమకూర్చిన 'పనితనం' ఎన్నో పేటెంట్‌లు సాధించి పెడ్తుందని విశ్వాసంతో వుండేవారు. కానీ కళను అమ్ముకోవటం తెలియని రామలింగం నమ్ముకున్న కళకోసం ఉన్న ఊరిని దాటి ఎక్కడికీ వెళ్ళకుండా తనకు తోచిన మార్గంలో తానే నేతదారిని వేసుకుంటూ ముందుకెళ్ళారు. ఆ దారిలో ఎందరు నడిచినా, ఇప్పటికీ నడుస్తున్నా పాపం వాళ్ళకే తెలియదు దీన్ని నిర్మించడం కోసం ఓ వ్యక్తి తన జీవితాన్ని మొత్తం 'నేతకే అర్పితం చేశాడని.

శ్యాంబెనగల్ ప్రస్థావన వచ్చింది కాబట్టి ఇక్కడో విషయం చెప్పాలి.

సరికొత్త డిజైన్ల నిత్యాన్వేషి అయిన ఈ నేతకారుని గురించి సినీ నేతకర్త శ్యాంబెనగల్‌కి తెల్సింది. అంతే – ఆంధ్రప్రదేశ్‌కి వచ్చి బండి కట్టుకుని పోచంపల్లి ఊర్లోకి వాలిపోయాడు. అప్పుడు బోనాల రోజులు. రామలింగం ఇంటిముందు ఊరంతా గుమిగూడి వుంది. బండిలో మగ్గం పెట్టబడివుంది. చేనేతబండిగా – జనం దండిగా సాగుతూ వుంటే రామలింగం బండి ఎక్కాడు. అమ్మవారి గుడికి బండి బయలుదేరింది. నేతచీర బండిమీద నేయడం మొదలైంది.

డప్పులు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల ఊపులు, జనాల తీన్‌మార్‌లు ఒక్కటేమిటి ఊరంతా సందడే సందడి. చివరికి బండి అమ్మవారి గుడిముందు ఆగింది. రామలింగం చేతిలో అమ్మవారి చీర కూడా పూర్తయింది. "ఊరి జనమంతా భక్తిగా చూశారు. శ్యాంబెనగల్ అబ్బురంగా చూశాడు". ఇంకేముంది ఆకంట్లో పడ్డ ఆ దృశ్యాన్ని కెమెరా కంటిలో బంధించి రామలింగాన్నే కథావస్తువుగా తీసుకుని 'సుస్మన్' సినిమాని తీశారు శ్యాం బెనగల్. ఆ చిత్రంలోని కళాకృతిని చూసి ప్రపంచం యావత్తు ముక్కున వేలేసుకుంది.

షబానా అజ్మీ, పల్లవి జోషి నటించిన ఈ చిత్రం కళాకారుల జీవితాల్లోని చీకటి వెలుగుల్ని ఎత్తిచూపింది. నిజానికి ఈ సినిమా రామలింగం జీవితం చుట్టూ అల్లిన కథన్న సంగతి ఈనాటి తరానికి తెలియదు. ఆ సినిమా తీస్తున్నపుడు శ్యాం బెనగల్ రామలింగానికి రూ. 10,000/- బహూకరించడం అప్పట్లో ఊళ్ళన్నీ గొప్పగా చెప్పుకున్నాయి. అలాగే స్విట్లర్లాండ్ దేశస్తులొచ్చినపుడు పచ్చీస్ ఆడుకునే గుడ్డను రంగులతో తయారు చేసి నేతగా ఆందిస్తే వారెంతో ముచ్చటపడి రూ. 300/-లు ఇవ్వడం మరో విశేషం.

నిజమైన కళాకారుడికే అసలైన కళాకారుడి ప్రతిభా పాటవాలు అర్థమవుతాయన్న సత్యాన్ని ఈ సంఘటనల ద్వారా మనం గ్రహించాలి. పత్రికలు, టీ.వీలు వారిమీద ఎన్నెన్నో వ్యాసాలు, ప్రసారాలు చేశాయి. తెలుగు ప్రజల్లో వున్న ఓ కళాకారుడి గురించి, ఆంధ్ర ప్రదేశ్ గురించి అందరికీ తెల్సింది.

నూలు పోగుల మేలుకలయికతో వస్త్రాలలో చిత్రాలను నేసే రామలింగం, కళను అడ్డుపెట్టుకుని అవార్డ్ల కోసం పాకులాడలేదు. తనకంటే తన ఊరు వెలగాలనుకున్నాడు. తన పేరు కంటే తన నేతపనితనం పదిమందికి తెలవాలని కలలు కన్నాడు. చిన్నతనంలో విద్యాబుద్ధులు నేర్పిన యాకూబ్ అనే టీచర్ ప్రోత్సాహం వల్లనే ఈ నేతకళలో అద్భుత పనితనం అలవడిందని ఎంతో వినయంగా చెప్పుకునే స్నేహశీలి రామలింగం.

ఏ నేత కార్మికుడికైనా అండగా వుండాల్సిన వీవర్స్ సొసైటీల అనైక్యతల పట్ల అమితంగా ఆవేదన చెందిన వీరు నేతన్నల బతుకులు మారాలంటే నేతబట్టలేసుకునే నాయకుల ధోరణి మారాలనేవాడు. కళాకారుడికి తగినంత ప్రోత్సాహం ఉండాలని అలా ఉన్నప్పుడే ఆశించిన ఫలితాన్ని అందుకోగలుగుతాడని తరచూ అంటుండేవాడు. తన జీవిత కాలంలో వేసిన నేత బొమ్మల్లో పండిట్ నెహ్రూ చిత్రాన్ని వస్త్రంపై నేసేందుకు 246 కొయ్యలను ఉపయోగించడం మర్చిపోలేనని, గుండెపై గులాబీని అత్యంత ఆకర్షణీయంగా మలిచేందుకు ఆరు రోజులు పట్టిందని చెప్పేవారు. కార్పోరేట్ కంపెనీల లోగోలు, ప్రపంచ అద్భుత కట్టడాల ప్రతిరూపాలను వస్త్రంపై ఆవిష్కరించడం గొప్ప అనుభూతని తరచూ గుర్తు చేసుకునేవారు. కొంత మంది అవకాశవాద మనుషుల అసలు రంగులు తెలుసుకోకుండా రంగుల కలలోనే తనదనుకున్న కళా ప్రపంచంలోనే మగ్గమే బతుకుగా గడిపిన రామలింగం కళ్ళనుండి జారే కన్నీటి బొట్టంత స్వచ్ఛమైన వ్యక్తి. సాలి మగ్గంలో జాలువారే కళాకృతులను ఆవిష్కరించి అంతలోనే అదృశ్యమైన ఈ చేనేత తపస్వికి తెలంగాణ రాష్ట్రం ఎంతో ఋణపడివుంది.

'బట్టనేద్దామని నూలు వడుకుతుంటే వస్త్రానికి బదులుగా కన్నీటిహారం తయారయింది' అన్నట్లుగా నేతన్న బతుకు దినదినగండంగా గడుస్తున్న రోజులలో చితికిన ఇంటికంటే, గడ్డుగా బతుకీడుస్తున్న రోజులకంటే రేపటి రోజున నిలబడే చరిత్ర కోసమే తాను నిలబడ్డాడు. తనని కళారంగానికే అంకితమిచ్చి ఆ కుటుంబం గొప్ప త్యాగమే చేసింది. ఆ త్యాగానికి ప్రతిఫలం దక్కకున్నా కనీసం గుర్తింపును కూడా కోరుకోని మనస్తత్వం ఆ కుటుంబానిది.

ప్రతి సంవత్సరం బోనాల పండుగ సందర్భంగా ఎడ్లబండి మీద మగ్గంపెట్టి విరామం ఎరుగక సవారి చేసి నేసిన చీరను సారెగా అందించే రామలింగం లేకపోవడంతో ఏటేటా పుట్టింటి చీరను అందుకున్న అమ్మవారు చిన్నపోయారు. ఆరు దశాబ్దాల మూడేళ్ళ క్యాలెండర్‌కి, కళకి తేడా తెలియక వెలుగు నీడల జోలికెళ్ళకుండా రంగుల కళలోనే కాలం గడిపిన చిలువేరు రామలింగం మగ్గం ఆగిపోయింది. ఆ నేతబండి నిలిచిపోయింది. ఆయనెంత నిస్వార్థపరుడంటే గగనానికి వెళుతూ వెళుతూ తను సంపాదించుకున్న ఘనమైన కీర్తిని కూడా ఇక్కడే వదిలేసి వెళ్ళాడు. తానే ఒక నేత చరిత్రగా నిలిచి తన 'టై అండ్ డై' నీడని మాత్రం ఇక్కడే వదలి వెళ్ళాడు.

కుంచెతో కాన్వాస్‌కు రంగులద్ది
నూలుపోగుల మేలు కలయికతో
మగ్గంమీద నేతల చిత్రాలు అలవోకగా నేసే

రామలింగం తన చిత్రపటానికి తానే నేసిన నేతతో వున్న పూలమాలని సెప్టెంబర్ 12, 2003లో వేయించు కున్నారు. ఓ మనిషి చరిత్ర ముగిసింది. ఇప్పుడే ఓ కళాచరిత్రకు తెర లేచింది. ఇప్పటికైనా వీరిని గురించిన సమగ్రమైన సమాచారం, వారి విలువైన 'డై విధానం'పై పరిశోధనలకు పూనుకోవలసిన అవసరం ఉంది. పోచంపల్లి కమాన్‌లోకి అడుగు పెడితే చాలు కమాన్ అంటూ పిలిచే ఆ నేత పనితనంతో ఇప్పటికైనా మనం కరచాలనం చేద్దాం. ఆనేత ఆవిష్కరణలను భవిష్యత్ తరాలకు భద్రం చేద్దాం. అది మన కళా తెలంగాణ ఓ నిఖార్సైన నేతకారుడికిచ్చే నిజమైన నివాళిగా భావిద్దాం.

# 31 చిందుల ఎల్లమ్మ

– వి. పద్మ

శ్రమ నుంచి పుట్టిన ఏ కళారూపమైనా మట్టి పరిమళాలు వెదజల్లుతుంది. అణచివేతకు గురైన సామాజిక వర్గాల జీవితాల నుంచి జనించే కళారూపాలేవైనా శ్రమను మరిపించేలా చేస్తాయి. ఇలాంటి కళారూపాలు ఎన్ని ఒడిదుడుకుల సునామీలొచ్చినా తట్టుకుని నిలబడతాయి. పునాదిలో మార్పు రానంతకాలం, శ్రమజీవుల జీవితాల్లో వెలుగులు పరుచుకోనంత కాలం అలాంటి కళలు సజీవంగానే ఉంటాయి. అలా సజీవంగా ఉన్న కళారూపాల్లో 'చిందు భాగవతం' కూడా ఒకటి.

ఇన్ని సంవత్సరాలుగా ఒక కళారూపం స్థిరపడటాన్ని చూస్తే అది సామాజిక, సాంస్కృతిక జీవితంలో వేళ్లూనుకున్న విషయాన్ని గమనిస్తే ఆ కళారూపానికి సమాజంలో వివిధ కులాల, వర్గాల ప్రజల ఆమోదం ఉందని అర్థం.

చారిత్రకంగా చూస్తే **'చిందు'** అనేది తొలినాళ్లలో ఒక సంబురం, పండుగ. 'చిందు' అనే పేరు ఈ అర్థాన్నే వ్యక్తం చేస్తుంది. చిందులేయడం అనే వ్యక్తీకరణ అనాదిగా వ్యవహారంలో ఉంది. అది సంతోషంగా ఉన్నప్పుడు మనిషి చేసే క్రియ చిందుతొక్కడం మనిషి హావభావాల వ్యక్తీకరణ. అంతేకాదు.. మనిషి దేహభాష కూడా.

పంట కోతల సమయంలో పంటను ఇంటికి తెచ్చుకుంటున్న సంబురంలో ఆ శ్రమజీవులంతా కలిసి ఆడతారు, పాడతారు. ఈ రకమైన పండుగ వేడుక ప్రతీ నాగరికతలో, ప్రతీ సముదాయంలో ఉంటుంది. బహుశ **'చిందు'** కు అక్కడే ఒక వ్యవస్థీకృత రూపం ఏర్పడి అది కొనసాగడానికి ప్రాతిపదిక ఏర్పడి ఉంటుంది. ప్రాతిపదికలు, పునాది అంశాలు ఏం ఉన్నా.. ఏమైనా చిందు భాగవతం పల్లె నుంచి ప్రపంచానికి ఎదగడానికి మాత్రం చిందుల ఎల్లమ్మ కృషి ఎనలేనిది. ఈ కృషి వెనుక వ్యక్తిగత జీవితాన్నే ఫణంగా పెట్టిన వైనమిది.

గత్తరొస్తే ఊర్లకు ఊర్లే గడగడలాడిపోయేవి. అలాంటి గత్తరొచ్చిన కాలంలో ఊరిడిసి పోయి, తిరిగి వచ్చేటప్పుడు పుట్టి, బతికిబట్ట కట్టిన సంతానంలో ఎల్లమ్మ రెండోది. ఆదిలాబాద్ జిల్లా బాసరలో జన్మించిన చిందుల ఎల్లమ్మ అసలు పేరు సరస్వతి, ఎల్లమ్మ నాలుగో యేట ఆమె తండ్రికి చూపుపోయింది. అప్పుడే మొక్కులో భాగంగా సరస్వతికి ఎల్లమ్మగా నామకరణం చేసి జోగినిగా మార్చారు. అప్పటినుంచి పులింటోళ్ల సరస్వతి కాస్త ఎల్మమ్మగా మారింది.

నాలుగేళ్ల వయసులో ముఖానికి రంగు అద్దుకుంది ఎల్లమ్మ. తొలిసారి బాలకృష్ణ వేషం వేసింది. తెరవెనుక ఉన్నవాళ్లు పాటపాడితే తెరముందు ఎల్లమ్మను వదిలి ఆడమని ప్రోత్సహించేవారు. అలా అభినయంలో అడుగులేయడం మొదలైంది. నాలుగేళ్లలోనే ప్రావీణ్యత సాధించింది. ఆ తరువాతి కాలంలో రంభ వేషం వేసింది.

'మీ కాలు పడితే మంచిదంట, సల్లదనమంట.

మీరొచ్చి బాగోతం ఆడితో ఆనపద్దదట. పంటలు పండుతాయట. సిందులోల్లూ మీరు రావాల' అని పిలుచుకునే సామాజిక స్థితి ఆ రోజుల్లో ఉండేది. నిజామాబాద్ జిల్లాలోని మద్నూరు, దెగ్లూరు నుంచి మహారాష్ట్ర దాకా వెళ్లి ప్రదర్శనలు ఇచ్చేవారు. ఇలా ఎప్పుడంటే అప్పుడే, ఎక్కడంటే అక్కడికి తిరుగుతూ బాగోతాలు ఆడుతుండేవారు. 'యాడ వానాకాలం వస్తే అన్నే ఉంటుంటిమి. యాడ ఎవరు సస్తే ఆన్నే బొందపెడుతుంటిమి. ఎవరికైనా లగ్గం కరారైతే ఆన్నే చేస్తుంటిమి. గోసనాయినా, మా సిందోల్ల బతుకులు' అని ఎల్లమ్మ వాపోయిన సందర్భాలెన్నో.

ఇన్ని ప్రతికూల పరిస్థితుల నడుమ కూడా చిందుబాగోతం బతుకుదెరువే కాదు, ఒక సామాజిక వర్గ జీవిత చిత్రమని, దాన్ని కాపాడాలని చివరికంటా తపన పడిన చిందుల ఎల్లమ్మకు తన 15వ యేట మేనత్త కొడుకు సైదులుతో వివాహం జరిగింది. కానీ నిరంతరం ప్రదర్శనల్లోనే తలమునకలుగా ఉండే ఎల్లమ్మ జీవిత సహచరుడికి సరైన సమయాన్ని మానసికంగానూ, శారీరకంగానూ అంత దగ్గర కాలేకపోతున్నానని మథన పడింది. అతనికి కావాల్సిన అవసరాల్ని తీర్చలేకపోతున్నానని దిగులుపడింది. కానీ వైవాహిక జీవితం కన్నా చిందు కళ మీదే ధ్యాస ఎక్కువ కలిగిన ఎల్లమ్మ చాలా పెద్ద మనసే చేసుకున్నారు. మనువాడిన మగడికి చెల్లి రామవ్వనిచ్చి మారు మనువు చేసింది. అప్పటికీ 20, 22 ఏళ్ల ప్రాయం ఎల్లమ్మది. ఇక చిందు బాగోతమే తన లోకమనుకుంది. బాల్యం, యవ్వనం, వృద్ధాప్యం ఇలా జీవితంలోని దశలన్నీ చిందు ప్రదర్శనలతోనే దాటేసింది. భర్త, చెల్లెలు, అన్నలతో ఆమె కుటుంబం సంతోషంగా ఉన్నారు. ఏ అరమరికలు లేకుండా గడిపారు. ఆ తరువాత కాలంలో భర్త సైదులు తనను 'అమ్మా' అంటుండె అని ఓ ఇంటర్వ్యూలో చెప్పింది.

వైవాహిక జీవితానికి దూరమైన ఎల్లమ్మకు ఒకటే ఆలోచన. ఎవరికీ పట్టని తన చిందుల కళకు ప్రపంచం పట్టం కట్టాల. అందరూ ఆదరించాల. అదే ఆశ, అదే శ్వాసగా బతికింది. ఎలాగైతేనేం అనుకున్నది సాధించింది.

30ల వరకు ఆడ, మగ రెండు పాత్రలు వేసేది ఎల్లమ్మ. తన అన్న గంగారం హరిశ్చంద్రుడిగా నటిస్తే ఎల్లమ్మ చంద్రమతిగా మారేది. అన్న సత్యవంతుడైతే ఎల్లమ్మ సావిత్రిగా జీవించేది. అన్న వాలిగా నిలబడితే ఎల్లమ్మ సుగ్రీవుడిగా పోటీపడేది. ఎవరైనా పాత్రధారులు లేకపోతే ఆ పాత్రకు తానే ప్రాణం పోసేది. ఆ తరువాత క్రమంగా చిత్రాంగి, చెంచులక్ష్మి, చంద్రమతి వేషాలు వేసింది. అలా చిందు బాగోతమే ఆమె జీవితంగా మారింది.

చిందు బాగోతంలోని ఏ పాటలకు ఆ పాట రాగం వేరుగానే ఉంటుంది. భూపాల రాగం ఎత్తుకుంటే భూమి వణుకు, నరాలన్నీ గుంజుకపోవు అంటారు అప్పటి కళాకారులు. అప్పుడు బాగోతాలల్ల భూపాలం, రూపక తాళం, ఆది తాళం ఎక్కువగా ఉండేవి.

మొదట్లో ఈ చిందు యక్షగానంలో మద్దెలు, తాళాలు, గజ్జెలు, పుంగీ ప్రధాన వాయిద్యాలు. తర్వాత క్రమంలో హార్మోనియం వచ్చింది. చిందు యక్షగానంలో గొప్పతన మేమిటంటే కళాకారులు వాళ్లే, వాయిద్యకారులు వాళ్లే. భుజకీర్తులు, కిరీటాలను, నగలను కూడా వాళ్లే తయారు చేసుకోవడం విశేషం. పొనికి కర్రతో వీటిని తయారు చేస్తారు. పొనికి కర్రనే బూరుగు కట్టె అంటారు.

నిచ్చెన మెట్ల వ్యవస్థలో అణచివేతకు గురవుతున్న సామాజిక వర్గంలో ఉన్న మాదిగలకు ఉపకులంగా చిందు కులస్థుల గురించి చెప్పినా, జాంబవంతుని పెద్దభార్య పిల్లలు మాదిగలని, చిన్న భార్యపిల్లలు చిందు కులస్థులని వారి విశ్వాసం. మాదిగలకు తమకు మధ్య ఉన్న బంధం అదే అంటారు.

ఈ కళాకారుల విషయంలో ప్రత్యేకంగా అభినందించాల్సిన విషయం ఏమిటంటే... యక్షగానంలో ఆడవారి పాత్రలను ఆడవారే వేయడం. ఈ కుటుంబంలోని మహిళలకు అలాంటి అవకాశం ఉండేది. కళాకారులుగా రాణించినందుకు వారికి ఎటువంటి కట్టుబాట్లు, ఆంక్షలు ఉండేవి కావు. అది మనుగడ కోసమే అయినా ఆహ్వానించదగిన పరిణామమే.

1981లో నిజామాబాద్ జిల్లా తిరుమనపల్లిలో నటరాజ రామకృష్ణ గారి పరిచయం తర్వాత ఇదే జిల్లా కలెక్టరేట్‌లో ఇదే సంవత్సరం తొలి అధికారిక ప్రదర్శన. తదనంతర కాలంలో అంతర్జాతీయ ఖ్యాతికి తొలిమెట్టు

అయ్యింది. నటరాజ రామకృష్ణ గారితో పరిచయమైన రోజున చెంచులక్ష్మి కథను ప్రదర్శించారు. ఆ ప్రదర్శనకు ముగ్ధుడైన రామకృష్ణ గారు తన శాలువా తీసి ఎల్లమ్మకు కప్పారు. చిందు కళను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అదే సంవత్సరం నాటక అకాడమీ సభ్యత్వం కూడా ఇప్పించారు రామకృష్ణగారు.

1986లో నాటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు గారు చిందుల ఎల్లమ్మ బృందాన్ని ఢిల్లీ తీసుకెళ్లి 'అప్నా ఉత్సవ్' లో ప్రదర్శన ఇప్పించారు. ఆ అప్నా ఉత్సవ్‌లో నాటి ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీతో పాటు... నాటి రష్యా అధినేత గోర్బచెవ్ దంపతులు వారి ప్రదర్శన చూసి ముగ్ధులయ్యారు.

అదే సంవత్సరం చిందుల ఎల్లమ్మను 'హంస' అవార్డుతో ప్రభుత్వం సత్కరించింది. 'కళారత్న అవార్డు', 2004లో 'రాజీవ్' ప్రతిభా పురస్కారాలతో రాష్ట్రప్రభుత్వం తన ఉనికిని చాటుకుంది. 2004 లోనే నిజామాబాద్ నుంచి బోధన్ వరకు గల రహదారికి ఎల్లమ్మ రహదారిగా నామకరణం చేసిన అనతికాలంలోనే కళారూపాన్నే ఇంటిపేరుగా మార్చుకున్న చిందు ఎల్లమ్మ 2005, నవంబర్ 9న శాశ్వత నిద్రలోకి జారుకున్నారు. అయినా అశేష అభిమానుల హృదయాల్లో శాశ్వతంగా కొలువై ఉంది ఈ కళాతపస్వి.

# 32 చొప్పకట్ల చంద్రమౌళి

**– వారాల ఆనంద్**

పట్టపగలే చీకటి రాజ్యం చేస్తుంది
మట్టి దీపాలయినా పెట్టండి
దీపం పెట్టేవాడులేని ఇల్లులావుంది దేశం
మనస్సులోని తమస్సును కాల్చడానికి
చిరు దివియనైనా వెలిగించండి

అని సమతా భావాల్ని వెలిగించిన గొప్ప ఆధునిక కవి చొప్పకట్ల చంద్రమౌళి. అభ్యుదయ భావాలతో చైతన్యవంతమయిన రచనలు చేసి ఒక తరానికి ప్రేరణగా నిలిచిన కవి రచయిత, మంచి వక్త చొప్పకట్ల చంద్రమౌళి. ఆధునిక తెలుగు సాహిత్యంలో విశిష్ట స్థానాన్ని పొందిన కరీంనగర్ జిల్లాలో 70వ దశకంలో ఎదిగి వచ్చిన యువకవులను ఆయన వెన్నుతట్టి ప్రోత్సహించి ముందుకు నడిపించినవాడు. సనాతన సాంప్రదాయ కుటుంబంలో పుట్టి వేములవాడ ధార్మిక క్షేత్రంలో ఎదిగి ప్రగతిగామిగా నిలిచిన కవి ఆయన. అధ్యాపక వృత్తిలో విద్యార్థుల అజ్ఞాన నివృత్తి చేస్తూ నిరంతరం యువకులతో వుంటూ వారికి ఆధునిక ఆలోచనల్ని కల్పించిన ఉత్తమ అధ్యాపకుడాయన. 1964లోనే జి.చంద్రమౌళి, పురాణం రామచంద్రలతో కలిసి చొప్పకట్ల చంద్రమౌళి 'ప్రగతి' పేర సైక్లో స్టైల్డ్ పత్రిక నడిపారు. తర్వాత 1970లో ఆగస్ట్ 15న ' సాహితీ మిత్రబృందం' సంస్థ ఏర్పాటు చేసి వేములవాడలో ముమ్మరంగా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి రెండవ శనివారం కవులూ రచయితలూ చొప్పకట్ల వారి ఇంట్లో సమావేశమయ్యేవారు. ప్రతిసారీ ఒక్కొక్కరు సభకు అధ్యక్షత వహించేవారు. అప్పుడే పురాద్ర, చొప్పకట్ల తదితరులు కలిసి 'కలుపు మొక్కలు' నాటకం వేశారు. ఆ తర్వాత ఎదిగి వచ్చిన తరం వేములవాడలో 'నటరాజ కాలానికేతన్' సాహితీ సంస్థను ఏర్పాటు చేసి అనేక కార్యక్రమాల్ని నిర్వహించారు. వీటన్నింటికీ చొప్పకట్ల చంద్రమౌళి ప్రేరకుడూ, సలహాదారుడూ కూడా.

సాహితీ కార్యక్రమాల నిర్వహణతోపాటు ఆయన నిరంతర కవితా సృజనకారుడు. అనేక కవితలు ఆకాలంలోనే అనేక పత్రికల్లో ప్రచురించబడి రేడియోలో కూడా ప్రసారమయ్యాయి. ఆయన కవితలతోపాటు కథలు, నాటికలూ కూడా రాశారు. 1960 నుంచి కరీంనగర్ జిల్లాలో ఎక్కడ కవి సమ్మేళనం జరిగినా చొప్పకట్ల లేకుండా జరిగేది కాదు. ఇక ఆయన అధ్యక్షతన జరిగే సమావేశాలు గొప్పగా జరిగేవి.

నటరాజ కళానికేతన్ సంస్థ కరీంనగర్ జిల్లా సాహితీ యాత్రలో ఒక ప్రభంజనం. ఆ సంస్థకు జింబో ప్రధాన కార్యదర్శి, వఝల శివకుమార్ నిర్వహణా కార్యదర్శి, పి.ఎస్.రవీంద్ర సహాయ కార్యదర్శిగా పని చేశారు. 1980కి ముందే శివారెడ్డి, దేవీప్రియ, గజ్జెల మల్లారెడ్డి, జ్వాలాముఖి, నిఖిలేశ్వర్, కుందుర్తి లాంటి వాళ్ళతో అనేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆ రోజుల్లోనే చొప్పకట్ల సంపాదకత్వంలో

'నవత' లిఖిత పత్రిక, అనంతరం అచ్చుపత్రికలు వెలువరించారు.

1971లో వెలువరించిన ఆయన కవితా సంకలనం ' సమతా దీపాలు' కాళోజీ ఆవిష్కరించారు. ఆపుడే ఆయన అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పని చేశారు. ఆయన కవిత్వం అత్యంత ఆధునిక భావాలతో ఇమిడి వుంటుంది.

ఆయన చంద్రునికో నివేదిక అంటూ ఇట్లా రాస్తాడు

"జీవనం ఎదగని నీలోని ఏడారులలో
సమతా నయాగారాలను పారించు
మంతా కుసుమ సౌరభాల స్వేచ్ఛా విహారాన్ని అరికట్టే
దానవతా శక్తులపై నరుడావై నారీ సారించు
దేవుడు కూడా సిగ్గిలునట్టు మానవాత శక్తిని నింపుకుని
తరించు"... అంటాడు.

చొప్పకట్ల చంద్రమౌళి కవిత్వం నిండా శాంతిని కాంక్షించడం సమతాను ప్రేమించడం మానవత్వాన్ని నిలబెట్టడం కనిపిస్తుంది. ముఖ్యంగా మనిషిని ప్రేమించడం ఆయన కవిత్వంలో ఆద్యంతం మనల్ని ఆకట్టుకుంటుంది.

ప్రగతిగాములు కానీ వారి పట్ల ఆయన మరో చోట ఇట్లా అంటాడు

"ఎందుకు కన్నావమ్మా ఈ పెద్దన్నలను
బొందినిండా ముళ్ళు నిండిన దద్దన్నలను
తలపులో విరిసిన పారిజాతాల అందాలను
మాటలలో మలచడం
కాషాయం తాగడంలా ఫీలయ్యే దౌర్భాగ్యులు..."
అంటూ వాళ్ళంతా జిడ్డు మోహాలకు ప్రతీకలని నిలదీస్తాడు.

చొప్పకట్ల కవిత్వంలో ప్రధాన లక్షణం 'చురక' ఆయన టీచర్ గురించి ఒకచోట రాస్తూ ఇట్లా అంటాడు...

"కరువుకు మారు పేరీనాడు గురువు
బరువుకు తూకం కానిది అతని పరువు...
టీచర్లోని తెలివికి హోదా దక్కదు
టీచర్ అనే మాట వినగానే
జలదరిస్తుందొక పెళ్లి కూతురు హృదయం
హి ఈజే ఏ పూర్ క్రీచర్
వాట్ విల్ బి మై ఫ్యూచర్"

ఇలా ఆయన కవిత్వం నిండా ఆకర్షించే శైలి చెప్పే తీరులో వైవిధ్యం మనల్ని విశేషంగా ఆకర్షిస్తుంది

వచన కవిత్వంలో అంతర్లయను ఆయన బాగా వాడుకున్నారు. ఎంచుకున్న ప్రతి కవితా విషయం సామాజికమై, ప్రగతి గామిగా వుండడం ఆయన కవితా ప్రత్యేకత. వ్యంగ్యం ఆయన మరో కవితా లక్షణం

"అంతరంగంలో చిత్తశుద్ధికి భద్రతలేని
మా పాలనా కొలమానాలతో అతన్ని
ఆంతరంగిక భద్రతా చట్టం కింద అరెస్ట్ చేస్తాం"

చొప్పకట్ల చంద్రమౌళి పండుగలకూ, సందర్భాలకూ రాసిన కవితల్లో కూడా ఉత్తమమయిన ప్రయోజనాత్మక మయిన రచనలు చేశారు.

ఇంకా ఆయన 'చిత్రిక' వార పత్రికలో వారం వారం వ్యవస్థా చిత్రిక పేరిట సమాకాలీన సమస్యలపైన రచనలు చేశారు. విద్యార్థుల సమస్యలు పరీక్షా విధానం తదితర అనేక సమస్యల పైన ఆయన రచనలు చేశారు. అంతేకాదు విద్యార్థుల్లో చైతన్యం నింపేందుకు స్కూలు, కాలేజీల్లో నాటికలు, నృత్య నాటికలు వేయించేవారు.

"దేశం తన గుండె పైన
సోషలిజం ప్రచురించేను
మన సమతా సౌధంలో
మసక వెలుగు ప్రసరించెను"

...అంటూ ఆయన రాసిన సైలెన్సర్లేని గుండె చాలా ప్రసిద్ధి పొందింది.

ప్రగతిశీల దృక్పథంతో చివరంటా నిలిచి ఒక తరాన్ని ప్రభావితం చేసిన ఆయన అనేక పాటలు వ్యాఖ్యానాలూ రాశారు. రచనలనిండా ఆద్యంతం అణచివేతకు గురయిన వారివైపు నిలబడి రచనలు చేసిన గొప్ప కవి చొప్పకట్ల చంద్రమౌళి. కేవలం రచనలేకాదు ఆచరణలో కూడా తనదయిన విలక్షణ వ్యక్తిత్వంతో నిలబడ్డవాడు చొప్పకట్ల చద్రమౌళి.

## 33

# చుక్క సత్తయ్య

**– డా॥ జె. చెన్నయ్య**

అపూర్వమైన జానపద సంస్కృతికి, అపారమైన వైవిధ్యం కలిగిన కళారూపాలకు ఆటపట్టయిన తెలంగాణలో జన్మించిన ధన్యజీవులైన కళాకారులెందరో. అటువంటి వారిలో చుక్క సత్తయ్య ప్రముఖంగా చెప్పుకోదగినవారు. ఒగ్గుకథ కళారూపానికి విశేషమైన గుర్తింపు తెచ్చిపెట్టిన ఈ కళామూర్తి పేరులో, వేషంలో తెలంగాణ కథాగేయాన్ని వివిధ గతుల్లో ఆలపించి అపూర్వమైన అనుభూతిని పంచిపెట్టడంలో ప్రత్యేకమైన గుర్తింపు పొందారు.

1935 మార్చి 29న వరంగల్ జిల్లా మాణిక్యాపురంలో సత్తయ్య జన్మించారు. తల్లిదండ్రులు సాయమ్మ, ఆగయ్య. ఆర్థికంగా సామాజికంగా వెనుకబడిన వర్గంలో జన్మించిన సత్తయ్య ఆనాడు పాఠశాలకు వెళ్ళి విద్యను అభ్యసించలేదు. ఊరి పంతుళ్ళ దగ్గర తెలుగు రాయడం, చూడడం బాలశిక్ష శతకాలు చదువుకున్నాడు. చిన్నప్పుడే ఊళ్లో ప్రదర్శించే వీధి నాటికలు సత్తయ్యను విశేషంగా ఆకర్షించాయి. నాటకాల్లోని పాత్రధారులు ధరించే ఆభరణాలు, వస్త్రాలు, వారు చూపే అభినయం, ఆలపించే పాటలు, పద్యాలు సత్తయ్యను సమ్మోహితుడ్ని చేశాయి. ఎట్లాగైనా తానూ కళాకారుడు కావాలని కలలుగన్నాడు. కొంత తండ్రి ప్రోత్సాహం తోడైంది. రామాయణ, మహాభారత కథలు ఇతివృత్తాలుగా సాగే వీధి నాటికల్లో తానూ వివిధ రకాలైన పాత్రలను ధరించడం ప్రారంభించాడు. రాముడు, హనుమంతుడు, రావణాసురుడు మొదలైన పాత్రలు ఆయనను కళాకారునిగా నిలబెట్టాయి. తర్వాత ఒగ్గుకథవైపు మొగ్గు చూపాడు.

ఒగ్గుకథ కుర్మకులానికి సంబంధించిన కళారూపం. కళాకారులు డోలు, తాళాలు, స్త్రీవేషం, కంతు మొదలైన హంగులతో ఆడిపాడుతూ అనేక రకాలైన కథల్ని గానం చేస్తారు. అంతేగాక కురుమ, యాదవకులంలో వివాహాలు, పండుగలకు ఒగ్గుపూజారులుగా వ్యవహరిస్తారు. ఈ అధికారం కొందరికే వుంటుంది. ఈ అధికారం లేదా హక్కును వతన్ అంటారు. చుక్కా సత్తయ్యకు వతన్ లేదు. తన అభిరుచితో, నిరంతర కృషితో ఒగ్గుకథలు నేర్చుకొని ఉన్నత స్థానానికి ఎదిగారు. జానపదకళలు మౌఖిక సంప్రదాయంలో ఒకతరం నుంచి మరొక తరానికి అందుతాయి. గంటలు, రోజుల తరబడి గానం చేసే ఒగ్గుకథ లాంటి కళారూపాలు కూడా అంతే. ఈ కళలో కథలన్నిటినీ అట్లా భట్టీపట్టడం నాటి తరంలో ఉంది. చుక్క సత్తయ్య ఆ విధంగా బీరప్పకథ, రేణుకా ఎల్లమ్మ, హరిశ్చంద్ర, మహాభారతంలాంటి ఎన్నో కథలు నేర్చుకొని పొల్లుబోకుండా ప్రదర్శించే ప్రజ్ఞని 20 ఏళ్ళ వయసుకే సొంతం చేసుకొన్నాడు.

తెలంగాణ సంస్కృతిని ఆసాంతం పుక్కిట బట్టి ఒగ్గుకథను తన సర్వస్వంగా స్వీకరించిన చుక్క సత్తయ్య కథా ప్రదర్శనలో తనదైన నాట్యం, కథాగానంతో కొత్తదనం ప్రవేశపెట్టారు. పురుషడైమండ్ ప్రధాన కథకునిగా స్త్రీవేషం

ధరిస్తాడు. కథ మధ్యలో నాయకుడు బీరయ్య ప్రవేశించడంతో సత్తయ్య జుట్టు విరబోసుకొని, మీసాలు పెట్టుకొని బీరయ్యగా మారిపోతాడు. శివుని కుమారుడైన వీరభద్రుని అవతారము ఎత్తుతాడు. ఒగ్గుడోలు, తాళాలు, వేగవంతంగా సాగే కథాగానంలో సత్తయ్య సాక్షాత్తు వీరభద్రుడై ఉగ్రరూపు దాలుస్తాడు. ఉన్నచోటనే తన ప్రత్యేకమైన పదాభినయంతో అశ్వారుఢుడై యుద్ధానికి తరలివెళ్ళే నాయకుడవుతాడు. బీరప్పకథలో తనకు కాబోయే వధువు ఎలా ఉండాలో తన మనోభావాల్ని చెబుతున్నప్పుడు జానపద నాయక లక్షణాలను పుణికిపుచ్చుకున్న ఆ సన్నివేశం సత్తయ్యలోని కళాకారుని విశ్వరూపం చూపిస్తుంది.

వేదికలమీద చుక్క సత్తయ్య బృందం ఒగ్గుకథ ప్రదర్శిస్తున్న తీరు ప్రత్యేకమైంది. గ్రామాల్లో సత్తయ్య ఒగ్గుకథ అంటే జనానికి పండుగే. వరంగల్లు జిల్లా ఆయన తొలినాళ్ళ కథల్ని తనివితీరావిన్నది. క్రమంగా ఇతర జిల్లాలకు తమ బృందంతో సహా వెళ్లి ప్రదర్శనలివ్వడంతో ఒగ్గుకథ, సత్తయ్యకు ప్రాచుర్యం, ప్రాముఖ్యం పెంచింది. 1970కు ముందే తెలంగాణలో జానపద కళారూపాల ప్రదర్శనల్లో ఒగ్గుకథకు అగ్రతాంబూలం లభించడానికి కారణం సత్తయ్య. అంతకుముందున్న కథాగమనంలో ఆయన ప్రవేశపెట్టిన నాట్యం, నాటకీయత, ఆహార్యం, సంభాషణలు పలికేతీరు, వీటితోపాటు తనదైన గ్లామర్‌ను జోడించడంతో సత్తయ్య పేరు మారు మోగింది. ఇతర రాష్ట్రాల వేదికలలో కూడా ఒగ్గుకథకు స్థానం కల్పించాడు. ఇతరులు చుక్క సత్తయ్య బృందాన్ని ఆహ్వానించడం సర్వ సాధారణమైపోయింది.

గత 50 ఏళ్ళల్లో సుమారు 13000 ప్రదర్శనలిచ్చారు. 1973లో దూరదర్శన్ ప్రసారాలు ప్రారంభం కావడంతో ఒగ్గుకథకు చోటుకల్పించారు. ఆకాశవాణి ద్వారా, దూరదర్శన్‌ద్వారా, వేదికల మీద ఒగ్గుకథకు పట్టంగట్టడం, సామాన్య ప్రజల ఆదరణ అపరిమితంగా పెరుగడంతో సంప్రదాయకథలతో పాటు ప్రభుత్వ పథకాలను ఇతివృత్తాలుగా ఒగ్గుకథలుగా రూపొందించుకొని చెప్పడం ప్రారంభమైంది. అప్పటివరకు ఎన్ని కథలు చెప్పినా అప్పటి వరకు ఉన్నవే. కాని కొత్తగా ప్రభుత్వం ఒగ్గుకథ కళారూపాన్ని వినియోగించుకొని ప్రజా చైతన్యాన్ని పెంపొందించాలని నిర్ణయించడంతో కొత్త దారి అవసరమైంది. సత్తయ్యకు సమయస్ఫూర్తి పుష్కలంగా ఉండడంతో ఏ అంశం ఇచ్చినా ఇట్టేకథ అల్లుకొని జనం భాషలో కథలు చెప్పడం సాధ్యమైంది. 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమం, వయోజన విద్య, కుటుంబనియంత్రణ తదితర పథకాలు, కార్యక్రమాల గురించి ఒగ్గుకథలు చెప్పి గ్రామీణులను చైతన్యవంతులను చేశారు.

1973లో దూరదర్శన్ ఆకాశవాణిలో ఒగ్గు కథాగానం ప్రసారమైంది. రెండు మాధ్యమాల్లో తొలుత ఒగ్గుకథ గానం చేసింది సత్తయ్యనే. ఢిల్లీలోని జాతీయ సంగీత నాటక అకాడమీ అనేక మార్లు చుక్కసత్తయ్య ఒగ్గుకథ ప్రదర్శనలు ఏర్పాటు చేసింది. దిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో, నాగపూర్‌లోని దక్షిణ ప్రాంత సంస్కృతిక కేంద్రం, హంపీ విజయనగర దసరా ఉత్సవం, ప్రపంచ తెలుగు మహాసభలు, తిరువనంతపురం నిషాగంధి ఉత్సవం మొదలైన ప్రతిష్ఠాకరమైన సంస్థలు ఏర్పాటు చేసిన ఉత్సవాల్లో చుక్క సత్తయ్య బృందం ఒగ్గుకథను ప్రదర్శించి తెలంగాణ జానపద కళా వైలక్షణ్యాన్ని ఆయా భాషల వారికి రుచిచూపాయి. ఆకాశవాణి, దూరదర్శన్ ద్వారా గత 45 సం॥గా కొన్ని వందలసార్లు వీరి ఒగ్గుకథాగానం ప్రసారమై అసంఖ్యాకమైన శ్రోతలను ఆకట్టుకుంది. 1987లో సెంట్రల్ సౌత్‌జోన్ ఆహ్వానంపై అండమాన్‌లో జరిగిన ఉత్సవాల్లో సత్తయ్య ఒగ్గుకథ కళారూపం ప్రదర్శితమైంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆవిర్భవించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర అవతరణ రజతోత్సవాల్లో ఒగ్గుకథా ప్రదర్శనకు అవకాశం లభించింది. నాటి ముఖ్యమంత్రి టి. అంజయ్య చేతులమీదుగా సత్తయ్యకు ఘన సన్మానం జరిగింది.

దశాబ్దాలకు పూర్వమే ఢిల్లీ, భోపాల్, ఉదయ్‌పూర్, బెంగళూరు, ఉజ్జయిని, నాగపూర్, విజయవాడ, బరంపురం, విశాఖపట్నం, మైసూర్, కడప, కర్నూలు మొదలైన విభిన్న ప్రాంతాలకు వెళ్ళి తమ ఒగ్గుకథను ప్రదర్శించారు. ఆనాడే తెలంగాణ జానపద కళా ప్రదర్శనకు ముఖ్య ప్రతినిధిగా పేరుపొందారు. సత్తయ్యకు లభించిన గౌరవాలు కూడా అత్యున్నతమైనది. తొలి ప్రపంచ తెలుగు మహాసభల్లో కథా ప్రదర్శనకు మహామహులైన విద్వాంసుల సరసన జానపద కళామూర్తి నాటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు

చేతులమీదుగా ఘన సత్కారం అందుకున్నారు. ప్రధానులు శ్రీమతి ఇందిరాగాంధి, రాజీవ్ గాంధి, పి.వి. నరసింహారావు, నీలం సంజీవరెడ్డి, ఎ.పి.జె. అబ్దుల్‌కలాం వంటి రాష్ట్రపతులు చుక్క సత్తయ్యను సత్కరించారు. ఎన్.టి.ఆర్.కు చుక్క సత్తయ్య అంటే ప్రత్యేకమైన గౌరవం. ఎన్టీఆర్ అభినయ ఛాయలు సత్తయ్య కథా ప్రదర్శనలో కనిపిస్తాయి. ఆంధ్ర విశ్వవిద్యాలయం స్వర్ణకంకణంతో గౌరవించింది.

ఆయనపేరు చౌదరిపల్లి సత్తయ్య. అయితే చుక్క సత్తయ్యగానే కళాలోకానికి సుపరిచితులు. కథా ప్రదర్శన ప్రావీణ్యంతో తెలంగాణ జానపదకళకు ప్రపంచ వేదికలపైన చోటు దొరకపోయినప్పటికి ప్రత్యేకమైన పరిగణన లభించడం అరుదైన విషయం. వీరికి లభించిన పురస్కారాలు కూడా ప్రత్యేకంగా పేర్కొనదగినవి. తెలుగు విశ్వ విద్యాలయంలో ఒగ్గుకథ అధ్యాపకులుగా సేవలు అందించడంతో పాటు ఆ విశ్వ విద్యాలయం నుంచి జానపదకళా రంగంలో ప్రతిభా పురస్కారాన్ని, అత్యున్నతమైన విశిష్టపురస్కారాన్ని సత్తయ్య అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ప్రతిభా రాజీవ్ పురస్కారమందుకొన్నారు. శ్రీ డా. నేరెళ్ల వేణుమాధవ్ పురస్కారం పొందారు.

ఒక్క విషయం తప్పకుండా ప్రస్తావించాలి. అది 2005వ సంవత్సరం చుక్క సత్తయ్య గారికి గౌరవడాక్టరేట్ ప్రదానం చెయ్యాలని నిర్ణయించినట్లు తెలియజేస్తూ రెండు విశ్వవిద్యాలయాలు గవర్నరుకు ప్రతిపాదన పంపాయి. ఒకరికి రెండు డాక్టరేట్లు ఏకకాలంలో ఇవ్వడం జరగదు. సత్తయ్య జన్మస్థలం వరంగల్లు జిల్లా కాబట్టి కాకతీయ విశ్వవిద్యాలయం అయనకు డాక్టరేట్ ప్రదానం చేసేందుకు గవర్నర్ ఆమోదం తెలిపారు. ఒకేసారి రెండు విశ్వవిద్యాలయాలు ఈ అత్యున్నతమైన గౌరవాన్ని ఆయనకు అందించాలని నిర్ణయించడం యాదృచ్ఛికమే అయినా గొప్ప శాస్త్రవేత్తతోనూ, గొప్ప శాస్త్రీయ కళకు సంబంధించిన విద్వాంసునితోనూ సమానంగా సత్తయ్యకు ఈ గౌరవం లభించడం సాధారణమైన విషయం కాదు. ఆ తర్వాతి కాలంలో కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారం అప్పటి రాష్ట్రపతి డా. ఎ.పి.జె. అబ్దుల్‌కలాం చేతుల మీదుగా దక్కడం సామాన్యమైన విషయం కాదు సత్తయ్య దశాబ్దాల కఠోర పరిశ్రమతో తనదైన ప్రదర్శనా రీతితో ఒగ్గుకథకు గుర్తింపుతేవడం, దేశంలోని ప్రథమ నగరాల్లో, ఈశాన్య రాష్ట్రాలు, ఢిల్లీ, బెంగళూరు, నాగపూర్, మైసూరు వంటి చోట్ల అప్పటికే ప్రదర్శించి ప్రాచుర్యం పొంది వుండడంవల్ల ఈ గుర్తింపు వచ్చిందని కచ్చితంగా చెప్పవచ్చు. కేంద్ర సంగీత నాటక అకాడమి అవార్డు పొందిన తెలంగాణ విద్వాంసులు, కళాకారులే తక్కువ. అందునా ఒక జానపదకళాకారునికి ఈ పురస్కారం లభించడం అరుదైన విషయం. సత్తయ్యలోని ప్రతిభకు దక్కిన గౌరవమిది.

అయితే సత్తయ్య గొప్పవినయశీలి. ఏనాడూ ఈ ఘనత తనదేనని అనుకోలేదు. ఏ వేదికనెక్కినా ఇది తెలంగాణ జానపద కళావారసత్వ సంపద గొప్పతనమని, తన చిన్ననాడే ఈ విద్య నేర్పిన బీర్ల అయిలయ్య, బండినర్సయ్య తనను ఆదరించి, ప్రోత్సహించి, పెంచిన తెలంంగాణ ప్రజలదే ఈ ఘనత అని చెప్పుకొన్నాడు. నాలాగా జీవనోపాధికరమైనా కళలనే నమ్ముకొని కళను ప్రదర్శిస్తూ బతికిస్తూ వస్తున్న ఎంతో మంది జానపద కళాకారుల తరపున వారిలో ఒకనిగా నాకీ గౌరవం లభించిందన్నారు.

తాను గానం చేసిన ఒగ్గుకథల ఆడియో క్యాసెట్లు తెలంగాణ దాటి అమెరికా, మలేషియా, మారిషన్, దుబాయి, మస్కట్, కువైట్ వంటి దేశాల్లో వేలాదిగా అమ్ముడైన సత్తయ్యకు లభించిన పారితోషికం నామమాత్రం. ఎంత గౌరవం లభించినా శాస్త్రీయ సంగీత, నృత్యాలకు ఇచ్చిన పారితోషికం ఎవరూ ఇవ్వరు. అందులో పల్లె ప్రజల మధ్య పుట్టి పెరిగిన ఈ కళకు ఇచ్చే పారితోషికం చాలా తక్కువ. అందుకే సత్తయ్య ఆర్థికంగా ఇప్పటికీ పేదవాడే. తెలంగాణ ప్రభుత్వం పింఛను ఇచ్చి ఆదుకుంటున్న విషయము హర్షించదగింది.

ఒగ్గుకథ జానపద కళారూపాల్లో జనరంజకమైన కళ. కథాగానం, నాటకీయత, రసవత్తరమైన సంభాషణలు, నాట్యరీతి, సంగీతం ఇవన్నీ కలిగిన సమాహారకళ. దీన్ని అంతరించి పోకుండా కాపాడాలనే ఉద్దేశంతో అనేక జిల్లాల్లో శిక్షణ శిబిరాలు నిర్వహించి ఈతరం కళాకారుల్ని తయారు చేశాడు చుక్క సత్తయ్య. బీరప్పకథ, ఎల్లమ్మ, కీలుగుర్రం, మాంధాతకథ, నల్లపోచమ్మ, హరిశ్చంద్ర, శివకుమార్

మొదలైన కథలన్నీ అవలీలగా రోజులతరబడి గానం చేసే అరుదైన కళాకారుడు సత్తయ్య.

1969లో తెలంగాణ ఉద్యమంలో కళాకారునిగా, వ్యక్తిగా కూడా పాల్గొని పోలీసుల చేత దెబ్బలు తిన్న జ్ఞాపకాలు అది వేరే కథ.

ఏమైనా తెలంగాణలో జన్మించి స్వయంకృషితో సమున్నత కళాకారునిగా ఎదిగి జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మకమైన రీతిలో గుర్తింపుపొందిన కళాకారుడు చుక్క సత్తయ్య. తెలంగాణ కళా వినీలాకాశంలో పల్లె ప్రతిభకు ప్రతీకగా మెరిసే వేగు చుక్క ఈ చుక్క సత్తయ్య. ఆయనను చూసి తెలంగాణ గర్విస్తుంది. తెలంగాణ మట్టిలో జన్మించినందుకు తానూ గర్విస్తాడు.

# 34 డి. రామలింగం

– డా॥ దేవరాజు మహారాజు

వృత్తి ఏదైనా ప్రవృత్తి రీత్యా రచయితలయినవారు రచన చేయడమే ధ్యేయంగా పెట్టుకోవాలి – అన్న సందేశాన్ని సుప్రసిద్ధ సాహితీవేత్త, తెలుగు కథానికా సమీక్షకులూ అయిన డి. రామలింగం ఎక్కడో ఏ మహా సభలోనో చెప్పలేదు. నిశ్శబ్దంగా జీవితాంతం చేసి చూపించారు. అందుకే నేటితరం కవులూ, రచయితలు ఆయన సాహిత్య కృషిలోంచి నేర్చుకోవాల్సింది చాలా ఉంది. ఆయన జీవిత విశేషాలపై దృష్టి సారిస్తే ఆయన ఎంతటి నిరాడంబరుడో, ఎంతటి పట్టుదల, పరిశ్రమ గలవాడో అర్థమవుతుంది. ఆయనలోని నిబద్ధత, నిజాయితీ ఈతరంవారు ఆదర్శప్రాయంగా తీసుకోవాల్సి ఉంది.

డి. రామలింగం ఖమ్మం జిల్లా మధిర తాలూకా బనిగండ్లపాడు గ్రామంలో 8 జూన్ 1924న జన్మించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి పట్టభద్రులయ్యారు. ఇంగ్లీషు సాహిత్యం, ఆర్థిక శాస్త్రం, రాజకీయ శాస్త్రం ఆయన ఐచ్ఛిక విషయాలు. తెలుగులో డిస్టింక్షన్ తెచ్చుకున్నారు. చురుకైన విద్యార్థిగా ఉంటూ, ఒకవైపు రచనలు చేస్తూ, మరోవైపు జాతీయోద్యమంపట్ల ఆకర్షింపబడి క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో విముక్తి పోరాటంలోకి దూకారు. స్టేట్ కాంగ్రెస్ వారి తెలుగు వార పత్రిక 'సారథి'కి సహ సంపాదకుడిగా పనిచేశారు. ఆ రోజుల్లో 'సారథి' పత్రికను నిజాం ప్రభుత్వం నిషేధించింది. ఆ సమయంలోనే ఆయన పద్నాలుగు నెలలు అజ్ఞాతంగా పనిచేశారు. ఒక బాధ్యతగల జర్నలిస్ట్‌గా ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి విషయాలు సేకరించి, 'సారథి'కి వ్యాసాలు రాయడం మాత్రం ఆపలేదు. ఆ తర్వాత కొంతకాలం 'గోలకొండ' పత్రికలో పని చేశారు. గోలకొండ పత్రిక మొదట కొంతకాలం వారానికి రెండుసార్లు వెలువడేది. ఆ తర్వాత దిన పత్రికగా మారింది. ఆ రెండు దశల్లోనూ రామలింగం గోలకొండ పత్రికలో పని చేస్తూనే వచ్చారు. తర్వాత సమాచార శాఖలో అనువాదకుడిగా చేరారు. ప్రభుత్వోద్యోగం కావడంతో అది ఆయన జీవితానికి కొంత భద్రత కలిగించించి. దానితో ఆయన దృష్టి ఇతర సృజనాత్మక రచనలవైపు మళ్ళింది. ఆయన సమాచార శాఖలో చేరిన కొద్ది కాలానికే హైదరాబాద్ సంస్థానం యూనియన్‌లో చేరింది. హైదరాబాద్ సమాచార శాఖ ఆంధ్రప్రదేశ్ సమాచార శాఖగా అప్పుడే రూపాంతరం చెందింది. ఆ కాలంలోనే ఆయన తెలంగాణ రచయితల సంఘానికి కార్యదర్శి అయ్యారు. సభలూ, సమావేశాలు నిర్వహించడం, పుస్తకాలు ప్రచురించడం వగైరా నిత్య కృత్యాలయ్యాయి.

ఆ సమయంలోనే పదోన్నతిపై డి. రామలింగం రాష్ట్ర కార్యాలయం నుండి కేంద్ర ప్రభుత్వ కార్యాలయానికి మారారు. అప్పటినుండి కొంతకాలం తెలుగు నేలకు దూరమయ్యారు. ఢిల్లీలోని భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ICAR) లో కొంతకాలం పని చేశారు. చివరకు

చెన్నై సెన్సార్ ఆఫీసర్‌గా కొంతకాలం పనిచేశారు. చివరకు చెన్నై నుండి పదవీ విరమణ చేసి, హైదరాబాద్‌లో స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. బాగ్‌లింగంపల్లి నుండి నల్లకుంట మార్కెట్ వెళ్ళే రోడ్డులో ఆయన స్వంత ఇంట్లో శేష జీవితం గడిపారు. ఉద్యోగంలో ఉన్నా, పదవీ విరమణ తర్వాతైనా నిరంతరం రచన చేయడం ఆయన నైజంగా ఉండేది. వ్యాసాలు, సమీక్షలు రాస్తూనే ఎన్నో గ్రంథాలకు సంపాదకత్వ బాధ్యతను తీసుకునేవారు. కేంద్ర సాహిత్య అకాడమి వారి పత్రిక 'ఇండియన్ లిటరేచర్'కు వ్యాసాలు రాసేవారు. 'హిందూ' ఇంగ్లీషు దిన పత్రికలో తెలుగు పుస్తకాలు సమీక్షించేవారు. వారానికి ఓ సారి ఎక్కడో ఓ చోట ఆయన పేరు కనబడుతూనే ఉండేది. ఇవన్నీ కాకుండా, జీవిత చరిత్రల రచయితగా ఆయన గొప్ప పేరు సంపాదించు కున్నారు. పిల్లల సాహిత్యంపై కొంత కృషి చేశారు.

రామలింగం కేంద్ర సాహిత్య అకాడమీ సలహా సంఘ సభ్యులుగా అయిదేళ్ళు పని చేశారు. బహుశా ఆ కాలంలోనే 'ఇండియన్ లిటరేచర్' ఇంగ్లీషు పత్రికలో తెలుగు సాహిత్య ధోరణులను గూర్చి, దాశరథిలాంటి నాటి ప్రముఖ కవుల గూర్చి విపులమైన వ్యాసాలు రాశారు. ఆ రకంగా తెలుగు భాషా సాహిత్యాల గూర్చి ప్రపంచానికి తెలియజేసిన వారయ్యారు. వీరి రచన 'విశ్వకవి' 1960-70లలో చాలాకాలం ఏడో తరగతి విద్యార్థులకు ఉపవాచకంగా ఉండేది. తెలుగులోనేకాక, వీరికి ఉర్దూలో కూడా మంచి ప్రావీణ్యం ఉండేది. ప్రొఫెసర్ ఆర్నాల్డ్ టాయనబీ, కె.సి.దేల పుస్తకాలను తెలుగీకరించారు. తెలుగు, ఇంగ్లీషు, హిందీ, ఉర్దూ, బెంగాలీ భాషలు బాగా రావడంవల్ల అనువాదకులుగా రాణించారు.

ఇవి మాత్రమేకాక, సృజనాత్మక సాహిత్యంలో కూడా విశేషంగా కృషి చేశారు. కథానికలు, స్కిట్‌లు, రేడియో నాటికలు రాశారు. 'కాగితపు పడవలు' అనే వీరి కథా సంపుటిని దేశీ ప్రచురణాలయం 1964లో ప్రచురించింది. అందులో సిపాయి రాముడు, బర్సాతీ, గమ్యస్థానం భంగపడిన రాగబంధం, భార్యోపహతుడు, అత్తా - అల్లుడు, ప్రాప్తంలేదు, కబుర్లలో కత్తిగాట్లు, జాగృతి వంటి మంచి కథలెన్నో ఉన్నాయి. ఆనాటి సామాజిక స్థితిగతుల్ని, మానవ సంబంధాల్ని చిత్రించిన ఆ కథలు ఆయనను శిల్పం లోతులు తెలిసిన ఉన్నత స్థాయి రచయితగా నిలబెట్టాయి. విశాలాంధ్ర ప్రచురణాలయం 2005లో వెలువరించిన 'తెలంగాణ కథలు' బృహత్ సంకలనంతో వీరి కథ 'గమ్యస్థానం' ఉంది. ఇటీవల డి. రామలింగం కథలు శీర్షికన నవచేతన పబ్లిషింగ్ హౌస్ వారు ఆయన కథల్ని పునర్ముద్రించారు.

జీవిత చరిత్రల విషయానికొస్తే ఆయనది ఒక ప్రత్యేకమైన స్థానం. విశిష్టమైన శైలి!! బూర్గుల రామ కృష్ణారావు, మాడపాటి హనుమంతరావు, శొంఠి రామమూర్తి, దామోదరం సంజీవయ్య మొదలైన తెలుగు ప్రముఖుల జీవిత చరిత్రలను ఆయన పాఠకలోకానికి అందించి, తద్వారా ఒక స్ఫూర్తిని కలిగించారు. జీవిత చరిత్రలైనా, సాహిత్య వ్యాసాలైనా ఆయన పరిశోధనాత్మకంగా, తులనాత్మకంగా రాసేవారు. తెలుగు రచయితలలో కొద్దిమందికి మాత్రమే ఆ స్థాయి ఉంది. ఒక తరం తెలుగు కథకు రాసిన ముప్పయి పేజీల ముందుమాట కథకులు. సాహితీ ప్రియులు భద్రపరుచుకోవాల్సినంత విలువైంది! జీవిత చరిత్రలు రాయడంలో ఆయనకు ఎంత పేరు వచ్చిందంటే తమ తాలూకు మనుషుల జీవిత చరిత్రలు రాస్తే ఎక్కువ మొత్తంలో పారితోషికమిస్తామని కొంతమంది పెద్దవాళ్ళు ఆయన చుట్టూ తిరగడం నేనెరుగుదును. "వ్యక్తుల పరిచయాలు లేకుండా, వారు చేసిన కృషి ఏమిటో తెలియకుండా పారితోషికం కోసం జీవిత చరిత్రలు రాయడానికి పూనుకోను" అని నిర్మొహ మాటంగా ఆయన వారికి చెపుతూ ఉండడం కూడా నాకు తెలుసు.

కేంద్ర సాహిత్య అకాడమీ కోసం ఆయన 1988లో "తెలుగుకథ" సంకలనాన్ని కూర్చారు. 'ఒక తరం తెలుగుకథ' పేరుతో మళ్ళీ మరో సంకలనాన్ని కూర్చారు. అది ఆయన మరణానంతరము 1994లో వెలువడింది. అది బెంగళూరులో ముద్రణ జరుగుతున్న దశలో సంకలనకర్త డి. రామలింగం గారి గూర్చి చిన్న పరిచయం రాయమని సాహిత్య, అకాడమీవారు నన్ను కోరారు. పెద్దాయనకదా! కలిసి మాట్లాడి రాస్తే బావుంటుందని ఆయన దగ్గరికి వెళ్ళాను. సుస్తీగా పడుకొని ఉన్నారు. నాకు విశేషమేమీ కనిపించలేదు. అప్పటికి ఆరు నెలలుగా ఆయన అలాగే ఉన్నారు. వచ్చిన విషయం చెప్పాను. అల్మారాలోంచి "తెలుగుకథ" పుస్తకం తీసి, దాని వెనకవున్న ఐదారు పంక్తుల

పరిచయం చూపించారు. అది అబ్బూరి వరద రాజేశ్వరరావు రాసిందని చెప్పారు. ఎక్కువగా మాట్లాడలేదు. 'వంట్లో ఏమీ బావుండడంలేదండీ' అని వెంట వెంటనే రెండు మూడుసార్లు అన్నారు. నాకెందుకో భయంవేసింది. అంతకు కొన్ని నెలలముందు 'ఓల్డ్ ఏజ్ హోమ్' వివరాలు కావాలని అడిగినప్పుడు కూడా నాకు అలాగే భయం వేసింది. ఆయన కంటి జబ్బు గూర్చి, కడుపునొప్పి గూర్చి తెలుసు. వాటిని మించి భయంకరమైన ఒంటరితనం గూర్చి కూడా తెలుసు. ఏం మాట్లాడగలను? 'పడుకోండని' అయిదు నిముషాల్లోనే బయటికొచ్చేశాను. కొంచెం కోలుకున్నాక, ఓ వారం తర్వాత మళ్ళీ కలవొచ్చులే – అనుకున్నాను. నాలుగు రోజులకే టి.వి. వార్తల్లో ఘోరం వింటానని ఊహించలేదు.

నేను ఆయనను చివరిసారిగా కలిసింది బహుశా 1992 డిసెంబర్ 30న అనుకుంటాను. ఆ తర్వాత కేవలం నాలుగు రోజులకే 1993 జనవరి 3న ఆయన హుస్సేన్‌సాగర్‌లో దూకి ఆత్మహత్య చేసుకుంటారని ఊహించలేకపోయాను. కడుపు నొప్పి భరించలేకనా? లేక ఇతర మానసిక ఒత్తిడిలవల్లనా? ఎందుకు అలాంటి నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందో తెలియదు. వార్తా పత్రికల కథనం ప్రకారం, ఆయన భౌతిక కాయాన్ని పది రోజులు మార్చురీలో ఉంచిన తర్వాత అంత్యక్రియలు జరిగాయి. విషయం సాహితీ మిత్రులకు తెలియలేదు. ఎవరూ ఎక్కడా సంతాపం ప్రకటించలేదు. ఒక ఉన్నతశ్రేణి జీవితం ఒక విషాదగాథలా ముగియడం బాధాకరమైన విషయం. ఆ బాధతో ఆంధ్రప్రభ వారపత్రిక సంపాదకుడికి నేనొక లేఖ రాశాను. అప్పుడు వాకాటి పాండురంగారావు ఆ పత్రికకు సంపాదకుడిగా ఉన్నారు. నా లేఖను లేఖల శీర్షికలో కాకుండా 'నివాళి' శీర్షికతో చిన్న వ్యాసంగా ప్రముఖంగా ప్రచురించారు. దూర దూర ప్రాంతాల్లో ఉన్న ఎంతోమంది సాహిత్యాభిమానులకు అదే సమాచారాన్ని చేరవేసింది.

చనిపోవడానికి ముందు కేవలం రెండు మూడు నెలలు మాత్రమే ఆయన ఏమీ రాయలేదు. కానీ, అంతకుముందు ఆయన ఎప్పుడూ ఏదో ఒకటి రాస్తూనే ఉండేవారు. జీవిత భాగస్వామిని కోల్పోయి, కుటుంబ సభ్యుల ఆదరణ కరువైన దయనీయమైన దశలో, ఆయన ధ్యాసంతా రచన మీదికే మళ్ళించారు. రచనే ప్రాణంగా బతికారు. ఎవరన్నారో తెలియదుగానీ, ఆయనకు 'తెలంగాణ శ్రీవాత్సవ' అనే పేరుండేది. 'శ్రీవాత్సవ' కలం పేరుతో పుస్తక సమీక్షలు చేస్తుండేవారు. చివరి దశలో సర్వేపల్లి గోపాల్ బృహత్ గ్రంథం అనువదించారు. నేషనల్ బుక్ ట్రస్ట్‌కు మిర్జా గాలిబ్ కృతిని తెలుగు చేశారు. ఆయన చేతిమీద ఎప్పుడూ ఏదో ఓ పుస్తకంపై పని జరుగుతూనే ఉండేది. ఆయన తెలంగాణ సాహిత్యంపై రాసిన వ్యాసాలు, బుచ్చిబాబు, గోపీచంద్, పాలగుమ్మి పద్మరాజు లాంటి తెలుగు మహా కథకుల కథల గూర్చి రాసిన విశ్లేషణాత్మకమైన వ్యాసాలనన్నీ ఏరికూర్చి విశాలాంధ్ర వారికి అందించాను. వారు 'తెలంగాణ సాహిత్యం తెలుగు సాహితీమూర్తులు' శీర్షికన 2008లో పుస్తకంగా అచ్చేశారు. ఆ పుస్తకానికి సంపాదకుడిగా ముందుమాట రాసే అవకాశం నాకు లభించింది. అవి చాలా విలువైన వ్యాసాలు, వాటిని తెలుగు పాఠకులు ఎప్పటికీ మర్చిపోరు. సాహిత్య ప్రక్రియలపై కూడా డి. రామలింగం ఎన్నో వ్యాసాలు ప్రకటించారు. అవికూడా మరో సంపుటిగా వస్తే తెలుగు సాహితీలోకం సంబురపడుతుంది.

# 35

# దాశరథి కృష్ణమాచార్య

**– డా॥ తిరుమల శ్రీనివాసాచార్య**

తెలంగాణలో జన్మించిన, గణనీయ వైతాళికులలో, మహాకవి దాశరథి అగ్రేసరులు.

"ప్రాణము లొడ్డి ఘోరగహనాటవులన్ బడగొట్టి, మంచి మా
గాణములన్ సృజించి, ఎముకల్ నుసిచేసి, పొలాలు దున్ని, భో
షాణములన్ నవాబుకు స్వర్ణము నిండిన రైతుదే తెలంగాణము రైతుదే;
ముసలినక్కకు రాజరికంబు దక్కునే" –

అంటూ గర్జించి, హైదరాబాద్ సంస్థానవిముక్తి మహోద్యమంలో దూకి, నిజాం నవాబు – మీర్ ఉస్మాన్ అలీఖాన్‌ను ఎదిరించి, తెలంగాణ విముక్తికై కారాగారశిక్ష అనుభవించి, లక్ష్యాన్ని సాధించిన స్వాతంత్రోద్యమ కవి సింహం దాశరథి.

దాశరథి పూర్తి పేరు. దాశరథి కృష్ణమాచారి. దాశరథి 1925 జూలై 22 నాడు, ఖమ్మం జిల్లా, మానుకోట తాలూకాలోని, చినగూడూరు గ్రామంలో జన్మించినాడు. శ్రీమతి వేంకటమ్మ శ్రీమాన్ వేంకటాచార్యులు ఆతని తల్లిదండ్రులు. దాశరథి రంగాచారి దాశరథి తమ్ముడు. వీరిది శ్రీవైష్ణవ కుటుంబం. పేదరికంలో అలమటించేవారు. తండ్రి నుండి, చిన్ననాడే సంస్కృతభాషా సాహిత్యాలను, తల్లి నుండి తెలుగు పరిమళాలనూ మానవతా దృక్పథాన్నీ సంగ్రహించి నాడు దాశరథి. చినగూడులో నాల్గవతరగతినీ, ఖమ్మం ఉస్మానియా హైస్కూల్‌లో మెట్రిక్యులేషన్‌నూ పూర్తి చేసినాడు. ఖమ్మంలో చదువు కుంటున్నప్పుడే మీర్జాగాలిబ్ శృంగారాత్మక సాహిత్యాన్ని, ఇక్బాల్ విప్లవగీతాలను అధ్యయనం చేసినాడు. మరోవైపు ఉపనిషత్తుల సారాన్ని ఎదలో పొదుగుకొన్నాడు దాశరథి.

ఆనాటి హైదరాబాద్ సంస్థానంలో 1100 జాగీర్లుండేవి. వాటిలో 'గార్ల' జాగీరు ఒకటి. ఈ జాగీరు కింద ఉండే, పేద ప్రజల బాధలను చూచినాడు దాశరథి. పన్నులు చెల్లించలేక, వెట్టిచాకిరితో, ఆకలికి మాడిపోయే, నిరుపేదల కన్నీటి బతుకులను చూచి, దాశరథి గుండె విలవిలలాడి పోయింది. కర్కోటకులైన భూస్వాముల అత్యాచారాలు, అక్రమ భోగభాగ్యాలు, నిజాం తాబేదార్లు సాగించే హింసా కాండను చూచిన దాశరథిలో ఈ అన్ని దౌష్ట్యాలకూ కారణభూతుడైన నిజాం నిరంకుశత్వం పట్ల, ఆగ్రహ ద్వేషాలు పెల్లుబికినాయి. ఆతని హృదయం, అగ్నిగోళమైంది. ఆతని కోపం 'అగ్నిధార'గా ప్రవహించింది.

"నా గీతావళి ఎంత దూరము ప్రయాణంబౌనొ అందాక ఈ
భూగోళమ్మున అగ్గిపెట్టెదను" – అంటూ విప్లవ చైతన్యమూర్తియై ప్రజ్వరిల్లినాడు. ప్రజల బాధలకు, కారణభూతులైన భూస్వాముల ఆటకట్టించాలనీ, రైతుల హక్కుల కోసం పోరాడుతున్న కమ్యూనిస్టులతో కలిసి పోయినాడు దాశరథి. కార్యకర్తగా, కావ్యకర్తగా

ఉద్యమించాడు. కోయగూడేలలో తిరిగి వాళ్లను సమైక్య పరచినాడు. లంబాడీలను, హరిజనులను, రైతులను, కూలీలను, వర్తకులను మేల్కొలిపి, వాళ్లను స్వాతంత్ర్యో ద్యమంలో భాగస్వాములుగా చేసినాడు. పుంఖానుపుంఖంగా కవితలు రచించి, పీడిత ప్రజల, భావాలకు ప్రతినిధిగా తన కలాన్ని ఝుళిపించినాడు –

"వీదియ తీగపై పదనుపెట్టిన నా కరవాలధారతో
గానము నాలపించెద; స్వకంఠము నుత్తరణంబొనర్చి
స్వర్గానకు భూమి నుండి
రసగంగలు చిమ్మెద – పీడిత ప్రజా
వాణికి 'మై'కమర్చి అభవవాదులకున్, వినిపింప జేసెదన్" అంటూ బాధాతప్త ప్రజలనోటికి 'మైక్'గా కూరిపోయినాడు దాశరథి. దాశరథి కవిత్వంలోని తీవ్రభావాలు అటు ప్రజలనూ, ఇటు తీవ్రవాదులనూ బాగా ఆకర్షించేవి. దాశరథి కమ్యూనిస్టు సెల్ సమావేశాలకూ, అజ్ఞాత సమావేశాలకూ హాజరయ్యేవాడు.

ఆనాటి ఉద్యమధ్యేయం తెలంగాణ స్వాతంత్ర్య సంపాదన – ఒక్కటే. అందుకై కమ్యూనిస్టు వాళ్లూ, కాంగ్రెసు వాళ్లూ కలసి 'ఆంధ్ర మహాసభలలో' పాల్గొనేవాళ్లు. దాశరథి కూడా ఆ సభలలో పాల్గొని – "ఆంధ్రమహాసభకు – అరుదెంచుడి జనులారా" అంటూ ప్రజలను ఆహ్వానించేవారు.

మరోవైపు తెలుగు భాషా సంస్కృతుల పునరుద్ధరణకై కంకణం కట్టుకొన్న ఆంధ్ర సారస్వత పరిషత్తు సభలలో పాల్గొని,కావ్యగానం చేసేవాడు దాశరథి. ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రథమ వార్షికోత్సవ సభ 1944లో ఓరుగల్లు కోటలో ఏర్పాటైంది. రజాకార్లు సభపై – వేసిన పచ్చని పందిళ్లను తగులబెట్టినారు. అప్పుడు దాశరథి నిర్భయంగా – "జ్వాలలో ఆహుతి అయిపోతాం గాని, కవి సమ్మేళనం జరిపి తీరుతాం" అంటూ కాలిన పందిళ్ల బూడిద వేడిగా కాళ్లకు తగులుతుండగా, గళం విప్పి –

"ఓ పరాధీన మానవా! ఓపరాని
దాస్యము విదల్చలేని శాంతమ్ముమాని
తలుపులను ముష్టిబంధాన కలచివైచి
చొచ్చుకొనిపొమ్ము స్వాతంత్ర్య సురపురమ్ము" – అంటూ ప్రబోధించినాడు. సభాధ్యక్షులైన శ్రీ సురవరం ప్రతాపరెడ్డి గారు లేచి 'సింహగర్జన చేశావు నాయనా' అంటూ దాశరథిని మెచ్చుకొన్నారు. శ్రీ దేవులపల్లి రామానుజరావు గారు దాశరథి మెడలో పుష్పహారం వేసి కౌగలించుకొన్నారు. తరువాత 'మంచిర్యాల'లో జరిగిన ఆంధ్ర సారస్వత పరిషత్తు సభా కవిసమ్మేళనానికి, దాశరథి అధ్యక్షత వహించి ప్రజలను ప్రబోధించినాడు.

ఒకరోజు, మానుకోట తాలూకా 'జయ్యవరం' గ్రామంలో, రాత్రంతా సభ జరిపి, మరునాడు చిన్నగూడూరు కు వచ్చిన దాశరథిని పోలీసులు అరెస్టుచేసి చేతులకు బేడీలు, నడుముకు తాడు కట్టి, 'పదిమైళ్ల' దూరంలో ఉన్న 'నెల్లికుదురు' పోలీసుస్టేషనుకు, నడిపించుకొంటూ తీసికొని వచ్చినారు. అప్పుడు అవకాశం చూచి, దాశరథి తప్పించుకొని, పొలాల్లో, నదుల్లో, అరణ్యాల్లో పడి 30 మైళ్ల దూరంలో ఉన్న, "నాగారం" అనే గ్రామంలో తలదాచు కొన్నాడు. మిత్రులు అతన్ని రక్షించినారు. అప్పటినుండి దాశరథి మారువేషంలో సంచరిస్తూ ప్రజలను తన ప్రసంగాలతో ఉత్తేజపరిచేవాడు.

1945–46 ప్రాంతంలో దాశరథికి కమ్యూనిస్టులతో అభిప్రాయభేదాలేర్పడ్డాయి. అప్పుడు దాశరథి హైదరాబాదు సంస్థానంలో బాధ్యతాయుత ప్రభుత్వ స్థాపనకూ, భారతయూనియన్‌లో హైదరాబాద్ రాష్ట్రం విలీనం కావడానికీ, మహోద్యమాన్ని సాగిస్తున్న 'స్టేట్ కాంగ్రెసు'లో చేరినాడు. స్వామీ రామానందతీర్థ నాయకత్వంలో, జమాలాపురం కేశవరావు, కొండా వెంకటరంగారెడ్డి, మాడపాటి హనుమంతరావు మొదలగువారితో కలసి, స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నాడు దాశరథి.

1947 ఆగస్టు 15 నాడు భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించింది. కాని నిజాము మాత్రం, భారత యూనియన్‌లో చేరక, తాను స్వతంత్రుడనని ప్రకటించుకొన్నాడు. అంతేకాదు "భారత పతాకం హైదరాబాద్ సంస్థానంలో ఎగురువేయడం నేరం" అని ప్రకటించినాడు. మరోవైపు రజాకార్లు, నిజాం అండదండలతో దుశ్చర్యలకూ హింసాకాండకు పాల్పడ్డాడు. దానితో దాశరథి గుండె ప్రజ్వరిల్లింది. అజ్ఞాతవాసంలో మారువేషంలో ఉన్న, దాశరథి బాహాటంగా బయటకు వచ్చి నిజాం నిరంకుశత్వాన్ని నిరసించినాడు.

"ఇదేమాట ఇదేమాట పదేపదే అనేస్తాను
జగత్తంత రగుల్కొన్న కృథాజ్వాల వృథాపోదు

అడుగడుగున ఎడద నెత్తు గడగడమని త్రాగినావు
పడతుల మానాలు ద్రోచి గుడగుడమని హుక్క త్రాగి
జడియక కూర్చుండినావు మజకట్టుక నిల్చినావు
దగాకోరు బటాచోరు రజాకారు పోషకుడవు
వూళ్ల కూళ్లకగ్గిపెట్టి ఇళ్లన్నీ కొల్లగొట్టి
తల్లి పిల్ల కడుపుగొట్టి నిక్కిన దుర్మార్గమంత
నీ బాధ్యత నీ బాధ్యత .........
"వద్దంటే గద్దెనెక్కి పెద్దరికం చేస్తావా
మూడుకోట్ల చేతులు నీ మేడను పడదోస్తాయి మెడనే
విడదీస్తాయి
నీకు నిలుచు హక్కు లేదు నీకింకా దిక్కులేదు"
"చరిత్ర బొంగరం తిరిగి కిరీటాలు నేల కొరిగి
ధరాధిపుల నశిస్తుంటె బరాయెంనా నవాబా
పరక్రామంచూపేవా"
"దిగిపొమ్మని జగత్తంత నగారాలు కొడుతున్నది
దిగిపోవోయ్ తెగిపోవోయ్ తెగిపోవోయ్ దిగిపోవోయ్
ఇదేమాట ఇదేమాట పదేపదే అనేస్తాను" అంటూ,

"నిజాం రాజు జన్మజన్మల బూజు" అంటూ, ఉద్యమ కవితావేశమూర్తియై, దాశరథి సత్యాగ్రహానికి తలపడ్డాడు. అప్పటిదాకా పొంచి ఉన్నపోలీసులు 'గార్ల' గ్రామంలో, దాశరథిని అరెస్టు చేసి, ఉద్యమ రహస్యాలను చెప్పుకొని 'ఠాణా'లో నిలబెట్టి కొరడాలతో కొట్టినారు. నిజాం ప్రభుత్వం దాశరథికి 16 నెలల కఠినకారాగార శిక్షను విధించింది. కొన్ని నెలలు వరంగల్ జైల్లో ఉంచి, తరువాత దాశరథిని నిజామాబాద్ సెంట్రల్‌జైలుకు పంపింది నిజాం ప్రభుత్వం. నిజామాబాద్ జైల్లో దాశరథి ముఖం కడుక్కునే బొగ్గుతో జైలు గోడ మీద –

"ఓ నిజాము పిశాచమా! కానరాడు నిన్ను బోలిన
రాజుకు మాకెన్నటేని
తీగెలను తెంపి అగ్నిలో దింపినావు నా తెలంగాణ
కోటి రత్నాల వీణ"

అని రాస్తే జైలు అధికారులు తుడిచివేసినారు. అపుడు అదే జైల్లో ఉన్న త్యాగమూర్తి శ్రీ వట్టికోట ఆళ్వారుస్వామిగారు, ఆ పద్యాన్ని మళ్లీమళ్లీ గోడమీద రాసేవారు.

నిజామాబాద్ జైల్లో, సున్నం, సిమెంటు కలిపిన, వడ్లగింజలున్న అన్నం, రొట్టెలనూ, భోజనం చేసిన ఫలితంగా దాశరథి ఆరోగ్యం చెడిపోయింది. 1948 జనవరి 11 నాటి రాత్రి నిజామాబాద్ జైలు ఖైదీలపై రజాకార్లు దాడి జరిపిన దుస్సంఘటన ఫలితంగా, దాశరథి తల పగిలింది ఎడమ భుజం ఎముక విరిగింది. చికిత్స కోసం దాశరథిని హైదరాబాద్ చంచల్‌గూడ సెంట్రల్ జైలుకు మార్చింది ప్రభుత్వం. జైల్లో దాశరథి స్వామీ రామానందతీర్థను దర్శించుకొన్నాడు. స్వామీజీ దాశరథి సాహసాన్ని ప్రశంసించినారు.

నిజాం, భారత యూనియన్‌తో కుదుర్చుకొన్న ఒడంబడికను ఉల్లంఘించిన ఫలితంగా 'పోలీసు చర్య' జరిగింది. భారతసైన్యం 1948 సెప్టెంబర్ 13 నాడు హైదరాబాద్‌లోనికి చొచ్చుకొనివచ్చింది. సెప్టెంబర్ 17 నాడు నిజాం లొంగిపోయినాడు. హైదరాబాద్ సంస్థానం విముక్తమైంది. దాశరథి జైలునుండి విముక్తుడైనాడు. తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధుడైన దాశరథి లక్ష్యం నెరవేరింది. 'రుద్రవీణ' కావ్యాన్ని 'తెలంగాణ'కు అంకితం చేసి జన్మభూమి ఋణం తీర్చుకొన్నాడు దాశరథి.

"నా తెలంగాణ తల్లి కంజాతవల్లి" – "నా తెలంగాణ కోటి అందాలజాణ" – "నా తెలంగాణసీమ సౌందర్యసీమ" – "నా తెలంగాణ కోటి రత్నాల వీణ" అంటూ తెలంగాణ తల్లిని వేనోళ్లా ప్రశంసించిన తెలంగాణ ముద్దు బిడ్డడు దాశరథి.

తెలంగాణ మూర్తితో ఆగకుండా దాశరథి తెలుగువాళ్ల సమైక్యాన్ని ఆశించి మహాంధ్రోదయానికి ఉద్యమించినాడు.

"పటు బాహుబలురైన ఆంధ్రుల
గతప్రాశస్త్యముల్ వల్లె వే
యుటలో కొన్ని తరాలు దాటినవి;
పూర్వోదంతముల్ నేటి సం
కటముల్ దీర్పవుగాక; నాటి స్వలితాంగాదరమ్ము
లీనాటి కుం
పటిలో బూడిద కప్పుకొన్నవి రగుల్పన్ లెమ్ము!
వీరాంధ్రుడా!" అంటూ వైతాళికుడై పాడి, ఆంధ్రులను మేల్కొల్పినాడు. ఆతని ఆశయం నెరవేరింది. 1956 నవంబరు 1 నాటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణంతో –

తెలంగాణాకూ విశాలాంధ్రకు మాత్రమే పరిమితుడైన కవి కాదు దాశరథి

“జండా ఒక్కటె మూడువన్నెలది; దేశంబొక్కటే భారతా
ఖండ సేతు హిమాలచలోర్వర; కవీట్కాండమ్ము లోనన్
రవీంద్రుండొక్కండె కవీంద్రు
దూర్జిత జగద్యుద్ధాలలో శాంతితో
దండోద్య ద్విజయుండు; గాంధి ఒకడే, తల్లీ!
మహాభారతీ!” –

అని పల్కిన అఖిల భారతజాతీయ మహాకవి దాశరథి.

“నా కులమెద్దియో యెఱుగ నా మతమెయ్యదియో
యెఱుంగగా
లేక దశాబ్దముల్ గడచె, లేళ్లది యేళ్లది రాళ్లదే కులం
బాకులమే మదీయము'' అంటూ కులాతీత, మానవతను చాటిన విశ్వకవి దాశరథి.

“తెలంగాణలోని కోటిధీరుల గళధ్వనినె గాక
ఇలాగోళమందుండెడి ఎల్లరి శబ్దాన్ని నేను
నా పేరు ప్రజాకోటి నా ఊరు ప్రజావాటి” అని చాటగలగిన ప్రపంచ ప్రజాకవి దాశరథి.

‘అగ్నిధార’ మొదలు ‘నేత్రపర్వం’ దాకా ముప్పైకిపైగా, గ్రంథాలు రచించినారు దాశరథి. 200కు పైగా చలన చిత్రగీతాలు రాసినాడు దాశరథిని గూర్చి అనేక విశ్వ విద్యాలయాల్లో పరిశోధనలు జరిగినవి. ఆతని రచనలు అనేక భాషలలోనికి అనువాదితమైనాయి. తెలుగులో గజల్ రుబాయీ ప్రక్రియలను, ప్రప్రథమంగా ప్రవేశపెట్టిన ప్రయోక్త దాశరథి మహాకవే.

‘జాతీయోద్యమ రథసారథిగా’ భారత ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ చేతుల మీదుగా తామ్రపత్ర సన్మానాన్నీ, అప్పటి ఉపరాష్ట్రపతి శ్రీ ఆర్. వెంకట్రామన్‌గారి చేతుల మీదుగా సన్మానాన్ని అందుకొన్నాడు దాశరథి. ‘కళాప్రపూర్ణ’, ‘డి.లిట్’ వంటి గౌరవ పట్టాలతో వివిధ విశ్వవిద్యాలయాలు దాశరథిని సన్మానించినవి. అమెరికా తెలుగు వాళ్లు ‘ఆంధ్ర కవితాసారథి’గా సన్మానించారు. ఒంగోలు ‘గండపెండేరం’ తొడిగి సన్మానించింది. వరంగల్లు దాశరథికి స్వర్ణోత్సవం చేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1977లో ఆస్థానకవిగా నియమించి సన్మానించింది. అనేక దేశాలలో పర్యటించి, దాశరథి తెలుగుభాషా సాహిత్య సంస్కృతులను గూర్చి ప్రసంగించినాడు.

1983లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఆస్థానకవి పదవిని రద్దు చేయడంతో దాశరథి కలతపడ్డాడు. ఆ కలత అనారోగ్యానికి దారి తీసింది. 1987 నవంబరు 5వ తేదీనాడు ఉదయం 11 గం.లకు శాశ్వతంగా కన్నుమూసినాడు దాశరథి.

బ్రతికినంతకాలం అవిశ్రాంతంగా తిమిరంతో సమరం జరిపిన, దాశరథి హఠాన్మరణానికి సాహిత్యలోకం స్వాతంత్ర్య సమరయోధుల సంఘం కన్నీరుమున్నీరుగా విలపించి నివాళులర్పించింది.

“నల్లని చీకట్ల మీద నవకాంతి కవితలు” రాసిన దాశరథి ‘‘జ్వాలాలేఖిని ఆరిపోదు'' – ‘‘అందులోని చైతన్యమదీ పంకం ఇంకిపోదు”

కాలాన్ని గెలిచిన ఘనవిజేత దాశరథి.
తెలంగాణ వైతాళిక కవినేత దాశరథి.

# 36 దాశరథి రంగాచార్య

– డా॥ వి. జయప్రకాష్

అక్షర వాచస్పతి డాక్టర్ దాశరథి రంగాచార్య అనగానే ఊర్ధ్వపుండ్రాలు ధరించిన సంప్రదాయ రూపం, ఆ రూపం వెనకాల ఉన్న మార్క్సిస్టు దృక్పథం వెంటనే స్ఫురణకు వస్తాయి. తెలంగాణ ఉద్యమం, చరిత్ర, ప్రజల జీవితం, సాహిత్యం, సంస్కృతి. ఇలా తెలంగాణాకు సంబంధించి ఏ విషయం గురించి ఆలోచించినా తప్పకుండా రంగాచార్య రచనలు స్పృశించాల్సిందే. ఆయన జీవితం, సాహిత్యం తెలంగాణాతో అంతగా పెనవేసుకుపోయాయి.

దాశరథి రంగాచార్య జీవితం భిన్న వైరుధ్యాల నిలయం. ఆయనను చూస్తే, నిజాం నవాబుకు వ్యతిరేకంగా సాగిన పోరులో తుపాకీ పట్టి పోరాటం చేశారని, ఆయన నుదిటిపై కనిపించే తిరునామాలు చూసి ఆయనొక మార్క్సిస్టు అని ఎవరూ అనుకోరు. కానీ, ఆయన విప్లవశక్తికి ప్రతీక. రంగాచార్య మార్క్సిజాన్ని ఎంతగా ప్రేమిస్తారో, సంప్రదాయాన్ని అంతగా ఇష్టపడతారు. తెలుగు సాహిత్యానికి నిక్కమైన నీలాల్లాంటి నవలలు అందించిన రంగాచార్య, అదే చేత్తో రామాయణ, భారత, భాగవతాలు, వేదాలు, ఉపనిషత్తులు తెలుగు జాతికి అందించారు. భిన్న ప్రక్రియల్లో రచనలు చేసి తెలుగు సాహితీ క్షేత్రాన్ని సుసంపన్నం చేశారు. భిన్నత్వంలో ఏకత్వం అనే భారతీయ దృక్పథానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన దాశరథి రంగాచార్య... స్వాతంత్ర్య సమర యోధుడిగా, అక్షర వాచస్పతిగా ప్రజల హృదయాల్లో పీఠం వేసుకున్నారు.

ప్రముఖ కమ్యూనిస్టు యోధుడు చండ్ర రాజేశ్వరరావు చేత "ఆంధ్రగోర్కీ"గా ప్రశంసించబడిన దాశరథి రంగాచార్య 1928 ఆగస్టు 24న పూర్వపు వరంగల్ జిల్లాలోని చినగూడూరులో జన్మించారు. కవితా ప్రపంచంలో లబ్ధప్రతిష్టులైన దాశరథి కృష్ణమాచార్య వీరి అగ్రజుడు. రంగాచార్య సనాతన సంప్రదాయ కుటుంబ వాతావరణంలో పెరిగారు. ఇతరుల నీడ పడితే మైల పడిపోతాం అన్నంత ఛాందసం. మడి కట్టుకుంటే తెలుగు మాట్లాడకూడదు. స్కూల్లో ఉర్దూ తప్ప తెలుగు ఉండదు. ఇంటా, బయటా తెలుగుపై అంత చిన్నచూపు, నిరాదరణ ఉన్నా, దాశరథి సోదరులు ఇద్దరికి తెలుగు భాషపై ఎనలేని మమకారం ఏర్పడింది. రంగాచార్య వచన రచనను చేపట్టి, కాల్పనిక, సాంప్రదాయ సాహిత్య సృష్టిలో అనితర సాధ్యమైన స్థాయికి చేరుకున్నారు.

"పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది" అనే నానుడి రంగాచార్య జీవితంలో నిజమయింది. ఆయనలోని తిరుగుబాటు తత్త్వం, అన్యాయానికి ఎదురు తిరిగే స్వభావం చిన్నతనంలోనే బయటపడింది. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో వచ్చిన వందేమాతర ఉద్యమం, నిజాం రాజ్యంలోని ఇతర ప్రాంతాలకు పాకింది. అప్పుడు రంగాచార్య పాఠశాల ప్రార్థన సమయంలో వందేమాతరం చదివి ఉపాధ్యాయుల చేతిలో దెబ్బలు తిన్నారు. ఆరవ తరగతిలో ఉండగా నిజాం నవాబు విధించిన యూనిఫారంలో

కుచ్చుటోపికి బదులు గాంధీ టోపి పెట్టుకుంటామని స్కూల్లో విద్యార్థుల చేత సమ్మె చేయించి విజయం సాధించారు. కానీ, పాఠశాల నుంచి బహిష్కరణకు గురయ్యారు. దాంతో ఆయన చదువు ఆరోతరగతితో ఆగిపోయింది. ఆ కాలంలో అందరిలాగే రంగాచార్యను కూడా వామపక్ష భావజాలం ఆకర్షించింది. గ్రామాల్లో తిరిగి ప్రజలను ఆంధ్రమహాసభలో చేర్పించారు. పిల్లలకు పాఠాలు చెప్పారు. వయోజనులకు రాత్రి పాఠశాలలు నడిపారు. తహసీల్దార్‌ను ఎదిరించి గ్రామంలోకి పత్రిక తెచ్చారు. ఆ కాలంలోనే మార్క్సిస్టు సాహిత్యాన్ని విపరీతంగా చదివారు. తర్వాత తెలంగాణా రైతాంగ పోరాటం సాయుధ రూపు తీసుకొని ఉధృత మవడంతో, రంగాచార్య కూడా అండర్ గ్రౌండ్‌కు వెళ్లిపోయారు. తుపాకీ పేల్చడంలో శిక్షణ తీసుకున్నారు. పోలీస్ యాక్షన్ తర్వాత ఉద్యమం నుంచి బయటకు వచ్చారు. స్వాతంత్ర్యం తర్వాత ప్రజలను పీడించిన దొరలే, ఖద్దరు, గాంధీ టోపీ ధరించి రాజకీయ నాయకులుగా అవతార మెత్తారు. రంగాచార్య వారి మధ్య ఇమడలేకపోయారు. స్వయంకృషితో చదువుకొని 1951లో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించారు. తర్వాత 1957లో సికింద్రాబాద్ మునిసిపల్ కార్పోరేషన్‌లో అనువాదకులుగా చేరి, 1988లో అసిస్టెంట్ కమిషనర్ హోదాలో పదవీ విరమణ పొందారు.

వట్టికోట ఆళ్వార్‌స్వామి తెలంగాణా పోరాటచరిత్రను నవలలుగా రాయాలనుకున్నారు. ఆ క్రమంలో మొదటి నవల "ప్రజల మనిషి"ని వెలువరించారు. "గంగు" రాస్తుండగా ఆళ్వార్ స్వామి చనిపోయారు. దాంతో అది అర్థాంతరంగా ఆగిపోయింది. ఆళ్వార్‌స్వామి వదిలి వెల్లిన ఉద్యమాన్ని ఎవరూ తలకెత్తుకోలేదు. చివరికి రంగాచార్య తనదైన పద్ధతిలో తెలంగాణా ప్రజల జీవన చిత్రణ కోసం నవలా రచనకు పూనుకున్నాడు. ఒక ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. నవలా రచనకు సంబంధించి పుస్తకాలు అధ్యయనం చేశారు. మొదటి నవల "చిల్లర దేవుళ్లు" వెలువరించారు. తెలంగాణా గురించి తెలంగాణా మాండలికంలో రాసిన నవల కావడంతో విశేష ఆదరణ పొందింది. మొదటి నవలకే ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహుమతి పొందారు రంగాచార్య. "చిల్లర దేవుళ్లు" చలనచిత్రంగా కూడా వచ్చింది. 'చిల్లరదేవుళ్లు'లో 1938కి పూర్వపు తెలంగాణా ప్రజల జీవనాన్ని చిత్రిస్తే, తెలంగాణా సాయుధ పోరాటంలో స్వర్ణయుగంలాంటి 1942-48 కాలాన్ని "మోదుగుపూలు" వర్ణిస్తుంది. రంగాచార్య గార్లలో నిర్వహించిన పోరాట చిత్రణమే 'మోదుగుపూలు' నవల ఇతివృత్తం. నిజాం రాజ్యంలో ఉండే నామమాత్రపు హక్కులు కూడా ఉండని ఒక జాగీరులో, ఉద్యమ నిర్మాణం, అది ఎదిగిన తీరు, ప్రజలు ఏకమై తహసీల్దారును హతమార్చిన సంఘటనలు, కోయ ప్రజల జీవన విధానం, వారి అమాయకత్వం, ఉద్యమంలో భాగస్వాములు కావడం కన్నులకు కట్టినట్టు చిత్రించారు రంగాచార్య. స్వాతంత్ర్యం తర్వాత సుమారు రెండు దశాబ్దాల సుదీర్ఘ కాలాన్ని 'జనపదం' నవలలో చిత్రించారు. నగర సమస్యల ఇతివృత్తంతో 'మాయా జలతారు' రాశారు. భారతదేశంలో సామ్యవాద స్థాపన జరుగుతుందన్న ఆశలను, ఆశయాలను 'రాస్తున్నది ఏదినిజం?' నవలలో చిత్రించారు. "మానవత" నవలలో "మతాలు వెలసిపోయే రంగులు, మానవత నిరంతరం నిలిచి ఉండే ఘనత" అనే సందేశం ఇస్తారు. ఒక బ్రాహ్మణునికి, ఒక హరిజనునికి మధ్య స్నేహాన్ని కల్పించి, మానవత్వం దైవత్వానికి అతి దగ్గరని ''శరతల్పం'' నవలలో నిరూపించారు. స్వాతంత్ర్యం తర్వాత కూడా ఆ స్వాతంత్ర్యపు వెలుగు ప్రసరించని గ్రామాలు ఎలా దోపిడీకి గురయ్యాయో, ఆ దోపిడీలో ప్రజల విషాద జీవితాలు, టీచరమ్మ నుంచి చైతన్యం పొంది గ్రామస్తులు తిరగబడి విజయం సాధించడం "పావని" నవల చిత్రిస్తుంది. వీటి తర్వాత రంగాచార్య దృష్టి సంప్రదాయ సాహిత్యంపై పడింది. భారతం, వేదాలు, ఉపనిషత్తులు అనువదించిన తర్వాత మళ్లీ నవలా రచనకు ఉపక్రమించారు రంగాచార్య. ప్రపంచీకరణ, పారిశ్రామికీ కరణ ప్రభావంతో మరణం వైపు పయనిస్తున్న ప్రజలను అమృతం వైపు పయనింపజేసే "అమృతంగమయ" నవలను రాశారు. ఇందులో భారతీయ తాత్త్వికత, దాని గొప్పదనం, ఆంగ్లేయులు దాన్ని ధ్వంసం చేసిన విధానం, భారత సంప్రదాయాన్ని రక్షించుకోవాల్సిన అవసరం తదితర విషయాలు చిత్రించారు.

రంగాచార్య మొత్తం 9 నవలలు రాశారు. వీటిలో చిల్లరదేవుళ్ళు, మోదుగుపూలు, జనపదం నవలలు పిరియాడిక్ నవలలు కావడంతో ఒక నవల ముగింపు మరో

నవలకు ప్రారంభం అవుతుంది. నవలల్లో ఇతివృత్తంతో పాటు, తెలంగాణా మాండలిక ప్రయోగం కూడా రంగాచార్యకు మంచిపేరును సంపాదించి పెట్టింది. విషయ నివేదనకు సాధారణ భాషనే వాడినా, పాత్రలు వారి వారి సాంఘిక నేపథ్యాన్ని బట్టి మాట్లాడే భాష వేర్వేరుగా ఉంటుంది. ఇలా ఉండడంవల్ల నవల చాలా సహజంగా సాగుతుంది. సంఘటనలు, సంభాషణలు హృదయానికి హత్తుకుంటాయి.

రంగాచార్య అనగానే నవలా రచనే గుర్తొస్తుంది. కానీ నవలల కంటే ముందే, ముప్పై మూడేళ్ల వయసులోనే ఆయన "శ్రీమద్రామాయణము" రచించారు. కాలక్రమంలో వాల్మీకి రామాయణంలో చోటుచేసుకున్న అవాల్మీకాలు లేకుండా అచ్చంగా వాల్మీకి ప్రోక్తమైన రామాయణాన్ని తెలుగువారికి వచనంలో అందించారు. రంగాచార్య అంత చిన్న వయస్సులోనే రామాయణాన్ని అధ్యయనం చేసిన తీరును, రాసిన విధానాన్ని విశ్వనాథ సత్యనారాయణ, ఆచార్య దివాకర్ల వేంకటావధాని వంటి ఉద్ధండులు కొనియాడారు. రామాయణంలో అక్కడక్కడా రాసిన రంగాచార్య విమర్శనాత్మక అభిప్రాయాలు పఠితులను ఆలోచించేలా చేస్తాయి. వారికి అపరిమితమైన జ్ఞానాన్ని అందిస్తాయి. రామాయణం తర్వాత "శ్రీమద్భాగవతం" రాశారు. ఈ రచనలో వ్యాసున్ని అనుసరించినా, పోతన పద్యాల రుచిని పాఠకులకు చూపించారు. "సీతాచరితం" పేర మరోసారి రామాయణాన్ని రాశారు. హరివంశ సహిత "మహాభారతము" రచించారు. రామాయణ, భారత, భాగవతాలు రాసిన తర్వాత ఇక భారతీయ సంప్రదాయ సాహిత్యంలో హిమవదున్నతమైన నాలుగు వేదాలను ఎంతో శ్రమించి తేట తెలుగు వచనంలో అందించారు. వేదం బ్రాహ్మణులు అందులోనూ పురుషులకే పరిమితం. బ్రాహ్మణేతరులు, స్త్రీలు వేదం చదవరాదని నిషేదం విధించారు. పాశ్చాత్య విద్వాంసులేమో వేదాన్ని తమ దృక్పథంతో వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో రంగాచార్య "ప్రజలకు వేదం" అనే నినాదంతో వేద ఉద్యమాన్ని ప్రారంభించి, విజయవంతంగా పూర్తి చేశారు. కోట్ల నిధులున్న ధర్మసంస్థలు కూడా ఆలోచన చేయలేని దానిని,ఒక్కచేతితోచేసి చూపించారు. వేదావిష్కరణోత్సవంలో ఒక స్త్రీకి, ఒక దళిత యువకుడికి వేద ప్రతులు అందించారు. వేదాల తర్వాత పది ఉపనిషత్తులు, ఋగ్వేద శాంఖాయన బ్రాహ్మణము, ఋగ్వేద ఐతరయ బ్రాహ్మణము, వేదం జీవననాదం – పరిచయం, వేదం జీవననాదం – ఋగ్వేద పరిచయం, మానస తిరుప్పావై, తాను దర్శించిన దేశంలోని యాత్రా స్థలాల విశేషాలతో "యాత్రా జీవనం" రచించారు. రంగాచార్య జీవిత చరమాంకంలో 'ఉపదేశగీత' పేరుతో రాసిన భగవద్గీత ఆయన మరణానంతరం ప్రచురిత మయింది. రంగాచార్య రచించిన సాంప్రదాయ గ్రంథాలు ఉబుసుపోక చదువుకునే పారాయణ గ్రంథాలు మాత్రం కాదు. అవి విమర్శకుల మెదడుకు సైతం పదును పెడతాయి. పాఠకుడికి జ్ఞాన కాంతులు ప్రసాదిస్తాయి.

ఆయన రాసినవన్ని ఉద్గ్రంథాలే. అయితే, రంగాచార్య కథ చెప్పి వదిలేయలేదు. సాహిత్యంలో తనకున్న పరిజ్ఞానం, ప్రపంచ జ్ఞానంతో ఆ కథకు సంబంధించి పూర్వాపరాలు, మంచిచెడులు చర్చించారు. ఈ విధానాన్ని 'శ్రీమద్రామాయణము' తో ప్రారంభించారు. అయితే తర్వాతి రచనల్లో తన అభిప్రాయాలకు "ఆలోచనామృతము" అనే పేరు పెట్టారు. ఆయన వ్యాఖ్య నిజంగా అమృత ప్రాయమైన ఆలోచనలు కలిగిస్తుంది. పాతను కొత్తతో మేళవించి చూపుతుంది. భారతీయ తాత్త్వికతను ఎలా అర్థం చేసుకోవాలో వివరిస్తుంది. ప్రాచీన సాహిత్యమంతా పుక్కిటి పురాణాలు కావనీ, మానవజాతిని మహోన్నత దిశగా తీసుకొనిపోయే అమృతత్త్వం అందులో ఉందని నిరూపిస్తుంది.

రంగాచార్య జీవితానికి, అనువాదాలకు విడదీయని బంధం ఏర్పడింది. ఆయన చాలా చిన్నతనంలోనే వారి తండ్రి నిర్వహించిన "దాశరథి" పత్రిక కోసం ద్రావిడ గ్రంథాలు అనువదించారు. తర్వాతి కాలంలో ఆయన సాహితీ జీవితం అనువాదంతోనే ప్రారంభం అయింది. కోల్‌కతాలో వచ్చిన కరువు రక్కసి గురించి ప్రఖ్యాత భారతీయ ఆంగ్ల రచయిత భవానీ భట్టాచార్య రాసిన నవల "He Who Rides A Tiger"ను " దేవుని పేరిట" పేరుతో తెలుగులో అనువదించారు. ఆ నవలను వట్టికోట ఆళ్వార్‌స్వామి దేశోద్ధారక గ్రంథమండలి తరఫున ప్రచురించారు. తెలుగు కథలను ఉర్దూలోకి "తెలుగు అఫ్సానే" పేర అనువదించారు. ప్రముఖ ఉర్దూ కవయిత్రి జీలానీబాను కథలను "కేదారం" పేరుతో తెలుగులోకి అనువదించారు.

ఉర్దూ నవల ''ఉమ్రావ్‌జాన్ అదా''ను తెలుగులోకి అనువదించారు.

రంగాచార్య తొలినాళ్లలో పిల్లలకోసం వివేకానందుడు, మహాత్ముడు కాళిదాసు మూడు నాటకాలు, శ్రీవేంకటేశ్వర లీలలు అనే పుస్తకాలు రచించారు. ఈ పుస్తకాలు పిల్లలకోసమే అయినా, పూర్తి సమాచారాన్ని ఇస్తాయి. పిల్లలతోపాటు పెద్దలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. ఇక 1962లో భారత్‌పై చైనా దాడిచేసినప్పుడు, తెలుగులో వెలువడిన కవితలను ''రణభేరి'' పేర తెలుగులోకి అనువదించి ప్రచురించారు. రంగాచార్య రచనల్లో 'దేహదాసు ఉత్తరాలు', 'జనరంగం' శతకం స్వాతంత్ర్యం పొందిన తొలినాళ్లలో ప్రజల జీవన విధానాన్ని, మారుతున్న సామాజిక వ్యవస్థను, పతనమవుతున్న విలువలను చిత్రిస్తాయి. ఇక రంగాచార్య 21 కథల సంకలనం "నల్లనాగు" సమకాలీన సమాజంలోని భిన్న పార్శ్వాలను చిత్రిస్తుంది. వీటితోపాటు "ప్రేమ్‌చంద్ జీవితం – సాహిత్యం", "మానవ కవిత", ''అభిజ్ఞాన శాకుంతలం'' శతాబ్ది, శ్రీరామానుజ చరితామృతమ్, శ్రీశంకర చరితామృతమ్, బుద్ధభానుడు, రామాయణం పాత్రలు, భారతంలోని సూక్తులు, వివిధ కవుల గురించిన వ్యాసాలు, ఆయా పత్రికలకు రాసిన వ్యాసాలు రంగాచార్య అక్షర సృష్టిలో భాగంగా ఉన్నాయి.

రంగాచార్య రచనల్లో ప్రత్యేకంగా పేర్కొనవలసిన మరొక రచన "జీవనయానం". అది రంగాచార్య జీవిత కథ. 'జీవనయానం'లో రంగాచార్య తన జీవితంతోపాటు, ఏడు దశాబ్దాల తెలుగుజాతి జీవితాన్ని చిత్రించారు. స్వతంత్ర పోరాటం, తెలంగాణాలో సాంస్కృతిక చైతన్యం, ఆంధ్రమహాసభ పోరాటాలు, రజాకార్ల దౌష్ట్యం, కమ్యూనిస్టుల సారథ్యంలో తెలంగాణా సాయుధ పోరాటం, ఆంధ్రప్రదేశ్ అవతరణ, ప్రత్యేక తెలంగాణా, రాజకీయాలు, విద్యావ్యవస్థ, కార్మిక సంఘాలు, సాహితోద్యమాలు, సాహితీ సంస్థలు... ఇలా ఒకటేమిటి మొత్తం తెలుగు ప్రజల ఏడు దశాబ్దాల సామాజిక, ఆర్థిక, రాజకీయ, చారిత్రక, ఆధ్యాత్మిక స్థితిగతుల్లో వచ్చిన మార్పులకు 'జీవనయానం' అద్దం పడుతుంది. సంఘటనలు పేర్కొని వదిలేయకుండా, దాని పూర్వాపరాలు చర్చించడ, చూచాయగా కాకుండా తేదీలతో సహా కచ్చితమైన సమాచారాన్ని అందించడం రంగాచార్య ప్రత్యేకత. ఇక సందర్భోచితంగా ప్రయోగించే శ్లోకాలు, పద్యాలు, ఉర్దూ కవితలు, సామెతలు పాఠకులకు రసవిందును చేస్తాయి. ఇన్ని అంశాలు చెప్పాల్సి వచ్చినా, ఎక్కడా కృతకంగా అనిపించదు. నల్లేరు మీది నడకలా సాగిపోతుంది రచన.

మహా రచయిత డాక్టర్ దాశరథి రంగాచార్యను వాల్మీకి, వ్యాసుడు, కాళిదాసు, గోర్కీ, ప్రేమ్‌చంద్‌ల మేలు కలయికగా చెబుతారు. వారిలోని రచనా విశిష్టతలు, పాత్ర పోషణ, వర్ణనా ప్రియత్వం, మార్క్సిస్టు దృక్పథాన్ని వంటబట్టించు కున్నారు. ఆ ప్రభావం రంగాచార్య రచనలపై కనిపిస్తుంది. ఆయన శైలి చదివిస్తుంది. రక్తి కట్టిస్తుంది. బొమ్మను కళ్లముందు ఆడిస్తుంది. ఆయన రచనలోని ప్రతి పేజీ పాఠకుడిని కట్టి పడేస్తుంది. ఏ పేజీ తెరచి చదివినా, అలా సాగిపోతాడు పాఠకుడు. పుస్తకం మధ్యలో మూయడానికి మనసొప్పదు. అంత ఆత్మీయంగా ఉంటుంది రంగాచార్య శైలి. జీవనది ప్రవాహంలా సాగే ఆయన రచనలో అంత మహత్తు ఉంటుంది.

ఒక రచయిత చేతిరాతలో 38వేల పేజీలు, ప్రచురణలో 17వేల పేజీలు రాయడం అనన్య సామాన్యం. నభూతో నభవిష్యతి. ఆయనొక విశ్వమానవుడు. తన రచనల ద్వారా ఉద్యమాల ద్వారా విశ్వమానవ శ్రేయస్సును కాంక్షించాడు. మార్క్సిస్టు భావజాలంతో సంప్రదాయంలో ఆధునికతను, అభ్యుదయాన్ని దర్శించారు. రంగాచార్య చివరి వరకు అదే దృక్పథంతో రచనలు చేశారు. సుదీర్ఘమైన సాహితీ జీవితానికి స్వస్తివాచకం పలుకుతూ రంగాచార్య జూన్ 8, 2015న తనువు చాలించారు. ఆ మహారచయితకు తెలంగాణ ప్రభుత్వం, రచయితలు, ప్రజలు ఘనమైన వీడ్కోలు పలికారు.

తెలంగాణా సాయుధ పోరాటంలో స్వయంగా పాల్గొన్న ఉద్యమకారుడిగా, ఆనాటి చరిత్రను ప్రజల జీవితాలను గ్రంథస్థం చేసిన నవలాకారుడగా, తెలంగాణ భాషకు కావ్య గౌరవం కలిగించిన రచయితగా.. వేదాలను, ఉపనిషత్తులను, రామాయణ, భారత, భాగవతాలను ప్రజల భాషలో అందించిన అభినవ వ్యాసుడిగా దాశరథి రంగాచార్య ప్రజల గుండెల్లో కలకాలం నిలిచిపోతారు.

# 37 దేవులపల్లి రామానుజరావు

– దేవులపల్లి ప్రభాకరరావు

ఆధునిక తెలుగు వాఙ్మయ, సారస్వత రంగాలలో, సాహిత్య వేత్తలలో, భాషా సేవకులలో అద్వితీయుడు దేవులపల్లి రామానుజరావు సారస్వతి సేవను నిరంతర, నిర్విరామ తపస్సుగా భావించి, తెలుగు వాఙ్మయ వికాసానికి తన అమూల్య జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు దేవులపల్లి రామానుజరావు. ఆధునిక తెలంగాణ వైతాళికుల శ్రేణిలో ఆయన నిశ్చయంగా అగ్రగణ్యుడు. ఆధునిక తెలంగాణ నిర్మాతలలో, తెలుగు సారస్వత ఆధునిక సౌధం నిర్మాణంలో రామానుజరావు ముఖ్యుడు. ముందు నిలిచినవాడంటే అతిశయోక్తి కాదు. తెలుగు సారస్వతంపట్ల ఆయన ప్రేమాభిమానాలు అపారమయినవి తాను చదివింది విజ్ఞానశాస్త్రం, అర్థశాస్త్రం, రాజకీయ శాస్త్రం, న్యాయ శాస్త్రాలని, అభిరుచితో పరించింది మాత్రం తెలుగు సాహిత్యమని రామానుజరావు అన్నాడు. సిరిగల ఇంటిలో పుట్టి, తెలుగేతరమయిన చదువులు చదివి, తెలుగు, సాంస్కృతిక పునరుజ్జీవనానికి అంకితమయిన వారు రామానుజరావు గారని, ఆయన వంచని తల, చాచని చేయి, మోమాటము లేని మాట తీరున్న అభిమానధనుడని ప్రస్తుతించిన పెద్దలున్నారు.

నాటి ఓరుగల్లు, నేటి వరంగల్లు రామానుజరావు గారి పుట్టినిల్లు, వరంగల్లు పట్టణంలోని ఒక సంపన్న భూస్వామి కుటుంబంలో 1917 ఆగస్టు 25వ తేదీన రామానుజరావు జన్మించారు. ఆయన తల్లిదండ్రులు దేవులపల్లి ఆండాళమ్మ, వేంకటాచలపతిరావు. హనుమకొండ కోర్టులో న్యాయవాది గా, సారస్వత ప్రియుడుగా, సాహిత్యవేత్తగా, కవిగా, వరంగల్లు శబ్దానుశాసనాంధ్ర భాషానిలయం పోషకుడుగా ప్రసిద్ధి పొందిన వేంకటాచలపతిరావు నూరు సంవత్సరాల కిందట వరంగల్లు పట్టణ సామాజిక, సాంస్కృతిక జీవనంలో ప్రముఖుడు. అన్ని వర్గాల వారికి, విభిన్న సైద్ధాంతిక దృక్పథాల వారికి ఆయన ఆప్తుడు. సారస్వతి, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, సమన్వయవాద వాతావరణంలో, భక్తిపరులు, సాహిత్యప్రియులు అయిన తల్లిదండ్రుల ఒడిలో, బడిలో రామానుజరావు బాల్యం గడిచింది. ఆయన చదివింది హనుమకొండలోని ఇంగ్లీష్ మీడియం పబ్లిక్ స్కూలు. ఆ రోజుల్లో తెలంగాణలోని ఒకే ఒక పబ్లిక్ స్కూల్ అది. వరంగల్లు మట్టెవాడలోని ఇంటినుంచి హనుమకొండ స్కూలుకు రామానుజరావు గుర్రపుటాంగాలో వెళ్ళేవాడు. ప్రాచీన ఏకశిలానగరం, ఓరుగల్లు చారిత్రక వైభవం, ప్రశస్తి రామానుజరావును బాల్యం నుంచే ఉత్తేజపరిచాయి. అనంతర జీవితంలో ఆయన రాసిన ఒక కవితలోని వాక్యాలు ఇవి: ఆయన అంటారు –

"కాబోలు నియ్యది కాకతీయులొకప్డు
కరకు నెత్తుట కత్తి కడుగుచోటు
కాబోలు నీ ద్వార కల్యాణవేదిక
అలికి ముగ్గులు పెట్టి తెలుగు పడుచు
కాబోలు నీ జీర్ణ కమనీయ సౌధాన

సుకుమార శిల్పములు సొంపులొలికె
కాబోలు నీ వీధి కాపురం బొనరించె
పైడి మేడలలోని భాగ్యలక్ష్మి....”

ఉన్నత విద్యారచన కోసం రామానుజరావు 1934లో సొంత ఊరు వరంగల్లు నుంచి హైదరాబాద్ వచ్చినారు. ఆ రోజుల్లో హైదరాబాద్ నగరంలోని నిజామ్ కాలేజ్ మదరాసు విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న ఇంగ్లీషు మీడియం కళాశాల. అప్పుడు నిజామ్ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ విలియమ్ టర్నర్. ఆ కళాశాలలో ప్రవేశం లభించడం కష్టం. రామానుజరావు గారికి నిజామ్ కాలేజ్ బి.ఎ. కోర్సులో ప్రవేశం లభించింది. నాలుగు సంవత్సరాలు ఆయన ఆ కళాశాల విద్యార్థి. రాజకీయ, ఆర్థిక, సామాజిక శాస్త్రాల ఉన్నత విద్యార్జన. ఆంగ్ల సాహిత్య శోధన నిజామ్ కాలేజ్ వైజ్ఞానిక వాతావరణంలో ప్రారంభం కాకముందే తమ స్వస్థలం వరంగల్లు ఇంటిలో బాల్యంలోని రామానుజరావుకు కాకతీయ చరిత్రపై పరిశోధన చేస్తున్న ఉద్దండ పండితులు శేషాద్రి రమణ కవులతో, తెలంగాణ తొలి పత్రికలలో ఒకటయిన తెనుగు పత్రికను ప్రచురిస్తున్న బహుముఖ ప్రతిభావంతులు. మహా పండితులు ఒద్దిరాజు సోదరులతో పరిచయమయి తెలుగు భాష, సారస్వతాలపట్ల మమకారం ఏర్పడింది. రామానుజరావుకు పదిహేను సంవత్సరాలయినా నిండని కౌమార విద్యార్థి దశలో, 1931లో హనుమకొండలో కాకతీయ మహాసభలు జరిగాయి. కాకతీయ ప్రత్యేక సంచిక ప్రచురితమయింది. కాకతీయ మహాసభలలో శ్రద్ధాసక్తులతో రామానుజరావు పాల్గొన్నారు. కాకతీయ మహాసభల అనంతరం కొద్ది రోజులకే వరంగల్లు శబ్దానుశాసనాంధ్ర భాషా నిలయంలో దేశోద్ధారక కాశీనాథుని ప్రసంగం విని పులకితులయినారు. గాంధీ మహాత్ముని నాయకత్వంలో, సారథ్యంలో భారత జాతీయ, స్వాతంత్ర్య ఉద్యమాల మహత్తర అధ్యాయం ప్రారంభమయిన తరుణంలో, హైదరాబాద్ సంస్థానంలో ఏడవ నిజామ్ రాజు మీర్ ఉస్మాన్ అలీఖాన్ పాలన ఆరంభమయిన దశలో రామానుజరావు వ్యక్తిత్వానికి, ఆయన సామాజిక దృక్పథానికి రూపకల్పన జరుగసాగింది. భారత స్వాతంత్ర్య, జాతీయ ఉద్యమాల ప్రభావం, ఆసఫ్ జాహి రాచరిక వ్యవస్థలో హైదరాబాద్ సంస్థానంలో కొనసాగుతున్న అణచివేత, సంస్థానం ప్రజల హక్కులకు, ప్రయోజనాలకు కలుగుతున్న విఘాతం రామానుజరావు వ్యక్తిత్వ రూపకల్పనలో ప్రధాన పాత్ర వహించాయి.

నిజామ్ కాలేజ్ విద్యార్థిగా రామానుజరావు కావించిన బహు గ్రంథ పఠనం, అపార అధ్యయనం, సూక్ష్మ పరిశీలన ఆయన మేధస్సును సహస్ర దళాలతో వికసింపజేసాయి. రామానుజరావు నిరంతర గ్రంథ పఠనానికి నిజామ్ కాలేజ్ గ్రంథాలయం ఎంతో ఉపకరించింది. నిజామ్ కాలేజీలో రామానుజరావుకు చరిత్ర రాజకీయ శాస్త్రం అధ్యాపకులు సిరుగూరి హనుమంతరావు. ఆంగ్లం అధ్యాపకులు ఆచార్య తణికెళ్ళ వీరభద్రుడు, తెలుగు అధ్యాపకులు కురుగంటి సీతారామయ్య, సరిపల్లి విశ్వనాథశాస్త్రి వీరు వారి విషయాలలో నిష్ణాతులయిన ఆచార్యులు, షేక్స్‌పియర్ ఆంగ్ల నాటకాలపై, సాహిత్యంపై ప్రత్యేక పరిశోధన జరిపే అథారిటీగా పేరొందిన ఆచార్య తణికెళ్ళ వీరభద్రుడు అనర్గళవక్త. ఆయన ప్రసంగాలను వినడానికి ప్రపంచ ప్రఖ్యాత ఆంగ్ల కవయిత్రి సరోజినీనాయుడు తమ కాలేజీకి వచ్చేవారని రామానుజరావు ఒక సందర్భాన రాశారు. వీరభద్రుడితో రామానుజరావుకు సాన్నిహిత్యం ఏర్పడింది. విద్యార్థి దశలోనే రామానుజరావు తమ కళాశాలలో, బయటి వేదికలపై సర్వేపల్లి రాధాకృష్ణ, సర్ సి.వి. రామన్, సర్ సి.పి. రామస్వామి అయ్యర్, తేజ్ బహద్దుర్ సప్రూ, కట్టమంచి రామలింగారెడ్డి, భారత జాతీయోద్యమ నాయకుడు సత్యమూర్తి భూలాభాయిదేసాయి, సోషలిస్టు మేధావి ఆచార్య నరేంద్ర దేవ్, సరోజినీనాయుడు, జాతీయవాది సయ్యద్ హుసేన్ తదితరులు ప్రసంగాలు విని ఉత్తేజితుడయినాడు. నిజామ్ కాలేజ్‌లోని ఆంధ్ర సారస్వత సమితి పక్షాన రామానుజరావు, ఆయన మిత్రులు ప్రముఖ తెలుగు కవులు, పండితులను కళాశాలకు ఆహ్వానించి వారి ప్రసంగాలను వినేవారు. సికిందరాబాద్‌లో ‘సత్యహరిశ్చంద్ర’ నాటక ప్రదర్శనకు వచ్చిన బలిజేపల్లి లక్ష్మీకాంత కవిని కళాశాలకు ఆహ్వానించారు. ఆయన ప్రసంగం, పద్య పఠనం రామానుజరావును, ఆయన మిత్రులను ముగ్ధపరచింది. బలిజేపల్లి లక్ష్మీకాంతకవి రాగయుక్తంగా చదివిన భవభూతి ఉత్తర రామ చరిత్రను విని రామానుజరావు ఉప్పొంగి పోయారు. ఉత్తర రామచరిత్ర తనకు చాల ఇష్టమయిన కావ్యమని రామానుజరావు అన్నారు. తాము ఆహ్వానించగానె

వచ్చి పానుగంటి లక్ష్మీనరసింహరావు తమ కళాశాలలో మహోపన్యాసం కావించారని రామానుజరావు తమ జ్ఞాపకాలలో రాశారు. ఆ రోజుల్లోనే తిరుపతి వేంకట కవులు తమ కళాశాలకు వచ్చి అవధానం చేశారని, ఆ కార్యక్రమానికి రాయప్రోలు సుబ్బారావు అధ్యక్షత వహించారని, అప్పుడే తనకు రాయప్రోలుతో పరిచయమయిందని రామానుజరావు వివరించారు. తరువాత మల్లంపల్లి సోమశేఖర శర్మ 1937-38లో నిజామ్ కళాశాల ఆంధ్రసారస్వతి సమితి ఆహ్వానంపై వచ్చి ప్రసంగించారు. నిజామ్ ప్రభుత్వం ఆదేశించడంతో 1937లో నిజామ్ కళాశాల ఆంధ్రసారస్వత సమితి పేరును తెలుగు సారస్వత సమితిగా మార్చారు. పేరు మార్చినా సారస్వత సమితి కార్యక్రమాలు మారలేదు. రామానుజరావు తెలుగు సారస్వతి అభిమానం. ఆరాధన ఆగిపోలేదు.

నిజామ్ కళాశాలలో 1934 నుంచి నాలుగు సంవత్సరాలు బి.ఎ. చదువుతూ సారస్వత సేవ చేస్తున్న రోజుల్లోనే హైదరాబాద్ నగరంలో మాడపాటి హనుమంతరావు. సురవరం ప్రతాపరెడ్డి, మందుముల నరసింగరావు, బూర్గుల రామకృష్ణారావు, ఆదిరాజు వీరభద్రరావు, ఎన్.కె. రావు తదితర తెలంగాణ ప్రముఖులతో, వైతాళికులతో రామానుజరావుకు పరిచయాలతో ప్రారంభమయి సాన్నిహిత్యం ఏర్పడింది. 1939లో నిజామ్ కళాశాల నుంచి బి.ఏ. డిగ్రీ పొందిన రామానుజరావు వరంగల్లు ఇంటిలోనె రెండు సంవత్సరాలు ఉండి సారస్వత సేవలో తలమునకలయినారు. అప్పటికే ఆయనపై భారత జాతీయ, స్వాతంత్ర్యోద్యమాల ప్రభావం గాఢంగా ప్రసరించింది. అందువల్ల, జాతీయ, స్వాతంత్ర్య భావాలు ప్రబలంగా ఉన్న రాయప్రోలు సుబ్బారావు కవితలు ఆయనకు నచ్చాయి. అప్పటికి హైదరాబాద్‌లో ఆయన శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషానిలయంలో గుర్రం జాషువా, తుమ్మల సీతారామమూర్తి ప్రసంగాలు, కవితలు విన్నారు. హనుమకొండ పాఠశాలలో చదువుతున్నప్పుడు రామానుజరావుకు సహాధ్యాయి కాళోజీ నారాయణరావు. కాళోజీ ఉద్యమాల కవి అని అప్పుడే రామానుజరావు అభిప్రాయపడ్డారు. అనంతరం నాగపూరు న్యాయకళాశాలలో రామానుజరావు, పి.వి. నరసింహారావు సహాధ్యాయులు, డిగ్రీ చదువు అనంతరం రెండు సంవత్సరాలు వరంగల్లులో ఉన్నప్పుడు రామానుజరావు తెలుగులో రచించిన కవితలు, వ్యాసాలు గోలకొండ అర్ధవారపత్రికలో ప్రచురితమయ్యేవి. సురవరం ప్రతాపరెడ్డి సంపాదకత్వాన 1926 జూన్ 10 నుంచి హైదరాబాద్‌లో గోలకొండ అర్ధవారపత్రిక ప్రచురణ ప్రారంభమయింది. గోలకొండ పత్రికలో ప్రచురితమయిన తన ప్రథమ వ్యాసాన్ని మెచ్చుకుంటూ మాడపాటి హనుమంతరావు రాసిన కార్డు రామానుజరావుకు అమితానందం కల్గించింది. అప్పటి నుంచి నిరంతరంగా దాదాపు అరవయి సంవత్సరాలు. చివరి శ్వాస వరకు, రామానుజరావు లేఖిని నుంచి అమృత బిందువులు, ఆణిముత్యాలు, విజ్ఞానపేటికల వంటి కవితలు, వ్యాసాలు, విమర్శలు, వ్యాఖ్యలు, పీఠికలు, సమీక్షలు, సంపాదకీయాలు, విశ్లేషణలు పుంఖానుపుంఖంగా వెలువడి తెలుగు సరస్వతికి అమూల్య ఆభరణాలుగా భాసించాయి - అవి విలువయిన సంకలనాలుగా ప్రచురితమయినాయి. వాటిలో ముఖ్యమయినవి కవితల సంకలనం 'పచ్చతోరణం', వ్యాసాల సంపుటం 'సారస్వత నవనీతం' వంటివి. తన మొదటి వ్యాసం ప్రచురితమయిన గోలకొండ పత్రిక దినపత్రికగా ప్రచురితమవుతున్నప్పుడు సురవరం ప్రతాపరెడ్డి గారికి కుడి భుజంగా నిలిచి, మతోన్మాదుల బెదిరింపులను లెక్క చేయకుండా రామానుజరావు సంపాదకత్వ బాధ్యతలు నిర్వహించడం విశేషం.

మాడపాటి హనుమంతరావు సురవరం ప్రతాపరెడ్డి ప్రోత్సాహంతో బుక్కపట్నం రామానుజాచార్యులు 1942లో, హైదరాబాదులో తెలంగాణ దినపత్రిక ప్రచురణ ప్రారంభించారు. ఆ పత్రిక సంపాదకత్వంలో చేరమని రామానుజరావును మాడపాటి హనుమంతరావు కోరారు. నాగపూర్ న్యాయ కళాశాలలో విద్యార్థిగా ఉన్న రామానుజరావు తెలంగాణ పత్రిక సంపాదకత్వంలో చేరలేకపోయారు. అయినప్పటికీ, ప్రతి వారం 'తెలంగాణ' పత్రికలో రామానుజరావు గారి సాహిత్య విమర్శలు ప్రచురితమయ్యేవి. రామానుజరావు జీవితంలో 1942 మరచిపోలేని సంవత్సరం. బొంబాయిలో 1942 ఆగస్టు మొదటివారంలో భారత జాతీయ కాంగ్రెస్ క్విట్ ఇండియా తీర్మానాన్ని ఆమోదించనున్న తరుణంలో గాంధీ మహాత్ముని

దర్శనం కోసం రామానుజరావు, ఆయన మిత్రులు కొందరు వార్ధా ఆశ్రమానికి వెళ్ళారు. గాంధీజీ దివ్య తేజస్సుతో ఒక ఋషివలె, ఆయన ఆశ్రమం ఒక ఋషి ఆశ్రమంవలె కన్పించి పులకితులం అయినామని రామానుజరావు తమ జ్ఞాపకాలలో రాశారు. గాంధీ దర్శనం తరువాత రామానుజరావులో స్వాతంత్ర్య భావాలు, జాతీయస్ఫూర్తి, దేశభక్తి, సేవానురక్తి మరింత పెల్లుబికినాయి. ఉద్యోగాల జోలికి పోకుండా సారస్వతసేవకు, సమాజసేవకు తన జీవితాన్ని అంకితం చేయాలని రామానుజరావు నిర్ణయించారు. అదొక మహాసంకల్పం. క్రమశిక్షణ, సమయపాలన, విశేషించి సంస్థల డబ్బు వినియోగంలో కఠిన నియమాలు పాటించడం, ప్రజా సంస్థలకు సుస్థిరమయిన పునాదులు నిర్మించడం తాను మాడపాటి హనుమంతరావుగారి నుంచి నేర్చుకున్న అత్యుత్తమ పాఠాలని రామానుజరావు అన్నారు. ఈ పాఠాలను అక్షరాల అనుసరిస్తూ రామానుజరావు తమ ఆధ్వర్యంలోని సారస్వత, సాంస్కృతిక, విద్యా, వైజ్ఞానిక సంస్థలను తీర్చిదిద్దారు.

నాటి నిజామ్ ప్రభుత్వం గస్తీనిషాన్ 53తో హైదరాబాద్ సంస్థానంలో, విశేషించి తెలంగాణ ప్రాంతంలో ప్రజల ప్రాథమిక హక్కులకు, భావప్రకటనా స్వాతంత్ర్యానికి కల్గిస్తున్న విఘాతం రామానుజరావుకు ఖేదం కల్గించింది. తెలంగాణ ప్రజలలో సామాజిక, సాంస్కృతిక, రాజకీయ చైతన్యం కల్గించడానికి, రాచరికపాలన అక్రమాలకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలను జాగృతపరచి చైతన్యవంతులను చేయడానికి విస్తృత స్థాయిలో విద్యావ్యాప్తి జరగాలని, మాతృభాష తెలుగుపట్ల గౌరవం పెరగాలని రామానుజరావు దృఢంగా సంకల్పించారు. ఈ సంకల్పానికి అనుగుణంగా ఆయన అత్యంత ధైర్యసాహసాలతో వ్యవహరించి నిర్విరామ కృషి జరిపారు – కంకణధారణ చేసే కదన రంగంలో అడుగుపెట్టారు. విద్యార్థి దశ ముగిసి ఒక కవిగా, రచయితగా తెలుగు సారస్వత లోకానికి పరిచయమవుతున్నప్పుడు రామానుజరావు వరంగల్లు శబ్దానుశాసనాంధ్ర భాషా నిలయానికి కార్యదర్శి, ఆయన ఆధ్వర్యంలో 1944లో, వరంగల్ నగరంలో, శబ్దానుశాసనాంధ్ర భాషానిలయం రజతోత్సవాలు ఘనంగా జరిగాయి. గ్రంథాలయోద్యమ పితామహుడు గాడిచర్ల హరిసర్వోత్తమరావు రజతోత్సవాలను ప్రారంభించారు. అంతకుముందు హైదరాబాద్‌లో 1943 మే నెల 25వ తేదీన స్థాపితమయిన ఆంధ్రసారస్వత పరిషత్తుతో రామానుజరావుకు అనుబంధం ఏర్పడింది. మరుసటి సంవత్సరం, 1944లో, వరంగల్లులో ఆంధ్ర సారస్వతపరిషత్తు వార్షిక సభల నిర్వహణలో రామానుజరావు ప్రముఖ పాత్ర నిర్వహించారు. వార్షిక సభల సందర్భాన వరంగల్లు కోటలో కవి సమ్మేళనం కోసం ఏర్పాటయిన వేదికను మతోన్మాదులు తగులబెట్టి బూడిద చేశారు. సురవరం ప్రతాపరెడ్డి, రామానుజరావు ఎంత మాత్రం భయపడకుండా ఆ బూడిద కుప్పమీదనే కవిసమ్మేళనం నిర్వహించారు. దాశరథి తన కవితా గానంతో ఆ వేదికపై గర్జించారు. తరువాత సంవత్సరాలలో దాశరథి కవితా సంకలనం 'అగ్నిధార'కు రామానుజరావు ఆవేశపూరిత మయిన పీఠిక రచించారు. 1945లో వరంగల్లు వచ్చిన నిజామ్ రాజ్యం ప్రధానమంత్రి సర్ మిర్జా ఇస్మాయిల్‌ను శబ్దానుశాసనాంధ్ర భాషా నిలయంలోనికి ఆహ్వానించి ఆయన మెప్పు పొందిన సాహసవంతుడు రామానుజరావు. మతోన్మాదుల అమానుష హత్యాకాండతో మొత్తం తెలంగాణం, ముఖ్యంగా వరంగల్లు ఒక అగ్నిగుండంగా మారినప్పుడు వరంగల్లు నడిబొడ్డునుంచే రామానుజరావు 'శోభ మాసపత్రికను ప్రచురించడం మరో సాహసం. ఏబది సంవత్సరాల సామాజిక, సారస్వత సేవామయ జీవితంలో రామానుజరావు ఎన్నో సవాళ్లను, సమస్యలను సాహసవంతంగా ఎదుర్కొని సఫలీకృతులయినారు.

సారస్వత, సాంస్కృతిక, విద్యా, వైజ్ఞానిక రంగాలలో ఆంధ్రసారస్వత పరిషత్తు ఉపాధ్యక్షులుగా, అధ్యక్షులుగా, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి కార్యదర్శిగా, అధ్యక్షులుగా, మూడు పర్యాయాలు ఉస్మానియా విశ్వవిద్యాలయం తాత్కాలిక వైస్ చాన్స్‌లర్‌గా, రాజ్యసభ సభ్యులుగా, ఇతర అనేక సంస్థల మార్గదర్శిగా రామానుజరావు విజ్ఞానజ్యోతులు వెలిగించారు. 1993 జూన్ 8వ తేదీన హైదరాబాద్ నగరంలో దివంగతుడయిన రామానుజరావు చిరస్మరణీయుడు.

38

# దేవులపల్లి వెంకటేశ్వరరావు

– డా॥ యస్. జతిన్ కుమార్

తెలంగాణ ప్రజల సాయుధ పోరాట అగ్రనేతగా, భారత జనతా ప్రజాతంత్ర విప్లవ పంథా రూపకర్తగా, పీడితజన హృదయనేతగా, అశేష శేముషీ దురంధరునిగా, దిగ్దశాంత కీర్తి కాంతులు వెదజల్లిన వైతాళికమూర్తి, స్ఫూర్తి ప్రదాత శ్రీ దేవులపల్లి వెంకటేశ్వర రావుగారు.

ప్రపంచ ప్రజల విప్లవోద్యమ ప్రస్థానంలో ఒక మహోజ్వల ఘట్టంగా గుర్తింపు పొందినది. 1946–1951 మధ్యసాగిన తెలంగాణ రైతాంగ సాయుధపోరాటం, ఆ పోరాట స్రష్టగా, ఆ చరిత్ర రచయితగా, విప్లవ తాత్వికునిగా దార్శనికునిగా అనేక రచనలు చేసి, భారత విప్లవకారుల సమైక్యతకోసం శూద్రబద్ధ వైఖరులను రూపొందించిన ద్రష్ట శ్రీ దేవులపల్లి, వ్యవసాయ విప్లవ పురోగమనం కోసం గ్రామీణ పేదలను సంఘటితం చేస్తూ, అకుంఠిత దీక్ష, మహోన్నత నైతిక విలువలు, అపురూపమైన త్యాగశీలత ముప్పేటగా కలిసి సాగిన అత్యంత అరుదైన విప్లవ విరాట్‌మూర్తి కామ్రేడ్ దేవులపల్లి.

17 సంవత్సరాలపాటు అజ్ఞాత రహస్య జీవితము, 5 సంవత్సరాల జైలు జీవితము అనుభవించిన మొక్కవోని దీక్షతో జీవితమంతా విప్లవకారునిగానే జీవించినవాడు. తెలంగాణా వీర పుత్రులలో మొదటిగా ఎన్నదగినవాడు కామ్రేడ్ డివి.

నల్లగొండ జిల్లా సూర్యాపేట తాలూకాలోని బండమీది చందుపట్ల ఆయన స్వగ్రామం. ఆయన జన్మించినది వరంగల్ జిల్లా మానుకోట తాలూకా ఇనుగుర్తి గ్రామంలో (మాతామహుల ఇంట) 1917 జూన్ మొదటి తారీఖున. అంటే ఈ వేళకు సరిగ్గా వంద సంవత్సరాల క్రితం. ఇది ఆయన శతజయంతి వేళ. ఆయన తండ్రి దేవులపల్లి వరదరావు, తల్లి శ్రీమతి గోపమ్మ. ఒక స్థాయి సంపన్న కుటుంబమే. ప్రాథమిక విద్య నామవరం, తిరుమలగిరి గ్రామాల్లో, మాధ్యమిక విద్య సూర్యాపేటలో, ఉన్నత పాఠశాల విద్య ఖమ్మంలో సాగింది. వరంగల్‌లో ఇంటర్మీడియట్ పూర్తిచేసుకొని, కళాశాల విద్యకోసం ఉస్మానియా విశ్వవిద్యాలయం చేరుకున్నారు. బి.ఎ. చదువుతుండగానే ఆరోజుల్లో సాగిన వందేమాతరం సమ్మెలో పాల్గొనడంతో కాలేజీ నుంచి బహిష్కరింప బడ్డారు. అనేక విద్యాలయాలలో ప్రయత్నించి చివరకు జబల్‌పూర్ ఆర్ట్స్ కాలేజిలో డిగ్రీ పూర్తి చేశారు. డిగ్రీ చదువుతుండగానే 1937(9)లలో ఆయనకు శ్రీరంగమ్మ గారితో వివాహం జరిగింది. ఇక్కడో ముఖ్యమైన విషయం ఉందికూడా.

దేవులపల్లికి చాలా చిన్నతనంలోనే ఒకపరి వివాహం జరిగింది. కొద్ది రోజులలోనే ఆ అమ్మాయి జగన్మోహిని టైఫాయిడ్ జ్వరంతో మరణించింది. అలాగే శ్రీరంగమ్మ గారికి కూడా 5వ సంవత్సరంలోనే వివాహం జరిగింది. అతను

సంవత్సరం తిరగకముందే చనిపోయాడు. తనలాగే బాల్యంలోనే వివాహం జరిగి భర్తను కోల్పోయిన స్త్రీని పెండ్లి చేసుకోవాలనే ఉద్దేశంతో డివి తన తల్లిదండ్రులను, బంధువులను వ్యతిరేకించి శ్రీరంగమ్మ గారిని వివాహమాడారు.

వీరికి 1942లో కూతురు క్రాంతి, 1945లో కుమారుడు రుక్మారావు జన్మించారు. ఈ పిల్లల బాధ్యత, చదువు సంధ్యలు, కుటుంబ వ్యవహారాలు, పంటలు, కౌళ్ళు వంటి సమస్యలనేకాక, దీర్ఘకాలం దాంపత్యంలో ఎడబాటు, భర్త యోగక్షేమాల గురించి కనీస సమాచారం లేని ఆందోళనలు, మధ్యమధ్య పోలీసు దాడులు వంటి ఎన్నో సమస్యలు ఎదుర్కొని కూడా శ్రీరంగమ్మగారు తన భర్త రాజకీయ జీవితానికి అనేక విధాలుగా సహకరించారు. "వారు నాకొక స్వతంత్రమైన జీవితాన్ని సృష్టించి, సమాజంలో నేనొక వ్యక్తిగా జీవించడానికి తోడ్పడినారు". అని ఆవిడ తన జ్ఞాపకాలలో రాసుకోవడం డివి గారి వ్యక్తిత్వాన్ని మనకు తెలియజెప్పుతుంది.

విద్యార్థి జీవితంలోనే ఆయన భవిష్యత్ రాజకీయ జీవితం మొగ్గ తొడగసాగింది. ఖమ్మం హైస్కూలు విద్యార్థిగానే ఆయన అక్కడ జరిగిన మూడు ఆంధ్ర మహాసభల్లో పాల్గొన్నారు. ఉస్మానియాలో వందేమాతరం సమ్మె అందరూ ఎరిగినదే. బి.ఎ. చదువుతుండగానే జాతీయోద్యమ పరిచయం, కొందరు ప్రముఖ నాయకులను కలుసుకునే అవకాశం లభించింది. సోషలిస్టు, కమ్యూనిస్టు భావజాలం తోను, ఆ సాహిత్యంతోను ఎరుక ఏర్పడింది. (పరిచయ మయిన అన్ని భావజాలాలు, ఆర్య సమాజ్ వంటి సాంఘిక ఉద్యమాలు, స్వాతంత్ర్య పోరాటాలు ఆయనమీద అంతో యింతో ప్రభావం చూపినా). ఆయన కుశాగ్రబుద్ధితో ఆయా ఉద్యమాల పరిమితులను, లోటుపాట్లను ఆదిలోనే గ్రహించి మార్క్సిజం, లెనినిజం సిద్ధాంతాలను అభిమానించారు. ప్రజల విముక్తికి, దేశ అభ్యున్నతికి కమ్యూనిస్ట్ వ్యవస్థ నిర్మాణమే మార్గమని నిశ్చయించుకున్నారు. అదే తన జీవిత గమ్యంగా ఎంచుకున్నారు. 1939లో ఆయనకు ఆనాటి కమ్యూనిస్టు పార్టీతో అనుబంధం ఏర్పడింది. అప్పటికాపార్టీ నిషేదంలో వుంది. సంస్థానంలో కమ్యూనిస్ట్‌పార్టీ కార్య కలాపాలు సాగించడమంటే ప్రాణత్యాగానికి సిద్ధపడటమే. అనేక విపత్ కార్యాలను తలకెత్తుకోవడమే. అయినా ఆ కంటకావృతమైన మార్గాన్ని దేవులపల్లి ఎన్నుకొని, ఇక తన జీవితం ఆఖరి క్షణాలవరకు కమ్యూనిస్టు విప్లవకారుడిగానే జీవించారు. 12 జూలై 1984న అసువులు బాసేవరకు కమ్యూనిస్టు పదానికున్న నిజమైన అర్థాన్ని దృఢంగా ఆచరించి చూపారు. కమ్యూనిస్టు ఉద్యమ అగ్రేసర పుత్రునిగా మిగిలిపోయారు.

(నాలుగున్నర దశాబ్దాల సుదీర్ఘ విప్లవ ప్రయాణంలో ఎనలేని అనుభవాలు, ఎదుర్కొన్న అటుపోట్లు, తవ్వితీసిన గుణపాఠాలు, ఔదార్యందాల్చిన విప్లవ దీపాల కాంతి పుంజాలు ఎన్నో... దేశంలో చరిత్రగమనంలో ఏర్పడుతున్న అనేకానేక మార్పులను సాఫల్యంగా, సమీక్షించుకుంటూ తన విప్లవ చైతన్యాన్ని పదునుపెడుతూ భారత ప్రజలకో దిశానిర్దేశం చేసిన దార్శనికత ఎంతో... మాటల్లో చెప్పలేము.)

1940-50 దశాబ్దంలో తెలంగాణా సమాజంలో అట్టుడుకుతున్న వెట్టి వ్యతిరేక, భూస్వామ్య దోపిడీ వ్యతిరేక భావజాలాన్నంతా వొడిసిపట్టి, రైతుల భూదాహాన్ని పసిగట్టి సాయుధ పోరాట సన్నాహక కృషిని చేశారు. 46-51 మధ్య కాలంలో రైతాంగ ఉద్యమం సాయుధమై విస్తరించగా తాను నల్లగొండ జిల్లా పార్టీ కార్యదర్శిగా, ప్రజలనుంచి నేర్చుకుంటూ, ప్రజలకు నేర్పుతూ వర్గపోరాటాన్ని అభివృద్ధి చేశారు. (ఆనాటి పార్టీ, కేంద్రకమిటీల విధానాలలోని వర్గసంకర రాజకీయ అంశాలను ఎప్పటికప్పుడు విశ్లేషించుకుంటూ) తన క్షేత్రస్థాయి అనుభవాలతో, నిశితమైన రాజకీయ పరిజ్ఞానంతో తెలంగాణాలో పార్టీని సరిఅయిన దిశలో నడిపిస్తూ, తెలంగాణా మహోద్యమ చరిత్రకు ప్రాణం పోశారు. (మితవాద, అతివాద, అవకాశవాద రాజకీయాలను తృణీకరిస్తూ, తెలంగాణాలో పార్టీ ఏర్పాటు, ఉద్యమ పరిణామ క్రమంలో సాయుధపోరాట నిర్వహణ, నెహ్రూ సైన్యాలకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగించడం, పోరాటాన్ని విరమించాలనే తప్పుడు ధోరణులను వ్యతిరేకించడం వంటి సందర్భాల్లో) ఆయన గొప్ప నాయకత్వ పాత్రను నిర్వహించారు. భారత విప్లవానికి భూమి పంపక కార్యక్రమం జోడించడం, దున్నే వానికే భూమిని కేంద్ర నినాదంగా చేయడం, వలంటీరు దళాలను నిర్మించడానికి, అవి గుతుపల సంఘాలుగా నిలబడటానికి, గ్రామ రక్షక

దళాల ఏర్పాటు, గ్రామ పంచాయితీలు, గ్రామ రాజ్యాల ఏర్పాటు వంటి కార్యక్రమాలకు శ్రీదేవులపల్లి ఆలోచనలే మూలం. దేవరుప్పల గ్రామంలో వాలంటీరు దళం ఏర్పాటు చేసింది ఆయనే. 1946లోనే భూమి పంపకాన్ని చేపట్టిన ఆద్యుడు ఆయనే. తెలంగాణా సాయుధ పోరాటాన్ని అభివృద్ధి చేసి నడిపించడంలో ఆయన చూపిన చొరవ, ఎరుక, కృషి, బహుముఖమైన ఆయన పాత్ర తగినంతగా గుర్తింపు పొందలేదు. (చివరకు ఆయన రాసిన ఆ పోరాట చరిత్రలో కూడా, చారిత్రక క్రమంలో ఆయా ఉద్యమ ఘట్టాలను, ఘటనలను, వర్ణించారు, విశ్లేషించారు తప్ప పార్టీనిర్మాణం, ఉద్యమ నిర్మాణం మిలటరీ నిర్మాణం వంటి అంశాలలో కర్ణధారిత్వం వహించిన తన పాత్రను చాలా కొద్దిగానే ప్రస్తావించారు. అయితే చరిత్రను లిఖించే పద్ధతికి ఆయన పుస్తకం ఒక వరవడిని సృష్టించింది).

సాయుధ పోరాట విరమణ తర్వాత 1951 నుండి 1968 వరకు నల్లగొండ పార్లమెంటరీ సభ్యునిగా వ్యవహరించారు. ఆ పని ఎంత నిక్కచ్చిగా చేసేవారంటే తన భార్య పిల్లలను కనీసం ఒక్కసారికూడా ఢిల్లీ తీసుకువెళ్ళలేదాయన. ఆ ఛార్జీ డబ్బులతో పార్టీ కార్యకర్తలకు ఏవైన సదుపాయాలు కల్పించవచ్చుని ఆలోచించేవారు. ఒకానొక సందర్భంలో ఆయనను అరెస్టు చేయడానికి వచ్చిన పోలీసు ఆఫీసర్లు వారు నివసిస్తున్న చోటుచూసి డి.వి. గారు యం.పి.గా వుండటమేమిటి? ఈ పాకలో నివసించడం ఏమిటి? అని ఆశ్చర్యానికి లోనయ్యారు (అంతటి నిరాడంబరం, అంత నిజాయితీ, ఆ కర్తవ్య పరాయణత్వం, బాధ్యతాయుత ప్రవర్తన గల నాయకులు కంచు కాగడావేసి వెతికినా కనిపించరు కదా!) అయితే ఆ పార్లమెంటరీ పంథాతో ఆయన రాజీపడలేదు. నల్లగొండ జిల్లా కార్యదర్శిగానూ, 1948 నుండి రాష్ట్ర కమిటీ కార్యవర్గ సభ్యునిగానూ, ఆతర్వాత కేంద్ర కమిటీ సభ్యునిగానూ, జాతీయ సమితి సభ్యుడిగానూ వ్యవహరించారు. అనేక అంతర్గత పార్టీ పోరాటాలు చేస్తూ వచ్చారు. 1968లో సి.పి.యం. నుండి బయటకు వచ్చారు. 1968-69 కాలంలో 'పోరాట ఉద్యమానికి పునాదులు వేయండి' అనే తక్షణ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. నక్సల్బరీ మేఘ ఘర్జనను, శ్రీకాకుళం గిరిజన పోరాటాలను నిశితంగా పరిశీలించి తన తెలంగాణా పోరాట అనుభవాలతో (మితవాద, అతివాద ధోరణులకు వ్యతిరేక కేంద్రంగా) సరిఅయిన విప్లవ శిబిరంగా తన ఆలోచనలు విస్తరింపజేస్తూ కామ్రేడ్ నాగిరెడ్డిగారితో కలిసి 1975లో కమ్యూనిస్టు విప్లవకారుల సమైక్యతా కేంద్రం స్థాపించారు. ఆ సంస్థ కేంద్ర కమిటీ కార్యదర్శిగా చివరంటా తన విప్లవ కృషి కొనసాగించారు. ప్రొలిటేరియన్‌లైన్, సంకేతం పత్రికల ద్వారా విప్లవ జర్నలిజానికి తలమానికమనదగ్గ అనేక వ్యాసాలు ప్రచురించారు. (భారత దేశ అభ్యున్నతికి ప్రత్యేకించి తెలంగాణా ప్రాంత అభివృద్ధికి విలువైన సూచనలు చేశారు. తక్షణ అవసరాలు, కరువు పరిస్థితులు, అభివృద్ధిలోని అసమానతలు, ప్రాంతీయ అవసరాలు, దీర్ఘకాలిక ప్రణాళికలు, సమగ్ర అభివృద్ధిలో ఆయా ప్రాంతాల సమతూకం వంటి అంశాలు ప్రాతిపదికగా తెలుగుజాతి ఐక్యతను కోరుకున్నారు.) అయితే పాలకవర్గాలు తమ అధికార ప్రాబల్యం కోసం, తమ వర్గ స్వార్థ ప్రయోజనాల కోసం పని చేస్తాయని, కనుక ప్రజాసమూహాల మధ్య, ప్రాంతాల మధ్య వివక్ష, అసమానతలను పెంచిపోషిస్తారు తప్ప వీరు తెలుగు జాతి ఐక్యతను సాధించలేరని ఘంటాపథంగా చెప్పారు. ఏవిధంగా 'సమైక్యత' ప్రజా సమస్యలను దూరం చేయలేదో అదేవిధంగా ప్రత్యేక రాష్ట్రాలు కూడా ప్రజల మౌలిక సమస్యలు తీర్చలేవని భావించారు. ప్రజా ఉద్యమకారులు పాలక వర్గాలు విసిరే ఎలాంటి వలలోనూ చిక్కుకోకుండా మౌలిక సమస్యలు పరిష్కరించే తమ విప్లవ కార్యాచరణలో నిమగ్నం కావాలని తీవ్రంగా తపన పడేవారు. ప్రజల జీవన ప్రమాణాల అభివృద్ధే ప్రాంత అభివృద్ధికి సంకేతమనీ, ఏదో కొందరు భూస్వాములు, కొందరు ఫ్యాక్టరీ యజమానులు, ధనవంతుల అభివృద్ధి నిజమైన అభివృద్ధి కాదని నిక్కచ్చిగా వక్కాణించారు).

తన విప్లవకర, ఉత్తేజకర జీవితంలో అనేకమార్లు నిర్బంధానికి గురి అయ్యారు. ఆనాటి నిజాం ప్రభుత్వం ముండ్రాయి లంబాడీ రైతాంగపు పోరాట సందర్భంగా ఈయనపై తొలికేసు నమోదు చేసింది. తెలంగాణా పోరాట కాలంలో 1946-52 వరకు రహస్య జీవితం గడిపారు. ఎంతటి అజ్ఞాతమంటే అనేక నెలలపాటు భార్యా పిల్లలను చూడలేనంత, పిల్లలు తండ్రిని గుర్తుపట్టలేనంత, తల్లి, అత్తా మరణించినా అక్కడకు వెళ్లలేనంత, కొడుకు వివాహం కూడా

చూడలేనంత.. అజ్ఞాతం, కానీ ప్రజా ఉద్యమాలకు ప్రతిక్షణం నాయకత్వం వహించే కార్యాచరణ కొనసాగించడం, ఇక బహిరంగ జీవితంలో ఉన్నప్పుడు భారత–చైనా యుద్ధ సమయంలో 1962 నవంబరు నుండి 1963 జులై వరకు, పాకిస్తాన్‌తో యుద్ధం సందర్భంగా 1964 డిసెంబరు నుండి 1966 మే వరకు జైలు జీవితం. హైదరాబాద్ కుట్రకేసు సందర్భంగా 1969 డిసెంబరు నుండి 1972 మే వరకు జైలు జీవితమే. ఆతర్వాత 1975 జూన్‌లో అత్యయిక స్థితి విధించేవరకు కఠినమైన బెయిలు జీవితం అది ఎక్కువగా గృహానికే పరిమితమైన సందర్భం. ఆయన బహుశా కుటుంబ సభ్యులతో ఎక్కువగా గడిపింది, మనవళ్ళతో ఆడుకున్నదీ, ఆప్యాయతలు పంచుకున్నదీ ఈ బెయిలు సందర్భంగానే అనుకుంటా. ఎమర్జెన్సీ ప్రకటనతో తిరిగి రహస్య జీవితమే.

నిజాం రాజరికం నుండి భారత ప్రభుత్వం వరకు ఎన్ని పార్టీలు, ప్రభుత్వాలు మారినా ఆయనపై రాజ్యం చేసిన "దాడి" మారలేదు. అలాగే అనేకమంది ఇతర నాయకులు పాలకుల పట్ల భ్రమలతో కొట్టుకు పోతున్నా ఆయన విప్లవదీక్ష, దృఢచిత్తం, ప్రజాఉద్యమాల పట్ల అంకితభావం ఇసుమంతయినా సడలలేదు. మాజీ పార్లమెంటు సభ్యునిగా అందే పెన్షను తీసుకోవడానికి కూడా నిరాకరించిన ఉదాత్తా ప్రజానేత ఆయన.

(ప్రజలమధ్య, ప్రాంతాలమధ్య, రాష్ట్రాల మధ్య, పొరుగుదేశాల మధ్య వివక్ష, దోపిడీ, పెత్తందారీ తనంలేని ఒక స్వతంత్ర ప్రజాతంత్ర వైఖరిని ఆయన ప్రతిపాదించారు.) ప్రజలను దుర్భర దారిద్ర్యంలోకి ఈడుస్తున్న భూస్వామ్య దోపిడి లేని రాజ్యాన్ని, దేశ ఆర్థిక జీవనాడులను పీల్చిపిప్పి చేస్తున్న సామ్రాజ్యవాద దోపిడీలేని దేశాన్ని, ప్రజల జవసత్వాలను, శ్రమశక్తిని తమ సంపదలుగా కూడబెట్టు కుంటున్న పెట్టుబడిదారులు లేని సుభిక్షమైన భారతదేశాన్ని ఆయన కోరుకున్నారు. దాని కోసమై ఉద్యమించారు. విప్లవపార్టీని నిర్మించారు. కార్యకర్తలను తయారు జేశారు. ఒక రచయితగా, తాత్వికునిగా సంఘ సంస్కరణాభిలాషిగా, ప్రజా సాంస్కృతికోద్యమ దిక్సూచిగా, దోపిడీ వర్గ విధ్వంసకు నిగా నూతన యుగావిష్కరణ కోసం విప్లవించారు. విప్లవం కోసమే జీవించారు. ప్రజాయుద్ధ వైతాళికునిగా, ఒక నూతన తెలంగాణ సమాజాన్ని, ఒక నూతన భారత దేశాన్ని స్వప్నించి, కృషిచేసిన అగ్ర నాయకునికి శతజయంతి సందర్భంగా వినమ్రంగా అరుణారుణ జోహార్లు.

# 39 ధవళా శ్రీనివాసరావు

**– పున్న అంజయ్య**

సాహితీ ప్రపంచంలో కొందరు కవిత్వాన్ని కాలక్షేపం కోసం రాస్తే మరికొందరు సమకాలీన సమాజ పరిస్థితుల ప్రాబల్యంతో అనేక వత్తిడులకు లోనైనప్పుడు రాస్తారు. ఇందులో రెండవ కోవకు చెందిన వారు ధవళా శ్రీనివాసరావు. వీరు నల్లగొండ జిల్లా చండూరు మండలం లోని కోటయ్యగూడెం గ్రామంలో 1918 కాళయుక్తినామ సంవత్సరంలో మాఘ బహుళ ఏకాదశినాడు జన్మించారు. చండూరు సాహితీమేఖలకు పట్టుగొమ్మలైన వారిలో వీరొకరు. ఈ సంస్థకు వీరు ప్రధాన కార్యదర్శిగానే కాకుండా ఆంధ్ర సారస్వత పరిషత్తు కార్యకర్తల్లో ముఖ్యులు కూడాను.

ఈ కవి తమ గురువులైన అంబటిపూడి వెంకటరత్నం శాస్త్రి వద్ద ఆంగ్ల సాహిత్యం నేర్చుకొని గోల్డ్‌స్మిత్, వర్డ్స్‌వర్త్, కీట్స్, షెల్లీ వంటి ఆంగ్లకవుల కావ్యాలను చదివి ఉత్తమ రచనకు, ఉపన్యాసానికి కావలసిన కళాదృష్టిని, భాషా పరిజ్ఞానాన్ని సంపాదించుకున్నారు. వీరికి తులనాత్మక పరిశీలనయందు మక్కువ ఎక్కువ.

ప్రాచీన పద్ధతిలో ఛందోబద్ధ కవితలను, నవీన ఫక్కీలో మాత్రా ఛందస్సున గేయాలను సమానంగా రాశారు. నిజాం పరిపాలనలో కొన్ని వాస్తవాలను గేయరూపంలో రూపకల్పన చేసి గళంవిప్పి వాటికి జీవం పోశారు. ఆనాడు దాశరథి అగ్నిధార ఐతే ధవళశ్రీ అమృతధార అనేవారు.

1946లో దేశమంతటా చెలరేగిన మత కలహాలనూ, కరువు కాటకాలనూ దృష్టిలో ఉంచుకొని ఈ కవి పడిన ఆవేదన "ఏమి వ్రాయాలె? నేనేమి వ్రాయాలె?" అన్న గేయం వెలువడ్డానికి మూలమయింది.

ఏమి వ్రాయాలె?<br>
    నేనేమి వ్రాయాలె?<br>
నా ఇంటినడుమనే<br>
    పెను మంటలేరేగ<br>
నా తమ్ములే విలయ<br>
    నాట్యాలు సేయగా<br>
నా కూనలీనాడు<br>
    బాకులకు బలిగాగ<br>
నాదు చెల్లెండ్ర<br>
    మర్యాద దోపిడి సాగ<br>
నాతల్లి గుండియలు<br>
    కోతలు పడ్డాక ॥ ఏమి ॥

తెలుగు భాషకు అంధయుగం అయిన నిజాం పాలనలో తెలుగు వేషభాషలను కాపాడేందుకు జరిగిన ఉద్యమాలు ఏ జాతి నిర్వహించిన స్వాతంత్ర్యోద్యమాల కంటే ఏ మాత్రం తక్కువవి కావు. మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి, దేవులపల్లి రామానుజరావు, పులిజాల హనుమంతరావులాంటి వారు ఈ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ఐతే నల్లగొండ జిల్లాలో మాత్రం ఈ ఉద్యమానికి బీజం వేసినవారు పులిజాల హనుమంతరావు. వీరు

1934లో చందూరులో స్థాపించబడిన "సాహితీ మేఖల" సంస్థకు వ్యవస్థాపక కార్యదర్శి. ఇదే సంస్థకు చెందిన ధవళా శ్రీనివాసరావు కూడా తెలుగుభాష పట్ల చిన్నచూపుగల వారిని మందలిస్తూ పద్యాలు రాశారు.

తెలుగుదేశాన జన్మించి తెలుగు చేత
మంచి చెడ్డల భేదంపు మర్మమరసి
తెలుగు పొలముల పంటను తినుచు బెరిగి
తెనుగు బాసన్న నాలుక తేలవైతె ?

అంతేకాదు నిజాం పాలనలో తెలుగుభాష యొక్క దీనస్థితి, హీనస్థితిని చూసి ధవళా శ్రీనివాసరావు హృదయం చలించింది.

ఉర్దూభాషా సాహిత్యాలను, అక్కడి షాయర్లనూ ముషాయిరాలను మెచ్చుకునే సందర్భంలో తెలుగురాదని చెప్పుకోవడమే గొప్పగా భావించేవారు. ఇది నచ్చని ధవళా శ్రీనివాసరావు సింహంలా గర్జించాడు.

తెలుగన్నతంనే యేవగించుకొని మూతిల్
విప్పవేమోయి ఈ
తెలుగుంబాస పసందు ముచ్చటలు
సుంతేనింపసందింపవో
పలుకం జెల్లునె తెల్గురాదనుచునీ పాండిత్యమా
గంగలో
గలుపంగా దగదే యదేదియుయినంగానిమ్ము
నీపొలిటన్"

ఆనాడు శ్రీనివాసరావు తన పద్యాన్ని ప్రజలకు ప్రబోధ శంఖంలా పూరించాడు. పాటలాగా పద్యాన్ని పరుగెత్తించే కలం బలం ధవళశ్రీ సొత్తు.

ధవళా శ్రీనివాసరావు జాతీయ భావాలు కలిగిన కవి. జాతీయోద్యమ స్ఫూర్తితో ఆనాడు చక్కని కవితలు రాశారు.

అదిగో తూర్పున రక్తిసంధిలగ నార్యావర్త దేశంబుపై
నుదయించె స్రవికాంతి జీవనపు లీలోద్యాన
మందెల్లడన్
యెదల న్మూసిన శౌర్యపంఉగుసుమముల్విప్పారి
స్వాతంత్ర్యసం
పదసౌరభ్యము దిగ్దిగంతములలో వ్యాపింపగా నొప్పదే

'క్విట్ ఇండియా' ఉద్యమం ముమ్మరంగా సాగుతున్న రోజుల్లో హైదరాబాద్ సంస్థానంలో ఉన్నా, భారత స్వాతంత్ర్యం కోసం స్పందించి రాసిన పద్యమిది.

ప్రజాకవి కాళోజీని నిజాం ప్రభుత్వం 1946లో మూడునెలలు వరంగల్ నుండి బహిష్కరించినపుడు "సాహితీ మేఖల" దశమ వార్షికోత్సవాల సందర్భంగా ఆహ్వానించి ఘనంగా సన్మానించింది. తెలంగాణ ఉద్యమస్ఫూర్తితో ధవళా శ్రీనివాసరావు 'కాళోజి'పై రాసిన కవితలు ఎంతో గుర్తింపుపొందాయి.

కాకిమూకలు నిన్ను చీకాకునొనరింప
ఏకతంబే కోయిలా! వానికేమి లాభమె కోయిలా!
కలత జెందకె కోయిలా!
మనది
కవికులంబౌ కోయిలా!

ఈ కవికి పల్లెటూళ్లన్నా, పచ్చని పంటపొలాలన్నా ఎంతో ఇష్టం. అందుకే చేలన్నీ పచ్చదనంతో కళకళలాడుతూ వుండాలని, మండుటెండలకు ఎండి వాడిపోయే పొలాలు చూచి తన కన్నీళ్ళతోనైనా వాటికి తేమగూర్చాలని "మధురోహం"లో కోరుకుంటాడు.

'నా కలం
నేడు
బలరాముని హలం' అంటారొక చోట
నేనెవరో
నన్నెరుగరు
కవిని – కాదు
గాయకుడను
శిల్పినంటారేమొ
అదిగాదిదిగాదు నేను
మధురోహను
మధురోహను' అని అంటారు ఇంకోచోట.

వేదనాభారంతో మగ్గిపోయిన హృదయాలను మథించి అమృతభాండములను అందించగల మధురకవి ధవళశ్రీ.

వీరి మరణానంతరం వీరి కుమారులు అముద్రితంగా వున్న కవితలన్నీ సేకరించి "ధవళశ్రీ" పేరుతో 1991లో అచ్చువేయించారు. ఈ కవి 1980 మే 7న అస్తమించారు.

# 40 దొడ్డి కొమురయ్య

– ప్రొ. ననుమాస స్వామి

దొడ్డి కొమురయ్య భారతదేశ పోరాటానికి నాయకత్వం వహించిన యోధుడు. 1857నాటి సైనిక తిరుగుబాటును తలపించే కడివెండి పోరాటానికి కారకుడు. 1946లో ఆంధ్ర మహాసభ సంఘానికి నాయకుడై కరడుగట్టిన భూస్వాములతో పోరాడి తానా రంగంలో అసువులు బాశాడు. ఆయన మరణించిన తర్వాత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం మొదలయింది. అంతిమంగా హైదరాబాద్ విముక్తి పోరాటమయింది. భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం ఆవిర్భవించిన ఆంధ్ర మహాసభ కమ్యూనిస్ట్ పార్టీగా మారిపోయింది. తెలంగాణ ప్రాంతంలోని వరంగల్ జిల్లాలో ఉన్న కడివెండిపల్లె ప్రపంచ పటంలోకి ఎక్కింది అప్పుడే.

విసునూరు గ్రామం చుట్టూ ఉన్న 60 పల్లెలకు దొర రాపాక రామచంద్రారెడ్డి. మకుటంలేని మహారాజు. పరమ కిరాతకుడు. ఆగడాలకు హద్దు – పద్దూ లేదు. అతను జేసే అఘాయిత్యాలకు జనం హడలిపోతుంటారు. అతని తల్లి జానకమ్మ. ఆ దొరసాని కొడుకును మించిన క్రూరురాలు. కడివెండి జాగీర్ ఆమెది. కడివెండి గడి నరకానికి నకల్ వెట్టిచాకిరీలో నలిగింది. పండే పంటమీద హక్కులేదు. పీల్చే గాలి మీద హక్కులేదు. దొరకు వచ్చే ప్రభుత్వ అధికారులకు విందు ఖర్చులివ్వాలి. జానకమ్మ గడిలో పుట్టుకైనా దావతైనా ఖర్చులు ఊరు వారే భరించాలి. పటేల్, పట్వారి, దొరల రాజ్యంలో బతుకే తమదిగాదు. అణచివేతకు, దోపిడీలకు అంతేలేదు. ఇక జానకమ్మను దొరసాని అంటే నేను సానినా అని మండిపడుతుంది. అమ్మా అని పిలిస్తే నీ తండ్రికి పెళ్ళాన్నా అని భగ్గుమంటుంది. ఆడదైనా 'దొర' అనే పిలవాలని ఆజ్ఞాపించింది. దొరల దురాగతాలను మాసిన దొడ్డి కొమురయ్య గుండె మండింది. అన్యాయాలను ఎదురించడమే గాదు పోరాడి ప్రాణం విడిచాడు. ఆయన త్యాగం రైతాంగ సాయుధ పోరాటానికి మొదటి అధ్యాయమైంది.

నల్గొండ జిల్లా భువనగిరిలో 1944లో ఆంధ్ర మహాసభ మహాసభలు జరిగాయి. వేలమంది జనం, వందలమంది కవుల హాజరైనారు. వాళ్ళందరూ రైతులు, కూలీలు రకరకాల వృత్తులు జేసే ఉత్పత్తి కులాలవారు. నాయకులు చెప్పే ఉపన్యాసాలు, గాయకులూ పాడిన పాటలు విన్నారు. ఆ మాటలు, పాటలు తమ బతుకుల గురించే వున్నదని తమ కష్టాలు పోయే మార్గమున్నదని, ఉత్సాహం, ఉత్తేజం కలిగి సంఘంలో జేరి పోరాడాలనుకొన్నారు.

వెట్టిచాకిరి, దొరల జమీందార్ల దౌర్జన్యాలు అంతం జేయాలనుకొన్నారు. జనమంతా "ఆంధ్ర మహాసభకు జై" అన్నారు. వాళ్ళ కళ్ళల్లో కాంతి కనిపించింది. గుండెల్లో ధైర్యం వచ్చింది. గుట్టలు, పుట్టలు, చెట్లు జై అన్నట్లు ప్రతిధ్వనించినాయ్. గుండెల్లో ధైర్యం నిండింది. కళ్ళల్లో శక్తి వచ్చింది. మనసులో ఆవేశం రగిలింది. నిగూఢమైన శక్తి నిద్ర లేచింది. కానీ, అంతలోనే గుండెల్లో గుబులు కలిగింది. సభకు పోయినమని దొరకు, పటేళ్ళకు తెలిసి

ఉంటది. ఇంటికి పోగానే జరిగేది గుర్తుజేసుకున్నారు. దొర, గడి, గడిముందు పెట్టే హింసలు కళ్ళముందు తిరిగినయ్. ఏమి చెయ్యాలే! ఎట్లా బోవాలి! ఊర్లో వుండనిస్తరా? ఎన్ని హింసలు పెట్టరోనని గుంపులు, గుంపులుగా జేరి చర్చించుకున్నారు. అమ్మో! దొరకు దెలిస్తే? యం జేస్తదు? 'కొడ్తదు తిడ్తదు – జుర్మానావేస్తాడు. ఊరు నుండి వెల్లగొడ్తాడు' అన్నడో యువకుడు. మనందరం ఒక్కటిగవుంటే ఊరి జనమంతా మనతో కలిస్తే వాళ్ళేంజేస్తరు? సంఘంలో చేరాలి. ఒక్కటిగ నిలవాలి? అనుకొంటూ కడివెండికి వెళ్ళారు.

ఊరూరున సంఘం పుట్టింది. సంఘం పుట్టిందనగానే జానకమ్మ దొరసానికి శివమెత్తినట్లయ్యింది. సంఘం లేకుండా చేయాలనుకున్నది. తాగుబోతు కిష్టడు. కోట చంద్రయ్య పెండ్లాల నర్సమ్మను తప్ప తాగించి, సంఘం కార్యకర్తల ఇండ్లపై ఉసిగొల్పింది. వారిద్దరు సంఘం కార్యకర్తల, నాయకులను బండ బూతులు తిడుతూనే శాపనార్థాలు పెడుతున్నారు. రాళ్లు విసురుతున్నారు. సహనం నశించిన సంఘం కార్యకర్తలు వాళ్ళను తొక్కి కొట్టారు. ఆ తర్వాత 40 మంది రౌడీలతో మిస్కి నలీ, అబ్బానలీ, దిగింద్రు. గడిలో మఖాం బెట్టారు. అక్రమ కేసుల్లో ఇరికించడానికి అమీన్‌సాబ్‌కు కబురు చేశారు. అమీన్‌సాబ్ వచ్చిండు. గ్రామ సంఘం నాయకుడు మోహన్‌రెడ్డిని గడికి రమ్మని నౌకరును పంపిండు. మోహన్‌రెడ్డి గడికి రానన్నాడు. కావాలంటే ఆంధ్ర మహాసభ ఆఫీసుకు, లేదా చావడి దగ్గర కొస్తానన్నాడు. అమీన్‌సాబ్‌కు కోపమొచ్చింది. 16 మంది కార్యకర్తలను పట్టుకొచ్చింద్రు. అది చూసే వందలమంది జనం అమీన్‌సాబ్‌ను చుట్టుముట్టారు. అక్రమంగా అరెస్టు చేసిన వారిని విడిపించుకున్నారు. అది అమీన్‌సాబ్, దొరసాని జానకమ్మ తీరని అవమానమనుకున్నారు. రౌడీలకు తలవంపు అయ్యింది. ప్రతీకారం తీర్చుకోవాలనుకున్నారు.

సర్కార్ ఖానూన్ ప్రకారం ప్రతీ రైతూ బోనీ ధాన్యం చెల్లించాల్సిందేనంటూ ఇల్లుల్లూ సోదా చేసి ఉన్న నాలుగు గింజలు బలవంతంగా లాక్కొని, ధాన్యానంతా బండ్లమీద వేసుకొని వెళ్ళిపోతున్నారు. ఊరు బయటకు రాగానే సంగంవాళ్ళు అడ్డుపడి నిలిచారు. పేదల గింజలు కాదు... దొర గడీలో ఉన్న పుట్ల కొద్దీ ధాన్యం ఎందుకు ముట్టుకోలేదని నిలదీశారు. తటపటాయించాడు తహసీల్దారు. గడిలో ధాన్యం లేదని బుకాయించాడు. తాము చూపిస్తామన్నారు సంఘంవాళ్ళు. గత్యంతరంలేక అధికారులు బండ్లను వెనక్కి మళ్ళించారు. అధికారులు, పోలీసులు తిరిగి గడీలో బస చేశారు. ఆ రాత్రి విందు జరిగింది. పొద్దున్న ప్రజల ముందు గడీలో ధాన్యం బయట పడుతుందని, పరువు పోతుందని రాత్రికి రాత్రే దాన్నంతా దొంగచాటుగా విసునూర్కు తరలించారు. పొద్దున్నే చూస్తే గడీలో ఖాళీ గరిసెలు దర్శనమిచ్చాయి. కానీ దొరతనం పరువు పోయింది. మొదటిసారిగా ప్రజలు తమకు ఎదురుతిరగడం సహించలేకపోయారు. సంఘం సంగతి, ప్రజల సంగతి చూస్తానని జానకమ్మ గుడ్లురిమింది. గూండాల గుంపులు కడవెండికి చేరుకున్నాయి. అడ్డుకోకపోతే మరింత హద్దు మీరుతారని అనుకున్నారు. గుమాస్తా అబ్బాసలీ (అమరుడైన బందగి సోదరుడు) నాయకత్వంలో గడీ నిండా చేరిన గుండాలు ఊరిపై దాడికి పూనుకున్నారు. కత్తులు, కర్రలు, బరిసెలతో బీభత్సం చేశారు. అమీన్‌షాబ్ – జమేదారీ వెళ్ళిపోయాడు. రౌడీలు రాత్రంతా గడిలో కుట్రపన్నారు. మరుసటిరోజు (1946లో జూలై4) చీకటిపడగానే, సంఘం కార్యకర్తల ఇండ్లపై రాళ్ల వర్షం కురిపించారు. సంఘం నాయకులు సంఘశక్తి చూపాలనుకున్నారు.

ఇళ్ళల్లోని వారంతా బయటికొచ్చారు. దాడికి వ్యతిరేకంగా ఊరేగింపు జరపాలని నిశ్చయించారు. ఊరంతా కదిలింది. ఊరేగింపు గా ఆంధ్ర మహాసభ కార్యాలయంవైపు బయల్దేరారు. అప్పుడే వచ్చి అన్నం తింటున్న దొడ్డి కొమురయ్య ఆ వార్త తెలిసి దుడ్డుకర్ర అందుకొని 'జై' అంటూ అన్న మల్లయ్యతో కలిసి వెళ్ళి ఊరేగింపులో కలిశాడు. ఊరేగింపు సాగిపోతోంది. సంఘం ఆఫీసు జానకమ్మ దొరసారి గడిముందే వున్నది.

ఊరేగింపు గడి దగ్గరకు రాగానే, తప్ప తాగిన రౌడీలు తుపాకులు పేల్చారు. ఊరేగింపు ముందు వరుసలోవున్న దొడ్డి కొమురయ్యను మిస్కీనలీ గురిపెట్టి కాల్చిండు. ముందున్న దొడ్డి కొమురయ్య సోదరుడు మల్లయ్య మోకాలు నుండి తూటా దూసుకుపోయింది. కొమురయ్య ఉగ్రుడయ్యాడు. ముందుకు సాగాడు. గూండాలు కాల్పులు జరిపారు. తూటా కొమురయ్య పొట్టలో నుండి దూసుకు పోయింది. పేగులు బయటపడ్డాయి. ఆంధ్ర మహాసభకు 'జై' అని నినదిస్తూ ప్రాణాలు వదిలాడు. దొడ్డి మల్లయ్య, నేడివల్లి కొండయ్య సురిగెల్ల నర్సయ్య, కొరగల్ల సాయిలు, పడమటింటి అయిలయ్య దేశవల్లి లక్ష్మీనర్సీహ్మలతో సహా 20 మందికి గాయాలయ్యాయి. వారు నేల గూలి రక్తపు

మడుగులో కొట్టుకుంటున్నారు. సంఘం కార్యకర్తలు రౌద్ర రూపం దాల్చారు. "ఆంధ్ర మహాసభకు జై అని గడివైపు ఉరికింద్రు. రౌడీల గూండెలదిరినయ్. తలుపులు బిగించుకున్నారు. సంఘం నాయకులు ప్రజలను శాంతింప చేశారు. గడిచుట్టూ కాపలా బెట్టారు. గాయపడిన వాళ్ళను భుజాల మీద వేసుకొని జనగామ దవాఖానాకు తీసుకెళ్లారు. అప్పటికె దొడ్డి కొమురయ్య ప్రాణాలిడిచాడు.

ఈ వార్త తెలిసిన చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది ప్రజలు కడవెండి చేరారు. 1946 జూలై ఐదున వేలాది జనం ఊరేగింపుగా వెళ్ళి అమరజీవి దొడ్డి కొమురయ్య అంత్యక్రియలలో పాల్గొన్నారు. కొమురయ్య ఆశయ సాధన జరిగేదాకా విరమించేది లేదని ప్రతినపూనారు. విసుమారు దొర దుర్మార్గాలకు కడివెండి అర్థం పట్టింది. దొడ్డి కొమురయ్య అమరత్వం ఉద్యమానికి ప్రతీకలయ్యాయి.

"ఒక వీరుడు మరణిస్తే వేలకొలది ప్రభవింతురు. ఒక నెత్తుటి బొట్టులోనే ప్రళయాగ్నులు ప్రజ్వరిల్లు 'ఖబర్దార్ ఖబర్దార్ నిజాం పాదుషాహీ బానిసత్వం విముక్తికై హిందూ ముస్లిం పీడిత శ్రమజీవులు ఏకమైంది" అన్నాడు ఓ కవి.

రైతాంగ సాయుధ పోరాటయోధులకు ఉత్తేజం నింపేట్టుగా ఓ వాగ్గేయకారుడు స్మృతి గీతాన్ని రచియించాడు. వినండి.

'గొడ్లండ్లు నూరినారు గొంగండ్ల పెట్టినారు కారిన రక్తమంతా కడపల్లో నింపినారు చిలికిన రక్తమంతా సీసాల్లో నింపినారు నీ పాణం తీసిరి కొడుకో కడివెండి కొమురయ్య'

మరో తెలంగాణ కవి

'పోరుగడ్డ తెలంగాణ తెలంగాణ వీరమాత తెలంగాణ' అంటూ పల్లవి ఎత్తుకొని-'దొడ్డి కొమురయ్య పోరుగడ్డ తెలంగాణ' తెలంగాణ తెలంగాణ - అంటూ కొమురయ్య త్యాగాన్ని కీర్తించాడు.

మరో తెలంగాణ కవి

'అమర వీరుడవు నీవు కొమురయ్యా అందుకో జోహారు
కొమురయ్యా
న్యాయవంతంలేని నిజాం పాలనలో విశ్వ కంఠకమైన
ఇన్నూరు రాజ్యంలో
పాలించుచున్నాడు ప్రజల పాలిటి యముదు జానకమ్మ
కొడుకు రామచంద్రారెడ్డి
ప్రజల హక్కుల కోసం కొమురయ్యా ప్రాణాలు
విడిచావు కొమురయ్యా
అమర వీరుడవు నీవు కొమురయ్యా అందుకో జోహార్లు
కొమురయ్యా'

సామాన్యుడైన దొడ్డి కొమురయ్య అసామాన్యంగా పోరాడిన ఘట్టాన్ని ఏ జాతి పోరాటానికైనా స్ఫూర్తి కదా!

దేశంలో స్వాతంత్ర్యం కోసం పోరు సాగుతూ ఉంటే, నిజాం సంస్థానంలో విముక్తి పోరాటం సాగింది. ఒక ప్రతిఘటన, ఒక తిరుగుబాటు, ఒక విప్లవం అన్ని కలిస్తే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమైంది. ప్రజాస్వామ్య మంటే ఏమిటో తెలియని రోజుల్లో సామాన్యులు ఏకమై నిజాం పైశాచిక పాలనపై తిరగబడ్డారు. రెండు శతాబ్దాలపాటు ఎదురులేని పాలనకు మట్టి మనుషులు మరణ శాసనాన్ని లిఖియించారు. బడుగు బలహీన వర్గాల బలిదానాలు ఇక్కడే ఎక్కువ. తెలంగాణ విప్లవ చరిత్రలో దొడ్డి కొమురయ్య అమరత్వం ఓ ఉజ్జ్వల ఘట్టం. సైద్ధాంతికంగా ప్రారంభమైన ఉద్యమమెప్పుడు లక్ష్యాన్ని ముద్దాడుతుంది. తెలంగాణ సాయుధ పోరాటం వెనుకడు గేయక ప్రాణ త్యాగాలకుసైతం ముందుకురికి విజయ తీరాలను తాకింది. రాచరికపు కోటలను బద్దలుకొట్టి, తరాల నిరంకుశత్వాన్ని పాతరేసి, బానిస సంకెళ్ళను తెగ్గొట్టింది. బైరాన్‌పల్లి, గుండ్రాపల్లి, రాయికుడ్, అప్పంపల్లి లాంటి గ్రామాలలో 4 వేలమందిని ఊచకోత కోసిన రజాకార్ల గుండెల్లో గుబులు పుట్టించింది. ఆధునిక ప్రపంచ విప్లవ పోరాటాల్లో తెలంగాణ పోరాటం వియత్నాం యుద్ధమంతా పెద్దది. అంతేగాదు ప్రపంచ పోరాటాల చరిత్ర పుటల ఎక్కవల్సిన పోరాటంగా పేర్కొనాలి.

మదనపల్లి గ్రామంలో దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని జె.ఏ.సి. చైర్మన్ కోదండ రామ్ ఆవిష్కరించాడు. హన్మకొండ లో దొడ్డి కొమురయ్య స్మారక సంస్థ కొమురయ్య విగ్రహాన్ని ఆవిష్కరింపజేశారు. కొమురెల్లి మల్లన్న గుడి సందర్శించినప్పుడు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు కొమురయ్య భవనాన్ని హైదరాబాద్‌లో ఎకరం 20 గుంతల భూమిలో నిర్మిస్తామని ప్రభుత్వ గెజిట్‌లో ప్రకటన ఇస్తామన్నారు. తెలంగాణ సాయుధ పోరాటానికి తన ఊపిరిని ఎత్తుగా పెట్టి ప్రాణవాయువులూదిన దొడ్డి కొమురయ్య త్యాగాన్ని స్మరించుకోవడానికి చెప్పాల్సి ఉంది.

# 41 డోకూరు కోట్ల బాల బ్రహ్మచారి

– మావిశ్రీ మాణిక్యం

తెలుగు భాషకున్న ప్రత్యేక భాషాభూషణ అవధానం ఇది మన తెలుగు భాషకే సొంతమైన ప్రక్రియ. ఈ అవధాన ప్రక్రియను ఎందరో మహానుభావులు నిర్వహించారు. ఎంతో కీర్తి ప్రతిష్ఠలను సంపాదించారు. వారంతా సర్వాంగులు సుందర స్వరూపులు కీర్తి గడించడానికి ఏ లోపమూ లేనివారు కానీ అంగ విహీనమైవుండి, పుంభావ సరస్వతీ పుత్రుడై భాసిల్లిన ఓ నడయాడే విజ్ఞాన స్వరూపమా అన్నట్లు తెలంగాణములో ఉన్నాడా అనే విధంగా ఒకింత ఆశ్చర్యానికి గురి చేసే అంశం "సర్వేంద్రియానాం నయనం ప్రధానం" అనేది పెద్దల మాట అలాంటి నయనాలు లేని ఓ వ్యక్తి అవధానాలను అలవోకగా నిర్వహించాడంటే ఆశ్చర్యం వేయక మానదు.

కేవలం తన మనోనేత్రంతో చూస్తూ రెండువేలకు పైగా అవధానాలు చేసి మెప్పించారు వారు. అంతటి ఘనాపాటి తెలంగాణ మట్టిపై పుట్టి తిరుపతి వేంకట కవులకు ధీటుగా అవధానాలను నిర్వహించారంటే వారెంతటి ఘటికులో అర్థమవుతుంది. అలాంటి ఒక గొప్ప తెలంగాణ ముద్దుబిడ్డ, కవి పండితుడు అవధాన సరస్వతి అయిన బాలబ్రహ్మచారిని గుర్తుకు చేసుకోవడం ఎంతో గర్వించదగిన విషయం అని చెప్పాలి ఈనాడు. బాలబ్రహ్మచారి గారి తల్లి మోనాంబికా, తండ్రి అనంత రామాచార్యులు వారు మహా పండితులు, సకల కళావిశారథులు అట్టివారి పుత్రులే అవధాని బాలబ్రహ్మచారిగారు.

బాలబ్రహ్మచారి గారు మూడేళ్ళ ప్రాయంలో ఉన్నప్పుడే అనారోగ్యం బారిన పడి తన రెండు కళ్ళను కోల్పోయాడు. ఆయన ఎంతో స్ఫురద్రూపి, ఏక సంథాగ్రహి.

వీరి తండ్రిగారైన అనంతాచార్యులు వారే వీరికి స్వయంగా విద్యను బోధించారు. ఆయన సకల శాస్త్ర పారంగతుడు. జ్యోతిష్య, కావ్య, మీమాంస, వ్యాకరణ శాస్త్రాలలో నిష్ణాతులు గనక తన కుమారునికి మౌఖికంగానే విద్యాబోధన జరిపి జ్యోతిష్య, వ్యాకరణ, కావ్య శాస్త్రాదులలో, నిష్ణాతుడిగా తీర్చిదిద్దినాడు. క్రమంగా వారు విద్యాభ్యాస నంతరం ఇతిహాస కథలు, హరికథలు చెప్పటం ఆరంభించి చతుర్విధ కవితలు చెప్పడంలో ఆరితేరారు.

ఒకరోజు గద్వాల సంస్థానంలో సాహిత్యోత్సవాలు జరుగుతుండగా, అందులో పాల్గొనే అవకాశం బ్రహ్మచారి గారికి లభించింది. అదే ఉత్సవాల్లో శతావధాని కవి సింహ పోకూరి కాశీపతి అవధానిగారు అష్టావధానం చేస్తుండగా ఆ సభలోనే ఉండి అవధాన కార్యక్రమాన్ని ఆసాంతం విన్న బ్రహ్మచారి నేను కూడా అవధానం చేస్తానని నాకూ అవకాశం ఇప్పించండని కోరి తన ఆత్మ విశ్వాసాన్ని ప్రకటించారు. ఆ వెంటనే రాజావారు విని సంభ్రమంతో మీరు కూడా అవధానం చేయవచ్చని చెప్పి అవకాశం కల్పించారట. అదే అదనుగా అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నిర్విఘ్నంగా అష్టావధానాన్ని

ధైర్యంగా వచ్చి చేశారు. 32, అర్థాలు వచ్చేలా ఒక చమత్కార పద్యంలో మొదలుపెట్టారు.

తే.గీ.॥ శ్రీ పుభేభ్యుడు, హరిబుధార్చిత సదినుడు
పరమ హితకరుడజపద భ్రాజితుండు
కువలయ, విద్ధనుడ సమగోవు, సిద్ధు
డైన, భగవంతుడోము మమ్మాదరమున

అని శ్రీకారంతో ఆరంభించి దత్తపదితో ముందుకెళ్లాడు అల్లము, బెల్లము, పల్లము, బుల్లము (ఇవి దత్తపవి) అంశాలు ఇవ్వగా శ్రీ అవధానిగారు రామాయణార్థంలో ఎలా పూరించారో చూడండి.

"అల్ల ముకుందు దాశ్రిత బుధావళి నేలగ
రాముడై జనం
బెల్ల ముదంబు నొంది నుతియింప,
దురాత్ముల రక్తమర్విపై
బల్లము, మిఞ్జనేకమయి పాఱెడి,
యిట్లానరించి సతతం
బుల్లము, రంజిలన్, బుధుల నోమెనయోధ్య
పురాధినాధుడై"

అని పూరించి అందరి మెప్పును పొందారు. ఆ వెంటనే మరో పృచ్ఛకుడు లేసి, నాకో సమస్య ఉన్నది. నీ కోసమస్య ఉన్నది నీ సమస్యను నీవేమైనా చేసుకో కానీ నా సమస్యకు మాత్రం భారతార్థంలో చెప్పమనెను.

సమస్య : అంధత్వంబు పురాభవ గ్రదిత పుణ్యప్రాప్త మూహింపగ సమస్యను ఇలా పూరించాడు అవధాని.

శా॥ అంధత్వ స్థికమేమి, నాబ్రతుకునన్,
వ్యాసుండు దానినిట్లనెను
గాంధారీధవ యిట్లుగాని యెడ, దుష్కర్మ
ప్రపంచపు గో
దుంధాత్రిన్, గని,
కుందగావలసియుండున్గాని, నెంతేని నీ
యంధత్వంబు, పురాభవ ద్రదిత పుణ్యప్రాప్త
– మూహింపగాన్
అని పూరించిరి.

అలా అవధాన ప్రస్తానాన్ని మొదలుపెట్టి (2000) రెండు వేలకు పైగా అవధానాలు చేసి దేశవ్యాప్తంగా పర్యటించారు.

జైపూర్ సంస్థానం వరకూ వీరి యాత్ర కొనసాగించారు. అందులో భాగంగానే గద్వాల, వినపర్తి, ఆత్మకూరు, జటప్రోలు, దైవముదిన్నె మొదలైన సంస్థానాల్లో వీరు అవధానాలను నిర్వహించారు. అలాగే తిరుపతి, శ్రీశైలం, బ్రహ్మంగారి మఠం, మంగలగిరి, వేములవాడ, యాదగిరి గుట్ట, మున్నగు క్షేత్రాలలోగానూ, హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలందు, ఇంకా గ్రామాలు, పట్టణాలు ఎన్నింటిలోనో, రాష్ట్రము, రాష్ట్రేతర ప్రదేశాలలో యావద్దేశ మంతా పర్యటించి అవధానామృతాన్ని పంచిపెట్టారు వారు. పోయిన ప్రతిచోట వారికి ప్రశంసల జల్లులు కురిసినాయి. ఎన్నో సత్కారాలు, బిరుదులు, ధన కనక వస్తువులు బహుమానాలుగా అందినాయి. అందులో కొన్నింటిని ఇక్కడ ప్రస్తావిస్తారు.

గద్వాల సంస్థానం వారు "కవిరత్న" బిరుదతో సత్కరించారు తిరుపతి వాస్తవ్యులు – "చిత్రకవిత ప్రవీణ" అంటూ చమత్కరించారు. వరంగల్ పట్టణంవారు – ఆశు కవితా దురీణ అంటూ అక్కున చేర్చుకున్నారు.

మంగళగిరి మాన్యంవారు – 'కవిశేఖర' అని కీర్తించారు. రాజమండ్రి వారు – 'కవిశిరోభూషణ' – అని ఘనంగా పొగిడారు. జైపూరు పట్టణంవారు – 'అవధాన పంచాననా' అంటూ ఆనందంతో అందలమెత్తి ఊరేగించారు.

ఇలా అనేక పట్టణాలలో – అనేక విధాల కీర్తించి సత్కరించి ఆనందించారు అక్కడివారు. అంతేకాక వారికి స్వర్ణ కిరీటం, స్వర్ణకంకణాలు, స్వర్ణ పతకాలతో సత్కరించారు వారు.

బాలబ్రహ్మచారి గారు దివ్యాంగులైనప్పటికీ పెద్దవి, చిన్నవి కలిపి, మొత్తం 40 రచనలు చేసినారు. అందులో కొన్నింటి పేర్లను ఇక్కడ ప్రస్థావిస్తాను.

అవి:

1. నాగ్నజితి పరిణయం
2. మహేంద్ర గర్వభంగం
3. సుగుణ వర్మోపాఖ్యానం మొ॥లగు కావ్యాలను వారు రాశారు.

కొన్ని శతకాలను కూడా వెలువరించారు.

1. మన్నెంకొండ వెంకటేశ్వర శతకం
2. కొడంగల్ వెంకటేశ్వర శతకం
3. శంభులింగ ప్రభు శతకం
4. నామ లింగేశ్వర శతకం
5. శ్రీ రంగనాథ శతకం – వింటి శతకాలు రాసి శివ కేశవ తత్వాన్ని వారు తెలిపినారనవచ్చు
6. మౌన ప్రభు శతకం – ద్వారా వేదాంత జ్ఞానాన్ని వారు మనకందించినారనిపిస్తుంది. అలాగే
7. భారతీ శతకం – తో సరస్వతి మాతను అర్పించారు.

ఇంకా

వెంకటేశ్వర గీతావళి.<br>
బసవ నక్షత్ర మాలిక<br>
కలిమి – కొలిమి,<br>
వజ్రసూచి,<br>
చమత్కార దర్శిని గణితము,<br>
బహుళార్థ గీత పద్యము.

ఏకాక్షరీ, ద్వక్షరి, త్ర్యక్షరి, పంచాక్షరీ, సప్తాక్షరీ ఆకార, ఇకార, ఒకార, పద్యములను, అనులోమ విలోమ, పద్యములను, చమత్కార పద్యములను చిత్రబంధ కవిత్వమును, గర్భ కవిత్వమును. ఆశుకవిత్వము, ఆశు పద్యాల నెన్నింటినో చెప్పి తరువాతితరం అవధానులెల్లరకు గొప్ప మార్గదర్శనం చేసి గొప్ప ఖ్యాతిని ఆర్జించారు. శ్రీ బాల బ్రహ్మచారి గారు. ఇంకా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆజన్మాంతం గౌరవ వేతనం అందించినాయి. చివరికి వారు 1983 ఏప్రిల్ 8వ తేదీన యావత్ సాహితీ లోకాన్ని త్యజించి శివైక్యం చెందారు. తెలంగాణ జాతికి శాశ్వత కీర్తి నందించారు. మేరు నగ సమానంగా తెలంగాణ కీర్తిని, జాతి పతాకనెగరేసి తెలంగాణ వైతాళికులో ఒకరిగావించిరి. దీని తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రపంచ తెలుగు మహా సభలలో – వారూ ఒక వెలుగు కిరణమై వెలగడం యావత్ ప్రజలకే – అది గర్వకారణమని చెప్పవచ్చు.

# 42 ఎదిరె చెన్నకేశవులు

**- డా॥ భీంపల్లి శ్రీకాంత్**

పాలమూరు సాహిత్యంలో ఆణిముత్యాలనదగ్గ రచయితల్లో అగ్రగణ్యులు ఎదిరె చెన్నకేశవులు. కవిగా, కథా, నవలా, గేయ రచయితగా, జర్నలిస్టుగా, సంపాదకుడిగా, అనువాదకుడిగా, సహకార సంఘ ఉద్యమ నాయకుడిగా లబ్ద ప్రతిష్టులు. తెలంగాణ తొలితరం కథకుల్లో ప్రముఖంగా పేర్కొనదగినవారు ఎదిరె చెన్నకేశవులు.

మహబూబ్‌నగర్ పట్టణంలో ఆగస్టు 15, 1918న బాలకృష్ణమ్మ నారాయణమ్మ అనే దంపతులకు జన్మించారు. స్వయంకృషితో తెలుగు, ఆంగ్ల, ఉర్దూ భాషలలో తగు ప్రావీణ్యాన్ని సంపాదించారు. విద్యార్థి దశలోనే ఈ మూడు భాషలలో వెలువడు దినపత్రికలకు విలేకరిగా పనిచేశారు. సురవరం ప్రతాపరెడ్డి స్థాపించి గోలకొండ ద్వైవారపత్రికకు సహాయ సంపాదకులుగా పనిచేశారు. మిలాప్ హిందీ పత్రికకు ప్రతినిధిగా కూడా కొంతకాలం పనిచేశారు. నిజాం వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్నారు. పద్మశాలి సంఘం ప్రచురించే 'నేత' పత్రికకు సంపాదకులుగా వ్యవహరించారు. చేనేత సహకార సంఘం నిర్వహణలో ముఖ్యపాత్ర పోషించారు. సహకార సమాచారం పత్రికకు సహాయ సంపాదకులుగా వ్యవహరించారు. చేనేత రంగంలో విశేష కృషి సల్పిన వారి గురించి 'చేనేత ప్రముఖులు' అనే గ్రంథాన్ని వెలువరించారు. 'సహకార సహజీవనం' అనే వ్యాససంపుటిని వెలువరించారు.

ఎదిరె చెన్నకేశవులు మొదటగా గోపాలపేట సంస్థానం లోని హరిజన పాఠశాలలో ఉపాధ్యాయ వృత్తిని నిర్వహించి వారి అభ్యున్నతికై పాటుపడ్డారు. ఎంతోమంది నిరక్ష రాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దారు.

**కథారచయితగా**

తెలంగాణ తొలితరం కథల్లో లబ్ద ప్రతిష్టులు ఎదిరె చెన్నకేశవులు. ఆయన కథలు అనేక పత్రికల్లో ప్రచురిత మయ్యాయి. వీరి 'అభ్యుదయ రచయిత' అన్న కథ సుజాత పత్రికలో 1950లో మొదటగా అచ్చయింది. అనంతరం రాసిన తొమ్మిది కథలతో 'పొట్టకోసం' అనే కథాసంపుటిని 1968లో వెలువరించారు. ఇందులో పర్యవసానం, కూలి వెంకన్న, ప్రతిఫలం, పొట్టకోసం, సహవాసం, ఉగాది, కార్మికులదే గెలుపు, నీ కోసం, గుణపాఠం వంటి కథలున్నాయి.

**పర్యవసానం**

పొట్టకోసం కథా సంపుటిలో మొదటి కథ పర్య వసానం. ఈ కథలో రూప అనే అమ్మాయి డ్రామా ఆర్టిస్టుగా, ప్లే బ్యాక్ గాయకురాలిగా పనిచేస్తుంది. చంద్రహాసన్ అనే మేకప్‌మెన్ ఆమెను లోబర్చుకోవాలనుకుంటాడు. ఆమె చంద్రహాసన్‌ను తిరస్కరిస్తుంది. చంద్రహాసన్ రూపపై పగ సాధించడానికి ఆమెను పతిత అని దుష్ప్రచారం చేస్తాడు. అవమానాలు తట్టుకొని ప్రేమించిన వాడితో చివరికి పెళ్ళి

జరుగుతుంది. ఈ కథలో రూప పాత్రను రచయిత తెలిసీ తెలియని వారితో స్నేహం చేస్తే దాని పర్యవసానం ఎలా ఉంటుందో చిత్రించారు.

**కూలీ వెంకన్న**

రెండవ కథ కూలీ వెంకన్న. ఈ కథలో మేస్త్రీలు కూలీలను ఎంత హింసకు గురిచేసి స్త్రీలను ఎలా పాడుచేశారో ఇందులో రచయిత వివరించారు. కూలీ వెంకన్న పాత్ర ద్వారా కూలీల జీవనస్థితిని చిత్రించారు. ఇందులోని లక్ష్మి పాత్ర ద్వారా ఆడకూలీల దయనీయమైన జీవనాన్ని మనకళ్ళకు కట్టించారు. ఈ కథలో వెంకన్న పాత్ర ద్వారా కూలీల జీవన స్థితిని ఈ కింది సంభాషణలో చూపించారు. ఈ పాడులోకంలో కూలీ చేసుకొని బతికే వారికి గౌరవమే లేదు. ధనంతోనే బీదల మానమర్యాదలను కొల్లగొట్ట జూస్తారు పెద్దలు. అందుకే మాకీ ప్రపంచంలో తావు లేదు, సుఖములేదు. ఎప్పటికీ కష్టజీవులమై కాలం గడుపుతుంటామనే వాస్తవాన్ని చెప్పారు.

**ప్రతిఫలం**

మూడవ కథ ప్రతిఫలం. ఈ కథలో డబ్బుతో దేవున్ని పూజించడం కన్న సమాజహిత కార్యక్రమాలకు ఆ డబ్బును ఉపయోగించడం మంచిదన్న విషయాన్ని తెలిపారు.

**పొట్టకోసం**

నాల్గవ కథ పొట్టకోసం. ఈ కథలో ప్రపంచంలో పొట్టకోసం వేశ్యలు ఏ ఏ పాట్లు పడతారో యమున పాత్ర ద్వారా చక్కగా చిత్రించారు. వేశ్యల జీవన విధానాన్ని కళ్ళకు కట్టినట్లు చూపించారు. వేశ్యాగృహాలలో ఉండే వాతావరణాన్ని సహజసిద్ధంగా చిత్రించిన కథ ఇది.

**సహవాసం**

ఐదవ కథ సహవాసం. మంచి, చెడు సహవాసాల వల్ల ఎలాంటి పరిణామాలుంటాయో ఈ కథ ద్వారా రచయిత తెలిపారు. ఇందులో మంచి సహవాసం వల్ల జీవితం ఎలాంటి మలుపులు తిరిగిందో లలిత, శ్యామల పాత్రల ద్వారా చూపించారు. చెడు సహవాసం వల్ల కలిగే అనర్థాలను లీల పాత్ర ద్వారా చిత్రించారు. గొప్ప స్నేహితురాళ్ళ కథ ఇది. స్నేహం విలువను చాటిన కథనమిది.

**కార్మికులదే ఈ గెలుపు**

ఆరవ కథ కార్మికులదే ఈ గెలుపు. ఈ కథలో కార్మికుల జీవనవ్యథలను చిత్రించారు. ఐకమత్యంతో కార్మికులందరూ ఉంటే ఎలాంటి విజయాన్నైనా సాధించవచ్చనే భావాన్ని తెలిపింది ఈ కథ.

**గుణపాఠం**

ఏడవ కథ గుణపాఠం. ఈ కథలో మేరి పాత్ర ద్వారా స్త్రీలు సౌందర్యం కోసం వెచ్చించే డబ్బునంతా పొదుపు చేస్తే సుఖవంతమైన జీవితం ఎలా గడపవచ్చనే అంశాన్ని చాలా సున్నితంగా తెలిపారు.

**మొదటి తేది**

ఎనిమిదవ కథ మొదటి తేది. ఇందులో ప్రతీ ఉద్యోగికి మొదటి తేది వస్తుందనగానే ఒక దిక్కునుండి ఆశ, రెండవ దిక్కునుంచి నిరాశ ఆవహిస్తుంది. ఆశ ఎందుకంటే నెలరోజులు చమటోడ్చి శ్రమ చేసిన దానికి ప్రతిఫలంగా డబ్బు లభిస్తుంది. అది తన కుటుంబపోషణానికి సరిపోని, సరిపోకపోనీ తనకు ఆనాడు అందితే చాలు. ఉద్యోగి ఆనందానికి అంతే ఉండదు. మరుసటి రోజు కలిగే ఆర్థిక చిక్కులకు తట్టుకోలేక ఎందుకీ మొదటి తేదీ వచ్చిందిరా దేవుడా?! అని నిరాశతో వాపోతాడు ప్రతి ఉద్యోగి అనే గొప్ప భావాన్ని ప్రదీప్ పాత్ర ద్వారా అద్భుతంగా చిత్రించారు. ఈ కథను ఎదిరె చెన్నకేశవులు అతి సహజాతి సహజంగా రచించడం విశేషం.

**నవలా రచయితగా**

ఎదిరె చెన్నకేశవులు కథకుడిగానే కాకుండా నవలా రచయితగా కూడా పేరెన్నికగన్నవాడు. తొలి తెలంగాణ డిటెక్టివ్ నవలారచయితగా ఎదిరె చెన్నకేశవులు లబ్ధ ప్రతిష్టులు. వీరి అదృశ్యహస్తం నవల తొలి తెలంగాణ అపరాధ పరిశోధక నవల. ఇది నేత వారపత్రికలో ధారావాహికంగా వెలువడి ప్రజాదరణ పొందింది. దొంగ, హంతకుడు అయిన భయంకర్ బారి నుంచి అతని

మేనమామ కూతురును డిటెక్టివ్ మోహన్ కాపాడడం ఇందులోని ఇతివృత్తం. వీరి మరో నవలలు పొట్టకోసం, పతిత ఈ రెండూ సాంఘిక నవలలు.

అదృశ్యహస్తం అపరాధ పరిశోధక నవల. నేత వారపత్రికల్లో 1967లో ధారావాహికంగా ప్రచురితమైంది. 1969లో పుస్తక రూపంలో వెలువడింది. ఇది సీరియల్‌గా వస్తున్నప్పుడే పాఠకుల మన్ననలను పొందింది. అపరాధ పరిశోధక నవలకు ఉండవలసిన లక్షణాలన్నీ ఈ నవలలో ఉన్నాయి. ఎప్పటికప్పుడు ఏమి జరుగుతుందనే ఉత్కంఠ ఈ నవలలో అడుగడుగున తొంగి చూసింది.

ఈ నవలలో అపరాధ పరిశోధకుడు మోహన్, కథానాయకుడు భయంకర్. ఇతడు అనేక దొంగతనాలు, దోపిడీలు హత్యలు చేయించిన పచ్చి దొంగ. తనకు జరిగిన అన్యాయానికి ప్రతీకారంగా భయంకర్ ఇటువంటి హత్యలు, దోపిడీలు చేస్తుంటాడు. భయంకర్ తన మేనమామ కూతురు పద్మ అనే అమ్మాయిని ప్రేమించి పెళ్ళి చేసుకోవాలనుకుంటాడు. అది జరగకపోవడంతో పద్మను ఎత్తుకపోయి చెరపట్టి వివాహ చేసుకోవడానికి ప్రయత్నిస్తాడు. ఇదే ఈ నవలలోని ప్రధానమైన ఇతివృత్తం. పద్మను కాపాడడానికి డిటెక్టివ్ మోహన్ వేసిన ఎత్తుడగ ఎలాంటిదో ఈ నవల చదివితే తెలుస్తుంది. అయితే భయంకర్ పద్మ తనను ప్రేమిస్తుందనే తపనతోనే ఆమెను ఎత్తుకుపోతాడు. కానీ, డిటెక్టివ్ మోహన్ ఆమెను రక్షిస్తాడు.

రచయిత ఈ నవలలోని భయంకర్ పాత్రను జాలి కలిగేటట్లు చిత్రించారు. ఎన్ని దుర్మార్గాలు చేసినా కూడా అతనిని పాఠకులు ఎవ్వరూ అసహించుకోలేరు. అలా ఆ పాత్రను రచయిత తీర్చిదిద్దారు. ఒక విలన్‌ను జాలిగొలిపేటట్లు పాత్రను సృష్టించడం రచయిత నేర్పును తెలియజేస్తుంది.

ఈ నవలలో అరణ్యంలోని రహస్యగుహలు, పాతాళ గుహలు, ముసుగు మనుషులు మొదలైనవాటిని రచయిత కళ్ళకు కట్టినట్లుగా ఆవిష్కరించారు. ఇందులోని ముగింపు కూడా విభిన్నంగా ఉంటుంది. సహజంగా అపరాధ పరిశోధక నవలల్లో డిటెక్టివ్ అసిస్టెంట్ పెళ్ళితో కథ ముగుస్తుంది. కానీ ఇక్కడ మోహన్ కుమార్తె వివాహంతో ఈ నవల ముగించడం విశేషం. డిటెక్టివ్ నవలకు ఉండవలసిన అన్ని హంగులతో ఈ నవలను ఎదిరె చెన్నకేశవులు ఎంతో నేర్పుతో రచించారు.

ఎదిరె చెన్నకేశవులు రచించిన రెండవ నవల పొట్టకోసం. ఈ నవల 1969లో ప్రచురించబడింది. ఈ నవలలోని ప్రధాన ఇతివృత్తం గ్రామీణ ప్రజలు పట్టణాలకు వలసపోయి ఎలా జీవిస్తున్నారే అంశంగా దీనిని రచించారు. మొదటిసారిగా నగరంలోకి వలస వచ్చిన వారి జీవితాలను రచయిత అద్భుతంగా ఆవిష్కరించారు. ఇందులో మురికివాడల్లో నివసించే దృశ్యాలు మనకు కన్నీళ్ళను పెట్టిస్తారు. ఈ నవల అతి సహజాతిసహజంగా వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించే విధంగా రచించడం విశేషం. పొట్టకోసం ఎంత దూరమైనా, ఎలాంటి పనికైనా వెళ్ళడానికి గ్రామీణులు సాహసిస్తారనే వాస్తవాన్ని ఈ నవలలో రచయిత చిత్రించారు.

రచయిత మూడవ నవల పతిత. ఇది 1970లో సహకార సమాచారం అనే వారపత్రికలో సీరియల్‌గా వెలువడింది. ఒక సినిమా నటి జీవితాన్ని ప్రతిబింబించే విధంగా ఈ నవల రాయబడ్డది. ఆ నటి పేరు రమ్య. ఆమెకు సినిమాలలో నటించాలనే ఆసక్తి ఉంటుంది. సినిమాలలో చిన్నచిన్న క్యారెక్టర్ ఆర్టిస్టుగా నటిస్తూ అందరితో సరదాగా ఉంటుంది. తను పతిత కాకపోయినా పతిత అని ముద్ర పడుతుంది. దీంతో ఆమెను ఎవరూ పెళ్ళిచేసుకోవడానికి ముందుకు రారు. తోటి నటీనటులు హేళనగా మాట్లాడడం చూసి ఆ రంగం నుంచి బయటపడి సుఖవంతమైన జీవితాన్ని గడుపుతుంది. ఇందులోని ప్రధాన ఇతి వృత్తమిదే.

**జర్నలిస్ట్‌గా**

గోలకొండ పత్రికలో చెన్నకేశవులు పనిచేస్తున్నప్పుడే ఆనాటి నిజాంకాలం నాటి ప్రజల పరిస్థితుల గురించి, గ్రంథాలయోద్యమం గురించి మొదలైన అంశాలపై గోలకొండ, నేత వంటి పత్రికలలో పలువ్యాసాలను ప్రచురించారు. జర్నలిస్టుగా, రచయితగా ఎంతో పేరు సంపాదించుకున్న ఎదిరె చెన్నకేశవులు ఆంధ్ర సరస్వత పరిషత్ మహబూబ్‌నగర్‌జిల్లా కార్యదర్శిగా, ఆంధ్రమహాసభ జిల్లా సంయుక్త కార్యదర్శిగా, రాష్ట్ర గ్రంథాలయ సంఘ వ్యవస్థాపక కార్యదర్శిగా, హైదరాబాద్ కేంద్ర చేనేత సహకార

సంఘానికి ప్రధాన వ్యవస్థాపకుడిగా పలుసేవలను అందించారు. హైదరాబాద్ రాష్ట్ర చేనేత ఉద్యమ ముఖ్యనాయకులలో ఒకరుగా, సర్వోదయ కార్యకర్తగా ప్రజోద్యమ నాయకుడిగా, వివిధ సంస్థల బాధ్యుడిగా పనిచేసిన నిరంతర శ్రమజీవి.

సహకార సమాచారం మాసపత్రిక నిర్వహించిన సహకారోద్యమ వ్యాసాల పోటీలలో పాల్గొని వరుసగా మూడు సంవత్సరాలు బహుమతులను అందుకున్న ప్రజ్ఞావంతులు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి వారు తయారు చేసిన చేనేత పదకోశంకు ఊరూరా తిరిగి చేనేత పదాలను సేకరించారు. నవల, కథ రచనలో వీరికి అడివి బాపిరాజు స్ఫూర్తిగాగ, జర్నలిజంలో సురవరం ప్రతాపరెడ్డి మార్గదర్శకులు.

**గేయకవిగా**

ఎదిరె చెన్నకేశవులు గేయకవిగా కూడా ప్రసిద్ధులు. వీరు రాసిన పలు గేయాలను 'అర్పణ, అందరి గొడవ' పేర్లతో తీసుకొచ్చారు. అయితే అర్పణ అనువాద గేయ సంపుటి. 'నన్నిలా ఉండనీ' అనే వచన కవితా సంపుటిని కూడా చెన్నకేశవులు రచించారు.

అయితే ప్రసిద్ధ ఉర్దూ కవయిత్రి శ్రీమతి బాను తాహరా సయీద్ బేగం ఉర్దూ భాషలో రాసిన గేయ సంపుటి అనువాదమే ఈ అర్పణ. బాను తాహరా సయీద్ బేగం హైదరాబాద్‌లో ప్రసిద్ధి గాంచిన ఉర్దూ కవయిత్రి. పలు కవిసమ్మేళనాలలో పాల్గొని తన రసకవితాధారలను విరజిమ్మింది. భగవాన్ శ్రీ సత్యసాయిబాబా పరమభక్తురాలు. బాబా భక్తబృందంలో ఈమె ఒకరు. సత్యసాయిబాబా భక్తి భావంతో ఆమె ఎన్నో మధురగేయాలను రచించారు. ఈ అర్పణ గేయ సంపుటిలో ఎక్కువగా సత్యసాయిబాబా మీద రాసిన గేయాలున్నాయి. గజల్, నజమ్ ఫక్కీలలో ఈ గేయాలను రచించారు. వివిధ భక్తులలో ఆత్మ నివేదక ఒకటి. భాను తహరా ఆత్మ నివేదనకు అక్షరరూపమే ఎదిరె చెన్నకేశవులు అనువదించిడం విశేషం. ఈ అర్పణలో మొత్తం 26 గేయాలున్నాయి. ఎదిరె చెన్నకేశవులు మూలంలోని భావాలను యధాతథంగా అనువదించడం విశేషం. ఈ గేయాల్లో సత్యసాయిబాబాను స్మరిస్తూ, స్తుతిస్తూ, ప్రశంసిస్తూ రాసిన గేయాలు హృదయానికి హత్తుకునేలా ఉన్నాయి. ఇందులోని హృదయవాణి, మధుర దృష్టి, చింత ఏలా?, వెన్నెల రాత్రి, మనమిద్దరం, నా ఆకాంక్ష, స్మరణ, గురుపూర్ణిమ, నిరీక్షణ, కానుక మొదలైన గేయాలు వేటికవి భిన్నంగా ఉండి మనలను రసఝరిలో ప్రవహింపజేస్తాయి. ఆనందడోలికలో విహరింపజేస్తాయి. ఆ భక్తిధార కవితా మాధురిలో మనమూ కొట్టుకుపోతాము.

ఈ గేయాల్లో సర్వసంగ పరిత్యాగి అయిన సత్యసాయి బాబా మధుర భాష శ్రవణం, దివ్యరూప స్మరణంల గురించి రాసిన గేయాలు రచయిత భక్తి తత్పరతను తెలియజేస్తాయి.

' నా ప్రాణదాతవు నీవే
నా హృదయ మూర్తివి నీవే'

అంటూ తన సర్వస్వం బాబానే అంటూ కీర్తిస్తారు.

భగవంతుడితో భక్తుడు తన నివేదనను ఆర్తితో పలికిన గేయాలెన్నో ఇందులో ఉన్నాయి. భగవంతుడిని ఒక మిత్రుడిగా, ప్రేమికుడిగా, సన్నిహితుడిగా భావించి రాసిన గేయాలు మనకు రవీంద్రనాథ్ ఠాగూర్ గీతాంజలిని తలపిస్తుంది. మొదటి గేయం హృదయవాణిలో

తారల్లో నిను చూచి తారసిల్లాను
వసంతంలో వెదకి వసుధ గాంచాను
నీ చూపు నా చూపు కలిసినప్పటి నుండి
నేనెచట నుంటినో నే నెరుగనైతి

అనుభూతి ప్రధానంగా రచించబడ్డ ఆత్మాశ్రయ గేయమిది. ప్రేమకు ప్రతీకగా ఈ గేయరచన సాగింది. భగవంతుడిని స్నేహితుడిగా భావిస్తూ రాసిన గేయం అత్యంత స్నేహ మధురిమను వెల్లడిస్తుంది.

నా హృదయమెంతో కలవరపడుచున్నది నేస్తం
నా హృదయ స్పందన శబ్దం నీ చెవిలో
గింగురుపమనలేదా నేస్తం
నా ఏకాంతం నా దుఃఖం
నా ఆందోళన నీకు తెలియనివికావు

అంటూ హృదయం పడే ఆవేదనను ఈ గేయంలో ఎదిరె చెన్నకేశవులు భావుకతతో వెల్లడించి మన మనసులను దోస్తారు. వెన్నెల రాత్రిని వర్ణిస్తూ చెప్పిన గేయం విరహగీతికను తలపిస్తుంది.

ఎంతో మనోహరమైనదీ వెన్నల రాత్రి
ఎంతో భారమైనది, నీవు లేని ఈ రాత్రి
ఉదయాన్నే నీ దర్శనభాగ్యం లభిస్తుందని
రాత్రంతా గడిపాను ఆశతో నీ కోసమని

సహజంగా వెన్నెల రాత్రి మనోహరంగానే ఉంటుంది. కానీ, నీవు లేని రాత్రి భారంగానే ఉంటుందని చెప్పిన తీరు ప్రేయసీ ప్రియుల ప్రేమకు పరాకాష్టగా నిలిచిపోతుంది.

ప్రశాంతి నిలయంలో ప్రతి సంవత్సరం దసరా ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని రాసిన గేయం.

స్వయం ప్రకాశ స్వరూపడొస్తున్నాడు
పలుదిశ సంతసము వెదజల్లుతున్నాడు
ముసిముసి నవ్వులతో పుష్పమాల రాలుస్తు
గంభీరముతో ప్రేమమూర్తి వస్తున్నాడు

అంటూ సత్యసాయిబాబాను స్వయంప్రకాశ స్వరూపుడిగా భావిస్తూ చెప్పిన ఈ గేయం బాబా మూర్తి మత్వాన్ని వెల్లడిస్తుంది.

ఇంకా ...

నీ ఉపదేశాలే ప్రేమను నేర్పాయి. నాకు ఈ ఇల
నీ సందేశాలే నాలో జీర్ణించాయి ఈ ఇల

అంటూ సత్యసాయిబాబా ఉపదేశాలు ఎలా ఉంటాయో చెప్పకనే చెప్పారు. ఇందులో సత్యసాయిబాబా పలుకుల కోసం యావత్ ప్రపంచం అంతా ఎదురు చూస్తుందంటే అతిశయోక్తి కాదు. ఆయన దర్శనభాగ్యం కలగడమే జన్మ ధన్యమైనట్లుగా భావిస్తారు భక్తులు. అలాంటి సత్యసాయి మీద రాసిన ఈ గేయాలు అందరినీ ఆకట్టుకుంటాయి. ఎదిరె చెన్నకేశవులు చక్కని అనువాదానికి నిదర్శనం ఈ అర్పణ గేయ సంపుటి కావ్యం.

# 43 ఈశ్వరీబాయి

– డా॥ ముక్తేవి భారతి

ఈశ్వరీబాయి గారి జీవిత విశేషాలు వింటుంటే, ఒకనాడు భర్తృహరి చెప్పిన సుభాషితం గుర్తొస్తుంది.

ఒకటి నేలను నొకటి నొప్పారు పూసెజ్జపై ఒకటో శాకమువారణించు, ఒకటి ఉత్కృష్ణ శాల్యోదనం, ఒకటి బొంత ధరించు – ఇలా చెప్పి, కార్యసాధకుడు దుఃఖాన్ని సుఖాన్ని లెక్కపెట్టడు. అతని లక్ష్యం కార్యసాధన మాత్రమే. ఇది ఈశ్వరీబాయి గారిపట్ల సార్థకమైందని చెప్పాలి.

ఈశ్వరీబాయిగారి జీవిత చరిత్ర రాసిన ఎం.ఎల్. నరసింహారావు గారు "సాహసమూర్తి జె. ఈశ్వరీబాయి" అన్నారు.

"ఎక్కడ ఏ మూల ఏ అన్యాయం జరిగినా పలు వేదికలపై నుండి సుమారు అర్ధశతాబ్ది క్రితం వాటిని ప్రభుత్వ దృష్టికి తెచ్చి పరిష్కారాలు డిమాండు చేసిన ఏకైక "యాంగ్రీయంగ్ ఉమెన్ లీడర్" జె.ఈశ్వరీబాయి అన్న సుప్రసిద్ధ సీనియర్ జర్నలిస్టు టి.ఉదయవర్లు గారు ఈశ్వరీబాయి ఒక వాక్చిత్రం' అన్నారు. ఇవన్నీ ఈశ్వరీబాయి వ్యక్తిత్వంలోని విశిష్టలను చాటి చెబుతాయి.

1918లో డిసెంబరు ఒకటవ తారీఖున ఈశ్వరీబాయి సికింద్రాబాద్‌లో ఒక సామాన్య దళిత కుటుంబంలో జన్మించారు. తండ్రి బలరామస్వామి సికింద్రాబాద్ చిలకల గూడలో వుంటూ, రైల్వే ఉద్యోగిగా జీవితం సాగించారు. తల్లి రాములమ్మ.

ఈశ్వరీబాయి విద్యాభ్యాసం ఎస్.పి.జి. మిషన్ పాఠశాలలో తర్వాత కీస్ హైస్కూలులో సాగింది. ఈశ్వరీబాయిది బాల్యవివాహం. పదమూడేళ్ళకే వివాహ మయింది. భర్త దంత వైద్యుడు జె. లక్ష్మీనారాయణ. వారికి ఒక కూతురు గీతారెడ్డి, వైద్యురాలు, రాజకీయవేత్త.

ఈశ్వరీబాయి వైవాహిక జీవితం విచ్ఛిన్నమయినా, కృంగిపోలేదు ఈశ్వరీబాయి. ఆత్మస్థైర్యంతో జీవితాన్ని ఎదుర్కోవాలని నిశ్చయించింది.

సికింద్రాబాద్‌లో ఒక పాఠశాల దాన్ని సీతమ్మ పాఠశాల అనేవారు. ఆర్య సమాజ నాయకుడు శ్యామలరావు గారు వారి తల్లి పేరున పెట్టిన పాఠశాల అది. ఈశ్వరీబాయి అందులో ఉపాధ్యాయురాలిగా పని చేశారు. సంపన్నుల కుటుంబాలలోని పిల్లలకు ట్యూషన్లు చెప్పారు. ఈశ్వరీబాయి బహు భాషా కోవిదురాలు, తెలుగు, హిందీ, ఇంగ్లీషు, ఉర్దూ, మరాఠీ భాషలు వచ్చు.

ఈశ్వరీబాయి జీవితంలో గొప్ప మలుపు, సాంఘిక దురాచారాలతో అణగారిపోతున్న వారిని ఆదుకోవాలనే సంకల్పమే. అదే సమయంలో, ఆమెపై గాంధీ, అంబేద్కర్‌ల ప్రభావం చూపబడింది. ఆ ప్రభావం ఈశ్వరీబాయి జీవితాన్ని అభ్యుదయ మార్గంవైపు నడిపించింది.

అంబేద్కర్ ఉపన్యాసాలు ఈశ్వరీబాయి మనసుపై ముద్ర వేశాయి. దళిత జాతుల సముద్ధరణకి కృషి చేయాలని బద్ధకంకములయ్యారు. అంబేద్కర్ చేసిన పోరాటాలు దళిత హక్కుల విషయంలోనూ, భారత రాజ్యాంగ రచనలోని ఆయన అభిప్రాయాలు ఈశ్వరీబాయిలో గొప్ప ప్రేరణ కలిగించాయి.

అంబేద్కర్ ఉపన్యాసం ఒకటి ఈశ్వరీబాయిలో గొప్ప చైతన్యాన్ని కలిగించింది. "నేను జాతిలో జన్మించి పెద్దవాడినై, జీవనయాత్ర సాగిస్తున్నానో, ఆ దళిత ప్రజల సంక్షేమానికి, అభ్యున్నతికి నా జీవితం ధారపోస్తాను. నా ఈ న్యాయ సమ్మతమైన మార్గం నుంచి నన్ను యే దుష్టశక్తులు, ఏ విమర్శలూ మళ్ళించలేవు. నన్ను ఒక్క అంగుళం కూడా కదల్చలేరు" అని అంబేద్కర్ అన్న మాటలు ఈశ్వరీబాయి జీవితానికి ఆదర్శప్రాయమయ్యాయి.

ఈశ్వరీబాయి రాజకీయ జీవితంవైపు అడుగులు వేసి, ముందు తరాలకి ఒక బాట వేశారు. భారతదేశంలోని బలహీన వర్గాలు, అట్టడుగున పడివున్న పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాజకీయాల్లో ప్రవేశించారు. సమాజంలోని హెచ్చు తగ్గులు, దారిద్ర్యం, మూఢ నమ్మకాలు, ఛాందస అచారాలు చూస్తున్న ఆమెకు చాలా ఆవేదన కలిగేది. ఒకనాటి మహనీయులైన సంఘ సంస్కర్తల ఆశయాలు ఆదర్శాలు సఫలమవ్వాలని ఆమె ఆశించేవారు.

ఈశ్వరీబాయి చిలకలగూడ వార్డు (సీతాఫల్‌మండి) నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు ఆమెకు రాజకీయాల ప్రవేశం అదే మొదలు ఆమెకు ఏ బలమూలేదు గెలవడానికి ఒక్క ఆత్మబలం తప్ప. పురపాలక సంఘ సభ్యురాలిగా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తూ, ఇంటింటికి తిరిగి ఓట్లు వేయమని కోరారు. మురికివాడల్లో, దళిత వర్గాలు కార్మికులు నివసించే వీధుల్లో ఆమె తిరిగి అందరినీ కలిశారు.

ఈశ్వరీబాయి గెలుపు ఆమె జీవితంలోనే పెద్ద గెలుపైంది. రాజకీయాల్లో అది తొలి అడుగే అయినా, నిజాయితీతో, సేవా భావంతో దళిత ప్రజల విముక్తి పోరాటానికి ఆమె బద్ధకంకణురాలయ్యారు. ఆ దీక్షతోనే ఆమె ప్రజాసేవా రంగంలో అడుగుపెట్టారు.

ఈశ్వరీబాయి పురపాలక సంఘ సభ్యురాలై నగర పురోభివృద్ధికి కృషి చేయడమేకాక ఎన్నో సంస్థలలో సభ్యురాలై, సేవా కార్యక్రమాలు చాలా చేశారు. మురికివాడల్లో మంచినీటి నల్లాలు వేయించటం, వీధి దీపాలు పెట్టించటం, పొట్ట కూటికై నగరానికొచ్చిన బీదలకు ఇళ్ళ స్థలాలు ఇప్పించటం మొదలైన సేవా కార్యక్రమాలు బాధ్యతగా జరిపించారు.

ఆనాటి పెద్దలు అనుభవజ్ఞులు అయిన మాడపాటి హనుమంతరావుగారు, వెంకటరామరెడ్డి గారు, సీతయ్య గుప్తా గారు మొదలైన మహనీయులను ఘటిస్తూ, వారి నుంచి ఎన్నో ఆదర్శప్రాయమైన అంశాలు తెలుసుకునేవారు.

ప్రముఖ నగరాలైన బొంబాయి, నాగపూర్‌లో జరిగే షెడ్యూలు కులాల ఫెడరేషన్ సభలలో పాల్గొని, అంబేద్కర్ ఆశయసిద్ధికై కృషి చేయాలనే పట్టుదల వుండాలని ఆమె ప్రచారం చేసేవారు.

1967లో జరిగిన సాధారణ ఎన్నికలలో ఈశ్వరీబాయి రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా ఎన్నికయ్యారు. ఆమె బడుగు బలహీన పక్షాన నిలిచి, వారి న్యాయమైన కోర్కెలకై పోరాడుతానని వారికి ధైర్యమివ్వటమే ఆమె గెలుపునకి కారణం.

ఈశ్వరీబాయి వ్యక్తిత్వం మహోన్నతమైంది. అందరి సమస్యలు, బాధలు తనవిగా భావించే సహృదయురాలు.

పరిపాలనా సంస్కరణల సందర్భంగా ఈశ్వరీబాయి లోనే అభిప్రాయాలు నిర్భయంగా చెప్పేవారు. ప్రజలనుంచి వచ్చే విజ్ఞప్తులు, దరఖాస్తులు, ఫిర్యాదులు కనీసం అవి అందినట్టు జవాబైనా పంపించే నాథుడు లేడు అంటే ఉద్యోగబృందం యొక్క నిర్లక్ష్యవైఖరి తేటతెల్లమవుతోంది. సాధారణ పౌరుడికి అందుబాటులో వుండే వ్యవస్థ కావాలి. నియమ నిబంధనలు సులభతరం చేయాలి. ప్రభుత్వం రూపొందించే నియమాలు నిబంధనలు ప్రజోపయోగము నకుకాని, ప్రజలను బంధించడానికి తప్పులు పట్టడానికి కాదనే సత్యాన్ని బ్యూరోక్రసీ గుర్తించాలని నేను కోరుతున్నాను. (సాహసమూర్తి, జె. ఈశ్వరీబాయి - ఎం.ఎల్. నరసింహారావు).

విద్యారంగంపై దృష్టి సారించారు. విద్యా ఒక వ్యాపారంగా మారిపోయిందని, పేదవారికి డొనేషన్లు కట్టే

స్థితిలేక, ప్రభుత్వ పాఠశాలల్లో, బోధనాపద్ధతి బాగాలేకున్న, అక్కడే చేరుస్తున్నారు. పిల్లలతరపు ఆవేదన వ్యక్తం చేశారు.

భూసంస్కరణ సందర్భంగా తీవ్రంగా విమర్శించారు ఈశ్వరీబాయి. 'అభ్యుదయ వాదులు, ప్రగతిశీలురమని చెప్పుకునే నాయకులు తమ ప్రగతి శీలభావాలను మాటల్లోకాక చేతల్లో చూపాలి' అన్నారు.

మహిళా సంక్షేమం గురించి చాలాసార్లు శాసనసభల్లో మాట్లాడారు. మహిళా సంక్షేమ శాఖలో జరిగే అక్రమాలను నిరభ్యంతరంగా విమర్శించేవారు. గ్రామ సేవకుల ఉద్యోగాలను పర్మినెంటు చెయ్యాలని, సీనియారిటీ తెలిపే రికార్డులు, ఉద్యోగ సర్వీసు పుస్తకాలు సరిగాలేవని, "డైరెక్టర్‌గారి దయాదాక్షిణ్యాల మీద యావత్ సిబ్బంది ఆధారపడివుండడం అత్యంత సోచనీయమన్నారు. షెడ్యూలు కులాల విద్యార్థుల వసతి గృహాలు సరిగా నడవటంలేదని గుర్తించారు. 'అధికార పార్టీకి చెందిన వారికే ఈ వసతి గృహాల నిర్వాహకులుగా నియమించటం జరుగుతోందని, నిజాయితీ సేవా భావంతో పనిచేసేవారిని మేనేజర్లుగా నియమించాలని, అప్పుడే ప్రభుత్వ పథకాలు విజయవంతం అవుతాయన్నారు.

ఈశ్వరీబాయి తెలంగాణా ఉద్యమాన్ని బలపరిచి తెలంగాణా ప్రజాసమితి కార్యవర్గ సభ్యులుగా ఉన్నారు.

ఈశ్వరీబాయి గొప్ప వక్త. గొప్ప కార్యదక్షురాలు. సేవాతత్పరత, పేదలపాలిట కల్పవల్లి అని పలువురిచే అభినందనలు పొందారు.

ఈశ్వరీబాయి ఒక ఉద్యమం ఒక శక్తి. ఒక చైతన్య జ్యోతి. నిరుపేదలు షెడ్యూల్డు కులాల ప్రజల ఏకైక ప్రతినిధి. మహానాయకురాలు అని ప్రజలచే కీర్తించబడ్డారు.

ఆంధ్రప్రదేశ్ శాసనసభలో జె. ఈశ్వరీబాయి ప్రసంగాలు అనే పుస్తకంలో 29 ప్రసంగాలున్నాయి. ప్రసంగానికి ఆ ప్రసంగమే ప్రత్యేకమైంది. ఈ ప్రసంగాలు ఈ తరానికి కానుకగా అందిన్నున్నామని, ఇది శాసనసభ్యులకు స్ఫూర్తివంతంగా ఉంటుందని ఆశించారు. సీనియర్ జర్నలిస్టు ఉడయవర్లుగారు. ఈశ్వరీబాయిగారి కుమార్తె.

డా. గీతారెడ్డిగారు వైద్యురాలిగా, రాజకీయవేత్తగా సుప్రసిద్ధురాలు.

"తనయ మాటల్లో తల్లిగారు" అనే వ్యాసంలో తల్లి గురించి మనసులో మాట చెప్పి, తల్లికి స్మృత్యంజలి ఘటించారు గీతారెడ్డిగారు.

గొప్ప సంఘ సేవకురాలిగా తల్లి తనకి ఆదర్శమన్నారు డా. గీతారెడ్డిగారు. "మా తల్లిగారి శిక్షణ మార్గదర్శకత్వం వల్లనే నేను నా జీవితంలో ఎన్నో విజయాలు సాధించాను. కార్యసాధనలో పట్టుదల, శ్రద్ధాసక్తులు, తోటి మానవులతో, సహచరులతో నమ్రత, వాత్సల్యం, ప్రేమభావంతో ఉన్నత గుణాలు ఆమె నుంచి నాకు అలవడ్డాయి" అని ఎంతో ఆనందంతో చెప్పారు. 'మా అమ్మగారు నా జీవితానికి ఆదర్శవంతురాలు. నాకేకాదు, ఈ సమాజానికే ఆమె ఒక ఆదర్శమహిళ. స్త్రీ జాతికే గర్వకారణమైన ఉన్నత వ్యక్తిత్వం ఆమెది. అత్యంత ధైర్యసాహసాలుగల గౌరీమణి అన్నారు తల్లి గురించి గీతారెడ్డి గారు.

మనకు ఉన్నదానిలోనే సంతృప్తిచెందాలని, లేనివారికి సహాయపడాలని తల్లి చెప్తూండేవారని గీతారెడ్డిగారు తెల్పారు.

ఈశ్వరీబాయిగారి ట్రస్టు, ఈశ్వరీబాయిగారి నర్సింగ్ స్కూలు చాలా ప్రసిద్ధమైనవి.

విశ్వమానవ శ్రేయస్సును కాంక్షించిన మానవతావాది ఈశ్వరీబాయి అనగల్గడం అక్షరసత్యం.

44

# ఈటూరి లక్ష్మణరావు

**– ఆచార్య వెలుదండ నిత్యానందరావు**

జీవితం వడ్డించిన విస్తరి కాదు. అవకాశాలు పొంది అందలాలెక్కిన ప్రతివారు గొప్పవారూ కాదు. అందలాలెక్కని వాళ్లంతా పనికిమాలినవారూ కాదు. కొంతమందికి సకాలంలో అవకాశాలు అందివస్తాయి. చుట్టూ ప్రోత్సాహకరమైన వాతావరణం ఉంటుంది. జనం గుర్తిస్తారు. ప్రయోజకులుగా ముద్రపడుతుంది. మరికొందరు చాలా సాదాసీదాగా జీవితం గడుపుతారు. పెళ్ళిళ్లు, చేసుకొంటారు. ఉద్యోగాలు చేస్తారు.

కాలగర్భంలో కలిసిపోతారు. అలాంటి ఒక సాదాసీదా మనిషే ఈటూరి లక్ష్మణరావు గారు. ఈటూరి లక్ష్మణరావు గారు పుట్టినపుడు దేవదుందుభులు మోగలేదు. సరికదా చనిపోయినపుడు కూడా పత్రికల్లో వార్తాంశం కాలేదు. ఏదీ కానపుడు ఆయననెందుకు తలుచుకోవడం అంటే తెలంగాణ తన అస్తిత్వాన్ని వెతుక్కుంటున్న క్రమంలో తన కడుపున పుట్టిన పిల్లలు ఎలా నిరాదరణకు గురయ్యారో కథలు కథలుగా నమోదు చేయాల్సిన చారిత్రక దశలో వస్తువులవుతున్నారు కనుక.

జనగామకు దాదాపు ఇరవై మైళ్ల దూరంలో దేవరుప్పల అనే గ్రామం ఉంది. ఆ గ్రామంలో కరణాలున్నారు. లక్ష్మీనారాయణరావు, వెంకట రామనర్సమ్మ దంపతులకు పుట్టిన వ్యక్తే మన లక్ష్మణరావు. వీరి గోత్రం కాశ్యపస. ఇంటిపేరు ఈటూరి. ఈటూరి లక్ష్మణరావు తన 48వ యేట 14 జూలై, 1965న కన్నుమూశారు. ఇది నిర్ధారణగా దొరుకుతున్న ఆధారం. కనుక 1917లో పుట్టి ఉంటారు. లక్ష్మణరావు ప్రాథమిక విద్యాభ్యాసం దేవరుప్పలలోనే ముగిసింది. స్థానిక ఖాన్గిబళ్లలో సాతాని పంతులు, మరో తురక పంతులు అలీఫ్ బేతో పాటు ఒంట్లు, ఓనమాలు, లేక పద్యాలు సిద్ధం నమ అని నేర్పించి ఉంటారు. ఏకసంథాగ్రాహి కావడం వల్ల అచిరకాలంలో దేవరుప్పల గ్రామంలోని చదువంతా లక్ష్మణరావు చదివేశారు.

పై తరగతుల కోసం హనుమకొండలో ఉన్న అక్కాబావల చెంతకు చేరారు. ఆ బావగారి పేరు వనం కేశవరావు. వారు ఆ కాలంలో పేరుమోసిన లాయర్. హనుమకొండలో ఆరవ తరగతి నుంచి చదివారు. హనుమకొండలో రాజనరేంద్ర భాషా నిలయం ఉంది. అది తెలంగాణలో రెండవ గ్రంథాలయం. 1904లో స్థాపించబడింది. మొదటి గ్రంథాలయం హైదరాబాద్‌లోని శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం. లక్ష్మణరావు హైస్కూలు చదువులు చదువుతూనే ఆ గ్రంథాలయంలోని ఒక పుస్తకం కూడా మిగల్చకుండా చదివారంటే ఆశ్చర్యం కలగకమానదు. లక్ష్మణరావులో ఆ చిన్ననాడు మొదలైన పుస్తక పఠన వ్యసనం చివరిదాకా కొనసాగింది. పెద్దయ్యాక ఉద్యోగం వచ్చాక కూడా చదువు మానలేదు. ఏదో ఒకరంగం పుస్తకాలకే పరిమితం కాలేదు. తత్త్వశాస్త్రం, కాల్పనిక సాహిత్యం, సామాజికం అన్ని అభిమాన అంశాలే అయ్యాయి. అద్వైతం,

విశిష్టాద్వైతం వీటితో పాటు.. ఇస్లాం, క్రైస్తవం, బౌద్ధం, వీరశైవం గ్రంథాలు కూడా చదివేవారు. భిన్నభిన్న మతాల ఆంతర్యాలను తులనాత్మకంగా పరిశీలించి విశ్లేషించడం వీరి ప్రవృత్తి. చదివిన తర్వాత ఆ పుస్తకాలను సొంతానికి కొనుక్కునే వారు. అలా జీవిత చరమాంకంలో ఓ పెద్ద లైబ్రరీ సమకూరింది.

హనుమకొండలో ఆనాడు ఇంటర్‌మీడియెట్ సెంటర్ కూడా లేదు. హైదరాబాదుకు వచ్చి పరీక్షలు రాయాల్సి వచ్చేది. ఆనాడు ఇంటర్మీడియెట్‌ను ఎఫ్.ఎ. (ఫెలో ఆఫ్ ఆర్ట్స్) అనేవారు. అలా ఇంటర్ అయ్యాక లక్ష్మణరావు హైదరాబాద్‌కు మకాం మార్చారు. 1943లో బి.ఎ.లో చేరారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం గుండెకాయ అనదగిన ఆర్ట్స్ కాలేజీలోనే బి.ఎ. క్లాసులు కూడా జరిగేవి. ఆ రోజుల్లో బి.ఎ. ఈనాటి లాగా మూడేళ్లు కాదు. రెండేళ్లే. కాస్త ఆస్తిపాస్తులు ఉన్న కుటుంబమే కానీ లక్ష్మణరావు మెతక. ఆయన తండ్రి అప్పటికే స్వర్గస్తులయ్యారు. పాలెవాళ్లు నెత్తిన టోపీ పెట్టారు. ఫలితంగా లక్ష్మణరావు నిరాదారులై పోయారు.

పూనుకూరి రాఘవరావు అనే వదాన్యుడైన ఒక వెలమదొర ఆ రోజుల్లో హైదరాబాద్‌లో ఉండేవారు. ఆయనది లక్ష్మక్కపేట. కరీంనగర్‌లో లక్ష్మక్కపేట ప్రాంతంలో తొలిసారిగా వడ్లగిర్నీ పెట్టిన వ్యక్తి ఆయన. నాంపల్లిలో వారిది విశాలమైన, సౌకర్యవంతమైన భవనం. వాళ్ల పిల్లలకు ట్యూషన్స్ చెప్పేవారు. అందువల్ల వారింట్లోనే నెలకు ఐదు రూపాయల కిరాయితో లక్ష్మణరావు ఉండటం మొదలు పెట్టారు. అలా స్వయంకృషితో అవసరాలు తీర్చుకోవలసి వచ్చేది.

తండ్రి లేని సుతుడు ధూళికన్నా చులకన గదా! లక్ష్మణరావుకు వంట రాకపోవడం పెద్ద సమస్యగా మారింది. ఉడికీ ఉడకని అన్నం, అర్ధాకలి. ఊరి నుంచి తల్లి కట్టించిన తినుబండారాలతో కాలం గడుపుకొనేవారు. ఒకరోజు తిండిలేక ఆకలితో ఆర్ట్స్ కాలేజీలో 'చక్కర్' వచ్చి పడిపోయారు.

సహాధ్యాయుల్లో ఒకరు మనోహరరావు వెంటనే లక్ష్మణరావుకు ఉపచారాలు చేసి హాస్టలుకు తీసుకుపోయి అన్నం పెట్టించారు. అలా ఆనాడు ప్రాణం కాపాడిన మనోహరరావుతో ఆత్మీయానుబంధం జీవితాంతం కొనసాగింది. ఈ మనోహరరావు ఇంటిపేరు తెలియదు. కరీంనగర్ ప్రాంతానికి చెందిన వెలమదొర. మెల్లకన్నో, ఒంటికన్నో ఉండేది. నృపతుంగ హైస్కూలులో అధ్యాపకులుగా పనిచేశారని విన్నాను. లక్ష్మణరావు పరిస్థితి చూసి దేవరుప్పుల నుంచి తల్లి హైదారాబాద్‌కు రాకతప్పలేదు.

ఆప్యాయతతో వంటచేసి పెడుతుంటే సుఖంగా తిని కాలేజీకి పోవడం మొదలుపెట్టాడు. లక్ష్మణరావు డిగ్రీ చదువుతున్న రోజుల్లోనే ఆయన మేనల్లుడు సి.లక్ష్మీనరసింహా రావు అన్వర్ ఉలుం స్కూల్లో నాల్గవ తరగతిలో చేరారు. వారిప్పుడు ప్రముఖ వైద్యులు. తన ఈనాటి అభ్యున్నతికి ఆనాడు తన మేనమామ చూపిన ఆదరాభిమానాలే కారణమని ఎంతో భక్తిభావంతో ఈ వివరాలందించారు. ఆ విధంగా వెంకటరామ నర్సమ్మ (తల్లి), లక్ష్మణరావు (కొడుకు), సి.లక్ష్మీనారాయణరావు (మేనల్లుడు) ముగ్గురు ఆ చిన్న ఇంట్లోనే కాలం వెళ్లబుచ్చేవారు.

లక్ష్మణరావు 1945లో బి.ఎ. ఉత్తీర్ణులయ్యారు. ఉర్దూ రాజ్యమేలుతున్న కాలంలో నిజాం ప్రభుత్వం తెలుగులో కూడా ఎం.ఎ. చేయవచ్చునని 1940లో ఆర్డర్ పాస్ చేసింది. అప్పటికే వందేమాతరం ఉద్యమం ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని ఉగ్రూతలూగించింది. నిజాం ప్రభుత్వాన్ని గడగడలాడించింది. మహాఘనత వహించిన నిజాం ప్రభువు అధిక సంఖ్యాకులైన హిందువులను ప్రసన్నులను చేసుకోవడా నికి ఖర్చులేని రద్దు అయిన ఎం.ఎ. తెలుగుకు అనుమతించారు.

రాయప్రోలు సుబ్బారావు ప్రఖ్యాత తెలుగు కవి. 1919 నుంచి ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని తెలుగు శాఖకు అధ్యక్షులు. మొదట్లో తెలుగు శాఖలో పాఠప్రవచనాలు లేవు. లైబ్రరీలో పుస్తకాలకు సూచీలు తయారు చేసేవారు. 1926 ప్రాంతాల్లో డిగ్రీ మొదలైంది. ఉర్దు మీడియమే అని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. 1938లో వందేమాతర ఉద్యమం కారణంగా డిగ్రీ చదువుతున్న పల్లా దుర్గయ్య లాంటి వారెందరో కాలేజీ వదిలిపెట్టి మహారాష్ట్ర వెళ్లారు. పల్లా దుర్గయ్యకు అక్కడ ఆరోగ్యం సరిపడలేదు. తిరిగి వచ్చారు. ఒక సంవత్సరం వృథా చేసుకుని డిగ్రీ పూర్తిచేశారు. అదే సంవత్సరం తెలుగులో ఎం.ఎ. చేయవచ్చునని విశ్వవిద్యాలయం అనుమతించింది. పల్లాదుర్గయ్య

రాయప్రోలు ఆశీస్సులతో 1940లో ఎం.ఎ.లో చేరారు. రాయప్రోలు వారు తెలంగాణ పొలిమేరలు దాటినప్పుడు తెలుగు భాష ఔన్నత్యం, స్వాతంత్ర్యోద్యమం, దేశభక్తి లాంటి మాటలు మాట్లాడేవారు. కవిత్వం రాసేవారు. కానీ తెలంగాణ ప్రాంతంలో నిజాం స్తోత్రం చేయక తప్పేది కాదు. అప్పటికే తెలుగునేల అంతటా కవిగా పేరు రావడంతోనూ, ఉర్దూ ఆధిపత్యానికి నూకలు చెల్లుతాయన్న విశ్వాసం బహుశా కుదరకపోవడంతో రాయప్రోలు వారు ఒక నిస్పృహలో తెలుగు శాఖను పెద్దగా పట్టించుకోలేదు. తెలంగాణలో మమేకం కాలేదు. విద్యార్థులను ప్రోత్సహించలేదు. మడుపు శేషారావు (కవి, ఆచార్య ఎం.కులశేఖరగారి అన్నగారు), జువ్వాడి గౌతమరావు (సోషలిస్టు నాయకులు) లాంటి వారు ఎం.ఎ. తెలుగు చేయాలన్న కోరిక తీరక వేరే చదువుకోవలసి వచ్చింది.

పల్లాదుర్గయ్య 1942లో పాసైన తొట్టతొలి ఎం.ఎ. తెలుగు విద్యార్థిగా స్థిరకీర్తి సంపాదించుకున్నారు. డాక్టరేటు చేయడం వల్ల, లెక్చరర్ కావడం వల్ల పల్లాదుర్గయ్య పేరు అందరికీ తెలిసింది. ఈ రెండవ విద్యార్థి అయిన లక్ష్మణరావును గురించి మాత్రం ఎక్కడా రికార్డు కాలేదు. 1945 ఏప్రిల్‌లో లక్ష్మణరావు బి.ఎ. విజయవంతంగా పూర్తిచేసుకొని ఎం.ఎ. (తెలుగు)లో చేరారు. తత్ఫలితంగా 1947లో తృతీయ శ్రేణిలో ఎం.ఎ. తెలుగు పట్టా పొంది బయటపడ్డారు. రాయప్రోలు వారి కుమారుడు రాయప్రోలు మార్తాండం కూడా అదే సంవత్సరాల్లో చదువుతుండడం వల్ల అతనికి పోటీ వస్తానని తృతీయ శ్రేణి ఇచ్చారని లక్ష్మణరావు జీవితాంతం ప్రస్తావన వచ్చినపుడల్లా చెప్పేవారట. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 1951కి ముందున్న రికార్డులన్నీ ఉర్దూలోనే ఉన్నాయి. 1942లో ఉత్తీర్ణుడైన పల్లాదుర్గయ్య, 1947లో ఉత్తీర్ణుడైన లక్ష్మణరావు, 1949లో ఉత్తీర్ణుడైన కోవూరు గోపాలకిషన్ రావు పేర్లు, మార్కులు, రూల్ నెంబర్ లాంటి వివరాలన్నీ మనకు ఉర్దూలోనే తప్ప ఆంగ్లంలో దొరకవు. తెలుగులో ఇప్పటికీ దొరికే ముచ్చటే లేదు. ఆ రోజుల్లో ఎం.ఎ. తెలుగును ఎం.ఎ. తెలింగీ అని ఉర్దూలో వ్యవహరించేవారు. ఈరోజుల్లోలాగా సెమిస్టర్ పద్ధతి గానీ, ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు విడివిడిగా పరీక్షలు రాసే విధానం గానీ లేదు. రెండు సంవత్సరాలకు కలిపి ఒకేసారి పరీక్షలు రాయాలి. మొత్తం ఎనిమిది పేపర్లు. పద్యం-గద్యం, నాటకం, ప్రాచీనాధునిక కవితలు, ఆంధ్రుల చరిత్ర, ఆంధ్రభాషా చరిత్ర, వ్యాకరణం, అలంకార శాస్త్రం, ప్రాచీనాధునికాంధ్ర సాహిత్య చరిత్ర, ప్రతిపేపర్‌కు నూరు మార్కులు చొప్పున మొత్తం 800 మార్కులు. 1947 ఏప్రిల్‌లో ఎం.ఎ. తెలుగు పరీక్ష రాసిన, ఉత్తీర్ణుడైన ఏకైక విద్యార్థి లక్ష్మణరావు. వీరి రోల్ నెంబర్ 130. వరుసగా 8 పేపర్లలో 27 37 52 44 61 40 55 42 358. తృతీయ శ్రేణి. ఉస్మానియా తెలుగు శాఖలోనే అధ్యాపకునిగా చేరిఉంటే లక్ష్మణరావు గారి వైదుష్యానికి మంచి గుర్తింపు లభించి ఉండేది. కానీ తృతీయ శ్రేణి మనిషి కావడంతో అధ్యాపక వృత్తికి అనర్హుడై నిజాం ప్రభుత్వంలో రెవెన్యూ శాఖలో క్లర్కుగా చేరారు.

తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ, హిందీ క్షుణ్ణంగా వచ్చినవారు కావడం వల్ల అచిరకాలంలోనే నిజాం రాష్ట్ర అనువాద శాఖలో ఉద్యోగంలో చేరారు. దాదాపు పదిహేడేళ్లకు పైగా ఉద్యోగం చేసి ఉంటారు. డిప్యూటీ డైరెక్టర్‌గా ఎదిగారు. ఇంతలో చరిత్ర మలుపు తిరిగింది. ఆంధ్ర తెలంగాణ కలిసిపోయాయి. మదరాసు నుంచి వయా కర్నూలు మీదుగా ఆంధ్ర అనువాదశాఖ హైదరాబాద్‌లోకి అడుగుపెట్టింది. నిజాం-ఆంధ్ర అనువాద శాఖలు విలీనమయ్యాయి. వయస్సులో పెద్దవారు, కవిగా సుప్రలక్ష్మణరావుసిద్ధులు, ఆంధ్ర అనువాద శాఖ సంచాలకులు అయిన బోయి భీమన్న ఉమ్మడి అనువాద శాఖకు సంచాలకులయ్యారు. లక్ష్మణరావు యథావిధిగా ఉపసంచాలకులుగా కొనసాగారు. లక్ష్మణరావు సహోద్యోగుల్లో బోయి భీమన్న, జె.వి.నరసింగరావు తోడల్లుడు కె.వి.లింగారావు, మంత్రి శ్రీనివాసరావు, బషీరుద్దీన్ లాంటివారు నేడు లేరు. ఎస్.రమణారావు, గోవిందరాజు రామకృష్ణారావు, దేశరాజు వెంకట కృష్ణారావు, హైమవతీ బోయి భీమన్న గారులు నేటికీ చల్లగా, ఆరోగ్యంగా ఉన్నారు. లక్ష్మణరావు గతించిన యాభై ఏళ్ల తరువాత కూడా వారంతా లక్ష్మణరావు సౌమ్యుడు, నెమ్మది మనిషి, అపార పుస్తక పఠన పిపాసి అని ఆప్యాయంగా స్మరించు కుంటున్నారు.

లక్ష్మణరావు ఎం.ఎ. చదువుతున్న కాలం భారత స్వాతంత్ర్యోద్యమం, నిజాం వ్యతిరేకోద్యమం, ప్రగతిశీల

భావాలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న కాలం. అందునా అపారమైన పుస్తక పఠన వ్యసనం కలిగిన లక్ష్మణరావులో ఆధునిక భావాలు ఉండడంలో ఆశ్చర్యపోవలసిన పనేమీ లేదు. ఎం.ఎ. రెండో సంవత్సరం చదువుతున్న 1944లో మామిడాల గ్రామవాస్తవ్యులు బోయినపల్లి లక్ష్మీనరసింహారావు కూతురు లలితను పెళ్లాడారు. ఈ రెండు కుటుంబాలకు అనుసంధానకర్తగా వ్యవహరించి పెళ్లి జరగడానికి కారణమైన వ్యక్తి లక్ష్మణరావు డిగ్రీ సహాధ్యాయి మనోహరరావు గారే. వీరిని గురించి ఇంతకుముందే ప్రస్తావించాను. శ్రీమతి లలిత బాలవితంతువు కావడం వల్ల లక్ష్మణరావు తల్లికి, బంధు వర్గానికి ఈ పెళ్లి నచ్చలేదు. లక్ష్మణరావు సహనంతో, సౌజన్యంతో అందరినీ ఒప్పించారు. శ్రీమతి లలిత తన మంచితనంతో మెప్పించారు. స్వయంకృషితో ఓ స్థాయికి ఎదిగిన లక్ష్మణరావు తోబుట్టువులకు, వారి సంతానానికి అన్నివిధాలా చేయూతనిచ్చారు. భార్య చెల్లెళ్లకూ ఎంతో సాయం చేశారు. లక్ష్మణరావుకు సంతానం కలుగలేదు. ఒక మరదలి కొడుకును దత్తత తీసుకున్నారు. వారి పేరు రాజేంద్రప్రసాదు. వారిప్పుడొక ఉన్నతోద్యోగంలో రాణిస్తున్నారు. లక్ష్మణరావుకు పెళ్లయిన తరువాత పుట్టిన చిట్టి మరదలు సుజాత అంటే ఎక్కువ అభిమానం. ఆమెను చదివించారు. ముఖ్యంగా ఇంగ్లీష్ నేర్పారు. పెళ్లి జరగడంలో సహకరించారు. ఆ సుజాత గారు నేడు 70 ఏళ్ల వ్యక్తి. అధ్యాపకురాలిగా పనిచేసి రిటైరయ్యారు. తనను చిన్నప్పుడు చదివించి, విద్యాబుద్ధులు నేర్పి తండ్రి లాంటి బావగారి పట్ల అపారమైన కృతజ్ఞతాభావాన్ని, భక్తిభావాన్ని ఇప్పటికీ వ్యక్తీకరిస్తారు. అకస్మాత్తుగా గుండెపోటుతో లక్ష్మణరావు 1965, జులై 14న తన 48వ యేట అస్తమించారు. కుటుంబం తుఫానులో చిక్కుకున్న నావలాగా విలవిల లాడింది. ఆ విపత్కర కాలంలో శ్రీమతి లలితా లక్ష్మణరావును ఆదరించి అక్కున చేర్చుకొని 2002లో ఆమె స్వర్గస్థులయ్యే దాక బాసటగా నిలిచిన వారు శ్రీమతి సుజాతగారు. వీరికి తోడునీడగా నిలిచి సహకరించిన వారు శ్రీవారు నర్సింగరావు గారు. శ్రీమతి సుజాత గారు లక్ష్మణరావు ఫొటోలివ్వడమే గాక ఎన్నో విశేషాలు చెప్పి ప్రోత్సహించారు. మలక్‌పేటలోని కాలడేరా కాలనీలోని ప్రభుత్వ క్వార్టర్స్ చిన్నగా, ఇరుకుగా ఉండడంతో లక్ష్మణరావు ఆఫీసులోనే ఐదారు అల్మారాల నిండా పుస్తకాలు పెట్టుకొన్నారు. వారు అస్తమించాక అల్మారాలతో సహా ఆ పుస్తకాలన్నింటినీ శ్రీకృష్ణరాయాంధ్ర భాషా నిలయానికి ఇచ్చేశారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో ఎం.ఎ. పట్టా పొందిన రెండవ విద్యార్థి అయిన లక్ష్మణరావు అప్పుడే తెలుగు శాఖలో అధ్యాపకునిగా అవకాశం వచ్చి ఉంటే వెలిగిపోయేవారు. ఈ మాత్రం వివరాలయినా తెలుస్తున్నా యంటే లక్ష్మణరావు గారి మేనల్లుడు 83 ఏళ్ల ప్రముఖ వైద్యులు సి.లక్ష్మీనరసింహారావు, మరదలు శ్రీమతి సుజాత కట్టుకున్న పుణ్యం. మా గురువర్యులు ఆచార్య ఎం.కులశేఖర గారు అందించిన ఆధారం. ఆచార్య బి.రామరాజు 1951లో ఎం.ఎ. పూర్తిచేశారు. వారు చాలాసార్లు తాను రెగ్యులర్ విద్యార్థుల్లో ఏడవ విద్యార్థినని, ప్రైవేటు విద్యార్థులను కూడా కలిపితే పదవ వ్యక్తినని చెప్పేవారు. మరి వారెవరో ఇప్పటికైనా తెలుసుకోవలసిన అవసరం లేదా ? తెలంగాణ సాకారమయ్యాకనైనా చీకటికోణంలో దాగిన ఇలాంటి వారిని స్మరిద్దాం.

45

# గడ్డం రాంరెడ్డి

– డా॥ రాయారావు సూర్యప్రకాశ్ రావు

విద్యాసౌకర్యాలు పెద్దగా లేని మారుమూల పల్లెటూర్లో పుట్టిన ఆ మహోన్నతుడు కాలేజీ చదువు పూర్తి చేయడమే గొప్ప. ఆ గ్రామం నుండే కాకుండా ఆ జిల్లా నుండే ఆ కాలంలో ఉన్నత చదువులు చదివిన వారి సంఖ్య బహు స్వల్పం. పేదరైతు కుటుంబంలో పుట్టిన ఆయన లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో విద్యార్జన చేయగలిగారు.

మారుమూల పల్లెల్లో చదువుకోవడానికి సౌకర్యాలు లేని లక్షలాది మంది కోసం దూరవిద్యా విధానానికి శ్రీకారం చుట్టడంలో కీలకపాత్ర పోషించారు. దేశంలో దూరవిద్యకు పితామహుడిగా ఖ్యాతినార్జించారు. విశ్వవిద్యాలయాలకు విరాళాలందించే ప్రధాన బాధ్యత నిర్వర్తించే విశ్వ విద్యాలయాల నిధుల సంఘానికి చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయనే ఆచార్య జి.రాంరెడ్డి.

కరీంనగర్ జిల్లాలోని మైలారం గ్రామంలో 1929 డిసెంబర్ నాలుగో తేదీన తమ అమ్మమ్మ ఇంట్లో రాంరెడ్డి జన్మించారు. ఆయన స్వగ్రామం రాజన్న–సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం బండపల్లి. గడ్డం కృష్ణారెడ్డి, కాంతమ్మ దంపతుల సంతానంగా జన్మించిన ఆయన బండపల్లి, మైలారం గ్రామాల్లో ప్రాథమిక విద్యాభ్యాసం చేశారు. కరీంనగర్‌లో మెట్రిక్యులేషన్ చదివారు.

డిగ్రీ పూర్తి చేసిన అనంతరం రాంరెడ్డి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో రాజనీతి శాస్త్రంలో ఎం.ఎ. చేశారు. తర్వాత విశ్వవిఖ్యాత ఆర్థిక శాస్త్ర అధ్యయన కేంద్రం లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో ప్రభుత్వ రంగ సంస్థలపై ప్రత్యేక అధ్యయనం నిర్వహించి పట్టా స్వీకరించారు.

దేశానికి తిరిగివచ్చిన అనంతరం 1959లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఉపన్యాసకుడిగా చేరారు. బోధనలో, పరిశోధనలో ప్రతిభ వల్ల దశాబ్ద కాలంలోనే ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆచార్యుడయ్యారు. సోషల్ సైన్సెస్ రీసెర్చ్ కౌన్సెల్‌కు దక్షిణ భారత ప్రాంతీయ కేంద్ర సంచాలక బాధ్యతలు 1973లో చేపట్టారు. ప్రతిష్ఠాత్మకమైన ఉస్మానియా విశ్వవిద్యాలయానికి 48 ఏళ్ల వయస్సులోనే 1977లో వైస్ ఛాన్సెలర్‌గా బాధ్యతలు స్వీకరించారు. 1982 వరకు ఆ పదవిలో కొనసాగారు.

సమాజ విద్యావసరాలు పెరుగుతున్నాయని, సాంప్రదాయిక విద్యావిధానానికి ప్రత్యామ్నాయంగా మరో విద్యావిధానం ఉండాలని ఆయన ప్రగాఢంగా వాంఛించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో వైస్ ఛాన్సెలర్‌గా పనిచేసేటప్పుడే దూర విద్యకు సంబంధించిన అధ్యయనాన్ని చేపట్టారు. అప్పటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు సాగిన ఈ అధ్యయనం ఫలితంగానే దేశంలో

మొట్టమొదటి సార్వత్రిక విశ్వవిద్యాలయంగా ప్రస్తుతం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంగా పేర్కొంటున్న ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం 1982లో ఏర్పడింది. దూరవిద్యలో ఆచార్య రాంరెడ్డి ప్రగతిశీల దృక్పథం వల్ల ప్రభుత్వం ఆయనను ఈ విశ్వవిద్యాలయానికి మొదటి వైస్‌ఛాన్సెలర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఈ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సెలర్‌గా దూర విద్య ప్రతిష్ఠ పెంచేందుకు నిరంతరం శ్రమించారు. ఉన్నత విద్యావకాశాల విషయంలోనూ, ఉద్యోగావకాశాల్లోనూ సాంప్రదాయిక విద్యాభ్యాసం చేసిన వారితో సమానంగా అవకాశాల కల్పన ఆయన శ్రమ ఫలితమే.

దూరవిద్యలో ఆచార్య రాంరెడ్డి చేసిన అధ్యయనం, ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయ వ్యవస్థాపనలో కృషి, ఆ విశ్వవిద్యాలయ మొదటి వైస్ ఛాన్సెలర్‌గా ఆయన అనుభవం జాతీయ స్థాయిలో ఆయనకు గుర్తింపును తెచ్చిపెట్టాయి. ఫలితంగా కేంద్రప్రభుత్వం జాతీయ స్థాయిలో సార్వత్రిక విద్యావిధాన రూపకల్పన చేయవలసిందిగా ఆయనను కోరింది.

ఆరు నెలల కాలంలోనే ఆచార్య జి.రాంరెడ్డి తన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించి రికార్డు సృష్టించారు. ఆయన నివేదిక ఫలితంగా 1985లో ఇందిరాగాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఏర్పాటైంది. ఆ విశ్వవిద్యాలయానికి కూడా మొదటి వైస్ ఛాన్సరల్‌గా ఆయనే నియమితులయ్యారు. ఐదేళ్లపాటు ఆ పదవిలో కొనసాగారు. వివిధ కోర్సులను దూరవిద్యలో ప్రవేశపెట్టడంతోపాటు వాటి పాఠ్యప్రణాళిక రూపకల్పనలో ఆయన కృషి శ్లాఘనీయం. ఇందిరాగాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్‌గా ఆయన సేవలు అంతర్జాతీయ స్థాయిలో ఆయనకు పేరు తెచ్చిపెట్టాయి.

సెంటర్ ఫర్ ఎకనమిక్స్ అండ్ సోషల్ స్టడీస్‌కు 1989 నుండి 1995 వరకు ఆచార్య రాంరెడ్డి చైర్మన్‌గా వ్యవహరించారు. విద్యారంగంలో ఆయనకున్న అపార అనుభవం దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం 1991లో విశ్వ విద్యాలయాల నిధుల సంఘం యు.జి.సి.కి ఆయనను చైర్మన్‌గా నియమించింది. ప్రతిష్ఠాత్మకమైన యూనివర్సిటీ గ్రాంట్ల సంఘం అధ్యక్షుడిగా ఐదేళ్లు పనిచేసిన ఆయన దేశంలో విశ్వవిద్యాలయాల గుర్తింపు కోసం అత్యుత్తమ పద్ధతిని అమల్లోకి తెచ్చిన ఘనత సాధించారు. ఆయన కృషి వల్లే విశ్వవిద్యాలయాల గుర్తింపు కోసం 'నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్' ద్వారా పారదర్శకమైన విధానం అమల్లోకి వచ్చింది. ఈ విధానాన్ని అమలు చేయడం ద్వారా దేశంలో ఉన్నత విద్యారంగంలో నాణ్యత పెంపుదలకు ఆయన చేసిన కృషి మరువలేనిది. దక్షిణాసియా ప్రాంతంలోనే మొదటిసారిగా ఈ విధానాన్ని రూపుదిద్దడం విశేషం.

విద్యారంగంలో అద్వితీయ ప్రతిభ కనబర్చిన ఆచార్య జి.రాంరెడ్డి ఇండియన్ కౌన్సెల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ రీసెర్చ్ సంస్థకు కూడా చైర్మన్‌గా సేవలందించారు.

దేశంలోనే కాకుండా అంతర్జాతీయంగానూ సార్వత్రిక విద్యావ్యవస్థకు రూపురేఖలు తెచ్చారు ఆచార్య రాంరెడ్డి. ప్రపంచంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో సార్వత్రిక విద్యావ్యవస్థను ఆయన అధ్యయనం చేశారు. ఆసియా అభివృద్ధి బ్యాంకు ఏర్పాటు చేసిన సదస్సులో సార్వత్రిక విద్యావ్యవస్థకు ఒక నమూనాను ఆయన ప్రదర్శించారు.

ఈ నమూనా వివిధ దేశాల్లో సార్వత్రిక విశ్వ విద్యాలయాల ఏర్పాటుకు పునాది వేసింది. బంగ్లాదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొదటి సార్వత్రిక విశ్వవిద్యాలయానికి సలహాదారుగా ఆయన బాధ్యతలు నిర్వహించారు.

ఆసియా దేశాల సార్వత్రిక విశ్వవిద్యాలయాల అసోసియేషన్‌కు ఆయన మొట్టమొదటి సెక్రటరీ జనరల్‌గా ఎన్నికయ్యారు. అంతర్జాతీయ దూరవిద్యామండలిలో చురుకైన సభ్యుడిగా పేరు తెచ్చుకున్నారు. ఈ మండలికి శాశ్వత సభ్యుడిగా నియమితులయ్యారు.

విద్యారంగంలో కామన్‌వెల్త్ దేశాలు నెలకొల్పిన కామన్ వెల్త్ ఆఫ్ లర్నింగ్ సంస్థ స్థాపనలో ఆయన కృషి ఎంతో ఉంది. ఈ సంస్థ స్థాపన కోసం నియమించిన రెండు కమిటీల్లోనూ ఆయన సభ్యుడిగా పనిచేశారు. అనంతరం ఆ సంస్థ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్‌లో భారతదేశ ప్రతినిధిగా నియమితులయ్యారు. బోర్డు సభ్యుడిగా భారతదేశానికి, సంస్థకు మధ్య వారధిగా పనిచేశారు. దేశంలోని విద్యా

సంస్థలకు, వృత్తివిద్యా సంస్థలకు మార్గదర్శిగా నిలిచారు. ఆ సంస్థకు 1989లో మొట్టమొదటి ఉపాధ్యక్షుడయ్యారు. 1991 వరకు ఆ పదవిలో కొనసాగారు.

కామన్‌వెల్త్ దేశాలకు విద్యారంగంలో అనేక సేవలందించిన ఆచార్య రాంరెడ్డి కామన్‌వెల్త్ దేశాల అవార్డును స్వీకరించేందుకు లండన్ వెళ్లి అక్కడే 1995 జూలై 2న మరణించారు.

విద్యారంగంలో విశేష కృషి చేసిన ఆచార్య జి.రాంరెడ్డికి అనేక గౌరవాలు దక్కాయి. ప్రతిష్ఠాత్మక రాజాలక్ష్మీ ఫౌండేషన్ అవార్డును 1994లో ఆయన పొందారు.

దూరవిద్యారంగంలో ఆయన సేవలకు గుర్తింపుగా ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నెలకొల్పిన దూరవిద్యా కేంద్రానికి ఆయన పేరే పెట్టారు. ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఆయన పేరిట స్మారక ఉపన్యాసాన్ని 1996 నుండి ఏటా ఆయన వర్ధంతి సందర్భంగా జూలై రెండవ తేదీన నిర్వహిస్తోంది. ఆయన పేరిట స్మారక కేంద్రాన్ని కూడా 2008 జూలై రెండవ తేదీన నెలకొల్పింది. ఈ స్మారక కేంద్రంలో ఆచార్య జి.రాంరెడ్డికి సంబంధించిన ఆడియో, వీడియో క్యాసెట్లను రెండు వేల పై చిలుకు రిఫరెన్స్ మెటీరియల్ ఈ స్మారక కేంద్రంలో ఉంచడం విశేషం. విద్యావేత్తలకు, పరిశోధకులకు, విద్యార్థులకు, అధికారులకు దూరవిద్యారంగంలో విధాన నిర్ణేతలకు ఉపయోగపడేలా ఈ స్మారక కేంద్రాన్ని తీర్చిదిద్దారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయం 1993లో ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఉత్తమ సేవలందించిన యువ సామాజిక శాస్త్రవేత్తలకు ప్రతి రెండేళ్లకోసారి ఆచార్య జి.రాంరెడ్డి పేరిట పురస్కారాన్ని అందిస్తోంది రాంరెడ్డి ట్రస్టు. దళిత మహిళల జీవన స్థితిగతులపై పరిశోధనలు నిర్వహించిన పూనా విశ్వవిద్యాలయానికి చెందిన షర్మిల రేగె, దూర విద్యపై పరిశోధనలు చేసిన సంజయ్ మిశ్రా మొదలైనవారికి పురస్కారాలను అందజేసింది ఈ ట్రస్టు.

ఆచార్య జి.రాంరెడ్డి ప్రత్యేక తెలంగాణ డిమాండును సమర్థించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడాలని ఆకాంక్షించారు. తెలంగాణ ఏర్పాటు అవసరాన్ని విశ్లేషిస్తూ 1969లో మొదటి దశ తెలంగాణ ఉద్యమ సందర్భంగా ఆంగ్ల పత్రిక 'మెట్రిక్ స్ట్రీమ్'లో ఒక వ్యాసం రాశారు. తద్వారా జాతీయ స్థాయిలో రాజకీయ విశ్లేషకుల దృష్టిని ఆకర్షించారు.

పంచాయతీరాజ్ వ్యవస్థ పనితీరుపై ఆచార్య జి.రాంరెడ్డి పరిశోధనలు వెలుగురేఖలను ప్రసరింపజేశాయి. పేదరికంపై ప్రభుత్వం విధానాల ప్రభావాన్ని ఆయన అధ్యయనం చేశారు. తూర్పు గోదావరి, మెదక్ జిల్లాలో పేదరిక నిర్మూలన కార్యక్రమాల అమలు, ప్రభుత్వ నిధుల వ్యయంపై ఆయన చేసిన అధ్యయనం కొత్త ఆలోచనలకు దారి చూపింది.

ఎన్ని పదవులు నిర్వర్తించినా, గొప్ప స్థాయిలో ఉన్నా విద్యార్థుల సంక్షేమంకోసం తపించినవారు ఆచార్య జి.రాంరెడ్డి. నిరుపేదల జీవితాలను బాగు చేయడం పట్ల ఆయనకు ఆర్తి ఉండేది. పేదరిక నిర్మూలన కార్యక్రమాలు పటిష్టంగా అమలు జరగాలని భావించేవారు. అధ్యాపకుడిగా ఆయన క్రమశిక్షణ పాటించేవారు.

యువతరానికి ఆదర్శప్రాయంగా ఉండేది ఆయన ప్రవర్తన. ఆయన మాట్లాడితే విన్నవారికి ఎంతో అవగాహన ఏర్పడేదంటారు. అనేక విషయాల పట్ల పరిజ్ఞానాన్ని పెంచేదిగా ఉండేది ఆయన ఉపన్యాసం. చతురోక్తులతో ఆయన సంభాషణ సాగేది. విద్యార్థుల్లో ఎంతో స్ఫూర్తి నింపేవారు. స్నేహితులతో సన్నిహితంగా మెలిగేవారు. గొప్ప మానవతావాదిగా ఆయనను ఆయన మిత్రులు పేర్కొంటారు.

వివిధ పదవులు నిర్వహించి, పరిపాలనా బాధ్యతల్లో తలమునకలైనప్పటికీ విద్యాపరమైన విధులను నిర్వర్తించడం, పరిశోధనల నిర్వహణ ఆయన మానలేదు. దూర విద్యలో పాఠ్యప్రణాళిక రూపకల్పన, పాఠ్యపుస్తకాల రచన మొదలైన అంశాల్లో శ్రద్ధ కనబర్చారు.

ప్రభుత్వ విధానాలపై, దూర విద్యారంగంపై, పేదరిక నిర్మూలన వంటి అంశాలపై అనేక పరిశోధనాపత్రాలను ఆయన సమర్పించారు. పది గ్రంథాలను ప్రచురించారు. దూరవిద్యారంగంలో ఆయన రూపొందించిన గ్రంథాలనే జాతీయంగానూ అంతర్జాతీయంగానూ పలు విశ్వ విద్యాలయాలు ఇప్పటికీ ప్రామాణికమైనవిగా పేర్కొంటున్నాయి.

మారుమూల గ్రామంలో జన్మించి, అంచెలంచెలుగా అంతర్జాతీయ స్థాయికి ఎదిగారు ఆచార్య రాంరెడ్డి. దేశ భవిష్యత్తుకు విద్యావకాశాల కల్పన ప్రధానమైనదిగా ఆయన భావించారు.

విద్యావకాశాలు లేని వారి కోసం దూరవిద్యావిధానాన్ని అమల్లోకి తెచ్చి, లక్షలాది మందికి చదువుకునే అవకాశాన్ని కల్పించారు. ప్రభుత్వ విధానాల అమలు, పేదరిక నిర్మూలన కార్యక్రమాల రూపకల్పన, దూర విద్యావకాశాల కల్పన, సామాజిక శాస్త్రాల అధ్యయనం మొదలైన విషయాల్లో దేశానికి వన్నె తెచ్చిన ఆచార్య జి.రాంరెడ్డి సేవలు కలకాలం నిలుస్తాయి.

46

# గడియారం రామకృష్ణ శర్మ

– డా॥ గన్నవరాజు గిరిజా మనోహర బాబు

పరమ పావని తుంగభద్ర స్రవంతియే
పరుషమ్ములడగించు గంగాభవానీ
రసలింగ రూపుడౌ బ్రహ్మేశ్వర స్వామి
యెల్లరదన్ను విశ్వేశ్వరుండు
శుభకామనులు దీర్చు జోగులాంబ శక్తి
అఖిల జీవుల బ్రోచు అన్నపూర్ణ
వాస్తు శిల్ప విశేష వైభవాఢ్యము హేమ
లాపురంచే కాశికపురంబు
భవ్య చౌషష్ఠి ఘట్ట సంభరిత మగుచూ
తలప శ్రీగిరి పశ్చిమద్వారమగుచు
వ్యాసముని సన్నుతికి పాత్రమైన భూమి
భద్రగుణరాశి దక్షిణ వారణాశి'

అని గొంతెత్తి గానం చేసి తెలంగాణలో ఏకైక శక్తిపీఠంగా వెలుగొందుతున్న, దక్షిణ కాశీగా ప్రసిద్ధిచెందిన ఆలంపుర ప్రాశస్త్యాన్ని చాటిన పండిత కవి కీర్తిశేషులు గడియారం రామకృష్ణ శర్మ గారు.

ఇవాళ ఆలంపురాలోని అపురూప ఆలయాలన్నీ విశ్వమంతా ప్రాచుర్యం పొందడానికి అవసరమైన చారిత్రక నేపథ్యాన్ని పలు మార్గాల్లో అందించిన మాన్యులు ప్రముఖ చారిత్రక విషయ పరిజ్ఞాన కవి, విమర్శకులు, మహావక్తలు బ్రహ్మశ్రీ గడియారం రామకృష్ణ శర్మ గారు.

పాంచజన్యం (కవితా సంపుటి), చంద్రహాస, కువలయానంద సారం, భారతీయ వాస్తు విద్య, కన్నడపు చిన్నకథలు వంటి పలు గ్రంథాల్ని రచించి తెలుగు పాఠక లోకానికి అందించిన బ్రహ్మశ్రీ గడియారం రామకృష్ణ శర్మ గారు తెలుగు దేశాన సుప్రసిద్ధులైన పండిత వర్యులు. వారి ప్రతిభ బహుముఖీనమైనది. అనేక కార్యక్షేత్రములకు వారి అసమాన ప్రతిభ కారణంగా చెప్పలేనంత మేలు జరిగింది. పలు వేదికలకు వ్యాపించిన వారి ప్రతిభ ఆయా వేదికలకే వన్నె తెచ్చింది. సాహిత్య, సామాజిక, రాజకీయ రంగాలకు విస్తృత సేవలందించిన వారి జీవితం ప్రతివ్యక్తి విధిగా అధ్యయనం చేసి నేర్చుకోవలసిన ఒక పాఠ్యాంశం అనడంలో ఎటువంటి సందేహం లేదు.

మహోజ్వల చారిత్రక నేపథ్యం కలిగి ఉన్న రాయలసీమలో జన్మించిన బ్రహ్మశ్రీ గడియారం వారు చిన్నవయసులోనే తెలంగాణకు వచ్చి ఇక్కడే స్థిరపడి ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఆలంపురాతో పాటు యావత్ తెలంగాణకు తమ సేవలను విస్తరింపజేశారు.

అనంతపురం జిల్లాకు చెందిన ''కదిరి''లో శ్రీ కాలయుక్తి నామ ఫాల్గుణ శుద్ధ చవితి (06.03.1919)న సుప్రసిద్ధ జ్యోతిష్యులు శ్రీ గడియారం జ్వాలాపతి శాస్త్రి, సుబ్బమ్మ దంపతులకు జన్మించారు. వారి ప్రాథమిక విద్య

1929 వరకు కదిరిలోనే కొనసాగింది. తన చిన్నాన్న గారైన రామశర్మ గారి వద్ద తాడిపర్తిలో సంప్రదాయ విద్యగా అమరకోశం, శబ్దమంజరి, రఘువంశాది గ్రంథాలను అభ్యసించారు. వాటితో పాటు తెలుగు భాషా సాహిత్యంలోని భారత, భాగవతాదులను కూడా చదవడం ప్రారంభించారు.

కొన్ని ప్రత్యేక కారణాల వల్ల శర్మ గారు మహబూబ్ నగర్ జిల్లాలోని ఆలంపుర గ్రామానికి 1929లో అంటే వారి 11వ యేట వచ్చి మరణ పర్యంతం తమ నివాసంగా దక్షిణ వారణాశి అని ప్రసిద్ధిచెందిన ఆలంపురాన్ని స్థిరపర్చుకున్నారు. 1930–31లో శర్మగారు ఆలంపురాలోనే తమ మాధ్యమిక విద్యను పూర్తిచేశారు. దాంతో శర్మ గారి జీవితంలో పాఠశాల విద్య ముగిసినట్లే. "పుణ్యగుణ భూమియైన ఈ తెలంగాణ సీమ" శర్మ గారి వంటి మహా విద్వాంసుని తనవానిగా చేసుకుంది.

పాఠ్యశాల విద్య ఆగిపోయినా శర్మగారిలోని జ్ఞానతృష్ణ తననొక జిజ్ఞాసునిగా మార్చినది. ఆ తృష్ణే శర్మగారిని మహావిద్వద్వరేణ్యులు, శతావధానులు, బ్రహ్మశ్రీ వేలూరి శివరామ శాస్త్రుల వారి సన్నిధికి చేర్చింది. వారివద్ద చేసిన శిష్యరికం శర్మ గారి జీవితంలోనే ఒక మహత్తర ఘట్టం. సంప్రదాయక రీతిలో కావ్య నాటకాలంకార వ్యాకరణములను అభ్యసించిరి. శర్మ గారిలోని సహజమైన ప్రతిభా పాండిత్యాలు గురువు గారి ప్రేరణ కారణంగా రాణించే సమయం రావడం వారి సహచర్యం వల్ల శర్మగారిలో నూతన వికాసం కలగడం వారి జీవితంలోనే అతిపెద్ద మలుపు. ప్రతి విషయంలోనూ ఉన్నత ఆదర్శాలకు మాత్రమే స్థానం కల్పించడం, త్రికరణ శుద్ధితో జీవన యానాన్ని సాధించడం, ఉత్తమ విలువలకు పెద్దపీట వేయడం, మానవతా దృక్పథానికి అంకితం కావడం వంటి సలక్షణాలు శర్మగారికి గురువు గారి వలన కలిగిన సుగుణాలు. 1937 నుంచి 1939 వరకు శర్మ గారు శాస్త్రి గారి వద్ద శిష్యునిగా ఉండి పలు విషయాలపై విస్తృత అవగాహనను పొందారు. పుత్రవాత్సల్య సమమైన వారి శిష్య వాత్సల్యం శర్మ గారి జీవితంపై గొప్ప ప్రభావాన్ని చూపించింది.

బ్రహ్మశ్రీ వేలూరి శివరామ శాస్త్రి గారి వద్ద నుంచి తిరిగివచ్చిన శర్మ గారు మరింత దీక్షతో వారు చూపించిన మార్గంలోనే విద్యార్జన కృషి సాగించి పఠనాపాఠనాదులను కొనసాగించి తమలోని ప్రతిభకు మరింత వన్నెపెట్టిరి. కవితా కళను సాగిస్తూనే పాండితీ బలాన్ని కూడా పెంపొందింప జేసుకున్నారు. ఆంగ్ల, హిందీ, కన్నడాది భాషా సారస్వతాల అధ్యయనం చేసి స్వయంకృషితో ఎన్నో లోతులు సాధించారు.

ఆలంపురమే స్థిరనివాసంగా చేసుకున్న శర్మ గారు అప్పటికే తాలూకాలో ప్రసిద్ధమైన గ్రంథాలయాలుగా పేరుబడ్డ ఉండవెల్లిలోని సరస్వతీ గ్రంథాలయంలోనూ, ఆలంపురాలోని రామకృష్ణారెడ్డి స్మారక గ్రంథాలయంలోనూ వివిధ గ్రంథాలను అధ్యయనం చేసి తమ వైదుష్యాన్ని అభివృద్ధి చేసుకున్నారు. ఈ సమయంలోనే శర్మ గారు తమ చదువుతో పాటు.. స్వీయానుభావం వలన, స్వయంకృషి వలన అనేక విద్యా విషయాలతో పాటు.. భావి జీవితానికి ఉపయుక్తములయ్యే పలు కార్యములకు సంబంధించిన విశేష జ్ఞాన సముపార్జన చేసి సమయాన్ని సద్వినియోగపర్చు కున్నారు.

కేవలం సాహిత్యవేత్తగానే గాక, శర్మ గారు ఒక చరిత్ర పరిశోధకునిగా, వాస్తు, శిల్ప, లిపి, శాస్త్రాదులందు అభిరుచిగల జిజ్ఞాసునిగా తమను తాము మలుచుకొని ఆయా రంగాలలో అధికంగా పరిశ్రమించి జ్ఞాన సముపార్జనం చేశారు. వీటితోనే సరిపెట్టుకోక.. నాటక కళారంగ సేవ, సమాజ సేవ, గ్రంథాలయోద్యమ నిర్వహణ, భాష ప్రచారోద్యమ సేవ వంటి పలు రంగాలకు తమ సేవలను విస్తరించారు.

1940–59 మధ్యకాలంలో నాటక రంగానికి విస్తృత సేవలందించారు. అనేక నాటక ప్రదర్శనలు నిర్వహించి ఆలంపురాలో 'ఆంధ్ర యువజన నాట్యమండలి'ని స్థాపించి దర్శకులుగా, నటులుగా హరిశ్చంద్ర, శ్రీకృష్ణ, బిల్వమంగళ, ఖడ్గ నారాయణాది పాత్రలను తామే ధరించి తెలుగు నేలపై విశేష ఖ్యాతినొందారు.

నాటి నిజాం ఏలుబడిలో తెలుగును, తెలుగుదనాన్ని మరిచిన ప్రజలకు తెలుగు పరిమళాలను వెదజల్లే ప్రయత్నమే ఆంధ్రోద్యమమై వ్యాప్తి చెందింది. స్వాతంత్ర్యోద్యమంలో మిక్కిలి ఉత్సాహంగా పాల్గొంటున్న శర్మ గారు అంతకు రెండింతల ఉత్సాహంతో ఆంధ్రోద్యమంలోనూ పాల్గొన్నారు.

ఉద్యమోప జీవియైన శర్మ గారు కొన్నాళ్లు ఆలంపుర తాలూకా కాంగ్రెస్ ప్రెసిడెంట్‌గా ఆ సంస్థకు ఇతోధిక సేవలందించారు. జిల్లా, రాష్ట్ర కాంగ్రెస్‌లో కూడా వారు సభ్యులే.

ఆంధ్రోద్యమంతో పాటు.. గ్రంథాలయోద్యమంలోనూ చురుకుగా పనిచేసిన శర్మ గారి కృషి అసాధారణం. 1940 నుంచి 1956 వరకు ఈ ఉద్యమాలే ఊపిరిగా శర్మ గారు పనిచేశారు. నైజాం వ్యతిరేక పోరాట కార్యక్రమంలో రహస్య రేడియో కేంద్రాన్ని కూడా నడిపిన గొప్ప కార్యశీలి రామకృష్ణ శర్మ గారు. త్యాగాలకు వెనుకాడకుండా పట్టుదలతో ఈ ఉద్యమాలలో మమేకమై పనిచేసిన శర్మగారు స్వాతంత్ర్యానంతరం రాజకీయాల్లో కల్మషాలకు విసిగి ఆ రంగాన్ని స్వచ్ఛందంగా వదులుకున్నారు.

వారిలోని ప్రధాన కోణం సాహిత్యం. తమలోని ప్రతిభా కార్యదక్షతలకు తోడైన మరికొందరు ఔత్సాహికులైన పెద్దల సహకారంతో “ఆంధ్ర సారస్వత పరిషత్”ను హైదరాబాద్‌లో ప్రారంభించారు. ప్రారంభం నుంచి సాన్నిహిత్యం ఉండుట కారణంగా దాదాపు తన జీవితపు చివరి అంచుల వరకు ఆ సంస్థకు శాఖా కార్యదర్శిగా, కేంద్ర సంస్థ ప్రచారకులుగా, కార్యవర్గ సభ్యులుగా, పరీక్ష కార్యదర్శిగా, సహాయ కార్యదర్శిగా, ప్రధాన కార్యదర్శిగా, ఉపాధ్యక్షులుగా పలు స్థాయిల్లో తమ విశిష్టమైన సేవలందించి దాని విస్తృతికి తమవంతు సహకారాన్ని అందించారు.

పత్రికా రంగం పట్ల ఆసక్తి ఉన్నవారు శర్మగారు. 1950-53 మధ్యకాలంలో “సుజాత” మాసపత్రికకు సంపాదకులుగా వ్యవహరించారు. “తెలంగాణ సంచిక” “సప్తమ వార్షికోత్సవ సంచిక”లుగా వారి సంపాదకత్వంలో వెలువడ్డ ప్రత్యేక సంచికలు. నేటికీ పలువురి ప్రశంసలకు పాత్రమవుతూనే ఉన్నాయి.

వారి మరో ప్రధాన రంగ చరిత్ర. విశేషమైన చరిత్ర కలిగిన ఆలంపురాలోని శ్రీ బాలబ్రహ్మేశ్వర దేవస్థానానికి ట్రస్టు బోర్డు అధ్యక్షులుగా 1954 నుంచి కొన్ని దశాబ్దాల పాటు గణనీయమైన సేవలందించారు గడియారం వారు. అసాధారణ శిల్ప సంబంధితములైన ఈ ఆలయాల అభివృద్ధి కొరకు పాటుపడ్డ శర్మగారి దక్షత అపూర్వం. శ్రీశైలం జలవిద్యుత్ ప్రాజెక్టులో మునిగిపోవలసిన ఈ క్షేత్రమును, ఇక్కడి ఆలయాలను బహు కష్ట ప్రయాసలకోర్చి వాటి రక్షణకై తీవ్ర కృషిసల్పి సఫలులైనారు. వారి సఫలత్వానికి నిలువెత్తు సాక్ష్యమై చుట్టూ కనిపించే రక్షణ కుడ్యము.

కీర్తిశేషులు గడియారం రామకృష్ణ శర్మగారు తమ 18వ యేటనే చంద్ర హాసోపాఖ్యానం అనే పద్యకావ్య రచన చేసి సాహిత్య రంగంలోకి అడుగుపెట్టారు. ఆలంపుర శిథిలములు, దక్షిణ వారణాశి ఆలంపుర క్షేత్రం వంటి చరిత్ర సంబంధించి రచనలతో పాటు.. భారతదేశపు చరిత్ర, ప్రపంచ రాజ్యముల వంటి గ్రంథములను వారు అందించారు. మన వాస్తు సంపదను గురించి వారు రాసిన గ్రంథము ఆ శాస్త్రంలో శర్మ గారికి ఉన్న పాండిత్యానికి నిదర్శనం. భారతీయ వాస్తు శిల్ప విజ్ఞానం అను గ్రంథము కూడా ఈ కోవలోనిదే. చరిత్ర పరిశోధన మాత్రమే కాక.. శాసన పరిశోధనలోనూ పరిణత ప్రజ్ఞ కలిగిన శర్మ గారు వినయాధిత్యుని పల్లెపాడు తామ్ర శాసనం తెలంగాణ శాసనములు (రెండో భాగం) కూడా వెలువరించారు. వారు కన్నడం నుంచి అనువదించిన బి.ఎం. శ్రీ కంఠయ్య గారి గదాయుద్ధ నాటకమునకు 1970లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. కన్నడంలోని చిన్న కథలను కూడా వారు అనువదించారు. వారికి తెలుగు సిరి పాంచజన్యములు మనోజ్ఞమైన పద్యకావ్యములు. బాలబాలికపై వారు ‘వీరగాథలు’ అనే కథా సంపుటిని కూడా వెలువరించారు. ఇంకా పలు అముద్రిత గ్రంథాలుగా వారి రచనలు మిగిలిపోయాయి. విస్తృత సాహిత్య సేవ వారి జీవితంలో ప్రధాన భాగం. వారు నెల్లూరు, కర్నూలు, హైదరాబాద్, మహబూబ్‌నగర్ వంటి ఎన్నోచోట్ల విరివిగా సాహిత్య, సాంస్కృతిక, చారిత్రక విశేషాలపై వందలాది ప్రసంగాలు చేసి ఒక గొప్ప చైతన్యాన్ని కలిగించారు.

వీరిలోని కార్యదక్షతకు, మేధాశక్తికి అబ్బురపడిన అనేక సంస్థలు వారి సేవలను ఉపయోగించుకున్నాయి. వారు 1965 నుంచి 1975 వరకు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ సభ్యులు. 1968-70లలో కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి సభ్యులు. 1962 నుంచి దాదాపు ఒక దశాబ్ద కాలం వారు గ్రంథాలయ సంస్థ సభ్యులు. 1970 ప్రాంతంలో ఆంధ్రోద్యమ చరిత్ర నిర్మాణ సంఘంలో సభ్యులు. ఉస్మానియా విశ్వవిద్యాలయం

అకాడమిక్ కౌన్సెల్‌లో 1970 నుంచి సభ్యునిగా సేవలందించారు. ఇవి మాత్రమే కాక ఆలంపుర తాలూకాలోని రైతుల కొరకు కృషిచేసి రైతులందరినీ సంఘటితపర్చి "ఆలంపుర వ్యవసాయ సంఘాన్ని" ఏర్పర్చిరి.

వీరి ఆత్మకథ "శతపత్రం" 2007లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని అందుకున్న ప్రశస్య గ్రంథం. 1977లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వీరిని విశిష్ట సభ్యులుగా గుర్తించి ఘన సన్మానాన్ని అందించడం శర్మ గారి సాహిత్య వ్యకిత్వానికి ఒక గొప్ప ఉదాహరణ.

వీరిలోని మరో ఘనమైన పార్శ్వం సంఘ సంస్కరణ. మూఢాచారాలను తీవ్రంగా వ్యతిరేకించే శర్మగారు 1945 నుంచి 1965 వరకు స్త్రీ జనాభ్యుదయం కొరకు ఒక మహాసంస్థ వలె కృషిచేశారు. స్వయంగా వితంతు వివాహం చేసుకున్న శర్మ గారు ఆ స్ఫూర్తితో ఆ రోజుల్లో హైందవ బాలవితంతువుల వివాహాలు తాము దగ్గరుండి జరిపించడమే గాక.. ఎదిరించిన పండితులతో శాస్త్ర వాదములు చేసి పునర్ వివాహములు శాస్త్ర సమ్మతములేనని నిరూపించు కున్నారు. ఆలంపురాలో అనాథ స్త్రీల కొరకు ప్రత్యేక విద్యాలయం స్థాపించి హిందూ, ముస్లిం, క్రైస్తవ విద్యార్థిను లకు శిక్షణ ఇప్పించారు. దానివల్ల పలువురు స్త్రీలు జీవనోపాధి పొందడం శర్మ గారి కృషికి ఫలితం.

గడియారం రామకృష్ణ శర్మగారి జీవితం ఒక మహాత్ముని జీవితం వంటిది. స్వాభిమానంతో స్వతంత్ర జీవనాన్ని గడిపి తాము జీవించినంత కాలం లోకోపకారమే లక్ష్యంగా సాగిన మాన్యులు శ్రీ రామకృష్ణ శర్మగారు 2006, జూలై 25వ తేదీన తుదిశ్వాస విడిచారు. భౌతికంగా శర్మ గారు లేకున్నా తెలుగు నేలపై సాహితీ సంస్కృతులు విలసిల్లినంత కాలం శర్మ గారు చిరంజీవులే.

# 47 గణపతి రామచంద్రరావు

– గన్ను కృష్ణమూర్తి

జన్మస్థలం : ఇబ్రహీంపట్నం

పుట్టినతేదీ : 25.07.1940 పరమపదించినది 12.10.2005

తల్లిదండ్రులు : కీర్తిశేషులు యమునా బాయి, లక్ష్మీకాంతరావు

వృత్తి : వ్యవసాయం

ప్రవృత్తి : సాహిత్యం (అధ్యయనం, పరిశీలన, పరిశోధన, విమర్శ లేఖనం, మననం, ప్రవచనం, చర్చాగోష్ఠి)

**రచనలు**

ఆముద్రితాలు 1. శ్రీనివాస శతకం (సీసములు) 2. సంతోషీమాత శతకం (మంజరులు) 3. వేంకటేశ్వర శతకం (చంపకోత్పల మాల) 4.లక్ష్మీకాంతం (మంజరులు) 5. ధర్మపురి లక్ష్మీ నరసింహ శతకం (మధ్యాక్కరలు) 6. బాసర జ్ఞాన సరస్వతీ శతకం (మత్తకోకిలు) 7. శ్రీచక్ర శతకం (శార్దూల మత్తేభములు) 8. వరదాచార్యోదాహరణం 9. హృద్యపద్య కావ్య సంహిత 10. శ్రీ దుబ్బ రాజేశ్వర శతకం (తేటగీతలు)

ఆముద్రితాలు 1. గాయత్రీ శతకం (స్రగ్విణులు) 2. నీలకంఠేశ్వర శతకం (శార్దూల మత్తేభములు) 3.ఉమామహేశ్వర శతకం (సుగంధులు) 4. శ్రీ గణేశ శతకం (గేయాలు) 5. ఆంజనేయ శతకం (తేటగీతులు) 6. సుకవి రాట్మూర్తి శతకం (ఆటవెలదులు) 7. కవి రామేశ శతకం (కందములు) 8. బంధుకవిత్వ శతకం (అనేక వృత్తములు) 9. సరస్వతీదేవి ఉదాహరణం 10. మధుపానం (సప్తా శ్వాస గేయమహా ప్రబంధం)

నేను నిజామాబాద్‌లో (1929–89) వాణిజ్య శాస్త్రోపన్యాసకునిగా పనిచేస్తున్న రోజుల్లో వారితో నాకు పరిచయమేర్పడింది. అప్పుడు శ్రీ తిరునగరి నరసింహులు గారిచే స్థాపించబడి, నడిపించబడుతున్న 'నిజామాబాద్ జిల్లా రచయితల సంఘం' వేదికపై నా రెండవ కార్యం 'కవితా కాళించి' డాక్టర్ ఇరివెంటి కృష్ణమూర్తి గారిచే ఆవిష్కరించ బడింది. ఆ సందర్భంగానే వీరితో మొదటిసారిగా నాకు పరిచయమేర్పడింది.

నిజం చెప్పాలంటే వారిని చూస్తే మహామహులకు దడపుట్టేది. సాహిత్య పీఠాధిపతులకు సైతం వీపులో వణుకు పుట్టేది. ఆపై చెమటలు పట్టేవి. ఒక పులినో, సింహాన్నో చూసినట్లుగా భయపడేవారు. 'మా జోలికి రాబోకండి! అన్నట్లుగా వేదికలపై కనబడగానే తమ రెండు చేతుల్ని జోడించి వినయ విధేయతలతో నమస్కరించేవారు. కారణం ఎక్కడ, ఏ దోషం కనపడినా, నిర్భయంగా, నిర్మొహమాటంగా ముఖం మీదే కడిగేసే వారాయన. ఆయన వాగ్ధాటి కూడా

అనుపమానం. ఏ విషయంపైనైనా తడుముకోకుండా, తట్టుకోకుండా అనర్ఘలంగా మాట్లాడగలిగేవారు. ఒక్కమాటలో ఆయన ప్రచండ భాస్కరుడే.

వారెప్పుడైనా, ఎక్కడైనా తన అభిప్రాయాన్ని కుండ బద్దలు కొట్టినట్టుగా చెప్పేసేవారు. దీనికొక ఉదాహరణ. ఓసారి ఓ మహాకవి తన కావ్యాన్ని వీరికిచ్చి అభిప్రాయం రాసిమ్మన్నారు. వార్తా పుస్తకంలోని తమ ముందు మాటలో సృష్టి త్రిముఖాత్మాకం అని రాసిఇచ్చారు. వీరి దేగచూపు దానిపై పడింది. వీరు వారిని నిర్మొహమాటంగా ఖండిస్తూ "సృష్టి త్రిమూఖాత్మాకం కాదు చతుర్ముఖాత్మకం. కారణం సృష్టికర్త అయిన బ్రహ్మ చతుర్ముఖుడు కాబట్టి అంటూ రాసిచ్చాడు.

అలాగే మరోమారు అదే మహాకవి గారు 'అభినవ పోతన వానమాముల వరదాచార్యులపై రాసిన కవితా ఖండిక ఒకటి వీరి దృష్టికి వచ్చింది. అందులో వారు 'గుండెలోన రసవదర్ద భాండమ్ములు గలవాడా ! గొంతులోన పుంస్కోకిల కూజితములు గలవాడా ! నిన్నేమని వర్ణింతును అన్నా ! వరదన్నా ! అంటూ రాశారు వారు.

'ఆం.. ఏమున్నదిందులో? నీ గుండెలో కల్లుకుండులున్నాయని చెబుతున్నాడు కవి' అన్నాడట వెక్కిరింతగా తన శిష్యులతో వీరు. అది ఈ నోటా, ఆ నోటా పాకి ఆ మహాకవుల వరకు చేరిందట. ఆయన తలపట్టుకున్నాట్ట. ఏమిటండి ! అని శిష్యులనడిగితే 'నిజమే వారు చెప్పేది నిజమే ! ఇలా మనకు చెప్పేవారు లేరు' అని బాధపడ్డారట.

ఇదొక ఉదాహరణ మాత్రమే. ఇలాంటి వ్యాఖ్యలు, విమర్శలు వారెన్ని చేసి ఉంటారో చెప్పలేం. వారు దర్శించే విధానమే వేరుగా, విలక్షణంగా ఉండేది. దానికి మరో ఉదాహరణ.

నేను 'అంతరంగం' పేరిట కొన్ని మినీ కవితల్ని రచించి ప్రచురించాను. వాటిపై వారి అభిప్రాయాన్ని తీసుకున్నాను. అందులో ఒక కవిత ఇలా ఉంది –

'ఆకాశంలో అక్షరాల నక్షత్రాలు ! చివరన ఫుల్‌స్టాప్‌గా చంద్రుడు. ఈ ఉత్తరం ఎవరికో! ? అనగా ఆకాశంలో నక్షత్రాలు వరుసగా ఒక వాక్యరూపంలో ఉన్నామని, వాని చివర ఒక పూర్ణబిందువు చంద్రుడున్నాడని, ఈ ఉత్తరం లేదా లేఖ ఎవరి కోసమో కదా !' అని ఆశ్చర్యపోవడమిది.

కానీ గణపతి గారెలా దానిపై స్పందించారో చూడండి.

'ఈ ఉత్తరం (అనగా ఉత్తరధ్రువం) దక్షిణ ధ్రువవాసుల కొరకు' అని రాశారు. నేనాశ్చర్యపోయాను. ఇలా కూడా అర్థాన్ని చెప్పుకోవచ్చునా ? అని.

ఇలా ఆయన ప్రజ్ఞ అమోఘం. బహుముఖీనం. పద్యం రాశారు. గేయం రాశారు. ఉదాహరణ కావ్యాల్ని, ఖండకావ్యాల్ని రాశారు. అచ్చతెనుగులోనూ, హలంత తెలుగులోనూ కవిత్వం రాశారు. ఒకటీ.. అరా కాదు. మూడు లక్షణ గ్రంథాల్ని రచించారు. అవి 1. పొడశాలంకాల శబ్ద కళాశాస్త్రం 2. గేయ ఛందశ్శాస్త్రం 3. బంధ కార్య లక్షణం శాస్త్రం. అంతేకాదు... ప్రాచీన రసశాస్త్రాల్ని తిరస్కరిస్తూ 'రసభూమిక' పేరిట రసజ్ఞాన సర్వస్వమును తెలిపే గ్రంథాన్ని సైతం రచించమన్నారు వీరు. ఆపై ఇల్లిల్లూ తిరిగి సమాచారాన్ని సేకరించి కరీంనగర్ మండల చరిత్ర, మెట్‌పల్లి సమితి చరిత్రలను సైతం వ్రాసియున్నారు. నిజామాబాద్ జిల్లా చరిత్ర కోసం కూడా కొంత కృషిచేశారు వీరు. తెలంగాణకు చెందిన అనేక కవిపండితులను సన్మానించి, సత్కరించి 'అపర కృష్ణదేవరాయలన్న' బిరుదును సొంతం చేసుకున్నారు. వందలాది కవుల కావ్యాల్ని పరిష్కరించారు. అనేక సాహిత్య సంస్థలతో, కవి పండితులతో సత్సంబంధాల్ని ఏర్పర్చుకున్నారు. అనేక సంస్థల్లో అధ్యక్షులుగా, గౌరవాధ్యక్షులుగా సలహాదారులుగా ఉన్నారు. అనేక వేదికలపై ముఖ్యఅతిథిలుగా, కార్యక్రమ అధ్యక్షులుగా వ్యవహరించారు.

అంతేనా.. ! భగవద్గీత అంతరార్థాన్ని ఆకళింపు చేసుకున్నారు. భగవద్గీత ఆయన నాల్కపై నడయాడేది. అంతేకాదు.. భగవద్గీతపై అవధానం చేయగల స్థాయికి ఎదిగారు. వీరు వ్రాసినన్ని చిత్రకవితలు, బంధగర్భ కవితలు మరొకరు వ్రాసిఉండరు. ఒకే పద్యంలో చతుర్విధ కవిత్వములను చూపిన మహా మహుడీయన. అంతేనా! రోజుకొక శతకం చొప్పున పది శతకాలను రాసి సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తిన వారు. ఒకే ఒక అచ్చ తెనుగు ఏకాక్షర శబ్దాలతో, పంచవింశతి బంధాలతో రాసి

చూపినవారు. షోడశ కళాపూర్ణమగు వీరి కవిత్వమందు పూర్వ మహాకవుల పద్యములు వెలవెలబోయేవి.

ఇలా వారు ఒక పండిత కవిగా, క్షణికులే కాక యోగవిద్యలోనూ గొప్ప సాధన చేసిన యోగపుంగవులు. 1991లో హైదరాబాద్‌లో జరిగిన యోగ విద్యా పోటీల యందు స్వర్ణ పతకాన్ని గెలుచుకున్న మహామహులు వీరు.

వీరు పంచ మహాకావ్యాలను లోతుగా అధ్యయనం చేశారు. ఉపనిషత్తులను అవపోసన పట్టినారు. ఆపై తమ చివరి రోజుల్లో జ్యోతిష్యంలోనూ సాధికారత సంపాదించినారు. అది ఎంతవరకు వెళ్లిందంటే పంచాంగకర్తలు సైతం వీరి వద్దకు వెళ్లి తమ సందేహాల్ని తీర్చుకొని వెళ్లేవారు.

కానీ వీరు వచన కవిత్వాన్ని కవిత్వంగా అంగీకరించే వారు కారు. అయినా అనేకమంది వచన కవులతో సత్సంబంధాల్ని కలిగి ఉండేవారు. హిందీ, ఉర్దూ, సాహిత్య సంస్థలతోనూ, సభ్యులతోనూ సంబంధాలు కలిగి ఉండేవారు.

వారు ఏ ఊరికి వెళ్లినా కవిపండితుల్ని కలిసి తనివి తీరా మాట్లాడి కానీ తిరిగి వెళ్లేవారు కారు. వీరిలా ఎంతటి ప్రతిభావంతులైనా.. ఎదుటివారిలో ఏమాత్రం ప్రతిభ కనబడినా గొప్పగా స్పందించి ప్రశంసించేవారు. భుజం తట్టి ప్రోత్సహించే వారు. నేను రాసిన రామాయణ రహస్యాలు పేరిట దాదాపు రెండు సంవత్సరాలు సీరియల్‌గా ప్రచురించబడింది. ఇటీవల అది 'రామ్ కౌన్ హై ? రామయణ్ క్యాహై ?' అన్నపేరిట వై.వి.రమణరావు గారితో అనువదింపబడి ముద్రింపబడినది కూడా. వీరు కేవలం నా వ్యాసాన్ని మాత్రమే చూశారు. చూచి.. ఒక సాగరంలా ఉప్పొంగిపోయారు.

ఆ తర్వాత ఇది 'రాముడంటే ఎవరు ? రామాయణ మంటే ఏమిటి ?' అన్న పేరుతో పుస్తకంగా ప్రచురించబడి మహామహుల ప్రశంసలెన్నింటినో అందుకున్నది. అప్పుడు వీరు లేరు.

వారి హృదయం ఎటువంటిదో, వారి స్పందన ఏ విధమైనదో.. ప్రపంచానికి చాటిచెప్పడానికే. అందుకే నేను అంటుంటాను. 'ఎదుటివాని ప్రతిభను గుర్తించడమూ ఒక ప్రతిభేనని' ఇలా అందులోనూ వీరు అత్యంత ప్రతిభావంతులే ! సందేహం లేదు.

మన తెలంగాణ ఆవిర్భావానికి పూర్వమే వీరు 'నా తెలంగాణ'యనే ఖండ కావ్యాన్ని రచించియున్నారు. దానిలోని ఒక పద్యాన్ని ఉదహరిస్తున్నాను చూడండి.

'నా తెలంగాణ కావ్యాంగన ముఖాంచత్కళా మూర్తి
నా తెలంగాణ శృంగార నాళిక మకరంద వర్తి
నా తెలంగాణ విజ్ఞాన నందనోద్యాన సూనమ్ము
నా తెలంగాణ భూలోక నాకమ్ము నాదు ప్రాణమ్ము'

గతంలో ముఖాల్ని చూచి గౌరవించే సమాజం మనది. పైరవీలకు పట్టంగట్టే సమాజం మనది. ప్రతిభా వ్యుత్పత్తులను పాతరేసే సమాజం మనది. అందువల్ల వీరికి తగినంత గుర్తింపు లభించలేదు. ఏ విశ్వవిద్యాలయంలోనో, ఏ ఉన్నత సాహిత్య పీఠం మీదనో ఉండవలసిన వారు వీరు. వీరి రచనలపై పరిశోధనలు జరపవలసిన అవసరం వీరి ప్రతిభా పాటవాలను రాబోవు తరాలకు అందజేయాల్సిన బాధ్యత మన భుజస్కంధాలపై ఉన్నది.

వీరింకా జీవించి ఉంటే మరెన్ని అద్భుతాలను సృష్టించి ఉండేవారో.. ? వీరు లేని లోటు తీర్చలేనిది. వీరి ప్రతిభా వ్యుత్పత్తుల్ని పొగడడానికి శారదకైనా మాటలు చాలవేమో ! అందువల్ల "సర్వయుగ కవి సమ్రాట్"వ అన్న వారి బిరుదు సముచితమైనదే కాదు.. సార్థకమైనది కూడా !

వీరికి అంజలి ఘటిస్తూ.. శ్రీ ఎఱ్ఱాప్రగడ రామమూర్తి గారి పద్యంతో జేజేలు పలుకుదాం.

సర్వయుగ కవి సామ్రాట్టు జైత్రయాత్ర
చిత్రముల లోనికెలల్ల విచిత్రమగును
వర్తమాన మా దిశ నిరువైపులకిది
సర్వ కాలావధులు దాటి సాగిపోవు.

# 48 గోపాల్‌రాజ్ భట్

**– రాయప్రోలు రమణ**

జానపద కళా చిత్రరూపశిల్పి "గోపాల్‌రాజ్ భట్". చివరి నిజాం నవాబు పాలనా కాలంలో భారతదేశ స్వాతంత్ర్యానికి ముందు తెలంగాణ ప్రాంతంలో వెన్నెల కిరణం జానపద కళపై ప్రసరించింది. వసంత మేఘమై వర్షించింది. గిరిజన, లంబాడీ, గోండు బలహీన వర్గాలు వారి వారి సంప్రదాయ పాట, ఆట. మాటకు గుర్తింపు గౌరవం కల్పించిన గోపాల రాజ్ భట్ చెన్నమాధవుని ఆ వెలుగు రేఖ. సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో జానపద కళకు బాటలు వేసిన మార్గదర్శి.

జానపద కళ అనే పదానికి విలువ, అర్థం తెలియని రోజుల్లో స్వయంగా దేశంలోని వివిధ ప్రాంతాల్లోని ఆదివాసీ, గిరిజన, లంబాడీ తెగల వారితో మమేకమై వారి సాంప్రదాయం, స్వభావం, వేషభాషలు అవగాహన చేసుకుని కొంత మెరుగులద్ది నగర పట్టణ ప్రాంతాలకు మార్గం పట్టించిన గోపాల్‌రాజ్ భట్ జానపద కళాబ్రహ్మగా గుర్తింపు పొందారు. వివిధ రాష్ట్రాల రాజధానుల్లోనే గాక దేశరాజధానిలో సైతం రిపబ్లిక్‌డే. ఇతర ప్రభుత్వ కార్యక్రమాల్లో గోపాల్‌రాజ్ భట్ బృందం. జానపద కళా ప్రక్రియలదే నాడు తొలిస్థానం.

1928 జూన్ 9న తెలంగాణలోని కరీంనగర్ జిల్లాలోని సుల్తానాబాద్ తాలూకాలో కర్రేపల్లి గ్రామంలో జన్మించారు గోపాల్‌రాజ్ భట్. ఆరేళ్ళ వయస్సులోనే పగటి వేషాలు గట్టి అందరిని ఆశ్చర్యపరిచేవారు. తండ్రి వెంకట రామరాజు భట్ ప్రభుత్వ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు కావడంవల్ల తెలుగు భాషా పరిజ్ఞానం అబ్బింది. బాబాయి చిత్రలేఖకుడు. గాయకుడు. ఆయనను అనుసరిస్తూ ఉండడంవల్ల సంగీత జ్ఞానం అబ్బింది.

1945లో ప్రీమెట్రిక్ పూర్తి చేసాడు. చిత్రలేఖనంపై మక్కువతో ఫైన్ ఆర్ట్స్‌లో ఐదు సంవత్సరాల డిప్లొమా ఉత్తీర్ణుడయ్యాడు. హైదరాబాద్‌లోని ఉర్దూ షరీఫ్ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న కాలంలో జానపద సాంప్రదాయం రీతులపై దృష్టి మళ్ళింది.

వివిధ ప్రాంతాల గిరిజన ఆదివాసీ తెగల ఆచార వ్యవహారాలు వారి సాంప్రదాయ కళలపై నిశిత పరిశోధన చేసి ఆ కళలకు తన సంగీత పరిజ్ఞానం జోడించి చిత్రలేఖనం లోని మెళకువలతో జీవం తొణికిసలాడేలా కళాకారుల రూపాలను తీర్చిదిద్ది 1950 ప్రాంతం నుంచి భాగ్యనగరంతో పాటు ఇతర ప్రాంతాలలో జానపద కళలు లంబాడీ, గుస్సాడీ, గోండు థింసా, గురువాయలు తప్పెట గుళ్ళు, బోనాలు తదితర కళా ప్రక్రియల ప్రదర్శనలను నిర్వహించారు. స్వయంగా గోపాలరాజ్ వారితో కలిసి నర్తించేవారు.

చిత్రలేఖనంలో ఆరితేరిన చేయి అయినందున జానపద నర్తకుల రూపాలను చిత్రాలుగా రూపకల్పన చేయడంలో ప్రముఖుల ప్రశంసలు అందుకున్నారు. ప్రఖ్యాత నటుడు పృథ్వీరాజ్ కపూర్ కూడా ఈయన రూపసృష్టికి

అచ్చెరువు చెందారు. జానపద కళలల్లో గోపాలరాజ్ ప్రతిభకు గుర్తింపుగా సంగీత నృత్యకళాశాలలో జానపద కళల తొలి ఆచార్యునిగా నియమితులయ్యారు. తదనంతరం కాలంలో తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పడిన తరువాత జానపద కళాపీఠానికి తొలి అధిపతిగా నియుక్తులైనారు.

ప్రముఖ కవి డాక్టర్ సి. నారాయణరెడ్డి సహచర్యంలో ఉర్దూ భాషా సాహిత్యంతోపాటు, తెలుగు భాషా సాహిత్యాన్ని వంటపట్టించుకొని స్వీయ రచనలతో జానపద రూపకాలను మలచారు. అప్పటి రాష్ట్ర సంగీత నాటక అకాడమీలో సభ్యులుగా నృత్య అకాడమీ సంయుక్త కార్యదర్శిగా సమైక్యాంధ్రప్రదేశ్‌లోని జానపద కళావైభవాన్ని జాతీయ అంతర్జాతీయ వేదికలపై నిలిపిన ప్రతిభాశాలి. గోపాల్‌రాజ్ భట్టును ఎరుగని గౌరవించని ప్రధానులు, రాష్ట్రపతులు నాడు లేనరడం అతిశయోక్తికాదు.

నెహ్రూ, లాల్‌బహదూర్‌శాస్త్రి, ఇందిరా గాంధీ, రాజీవ్‌గాంధీ, పి.వి. నర్సింహారావు ప్రధానులు బాబూ రాజేంద్రప్రసాద్, డా. సర్వేపల్లి రాధాకృష్ణన్, డాక్టర్ వివి గిరి రాష్ట్రపతులు. ఆయన ప్రదర్శనలను వీక్షించి అభినందించినవారే. దేశ సరిహద్దు నేపాల్ సైనికులను ఉత్తేజితులను చేస్తూ జానపద నృత్యాలను 300 మందికి పైగా కళాకారులతో నిర్వహించి జేజేలు అందుకున్న మహా కళాస్రష్ట.

దేశంలోని అన్ని నగరాలతోపాటు పశ్చిమ, ఈశాన్య, రాష్ట్రాలలోనూ ప్రదర్శనలివ్వడమేగాక అక్కడి ఆదివాసి మూలవాసీయుల కళారూపాలను అధ్యయనం చేసి వారి కళారూపాలను దేశంలోని అన్ని ప్రాంతాలకు పరిచయం చేసిన సృజనశీలి, సమైక్య రాష్ట్రంలో నాటి ముఖ్యమంత్రులు చెన్నారెడ్డి, అంజయ్య, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, నేదురుమిల్లి జనార్దనరెడ్డి వంటి వారేకాక ఎన్టీఆర్ సైతం ప్రభుత్వోత్సవాల్లో జానపద కళారూపాలపై గోపాల్‌రాజ్‌ను సంప్రదించేవారంటే ఆయనకు జానపదంపై ఉన్న అవగాహన విశేష పరిజ్ఞానానికి తార్కాణం.

తెలంగాణ జానపద కళారూపాలు డప్పు – చిందు, యక్షగానం, గొల్లసుద్దులు, బతుకమ్మ, గోండు, థింసా, బోనాలు, శారద కథలు వంటి కళారూపాలతోపాటు రాజస్థాన్, జార్ఖండ్ మహారాష్ట్ర, గుజరాత్, పంజాబ్‌ల జానపద నృత్యాలు గుమాల్, సంతాల్, కోయి, కుండియత్‌వాస్, గిడ్డాలలో సైతం శిక్షణ ఇచ్చి ఆ కళారూపాలను దేశమంతటా ప్రదర్శించారు. జాతి సమైక్యతకు సంస్కృతి కళల పరస్పర అవగాహన సౌభ్రాతృత్వానికి వీరి ప్రదర్శనలు దోహదం చేసేవి.

దేశరాజధాని ఢిల్లీలో రిపబ్లిక్‌డే ఉత్సవాల్లో 1952లోనే తెలంగాణ బతుకమ్మ ప్రదర్శించిన ఘనత ఈయనదే. లంబాడీ, గిరిజన తండాల వారిని హైదరాబాద్‌లోని తన ఇంటిలో వసతి కల్పించి వారిని ప్రదర్శనలకు తీసుకెళ్ళడంతో పాటు వారి జీవన శైలిలో మిళతమైన కళారూపాలను తన శిష్యులు చూసి నేర్చుకునేవిధంగా గురుకులాలని నిర్వహించిన గోపాల్‌రాజ్ భట్టు తన గృహానికి “జానపదం” అని పెట్టుకున్నారు.

దేశరాజధాని ఢిల్లీలో ఏషియన్ గేమ్స్ ప్రారంభ, ముగింపు ఉత్సవాల్లో గోపాల్‌రాజ్ భట్టు 400 మంది కళాబృందంతో ప్రదర్శించిన నృత్యాలు అపురూపం, అపూర్వమని ప్రశంసలు అందుకున్నారు. పలు రాష్ట్రాల్లోని జానపద అకాడమీలలో సభ్యునిగా జానపదమే జీవనంగా ఆరు దశాబ్దాలు దేశీయ జానపద కళకు జీవితాన్ని అంకితం చేసారు.

భారత్ ఫోక్ ఆర్ట్స్ అకాడమీని స్థాపించి రాష్ట్రేతర ప్రాంతాల వారికీ శిక్షణనిచ్చి భవిష్యత్తు తరాలకు జానపదాన్ని అందించిన క్రాంతిదర్శి, నాడు ప్రభుత్వ కార్యకలాపాల్లో గోపాల్‌రాజ్ భట్టు బృందం జానపద నృత్యాలు తప్పనిసరి. దక్కన్ రేడియో ప్రారంభోత్సవం రవీంద్రభారతి ప్రారంభోత్సవం, ఉపగ్రహ దూరదర్శన్ ప్రారంభోత్సవంలతో పాటు ప్రపంచ తొలి తెలుగు మహాసభల ప్రారంభోత్సవ సందర్భంలో సినారె రచించిన తరతరాల తెలుగు వెలుగు నృత్య రూపకంలో ప్రాచీన కవులు నన్నయ్య, తిక్కన్న పోతన, వాగ్గేయకారులు త్యాగయ్య, రామదాసు వంటి పాత్రల్లో నటించి ప్రశంసలు అందుకున్నారు.

రాష్ట్రంలో సంగీత నాటక అకాడమీ ఆవిర్భావ సందర్భంగా ప్రఖ్యాత నాట్యాచార్యులు వేదాంతం సత్యనారాయణ శర్మ మోహినిగా కోరాద నర్సింహారావు

భస్మాసురినిగా జాలరి నృత్యకళాకారుడు సంపత్‌కుమార్, శివునిగా నటించగా గోపాల్‌రాజ్ భట్టు వారికి సరి ఉజ్జీగా నారదునిగా నటించి మోహిని భస్మాసుర నాటకాన్ని రక్తికట్టించిన సంగతి నేటికీ నాటి ప్రముఖుల మనస్సుల్లో నిలిచి ఉన్నాయి.

గోపాల్‌రాజ్ భట్టు జానపద కళాకారునిగా గాక, బహుముఖాలుగా ఆయన ప్రతిభ ఆవిష్కృతమైంది. చిత్రలేఖనంలో ప్రవీణతవల్ల రంగలు సమ్మేళనంలో పూర్తి అవగాహన కల్గి కళాకారులకు పాత్రోచిత ఆహార్యం రూపకల్పన చేయగల ఉత్తమ రూపశిల్పి సంగీతంపై పట్టు ఉండడంతో శిష్యులకు పాటల్లోనూ శిక్షణ నిచ్చి, రాగ, తాళ జ్ఞానం నేర్పిన మంచి సంగీతజ్ఞుడు.

వేదికపై రంగోద్దీపనం, రంగస్థల అలంకరణ మైక్ సెట్టింగ్‌లపై పరిజ్ఞానం గల థియేటర్ పర్సనాలిటి. దేశవ్యాప్తంగా ఐదువేలకు పైగా శిష్యులకు శిక్షణ ఇచ్చిన గోపాల్‌రాజు భట్టుకు శిష్యులు దేశవిదేశాల్లో ఎందరో. నలభైవేలకు పైగా ప్రదర్శనలు ఆయన కీర్తికిరీటానికి వన్నెలద్దాయి.

శాస్త్రీయ, నృత్యకారులను జానపదం నేర్చుకుంటే సహజమైన అభినయం పట్టుపడుతుందని చెప్పే గోపాల్‌రాజ్ రంగస్థలం ప్రేక్షకుల మనస్సులో నిలిచి ఉండేలా ప్రదర్శన ఉండాలని శిష్యులకు బోధించేవారు.

కేవలం కళా ప్రదర్శనలేగాక సామాజిక సేవా కార్యక్రమాల్లో నేనుసైతం అంటూ ముందుకు వచ్చేవారు.

దివిసీమ తుపాన్ సందర్భంగా తన కళాబృందంతో దాదాపు నెలరోజులపాటు ఆ ప్రాంతంలోనే ఉండి బంధుమిత్రులను ఆస్తులను కోల్పోయిన అభాగ్యులకు నూతనోత్సాహం తన ప్రదర్శనల ద్వారా ఇచ్చిన విశేషాలను నాటి వారు ఇప్పటికి చెప్పుకుంటారు. ప్రఖ్యాత బాలీవుడ్ నటుడు మెహమూద్ ఇబ్బందుల్లో ఉన్న సందర్భంలో సౌజన్యప్రదర్శనలు (చారిటీ షోస్) నిర్వహించి, వారి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. ఇట్టి ఉదంతాలు ఎన్నో....

సినీ నటులు ఎన్టీఆర్, ఏఎన్ఆర్, జగ్గయ్య, రావుగోపాలరావు, కాంతారావు, ప్రభాకరరెడ్డి, గుమ్మడి, జమునలతో సన్నిహితంగా మెలిగినా సినీ నటునిగా స్ఫురద్రూపి అయినందున అవకాశాలు వచ్చినా జానపద కళకే అంకితమయిన జానపద కళాజీవి.

జానపద గాయకుడు ఎం. నర్సింహమూర్తిని ప్రోత్సహిస్తూ తన ప్రదర్శనల్లో స్థానం కల్పించారు. జానపదానికి పర్యాయపదంగా ఆ కళకు దశ, దిశ చూపిన నిర్దేశకునిగా గోపాల్‌రాజ్ భట్టు ఆరు దశాబ్దాల కళాజీవితం 2006 జనవరి 29లో అమరజీవనత్వం పొందింది.

ఆయన వెలిగించిన జ్యోతిరేఖల్లో ఎందరో జానపద కళాకారులు వెలుగులోకి వచ్చారు. ఆయన వారసత్వంగా వారి ఇరువురి కుమారుల్లో ఒకరు రూపశిల్పి కాగా మరొకరు ప్రముఖ కథక్, జానపద కళాకారుడు రంగరాజు భట్టు. కుమార్తెలిరువురు జానపద నృత్య కళల్లో ప్రతిభాశీలురు. ఒక ప్రముఖుడు మాటల్లో... "Gopal Raj Bhatt highly disciplained, sensor of manner. Dressed simple with dedication, devotion. He himself and institution".

**అందుకున్న పురస్కారాలు...**

1. డాక్టరేట్ – తెలుగు విశ్వవిద్యాలయం.
2. జానపద నృత్యకళానిధి – ఆంధ్రప్రదేశ్ గిరిజన నృత్య అకాడమి
3. జానపద బ్రహ్మ – జంటనగరాల కళా సంస్థలు
4. జానపద కళాతపస్వి – రాష్ట్ర కళాకారుల సంఘం
5. జానపద కళాసామ్రాట్ – జంటనగరాల సాహితీ సాంస్కృతిక సంఘాలు

**గౌరవ సభ్యత్వాలు**

1. సమైఖ్యాంధ్రప్రదేశ్ నృత్య అకాడమిలో సంయుక్త కార్యదర్శి
2. రాష్ట్ర సంగీత నృత్య అకాడమీలో సభ్యుడు
3. ఆకాశవాణి సౌత్‌జోన్ (తంజావూర్, నాగపూర్) సలహామండలి సభ్యుడు
4. దూరదర్శన్ సలహామండలి సభ్యుడు
5. వివిధ రాష్ట్రాల్లోని జానపద అకాడమీలో సభ్యత్వం

**రూపొందించిన జానపద నృత్య రూపకాలు**

1. వార్ అండ్ పీస్
2. మాన్ అండ్ మెషిన్
3. టెంప్టేషన్ ఆఫ్ బుద్ధ
4. శిల్పి
5. ఈగల్
6. మాపల్లె
7. ఒలియో ఓలియో – బంగారు పంట
8. నా దేశం

'రాజు మరణించే ఓతార రాలిపోయే

కవియు మరణించే ఒకతార గగనమెక్కే

రాజు జీవించే రాతివిగ్రహాలలోన

సుకళాకారుదు జీవించే ప్రజల జీవితాల్లోన' అన్నట్లుగా

ఇప్పుడు వెలుగుతున్న ప్రతి కళాకారుడికి స్ఫూర్తిని, ఆదిలోనే ఎన్నో అవకాశాల్ని అందించిన గొప్ప కళాకారుడు గోపాల్‌రాజ్ భట్.

## 49

# గూడ అంజన్న

**– డా॥ పసునూరి రవీందర్**

ప్రజలకోసమే కలం పట్టి, కడదాకా ఉద్యమాలకోసమే బతికిన ప్రజావాగ్గేయకారుడు గూడ అంజయ్య. అడవి బిడ్డల అమ్మఒడి ఆదిలాబాద్‌లో ఒక మారుమూల గ్రామం లింగాపురంలో 1955లో పుట్టిన అంజన్న 61 సంవత్సరాలు మాత్రమే జీవించాడు. అందులో నాలుగున్నర దశాబ్దాల కాలాన్ని ఉద్యమాలకే కేటాయించాడు. ఫార్మసిస్టుగా కొలువు చేసినప్పటికీ, పోరాటాల్లోనే అతని జీవితమంతా గడిచింది.

అంజన్న పాటలు విన్నా, అంజన్నను చూసినా చిలీ దేశ ప్రజాగాయకుడు విక్టర్ జారా గుర్తుకొస్తాడు. ఉరితీసే ముందు ఆయన అన్న మాటలు గుర్తుకొస్తాయి.

"నేను మీ చప్పట్ల కోసం పాడడం లేదు
నేను మీ అభినందనల కోసమూ పాడడం లేదు
నేను నాదేశ స్వాతంత్ర్యం కోసం పాడుతున్నాను"
అన్నాడు విక్టర్ జారా.

సరిగ్గా అంతటి ప్రజా వాగ్గేయకారుడు గూడ అంజయ్య. తెలంగాణ విముక్తి కోసం తన చివరి శ్వాస వరకు అంకితమయ్యాడు. సాధారణంగా చాలామంది రచయితలు ఉద్యమాల్లో పాటలు రాస్తారు. అవి ఆ ఉద్యమ లక్ష్యాలను ప్రచారం చేసి కనుమరుగవుతాయి. కాని, గూడా అంజన్న పాటలు సావులేని పాటలు. అందుకు సాక్ష్యంగా అంజన్న రాసిన అనేక పాటల్ని ఉదహరించవచ్చు. భారతదేశ సామాజిక స్వరూపాన్ని వర్గ దృక్పథంతో అర్థం చేసుకొని కొన్ని పాటలు, ఆ తరువాత దళితోద్యమం ముందుకు వచ్చినప్పుడు అంబేద్కర్‌ను చదువుకొని మరిన్ని నెత్తురసొంటి పాటలు రాసిండు అంజన్న. ఆ పాటల చరిత్రలో చెరగని స్థానం అంజన్నది. నలభై ఏండ్ల కిందట విప్లవోద్యమం రాజుకుంటున్న వేళ అంజన్న రాసిన "ఊరు మనదిరా.... ఈ వాడ మనదిరా" అన్న పాట యావత్ దేశాన్నే ఊపేసింది. ఈపాట దేశంలోని పలు భాషల్లోకి ప్రజలు అనువదించుకున్నారు. విప్లవ సిద్ధాంతం ఏం చెబుతున్నదో తెలుసుకోవాలంటే అంజన్న రాసిన ఈ ఒక్కపాట చాలు.

అలా సామాన్యుని గుండెను తట్టిలేపింది గూడ అంజన్న పాట. ఈపాట భూస్వాముల గుండెల్లో ఫిరంగిలా పేలింది. కూలీ చేసి ప్రతీ దళితుడు ఇది నాపాటే అనుకునేలా చేసింది. 'నడుమ దొరా ఏందిరో... దొర పెత్తనమేందిరో...' అని పాడుకునేలా చేసింది. కులమే ఈదేశంలో వర్గంలా మారి, ఆధిపత్యలను కొనసాగిస్తుంటే అంజన్న చూస్తూ ఊరుకోలేకపోయాడు. ఆ ఆధిపత్యాలను కూలగొట్టడానికి అంజన్న తన పాట ద్వారా పథక రచన చేసిండు. ఈ పాటలో అంజన్న దళిత తత్వం పదపదాన ప్రతిధ్వనిస్తది.

గ్రామం కింద కులాల రెక్కల కష్టం మీద నిర్మితమవుతుంది. ఆ నిర్మితమైన గ్రామం మీద దొరలు, భూస్వాముల పెత్తనం ఏంటని నిలదీసింది అంజన్న పాటే. "బండ మనదిరా... బండెడ్లు మనయిరా..." అంటూ, "సావుకాడ మనమే... సన్నాయికాడ మనమే..." అని

దళితుల శ్రమను కీర్తించి అంజన్న ఊరుకోలేదు. “నడుమ దొర ఏందిరో.... దొర పెత్తనం ఏందిరో...” అంటూ దోపిడి గుట్టురట్టు చేసిండు అంజన్న. అలా అంజన్న పాటలు విప్లవోద్యమానికి జవజీవాలను అందించాయి. ప్రజా యుద్ధనౌక గద్దర్ వేదికలమీద ఈ పాటందుకుంటే జనం ఊగిపోయేవారు. అందువల్లనే ఈపాట గద్దరే రాశాడేమోనని చాలాకాలం పాటు జనం అనుకున్నారు. కాని, ఆ తరువాత గద్దరే గూడ అంజన్న పేరును వెలుగులోకి తీసుకొచ్చాడు.

అంజన్న కండ్లముందు ఊపిరిపోసుకున్నది తెలంగాణ ఉద్యమం. ఆనాటి అరవై తొమ్మిది నుండి మలిదశ ఉద్యమం వరకు తెలంగాణ వెంటే నడిచిండు గూడ అంజన్న. మలిదశ ఉద్యమానికి జనాన్ని సన్నద్ధం చేసింది సాహిత్య సాంస్కృతిక రంగాలే. అలాంటి సాంస్కృతిక రంగానికి ముందునడిచిన నాయకుడు, గాయకుడు అంజన్న. తెలంగాణ ఉద్యమం రాజుకోవాలని అంజన్న కలగన్నడు. ఆ కల అక్కడివరకే ఆగలేదు. తెలంగాణ వచ్చి తీరుతుందనే ఒక ఆశాభావాన్ని అందించే వరకు వెళ్ళేలా చేసింది అంజన్నపాట. ‘ధూంధాం’ వేదికల మీద కూడా అంజన్న పాటలు మరోసారి జనం గుండెల్ని తాకాయి. తెలంగాణ కోసం ఎందుకు పోరాడాలో చెప్పింది అంజన్న పాట. ఎలా తెలంగాణ సాధించుకోవాలో కూడా అంజన్న పాటే దిశానిర్దేశం చేసింది. రసమయి బాలకిషన్ వంటి గాయకులు అంజన్న పాటల్ని వేదికలమీద పాడితే జనం ఊగిపోయారు. పదిజిల్లాల గుండా అంజన్న పాటలు తెలంగాణ సాధించుకోవడానికి కావల్సిన భావజాల పునాదిని ఏర్పరచింది.

తెలంగాణ ఉద్యమ సాంస్కృతిక రంగం గురించి మాట్లాడితే, అందులో అంజన్న చేసిన అవిశ్రాంత కృషిని గుర్తు చేయాల్సిందే. తెలంగాణ ఉద్యమంలో వచ్చిన పాటలు, తెలంగాణ వచ్చిన తర్వాత కూడా జనం నోళ్ళల్లో నానుతున్నాయి. అంతటి శక్తివంతమైన పాటలు అంజన్నవి. తాను వాగ్గేయకారునిగా, ఉద్యమకారునిగా, కథకునిగా, నవలాకారునిగా మాత్రమే కాకుండా, గొప్ప మానవతామూర్తి కూడా. అందుకే తన తోటి కళాకారులను, కవులను, ఉద్యమాలను, పోరాటాలను గుండెల నిండా హత్తుకున్నాడు. ఏనాడూ ఉద్యమాన్ని మరిచి తాను దూరం జరిగింది లేదు. సాంస్కృతిక రంగం తనమీద పెట్టిన బాధ్యతను మరిచిపోయింది లేదు. అందుకే అంజన్న అస్వస్థతకు గురైతండంటే యావత్ తెలంగాణ సమాజం ఆయన త్వరగా కోలుకోవాలని కోరుకుంది. మరణశయ్య మీదుండి కూడా ఉద్యమాలనే కలగన్నాడు అంజన్న.

ప్రజలకు విముక్తి కలిగించే ఉద్యమాలకోసం పాటల పహారా కాసిన కన్ను గూడ అంజయ్య. తెలుగు సమాజానికి సుపరిచితమైన ప్రజా రచయిత గూడ అంజయ్య. ఆయన పాటల్ని గురి చూసి గుండెల్ని తాకే చూపున్న పాటలు. ఆయన పాట పాడుతన్నా, వింటున్న ఈదేశంలో తిండి, బట్ట, నీడకు అల్లాడే పేదల దుఃఖం ఒక దృశ్యకావ్యమై మనల్ని కదిలిస్తది. రోమాలు నిక్కబొడుచుకునేలా చేసే నెత్తురసొంటి శక్తి అంజన్న పాటలది. అవి ఉద్యమాల్ని రగిలించి మండించి, పేద ప్రజల వేదనల్ని, అంటరానివాళ్ల సంవేదనల్ని అర్థం చేయిస్తాయి. దోపిడి కోటల్ని కూల్చడానికి, బడుగుజీవులకు సరికొత్త శక్తిని నూరిపోస్తాయి.

పాట రాయాలంటే, మిగిలిన రచయితలలాగ ఆయన పుస్తకాల్లోకి తొంగిచూడడు. ప్రజల మధ్యలోకి పోయి, వారితో మాట్లాడి, వారి బాధలను పల్లవులుగా, వారి కష్టాలను చరణాలుగా మలుస్తాడు. అందుకే గూడా అంజయ్య పాటలు మనలో ఒక తాత్విక చర్చను రేపుతాయి. అలతి అలతి పదాలతో బతుకును సజీవంగా కండ్లముందుంచడం, ఆ జీవితాలు అలా ఎందుకు అయ్యాయో విడమరిచి చెప్పడం అతని పాటల లక్షణం. అందుకే బతుకును పాటలకు ఒంపిన జాత మన గూడ. నాలుగు దశాబ్దాలుగా తెలుగు నేల మీద అంజయ్య పాటలు ఉద్యమాలకు ఊపిరిపోశాయి. ఒక్క ఉద్యమంలో పాల్గొంటేనో, పనిచేస్తేనో ఒక మనిషి జీవితకాలం పూర్తవుతుంది. కొన్నిసార్లు ఆ ఉద్యమం గమ్యానికి చేరుకోక ముందే ఉద్యమకారుడు అలసిపోవడమో, అందులో నుండి నిష్క్రమించడమో జరుగుతుంది. అలాంటిది గూడా అంజయ్య మాత్రం తన పదహారవయేటనే విప్లవోద్యమంలో అడుగుపెట్టి, అందులో అనేకపాటలు రాసి, పాడి ప్రజల మధ్య జీవితాన్ని ఆరంభించాడు. అలా విప్లవోద్యమమే కాదు తెలుగునేల మీద పుట్టిన దళితోద్యమంలో తన వంతు పాత్రను పోషించాడు. రెండు ఉద్యమాల్లో పనిచేసినా సరే తను అలసిపోలేదు. ప్రపంచం తలతిప్పి చూసిన మహత్తర తెలంగాణ ఉద్యమంలో కూడా తనదైన పాత్రను విజయవంతంగా పోషించాడు. తెలంగాణ ప్రజల విముక్తి కోసం కూడా సిద్ధమై పదునైన పాటల

నందించాడు. ఇలా అనేక ఉద్యమాల్లో ముందుండి పనిచేసిన ఘనత గూడ అంజయ్యదే.

గూడ అంజయ్య తొలిపాట "ఊరిడిసి నేబోదునా... అయ్యో ఉరిపెట్టుకొని సద్దునా...". ఈ పాటకూడా గ్రామాల్లో దొరల దాష్టికాన్ని బట్టబయలు చేసింది. రైతులకు అప్పులిచ్చి పంటలు జప్తు చేసే దొరల దుర్మార్గాలకు బలై, ఊరిడిసి వలసపోయే ఓ పేదరైతు బాధను పాటీకరించాడు అంజయ్య. ఈపాటలో రైతు బాధను ఉన్నది ఉన్నట్లుగా, తనను పలకరిస్తే వలపోసే తీరును సరిగా పట్టుకున్నాడు రచయిత. అందుకే అప్పుతెచ్చిన మాట నిజమే. అది వడ్డీకి తెచ్చింది నిజమే అంటాడు.

ఈ పాటతో మొదలైన అంజయ్య ప్రస్థానం విప్లవోద్యమం మీదుగా దళిత, తెలంగాణ ఉద్యమాలను చేసి మరింత పదునెక్కింది. గూడా అంజయ్య పాటల్లో బాణీలు కఠినంగా ఉండవు. సామాన్యుడు సైతం, కోరస్‌గా గొంతుకలిపే విధంగా ఉంటాయి. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ప్రజల బాణీలను తీసుకొని, ప్రజా సమస్యలను వస్తువుగా జతచేసిన బండి యాదగిరి, సుద్దాల హనుమంతులకు వారసుడు గూడ అంజయ్య. అందుకే వారి బాటలోనే వారిలాగే ప్రాణమున్న పాటలను రచించాడు.

పాటకు తగిన బాణి, భావానికి తగిన పదాల పొందిక, అందులో అంజయ్య జాగ్రత్తగా ఇమిడ్చే ప్రజల నుడికారాలు, సామెతలు పాటను శక్తివంతంగా తీర్చిదిద్దుతాయి.

తొంభైయవ దశకంలో తెలుగునేల మీద దళితోద్యమం పుట్టింది. ఉవ్వెత్తున లేచిన దళితచైతన్యంతో మమేక మయ్యాడు అంజన్న. ముందు నడిచాడు. 1992 జూన్‌లో ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో బి.ఎస్. రాములు వంటి సామాజికవేత్తలను పిలిపించి చారిత్రాత్మకంగా "దళిత రచయితల కళాకారుల మేధావుల ఐక్యవేదిక" 'దరకమే' ఏర్పాటుకు పునాది వేసిందు అంజన్న. కంచికచర్లలో దళితుడైన కోటేశును సజీవదహనం చేసినపుడు అంజయ్య ఆ దారుణం మీద పాట రాశాడు. అప్పటిదాకా పాటలు మాత్రమే రాసిన అంజయ్య, దళితోద్యమంలో పనిచేసే క్రమంలోనే సాహిత్యంలోనే మిగిలిన ప్రక్రియల వైపు మరలాడు.

అంబేద్కరిజం పరిచయమయ్యాక అంజన్నకు సాహిత్య ప్రక్రియలతో మరింత పరిచయం ఏర్పడ్డది. దళిత కథలు రాసి పుస్తకం వెలువరించాడు. అలాగే "పొలిమేరలు" అనే నవల రాసి, తెలుగు విశ్వవిద్యాలయం చేత, ఆ యేటి ఉత్తమ నవలగా అవార్డు కూడా అందుకున్నాడు. ఇది అంజయ్యలో మాత్రమే ఉన్న ప్రత్యేక లక్షణం. వాగ్గేయ కారులంతా పాటల రచనవరకే పరిమితమవుతారు. అంజయ్య మాత్రం ఉద్యమ అవసరాల్లో భాగంగా, దరకమే సాన్నిహిత్యంతో కథకునిగా, నవలాకారునిగా మారాడు.

విప్లవోద్యమంలో పనిచేసిన వాగ్గేయకారులంతా కొంత వెనుకపట్టు పట్టినప్పటికీ, అంజన్న మాత్రం మరో ఉద్యమానికి సిద్ధమయ్యాడు. దళిత, బహుజన రాజ్యాధికారం కోసం తాను కవి, రచయితగా, నవలాకారునిగా మారాడు. అలా ఒక పాటగాడు, ఉద్యమకారుడై, ఆతరువాత పలు సాహిత్య ప్రక్రియల్లో తన ముద్రను అనతికాలంలోనే వేయగలిగాడు. దళిత కథలు, నవలలు రచించాడు. ఇది మరో వాగ్గేయకారునిలో మనం చూడలేము. అందరూ పాట వద్దే ఆగిపోతారు. అంజన్న మాత్రం తన జాతి ప్రజలను మేల్కొలపడానికి సాహిత్యాన్ని ఆయుధంగా భావించి పలు రచనలు చేశాడు.

అలా వాగ్గేయకారుడు అంజన్న కాస్త, కథకునిగా, నవలాకారునిగా దళిత సాహిత్యానికి మరింత సేవ చేశాడు. ఈ సేవను ప్రధాన స్రవంతి సమాజం సరిగా పట్టించు కోలేదనే చెప్పాలి. అందువల్లనే గూడా అంజయ్య అంటే కేవలం వాగ్గేయకారుడనే మాటే తెలుగు సమాజంలో స్థిరపడిపోయింది. అయినా అంజన్న ఏనాడూ నారాజు కాలేదు. ఆ తరువాత కాలంలో ముందుకొచ్చిన తెలంగాణ ఉద్యమంలో కాలు కదిపి ముందుకు సాగాడు. మరోసారి తనలో ఉన్న వాగ్గేయకారునికి పని కల్పించాడు.

తెలంగాణా ఉద్యమానికి పాటే ప్రాణం పోసింది. కనిపించని శత్రువును, కాటేసే కుట్రలను కండ్లముందుం చింది పాటే. తెలంగాణ ఉద్యమం అరవైతొమ్మిదిలో పాలకుల చేతిలో దగాకాబడి మళ్ళీ 90ల తర్వాత పుంజుకోవడానికి పాటే ఆయుధంగా నిలిచింది. అలాంటి సమయంలో గూడా అంజయ్య రచించిన అనేక పాటలు తెలంగాణ ఉద్యమాన్ని పల్లెపల్లెకు చేర్చాయి. "నా తెలంగాణ... నసుగన్న నాతల్లి నా తెలంగాణ..." అంటూ పాటరాశాడు. అది మొదలుగా తెలంగాణ ఉద్యమం కోసం అంజన్న రాసిన పాటల్లో "పుడితే

ఒకటి... సత్తె రెండు... రాజన్న... ఒరె రాజన్న" అన్న పాట సుమారు దశాబ్దంన్నర కాలంపాటు తెలంగాణ పదిజిల్లాల్లో మార్మోగింది. ప్రజలను ఉర్రూతలూగించే ఈపాట బాణీ, ఉద్యమానికి జవజీవాలనిచ్చింది.

అంజన్న ఈపాటలో ఉదహరించిన ఊర్లపేర్లు, వ్యక్తుల పేర్లు తెలంగాణలో బాగా పాపులర్‌వే కావడం ప్రజలను మరింత ఆకర్షించింది. ఈపాటలో తెలంగాణ ఉద్యమానికి ఒక దిశానిర్దేశం చేశాడు. తెలంగాణ రాదేమో అని నిరాశ చెందేవారికి గొప్ప ధైర్యాన్నిచ్చిండు. "బరిగీసి బడితందుకోర రాజన్న ... ఒరె రాజన్న, తెలంగాణ రాకుంటె ఒట్టు రాజన్న... మా రాజన్న...'' అంటూ ఈ పోరాటం వృథాపోదు, తెలంగాణ వచ్చి తీరుతుందని ధీమాను వ్యక్తం చేశాడు. ధూం ధాం వేదికలమీద ఈపాట ఫిరంగిలా పేలింది.

ఆకలిపోరాటం మాత్రమే కాదు, తెలంగాణ ఉద్యమంలో ఆత్మగౌరవ సమస్య కూడా ఇమిడి ఉంది. అందుకే గూడా అంజయ్య పాటలో ఆ ఆరాటం ప్రతిధ్వనించింది. తెలంగాణ ప్రజల యాసను బాసను కించపరిచేవారిని నిలబెట్టి కడిగి పాడేశాడు.

తెలంగాణ ఉద్యమంలో ప్రతీ వేదిక మీద ఈపాట మార్మోగింది. అయిదున్నర దశాబ్దాల నలిగిపోయిన తరం నుండి వచ్చిన ఈ ప్రశ్నలు అంజయ్యవి మాత్రమే కాదు. ఇక్కడి ప్రజలవి కూడా. అందుకే జనం గుండెను సూటిగా తాకి ఆకట్టుకున్నాయి. అలాగే ఆధిపత్యాన్ని పెంచి పోషించేవారికి ముచ్చెమటలు పోయించాయి. అంజయ్య పాటలే కాదు. చాలా వరకు సామాజిక ఉద్యమాల్లో వచ్చిన పాటలు కూడా రెండు రకాల బాణీల్లోనే ఎక్కువగా వెలువడ్డాయి. ఒకటి ప్రజల జీవితాన్ని పాటలుగా మలిచేటప్పుడు వారు పడుతున్న బాధల తీవ్రతను అర్థం చేయించడానికి కరుణారసాత్మక బాణీలు, రెండవది ఉద్యమానికి సిద్ధం చేసే వీరరస బాణీలు. అందుకే అంజన్న పాటల్లో ఈ రెండు రకాలైన బాణీలతో కూడిన పాటలే కనిపిస్తాయి. అవి కూడా సాదాసీదాగా రాయడం అంజన్నకు తెలియదు. ఉద్యమ లక్ష్యం నెరవేరేందుకు అందులో సంపూర్ణస్థాయికి చేరేలా పాటను మలుస్తాడు. అందుకే ఉద్యమాలతో సమానంగా అంజన్న పాటలు సినిమా రంగంలో కూడా చెరగని స్థానాన్ని ఏర్పరచుకున్నాయి.

"భద్రం కొడుకో.. నా కొడుకో.. కొమురన్న జర..." అంటూ ముప్పై ఏళ్ల క్రితం తాను రాసిన సినిమా పాట అత్యంత ప్రజాదరణను పొందింది. అలాగే "కొడుకో కొమురన్నా.. నువ్ కొలకటేరుననూ కుంటునిరో" అంటూ రాసిన పాట వెండితెర మీద అంజయ్య మార్కు సంతకాన్ని చేశాయి. తెలంగాణ ఉద్యమకాలంలో ఎక్కడ ఏ సభ జరిగినా అంజన్న కాళ్లు అక్కడికి చేరుకునేవి.

"పుడితె ఒకటి చస్తే రెండు రాజన్న ఒరె రాజన్న, బరిగీసి బడితందుకోర రాజన్న ఒరె రాజన్న తెలంగాణ రాకుంటె ఒట్టు రాజన్న మా రాజన్న" అంటూ తెలంగాణ తప్పక వచ్చి తీరుతుందని గట్టి నమ్మకాన్ని ఇచ్చినోడు గూడా అంజన్న. తెలంగాణ నేలమీద పాటల ప్రవాహ ఉధృతిని ఆగిపోకుండా దోసిలిపట్టిన కలం అంజన్న. ఏ ఉద్యమం వచ్చినా అందుకోసం నేనున్నానంటూ ప్రజావాగ్గేయకారునిగా గొంతెత్తిండు అంజన్న.

అంజన్నను తలుచుకోవడమంటే నాలుగు దశాబ్దాల, తెలుగు నేల సాంస్కృతిక చరిత్రను తడిమి చూసుకోవడమే. విప్లవోద్యమాన్ని ప్రతీ గుండెకు చేర్చింది అంజన్న పాటే. తెలంగాణ ఉద్యమాన్ని విజయతీరాలకు చేర్చడంలో దిక్సూచిగా మారింది అంజన్న పాట. దళిత ఆత్మగౌరవాన్ని అక్షరీకరించింది అంజన్నే. ఇలా ఉద్యమాలకు సైరనై మోగిన ప్రజా వాగ్గేయకారుడు అంజన్న.

తన చుట్టూ ఉన్న సమాజంలో ఏం జరుగుతోంది? అందులో ఎక్కడ ఆధిపత్యముంది? దానిని పారద్రోలడానికి తానేం చేయాలి? అనే తపనే అంజన్నకు జనం గుండెల్లో చెరగని స్థానాన్ని ఏర్పరచింది. సెంట్రల్ యూనివర్సిటీలో రోహిత్‌కు జరిగిన అన్యాయం గురించి తెలుసుకొని బాధపడ్డాడు. మరో విద్యార్థికి ఆ పరిస్థితి రావొద్దని కోరుకున్నాడు.

బతికినంత కాలం ప్రజల కోసమే బతికి, శరీరం కదలలేని దశ వచ్చినా సరే ప్రజల కోసమే అల్లల్లాడడం అంజన్నకే సాధ్యమైంది. ఆఖరి శ్వాసదాక ఉద్యమాల కోసమే బతికిన అంజన్న ఎప్పటికీ ప్రజల గుండెల్లో ఆయన పాటల రూపంలో బతికే ఉంటాడు.

# 50 గూడూరి సీతారాం

– డా॥ పత్తిపాక మోహన్

స్వాతంత్ర్యానంతర తెలంగాణా తొలితరం కథకుల్లో అగ్రగణ్యులు గూడూరి సీతారాం. తెలంగాణా మట్టి భాషకు, యాసకు కథల్లో పటం కట్టి చూపించిన కథకుడాయన. నిఖార్సయిన తెలంగాణా భాషకు 1950 ప్రాంతంలోనే పట్టం కట్టిన గూడూరి జూలై 18, 1936న నిన్నటి కరీంనగర్ జిల్లా, నేటి రాజన్న సిరిసిల్ల జిల్లాలోని హనుమాజీ పేటలో పుట్టారు. చేనేత వస్త్రవ్యాపారులు గూడూరి లక్ష్మయ్య – వెంకటలక్ష్మమ్మలు సీతారాం తల్లిదండ్రులు. ఈ హనుమాజీపేట, సినారె పుట్టిన హనుమాజీ పేట ఒకటే. వీళ్ళది సినారె పక్క ఇల్లు. వయసురీత్యా సినారె కంటే నాలుగైదు సంవత్సరాలు చిన్న అయిన గూడూరి బాల్యం నుండి సినారె సన్నిహిత సహచరులుగా ఉన్నారు. ఒగ్గు కథా దిగ్గజం మిద్దె రాములు, గేయకవి కనపర్తి లక్ష్మీనరసయ్య స్నేహం, హేతువాది జి. సురమౌళి, సినారె గురుత్వం గూడూరిని సాహిత్య రంగంవైపుకు నడిపించాయి..

హనుమాజీపేట, సిరిసిల్ల, కరీంనగర్‌లలో విద్యను పూర్తిచేసిన గూడూరి సీతారాం 1961లో బి.ఎ. కోసం తన మిత్రుడు, గురువు, హితుడు డా. సి. నారాయణరెడ్డి సలహాతో హైదరాబాద్‌లోని నిజాం కళాశాలలో చేరారు. ఈ సమయంలోనే దాదాపు పది సంవత్సరాలు సినారె – గూడూరి ఒకే ఇంట్లో ఉన్నారు. ఈ సమయంలోనే దాశరథి, కాళోజి, పల్లా దుర్గయ్య, వట్టికోట ఆళ్వార్‌స్వామి, బి.ఎన్. శాస్త్రి వంటి వారితో సాన్నిహిత్యం ఉండేది. తొలినాళ్ళలో సినారె, కనపర్తిలు కవిత్వం వైపుకు వెళ్ళగా గూడూరి సీతారాం, వీరి తమ్ముడు డా. గూడూరి రాఘవేంద్ర మరో కథకులు గూడూరి శంకరం కథలవైపుకు మొగ్గు చూపారు. సినారె మాటల్లో చెప్పాలంటే "ఆ రోజుల్లో నన్ను అనుసరించిన యువకులిద్దరు, ఒకరు గూడూరి సీతారాం, రెండవవాడు కనపర్తి లక్ష్మీ నర్సయ్య, గూడూరి కథల దారిలో చరించాడు. కనపర్తి కవితా మార్గంలో సాగిపోయాడు" అంటారు.

విద్యార్థి దశలోనే గోరా, లవణంల ప్రభావంతో సీతారం మిత్రబృందం 'ఏథిస్ట్ బాయిస్ క్లబ్'ను ఏర్పాటు చేసింది. ఇదే సమయంలో వేములవాడ నుండి వీరు, వీరి మిత్రబృందం వెలువరించిన లిఖిత పత్రిక 'విద్యుల్లత'లో, హెచ్.ఎస్.ఎల్.సిలో సిరిసిల్ల పాఠశాల నుండి వీళ్ళే స్థాపించి వెలువరించిన సంచిక 'తరంగిణి'లోనూ సీతారాం కథలు అచ్చయ్యాయి. అప్పటి ప్రముఖ పత్రికలు ప్రజామత, పల్లెటూరు, సుజాత, శోభ, తెలుగుదేశంతోపాటు భారతి, కరీంనగర్ నుండి వెలువడ్డ సారస్వత జ్యోతిలో గూడూరి కథలు, వ్యాసాలు, కవిత్వం వచ్చాయి. 1955 నుండి 1965 మధ్య గూడూరి సీతారాం 85కు పైగా కథలు, రెండు నవలలు, వివిధ అంశాలపై విమర్శ వ్యాసాలు రాసారు. అయితే అందరు తెలంగాణా రచయితల మాదిరిగా రాయడమే తప్ప వాటిని ప్రిజర్వ్ చేసుకోవాలనే సోయి

లేకపోవడంతో అరవైకి పైగా కథలు లభించకుండా పోయాయి. మళ్ళీ 1995 ప్రాంతంలో సిరిసిల్లలోని మానేరు రచయితల సంఘం గూడూరి సీతారాం సాహితీ జీవిత స్వర్ణోత్సవం జరపాలనుకున్న సమయంలో తెలుగుదేశంలోని అన్ని ప్రసిద్ధ గ్రంథాలయాలు తిరిగి సేకరించిన 18 కథలతో గూడూరి సీతారాం కథలను ప్రచురించింది. ఇటీవల మరో నాలుగు కథలు లభించాయి. 1960–65 మధ్య రాసిన రెండు నవలలు ఇంకా అలభ్యాలే. గూడూరి విమర్శకులుగా కూడా ప్రసిద్ధులే. ఆ మధ్య పాత పత్రికలు వెతుకుతున్నప్పుడు తెలుగుదేశంలో కాళోజీ 'నా గొడవ' గూర్చి రాసిన వ్యాసం కనిపించింది. ప్రజాకవి కాళోజీ ఒక్కడే అంటారు. అంతేకాక 'ఇలాతలంలో హేమం పండగ' అంటూ రాసిన మహా మహా సమాసాలు చదువుకున్న నాలాంటి వాడికే అర్థంకానప్పుడు సామాన్యునికి ఎట్లా అర్థం అవుతాయి. కాబట్టి సామాన్యునికి అర్థమయ్యేలా కవిత్వం రాసిన కాళోజీ ఒక్కరే ప్రజాకవి అంటారు.

ప్రతి కవి, రచయిత తాను పుట్టిన ఊరి మట్టివాసనలు ఏదో ఒకచోట నిక్షిప్తం చేసి వాటికి కావ్య గౌరవాన్ని కలిగింపజేస్తాడు. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో రాస్తాడు. వారి వారి రచనల్లో ఆ ఊరి వాతావరణంలోని నిర్దిష్టమైన స్థితిగతులు, సామాజిక, ఆర్థిక అంశాలు అనుభవాలుగా, వస్తువులుగా వారి రచనల్లో చోటు చేసుకుంటాయి. ఆ అనుభవాలకు కవి, రచయిత తన ప్రతిభను జోడించి పాఠకుడి హృదయాన్ని స్పృశించేలా రచనలను కళాత్మకంగా తీర్చిదిద్దుతాడు.

గ్రామీణ జీవితం నేపథ్యంగా కథకునిగా ఎదిగిన గూడూరి సీతారాం తన రచనల్లో సామాన్యుని జీవిత వలయాలను దాటి రాసేప్రయత్నం ఎక్కడా చేయలేదు. తెల్లవారింది మొదలు పొద్దుకూకేవరకు పల్లెల్లో కంటికి కనిపించే వృత్తులు, జీవితాలు, సంస్కృతి మొదలైనవాటిని సూక్ష్మంగా నమోదు చేసారు గూడూరి.

కరీంనగర్ మాండలికంలో 1957లో రాసిన కథ 'మారాజు', ఇది అచ్చమైన తెలంగాణ భాషనే కాక జీవన విధానాన్ని, జాగరూకతను చిత్రించిన కథ. 'రంగడు బొంబాయి పోయచ్చిండు. ఆడెప్పుడో బొంబాయిదాకా యెళ్ళకుంటా ఉండడని చానామంది అనుకున్నారు. యెర్రిబాగులోడు – ఆ పిచ్చోడు బొంబాయిదాకా ఒక్కడే ఎట్లా యెళ్ళిండా అనే తర్కాల పడ్డారు. నడుమ అదేదో పెద్ద సోపాల సదువంతా సదువుకున్న దొరగారి పిల్లగాడు లష్కరు బోయిండంట' అంటూ ఈ కథ సరళమైన భాషలో సాగుతుంది. 1950ల్లోని వలస జీవితాలను ఈ కథలో ప్రతిభింబింపజేసారు.

పట్నం మోజులో అటు వృత్తికి దూరమై, ఇటు మట్టికి, నా అనుకున్న మనుషులకు దూరమై అప్పటి తెలంగాణం ఎట్లుందో చూపిస్తారు గూడూరి. భాష రాని, బాట తెలియని ఒక అమాయక పల్లెటూరి బైతు పరాయి ప్రాంతంలోపడ్డ సాధకబాధకాలతో ఈ కథ ఆద్యంతం సాగింది.

'నారిగాని బతుకు' మరో మంచి కథ. కథలోని నారి వృత్తిరీత్యా గీత కార్మికుడు. కల్లు గీసి తేవడం అతడి దినచర్య. పల్లెల్లో భర్తతోపాటు భార్య, ఇంటిల్లిపాది వృత్తిలో పాల్గొనడం మామూలే. వృత్తిని కేంద్రంగా చేసుకుని గూడూరి ఈ కథలో విభిన్న స్త్రీ మనస్తత్వాలను, గ్రామీణ జీవనంలో కులవృత్తుల స్థానాన్ని చెబుతారు. నారిగానికి ముగ్గురు భార్యలు, లసుము, ఎల్లి, మూడో భార్య పాత్రలతో మూడు రకాల మానవ మనస్తత్వాలు గోచరిస్తాయి. లసుము కుటుంబపరమైన వ్యాపారంలో భర్తకు సహకరిస్తూ పరువుగా బతుకుతుంది. ఎల్లి నారిని మోసం చేసి లేచిపోతుంది. ఎల్లి మోసం చేయడంతో నారిగాడు చివరకు మూడో పెళ్ళి చేసుకుంటాడు. తనవృత్తి ధర్మంగా కల్లు వంచుతున్న మూడో భార్యను ఒక వ్యక్తి కొంగుపట్టి లాగగా నారిగాడు ఆవేశంగా అతనిమీద చేయి చేసుకుంటాడు. ఇక్కడ రచయిత కల్లుగీత వృత్తిలోని చాలా విషయాలను చర్చిస్తారు.

తరాలు మారిపోయి కులవృత్తిపై యాజమాన్యం సంతానానికి సంక్రమించి, పూర్వ యజమానిది ప్రేక్షక పాత్రే అయినప్పుడు ఆయన పడుతున్న సంఘర్షణను, మానసిక స్థితిని, పల్లెజీవికకు భూమికగా నిలిచిన కులాల సంస్కృతి మూల బిందువుగా చక్కటి కథనం ద్వారా మెప్పించారు గూడూరి. అంతేకాకుండా శ్రామిక కుటుంబాల్లో ఇల్లాలు భర్తతోపాటు కులవృత్తిలో పాల్గొనే గ్రామీణ కుటుంబ సంస్కృతిని వివిధ కోణాల్లో చిత్రించారు.

'రాజమ్మ రాజరికం' కథ ఐహిక సుఖాలు, కోరికలు, విలాసవంతమైన జీవితంపట్ల ఆకర్షితురాలై మోసపోయి

చివరకు భిక్షగత్తెగా మారిన స్త్రీ కథ. కథను ఎత్తుకోవడంలోనే ఒక కొత్త ఒరవడిని చూపిన గూడూరి 'సెన్గ సేన్ల నిలుచుని నీవు, సేయి జాపవే పూసలోల్ల రాజమ్మ, కంది సేన్లల నిలుచుని నువ్వు కన్నుగీటవే పూసలోల్ల రాజమ్మ' తెలంగాణా జానపదంతో ప్రారంభిస్తారు. సంస్కృతిలో వస్తున్న మార్పులతో కొత్తగా వస్తున్న వస్తువుల మోజులో సామాజిక జీవనం, నియమాలకు భిన్నంగా ప్రవర్తించి భర్తను కాదనుకున్న రాజమ్మ తాను పెళ్ళి చేసుకున్నా మార్పులకు లొంగని భర్తను కాదనుకుని వికటించిన నాగరికత ప్రభావంతో, కోరికలతో భర్తతో వైవాహిక జీవనానికి దూరమై రెంటికి చెడిన రేవడిలా అవుతుంది. రాజమ్మ పాత్రద్వారా గూడూరి చూపించిన వాస్తవాలు దాదాపు నాలుగు దశాబ్దాల నాటి సామాజిక పరిస్థితులు, అప్పుడప్పుడే తెలంగాణ బతుకులపై ప్రభావం చూపుతున్న సినిమాల పరిణామాలు చూడవచ్చు.

ఇంచుమించు ఇదే సమయంలో వచ్చిన మరో రెండు కథలు 'రంగడు', 'లచ్చి', భాష, ఇతివృత్తం, ఆనాటి సమయ కాలాల విషయంలోనేకాక రచయిత గూడూరి సీతారాం కథలకు పేర్లు పెట్టడంలో కూడా తన ప్రాంతం, ప్రజలపై ఉన్న మమకారాన్ని వదులుకోలేదు. ఆయనకుగల అభిమానం, ప్రేమ ఆయన రచనల్లో ప్రతి వాక్యంలో కనిపిస్తుంది. రంగడు కథలో స్త్రీ మూర్తికి సంబంధించిన ఎన్నో సున్నితమైన అంశాల్ని చర్చించే ప్రయత్నం చేసారు రచయిత. ఈ నేపథ్యంగా విలువల గురించి, అప్పుడప్పుడే వస్తున్న మార్పుల గురించి ఎంతో చర్చిస్తారు గూడూరి.

1957లోనే అణగారిన బతుకుల జీవన విధానాన్ని, సంస్కృతిని పరిశీలించి ఒక డాక్యుమెంటులాగా మలిచి, పరిశీలించి రాసిన కథ లచ్చి. సంచార తెగకు చెందిన బిక్షగాళ్ళ బతుకుతెరువుకు సంబంధించిన కథ ఇది. చాపలు అల్లుతూ, భిక్షాటన చేస్తూ బతికే ఒక కుటుంబం అందరిలాగే పట్నం మోజులోకి వచ్చి వృత్తి మారి, ఆర్థికంగా ఎదిగి ఈ క్రమంలోనే సామాజికంగా ఎదగలేక చిన్నాభిన్నమై ఎలా నాశనమైందో దీనిలో చూడవచ్చు.

పరిగెత్తి, పరిగెత్తి ఎన్నో అపార్థాలు, అనుమానులకు లోనై చతికిలబడి చివరికి బతుకు పరుగు పందెంలో అలసటచెంది పూర్వపు జీవితాన్ని మళ్ళీ గెలుచుకున్న క్రమంలో జరిగిన పరిణామాలు, పరిస్థితులు సామాన్యుని జీవితంలో మార్పులు ఎందుకు అనుకూల స్థితిని కలిగించ లేకపోతాయో లచ్చి కథ అందుకు తార్కాణంగా నిలుస్తుంది.

ఇంకా 'అందని ఆకాశం', 'అబ్బాయి – అమ్మాయి', 'దెబ్బతిన్న అహంభావం', 'ఎర్రని పువ్వు', 'బస్సచ్చింది', 'పిచ్చోడు' వంటి ఎనభై అయిదు కథలను రాసారు గూడూరి సీతారాం.

గూడూరి కథలన్నిటిలో పాత్రోచితమైన సంభాషణలతో జీవభాష ఉట్టిపడుతుంది. గూడూరి సీతారాం కథలు స్వాతంత్ర్యానంతరం రాయడం మొదలుపెట్టిన తెలంగాణా నవతరం రచయితలకు ఒక దిక్సూచిగా పని చేసాయి. కథా సాహిత్యంలో నిజాయితీగా, నిస్సంకోచంగా గ్రామీణ పేదల జీవితాలను, వాళ్ళ ఇతివృత్తాలను ప్రవేశపెట్టేందుకు గూడూరి కథలు ఎంతగానో తోడ్పడ్డాయి. కథల్లో గూడూరి వాడిన తెలంగాణా జీవభాష అటు తరువాత తరం రచయితలకు ఒక పెద్దబాలశిక్షలాగా ఉపయోగపడింది.

తాను తన హనుమాజీపేట, వేములవాడ, సిరిసిల్లల్లో చూసిన జీవితాలను నేపథ్యంగా చేసుకుని పల్లెజీవితాన్ని కథనం చేసారు గూడూరి. తెలంగాణా భాషకు సాహిత్య గౌరవాన్ని కల్పించిన రచయిత గూడూరి సీతారాం. అంతేగాక ఆనాటి తెలంగాణా సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను, పరిణామ క్రమాన్ని అధ్యయనం చేయడానికి గూడూరి సీతారాం కథలు ఆకారాలుగా నిలుస్తాయి.

51

# గులాం అహ్మద్

- భాను శ్రీదేవి

ఆయారాం, గయారాం అనే పదం భారత క్రికెట్‌లో గులాం అహ్మద్‌కే జరిగిందా అనిపిస్తుంది. తొలి టెస్ట్ మ్యాచ్ ఆడితే, మలి టెస్ట్‌లో ఆయనకు స్థానం ఉండదు. పోనీ ఆడిన టెస్ట్‌లో ప్రదర్శన బాగోలేదంటే అనుకోవచ్చు. బాగా ఆడినప్పటికీ ఆయనకు తదుపరి టెస్ట్‌లో చోటులేదు. ఇది గులాం అహ్మద్ టెస్ట్‌ల గురించిన విశేషం.

అప్పట్లో అంటే 1950ల్లో క్రికెట్ ఆణిముత్యంగా, తెలుగుతల్లి తేజంగా గులాం అహ్మద్ ప్రతిభను భారత క్రికెట్ బోర్డు ఆపలేకపోయింది. ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని జట్టులోకి వచ్చినప్పటికీ రాకపోకలు ఆయన చేతిలోకాకుండ జట్టు నాయకుడి చేతిలోవుండేవి. అప్పట్లో, ఇప్పటికీ క్రికెట్‌లో దక్షిణాది, ఉత్తరాది అనే భేదభావం ఉంది. నిజానికి గులాం ఆహ్మద్ క్రికెటర్‌కాదు, ఆయన రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారి. రాష్ట్ర ప్రభుత్వంలో సెక్రటరీగా బాధ్యతలు నిర్వహిస్తున్న IAS అధికారి.

గులాం అహ్మద్ జూలై 4, 1922లో హైదరాబాదులో జన్మించారు. స్కూల్ చదువుతో పాటు క్రీడలపట్ల మక్కువతో అన్ని ఆటల్లో పాల్గొనేవారు. హైస్కూల్ చదువు ముగియగానే, నిజాం కళాశాల చదువుతోపాటు క్రికెట్ ఆటపై శ్రద్ధ చూపిస్తూ ఇంటర్ కాలేజ్ పోటీలలో ఆయన బౌలింగ్‌పై శ్రద్ధ వహించారు. తన స్పిన్ బౌలింగ్ ప్రతిభతో రంజీ ట్రోఫీలో 17 సంవత్సరాల వయస్సులోనే గులాం అహ్మద్ తొలి రంజీట్రోఫీ మ్యాచ్‌ను అప్పటి మద్రాసు జట్టుతో డిసెంబర్ 1, 1939లో ఆడారు. తొలి రంజీ మ్యాచ్‌లో ఆయన బౌలింగ్‌లో అద్భుతం చేశారు. తొలి ఇన్నింగ్స్‌లో 95 పరుగులిచ్చి 5 వికెట్లు, రెండవ ఇన్నింగ్స్‌లో 62 పరుగులకు 4 వికెట్లు తీసుకున్నారు. తన బౌలింగ్ ప్రతిభతో మద్రాసు జట్టును ఆడించారు. దాదాపు 20 సంవత్సరాల వరకు ఆయన రంజీ మ్యాచులు ఆడారు.

20 సంవత్సరాలలో ఆయన బౌలింగ్‌తోను, బ్యాటింగ్‌తోను సత్తా చాటారు. 1939 నుండి 1959 వరకు హైదరాబాదు తరపున పోటీలో పాల్గొన్నారు. ఆయన ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లల్లో 407 వికెట్లు తీసుకున్నారు. బ్యాటింగ్‌లో ఆయన 1,379 పరుగులు సాధించారు. ఇందులో ఐదు హాఫ్ సెంచరీలు కూడా ఉన్నాయి. ఫస్ట్ క్లాస్‌ల్లో గులాం అహ్మద్ అత్యధిక స్కోరు 90 పరుగులు.

రంజీ మ్యాచ్‌లలో ఆయన ఆఫ్‌స్పిన్ బౌలింగ్‌తో అద్భుతాలు చేయడంలో భారత క్రికెట్ బోర్డు ఆయనను భారత జట్టుకు ఎంపిక చేసారు. అప్పట్లో వెస్ట్ ఇండీస్ జట్టు భారతదేశంలో పర్యటిస్తూ ఐదు టెస్ట్ మ్యాచులు ఆడవలసివుంది. తొమ్మిది సంవత్సరాల తన శ్రమకు ఫలితం భారత జట్టులోకి వచ్చిన గులాం అహ్మద్ కొద్దిగా నీరసపడ్డారు. మొదటి రెండు టెస్ట్ మ్యాచ్‌లో గులాం అహ్మద్‌కు జట్టులో చోటు దక్కలేదు.

అయితే ప్రతి క్రికెటర్‌కి భారత్‌లోని కలకత్తా ఈడెన్ గార్డెన్స్‌లో మ్యాచ్ ఆడాలనే కోరిక, ఎందుకంటే స్టేడియంలో లక్షల మంది మ్యాచ్‌ను చూస్తారు. 'డ్రీం కం ట్రూ' వెస్ట్ ఇండీస్‌తో మూడవ టెస్ట్‌లో మొత్తానికి గులాం అహ్మద్‌కు చోటు దక్కింది. గులాం అహ్మద్ 1948 డిసెంబర్ 31న తన తొలి టెస్ట్ మ్యాచ్ ఆడారు. అయినా రంజీ, టెస్ట్ మ్యాచ్ డిసెంబర్‌లోనే ప్రారంభించారు.

తొలి టెస్ట్‌లో ఆయన బౌలింగ్‌లో వెస్ట్ ఇండీస్ మేటి బ్యాట్స్‌మెన్‌లైన వాల్‌కాట్, వీక్స్‌లను అవుట్ చేసారు. తొలి ఇన్నింగ్స్‌లో గులాం అహ్మద్ 94 పరుగులిచ్చి 4 వికెట్లు తీసుకున్నారు. రెండవ ఇన్నింగ్స్‌లో మరొక రెండు వికెట్లు తీయడంతో మూడవ టెస్ట్ వెస్ట్ ఇండీస్‌తో 'డ్రా' అయ్యింది. నాల్గవ, ఐదవ టెస్ట్‌ల్లో ఆయన ప్రదర్శన సరిగా చేయలేక పోయినా, భారత పర్యటనకు వచ్చిన ఇంగ్లాండు జట్టుతో ఆడే భారత జట్టులో సభ్యుడుగావున్న మొదటి మూడు టెస్ట్ మ్యాచ్‌లో ఆడించలేదు.

నాల్గవ టెస్ట్ కాన్పూరులో జరిగింది. జట్టులోకి తీసుకున్నారు. తొలి ఇన్నింగ్స్‌లో గులాం అహ్మద్ 70 పరుగులిచ్చి అమూల్యమైన 5 వికెట్లు తీసుకున్నారు. తరువాత ఇండియా జట్టు ఇంగ్లాండు పర్యటన 19525లో జరిగింది. అప్పుడు ఇంగ్లండ్‌లో ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లలో 80 వికెట్లు సాధించిన మొదటి స్పిన్నర్‌గా మిగిలాడు. అలాగే 4 టెస్ట్ మ్యాచ్‌లలో 15 వికెట్లు తీసి బౌలింగ్ సత్తా చాటారు.

1954-55 లో భారత జట్టుతో పాకిస్తాన్‌లో పర్యటించారు. అయితే అప్పట్లో భారత జట్టులో అత్యధికంగా బొంబాయికి చెందిన ఆటగాళ్ళు ఉండేవారు. దక్షిణాది నుండి తక్కువమంది ప్రాతినిధ్యం వహించారు. జట్టులో ఉన్నా దక్షిణాది క్రీడాకారులుపై వారికి చిన్న చూపు ఉండేది.

కాని మైదానంలో ఎంతో స్నేహం ఉండేవారిలాగ ప్రవర్తించేవారు. గులాం అహ్మద్ అలాంటి ఆటుపోట్లు ఎన్నో ఎదుర్కొని, ఆటలో ఏమాత్రం తగ్గకుండా ప్రదర్శన ఇచ్చేవారు. ఏ క్రికెటర్‌కైనా భారత జట్టులో స్థానం సంపాదించాలనే కోరిక ఉంటుంది. దానితో పాటు తన జీవితకాలంలో కలకత్తాలోని ఈడెన్ గార్డెన్ స్టేడియంలో క్రికెట్ ఆడాలనే బలమైన కోరిక, అలాగే నాయకత్వం వహించాలనే కోరిక ఉంటుంది. అది గులాం అహ్మద్ జీవితంలో నెరవేరింది. తన జీవితంలో రెండు కోరికలను సాకారం చేసుకున్న వ్యక్తి గులాం అహ్మద్. ఈడెన్ గార్డెన్‌లో తన తొలి టెస్ట్ మ్యాచ్‌ని 1955-56 భారత పర్యటనకు వచ్చిన న్యూజిలాండ్ తొలి టెస్ట్ మ్యాచ్‌కు నాయకత్వం బాధ్యతలు వహించారు. సొంత ఊరు హైదరాబాదులో న్యూజిలాండు తన తొలి టెస్ట్ మ్యాచ్ ఆడింది.

హైదరాబాదులో భారతజట్టుకు నాయకత్వం వహించిన గులాం అహ్మద్ జీవితంలో మర్చిపోలేనిరోజు. మిగత టెస్ట్‌లలో నాయకత్వ బాధ్యతల నుండి గులాం అహ్మద్‌ను తొలగించారు. గులాం అహ్మద్ మళ్ళీ 1958-59 వెస్ట్ ఇండీస్ పై రెండు టెస్ట్ మ్యాచ్‌లకు కెప్టెన్‌గా కొనసాగారు. జీవితంలో పాకిస్తాన్‌తో టెస్ట్ మ్యాచ్‌లు ఆడాలనే గులాం అహ్మద్ బలమైన కోరిక, అలాంటి అవకాశం 1958-59లో లభించింది. 4 టెస్ట్‌ల్లో ఆయన 15 వికెట్లు సాధించారు. బ్యాటింగ్‌లో ఆయన హేమూ అధికారితో కలసి చివరి, పదవ వికెట్టుకు రికార్డు స్థాయిలో 109 పరుగులు జోడించారు. ఇది పదవ వికెట్టు రికార్డు. ఆయన చివరి టెస్ట్ మ్యాచ్ వెస్ట్ ఇండీస్‌తో డిసెంబర్ 31, 1958లో ఆడారు. ఆయన తొలి టెస్ట్ చివరి టెస్ట్ ఆడింది డిసెంబర్ 31.

1952-53 పాకిస్తాన్ జట్టు భారత పర్యటనకు వచ్చింది. తొలి టెస్ట్ ఢిల్లీ వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఇండియా పాకిస్తాన్‌పై భారీ స్కోర్ (372) సాధించింది. నిజానికి టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మన్ అవుట్ అయినప్పటికీ చివరి మరియు 10వ వికెట్టు హేమూ అధికారితో కలిసి గులాం అహ్మద్ అమూల్యమైన 109 పరుగులు జోడించారు. అది ఒక సరికొత్త రికార్డ్.

ఇందులో గులాం అహ్మద్ 50 పరుగులు అధికారి 81 పరుగులతో నాటౌట్‌గా ఉన్నారు. ఈ టెస్ట్‌లో ఇండియా పాకిస్తాన్‌ను ఇన్నింగ్స్ 70 పరుగుల తేడాతో ఓడించింది. బౌలింగ్‌లో గులాం అహ్మద్ గొప్ప పాత్ర పోషించారు. తొలి ఇన్నింగ్స్‌లో ఒక వికెట్టు, రెండవ ఇన్నింగ్స్‌లో 55 పరుగులిచ్చి 4 అమూల్యమైన వికెట్లు తీయడంతో విజయం సులభంగా దక్కింది.

అయితే రెండవ టెస్ట్‌లో ఫలితం తారుమారు అయ్యింది. రెండవ టెస్ట్‌లో ఇండియా ఘోర పరాజయాన్ని ఎదుర్కొంది. మూడవ టెస్ట్‌లో ఇండియా పరాజయానికి ప్రతీకారం తీసుకుంది. అలవోకగా మూడవ టెస్ట్ గెలిచింది. ఇందులో గులాం అహ్మద్ పాత్ర ఏ మాత్రంలేదు.

అనుకోకుండా నాల్గవ టెస్ట్‌లో గులాం అహ్మద్‌ను తప్పించారు. అది "డ్రా"గా ముగిసింది. ఐదవ టెస్ట్ ఈడెన్ గార్డెన్స్‌లో, గులాం అహ్మద్ తిరిగి జట్టులోకి వచ్చారు. పాకిస్తాన్ జట్టును పరుగులు చేయకుండా భారత్ కట్టుదిట్టమైన బౌలింగ్ చేయడంతో పాకిస్థాన్ కేవలం 257 పరుగులు మాత్రమే చేసింది. గులాం అహ్మద్ కేవలం వికెట్టు మాత్రమే తీసారు. అయితే బ్యాటింగ్‌లో మంచి తోడ్పాటు అందించడంవల్ల, టెస్ట్ మొదటిసారి ఆడుతున్నా సోడన్‌కు పార్టనర్‌షిప్ అందించి, వికెట్టు పడకుండా ఆడుతూ, సోడన్ తన తొలి టెస్ట్ మ్యాచ్‌లో సెంచరీ పూర్తిచేయడానికి తోడ్పాటు అందించారు.

రెండవ ఇన్నింగ్స్‌లో, గులాం అహ్మద్ తన పదునైన ఆఫ్‌స్పిన్‌తో అమూల్యమైన 4 వికెట్లు పడగొట్టారు. ఇందులో ముఖ్యమైన బ్యాట్స్‌మన్లు ఇంతియాజ్ అహ్మద్, అన్వర్ హుస్సేన్, వకార్‌హసన్, ఫజల్ మహ్మద్‌లు ఉన్నారు.

పాకిస్తాన్ సిరీస్‌లో శక్తివంచన లేకుండా ఆడినప్పటికి, మరుసటి సంవత్సరం భారత క్రికెట్ జట్టు వెస్ట్ ఇండీస్ పర్యటనకు బయలుదేరవలసింది. కాని గులాం అహ్మద్‌కు ఆ సిరీస్‌లో జట్టులో అవకాశం ఇవ్వలేదు. వెస్ట్ ఇండీస్ సిరీస్‌కు భారత జట్టులో అవకాశం రాకపోవడంతో గులాం అహ్మద్ బాగా నిరాశపడ్డారు. గులాం అహ్మద్ తనలో లోపం ఎక్కడ వుందని ఆత్మ విమర్శ చేసుకున్నారు. లోపం లేకున్నా జట్టు నుండి తొలగించడంపై, ఎంతోమంది క్రికెట్‌లు మేధావులను అడిగారు.

అప్పట్లో స్వర్గీయ భూపతిగారు ఆయనకు కొన్ని బౌలింగ్ టిప్స్ అందించడం జరిగింది. దానిపై దృష్టిపెట్టి తీవ్రంగా కృషి చేసి తిరిగి జట్టులోకి ఏ విధంగా రావచ్చు అనే దృష్టితో సాధన చేసారు. వెస్ట్ ఇండీస్ పర్యటన పోతే పోయింది. తరువాత 1954-55లో పాకిస్తాన్ పర్యటనకు భారత జట్టులోకి గులాం అహ్మద్ తిరిగి వచ్చారు. పాకిస్తాన్ పర్యటనలో ఇండియా ఆడవలసినది 5 టెస్ట్‌ల సిరీస్.

పాకిస్థాన్ సిరీస్‌కి భారతజట్టు క్యాప్టన్‌గా వినూమన్కడ్ నియమించబడ్డాడు. అప్పటికే గులాం అహ్మద్, వినూమన్కడ్‌ల మధ్య తీవ్రమైన విభేదాలు ఉండేవి. ఎన్ని విభాదాలున్నప్పటికి మైదానంలో మాత్రము ఆటగాళ్ళలో సమిష్టి పోరాటం కన్పించేది. వారు తమ రాష్ట్రాల కోసం కాదు, తమ దేశం కోసం ఆడుతున్నామనే ఆరాటం ఉండేది.

పాకిస్తాన్ పర్యటనలో గులాం అహ్మద్ ఐదు టెస్ట్‌ల్లో, నాలుగు టెస్ట్‌ల్లో మాత్రమే ఆడారు. అనుకున్నట్టు ఆయన బౌలింగ్‌లో ఏ అద్భుతం జరగలేదు. గెలవడానికి కావలసిన ప్రదర్శన చేయలేకపోయారు. తొలి టెస్ట్‌లో మాత్రమే ఐదు వికెట్లు తీసుకున్నప్పటికీ సిరీస్ మొత్తంలో 335 పరుగులిచ్చి 9 వికెట్లు తీసుకున్నారు. బ్యాటింగ్ అంతంత మాత్రమే. పాకిస్తాన్ పర్యటన స్వయంగా గులాం అహ్మద్‌కు తృప్తి కలిగించలేదు.

అయితే సెలెక్టర్లు మాత్రము ఆయనపై నమ్మకంతో న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టెస్ట్‌కు నాయకత్వం బాధ్యతలు అప్పగించారు. హైదరాబాదులో తొలి టెస్ట్ బౌలింగ్‌లో విఫలమవడంతో, నాయకుడుగా, ఆయనను తప్పించారు. తరువాత ఆస్ట్రేలియాతో జరిగిన టెస్ట్ సిరీస్‌కు గులాం అహ్మద్ జట్టులోకి తిరిగి వచ్చారు. తొలి టెస్ట్‌లో ఆస్ట్రేలియాతో ఆడినప్పటికీ రెండవ టెస్ట్‌లో జట్టు నుండి తొలగించి, మూడవ టెస్ట్‌తో మళ్ళీ జట్టులోకి వచ్చారు.

మూడవ టెస్ట్‌లో తన బౌలింగ్‌లో సత్తా చాటారు. మ్యాచ్‌లో పది వికెట్లు తీసుకున్నారు. మొదటి ఇన్నింగ్స్‌లో 7, రెండవ ఇన్నింగ్స్‌లో 3 వికెట్లు తీసుకున్నారు. భారత జట్టులోకి రావడం, పోవడం ఆయనకు కొంత అసహనానికి గురి చేసింది. చివరకు తన ఇష్టమైన ఈడెన్ గార్డెన్స్‌లో వెస్ట్ ఇండీస్‌తో చివరి మ్యాచ్ ఆడారు. తనకిష్టమైన క్రికెట్ టెస్ట్ మ్యాచ్ ఎక్కడ నుండి మొదలుపెట్టారో, చివరకు అక్కడే తన రిటైర్డ్‌మెంటు ప్రకటించారు. IAS అధికారి అయినా, గులాం అహ్మద్ ప్రభుత్వంలో ఉన్నత అధికారి, సెక్రటరీ హోదాలో పని చేసారు.

ప్రభుత్వ రంగ వివిధ శాఖల్లో పనిచేసిన గులాం అహ్మద్ నూతనంగా కొన్ని కొత్త పరిపాలనా విధానంతో, గొప్ప మార్పులు చేర్పులు చేసి పరిపాలన సులభతరంగా చేసారు. తన పరిపాలన అనుభవంతో హైదరాబాదు క్రికెట్

అసోసియేషన్‌ను తీర్చిదిద్దారు. పరిపాలన దక్షతతో అసోసియేషన్‌ను మంచి దారిలో పెట్టారు. 17 సంవత్సరాలు గులాం అహ్మద్ సెక్రటరీ పదవిలో కొనసాగారు.

తరువాత హైదరాబాదు క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడుగా 1984–86 వరకు ఉన్నారు. భారత క్రికెట్ బోర్డులో వివిధ హోదాల్లో పనిచేసి బోర్డును చక్కదిద్దారు. ప్రభుత్వ ఉన్నతాధికారి, మంచి పరిపాలన దక్షుడైన ఆయన ప్రయాణం క్రికెట్ అసోసియేషన్‌తో కొనసాగించి మంచి పేరు తెచ్చుకున్నారు. హైదరాబాదు క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ 17 సంవత్సరాలపాటు 1959 నుండి 1976 కొనసాగారు. అధ్యక్షుడుగా 1984–86 ఉన్నారు.

గులాం అహ్మద్ ఇండియన్ క్రికెట్ బోర్డు సెక్రటరీగా 1975–76, మరియు 1979–80 రెండుసార్లు ఎన్నుకో బడ్డారు, జెయింట్ సెక్రటరీగా 1970–71, నుండి 1974–75 వరకు ఆ పదవిలో కొనసాగారు. అల్‌గారె ఆల్ ఇండియా సెలక్షన్ కమిటి సభ్యుడుగా 1963 నుండి 1967 కొనసాగిన గులాం అహ్మద్ ఐదు సంవత్సరాలపాటు పాకిస్తాన్‌లో నివాసం ఉన్నారు.

పాకిస్తాన్ మాజీ కెప్టెన్, తన మేనల్లుడైన ఆసిఫ్ ఇక్బాల్‌తోపాటు ఉన్నారు. ఐదు సంవత్సరాల అనంతరం తిరిగి వచ్చారు. క్రికెటర్‌గా క్రికెట్ పరిపాలనదక్షుడుగా గులాం అహ్మద్ క్రికెట్‌కు గొప్ప సేవలు అందించారు. క్రికెటర్స్‌లో మంచి పేరు సంపాదించిన గులాం అహ్మద్ అక్టోబరు 28, 1998లో హైదరాబాదులో మరణించారు. మరణించేటప్పుడు గులాం అహ్మద్ వయస్సు 78 సంవత్సరాలు.

తెలంగాణ రాష్ట్రం గొప్ప క్రికెటర్, పరిపాలనాదక్షుడుని కోల్పోయింది.

# 52 గుమ్మనగారి లక్ష్మీ నరసింహశర్మ

**– డా॥ చెప్పెల హరినాథశర్మ**

భారతీయ భాషా సాహిత్యాలలో మరే ఇతర భాషకు లేని విశిష్ట గౌరవాన్ని తెలుగు భాషకు సమకూర్చి పెట్టింది. అవధాన ప్రక్రియ, అష్టావధాన, శతావధాన, సహస్రావధాన, పంచసహస్రావదానాలుగా అవధానప్రక్రియ భిన్న రూపాలలో పరిడవిల్లినప్పటికీ అవధానమంటే అష్టావధానమే అన్నంతగా అష్టావధానానికి ప్రఖ్యాతి లభించింది.

ఉమ్మడి మెదక్ జిల్లా కొల్చారంకు చెందిన మల్లినాథసూరి అనే పండితుడు ప్రతాప రుద్రుడి ఆస్థానంలో మొట్టమొదటి శతావధానం చేశాడని పరిశోధకులు భావిస్తున్నారు. "కొలిచెల్మాన్వయాబ్ధీందో మల్లినాథో మహాయశ; శతావధాని విఖ్యాతో వీరరుద్రాభిపోజిత:" అని మీగడ తరకలు అనే గ్రంథంలో వేటూరి ప్రభాకరశాస్త్రి పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్న అష్టావధాన ప్రక్రియకు మాడభూషి వెంకటాచార్యులు రూపమిచ్చి నట్లు యకారులు భావిస్తున్నారు.

అవధాన ప్రక్రియకు ఆద్యుడుగా భావిస్తున్న మెదకుసీమ అవధానుల సీమగా పేరొందింది. అందులో ఇరవయ్యవ శతాబ్దం ఉత్తరార్థంలో అవధాన కళామతల్లిని అర్చించడం ప్రారంభించి ఏడు దశాబ్దాలపాటు అవధాన వేదికలపై పద్యాన్ని ఊరేగించిన మహనీయులు గుమ్మనగారి లక్ష్మీ నరసింహశర్మ ప్రముఖులు.

ఉమ్మడి మెదక్ జిల్లా సిద్ధిపేట తాలూకా పోతారెడ్డిపేట గ్రామంలో 1934 ఫిబ్రవరి 19వ తేదీన రాదాకిష్టయ్య, అన్నపూర్ణమ్మ అనే పుణ్య దంపతులకు ప్రభవించిన ప్రతిభాశాలి ఆయన. చిరుప్రాయంలోనే అన్నపూర్ణమ్మ మరణించగా మాతృవియోగ దుఃఖాన్ని పొందారు. వీధిబడిలో ప్రాథమిక విద్యాభ్యాసాన్ని కొనసాగించారు. దైవానుగ్రహంతో కవితాధార అబ్బింది. 1956లో పద్మావతిని ఇల్లాలుగా స్వీకరించారు.

వీరి వివాహం జరిపించిన గౌరీభట్ల రామకృష్ణశర్మ గుమ్మనగారిలోని కవితాశక్తిని గ్రహించారు. అష్టావధానిగా, శ్లేష, యమక కవిగా పేరొందిన రామకృష్ణ శర్మ వీరిని అవధానం చేయవలసిందిగా ప్రోత్సహించారు. అష్టావ దానంలోని మెళకువలను బోధించారు. తమ స్వగ్రామమైన వెంకట్రావుపేటలో తొలి అవధానాన్ని ఏర్పాటు చేయించారు. 1956లో ఆరంభమైన అవధాన ప్రస్థానం 2005 వరకు నిరాఘాటంగా కొనసాగింది.

ఆదిలాబాద్ నుండి అనంతపురం వరకు తెలుగునేల నాలుగు చెరగులా అష్టావధానాలు నిర్వహించారు. ఈవిధంగా ఒక శతావధానంతో పాటు 330 అష్టావధానాలను దేశవ్యాప్తంగా నిర్వహించారు. వాగ్దేవి వరపుత్రుడుగా సాహితీప్రియుల ప్రశంసలందుకున్నారు. గుమ్మనగారి లక్ష్మీ నరసింహ శర్మ వాగీశ్వరీ స్తుతి ద్వారా ఆ విషయం అక్షర సత్యమని నిరూపించుకున్నారు.

“ పలికుంబువ్వుల బాట నిన్ను నడిపింపన్ బూను
నన్నెన్ని ప్రాం
బలుకుం బువ్వను బుజ్జగించి తినిపింపన్ నీకు
నౌనందునో
పలుకుం జల్లని తల్లి! నాడు మనవిన్ బాటించి నీ
కప్రపుం
బలుకుం దోడుగ వేగరమ్మనుచు నాహ్వానింతు
వాగీశ్వరీ!”

అని అవధాన వేదికలపై పలుకుల తల్లిని వేడుకుంటూ అలవోకగా వారి ఆశుకవితా ప్రవాహం సాగిపోయేది. హిందోళ రాగంలో కమనీయమైన కంఠస్వరంతో ఆయన పద్యాన్ని ఆలపిస్తుంటే శ్రోతలు తమను తాము మరచి కవితారసాస్వాదన చేసేవారు.

గుమ్మనగారి అష్టావధానం ఉందంటే చాలు సాహితీ ప్రియులు పరుగెత్తుకొచ్చేవారు. తిరుపతి వేంకటకవులు, కొప్పరపు సోదరకవుల వలె వీరు కూడా అబ్బురపరిచే ఆశు కవితా ప్రవాహంతో తెలంగాణాలోనూ, సీమాంధ్రలోనూ విరివిగా అవధానాలు చేసి అక్షరార్చన గావించారు. ప్రచార ఆర్భాటాలకు తావు లేకుండా, అవార్డులు, రివార్డుల కోసం పాకులాడకుండా నిరాడంబరంగా వాఙ్మయార్చన చేశారు. అష్టావధానం చేస్తే పారితోషికంగా ఏమిస్తారన్న ఆలోచన వారికి ఉండేది కాదు.

అవధాన కళా ప్రదర్శనను సారస్వతారాధనగానే ఆయన భావించేవారు. ఒకవైపు ఆశుకవితా ప్రదర్శనలు, అవధాన సభలు నిర్వహిస్తూనే తెలుగుభాషామతల్లి గళసీమకు మణిపూసల్లాంటి కావ్య సుమాలను సమర్పించారు.

“గుమ్మనగారి పద్యములు కోమలమౌ సుమరామ
లాస్యముల్
గుమ్మనగారి భావనలు కోవెలలోని సరస్వతీప్రభల్
గుమ్మనగారి వైఖరులు కూరిమి ముత్తెపు జల్లులౌను,
మాగుమ్మనగారి వాఙ్మయపు గుర్తులు సద్రస
మూర్తులుర్వరన్”

శతావధాని జి.ఎం. రామశర్మ అన్నట్లు సద్రస మూర్తులుగా తమవాఙ్మయ చిహ్నాలను సరస్వతీప్రభాలుగా ప్రభవింపజేశారు.

వీరి రచనలు :

1) కవితా కల్యాణి
2) అవధాన సరస్వతి
3) వాగీశ్వరీస్తుతి
4) ఆద్యమాతృక
5) పద్యోద్యానం

**కవితా కల్యాణి**

1968వ సంవత్సరంలో అచ్చైన గుమ్మనగారి తొలి కావ్యం కవితా కళ్యాణి. ఏకాదశ పద్య ఖండికల సంపుటి ఇది. రాజరాజేశ్వరీ స్తుతి అనే తొలి ఖండికతో ఈ కావ్యం ప్రారంభమైంది. మాతృగీత, గురుప్రణుతి, ప్రకృతిప్రభావతి, ఊహాసుందరి, కవితా కల్యాణి, కవితాతపస్వి, సల్లాపము, వ్యాసమునీంద్ర, ఉద్ధతి అనే ఖండికలు ఉన్నాయి. ప్రకృతి ప్రభావతి, ఊహాసుందరి, ఖండికల రచన ఆత్మాశ్రయ భావకవిత్వ ఛాయలలో సాగగా, కవితా కల్యాణి, కవితా తపస్వి, సల్లాపము, వ్యాసమునీంద్ర, ఖండికలు కవిత్వ తత్వాన్ని వివరించాయి.

**అవధాన సరస్వతి**

గుమ్మనగారి అవధాన పద్యాల సంకలన గ్రంథం అవధాన సరస్వతి. నిషిద్ధాక్షరి, సమస్య, దత్తపతి, వర్ణన తదితర అవధానాంశాలకు ఆయా అవధానాలలో చెప్పిన పద్యాలలో కొన్నిటిని వారు అక్షరబద్ధం చేసుకున్నారు. వాటిలో నుండి కొన్ని ఎంపిక జేసి అవధాన సరస్వతిలో చేర్చారు. సిద్ధిపేట పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త రేఖా అంబయ్య షష్టి పూర్తి మహోత్సవం సందర్భంగా 1976లో ఇది ప్రచురితమైంది.

**వాగీశ్వరీస్తుతి**

తనలో తాను సృష్టించుకున్న తాత్త్విక భావాలతో ఆధ్యాత్మిక మందిరాన్ని నిర్మించుకున్న గుమ్మనగారి తన ఆధ్యాత్మిక మార్గాన్ని వాగీశ్వరీస్తుతిలో స్పష్ట పరిచారు. 1991లో ఈకావ్యం ప్రచురితమైంది. వాగీశ్వరీస్తుతిలో 81 పద్యాలున్నాయి. ఈ కావ్యంలోని పద్యాన్నీ ‘ల’ కారి ప్రాసతో అల్లినవే కావడం విశేషం. దీనిని తమ గురువైన పరాశరం గోపాలకృష్ణమూర్తికి అంకితం ఇచ్చారు. ఇందులో మత్తేభ, కంద గర్భిత సీస పద్యం వీరి చతుర్విధ కవిత్వ రచనాశక్తికి నిదర్శనంగా నిలుస్తుంది.

**ఆద్యమాతృక**

గుమ్మనగారి లక్ష్మీనరసింహశర్మ గారి నాల్గవ కావ్యం ఆద్యమాతృక. విశ్వనాథేశ్వరా! అన్న మకుటంతో రాసిన 108 పద్యాల శతకం ఇది. యామినీ సరస్వతి గారిచే ధూర్జటి కాళహస్తీశ్వర శతకంతో సమానమైనదిగా ప్రశంసించబడిన కావ్యం ఇది. మత్తేభ, శార్దూల వృత్తాలలో సాగిన శతక రచనలో సామాజికాంశాలను కూడా కవి స్పృశించారు. ఈకావ్యం రామగిరి గణేశ్వర శర్మకు అంకితం యిచ్చారు.

**పద్యోద్యానం (త్రిశతాంకుర)**

308 పద్యాలతో కూర్చిన కావ్యం యిది. 2010లో ప్రచించిన ఈ కావ్యం శర్మగారి జీవితకాలంలో అచ్చైన చివరి కావ్యం. జులై 2009 సికింద్రాబాద్ యశోదా ఆసుపత్రిలో కీమోథెరపీ చికిత్స పొందుతూ కూడా పద్య రచనను వీడని ఆజన్మాంత పద్యరచనా తపస్వి గుమ్మనగారు. బెడ్‌పై చికిత్స పొందుతూ కూడా "రెండు పద్యాలు చెప్తాను రాయి బిడ్డా" అని తన కూతురు బాలసరస్వతికి చెప్పిన పద్యాలు కూడా ఈ కావ్యంలో ఉన్నాయి.

"నా మనోభూమి నుభయ సంధ్యాప్రశాంత
కాంతులను చింది నిశ్చల జ్ఞానమొసగి
లలితపద, లలితేశాని; కళల జిలికి
జీవన మొసంగునామె, రక్షించునామె
అంబరచుంబి, భవ్యరజితాచల మందిర సుందరేశ్వరా
లంబనజేసి రేల్ పవళున్ గడియల్ నిమిషాలు
లిప్తలున్
త్ర్యంబకు నూహ సేయగ సరాసరిగా నొక శ్వేతగంధ
మా
ల్యాంబరశోభి తాః నిలిచినంతన కన్మిరుమిట్లు
గొల్పెడిన్ "

ఇంచుమించు కావ్యంలోని పద్యాలన్నీ ముక్తకాలే. ఏపద్యానికి ఆపద్యం స్వతంత్రమే అయినా అంతటా అంతర్వాహినులుగా వాగ్దేవి వదన కాంతులు ప్రవహించా యంటారు కావ్యానికి ముందు మాట రాసిన సుప్రసిద్ధ పండితులు. ఆచార్య కోవెల సుప్రసన్నాచార్యులు. ఈ కావ్యం రామగిరి గణేశ్వరశర్మకు అంకితం ఇచ్చారు.

**అవధాన విధాన చాతురి**

అవధాన సభలో గుమ్మనగారి తీరు అత్యంత ఆశ్చర్యకరంగా ఉండేది. జటిలమైన సమస్య, దుష్కరమైన దత్తపదులు, నిషిద్ధాక్షరి పృచ్ఛకులుగా ఉద్దండులైన పండితులు ఉన్నా సరే చిరునవ్వులు వెలారుస్తూ, తాంబూల సేవనం చేస్తూ అలవోకగా పద్యాలల్లేవారు. సహజంగా అవధానాలలో రసవత్కవిత్వానికి ఆస్కారం లేదనే విమర్శ ఉంది. ఈ విమర్శను పూర్వ పక్షం చేస్తూ రసరమ్యమైన పద్యాలు చెప్పారు. మహాసహస్రావధాని డాక్టర్ గరికపాటి నరసింహారావు పద్య కవిత్వంతో సరస్వతీమాతకు వెలుగు లీనే భవనాన్ని నిర్మించిన సత్కవిగా గుమ్మనగారిని కీర్తించారు.

"అద్భుతమైన ధార, పరమాద్భుత ధారణ, ప్రౌఢ భావ
సం వద్భువ పద్య పూరణ, స్వభావ మనోహరమైన
శైలి, వి ద్వద్బుధగాత్మ తృప్తి బహుధా గయిసేయు
సమాస ధాటి, దీ
వ్యద్భువనమ్ము గట్టితివి వాణికి గుమ్మన శర్మ సత్కవీ"

వీరి అష్టావధానంలో నిషిద్ధాక్షరి, వర్ణన, దత్తపది, సమస్య, అప్రస్తుత ప్రసంగం, ఘంటాగణనం, చందో భాషణం, స్వీయకవితా గానం, చీట్లపేక, అశువు వంటి అంశాలు ఉండేవి. సమయ సందర్భాల ననుసరించి అంశాల్లో కొన్ని స్వల్ప మార్పులు చేసుకునే వారు.

**నిషిద్ధాక్షరి**

అవధానంలో నిషిద్ధాక్షరి కీలకమైన అంశం. పృచ్ఛకుడు కూడా ఇంచుమించు అవధానితో సమాన పాండిత్యం కలిగినవాడై ఉండాలి. లేకపోతే అవధాని పని సులువు అవుతుంది. ఒక అవధానంలో మహాదేవ శ్రీనివాసరావు అనే పండితుడు నిషిద్ధాక్షరి పృచ్ఛకులుగా పాల్గొని యోగీశ్వరుడైన కృష్ణుడిని కందంలో వర్ణించు మన్నారు.

"గీతా గుంజత్ ధీకున్
శ్రీతత్త్వన్ గొల్తు యుగ్గరిష్టున్ గురునిన్
భీతి మదర్జును నేలగ
శ్రీతరువటు నిల్చినట్టి కృష్ణుని నెపుడున్"

యుగ్గరిష్టుడు అనే ప్రయోగం ప్రౌఢమైనది.

నిషిద్ధాక్షరిలో ఇలాంటి పదప్రయోగం చేయడం గుమ్మనగారి వంటి పండిత కవులకే సాధ్యం.

**సమస్య**

సమస్య ఎంత జఠిలమైనదైనా సరే పండితులు మెచ్చేవిధంగా పూరించడం గుమ్మనగారి సమస్యాపురాణాల్లో కనిపించే సహజ లక్షణం. "రాముడు పార్వతీ సతిని రంజిల జేసెను గౌగిలింతలన్" అన్న సమస్యకు గుమ్మనగారి ఇలా పూరించారు.

"స్వామి! ఇదేమి? పాములు వెసన్ బుసకొట్ట విసంపు కంపు రా
దా? మెయి బూదిబూయ సరదా? అను శైలజకున్ శివుండు'నే
సోముడనౌట: నోటు పడనూ? 'అని నవ్వి చంద్రమ: కళా రాముడు పార్వతీ సతిని రంజిల జేసెను గౌగిలింతలన్"

రాముడు పార్వతిని రంజింప జేయడం సమస్యలోని విరుద్ధాంశం. దీనిని పరిష్కరించడం కోసం అవధాని పై పాదంలోని చంద్రమ:కళతో రాముడిని సమసింపజేసి చంద్రమ:కళారాముణ్ణి చేశాడు. అంతేకాక నే సోముడనౌట అంటూ సోమ = స+ఉమ అనే అర్థాన్ని రమ్యంగా చెప్పి సమస్యాపూరణలో కొత్త సొగసును చూపించారు.

మరో అవధానంలో "సీతను పెండ్లాడె శివుడు శిశువున్ గనియెన్" అన్న సమస్యను పై పాదంలోని రెండక్షరాలు కలుపుకుని అర్థవంతంగా పూరించారు.

"చైతన్యానంద సుధా
స్రోతస్వి నిజాలు వారు చొప్పున సుమన:
ప్రీతగ హిమవత్సుత నత
సీతను పెండ్లాడె శివుడు శిశువున్ గనియెన్"

సీతకు అత అనే అక్షరాలను జతచేయడంతో అతసీ తను అయింది. అతసీ పుష్పము వంటి కోమలమైన శరీరము గల హిమవత్సుతను శివుడు పెండ్లాడాడని పూరించడం గుమ్మనగారి ప్రతిభకు నిదర్శనం.

**దత్తపది**

దత్తపదులను అర్థవంతంగా పద్యపాదాల్లో ఇమిడించి రసవత్కవిత్వాన్ని ఆవిష్కరించడంలో కూడా గుమ్మనగారికి గుమ్మనగారే సాటి. ఒకసారి వీరికి "రండ, బండ, కొండ, ముండ'' అనే పదాలిచ్చి రామాయణార్థంలో పూరించమన్నారు.

"రండఖిలార్య సంస్కృతి పరంపరులార!
కనంగపున్నెపుం
బండవు రాము పెండ్లి గనవచ్చును, సీతకు దగ్గవాడు
రా ముండన వచ్చు, సీత వలపున్, తలపున్ తెలియంగ వచ్చు మే
ల్కొండనవచ్చు అచ్చపు వెలుంగు నిలంగనవచ్చు నిచ్చయిన్"

రండు+అఖిలార్యలో రండ శబ్దాన్ని, పున్నెపున్ + పండు + అవులో బండను, రాముండ + అన లో ముండ అనే పదాన్ని మేల్కొండన అనే పదంలో కొండను తెచ్చి పెట్టి దత్తపదాలను ఉచిత పదాలుగా మార్చారు.

మరోసారి రిక్షా, కారు, లారి, ఆటో అన్న పదాలతో భారతార్థంలో చెప్పమని కోరారు. పదాలన్నీ ఆధునిక కాలంలో వాడే వాహనాలు, కోరింది భారతగాథకు సంబంధించిన పద్యం.

"అంతరిక్షాన దేవతా లభినుతింప
కారు చీకట్లు కురు రాడ్వికారులెల్ల
భూతలారి కరిష్టత పొసగ పార్థు
వట్టి ఆటోపియో తమ్మి బవరమందు"

ఇచ్చిన పదాలు ఎక్కడ ఇమిడిపోయాయో కూడా సామాన్యులు కనిపెట్టలేని రీతిలో పద్యరచన చేశారు. పైగా పద్మవ్యూహాన్ని తమ్మిబవరం అంటూ అచ్చ తెలుగు పదాల్లో చెప్పడం పద్యానికి అదనపు సొగసును సమకూర్చింది.

**వర్ణన**

వర్ణన అంశ నిర్వహణలో కూడా గుమ్మనగారు తన ప్రత్యేకతను చాటుకున్నారు. చతుర్విధ పురుషార్థాలను క్షేత్రగణితాన్ని ఉపయోగించమని కోరగా చెప్పిన పద్యం ఇది.

"ధర్మ మది కేంద్ర బిందు వర్థంబు పరిధి
కామ మనగ వ్యాసార్థమ్ము గాగ మోక్ష
మగును వృత్త వైశాల్యమని యస్మ దూహ
తళుకు మను క్షేత్రసూత్రమ్ము లందు"

భౌగోళిక చిత్రపటంలో ఎవరెస్టు శిఖరం ఎగుడు దిగుళ్ళను చూచినప్పుడు యువకవికి కలిగే భావనను వర్ణించుమని ఉమాపతి పద్మనాభ శర్మ కోరగా రసరమ్యమైన పద్యం చెప్పారు.

> “నానాహాళి సుధారసైక విలసన్మాధుర్య ధారా పిపా
> సానూన ప్రతిభన్ రహించగల భార్యారత్న తా సన్నిధా
> నానన్ నిల్చి గృహస్థ ధర్మముల నానందాన నందింప
> నెం తేనిన్ బోలునటన్న రీతిగన భావింతున్
> వయస్యాగ్రణీ”

ఆసక్తిని కలిగిస్తూ అమృత రసైకమై ప్రకాశమానమైన తీయందనముతో ఎడతెగని పిపాసతో వెతికి లేకుండా ప్రతిభతో వర్ధిల్లే భార్యారత్నము తన దగ్గర నిల్చి గృహస్థ ధర్మములతో ఆనందాన్ని కలిగించడం ఎవరెస్టు శిఖరం ఎగుడు దిగుళ్ళను చూచినప్పుడు కలిగే ఆనందం వలె ఓ స్నేహితుడా! నేను భావిస్తాను.

అష్టావధానాల నిర్వహణ ప్రవృత్తిగా పెట్టుకున్న వారు జీవికను కొనసాగించడం కోసం ఉపాధ్యాయవృత్తిని చేపట్టారు. మెదక్ జిల్లాలోని వివిధ ప్రాంతాలలో తెలుగు పండితులుగా పనిచేసి వందలాది మంది విద్యార్థులను కవులుగా, కళాకారులుగా, వక్తలుగా తీర్చి దిద్దారు. సుప్రసిద్ధ అష్టావధాని అష్టకాల నరసింహ రామశర్మ వీరి ప్రేరణతోనే అవధానిగా ఎదిగారు. అకుంఠితదీక్షతో, అద్భుత వాక్పటిమతో తెలంగాణా రాష్ట్రాన్ని సాధించిన తెలంగాణా తొలి ముఖ్యమంత్రి కె.సి.ఆర్. తమ గురువు గుమ్మనగారి లక్ష్మీ నరసింహ శర్మను ప్రత్యేకంగా గుర్తుచేసుకోవడం గుమ్మనగారి పట్ల వారి శిష్యులకుండే గౌరవానికి ప్రతీకగా చెప్పుకోవచ్చు.

# 53 గుండేరావు హర్కారే

– ఆచార్య మసన చెన్నప్ప

పట్నములలోన హైదరాబాదు గొప్ప
హైద్రాబాదులోన పాతపట్నంబు గొప్ప
పాతపట్నంబులో గొప్ప పదియురెండు
భాషలెరిగిన హర్కారె పండితుండు.
(తెలంగాణోదయం)

బహుభాషలలోను, బహుశాస్త్రాలలోను ఉత్తమశ్రేణికి చెందిన పండితుడు గుండేరావు హర్కారే. ఎంత పాండిత్యముంటే, అంత ఒదిగి ఉండాలని నిరూపించిన శాంతమూర్తి ఆయన. త్రికరణ శుద్ధికి మారుపేరుగా నిలిచిన హర్కారే జీవితంలో అంచెలంచెలుగా ఎదుగుతూ త్రివిక్రముణ్ణి తలపించాడు.

గుండేరావు న్యాయశాస్త్రంలో ఎంత దిట్టనో, వ్యాకరణ శాస్త్రంలోను అంతే దిట్ట. పాణిని రచించిన అష్టాధ్యాయికి, ఆధునిక విజ్ఞానాన్ని అనుసరించి, విద్యార్థుల సౌకర్యార్థం 'Sanskrit Grammar Made Easy' పేరుతో ఒక యంత్రాన్ని తయారు చేశాడు. ఇది ఆయనకు గొప్పకీర్తిని తెచ్చిపెట్టింది.

తెలుగుతోపాటు దేశవిదేశ భాషలలో సంపాదించిన పాండిత్యం ఒక ఎత్తైతే, సంస్కృతంలో గుండేరావు సంపాదించిన పాండిత్యం ఒక ఎత్తు. ద్వాదశ భాషా పండితుడు ఆయన నా దృష్టిలో ఒక భాషా పండితుడే కాదు. ఒక విజ్ఞాన సర్వస్వం.

గుండేరావు సీతాబాయి, రామారావులకు 1887 మార్చి 13వ తేదీన హైదరాబాదు నగరంలో జన్మించాడు. వీరి ఇంటి పేరు హర్కారే. బహుశా ఇది వీరి వంశీయుల పనితనాన్ని బట్టి వచ్చిన బిరుదనామం. గుండేరావు పూర్వీకులది మహారాష్ట్ర. వివిధ జిల్లాల నుండి, పరగణాల నుండి ప్రభుత్వానికి అధికారికంగా వార్తలను చేరవేసే నమ్మకమైన దూతలకే హర్కారులని పేరు. బహుశా ఈ పేరుగల వారు దేశంలో ఎక్కడున్నా వారు ప్రభుత్వానికి నమ్మకంగా పనిజేస్తూ పేరు తెచ్చుకున్నవారే.

గుండేరావు హర్కారే జీవితచరిత్రను అధ్యయనం చేస్తే ఈ విషయం స్పష్టంగా మన కర్థమవుతుంది.

హర్కారే పండితుడు. దేశకాల పరిస్థితులననుసరించి బాల్యంలో నిజాం రాష్ట్రవాసి కావడం వల్ల పర్శియన్, అరబిక్ భాషలు నేర్చుకోవలసి వచ్చింది. ఆ తర్వాతనే తెలుగు, మరాఠీ భాషలు నేర్చుకొన్నాడు. ఈ రెండు భాషలను ప్రైవేట్‌గా నేర్చుకోవలసి వచ్చింది. ఇక్కడ గమనించివలసిన అంశాలు మూడున్నాయి. వారు నేర్చుకున్న భాషలలో ఒకటి మాతృభాష, రెండు స్థానిక భాష, మూడు రాజభాష ఉండడం విశేషం. ఆ తర్వాత హర్కారే ఆంగ్లపాఠశాలలో తన 12వ ఏట చేరి, 1906 ప్రాంతంలో మెట్రిక్యులేషన్ పరీక్షకు హాజరయ్యాడు. ఆ తర్వాత కుటుంబపరిస్థితుల కారణంగా చదువుకు దూరమయ్యాడు. ఉద్యోగానికి

చేరువయ్యాడు. 1908లో నగరంలోని న్యాయస్థానంలో గుమస్తాగా ప్రవేశించాడు.

అనువాదకులకు వివిధ భాషలలో పరిచయం ఉండడమేగాక, అనువాద కౌశల్యం కూడా ఉండాలి. హర్కారే ఒక గుమాస్తాగా ఉండి, శ్రద్ధాభక్తులతో భాషారాధ్య చేసినాడు. అందుకే న్యాయస్థానం అయనకు 1908లో ఒకేసారి పదోన్నతిని పెంచి, స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టుకి బదిలీ చేశారు. అక్కడ హర్కారే మంచి అనువాదకుడుగా పేరు తెచ్చు కున్నాడు. ఆ తర్వాత ఆయన పనితనాన్ని గుర్తించి నిజాం ప్రభుత్వం ఆయనను 1914లో ఉన్నత న్యాయస్థానానికి (Highcourt) బదిలీ చేసింది. అప్పుడు హర్కారే ప్రధాన న్యాయమూర్తికి ఆంతరంగిక కార్యదర్శిగా నియుక్తుడయ్యాడు.

భాషా పండితునిగా, సాహితీవేత్తగా ఒకవైపు గుర్తింపు తెచ్చుకున్న హర్కారే – హైకోర్టులో తన సేవలకుగాను గద్వాల సంస్థానంలో 1919ల6 మున్సిఫ్ మెజిస్ట్రేట్‌గా నియమింప బడినాడు. 1948 దాకా ఆయన అక్కడ పనిచేశాడు. సుమారు అక్కడి 30 ఏండ్ల ఉద్యోగకాలంలో ఆయన జిల్లా న్యాయాధీశుడుగా, కలెక్టర్‌గా, సెషన్స్ జడ్జిగా ఉన్నత పదవులను అధిరోహించాడు.

గద్వాలలో ఉన్న రోజుల్లో గుండేరావు న్యాయాధీశుడుగానే కాక గొప్ప పండితునిగా వెలుగొందాడు. గద్వాల సంస్థానాధీశురాలైన రాణి మహలక్ష్మమ్మ ఆదరాభిమానాలు చూరగొన్న హర్కారే తరుచుగా ఆస్థానానికి వెళ్లేవాడు. ఆస్థానానికి వచ్చే పండితుల ప్రేమకు, గౌరవానికి గుండేరావు ఆలవాలమయ్యాడు. ఆస్థానంలో జరిగే సాహితీచర్చలకు, అవధానాలకు సాక్షిగా నిలబడ్డాడు. గద్వాల సంస్థానానికి కొప్పెరపు కవులు వచ్చిన సందర్భంలో హర్కారే రాణిగారి ఆస్థానంలో ఉండడం విశేషం.

గుండేరావు తర్కన్యాయ వేదాంత శాస్త్రాలతతోనేగాక గణితశాస్త్రంలోను నేర్పరి అనటానికి ఈ సందర్భంగా ఒక సంఘటనను వివరించక తప్పదు (స్వయంగా హర్కారే నాకు చెప్పిన విషయాన్ని ఇక్కడ పొందు పరుస్తున్నాను).

గద్వాల సంస్థానానికి, నిజాం సర్కారుకి పన్నుల బాకీ విషయంలో పేచీ ఏర్పడింది. ముప్పైవేల రూపాయల పన్ను కట్టాలని మంత్రిగా ఉన్న సాలార్‌జంగ్ సంస్థానానికి తాఖీదు పంపించాడు. ఈ సంగతి ఎట్లాగో గుండేరావు హర్కారే దృష్టికి వచ్చింది. ఆయన లెక్కలన్నీ తీసి, అదివరకు కట్టినవి తీసేసి – చివరికి మూడువందలు మాత్రమే కట్టవలసి ఉన్నాయని తేల్చి చెప్పినాడట. ఈ విషయం తెలుసుకున్న సాలార్‌జంగ్ గుండేరావును గౌరవంగా హైదరాబాదులో జరిగిన ఒక విందు కార్యక్రమానికి ఆహ్వానించాడట.

అక్కడ స్వయంగా సాలార్‌జంగ్ గుండేరావును అభినందిస్తూ – యథాలాపంగా "నీలాంటి పండితుడు మా మతంలో చేరితే మా మతానికెంతో వన్నె కల్గుతుంది" అని ప్రలోభపెట్టాడట. వెంటనే హర్కారే వినయంగా "ఇంకో మతం నుంచి మీ మతంలోనికి వచ్చే వాళ్ల వల్లనే మీ మతం వన్నెకెక్కడం నాకు తృప్తి కల్గించడం లేదు" అని సున్నితంగా సమాధానమిచ్చాడట.

గుండేరావు ధైర్యశాలి అంటానికి ఒక సంఘటనను తప్పక వివరించాలి. భారత ప్రభుత్వం టంగుటూరి ప్రకాశం పంతులు గారిని బంధించడానికి సన్నాహాలు చేసింది. పోలీసుల కన్నుగప్పి ప్రకాశంగారు ఒక నాల్గురోజుల కోసం గద్వాల సంస్థానానికి వచ్చాడు. మారువేషంలో ఉన్న ప్రకాశంగారికి గుండేరావు తన ఇంట్లో నాల్గురోజులు ఆతిథ్యమిచ్చి, ఆ నాల్గురోజుల్లో ఆయన కూర్చొనగల్గినరీతిలో ఒక బలమైన వెదురుబుట్ట తయారుచేయించి – తద్వారా కండపుష్టిగల సేవలకులతో మోయించి, ప్రకాశం గారిని రహస్యస్థావరానికి చేర్చినాడట. ఈ సంఘటనను హర్కారే గారు నాకు వివరించినప్పుడే కాదు, దీన్ని రాస్తున్నప్పుడు కూడా నా ఒళ్లు జలదరించింది.

గుండేరావు బలమైన వ్యక్తి. ఆయన ఆకారం ఒక కొండను తలపిస్తుంది. లేదా ఏనుగును తలపిస్తుంది లేదా గుమ్మడికాయను గుర్తుకు తెస్తుంది. అరబ్బులతో ముష్టి యుద్ధం చేసిన సాహసి. ఉదయం, సాయంత్రం ధ్యానానికి ప్రాధాన్యం ఇచ్చినట్లే వ్యాయామానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చినాడు. ముష్టిఘాతాలతో ఆయన శరీరం గట్టిపడింది.

హర్కారే గద్వాలలో ఉన్నప్పుడు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే అధ్యయనశీలియై అనేకానేక పరీక్షలు రాసి తన ప్రతిభను నిరూపించుకున్నాడు. తీరిక దొరికితేచాలు ఏ కావ్యాన్నో లేదా ఏ శాస్త్రాన్నో చదవాలన్న కోరిక ఆయనది.

మద్రాసు విశ్వవిద్యాలయం నిర్వహించిన న్యాయశిరోమణి, సాహిత్యశిరోమణి పరీక్షలలోను; ధర్మశాస్త్రంలోను, తులనాత్మక సాహిత్యంలోను నిర్వహించిన పి.ఓ.ఎల్. పరీక్షలందును హర్కారే తన ప్రతిభను చూపించి విజయాన్ని సాధించాడు. న్యాయశాస్త్రంలో నిష్ణాతుడైన గుండేరావుకు న్యాయశాస్త్రానికి కేంద్రమైన 'నవద్వీప్'లోని పండితపరిషత్తు 'వాచస్పతి' పట్టాన్ని ఇచ్చి గౌరవించింది. అయోధ్య, బెల్గాం పట్టణాల్లోని ప్రతిష్ఠాత్మకమైన పండితసభ గుండేరావుకు 'విద్యాభూషణ' బిరుదం ఇచ్చి గౌరవించింది.

గుండేరావు కేవలం పండితుడేకాడు. గొప్ప రచయిత కూడా. ఆయన రచనలు వెలుగులోకి వస్తే మరాఠీ, తెలుగు, సంస్కృతం, ఆంగ్లభాషలలో ఆయన చేసిన కృషి ప్రపంచానికి తెలుస్తుంది. కాని చాలమటుకు అవి మరుగునపడి ఉన్నాయి. ఐతే ఆయన చేసిన అనువాదాలు సంస్కృత పండితులనే ఆశ్చర్యపరచినవి. ఒక తెలుగువాడు ఆంగ్లం నుండో, హిందీ నుండో, సంస్కృతం నుండో తెలుగులోకి అనువదిస్తే ఎంతో గొప్ప. కాని గుండేరావు అద్భుతమైన అనువాద కౌశల్యానికి ఆయన సంస్కృతానువాదాలే గట్టి నిదర్శనం.

సన్నిధానం సూర్యనారాయణశాస్త్రి పింగళిసూరని కళా పూర్ణోదయాన్ని సంస్కృతంలో అనువదించగా, గుండేరావు గారు 'ప్రభావతీ ప్రద్యుమ్నం' ను సంస్కృతంలోకి అనువదించాడు. ఇదొక అద్భుతమైన రచన. గుండేరావుగారి ఈ అనువాదం వారి చివరిదశలో జరిగింది. ఆ సమయంలోనే నేను వారికి అంతేవాసిని కావడం నా అదృష్టం.

గుండేరావు సంస్కృత అనువాద రచనలు మహత్తర మైనవి. ఆయనకు ఆంగ్లం మంచినీళ్లప్రాయమైంది. తెలుగుభాష - క్షీరసదృశం కాగా సంస్కృతం అమృతాయమానమైంది. ఆంగ్ల రచనలను సంస్కృతంలోకి అనువదించడమంటే ఆయనకు చాలా సరదా! ఎంతో గొప్ప పండితుడైనప్పటికీ సారళ్యానికి, శిల్పానికి ప్రాధాన్యం ఇచ్చిన మహానుభావు డాయన! థామస్‌గ్రే రచించిన 'ఎలిజీ', గోల్డ్‌స్మిత్ 'ట్రావెలర్' 'డిజర్టెడ్ విలేజ్' వర్డ్స్‌వర్త్ రచించిన 'ఇంటిమేషన్ టు ఇమ్మోర్టాలిటీ' షేక్స్పియర్ నాటకాలైన 'హేమ్‌లెట్', 'ది మిడ్ సమ్మర్ నైట్స్ డ్రీమ్' మొదలైన వాటికి గుండేరావు చేసిన సంస్కృతకావ్యానువాదాలు విశిష్టమైనవి. ఆ మహాపండితుడు ఫారసీలోని 'మస్నవీ షరీఫ్', అరబ్బీలోని 'ఖురానే షరీఫ్' మొదలైన మతగ్రంథాలను సంస్కృతంలోకి తీసికొని వచ్చాడు. ఇంత అనువాదాలు మరెవరూ చేయలేదని చెప్పవచ్చు.

గుండేరావు అంటే భాషాకోవిదుడు. ఏ భాషనైనా ఇట్లే నేర్చుకొని, భాషించగల నేర్పరి. అంతేకాదు ఆ భాషలలో పాండిత్యాన్ని సంపాదించి వివిధ భాషల వారికి అనువాదాల ద్వారా ఆదర్శ పండితుడయ్యాడు.

గుండేరావు భాషావ్యాకరణ వేదాంతధర్మ శాస్త్ర గ్రంథాల్లోనే కాక చరిత్ర విషయంలోను తన విమర్శన, పరిశోధన పాటవాన్ని చూపాడు. ఆయన మరాఠీ సాహిత్య చరిత్రను తెలుగులో రచించాడు. భారతీయులకిష్టపాత్రమైన ఉపనిషత్తులను అధ్యయనం చేసి, వాటిలో ఈశ, కేన, కఠోపనిషత్తులకు కారికలు రచించాడు.

గుండేరావు అటు సాహిత్యాన్ని, ఇటు వేదాంతాన్ని ఔపోశనం పట్టినాడా? అనిపిస్తుంది. ఆయన అన్ని మతాలను పరిశీలించాడు. మతగ్రంథాలను చదివాడు, భారతీయ వేదాంతంతో ఇతరుల ఆలోచనలను తులనాత్మక పరిశీలన చేసిన మహానుభావుడాయన. వివిధ మతాలకు చెందినవారు తరుచుగా గుండేరావు దగ్గరికి వచ్చి తమ ఆలోచనలను తెలియజేసి, గుండేరావు నుండి స్ఫూర్తిని పొందేవారు. హైదరాబాదు నగరంలో ఏ వేదాంత సభ జరిగినా అందులో విశిష్టస్థానం వారిదే.

గుండేరావు తెలంగాణ చిత్రపటం మీద మెరిసే ఒక వజ్రం. ఆయన మహ్మదీయుల పరిపాలనలో ఉద్యోగిగా ఉన్నప్పటికీ, కేవలం ఉద్యోగధర్మానికే పరిమితం కాలేదు. హైందవ ధర్మానికి పట్టుగొమ్మగా నిలిచాడు. తెలంగాణలోని ప్రతి పండింతునికి స్ఫూర్తినందించాడు. ఆయనలాగా ప్రాచ్య పాశ్చాత్య సంస్కృతులెరిగినవారు అరుదుగ కనిపిస్తారు. అన్ని భాషలలోని అంతఃసూత్రాన్ని తెలిసికొన్న ఉత్తమ పండితుడాయన. 20వ శతాబ్దిలో చెప్పుకోదగ్గ పండితుల్లో ఆయన ఒకరని నా అభిప్రాయం.

# 54 ఇల్లిందల సరస్వతీ దేవి

**- షబ్నవీజ్ ఇందిర**

ఏ పాఠకుడినైనా మెప్పించటం సులభమేమో కాని మనసుని సంతృప్తి నివ్వగలిగిన రచన- మనసు మీద గాఢమైన ముద్ర వేయగల రచన చేయటం చాలా కష్టమని నా అనుభవం నేర్పిన పాఠం. ఒక మంచి రచన చదివిన తరువాత పాఠకుడికి కలిగేవి అలౌకికమైన ఆనంద రసానుభూతి. అటువంటి రచన చేయాలన్న ఆకాంక్షలో ఎదురు చూస్తూ... అని ఇల్లిందల సరస్వతీ దేవి 1981లో అచ్చయిన "స్వర్ణ కమలాలు" పుస్తకంలో ముందుమాటలో చెప్పారు. తెలుగు సాహిత్యంలో గొప్ప సాహితీమూర్తిగా రసానందాన్ని తాను తన రచనల ద్వారా పొంది, పాఠకులకు కూడా ఆ రసానందాన్ని కలిగించారనేది అక్షర సత్యం.

1981 జూన్ 15వ తేదిన ప.గో.జిల్లా నరసాపురంలో సరస్వతీ దేవి జన్మించారు. కామరాజు రత్నమ్మ, వెంకట ప్పయ్యల ముద్దుబిడ్డ సరస్వతీ దేవి.

గురజాడ అప్పారావు గారు, కందుకూరి వీరేశలింగం గారు, పానుగంటి లక్ష్మీ నరసింహారావుగారి ప్రసహనాలు మొదలైనవెన్నో ఆ నాటి సామాజిక స్థితిగతులు చక్కదిద్దటానికి మహాకవుల చేపట్టిన ఆయుధాలే. 19వ శతాబ్ది పూర్వ భాగం చాలా చైతన్యవంతమైందిగా కనిపిస్తుంది. వివిధ పత్రికలు ఎందరో రచయితలను ప్రోత్సహించి సాహిత్య సేవ చేయటానికి అనుకూలించాయి. ఇల్లిందల సరస్వతీ దేవి 1918లో పుట్టేనాటికి ఈ చైతన్యం ఇంటింటా వెల్లివిరిసింది. సరస్వతీ దేవికి ఆమె బాల్యంలోనే కథలు, స్త్రీల పాటలు వినే అవకాశం ఆమె పెత్తల్లి ద్వారా కలగటం, ఆమె బాబాయి వీరేశలింగం గారి ప్రభావంలో వితంతు వివాహం చేసుకోవటం, భారత రామాయణ కథలు ఆమె తండ్రి రోజు సరస్వతీ దేవి చెప్పటం, ఇలా ఎన్నెన్నో అమె జీవితంపైన రచనల పైన గొప్ప ప్రభావాన్ని చూపాయన్నది సత్యం.

సరస్వతీ దేవి వివాహం జరిగేవరకు ఆంధ్ర ప్రాంతంలోనూ, వివాహం జరిగాక తెలంగాణా ప్రాంతంలో, ముఖ్యంగా హైదరాబాదులోను జీవితం గడపటంవలన, అటు వీరేశలింగం గారి సంస్కరణోద్యమంతోపాటు ఇటు మాడపాటి హనుమంతరావు గారి తెలంగాణా ఆంధ్రోద్యమం తో ప్రభావితులయి సాహిత్య రచన చేశారనేది నిర్వి వాదాంశం. బాల్యంలోనే అలవడిన పఠనాసక్తి ద్వారా కందుకూరి, శ్రీవాద, విశ్వనాథ మొ.వారి రచనలు చదవటం, ఆ పఠనాసక్తి గృహిణిగా కూడా కొనసాగి శ్రీ కృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయంలోని గ్రంథాలనెన్నిటినో పఠించి, సాహిత్యంపై సదవగాహనతో, రచనలు చేసి, తెలుగు సాహిత్యంపై సుప్రసిద్ధ రచయితిగా స్థిరమైన స్థానాన్ని సంపాదించుకున్నారు.

ఇల్లిందర సీతారామారావు గారితో సరస్వతీదేవి గారి వివాహం జరిగింది. ఆమె 15వ ఏటా అత్తవారింట్లో అడుగుపెట్టి అత్తగారి ఆదరణ, భర్త ప్రేమానురాగాలు పొందిన గొప్ప ఇల్లాలిగా గౌరవింపబడ్డారు.

సరస్వతీదేవి రేడియోలో చదివిన మొట్టమొదటి కథ “పితృ హృదయం” ఆ కథే 1943లో “భారతి మాస పత్రికలో ప్రచురింపబడింది. సరస్వతీదేవి జీవితంపైన, రచనలపైన ఆనాటి తెలంగాణా ఉద్యమాల ప్రభావం చాలా ఎక్కువగా కనిపిస్తుంది. తెలంగాణాలోని సాంస్కృతిక, రాజకీయ, సాహిత్య ఉద్యమాలు.. సరస్వతీదేవిలో చైతన్యాన్ని కలిగించి, రచయిత్రిగా ఆమెలో గొప్ప స్పందన కలిగించాయి. తెలంగాణా స్వాతంత్రోద్యమం, గ్రంథాలయోద్యమం, సంస్కరణోద్యమం, రాజకీయోద్యమం, ఒకదానితో ఒకటి అనుబంధాలై, ప్రజలను ప్రగతిపథంవైపు నడిపించటానికి దోహదం చేశాయి.

ఇల్లిందల సరస్వతీదేవి రచనల్లో ఉద్యమ ప్రభావం చాలా ఎక్కువగా కనిపిస్తుంది. బాల్య వివాహ నిరశన, వేశ్యావృత్తి నిషేధం, కులాల నిరసన, పురుషాధిక్య వ్యతిరేకత, స్త్రీ వ్యక్తిత్వ వికాసం, స్త్రీ విద్యావసరం మొదలైన సామాజికాంశాలు ఆమె రచనల్లో ప్రతిబింబించాయి. అంతేకాక, ఆమె చూపిన పరదా విధానం గురించి యువతీమండలి స్థాపన విషయంలో, చందాలు అడగటానికి వెళితే మహిళలు తలుపు తీసేవారుకారని, పని మనుషులచేత మాట్లాడించేవారని తెల్పారు.

అంతేకాక ఆమెకు తెలంగాణా వారల గురించి, ఆనాటి గడీల గురించి అవగాహన వుండటంతో, వెట్టిచాకిరీ గురించి తెలియటంతో, ఆ అంశాలు ఆమె నవలలో చిత్రీకరించారు. “నీ బాంచను కాల్మొక్త” అనే నవల రాయడానికి ఆ పేరు పెట్టడానికి సరస్వతీ దేవికి తెలంగాణా గ్రామీణ జీవన విధానం తెలియటమే అనిపిస్తుంది. సరస్వతీదేవి ఆనాటి మహనీయులతో కలిగిన ధన్యురాలని చెప్పారు. మాడపాటి హనుమంతరావు గారు, సురవరం ప్రతాపరెడ్డిగారు, రాజబహదూర్ వేంకటరామారెడ్డిగారు, బూర్గుల రామ కృష్ణారావు గారు, కొండ వెంకటరంగారెడ్డిగారు మొదలైన వారంతా ఆమెకు స్ఫూర్తి ప్రధాతలే. వారి సాహచర్యంలోనే ఆమెకు సాంఘిక సేవాకార్యక్రమాలపై ఆసక్తి కలిగింది. తెలుగు భాషా వికాసానికై కృషి చేయాలనే సంకల్పం కలిగింది. జైలుపరంగా ఆమె మహిళా ఖైదీల కష్టాలు సానుభూతితో తెలుసుకుని, మానవత్వంతో వారికి సహాయమందించగలిగారు. ఆమె పఠనాసక్తికి మూలప్రేరణ శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం. ఆమె రచించిన “తేజోమూర్తులు” అనే గ్రంథం ద్వారా ఆమె ఆయా మహనీయుల ప్రభావానికి లోనయి ఆమె వేసిన ప్రతి అడుగులోను వారినే ఆదర్శంగా తీసుకున్నారన్నది స్పష్టంగా తెలుస్తుంది.

సరస్వతీ దేవి రచించిన నవలలన్నిటిలో విశేష ప్రచారాన్ని ఆదరాన్ని పొందిన నవల “నీ బాంచను కాల్మొక్త”. ఈ నవల ఆంధ్రప్రభ ఆదివారపు సంచికలో ధారావాహికంగా ప్రచురింపబడింది. 976లో నవలగా ముద్రింపబడింది. నవలను గురించి రచయిత్రి ఎంతో వివరంగా తెలియ జేశారు. “ఈ నవల ఆంధ్రప్రభ ఆదివారపు సంచికలో సీరియల్‌గా వెలువడుతున్న కాలంలో పాఠకులనేకులు, ఈ నవల పేరు బాగుండలేదు అని, మాకు అర్థంకాలేదు అని నాకు ఉత్తరాలు రాశారు”. బాబూ, నాయనా, తండ్రి అని ఆంధ్రదేశంలో కొన్ని ప్రాంతాలలో పిల్లలను బతిమాలాడే ధోరణిలో పెద్దవాళ్ళు అన్నట్టు, తెలంగాణాలో, “నీ బాంచను కాల్మొక్త” అంటారు కొందరు.

బానిసలు, ప్రభువులు మెలిగే ఈ సంఘంలో, “చిత్తం బాబాయ్యా” అని కొన్ని ప్రాంతాలలో వున్నట్టి, తెలంగాణాలో “నీ బాంచను కాల్మొక్త” అనటం ఉంది. తెలంగాణా మాట మరింత బానిసత్వాన్ని సూచించేది గా వున్నది. కులాలలో తరతమ భేదాన్ని కొట్టవచ్చేటట్లు తెలిపేదిగానూ వున్నది. ఈ నవలకు ఇంతకంటే మంచి పేరు స్ఫురించలేదు.” ఈ నవలలో కథానాయకుడు హీనకులజుడని, అతడిపట్ల సంఘం ప్రవర్తించిన తీరు, అతడిలో జీర్ణించుకుపోయిన ఇన్‌ఫీరియారిటి కాంప్లెక్సును పోగొట్టడానికి జానకమ్మ చేసిన ప్రయత్నాలు, అవి ఫలించినతీరు నా శక్తికొలది చిత్రించటానికే ప్రయత్నం చేశాను” అని చాలా స్పష్టంగా ఈ రచన గురించి తెల్పారు సరస్వతీదేవి.

“ఏడెనిమిది సంవత్సరాల పిల్లవాడు రాగి వెంట్రుకలు ముఖమ్మీద ముసురుకున్నాయి. ఒంటికి చొక్కాగుడ్డయినా లేదు. గోచి పెట్టుకొని ఒక చిన్న గుడ్డ పీలిక భుజంమీద వేసుకున్నాడు. కళ్ళు చిన్నవే కాని చూపులు చురుకైనవి. బూడిద పడినట్లు కనబడే రంగు. “కాసిగా, నదు అవతలకి” ఎవరో పెద్ద అమ్మ అరిచారు. కాని లేచి మోకాలి పుండు చూచుకుంటూ, గ్రుడ్ల నీళ్ళు గ్రుడ్లలోనే గుక్కుకుంటూ

నిలబడ్డాడు. అక్కడ దొడ్డమ్మ అన్నం అంతా ముద్ద చేసి చిప్పలో వేసింది – అంతే!!

నీ బాంచను, నీ బాంచను, కాల్మొక్త "కాశీ వెళ్ళి పోయాడు వెనక్కు చూచుకుంటూ – ఒక సం.రం. పాటు ఆంధ్రప్రభలోని ధారావాహికంగా అచ్చయిన ఈ నవలలోని జానకమ్మని, కాశీని పాఠకులు ఈ నాటికి మరిచిపోలేదు – అది సరస్వతీ దేవిగారి కలానికున్న శక్తి.

సరస్వతీ దేవి సాహిత్యానికి మకుటాయమానంగా నిలిచేవి ఆమె కథా సంపుటలు. "స్వర్ణ కమలాలు" కథలలో శతపత్ర సుందరిలా శోభించింది. సరస్వతీ దేవిగారు సాహిత్య సరస్వతికి అర్పించిన కంఠహారం అని అనుకుంటుంటే వెంటనే స్ఫురించేవి తులసీదళాలు. ఇవి అమ్మవారి అష్టోత్తర శత నామాల్లో ఉన్నాయి. సంఖ్యలో 1994లో ప్రచురింప బడిన ఈ కథా సంపుటిలో వస్తు విస్తృత విభిన్నత గోచరిస్తుంది. 'అమ్మా, నాకు ప్రాణంతో పుట్టె హక్క లేదా' అనే కథ హృదయ విదారకంగా వుండటమేకాక, 'చైనా దేశంలో ఆడపిల్ల పుట్టగానే వేడి వేడి నీళ్ళలో ముంచి చంపేస్తారు. మనదేశంలో ఆడపిల్లయితే మహాలక్ష్మి అంటారు. మీ వంటి పెద్దవాళ్ళు అసలు ఆడదే లేకపతే ఇంత ప్రపంచమేముందండీ! ఏ ప్రాణికయినా జీవించే హక్కులేదా, లేదని శాసించే హక్కు ఎవరికుంది, నాగరికత వెర్రితలులు వేస్తోందా.. ఈ మాటలు పాత్రలతో అనిపించినా, సరస్వతిగారి గొంతే అక్కడ ప్రతిధ్వనించింది. "తులసీదళాల లక్ష్యం మానవాళి సత్వ గుణ ప్రధానంగా మనుగడ సాగించాలన్నదే అన్నారు సరస్వతీదేవిగారు. "అనేక వందల పాత్రలతో, అనేక వందల సంఘటనలతో నిండుగా సందడిగా వుండే ఈ కథాసంపుటి జగన్నాటకానికి ఎదురుగా నిలిపిన నిలువుటద్దం". అని ప్రశంసలందుకుంది ఈ సంపుటి.

**ప్రతిభా సరస్వతి**

సరస్వతీదేవి రచయిత్రిగా, సంఘ సేవకురాలిగా, బాధ్యతాయుతమైన కొన్ని పదవులు నిర్వహించిన స్త్రీ మూర్తిగా గొప్ప గౌరవాన్ని సమాజాన్నుంచి అందుకున్నారు.

1. 1958 నుంచి 1966 వరకు ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ కౌన్సిల్ మెంబరుగా నామినేట్ అయ్యారు.
2. 1967 – 72 వరకు ప్రాంతీయ చలనచిత్ర అవార్డుల కమిటీ సభ్యురాలుగా ఉన్నారు.
3. 1974లో జాతీయ చలనచిత్ర అవార్డుల కమిటీ సభ్యురాలు.

సామాన్య గృహిణిగా కనిపించినా అసామాన్యమైన రచయిత్రిగా పేరు పొందారు. సాహిత్య రంగం నుంచి ఎన్నో పురస్కారాలు అందుకున్నారు.

1. 1964లో మద్రాసు కేసరి కుటీరంవారి గృహలక్ష్మి స్వర్ణ కంకణ పురస్కారం.
2. 1974లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఉత్తమ రచయిత్రి అవార్డు.
3. 1987లో బాలల అకాడమీ నుంచి "బాలబంధు" అవార్డు.
4. 1982లో "స్వర్ణ కమలాలు" కథా సంపుటికి కేంద్రరాష్ట్ర సాహిత్య అకాడమి అవార్డులు.
5. 1989లో సుశీలా నారాయణరెడ్డి అవార్డు.
6. 1989లో దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ అవార్డు.

ఇవికాక ఎందరో సరస్వతీదేవిని సన్మానించారు. 1976లో ప్రముఖ సాహితీ సాంస్కృతిక సంస్థ, వంశీ ఆర్ట్స్ హైదరాబాదు వారి నుంచి, 1987లో మహామంత్రి మాదన్న వర్ధంతి సందర్భంగా గొప్ప సన్మాన పత్రాలు అందుకున్నారు. రావూరి సత్యనారాయణగారి "భాషాకుటీరం" నుంచి, రసమయి సాంస్కృతిక సంస్థ నుంచి సన్మానింపబడ్డారు. మద్రాసు తెలుగు అకాడమి, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సరస్వతీదేవిని సన్మానించాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాల శాఖ స్వీయ సాంస్కృతిక సేవా పథకం నుంచి సరస్వతీ దేవి గౌరవింపబడటం ఎంతో అభినందనీయం.

ఇంత ప్రతిభావంతురాలైన సరస్వతీదేవి ఎంతో మృదుభాషిణి, ఉత్తమ ఇల్లాలు, ఆదర్శ గృహిణి, నిరాడంబరాలు, ఎందరినో ఆత్మీయురాలు.

"నేను మొదట రచయిత్రినికాను. కావాలని ఆశించలేదు. కేవలం పాఠకురాలిగా అన్ని సాహితీ

ప్రక్రియలను చదివాను. అన్నిటిలో కథా సాహిత్యమంటే అభిమానమెక్కువ" అని స్వయంగా సరస్వతీ దేవి తెల్పారు. మధ్యతరగతి కుటుంబ వాతావరణం నుంచి మీ కథలు, నవలలు దాటిపోలేవేమి అని ప్రశ్నిస్తే, సరస్వతీదేవి ఎంతో సముచితంగా సమాధానమిచ్చారు. "దేశకాల పాత్రల కతీతమైంది. మానవ మనస్తత్వం. ఈ మనస్తత్వ ధోరణులను వివిధ వాతావరణాలలో అవి చెందే పరిణామ క్రమాన్ని విశ్లేషించటం నా మొదటి ఆశయం. అలాగే విశ్వ జనీనయమైన భావాలను దృష్టిలో పెట్టుకొని రచన చేయటానికే నా కలం మొగ్గు చూపుతుంది. చక్కని ఇతివృత్తం ఎక్కడ లభ్యమయితే, అక్కడినే వెళతాను కానీ కేవలం మధ్యతరగతి కుటుంబాలనే నా ఇతివృత్తం పరిమితం చేసుకోలేదు అన్నారు సరస్వతీదేవి స్పష్టంగా. అంటే రచనా లక్ష్యం విశ్వశ్రేయస్సు అనేది వివరించారు చాలా దృఢంగా.

"నేను సృష్టించిన స్త్రీ పాత్రలన్నీ క్షమ, జరిమి మంచితనం ముందు చూపు కలిగి ప్రవర్తిస్తాయి. స్త్రీలో ఉండే జరిమిని చేతకానితనం కింద ఎప్పుడూ అనుకో కూడదు. నా వచనలో స్త్రీ పురుష సమైక్యతను చాటి చెప్పే విశ్వజనీన భావాన్ని పొందుపరచడానికే ప్రయత్నించాను కానీ ఏ ఒక్కరినో సమర్థించడానికో లేదా విమర్శించడానికో ప్రయత్నించలేదు అన్నారు. అంటె సరస్వతీదేవి స్త్రీ పురుష సమానత్వాన్ని ఆకాంక్షించిన అభ్యుదయ స్త్రీ మూర్తిగా అర్థమవుతుంది. అలాగే సరస్వతీదేవి చెప్పిన ఎన్నో సమాధానాలలో ఆమె వ్యక్తిత్వ వికాసం స్పష్టంగా గోచరిస్తుంది. స్త్రీల సమాన హక్కులు. స్త్రీ స్వాతంత్ర్యంపట్ల సరస్వతీదేవి గారు చాలా ఖచ్చితమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. "నినాదాలవల్ల ఎవరైనా ఏదయినా సాధించగలరా, ఈ ఉమెన్స్ లిబ్ అన్నది పాశ్చాత్య దేశాలనుంచి దిగుమతి అయిన నినాదం. ఈ దేశంలో ఇది ఎంత వరకు అవసరమో మనం ఆలోచించాలి. నాకు తోచినంత వరకు స్త్రీ సమాన హక్కులు అంటూ స్త్రీ, పురుషులు కలికట్టుగా జీవించాలితప్ప స్త్రీలను బడుగు వర్గాలుగా చిత్రించి రిజర్వేషన్లు ఇవ్వడం నా అభిమతంకాదు." ఇదీ సరస్వతీదేవి ఆమె అభిప్రాయంగా స్వయంగా 1992లోనే చెప్పటం గుర్తించాలి.

ఇల్లిందల సరస్వతీదేవి సాహితీ స్వర్ణకమలం. తెలుగు సాహిత్యంలో తనదైన ముద్రను కథల ద్వారా, నవలల ద్వారా, వ్యాసాల ద్వారా, మరెన్నో సాహిత్య ప్రక్రియ ద్వారా నిలుపుకున్న సాహితీమూర్తి.

కొద్ది తక్కువగా వేయి పున్నములు జీవితంలో చూసిన పుణ్యాత్మురాలు, సాహిత్యంలో సమాజంలో, దేశంలో కూడా వచ్చిన పున్నములను, అమావాస్యలను దర్శించిన ధన్యురాలు.

ఇల్లిందల సరస్వతీదేవి గారు "జాతిరత్నం" ఆమె "తేజోమూర్తి". మానవతా విలువలతో విరబూసిన స్వర్ణకమలాలు సాహిత్యం లోకానికందించిన సాహితీమూర్తి, ఒక స్వర్ణ కమలం 31 ఆగష్టు 1998లో కన్ను మూసింది. మూడు తరాలకి ప్రతినిధియైన సాహితీమూర్తి మనకికలేరు.

55

# జమలాపురం కేశవరావు

**- డా॥ చవ్వా వెంకటరెడ్డి**

కోటి రతనాల వీణగా ప్రఖ్యాతమైన తెలంగాణ మాగాణం ఎందరో మహానుభావులకు, దేశభక్తులకు, సంఘసంస్కర్తలకు పోరాటయోధులకు ప్రాణ ప్రతిష్ట చేసింది. ఎన్నో మహోజ్వల ఘట్టాలకు ఊపిరిలూదింది. అది నిజాం రాచరికపు నిరంకుశ పాలనాకాలం. స్వేచ్ఛకోసం, ప్రజా స్వామిక హక్కుల కోసం ప్రజలు మాట్లాడుతున్న సమయం. దొర పట్టేళ్ల దాష్టీకానికి బడుగుల బతుకులు బలౌతున్న రోజులు. ఆకలితో అలమటించే అభాగ్యులకు అండగా ఉంటూ, ఆధిపత్యాలను అంతమొందించే యోధుడి కోసం తెలంగాణ సమాజం ఎదురుచూస్తున్న తరుణం.

ఆ సమయంలో కటిక చీకటిలో కాంతిరేఖలా, పీడితుల గుండెల్లో ధైర్యమై, ఎగిసిన పిడికిళ్లకు తెగింపై నినదించిన సింహ కంఠనాదం, పోరు రణన్నినాదం సర్దార్ జమలాపురం కేశవరావు. హైదరాబాద్ సంస్థానంలో విముక్తి ఉద్యమాలను అత్యంత ధైర్య సాహసాలతో, గాంధేయమార్గంలో నడిపించిన ధీశాలి జమలాపురం కేశవరావు.

నల్లబంగారం సిరుల పంటగా పేరుగాంచిన నాటి వరంగల్ (నేటి ఖమ్మం) జిల్లాలోని ఎర్రుపాలెం గ్రామంలో వెంకటరామారావు, వెంకట నరసమ్మ పుణ్య దంపతులకు 1908 సెప్టెంబర్ 3న కేశవరావు జన్మించారు. కేశవరావు చిన్ననాటి విద్యాభ్యాసం స్వగ్రామంలోనే కొనసాగింది. ఆ పై చదువులు ఖమ్మం పట్టణంలో పూర్తి చేశారు. సంపన్న కుటుంబంలో జన్మించినా ఇతరుల కష్టాలు తనవిగా భావించి పరిష్కరించే నైజం కేశవరావుది. బాల్యం నుండే కేశవరావు అన్ని కులాలు, మతాల వారితో కలివిడిగా ఉండేవారు. గ్రామీణ వ్యవస్థలోని మూఢనమ్మకాల పట్ల అతనికి తీవ్ర వ్యతిరేకత ఉండేది. పుట్టగానే పూవు పరిమళించినట్లు బాల్యం నుండే ప్రశ్నించడం, స్పందించడం, కలుపుకుపోవడం అనే సద్గుణాలు కేశవరావును నాయకుడిగా నిలబెట్టాయి.

ఒకసారి వారి గ్రామంలో ఒక నిండు గర్భిణి చనిపోతే, ఆ సంఘటనను అరిష్టంగా భావించి కుటుంబ సభ్యులతో సహా ఎవ్వరూ ఆ శవ దహన సంస్కారాలకు ముందుకు రాలేదు. ఆ సన్నివేశాన్ని చూసి చలించిన కేశవరావు గారు తానే స్వయంగా ఆ యువతి శవాన్ని భూజాన మోసుకొని స్మశానవాటికకు తీసుకెళ్లి దహనసంస్కారాలు చేయించి గ్రామస్తుల మూఢనమ్మకాన్ని పటాపంచలు చేశారు.

ఊర్లో ఉంటే చెడిపోతున్నాడని భావించిన తండ్రి కేశవరావును హైదరాబాద్ నిజాం కాలేజీలో బి.ఎ.లో చేర్పించారు. నిజాం కాలేజీ విద్యాభ్యాసం కేశవరావు ఆలోచనా పరిధిని మరింత పదునెక్కించింది. ప్రగతిశీల భావజాలం, అభ్యుదయ ప్రాపంచిక దృక్పథం, ఉద్యమించే మనస్తత్వం స్థిరపడటానికి నిజాం కాలేజీ మార్గదర్శనం చేసిందని చెప్పవచ్చు. అవి వందేమాతర ఉద్యమం జరుగుతున్న రోజులు. నిజాం ప్రభుత్వం వందేమాతర గీతాన్ని పాడకూడదని నిషేధించింది. అయినా

లెక్కచేయకుండా కేశవరావు మిత్రులతో కలిసి వందేమాతర ఉద్యమంలో పాల్గొన్నారు. కేశవరావే ముందుండి తరగతి గదులను బహిష్కరింపజేసి కళాశాల మైదానంలో సమావేశాలు ఏర్పాటు చేసేవారు. కేశవరావు నాయకత్వంలో విద్యార్థులు వందేమాతర గీతంపై నిషేధాన్ని ఎత్తివేయాలని గర్జిస్తూ ఉద్యమాన్ని మరింత ప్రజ్వరిల్లజేశారు.

కారణాంతరాల వల్ల బి.ఎ.చదువును మధ్యలోనే ఆపేసి మరఠ్వాడలోని కడకత్‌లో ఉన్న కరోడ్గిరీ శాఖలో ఉద్యోగంలో చేరారు. కొంతకాలం తరువాత ఆ ఉద్యోగాన్ని వదిలి హైదరాబాద్ జిల్లా అవ్వల్ లూలూక్దార్ కార్యాలయంలో చేరారు. 1936లో ఆ ఉద్యోగానికి కూడా రాజీనామా చేసి సంస్థాన స్వాతంత్ర్య ఉద్యమంలోకి కొదమసింహంలా దూకారు. అప్పటి నుండి తన జీవితాన్ని దేశసేవకే అంకితం చేసిన త్యాగధనుడు కేశవరావు.

కేశవరావు విద్యార్థి దశలోనే మాడపాటి హనుమంతరావుతో కలిసి గ్రంథాలయోద్యమంలో పాల్గొన్నారు. 1923లో విద్యార్థి నాయకునిగా 1934లో ఉద్యమకారునిగా గాంధీజీని కలుసుకున్నారు. ఆ చొరవతోనే 1946లో గాంధీజీ ఖమ్మం పర్యటన కేశవరావు సారథ్యంలోనే జరిగింది. నాడు ఖమ్మంలో గాంధీ గారి ప్రసంగం వినడానికి 80 వేల మంది ప్రజలను సమాయుక్త పరిచిన ఘనత కేశవరావుదే అంటే అతిశయోక్తి కాదు.

హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ స్థాపనకు కేశవరావు ముఖ్య భూమిక పోషించారు. స్వామి రామానంద తీర్థ, గోవిందరావు నానక్, రామ్ కిషన్ ధూత్, రావినారాయణరెడ్డి, జనార్ధనరావు దేశాయ్, శ్రీనివాసరావు బోరేకర్లతో కలిసి తెలంగాణలో స్టేట్ కాంగ్రెస్ పార్టీని ఉన్నతంగా నడిపించారు. నిజాం ప్రభుత్వం స్టేట్ కాంగ్రెస్‌ను నిషేధించింది.

1938 అక్టోబర్ 24న మధిరలో సత్యాగ్రహదీక్షలో కేశవరావు పాల్గొన్నారు. దీక్షకు అనుమతిలేదు కాబట్టి పోలీసులకు చిక్కకుండా నాటకీయ ఫక్కీలో ఒక రైతు వేషంలో జనంలోకి వెళ్ళి ప్రసంగించారు కేశవరావు. మహాత్మాగాంధీకి జై, భారత్ మాతాకీ జై అని నినదించారు. దీంతో నిజాం ప్రభుత్వం కేశవరావును 14 నెలలు జైలులో బంధించింది. జైలు నుండి తిరిగి వచ్చిన కేశవరావు తెలంగాణలోని ప్రతి పల్లెపల్లెలో పర్యటించి స్వతంత్ర ఉద్యమాన్ని ఉధృతం చేశారు. అంతేగాకుండా 1942లో క్విట్ ఇండియా ఉద్యమాన్ని కూడా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్ళారు.

కేశవరావు ప్రజానాయకుడిగా ఎన్నోసార్లు పోలీసులను ఎదిరించారు. ఒకసారి ఇల్లెందులలో యువజన కాంగ్రెస్ సమావేశాలకు పోలీసులు అనుమతించకపోతే, వారి ప్రవర్తనను నిరసిస్తూ జెండా కర్రతో పోలీసులకు ఎదురొడ్డి సవాలు విసిరాడు కేశవరావు. "సభకు అనుమతి ఇవ్వాలని, ఇవ్వకపోతే శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని, దానికి పోలీసులే బాధ్యత వహించాలని హెచ్చరించారు. దీంతో ఒక పోలీసు అధికారి తన తుపాకీని కేశవరావుకు గురిపెట్టి కాలుస్తానని బెదిరించాడు. ఆ అధికారి దౌర్జన్యాన్ని లెక్కచేయకుండా చావుకైనా సిద్ధమంటూ తుపాకిగుండు కెదురుగా తన గుండెను నిలిపిన ధీశాలి కేశవరావు. వారి ధైర్యం అక్కడి ప్రజల్లో చైతన్య స్ఫూర్తిని రగిలించింది. "సర్దార్ కేశవరావు జిందాబాద్" అన్న నినాదానికి అక్కడే ప్రాణ ప్రతిష్ట జరిగింది. వారి తెగింపుకు ప్రజలు అభిమానంతో ఇచ్చిన బిరుదు "సర్దార్" అప్పటి నుండి మన కేశవరావు సర్దార్ జమలాపురం కేశవరావు అయ్యారు.

1946 మే నెలలో నాటి మెదక్ జిల్లా కంది గ్రామంలో కేశవరావు అధ్యక్షతన నిజామాంధ్ర 13వ మహాసభలు జరిగాయి. ఆ సభలో నిజాం ప్రభుత్వం చేపట్టిన బూటకపు సంస్కరణలను తీవ్ర పదజాలంతో ఖండించారు సర్దార్ కేశవరావు. స్వామి రామానంద తీర్థ సహాయం, కేశవరావు అవిశ్రాంత కృషి వల్ల ఆ బూటకపు సంస్కరణలను వెనక్కు తీసుకుంది నిజాం ప్రభుత్వం.

సర్దార్ జమలాపురం కేశవరావు అధ్యక్షతన స్వాతంత్ర్యోద్యమం ఒక స్పష్టమైన స్వరూపం పొందగలిగింది. వేలాదిగా యువకులు, విద్యావంతులు వీరి నాయకత్వంలో స్వాతంత్ర్య సమరంలో పాల్గొనడానికి ముందుకు వచ్చారు. గ్రామ సంఘాలు, తాలుకా సంఘాలు ఏర్పాటు చేశారు. సర్దార్ కేశవరావు ప్రజలలో జాగృతి కలిగించడానికి బుర్రకథలు, హరికథలు, నాటకాల దళాలు ప్రతి జిల్లాలో ఏర్పాటు చేశారు. గ్రామాలలో గ్రంథాలయాలు నెలకొల్పారు. వయోజన విద్యా పాఠశాలలు ప్రారంభించారు.

గాంధీ మహాత్ముని సిద్ధాంతాలకు అనుగుణంగా సత్యం, అహింసల ద్వారానే స్వాతంత్ర్యం సాధించాలని కేశవరావు ప్రజలకు ఉద్బోధించేవారు. ఆనాటి ప్రభుత్వ దమననీతిని, తన అనర్గళ ఉపన్యాసాలలో నిశితంగా

విమర్శించేవారు. సభలో కేశవరావు ఉపన్యసిస్తున్నాడని తెలిస్తే ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చేవారు.

ఆర్య సమాజంతో కూడా కేశవరావుకు సన్నిహిత సంబంధాలుండేవి. దళితుల, ఆదీవాసీల అభ్యున్నతికి కూడా కృషిచేశాడు. వడ్డీ వ్యాపారులు, షావుకార్ల దోపిడీపై సభలో సమరశంఖం పూరించారు సర్దార్ జమలాపురం కేశవరావు.

కేశవరావు స్వాతంత్ర్య కాంక్షతో సరిపెట్టక హైదరాబాద్ రాష్ట్రాన్ని భారత యూనియన్‌లో విలీనం చేయాలని నిజాం రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడిగా 1947 ఆగస్ట్ 7న సత్యాగ్రహం చేశారు. దీంతో నిజాం ప్రభుత్వం 18 నెలలు జైలులో పెట్టింది. జైలులో తోటి ఖైదీలకు సమాజంలోని విషయాల పట్ల అవగాహన కలిగించి చైతన్యపరిచారు. జైలులో పోలీసు అధికారులకు, ఖైదీలకు మధ్య జరిగిన గొడవలను సామరస్యపూర్వకంగా పరిష్కరించేవారు. సర్దార్ కేశవరావును వరంగల్ నుండి నిజామాబాద్ జైలుకు తరలించే సందర్భంలో ప్రజలు వేలాదిగా తరలివచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆ ఉద్రిక్త పరిస్థితులను చక్కదిద్దడం పోలీసులకు ఎంతకూ సాధ్యంకాకపోతే కేశవరావే స్వయంగా ప్రజలను శాంతపరిచారు.

సరిహద్దు గాంధీగా పేరొందిన ఖాన్ అబ్దుల్ గఫార్‌ఖాన్‌లో మూర్తీభవించిన నిరాడంబరత, సహనం, సత్యసంధత కేశవరావులో ఉండటం వల్ల ప్రజలు కేశవరావును అపరసరిహద్దు గాంధీగా పిలుచుకునేవారు.

కేశవరావు సంస్కర్త, మానవతావాది, నిష్కామయోగిగా బహుముఖీనమైన పాత్రలు పోషించారు. మతమనేది సర్వసమాన హితానికి మూలం కావాలని అనేక సందర్భాలలో తెలియజేశారు. తను ఆచరణలో నిరూపించుకున్నారు. ఓ సారి తమపెద్దల సమావేశం జరుగుతున్నది. సాయంత్రం అయింది. ఒక ముస్లిం సోదరుడు దేనికోసమో వెదుకుతూ విచారంగా కనిపించాడు. అతని అవస్థను గమనించిన కేశవరావు తన భుజంపై కండువాను ఇచ్చి నమాజు చేసుకొమ్మని, కండువా మాసిపోతుందని ఆలోచించవద్దని భుజం తట్టి ఉత్సాహపరిచారు. ఈ ఘటన వారి పరమతసహనానికి ప్రతీక.

తెలంగాణలో కమ్యూనిస్టు పార్టీ సాయుధపోరాటం కొనసాగించిన రోజులలో సైతం కేశవరావు గ్రామాల్లో నిర్భయంగా తిరిగేవారు. ప్రత్యర్థులు సైతం ఆయనను గౌరవించేవారు. అధికార పదువులకోసం కేశవరావు ఎన్నడూ అర్రులు చాచలేదు. ప్రచార ఆర్భాటాలకు దూరంగా ఉండేవారు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూకు కేశవరావుపై గాఢమైన అభిమానం ఉండేది. అందుకే హైదరాబాద్ సంస్థానం నుండి భారత పార్లమెంట్‌కు నామినేట్ చేయబడ్డారు కేశవరావు.

జమీందారీ వ్యవస్థలో అతలాకుతలమైన తెలంగాణను విశాలాంధ్ర పేరుతో ఆంధ్రలో కలిపితే తీవ్రనష్టం జరుగుతుందని ఆనాడే హెచ్చరించారు కేశవరావు. స్వాతంత్రోద్యమంలో ఏ భూస్వామ్య శక్తులనైతే వ్యతిరేకించాడో వారే కాంగ్రెస్‌లో చేరి 1952 ఎన్నికలలో కేశవరావును ఓడించారు. అయినా గెలుపు ఓటములను సమదృష్టితోనే చూసేవారు కేశవరావు.

ఉద్యమ సమయంలో సరైన ఆహారనియమాలు పాటించక పోవడం, జైలు జీవితం, నమ్మిన వారు ద్రోహం చేయడం వంటి దుష్పరిణామాలు కేశవరావును క్రుంగదీశాయి. అందుకే అర్ధాంతరంగా 1953 మార్చి 29న తన 46వ ఏట మనల్ని వీడి శాశ్వతంగా వెళ్ళిపోయారు.

తెలంగాణ ఒక నిస్వార్థ ప్రజాసేవకుడిని, నిష్కల్మష హృదయుడిని, జననేతను, జాతీయనాయకున్ని కోల్పోయింది. మచ్చలేని వ్యక్తిగా, మానవత్వానికి ప్రతీకగా ప్రజలతో మమేకమైన ఉద్యమస్ఫూర్తి, చైతన్య దీప్తి సర్దార్ జమలాపురం కేశవరావు. మన భారతదేశానికి సర్దార్ వల్లభాయ్ పటేల్ అయితే దక్కన్ సర్దార్ మన తెలంగాణ కేసరి జమలాపురం కేశవరావు. ఈ సందర్భంలో కాళోజీ జమలాపురం కేశవరావును ప్రజల మనిషిగా అభివర్ణిస్తూ చెప్పిన కవితాపంక్తులను కొసమెరుపుగా అందిస్తున్నాను.

"మొండి చేతుల అంగి మోకాళ్ళు దాటిన
మొలగుడ్డతో తిరుగు కేశన్న
పల్లెబాటల బాధ ప్రజలతో బాటు
నీ బరి కాళ్లకే బాగ గురుతన్న
మచ్చలేని మనసు జబ్బులోని ఒళ్లు
డబ్బులేని జేబు నీదన్న
సర్దారు నామంబు సహజనామంబుగా
సరిపోయినది నీకు కేశన్న"

# 56 జమాలుద్దీన్

– డా॥ దేవరాజు మహారాజు

1970–80 దశకం వరకు మన హైదరాబాదు నగరంలో సయిద్ జమాలుద్దీన్ పేరు బాగా వినిపిస్తూ ఉండేది. ఆయన చెప్పిన హాస్యోక్తులు ఆయన ఆశువుగా చెప్పిన షాయరీలు, చురకల్లాంటి చెలుకులూ తరచూ వినిపిస్తూ ఉండేవి. నిజానికి ఈయన ఎవరు? నిజాం రాజు ఆస్థానంలో విదూషకుడా? కాదు. ఆయన ఆస్థానంలో అలాంటివారు ఎవరూలేరు. కానీ జమాలుద్దీన్ అనధికారంగా అంతటివాడే.

అక్బర్ ఆస్థానంలో బీర్‌బల్‌లాగా, శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలో తెనాలి రామలింగ కవిలాగా, మన హైదరాబాద్ సంస్థానాధీశుడు లేడు. కానీ, ఆయన దగ్గరే చిరు ఉద్యోగిగా చేరి, క్రమక్రమంగా 'బాగే–ఎ–ఆమ్' పబ్లిక్ గార్డెన్స్‌కు సూపరింటెండెంట్‌గా పదోన్నతి సాధించాడు.

తెనాలి రామలింగడి గురించి, బీర్‌బల్ గురించి ఎలాగైతే కథలు, పిట్టకథలు వ్యాప్తిలోకి వచ్చాయో జమాలుద్దీన్ పేరు అలాంటివే ఎన్నో వ్యాప్తిలోకి వచ్చాయి. ఈ తరంవారికి అవి అభూత కల్పనలని అనిపిస్తాయి. 'జమాలుద్దీన్' అనేది ఎవరో సృష్టించిన ఒక పాత్ర అని కూడా అనుకున్నారు. కానీ, జమాలుద్దీన్ నిజాం కాలంలో రంగ ప్రవేశం చేసి, తనదైన తరహాలో పాత్రపోషణ చేసి ఈ జీవిత నాటకరంగం నుంచి నిష్క్రమించిన ఒక సజీవ విదూషకుడు! నిజాంరాజు ఆయనను ఆస్థాన విదూషకుడిగా నియమించకపోయినా, ప్రజల దృష్టిలో ఆయన హైదరాబాదు సంస్థానానికి విదూషకుడయ్యాడు.

దక్కను పీఠభూమిలో హైదరాబాదుకు కొన్ని ప్రత్యేకతలున్నాయి. భాషా సంస్కృతులు, ఆచార వ్యవహారాలు, ప్రత్యేకమైన వంటకాలవలె జమాలుద్దీన్. సర్వర్ దండా లాంటి వాళ్ళు కూడా హైదరాబాదు సంస్కృతిలో భాగమైపోయారు. నిజాం కుటుంబానికి అతి సన్నిహితుడైన జమాలుద్దీన్ టిప్పు సుల్తాన్ వంశంలోనివాడు.

1881లో మద్రాసులో అంటే చెన్నైలో పుట్టాడు. విద్యాభ్యాసం కోసం విద్యార్థిగా హైదరాబాదు చేరాడు. నాటి ప్రముఖ విద్యావేత్త, సరోజినీ నాయుడి తండ్రిగారైన అఘోరనాథ ఛటోపాధ్యాయ సంరక్షణలో పెరిగి పెద్దవాడయ్యాడు. మెట్రిక్యులేషన్ పాసయ్యేవరకు సరోజినీ నాయుడి కుటుంబ సభ్యులతో కలిసి మెలిసి తిరిగాడు. అఘోరనాథ్ ఛటోపాధ్యాయ నిజాం కళాశాలకు ప్రిన్సిపాల్‌గా ఉండేవారు. ఆబిడ్స్ రోడ్డులోని 'గోల్డెన్ త్రెషోల్డ్' భవనం వారి నివాసంగా ఉండేది. కవులకు కళాకారులకు, సామాజిక కార్యకర్తలకు అది కేంద్రంగా విలసిల్లింది. సరోజినీ నాయుడితో పాటు ఆమె సోదరుడు హరీంద్రనాథ్ ఛటోపాధ్యాయ వీరి వయసువాడే! ఇక్కడ – అనుకోకుండా ఇంటా బయటా లభించిన సాహిత్య కళారంగాల వాతావరణం జమాలుద్దీన్ ఎదుగుదలకు దోహదం చేసింది.

అలాగే, ఒక మంచి అవకాశం కూడా అనుకోకుండానే చేజిక్కింది. జమాలుద్దీన్‌కు నవాబ్ కాజిమ్‌యార్ జంగ్ సోదరి గౌసియా బేగంతో 'నిఖా' జరిగింది. నవాబ్ కాజిమ్‌యార్ జంగ్ అంటే మాటలా? నిజాం ప్రభుత్వంలో ఒక ముఖ్యమైన శాఖ నిర్వహిస్తున్న 'వజీర్'! నవాబుల కుటుంబం. అందులో మంత్రిగారి చెల్లెలుతో పెళ్ళి. ఇంకేముంది? జమాలుద్దీన్ స్థాయి ఒక్కసారిగా పెరిగిపోయింది.

ఇకనేం నిజాం ప్రభువుతోనూ, అతని కుటుంబ సభ్యులతోనూ పరిచయం కావడం, సాన్నిహిత్యం పెరగడం ఇక సహజమేకదా? ఆ విధంగా జమాలుద్దీన్‌కు సన్నిహితు డయ్యాడు. ఉద్యానవన శాఖలో నిన్న ఉద్యోగిగా చేరి, అనతి కాలంలో త్వరితగతిని పబ్లిక్ గార్డెన్స్‌కు అంటే 'బాగ్ – ఎ – ఆమ్'కు సూపరింటెండెంట్ అయ్యాడు. పబ్లిక్ గార్డెన్స్‌లో 'జపనీస్ గార్డెన్' అభివృద్ధి చేయడానికి నిజాం, జమాలుద్దీన్‌ను జపాన్ పంపించాడు.

జమాలుద్దీన్ జపాన్ వెళ్ళి అక్కడి తోటల పెంపకం, నిర్వహణ అంతా అధ్యయనం చేశాడు. హైదరాబాదుకు తిరిగొచ్చాక వెంటనే కార్యరంగంలోకి దూకకుండా కాల యాపన చేశాడు. ఈయన బద్ధకాన్ని గమనించి నిజాం ప్రభువే వెంటపడి 'ఎంత డబ్బు కావాలో తీసుకో. జపాన్ గార్డెన్ అభివృద్ధి చెయ్యి' అని ఒత్తిడి చేయసాగాడు. లక్ష రూపాయలు, సంవత్సరం గడువూ కావాలన్నాడు జమాలుద్దీన్. నిజాం మంజూర్ చేశాడు.

కాలం గడిచింది. లక్ష ఖర్చయ్యింది. కానీ, "జపాన్ గార్డెన్"లో ఒక్క మొక్కా పెంచలేదు. జపనీస్ పద్ధతిలో ఉద్యానవనం తయారై ఉంటుందనుకుని ఎంతో ఉబలాటంతో నిజాం రాజు తనిఖీకి వచ్చాడు. 'పని ఎంతవరకు వచ్చింది' అని అడిగాడు.

"జపాన్ గార్డెన్ అంతా సిద్ధమైంది ప్రభూ! కానీ, ఒక్కటే తక్కువ! జపాన్ నుండి అగ్ని పర్వతాలు దిగుమతి చేసుకోవాల్సి ఉంది!" అని నివేదించుకున్నాడు – జమా లుద్దీన్. పిసినిగొట్టు, కోపిష్టీ అయిన నిజాం ప్రభువు మరి ఆ సమయంలో ఏ గుణాన ఉన్నాడో గానీ... చిరునవ్వు నవ్వి వెళ్ళిపోయాడు. గార్డెన్‌కు మరికొంత డబ్బు మంజూరు చేశాడు. ఆ తర్వాత జమాలుద్దీన్ తన బద్ధకం వదిలించుకుని, రాత్రింబవళ్ళు జపనీయ తోట పెంపకం మీద మనసు పెట్టాడు. చివరకు జపనీస్ శైలిలో అద్భుతమైన గార్డెన్ అభివృద్ధి చేశాడు. ఇటీవలి కాలం వరకు పబ్లిక్ గార్డెన్‌లో జపనీస్ విభాగం ప్రపంచ విహారయాత్రికులను ఎంతగానో అలరించేది.

తర్వాత కాలంలో పబ్లిక్ గార్డెన్స్‌లో లలిత కళాతోరణం, తెలుగు విశ్వవిద్యాలయ భవన సముదాయం రావడంతో జమాలుద్దీన్ అభివృద్ధి పరిచిన జపనీస్ గార్డెన్ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. బెరార్ యువరాజు, నిజాం యువరాజు మొజంజా మొదలైనవారంతా జమాలుద్దీన్‌తో స్నేహంగా ఉండేవారు. అప్పటికి మోటారు వాహనాలు చాలా తక్కువగా ఉండేవి. గుర్రాలు వాడుకలో ఉండేవి. గుర్రాలమీద స్వారి చేస్తూ ఈ మిత్రులంతా 'బాగె–ఎ–ఆమ్'కు వచ్చి జమాలుద్దీన్‌తో బాతాఖానీ వేసి, గరమ్ గరమ్ చాయ్ తాగి సరదాగా గడుపుతూ ఉండేవారు.

1940లో జమాలుద్దీన్ రెడ్ హిల్స్‌లో ఒక చిన్న భవనం కట్టుకున్నాడు. అది కూడా జపనీస్ శైలిలో ఎంతో అందంగా తయారైంది. దాని పేరు 'ఫెర్న్‌విల్లా'. అయితే జమాలుద్దీన్ ఆ భవనంలో ఎక్కువకాలం గడపలేకపోయాడు. కారణం, 1942లో ఆయన అకాల మరణం పొందాడు. కుటుంబంలోని వారంతా అనాధలయ్యారు.

జమాలుద్దీన్ కొడుకు ఇంటిలోని వస్తువులన్నీ అమ్ముతున్నట్లు పత్రికా ప్రకటన ఇచ్చాడు. అది తెలిసి నిజాం ప్రభువు హుటా హుటిన 'ఫెర్న్‌విల్లా'కు వెళ్ళాడు. అక్కడి ఆస్థి విలువ ఎంతుందో అధికారులను లెక్కగట్ట మన్నాడు. వాళ్ళు అటూ ఇటూ కూడీ, తీసివేసి చివరకు ఆ ఆస్థి విలువ రెండు లక్షలని తేల్చారు. నిజాం భృకుటి ముడిచాడు. భవనం, ఫర్నీచర్, ఇతర వస్తువులు అన్నీ కలిపి లక్షకు బేరమాడాడు. ప్రభువే ఆ మాట అంటే కాదు, ఇంకా ఎక్కువ ఇచ్చి కొంటామని ఎవరుమాత్రం ముందుకొస్తారూ? ఎంతటి ప్రభువైనా నిజాం పిసినారితనం జగద్విఖ్యాతమైంది. 'ద టీల్స్ ఆఫ్ ఇండియన్ ప్రిన్సెస్' అనే ప్రసిద్ధ గ్రంథంలో కూడా నిజాం పిసినారితనం నమోదై ఉంది.

జమాలుద్దీన్ బతికి ఉన్నంతకాలం నిజాంను అపహాస్యం చేస్తుండేవాడు. జమాలుద్దీన్ 'ఫెర్న్‌విల్లా'

కట్టుకున్న తొలి రోజుల్లో యువరాజు మొజంజా ఫెర్నావిల్లాకు వచ్చి 'ఇదేమిటి పావురాల గూళ్ళలాగ ఇంత ఇరుకుగా ఉందీ ఇల్లూ – ఇందులో ఎట్లా ఉంటారూ?' అని హేళన చేశాడు. 'తన స్థాయికి, తన సంపాదనకు తగినట్టుగా తను కట్టుకున్నానని జమాలుద్దీన్ సవినయంగా మనవి చేసుకున్నాడు. విచిత్రమేమంటే పోలీస్ యాక్షన్ తర్వాత యువరాజు తన అధికారం నివాసం 'హిల్ ఫోర్ట్ ప్యాలెస్' వదిలి, తన తండ్రి నిజాం బేరమాడి కొన్న ఈ 'ఫెర్న్‌విల్లా'లోనే ఇరవైయేళ్ళు నివసించాడు. అలా జమాలుద్దీన్ కట్టిన పావురాల గూడులో యువరాజుకు జీవితం వెళ్ళబోయక తప్పిందికాదు.

జమాలుద్దీన్ పేర ప్రచారంలో ఉన్న కొన్ని హాస్యోక్తులు చూద్దాం. జమాలుద్దీన్ టోపీ ముందు భాగాన్ని వెనక్కి పెట్టుకుని తిరిగేవాడట. అదేమంటే 'ఏమో నిజాం ప్రభువు గబుక్కున వెనకనుండి వస్తే ఎట్లా? అందుకే ఈ ఏర్పాటు' – అని అనేవాడట. తెలివి తక్కువ నౌకరు ఇంట్లో మేకు కొడుతున్నాడట. మేకు తలభాగం గోడకు పెట్టి, మొనతేలిన భాగాన్ని బాదుతున్నాడట. అది గమనించిన జమాలుద్దీన్ 'ఆ మేకు ఆ గోడది కాదురా! అదిగో ఎదురుగా ఉన్న గోడది! కదిలించకుండా అలాగే తీసుకెళ్ళి ఎదురుగా కొట్టు దిగుతుంది' అని చెప్పాడట. ఒక్కో గోడకు ఒక్కోరకం మేకులుంటాయా – అని నౌకరు ఆశ్చర్యపోయ్యాడట. ఒకసారి కారు డ్రైవర్ సడన్‌గా బ్రేకు వేశాడట. ఏమిటి? ఏమైంది? అని అడిగాడు జమాలుద్దీన్. 'ఎదురుగా గొయ్యి ఉందిసార్. చూస్కోలే. మాఫ్‌కర్‌నా' అన్నాడట డ్రైవర్.

"గొయ్యి ఉన్నా నుయ్యి ఉన్నా హారన్ మోగిస్తూ వెళ్ళిపోవాలేగాని, బ్రేకులు కొట్టి కార్లో ఉన్నవాళ్ళ ప్రాణాలు తీస్తావా?" అని సీరియస్‌గా జోక్ చేశాడట జమాలుద్దీన్.

చదువుకోసం కూతురిని జమాలుద్దీన్ ఢిల్లీ పంపించాడు. అక్కడ ఆమె 'పింగ్‌పాంగ్' ఆట నేర్చుకుని, తల్లిదండ్రులకు ''నేను పింగ్‌పాంగ్‌ను వదిలి ఉండలేకపోతున్నా"నని ఉత్తరం రాసింది.

దానికి జమాలుద్దీన్ 'అదిగో చూశావా నీ కూతురు ఎవడో చైనా వాడి వలలో పడింది'అని భార్యను బెదిరించాడట. జమాలుద్దీన్ భార్య గౌసియా బేగం తెలివి తక్కువదికాదు. 'పింగ్‌పాంగ్' – అంటే టేబుల్ టెన్నిస్ అని భర్తకు తెలియ జెప్పింది. నవాబుల కుటుంబంలోంచి విచ్చిన గౌసియా బేగం, స్త్రీవిద్యకు ముఖ్యంగా హైదరాబాదు సంస్థానంలో మాంటిస్సోరి విద్యావిధానానికి నాంది పలికిన నారీమణి! ఇక్కడి నుండి పట్టభద్రులైన తొలితరం మహిళల్లో ఆమె ఒకరు. ఆ రోజుల్లోనే ఇంగ్లాండ్ వెళ్ళి, మాంటిస్సోరి విద్యావిధానాన్ని అధ్యయనం చేసొచ్చి ఇక్కడ ప్రవేశపెట్టిన ఘనత ఆమెదే! భర్త జమాలుద్దీన్ అటు ఉద్యానవన శాఖను పరిపుష్టి గావిస్తే, ఇటు ఈమె విద్యారంగాన్ని సుసంపన్నం చేశారు. హైదరాబాదు చరిత్ర పుటల్లో ఈ దంపతుల పేర్లు చిరస్థాయిగా నిలిచిపోయాయి.

57

# జయశంకర్ సర్

**– దేశపతి శ్రీనివాస్**

**ప్రతీదీ సులభమ్ముగా సాధ్యపడదు లెమ్ము**
**నరుడు నరుండవుట దుష్కరమ్ము సుమ్ము**

దుష్కరమైన దానిని సుసాధ్యం చేసి చూపిన మనీషి ఆచార్య కొత్తపల్లి జయశంకర్. కలలో కనిపించినా నిద్రలోనే చేతులెత్తి నమస్కరించేంతగా తెలంగాణ ప్రజాజీవితం మీద ఆయన తన జీవిత కార్యాచరణతో ముద్రవేశారు. తెలంగాణ మట్టిలోని ఉదాత్త విలువలకు మానవ రూపం ఆచార్య జయశంకర్.

1934 ఆగష్టు 6న తెలంగాణ సంస్కృతికి పట్టుగొమ్మ అయిన వరంగల్ జిల్లా ఆత్మకూరు మండలం అక్కంపేటలో ఆయన జన్మించారు. కాళోజీ, సురవరంలలో ప్రతిఫలించిన హైదరాబాద్ సంస్థాన సంస్కృతికి జయశంకర్ కూడా అచ్చమైన వారసుడు. జయశంకర్ గారు మాట్లాడు తున్నప్పుడు నిజాం కాలం నాటి హైదరాబాద్ సంస్థానంలోని ప్రజాజీవితానికి సంబంధించిన జ్ఞాపకాల వెలుగునీడలు ఆయనలో ప్రతిఫలించేవి. నిఖార్సైన తెలంగాణీయుడు.

అందుకే తన తెలంగాణతనం మీద ఎవరూ ఆక్షేపణ చేసినా అవమానించినా ఆయన సహించలేదు. రోషంతో తిరగబడ్డాడు. జీవితమంతా ఒకే ఎజెండాతో జీవించారు. తెలంగాణ జీవితాన్ని విధ్వంసం చేస్తున్న ఆంధ్ర వలస వాదానికి వ్యతిరేకంగా తెలంగాణ ప్రజల పక్షాన ఆయన వకాల్తా తీసుకున్నాడు. ఒకమాటలో చెప్పాలంటే తెలంగాణ తల్లి తనకోసం తాను నియమించుకున్న న్యాయవాది ఆయన. తన క్లైంట్ తరఫున వాదనలను ఆయన ఎంతో కఠోర దీక్షతో పదునుపెట్టుకున్నాడు. జీవిత పర్యంతం ఎంతో శ్రద్ధగా వాదించిండు. తెలంగాణ ఉద్యమానికి ఒక తాత్విక భూమికను ఏర్పరచిండు.

తెలంగాణ ఉద్యమం అన్ని దశలలోను జయశంకర్ ఉద్విగ్న భాగస్వామి. పోలీస్ యాక్షన్ తరువాత తెలంగాణలో సివిల్ రూల్ అమలులో ఉన్న కాలంలో అప్పటి పాలకులు ఇక్కడి ఉద్యోగాల్లో ఇతర ప్రాంతాల వారిని నియమించారు. ఈదశలో తామరతంపరగా వలసవచ్చిన ఆంధ్ర ప్రాంతీయులు ఇక్కడి ప్రజల జీవనంతో సంలీనం కాలేదు. ఈ ప్రాంతాన్ని జయించిన విజేతల వలె వారు ప్రవర్తించారు. ఇక్కడి వారికి సభ్యత, సంస్కారం, నాగరికత భాష నేర్పేందుకు వచ్చిన ఉద్ధాన కర్తలవలె తమనుతాము భావించారు.

ఆంధ్ర ఉద్యమంలో పొందిన అభిజాత్యాన్ని తెలంగాణ ప్రజల మీద ప్రదర్శించారు. ఈ నేపథ్యంలో 1952లో ముల్కీ ఉద్యమం చెలరేగింది. 1952 సెప్టెంబర్ 3న హైదరాబాద్ సిటీ కాలేజీలో జరిగే విద్యార్థుల సమావేశానికి బయల్దేరిన జయశంకర్ బస్సు ఫెయిల్ అయి మార్గమధ్యంలో జనగామ దగ్గర ఆగిపోయిందు. ఆరోజు సిటీ కాలేజీ సమా వేశంపై పోలీసులు చేసిన కాల్పుల్లో నలుగురు విద్యార్థులు అమరులయ్యారు. నిజాంకాలం నాటి సంక్లిష్ట సందర్భంలో

ఎదిగిన వాడు జయశంకర్. ఉర్దూ మీడియంలోనే చదువు అందుబాటులో ఉన్న రోజులవి. హన్మకొండలోని మర్కజి హైస్కూల్‌లో ప్రాథమిక విద్య అభ్యసించాడు. ఉస్మానియాలో బి.ఏ. బెనారస్ అలీఘడ్ విశ్వవిద్యాలయాలనించి పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిగ్రీ పొందాడు.

ఉమ్మడి రాష్ట్ర ప్రతిపాదనలో ఉమ్మడితనం లేదని జయశంకర్ మొదటినుంచి వాదించాడు. అది కేవలం ఆంధ్ర రాష్ట్ర సమస్యలను గట్టెక్కించు కోవడం కోసం తమ రాజకీయ ప్రాబల్యం పెంచుకోవడం కోసం ఆంధ్ర నాయకత్వం తీసు కొచ్చిన ప్రతిపాదనగానే ఆయన భావించారు. భిన్న చారిత్రక దశలు, సామాజిక పరిణామాలు గడిచివచ్చిన రెండు సమాజాలను ఒకటి చేస్తే అసమానతలు చోటుచేసు కుంటాయని ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదనను నిర్ద్వందంగా వ్యతిరేకించాడు. భావ సమైక్యత లేకుండా భాష ఒక్కటే ప్రజలను కలిపి ఉంచలేదని "ఫజల్ అలీ కమీషన్ ముందు తన వాదనలు వినిపించాడు.

కాని తెలంగాణ ప్రజల అభిప్రాయాలను విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ ఏర్పాటయింది. ఏర్పాటు సమయంలో తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలు, రక్షణలు, చేసుకున్న ఒప్పందాలు ఏవీ అమలు కాలేదు సరికదా దారుణమైన ఉ ల్లంఘనలు చోటుచేసుకున్నాయి. ఈ పరిణామం తెలంగాణ ప్రజల జీవితంలో కల్లోలం రేపింది. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన 13 సంవత్సరాలలోనే అది ఒక విఫల ప్రయోగమని తేలి పోయింది.

1969లో తెలంగాణ ప్రజాక్షేత్రంలో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఎగిసిపడింది. 35ఏళ్ళ జయశంకర్ ఉద్యమ సమరాంగణంలో సాహసోపేతంగా దూకిండు. ఒక సందర్భంలో ఆనాటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి జయశంకర్ వాదనలోని తీవ్రతను చూసి "నిన్నిప్పుడే ఉద్యోగంలోంచి తీసేయగలను' అని బెదిరింపు ధోరణలో మాట్లాడితే 'మీ టేబుల్ మీద కాగితం ఉంది మీ జేబులో పెన్నుంది ఈ క్షణం నన్ను ఉద్యోగంలోంచి తీసేయండి' అని జవాబిచ్చిన ధీశాలి జయశంకర్.

ఏడాది కాలం కాలాన్ని కళపెళ ఉడికించి అనేక మంది యువకులు తమ రుధిర ధారలతో నేలను తడిపి ప్రాణార్పణతో ప్రతిఘటనను నిర్మించి నిలబెట్టిన ఉద్యమం విద్రోహానికి గురయ్యింది. నాయకత్వం లొంగి పోయింది. తీవ్రమైన నిరాశా నిస్పృహలు తెలంగాణ ఎల్లెడలా అలుముకున్నాయి. ఆ నీరవ నిశ్శబ్ద సందర్భంలోనూ నిస్పృహకు గురికాకుండా కర్తవ్యదీక్షతో ముందుకు కదిలిన గుండె ధైర్యం పేరు జయశంకర్.

చిత్రగుప్తుడు పాపాల చిట్టా రాసినట్టు పాలకుల వివక్షను పుస్తకాల్లో సాక్ష్యాధారాలతో రికార్డు చేస్తూ పోయిండు. మొక్కవోని దీక్షతో భవిష్యత్తు మీద ఎనలేని నమ్మకంతో చేసిన ఆయన ప్రయత్నం మలిదశ తెలంగాణ ఉద్యమానికి సైద్ధాంతిక భూమికను సమకూర్చింది. ఆనాటి నుంచి నిధులు, నీళ్ళు, నియామకాలలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని అనవరతం లిఖిస్తూ పోయిండు.

ఆర్థిక శాస్త్ర ఆచార్యుడైన జయశంకర్ ఇంజనీర్లకన్నా లోతుగా ప్రాజెక్టుల గురించి నీటి పంపకాల గురించి జరిగిన అన్యాయం గురించి బలంగా రాసిండు. నిధుల తరలింపు, నియామకాల్లో జరిగిన అన్యాయాలు ఏది రాసినా సాధికారికంగా రాసిండు. అందుకోసం ఆయన అనేక అంశా లను అధ్యయనం చేసారు. సమాచారాన్ని సేకరించారు. తెలంగాణ దృక్పథంతో విశ్లేషించిండు. మాటలను కాయినైజ్ చేయడంలో జయశంకర్ తనదైన ముద్ర వేసిండు. నిధులు, నీళ్ళు, నియామకాల అనటంకాని యాచించి కాదు శాసించి సాధించాలి అనటస్త్రం కాని స్ట్రీట్ ఫైట్ కాదు స్టేట్ ఫైట్ అనటం కాని RSS నించి RSU దాకా అందరూ ఒకే ఎజెండాలా కదలాలని చెప్పడం కాని తెలంగాణ వాదులు వీలైన సమైక్యంగా లేదా సమాంతరంగా పోరాడాలి తప్ప సంఘర్షణలకు దిగకూడదని చెప్పడం కాని ఆయనలోని సృజనాత్మకతకు అనుభవ సామర్థ్యానికి నిదర్శనం.

జయశంకర్ సారుది మేఘ గంభీర స్వరం. ఆయన ఉపన్యాసం గంభీర నదీ ప్రవాహం. సప్రమాణమైన చర్చ, ఖచ్చితమైన తర్కమే తప్ప సభారంజకత్వం కోసం చేసే ఉపన్యాసం కాదు. ఆలోచనా బలంతో విశ్లేషణ వైదుష్యంతో వాదంలో స్పష్టతతో సభమీద ఒక గంభీరమైన ముద్రవేస్తడు. భావన ఎంత స్పష్టంగా వుంటుందో వ్యక్తీకరణ అంత స్ఫుటంగా ఉంటుంది. రాసినప్పుడు వాక్యం ఎంత బిగువుగా వుంటుందో మాట్లాడినప్పుడు అంతే పకడ్బందీగా ఉంటుంది.

శిథిల వాక్యాలకు ఆయన ఉపన్యాసంలో చోటు లేదు. మాటల మధ్య పాజ్‌తో కూడా ఒక వ్యక్తీకరణను సాధ్యం చేయడం ఆయనకు తెలిసిన ఒక అద్భుత విద్య. ఎంతటి సంక్లిష్ట విషయాన్నైనా అనుగుణమైన పదాలతో సులభంగా సుగమంగా భోదించడం జయశంకర్ ప్రత్యేకత. మీకీ విధంగా పదాలను అప్రాప్రియేట్‌గా ప్రయోగించడం ఎట్లా సాధ్యం అని అడిగినప్పుడు జయశంకర్ 'నేను ముందు ఉర్దూలో ఆలోచిస్తా ఉర్దూ పదాలకు సమానార్ధకాలైన తెలుగు పదాలను ఉపయోగిస్తా' అనే ఆశ్యర్యకరమైన సమాధానం చెప్పిండు. ఉర్దూ అంటే ఆయనకు అమితమైన ప్రేమ.

ఉర్దూ కేవలం మహమ్మదీయుల భాష అనుకునే వారి సంకుచితత్వం పట్ల సారుకు చానా అసహనం. ఒక మతానికి భాష ఉండవచ్చు కాని, ఒక భాషకు మతం ఉండదు అనేది సారు అభిమతం. జయశంకర్ ఉర్దూ ప్రసంగాన్ని వినేందుకు మహమ్మదీయులు పండితులు కూడా చెవికోసుకునేది. ఫసీ ఉర్దూలో ఆయన ప్రసంగిస్తుంటే అత్తరు వాసనల వలె సాహిత్య పరిమళం సభను అలుముకునేది.

మిర్జాగాలిబ్ సాహిర్ లూథియాన్‌వి, ఇక్బాల్ షాద్ కాళోజీ రామేశ్వరరావుల షాయరీలు అలవోకగా ఉటంకిస్తూ చేసిన ఆయన ప్రసంగాలు నేటి తరానికి గొప్ప సిలబస్‌గా నిలుస్తాయి. తెలంగాణ ప్రజలు మాట్లాడే తెలుగును ఉర్దూ కలిసిన తెలుగు కనుక తారక్యాద్దం అని అన్న ఆంధ్రా పండితులకు ఆయన మూతోడ్ జవాబ్ యిచ్చిండు. ఉర్దూ భారతీయ భాష. దాని ప్రభావం దేశంలోని అన్ని భాషల మీదా ఉంది. తమదే అసలైన తెలుగుగా భావించే ఆంధ్రా ప్రాంతీయులు ఎన్ని ఉర్దూ పదాలను అవి ఉర్దూ పదాలని తెలియకుండానే ఎటా ఉపయోగి స్తున్నారో సార్ వివరించి చెప్పిండు. కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి తెలంగాణను దక్షిణ పాకిస్తాన్ అన్నందుకు ఆగ్రహించి ఆయన ఇంటికి పోయి ఆయన పద్యాలలో ఉన్న ఉర్దూ పదాలను చూపించి ఆయనను ఆశ్చర్య పరిచిండు. అట్లే శ్రీశ్రీ తదితర కవుల కవితలలో ఉర్దూ ఎట్లా మిళితమయిందో సోదాహరణంగా వివరించిండు.

జయశంకర్ సారుకు చదువు చెప్పిన గురువు విద్వాన్ టి.వి. సుబ్బారావు. ఆయన తన 80వ యేట ఉర్దూ నేర్చుకుని ఉర్దూ కవితా మాధురి అనే పుస్తకం రాసిండు. విచిత్రమేమిటంటే తన గురువు పుస్తకానికి శిష్యుడైన జయశంకర్ గొప్ప ముందుమాట రాసిండు. ఆ ముందుమాట తెలుగు భాష మీద ఉర్దూ భాషా ప్రభావాన్ని విశదీకరించిన ఒక మాస్టర్ పీస్.

ఇజాలలో ఇమడని వ్యక్తిత్వం జయశంకర్‌ది. నానా ఇజాలలో చూడ నాఇజమే కనిపించును అన్న కాళోజీ మార్గం ఆయనది. బ్రతుకు పూజ్యనీయమైనదని దానిని స్వార్ధంతో సంకుచితత్వంతో నింపేయొద్దని ఆయన నమ్మిక. చట్టబద్ధ పాలన ఆయన నమ్మిన సూత్రం.

తన వ్యక్తిగత జీవితంకన్నా వృత్తి గత జీవితానికి సామాజిక జీవితానికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాడు. వామపక్ష విద్యార్ధి ఉద్యమాలు తీవ్రంగా ఎగిసి పడుతున్న సమయంలో వరంగల్‌లోని CKM కాలేజీ ప్రిన్సిపాల్‌గా కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సులర్‌గా ఎంతో పరిణతితో సమన్వయ దృక్పథంతో పరిపాలనా భాద్యతను నిర్వహించారు. కాకతీయ యూనివర్సిటీలో విద్యా ప్రమాణాల్ని నెలకొల్పడంలో యూనివర్సిటీని ప్రాంతీయ అసమానతల అధ్యయనం చేయడం కోసం తెలంగాణ స్టడీ సెంటర్‌ను ఆయన నెలకొల్పారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఆయన ఒక దీపస్తంభం వలె దారి చూపారు. ఆటుపోట్లు ఎదురైనప్పుడు ధైర్యం చెప్పిండు.

నేటి ముఖ్యమంత్రి నాటి తెలంగాణ ఉద్యమ రథసారధి KCR అండగా నిలిచిండు. తెలంగాణ నలుచెరగులా కలియదిరుగుతూ భావజాల ప్రచారం చేసిండు. స్వపక్షమైనా విపక్షమైనా తెలంగాణ గురించి మాట్లాడాలంటే జయశంకరే రెఫరెన్స్. ఆయన ఒక నడిచే తెలంగాణ ఉద్యమ సర్వస్వం జాతీయ స్థాయిలో వివిధ పార్టీలను తెలంగాణకు అనుకూలంగా ఒప్పించడంలో KCR గారితో పాటు జయశంకర్ గారిది కీలకపాత్ర.

ఆనాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఎంతో గౌరవించే ఆత్మీయమిత్రుడు జయశంకర్. చారిత్రికమైన డిసెంబర్ 9 ప్రకటనను రాసింది జయశంకరే. కాన్సర్ దేహాన్ని కబళిస్తున్నా లెక్కచేయకుండా శ్రీకృష్ణ కమిటీకి తెలంగాణ రాష్ట్ర సమితి పక్షాన తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను

గురించి నివేదిక రాసి ఇచ్చింది జయశంకరే. కాన్సర్‌తో బాధపడుతూ ఢిల్లీలో నివేదిక పనిలో ఉన్న జయశంకర్‌కు 'ఎందుకు సార్ ఈ సమయంలో ఈ పరిస్థితిలో మీకింత కష్టం' అని నేను మెసేజ్ పెట్టిన. ఎవరు మెసేజ్ పెట్టినా వెంటనే జవాబివ్వటం ఆయన పద్ధతి. నాకు సార్ ఫోన్ నించి ఈ విధంగా మెసేజ్ వచ్చింది Thanks for the fine sentiments. In all modesty I would like to say that at this stage in my life, I am living only for Telangana and if I loose my life for the sake of Telangana, it would be my good fortune.

సార్ స్వప్నం సాకారమైంది. ఆయన లేకున్నా ఆయన ఆశయాలు దీపాల్లా వెలుగుతున్నాయ్. రేపు తెలంగాణ పొలాలకు పారే నీటి గలగలలో ఆయన చిరునవ్వులే వినపడతాయి. ఆత్మగౌరవంతో బ్రతికే ప్రతి పౌరుని కళ్ళలో కనిపించే సంతృప్తిలో ఆయన ఆనవాళ్ళే మెరుస్తాయి. ఆయన స్మృతుల్ని అజరామరం చేసేందుకు ఆయన చరిత్రను భవిష్యత్ తరాలను పాఠాలుగా భోదించేందుకు ప్రజలకు తమ కష్టాలకు సంబంధించిన అనుభవాలు మాత్రమే ఉంటాయి. వాటి మూలాలను వివరించడం విద్యావంతుల పని అని చెప్పి ఆయన అందించిన కార్యాచరణను మునుముందుకు కొనసాగించడమే మన ముందున్న కర్తవ్యం.

# 58 జొన్నవాడ రాఘవమ్మ

**– డా॥ భీంపల్లి శ్రీకాంత్**

పాలమూరు జిల్లా గేయ కవయిత్రిగా, రచయిత్రిగా జొన్నవాడ రాఘవమ్మ సుప్రసిద్ధురాలు. రాధికా గీతాల సృష్టికర్తగా జొన్నవాడ రాఘవమ్మ లబ్ధ ప్రతిష్టురాలు. నాలుగు దశాబ్దాలకు పైగా సాహితీ సృజన చేసిన రాఘవమ్మ గీతాలు ఆకాశవాణిలో వరుసగా ప్రసారమై ఆబాలగోపాలాన్ని అలరించాయి. అప్పట్లో రాఘవమ్మ గేయాల కోసం శ్రోతలు అమితాసక్తిగా ఎదురుచూశారంటే ఆమె గేయమార్దవం ఎలాంటిదో చెప్పవచ్చు. ఆమె బతికున్నపుడు తన ఇంటికి ఎవరు వచ్చినా తన గేయాలను వినిపించడమనేది ఆమెకున్న సాహిత్యాభిలాషను తెలియజేస్తుంది.

జొన్నవాడ రాఘవమ్మ పాలమూరు జిల్లా నవాబుపేట మండలం కేశవరావు పల్లెలో అక్టోబర్ 14, 1928న శ్రీ జినకుంట శ్రీనివాసాచార్యులు, శ్రీమతి రాగమ్మ పుణ్యదంపతులకు జన్మించారు. చిన్ననాటనే తన తండ్రి, పినతండ్రి దగ్గర భాగవతం, రామాయణం, భారతం మొదలైన పురాణాలను పారాయణం చేసేవారు.

అప్పటి నుండి రాఘవమ్మకు దైవభక్తి ఎక్కువ కావడంతో భాగవత ప్రవచనాలను జీర్ణించుకొని శ్రీకృష్ణుడిపై భక్తిగేయాలకు శ్రీకారం చుట్టారు. తాను జీర్ణించుకొన్న విషయాలను భక్తి పారవశ్యంతో మధురగీతాలను రచించారు. బహుగ్రంథ పఠనం వల్ల నిరంతరం అభ్యాసంవల్ల రాఘవమ్మ ప్రతిభ మొగ్గ తొడిగింది. ప్రతిభ పరిమళించింది. జన్మతః సిద్ధించిన జానపదాది లలిత గీతికా రచనలతో తన గేయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. అలా లలితగేయాలను రచించి ఆబాలగోపాలాన్ని అలరించారు. ఆధ్యాత్మిక జీవన చింతనతో భగవద్గీత మకరందాన్ని పంచారు.

జొన్నవాడ రాఘవమ్మ రచించిన గేయాలెన్నో ఆకాశవాణి శ్రోతలను రసావర్ణవంలో ఓలలాడించాయి. మృదుమధురమైన కర్ణపేయంగా రచించిన రాధికాగీతాలు మకరందం వలె ఆస్వాదింపజేశాయి. రాఘవమ్మ రాసిన గేయాల్లో దేశభక్తి, మాతృభక్తి, మాతృభాష, పండుగలు, పల్లెరైతులు, దైవభక్తి, దేవతలు మొదలైనవి ప్రసిద్ధాలు. సరళమైన భాషలో, చెవులకు ఇంపుగా అలతిఅలతి పదాలతో రాసిన గేయాలు అందరినీ అలవోకగా చదివిస్తాయి, హాయిగా పాడిస్తాయి, మనసును పులకింపజేస్తాయి.

జొన్నవాడ రాఘవమ్మ రాసిన రాధికా గీతాలు 1972లో, 2006లో ముద్రితం కాగా ఆమె రచనలన్నింటిని కలిపి 2014లో 'భావ తరంగాలు'గా వెలువరించారు. మొదటి రాధికాగీతాలులో మొత్తం 48 గేయాలుండగా, రెండవసారి ముద్రించిన రాధికాగీతాలులో 131 గేయాలున్నాయి. భావతరంగాలులో 105 గేయాలు 4 రూపకాలున్నాయి.

రాఘవమ్మ భక్తి గేయాలతోపాటు దేశభక్తి, జానపద గేయాలను, భజన కీర్తనలను, రూపకాలును గేయనాటికలను

రచించారు. జిల్లాలో జరిగిన పలు కవి సమ్మేళనాలలో తన గేయాలను వినిపించి శభాష్ అనిపించుకున్నారు. రాఘవమ్మ రాసిన ప్రతి గేయంలో మధురమైన పదాల కూర్పుతో ఉదాత్త భావనలుంటాయి. మృదుమధురంగా శ్రోతలను ఆకట్టుకుంటాయి. భక్తి పారవశ్యంతో రాసిన గేయాలు కోమలంగా ఉండి శ్రోతల్ని అలరింపజేస్తాయి. రాఘవమ్మకు కృష్ణుడంటే అభిమానం. అందుకే కృష్ణుడిపై అనేక గీతాలను రచించారు. ఈ కృష్ణుడి గీతాలను రాఘవమ్మ హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రంలో దాదాపు పదేళ్ళపాటు పాడించి అందరి అభిమానాన్ని చూరగొన్నది. ముద్దుకృష్ణునిపై మురిపించు భక్తిగీతాలను రచించి కృష్ణుని భక్తితత్వాన్ని తన గేయంలో ప్రచారం చేసింది.

జొన్నవాడ రాఘవమ్మ గురించి చెప్పాలంటే ...
ఆమె కవిత్వం కోమలం
ఆమె గాత్రం సమధురం
ఆమె జీవితం నిరాడంబరం
ఆమె పలుకు ఆబాలగోపాలం
లలితా సంగీత రచనలో మేటి
రాధికా గేయాల ఘనాపాటి
మృదుమధుర కవితాసుధలను
కురిపించే శ్రీకృష్ణపద సుధానిధి
కర్ణపేయ కవితా రచనలను
సృజించిన విశిష్ట 'విదుషీమణి'
ఆకాశవాణి శ్రోతలను అలరించిన
భక్తిగీతాల 'సుగుణామణి'
అత్యద్భుత రసావిష్కరణ చేసిన
సుమధురగీతాల చింతామణి
దేశభక్తి, దైవభక్తి మెండు
ఆమె భారతీయతకు దర్పణం
జానపదం, సాంఘీకం
ఆమె కవితా ప్రతిభకు నిదర్శనం
ఆమె కవిత్వం సహజ పాండిత్యం
ఆమె గానం సుమధుర కావ్యం
ఆమె తత్వం ప్రేమమయం
ఆమె సౌజన్యం వినయశీలం
ఆమె సుగుణానికి మకరందం
ఆమె వినయానికి భూషణం
పాలమూరు పరిమళించిన
లలిత గీతాల శిరోమణి
భావతరంగాలను మీటిన
సహజ పాండితీ శిఖామణి

జొన్నవాడ రాఘవమ్మ నిరాడంబర జీవితాన్ని గడిపిన భక్త శిఖామణి.

రాఘవమ్మ ఆకాశవాణిలో రాసిన లలిత గేయాలు భక్తిరంజని, ఈ మాసపు పాట, ఈ పాటను నేర్చుకుందాం, మహిళా కార్యక్రమంలో విరివిగా వచ్చి బహుళ ప్రజాదరణ పొందాయి.

ఈ గేయాలే కాక తుమ్మెద గోపికలు, తులసీమహాత్యం, శ్రీవనదుర్గ, గోపికల గేయాలు వంటి గేయరూపకాలు కూడా ఆకాశవాణిలో ప్రసారమయ్యాయి. ఇందులో అత్యధికంగా శ్రీ నవదుర్గ గేయరూపకం ప్రసారమై ఆబాలగోపాలాన్ని అలరించింది.

జొన్నవాడ రాఘవమ్మకు విశేష కీర్తి నార్జించిన గేయాలు రాధికా గీతాలు. ఇందులోని ప్రతి గేయాన్ని రాఘవమ్మ అనుభూతి చెందుతూ రచించారు.

ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో ఇవి దాదాపు పదేళ్ళపాటు పాడించి అందరినీ ఆకట్టుకున్నారు.

'పిల్లనగోవి మెల్లన ఊదీ పుల్లము దోచిన దెవరో
నా పూలను దోచిన దెవరో
కనివిని ఎరుగని కమ్మని పిలుపుతో,
రమ్మని పిలిచినదెవరో
నను రమ్మని పిలిచినదెవరో,
అనురాగము చిలికిన దెవరో'

అంటూ ఆ నందగోపాలుడిని, మనసుదోచిన మురళీ ధరుడిని ఆత్మీయంగా ఆనందానుభూతితో స్మరిస్తుంది. అంతేకాదు అలసిపోయిన శ్రీకృష్ణుడిని సేదతీరమంటూ చెబుతూ ...

నాలోన నిమిషము నిదురించర స్వామి
ఆలమందల తోలి అలసి పోయితివేమో
చిగురుటాకుల బోలు చిన్ని నీ పాదాలు
కరుకు నేలను తగిలి కందితే కనలేను

అంటుంది. కృష్ణుడంటే రాఘవమ్మకు అమితమైన ప్రేమ. శ్రీకృష్ణుడి బాల్యలీలను కళ్ళకు కట్టినట్లుగా రాసిన అనేక గేయాలు ప్రతి హృదయాలను ఆనందపరవశుల్ని చేస్తుందనడంలో అతిశయము లేదు. కనిపించకుండా పోయిన శ్రీకృష్ణుడి కోసం నిరీక్షిస్తూ రాసిన గేయం ప్రేమ విరహాన్ని తెలియజేస్తుంది.

తలుపులు తెరచితీరాస్వామి నీకై
నా వలపుల తలుపులు తెరచితీరా స్వామి
రమ్మని పిలిచి యమునా తటికి
కెమ్మవి సుధలిమ్మని పలికి
పొన్నల మాటన దాగెదవేల
వేగరాగ గోపాల బాల

అంటూ శ్రీకృష్ణుడిని రమ్మని పిలుస్తోంది. వేగంగా రమ్మని తలుస్తోంది. మరో గేయంలో కూడా రాఘవమ్మ శ్రీకృష్ణుడి రాకకై ఎదురుచూస్తూ ....

కనుపించెనా మురళి వినిపించెనా
కమనీయమైన ఓ మల్లె మాలికలారా
కంజాతములబోలు కనదోయి కలవాడు
మంజుమంజులమైన మందహాసమువాడు
సంజ వెలుగుల చాయ మందహాసమువాడు

అంటుంది. శ్రీకృష్ణుడు ఎలా ఉంటాడో వర్ణిస్తూ చెలికత్తెలకు చెబుతుంది. ఆ రూపు కలవాడిని పిలుచుకు రండ్రని పురమాయిస్తోంది. శ్రీకృష్ణుడంటే అంత అభిమానం గల రాఘవమ్మ తనే ఒక ప్రియురాలై ప్రియుడికోసం వేచి చూస్తున్నట్లు రాసిన గేయాలు అమలిన శృంగారానికి పరాకాష్టగా ఉన్నాయనడంలో అత్యుక్తి కాదు. శ్రీకృష్ణుడిపై రాసిన ప్రతి గేయం వేటికవే భిన్నంగా ఉండి చదివించేలా చేయడము రాఘవమ్మ రచనా కౌశలానికి నిదర్శనం.

రాఘవమ్మ శ్రీకృష్ణుడిపై రాసిన గేయాలే గాక వివిధ అంశాలపై రాసిన గేయాలు కూడా ప్రాచుర్యం పొందాయి. శ్రీరాముడు, శ్రీవేంకటేశ్వరుడు, శ్రీహరి, పాండురంగడు, ఈశ్వరుడు, పార్వతీదేవి, వరలక్ష్మీదేవి, అలవేలుమంగ వంటి దేవతామూర్తులపైన భక్తి గేయాలను రచించి శ్రోతలు ఆకట్టుకుంది. శ్రీరాముని గురించి వర్ణిస్తూ ...

'రామనామ మధురరసం రమ్యమైన తారకం
వేగవాని చరణసేవ పదవి దొరికె పావనం
దధి నవనీతములకన్న మధురమైన నామం
ధరణి నేలు రమనామ పదవి దొరికె పావనం
కదళీ ద్రాక్ష మధువు కన్న మధురమైన నామం
కొదవ లేదు క్షీరపురీ దాస హృది నివాసం'

అని చెప్పిన గేయం తారకరాముని నామనామాన్ని వేనోళ్ళ కీర్తిస్తుంది.

తన అంతరంగాన్ని ఆవిష్కరిస్తూ చెప్పిన గేయం అందరినీ ఆలోచింపజేస్తుంది.

'పదుగురు నను పొగడాలని
పాటలెపుడు పాడలేను
విధి కెదురుగ నడవాలని
హృదయమెపుడు కోరలేదు'

అంటూ పదిమంది కోసం గేయాలను రాయలేదనీ, తనలోని జిజ్ఞాసను బయట పెట్టుకోవడానికే రాసాననీ వినమ్రంగా చెబుతుంది రాఘవమ్మ.

రాఘవమ్మ రచించిన మూడవ గేయాల సంపుటి 'భావ తరంగాలు'. ఇందులో 115 గేయాలు, 4 గేయరూపకాలు ప్రజాదరణ పొందినవే. ఈ భావతరంగాలు లోని గేయాలు కూడా ఆకాశవాణిలో ప్రసారమై బహుళ ఆదరణ పొందాయి. ఇందులో భక్తి పారవశ్య గీతాలే కాదు సామాజిక స్పృహ కలిగిన గేయాలను రాఘవమ్మ అద్భుతంగా రచించి అన్నీ రాయగలనన్న రచయిత్రిననిపించుకున్నది. వైవిధ్య భరితమైన అంశాలను తీసుకొని రాసిన గేయాలు రాఘవమ్మ ప్రతిభకు నిదర్శనాలుగా నిలుస్తాయి. ఎంతోమంది స్వరకర్తలు రాఘవమ్మ గేయాలకు కూర్చిన బాణీలు పేరొందిన గాయని గాయకుల గళాలలో గుభాళించాయి.

రాఘవమ్మ రాసిన దేశభక్తి గేయాలు భారతీయ సంస్కృతిని చాటి చెబుతాయి. కార్మిక, కర్షక గేయాలు, పండుగల గేయాలు, సామాజిక గేయాలు, కుటుంబ గేయాలు అందరినీ ఆకట్టుకుంటాయి. దేశ సౌభాగ్యం, తెలుగు తల్లి, తెలుగు కీర్తి, నడవరా ఓ భారతీయుడా, నవభారతవీరుడా వంటి దేశభక్తి గేయాలు, రైతన్నలు, కర్షకుడు, కార్మికులు వంటి కార్మిక గేయాలు, సంక్రాంతి శ్రీలక్ష్మి, ఉగాది,

జన్మాష్టమి వంటి పండుగ గేయాలు, చాచానెహ్రూ, బాపూజి, బుద్ధుడు వంటి మహాత్ముల గేయాలు, మూఢాచారం, బీదపూజ, ఓటుహక్కు, ఇద్దరు వంటి సామాజిక గేయాలు రాయడం రాఘవమ్మ బహుముఖ ప్రజ్ఞాశీలతకు నిదర్శనం.

పండుగలోని ఆంతర్యాలను, భారతీయ సంస్కృతి మూలాలను, జాతిని మేల్కొలుపుతూ రాసిన గేయాలు ఆమెకు దేశం పట్ల ఉన్న భక్తి తత్పరతను తెలియ జేస్తున్నాయి.

విశ్వశ్రేయస్సుకై అవతరించిన భగవద్గీతను చిన్నగేయంలో ఇమిడ్చి గీతాసారాన్ని సరళ పదాలతో రాసిన గేయం రాఘవమ్మ ప్రతిభకు తార్కాణంగా నిలుస్తుంది.

రాఘవమ్మ ప్రకృతి గేయాలు కూడా చాలా రాసింది. ఉదాహరణకు ...

ఎవరు పెంచిన కల్పతరులివి
ఎవరు తీర్చిన సోయగములివి
ఎచట చూచిన ఊహకందని
అందమే కనువిందు చేసెను

అంటూ ప్రకృతి సౌందర్యాన్ని ఎంతో వైవిధ్య భరితంగా రసాప్లవితం చేసింది. ప్రకృతిని బహుసుందరంగా వర్ణించింది. ఈ గేయం 'లలిత సంగీతం – డిప్లొమోకోర్సు' పాఠ్యప్రణాళికలో 'ప్రకృతి గీతాలు' శీర్షికలో చేర్చబడటం దీనికున్న వైశిష్ట్యాన్ని తెలియజేస్తుంది. ఇంకా 'పండుగల పాటలు' శీర్షికలో సంక్రాంతి శ్రీలక్ష్మీ వచ్చిందోయ్ సస్యముల సంపదలు తెచ్చిందోయ్ అనే గేయం కూడా చేర్చబడింది. రాఘవమ్మ రాసిన 'ఆడపడుచు' గేయం నిజంగా అందరిని ఆలోచింపచేసే గేయం.

'నిప్పువంటి సీతమ్మకు – నిందయున్నదొక్క యుగం
నిండుసభలో ఒక్కసతిని – పరాభవించె ద్వాపరం
వరకట్నపు దురాచార – దురంతాలు చెలరేగెను కలియుగం
ఆనాటికి ఈనాటికి మారలేదు స్వార్థం
ఆడవారి గుండెలలో రగిలే ఈ అవమానం
ఈనాటిది కాదమ్మ ఆడబ్రతుకు జీవితం
యుగయుగాల శాపమిది – ఆరని అవమానం'

అంటూ సమాజంలోని వరకట్న దురాచారమనే రుగ్మత ఎలా బలంతా ప్రబలిపోయిందో కళ్ళకు కట్టినట్లు రాఘవమ్మ రచించడం సాంఘీక దురాచారాన్ని తేటతెల్లం చేసింది.

రాఘవమ్మ తాను సామాన్యురాలిగా భావించుకుంటూ రాసిన గేయం 'నిరాడంబరం'. ప్రశంసలకు, పొగడ్తలకు, సన్మానాలకు దూరంగా ఉండే రాఘవమ్మ రాసిన గేయమిది.

కవిగాను సాహిత్య గనిగాను నేను
కారుచీకటిలోన దారిగానగలేక
అలమటించే ఒక్క బాటసారిని నేను
నా కవితకే భాష నియమాలు లేవు
నా లోన చెలరేగే ఆవేదనే తప్ప

అంటూ కవిని గాను అంటూనే తనలోని ఆవేదనలకు అక్షర రూపం ఇస్తూ రాసిన గేయం రాఘవమ్మ పాండిత్యానికి, సౌశీల్యానికి, ఆమె జీవితానికి దర్పణమని చెప్పవచ్చు.

కవిత గురించి చెబుతూ ...

'కదలి వలె పొంగింది జలజలా పారింది
వెలలేని నా కవిత నాలోన వొదిగింది'

అంటూ కవితా స్వరూపాన్ని గేయాత్మకంగా రచించింది. రాఘవమ్మ రాసిన ప్రతి గేయాన్ని స్పర్శించడ మంటే చంద్రున్ని అద్దంలో చూపడమే అవుతుంది. రాఘవమ్మ కలానికి ఉన్న గొప్ప శక్తి గేయాలను సరళమైన పదాలలో రాయడం.

శ్రీకృష్ణుడికి తన జీవితాన్ని అంకితమిచ్చి, ఆయననే తన సర్వస్వంగా భావించి తనను రాధగా చేసుకొని తన జీవితాన్ని సార్థకం చేసుకున్న భక్తశిఖామణి జొన్నవాడ రాఘవమ్మ. భగవంతునిపై ఉన్న అచంచలమైన భక్తితో తన అంతరాత్మలోని అక్షరాలను శ్రీకృష్ణుడికి నైవేద్యంగా అభిషేకించిన తీరు రాఘవమ్మ భక్తి ప్రపత్తులకు నిదర్శనం.

రాఘవమ్మ కేవలం భక్తురాలే కాదు, నాయకత్వ శిరోమణి కూడా. 1969లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో ప్రముఖ మహిళా నాయకురాళ్ళతో 15 రోజుల పాటు జైలు జీవితాన్ని అనుభవించారు.

జొన్నవాడ రాఘవమ్మ సాహితీ సృజనకు హైద్రాబాద్ శ్రీ జ్ఞాన సరస్వతీ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమి వారు శ్రీకృష్ణ పదసుధానిధి అనే బిరుదుతో సన్మానించడం విశేషం. ఇంకా అనేక సంస్థలు సన్మానించాయి. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 2014లో పాలమూరు

జిల్లా స్థాయి సాహిత్య పురస్కారాన్ని అందుకున్నది. ఇంకా పాలమూరు సాహితి ఉగాది పురస్కారం, విశాలాంధ్ర స్వర్ణోత్సవ పురస్కారం, తదితర పురస్కారాలను అందుకున్నది.

అంతేకాదు రాఘవమ్మ గేయ కవితా వైశిష్ట్యాన్ని గుర్తించి తెలుగు విశ్వవిద్యాలయం వారు ఎం.ఎ. సంగీతంలో పలు లలిత గీతాలను చేర్చడం రాఘవమ్మ పాండితీ వైభవాన్ని చాటి చెబుతున్నది.

జొన్నవాడ రాఘవమ్మ యావత్ తెలుగు ప్రజల మన్నన పొందిన విదుషీమణి. బోయి భీమన్న, సి. నారాయణరెడ్డి, పాలగుమ్మ విశ్వనాథం, చౌదూరి గోపాలరావు, ముకురాల రామారెడ్డి, వెంకటగోపాలం, శశాంక, యం. చిత్తరంజన్ వంటి ప్రముఖులు మెచ్చుకున్న సౌజన్యమూర్తి. లలిత గీతాలు మనకు అనగా ఆకాశవాణి గుర్తుకొస్తుంది. జొన్నవాడ రాఘవమ్మ అనగానే లలిత గీతాలు గుర్తుకొస్తాయి.

# 59 జుల్ఫీకరుద్దీన్

– పి.వి. రామమోహన్ నాయుడు

పంతొమ్మిదో శతాబ్దపు తొలి రోజుల్లో బ్రిటిష్ సైనికుల ద్వార హైదరాబాద్‌లోకి ఫుట్‌బాల్ ప్రవేశించింది. 1930 ప్రాంతంలో తార్బండ్ నవాబ్ ప్రోత్సాహంతో నగరంలో ఫుట్‌బాల్ క్రీడ వేళ్ళూనుకోవడం ఆరంభమయ్యింది. నవాబుకు తోడుగా కాకినాడ, రాజమండ్రి మహారాజులు కూడా ముందుకు వచ్చి పోషకులుగా నిలవడంతో ఫుట్‌బాల్ క్రీడ హైదరాబాద్‌లో పటిష్టపడటం ప్రారంభమయ్యింది.

18 మంది ఒలింపిక్ స్థాయి ఫుట్‌బాల్ క్రీడాకారులను అందించిన అప్పటి కోచ్ ఎస్.ఏ. రహీం హైదరాబాద్ జట్టు ప్రాభవానికి కర్త, కర్మ, క్రియ.

వృత్తిరీత్యా ఉపాధ్యాయుడైన రహీం, ఏ మూల మంచి ఆటగాడు ఉన్నాడని తెలిసినా వెదుక్కొంటూ వెళ్లి తెచ్చి ప్రోత్సహించిన క్రీడా స్ఫూర్తే ఆయన.

1951 భారత్‌లో జరిగిన ఆసియా క్రీడల్లో 1962లో జకార్తా ఆసియా క్రీడల్లో బంగారు పథకాలు సాధించే జట్టుగా భారత్ ను రహీం సాబ్ రూపొందించారు. రహీంసాబ్ హయాంలో హైదరాబాద్ యువకులు ఫుట్‌బాల్ అంటే విపరీతమైన అభిమానం చూపేవారు.

ఆ రోజుల్లో విక్టరీ మైదానమే హైదరాబాద్ ఫుట్‌బాల్‌కు ముఖ్య కార్యస్థానం. 1950 నుంచి 1965 వరకు హైదరాబాద్‌లో ఫుట్‌బాల్ క్రీడకు స్వర్ణయుగం అని చెప్పవచ్చు.

1952 హెల్సింకీ ఒలింపిక్స్‌లో సయ్యద్ ఖ్వాజ, అజీజుద్దీన్. నూర్ మహమ్మద్, ఎస్.కె. మొయినుద్దీన్ పాల్గొన్నారు. 1956లో మెల్బోర్న్‌లో జరిగిన ఒలింపిక్స్‌లో ఏకంగా 8 మంది హైదరాబాదీ ఆటగాళ్ళు పాల్గొనగా, 1960లో ఇటలి రాజధాని రోమ్‌లో జరిగిన ఒలింపిక్స్‌లో ఆరుగురు మన రాష్ట్ర ఆటగాళ్ళు పాల్గొన్నారు.

"ఫుట్ బాల్ ఒలింపిక్స్‌లో మూడు వరుస గోల్స్‌తో హ్యాట్రిక్ సాధించిన భారత క్రీడాకారుని పేరేమిటి" ఆ మధ్య కౌన్ బనేగా కరోర్ పతి అనే టి.వి కార్యక్రమంలో అమితాబ్ బచ్చన్ గంభీర స్వరం విసిరిన ప్రశ్న. హైదరాబాద్‌లోని మధ్య తరగతి నివసించే కాలనీలో ఆ కార్యక్రమం చూస్తున్న యువకులు తమతో ఫుట్ బాల్ కబుర్లు చెప్పే వృద్ధుడి కేసి జవాబు కోసం చూశారు. ఆయన తడుముకోకుండా సమాధానం చెప్పాడు. అది సరైన సమాధానం. ఆ పెద్దాయన జ్ఞాపకశక్తికి యువకులు అచ్చెరువు పొందారు.

అయితే హాట్రిక్ కోసం వ్యూహ రచన చేసిందీ, మూడుసార్లు బంతిని గోల్‌లోకి తన్నిన నోయెల్‌కు బంతిని పాస్‌గా ఇచ్చింది ఇప్పుడు తమకు సమాధానం చెప్పిన జుల్ఫీకరుద్దీన్ అనే కొస మెరుపు ఆ యువకుల తోపాటు చాలమందికి తెలియదు.

ఒకనాటి హైదరాబాద్, భారత దేశ ఫుట్ బాల్ ఘన చరిత్రకు మనిస్తంభం వంటి ఉద్దండుడు జుల్ఫీకరుద్దీన్. నగర

గల్లీల నుంచి ఒలింపిక్ మైదానం వరకు మన క్రీడా పతాకం పట్టుకొని పరుగులు తీసిన అజేయుడు. ఆంధ్ర ప్రదేశ్ పోలీస్ జట్టుకు మన రాష్ట్ర జట్టుకు పదేళ్ళపాటు విజయవంతంగా నాయకత్వం వహించిన దిగ్గజం జుల్ఫీకర్.

హైదరాబాద్, మెహదీపట్నం సమీపంలోని మరద్ నగర్‌లో 1936, ఫిబ్రవరి 7వ తేదీన జుల్ఫీకర్ జన్మించారు. తండ్రి ఇమాముద్దీన్ రెవెన్యు శాఖలో సెక్షన్ ఆఫీసర్‌గా పని చేసేవారు. ఆరుగురు అన్నదమ్ములు, ఇద్దరు అక్కచెల్లెళ్ళతో వారిది పెద్ద కుటుంబం. క్రికెట్, సినిమా వ్యామోహాలు ఇంకా నగరానికి ప్రబలని ఆ రోజుల్లో ఫుట్‌బాల్ క్రీడంటే హైదరాబాద్ యువకులకు వల్లమానిన ప్రేమ, అభిమానం. చిన్నా పెద్ద మైదానాలన్ని ఫుట్‌బాల్ మ్యాచ్‌లతో, ప్రాక్టీసులతో కళకళ లాడుతుండేవి. చుట్టూ వున్న వాతావరణంవల్ల జుల్ఫీకర్ కూడా అప్రయత్నంగానే ఆ క్రీడపట్ల ఆకర్షితులయ్యారు.

ఇంటి చుట్టూ పక్కల స్నేహితులతో కలసి దొరికిన టెన్నిస్ బంతినో, రబ్బర్ బాల్‌నో తన్నుతూ పరవశించిపోయేవాడు. దినా రాత్రులు ఫుట్‌బాల్ అభ్యసించే వాడు. అసలు ఫుట్‌బాల్‌ను కొనడానికి మిత్రులెవ్వరి వద్ద డబ్బులు ఉండేవి కావు. అందుకని పాత గుడ్డ పీలికల మధ్య బరువైన వస్తువులు పెట్టి గుండ్రంగా బంతిలా నాయనమ్మ చేత కుట్టించుకొని పట్టుకెళ్ళి వీధుల్లో తమ పిక్కబలం చూపేవారు.

ఫుట్‌బాల్ ఆడటం తండ్రికి ఇష్టం ఉండేది కాదు. అందుకే మొదట బంతిని గోడ అవతలకి తరలించి, ఆనక ఏదో పనిపైన వెళ్తున్నట్లు జుల్ఫీకర్ జారుకునేవాడు. అలా తండ్రి కళ్ళు కప్పి ఫుట్‌బాల్‌తో ప్రేమాయాణం సాగించాడు. కఠోరమైన సాధనతో అలవడ్డ అచంచలమైన ఆత్మవిశ్వాసం ఆయనను చక్కని ఆటగాడిగా తీర్చిదిద్దింది. క్లబ్ మ్యాచ్‌లలో అత్యుత్తమ ప్రతిభ చూపుతూ రోజు రోజుకు అగ్రశ్రేణి ఆటగాడిగా జుల్ఫీకర్ ఎదిగిపోయాడు. క్రీడాభిమానుల్లో జుల్ఫీకరుద్దీన్ పెద్ద పేరయ్యింది.

1954లో హైదరాబాద్ స్పోర్టింగ్ క్లబ్ తరపున అంబర్‌పేట్ సిటి పోలీసు జట్టుతో ఆడిన మ్యాచ్ జుల్ఫీకరుద్దీన్ క్రీడా జీవితాన్ని మలుపు తిప్పింది.

ఆ మ్యాచ్‌లో ఆయన కనబరచిన అద్భుతమైన ఆటతీరుకు ముగ్ధుడైన సి.పి.ఎల్ కమాండెంట్ జుల్ఫీకర్‌ను పోలీసు ఉద్యోగంలో చేరి తమ జట్టుకు ప్రాతినిధ్యం వహించమని కోరారు. ఎంప్లాయ్మెంట్ కార్డ్ కూడా లేని జుల్ఫీకర్‌కు అన్నీ సమకూర్చి పోలీసు కానిస్టేబుల్‌గా నియమించారు. అప్పటి నుంచి సి.పి.ఎల్ జట్టుకు, ఆంధ్ర ప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించడం మొదలు పెట్టారు. 1956లో జాతీయ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్ "సంతోష్ ట్రోఫి" ఫైనల్స్‌లో రెండు అద్భుతమైన గోల్స్ సాధించి హీరోగా వార్తల్లోకి ఎక్కారు. అదే ఏడాది మెల్బోర్న్ ఆస్ట్రేలియా ఒలింపిక్స్‌లో అతి పిన్న వయస్కుడైన ఆటగాడిగా భారత జట్టు తరపున ప్రాతినిధ్యం వహించారు.

విదేశీ మైదానంలో విభిన్నమైన వాతావరణంలో ఆడి రాణించడం సామాన్యమైన విషయంకాదు. సెమి ఫైనల్స్‌లో యుగస్లేవియా చేతిలో పరాజయంపాలై నాలుగో స్థానంలో నిలబడ్డారు. తొలుత ఒక్క గోల్ ఆధిక్యంలో ఉన్నప్పటికీ చివరికి వచ్చేసరికి మనజట్టు పట్టు సడలించేసింది. 1958లో టోక్యో ఆసియా క్రీడల్లోనూ, 1959లో కౌలాలంపూర్లో జరిగిన మెర్డిక టోర్నమెంట్‌లోను భారత కీర్తి ప్రతిష్టల కోసం జుల్ఫీకరుద్దీన్ శ్రమించారు. 1956 మెల్బోర్న్‌లో జరిగిన ఒలింపిక్స్‌లో జుల్ఫీకరుద్దీన్ తన ప్రతిభ చాటారు.

మన దేశంలో జరిగే పెంటాగ్యులర్ ట్రోఫీ, సంతోష్ ట్రోఫీ, రోవర్స్, ఐ.ఎఫ్.ఎ.డి.సి.ఎం వంటి అన్ని టోర్నమెంటు ల్లోనూ జుల్ఫీకర్ తన గోల్స్‌తో, తానందించిన అద్భుతమైన సమయోచిత పాస్‌లతో రాష్ట్ర జట్టును గెలిపించారు.

జుల్ఫీకరుద్దీన్ క్రీడా జీవితంలో అద్భుతమైన ఎన్నో సంఘటనలు తళుక్కుమంటాయి. 1956లో బొంబాయి రోవర్స్ ట్రోఫీ ఫైనల్స్‌లో అతి శక్తివంతమైన మహమ్మడన్ క్లబ్‌తో మన జట్టు తలపడింది. ఆంధ్రప్రదేశ్‌కు ఓటమి ఖాయమని అంతా అంచనాలు కట్టారు. రెండు బలమైన జట్లు తలపడుతుండటంతో బొంబాయిలోని గ్రౌండ్ జనంతో కిటకిటలాడింది.

ఆట మొదలైన రెండో నిముషంలో దాదాపు మధ్య కోర్ట్ నుంచి బంతిని లాఘవంగా తన్ని అద్భుతమైన గోల్ చేశారు. కనీ వినీ ఎరుగని పరిణామానికి ప్రేక్షకులంతా

నిశ్చేష్టులయ్యారు. మైదానం మౌన ముద్ర దాల్చింది. బంతి ఎక్కడో దూరాన ఉంది లెమ్మని గోల్ కీపర్ గోల్ పోస్ట్ నుంచి బాగా ఇవతలికి వచ్చి నిర్లక్ష్యంగా నిలుచున్న వైనాన్ని పసిగట్టిన జుల్ఫీకర్ కేవలం సెకన్లలో నిర్ణయం తీసుకొని నేరుగా గోల్‌లోకి బంతిని తన్నారు. దీంతో గుండె బలం చెదరిన ప్రత్యర్థి జట్టు మహమ్మడన్ క్లబ్ 3-0 తేడాతో ఓడిపోయింది.

కెప్టెన్‌గా జుల్ఫీకర్ అసాధ్యుడు. వ్యూహ రచనలోను, జట్టును సమిష్టిగా నడపడంలో ఆయన పెట్టింది పేరు. క్రమ శిక్షణకు ఆయన మారుపేరు. మొయిన్, యూసుఫ్, నూర్, అజీజ్ వంటి మేటి క్రీడాకారులున్న జట్టుకు ఆయన కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వర్తించి ఎన్నో విజయాలు సునాయాసంగా దక్కించుకున్నారు. జట్టు సభ్యులను పేకాట, మద్యం వంటి వ్యసనాలకు దూరంగా ఉంచేవారు.

విదేశీ పర్యటనల్లో, అధికార విందుల్లోసైతం ఈ విషయంలో మినహాయింపు ఇచ్చేవారు కాదు. జుల్ఫీకర్ ఇస్లాం సంప్రదాయాలను ఆచరిస్తారు. కాలికట్‌లో టోర్నమెంట్ ఆడుతుండగా రంజాన్ మాసం వచ్చింది. జుల్ఫీకర్‌తోపాటు యూసుఫ్, ఖలీం కూడా ఉపవాస దీక్ష పాటిస్తూనే మ్యాచ్ ఆడారు.

ఆ ఉదయాన వ్యాయామం చేయడం వెంటనే మ్యాచ్ ఆడటంవల్ల తీవ్ర అలసటకు గురయ్యారు. ఇది గమనించిన కోచ్ పెంటయ్య దీక్ష రోజుల్లో ముస్లిం క్రీడాకారులకు వ్యాయామం నుంచి మినహాయింపు ఇవ్వబోయాడు అయితే జుల్ఫీకర్ అందుకు అంగీకరించలేదు. ఈ చర్యవల్ల జట్టులో ఏకత్వానికి విఘాతం కలుగుతుంది కాబట్టి అందరు ఒకే పద్ధతులు పాటించాలని అభిప్రాయపడ్డారు. ఉపవాస దీక్ష పాటిస్తూనే, వ్యాయామంకు హాజరయ్యేవారు. అలాగే మ్యాచ్‌లు ఆడేవారు.

దక్షిణ భారత ఫుట్ బాల్ జట్టుకు నాయకత్వం వహిస్తూ రష్యా, హంగేరి, డెన్మార్క్, జర్మని, ఇతర యురేపియన్ జట్లతో తలపడ్డారు. పెంటాగ్యులర్ ఫుట్ బాల్ టోర్నమెంట్‌లో కెప్టెన్గా, కోచ్‌గా మద్రాస్, హైదరాబాద్, కేరళ, బెంగళూరు, శ్రీలంకలలో జరిగిన అన్ని ఫైనల్స్‌లో గెలుపొంది 1963లో ఎఫ్.ఐ.ఎఫ్.ఏ. అధ్యక్షుడు సర్ స్టాన్లీ రోజ్ చేతులపై ట్రోఫీ అందుకున్నారు. అవకాశాలు వెతుక్కుంటూ జుల్ఫీకర్ స్నేహితులు వివిధ ప్రాంతాలకు వెళ్ళారు. కొందరు పాకిస్తాన్ కూడా వెళ్ళారు. కానీ ఆదే రోజుల్లో దేశంలోని అన్ని ప్రధాన జట్ల నుంచి ఆయనకు ఆహ్వానం ఉన్నప్పటికీ తన పంచ ప్రాణాలైన హైదరాబాద్‌ను వదిలి వెళ్ళేది లేదనే వాడు. గెలిచినా ఓడినా ఈ గడ్డ పైనే అనేవారు. అదే మాటపై జుల్ఫీకర్ జీవితాంతం హైదరాబాద్ కోసమే నిలబడ్డారు. ఆ రోజుల్లో మ్యాచ్‌కి 50 రూపాయలు మాత్రమే తమకు ఇచ్చేవారని, అయితే తాము డబ్బు కోసం కాకుండా ఆట మీద మక్కువ, దేశం, రాష్ట్రంపట్ల భక్తితో మాత్రమే ఫుట్ బాల్ ఆడేవారమని జుల్ఫీకర్ చెబుతుండేవారు.

పోలీసు శాఖలో అంచలంచలుగా ఎదిగి 1963లో నల్లగొండలో రిటైర్ అయ్యారు. ఉద్యోగరీత్యా ఎక్కడ పని చేసినా ఆ ప్రాంతంలో క్రీడల అభివృద్ధికి ఇతోదికంగా పాటుపడ్డారు. కరీంనగర్‌లో పని చేస్తున్నప్పుడు పోలీసు క్రీడలు ఘనంగా నిర్వహించారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఉన్న ఫోర్ట్ వాల్ ఆయన హయాంలో నిర్మించిందే.

పోలీసు శాఖలో ఆయన చూపిన కర్తవ్య దీక్షను గుర్తిస్తూ ప్రభుత్వం సేవాపతకంతో గౌరవించింది.

హైదరాబాద్ క్రీడా ప్రాభవానికి వెలుగు రవ్వల సంతకంలా నిలబడ్డ జుల్ఫీకరుద్దీన్ కు జేజేలు.

## 60

# జువ్వాడి గౌతమరావు

– డా॥ గంద్ర లక్ష్మణరావు

కరీంనగర్ సమీపాన గల ఇరుకుల్ల గ్రామంలో ఇద్దరు మహానుభావులు జన్మించారు. ఒకరు మచ్చలేని రాజకీయ నాయకుడు. మరొకరు మధుర హృదయులు సాహితీ మూర్తి. ఎన్ని రాజకీయ పదవులు నిర్వహించినా తన బ్రతుకుదెరువు తనకే కష్టంగా కరీంనగర్‌లో కనీసం ఒక చిన్న ఇల్లు కూడా లేని నిరాడంబరత, నీతి నిజాయితీలకు మారుపేరుగా బ్రతికిన రాజర్షి జువ్వాడి చొక్కారావు. మరొకరు సాహితీవేత్తగా, సోషలిస్టు నాయకుడుగా యావదాంధ్రదేశం ఆత్మీయ మిత్రునిగా మహోన్నత వ్యక్తిగా బ్రతికిన బ్రహ్మర్షి జువ్వాడి గౌతమరావు.

జువ్వాడి వంశంలో చొక్కారావు (ఈయన ఎం.పి కాదు) – రాధమ్మ దంపతులకు ప్రథమ సంతానంగా ఫిబ్రవరి 1929లో గౌతమరావు జన్మించారు. గౌతమరావు గారి తరువాత రామేశ్వర్ రావు, రఘునాథరావు ఇద్దరు తమ్ముళ్ళు. చొక్కారావుగారి కుటుంబం సంస్కారవంతమైన కుటుంబం. ఆ రోజుల్లో సంస్కృతం తెలుగు చదివిన వారు గౌతమరావుగారి తండ్రిగారు చొక్కారావుగారు.

కుటుంబంలోని స్త్రీలు కూడా కొంత చదువుకున్నవారు. అప్పుడు కొంత చదువుకోవడమంటే పోతన్న భాగవతంలోని పద్యాలు, నరసింహ శతకం, సుమతీ శకతం, కృష్ణ శతకం వంటి వాటితో పాటుగా కొన్ని మంగళ హారతులు స్వయంగా పాడగలిగినంత చదువుకున్నారు. చొక్కారావు గారు పద్యాన్ని చాలా భావస్ఫోరకంగా చదివేవారని, మా తండ్రి గారే నాకు పద్యాన్ని ఎట్లా చదవాలో నేర్పించారని ఎన్నో సందర్భాల్లో గౌతమరావుగారు చెప్పుకున్నారు.

గౌతమరావుగారు ప్రాథమిక విద్య ఊరి బడిలో చదువుకున్నారు. కొంచె పెద్ద తరగతికి రాగానే కరీంనగర్‌లో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేర్పించారు. సంస్కృతంలో కూడా కొన్ని శబ్దాలు నేర్చుకున్నారు. ధాతువుల జోలికి పోకుండానే ఆ సంస్కృతం నేర్చుకోవడం ఆగిపోయిందని, అయినా వాల్మీకి మొదలు మరికొన్ని కావ్యాలు చదువుకుంటే అర్థమయిపోయేవని తరువాతి కాలంలో చెప్పుకున్నారు.

అప్పుడు దూపాటి రమణాచార్యులు తెలుగు అధ్యాపకులు. దూపాటి రమణాచార్యులు గారు చదువు తుండగా చూసిన ఒక పుస్తకం తాను కూడా చదవాలని ఒకరోజు ఆయన ఇంటిలోనుంచి ఆ పుస్తకం అడగకుండా చెప్పకుండా తెచ్చుకొన్నాడు. ఆ రోజు రాత్రంతా లాంతరు ముందు కూర్చొని చదివాడు. పుస్తకం అయిపోయేదాకా నిద్రపోలేదు. అది విశ్వనాథ సత్యనారాయణగారి నవల 'చెలియలికట్ట'. అప్పటి వరకు డిటెక్టివ్ నవలలు చదివే గౌతమరావుగారికి ఇది తొలి అనుభవం. పసి మనసు. గంభీరమైన విషయం. అందులోని వర్ణనలు, ఆయా పాత్రలు, ఆ సంఘటనలు ఆయనను ఎంతో ప్రభావితం చేశాయి.

అది మొదలు సాహిత్య పఠనం, సాగంత్యం నా జీవితంలో అంతర్భాంగం అయిపోయాయని తరువాత ఆయనే స్వయంగా చెప్పుకున్నారు. గౌతమరావుగారు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు సంస్కృతం డిగ్రీలో చేరారు. కాని వారి తండ్రిగారిని ఎవరో తెలుగు చదవడం వల్ల ప్రయోజనం ఉండదని చెప్పడం వల్ల అప్పుడే కొత్తగా ప్రారంభించిన కామర్సులోకి వీరిని మార్పించారట.

**ఉన్నత విద్య – ఉస్మానియా విశ్వవిద్యాలయం**

నిజాం వ్యతిరేక ఉద్యమంలో ఔరంగాబాదు జైలుకు వెళ్ళారు. రెండు సంవత్సరాలలో పారిపోయి వచ్చారు. ఉద్యమంలో పాల్గొన్న ఈ అనుభవం తరువాత రాజకీయాలలో పాల్గొనేటట్లు చేసింది. అప్పుడు హాస్టల్‌లో ఉండేవారు. అప్పుడే కొత్తగా విశ్వనాథ వారి వేయిపడగలు సీరియల్ నవల అయిపోయి పుస్తకం రూపంలో వెలువడిందని విన్నారు. దానికొరకు గ్రంథాలయాలన్నీ వెదకి చివరికి ఒక మిత్రుని ఇంటిలో కనపడితే చెప్పకుండా తెచ్చుకొని ఒక దినము, రాత్రి ఏకబిగిన చదివి తిరిగి వారి పుస్తకం వారికే ఇచ్చేశారు. చిన్నప్పుడు చదివిన చెలియలి కట్ట తరువాత చదివిన వేయిపడగలు విశ్వనాథ సాహిత్య సుడిగుండంలో పడవేశాయి. ఆయన అందులో అనేక మునకలు వేసి వారి ఆంతర్యాన్ని శోధించి పట్టుకోగలిగాడు. అంతగా మరే పాఠకుడు విశ్వనాథను పట్టుకోలేక పోయారు.

గౌతమరావుగారు గొప్ప దేశస్థాయి సోషలిస్టు నాయకులు. కాని వారి సాహిత్య జీవనాన్ని మాత్రమే ఇక్కడ ప్రస్తావిస్తాను.

**సాహిత్యం**

గౌతమరావుగారికి చిన్నతనం నుండి పద్యాలు చదవడంతో పాటు క్రమంగా విశ్వనాథ సాహిత్య పరిచయం కావడం ఆయన కావ్యాలు చదవడం అందులో తన్మయులు కావడం జీవితంలో అది ఒక భాగమైపోవడం జరిగినాయి.

అప్పుడప్పుడు పత్రికలలో వచ్చిన విశ్వనాథ పద్యాలు కొన్ని సేకరించి అవి ఒక పుస్తకంగా అచ్చువేయాలని స్వయంగా విజయవాడకు వెళ్ళి విశ్వనాథకు చెపితే ఇవే కాదు ఇంకా ఉన్నాయి. అన్నీ కలిపి వేస్తానని అన్నారట. అదే 'విశ్వనాథ పంచశతి' అయింది. ఆ తరువాత ప్రతి రచనను గౌతమరావుగారు చదవడం అప్పుడప్పుడు విజయవాడకు, వరంగల్లుకు వెళ్ళి విశ్వనాథను కలువడం వారికి పరిచయం పెరగడం జరిగినాయి.

1956లో విశ్వనాథ షష్టిపూర్తి సందర్భంగా కరీంనగర్‌లో సన్మానం చేయాలని గౌతమరావుగారు, మరో న్యాయవాది తుక్కారావుగారు మొదలైన వారు పిలిచారు. అప్పుడే మొదటి సారి విశ్వనాథ కరీంనగర్‌కు వచ్చారు. తెలతెలవారుతుండగా కరీంనగర్‌కు ముందు మానకొండూరు ఊరి చెరువు మీద సూర్యకిరణాలు పడుతుండగా చూసిన విశ్వనాథ కొన్ని పద్యాలు రాసి సభలో చిదివి వినిపించారు.

తనలోతు నెఱుగని జనుల పూజకు తిర
స్మృతి జూపు మత్సరస్వతి సుభద్ర
తన లోతు నెఱిగిన జనుల పూజకు నవా
దృతి జూపు మత్సరస్వతి సమార్ద్ర
మానకొండూర్తటాకాన గట్టున గుమ్ము
లాడు సాలీండ్ల గూండ్లవి శతములు
రవిసుషమా సమాక్రాంత కాంతుల చేత
మాణిక్య కాంతులు మలసి యాడి
వెండి నీరాజనములెత్తుచుండ కదలి
వచ్చె మీ కరీంనగరము భసల వేణి
మత్సరస్వతి భావ సామ్రాజ్య లక్ష్మి
భక్తి యున్నట్టిచో మెత్త బడెడు దేవి

అప్పటి నుండి కరీంనగర్‌తో ఒక విడదీయరాని బంధం ఏర్పడింది. విశ్వనాథకు 1959లో కరీంనగర్‌లో శ్రీరాజరాజేశ్వర స్వామి నిధులతో ఏర్పాటు చేసిన కళాశాలకు సభ్యులుగా ఉన్న గౌతమరావుగారు మిగతా సభ్యులను ఒప్పించి విశ్వనాథను కళాశాల ప్రిన్సిపాల్‌గా రప్పించారు.

విశ్వనాథ సత్యనారాయణగారు శ్రీరాజరాజేశ్వర డిగ్రీ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా 1961 వరకు పనిచేశారు. ఆ రెండేళ్ళలో విశ్వనాథ అనేక పుస్తకాలు రచించారు. అక్కడే న్యాయవాది హిందూస్థానీ సంగీత విద్వాంసుడు పి. నారాయణరావుగారితో పరిచయం ఏర్పడింది. జువ్వాడి గౌతమ రావుగారు, విశ్వనాథ, నారాయణరావుగారలు రోజు కలుసుకునేవారు. పి. నారాయణరావుగారి సంగీతం విన్న సత్య నారాయణగారు ఆయన జీవితాన్ని ఒక నవలగా

''ప్రోయుతుమ్మెద'' పేరుతో రచించారు. అందులో గౌతమరావు, నేదునూరి బాబురావు, చీటి ముత్యం మొదలైన వారంతా పాత్రధారులు, పి. నారాయణరావుగారు కథా నాయకులు.

విశ్వనాథ వారు చెపుతుండగా (డిక్టేట్ చేస్తుండగా) గౌతమరావుగారు దాదాపు 10 నవలలు రాశారు. విష్ణుశర్మ ఇంగ్లీషు చదువుచూ ప్రోయుతుమ్మెద, సముద్రపు దిబ్బ, దమయంతీ స్వయంవరం, నీలపెండ్లి, నందోరాజా భవిష్యతి, పులిముగ్గు, వేదవతి మొదలైన వాటికి లేఖకుడు శ్రీ గౌతమరావుగారు. కేవలం చెప్పినది రాయడమే కాదు, అందులోని విషయాలను సున్నితంగా ఎత్తి చూపేవాడు. కొన్ని నవలలు స్త్రీ పాత్రలు మాత్రమే ఆధిక్యాన్ని చూపిస్తున్నాయని చెబితే తరువాతి నవల అట్లా కాకుండా జాగ్రత్త పడ్డారు విశ్వనాథ, అంతేకాని ఎత్తి చూపిన గౌతమరావును తప్పుపట్టలేదు. దానికి కారణం గౌతమరావు నిశిత పరిశీలకుడు, పండితుడు, సహృదయుడు అనే సంగతి విశ్వనాథకు తెలుసు. 'నా వేగానికి తట్టుకొని రాసినవారు ఇద్దరు. మాతమ్ముడొకరు, వీరొకరు. వేరొకరు లేరు.' అని విశ్వనాథ స్వయంగా కితాబిచ్చారు.

**గౌతమరావుగారి పద్యపఠనం**

"పద్యపఠనం అనేది ఒక కళ. అది ఒక అల్కెమీ. అది తెలిసినవారు చాలా అరుదు. అట్లాంటి పద్యపఠనా కళాశీలి గౌతమరావు.' అని సంపత్కుమార గౌతమరావుగారి పద్య పఠనాన్ని గురించి ఒకచోట అన్నారు. బందరులో రామాయణ కల్పవృక్ష కావ్యగానం మల్లంపల్లి శరభయ్యగారు చేస్తుండగా విశ్వనాథ వారు ఆపి గౌతమరావుగారిని చదువుమన్నారట. గౌతమరావుగారు శివధనుర్భంగం ఘట్టం చదువుతూ 'అతని దృష్టికి జానకి ఆగలేదు, అతని శక్తికి శివధనుస్సాగలేదు, అని పద్యం ఇంకా రెండు పాదాలుండగానే జనం ఆగలేక చప్పట్లు కొట్టారట. సామాన్యశ్రోతలను కూడా కథతో రసజగత్తులో ముంచి వేసే కంఠమాధుర్యం, పద్యపఠనం ఆయనది. ఆ తరువాత ఆయన విశాఖపట్నంలో, విజయవాడలో, హైదరాబాదులో అనేక చోట్ల రామాయణాన్ని చదివారు. రాయప్రోలు, జాషువా, కృష్ణశాస్త్రి మొదలైన వారి పద్యాలు కూడా ఎంతో అద్భుతంగా చదివేవారు. ఆయన పద్యం చదువుతుంటే ఎంత కఠిన సమాసమైనా పువ్వు విచ్చుకున్నంత సుకుమారంగా విచ్చుకునేవి పదాలు. అర్థం తెలియకపోయినా అర్థమవుతున్నట్లే భావం ప్రకటితమయ్యేది.

విశ్వనాథ రామాయణాన్ని వినడానికే శ్రీశ్రీశ్రీ లక్ష్మణ యతీంద్రులు కరీంనగర్‌కు వచ్చి ఆయన ఇంట్లోనే ఉండి పది పదిహేను రోజులు ఉదయ సాయంత్రాలు రామాయణం వినేవారు. ఆ రోజుల్లో ఆయనతో పాటు సుప్రసన్న, సంపత్కుమార, లక్ష్మణమూర్తి, ఏలూరి పాటి అనంతరామయ్య, బేతవోలు రామబ్రహ్మం, చేకూరి రామారావు అనుమాండ్ల భూమయ్య, విశ్వనాథ పావని శాస్త్రి, వాకాటి పాండు రంగారావు, ఇంకా ఎందరో మొదలైన వారు కూడా వచ్చి వారికి వీలయినన్ని రోజులుండి రామాయణం వినేవారు. స్థానికులు నేదునూరి బాబురావు, జి.వి. కృష్ణమూర్తి, నేను, నూకల మర్రిగంగయాచారి, డింగరి నరహరి చారి ఇంకా ఎందరో రామాయణం వినడానికి వెళ్ళేవారము.

హైదరాబాదులో అబ్బూరి ఛాయాదేవి ప్రత్యేకంగా రామాయణ కావ్యపఠనం ఏర్పాటు చేసినపుడు రావిశాస్త్రి, కాశీపట్నం రామారావు, జ్వాలాముఖి వంటివారు వచ్చి విని తన్మయులై రామాయణం ఇంత రసవత్తరంగా రాశారా? అని ఆశ్చర్యాన్ని ఆనందాన్ని వ్యక్తం చేస్తూ విశ్వనాథ రామాయణానికి ప్రశస్తి రావడానికి గౌతమరావుగారి పఠనం కూడా ఒక కారణం అని ప్రశంసించారు. అయితే గౌతమ రావుగారు మాత్రం రచనలో బలం లేకుంటే ఎంత చదివినా రసానందం కలుగదు అని రచనలోని గొప్పదనాన్నే చెప్పేవారు.

**జయంతి**

గౌతమరావుగారు సృజన సాహిత్యాన్ని ఎక్కువగా చేపట్టకపోయినప్పటికీ జయంతి పత్రిక ద్వారా సాహిత్య ధారను ప్రవహింపచేశారు. ఎప్పుడో విశ్వనాథ ప్రారంభించి ఆపివేసిన జయంతి సాహిత్య పత్రికను తాను చేపట్టి ఒక ఇరవై సంచికలు నిరాఘాటంగా ఏ సంచికా ఒక్క రోజు కూడా ఆలస్యం కాకుండా వెలువరించారు. అంతేకాదు సునిశితమైన సాహిత్య విమర్శ ఆ పత్రిక ద్వారా పాఠకలోకానికందించారు. సాహితీవేత్తలు ఆ సంచికకోసం ఎదురు చూసేవారు. విశ్వనాథ శాకుంతలము యొక్క అభిజ్ఞానత అందులోనే సీరియల్‌గా రచించారు. గురజాడ కవికాదు, వ్యావహారిక భాష అంటే ఏమిటి? సామాజిక

స్పృహ అంటే ఏమిటి? విమర్శకుని అజ్ఞానం వంటి ఎన్నో వ్యాసాలు సాహిత్యలోకంలో పెద్ద చర్చలకు దారితీశాయి. మౌలికమైన విమర్శనాంశాలను గౌతమరావుగారు అపూర్వంగా చర్చించారు. సంస్కృతం, ఇంగ్లీషు భాషల్లోని రచనల విశేషాలను కూడా ఆ సంచికల్లో ఆయా సందర్భాల్లో చర్చించారు.

గొప్ప రచనలగురించి సాహిత్య ధారలో ఒక వ్యాసంలో ఈ విధంగా రాశారు.

"ఎవని ప్రతిభ జగత్తు యొక్క విశాల భాగాల నాక్రమించుకొనగలదో, మానవసృష్టిలోని అనంతములైన రహస్యాలకు వ్యాఖ్యానం చేయటానికి ఎవని బుద్ధి సమర్థమై ఉంటుందో వానిది మహాప్రతిభ. సతాంహి సందేహపదేషు వస్తుషు ప్రమాణమంతః కరణ ప్రవృత్తయః, అన్న దుష్యంతుడొక రహస్యమునకు వ్యాఖ్యానము. సీతాస్పర్శచేత చైతన్యవంతుడైన శ్రీరామచంద్రుడొక రహస్యానికి వ్యాఖ్యానము. ప్రతిభ అట్లా ఉంటుంది. అందుచేతనే వాల్మీకి వ్యాసులు, కాళిదాస భవభూతులు, షేక్స్పియరు మిల్టనులు, విక్టర్‌హ్యూగో, రోమేరోలా, డోస్టోవిస్కీలు మహా ప్రతిభాశాలురు. వారి తుల్యులును మహారచయితలు. వారు తమ ప్రతిభానేత్రమును విస్తరించి చూస్తే జగద్రహస్య సిద్ధాంతాలు నేను ముందునగా నేను ముందని పరుగెత్తుకొని వస్తవి. అంతేకాని ఉబుసుపోకకై నాలుగు పద్యాలు, పాటలు గిలికిన ప్రతిమినిషీ, కొన్ని విచిత్రంగా ఉన్న మాటలను ఒకచోట సమకూర్చి నవ్వుపుట్టించే ప్రతి మాస్యకాడూ మహాకవి కాలేడు."

మరోచోట తనకిష్టమైన ప్రబంధకవులు ఆముక్త మాల్యద రచించిన శ్రీకృష్ణదేవరాయలు, తెనాలి రామకృష్ణుడు అని చెప్పుకున్నాడు. 'రాయలలో ఎంత రాజసం యుద్ధవిద్య ఉందో, అంతకన్నా ఎక్కువ ఆర్ద్రత ఉన్నవాడని లేకపోతే మాలదాసరి వంటి కథగాని, పల్లెజీవితాన్ని గాని అంత గొప్పగా చిత్రించేవాడు కాదు' అని గౌతమరావుగారి అభిప్రాయము.

సామాజిక ప్రయోజనం, రసానందం రెండింటి మధ్య ఆనాడు జరుగుతున్న చర్చకు గౌతమరావుగారు గొప్ప సమన్వయాన్ని వ్యాఖ్యానించారు. విశ్వనాథ నవలలను, కావ్యాలను గురించి సమీక్షిస్తూ జీవుని వేదన, ఆర్ద్రత అయిన అన్ని రచనల్లో మౌలికమైన అంశంగా ప్రతిపాదించారు. ప్రపంచ మహారచయితలైన విక్టర్ హ్యూగో, రోమారోలాండ్ మొదలైన వారి సరసన కూర్చోదగినవాడు విశ్వనాథ అని ఆయన సవిమర్శకంగా నిరూపించారు. జయంతి పత్రిక 1958 నవంబరు నుండి 1960 జూలై వరకు నిర్వహించారు. తదుపరి ఆర్థికపరమైన ఇతర కారణాల వలన ఆగిపోయింది.

యువభారతి పక్షాన ఇరివెంటి కృష్ణమూర్తిగారి కోరిక మేరకు విశ్వనాథ కవితావైభవాన్ని గురించి ఒక ఇరవై పేజీల పుస్తకాన్ని రచించారు. కల్పవృక్షంలో కైకేయి పాత్ర అనేది వారి విశిష్టమైన వ్యాసం.

కరీంనగర్‌లో కొందరు సాహితీ మిత్రులతో కలిసి 'సాహితీ మేఖల' అనే పత్రికను నిర్వహించి కొన్ని సంచికలు వెలువరించారు.

సంస్కృత మృచ్ఛకటికం తెలుగు అనువాదం చేశారు. రష్యా, చైనా, భాషల్లోని ప్రముఖ కథారచయితల రచనలు కొన్ని, హిందీ, బెంగాల్ భాషల్లోని మరికొన్ని రచనలకు అనువాదాలు చేశారు. విరోధులు, సఫేద్ కాలర్‌వాలా, పాపజీవి, పశువు మొదలైనవి వాటిలో ముఖ్యమైనవి.

అబ్బూరి ఛాయాదేవిగారు అబ్బూరి గీతావళి పేరుతో అబ్బూరి వారి పద్యాలను గౌతమరావుగారు గానం చేసినవి, తరువాత రామాయణంలోని కొన్ని ఘట్టాలను సి.డి.ల రూపంలో తయారు చేసి 1992లో విడుదల చేశారు. వేయి పడగలు, కల్పవృక్షము ఇతర రచనల గురించి మిత్రులకు వ్రాసిన ఉత్తరాలు ఎంతో సాహిత్య విలువలు కలిగి ఉన్నాయి.

సాహిత్యం గురించి భాష గురించి తనకు ఖచ్చితమైన స్పష్టమైన అభిప్రాయాలుండేవి.

తెలుగు భాష తెలంగాణ ప్రాంతంలో నైజాము కాలంలో ఏ మాత్రం చెడలేదు. పల్లెటూళ్ళలో కొద్దిమంది చదువుకున్న వారే కాక చాలా మంది చదువురానివారు కూడా శతకాలు అప్పగించేవారు. వారి ఉచ్ఛారణలో దోషాలుండేవి కావు. పాటలు పాడినా, మాట్లాడినా, తప్పులుండేవి కావు. కాని అప్పుడు కావ్యాలలోని పద్యాలు

అందరికీ అర్థమై, చదువుకున్న వారి సంఖ్య పెరిగిన ఈ కాలంలో పద్యాలు అర్థం కాకపోవడం కేవలం పాఠ్యప్రణాళికల్లోని లోపమే.

తెలుగు భాష స్వాతంత్ర్యానంతరం చెడినంత బాగా నైజాం కాలంలో చెడలేదు. కవిత్వంలో బలం ఉండాలే గానీ పద్యమా, వచనమా అన్నది ప్రధానం కాదు.

కవిసమ్మేళనం ఉర్దూ భాషలో ఉన్నంత బాగా తెలుగులో ఉండదు. అసలు కవిసమ్మేళనం అనే సంప్రదాయం ఉర్దూ భాషకే సరిపోతుంది. ఉర్దూభాషలో కవిత చివరన ఒక చమత్కారం వినేవారికి వెంటనే ఓహో అనిపిస్తుంది. తెలుగు కవిత్వం అట్లాకాదు. దానికి భాషలో ఉండే లక్షణమే కారణం.

ఎంత కచ్చితంగా ఉంటారో అది కరిగిపోయేవారుగా ఉండే లక్షణం ఆయనది. వానమామలై జగన్నాథాచార్యలతో కలసి వేదాలపై ఉద్యమ గీతాలు పాడారు. ఆ జీవితాంతం సాహిత్యం, సంగీతం ప్రపంచంగా మిగతా కుటుంబ జీవితం కర్మయోగిగా గడిపిన మహావ్యక్తి జువ్వాడి గౌతమరావుగారు.

తన ఇల్లు ఒక సాహిత్యాశ్రమంగా ఎందరో సాహితీవేత్తలకు కావ్యరస ప్రపంచాలను చూపించారు.

నిజమునకు భావుకుండని
సృజనన్ పదివేల మంది నెవ్వడొ యొక్కం
డు జనించు, మెఱయు వానికి
రజనీపతి కాంతి భ్రూభరమ్మపుడపుడై
వారిలో నొక్కరుండు జువ్వాడి వంశ
రజని కాంతుండు గౌతమరావనంగ
కవికి నట్టిడు నొక చెలికాడు దొరకు
తొలతటి జనుస్సులందరి చెలిమికాడు

అని విశ్వనాథ చేత ఆత్మీయంగా ప్రశంసింపబడి, భ్రష్టయోగి కావ్యమంకితంగా పొందినారు. ఆ ఇద్దరి సాహిత్య జీవనానుబంధం సాహితీ జగత్తులో మరొకరికిలేదు.

రాజకీయాలలో సోషలిస్టు నాయకునిగా జయప్రకాశ్‌నారాయణ్, రామమనోహర్ లోహియా వంటి వారితో అత్యంత సన్నిహితంగా ఉండి బాధ్యతలు నిర్వర్తించారు. యువ విద్యార్థిగా నైజాం వ్యతిరేకపోరాటంలో జైలుకు వెళ్ళాడు. తన సమకాలికుడైన సి. హెచ్. రాజేశ్వరరావు, పి.వి. నరసింహారావు, జే.వి. నర్సింగరావు మొదలైన వారెందరితోనే సిద్ధాంతం వేరయినా తన వ్యక్తిత్వ ముద్రను నిలుపుకున్నారు.

సాహిత్యంలో మహారచయితలు, కవులు, విమర్శకులు అవుననే విధంగా మాట్లాడి, పద్యం చదివి, సాహితీలోకంలో ఒక చిరస్థానం పొందారు.

ఎప్పుడూ ఆయన కంఠం కంచులా వినిపిస్తూనే కళ్ళలో ఒక తడి తిరుగుతుండే మనిషి పైకి ఒక శ్యామల వర్ణంలో చెట్టంత మనిషిగా కన్పిస్తూ లోపల ఒక సముద్రం వలె గంభీరంగా యోగి వంటి జీవితం గడిపిన జువ్వాడి గౌతమరావుగారు 24 ఆగస్టు 2012 తేదీన చివరి శ్వాస విడిచారు. అంతిమ ఘటియల్లో ఆయనను నేలపై పడుకోబెట్టిన చివరి క్షణాలలో ఆయన పక్కన కూర్చొని భాగవతం పద్యాలు నేను (డా. గంద్ర లక్ష్మణరావు) వినిపించాను. అప్పుడు ఆయన కళ్ళు చివరి సారి కదిలి ఆగిపోయాయి. విశ్వనాథ సాహిత్యాన్ని మరో వందేళ్ళ ఆయుష్షును పెంచిన అత్యంత అభిమాని, అసలు సాహిత్యాన్ని కావ్యాన్ని ఎట్లా చదవాలి అని స్పష్టంగా చెప్పగలిగిన గొప్ప పండితుడు, సామాజిక న్యాయం జరగాలనే సోషలిస్టు సిద్ధాంతాన్ని నమ్మినవారు, ఆచరించినవారు, అన్నిటికి మించి ఎవరైన ఎంతో మర్యాదగా ఆప్యాయంగా పలకరించే మెత్తదనం గల మనిషి జువ్వాడి గౌతమరావు నిజంగానే విశ్వనాథ అన్నట్లుగా కనుబొమ్మల మధ్య ఏదో ఒక తెలియని వెలుగుతో ప్రకాశవంతమైన జీవితాన్ని గడిపిన ధన్యజీవి.

జువ్వాడి కడలి వేలుపు
జువ్వా! చదువరుల మొత్తములకున్ దలపై
పువ్వా! మవ్వపు మొవ్వా!
కవ్విన కబ్బముల ప్రోవ! గౌతమ రావా!
అని మల్లంపల్లి శరభయ్యగారు సన్మానింపబడినవారు.

# 61 జ్వాలాముఖి

– నిఖిలేశ్వర్

ప్రజాస్వామిక విప్లవ సాంస్కృతికోద్యమ మిత్రుడు, దిగంబర కవితా సహచరుడు జ్వాలాముఖి – ఆయనలో అర్థ శతాబ్ది స్నేహమను బంధం నాదుం. 1960కు పూర్వమే ఆకారం వీరవెల్లి రాఘవాచారిగా, ఆయన తొలిరచన 'మనిషి' కావ్యంతో నాకు తొలి పరిచయం.

జ్వాలాముఖి హైదరాబాద్ లోని సీతారాంబాగ్ దేవాలయంలో 12-4-1938 (బహుధాన్య, చైత్ర పూర్ణిమ)నాడు జన్మించాడు. తల్లిదండ్రులు వెంకటలక్ష్మి నరసమ్మ, వీరవెల్లి నరసింహాచార్యులు. మెదక్ జిల్లాలోని ఆకారం గ్రామం నుంచి హైదరాబాద్ వచ్చి స్థిరపడ్డారు. వారిది వైష్ణవ సంప్రదాయ కుటుంబం.

కలంపేరు జ్వాలాముఖిగా ప్రసిద్ధుడైన రాఘవాచారికి ఒక తమ్ముడు, ఇద్దరు చెల్లెళ్లు. ఆయన సతీమణి సీతాదేవి. ముగ్గురు మగపిల్లలు సంపత్, శ్రీధర్, వాసు. ఈ ముగ్గురు కుమారులు కులాంతర వివాహాలు చేసుకున్నారు. జ్వాల తన బాల్యం గురించి ఇలా వర్ణించాడు. "నాన్న పౌరోహిత్యం, కంఠశోష, రామాయణ పారాయణం, పూటగడవని తండ్రి కోపంలో వణికిపోయిన బాల్యం. ఈతలు, ఆటలు, బలాదూరు తిరుగుళ్ళు, ఆట ఖ్యాళి చాపల్యం"

జ్వాలాముఖి విద్యాభ్యాసం సీతారాంబాగ్‌లోని సంస్కృత పాఠశాలలో 'అమరకోశం', శబ్ధమంజరితో మొదలై నాంపల్లిలోని మల్టీపర్పస్ హైస్కూల్లో 10వ తరగతి, ఆతర్వాత నిజాం కాలేజీలోని సాయంకాల కళాశాలలో బి.ఎ. పాసై, ప్రయివేటుగా ఎమ్.ఎ.(తెలుగు), ఎల్.ఎల్.బి. పూర్తిచేశాడు. విడిగా హిందీ భూషణ్‌లో ఉత్తీర్ణత సాధించారు.

ఉద్యోగరీత్యా ఆయన ఎ.ఒ.సి.లో సైనికులకు చదువు చెప్పే సివిలియన్ స్కూలు మాస్టారుగా కొంతకాలం పనిచేశారు. తర్వాత వరసగా జలహళ్ళి (బెంగళూరు) ఏర్‌ఫోర్స్‌లో క్లర్కుగా, ప్రభుత్వ పౌరసరఫరాలశాల, ఆర్.టి.సి.లో క్లర్క్‌గా, ఆలియా ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పన్నెండేళ్లు, ఎల్. ఎన్. గుప్తా సాయంకాల కళాశాలలో 24 సంవత్సరములు లెక్చరర్‌గా పనిచేసి 1996లో రిటైరైయ్యారు.

మరోవైపు సీతారాంబాగ్ దేవాలయ ట్రస్టీ గనేరీవాల్‌తో, దేవాదాయ శాఖతో, కోర్టు వ్యాజ్యాల మధ్య పోరాడి స్థానిక బాధితులకు సొంతఇళ్ళు సాధించగలిగాడు.

**తాత్విక భూమిక**

సీతారాంబాగ్ జీవితం, జ్వాలను మొదట ఆస్తికుణ్ణి ఆతర్వాత నాస్తికునిగా మార్చింది. సంప్రదాయ వ్యతిరేకత, మానవతా ఆరాధన తొలి పాఠాలుగా హేతువాదంతో బలపడి "మంచి అనే విపంచి మీద మానవతా రాగాలు ఆలపిస్తూ అమరత్వానికి అభ్యుదయానికి" (మనిషీ) ప్రస్థానం చేయించింది.

"కట్టలు తెగిన కవితావేశంలో ఏదో చేయాలనే ఆరాటం". ఎంతచెప్పినా వినని సమాజంపట్ల క్రోధావేశం. మనుషుల్ని-మనసుల్ని దిగంబరంగా ఆవిష్కరించే ప్రయత్నం. తిరుగుబాటు వేదాంతంగా మారింది.

జ్వాలా కవితా చరణాల్లోనే

"భోదివృక్షం పిడికెడు నీడనీయలేదు
గాంధీ పథం గరిటెడు గంజిపోయలేదు
ధర్మశాస్త్రాలు తలదాచుకోనీయలేదు
కర్మ సిద్ధాంతం బానిసను చేసి వదిలింది"

ఆయనకు నిరంతర అధ్యయనం, అవగాహన, ఆలోచన, వివేచనలతో చివరికి మార్క్సిజం - లెనినిజం - మావో ఆలోచనా విధానం పట్ల నమ్మకం కుదిరింది. ఎరుపు నిజం అశృత్వ భారతజాతికి విముక్తి మార్గం అని తెలిసింది.

అయితే అతివాద దుస్సాహసిక వ్యక్తిగత హింసావాదాల ఫలితాలు గమనించి సరైన విప్లవ పంథా కోసం అన్వేషణ ప్రారంభించాడు. కా॥ దేవులపల్లి వెంకటేశ్వర రావు, తరిమెల నాగిరెడ్డి రూపొందించిన నూతన జనతా ప్రజాతంత్ర మార్గం దిక్సూచిగా కనపడింది. అప్పుడిక విప్లవ పంథా ప్రబోధానికి, తన కలం, గళం అంకితం చేశాడు.

**కవిత్వం - సాహిత్యం**

జ్వాలాముఖికి విద్యార్థి దశనుండే కవిత్వం ఒక దాహంగా, ఒక అభివ్యక్త మార్గంగా గోచరించింది. 1956-58 మధ్య రచించిన "మనిషీ" అనే దీర్ఘకవిత - కరుణశ్రీ, దాశరథి ఆశీస్సులతోపాటు ప్రోత్సాహాన్ని పొందింది. గోర్కి ప్రేంచంద్, టాల్‌స్టాయ్, శరత్, గురజాడ, శ్రీశ్రీ రచనల అధ్యయనం ఆయన సాహిత్య మార్గాన్ని సుగమం చేసింది.

ఇక 1965-70 మధ్యకాలంలో వెలువడిన మూడు "దిగంబరకవుల" కవితా సంపుటాలతో రాఘవాచారి జ్వాలాముఖిగా జ్వలించాడు. ఆరుగురు దిగంబర కవులలో ఒకడిగా ఆధునిక తెలుగు కవిత్వానికి ఉద్యమ స్ఫూర్తిని అందించాడు. నిస్తేజము, నిర్వీర్యమైన ఆనాటి సాహిత్య రంగాన దిక్కులు మార్మోగేలా గొంతు విప్పిన దిగంబర కవులు సంచలనం సృషించారు.

1970లో విశాఖపట్నంలో జరిగిన శ్రీశ్రీ షష్టిపూర్తి సభల్లో జ్వాల ఆవేశపూరిత ఉపన్యాసాలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. శ్రీకాకుళం, నక్సల్‌బరీ వసంత మేఘ గర్జనల నేపథ్యంలో విప్లవ రచయితల సంఘానికి సంస్థాపక సభ్యుడిగా, నిఖిలేశ్వర్ చెరబండ రాజులతో కలసి అగ్రేసర పాత్ర వహించాడు. మహాకవి శ్రీశ్రీతోపాటు ఆనాటి పౌరహక్కుల ఉద్యమంలో ముందు నిలిచాడు.

ఒక మహావక్తగా సాహిత్యపరంగా విప్లవ సందేశాన్ని ప్రచారం చేసిన జ్వాల, భావాలు-రచనలు సహించలేని ఆనాటి ప్రభుత్వ నిర్బంధాన్ని, నిషేదాల్ని ప్రయోగించింది. 1971లో నిఖిల్, చెరబండరాజుతో పాటు ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం (పి.డి.చట్టం) క్రింద జైలులో బంధించింది. భావ ప్రకటనను అభివ్యక్తీకరించే స్వేచ్ఛకు సంకెళ్ళు వుండరాదని హైకోర్టు తీర్పు చెప్పింది.

ఆతర్వాత 1975 దాకా విరసంలో కొనసాగిన సిద్ధాంత చర్చల పర్యవసానంగా చీలిక ఏర్పడింది. విరసం చారుమజుందారు ముఠా ప్రయోజనాలను కాపాడుతూ, వివిధ రూపాల వ్యక్తిగత హింసావాదాల్ని ప్రచారం చేసినందువల్ల, ప్రజా సాంస్కృతికోద్యమ లక్ష్యాలను సాధించలేదని భావించి, మిగతా మిత్రులతో ఆ సంస్థకు రాజీనామా చేశాడు.

ఇక జనపథంలో సాంస్కృతిక విప్లవోద్యమం నిర్మించాలనే ఆశయంతో "జనసాహితి" సంస్థ ఏర్పాటులో ప్రముఖపాత్ర నిర్వహించాడు. 1978 నుంచి 1981 దాకా "జనసాహితి" కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్న తర్వాత కొన్ని పరిణామాలు చోటు చేసుకున్నాయి. రాజకీయంగా అప్రజాస్వామిక ముఠా పద్ధతులు ప్రవేశించినందువల్ల, జ్వాలాముఖి మరికొందరు మిత్రులతో కలసి ఆ సంస్థనుంచి బయటికి వచ్చేశాడు. ఆతర్వాత తన వ్యక్తిగత స్థాయిలో ప్రజాస్వామ్య భావనతో, భూస్వామ్య-సామ్రాజ్యవాద ధోరణులకు వ్యతిరేకంగా తన సైద్ధాంతిక పోరాటం కొనసాగించాడు.

**రచనలు**

"మనిషీ" కావ్యంతో రచనా వ్యాసంగం ప్రారంభించిన జ్వాల, తన జీవితకాలంలో వివిధ ప్రక్రియల్లో రచనలు

చేశాడు. జీవితాంతం కలం యోధుడిగా విప్లవ మార్గంలో పయనిస్తూ కవిత్వం, కథలు, నవల, వ్యాసాలు రచించాడు. దిగంబర కవుల మూడు సంపుటాల తర్వాత ఆయన ప్రచురించిన కవితా సంపుటి "ఓటమి తిరుగుబాటు" మాత్రమే. "వేలాడిన మందారం" నవలకు, కొన్ని కథలకు పత్రికల పురస్కారాలు పొందినా పుస్తకరూపం పొందలేదు. ఆర్థిక ఇబ్బందుల మూలంగా ఆయన జీవించిన కాలంలో విడిగా సంపుటాలు వెలువడలేదు.

ఆయన మరణానంతరం "జ్వాల ప్రచురణల" పేరిట రచనలన్నీ 2009 తర్వాత వరసగా వచ్చిన సంపుటాలు – కవితాజ్వాల, కథాజ్వాల, వ్యాసజ్వాల, వేలాడిన మందారం (నవల), భస్మ సింహాసనం (దీర్ఘకవిత), జ్వాల స్మృతిలో స్మృతిసంపుటి.

జ్వాలాముఖి హిందీ, ఇంగ్లీషుల్లో కూడా ధారాళంగా ప్రసంగించడమే కాకుండా విరివిగా అనువాదాలు చేశాడు. కేంద్ర సాహిత్య అకాడమీ కోసం 'దేశదిమ్మరి ప్రవక్త శరత్' ('ఆవారా మసీహా' వియ ప్రభాకర్ అనువాదం), 'రాంగేయ రాఘవ్' (జీవిత చరిత్ర)లను హిందీ నుంచి అనువదించగా ప్రచురించారు.

**మహావక్తగా**

విప్లవకవి, రచయితగానే కాకుండా ఆయన మహావక్తగా ఖ్యాతి చెందాడు. వందలాది గ్రామాల్లో పర్యటించి సాంస్కృతిక సాహిత్య అంశాలపై, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకై ఉపన్యసించాడు. ఇటు రాష్ట్రంలోనే కాకుండా, దేశవ్యాప్తంగా ఆయా సభల్లో, సదస్సుల్లో ప్రసంగించాడు. ఆయన ఉపన్యాసాలు, ప్రాచీన ఇతిహాసాల నుండి ఉదహరించే ఉపమానాలతో, స్థానిక కథలతో, అంతర్జాతీయ సాహిత్యంలోంచి ఏరి తెచ్చిన కథలతో రక్తి కటించేవాడు. ముఖ్యంగా రామాయణ, మహాభారతాలను సందర్భానుసారంగా ప్రజాపరంగా అన్వయించి చెప్పేతీరు అందరిని ఆకట్టుకునేది. సామాన్యజనంలో విప్లవ భావాలను సూటిగానాటేవి. ఆయన ఉపన్యాసాలను కవితాత్మకత, కల్పనాశక్తితో శ్రోతల్ని ఆత్మీయంగా పలకరించి, ఆలోచనలను ప్రేరేపించేవి.

**సంస్థలతో**

జ్వాల ఒక నిబద్ధ సామాజిక కవిగా "అక్షరం పదునెక్కితేనే కవిత్వం / రాజ్యాన్ని నిలదీస్తేనే రచన పరమార్థం" అని విశ్వసించినవాడు. అక్షరాల్లోనే కాకుండా ఆచరణరీత్యా ఆయన ఒక క్రియాశీలకవిగా నిలిచిపోయాడు. ఆంధ్రదేశంలోని పౌరహక్కులు, ప్రజాస్వామ్య హక్కుల సంఘాలలో ఉద్యమకార్యకర్తగా తన వంతు బాధ్యతను నిర్వర్తించాడు. ప్రజాతంత్ర విద్యార్థి సంస్థ (డి.యస్.ఓ.) ఆవిర్భావ కాలం నుంచి అనుబంధం పెంచుకున్నాడు. ప్రజాతంత్ర విద్యావిధానం కోసం పోరాడుతూ విద్యార్థులను చైతన్యవంతులను చేశాడు.

గ్రామీణ పేదల సంఘం ఉద్యమాలకు బాసటగా నిలిచి, భూమి, భుక్తి, విముక్తి పోరాటాల్లో పాల్గొన్నాడు.

1976లో ప్రారంభమైన "భారత – చైనా మిత్ర మండలి" లో జీవిత పర్యంతం క్రియాశీలంగా వున్నాడు. సంస్థ నిర్మాణం, ఉద్యమ కార్యకలాపాలలో నాయకత్వ పాత్ర వహించాడు. మిత్రమండలి ప్రతినిధిగా రెండుసార్లు చైనా సందర్శించి అక్కడి ఆర్థిక రాజకీయ సాంస్కృతిక అంశాలను ఆకలింపు చేసుకొని, మన దేశ ప్రజలకు వివరించాడు.

ఉపాధ్యాయ సంఘాల, హేతువాద – నాస్తికవాద కార్యకలాపాల, కుల నిర్మూలనా సంఘం కార్యక్రమాల్లో ప్రజాతంత్ర వైఖరితో క్రియాశీలంగా పనిచేశాడు. వ్యక్తిగతంగా వందలాది కులాంతర, మతాంతర వివాహాలను జరిపించి ఈ దేశంలో రావలసిన కుల రహిత వ్యవస్థకోసం తపించాడు.

స్త్రీవాదాలు, కులతత్వ సిద్ధాంతాలు, మత తత్వధోరణులు తప్పుడు అవగాహనతో ప్రజలను చీల్చి, గ్రూపులుగా విడగొట్టి సంస్కరణవాద ఊబిలోకి దించుతాయని ఆయన విమర్శించేవాడు. మైనార్టీల రక్షణ కుల రహిత సమాజం, స్త్రీల విముక్తి కోసం తనదైన సామాజిక అవగాహనతో ఆయన ఉపన్యసించేవాడు.

జ్వాలాముఖి ఎక్కువగా దీర్ఘకవితలే రచించాడు. తన రాజకీయ, సామాజిక తపన ప్రతి ఖండికలో సవివరంగా ప్రతిఫలించాలనే కోరిక వుండేది. "ఆకాశం ఎర్రబడుతుంది" అనే దీర్ఘ కవితలోని ఈ రణాలు ఆయన ఆత్మ విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నాయి.

"రాత్రి / విచ్చుకున్న భయభీతావహం / క్రూరంగా కురుస్తున్న దోపిడి/

పామరులను చీకట్ల పోట్లతో / వేధిస్తున్న స్వతంత్రరాత్రి / .......

నావాళ్ళు / ఆకలిగొన్నవాళ్ళు / అన్యాయం వాతబడ్డవాళ్ళు / ...........

కొందరు చీకటిని చీలుస్తున్నారు / లక్షనక్షత్రాలు రాలందే /

ఉజ్వల ఉదయం ప్రవహించదు....."

ఇక ఆయనకు గౌరవ పురస్కరంగా లభించిన పురస్కారాలు – తొలి పురస్కారం గుంటూరు భారతీయ రచయితల పురస్కారం, ఝూన్సీ హేతువాద స్మారక అవార్డు, దాశరథి రంగాచార్య పురస్కారం, హిందీలో వేమూరి ఆంజనేయశర్మ అవార్డు, ఆవంత్స సోమసుందర్ పురస్కారం.

జ్వాలను చాలాకాలంగా డయాబెటీస్ వ్యాధి పీడించింది. 1991లో ముంబైలో గుండె ఆపరేషన్ జరిగిన తర్వాత నియమబద్ధ జీవితం, వ్యాయామంతో ఉత్సాహంగా తిరిగేవాడు. వ్యక్తిగతంగా ఆర్ద్ర హృదయుడు, మంచి భోజన ప్రియుడు. ఇతరులకు తినిపించి తాను తినేవాడు. కష్టాల్లో, సమస్యల్లో వున్నవారిని ఆదుకునే స్వభావం. చివరికి 70 సంవత్సరాలు దాటిన ఆయన, క్రిస్టోజనిక్ లివర్ సిరోసిస్ వ్యాధి మూలంగా 14-12-2008న కన్నుమూశాడు.

తన జీవితకాలంలో నాలుగు దశాబ్దాలకు పైగా అలుపెరగని కృషితో ప్రజా ఉద్యమాల వెంట నడిచినవాడు. సమకాలీనులకు, కొత్తతరాలకు స్ఫూర్తినిచ్చి "తిరుగుబాటు వేదాంతం" కవిగా మిగిలిపోయాడు.

# 62 కె.వి. రాఘవాచార్యులు

– డా॥ సి.హెచ్. లక్ష్మణ చక్రవర్తి

కరీంనగర్ జిల్లా సిరిసిల్ల తాలుకా నారాయణ పురంలో వేంకటమ్మ, కారంచేటి తిరుమల మనోహరాచార్య దంపతులకు కె.వి.రాఘవాచార్య 1929 విభవ నామ సంవత్సరం పుష్య శుద్ధ ద్వాదశి జన్మించారు. ఆయన 2016 ఆగస్టు 5న పరమపదించారు.

చిన్నప్పుడు తండ్రినీడలోనే చదువు అంటే ఇదే అని తెలియని రోజులనుండి వారి విద్యావ్యాసంగం ప్రారంభ మైంది. మాటలు వచ్చినప్పటి నుండే స్తోత్రాలు పద్యాలు ఎక్కాలు కంఠానికి పట్టించారు. తన 5వ ఏట శేషభట్టర్ శ్రీనివాసాచార్యుల దగ్గర కట్టెల పలకలమీద కా గుణింతం, పెద్దబాలశిక్ష, ఎక్కాలు, బొట్టు, పరక, వీసం పుట్టి లెక్కలు వ్రాయడం, కార్డులను ఉత్తరాలను చదవడం నేర్చుకున్నారు. 'ఆంధ్రనామ సంగ్రహం, సాంబ నిఘంటువు, అమరకోశం వంటివి ఉదయం చెబితే మరుసటినాటి ఉదయం మళ్ళీ నోటికి చెప్పాలి. చెప్పిన పాఠాన్ని చెప్పగానే నాలుగుపూటలు పూటకు 25 ఆవృత్తులు వల్లె వేసి మరుసటిరోజు ఒప్పచెప్పే వాళ్ళం' అంటారు కె.వి.రాఘవాచార్య. అప్పుడే ఉపనయనం, తండ్రి దగ్గర పంచసంస్కారాలు పొందిన రాఘవాచార్యులు బ్రహ్మశ్రీ వేదమూర్తుల జోగా వెంకయ్య శర్మగారి దగ్గర వేదం, నమిలికొండ శ్రీరంగాచార్యుల వద్ద సంస్కృతం నేర్చుకున్నారు. శర్మగారి దగ్గర పంచకర్మలు, దేవయ్యాకం నేర్చుకున్నారు.

వేణుగోపాలయంలో 5 సంవత్సరాలున్నా పంచకావ్యాలూ పూర్తి కాలేదు. ముందు చెప్పింది వస్తేనే తర్వాతది చెప్పేవారు. అక్కడ దోర్బల విశ్వనాథశర్మ, తిగుళ్ళ వేంకటేశ్వరశర్మ, రాచెర్ల వెంకటేశ్వర్లు, గుమ్లాపురం శ్రీనివాసాచార్యులు సహాధ్యాయులు. అప్పుడే చదువులకు సర్టిఫికెట్ అవసరం అనుకుంటున్న రోజులు. కరువు వచ్చింది. పిల్లలను వారాలకు కొందరి ఇండ్లలో ఏర్పాటు చేశారు. దోర్బలవారు, శిరిశనగళ్ళవారు ఒకరు తెనాలికి మరొకరు సీతారాంబాగ్ హైదరాబాద్ పాఠశాలలకు వెళ్ళారు. రాఘవాచార్యుల వారికీ వెళ్ళాలని ఉన్నా మరోచోటికి వెళ్ళి చదువుకోవాలనుకుంటే తిండి, బట్ట అన్నిటికీ లోటే. సహ విద్యార్థులు జగడాలతో దెబ్బలాడుతుంటారు అని శర్మగారి దగ్గరే చదువుకోమన్నారు తండ్రి గారు. ఊరు దాటనీయలేదు.

ఈ సమయంలోనే సురవరం ప్రతాపరెడ్డి ఆ ఊరికి రావడం, అక్కడ చిన్న సమావేశం జరిగింది. తన గురువుల పద్యాలు గోలకొండ కవుల సంచికలో పడడం చూసి తానూ కవిత్వవిద్యలోకి అడుగుపెట్టారు. అలా వేదం, ద్రావిడవేదం, యజ్ఞ విధులు, సంస్కృతం నుండి నాటక ఛందోలంకార శాస్త్ర సాహిత్యంవైపు మరలారు రాఘవాచార్య.

ఇంటి దగ్గరలోనే ఉన్న కృష్ణశాస్త్రి, నమిలికొండ శ్రీరంగాచార్యులవద్ద లఘు సిద్ధాంతకౌముది, మాఘకావ్యం గీతాభాష్యం, సంప్రదాయగ్రంథాలు, నైషధం, తర్కం,

శాకుంతలం, సాహిత్యదర్పణం, ఉత్తరరామచరిత్ర, వీర రాఘవీయ వ్యాఖ్యతో భాగవతంలోని నాలుగు స్కంధాలు చదివారు. ఊళ్ళో పండితులు లేనప్పుడు ఆరుమైళ్ళ దూరంలోని ఆవునూరుకు వెళ్ళి ఆచ్చి వేంకటాచార్యులవద్ద పాఠాలు చదివేవారు.

రాఘవాచార్యుల ఇంట్లో తాను పెద్ద తమ్ముడు స్కూలు చదువులకు పోలేదు. స్థిరమైన ఉద్యోగం కోసం తర్వాతిరోజుల్లో స్కూలు చదువులేక అనేక ఇబ్బందులు పడ్డారు రాఘవాచార్యులు. 1947 ఆగస్టు 15 స్వాతంత్ర్యం రావడం, జాతిపిత గాంధీ హత్య జనవరి 30, 1948న జరగడం దేశమంతా విషాదఛాయలతో ఉండింది. నైజాం రాష్ట్రంలో రజాకార్లవల్ల అలజడులు రావడంతో ఊర్లో తెల్ల టోపీలు, జండాలు పట్టుకుని స్వతంత్ర భారతమాతాకీ జై అంటూ నినాదాలు చేస్తూండేవారు. పోలీసులు వచ్చి తీసు కెళ్తుంటే ఊరి పెద్దలు వారికి నచ్చచెప్పి విడిపించడం జరిగేవి. ఊర్లో రోజూ సీతారామచంద్ర ఆలయంలో పూజలు జరపాలని నిర్ణయించారు.

నిజాం బాధలు తొలగాలని ఊరివారంతా అన్ని కులాలవారు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు. “రాష్ట్రమంతా రజాకార్ల దౌర్జన్యంతో ఉన్నప్పుడు మా గ్రామం భగవత్ సేవలోఉండి ‘ఇదినారాయణపురం’ అనిపించుకుందంటారు కె.వి.రాఘవాచార్య. సెప్టెంబర్ 17,1948న పటేల్‌కు నిజాం ప్రభువు లొంగిపోయాడన్న వార్త రేడియోలో విని సంబరాలు చేశారు. అప్పటికి వారి వయసు సరిగ్గా రెండు పదులు. ఆ రోజుల్లో ప్లేగు వ్యాధి గ్రామాన్ని ముంచెత్తింది. 85ఏళ్ళ గురువు మరణించారు.

కృష్ణశాస్త్రిగారి మాటల ప్రోత్సాహంతో ఊర్లో మురళీధర శర్మ కార్యదర్శిగా చిన్న గ్రంథాలయం పెట్టారు. సుజాత, స్వతంత్ర, భారతి పత్రికలు పోస్టు ద్వారా తెప్పించేవారు. ఆ కాలంలోనే ఆంధ్రసారస్వత పరిషత్ వారి పరీక్షలను శ్రీమాన్ నేరెళ్ళ వేంకటాచార్యులు నిర్వహించేవారు. ఇది వ్రాస్తే చిన్న ఉద్యోగం పొందవచ్చన్న ఆశతో సారస్వత పరిషత్తుకు వచ్చి ప్రవేశ పరీక్ష అనుమతి పొందడానికి వచ్చానని చెబితే లోపలికి వెళ్ళమన్నారు. అక్కడున్న ఇద్దరు ఏం చదివావన్నారు. చెప్పారు. ఏదైనా చెప్పమంటే భారవిశ్లోకం చెప్పారు. వారొక పద్యం చెప్పి అర్థం చెప్పమన్నారు. చెప్పారు. ప్రవేశ పరీక్షకు అనుమతిచ్చారు. ఆ అనుమతిచ్చినవారు పులిజాల హన్మంతరావు, దేవులపల్లి రామానుజరావు. సిరిసిల్లకు మకాం మార్చి ప్రవేశపరీక్షకు చదివేవారికి చదువు చెబుతూ తానూ చదువుకున్నారు.

తొలి వ్యాసం–తొలి బహుమతి, ఉద్యోగం 26 జనవరి 1950లో మహాత్మాగాంధీ జాతిపిత పేరుతో సంస్కృత భాషలో వ్యాస రచన పోటీ జరిగితే ముగ్గురు పాల్గొన్నారు. మొదటిబహుమతి వచ్చింది. పరీక్ష ఫలితాలు వచ్చాయి. ఆయనకు పరిషత్తువారు పరీక్ష ప్యాసైన సర్టిఫికెట్ ఇచ్చారు. 1950 సెప్టంబర్ 22న ఉర్దూభాషలో ఉద్యోగ ఆర్డర్ వచ్చింది. 25 రూపాయల జీతం, మాసాయిపేటలో 25సెప్టెంబర్ 1950నాడు ఉద్యోగంలో చేరారు.

అక్కడి కరణం రాజేశ్వరరావు దగ్గర ABCDలు ముస్లీం టీచర్ దగ్గర అలిఫ్,బె,పె,సెలు నేర్చుకుని మూడు నెలల్లోనే ఏడో తరగతి పుస్తకం వరకు చదవడం నేర్చారు. అప్పుడే ‘హఫ్తుమ్’ మిడిల్ పరీక్షకు అనుమతిపొంది ఆ పరీక్షలో ప్యాసై 16 జూలై 1951 ‘చక్ర్యాల’ (సంగారెడ్డి దగ్గరలో) ఏకోపాధ్యాయ పాఠశాలలో చేరారు . అక్కడ ఉండగానే HSCలో తెలుగువాచక పరీక్షలో తప్పకుండా పాస్ కావాలన్ననియమం వచ్చింది. సలాం సాహెబు అన్న గణితోపాధ్యాయుడికి తెలుగు చెప్పి అతడి దగ్గర లెక్కలు నేర్చుకున్నారు. HSC పాసయ్యారు. హిందీ ప్రచారసభ, సంస్కృత భాషాప్రచార సమితి వారి ప్రవేశిక. ప్రాథమిక, విశారద పరీక్షలు నిర్వహించారు. 1966లో సిద్ధిపేటకు బదిలీవల్ల చేరారు.

**సిద్ధిపేట సాహిత్య సాంగత్యాలు**

సిద్ధిపేట చేరాక పండితసభలు, కవి సమ్మేళనాలు ఆధ్యాత్మిక ప్రవచనాలలో ఎక్కువగా తిరిగేవారు. వేముగంటి నరసింహాచార్యులు, కాపురాజయ్య, A.రామరాజు, శ్రీవెంకట్రావు వంటివారితో సాహిత్య సాంస్కృతిక చైతన్య కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మరోవైపు ఎలిజర్ల సీతారామాచార్యులవద్ద భగద్విషయం సేవించారు. 1967లో MA సంస్కృతం, 1971లో తెలుగు MA పూర్తి చేశారు.

1972 సెప్టెంబర్ ఆదిలాబాద్ డిగ్రీ కాలేజీలో ట్యూటర్‌గా చేరారు. అక్కడ సదాశివ, వెంకటనారాయణశర్మ

వంటి వారితో పరిచయం ఏర్పడింది. మళ్ళీ సిద్ధిపేటకు బదిలీ అయ్యారు.

సిద్ధిపేటలో ఉండగానే ఇతిహాస, పురాణ ప్రవచనాలు చేస్తూండేవారు. యువభారతివారు 1983లో మాఘకావ్యవైభవంపై ప్రసగించమంటే ప్రసంగించారు. అలా మాఘకావ్యవైభవం పుస్తకం వచ్చింది. దానికి వచ్చిన పేరుతో వ్యాఖ్యానాలు చేయాలని నిర్ణయించుకున్నారు కెవి రాఘవాచార్య.

**వేదాంత దేశికుల కావ్యాలకు దీపశిఖ**

13,14 శతాబ్దాలకు చెందిన వేదాంత దేశికుల రచనలను వెలుగులోకి తేవాలని భావించి ఆయన స్తోత్రవాఙ్మయాన్ని వ్యాఖ్యానించడం మొదలుపెట్టారు. 1987లో 'గోదాస్తుతి అన్న స్తోత్రానికి పరిమళ వ్యాఖ్యను రచించారు. హైదరాబాదు సారస్వత పరిషత్తులో ఉభయవేదాంత సభలను శ్రీశ్రీశ్రీ త్రిదండి పెద్ద జియ్యర్ స్వామివారు నిర్వహించారు. అక్కడ తిరువాయ్ మొళిలోని ఒకదశకంపై ప్రసంగించారు. అక్కడినుండి ప్రతిసంవత్సరం జరిగే సభలలో ప్రసంగావకాశం లభించింది.

1989 జనవరిలో సిద్ధిపేట కాలేజీనుండి రిటైరయ్యాక హైదరాబాద్ చేరారు. 1990 భగవద్విషయం–ఈడు అవతారిక అన్న తమిళ రచనానువాదం, భగవద్ధ్యానసోపానం అన్న స్తోత్రానికి మనోరమా వ్యాఖ్యా రచించారు. శ్రీరామానుజకీర్తి కౌముది అన్న సంపుటాలలో శ్రీమద్రామానుజులు వర్ణాశ్రమధర్మాలు అన్న పుస్తకాన్ని12వ భాగంలో ప్రచురించారు.

**వేదాంత దేశికుల పాదుకా సహస్రవ్యాఖ్య**

కె.వి. రాఘవాచార్యుల వ్యాఖ్యానాలలో జీవిత సాఫల్య రచనగా చెప్పదగినది పాదుకా సహస్ర వ్యాఖ్య. 'పాదుకలను' అంశంగా తీసుకుని వెయ్యి భావాలు చెప్పడం ఈ రచన విశిష్టత. వేదాంత దేశికులవంటి ప్రౌఢకవి, విశిష్టాద్వైత రహస్య తత్త్వవేత్త వ్రాసిన మొత్తాన్ని వ్యాఖ్యానంలోకి తీసుకురావడంలో రాఘవాచార్యుల వారు చేసిన కృషి ఎనలేనిది. 1996లో తొలిభాగం ముద్రణై 2003లో ఐదు భాగాలతో ఈ వ్యాఖ్య ముగిసింది. దీన్ని హైదరాబాదు లోని అహోబిలమఠం మాలోల గ్రంథమాల వారు ప్రచురించారు.

పాదుకా సహస్రం రచనను పద్ధతి పేరుతో 32 విభాగాలుగా రచనను వేదాంతదేశికులు వర్గీకరించారు. వాటి ప్రస్తావన, సమాఖ్య మొదలైన విధంగా 32 పేర్లు పెట్టడానికి గల కారణాలను కె.వి.రాఘవాచార్యులు తమ వ్యాఖ్యానంలో వివరించారు.

వరదరాజ వంచాశత్, గరుడ దండకం, సుదర్శనాష్టకం, చతుఃశ్లోకీ, యతిరాజసప్తతి అభీతిస్తవం , శ్రీస్తుతి, దయాశతకం, న్యాస వింశతి, అచ్యుత శతకమ్ వంటి రచనలు తెలుగులో వ్యాఖ్యానాల ద్వారా అందులోని రహస్యాలను సాధారణ జనాలకు అర్థమయ్యేరీతిలో వెలువరించారు. శంకరాచార్యుల శ్రీవిష్ణుపాదాదికేశాంత స్తోత్రానికి వ్యాఖ్యానాన్నందించారు. దివ్యప్రబంధత్రయి పేరుతో ఆళ్వారుల ప్రబంధాల్లో మూడిటికి తెలుగు వివరణ, ద్రవిడోపషత్తాత్పర్యరత్నావళికి అన్న మరో రచనకు వ్యాఖ్యానాలు రచించారు. ఆళ్వారులు ప్రదర్శించిన భక్తి ప్రపత్తి మార్గాల విశ్లేషణ చేశారు.

పోతన భాగవతంలోని రుక్మిణీకల్యాణం, నారాయణ శతకాలకు వైష్ణవీ, రాఘవీయ పేరుతో వ్యాఖ్యానాలు రచించి పోతన పద్య రచనా హృదయాన్ని ఆవిష్కరించారు. 2010లో వేదాన్తదేశిక దర్శనమ్ పేరుతో రచించిన చిన్న గ్రంథంలో వేదాంత దేశికుల జీవన తాత్త్వికతను ఆయన రచించిన నూటొక్క రచనలను సంక్షిప్తంగా పరిచయం చేశారు.

యాదవాభ్యుదయం అన్న 24 సర్గల మహాకావ్యానికి వ్యాఖ్యానం రచించడం ప్రారంభించారు. 2630 శ్లోకాలున్న ఈ కావ్య వ్యాఖ్యానంలో ప్రస్తుతం నిమగ్నమై ఉన్న రాఘవాచార్యులవారు. మొదటిభాగంగా 4 సర్గలకు వ్యాఖ్య రచించి వెలువరించారు. ఇది మరో జీవిత సాఫల్య రచనగా చెప్పదగినది రాఘవాచార్యుల వ్యాఖ్యలో విషయాన్ని వివరించడంతోబాటు వేదం మొదలు లౌకిక కావ్యాల దాకా ఆళ్వారులు మొదలు అద్యతనుల వరకు ఉదాహరణలు అభిస్తాయి.

జీవితమంతా చదువుకోసం, చదివిన దానికి గుర్తింపుకోసం పాటుపడ్డ తరంలోని వారు రాఘవాచార్యులు. అప్పటి చదువుల్లో ఎక్కువభాగం సర్టిఫికెట్‌లేని చదువులు. భృతికోసం సర్టిఫికెట్ చదువులు 16 ఏళ్ళ తర్వాతే కొనసాగించారు. వేద విద్యలు, వేదాంతవిద్యలు, వైష్ణవ

గ్రంథాలు సంస్కృతం నేర్చిన గొప్ప పండితుడు మూడో తరగతి పిల్లలకు పాఠం చెబుతూ విధి బలీయమైందికదా అనుకున్నారు. అయినా పట్టువదలక పాఠశాల ఉపాధ్యాయుడి మొదలు కళాశాల అధ్యాపకుడిదాకా ఎదిగారు.

విశిష్టాద్వైత వేదాన్త విశారద, శాస్త్రవిద్వన్మణి, వాచస్పతి బిరుదులందుకున్నారు. మొదటిది గుంటూరువారు, 2వది వేద విశ్వవిద్యలయం తిరుపతివారు, మూడవది రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం తిరుపతి వారు ప్రదానం చేశారు. తెలుగు విశ్వవిద్యాలయ పండిత పురస్కారం, శివానంద సద్గురు ఎమినెంట్ అవార్డు, ఉభయవేదాన్త విద్యత్సమ్మానం, రఘునాథాచార్యుల వారిచ్చే ఉభయవేదాంత పురస్కారం, ఉగాది పురస్కారం, మహావ్యాఖ్యాత పురస్కారం వంటి వాటితో బాటు శ్రీశ్రీశ్రీ త్రిదండి పెద జీయరుస్వామి , శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామినుండి పురస్కారాలు పొందారు. తిరుమల చారిటబుల్ ట్రస్ట్‌ను తన సోదరులు, పుత్రులతో ఏర్పాటుచేసి ప్రతి సంవత్సరం పండిత సన్మానాలను చేస్తూ తాను సంస్కృత వాఙ్మయ సేవచేస్తూ, చేస్తున్న వారిని ప్రోత్సహిస్తూ జీవితం కొనసాగించారు.

63

# కాళోజీ నారాయణరావు

– నాగిళ్ళ రామశాస్త్రి

'నేనంటే, నువ్వు, నేను, వాడూ, నా గొడవ మనస్థితి వైనం. నేనంటే భారత పౌరుడు నా గొడవ ఆ పౌరుని మనఃస్థితి, నేనంటే ఒక ఓటరు. నా గొడవ ఓటరు మనఃస్థితి, నేనంటే ఒక తిరుగుబాటుదారు, నా గొడవ మన తిరుగుబాటు' అని 'కాళోజీ' తన నా గొడవలో చెప్పుకున్నట్లు, ఆ నేను, లేదా పౌరుని తరఫున ప్రాతినిధ్యం వహిస్తూ పౌరుని ఆయా కాలాల్లోని మనఃస్థితిని ఆయా కాలాల్లో వివరిస్తూ తన జీవితకాలమంతా, పౌరుని గొడవను తన గొడవగా వివరించిన సామాన్య మానవుని లేదా పౌరుని తరఫున పోరాటం చేసిన ప్రజా వకీలు కాళోజీ నారాయణరావు. అందుకే ఆయన ప్రజాకవి ఐందు.

ఆనాడు హైద్రాబాదు సంస్థానంలోపడి మహారాష్ట్ర ప్రాంతం నుంచి, చౌథ్ వసూలు చేయడం కోసం నిజాంచే నియమింపబడ్డ మహారాష్ట్ర కుటుంబాలు కొన్ని ఉద్యోగరీత్యా తెలంగాణాలో స్థిరపడ్డాయి. అట్లా స్థిరపడ్డవాళ్ళల్లో కాళోజీ కుటుంబం ఒకటి. అసలు వాళ్ళ ఇంటిపేరు కాలే–జీ పోయి పోయి కాళోజీ అయింది.

1914, హైద్రాబాదు సరిహద్దులోని బీజాపూరు జిల్లాలోని రట్టహళ్ళిలో అమ్మమ్మగారింట్లో కర్ణాటకలో సెప్టెంబర్ 9వ తేదీన కాళోజి పుట్టారు. తల్లిదండ్రులు పెట్టిన పేరు రఘువీర్ నారాయణ్ లక్ష్మీకాంత శ్రీనివాస్ రాంరాజా కాళోజీ. మడికొండ, వరంగల్లు, హైద్రాబాదుల్లో విద్యాభ్యాసం చేసి, వకాలతు పాసై, సర్కారు కోర్టులోకంటే, ప్రజాకోర్టుల్లోనే ప్రజలతరఫున ప్రాక్టీసు చేసిండు. తండ్రి ద్వారా ఉర్దూ సాహిత్యంతోపాటు జీవితంలో క్రమశిక్షణ, తల్లి చిన్నపుడు చెప్పిన ప్రహ్లాదచరిత్ర ద్వారా, అధికార దుర్మదాంధతను ఎదుర్కోవడంలో ఆసక్తి ఏర్పడితే వానమామలై సోదరులు, అన్న రామేశ్వరరావు, పల్లాదుర్గయ్య బిరుదురాజు రామరాజు వంటి సాయితగాండ్ల ద్వారా తెలుగు సాహిత్యంపట్ల మక్కువ ఏర్పడ్డయి.

ఈ లక్షణమే తాను చదువుకునే రోజుల్లో ప్రతి ఏటా వచ్చే గణేశ ఉత్సవాలకు ఇచ్చే సెలవు ఇవ్వకపోవటంతో 1600 మంది విద్యార్థులతో తిరుగుబాటుకు నాయకత్వం వహించేటట్టు చేసింది. అధికారుల ఏకపక్ష చర్యలను, అదీ ప్రజలకు వ్యతిరేకమైతే తప్పనిసరిగా వ్యతిరేకించే, నిరసించే, ప్రశ్నించే తత్త్వం అలవాటైంది. ఇది ఆయన 2002 నవంబరు 13న ఆయన కాలం చేసే వరకు కూడ సాగింది అవిచ్ఛన్నంగా, అదే ఆయనను ప్రజా కవిని చేసింది.

తెలంగాణకు కోడిపుంజై వెలుగు జాడ జూపిన సురవరం ప్రతాపరెడ్డి పత్రిక గోల్కొండలో తొట్టతొలి కవిత్వం రాసిండు కాళోజీ. 'నాగొడవ' ప్రకటించ నాందియైన వాడు అని ఆయనను స్మరించిండు కాళోజీ.

తండ్రిగారు ఉద్యోగరీత్యా, స్థలాలు మార్చడంవల్ల చదువు వానకాలం చదువుగనే సాగింది. ఇంటర్మీడియట్‌తో

వరంగల్‌లో ఆయన చదువు ఆగిపోయింది. అప్పటికే ప్రజా ఉద్యమాలల్ల పాల్గొనడం మొదలైంది. ఇంటర్మీడియట్‌లో టి.బి. రావడంవల్ల అర్థాంతరంగా చదువు ఆగిపోయింది. తర్వాత, ఆరోగ్యం చక్కగ ఐనంక వకాలత్ పాసైండు.

కాళోజీ బతుకంతా తెలంగాణ లోపటి రాజకీయ సాహిత్య, సాంస్కృతిక సామాజిక ఉద్యమాలన్నిటితోటి ముడిపడి వున్నది. ఆయనను ఉదహరించకుండ తెలంగాణ సాహిత్య, రాజకీయ, సామాజిక చరిత్ర లేదంటే అతిశయోక్తికాదు. అయితే ఆయన ఏమంటాడంటే నేను ఏ ఉద్యమానికి నాయకుణ్ణికాదు. ఉద్యమాలవల్ల పాల్గొన్న ప్రజలతోపాటు నేను ఎవరికి నాయకుణ్ణి కాదు. నాకెవరు అనుయాయులు లేరు. అవనిపై జరిగేటి అవకతవకలు జూచి, ఎందుకో నా హృదిని ఇన్ని ఆవేదనలు, పరుల కష్టముజూచి, కరిగిపోయెను గుండె, పతితమానవు జూచి, చితికిపోవును మనసు, పరుల కష్టాలతో పనియేమి మాకనెడి అన్యులను జూచైన హాయిగా మనలేను అని, ఆయన చెప్పుకున్నాడు నా గొడవలో. ఓ తీరుగ జూస్తే అది ఆయన ఫిలాసఫీ.

ఇట్ల చూసి ఊర్కునే వాండ్లనుచూసి ఆయన నేనట్లా దేవునివతు సాక్షీభూతున్ని కాదు. సాక్షాత్తూ మానవున్ని గనక అవకతవకలను చేసేవాండ్లను ప్రశ్నిస్త అన్నాడు. దేవుని కంటె ఉన్నతమైన స్థానం ఇచ్చిండు మనిషికి కాళోజీ. అన్యాయం జరుగుతుంటే అసమ్మతి తెల్పడం, తరువాత నిరసన తెలపడం ఇంకా అవసరమైతే వాండ్లను ధిక్కరించడం ఆయన లక్షణం. ఇదే ఆయన కవిత్వ లక్షణంగూడ. ఎందుకంటే కాళోజీ కవిత్వమూ, బతుకు వేరువేరు కావు. ఇక్కడ ఇంకోమాట తప్పనిసరిగా చెప్పాలే. మహారాష్ట్రలోని సంత్, ఇస్లాంలోని సూఫీ సాంప్రదాయాల ప్రభావం కాళోజీమీద ఉన్నది. సూరదాస్, కబీర్‌లవలే వేమనవలే ప్రపంచాన్ని చుట్టూ కనపడ్డ అసమానతలు, అవకతవకలను ప్రశ్నిస్తూ దానికి గురియైన వాండ్లను చైతన్యవంతులను చేసి వాండ్లను సమాజాన్ని ప్రశ్నించేటట్లు తయారు గమ్మన్నడు.

1946లోపటి నిజాం రాజ్యంలో జరిగిన దౌర్జన్యాలు, దమనకాండ, ఆనాటి అధికారాల లోపాయికారి వ్యవహారం విషయాల పట్ల ఎట్ల తీవ్రంగా స్పందించిండో, తర్వాత వచ్చిన దేశీయ ప్రభుత్వాల పాలన పట్ల కూడా అవకతవకలు జరిగితే అట్లనే స్పందించిండు. రక్షణకు ఏర్పడ్డ బలగం రక్కసుల పక్షంబు చేరిన రాక్షసుల ఇష్టానుసారం రాజ్యమును నడిపించినట్లే, బూజుపట్టిన రాజ్యభారం మోయజాలక జానపదులు రోజుచుండే దేశమేలెడు రాజు రోజులు నిండినట్లే. దీన్ని ఆయన కాలదేవత గర్భవేదన. అరసి, కాళోజీ వచించుట అన్నడు. అట్లనే ఆయన అన్నట్లు 1948లో నిజాం ప్రభుత్వం పోయింది.

1946లోనే కాళోజీ రైతేరాజు అన్నడు. రైతుగనక లేకపోతె సమాజంలోని ఏ వర్గం ప్రజలుగూడ బతుకలేరు అని కర్షకుని కర్రు కదిలినన్నాళ్ళే అన్న గేయంలో.

అంతకుముందట్నే, 1944ల జనగామ, నల్లగొండల ప్రాంతంల జరిగే అన్యాయాల్ని చూసి నవయుగంబన నాజీ వృత్తుల నగ్న నృత్యమింకెన్నాళ్ళు. దమననీతిలో దౌర్జన్యాలు పోషణ పొందేదెన్నాళ్ళు. ప్రజాదరణకోల్పోయి దేశమును పాలన చేసేది ఎన్నాళ్ళు, శాంతిభద్రతల పేర దుష్టతను సమర్థించుట ఇంకెన్నాళ్ళు అని ప్రశ్నించిండు.

తన కవిత్వాన్ని కాళోజీ సామాన్య ప్రజలనుద్దేశించి 'పది వుపన్యాసాలు చేయలేని పని ఒక వ్యాసం చేస్తది. పది వ్యాసాలు చేయలేని పని ఒక కథ చేస్తది. పది కథలు చేయలేని పని ఒక కవిత చేస్తది. పది కవితలు చేయలేని పని ఒక పాట చేస్తది. అందుకే నేను నా గొడవ రూపంలో కవిత్వాన్ని నా భావజాల వ్యాప్తికి ఎన్నుకున్న' అన్నడు. ఆయనకు కవిత్వం పరమావధి కాదు, మానవత్వం పరమావధి. ఇంట్ల మాట్లాడినట్లే ఆయన ఉపన్యాసాలు ఉండేవి. ఉపన్యాసం రీతుగనే ఆయన కవిత్వం ఉండేది. ప్రజలకు దగ్గర కావటానికి అది ఆయనకు కవిత్వం ఒక సామాజిక వాహిక. ఆయన ఏం చెప్పిన సూటిగనే చెప్పిండు. వేమన చెప్పినట్లు సామాజిక వ్యత్యాసాలను చాలా అలవోకగా కవిత్వంలో చెప్పిండు. ఒకడు తన అవసరాలకంటె ఎక్కువ సంపాదించి పెట్టుకుంటే సామాన్యునికి అందుబాటులోనికి రాక వాని అవసరాలు ఎట్ల తీరుతయి. 'అన్నపురాసులు ఒకచోట – ఆకలిమంటలు ఒకచోట, సంపదలన్ని ఒకచోట – గంపెడు బలిగం ఒకచోట' అన్న ఈ సంగతిని ఎంత అల్కగా చెప్తడంటే 'కమ్మని చకినాలొక చోట – గట్టి దవడలు ఇంకొక చోట' అని. ఈ వ్యత్యాసాలు తొలగకపోతే సామాన్యుడు ఎట్ల బాగుపడుతడు.

'అల్పులగు మానవులనడిగేదెవడు' అని కండ్లెర్రచేస్తడు. పండించు ప్రాణాలు పస్తుపడ్డాక, పాడు రాజ్యాన్ని కాపాడకుంటే ఏమి? అన్నడు. 'బీదల సర్వస్వముతో ధనికులు చేసే బేరము చాలింక, మూతులు నాకుచు, ఆత్మవంచనతో కట్టిన మూటలు చాలింక. ఇట్లాటి వ్యత్యాసాలు తొలగకపోతే ఆయ్య బాంచెను అన్న పౌరుడే అయ్య గొంతుకను అట్నే అదుమున్' అన్నడు. అందుకే ఈ వ్యత్యాసాలు పోయి, మనిషి, సాటి మనిషిని మనిషిగ చూడాలి. జాతియని, రీతియని, దేశమని, వేసమని విసముగక్కే వింత బిసగ మారినది, ఆధునిక ఆర్భాట మందణిగి అవనియే ఆత్మజుచ్చీ జనుల అడవైంది అన్నాడు.

ప్రభుత్వాలు ఏంచేసినా సామాన్య మానవునికి వాటి ఫలాలు అందాలనేది కాళోజీ మాట.

కాళోజీ భాష, సామాన్యుని భాష. అదే తన కవిత్వానకెంచుకున్నడు. మనం ఏం చెప్తున్నామో, ఎవనికోసం చెబ్తున్నమో, వానికి తెల్వాలే గద, తెలిస్తేగద వాడు ఆచరణలో పెడ్డడు. వాని బాసల, యాసల చెప్తే వానికి తెలుస్తది అనేది కాళోజీ మాట.

మనం సామాన్య మానవున్ని చైతన్యవంతున్ని చేసి వాన్ని ఆచరణ వైపు మరల్చకపోతే మన బ్రతుకు దండుగ అంటడు. కైత చేత మేల్కొల్పకున్న కాళోజీ కాయము చాలింక అన్నడు.

పర్యటినర్తా వేమన జనజీవితంల చూసిన సంఘటనలకు ప్రభావితుడై తేట తేట మాటలల్ల కవిత్వాలు చెప్పినట్లే అన్ని సంఘటనలకు స్పందించిండు కాళోజీ. ఆనందం వచ్చినా, దుఃఖం వచ్చానా కాళోజీకి కంటినిండా నీళ్ళే. అసలు మనిషిలో ఆర్ద్రత లేకపోతే వాడు మనిషే కాడంటడు కాళోజీ. 'అశ్రువులు లేనట్టి అసువులేలా నాకు, అని కన్నీళ్ళు నన్నెపుడు ఆదుకుని వుండాలె' నని అన్నడు. కవిత్వం ప్రజల కోసం అన్న కాళోజీ కవిత్వం ఎట్లా ఎండాల్నో గూడ చెప్పిండు. నా గొడవ కాలానికి (ప్రతికూలంగా) పారేది ఎదురెక్కేది అన్నడు. అందరు పొయ్యే బాటల నీటివాటంగా పోలే కాళోజీ. నా గొడవ, ఏనాడూ ఎవ్వనికి తలవంచలేదు. కాలునకే కాదు మహాకాలునకును ఏనాడును జీ అనని కలేజాతో ఉండాలె. అండ్ల అన్ని, నీ, భావనలే మన భావనలే, సమరస భావనలే. అది ఎదచించుక పారాలే. సామాన్యుని దుఃఖం వతుగ ఎండరాగబట్టినా ఆగకుండ ఎక్కి ఎక్కి వచ్చేటిదే.

ఆయన కవిత్వంల నిత్యసత్యాలు అనదగ్గ పంక్తులు చాన ఉంటయి. వేమన, కబీర్ చెప్పినట్లు సామెతలవతు, మల్ల మల్ల చెప్పేటట్టుంటయి.

సాగిపోవుటే బ్రతుకు, ఆగిపోవుటెచావు.

బ్రతుకుపోరాటము – పడకు ఆరాటము.

స్వాతంత్ర్యం తర్వాత వచ్చిన ప్రభుత్వాలు సామాన్యుని సంక్షేమం కోసం కోట్లు కోట్లు ఖర్చుపెట్టినా, వాటి ఫలాలు సామాన్యునికి చేరలేదు. మిరియాల పాటు ఖర్చు, పుచ్చిన జొన్నల సేద్యం అన్నడు.

ప్రజాస్వామ్యంలోపల ప్రజలేగొప్ప, సామాన్య ప్రజలకు కావల్సిందల్లా లేదా తీరవలసిందల్లా కూటి సమస్య, గూటి సమస్య, గూటిలోపలి గువ్వల జంటి సమస్యః ఈ సమస్య తీరందే కర్మయోగం, గీతా బోధలు దండుగ. గంటములెన్నో అరిగెను కంటకాలు మాత్రం తరగలేదు. లోకం తంటాలు తీరలేదు అని కాళోజీ బాధ పడ్డడు. కాళోజీ రాజకీయాలను రోసిండు. ప్రజాకీయాలు కావాలన్నడు. సామాన్యుని బ్రతుకు బాగుపడాలె అన్న కాళోజీకి మనిషి తర్వాత మనిషి బ్రతుకంటే గొప్ప విశ్వాసం. ఆయన అంటడు 'బతుకు తప్పదు బతక్క తప్పదు. శాస్త్రం తప్పుతుంది. ధర్మం తప్పుతుంది. న్యాయం తప్పుతుంది గాని బతుకు తప్పదు, బ్రతక్క తప్పదు' అన్నది ఆయన మాట. ఇంత విశ్వాసం ఉన్నది గనకనే అవగాహనకు ఉదాహరణ. చాలా గొప్ప కవిత. 'బతుకమ్మ బతుకు, అమ్మల మరవని సంతానము గని బతుకమ్మ బతుకు'

కాళోజీకి ప్రజాస్వామ్యం మీద గొప్ప విశ్వాసం. గొప్ప ప్రజాస్వామ్య వాది కాళోజీ. గత చరిత్ర తెలిసిన వాళ్ళకు ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్యం ఖూన్ చేయబడ్డప్పుడు ఆయన కొట్లాడిన విషయం గుర్తే ఉంటది.

చరిత్రకారుడెప్పుడు జరిగిన చరిత్రను తరువాత కాలంల సేకరించి కొంత విని, చదివి, వ్రాస్తడు. కాళోజీ ప్రజలల్ల తానొక్కడై, ప్రజా ఉద్యమాలల్ల పాల్గొని సమకాలీనుడుగా, ప్రత్యక్షంగా పాల్గొని, తన అనుభవాలను కవితీకరించి రాసిన కవిత్వం. అదొక రన్నింగ్ కామెంటరీ.

కరుణార్ద్రశీలి కాళోజీ. ప్రతి సంఘటనా సూటిగా ఆయన గుండెను తాకి, జాలినీళ్ళ ఉప్పెన పొంగీ, వాక్కై ఆయన నోటి నుండి, భాష్పంగా కంటి నుండి, త్ర్యంబక గోముఖిగా వెలువడతాయని ఒక ప్రముఖుడన్న మాట అక్షరాల నిజం.

కాళోజీ ఎక్కడున్న ఏం చేసినా ప్రజల మనిషి. ప్రజల గొడవే కాళోజీ గొడవ. ఆయన కవిత్వంలోని ప్రతి కమ్మ అందుకు ఉదాహరణ. ప్రజల సమస్యలే ఆయన్ను కవిగా చేసినయి అన్నడు ఇంకొక ఆయన. ప్రజల భాషలో ప్రజల హృదయాలను ప్రదర్శించిన అచ్చమైన తెలుగు, తెలంగాణ కవి కాళోజీ. నూటికి నూరుపాళ్ళు ప్రజాకవి.

రాజీ పడలేదాయన, లోపట తన భావన తప్పని తెలుసుకొని, ఎవరనుకొన్నారు ఇట్లౌవునని ఎవరుకొన్నారు అనీ, రెండున్నర జిల్లాలదె దండి భాస అంటారని, తక్కినోళ్ళ యాస, తొక్కి నొక్కి పెడతారని, అందుకే ప్రత్యేకంగా రాజ్యం పాలు కోరడం తప్పనిసరి అని వాపోయిండు.

1969లో తెలంగాణ రాష్ట్రం కోసం తెలంగాణ అంతా కలె తిరిగిండు. కవిత్వం చెప్పిండు. తర్వాత జరిగిన తెలంగాణ ఉద్యమంలో కాళోజీ ప్రస్తావన లేకుండా ఏ సభ, ఏ ఉపన్యాసం లేదంటే అతిశయోక్తి లేదు. తెలంగాణ ఉద్యమానికి ఆయన ఆశిస్సులు పుష్కల,గా ఉండె. భాష విషయంలో కాళోజీకి నిర్దిష్టమైన దృక్పథం ఉన్నది. బడి పలుకుల భాష గాక పలుకుబళ్ళ భాష గావలె అన్నడు. ఎవి భాషనైనా యాసనైనా ఎగతాళి చేయ్యొద్దన్నడు.

కాళోజీ అణగారిన శ్రమజీవులు నిర్మించిన పోరాట చరిత్రతో పాటు నడిచి బతుకంతా దేశానిదే అయిన మనిషి. మౌలికంగా ఆయన మనిషి, మనిషి గొడవే ఆయన గొడవ. నిత్య పథికుడు. నిత్యాన్వేషి, రక్తమాంసాలున్న మనుషు లందర్కీ అర్థమయ్యే భాష ఆయనది. పుటుక నీది చావు నీది, బతుకంతా దేశానిది అని లోకనాయక్ జయప్రకాశ్ గురించి ఆయన రాసిన మాట ఆయనకూ వర్తిస్తది.

ఖలీల్ జీబ్రాన్ ప్రాఫెట్‌లో ఆల్ ముస్తఫను తానుండిన కాలానికి తానె ఉషస్సయిన వాడు అంటడు. ప్రజా కవి కాళోజీ గూడ తానుండిన కాలానికి తానే ఉషస్సయిన వాడు. కాళోజీ గురించి ఎంత చెప్పినా వొడవని ముచ్చట. కాళోజీ రచనల వివరాలు, కాళోజీకి వచ్చిన పురస్కారాలు, తఫ్సీలు చెప్పను. ఆయన నిరంతరం ప్రజల నాల్కల మీద నడయాడుతూ వాండ్ల మనస్సుల్ల చిరంజీవి ఐండు. ప్రభుత్వం ఆయన పేరు మీద ఒక సాహితీ పురస్కారం ప్రతి ఏటా ఇచ్చే ఏర్పాటు చేసింది. వరంగల్‌లో కాళోజీ పేరిట ఆడిటోరియం నిర్మించి దాంట్లో కాళోజీ ఫౌండేషన్ కార్యాలయానికి, స్మారక గ్రంథాలయానికి చోటు కల్పించేందుకు వాగ్దానం చేసింది.

కాళోజీ అన్న ఒక్క మాటతో, నా మాటలు ముగిస్త. ఎంతటి ధనికునికైనా, అధికారమున్నోనికైనా నేరం చేసే అవకాశం ఉండకూడదు. ఎంతటి బీద వాడికైనా నేరం చేసే అవసరం రాకూడదు. అది కాళోజీ కోరుకున్న సమాజం. ఆ సమాజం కోసం ప్రభుత్వం ప్రజల భాగస్వామ్యంతో కృషి చేస్తే బంగారు తెలంగాణ సాధ్యమే.

# 64 కాళోజీ రామేశ్వరరావు 'షాద్'

– వి.ఆర్. విద్యార్థి

హైదరాబాద్ రాజ్యంలో ఇరవయోశతాబ్దం కీలకమైనది. ప్రపంచంలో వొచ్చిన అన్ని విపత్కర పరిస్థితుల ప్రభావం ప్రత్యక్షంగానో పరోక్షంగానో భారత దేశంపై పడడం అనివార్యమయింది. హైదరాబాద్ రాజ్యం ఇందుకు మినహాయింపుకాదు. అప్పటికే జాగీరుదార్లు, దేశ్‌ముఖ్‌లు, చిన్నపాటి దొరలు ప్రజల జీవితాల్ని నిరంకుశంగా శాసిస్తున్నారు. గాంధీజీ నాయకత్వంలో బ్రిటిష్ పరిపాలన అంతంచేయడానికి దేశమంతటా అహింసా మార్గంలో పోరాటాలు జరుగుతున్నాయి. ఆ స్ఫూర్తితో హైదరాబాద్ రాజ్య ప్రజలుగూడా నైజాం రాజు నుండి విముక్తి కోసం పోరాటాలు ఆరంభించారు. తమ భాషా సంస్కృతుల్ని పునరుద్దరించుకోవడం కోసం హైదరాబాద్ రాజ్యంలోని తెలంగాణ, మహారాష్ట్ర, కన్నడ ప్రాంతాలవాళ్ళు ఉద్య మించారు. తెలంగాణలో ఆంధ్ర మహాసభ ఏర్పడింది. సాయుధ పోరాటం ఆరంభమయింది. వివిధ రాజకీయ విశ్వాసాలతో ఎవరి మార్గంలోవాళ్ళు స్వాతంత్ర్య పోరాటాలు చేస్తున్నారు. వాళ్ళలో కాళోజీ సోదరులు గుర్తించదగిన యోధులు.

కాళోజీ సోదరులలో అగ్రజులు రామేశ్వరరావు పూర్తిపేరు 'రామేశ్వర్ నరహరిరాధాకిషన్ ఝుర్ణీశ్యాంరాజా కాళోజీ'. తమ్ముడు నారాయణరావు. పూర్తిపేరు 'రఘువీర్ నారాయణ్ లక్ష్మీకాంత్ శ్రీనివాస్‌రాజా కాళోజీ'. ప్రజాకవిగా ప్రసిద్ధులు.

వీరి పూర్వీకులు మహారాష్ట్రులు. పీష్వాల రక్షణశాఖలో లెక్కలు చూసేవారు. ఆరు తరాలక్రితం నిజాంరాజు నుండి 'చేత్' పన్ను వసూలు చేయడాని సైన్యం వెంటవచ్చి బీదర్, హైదరాబాద్, వరంగల్ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. తర్వాత వీరిలో ఒకరిద్దరు తిరిగి మహారాష్ట్ర నాగపూర్‌కి వెళ్ళి స్థిరపడ్డారు. తెలంగాణాలో వీరి పేరు చివరి 'పంతరావుగా ఇంటిపేరు 'కాళే' నుండి కాళోజీగా మారింది.

కాళోజీ రామేశ్వరరావు హైదరాబాద్ ప్రాంతంలో ఇప్పటి రంగారెడ్డి జిల్లాలోని 'ఆలూరు'లో 22 జూన్ 1908లో కాళోజీ రంగారావు, రమాబాయి దంపతులకు జన్మించారు. తండ్రి మహారాష్ట్ర బ్రాహ్మణుడుకాగా తల్లి కర్ణాటక మధ్య బ్రాహ్మణ కుటుంబంనుండి వచ్చినవారు. అందుకే వీరింట్లో తెలుగు, కన్నడ, మరాఠీ, ఉర్దూ, ఇంగ్లీష్ భాషలు వినిపించేవి. రామేశ్వరరావు తండ్రి రంగారావు ప్రభుత్వోద్యోగం చేసి విరమణ తరువాత మడికొండలోనూ, హైదరాబాద్‌లోనూ విద్యాలయాలు స్థాపించి పిల్లలకు ఉచితంగా విద్య నేర్పేవారు. సంస్కృతం, ఇంగ్లీష్, ఉర్దూ, ఫార్సీలలో పండితులు. ఈ నేపథ్యమే రామేశ్వర్‌రావు గారికి, నారాయణరావు గారికి అనేక భాషలు నేర్పింది.

రామేశ్వరరావు గారి మేనమామ పండిట్ నర్దేవ్ శాస్త్రి. వారు తిలక్ స్కూల్ ఆఫ్ థాట్ కు చెందినవారు. ఉత్తరప్రదేశ్‌లో స్థిరపడ్డవారు. ఆర్య సమాజిస్టు, బ్రహ్మచారి,

స్వాతంత్రయ సమరయోధులు. వీరి ప్రభావం రామేశ్వరరావు, నారాయణరావుగారలపై బాగా ఉంది. వీరు ఆర్య సమాజిస్టులు. ఇంట్లో కుల, మత భేదాలులేవు.

రామేశ్వరరావు గారి విద్యాభ్యాసం మడికొండలో, హన్మకొండలో, హైదరాబాద్‌లో జరిగింది. ఒక సందర్భంలో విద్యార్థిదశలో కోర్టుకు వెళ్ళి అక్కడ న్యాయవాదుల పనితీరుకు ఆకర్షితులై 'వకాలత్' (న్యాయశాస్త్రం) చదివి పేరు మోసిన 'క్రిమినల్ లాయర్' అయ్యారు. న్యాయవృత్తిలో వీరు సంపాదించిందిలేదు. ప్రజాసేవతప్ప. కూడబెట్టిన ఆస్తులూ లేవు. ప్రజల న్యాయవాదిగా పేరు వీరికి.

రామేశ్వరరావు గారి ధర్మపత్ని 'సరస్వతీబాయి' గొప్ప మనిషి. భర్త ఆలోచనాధోరణుల్ని, ఆదర్శాల్ని గొప్పగా సమర్థించి, సహకరించిన ఇల్లాలు. వీరికి ఒక కూతురు పేరు సక్కు బాయి. సక్కుబాయి భర్త పెండెం శ్రీనివాసరావు జర్నలిజంలో ప్రముఖులు. స్వాతంత్ర్యసమరయోధులు. పి.వి. నరసింహారావు గారికి సన్నిహితులు. వీరికి సంతానంలేదు.

రామేశ్వర్‌రావు గారు తమ్ముడు ప్రజాకవి కాళోజీని ఆయన కుటుంబాన్ని తమ చివరి శ్వాసవరకూ పోషించారు. తమ్ముడు ప్రజాకవి కాళోజీని ప్రజలకు అంకితం చేశారు.

అన్నదమ్ములిద్దరూ స్వాతంత్ర్య సమరయోధులు. ప్రజాకవి కాళోజీది ప్రత్యక్ష పోరాటమైతే రామేశ్వరరావు గారిది పరోక్ష పోరాటం. ఉద్యమకారులపక్షాన వకాల్తా పుచ్చుకునేవారు.

రామేశ్వరరావు గారు మొదటి నుండి కాంగ్రెస్ పార్టీ సభ్యులు. స్వాతంత్ర్యానంతరం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులుగా, మున్సిపల్ కౌన్సిలర్‌గా పనిచేశారు. ఉద్దండ రాజకీయ నాయకులైన హయగ్రీవాచారి, పి.వి. నర్సింహారావు, ఇటికాల మధుసూదనరావు మొదలగువారంతా వీరి శిష్యులవంటివారే. ఐతే అక్రమమనిపించినప్పుడు రామేశ్వరావు గారు ఎవరినీ సహించేవారుకారు.

బూర్గుల రాంకిషన్ రావులాంటి నాయకులు వీరిని ఎంతో గౌరవించేవారు. ప్రజాస్వామ్యంపై సంపూర్ణ విశ్వాసమున్నవారు రామేశ్వరరావు గారు.

రామేశ్వరరావు గారి రాజకీయ జీవితం, న్యాయవాద వృత్తి, సంఘసేవ ఒక ఎత్తయితే వీరి కవితా జీవితం మరొక ఎత్తు. వీరింట్లో ఉంటూ వీరి తిండి తింటూ ఎంతోమంది విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నతస్థానాలకు ఎదిగారు. వీరి గృహం కవులకు ఆశ్రమం. ఆశ్రమం మొదట తెలుగులో రచనలు చేసినా ఉర్దూ కవిగానే స్థిరపడ్డారు. వీరి కలంపేరు 'షాద్' (ఆనందం).

తెలుగులో కథలు, స్కెచ్‌లు, కవితలు రచించారు. హిందీలోనూ కవిత్వం రాశారు. కాని ఉర్దూ కవిత్వం 'షాద్' గారిని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్ళింది. 'దక్కన్‌కవి'గా దేశంలో ఉర్దూ సాహితీ లోకంలో ప్రసిద్ధులయ్యారు. వరంగల్ కవులకు ఉస్తాద్ (గురువు) అయ్యారు. 'సియాసత్' లాంటి ప్రసిద్ధ ఉర్దూ పత్రిక 'షాద్' గురించి ప్రముఖ సాహితీవేత్త సామల సదాశివ గారిచే సమాలోచన వ్యాసాలు రాయించి ప్రచురించింది. తమ తరం హైదరాబాద్ ప్రముఖ ఉర్దూ కవులు షాద్ కవిత్వాన్ని అభిమానించి ఎన్నో ముషాయిరాలకు ఆహ్వానించి గౌరవించారు.

షాద్ ఉర్దూ కవిత్వంలో కొంతభాగం కలామెషాద్. అవ్వల్, కలామెషాద్-దువ్వమ్, కాయనా తెషాద్‌గా మూడు సంపుటాలు తాజ్‌ముష్తర్, ఇస్మత్‌ముజిఫరీ లాంటి కవి మిత్రులు ప్రచురించారు. తెలుగులో 'కాళోజీ రామేశ్వర్‌రావు షాద్ రచనలు' (స్వీయరచనలు, అనువాదాలు)గా పామర రామగోపాలరావు, తంగేళ్ళ ప్రకాశరావు గారలు ప్రచురించారు. హిందీలో 'గుణీగాన్' అనే హిందీ కావ్యాన్ని, కాళోజీ ఫౌండేషన్ వరంగల్, మిత్రమండలి ప్రచురించాయి. 'మనన్‌కర్‌నా చాహతాహు' అనే హిందీ కావ్యం, ఇంకా అనేక ఉర్దూ, హిందీ కవితలు అచ్చు కావల్సివుంది.

'షబ్నం' లాంటి వీరి ఉర్దూ కవితలు చాలా శక్తి వంతమైనవి. 'జయమిత్ర' సాహిత్య సాంస్కృతిక వేదిక హైదరాబాద్ ప్రచురించిన 'మరో కొత్త వంతెన ఎక్‌జార్ నయాపూల్'లో షాద్ ఉర్దూ కవిత, తెలుగు అనువాదంతో ప్రముఖమైనది. ఉర్దూ తెలుగు సాహితీ ప్రపంచానికి అన్నలాంటి కాళోజీ రామేశ్వర్‌రావు షాద్ అనారోగ్యంతో తమ 89వ ఏట 11 నవంబర్ 1996న ఉదయం 11.20కి తమ్ముడు ప్రజాకవి కాళోజీ మిగతా కుటుంబ సభ్యులు, మిత్రమండలి మిత్రుల, వారి వైద్యుల నుండి 'ఇకచాలు ఈ

జీవితం' ఇటూ శాశ్వతంగా సెలవు తీసుకున్నారు. ఈ పుణ్యజీవి, ఋషి తమ చివరిరోజు తుది శ్వాసకు పదిహేడు గంటలముందు 'పలకరింత' అనే కావ్యాన్ని అంకితం తీసుకున్నారు. మొదటి ప్రతిని తమ్ముడు కాళోజీ సాక్షిగా అందుకుని గుండేలకు హత్తుకున్నారు.... షాద్ తమ చివరి నిమిషంవరకూ సాహితీ ప్రపంచంలోనే జీవించారు.

'షాద్' మరణానంతరం తమ పార్థివ శరీరాన్ని మెడికల్ విద్యార్థుల చదువు, పరిశోధనకోసం మెడికల్ కాలేజీకి డొనేట్ చేయాలని బిల్లు రాసి రిజిస్టర్ చేయించారు. ఆ ప్రకారమే వారి శరీరాన్ని తమ్ముడు కాళోజీ, మిత్రమండలి ఉర్దూ కవులూ మిత్రులూ కాళోజీ ఫౌండేషన్ వరంగల్లు వారు ఉర్దూ కవులు షాద్ డాక్టర్ మిత్రులూ, ఇంకా అశేష జనానీకం కాకతీయ మెడికల్ కాలేజికి ఇవ్వడం జరిగింది.

ఇష్టపూర్తిగా తమ శరీరాన్ని మెడికల్ కాలేజికి డొనేట్ చేయడంలో కాళోజీ రామేశ్వరరావు 'షాద్' మొదటివారై అందరికీ ఆదర్శప్రాయులయ్యారు. ఆ తర్వాత 'షాద్' తమ్ముడు ప్రజాకవి కాళోజీ, 'షాద్' కూతురు 'సక్కుబాయి' షాద్ బాటలో నడిచి తమ పార్థివ శరీరాల్ని కాకతీయ మెడికల్ కళాశాలకు డొనేట్ చేశారు. షాద్ జీవితాంతం ఇతరుల కోసం కన్నుల తడిలో జీవించారు. కాళోజీ రామేశ్వరరావు షాద్ రచనల్లో కొన్ని రచనలు:

"దారి బత్తెము చెల్లి పోవగ
దారి మాత్రము మిగిలియున్నది
బాటసారిని కలచివేసెడు
బాధమాత్రము మిగిలియున్నది" అంటూ వోగజిలో అంటారు జీవితపు చివరిరోజుల్లో.

"ఎన్నికలవేళ వాడెంత గొప్పోడు
ఓటున్న ప్రతి పౌరుడొక చక్రవర్తి
ఆ క్షణము గడిచెనా అన్నార్తివాడు" అంటూ ఎన్నికల ప్రహసనాన్ని తెలియజేస్తారు

ఒక హిందీ కవితలో –

"అన్యా యా జగ్‌సే లడ్‌కర్ బార్‌బార్ ఘాయల్ హోతాహుం
హార్ హార్‌కర్ తక్‌జాతాహు తబ్ తన్హా మీమే రోతాహు కవితామె
అప్నే సీనేకే గహరే దాఘ్ దిఖాతా హు పత్థర కో విగ్లా సక్‌తాహు"...

హైదరాబాద్ 400 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంలో మరో కొత్త వంతెన – ఎక్‌జార్ నయాపూల్ అనే ప్రసిద్ధ కవితా సంగలనానికి రాసిన కవితలో–

"హిందూ ముస్లిం సభ్యతలకు
మేలు కలయిక భాగ్యనగరము
ప్రతి అతిధిని ఆదరించి
తనవాదిగ చేసుకొనెను"

ఇంకొక కవిత ఉర్దూలో రాసింది. శీర్షిక 'షబ్నం'. ఇది షాద్ కవితల్లో ప్రసిద్ధమైనది–

"జో గున్చే చమన్‌మెధే సోతేహు మే వున్హే ఆకె షబ్నం జగాకర్‌యా, సబ్గేరా హువా ముహ్ ధులాకర్‌గయా నహ్లాకర్ ధులంకర్ సజాకర్‌గమీ

రహ్షిఘుద్ చమన్ సదా అశ్క్‌బార్ తబస్సుం కలీకో అతాకర్ గయా రహీతాజ్‌గీ సబ్ కో దేతె హుయె గయాతో సబీ కో హసాకర్ గయా అంథేరె సె ఆయా సుబహ్ దమ్ గయా నజానా కిసీవె కబ్ ఆకర్ గయా మిలీథీ వుసే ముక్తసర్ సీ హయాత్ వునీమె కిసీకా భలాకర్ గయా బసేరా ఘడీభర్ చతున్‌మె కియా చమన్ కో మగర్ క్యాసెక్యాకర్ గయా ఘడీ దోఘడీ కా వతన్ థా చమన్ జి.సె. ఆకె షబ్నం హరాకర్ గయా చమన్ సే వుసే కుఛ్న హాసిల్ హవా మగర్ వున్‌పె సబ్‌కుచ్ లుటాకర్ గయా లుటాకర్ చమన్ పర్ నిజి ఆబరూ గులిస్తాకి రౌనక్ బఢాకర్ గయా బులావే జబ్ ఆయా ఆయే మునీర్ చమక్‌తే దమక్ తే ఖజాకర్ గయా ఘడీభర్‌మె రోధో కె రుస్సత్ హుమీ వుసేగమ్ నహీఫర్జ్ అదాకర్ గయా జమానే కె దర్‌సే షహాదత్ దియా హమే మర్‌కె జీనా సిఖాకర్ గయా యహీ మేక్ పానీకి ఛోటీసి బూంద్ మేరే దిల్‌మె హల్‌చల్ మాచాకర్‌గయా

'షాద్' రచించిన ఈ కవితలో 'షబ్నం' (మంచుబిందువు) వస్తువు. ఒక ఉదయంపూట తోటలో పచ్చికమీద మంచుబిందువున చూస్తుంటే కవిలో కల్గిన భావన కవితగా మనోజ్ఞంగా రూపుదిద్దుకున్నది.

మంచుబిందువు తోటలోని పచ్చికకూ, పూలగుత్తులకూ

ప్రాణం పోస్తుంది. మొగలదిగులును దూరం కొడుతుంది. తోటను చైతన్యపరుస్తుంది. ఆనందపరుస్తుంది. స్వార్థరహితంగా తానున్న, కొద్దిసేపే తోటకు మేలుచేసి దాని మనసు గెలుస్తుంది. సూర్యకాంతి పడగానే మెరుస్తూ తోటనుండి శాశ్వతంగానిష్క్రమిస్తుంది. మంచుబిందువు తాను మరణిస్తూ తోటకు ప్రాణం పోస్తుంది.

లోక 'కల్యాణం' కోసం నిస్వార్థంగా మనిషి తనను తాను అర్పించుకోవాలన్నది ఈ కవితలోని అంతర్భావం.

కాళోజీ రామేశ్వరరావు 'షాద్' జీవితంగూడా అటువంటిదే. జీవితమంతా ఇతరుల కోసమే బ్రతికారు. ఇతరుల కోసమే శ్రమించారు. 'షాద్' కూ 'షబ్నం' కు చాలా పోలికలున్నాయి. మనిషిగా మాత్రం సంపూర్ణ ఆయుష్షు (89 ఏళ్ళు) జీవించారు.

'షాద్' ఒక నిజమైనకవి. వారి కవిత్వమంతా సౌందర్యాన్వేషణే! ఇంతేకాకుండా మనిషి తత్వంగురించి చెప్పుతూ మనిషి జీవిత కర్తవ్యతను సూచిస్తారు.

65

# కాల్వ బాలయ్య

– ఉండ్రాల రాజేశం

పండిత పామర జనరంజకమైన సంగీత, సాహిత్య, నృత్య, కళామయమైన సాహిత్య ప్రక్రియల్లో స్వతంత్ర ముద్రను కలిగి, కలికితురాయిలా శోభిల్లు ప్రక్రియ యక్షగానం. యక్షగానాలు నైజాం మత దురహంకారాన్ని తట్టుకుని నిలిచి తెలంగాణ సాంస్కృతిక అద్దం పట్టింది. యక్షగానం అనగా యక్షుల పాటయని సామాన్యార్థం. యక్షులనే పేరు అత్యంత ప్రాచీన కాలమునుండి వైదిక, బౌద్ధ, జైన సాహిత్యములలో ఉదహరించబడింది.

యక్షగాన శబ్దము మొదటగా శ్రీనాథుని భీమఖండంలో ఉటంకించబడింది. 16వ శతాబ్దములో కందుకూరి రుద్రకవి రచించిన "సుగ్రీవ విజయం" యక్షగాన వాఙ్మయములో మొదటిదని చెప్పవచ్చు శతాబ్దాలుగా యక్షగాన పాటలు ప్రజల నాల్కలయందు నాట్యమాడినవి. మెతుకు సీమ మాగాణములో చెర్విరాల బాగయ్య, బెల్లోజు రమణాచారి అనే కవులు శతాధిక యక్షగానాలు పండించి అందించడం, ఆడించడం విశేషం. అదేపరం పరలో యక్షగానములు రాసి, పాడి, ఆడించిన కళాకాలులలో కాల్వ బాలయ్య ఒకరు.

కళలకు కాణాచియై, సాహిత్యానికి కల్పవల్లియైన సిద్ధిపేట పట్టణములో 1936 సం॥లో కాల్వ లక్ష్మి – శంకరయ్య దంపతులకు బాలయ్య జన్మించాడు. వారిది చేనేత కుటుంబం. బాలయ్య తండ్రి వద్దనే అక్షరాభ్యాసం చేసి అతని వద్దనే పెద్దబాలశిక్ష నేర్చుకున్నాడు. తరువాత కుల వృత్తిలోకి దిగాడు. మగ్గంతో బట్టలు నేస్తూ భీవండి, బొంబాయి తదితర ప్రదేశాలు తిరగసాగాడు. కడుబీద స్థితిలోవుండి రాత్రుల్లో యక్షగానాలు, వీధి నాటకాలు చూపేవాడు. తాను నాటకాలలోని పాత్రలలో లీనమైపోవడమేకాదు, రామాయణ, మహాభారత పాత్రలలో చిన్నప్పుడే నటించి కళాహృదయుల మన్ననలు పొందాడు. పురాణాలు, ఇతిహాసాలు ఇంటిలోనే చదివి వాటి సారమును గ్రహించాడు. సృజనాత్మకత శక్తిబలపడింది. తానుకూడా యక్షగానాలు రాయగలనని నిర్ణయించుకున్నాడు.

కాల్వ బాలయ్య కళారంగములో మంచి కార్యకర్త. 1960 ప్రాంతంలో "శివభక్తమండలి"ని ఏర్పాటు చేశాడు. కొంతమంది శిష్యబృందాన్ని ఏర్పరచుకుని సిద్ధిపేట మార్కండేయ దేవస్థానమందు యక్షగానములు అభ్యాసనము చేసి, చేయించి ప్రదర్శనలు ఇచ్చేవాడు. తరువాత నెమ్మదిగా ప్రవాహంలో సిద్ధిపేట పరిసర గ్రామాల్లో, దుబ్బాక, ముచ్చర్ల, కొత్తపల్లి, నాందేడ్, సోలాపూర్, భీవండి, బిక్కనూర్ ప్రాంతాలలో యక్షగాన ప్రదర్శన ఇచ్చేవాడు.

ఉగాది, వినాయకచవితి, దేవీనవరాత్రులు, దేవాలయాల వార్షికోత్సవాలలో ప్రత్యేక ఆకర్షణగా యక్షగాన ప్రదర్శన ఆకర్షించేది. సినిమాలు, టెలివిజన్లు లేని ఆ కాలములో చిందు యక్షగానాలే మనోరంజకాలు. ఈయన యక్షగానాలలో దుర్యోధన, శాంతన మహారాజు,

భృగుమహర్షి, అర్జునుడు, తదితర పాత్రలు పోషించి, ఎందరో ఆదరాభిమానాలు పొందాడు. కాల్వ బాలయ్య ఉదయం నుండి సాయంత్రందాకా మగ్గం నేయడం రాత్రుల్లో యక్షగాన ప్రదర్శనల్లో లీనమయ్యేవారు. కడుబీద స్థితిలోవున్నా ఊహలకు పదునుపెట్టి యక్షగాన రచనల్లో కృషి చేయసాగాడు. అనతికాలములోనే యక్షగాన రచనా ప్రక్రియ కరతలామలకమైంది.

కాల్వ బాలయ్య తాను యక్షగాన ప్రదర్శనలివ్వడమే గాదు, తన మేథా ప్రతిభచే భీష్మ ప్రతిజ్ఞ, శ్రీకృష్ణమాయ మృగము, శూర్పణక కర్ణనాసికా ఛేదనము, గంగాభగీరథో పాఖ్యానము, భావన మహర్షి విజయము, శ్రీనివాస కళ్యాణము, నీలకంఠరుద్ర సంభవము మొదలైన యక్షగానాలు నాటక కళామతల్లికి మణిభూషణాలుగా అలంకరించాడు. పై యక్షగానములు రచించేందుకు పురాణాలను మరోసారి చదివి, వాటిలోని లోతుపాతుల్ని గ్రహించాడు. కీర్తనలు, పాటల సంభాషణలు, కందార్థాలను కమ్మగా రాశాడు.

యక్షగానము సర్వసాధారణ ప్రజల అభిమానం చూరగొన్న ప్రదర్శన. ప్రతి యక్షగానంలో ఒక హాస్యపాత్ర (బుడ్డరకాన్) ప్రవేశిస్తుంది. అదే పాత్ర అప్పుడప్పుడు మంత్రిగా, సైనికుడిగా మరెన్నో చిన్న పాత్రలను పరిచయం చేస్తుంది. అట్టి హాస్య పాత్రనే నిగతా పాత్రలను రక్తి కట్టించేలా ఉంటుంది. యక్షగాన కళాకారుడికి నటన రావాలి. నాట్యం రావాలి. పాటలు పాడే శక్తి ఉండాలి. సంభాషణలను అర్థవంతంగా చెప్పే సామర్థ్యం ఉండాలి. ప్రతి యక్షగానంలో నటన – నృత్యం – పాటలతోపాటు రాగం, తానం, పల్లవిల పరిజ్ఞానం ఉండాలి అవన్ని ప్రాధాన్యత వహిస్తాయి. ఇవన్నింటిలో కాల్వ బాలయ్య ఆరితేరినవాడు. సామాన్యంగా యక్షగానాలు పురాణీతిహాసముల ఇతివృత్తములు. యక్షగాన రచయితకు పురాణ, ఇతిహాసాలు తెలిసి ఉండాలి. సాహిత్యంతోపాటు రాగం, తానం, పల్లవిలను సాధన ద్వారా బాలయ్య సంపాదించాడు.

కాల్వ బాలయ్య అన్నింటిని అలవోకగా పోషిస్తూ, తాను రచించిన యక్షగానములను ఇతర కళాకారులకు నేర్పిస్తూ, వాయిద్యాలు నేర్పిస్తూ, తానూ అందులో పాత్రదారి అయ్యేవాడు. అట్లే వాటికి దర్శకత్వం వహించేవాడు. శ్రీకృష్ణమాయలేడి అనే సరికొత్త ఇతివృత్తంలో యక్షగానం రాసి, ప్రదర్శించి పేరు ప్రఖ్యాతలు ఆర్జించాడు. మహాభారతం లోని చిన్న అంశంను తీసుకుని రామాయణాంశం జోడించి లౌకికంగా పాటలు, పద్యాలతో కథను అద్భుతంగా నడిపాడు. అందులో ఆయా సందర్భానుసారంగా ముఖ్య పాత్రలు పోషించాడు. తన జట్టులోని నటులందరికి చక్కని మార్గదర్శనం చేశాడు. ఎందుకంటే ఆ రోజులలో స్త్రీల పాత్రలను మగవారే పోషించారు కాబట్టి ఆహార్యం దెబ్బతినకుండా చూసేవారు.

చక్కని ఆహార్యం, అతి చక్కని అంగీకంలు కాల్వ బాలయ్య సొంతం. ఈయన యక్షగాన పాత్ర వేదికపై ప్రవేశింపబడిందంటే చాలు ప్రజలంతా కేరింతలు కొట్టేవారు. తియ్యటి గొంతుగల బాలయ్య గానామృతాన్ని మౌనంగా ఆస్వాదించేవారు. కంటి కునుకు లేకుండా రాత్రులంతా ప్రదర్శనలు తిలకించేవారు జనాలు. నటులు వేషాలు వేసుకోవడంలో, వస్త్రాలంకరణ చేసుకొనడంలో క్రమశిక్షణ పాటింపజేసి సహజత్వానికి దగ్గరగా చూపేవాడు.

యక్షగాన రచనలో కందార్థముల సృష్టి తెలివి తేటలతో కూడుకున్నది. అట్టి రచనను కాల్వ బాలయ్య "నీలకంఠ రుద్ర సంభవము" అను యక్షగానంలో ఇంద్రుడు ఇలా అంటున్నాడు. నా యొక్క అష్టఐశ్వర్యాలు పాల సముద్రంలో పడిపోయినాయి. పాలసముద్రంలో విషమును తొలగించి, అమృతాన్ని కాపాడి మాకు అందించినావు శివుడా! నన్ను కాపాడు అంటూ ఇంద్రుడి గూర్చి "ఆటతాళంలో" ఇలా వర్ణించాడు.

ఇ॥క॥ తెలియక నొనరించితిని దుష్పల సాగరమందు
మునిగి భ్రష్టుడనైతిన్ కల దప్పిపోయితిని
నా కలతలు విదళించవేర ద ఆట కాకోదర
భూషణ చిన్మయరూప కా మిత్ర ఆకడలి విషమణ
గ జేసియు నట్టి పీయూషమును గాచియు మా
కు శుభములందజేయవె మంగళింగభవా
సనాతన కా

సంగీతము, సాహిత్యాలను జీర్ణించుకున్నాడు కాబట్టి యక్షగాన రంగములో సాటిలేనివాడయ్యాడు బాలయ్య

మరొక యక్షగానం "భావనమహర్షి విజయం" కాల్వ

బాలయ్య కలం నుండి కదిలివచ్చింది. అందులో కాలశేషుడనే రాక్షసుడు భద్రావతిని చూసిన సందర్భంలో 'త్రిపుట' తాళంలో అందమైన పాటలనుందించాడు. అందులో ఒక పాట:

1 చ॥ కలికి మీరు వాతి భాతి కలల్ గలభామిని క
గలభామిని గజంగామిని చెలి భమర
కుం తలిగాంచితిని భళి క

2 చ॥ నిలువగనులేను నేను వలల్ చలియించెన్ ని
చలియించెను పులకించెను వల తేనితూ
పుల కోసమే నిల క

3 చ॥ ధరణీ ప్ర సిద్ధి సిద్ధి పురీ వరుణేలును ధ వరుడేలును
దరిచేర్చును గరి సొగసు మం జరి గాంచితిని పరి క

ఇలాగే కాల్వ బాలయ్య రాసిన పాటలు, సంభాషణలు సాధారణ ప్రజల కర్థమయేవిలా, అలంకారాలతో కూడి ఉండేవి.

గంగా భాగీరథోపాఖ్యానము యక్షగానములో భగీరథుడు తపస్సు చేసి ఆకాశ గంగను భూమ్మీదికి తెచ్చి, తన తాతల భస్మరాసులను తడిపి వారికి మోక్షము లభించేలా చేసిన విధానాన్ని హృద్యమైన పద్యాలు, పాటలు, సంభాషణలతో రచించి ఆ పురాణగాథను ముందు తరాలవారికి కందించాడు. దానివల్ల భగీరథ ప్రయత్నమంటే ఏమిటో సాధారణ ప్రజలకర్థమైంది.

తండ్రి సుఖం కోసం అపురూపమైన త్యాగం చేసిన భీష్ముని గురించి యక్షగానం రాసి భీష్మప్రతిజ్ఞ అంటే ఏమిటో పల్లె జనాలకు, పామర జనాలకు అర్థం చేయించారు. "శ్రీనివాస కళ్యాణము" యక్షగానంలో కలియుగ దైవమైన వేంకటేశ్వర మహాత్మ్యాన్ని కళ్ళకు కట్టింటాడు. తాను నీలకంఠ సామాజిక వర్గానికి చెందినవాడు కాబట్టి నీలకంఠేశ్వర మహాత్మ్యం అందరికి తెలిసేలా "నీలకంఠ రుద్ర సంభవము" యక్షగానము రాశాడు. అందులో తాను ముఖ్యధారియై దర్శకత్వం వహించాడు.

కాల్వ బాలయ్య యక్షగానాలే కాకుండా సాహిత్యసీమలో కవిగా రాణించారు. అన్నిరకాల ఛందస్సులలో పద్యాలను రాసి, శతకాలను వెలువరించాడు. శ్రీ కోటిలింగేశ్వరశతకం, అన్నపూర్ణ భవానీశతకం, శ్రీ నీలకంఠేశ్వర శతకం, నేటికాల స్త్రీ పురుష ప్రవర్తన, కందార్థములు, షిరిడి సాయిబాబ శతకాలను సాహితీ లోకానికి అందించాడు. సిద్ధిపేటలో వెలసిన శ్రీ కోటిలింగేశ్వరస్వామి మహాత్మ్యాన్ని 'శ్రీ కోటిలింగేశ్వర శతకం'. నీలకంఠేశ్వరుడి మహిమలను "నీలకంఠేశ్వర శతకం"లో పద్యాలతో రక్తికట్టంచాడు. కాశీ అన్నపూర్ణదేవి మహిమలను "అన్నపూర్ణభవాని" శతకంలో వర్ణించారు.

ముఖ్యంగా కాల్వ బాలయ్య శతకాలలో మరొకటి "శునక వానరీయం" పద్య కృతిని, ప్రత్యక్ష సంఘటనా విరచితముగా ఆవిష్కరించాడు. ఈ యదార్థ సంఘటన పద్యకథగా మలిచినాడు. మూగజీవులైన కుక్క, కోతి స్నేహంగా ఉంటూ అందరిని ఆశ్చర్యచకితులను చేస్తూ ఉండేవి. కోతికెవరైనా కుడుక అందించిన కుక్కకు తినబెట్టేది. అన్నదమ్ముల మధ్య వైరముండే ఈ రోజులలో కుక్క, కోతి స్నేహబంధం ఎంతో ఉధాత్తమైనది. మానవాళికి ఆదర్శప్రాయమైనది. ఒకసారి కుక్క అకస్మాత్తుగా మరణించింది. కుక్క శవము పక్కన కూర్చుండి, కోతి దుఃఖముతో కుక్కను ఆలింగనం చేసుకుంటున్న దృశ్యాన్ని చూడడానికి జనులు తండోపతండాలు వచ్చి అందరు దుఃఖించారు. గుండెల్ని కదిలించే ఈ అద్భుత సంఘటనను కాల్వ బాలయ్య ఇలా చెప్పసాగారు.

సీ. కోటికి పడగెత్తి మేటియైన నరుండు
జచ్చినరారు యీ చందముగను
పదిమందిలో పల్కుబడి యున్నమనుజుడు
సమసినరారు యీ జనములిట్లు
కావ్యంబునందు ప్రఖ్యాతి గాంచినవాడు
బోయినరారు యీ పుడమినందు
రోగంబులన్ మాన్పి బాగుగా యశమొందు
వాడు ద్రుగ్గిన నిట్లు జూడరారు

గీ. తొల్ల జన్మంబునందు నీ నల్లకుక్క
పుణ్యకార్యంబు లెన్నెన్ని పుడమిజేసి
మెత్తెనో యిట్టి జన్మంబు నెంచిజూడ
వేల కన్నులు జూచుట వింతగాదె

అనే పద్యరచనతో మూగజీవుల రాగబంధంపై చక్కగా వర్ణించి ఎందరో హృదయాల్లో నిలిచినట్టి కవి కాల్వ

బాలయ్య. పంచతంత్రములో పక్షులు – జంతుజాలములు పాత్రధారులై మానవులకు నీతులు నేర్పినట్లుగా "శునకవానరీయము" మానవాళికి మార్గదర్శనము చేసింది.

కాల్వ బాలయ్య నిత్యం దేవాలయాలలో భజనలు చేయుటకుగాను అనేకమైన భజన కీర్తనలు రచించి భక్త బృందము ఆమోదం పొందేవాడు. భజున కీర్తనలను తాను పాడుతూ, భక్తులచే బాడిస్తూ, భక్తి పారవశ్యములో మునిగేవాడు. తాలాలు మరియు తబలా లయబద్ధంగా వాయిస్తూ పాటలను వినసొంపుగా మార్చేవాడు. విన్న వారిని ఆనందడోలికలూగించేవాడు. ఆయన రాసిన భజన కీర్తనలు నేటికి గూడా సిద్ధిపేట ప్రాంతంలోని దేవాలయాల్లో పాడుకుంటున్నారు.

సాహిత్యం, సంగీతం, నృత్యం, సంభాషణాచాతుర్యం సమపాళ్ళలోగల కాల్వ బాలయ్య యక్షగాన రచనలపై లక్ష్మి అన్నపూర్ణ, డా. దాశరథుల బాలయ్యలు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పరిశోధనలు చేయడం జరిగింది. మహాభారత యక్షగానాల పరిశోధనల్లో భాగంగా కాల్వ బాలయ్య రచన "శ్రీకృష్ణ మాయామృగం" యక్షగానంపై కూడా పరిశోధన జరిగింది. తనకు ఒక కన్ను కన్పించకపోయినా, దృష్టిలోపంవున్నా రచనలు మాత్రం కొనసాగించాడు. అవార్డులను, రివార్డులను ఆమడ దూరంలోవుండి ప్రజలమధ్యనే నిలిచి యక్షగాన ప్రదర్శనల్లో మునిగితేలాడు కాల్వ బాలయ్య.

సాహితీ క్షేత్రంలోని యక్షగాన విభాగంలో అవిశ్రాంతంగా కృషి చేసిన కాల్వ బాలయ్య 2.10.2015 రోజున పరమపదించారు. ఆయన ముగ్గురు కుమారులను విద్యావంతులుగా తీర్చిదిద్దినారు. కఠిక దారిద్ర్యం అనుభవించినా, కఠోర పరిశ్రమతో సాహితీ క్షేత్రంలో ఎన్నో విజయాలు సాధించారు. కాల్వ బాలయ్య అముద్రిత రచనలు సాహితీరత్నాలుగా వున్నా, ఆర్థిక సమస్యల వల్ల ముద్రణకు నోచుకోలేదు.

"కళల విద్యలెన్ని నేర్చినా – కుల విద్యల సాటిరావు గువ్వలచెన్నా" అన్నట్లుగా కాల్వ బాలయ్య చేనేత కార్మికుడిగా కూడా మంచి పేరు ప్రఖ్యాతలనార్జించాడు. చేనేతలో కూడా తోటివారికి మెలకువలు నేర్పించాడు. ప్రముఖ బాతిక్ చిత్రకారులకు రంగుల అద్దడంలో అర్థవంతమైన సూచనలు ఇచ్చాడు. నేటికి ఆయన శిష్యులు చిందు యక్షగాన కళాకారులు నేటికి అతనిని గురు భావంతో పూజిస్తారు. కాల్వ బాలయ్య యక్షగానముల దృశ్యమాలికలు నేడు కోకొల్లలుగా అనేక ప్రాంతాలలో ఉనికి ఉన్నాయి.

# 66 కనపర్తి రామచంద్రుడు

**– డా॥ దాసోజు పద్మావతి**

**వచన కవిత నా ఉద్యమం**
**వచన కవిత నా ఉద్యోగం**

అని నినదించి, వచన కవిత్వమే ధ్యాసగా, శ్వాసగా జీవించిన కవి కనపర్తి. తెలంగాణా తల్లి ఒడిలో ఉదయించిన సిద్ధిపేట ముద్దు బిడ్డ వచన కవితా ప్రవీణ కనపర్తి రామచంద్రాచార్యులు.

కనపర్తి 1947 ఆగస్టు 9వ తేదీన జన్మించారు. తల్లి భూలక్ష్మి, తండ్రి రంగన్న. రంగన్నగారు తెలంగాణ సాయుధ పోరాటంలో వీర మరణం పొందారు. అపుడు కనపర్తికి 2 సంవత్సరాల వయస్సు. తల్లి భూలక్ష్మిగారు (తెలుగు భాషా పండితులు) తల్లి, తండ్రి, గురువు తానై కనపర్తిని చక్కని విద్యాబుద్ధులతో తీర్చిదిద్ది మంచి కవిని సమాజానికి అందించారు. బయోడేటా అన్న కవితలో కనపర్తి తన గూర్చి ఇలా వ్రాసుకున్నారు.

నాన్న ఒక 'అగ్గిపుల్ల'
వెలిగించి వెళ్ళిపోయారు
అమ్మ 'చమురు' లాంటిది
ఇంకా నా కోసం
లోలోపలే ఇగిరిపోతుంది

కనపర్తి ప్రాథమిక విద్యాభ్యాసమంతా తోర్నాల, సిద్ధిపేటలో జరిగింది. నా కవితా ప్రస్థానానికి పచ్చతోరణం కట్టింది తోర్నాల గ్రామమే అంటారు కనపర్తి. అది కీలక నామ సంవత్సరం హెచ్.ఎస్.సి చదువుతున్న రోజులు (14 సంవత్సరాల వయస్సు) ఆశువుగా చెప్పిన కవిత. ఇది తొలికవితగా కవి వ్రాసుకున్నారు.

మడిసింది నాలో అజ్ఞాన ప్లవంగం – (ప్లవంగం – కోతి)

చెపుతావా సరస్వతి వీ కవితా కీలకం (కీలకం– రహస్యం) అంటారు కనపర్తి.

కనపర్తి స్కూల్ స్థాయిలో భారత, భాగవత, రామాయణాధికావ్యాలు చదివారు. ప్రాచీన సాహిత్యమన్న, పద్యసాహిత్యమన్న ఎంతో ఇష్టం కనపర్తికి. ఆంధ్రసారస్వత పరిషత్‌లో బి.ఓ.ఎల్ చదివేటపుడు 1971 వ సంవత్సరం మార్చి 17న కమలతో వారి వివాహం జరిగింది. వీరికి ముగ్గురు కుమారులు నాగరాజు, విద్యా ప్రకాశ్ శరత్. కనపర్తి ఉద్యోగ జీవితం 1974వ సంవత్సరం పశుసంవ ర్ధక శాఖ జోగిపేటలో ప్రారంభమైంది. వృత్తికి, ప్రవ ృత్తికి పొంతక కుదరక కొద్ది కాలానికే ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఆ తరువాత పూర్తి కాలం కవితా వ్యాసాంగానికే వెచ్చించారు. మధ్య తరగతి సామాన్యునికి ఉద్యోగం లేకపోతే ఎదురయ్యే కష్టాలు మాటలకందనివి. ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ జీవితకాలం ఆర్థిక సమస్యలు వెంటాడాయి కనపర్తిని.

మెదక్ జిల్లాలోను, సిద్దిపేటలోను ఏ సాహితీ కార్యక్రమం జరిగినా కవి సమ్మేళనం జరిగినా అక్కడ కనపర్తి

ఉండాల్సిందే. వారి స్వగ్రామం సిద్దిపేటంటే వారికి ఎంతో ఇష్టం. కవులకు, కళాకారులకే కాదు వీరులకు, ఉద్యమ కారులకు కట్టని కోట నా సిద్దిపేట అంటారు కనపర్తి.

'ఆదుకుంటాడు కోటి లింగేశ్వరుడు
ఊరి మధ్యలోనే
కాపురం పెట్టాడు శ్రీవేంకటేశ్వరుడు' అంటూ వారి స్వగ్రామం గూర్చి వ్రాసుకున్నారు.

కనపర్తికి ప్రాచీన కవులంటే ఎంతో అభిమానం. ఆధునిక కవుల్లో శ్రీ.శ్రీ. దాశరథి, కుందుర్తి, కృష్ణ శాస్త్రి రచనలంటే ఎంతో మక్కువ. కాళోజీ అంటే ప్రాణం. కాళోజీ ప్రభావం ఎంతగానో వుంది కనపర్తి రచనలపై.

అక్షర రూపం దాల్చిన ఒక సిరాచుక్క లక్ష మెదళ్ళకు కదలిక అని కాళోజీగారన్నారు.

శ్రీ కారానికి ప్రతీక
ఓంకారానికి టీక
ఒక సిరా చుక్క
ఒక సిరా చుక్క
నిద్రాముద్రిత జన చైతన్యానికి
వేగు చుక్క
బీడు వారిన మెదడు భూముల్లో
వాన చుక్క
అటూ సిరాచుక్క గూర్చి వ్రాసుకున్నారు కనపర్తి.

ప్రాచీన సాహిత్యాన్ని అమితంగా ఇష్టపడే మీరు, వచన ప్రక్రియను ఎంచుకోవడానికి కారణమేమిటంటే 'పద్యపాదాలే' నా వచన కవితకు ప్రాణాలంటారు కనపర్తి. ప్రక్రియకన్న వస్తువు ముఖ్యం. ఏ ఛందస్సులో నడిచింది అన్నది కాదు ముఖ్యం. ఏ చందంగా సాగుతున్నదన్నదే మనకు ప్రధానం అంటారు కనపర్తి. వారి కవితల్లో అంత్యలయల విన్యాసాలు, అను ప్రాసలగలగలలు, విరుపులు - పలుకుబడులు - పద బంధాలు కోకొల్లలుగా ఉంటాయి.

"పలికెడిది - వచన కవిత్వమట
పలికెడు వాడు - రామచంద్రుడట"

అంటూ పోతన్నను గుర్తుకు తెస్తారు కనపర్తి. కనపర్తి ప్రకృతి ప్రేమికుడు. రవీంద్రుని గీతాంజలిని హృదయాంజలి పేరుతో స్వేఛానువాదం చేశారు. కబీరు, తులసీదాస్ దోహాలను వచన కవితలుగా చిన్న చిన్న కథలుగా వ్రాసేవారు.

కనపర్తి కవనంలో చోటు చేసుకోని పువ్వే లేదన్న అతిశయోక్తి కాదు. మల్లే, గులాబి, తంగేడు, గునుగు, గడ్డిపువ్వు, పూల కవితలన్ని కూర్చి 'పూజా పుష్పాలు' అన్న కావ్యం వ్రాసి కన్నతల్లికి అంకితమిచ్చారు కవి. కావ్యాన్ని అంకితం తీసుకుంటున్న వేళ అమ్మ ఆనందానికి అవధులు లేవు.

"పట్టి ఇచ్చేది కాదు రా కవిత్వం
పుట్టుకొచ్చేది బిడ్డా దాని తత్వం"
అంటూ కవికి జన్మనిచ్చినందుకు నా జన్మ ధన్యమైందంటూ పొంగిపోయారు.

' మల్లే నా చెల్లే
ప్రాస కోసం కాదీ పిలుపు
ఎన్నైనా పూర్వ జన్మల వాసనల్ని
త్రవ్వి పోస్తుంది నీ వలపు
దైవానికి నీ వంటే ఎంతో ప్రేమ
నిన్న బురదలో దించలేదు
ముళ్ల మీద ఉంచలేదు

కనపర్తి కవిత్వంలో మనకు ప్రస్ఫుటంగా కనిపించేవి భావ చిత్రాలు. కవి, తను పొందిన అనుభవాన్ని శ్రోతలకు తన రచనలలో అందించడమే భావ చిత్రం. ఉపమానాల్ని అనేకం ఉపయోగిస్తారు కవి. పూలతో ప్రకృతిని పూజించడం తెలంగాణలో ఒక విశిష్ట సంప్రదాయం అదే మన బతుకమ్మ పండుగ. బతుకమ్మ పేరుపులో తంగేడు పూలది అగ్రతాంబూలం.

పండు ముత్తైదువులు
పసుపు ముద్దలార బెట్టినట్లు
ఎవరో పసుపు పారాణితో
నవ వధువులు నడిచి వెళ్ళినట్లు
ఎవరో పచ్చి బాలింతరాలు
తెలుగు ఆచారాన్ని పాటిస్తూ
ఈ త్రోవలో పోయినట్లు
ఏ స్వర్ణ కారుడో

'మంగళ సూత్రాల' కోసం
పసిడిరేకులు కత్తిరించి పోసినట్లు
ఎంత బాగున్నాయి
ఈ బంగారు పూలు
పరకాయ ప్రవేశం నాకొస్తే
ఒక్క గడియైనా చాలు
నేను తంగేడు పువునై పోతాను

అంటూ కవి పూల మీదున్న మమకారాన్ని చాటుతున్నారు కనపర్తి.

దేవతల్ని భరించనందుకు
పాపం! ఈ రాయికి మిగిందేమిటి?
ఉల్లిగాట్లు! సుత్తిపోట్లు
ఔను మరి!
రాయైనా, మనిషైనా దేవుడు కావాలంటే
తప్పవు ఎన్నెన్నో పాట్లు" అను నిత్య సత్యాన్ని చెప్పారు కనపర్తి.

కవిత్వం అంటే ఉత్తమ సంస్కార విలువల సమ్మేళనం – మానవీయ కోణాల ఆవిష్కారం. అంతేకాని అస్పష్టమైన, అశ్లీలమైన, అసంబద్ధవాక్య నిర్మాణం కాదంటారు కనపర్తి.

"కవిత్వం కనకపు సింహాసనం
దానిపైన అశ్లీల నినాదాల
శునకాల్ని కూర్చోబెట్టకు
గాడిద విడిచి గుడ్డల్ని మోసినట్లు కాదు
అశ్వం వీర యోధుల్ని మోసినట్లు
పదాలు అర్థగౌరవాన్ని మోయాలి" అపుడే కవికి, కవిత్వానికి అర్థం, పరమార్థం అంటారు కనపర్తి.

కనపర్తి తన కవిత్వంతో అన్ని వృత్తుల వారిని పల్కరించారు. సుప్రసిద్ధ చిత్రకారులు కీ.శే.కాపురాజయ్యగారి జాతీయ బహుమతి పొందిన "రిస్క్ లైఫ్" చిత్రానికి కనపర్తి "ఆకాశానికి నిచ్చెన" పేరుతో (20/9/1991లో) చక్కని వచన కవిత వ్రాశారు.

ఆకాశానికి నిచ్చెన వేస్తావు
అమృత బాండాన్ని అవనికి దింపుతావు
ఓ శ్రమైక జీవన సౌందర్యరాశి
కాళ్ళకు బంధం, నడుముకు బంధం
ఈ చెట్టుకూ – నీకు, ఏ నాటిదో – ఈ బంధం
చెట్టుకొట్టుకొనలో – పిట్టలాగా నీవుంటే
నీ ఇల్లాలి "తాడు" గట్టిదనం
నా కలానికి ధైర్యాన్ని నేర్పుతుంది
ఓ గీతకార్మికుడా! నేను గీతాల కార్మికున్ని –

అంటూ "గీత కార్మికుడి" గూర్చి వ్రాస్తారు. కాపు రాజయ్య గారంటే కనపర్తికి ఎంతో పూజ్యభావం. కనపర్తి రచించిన చాలా పుస్తకాలకు రాజయ్యగారు 'ముఖ చిత్రం' వేశారు.

అనుభూతి వైవిద్యం లేకపోతే అసలు జీవితంలో ఆనందమే ఉండదు. చూసే మనసు ఉండాలే కాని సమాజంలోని అన్ని అంశాలు కవితా వస్తువులే అంటారు కనపర్తి. మసిగుడ్డ, అలుకు పిడుస, చెత్త బుట్ట, గాజు పెంకు, గుండుసూది అన్నింటిలో మానవీయ కోణాన్ని దర్శిస్తారు కనపర్తి.

కాలికి గాజుముక్క కుచ్చుకొని రక్తం కారుతుంటే ఆ గాయాన్ని వెంటనే అందమైన గేయంగా మార్చుకున్నారు.

ఇది ఏ తల్లి కరకంకణమై మెరిసిందో
ఏ చెల్లి హస్త భూషణమై విరిసిందో
ఎప్పుడు ఏ ప్రణయ కలహంలో నలిగి
ఏ ప్రళయ సమరంలో నేలరాలిందో –

నారీమణుల సౌభాగ్య చిహ్నమైన తనను రోడ్డుపై పారేసారన్న కోపంతో నా కాలికి కుచ్చుకుంది. నా కలాన్ని రెచ్చగొట్టింది అంటారు కనపర్తి. మసిగుడ్డను గూర్చి కూడా ఆలోచించే మనసు ఎందరికుంటుంది.

"నిజంగా మసిగుడ్డ పసిబిడ్డ లాంటిది
ఎప్పుడు అమ్మచేతిలో ఆడుకుంటుంది"
తన తనవు కాలిన మన చేయి కాలనివ్వదు
అగ్ని సాక్షిగా మనతోనే జీవిస్తుంది.

ఈ కవితను అర్థం చేసుకుంటే అంతర్లీనంగా (స్త్రీమూర్తి) ఇల్లాలి నిస్వార్థ సేవ కనిపిస్తుంది. అంతేకాదు గుండుసూది చిన్నదైనా దాని గుండె పెద్దది. అల్పప్రాణి కదా అని ఆటలాడుకుంటే రక్తం కళ్ల చూస్తుందంటారు కనపర్తి.

రెండు జీవితాల్ని నూరేళ్ళు
కలిపి ఉంచలేని తాళికంటే
నూరు కాగితాల్ని పదికాలాలు
పదిలంగా కలిపి ఉంచే
గుండు సూదే గొప్పది - నాదృష్టిలో అంటారు కవి.

లోకంలో పిల్లల్ని తీర్చిదిద్దడంలో ప్రధాన భూమిక తల్లిదే. కనపర్తి జీవితంలోను తల్లి స్థానం ఎంతో విశిష్టమైనది. తనకోసం జీవిత సర్వస్వం ధారపోసిన తల్లిపై ఎనలేని భక్తి, గౌరవం కనపర్తికి.

మనిషి జీవన కావ్యానికి
ముందు మాట అమ్మ
మనిషి జీవన గీతానికి

పల్లవి లాంటిది అమ్మబీ అంటూ మాత ృభక్తిని చాటుకున్నారు. స్త్రీ మూర్తిని దేవతగా కీర్తించే మనదేసంలో కూడా స్త్రీలకు బాధలు తప్పడం లేదు.

కనపర్తికి వివిధ సాహితీ సంస్థలతో అనుబంధం ఉంది. జాతీయ సాహిత్య పరిషత్ 'గౌరవాధ్యక్షులు'గా, 'కార్యదర్శి'గా పనిచేశారు. 'అక్షర శిల్పాలు' కావ్యానికి '1989వ సంవత్సరం వేముగంటి' పురస్కారం 'వెలుతురుపూలు' కావ్యానికి సాహిత్య పరిషత్ అవార్డ్, 1990వ సంవత్సరంలో 'వచన కవితా ప్రవీణ' బిరుదు పొందారు. కవిగారికి 'ఆత్మీయ మిత్రమండలి' ఉంది. కనపర్తిని 'కవితా చంద్రుడని' ఐతా చంద్రయ్యగారిని (కథ రచయిత) కథా చంద్రుడని ప్రేమగా పిలుచుకుంటారు సిద్దిపేటలో అభిమానులు.

పరిశోధన చేయాలని నిర్ణయించుకున్నారు. డా. బి. జయరాములుగారు గైడుగా 'కనపర్తి కవిత్వం- సమగ్ర పరిశీలన' అన్న అంశాన్ని పరిశోధనకు తీసుకున్నారు. 2008లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ తీసుకున్నాను. కనపర్తి రచనపై పరిశోధన చేయడం నిజంగా నా అదృష్టం. పరిశోధనలో భాగంగా కవిగారిని, వారి మా మాతృమూర్తిని చాలా సార్లు కలిసాను. కనపర్తి తల్లితో మాట్లాడుతుంటే చాలా విషయాలు తెలుస్తాయి. పరాయి పాలనలో పడిన బాధలు ఆనాటి సాంఘిక జీవనం గూర్చి, కవి గూర్చి చాలా ఆసక్తికరమైన అంశాలు చెప్పేవారు. (ఆమె-2012లో 90 సంవత్సరాల వయసుస్సులో పరమపదించారు)

కనపర్తి తన సొంత ఇంట్లో జారిపడి వెన్నుముక దెబ్బతిన్నది. దాదాపు 10 నెలల కాలం మంచంలోనే ఉన్నారు. ఆ స్థితిలో కూడా కవితలు వ్రాసేవారు. ఇంట్లోనే చివరి రచన, తెల్లపావురాలు రచనను ఆవిష్కరించారు. చివరకు 2011 జూన్ 16వ తేది తన స్వగ్రామంలోనే పరమపదించారు. ఈ తెలంగాణ కవి అనేక రచనలు ఆముద్రితంగా ఉన్నాయి. అవి పూర్తిగా ముద్రితం అయ్యేలాగా తెలంగాణ రచయితల సంఘం తోడ్పడాలని ఆశిస్తున్నారు కనపర్తి అభిమానులు.

వచన కవితా వ్యాప్తి కోసం విశేషంగా కృషి చేసిన కవి కనపర్తి. ప్రచారాల ఆర్భాటాలు లేకపోవడం, ముఖ్యంగా వారి సాహిత్య కార్యక్రమాలకు వారి స్వగ్రామాన్నే (సిద్ధిపేట) వేదికగా ఎంచుకోవడంతో కనపర్తి గారికి రావలసినంత ఖ్యాతి రాలేదు. కనపర్తి 50 సంవత్సరాల కవితా ప్రస్థానంలో వారు స్పృశించని అంశం లేదు. వీరి రచనలపై బహుముఖీమైన పరిశోధన జరగవలసి వుంది. కీర్తి కాంక్షలేని ఆకు చాటు కోయిల కనపర్తి రామచంద్రాచార్యులు.

వారి రచనల్లో కొన్నింటిని ఇక్కడ ప్రస్తావిస్తున్నాను

వచన కవితా వ్యాసంగమే ఉద్యోగంగా 'ఆలోచనా వీచిక'లతో మొదలు పెట్టి 'గీతం నా సంకేతం'గా నిలిచి 'అక్షర శిల్పాలు' చెక్కి 'రాళ్ళలో రాగాలు' పలికించి 'వెలుతురు పూలు' పూయించి 'రాళ్ళు-ముళ్ళు' ఏరుకొని 'పిట్టగూడు' కట్టి 'నదీసుందరి'ని పల్కరించి 'కళ్యాణ రాగాలు' మ్రోగించి 'మౌనకోకిల'ను పల్కరించి 'మనిషి అక్షరమైతే' బాగుండునని 'హృదయం' 'ఆవిష్కారం' గావించి 'చినుకులు'లో తడిచి 'నగరంలో వెన్నెల'లో 'వ ృక్షదీపం' వెలిగించి 'సీతాకోకచిలుకలు' శుభోదయం పలుకగా 'కర్పూరహారతి' వెలిగించి 'దేవుడికి ఉత్తరం' వ్రాసి 'రసరేఖలు' మీటుతూ 'వసంతగీతం' అలపిస్తూ 'తెల్లపావురం' తన శాంతి సందేశంగా ఎగురవేసి నింగికెగిసిన 'అక్షరశిల్పి' అజరామరుడు, మానవతా మూర్తి మన కనపర్తి.

## 67 కాంచనపల్లి చినవెంకటరామారావు

– వేణు సంకోజు

కొందరి జీవితమంతా కలిపి ఒక పుట్టుక ఒక మరణం అనే రెండు తేదీలు అయితే కావచ్చును. కానీ యింకొందరి విషయంలో అట్లా పరిమితం కాని ఒక చరిత్ర అయి తీరుతుందది. ఈ రెండవ కోవకు చెందిందే శ్రీ కాంచనపల్లి చినవెంకట రామారావుగారి ఉనికి – ఈ నేల మీద. అయితే, రావుగారు సాధించిందేమిటి? డబ్బు, దస్కమైతే కాదు. ఒక స్ఫూర్తిదాయకమైన జీవితాన్ని స్వంతం చేసుకున్నారు. ఆ జన్మాంతం యువకుడిగా, చైతన్యశీలిగా కమ్యూనిస్టు – రాజకీయ నాయకుడుగా, సంఘసేవా పరాయణుడుగా రాణించారు. ఇక వీరన్నింటినీ మించ ఆపాదమస్తకం ఒక సాహిత్య కార్యకర్తగా, కవిగా, కథకుడిగా, విశ్లేషకుడిగా, ఉపన్యాసకుడిగా, తుదికంటా స్నేహశీలిగా భాసించారు. ఒక విద్యార్థిగానే నిరంతరం అభ్యుదయాన్ని ప్రచారం చేస్తూ వచ్చి, ఒక నిబద్ధత గల సేనానిగా పురోగమించారు.

1921 ఏప్రిల్ 10న జన్మించిన చినవెంకట రామారావు గారి స్వగ్రామం – నల్లగొండ సమీపం లోని పానగల్లు. హెచ్చెస్సీ వరకు ఉర్దూ మీడియంలోనే చదివారు. పరీక్షల కోసం హైదరాబాదుకు వెళ్ళిరాక తప్పలేదని ప్రత్యేకించి పేర్కొనవలసిన పనిలేదు. విద్యార్థి దశలోనే పత్రికలన్నా, జర్నలిజం అన్నా, మిక్కిలి అభి మానాన్ని పెంచుకున్నారు. "ప్రతాపరుద్ర ఆంధ్రాభాషా నిలయం" అన్న పేరుతో పానగల్లులోనే ఒక గ్రంథాలయాన్ని స్థాపించారు. కొన్నాళ్ళు ఒక లిఖితమాస పత్రికను కూడా వెలువరించారు. ఈ వ్యసనమే వీరిచేత "గోల్కొండ", "ఆంధ్రవాణి" మొ॥గు పత్రికల్లో వ్యాసాలను రాయించింది.

వివిధ సంస్థల్లో కార్యనిర్వాహకత్వం వహించడం, అనేక సంస్కరణలు – స్వాతంత్ర్య ఉద్యమాలకు ఆకర్షితు లవడం అనేవి కూడా విద్యార్థి దశలోనే జరిగాయి. ప్రతినిధిగా హాజరై, అతివాదులను సమర్థిస్తూ వచ్చారు. హైదరాబాదు సంస్థానంలో కాంగ్రెస్‌ను నిషేధించింది నిజాం ప్రభుత్వం. సహజంగానే రావుగారు నిషేధిత కాంగ్రెస్‌లో సభ్యత్వాన్ని కొనసాగిస్తూ వచ్చారు. కాంగ్రెస్ నిర్వహించే కార్యక్రమాలన్నింటిలో పాల్గొంటూ మామగారి ప్రోత్సాహంతో మంచి సోషలిస్టుగా ఎదిగారు. తపనను ఆపుకోలేక, బెజవాడకు వెళ్ళి ఖద్దరు బట్టలు కొనుక్కొని నాగపూర్‌లో 'వందేమాతరం' ఉద్యమంలో పాల్గొన్నారు.

ఏడవతరగతి చదువుతున్నప్పుడే వీరికి జానకమ్మ గారితో వివాహమైంది. పై చదువుల చదివించే శ్రద్ధను చూపలేకపోయారు – ఆనాటి పెద్దలు. ఉద్యోగం చేయక తప్పని పరిస్థితి అయ్యింది. చేస్తే గనుక, ఆ రోజుల్లో, నిజాం సర్కారు ఉద్యోగమే కదా చేయాలి? ఛస్ – వద్దనుకున్నారు. చెప్పాపెట్టకుండా సైకిల్‌మీద పడి హైదరాబాదుకు పారిపోయి 'లా'లో చేరినారు. అంతటితోనే ఆగక, కామ్రేడ్ అసోసియేషన్ సభ్యత్వాన్నికూడా సగర్వంగా స్వీకరించినారు.

'లా' చదువులకయ్యే ఖర్చులను భరించేందుకు ట్యూషన్లు కుదుర్చుకున్నారు చినవెంకటరామారావుగారు. నెలకు మూడురూపాయల వేతనం లభించేది. ఈ స్వల్ప ఆదాయంతోనే అటు 'లా' తరగతి ఫీజులు, యిటు తమ కాత్మీయమైన అధ్యయనానికి సరిపెట్టుకోవాలి. ఈ తక్కువ ఆదాయంతోనే శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయపు సభ్యత్వ చందానుకూడా కట్టగలిగారు. ఆ రోజుల్లోనే వీరికి కాళోజీ నారాయణరావు, కొండా లక్ష్మణ్ బాపూజీ గారలతో పరిచయం, సహవాసం కూడ కలిగినాయి. సరిగ్గా, ఆ రోజుల్లోనే రెండవ ప్రపంచయుద్ధం ప్రారంభం కావడమన్నది ఒక చారిత్రక యాదృచ్ఛికత. డబ్బులకోసం బాగా కటకటగా వున్నప్పటికినీ, అనుకున్న విధంగా, చరఖా కూడా కొనుక్కున్నారు రావుగారు. చరఖా సంఘం సభ్యులతో కలిసి ఆంధ్రమహాసభల్లో పాల్గొన్నారు. ఆ సభల్లో చురుకుగా పాల్గొంటూనే, దేవులపల్లి వేంకటేశ్వరరావుగారిని బలపరుస్తూ వచ్చినారు. 'లా' చదువుమీదికన్న ఉద్యమాలలో పాల్గొనడమంటేనే యిష్టంగా వుండేది వీరికి. అయినా, అశ్రద్ధ చేయక, 1941లో 'లా' పూర్తిచేసి ప్రాక్టీసును చేపట్టినారు.

భారత యూనియన్‌లో 'హైదరాబాదు సంస్థానం' విలీనం కావాలని కోరేవారిని కఠినంగా శిక్షిస్తూ వుండేది నిజాం ప్రభుత్వం. జీవితఖైదు, మరణదండనలు సాధారణమై పోయినవి. అయినా, పోరాటం అనేక రూపాలుగా విస్తరించింది. ఆ సందర్భంలో తన వంతు బాధ్యతగా కాంచనపల్లివారు తెలంగాణ విముక్తి ఉద్యమంలో అత్యంత చురుకుగా పాల్గొన్నారు.

తొలినాటినుండే చినవెంకటరామారావుగారు అన్యాయాన్నెదిరించే సాధుపైన అతివాది. రజాకార్లకూ, నిజాంకు వ్యతిరేకంగా పోరాటాన్ని కొనసాగిస్తూ, భూపోరాటాల్లో కీలకమైన పాత్రను పోషించారు. సం॥ర కాలంపాటు అజ్ఞాతవాసం చేశారు. కడలూరు, రాఘువెల్లూరు, వరంగల్ జైళ్ళలో దుర్భరమైన జీవితాన్ని గడిపినారు. జైల్లో వుంటూనే యితర ఖైదీలతో కలిసి మేడే జరిపినందుకు ప్రాణాలు పోయేంతటి తీవ్రమైన లాఠీదెబ్బలకు కూడా గురియైనారు.

కొన్నాళ్ళు వీరిని దంజను సెల్‌లో వుంచడం జరిగింది. అందులో ఒక వ్యక్తికి మాత్రమే చోటుంటుంది. ఎత్తు సరిపోనందున వంగి వుండాల్సి వస్తుంది. కాళ్ళు-చేతులు ఆడించడానికి వీలుండదు. అందులోనే మల-మూత్రవిసర్జన. ఆ నరకంలోవుంటున్న కాలంలో తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. నడుములు వంగిపోయి, జీవితాంతం ఆ నొప్పిని భరిస్తూ వచ్చినారు.

1952లో ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్ష బాధ్యతలను నిర్వహించిన రావుగారు, అదే సం॥ లో జరిగిన మొదటి సాధారణ ఎన్నికల్లో పాల్గొని 'చినకొండూరు' నియోజక వర్గం నుండి శాసనసభకు ఎన్నికైనారు. శాసనసభలో ఉపనాయకుడుగా వీరిని నియమించింది పార్టీ. 1962లో 'నల్లగొండ పంచాయతీ'కి పోటీ చేసి గెలిచారు. కానీ, అధికారుల ధనదాహం, ఆశ్రిత పక్షపాతం వంటివి ఆయనకు ఏ మాత్రం నచ్చలేదు. అప్పటి నుంచీ యిక కళ సాహిత్య సంస్కృతీ రంగాలలో తలమున్కలై తిరుగ నారంభించారు. ఎన్నికలలో పోటీ చేయడం విరమించినా, కమ్యూనిస్టు భావజాలంతో మమేకం చెందుతూ వచ్చారు.

1964లో కమ్యూనిస్టు పార్టీ విభజన జరిగిన సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులైన వీరిని జైళ్ళో పెట్టినారు. జైల్లో వుండగానే కుమారుడు - డా॥ ప్రభాకర్ పెళ్ళి సరోజతో (18 జూన్ 1964న) జరిగింది. పెళ్ళికి పెరోల్ మీద వారం రోజుల కోసం వచ్చి వెళ్ళినారు.

జైలు నుండి విడుదలై వచ్చిన పిదప, చినవెంకటరామారావుగారు సంపూర్ణంగా న్యాయవాదవృత్తిలో లీనమౌతూనే, ప్రవృత్తి పరమైన అంశాలు, సాహిత్యసంబంధ కార్యకలాపాల మీదనే కేంద్రీకరించారు. ఆ రోజుల్లో వారి ప్రోత్సాహంతో, నాటక రంగం, నల్లగొండలో మరింత బల పడటం జరిగింది. నాటకోత్సవాలకు సైతం తావేర్పడింది. ఔత్సాహిక కళాకారులనేకులకు ప్రోత్సాహం లభించింది. స్వయంగా రచనలు చేస్తూ, అచ్చువేస్తూ - వేయిస్తూ, రావుగారు అనేకమంది యువకులు, కళాకారులు, రచయితలను ఎంతో బాగా ప్రోత్సహించినారు. వీరి పర్యవేక్షణ, ప్రోత్సాహాలతోనే "యువ రచయితల సమితి" ప్రశంసనీయమైన కృషి చేస్తూ వచ్చింది. సంస్థ పక్షాన సంపుటులు, సంకలనాలూ వెలువడినాయి.

స్వయంగా కాంచనపల్లి వారు అచ్చువేసిన రచనల్లో 'అరుణరేఖలు' (గేయ సంపుటి), 'మా ఊళ్ళో కూడానా'

(కథల సంపుటి), 'మధుర స్మృతులు' (రష్యా పర్యటన అనుభవాలు) ముఖ్యమైనవి. వీరి యిల్లే ఒక సాహిత్యకేంద్రంగా, వీరు బ్రతికినంత కాలం విలసిల్లింది. వారానికో, పక్షానికో వీరింట యేదోవొక సాహిత్య కార్యక్రమం జరగవలసిందే. తేనీటి విందనేది వుండి తీరవలసిందే. సాహిత్యంతో పాటు రావుగారు – చిత్రకారులన్నా, చిత్రకళలన్నా ఎంతో అభిమానం చూపుతే, మిక్కిలి ప్రోత్సహిస్తూ వచ్చినారు.

చిన్న–చిన్న కార్యక్రమాలటుంచి వారు దేనికీ "చిన్న" కాదని నిరూపిస్తూ, అనేకానేక బృహత్ కార్యక్రమాలను చేపడుతూ వచ్చినారు. వాటిలో 1983లో జరిగిన 3వ జిల్లా రచయితల మహాసభలు, విశేషించి పేర్కొనదగినవి. మహాకవి శ్రీశ్రీ, రావిశాస్త్రి, గజ్జెల మల్లారెడ్డి, ఆవంత్స సోమసుందర్, అద్దేపల్లి రామమోహన రావు, శివారెడ్డి గారల వంటి అనేకమంది ఉద్ధండులైన కవులు, విమర్శకులు, కథకులు, నవలాకారులు మరియు ఉద్యమకారులు సైతం ఈ సభలకు విచ్చేశారు. వీరి కృషితో పొనగల్లులో ఒక మ్యూజియం ఏర్పాటు కావడమన్నది అత్యంత ఆనందదాయకమైన విషయం.

అంతా సజావుగా సాగుతున్నదనుకుంటుండగా 1992 మార్చి 13న చినవెంకట రామారావుగారు హఠాన్మరణం చెంది, అందరినీ దిగ్భ్రాంతికి లోనుగావించారు. ఆ విధంగా ఏర్పడిన లోటు యిప్పటికీ పూరింపబడలేదంటే అతిశయోక్తి కాదు.

# 68 కాపు రాజయ్య

– డా॥ సురభి వాణీదేవి

మానవుని హృదయం, అతని కోరికలు, అతని చుట్టూ ఆవరించిన సామాజిక స్థితిగతులు కళలో ప్రతిఫలించినట్లుగా మరిదేనిలోనూ ప్రతిఫలించవు.

రేఖలూ, వర్ణాలు చిత్రానికి శరీరమైతే, భావం చిత్రానికి ప్రాణం. చిత్రకారుని భావం చిత్రంలో పూర్తిగా వ్యక్తం కాకపోతే అది ప్రాణంలేని శరీరంలా వుంటుంది.

తెలంగాణ జీవన స్రవంతిని. శ్రమైక జీవన సౌందర్యాన్ని తన రేఖలతో, రంగులతో, సజీవం చేసిన చిత్ర కారుడు కాపు రాజయ్య. ఏప్రిల్ 7, 1925వ సంవత్సరంలో సిద్ధిపేటలో జన్మించిన రాజయ్య పూర్తి పేరు కాపు రాజయ్య. తండ్రి రాఘవులు చిరు వ్యాపారి. నిరుపేద కుటుంబం. 14 ఏళ్ళ వయస్సులోనే తండ్రిని పోగొట్టుకున్న రాజయ్యకు ఆ వూరి అబ్కారీ కాంట్రాక్టర్ మార్కం చంద్రయ్య గౌడ్ అండగా నిలిచారు.

పరిశీలన అనేది కళాకారుడి ముఖ్య లక్షణం. బాలుడైన రాజయ్య ఆ వూరిలోని కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, కంసాలి, నేత వృత్తుల వారిని శ్రద్ధగా గమనిస్తుండేవారు.

వీధి భాగవతాలు, పటం ద్వారా చెప్పే కథలు, హరి కథలు, తోలుబొమ్మలాటలు చూస్తున్న రాజయ్య స్టేజి డెకరేషన్, బ్యాగ్రౌండ్ కర్టెయిన్స్, ఆ కర్టెయిన్స్ మీద నాటకానికి తగ్గట్టు వేసిన సీన్స్ (ప్రకృతి, రాజదర్బారు, ఇల్లు) వంటి వాటిని పరిశీలించేవారు.

ఆ అనుభవంతో ఊళ్ళో జరిగే ఉత్సవ రథాలను, మొహర్రం, పీర్లకు అలంకరణ చేసేవారు. ఆ సమయంలో రాజయ్య వేస్తున్న చిత్రాలను చూసి, కుబేర్లు, నింబగిరి అనే స్కూలు టీచర్లు ఎంతో ప్రోత్సహించి గవర్నమెంటు డ్రాయింగ్ పరీక్షకు వారే ఫీజులు కట్టి వ్రాయించారు. 1943వ సంవత్సరంలో కుటుంబ సభ్యుల సహకారంతో హైదరాబాద్‌లోని సెంట్రల్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ మరియు క్రాఫ్ట్‌లో కళావిద్యాభ్యాసం ప్రారంభించారు.

అప్పటి స్కూల్ ప్రిన్సిపాల్ ఖాన్ బహదూర్ సయ్యద్ మహమూద్ దయతో కాలేజి వెనకున్న షెడ్‌లో రాజయ్య నివసించడానికి అనుమతి లభించినది. 1943లో సన్ కపూర్ అనే ఉపాధ్యాయుడు చార్ కోల్ బాక్స్ లేనందుకు తరగతి నుండి పంపించేశాడు. కానీ అదే సంవత్సరం క్లాస్ సెకండ్ వచ్చిన రాజయ్యను శభాష్ అంటూ మెచ్చుకొని అతన్ని అన్ని తరగతులలోకి తీసుకొనివెళ్ళి సీనియర్, జూనియర్స్‌కి పరిచయం చేసినాడు.

పట్టుదలతో, సృజనతో ఇంటర్‌మీడియట్ సర్టిఫికెట్ ఇన్ ఆర్ట్‌ను పొందిన రాజయ్యకు సంగారెడ్డిలో డ్రాయింగ్ టీచర్‌గా ఉద్యోగం దొరికింది. కానీ అంతటితో సంతృప్తి చెందక తిరిగి ఆర్ట్స్ కాలేజీలో 3 సంవత్సరాల డిప్లొమా కోర్సులో చేరి 1957వ సంవత్సరంలో సంవిధానం, చిత్రలేఖనం ప్రత్యేక పాఠ్యాంశాలు నేర్చుకున్నారు.

చిత్రకళా విద్యార్థిగా రాజయ్య చాలా చురుకుగా ఉండేవారు. మొదటి రెండు సంవత్సరాలు రెండవ వానిగా వచ్చినా, చివరి సంవత్సరంలో కళాశాల ప్రథముడుగా వచ్చారు. ఆయన అధ్యాపకులలో ముఖ్యులు జలాలుద్దీన్. ఆయన బొంబాయి జె.జె. స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ విద్యార్థి. అజంతా గుహ చిత్రాలకు (ప్రతికృతులను) రెప్లికాలను చేయడంలో ప్రసిద్ధులు. 1945వ సంవత్సరంలో రాజయ్యకు ఉపకార వేతనం వచ్చేలా సహకరించిన వారిలో ముఖ్యులు. నెలకు 5 రూపాయల ఉపకార వేతనంతోబాటూ సైన్‌బోర్డులు వేస్తూ చదువుకున్నారు.

రాజయ్య చిత్రకళ లాగానే దేశాన్ని, తన ప్రాంతాన్నీ ఎంతో ప్రేమించారు. సంగారెడ్డిలో మహంకాళి నారాయణగారు స్వాతంత్రోద్యమ కాలంలో ప్రత్యేక దళాన్ని ఏర్పాటు చేసారు. ఈ దళ కార్యకలాపాల్లో రాజయ్య కూడా పాల్గొన్నారు. ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో పోలీసులపై జరిగిన దాడిలో రాజయ్య పాల్గొని నేను సైతం అంటూ తనవంతు దేశభక్తిని చాటుకున్నారు.

డిప్లొమా చేతికొచ్చిన తర్వాత ఆయన తన స్వగ్రామమైన సిద్ధిపేటలో డ్రాయింగ్ టీచర్‌గా నియమితు లైనారు. అప్పట్లో నెలకు 60 రూపాయల జీతం ఉండేది. 30 సంవత్సరాలపాటు అక్కడే పనిచేసి రిటైర్ అయ్యారు. 1964లో సిద్ధిపేటలో లలిత కళాసమితిని స్థాపించి వ్యవస్థాపక అధ్యక్షులుగా సేవలందించారు.

ఆధునిక చిత్రకళలో సొంత గొంతు వినిపిస్తున్న రాజయ్య గారు వేసిన "బోనాలు" చిత్రాన్ని ఎ.ఎస్. రామన్ వ్రాసిన యువ చిత్రకారులు అంటూ వారిమీద రాసిన వ్యాసాన్ని "లండన్ స్టూడియో మ్యాగజైన్" పత్రిక ప్రచురించింది. రాజయ్య వేసిన చిత్రాలు 1950 – 1960లలో "ద ఇలస్ట్రేటెడ్ వీక్లీ, ధర్మ యుగ్" వంటి పత్రికలలో ముఖ చిత్రాలుగా వచ్చి ప్రజాదరణని పొందాయి.

1953లో "గృహ ప్రశంస" అనే చిత్రానికి హైదరాబాదు ఆర్టు సొసైటీ వారిచే "ఉదాత్తప్రశంస" లభించింది. 1954వ సంవత్సరంలో వారి చిత్రం "మూలకారిణి" కి మైసూరు అఖిల భారత చిత్రకళా ప్రదర్శనలో తృతీయ బహుమతి లభించింది. దీనిని ఒక అమెరికన్ కొనుగోలు చేయగా, "కోలాటము" అన్న చిత్రాన్ని రష్యన్ ప్రభుత్వం కొనుగోలు చేసింది. అలా 1954 నుంచే రాజయ్య గారికి దేశ వ్యాప్తంగా మంచి గుర్తింపు వచ్చింది. బొంబాయి, కలకత్తా, పాట్నా, గుంటూరు, ఢిల్లీ, అమృత్‌సర్, గ్వాలియర్, త్రివేంద్రం లాంటి ముఖ్యమైన పట్టణాలలో ఆయన చిత్రాలు ప్రదర్శింపబడ్డాయి.

1956వ సంవత్సరంలో 'ఇలస్ట్రేటడ్' వీక్లీలో ముఖ చిత్రంగా వచ్చిన "దుర్గ" త్రివర్ణ చిత్రాన్ని, మహారాజ్ హిందూర్ హోల్కర్ 500 రూ॥ ఇచ్చి కొనుగోలు చేసారు. రాజయ్య తొలి చిత్రాలు ప్రాచ్య విధానంలో అనగా 'వాష్' పద్ధతిలో చిత్రించబడ్డాయి.

తరువాత "నకాషీ" చిత్రకారుల అద్భుతమైన టెక్నిక్‌ను 'టెంపరా' రంగుల వాడకం మొదలుపెట్టాడు. ఇరవైఏళ్ళపాటు అంటే... 1950 నుంచి 1970 వరకు కాగితం మీద, అట్టలమీద, ప్లైవుడ్ మీద, గుడ్డల మీద కూడా టెంపరా చిత్రాలను చిత్రించాడు.

తెలుగు బొమ్మల బ్రహ్మగా ఎ.ఎస్. రామన్‌తోపాటు కీర్తించబడిన రాజయ్య తన చిత్రాలకు, అజంతా, లేపాక్షి చిత్రాలే ప్రేరణ అనేవారు. ఆయన శైలి కళా శైలిగా పేర్కొనవచ్చు. చిన్నప్పటినుండే గ్రామంలోని అన్ని కులాల జీవనశైలి పరిచయం ఉన్నందున... ఆయన చిత్రాల్లో సమిష్టి జీవనశైలి, పనిపాటలు, పండుగలు, పబ్బాలు కనిపిస్తాయి. అదృష్టవశాత్తూ పత్రికలు మొదలైన ప్రచార సాధనాల నుంచీ, కళావర్గాల నుంచీ మంచి ఆదరణ లభించింది.

రాజయ్యది అబ్‌స్ట్రాక్ట్ (Abstract) సాంప్రదాయం ప్రతీకాత్మకం కలగలిసి రాజయ్య గారికే వ్యక్తిగతమైన ఓ ప్రత్యేకశైలిగా రూపొందింది. అతని చిత్రాలలో నిజాయితీ కనిపిస్తుంది. అతను నమ్మిన, గౌరవించే అంశాలనే చిత్రించేవారు. తనకు సహజంగా అబ్బిన 'కళా' భాషలో తనను తాను సాంప్రదాయంగా ఆవిష్కరించుకొన్నారు. ఏడుకొండల వెంకన్న, శివుడు, ఇతివృత్తాలను ఎంతో పవిత్రంగా వాస్తవిక, ప్రతీకాత్మక దృష్టిని మేళవించి చిత్రించారు. 1993వ సంవత్సరంలో జె.ఎన్.టి.యు. యూనివర్శిటి, హైదరాబాదు వారిచే గౌరవ డాక్టరేటు, కళా ప్రవీణ బిరుదు పొందారు. తెలుగు విశ్వ విద్యాలయం విశిష్ట

పురస్కారంతో ఆయనను సన్మానించింది 1998 నుంచీ శ్రీ వెంకటేశ్వరా కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ అడ్వయిజరీ సభ్యులుగా వ్యవహరించిన రాజయ్య గారికి బిరుదులు, పురస్కారాలు లెక్కకు మించి వున్నాయి. ప్రపంచంలోని అన్ని ముఖ్య దేశాలను పర్యటించిన రాజయ్యగారు నిరాడంబరుడు, స్నేహశీలి. ఆయన ''కుంచె పదాలు'' అనే వచన సంకలనంలో కవితలు విశేష ఆదరణకు నోచుకున్నాయి.

"ఆ అంటే అనురాగం
'మ' అంటే మమకారం
అనురాగం + మమకారం = అమ్మ
అమ్మకమ్మదనం చెప్పలేదు బ్రహ్మ
అందుకే కనిపెంచే తల్లిదండ్రులు
కనిపించే దేవతలు" అన్న కాపు రాజయ్య గారి చిత్రాలు అజరామరాలు.

# 69 కాటం లక్ష్మీనారాయణ

**– ఆచార్య వెలుదండ నిత్యానందరావు**

శ్రీ కాటం లక్ష్మీనారాయణ గారు కాలంచేసి అప్పుడే ఏడేళ్లు గడిచిపోయాయి. గుండ్రటి ముఖం, ఎత్తైన మనిషి, ఖద్దరు తప్ప మరొకటి ఏనాడు దాల్చని నియమవ్రతుడు. ఇందిరాగాంధీతో సహా ఎంతటివారినైనా సరే ఢీకొట్టగల సాహసి. మంత్రులు, అధికారులు అందరూ సన్నిహితులే. అయినా ఏనాడు పదవుల కోసం, ప్రాపకాల కోసం వాడుకోని నిస్వార్థ శీలి. ఎన్నేళ్లు జీవించారు అని కాదు.. ఎన్ని మంచిపనులు చేశారన్నదే జీవితానికి ప్రాతిపదిక. అయితే 86 ఏళ్ల నిండు జీవితాన్ని కాటం లక్ష్మీ నారాయణ అనుభవించారు. 86కు మించిన మైలురాళ్ల నధిగమించిన మంచిపనులు సమాజోపయోగకరమైన, స్ఫూర్తిమంతమైన పనులు చేశారని చెప్పవచ్చు. జీవిత సార్థక్యానికి ఇంతకంటే కావలసింది ఏముంది..?

స్వాతంత్ర్యోద్యమ కాలంలో సాహసేపోతంగా ఉద్యమాలు నిర్వహించారు. జైలుకు వెళ్లారు. స్వాతంత్ర్యానంతరం ఏ చిన్నపాటి పదవుల కోసమైనా పాకులాడకుండా ఎన్నెన్నో పెద్దపెద్ద సభలు నిర్వహించి స్ఫూర్తిని నిలిపారు. స్వాతంత్ర్యోద్యమ చరిత్రను భావితరాలకు అందించాలని ఆరాటపడ్డారు. సంపుటాల రూపంలో ముద్రింపజేశారు. స్వాతంత్ర్యోద్యమ వీరులు చివరి దశలో కష్టపడకుండా పింఛను సౌకర్యాన్ని కల్పించడంలో చురుకైన పాత్ర పోషించారు. ఒక్క మాటలో చెప్పాలంటే తాము చేపట్టిన ఏ పనినైనా అంతుచూసే దాకా వదిలిపెట్టని దృఢవ్రతులు కాటం లక్ష్మీనారాయణ.

1924 సెప్టెంబర్ 19న రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో లక్ష్మయ్య, సత్తెమ్మ దంపతులకు జన్మించిన లక్ష్మీనారాయణకు అనువంశికమైన యాదవుల ధైర్య సాహసాలు, నిర్భయశీలం అలవడ్డాయి. కాటమరాజును వంశ మూలకర్తగా భావించే వారిలో ఆ నిర్భయశీలం ఉండటంలో ఆశ్చర్యపోవలసినది ఏమీలేదు. తాతగారు కాటం నారాయణ స్థానిక జమిందారుల అకృత్యాలను, సామాజిక దురాచారాన్ని ఎదిరించి.. బహుజనులను ఐక్యపరిచి సహాయ నిరాకరణ చేయించిన ధీరుడు. తాతగారి పేరు పెట్టుకున్నందుకు కాబోలు ఈ మనవడికి కూడా తాతగారి లక్షణాలన్నీ అక్షరాలా అబ్బాయి.

1942 అక్టోబర్ 12న బూర్గుల రామకృష్ణారావు హైదరాబాద్ చాదర్‌ఘాట్ విక్టరీ ప్లే గ్రౌండ్‌లో సత్యాగ్రహం చేయడానికి సమాయత్తమయ్యారు. బూర్గుల వారు 'మహాజనులారా...' అని కంఠమెత్తగానే పోలీసులు లాఠీ ఝుళిపించారు. సభలోని వారంతా భయంతో చెల్లాచెదురయ్యారు. 19 ఏళ్ల కాటం లక్ష్మీనారాయణ స్థిరంగా నిలబడి నినాదాలు చేశారు. బూర్గుల వారితో పాటే లక్ష్మీనారాయణను అరెస్టు చేశారు. ఆనాటి నుంచి లక్ష్మీనారాయణ బూర్గుల రామకృష్ణారావును గురువుగా భావించారు. ఈ గురుశిష్యుల అనుబంధం చివరిదాకా కొనసాగింది. ప్రభుత్వ నిషేధాజ్ఞలను ఉల్లంఘించినందుకు గాను లక్ష్మీనారాయణకు ఏడేళ్ల జైలుశిక్ష వేసి చంచలగూడ జైలుకు పంపించారు. ఆ జైల్లో స్థానిక నాయకులెందరో

ఉన్నారు. వారి అనుభవాల సారాన్ని లక్ష్మీనారాయణ గ్రహించారు. తమను తాను మలుచుకున్నారు. ప్రతికూలమైన పరిస్థితుల్లో సైతం బెంబేలు పడిపోయి.. నీరుగారిపోకుండా వాటిని తమకు అనుకూలంగా మలుచుకోగలిగే స్థిరచిత్తం, సంయమన శీలం లక్ష్మీనారాయణకు ఆ జైలు జీవితం నేర్పింది. జైలు నుంచి తిరిగి వచ్చాక 'లా' పూర్తిచేసి బూర్గుల వారివద్దనే జూనియర్ లాయర్‌గా చేరారు. బూర్గుల వారి కార్యక్రమాలన్నింటిలోనూ చేదోడువాదోడుగా లక్ష్మీనారాయణ నిలిచారు. ఆంధ్ర మహాసభ కార్యకలాపాల్లో క్రియాశీలక పాత్ర వహించారు.

రాజకీయ ఉద్యమాలో కాక దళిత జనోద్ధరణం, ఖాదీ ప్రచారం, హిందీ వ్యాప్తి లాంటి సమకాలీనమైన సంస్కరణ కార్యకలాపాలకు స్పందించారు. నిజాం ప్రభుత్వ ఆజ్ఞను ఉల్లంఘించి హిందీ పాఠశాలను స్థాపించారు. పోలీసులు దాన్ని చట్టవిరుద్ధమైనదిగా ప్రకటించారు. లక్ష్మీనారాయణ తదనంతర కాలంలో హిందీ ప్రతిష్ఠాన్ సంస్థకు మేనేజింగ్ ట్రస్టీగా వ్యవహరించడానికి హిందీ మాతృ భాష గానీ, దక్షిణ భారత హిందీ రచయితల సమ్మేళనాలు బెంగుళూరు, చెన్నై, త్రివేంద్రం, గోవా లాంటి నగరాల్లో ఘనంగా నిర్వహించడానికి బీజాలు పడింది ఇక్కడే. ప్రముఖ గాంధేయవాది స్వర్గీయ రామకృష్ణదూత్ 1946లో ఆజన్మాంతం ఖద్దరునే ధరిస్తామని 120 మంది యువకుల చేత చేయించిన ప్రతిజ్ఞలో లక్ష్మీనారాయణ గారున్నారు. ఆనాటి నుంచి ఖద్దరు ధరించారు.

ఆచార్య ఎన్.జి.రంగా ప్రేరణతో 1945లో లక్ష్మీనారాయణ హైదరాబాద్ యువజన కాంగ్రెస్‌ను స్థాపించి భాయి రామ్మూర్తి నాయుడిని అధ్యక్షునిగా చేసి తాను ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. దీన్ని బ్రిటిష్, ఆంధ్ర పత్రికలు ప్రముఖంగా ప్రచురించాయి. ఉర్దు పత్రికలు మాత్రం యువకుల్ని చదువుకోనీయకుండా రాజకీయాల్లోకి దించుతున్నారంటూ ఆడిపోసుకుంటే.. ఆంధ్ర పత్రికలు, తెలుగు పత్రికలు ఘనంగా ప్రశంసించాయి. బూర్గుల లాంటి పెద్దలు వెలిగిస్తున్న చైతన్య జ్యోతి మసకబారిపోకుండా, వారు సత్యాగ్రహాలు నిర్వహించి జైలుకు పోయినపుడు స్తబ్దత ఏర్పడకుండా కాటం లక్ష్మీనారాయణ యువజన కాంగ్రెస్ కృషిచేసింది. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. నిజాం రాజ్యానికి మాత్రం విముక్తి లభించలేదు. బూర్గుల వారు, కాటం వారు ప్రపంచ నాయకుల దృష్టికి దీనిని తీసుకువచ్చి వారి సహకారాన్ని, సానుభూతిని పొందాలనుకున్నారు. 1947 ఆగస్టు 15 ఇరువురు మద్రాసు (చెన్నై) రష్యా, అమెరికా, ఫ్రాన్స్, ఇంగ్లండ్ నేతల నుంచి నైతిక సహకారాన్ని అభ్యర్థిస్తూ టెలిగ్రాములు ఇచ్చారు. ఇది తెలుసుకున్న నిజాం ప్రభుత్వం హైదరాబాద్ లో కాలుపెట్టిన మరుక్షణం గురుశిష్యులిద్దరిని అరెస్టు చేసింది.

జైల్లో ఉన్నప్పుడు బూర్గుల కె.వి.రంగారెడ్డి, కాశీనాథుని వైద్య లాంటి నాయకులతో ఏదోరకంగా రాజీపడాలని నిజాం ప్రభుత్వం ఓ ఎత్తుగడ వేసింది. 22 వేలమంది చావుబతుకులకు తెగించి జైళ్లలో ఉంటే రాజీ ప్రతిపాదనలా..? ఇది ఉద్యమ స్ఫూర్తికే కళంకం అని యువ ప్రతినిధి అయిన కాటం లక్ష్మీనారాయణ లేఖలు రాయడంతో ఆ ప్రతిపాదనకు గండి పడింది. కాటం లక్ష్మీనారాయణ జైల్లో ఉన్నంతకాలం వారి కుటుంబ పోషణ కోసం కె.వి.రంగారెడ్డి నెలకు 15 రూపాయలు ఇచ్చేవారట. కె.వి.రంగారెడ్డి గారికి లక్ష్మీనారాయణ అంటే అంత అభిమానం. కాస్త వయసులో పెద్దవారైన మర్రి చెన్నారెడ్డి గారితోనూ లక్ష్మీనారాయణకు అంతే సాన్నిహిత్యం ఉండేది. మర్రిచెన్నారెడ్డి, లక్ష్మీనారాయణ ఒకే సైకిల్ ఎక్కి హైదరాబాద్‌లో చక్కర్లు కొట్టేవారట.

1947 మే నెల 11న పెళ్లి చేసుకున్న లక్ష్మీనారాయణ నాలుగు నెలలకే మళ్లీ అరెస్టయ్యారు. ఇలాగ పోలీసుల యాక్షన్ జరిగేదాకా అంటే 1948 సెప్టెంబర్ దాకా జైలుకు వెళ్లడం తిరిగి రావడం, మళ్లీ జైలుకు వెళ్లడం మళ్లీ తెరిగి రావడం అన్నది లక్ష్మీనారాయణ జీవితంలో చాలా మామూలు విషయమైపోయింది. ఆంధ్రప్రదేశ్ అవతరణానంతరం మంత్రి పదవుల కోసం పాకులాడకుండా ఆర్థిక, సాంఘిక, వైజ్ఞానిక రంగాల్లో రాష్ట్ర పునర్ నిర్మాణం కోసం 1949 డిసెంబర్‌లో 'జనత' పేరుతో ఉర్దూలో వారపత్రికను ప్రారంభించారు. 1945-46లలో మందుముల రామచంద్రారావు స్థాపించిన 'రయ్యత్' పత్రికలో పనిచేసిన అనుభవం లక్ష్మీనారాయణకు ఈ సందర్భంలో ఉపకరించింది. రజాకారుల చేతిలో హతుడైన పోయ 1952లో రాష్ట్ర కర్షక సంఘం స్థాపించారు. ఎస్.బి. చౌహాన్ లాంటి మేటి నాయకులు ఈ సంఘం కార్యవర్గ సభ్యులుగా ఉండేవారు.

తెలుగు భూమి అనే మరో పత్రికను 1969లో ప్రారంభించారు. 1969 నాటి ప్రత్యేక తెలంగాణ నాటి ఉద్యమ సమయంలో చాలామంది రచయితలు, నాయకుల లాగానే సమైక్యవాదిగా నిలిచారు. ప్రభాకర్ జీ లాంటి సర్వోదయ మండలి ఆచార్యుల ఆశీస్సులతో సర్వోదయ సాహిత్య ప్రచారాన్ని, భూదానోద్యమ కార్యక్రమాలను వ్యాపింపజేశారు. ఇప్పటికీ సర్వోదయ మండలి భూదానోద్యమ సంస్థలు తమ కార్యక్రమాలను నిర్విఘ్నంగా కొనసాగిస్తు న్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు అకాడమి లాగా హిందీ అకాడమీ ఉండాలని చెప్పి ప్రభుత్వం చేత ఏర్పాటు చేయించి దానికి ఉపాధ్యక్షులయ్యారు. హిందీ పుస్తక ప్రచురణలకు ఆర్థిక సాయం, రచయితలకు శిక్షణ శిబిరాలు నిర్వహింపచేశారు.

ఒక దశలో రాష్ట్ర హైకోర్టు 1968లో వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు చెల్లవని తీర్పు ఇచ్చింది. రాష్ట్రంలో ఉన్న బడుగు, బలహీన వర్గాల నాయకులందరినీ ఒక వేదిక మీదకు తీసుకువచ్చి... ఒక కార్యవర్గాన్ని ఏర్పరచి దానికి కాటం లక్ష్మీనారాయణ కన్వీనర్ అయి సుప్రీంకోర్టుకు వెళ్లి హైకోర్టు తీర్పు రద్దుచేయించారు. ఈ సందర్భంలోనే లక్షలాది మంది వెనుకబడిన కులాలను సమీకరించి ఒక మహాసభ నిర్వహించారు. దానికి సాక్షాత్తు ప్రధానమంత్రి ఇందిరాగాంధీ వచ్చారు. కాటం వారు సాధించిన ఘన విజయాల్లో ఇది ఒకటి.

దేశ స్వాతంత్ర్యోద్యమంలో అన్నివిధాల త్యాగాలు చేసిన దేశభక్తులకు వరం లాంటిది స్వాతంత్ర్య సమరయోధుల పెన్షన్ పథకం. ఈ పథకాన్ని హైదరాబాద్ వారికీ వర్తింపజేయాలని కేంద్రప్రభుత్వంతో లక్ష్మీనారాయణ గారు చర్చలు జరిపారు. మొదట కేంద్రప్రభుత్వం అంగీకరించ లేదు. మరుసటి రోజు కాటం లక్ష్మీనారాయణ తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధుని సత్యాగ్రహం అనే అట్టను మెడకు తగిలించుకుని ప్రధాని నివాసం ముందు నిరాహారదీక్ష చేశారు. ఢిల్లీ పత్రికలు దీన్ని ప్రముఖంగా ప్రచురించాయి. ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ లక్ష్మీనారాయణను పిలిపించుకుని ఏమిటి సంగతి అని వివరాలు అడిగారు.

సంస్థానాల్లోని స్వాతంత్ర్య సమరయోధులను మీరు గుర్తించకపోవడం కన్నా మాకు అవమానం ఏమున్నది..? బ్రిటిష్ ఆంధ్ర నాయకులు ఒక బ్రిటిష్ వారిమీదనే పోరాడారు. కానీ సంస్థానాల వారు అటు సంస్థానాధిపతులకు వ్యతిరేకం గాను, ఇటు బ్రిటిష్ వారికి వ్యతిరేకం గానూ పోరాడారు. 15 ఆగస్టు మాకు స్వాతంత్ర్య దినం వచ్చినట్టు కాదా ! హైదరాబాద్ విముక్తి జరిగిన సెప్టెంబర్ 17ను స్వాతంత్ర్య దినంగా జరుపుకోమంటారా ? ఒక్క హైదరాబాద్ సంస్థాన ప్రజలే కాదు... అసలు సంస్థానాల ప్రజలు భారతీయులు అవునా.. కాదా... ప్రకటించండి అని సూటిగా, ధైర్యంగా కాటం లక్ష్మీనారాయణ ఇందిరాగాంధీని ప్రశ్నించారు. దీంతో 22 వేలమంది స్థానిక స్వాతంత్ర్య సమరయోధులకు పెన్షన్ సౌకర్యం లభించింది.

లక్ష్మీనారాయణ గారు చేసిన మహత్తర కృషి హైదరాబాద్ స్వాతంత్ర్య చరిత్రను ప్రామాణిక పద్ధతిలో గ్రంథస్తం చేయించే కృషిచేపట్టారు. ఆ ప్రమాణికలో వచ్చిందే వెల్దుర్తి మాణిక్యాల రావు గారి 844 పేజీల హైదరాబాద్ స్వాతంత్ర్య సమర చరిత్ర. ఇది ఇప్పటికీ ప్రామాణిక గ్రంథం. చాలా పెద్దఎత్తున సభలను ఒక్కచేతి మీదుగా నిర్వహించడం లక్ష్మీనారాయణ గారి గొప్పతనాల్లో ఒకటి. హైదరాబాద్ స్వాతంత్ర్యోద్యమ చరిత్రను హైదరాబాద్‌లో అప్పటి రాష్ట్రపతి జైల్‌సింగ్ చేత ఆవిష్కరింపజేశారు. కాటం లక్ష్మీనారాయణ గారి కుమారులు ప్రముఖ లాయర్ కాటం రమేష్ రాసిన ఆంధ్రదేశ స్వాతంత్ర్య చరిత్రను 1992 భారత స్వాతంత్ర్య స్వర్ణోత్సవాల సందర్భంగా హైదరాబాద్‌లో ఆవిష్కరింపజేశారు.

పి.వి.నరసింహారావు, టి.అంజయ్య, కాసు బ్రహ్మానంద రెడ్డి, భవనం వెంకట్రావు నలుగురు ముఖ్యమంత్రులతో ఒక పెద్ద సభ నిర్వహించారు. కాటం లక్ష్మీనారాయణ నిర్వహించిన సభల్లో ప్రధానమంత్రులు, రాష్ట్రపతులు, పీఠాధిపతులు, స్వాతంత్ర్య సమర యోధులు, దలైలామా లాంటి వారి ఎందరో పాల్గొనేవారు.

తన కోసం వీసమాత్రమైనా అడగకపోవడం, సర్వజన శ్రేయస్సు కోసం, విలువల కోసం ఎంతటి వారినైనా నిర్మొహమాటంగా విమర్శించడానికి వెనుకంజ వేయక పోవడం కాటం లక్ష్మీనారాయణ గారి వ్యక్తిత్వంలోని ప్రధాన గుణం. 86 ఏళ్ల పరిపూర్ణ జీవితం గడిపి 25 ఫిబ్రవరి, 2010న అస్తమించారు. అలాంటి వారిని స్మరించుకోవడం స్ఫూర్తిదాయకం.

# 70 కేశనకుర్తి వీరభద్రాచారి

– కందాళై రాఘవాచార్య

శ్రీ. శే. కేశనకుర్తి వీరభద్రాచారి అనగానే నిజామాబాద్‌లో అన్ని కళల కేంద్రబిందువు అని ప్రతివారూ స్మరించాల్సిందే! ఆరడుగుల మనిషి – నల్లని కోటు టై – పొడుగాటి పాతకాలం హీరోలు గుర్తుకు వచ్చే ప్యాంటు నడిమ పాపిట, పొడుగాటి వెంట్రుకలు. చేతిలో ఐదారు పుస్తకాలు! టకటక బూట్లు చప్పుడు వరండాలో! అదిగో చారి సార్ వస్తున్నారు! కాలేజీ విద్యార్థులంతా ఆంగ్ల పాఠం కోసం ఎదురు చూస్తున్న క్షణానికి శుభ సూచకం ఆయన ఆగమనం. గిరిరాజ కాలేజీలో వృత్తిరీత్యా ఆంగ్లో పన్యాసకుడిగా ఉన్నా – ఆయన ప్రవృత్తి రీత్యా తెలుగునాట ప్రసిద్ధిపొందారు.

ఎక్కడో భీమవరంలో నివసించి ఉద్యోగరీత్య ఇందూరుకు వచ్చి ఈ జిల్లాను సకళ కళామయంగా పూర్ణ చంద్రుడి వెన్నెల వేదికగా తీర్చిదిద్దారు చారి సార్!

ఉషశ్రీ – వీరభద్రాచారిగారు కలిసి రాసిన వేంకటేశ్వర కళ్యాణం అప్పటి కళాశాల విద్యార్థులకు తెలుగు ఉపవాచకమైంది. వేదికపై నాటకమైంది. ఇలాంటి సకళ కళల సమాహారమైన కేశనకుర్తి వీరభద్రాచారిసార్ 14-05-1927 శ్రీకాకుళం జిల్లా 'కొర్ని'లో కేశనకుర్తి అప్పారావు, వరహాలమ్మ దంపతులకు జన్మించారు. మాతో అప్పుడప్పుడు చెప్పేవారు – 12వ యేటనే అనేక నాటికలు రాసి వేసేవాళ్ళమని! అవి రాతప్రతులే ఐనాయిగాని అచ్చు ప్రతులు కాలేదని చింతించేవారు. 1969 సంక్రాంతి 14న నిజామాబాద్‌లో గొప్ప కవుల వేదిక అవతరించింది. ఈ మకర సంక్రాంతి శుభవేళ ఇందూరులో సాహితీ వికాసం! సరికొత్త ఉదయం! దీనికి అంకురార్పణ వేసింది కేశనకుర్తి వీరభద్రాచారిగారే! ఈ సంస్థ పేరే 'ఇందూరు భారతి రచయితల సమాఖ్య'.

వీరికి చేదోడు వాదోడుగా సైబ పరంధాములు, ఆపుకారి సూర్యప్రకాశ్, బద్దూరి మొదలగు యువకిశోరాలు చారిగారిని అనుసరించారు.

ఆయనకు ఆలోచన రావడం వేమందరం అమలుపరచడం జరిగిపోయేవి!

ఇందూరు భారతి ఆవిర్భావం తరువాత అనేకులు కలం పట్టి కవులైనారు – కవయిత్రులైనారు! గొప్పవాళ్ళను ఆహ్వానించి వారితో ప్రసంగాలు ఇప్పించి యువకులకు ప్రేరణ అందేలా చారి సార్ ప్రణాళిక రచించేవారు.

దాశరథి కృష్ణమాచార్య, బెజవాడ గోపాలరెడ్డి దేవులపల్లి రామానుజారావు, జగ్గయ్య, నండూరి రామకృష్ణమాచార్య, నార్ల చిరంజీవి, వానమామలై వరదాచార్యులు, సి.నా.రె. ఇలాంటి పెద్దలను ఆహ్వానించి ఇందూరు భారతిని సుప్రసిద్ధం చేశారు.

కవిత్వమే కాకుండా గానం నాట్యం కోసం 'సరస్వతీ గానసభ'ను ప్రారంభించారు. అనేకమంది అమ్మాయిలు

ఇంటింటా నాట్యసరస్వతులు, గానకోకిలలూ ఐనారు. సాయంత్రం బాలవిహార్ పిల్లలతో సందడి సందడిగా ఉండేది.

విడివిడిగా అనేక నాటిక సంస్థలు ఎవరికివారే అన్నట్లుగా ఉండేవారు. వీరభద్రాచారి గారి సలహాల మేరకు అన్ని నాటక సంస్థలు ఒకటై 'నగరనట సమాఖ్య'గా ఒక్కటైనారు. ఈ సమాఖ్య నేపథ్యంలో చారి సార్ విశాల హృదయం ప్రగతి ఆలోచనలే కారణం.

ఈ సంస్థ ద్వారా అనేక నాటకాల పోటీలు నిర్వహింప జేసి – గొప్ప నటులను ఆహ్వానించి ఇందూరు పేరు తెలుగు నాట సుప్రసిద్ధం చేశారు.

గానసభ ద్వారా శోభానాయుడు నరసింహాచారి, వసంత. ఈమని శంకరశాస్త్రి చిట్టిబాబు పర్విన్ సుల్తానా వంటి సుప్రసిద్ధులను ఆహ్వానించి నిజామాబాద్‌ను రాయల యుగంగా మార్చారు.

సాహితీ కళాసంస్థలలోనే కాకుండా సేవాసంస్థలైన Lions, Lio మొదలైన క్లబ్బుల ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహింపజేసేవారు. యువకులందరికి ఆంగ్లం ఎలా మాట్లాడాలో శిక్షణ సైతం ఇచ్చేవారు.

వేదికపై వ్యాఖ్యానం ఎలా చేయాలో, కవిత్వం ఎలా చదవాలో, వేదిక మంగళాచరణ గీతం నుండి వందన సమర్పణ వరకు ఎట్టి మెలుకువలు ఉపయోగించాలో ఇవన్నీ యువతకు నేర్పించి గొప్ప కవులుగా నటులుగా గాయకులుగా తీర్చిదిద్దారు.

అప్పటి సాహిత్య అకాడమిలో దాదాపు తన జీవిత కాలము సభ్యుడిగా ఉండి నిజామాబాద్‌కు ఎనలేని సాహిత్య సాంస్కృతిక సేవలనందించారు.

తాను ఎన్నో కవితలు పద్యాలు రాసినా అవి అచ్చుకు నోచుకోలేదని, అలాంటి స్థితి యువతకు ఉండకూడదని ఇందూరు భారతి ద్వారా వెలుగులోకి, నగ్న చిత్రాలు, ప్రతి సంవత్సర సావనీర్లను ప్రింటు చేయించారు.

24 గంటలలో దాదాపు అర్ధరాత్రి దాటేవరకు బిజీగా ఉండేవారు. మళ్లీ ఉదయమే ఇంగ్లీషు ట్యూషన్స్ చెప్పేవారు.

అప్పుడప్పుడు కవిత్వం సామాన్య జనానికి అందాలని రాత్రిపూట గ్రామాల్లో కవిసమ్మేళనం నిర్వహించేవారు. కంజర్ల బోర్గాం ముబారక్‌నగర్, మొదలైన గ్రామాల్లో అందరూ భోంచేసి వచ్చిన తరువాత కవిత్వం వేదిక ప్రారంభమయేది. అందరు కవులు సామాన్య జనానికి అర్థమయేలా ఉన్నా కవిత్వాన్ని అందించేవారు. ఈ కవి సమ్మేళనం దాదాపు అర్ధరాత్రి దాటిపోయేది. ఇలాంటి స్ఫూర్తి కలిగించింది చారి సారే.

ఇంతేగాక పున్నమి వెన్నెల రాత్రుల్లో ఊరి బయట చెరువుకట్ల మీద కవి సమ్మేళనం నిర్వహింపజేసేవారు. బొడ్డెమ, చెరువు – మంచిప్ప చెరువు, అలీసాగర్ మొదలైన చెరువుల వద్దకు పెట్రోమాక్స్‌లతో వెళ్లేవాళ్ళం. దాదాపు 10 గంటల రాత్రి గడిచిపోయేది. కవితా విభావరులు ఇలా అనేకమంది యువకవుల్లో ప్రేరణగా నిల్చిపోయాయి.

చర్చలు, సమావేశాలు, గృహ సమావేశాలు, కవుల సంకలనాలపై ఉపన్యాసాలు, క్లుప్త గోష్ఠులు, కవితాపోటీలు, అనేకమందికి అవార్డులు, పండుగ పూట కవిత్వం వేడుకలు. ఇలా భోజరాజు కాలంలో సాగినట్లే కేశనకుర్తి వీరభద్రాచారి గారి మార్గదర్శకత్వంలో ఇందూరు భారతి సాహితీ శిఖరంగా ఎదిగింది.

1985లో ఆంగ్లోపన్యాసకులుగా పదవీ విరమణ గావించినా ఏనాడు అలసిపోని కళాతపస్విగా తమ సేవలను అందిస్తూ వచ్చారు.

నిరంతర సేవలు అందించడం ఎప్పుడు విరామమెరుగని ట్యూషన్‌లు మొదలైన వాటివలన కేశనకుర్తి వీరభద్రాచారిగారికి శ్వాసకోశాల ఇబ్బంది తలెత్తింది. చికిత్స నిమిత్తం చెన్నైలోని విజయా హాస్పిటల్‌కు వెళుతున్నప్పుడు అందరం చారిగారికి ధైర్యం చెపుతూ పసిపిల్లాడిలా వీడ్కోలు చెప్పాం! కాని చారి సార్ అనారోగ్యం తీవ్రతై అక్కడే 04-06-1986 నాడు కళాకీర్తిశేషులైనారు.

నిజామాబాదులో వారు పరమపదించి ఉంటే కొన్ని కిలోమీటర్ల పర్యంతరం కళాభిమానులు చారి సార్‌కు వీడ్కోలు పలికేవారు. అంత్యక్రియలూ సన్మానప్రాయంగా జరిగేవి. కాని చెన్నైలో కాలధర్మం చెందటంతో వారిని ఇక్కడికి రప్పించే అవకాశం రాలేదు. మా అందరికీ కడచూపుకూడా కరవైంది.

నిజామాబాదును ఇలా సర్వతోకళావేదికగా తీర్చిదిద్దిన

ఆ మహామనీషికి అశ్రు అంజలి మాత్రమే ఘటించగలిగారు కళాభిమానులు.

వారు వెళ్లిపోయాకా వారి కవితలు అచ్చుకాకుండా ఉండిపోయినై. మేమంతా వాటిని వారి కుటుంబ సభ్యుల సహకారంతో పెట్టెలు, పుస్తకాలు, ఫైల్లు పాత పత్రికలు అన్నీ అన్వేషించి వారి కవితలను పరిష్కరించి 'కొత్తదారి' పేరిట సంకలనాన్ని రూపొందించాం.

దీనికై ముందు మాట దాశరథి కృష్ణమాచార్యులవారు కంటతడిపెడుతూ రాశారు. దాశరథి వారికి చారిసార్‌కు ఉన్న అనుబంధం చాలా గొప్పది. నిజామాబాద్ అన్నా - చారిసార్ అన్నా, ఇందూరు భారతి కవులన్నా దాశరథిగారికి ఎనలేని ఆత్మీయ స్పర్శ.

సంకలనం చారిగారి ప్రెస్ ఐన 'శ్రీ' ప్రింటర్స్‌లోనే అచ్చైంది. ఈ ఆవిష్కరణ వేడుకకు కీ.శే. రావూరి భరద్వాజా విచ్చేసి అనేక గాద్గదిక మాటల మధ్య చారిసార్‌ను స్మరించుకునేలా చేశారు.

ఆవిష్కరణ సభకు కేశనకుర్తి వీరభద్రాచారిగారు స్థాపింపజేసిన అనేక కళానాటక నాట్యసంస్థలు విచ్చేసి వారి స్మృతిగా 'కొత్తదారి' వేసుకున్నారు.

ఈనాటికి గిరిరాజ కాలేజీ భవనాన్ని చూసినా, కొండెంగ హనుమాన్ వారున్న పాత ఇల్లు చూసినా, పెద్దబజార్ రోడ్ చూసినా, మణిక్ భవన్ కళావేదిక చూసినా కేశనకుర్తి వీరభద్రచారిగారే జ్ఞాపకం వస్తారు.

ఈనాడు లబ్ధప్రతిష్టులైన అనేక కవులు, నటులు, గాయకులు ప్రతిరోజూ ఏదో సందర్భంలో వారి పేరును నాల్కపైకి తెచ్చుకొని స్మరించకుండా ఉండలేరు.

ఎక్కడో భీమవరంలో స్థిరమైనా ఇక్కడ ఇందూరుకు వచ్చి కళాక్షేత్రంగా రూపొందించిన కేశనకుర్తి వీరభద్రాచారిగారు శరీరంతో లేకున్నా - వారి సాహితీ కళా ఆత్మ మా ఎదురుగా ఉన్నట్లేగా భావిస్తుంటాం.

ఈ రోజు ఇందూరు భారతి ద్వారా మేము నిరంతర సేవలందిస్తున్నమాటే వారి స్ఫూర్తి మాకు కవిత జీవకళ.

నిజామాబాద్ సాహితీ కళాచరిత్రలో వారి పేరు అనేక గ్రంథాల్లో సువర్ణ అక్షరాలతో లిఖించబడింది.

కళాకారుడికి మరణం నిజంగా లేదని ఇందరి అభిమానమే నేటికి ఋజువు చేస్తోంది. ఇందూరు కళలకు వేసింది కమలాల పూలదారి. వీరు రాసింది సరికొత్త 'కొత్తదారి'. మాలో నిలిచి ఉండే కారణజన్ములు కేశనకుర్తి వీరభద్రాచారి.

71

# కేవల్ కిషన్

– డా॥ బెల్లంకొండ సంపత్ కుమార్

తెలంగాణ సమాజం స్థానిక పరిమళాలను రచించుకుంటున్నది. ఆగమైన తన ఘనచరిత్రను చిత్రిక కడుతున్నది. అనామకంగా, వెలుగు చూడని ఎందరో వైతాళికులను, వీరులను, యోధులను, సాహితీ ఆణి ముత్యాలను స్మరించుకుంటుంది. అలాంటి దారిదీపాలలో కేవల్ కిషన్ చిరస్మరణీయుడు. ఆయన లేకపోయినా ప్రజల గుండెలలో గుడికట్టుకున్నాడు. ఆయన మరణించిన చోట సమాధివద్ద ప్రజలు జాతర చేస్తారు. జాతరలో బండ్లు తిరుగుతాయి. దేవుని బిళ్ళలవలే, ఫోటోలవలె, లాకెట్లవలె కేవల్ కిషన్ చిత్రం గల బిళ్ళలు, ఫోటోలు, లాకెట్లు జాతరలో లాభాపేక్ష లేకుండా అమ్ముతారు. ఎందరో తమ పిల్లలకు కిషన్ అని పేర్లు పెట్టుకున్నారంటే ఆయన సేవలు ఎంతటివో అర్థం చేసుకోవచ్చు.

కేవల్ కిషన్ 1922 మే నెల ఏడోతేదీన జన్మించాడు. వారిది మెదక్ జిల్లా, మాందాపురం అనే గ్రామం. తల్లిపేరు మున్నాబాయి. తండ్రి నారాయణ. ఆనాటికే వారిది చదువుకున్న కుటుంబం. తండ్రి పట్వారీగా పనిచేసేవాడు. ఆయన తెలుగు, ఉర్దూ, అరబ్బీ, మరాఠి, ఇంగ్లీషు భాషలలో మంచి విద్యామణి. తమ పిల్లలను బాగా చదివించి ఉన్నతస్థాయి ఉద్యోగాలలో చూడాలన్నది వారి కోరిక.

కేవల్ కిషన్ శెట్టిపల్లి, మాందాపురంలో అక్షరాలు అభ్యసించినా ఉన్నత విద్య మెదక్‌లో సాగింది. తాను చదువుకుంటున్న రోజులలోనే తోటి పిల్లల బీదరికం గురించి ఆలోచించేవాడు. బాల్యంలో కేవల్ కిషన్‌ను బాగా ప్రభావితపర్చిన ఊరు టేక్మాల్. అది కేవల్ కిషన్ అమ్మమ్మగారి గ్రామం కావడం వలన సెలవు రోజులు టేక్మాల్ లో గడిపేవాడు.

ఈ గ్రామంలో నివసించే ఉప్పు చంద్రయ్య, టేక్మాల్ రంగారావు, వెంకటేశ్వరరావు, చయనుల సదాశివ శర్మ, సింగరాయకొండ పురుషోత్తమాచార్యులు, రావికోటి రఘురామశర్మ మొదలైన సాహిత్య, స్వాతంత్ర్య సమర యోధుల గురించి కథలు కథలుగా విన్నాడు. ఇరవై ఐదుమందితో ఏకకాలంలో పోరాడనేర్పుగల దొడ్ల నారాయణ గురించి తెలుసుకొని ప్రేరణ పొందాడు. టేక్మాల్‌లోని దర్గా షరీఫ్ నేపథ్యం, మత సామరస్యం పరస్పరం ఆప్యాయంగా పిల్చుకోవడం కేవల్ కిషన్‌ను ముగ్ధుడిని చేసిన వాస్తవాలు.

కేవల్ కిషన్ మెదక్‌లో విద్యనభ్యసిస్తున్న కాలంలో తోటివారిని తీసుకొని కొలిగడ్డకు పోయి వ్యాయామం చేసేవాడు. టేక్మాల్ గ్రామంలోని ప్రముఖుల విషయాలను చర్చించేవాడు. ఆ విధంగా ఆయనలో నాయకత్వ లక్షణాలు ఏర్పడ్డాయి. పాఠశాల దశనుండే సామాజిక స్పృహ గల నాటకాలు వేశాడు. చరిత్రపట్ల నిశితమైన దృష్టి గలవాడు. రాజు, మంత్రులు, భటుల వేషాలు వేశాడు. పౌరాణిక నాటకాలలో పాండవ వనవాసం, పాదుకా పట్టాభిషేకం

వంటి నాటకాలలో కేవల్ కిషన్ పాత్రధారి కావడం వలన తెలుగు భాషమీద ఆయనకు పట్టు కలిగింది.

అమ్మ మున్నాబాయి తీరికవేళలో కథలు చెప్పేది. ఆ కథాంశాన్ని నిజంగా జరుగుతున్నట్టు ఊహిస్తూ, సమాజ పరిస్థితులకు పోల్చి చూసేవాడు. కథలోని క్రూర పాత్రల గురించి ముచ్చటించేవాడు. అంతే సహజంగా వెట్టిచాకిరీని వ్యతిరేకించాడు ఆ దురాచారాన్ని పోషిస్తున్న సంపన్నులను నిరసించి ఆగ్రహానికి గురయ్యేవాడు. ఎనిమిదో తరగతిలోనే ఆయన విద్యార్థి ఉద్యమాలపట్ల ఆకర్షితుడయ్యాడు.

కేవల్‌కిషన్ పాఠశాల జీవితం నుండే తబలా, హార్మోనియం వాద్యాలపట్ల ఆకర్షితుడైనాడు. భజన సంఘాలతో తిరిగి తబల హార్మోనియం నేర్చుకున్నాడు. ఆ దశలోనే ఈ ఆసక్తి ప్రజలతో మమేకం కావడానికి ఉపయోగపడింది. హైస్కూలు విద్యా దశలోనే ఆయనకు సాంబమూర్తితో పరిచయం ఏర్పడింది. ఆయన కేవల్‌కిషన్‌కు స్ఫూర్తి ప్రదాత అయ్యాడు. సాంబకిషన్ ఆశ్చర్యపడేవాడు. ఆయనే కేవల్‌కిషన్‌కు రాజకీయ గురువై మార్గదర్శనం చేశాడు. మెదక్‌లో విద్యాభ్యాసం పూర్తి చేసుకొని కళాశాల విద్యకోసం హైదరాబాదు సిటి కాలేజికి చేరుకోవడం ఆయన జీవితంలో ఒక మలుపు ఉర్దూ మీడియంలో విద్య అభ్యసించడం వలన పాలనకు సంబంధించిన విషయాలను బాగా అవగాహన పొందాడు. రాజకీయచైతన్యం పొందాడు.

ఆనాడు నిజాం ఏలుబడిలో చిన్న చిన్న ఫ్యూడల్ ఎస్టేట్లు ఉండేవి. వాటిని సర్ఫెఖాస్, జాగిర్లు, సంస్థానాలు, పాయగాలు, మక్తాలుగా పిలిచేవారు. అలాగే ఖల్సా ప్రాంతాలు ఉండేవి. ఈ నాటికీ మఖ్తా, ఖల్సా పేర్లు కొన్నిచోట్ల వాడుకలో ఉన్నాయి. ఖల్సా అంటే రైతులలో అంతరాలులేని ప్రాంతం. స్వేచ్ఛా ప్రాంతం. విముక్తి అయిన ప్రాంతమని అర్థం. అయినా ఇక్కడ ఫ్యూడల్, దోపిడి, నిరంకుశత్వం కొనసాగేది. పన్నుల భారంతో విపరీతమైన కౌలు దోపిడితో, వెట్టి, తిట్లు, అవమానాలతో ఈ ప్రాంతాలు దుర్భరంగా ఉండేవి. ఈ విధానంపట్ల కేవల్‌కిషన్ విముఖుడు. సిటి కాలేజిలో ఇంటర్‌మీడియట్ స్థాయి విద్యాదశలోనే ఆయనలో రాజకీయ చైతన్యం ఉరకలు వేసింది. ఆనాడు నిజాం సర్కార్‌లో గ్రామ్ సుధారక్ సంఘాలకు నామమాత్ర ఎన్నికలు జరిగేవి. అవి సర్కారుకు అనుకూలంగా నడిచేవి. పటేల్, పట్వారి, పోలీస్‌ల చేతిలో ఊర్లు నలిగిపోయేవి. ఆ గ్రామీణ జీవన చిత్రణను కళ్ళారా చూసిన కేవల్‌కిషన్ భూస్వాముల, అధికారుల నిరంకుశత్వంపట్ల చైతన్యం కలిగించడానికి తోటి విద్యార్థి మిత్రులతో కలిసి హైదరాబాద్‌లో 'విద్యార్థి యువజన సంఘం' స్థాపించాడు.

కేవల్‌కిషన్ 1939లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బి.ఎ. కోర్సులో చేరాడు. అక్కడ పలువురి మేధావులతో పరిచయాలు ఆయనలో మార్పు తెచ్చాయి. కామ్రేడ్ అసోసియేషన్‌తో కలిసి పనిచేశాడు. నాగపూర్ కమ్యూనిస్టులతో కలిసి హైదరాబాద్ విద్యార్థి ఫెడరేషన్ ఏర్పాటు చేశాడు. కామ్రేడ్స్ అసోసియేషన్‌ను పోలిన ఒక సంఘం మెదక్ పట్టణంలో అవసరమని వివిధ సంఘాల వాని కలిపి ఒకే సంఘం ఏర్పాటు చేశాడు. తర్వాత కాలంలో ఆ సంఘం మెదక్ కమ్యూనిస్టు సమితిగా మారింది. అందులోని సభ్యులకు కేవల్‌కిషన్ ఆదర్శప్రాయుడు. మెదక్‌లో పలు సమావేశాలు నిర్వహిస్తూ మగ్దూం మొయి నుద్దీన్, జవాద్ రజ్వి, ఓంకార్ ప్రసాద్‌లాంటి మేధావులను ఆహ్వానించాడు. ఈ క్రమంలో రావి నారాయణరెడ్డి బద్దం ఎల్లారెడ్డి, డా. ఎం.ఎన్. జయసూర్య రాజేశ్వరరావు, గురువారెడ్డి వంటి ప్రముఖుల పరిచయాలు కేవల్‌కిషన్‌లోని పోరాట వెలుగు జాడలను దేదీప్యమానం చేశాయి.

ఆంధ్ర మహాసభలు ఇచ్చిన స్ఫూర్తి, గ్రంథాలయాలు, గ్రంథమాల, పత్రికలు, సంఘాలు, సభలు అప్పటి యువతనం ముందడుగు వేయడానికి దోహదమయ్యాయి. కేవల్‌కిషన్ పఠనశీలి. తను చదివిన పుస్తకాలు, పత్రికలలోని విషయాలను తోటివారితో ప్రజలతో చర్చించేవాడు. మెదక్, హైదరాబాదు ఆయన ఉద్యమ కేంద్రాలు. ఆంధ్ర మహాసభలలో చురుకుగా పాల్గొన్నాడు. రెడ్డి హాస్టల్, ఉస్మానియా విశ్వవిద్యాలయం, సిటికాలేజి కేంద్రాలుగా విద్యార్థుల కార్యక్రమాలలో ముందుండేవాడు. నిద్రాహారాలు తెలువకుండా పనిచేశాడు. ఈ పరిణామాల నేపథ్యంలో అప్పటికే సిటికాలేజిలో లెక్చరర్‌గా ఉన్న మగ్దూంమొయినుద్దీన్ సాయుధ పోరాటానికి మద్దతు పల్కడం వలన కేవల్‌కిషన్ ప్రభావితుడైనాడు. ఉద్యమ వార్తలను ప్రచురించే గోలకొండ, మీజాన్ పత్రికలు చదివేవాడు. కోఠీ ప్రాంతంలో ఈ పత్రికలు కల్గి ఉన్నందుకు దుండగులు కొట్టి పత్రికలు కాల్చేసిన

సంఘటనలో కేవల్‌కిషన్‌పట్ల నిర్బంధం మొదలైంది. ఆ కారణంగా కొంతకాలం ఎవరికీ కనబడకుండా రహస్యంగా ఉండటంవలసి వచ్చింది.

మెదక్ జిల్లా కేంద్రం కార్యాలయాలు సంగారెడ్డిలో పని చేయడం వలన మెదక్ ప్రాంత ప్రజలకు ఇబ్బంది కల్గుతున్నదని సంగారెడ్డిలో దీక్ష చేసాడు ఆనాడు ప్రభుత్వానికి నిరసన తెలియజేయడమే గొప్ప సాహసం.

కేవల్‌కిషన్ తండ్రి కేవల్ నారాయణ కొడుకు డిగ్రీ పూర్తిచేసి ఉన్నతమైన ప్రభుత్వ ఉద్యోగం చేయాలని ఆశించాడు. అందుకు భిన్నంగా కేవల్‌కిషన్ ప్రజల స్వేచ్ఛ, విముక్తి పోరాటాలే తన ధ్యేయంగా ఆశయాన్ని బహిర్గతపర్చాడు. మెదక్ మున్సిఫ్ మెజిస్ట్రేటుగా ఉన్న అబ్దుల్ రహీం మొగిలి ద్వారా తహసిల్దారు ఉద్యోగాన్ని చేపట్టమని ఎన్నోసార్లు వివిధ ఉద్యోగాలు ఎరచూపి ప్రభుత్వం సందేశం పంపింది. కేవల్‌కిషన్ నిరాకరించాడు. దొరల ప్రాంతాలలో యెట్టి చేస్తున్న బీదలను సమీకరించాడు. సమావేశాలు నిర్వహించాడు. పొద్దంతా ప్రజల చైతన్యం కోసం శ్రమించి రాత్రి ఎప్పుడో ఇల్లు చేరేవాడు. తల్లి కాళ్ళొత్తుతూ ప్రజల దీనగాథలు వివరించేవాడు. ఆయనకు తల్లితో అనుబంధం ఎక్కువ. దీన ప్రజలను ఆదుకోవాలని తల్లి హితబోధచేసేది.

తెలంగాణలో పటేల్‌పట్వారీ దొరలు, పోలీసులు అధికారులు గొర్లు, మేకలు, కోళ్ళు తేమ్మని వ్యవసాయ సామాన్య రైతులను పురికొల్పేవారు. పశువుల కాపరులను ఆజ్ఞాపించేవారు. కేవల్‌కిషన్ దీనిని వ్యతిరేకించేవాడు. అభిమానంతో మాందాంపురం గొల్లలు ఒకసారి కేవల్‌కిషన్‌కు మేకలు తెచ్చిఇస్తే ఇది మంచి పద్ధతికాదని నచ్చజెప్పాడు. ఎంతకు వినకపోయేసరికి వెంటనే ఆ మూగ జీవాలను మందలో కలిపాడు. మేకపుల్లరి పన్ను విధానం మీద వారిలో చైతన్యం రగిలించాడు. 1942 సం॥ నుండే వివిధ గ్రామాలు తిరిగుతూ ప్రజలను సంఘటితపర్చాడు. బానిసత్వ విముక్తి, మద్యపాన వ్యతిరేకత యెట్టి వ్యతిరేకతలు ప్రచారం చేశాడు. 1943 నుండి కౌలుదార్ల పోరాటాలను ఉధృతం చేశాడు. మెదక్ జిల్లా కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శిగా ప్రజాపోరాటాలలో భాగమయ్యాడు. 1949లో తన తండ్రి స్వంత ఆస్తి అని చెప్పిన 250 ఎకరాల భూమిని ఎరుకలకు, లంబాడి ప్రజలకు, దళితులకు, భిక్షువులకు పంచాడు. అక్కడినుండి ప్రారంభమైన ఆయన భూపోరాటం నలు దిక్కులకు పాకింది. ఆ మార్పుతో పటేళ్ళ దొరల సేవలకు వెళ్ళడానికి యెట్టి జీతగాళ్ళు నిరాకరించారు. ఆయన ప్రభావంతో పలుప్రాంతాలలో వెట్టిపనులు ఆగిపోయాయి. భూస్వాముల భూములలో చాలాకాలంగా పనిచేస్తున్న రైతులకు శ్రమకు తగ్గ ఫలితం లభించింది. భూమి లభించింది. ఆ దశలో కేవల్‌కిషన్ దాడులను ఎదుర్కున్నాడు.

ఆరుట్ల రామచంద్రారెడ్డి, కమలాదేవితోపాటు కమ్యూనిస్టు నాయకులు కేవల్‌కిషన్‌తో కలిసి 1946-47 లలో సుదీర్ఘ చర్చలు జరిపారు. నియంతృత్వ పాలన అంతం కావడానికి సమకాలీన రాజకీయ దుర్మార్గాలను ఎదుర్కోవ డానికి సాయుధపోరాటమే శరణ్యమని కేవల్‌కిషన్ మగ్దూం దారిని సమర్థించాడు. వెట్టి జీతగాళ్ళ విముక్తి, సీలింగ్‌కు మించి అదనంగా కల్గివున్న భూస్వాముల భూమిని పంచడం మద్యపానం బంద్ చేయడం రాత్రి పాఠశాలలు. విద్య అభ్య సించడం మొదలైన ప్రజా కార్యాలను ఆయన సాధించాడు.

కిట్టన్నపేట భూ పోరాటంలో పాల్గొని అంటరానితనం, వెట్టి సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించాడు. ఆ ప్రాంతంలోని ఎందరో యువకులు కేవల్‌కిషన్ దళంలో చేరారు. ఆయన మీద బాబాహుకూమత్, కాలగష్తి, గస్తినిషాన్ తిర్పన్ ప్రభావాలు పడ్డాయి. ప్రభుత్వం భావ ప్రకటనా స్వేచ్ఛను అడ్డుకున్నది. పూర్తిస్థాయిలో నిర్బంధం పెరగడం వలన పోరాట మార్గం బలమైంది.

1947 సం॥ కాలానికే కేవల్‌కిషన్ రహస్యంగా కరపత్రాలు ముద్రించి పంచే కార్యక్రమం తీసుకున్నాడు. ఆనాడు ఆయన ప్రచురించిన కరపత్రంలో 1. పేద రైతులు చెల్లించే మితిమీరిన మిత్తి రద్దు కావాలి 2. ఏ ఊరిలో ఉన్న మిగులు భూమి ఆ ఊరి ప్రజలకు చెందాలి 3. దున్నేవారికే భూమి 4. వెట్టి, మద్యపానం తరాలుగా సాగుతున్న జీతగాళ్ళ విధానం రద్దుకావాలని పిలుపు నిచ్చాడు. 1948-50 లలో వరస కరువులొచ్చినప్పుడు 'కరువుదానా' పేరిట కలవారి దగ్గరి నుండి ధాన్యం ప్రోగుచేసి బీదలకు పంచాడు. జక్కన్నపేట చెఱువు పోరాటంలో 120 ఎకరాల పేదల భూమి కబ్జా కాకుండా కాపాడాడు. స్థానికంగా పనిచేసిన దళాల ప్రభావంగా ప్రజలే స్వచ్ఛందంగా వచ్చి భూస్వాము లను అడ్డగించడం ఇక్కడ జరిగింది.

సాయుధ పోరాట విరమణ తర్వాత కేవల్‌కిషన్ 1952 లో అసెంబ్లీ, భారత పార్లమెంటు ఎన్నికలలో పాల్గొన్నాడు. జయసూర్య గెలుపు కోసం అవి(శాంతంగా పనిచేశాడు. తనూ ఎన్నికలలో పోటీ చేశాడు. 1952, 1957 లలో ఓటమి పొందినా ప్రజల సమస్యల మీద చురుకుగా పనిచేశాడు.

కేవల్‌కిషన్ రాజ్యాంగం ఇచ్చిన సౌలభ్యాలనే అమలుపర్చాలని డిమాండ్ చేసి ప్రజలకు మేలు కలిగేలా పోరాడాడు. ఆయన శాంతంగా పరిస్థితులు విడమర్చి చెప్పే విధానం, న్యాయం కోరే పద్ధతి చూసి జిల్లా కలెక్టర్లు అధికారులు ఆశ్చర్యపడేవారు. కేవల్‌కిషన్ రాగానే లేచి నిలబడి సాదరంగా ఆహ్వానించేవారు. గరీబులు గంజినీళ్ళిచ్చినా, లంబడోళ్ళు తైదంబలి పోసినా, ముస్లిం బీదలు మక్కరొట్టె ఇచ్చినా ఇష్టంగా స్వీకరించాడు. వందలాది ఎకరాల భూమి పేదలకు చెందేవిధంగా పోరాడాడు. ఆయన 1960 డిసెంబర్ 26వ తేదీన రాత్రి 11.30 గం॥ మాసాయిపేట నిరుపేదలతో సమావేశమై తిరిగి వస్తుండగా పోల్కంపల్లి వద్ద అనుమాన పరిస్థితిలో ప్రమాదానికి గురై అసువులు బాసాడు. నలభైఏండ్లన్న రాకముందే నూరేళ్ళు నిండాయి. ఆ ప్రాంతంలోనే ప్రతి సంవత్సరం కేవల్‌కిషన్ జాతర జరుగుతుంది. ఒక మనిషిని దేవుని అంతగా జాతర జరపడం అరుదైన విషయం. ప్రజలు దేవుని ఫొటోల పక్కన కేవల్‌కిషన్ ఫొటో పెట్టుకోవడం ఇక్కడ ఉంది. ఇతర రాష్ట్రాల ప్రజలు జాతరకు తరలివస్తారు. ఆయన అక్షరాలా ఏ స్వార్థ ఆశలులేని ప్రజల మనిషి.

## 72

# ఖండవల్లి లక్ష్మీరంజనం

– డా॥ గుమ్మన్నగారి బాల శ్రీనివాసమూర్తి

పట్టుదలకు ప్రతిరూపం, కార్యదక్షతకు నిదర్శనం ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం. దాదాపు ఎనిమిది దశాబ్దాల ఆయన జీవితంలో యైభైఏళ్ళ కాలం ఏదో ఒక అర్థవంతమైన పనితోనే గడిచింది. ఇందులో స్వార్థంలేదు. సమాజ హితము, సాహిత్య వికాసమే ఖండవల్లి పనుల పరమార్థం. కోస్తాంధ్ర ప్రాంతంలో జన్మించి ఇతోధికమైన సేవలు చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగానికి ద్వితీయ అధ్యక్షుడిగా అద్వితీయ దార్శనికుడిగా గుర్తింపును పొందారు.

1908వ సంవత్సరం మార్చి మొదటి తారీఖునాడు తూర్పుగోదావరి జిల్లాలో మాతామహుల ఇంట ఖండవల్లి జన్మించారు. తల్లి సీతమ్మ, తండ్రి సూర్యనారాయణ. పరంపరగా వేదాధ్యయనం, సంప్రదాయ సాహిత్యపరిచయం ఉన్న కుటుంబం. అయితే ఆనాటకే ఆధునిక విద్య తాలూకు ప్రభావం సూర్యనారాయణ గారికి అర్థమైంది. అందుకే తమ కుమారుడిని పాఠశాల విద్యలో ప్రవేశపెట్టారు. ఇట్లా లక్ష్మీ రంజనం బాల్య విద్యాభ్యాసం చెల్లంపూడి – ఉరుమూడిలలో కొనసాగింది. ఇంతలోనే వారి కుటుంబం వరంగల్లుకు తరలి రావలసివచ్చింది. సూర్యనారాయణకు వరంగల్లు ఆయుర్వేద కళాశాలలో అధ్యాపక ఉద్యోగం లభించడం అందుకు కారణం.

లక్ష్మీరంజనం బాల్యంలోనే వరంగల్లు సాంస్కృతిక వైభవాన్ని వీక్షించే అవకాశం దొరికింది. ఆయనను కాకతీయుల చరిత్రపట్ల అమితమైన అభిమానం ఏర్పడేందుకు బాల్య అనుభూతులే కారణం కావచ్చు. ఆ రోజుల్లో వరంగల్లులో ఇంటర్మీడియట్ వరకే ఉండేది. ఉన్నత విద్య కోసం హైదరాబాద్ రావలసిందే. లక్ష్మీరంజనం సోదరుడు బాలేందు శేఖరం. ఆయన కూడా అన్నవలెనే చురుకైన విద్యార్థి, ఇద్దరూ నిజాం కళాశాల విద్యార్థులయ్యారు. విద్యార్థి దశనుండే లక్ష్మీరంజనం హైదరాబాద్ సాంస్కృతిక వికాస కార్యక్రమాల్లో పాలుపంచుకునేవారు. ఇట్లా ఆయనను ఇక్కడి సాంస్కృతిక రంగ ప్రముఖులతో గట్టి అనుబంధం ఏర్పడింది.

ఆంధ్ర జన సంఘం నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పాల్గొని పారితోషికాన్ని పొందారు. 1926లో లక్ష్మీరంజనం వివాహం జరిగింది. ధర్మపత్ని భ్రమరాంబ. 1928లో బి.ఏ. పూర్తి చేసుకున్న లక్ష్మీరంజనం ఇక్కడే సిటీ కళాశాల అధ్యాపకులయ్యారు. ఉద్యోగ జీవితం అంచెలంచెలుగా ఎదిగింది. 1946లో ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగం అధ్యక్షులయ్యారు. 1964లో ఉద్యోగ విరమణ చేసే వరకు ఆ పదవిలో ఉన్నారు. ఉస్మానియా తెలుగు విభాగంలోని అధ్యక్షులు ప్రముఖ కవి రాయప్రోలు. రెండవవారు ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం.

లక్ష్మీరంజనం తెలుగు విభాగం అధ్యక్షులు అయ్యేనాటికి ఈ విభాగంలో చదువుతున్న విద్యార్థుల సంఖ్యలుగా స్వల్పం.

ఆయన పదవీ విరమణ చేసేనాటికి ఈ సంఖ్య గణనీయస్థానాన్ని చేరుకున్నది. అందుకు ఖండవల్లి పట్టుదల కారణం, తెలుగును ద్వితీయ భాషగా ప్రవేశపెట్టే క్రమంలో ఆయన వ్యూహాత్మక వైఖరి, చతురత ప్రస్ఫుటమయ్యాయి. ద్వితీయ భాషగా తెలుగు తప్పకుండా ఉండవలసిందేనని ఆయన అధికారులకు నచ్చచెప్పారు. వారితో వాదించారు. ఒక ఒక్కరుగా పోరాట పటిమను ప్రదర్శించారు. ఆనాటికి తెలుగు ద్వితీయ భాషగా స్థిరపడాలంటే ఒక చారిత్రక గ్రంథం అవసరమైంది. లక్ష్మీరంజనం తాను స్వయంగా గ్రంథ రచన చేసేందుకు ముందుకు వచ్చారు.

"ఆంధ్రుల చరిత్ర సంస్కృతి" అనే గ్రంథం రచనకు శ్రీకారం చుట్టారు. ఇందులో కొన్ని అధ్యాయాల్ని ఆయన సోదరుడు బాలేందు శేఖరం రచించినా ప్రధాన గ్రంథకర్త మాత్రం లక్ష్మీరంజనమే. ఇది 1940ల నాటిమాట. ఆనాటికి తెలుగువారి చరిత్రపై ఇప్పటివలె ప్రామాణిక గ్రంథాలులేవు. పరిశోధనలు ఇంకా మొగ్గదశలోనే ఉన్న పరిస్థితి, అయినా అచ్చమైన ఆధారాలతో లక్ష్మీరంజనం ఈ మహత్తర గ్రంథ రచన చేశారు. కేవలం నెలరోజుల కాలవ్యవధిలో రచించిన ఈ గ్రంథం ఇప్పటికి అనేక పునర్ముద్రణలు పొందింది.

ఇది నేటికీ స్నాతకోత్తర స్థాయి విద్యార్థులకు పఠనీయగ్రంథం. పరిశోధన విద్యార్థులకు పరామర్శ గ్రంథం, పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులకు అవశ్య గ్రంథంగా మన్ననల్ని అందుకుంటోంది. ఈ గ్రంథంలో లక్ష్మీరంజనం చేసిన ప్రతిపాదనలు, సాధించిన నిష్కర్ష నేటికీ మన్ననల్ని పొందుతున్నాయి. ఈ రచన తాలూకు శైలి కూడా ఎంతో గొప్పది. ఇంకా వ్యావహారిక భాష ప్రచారంలోకి రానిరోజుల్లో లక్ష్మీరంజనం ఈ రచన పూర్తి చేశారు. ఈ గ్రంథం సామాన్యులకు సైతం అర్థమయ్యే తీరుతూ ఉంది.

ద్వితీయ భాషగా తెలుగు స్థానం స్థిరపడడంలో ప్రతిభావంతులైన ఎందరో స్నాతకోత్తర విద్యార్థులు ఉపాధిని పొందగలిగారు. పరోక్షరీతిలో తెలుగు భాషా సాహిత్య సంస్కృతులను ఆదరణ పెరిగింది. దాదాపు ఇదే కాలంలో ఖండవల్లివారు మరొక ప్రామాణిక రచన కూడా పూర్తి చేశారు. ఆయన ఈ గ్రంథాన్ని ఆంధ్రపితామహ మాడపాటి హనుమంతరావు ప్రేరణతో ప్రారంభించారు. అప్పటికి విద్యార్థులకు అందుబాటులో తెలుగు సాహిత్య చరిత్ర గ్రంథాలులేవు. దీన్ని గురించి లక్ష్మీరంజనం 'ఆంధ్ర సాహిత్య చరిత్ర' సంస్కృతంలో రచించారు. ఇది తొలుత కొన్ని వందల పుటల రచన. దీన్ని బాగా సంక్షిప్తపరచి ప్రపంచానికి లక్ష్మీరంజనం అందించారు. తెలుగువారి సంస్కృతిని తెలుసుకునేందుకు ఆంధ్రుల చరిత్ర సంస్కృతి, తెలుగు సాహిత్య చరిత్ర పరిచయమయ్యేందుకు ఆంధ్రసాహిత్య చరిత్ర సంగ్రహం ఇతోధికంగా తోడ్పడుతున్నాయి. సమాజ చైతన్యానికి దోహదం చేయాలన్న విశాలమైన లక్ష్యం ఈ రెండు రచనల వెనుక కనబడుతుంది.

తెలుగు విభాగంలో పరిశోధనలు ప్రారంభమై అవి సతత హరితంగా మారాలని లక్ష్మీరంజనం స్వప్నించారు. ఈ నవల ఫలితంగా ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో పి.హెచ్.డి. పరిశోధనలు ప్రారంభమయ్యాయి. పరిశోధనలు ఆరాధించేందుకు తగిన పరిస్థితులు, మానవ వనరులు, అవసరం, వీటిని చక్కగా అంచనా వేసుకున్నారు లక్ష్మీరంజనం. పరిశోధనాంశాల్ని గుర్తించారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు పిహెచ్‌డి పరిశోనకు అవకాశం కల్పించారు. ఆయా పరిశోధనా శీర్షికలకు తగిన పర్యవేక్షకులను ఎంపిక చేసుకున్నారు.

తెలుగులో ఉస్మానియా యూనివర్శిటి పరిధిలో తొలి పిహెచ్‌డి ఆయన పర్యవేక్షణలోనే పూర్తి అయింది. ప్రసిద్ధ పరిశోధకులు ఆచార్య బిరుదు రామరాజు రామరాజు గారికి ఈ ఘనత లభించింది. ఆయన రచించిన తెలుగు జానపద సాహిత్యం అనే సిద్ధాంత గ్రంథానికి లక్ష్మీరంజనం పర్యవేక్షకులు. ఆయన పర్యవేక్షణలో మొత్తం 13 మందిని సిద్ధాంత గ్రంథం చేశారు. ప్రసిద్ధ సాహితీవేత్తలు దివాకర్ల వేంకటావధాని, పల్లాదుర్గయ్య, ఏ.ఎస్.ఆర్. అప్పారావు, బి.వి. కుటుంబరావు, నీయని కృష్ణకుమారి, వేనరెడ్డిల సిద్ధాంత గ్రంథాలకు ఆయనే పర్యవేక్షకులు. ప్రముఖ వ్యాకరణవేత్త ఆచార్య రాజేశ్వర శర్మ, పరిశోధకులు, ఆచార్య వేటూరి ఆనందమూర్తి సిద్ధాంత గ్రంథాలకు కూడా ఖండవల్లి వారే పర్యవేక్షకులు, సుప్రసిద్ధ కవి, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డాక్టర్ సి. నారాయణరెడ్డిగారి ప్రసిద్ధ పరిశోధనా గ్రంథం. ఆధునికాంధ్ర కవిత్వం – సంప్రదాయం, ప్రయోగములు కూడా ఖండవల్లివారే పర్యవేక్షకులు. ఈ సిద్ధాంత గ్రంథాన్ని గురించి తెలుగు సాహిత్యాభిమానులకు కొత్తగా పరిచయం

చేయవలసిన అవసరమేలేదు. ఇప్పటికి ఎన్నోమార్లు పునర్ముద్రణల్ని పొందిన సి.నా.రె. సిద్ధాంత గ్రంథం నేటికీ ప్రామాణిక పరామర్శ రచనగా పరిగణించబడుతోంది. లక్ష్మీరంజనం పర్యవేక్షణలో వెలువడిన సిద్ధాంత గ్రంథాల్లో ఆయన పరిశోధనా దృష్టికి, తార్కిక దృష్టికి నిదర్శనాలుగా నిలుస్తున్నాయి. ఆచార్య నిడదవోలు వెంకటరావు, ఆచార్య పింగళి లక్ష్మీకాంతంతోపాటు విశ్వవిద్యాలయాల తెలుగు విభాగాల్లో పరిశోధనా రంగాన్ని అభివృద్ధి చేసిన గొప్పతనం ఖండవల్లిదే. పరిశోధకులను ప్రోత్సహించే క్రమంలో ఆయన చూపించిన వైఖరి సర్వదా ఆదర్శవంతం.

స్నాతకోత్సవ స్థాయిలో ఉన్న విద్యార్థులలోని పరిశోధనా పాటవాన్ని, వకృత్వ ప్రతిభను తెలుగులోకి తీసుకొని వచ్చేందుకు లక్ష్మీరంజనం ఎంతో ప్రయత్నించారు. ఆ దశలో ఇటువంటి ప్రోత్సాహం ఎంతో అవసరమని ఆయన గుర్తించారు. విద్యార్థులను తమకు ఇష్టమైన అలోచనలపై రచన చేయవలసినదిగా కోరేవారు. విద్యార్థులు తమ పత్రాల్ని రచించేవారు. వాటిని ఒకటికి రెండుసార్లు సరి చూసుకునేవారు.

పత్రాలలో ప్రామాణికత కోసం తపించేవారు. ఇట్లా వారి పత్రరచన తయారైన తరువాత ఒక సదస్సును లక్ష్మీరంజనం ఏర్పాటు చేసేవారు. ఈ సదస్సుకు సాహితీరంగంలోని ప్రముఖుల్ని ఆహ్వానించేవారు. వీరి సమక్షంలో విద్యార్థులు తాము రూపొందించిన సత్యాల్ని చదవవలసి ఉండేది. శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం వంటి చోట్లలో వేదికలు ఏర్పాటయ్యేవి. విద్యార్థులు తమ పత్రాల్ని ఇక్కడ పెద్దలముందు చదివేవారు. పెద్దల ప్రశంసలు. వారి ద్వారా విలువైన సూచనలు కూడా విద్యార్థులకు లభించేవి. ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య, బి.ఎన్. శాస్త్రి వంటివారు ఈ నేపథ్యంలోనే తమ తమ పరిశోధనల్ని ప్రారంభించారు.

విద్యార్థులలో పరిశోధనా ప్రజ్ఞను వెలికి తీసేందుకు లక్ష్మీరంజనం ఎన్నో వినూత్న ప్రయత్నాలు చేశారు. అందులో శ్రీనాథ కవి పద ప్రయోగం కోసం ఒకటి శ్రీనాథ మహా కవి చేసిన పద ప్రయోగాలను ఒకేచోట చేర్చడంద్వారా భావి తెలుగు భాషా వికాసానికి తోడ్పాటు లభిస్తుందని ఖండవల్లి విశ్వసించారు. ఈ పద ప్రయోగ కోశ రూపకల్పనను విద్యార్థులను పెట్టడం ఆయన ప్రత్యేకత. విద్యార్థులు భావి తెలుగు సాహితీవేత్తలని ఖండవల్లి గుర్తించడమే అందుకు కారణం. కొద్దికాలంలోనే పద ప్రయోగకోశం తయారైంది. శ్రీనాథుడి సాహిత్యంపై కూడా ఉత్తమ స్థాయి వ్యాసరచన జరిగింది. ఇవన్నీ కలిపి శ్రీనాథ భారతి అనే పేరుతో సంకలనంగా రూపుదిద్దుకున్నాయి. ఈ సంకలనం ఆనాటి విద్యార్థులలోని లోతైన విమర్శనాశక్తికి, పాండిత్యస్ఫూర్తికీ ప్రతిబింబం. శ్రీనాథ భారతి నేటికీ ఒక చక్కని ప్రామాణిక వ్యాస సంకలనంగా భావించబడుతోంది.

మహాభారతం దయసంహిత. ఇది పంచమవేదం. తెలుగు వారికి ఎంతో ఇష్టమైన ఇతిహాసం. "తింటే గారెలు తినాలి వింటే భారతమే వినాలి" అన్న నానుడి తెలిసిందే. అయితే కవిత్రయ మహా భారతానికి తెలుగునాట ఎన్నో భిన్నమైన ప్రతులున్నాయి. కొన్ని ప్రతుల మధ్య పోలికలులేని పరిస్థితి. మరి ఇటువంటి పరిస్థితుల్లో ఏ భారతప్రతిని ప్రామాణికంగా స్వీకరించాలి? ఇదొక పెద్ద సందేహం. ఈ సందేహం ఎప్పటి నుండో ఉన్నదే. తరాలుగా విద్వాంసులను ఆలోచనల్లో ముంచెత్తుతున్నదే. ప్రామాణిక ప్రతి సాధన ఎట్లా? అన్న విషయాన్ని ఖండవల్లి లోతుగా ఆలోచించారు. ఆయన దృష్టి ఎప్పుడూ నిర్దిష్టమైన కార్యవిధానం, నిర్దుష్టమైన ఫలిత సాధనలపైనే కేంద్రీకృతమై ఉండేది. అందుకే మహాభారత ప్రమాణ ప్రతి తయారీ కోసం బృహత్ పథకాన్ని తయారు చేసుకున్నారు. అవసరమైన కార్య ప్రణాళికను రూపొందించుకున్నారు. సరియైన పరిశోధక బృందాన్ని ఎంపిక చేసుకున్నారు.

తెలుగుసీమ నలుమూలల్లోనూ ఉన్న భారత ప్రతుల్ని సేకరించారు. పాత భేదాల్ని పరిశీలించారు. ఎవరి ఆర్థిక సహాయానికీ ఎదురు చూడకుండా తన వ్యక్తిగత విరాళంతో పనిని ప్రారంభించారు. ఇదొక వాఙ్మయ మహాయజ్ఞం, 'ఆంధ్ర మహాభారత సంశోభిత ప్రతి రూపకల్పన' అనే ఈ మహాయజ్ఞంలో ఖండవల్లితోపాటు దివాకర్ల వేంకటవధాని, నిడదవోలు వెంకటరావు, భూపతి లక్ష్మీనారాయణ ఇందు, పల్లా దుర్గయ్య, బిరుదురాజు రామరాజు, పాటిబండ మాధవ శర్మ, ఎం. కులశేఖరరావు, అమరేశం రాజేశ్వరరావు, కేశ వరపు రామకోటి శాస్త్రి, చలమచర్ల రంగాచార్యులు, బి.వి. కుటుంబరావు, కోవెల సుప్రసన్నాచార్యవంటివారు పాల్గొన్నారు.

భారత సంజీవని, అప్పకవీయం, ఆనంద రంగరాట్ఛందము, కవి సంజీవని, కవి సంశయాచ్ఛేదము, సర్వలక్షణ సార సంగ్రహము, సకల నీతి సమ్మతము, ప్రబంధ రత్నకరం వంటి పలు అకార గ్రంథాల్ని పరిశీలించారు. పుణ్ణా భండార్కర్ పరిశోధనా సంస్థలోని భారతాన్ని కూడా పరిశీలించారు. భగీరథ ప్రయత్నాన్ని గుర్తుకుతెచ్చేరీతిలో కృషి జరిగింది. మహా భారత సంగోషిత ముద్రణ ప్రతి తయారైంది. ఖండవల్లి లక్ష్మీరంజనం ఉస్మానియా వెలుగు విభాగం ఆచార్యులుగా ఉన్న కాలంలో ఆరంభమైన కృషి ఆయన పదవీ విరమణ అనంతరం కూడా నిరంతరాయంగా కొనసాగింది. విశ్వవిద్యాలయాల స్థాయిలో సమిష్టిగా జరిగిన గొప్ప పరిశోధనల్లో మహాభారత సంగోషిత ప్రతిరూపొందించడం ఒకటని ఎవరైనా అంగీకరిస్తారు. తనదైన రీతిలో ప్రతిభావంతులైన పరిశోధకులు వినూత్న ఆవిష్కరణలు చేయడం సహజ ప్రక్రియ. అయితే విభిన్న భావాలు, భిన్న నేపధ్యాలు కలిగిన పలువురు పరిశోధకులతో ఇంతటి వాఙ్మయ యజ్ఞాన్ని నిర్వహించడం మాత్రం కష్టం. అయినా ఎంతో సులువుగా ఈ సమిష్టి కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేశారు లక్ష్మీరంజనం. ఇక్కడ ఆయన నేర్పు, సంయమనం, నాయకత్వలక్షణాలు ప్రస్ఫుటమవుతున్నాయి.

ఇటువంటి ప్రయత్నమే "సంగ్రహంధ్ర విజ్ఞానకోశ నిర్మించి, ఇదొక విజ్ఞాన సర్వస్వ కృషి. తెలుగులో ఖండవల్లి కంటేముందు ఈ రంగంలో కొమర్రాజు లక్ష్మణరావుగారు గొప్ప కృషి చేశారు. విజ్ఞాన సర్వస్వ రచనకు నాందీ గీతాన్ని పాడారు కొమర్రాజు. అయితే ఆయన జీవించి ఉన్నందులో అది పూర్తి కాలేదు. ప్రయత్నం అసంపూర్తిగా మిగిలిపోయింది. ఈ దశలో సంగ్రహాంధ్ర విజ్ఞానకోశ నిర్మాణానికి ఖండవల్లి శ్రీకారంకట్టారు. వివిధ అంశాలను ఎంపిక చేసుకొని నిపుణులైన వ్యాస రచయితలతో రచనలు చేయించారు. ప్రసిద్ధ పరిశోధకులు ఆదిరాజు వీరభద్రరావు ఈ విజ్ఞాన కోశం ఎన్నో వ్యాసాలు రచించారు. విజ్ఞాన కోశం జిజ్ఞాసువుల ప్రశంసల్ని అందుకున్నది. వాఙ్మయ సౌరభాల్ని భావతరాలకు వారసత్వంగా అందించాలన్న తపనలోనే ఖండవల్లి. మహాభారత సంశోభిత ప్రతి "సంగ్రహాంధ్ర విజ్ఞాన కోశం" వంటి బృహత్ రచనలకు అంకురార్పణ చేసినట్టు భావించాలి.

లక్ష్మీరంజనం సాంస్కృతిక చరిత్రకు వ్యాఖ్యత, పరిశోధకులు మాత్రమేకాదు, ఆయనొక గొప్ప విమర్శకులు. విద్యార్థి దశలోనే ఆయన విమర్శనా ప్రతిభ విప్పారింది. 1936లో ఆయన తొలి రచన "తెనుగుదుక్కి" వెలుగు చూసింది. ఇందులో కొన్ని వ్యాసాలు మాత్రమే ఉన్నాయి. అయినా ప్రతి వ్యాసంలోనూ ఎంతో కొంత కొత్తదనం స్పష్టపడింది. భావ కవిత్వాన్ని సరిగ్గా విశ్లేషించిన కొద్దిమంది తెలుగు విమర్శకులలో లక్ష్మీరంజనం ఒకరని తెనుగుదుక్కి చదివిన తరువాత అర్థమవుతుంది. శైలిలోనూ స్పష్టత, సరళతలు ప్రతిబింబిస్తాయి. అలాగే ఖండవల్లి అందమైన తెలుగు వచనాన్ని రచించారు. ఏదైనా కొత్త అంశాన్ని చెప్పాలనుకున్న సందర్భంలోనే లక్ష్మీరంజనం విమర్శా వ్యాసాల్ని రచించేవారు. అందుకే పుంఖాను పుంఖాలుగా వ్యాసాలు రచించలేదు.

తెనుగు దుక్కితోపాటు అడపా దడపా ఆయన రచించిన కొన్ని వ్యాసాలు "లక్ష్మీరంజన్ వ్యాసావళి" అనే పేరుతో ఒక సంకలనంగా వెలువడ్డాయి. ఆయన షష్ఠి పూర్తి సందర్భంలో లక్ష్మీరంజన వ్యాసావళి వెలుగు చూసింది. సిద్ధాంత గ్రంథ రచన చేసే నేటి పరిశోధకులు, ఆచార్యులు, విద్యార్థులు ఈ వ్యాసాలను ఇప్పటికీ అధ్యయనం చేసారు. "నన్నయనాటి సాంఘిక రాజకీయ పరిస్థితులు" వంటి వ్యాసాలు లక్ష్మీరంజనం ప్రతిభా పాండిత్యాలకు ప్రతిరూపాలు. ఈ వ్యాసంలో వ్యాస భారతం - నన్నయ భారతం రెంటినీ తులనాత్మక రీతిలో పరిశీలించారు. సామాజిక నేపథ్యాన్ని అంచనాలోకి తీసుకున్నారు. "సంస్కృత, భారత రచనా కాలంనాటి రాజుకు అంత గొప్ప ప్రాధాన్యతలేదు. నన్నయ భారతం నాటికి రాజపదవికి ఎంతో ప్రాముఖ్యత ఏర్పడినట్లు కనబడుతోంది. "రాజును విమర్శించగలిగే శక్తి సామర్థ్యాలు వ్యాస భారత సమాజంలో సామాన్యుడికి దండిగా ఉండేవి."

అయితే నన్నయ నాటికి ఇవి ఊహలకు సైతం అందనివి. "సంస్కృత భారతంతో పోల్చితే తెలుగు భారతం మిక్కిలి రసవంతమైనది". ఈ వ్యాఖ్యలు ఖండవల్లి వారి సునిశిత విశ్లేషణకు అద్దంపడతాయి. లక్ష్మీరంజనం కాకతీయులను ఎంతో అభిమానించారు. ఈ రాజవంశీయులను గురించిన చారిత్రక అధ్యయనాలు

కొనసాగించారు. పలు కొత్త అంశాలతో "కాకతీయులు" అనే పేరుతో ఒక చిన్న పుస్తకాన్ని రచించారు. కాకతీయులతో పాటు "సాహిత్య వ్యాసంగా తెలుగు" అనే మరో రచన తొలి ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంలో 1975లో ప్రచురణను పొందాయి. ఇవి పరిమాణంలో చిన్న పుస్తకాలే అయినా ప్రామాణికమైనవి. లక్ష్మీరంజనం తెలుగులో ఎంత చక్కగా రాయగలరో ఇంగ్లీషులోనూ అంతే చక్కగా రచనలు చేసేవారని ఆనాటి ఆయన శిష్యులు గుర్తు చేసుకుంటారు. "స్పాట్‌లైట్ ఆన్ తెలుగు" వ్యాస సంకలనం, విశ్వనాథ రచించిన "శ్రీశైల మల్లికార్జున మహాలింగ శతకం" ఆంగ్లానువాదం లక్ష్మీరంజనం ఇంగ్లీషు వైదుష్యానికి ప్రతీకలు.

లక్ష్మీరంజనం సామాజిక బాధ్యత కలిసిన మేధావిగా నిలుస్తారు. భావితరాలకు అవసరమైన ఉన్నత విద్య కోసం కొత్తగా కళాశాలల ఏర్పాటు అవసరమన్న ఆలోచన చేసిన వ్యక్తి ఆయన. ప్రస్తుతం హైదరాబాద్ నల్లకుంటలో ఉన్న ప్రాచ్య కళాశాలను 1958లో లక్ష్మీరంజనం స్థాపించారు. దీనికి 1967 నాటికి ఒక సంపూర్ణ స్వరూపం ఏర్పడింది. తొలి దశలో ఖండవల్లిపట్ల గౌరవాభిమానాలతో పలువురు విద్వాంసులు స్వచ్ఛంద స్థాయిలో ఇక్కడ పాఠాలు బోధించారు. ఇక్కడ చదువుకున్న ఎందరెందరో విద్యార్థులు ఉపాధ్యాయవృత్తిలో రాణించారు. ఎందరో పరిశోధకులు, పండితులు ఇక్కడ ఆచార్యులయ్యారు. ఈ ప్రాచ్యకళాశాలను ప్రస్తుతం ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం ప్రాచ్యకళాశాల పేరుతో పిలుస్తున్నారు. లక్ష్మీరంజనం స్వామీ వివేకానంద వ్యక్తిత్వంతో ఎంతో ప్రభావితులయ్యారు. వివేకానంద విద్యా సమితి పేరుతో ఒక సంస్థను ఏర్పాటు చేశారు. ఇది డిగ్రీ కళాశాలగా ఎదిగింది. ఆరోజుల్లో ఈ కళాశాలలో తెలుగు మాధ్యమం ద్వారా పాఠాలు బోధించేవారు. ఆంగ్లంతో ఎక్కువగా అనుబంధం ఏర్పడని గ్రామీణ ప్రాంత విద్యార్థుల భవిష్యత్తుకు ఈ కళాశాల ఎంతో చేయూతను కల్పించింది. 1957లో లక్ష్మీరంజనం నగరంలోని విద్యానగర్ ప్రాంతంలో సంగీత పాఠశాలను ఏర్పాటు చేశారు. అదే సంవత్సరం ఆంధ్ర రచయితల సంఘాన్నీ ప్రారంభించారు.

బాధ్యతగల పౌరుడిగా లక్ష్మీరంజనం ఆదర్శప్రాయమైన వైఖరిని అనుసరించారు. ప్రతి ఎన్నికలలోనూ తప్పకుండా ఓటు వేసి వచ్చేవారు. ఏడు పదులు నిండిన వయసులోనూ ఓపికతో ఓటింగ్‌లో పాల్గొన్నారు.

నిరాడంబరతకు చిరునామాగా కార్యదక్షతకు కొలమానంగా, ఆదర్శ వర్తనానకి ఉపమానంగా జీవించిన ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం 1986లో ఈ లోకం నుండి నిష్క్రమించారు. ఆయన మరణానంతరం ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పరిశోధనా పత్రిక 'వివేచన' తన సంపాదకీయంలో వ్యాఖ్యానించినట్టు "ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం గారి ఘనకీర్తి ఎంత కొనియాడినా అల్పమే".

# 73 కోదాటి నారాయణరావు

**– డా॥ టి. గౌరీశంకర్**

తెలుగులో మాట్లాడటం, తెలుగు చదవటం చిన్న చూపుగా, నిర్లక్ష్యంగా, ఒక రకమైన నేరంగా పరిగణింపబడే నాటి నిజాం పరిపాలనా కాలంలో తెలంగాణ ప్రాంతంలో గ్రంథాలయాల స్థాపనకు, వాటి వికాసానికి నిర్విరామ కృషి చేసిన నిగర్వి, నిజాయితీ పరుడు, నిరాడంబరుడు కోదాటి నారాయణరావు. అనేక ప్రజాహిత కార్యక్రమాలలో ప్రముఖ పాత్రను పోషించి, పలురంగాలలో తమ సేవలను అందించిన నిస్వార్థపరుడు నారాయణరావు. సౌజన్యం, సౌశీల్యం, సంస్కారం, సామాజిక చైతన్యం రూపు కట్టిన నాటి మేటి కోదాటి. న్యాయశాస్త్ర పట్టభద్రులు, హైదారాబాదు సంస్థాన విమోచనోద్యమంలో ముందు నిలిచిన వ్యక్తి. గాంధేయ వాది, గ్రంథాలయోద్యమకర్త.

వీరు 1914 డిసెంబర్ 15వ తేదీన గంగిశెట్టి గూడెంలోని అమ్మమ్మగారింట్లో పుట్టారు. దీనినే ప్రస్తుతం 'బరాఖతాగూడెం' అని పిలుస్తున్నారు. వీరి స్వగ్రామం రేపాల. ఈ రెండూ ఈ నాటి నల్గొండ జిల్లా, కోదాడు తాలుకాలోని ఆనాటి మునగాల సంస్థాన పరిధిలో ఉన్నవి. వీరి తండ్రి గారి పేరు రంగారావు, తల్లిగారు పుల్లమ్మ, తరువాత ఆమె పేరు మంగమ్మగా మార్చారు.

కోదాటి వారు రేపాలలోనే ఏకోపాధ్యాయ పాఠశాలలో ప్రాథమిక విద్య పూర్తి చేసి, సూర్యాపేటలో మాధ్యమిక విద్య చదివి, ఆ తరువాత ఇంగ్లీషు పరీక్ష రాసి, హైస్కూల్ చదువు కోసం హైదరాబాదు వచ్చారు. ఆ రోజుల్లో వారి ఊళ్ళో మెట్రిక్యులేషన్ పాసైన మొదటి వ్యక్తి కోదాటి వారే. చదువులో ప్పుడూ మొదటి శ్రేణిలో నిలిచేవారు. అయితే ఆర్థిక పరిస్థితులు అనుకూలించక వెంటనే పై చదువులు కొనసాగించలేక పోయారు. ఇరవై ఏళ్ళ తరువాత ఆనాటి అజ్మీర్ ఇంటర్ పరీక్ష రాసి పాసయ్యారు. అనంతరం హైదరాబాదులోని సాయం కళాశాలలో చేరి డిగ్రీ పూర్తి చేసి, ఆ తరువాత ఎల్.ఎల్.బి, కూడా చదివి న్యాయశాస్త్ర పట్టభద్రులయ్యారు.

కోదాటి వారు చిన్నతనం నుంచి తాతగారి వద్ద పెరగటం వల్ల వారి క్రమశిక్షణ వీరి జీవితానికి పునాది వేసింది. ప్రతిరాత్రి తాతగారి దగ్గర పడుకొని ఆయన చెప్పే ముచ్చట్లు, కథలు, పద్యాలు వినేవాడు. ఖాళీ సమయాల్లో ఆయనతో కలిసి పంటపొలాలకు, తోటలకు తిరిగేవాడు. జీవితంలో తనకు కులతత్త్వం గానీ, మతభేదం గానీ ఏర్పడక పోవడానికీ, అంధ విశ్వాసాలు లేకపోవడానికీ తాతగారు నాటిన సంస్కార బీజాలేనని ఆయనే చెప్పుకొన్నారు. వీరు అగ్రవర?లో పుట్టినప్పటికీ, చిన్ననాటి నుంచే అన్ని కులాలు, మతాలు వారితో స్నేహం చేయడం, అందుకు పెద్దలు అడ్డుచెప్పకపోవడం వల్ల వీరిలో అందరూ ఒక్కటే అనే విశాలమైన భావం ఏర్పడింది. ఇది ఆయన తదనంతర కాలంలోని ప్రజాజీవితానికి బాగా తోడ్పడింది.

వీరు మూడు, నాలుగేళ్ళ ప్రాయంలో ఉన్నప్పుడే అంటే 1918లో వీరి గ్రామంలో గ్రంథాలయం స్థాపించబడింది. వీరు ఏడవ ఏటనే గ్రంథాలయానికి వెళ్ళి పుస్తకాలు చదవటం ప్రారంభించారు. తాను చదవడమే గాక, మిగతా పిల్లల చేత చదివింపజేసే వారట. గ్రంథాలయంలోని పుస్తకాలు కొన్ని దశల వారీగా బయటికి తీసుకొని వెళ్ళి తోటి పిల్లలకు ఇచ్చి, వారు చదివాక, వారాంతంలో వాటన్నింటినీ పోగుజేసి తిరిగి గ్రంథాలయానికి చేర్చి భద్రపరిచేవారట.

ఆనాడు వీరి ఊళ్ళోని గ్రంథాలయానికి 'ఆంధ్రపత్రిక' వచ్చేది. అందులో పానుగంటి వారి 'సాక్షి' ఉపన్యాసాలు ఉండేవి. కోదాటి వారు వాటిని బాగా చదివే వారు. ఒకనాడు 'ఆంధ్ర పత్రిక' ఉగాది సంచికలో అచ్చయిన పంజాబు అకాలీల సత్యాగ్రహం బొమ్మలు, సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొన్న నాయకుల ఫొటోలు, జలియన్ వాలాబాగ్ ఉదంతం – ఇవన్నీ వీరిని బాగా ప్రభావితం చేశాయి. వాళ్ళలాగానే దేశం కోసం ఏదైనా చేయాలనే దృధ సంకల్పం వీరిలో నాటుకొంది. ఆ సమయంలోనే తాతగారి మాటల వల్ల గాంధీ గారి పట్ల భక్తి విశ్వాసాలు కుదిరాయి. ఆంగ్ల ప్రభుత్వం పట్ల అసహ్యం ఏర్పడింది. గ్రామంలో ఖద్దరు పరిశ్రమ ఏర్పడడంతో ఖద్దరు వస్త్రధారణ పట్ల అభిరుచి కలిగింది.

జీవిక కోసం నారాయణరావు గారు ఆనాటి సురవరం వారి 'గోలకొండ' పత్రికలో ప్రూఫ్ రీడర్‌గా చేరి మూడు నెలలే పని చేశారు. దానితో జర్నలిజంపై ఆసక్తి కలిగింది. అటు పిమ్మట ముందుముల నరసింహారావు గారి సంపాదకత్వంలో వెలువడే ఉర్దూ పత్రిక 'రయ్యత్'లో అడ్వర్టయిజ్‌మెంట్ ఏజెంట్‌గా పనిచేశారు. ఆ తరువాత ఆంధ్రా ఇన్సూరెన్స్ కంపెనీ ఏజెన్సీ తీసుకొని ఖమ్మానికి మకాం మార్చారు. ఇది వీరి జీవితంలో గొప్ప మలుపుకు దారి తీసింది.

అప్పటి నుంచి కోదాటి వారికి ప్రజలతో సాన్నిహిత్యం ఏర్పడింది. ఎందరో యువకులను చేరదీసి వారిని కార్యకర్తలుగా తీర్చిదిద్ది, ఉద్యమోన్ముఖుల్ని చేశారు. అస్పృశ్యతా నివారణ, జాతీయోద్యమం, గ్రంథాలయోద్యమం – ఈ మూడింట తన పోరాట పటిమను ప్రదర్శించారు. హరిజన హాస్టళ్ళలోని విద్యార్థులకు విద్యనందించి, వారిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడానికి కృషి చేశారు. ఇందుకోసం కొందరు యువ కార్యకర్తలను నియమించారు. ఆనాడు వర్తక వ్యాపారులను ప్రభుత్వోద్యోగులు బాగా ఇబ్బంది పెట్టేవారు. వారి ఆగడాలను అడ్డుకోవడానికి వర్తకులందరినీ ఏకం చేసి, సంఘటిత శక్తిగా రూపొందింపజేశారు. వర్తక ప్రముఖులతో చర్చించి, వర్తక సంఘాన్ని ఏర్పాటు చేశారు. దానికి అధ్యక్ష, కార్యదర్శులను నియమించి, కార్యక్రమాలు నిర్వహించే బాధ్యతను మాత్రం కోదాటి వారు తమ భూజానికెత్తుకున్నారు. తద్వారా ప్రభుత్వం చేసే దౌర్జన్యాలను ఎదుర్కోవడమే గాక, తమ నడుమ ఏర్పడే తగాదాలను కూడా ఈ సంఘం ద్వారా పరిష్కరించుకునేవారు. అప్పటి నుంచే వారానికి ఒకరోజు దుకాణాలను మూసివేసే పద్ధతి ప్రవేశ పెట్టబడింది.

వీరి నాయకత్వం ఎందరినో ఆకట్టుకొంది. ఆనాడు ఎం.ఎస్.రాజులింగం, కొమరగిరి నారాయణ రావు, యల్లాప్రగడ కృష్ణ మూర్తి, సుగ్గల అక్షయ లింగం గుప్తా, గెల్లా కేశవరావు వంటి వారెందరో కోదాటికి అండగా నిలిచారు. ఇటువంటి సామాజిక ఉద్యమాలలో తలమునకలుగా ఉంటూనే, మరొక వైపు సాహిత్య కళారంగాల పట్ల అభిరుచిని, అభినివేశాన్ని ప్రకటించేవారు. సాహిత్య గోష్ఠులు, సారస్వత సమావేశాలు, కవి సమ్మేళనాలు, సంగీత కచేరీలలో స్వయంగా పాల్గొనడమే గాక, వాటి ఏర్పాటుకు తోడ్పాటును అందించేవారు.

ఆనాడు కొడిగట్టి పోతున్న తెలుగు భాషా పరిస్థితిని కోదాటి వారు చేపట్టిన గ్రంథాలయోద్యమం దోహదపడింది. వీరు చిన్నతనంలోనే సొంత ఊళ్ళో 'శ్రీవేంకటేశ్వర మనోహర బాలభారతీ పుస్తక భాండాగారం' పేరుతో ఒక గ్రంథాలయాన్ని స్థాపించారు. వీరు, తోటి విద్యార్థులు చదివిన పాఠ్యపుస్తకాలనే అందులో ఉంచి, క్రమంగా పుస్తకాలు బయటి నుంచి సేకరించి వాటి సంఖ్యను పెంచారు. నెమ్మదిగా తోటి పిల్లలతో అణా, రెండణాలు చందాలుగా కట్టించారు. అట్లా అంచెలంచెలుగా గ్రంథాలయాల ఏర్పాటుకు నాంది పలికారు. ఆ తరువాత 1927లో సూర్యాపేటలోని 'విజ్ఞాన నికేతన గ్రంథాలయం' ఆయన కృషి వల్లనే ఏర్పడింది. ప్రతి ఏటా మూడు రోజుల పాటు భారీ ఎత్తున వార్షికోత్సవాలు జరిపేవారు. ఈ సందర్భంగా ఇటు

నిజాం ప్రభువులను, అటు బ్రిటిష్ పాలకులను ఆహ్వానించి ఒకే వేదికపై వారిని సమావేశ పరిచేవారు. 1944లో ఇల్లెందులో జరిగిన 25వ ఆంధ్ర దేశ గ్రంథాలయ మహాసభకు బూర్గుల రామకృష్ణారావు అధ్యక్షత వహించారు. ఆ సభకు అటు కోస్తా, ఇటు రాలయసీమ, మన తెలంగాణా ప్రాంతాల నుంచి అనేక మంది ప్రముఖులు విచ్చేశారు. ఆనాటి గ్రంథాలయోద్యమం యావదాంధ్రదేశానికి ప్రాతినిధ్యం వహించే ఉద్యమంగా మారింది.

హైదరాబాదులోని రెడ్డి హాస్టల్‌లో జరిగిన పదవ ఆంధ్రమహాసభ సమయంలోనే కోదాటి వంటి వారికి తెలుగు భాషను పరిరక్షించుకోవాలనే సంకల్పం కలిగింది. దాని పర్యవసానంగా నిజాం రాష్ట్ర ఆంధ్ర సారస్వత పరిషత్తు అవతరించింది. పోలీసు చర్య అనంతరం అలంపురంలో ఈ పరిషత్తు ఉత్సవాలు జరిగాయి. అప్పుడు 'నిజాం రాష్ట్ర' అన్న పదాన్ని తీసివేసి, ఆంధ్ర సారస్వత పరిషత్తుగా మార్చివేశారు. ఇటీవలి కాలంలో ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం ఏర్పడిన నేపథ్యంలో దీనిని 'తెలంగాణా సారస్వత పరిషత్'గా మార్చిన విషయం మనకు విదితమే.

'ఆంధ్రమహాసభ' రెండుగా విడిపోయినప్పుడు కోదాటి వారు అభ్యుదయవాదుల పక్షాన నిలిచారు. ఒకవైపు సనాతన వాదులతో, మరొకవైపు కమ్యూనిస్టులతో వైరం పెట్టుకోకుండా, కోదాటి వారు అందరి తలలో నాలుకలా మెలిగేవారు. స్టేట్ కాంగ్రెస్‌లో స్వామి రామానంద తీర్థ పక్షంలో ఉన్నారు వీరు. కాంగ్రెస్ సభ్యులుగా, అఖిల భారత కాంగ్రెస్ సభ్యులుగా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంలో కోదాటి వారు బాగా పాటుపడ్డారు. వీరికి సహకార సంఘం కార్యకలాపాలతో మంచి సంబంధం ఉండేది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తరువాత కొంతకాలం రాష్ట్ర సహకార సంఘానికి అధ్యక్షులుగా పనిచేశారు. రచయితలకు కూడా సహకార సంఘాలు ఉండాలని వాదించేవారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంస్థ అధ్యక్షునిగా, గాంధీ స్మారక నిధి కార్యకర్తగా, గాంధీభవన్ మేనేజింగ్ ట్రస్టీగా, శ్రీకృష్ణదేవరాయ ఆంధ్ర భాషా నిలయం అధ్యక్షులుగా, భాగ్యనగరు ఖాదీ సమితి కార్యదర్శిగా ఆయన ఎంతో నిబద్ధతతో వ్యవహరించారు. తెలంగాణా స్వాతంత్ర్య సమరయోధులకు పెన్షన్లు ఇప్పించడంలో కోదాటి వారు చేసిన కృషి మరువరానిది.

ఇంతటి సామాజిక సేవా కార్యకర్తకు, తెలంగాణా వికాసానికి నిస్వార్థంగా పనిచేసిన నాయకునికి కాకతీయ విశ్వవిద్యాలయం వారు గౌరవ డాక్టరేట్‌ను ఇచ్చి సత్కరించారు. అయినప్పటికీ కోదాటి వారికి ఇంకా రావలసినంత గుర్తింపు రాలేదని బాధపడే వారున్నారు. ఆయనది నిశ్శబ్దంగా పోరాటం చేస్తూ పోయే తత్వం. ప్రచారాలకు ప్రాకులాడి, ప్రలోభాలకు లోబడే మనిషి కాదు. తన నమ్మకాన్ని, విశ్వాసాన్ని కాదనుకొని పరిస్థితులతో రాజీపడే మనస్తత్వం కాదు ఆయనది. ఆయన వ్యక్తిత్వం మహోన్నతమైనది. తనకు న్యాయం, ధర్మం అనిపించిన మార్గంలోనే ఆయన నడిచారు. భగవద్గీతలో చెప్పినట్లు ఫలితం కోసం ఎదురు చూడకుండా తన పనులు తాను చేసుకొంటూ వెళ్ళేవాడు. అసలు సిసలైన గాంధేయవాది. అజాత శత్రువు అన్న మాట ఆయనకు అక్షరాల అతుకుతుంది.

ఈ తెలంగాణా తేజోమూర్తి 2002 నవంబరు 11వ తేదీన కన్ను మూశారు. అయినా వారి సేవలు మాత్రం సదా స్మరణీయమైనవి.

# 74 కుమ్రం భీం

– డా॥ ఎస్.ఎం. ప్రాణ్‌రావు

తన జీవిత కాలంలోనే లెజండ్‌గా మారిన మహా మహులలో కుమ్రం భీం ఎన్నతగినవాడు తన తెగ అజేయమైనదని, భీంకి అంతులేని విశ్వాసం. ఆ విశ్వాసం నైజాం పాలకవర్గం గుండెల్లో గుబులు రేపింది. భీం తన అనుచరులతో జిల్లా కేంద్రమైన అసిఫాబాదును ముట్టడించి, దానిని స్వాధీనం చేసుకుంటాడని, అప్పటి ఆసిఫాబాదు కలెక్టరు మూల్వీ అబ్దుల్‌గుత్తార్ H.C.S. ప్రభుత్వానికి నివేదిక పంపాడు. కలెక్టర్ సూచనని అనుసరించి, జిల్లా కేంద్రాన్ని ఆసిఫాబాదు నుంచి ఆదిలాబాదుకు మార్చడం జరిగింది.

స్వేచ్ఛా పిపాస భీం రక్తంలో ఉంది. అందుకే ప్రభుత్వం విదిలించిన ఎంగిలి మెతుకులలాంటి అధికారిక ముదుపులకు ఆశపడకుండా, వీరులుగా మరణించడానికి అతను మొగ్గు చూపుతాడు. అందుకే అతని నాయకత్వంలో కేవలం పాతకాలపు కత్తులు, దుడ్డుకర్రలు ఆయుధాలుగావున్న 500 మంది గోండులు అత్యంత ఆధునిక ఆయుధాలు కలిగివున్న నిజాం సేనతో చావో రేవో తేల్చుకోవడానికి సిద్ధపడతారు.

నిన్నటి నుంచి నేటికి, నేటినుంచి రేపుకి పగ్గాలు లేకుండా పరుగులు పెడుతున్న కాలంలో, దాదాపు 90 సంవత్సరాలు వెనక్కి వెడితేనేగానీ, వాస్తవిక భీంని నిజాయితీగా ఆవిష్కరించడం సాధ్యంకాదు. ఆ ఆవిష్కరణ కోసం ఓపికున్ననంతమేరకు ఆదిలాబాదు అడవుల్లో తిరుగుతూ, గోండు గూడాలకి వెళ్ళి అనేకమంది గోండులతో ముఖాముఖిగా మాట్లాడడం జరిగింది. నేను కలిసిన వారందరిలోకి మణిపూస సోంబాయి. సోంబాయి కొమ్రం భీం భార్య. 1990 నాటికి ఆమె వయస్సు 85 సంవత్సరాలు. ఆమె నివాసం దోచె. ఆమెతోపాటు 18 ఏళ్ళ ఆమె మనమడు సోనేరావు కూడా ఉన్నాడు.

భీంతో వివాహం అయిన నాటి నుంచి, 1940లో పోరాటం జరిగిన జోడెన్ ఘాట్‌లో కూడా భీం వెంటేవుంది సోంబాయి. కొమ్రం భీం వ్యక్తిత్వం ఆమెవల్ల తేటతెల్లమయింది. భీం దృక్పథం వెలుగులోకి వచ్చింది. సోంబాయిని ఫొటో తీసిన ఫొటోగ్రాఫర్ అనుతుల శరత్‌బాబు, ఆమెను ఇంటర్వ్యూ చేసిన తొలి వ్యక్తి నేను కావడం నిజంగా మా అదృష్టం.

సొంబాయినిగాకుండా చాలామందిని కలవడం జరిగింది. వారిలో ముఖ్యుడు కర్పెతబాదు. యుద్ధంలో కర్పెతబాదు ముందు వరుసలో ఉన్నాడు. అతనికి తూటా తగిలింది. నిర్బంధంలోకి తీసుకుని చెఱసాలలో పడేసారు.

జోడెన్ ఘాట్‌లో జరిగిన పోరాటంలో కేవలం 14 మంది గోండులు మాత్రమే మరణించారని, కలెక్టర్ అబ్దుల్ సత్తార్ అధికారికంగా ప్రకటించినా, ఆనాటి పత్రికలలో వచ్చిన వార్తలు భిన్నంగా ఉన్నాయి. గోలకొండ పత్రిక, ముషీర్–ఎ–దక్కన్ పత్రికల ప్రకారం ఆ పోరులో

వందమందికి పైగా గోండులు మరణించారు. ఆ ప్రాంతం అంతా దుర్గంధం వెదజల్లుతున్న కుళ్ళిపోయిన శవాలతో నిండివుంది.

నేను కలిసిన మరో ముఖ్యమైన వ్యక్తి సెడాంమారు. 1990 నాటికి ఆయన విశ్రాంత ఉపాధ్యాయుడు. వయస్సు సుమారు 70 ఉంటుంది. కొమరం భీంని బాగా దగ్గరగా చూసిన వ్యక్తి. మారు మాష్టారు భీం గురించి ఎన్నో విషయాలు చెప్పాడు. ఇలా విపులంగా జరిగిన పరిశోధనను ఆధారం చేసుకుని కుమ్రం భీం వ్యక్తిత్వానికి సహజత్వాన్ని, వాస్తవికతను చేకూర్చడం జరిగింది.

**1. భీం వ్యక్తిత్వం**

కుమ్రం భీం 1901లో పుట్టివుంటాడు. భీం సాధారణ శరీర సౌష్టవం కలిగి మామూలు ఎత్తు కలిగిన వ్యక్తి. కొద్దిగా ఎత్తుపళ్లు ఉండేవి. పెద్ద పెద్ద అంగలు వేస్తూ నడిచేవాడు. నడుస్తూ మాట్లాడేవాడు. అతనిది కంచుకంఠం. గోండులు ధరించే సంప్రదాయ దుస్తులనే ధరించేవాడు. చేతిలో గుత్ప పట్టుకుని చంకలో గొడుగు ఉంచుకునేవాడు. తలపాగ ధరించేవాడు. అప్పుడప్పుడు రూమీ టోపి పెట్టుకునేవాడు. భీం చదువుకున్నవాడు. తెలుగు, ఉర్దూ రెండు భాషలూ చదవడం, వ్రాయడం వచ్చు.

బాల్యంలో అడవిలో పశువులు మేపుతూ, బుక్కా గులాల్ అమ్మే అయ్యవారి నుంచి చదువు నేర్చుకున్నాడు. దొంతి ఆకుల యాదటోమ్ పుల్లలతో రాసిన అక్షరాలను దిద్దాడు. జొన్నలు, మక్కలు గురుదక్షిణగా పొందిన అయ్య వారు ఎక్కాలు, సుమతీశతకం, దాశరథీ శతకం కంఠతా పట్టించాడు. ఇవిగాక గోండు రాజులైన ఖిల్లాల్‌సింగ్, కేసరిసింగ్, రాంసింగ్ మొదలైన వారి కథలు విన్నాడు. నైజాం మరియు బ్రిటిష్ సైన్యంతో పోరాడి 1860లో నిర్మల్‌లో ఉరితీయబడ్డ అమరవీరుడు రాంజీ గోండును గురించి కూడా విన్నాడు.

భీం వృత్తిరీత్యా రైతు. ఇతర రైతుల మాదిరిగానే భూమిని నమ్ముకుని పగలు రాత్రి శ్రమించేవాడు. పిల్లలను ముద్దు చేసేవాడు. వారి చదువు కోసం మడావి మహదు మహాదేమ్ అనే పంతులుని కూడా నియమించాడు.

భీం తన ముగ్గురు భార్యలను సమానంగా ప్రేమించాడు. అయితే మూడవ భార్య సోంబాయి మీద మక్కువ ఎక్కువ. ఆమెను జాతరలకి తీసుకుని వెళ్ళేవాడు. ఆమెకు కానుకలు కొనిచ్చేవాడు. ఒకసారి కీసలాపూర్ జాతరలో తనకి ఇత్తడిబిందె కొనిచ్చాడని సోంబాయి చెప్పింది.

భీం దైవభక్తి కలవాడు. తమ దేవత పెరసపేన్ మరియు ఇతర దేవతలను నిత్యం పూజించేవాడు. ముస్లిములపట్ల ద్వేషం, వైరం ఎన్నడూ ప్రదర్శించేవాడు కాదు. ఆదిలాబాదు దువ్వం తాలుక్‌దారు అయిన ఆగా మహమ్మద్ అలీపట్ల అతనికి ఎంతో గౌరవం ఉండేది. ఆ గౌరవం వల్లనే భీం బాబాజరీలో పోలీసులకి లొంగిపోయాడు. అసిస్టెంట్ డి.ఎస్.పి. అతీరజా ఉండన్, భీంకి, ఆగా మహమ్మద్ అతనికిగల స్నేహభావాన్ని దృఢపరుస్తాడు.

**2. కుమ్రం భీం – తిరుగుబాటుదారు**

తనతోటి గోండులలా భీం ఎన్నడూ అణిగిమణిగి వుండలేదు. అందుకే సిద్ధఖీ దాడి చేసినప్పుడు దెబ్బకి దెబ్బ తీసాడు. భీం చేతిలో చావుదెబ్బలు తిన్న సిద్ధఖీ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పారిపోయాడు. అంతేకాదు అటవీశాఖ అధికారులు బాబాజరీలో గోండుల గుడిసెలకి నిప్పు పెట్టి, వారి పొలాలు ధ్వంసం చేసినప్పుడు భీం ఎదురు తిరిగాడు. భీం దూకుడికి, అటవీశాఖ అధికారులు తోకముడవక తప్పలేదు.

ఈ సంగతి తెలిసిన సబ్–ఇన్‌స్పెక్టర్ జాఫర్ అహ్మద్ కొంతమంది పోలీసులను వెంటేసుకుని భీంని నిర్బంధంలోకి తీసుకోవడానికి వచ్చాడు. భీంకి, పోలీసులకి జరిగిన ఘర్షణలో మహమ్మద్ జాఫర్ తుపాకీ కూడా వదిలేసి బ్రతుకు జీవుడా అని పలాయనం చిత్తగించాడు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ రెవెన్యూకి రాసిన ఉత్తరంలో ఈ విషయాన్ని అబ్దుల్ సత్తార్ పేర్కొన్నాడు. మహమ్మద్ జాఫర్ నుంచి తుపాకీ చేజిక్కించుకున్న భీంలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. అందుకే కోర్టు నుంచి వచ్చిన సమన్లను కూడా లెక్కచెయ్యడు.

**3. భీం – మూఢనమ్మకాలు**

కుమ్రం భీం మూఢ నమ్మకాలను విశ్వసిస్తాడని అతడి గురించి ప్రచారం జరిగింది. భీం తన దేవుళ్ళని భక్తి ప్రపత్తులతో పూజించేవాడు. తన తెగకి చెందిన అన్ని రకాల కర్మకాండలలోను పాల్గొనేవాడు. అయితే అతనికి

మూఢనమ్మకాలు లేవు. యుద్ధానికి ముందురోజున వందలమంది గుమిగూడిన సభలో భీం ప్రసంగిస్తూ ముందుకు దూకలేనివాళ్ళు, ప్రాణభయంవున్నవాళ్ళు వెనక్కి తిరిగి వెళ్ళిపోవచ్చునని కుండబద్దలుకొట్టినట్టు చెప్పాడు.

యుద్ధానికి ముందుకు కదులుతున్నప్పుడు, గోండులు తమని ఏదో మానావాతీతశక్తి, ఆవహించి కదుపుతున్నట్టు కదులుతారు. అది ఒక trance like motion. అందువల్లనే భీంకి ఇతరులకి కొన్ని అతీంద్రియశక్తులు వున్నాయన్న నీలివార్తలు వ్యాపించాయి. వీటిని అజ్ఞానులైన తన పోలీసు కానిస్టేబుల్స్ నమ్మారని అబ్దులు సత్తార్ తన నివేదికలో పేర్కొన్నాడు.

'నేను చావుకి సిద్ధపడే వచ్చాను' అని భీం ఎలుగెత్తి అరుస్తాడు. అది ధీరోదాత్తుడైన ఒక వీరుడి అరుపుగానీ మూఢనమ్మకాల మూర్ఖుడి అరుపుకాదు. అతనిచుట్టూ ఉందని భావించే ఒక మాయాచక్రం, అతనిలో ఉన్నాయనుకున్న మానవాతీత కదలికలు, తుపాకి గుళ్ళు అతని శరీరానికి తగిలి, గాలిబుడగల్లా పేలిపోవడానికి అతను శరీరంనిండా రాసుకున్న ఆకుపసరు, ఇవేమీ వాస్తవంకావు. అవన్నీ కాకమ్మకథలే.

కుమ్రం భీం పైకి యుద్ధానికి వచ్చిన పోలీసు పటాలంతో సివిల్ సర్జన్ డాక్టరు నాయుడు కూడా ఉన్నాడు. అతను యుద్ధంలో చనిపోయిన గోండుల శవ పరీక్ష చేశాడు. గోండుల శరీరాల మీద వున్న గాయాలన్నిటిని అతను విపులంగా వివరించాడు, అవన్నీ తుపాకీ గుళ్ళ గాయాలేనని తన నివేదికలో స్పష్టంగా పేర్కొన్నాడు. అంతేకాదు ఏ గోండు శరీరం మీద ఎలాంటి ఆకుపసరుగానీ, అలాంటి పసరు పూసుకున్నందువల్ల ఏర్పడ్డ రంగుగానీ ఎక్కడా లేవని తన నివేదికలో పేర్కొన్నాడు.

చేతిలో ఏ ఆయుధం లేకుండా కుమ్రం భీం నిజాం సైనికులమీదికి దూకాడని ఒక కట్టుకథ ఉంది. చేతిలో ఏ ఆయుధం లేకుండా భీం తమవైపు సుడిగాలిలా దూసుకువచ్చాడన్నది అభూతకల్పన అని అబ్దుల్ సత్తారు తన నివేదికలో స్పష్టంగా పేర్కొన్నాడు. పై వాస్తవాలవల్ల భీంకి ఎలాంటి అతీంద్రియ శక్తులు, తాంత్రిక జిత్తులు లేవని తెలుస్తుంది.

**4. భీం యోధుడు**

భీం పుట్టుకతోనే యోధుడు, అతడు రాజగోండు, బాబా జరీలో, భీం తన శత్రువుపై మెరుపుదాడి చేస్తాడు. ఇలాంటి గెరిల్లా తరహా దాడులు కేవలం కాకలుదీరిన యుద్ధవీరులే చేస్తారు. దాదాపు 500 మంది గోండులు, చేతికి అందిన ఆయుధాలను తీసుకుని జోడెన్ ఘాట్‌కి రావడానికి కారణం భీంలోని యోధుని లక్షణాలు మరియు గోండు రాజ్యం స్థాపించాలనే అతని ఆశయం తప్ప మరొకటి కాదు. ఈ ఆశయాన్ని అబ్దుల్ సత్తార్ కూడా తన నివేదికలో ధృవపరుస్తాడు.

గోండుల దగ్గర తుపాకీలు కత్తులు, బల్లెములు, లాఠీలు ఉన్నాయని అబ్దుల్ సత్తార్ స్వయంగా చెబుతాడు. గుండ్రంగా తిరిగే ఒక చక్రానికి, పెద్ద తుపాకీ అమర్చి ఉండటం తను చూశానని, సహాయక తాలుక్‌దార్ చెబుతాడు. అది నేరుగా డి.ఎస్.పి. కదిలికల మీద గురిపెట్టబడి వుందని కూడా చెబుతాడు.

భీం మీద దాడి చెయ్యడానికి అవ్వల్ తాలుక్‌దార్ అబ్దుల్ సత్తార్, దువ్వం తాలుక్‌దార్ ఆగా మహమ్మద్ అతా, డి.ఎస్.పి. హిదాయతుల్లా సాహెబ్, అరబ్బులు, చావుష్‌లు, సింధీలు ఇంగా రెవెన్యూ అధికారులు జోడెన్ ఘాట్‌కి సమీపంలో ఉన్న వాధంలో శిబిరాలు దింపారు. సివిల్ సర్జన్ డాక్టరు నాయుడితోపాటు 30 మంది వైద్య సిబ్బంది కూడా వారితో ఉన్నారు. వీళ్ళుగాక ఆనాటి ఆధునిక ఆయుధాలు సమృద్ధిగా కలిగివున్న, ప్రత్యేక శిక్షణ పొందిన 94 మంది కానిస్టేబుళ్ళుకూడా ఉన్నారు.

ఇంత సైన్యం, ఇంతమంది అధికారులు భీంపై ఎలాంటి ప్రభావం చూపలేకపోయారు. భీం చేసిన పెనుదాడికి తనశ్రేణులలో ముందు వరుసలలో ఉన్నవారు తిరోగమించి మరోచోట పొజిషన్స్ తీసుకోవలసి వచ్చిందని అబ్దుల్ సత్తార్ తన నివేదికలో పేర్కొన్నాడు.

అతి బలవంతుడైన అబ్దుల్ సత్తార్‌కి ఆ యుద్ధం అన్నివేళలా అనుకూలంగా లేదు. తనతో మరింత సైన్యాన్ని వెంటబెట్టుకుని రానందుకు అబ్దుల్ సత్తార్ తనని తాను నిందించుకుంటాడు కూడా.

అబ్దుల్ సత్తార్ అతడి పక్కనేవున్న దువ్వం తాలూక్ దార్ ఆగా మహమ్మద్ అతార్ వెంట్రుక వాసి తేడాతో తుపాకీ గుళ్ళను తప్పించుకుంటారు. (The chief leader named Bhim fired at the first talaqdar and the shot struck a tree over his head - Director General Police) ఆ భీకర యుద్ధంలో భీం, అతని మేనల్లుడు రఘు పోలీసుల కెదురుగా కేవలం పది గజాల దూరంలోనే వీర మరణం పొందారు. (A feesilade begar, Bhim fell ten yards away right in front of the line, and near him his nephew - Abdul Sattar).

భీం నేల కొరిగిన తరువాతే మిగిలిన గోండులు యుద్ధరంగం నుంచి తప్పుకొన్నారు. పై వాస్తవాలన్నీ భీంని, ఒక మహాయోధుడిగా మనముందు నిలబెడతాయి. భీం నూటికి నురుపాళ్ళు సమరయోధుడే. పొడవైన మొగలు కత్తి తూసి ముందుకు వస్తున్న భీం, అజేయంగా కనిపించాడు అంటాడు అబ్దుల్ సత్తార్.

భీంని ఒక మహాయోధుడిగా నిర్ధారించడానికి ఇంతకి మించిన ధృవీకరణ పత్రం, ప్రశంసాపత్రం మరియొకటి అవసరంలేదు.

**5. భీం మరణ తేది**

జోడెన్ ఘాట్‌లో యుద్ధం జరిగిన రోజే భీం వీర మరణం పొందాడు. ఆయన 8-11-1940 నాడు చనిపోయాడని ఒక అభిప్రాయం వుంది. జోడెన్ ఘాట్‌లో జరిగిన యుద్ధం గురించి వివరాలు 5-10-1940 నాడు ముషీర్-ఎ-దక్కన్‌లో వచ్చాయని హోమ్ సెక్రటరీ మహమ్మద్ అజర్ హసన్‌కి రాసిన ఉత్తరంలో అబ్దుల్ సత్తార్ పేర్కొంటాడు. 6-10-1940 నాడు కాశీనాథరావు వైద్య, సిరాజుల్ తిర్మియాజి. ఎమ్ నర్సింగరావు, రామాచారి వాస్తవ పరిస్థితులను పరిశీలించడానికి ఆసిఫాబాదు వచ్చారు.

అదేరోజు కాంగ్రెస్ పార్టీకి చెందినవారు, హిందూ ప్రజామండలికి చెందినవారు కూడా వచ్చారని అబ్దుల్ సత్తార్ పేర్కొంటాడు. కాబట్టి కుమ్రం భీం 1940 అక్టోబర్‌లో అమరుడయ్యాడనేది వాస్తవం. కానీ సరియైన తేది 5వ తారీఖు కంటే ముందే ఉంటుందని నా నమ్మకం.

75

# కొమర్రాజు వేంకట లక్ష్మణరావు

– డా॥ వి. జయప్రకాష్

కొమర్రాజు వేంకట లక్ష్మణరావు. తెలుగు భాషా సాహిత్యాల అభివృద్ధికోసం నిరంతరం పరిశ్రమించిన వైతాళికుడు. తెలుగులో విజ్ఞాన సర్వస్వ సంకలనానికి శ్రీకారం చుట్టి, తెలుగు జాతిని పురాణ దశ నుంచి అభివృద్ధిచెందిన విజ్ఞాన శాస్త్రాలవైపు పయనింపజేయడంకోసం అహర్నిశలు తపించిన వ్యక్తి. కొమర్రాజు వేంకట లక్ష్మణరావు అంటే వ్యక్తికాదు. ఒక సంస్థ. కేవలం 46 ఏళ్ళ జీవితకాలంలోనే ఒక సంస్థ కన్న మిన్నగా సేవలు అందించారు.

బహుభాషా పండితుడు, చరిత్రకారుడు, రచయిత, ప్రచురణకర్త, సారస్వత పోషకుడు, విజ్ఞాన సర్వస్వ నిర్మాత. ఇలా బహుముఖాలుగా కృషిచేసిన కొమర్రాజు వేంకట లక్ష్మణరావు కృష్ణా జిల్లా నందిగామ తాలూకా, పెనుగంచిప్రోలులో మే 18, 1877న జన్మించారు. తల్లి గంగమ్మ, తండ్రి వెంకటప్పయ్య.

లక్ష్మణరావు గారికి రెండేళ్ళ వయసప్పుడే తండ్రి చనిపోయారు. దాంతో వారి సవతి అన్న లక్ష్మణరావుగారిని, వారి తల్లి గంగమ్మను భువనగిరికి తీసుకొచ్చి పోషణభారం వహించారు. లక్ష్మణరావుగారి ప్రాథమిక విద్యాభ్యాసం భువనగిరిలోనే సాగింది. లక్ష్మణరావు మేనమామ భండారు మాధవరావు నాగపూర్‌లో ఉండేవారు. ఆయన మొదటి భార్య చనిపోతే, లక్ష్మణరావు గారి అక్క అచ్చమాంబను ఆయనకు ఇచ్చి పెళ్ళి చేశారు. అక్కతోపాటు లక్ష్మణరావుగారు కూడా నాగపూర్ వెళ్లారు. ఆయన విద్యాభ్యాసం బి.ఏ. వరకు నాగపూర్‌లోనే మరాఠీ మాధ్యమంలో సాగింది. 1900 సంవత్సరం నాటికి ఆయన పట్టభద్రులయ్యారు. కలకత్తా విశ్వవిద్యాలయం నుంచి ప్రైవేటుగా 1902లో ఎం.ఏ. ఉత్తీర్ణులయ్యారు. లక్ష్మణరావుగారు చిన్నతనం నుంచి నాగపూర్‌లో ఉండడంవల్ల ఆచార వ్యవహారాల్లో, జీవన విధానంలో, వేషంలోనూ పూర్తిగా మహారాష్ట్ర వ్యక్తిగా పరివర్తనం పొందారు. లక్ష్మణరావుగారి వివాహం కంకిపాటి కరణం కోనూరి మల్లికార్జునరావు కుమార్తె కోటమాంబతో 1897లో జరిగింది.

లక్ష్మణరావుగారు విద్యార్థిగా ఉన్నప్పుడే పత్రికలకు మరాఠీలో వ్యాసాలు, భావగీతాలు రాసేవారు. ఆయన మహారాష్ట్ర ప్రాంతంలో ఉండి మరాఠీలో విద్యాభ్యాసం చేసినా తెలుగు భాషపై మమకారం వీడలేదు. తన సోదరి అచ్చమాంబను కూడ ప్రోత్సహించేవారు. ఇద్దరు కలిసి తెలుగు పత్రికలకు కథలు, వ్యాసాలు రాసి పంపేవారు. ఆ కాలంలో మహారాష్ట్ర సాహిత్య రంగంలో, సాహిత్య సంవాదాలలో కూడా లక్ష్మణరావుగారు ప్రముఖంగా పాల్గొనేవారు. రామాయణంలోని పంచవటి మహారాష్ట్ర లోనిదా, తెలుగుప్రాంతంలోనిదా అన్న వివాదంలో వి.కె. రజ్వాడే అనే పండితునితో వాదించి పంచవటి

తెలుగుదేశంలోనిదే అని సప్రమాణంగా నిరూపించారు. ప్రముఖ మరాఠ కవి మోరోపంత్ రచించిన మహాభారతం కర్ణపర్వం ఎస్.సి. కేట్కర్‌తో కలిసి పరిష్కరించారు. ఆ గ్రంథ ప్రచురణకు సహసంపాదకత్వ బాధ్యత వహించారు. అప్పటికి ఆయనకు ఇరవైఐదేండ్ల వయస్సు కూడా లేదు. లక్ష్మణరావుగారు ఇంగ్లీషువారి గ్రంథాలపై ఆధారపడకుండా మరాఠి గ్రంథాలను ఆధారం చేసుకొని 'శివాజి చరిత్ర'ను ప్రకటించారు. తెలుగువారికి శివాజి చరిత్ర ఆశ్చర్యానందాలతోపాటు గొప్ప ఉత్తేజాన్ని కలుగుజేసింది.

లక్ష్మణరావుగారు చదువు పూర్తయ్యాక, తన తండ్రి దివానుగ పనిచేసిన మునగాల సంస్థానానికి దీవానుగా నియమితులయ్యారు. జమిందారు వెంకట రంగారావు లక్ష్మణరావుగారిని ఎంతో ఆత్మీయంగా, అభిమానంగా చూసుకునేవారు. ఆయన గొప్ప సాహితీవేత్త అయినందుకు రగారావుగారికి ఎంతో సంతోషంగా ఉండేది. అయితే లక్ష్మణరావుగారు మునగాలలో ఎక్కువ రోజులు ఉండలేదు. జమిందారు లక్ష్మణరావు గారిని మద్రాసులో ఉండి న్యాయస్థానాలలో నడుస్తున్న సంస్థాన వ్యాజ్యాలు చూసుకోవాల్సిందిగా కోరారు. దాంతో లక్ష్మణరావుగారి మకాం మద్రాసుకు మారింది.

లక్ష్మణరావుగారు ఒకసారి గోపాలకృష్ణ గోఖలే ఉపన్యాసం విన్నారు. ఆ ఉపన్యాసం విన్నాక దేశహితం కోసం, అభ్యుదయం కోసం ఏదైన సంఘటిత కార్యక్రమం ప్రారంభించాలని ఆయన మనసు తహతహలాడింది. ఆ రోజుల్లో మద్రాసులో ఉన్న కందుకూరి వీరేశలింగం పంతులుగారితో లక్ష్మణరావుగారికి పరిచయం లభించింది. వీరేశలింగం పంతులుగారి సంఘ సంస్కరణ తత్పరత, సాహిత్య సేవ లక్ష్మణరావుగారిని ఎంతగానో ఆకర్షించాయి.

కొమర్రాజు లక్ష్మణరావుగారు రాజా నాయని వేంకటరంగారావు, రావిచెట్టు రంగారావు, ఆదిపూడి సోమనాథ రావు, మైలవరపు నరసింహశాస్త్రివంటి వారితో కలిసి హైదరాబాద్‌లోని సుల్తాన్ బజార్‌లో ఉన్న రావిచెట్టు రంగారావు ఇంట్లో 1901 సెప్టెంబర్ 1న శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం స్థాపించారు. తెలంగాణాలో భాషా సంస్కృతుల వికాసానికి భాషా నిలయం ఎనలేని సేవ చేసింది. నిద్రాణమైనవున్న తెలంగాణ ప్రజలను జాగృతపరిచి కార్యోన్ముఖుల్ని చేసింది.

1906వ సంవత్సర లక్ష్మణరావుగారి జీవితంలో ప్రధాన ఘట్టం. ఆయన తన జీవితంలో సాధించిన మహత్కార్యాలు, సాగించిన ఉద్యమాలకు ఈ సంవత్సరం లోనే బీజాలు పడ్డాయి. 1906లోనే రాజా నాయని వెంకట రంగారావు, రావిచెట్టు రంగారావు, హరిసర్వోత్తమరావు, కాళేశ్వరరావుగార్లతో కలిసి హైదరాబాద్‌లో 'విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలి'ని స్థాపించారు. మండలి స్థాపన సందర్భంలో జనసామాన్యం ముఖ్యంగా స్త్రీలు విజ్ఞానంగలవారైతేగాని, దేశం నాగరిక దేశంగా గుర్తించబడటానికి వీలులేదని, సర్వజనులకు జ్ఞానాభివృద్ధి కలగాలంటే వారి దేశభాషల మూలంగానే జరగాలని అభిలషించారు. జ్ఞాన విషయాలు అసంఖ్యాకంగా ఉన్నాయి. ఏ విషయం గురించి చూసిన తెలుగు భాషలో తగిన గ్రంథాలు లేవు. అందుకే 'ఉడుతాభక్తి' చందంగా తమ అల్పశక్తి కొద్ది తెలుగు భాషకు సేవ చేయడానికి 'విజ్ఞానచంద్రికా గ్రంథ మండలి' పేరుతో సంస్థను స్థాపించామని ప్రజలకు విన్నవించారు.

దేశచరిత్రలు, మహాపురుషుల జివితాలు, చారిత్రక నవలలు, ప్రకృతి లేక భౌతికశాస్త్రాలు, ఇంగ్లీషులోని అందరికి ఉపయోగపడే గ్రంథాలను తెలుగులోకి అనువదించి ప్రచురించేందుకు సంకల్పించారు. ఈ విధంగా ఒక స్థిరమైన ప్రాతిపదికతో విజ్ఞానచంద్రికామండలి స్థాపించబడింది.

తెలుగు భాషలో గొప్ప వాఙ్మయం ఉన్నా అది తెలుగు జాతిని ఆధునికతవైపు నడిపించేందుకు అనువైనదికాదు. పురాణయుగం నుంచి ప్రకృతిశాస్త్ర, రాజకీయ, ఆర్థిక యుగానికి మన ప్రజలకు తీసుకొనిపోవాల్సి ఉంది. కాబట్టి తెలుగు ప్రజలకు ఆధునిక ప్రపంచంలో భాగా అభివృద్ధి సాధించిన ప్రకృతి శాస్త్ర, చారిత్రక, రాజకీయ, ఆర్థిక విజ్ఞానాన్ని ఇవ్వడం ఆవశ్యకమని వారు నిర్ణయించారు.

విజ్ఞానచంద్రికా గ్రంథమండలి పక్షాన మొట్టమొదటి పుస్తకంగా 'అబ్రహాంలింకన్' జీవిత చరిత్రను ప్రచురించారు. తర్వాత లక్ష్మణరావుగారి 'హిందూమహాయుగము' ఆచంట లక్ష్మీపతిగారి 'జీవశాస్త్రం', వేలాల సుబ్బారావు రచించిన

'రాణిసంయుక్త' అనే చారిత్రక నవలను హైదరాబాద్ నుండి ప్రచురించారు.

ఆంధ్రదేశంలో ప్రఖ్యాతిపొందిన చరిత్రకారులలో లక్ష్మణరావుగారు అగ్రగణ్యులు. చరిత్ర రచనలో వారు గొప్ప ప్రమాణాలు సృష్టించారు. ఇంగ్లీషు చరిత్రకారులు రాసిందే వేదం అని కొందరు పెద్దలు నమ్ముతున్న తరుణంలో లక్ష్మణరావుగారు 'హిందూమహాయుగము' ప్రకటించారు. విద్యార్థులు ఇంగ్లీషువారు రాసిన పక్షపాతపు, అసత్యపు చరిత్రను చదవడం లక్ష్మణరావు గారికి బాధకలిగించింది. అందువల్ల ఆయన ఇంగ్లీషు చరిత్రకారుల మీదనే ఆధారపడకుండా ఎన్నో ప్రాచ్య, పాశ్చాత్య గ్రంథాలను, శాసనాలను పరిశీలించి స్వతంత్ర దృక్పథంతో, సత్య దృష్టితో చరిత్ర రాశారు. లక్ష్మణరావుగారికి మరాఠి తెలుగు భాషలతోపాటు బెంగాలీ, తమిళం, మలయాళం, కన్నడం, హిందీ, ఉర్దూ, సంస్కృతం, పాళి, ఇంగ్లీషు భాషలలోను మంచి పరిజ్ఞానం ఉంది. దాంతో వారు ఎన్నో గ్రంథాలను, శాసనాలను స్వయంగా పరిశీలించగలిగారు.

1906 ప్రాంతంలో ఉన్నత పాఠశాలల్లో 'సిటిజన్ ఆఫ్ ఇండియా' అనే పుస్తకం పాఠ్య పుస్తకంగా ఉండేది. బ్రిటిష్‌వారి పరిపాలనవల్ల భారతదేశానికి కలిగిన లాభాలను ప్రస్తుతించే గ్రంథం అది. లక్ష్మణరావుగారి ఉపాధ్యాయులు 'సిటిజన్ ఆఫ్ ఇండియా'లోని రాతలను ఖండిస్తూ పాఠాలు బోధించేవారు. ఈ విధంగా లక్ష్మణరావుగారు తన రచనలచేత విద్యార్థుల్లో జాతీయభావాన్ని పెంపొందించారు. మల్లంపల్లి సోమశేఖరశర్మవంటి ఎందరో యువకులను రచనకు, పరిశోధనకు ప్రోత్సహించారు.

గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారిపై రాజద్రోహనేరం మోపి, వారిని నిర్బంధించారు. విజ్ఞాన చంద్రికా గ్రంథమండలిపైన కూడా పోలీసుల నిఘా ఎక్కువైంది. దాంతో మండలి కార్యస్థానాన్ని హైదరాబాద్ నుండి మద్రాసుకు మార్చారు. మద్రాసు నుండి లక్ష్మణరావుగారి మహమ్మదీయ మహాయుగం మొదలుకొని అనేక విజ్ఞానశాస్త్ర గ్రంథాలు, చిలుకూరి వీరభద్రరావుగారి ఆంధ్రుల చరిత్ర, చారిత్రక నవలలు మొదలైనవి ప్రచురించారు. వీరేశలింగం పంతులుగారి జీవితచరిత్రను మొదటిసారి విజ్ఞానచంద్రికా గ్రంథ మండలి పక్షాన్నే ప్రచురించారు. మండలి పక్షాన 1916 నాటికి 30 గ్రంథాలు ప్రకటించారు.

1912వ సంవత్సరం నుండి విజ్ఞాన చంద్రికా పరిషత్తు పేరుతో వైజ్ఞానిక, చారిత్రక, శాస్త్రీయ గ్రంథాలను పాఠ్యపుస్తకాలుగా నిర్ణయించి పరీక్షలు నిర్వహించారు. గుంటూరు, బందరు, బెజవాడ, నరసాపురం, రాజమహేంద్రవరం, కాకినాడ, హైదరాబాద్ మొదలైన చోట్ల పరీక్షాకేంద్రాలు నిర్వహించారు. పరీక్షల్లో కృతార్థులయిన వారికి యోగ్యతనుబట్టి 116 రూపాయలు నగదు బహుమానం, బంగారు, వెండి పతకాలు, యోగ్యతాపత్రాలు ఇచ్చేవారు. వీరేశలింగం పంతులు, కట్టమంచి రామ లింగారెడ్డి మొదలైనవారు పరీక్షాధికారులుగా ఉండేవారు.

భారతీయ భాషలలో తొలిసారి విజ్ఞాన సర్వస్వం తెలుగులోనే ప్రారంభమయింది. దానికి కారకులు లక్ష్మణరావుగారు. లక్ష్మణరావుగారి జీవితమంతా ఒక ఎత్తు అయితే, వారి విజ్ఞాన సర్వస్వం ఒక్కటి ఒక ఎత్తు. ప్రపంచ విజ్ఞానాన్ని తెలుగువారికి పంచిపెట్టాలని ఆయన తపించిపోయారు. లక్ష్మణరావుగారికి తెలుగులో విజ్ఞాన సర్వస్వం 'ఎన్‌సైక్లోపీడియా ఆఫ్ బ్రిటానికా' తరహాలో తీసుకురావాలని ప్రబలవాంఛ. 1915 నుంచి ఆయన జీవితం మొత్తం విజ్ఞాన సర్వస్వంలో వ్యాసాలు రాయడానికే సరిపోయింది. చరిత్ర పరిశోధనకు ఎన్నో శాసనాలు పరిశోధించాల్సి వచ్చింది. ఈ పనిలో వారికి మల్లంపల్లి సోమశేఖరశర్మ వంటివారు సహాయపడేవారు. లక్ష్మణరావుగారు విజ్ఞాన సర్వస్వం 'అ' కారం మూడు సంపుటాలు ప్రచురించారు. ఈ సంపుటాల్లో విజ్ఞానశాస్త్రం, భాష, ఖగోళశాస్త్రం, చరిత్ర, కళవంటి అంశాలు ఉన్నాయి. ఇందులో 35 శీర్షికలు లక్ష్మణరావుగారే స్వయంగా రాశారు. ఈ వ్యాసాలు విజ్ఞాన సర్వస్వంలో పదకొండు వందల పేజీలు ఆక్రమించాయి. అధర్వణవేదం, అద్వైతం, అభిజ్ఞాన శాకుంతలం, అలంకారాలు, అష్టాదశ పురాణాలు, అట్టబెందు, అష్టాధ్యాయి వంటి వైవిధ్యమైన విషయాలపై లక్ష్మణరావుగారు వ్యాసాలు రాశారు. లక్ష్మణరావుగారు అంకగణితం గురించి రాసినా, అలంకారాల గురించి చెప్పినా, ఆయుర్వేదం గురించి వివరించినా, శృంగారం, పూర్వ లాక్షణికులు మొదలైన సారస్వత విషయాలు

ప్రస్తావించినా, దేశచరిత్రలు, జీవిత చరిత్రలు రాసినా విస్పష్టంగాను, విజ్ఞానదాయకంగాను ఉండటం ఆయన రచనల్లో ప్రత్యేకత.

లక్ష్మణరావు గారు 'అ' కారంతో మూడు సంపుటాలు పూర్తిచేసిన తర్వాత 'ఆంధ్ర' సంపుటాన్ని తయారుచేయడానికి పూనుకున్నారు. అప్పటికి తెలుగువారి గురించి పెద్దగా పరిశోధన జరగలేదు. కాబట్టి ఎక్కువగా పరిశోధించాల్సి వచ్చింది. రాత్రింబవళ్ళు శాసనాలు, ఇతర గ్రంథాల పరిశోధనతో గడిపాడు. దాంతో ఆయన ఆరోగ్యం పాడయింది. మద్రాసు ఎమ్మిగనూరులోని వేదవిలాస భవనంలో పడకకుర్చీలో కూర్చుని ఆంధ్ర సంపుటం కోసం పుస్తకం పరిశీలిస్తూనే... 1923 జూలై 13న 46 ఏళ్ళ వయసులో స్వర్గస్తులయ్యారు.

కొమర్రాజు లక్ష్మణరావు మరణంతో ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం 'అ'కారం మూడు సంపుటాలతో ఆగిపోయింది. లక్ష్మణరావుగారి మరణం తర్వాత కాశీనాథుని నాగేశ్వరరావు లాంటివాళ్ళు విజ్ఞాన సర్వసాన్ని కొనసాగించడానికి ప్రయత్నం చేసినా వారి ప్రయత్నం ఫలించలేదు.

ఆయన బుద్ధి ఎంత నిశితమో, విజ్ఞానం అంత విశాలం. ఆయనకు తెలియని విషయమంటూలేదు. వేదాల దగ్గరనుంచి సమస్త విషయాలు ఆమూలాగ్రంగా ఆయనకు తెలిసిన విషయాలే. పోతన నివాస స్థలం అయిన ఏకశిలానగరం కడప జిల్లాలోని ఒంటిమిట్ట కాదని, వరంగల్లు అని సహేతుకంగా నిరూపించారు. త్రిలింగాలలో ద్రాక్షారామం, శ్రీశైలం తర్వాత మూడవది శ్రీకాళహస్తి కాదని, మంథని దగ్గర ఉన్న కాళేశ్వరమని మొదట చెప్పినవారు లక్ష్మణరావుగారే.

సాహిత్యవేత్తగా, చరిత్రకారుడిగా, విజ్ఞానసర్వస్వ నిర్మాతగా తెలుగుజాతిని అభివృద్ధిపథంలో విజ్ఞానంవైపు పయనింపజేసిన కొమర్రాజు వేంకట లక్ష్మణరావుగారు తెలుగు ప్రజల్లో... ముఖ్యంగా తెలంగాణ ప్రజల హృదయాల్లో శాశ్వత స్థానం సంపాదించుకున్నారు.

# 76 కొండా లక్ష్మణ్ బాపూజీ

– బి.ఎస్. రాములు

**ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ప్రజల మనిషి. స్వాతంత్ర్య సమరయోధుడు.**

ప్రముఖ గాంధేయవాది.

నిజాం రాజ్యం నుండి ఎదిగిన జాతీయ నాయకుడు.

ఆయన వ్యక్తిత్వం విశిష్టమైనది.

జీవిత లక్ష్యాలు మహోన్నతమైనవి.

పదవులకోసం ఎన్నడూ అర్రులు చాచని ధీరోదాత్తుడు.

ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం తెరిచిన పుస్తకం.

కొండా లక్ష్మణ్ కేవలం రాజకీయ నాయకుడు కాదు.

అనేక సామాజిక రంగాల్లో కృషి చేసిన ఉద్యమకారుడు.

కొండా లక్ష్మణ్ బాపూజీ లాలాలజపతిరాయ్, మహాత్మా జ్యోతిబా ఫూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, గాంధీజీల వారసుడు.

కొండా లక్ష్మణ్ బాపూజీ తన యవ్వనకాలంలో భగత్‌సింగ్, సుభాష్ చంద్రబోస్, దామోదరం సంజీవయ్య, లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ, రామమనోహర్ లోహియా వంటి మహానాయకులవలె మిలిటెంటు ఉద్యమాలు నిర్మించిన యువకుడు.

97 సంవత్సరాల నిండు జీవితం జీవించిన కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితంలో ఎన్నో పరిణామాలు చూడవచ్చు.

బాపూజీ జీవితం పరిశీలిస్తే ఆయన జీవితాన్ని, వ్యక్తిత్వాన్ని, పరిణామాల్ని దశలవారీగా పేర్కొనవచ్చు.

జాతీయోద్యమం, ఆనాటి సమాజం, కుల వ్యవస్థ, కుల వృత్తులు, పేదరికం, హైదరాబాద్ స్టేట్ ప్రత్యేక స్థితిగతులు మొదలైనవాటి గుండా కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం సాగుతూ వచ్చింది.

యువనాయకుడుగా మల్లయోధుడుగా అనేక క్రీడలకు సారధిగా తిరిగిన కాలాన్ని బాపూజీ జీవితంలో మొదటి దశగా చెప్పవచ్చు.

రెండవ దశలో ఆదిలాబాద్ జిల్లాలో తానున్న ప్రాంతంలో మొట్టమొదటి విద్యావంతుడుగా, ఉన్నత విద్య కోసం నిరంతర కృషి చేశాడు.

సంఘ సంస్కర్తగా పరిణతి చెంది జీవితాంతం కృషి చేసిన బాపూజీ వ్యక్తిత్వాన్ని మూడవ దశగా చెప్పవచ్చు.

ఉద్యమ కాలంలో కొండా లక్ష్మణ్ నైజాం వ్యతిరేక ఉద్యమకాలం నుండి చేనేత కష్టనివారణ, పద్మశాలి సంక్షేమ సంఘం, సహకార సంఘాల నిర్మాణం, హైకోర్ట్ నిర్మాణంలో చురుకైన పాత్ర నిర్వహించాడు.

కొండా లక్ష్మణ్ రాజకీయనాయకుడుగా, శాసన సభ్యుడిగా, మంత్రివర్గాల్లో వివిధ శాఖల మంత్రిగా పనిచేశారు.

కొండా లక్ష్మణ్ బాపూజీలో మానవీయ, సంస్కృతి, నైతిక విలువలు, ఆదర్శ వ్యక్తిత్వం నేటికీ ఆదర్శప్రాయం.

ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వెనుకబడిన ఆదిలాబాదు జిల్లా వాంకిడి గ్రామంలో అమ్మమ్మ గారింట 1915 సెప్టెంబరు 27 తేదీన జన్మించారు.

కొండా పోశెట్టి, అమ్మక్క దంపతులకు కొండా లక్ష్మణ్ ఐదవ సంతానం. తండ్రి పోశెట్టి పోస్ట్‌మ్యాన్‌గా పని చేసేవాడు. కొండా లక్ష్మణ్ రెండున్నరేళ్ల పసిప్రాయంలోనే తల్లి మరణించింది. కొండా లక్ష్మణ్ ఐదో సంతానం. ఐదుగురు సంతానంలో నలుగురు మగపిల్లలు, ఒక్కరు ఆడపిల్ల. కొండా పోశెట్టి పోస్ట్‌మ్యాన్ ఉద్యోగం చేస్తున్నపుడు ప్రభుత్వ రికార్డుల్లో బాపూజీగా చేర్చబడింది. పోశెట్టి పేరు బాపూజీగా మారింది.

పోశెట్టి (బాపూజీ) సేవను గమనించి గుమస్తాగా, క్యాషియర్‌గా, సబ్ పోస్ట్‌మాస్టర్‌గా ప్రమోషన్‌లు ఇచ్చారు. కొండా లక్ష్మణ్ ఉర్దూ, మరాఠీ మీడియంలలో పాఠశాల విద్యను కొనసాగించాడు. తండ్రి లక్ష్మణ్‌ను రాజూర, మాణిక్‌ఘర్‌లో నాలుగవ తరగతిలో చేర్చారు. మాణిక్‌ఘర్ ఆనాడు నాలుగువేల జనాభాతో ఒక తాలూకా కేంద్రం. కొండా లక్ష్మణ్ చదువుతున్న రాజూరా ... మాణిక్‌ఘర్‌కు 20 కిలోమీటర్ల దూరంలో ఉండేది.

అది మరాఠీ మాట్లాడే ప్రాంతం. మహాత్మాగాంధీ స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో చాందా (చంద్రపూర్) రావటం జరిగింది.

అప్పుడు కొండా లక్ష్మణ్ వయస్సు 15 సంవత్సరాలు. మహాత్మాగాంధీ వస్తున్నాడనే వార్త కొండా లక్ష్మణ్‌కు ఎంతో ఉత్సాహాన్నిచ్చింది. కొండా లక్ష్మణ్ చదువుతున్న పాఠశాల ఉపాధ్యాయ వర్గం మహాత్మాగాంధీ పర్యటనకు ఎవ్వరూ వెళ్లవద్దని ఆదేశించారు. అయినా కొండా లక్ష్మణ్ కొంతమంది విద్యార్థులను రహస్యంగా తీసుకొని చాందా వెళ్ళి మహాత్మాగాంధీ ఉపన్యాసాన్ని వినటం జరిగింది. ఆనాడు మహాత్మాగాంధీ ఇచ్చిన ఉపన్యాసం, దర్శనం కొండా లక్ష్మణ్ జీవితాన్ని ఎంతగానో ప్రభావితం చేసింది.

కొండా లక్ష్మణ్ తన తెల్ల ప్యాంటును చించి స్వయంగా గాంధీ టోపిని తయారు చేసుకొని ధరించటం 1932 నుంచి ప్రారంభించారు. నిజాం రాజ్యంలో తెల్ల టోపి ధరించటమనేది ప్రభుత్వ ధిక్కారానికి చిహ్నంగా ఉండేది. కొండా లక్ష్మణ్ 17వ ఏట ప్రాథమిక విద్యను పూర్తి చేసి మిడిల్ స్కూల్‌లో 1935లో 7వ తరగతి పాసయ్యేనాటికి ఆయన వయస్సు 20 ఏండ్లు. బాపూజీ 1935లో ఏడవ తరగతి ఉత్తీర్ణుడైన తరువాత హైదరాబాద్ సిటీలో విద్యనభ్యసించాడు. ఈ సందర్భంలో అన్ని తరగతులకు మానీటర్‌గా వ్యవహరించాడు.

1936-37 ప్రాంతంలో గణేశ్ వ్యాయామశాల్లో వ్యాయామం అభ్యసించాడు. 1938-39 ప్రాంతంలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ప్రారంభమైన వందేమాతరం ఉద్యమం పట్ల ఆసక్తి కనపర్చాడు. పాఠశాలలో లక్ష్మణ్ గణితంలో ఫస్ట్ ర్యాంక్ తెచ్చుకున్నాడు. కబడ్డీ పోటీల్లో జిల్లా స్థాయిలో పాల్గొనడంతో పాటు హాకీ, ఫుట్‌బాల్ కెప్టెన్‌గా కూడా నియమించబడ్డాడు. ఆదిలాబాద్ రెజ్లింగ్ (కుస్తీ) పోటీల్లో ఫస్ట్ వచ్చాడు. చదువుతోపాటు ఆటలపోటీల్లో అన్ని రంగాల్లో చురుగ్గా ఉండేవాడు. కొండా లక్ష్మణ్ రాజూరాలో హనుమాన్ వ్యాయామశాల స్థాపించడంలో కీలకపాత్ర వహించాడు.

ఆయన హైదరాబాద్‌లోని శాలిబండలో 15 ఏండ్లపాటు వ్యాయామ శాలకు అధ్యక్షుడుగా ఉన్నాడు. ఆ సమయంలో యువకులు జాతీయోద్యమంలో చేరాలని జాతీయ నాయకులు కోరినపుడు కొండా లక్ష్మణ్ యువకులకు రహస్యంగా శిక్షణ ఇచ్చి చైతన్య పరిచాడు. 1935లో మహారాష్ట్ర పరిషత్, 1936లో కర్ణాటక పరిషత్‌లు ఏర్పడి నిజాం రాష్ట్ర ప్రజలలో మహత్తరమైన రాజకీయ చైతన్యాన్ని కలుగజేశాయి. తెలంగాణలో నిజామాంధ్ర మహాసభ ఏర్పడింది.

1938లో కొండా లక్ష్మణ్ రాజకీయ జీవితం ప్రారంభమైంది. 1938లో హైదరాబాదు స్టేట్ కాంగ్రెస్ నిజాం రాజ్యంలో ప్రజల పౌరహక్కుల సాధన కొరకు సత్యాగ్రహం చేయటం ప్రారంభించింది. హిందూ మహాసభ, ఆర్య సమాజంవారు కూడా అదే సంవత్సరం సత్యాగ్రహాన్ని ప్రారంభించారు. మొదటి సత్యాగ్రహం హైదరాబాద్‌లోని పుత్లీబౌలి క్రాస్‌రోడ్స్ వద్ద జరిగిన సందర్భంలో కొండా లక్ష్మణ్ వారికి అనుకూలంగా నినాదాలు ఇచ్చి ప్రోత్సహించి

నందువల్ల అరెస్టు అయినారు. కొండా లక్ష్మణ్ బాపూజీ 1940లో 3వ గ్రేడు వకీలు కోర్స్ పాసయ్యాడు. ఆదిలాబాద్ జిల్లాలోనూ, హైదరాబాద్‌లోని కొన్ని కోర్టులలో ప్రాక్టీస్ ప్రారంభించాడు.

1940-43 జాతీయ చైతన్యాన్ని రగిలించడానికి చర్చాగోష్టులను నిర్వహించే 40 సంస్థలను ప్రారంభించి నడపడంలో కీలకపాత్ర వహించాడు. వాటికి ఛైర్మన్‌గా ఎన్నికయ్యాడు. 1941-42 నిజాం ఆంధ్రమహాసభలో పౌరహక్కుల, ప్రజాస్వామిక హక్కుల కోసం చురుకుగా పాల్గొన్నాడు.

1940లో న్యాయవాదిగా కొండా లక్ష్మణ్ బాపూజీ నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేసే వారి తరపున వాదించి కేసులను గెలిపించేవాడు. కొండా లక్ష్మణ్ 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నాడు.

1947 డిసెంబర్ 4న నిజాం నవాబు మీద బాంబులు విసిరిన నారాయణరావు పవార్ బృందంలో కొండా లక్ష్మణ్ మార్గదర్శి. 1944లో 2వ గ్రేడ్ వకీలు డిప్లొమా కోర్సు పాసయి హైదరాబాద్ హైకోర్టులోను, సెషన్ కోర్టులోను వకాలత్ ప్రారంభించాడు. 1945లో 1వ గ్రేడ్ వకీలు డిప్లొమా కోర్సు పాసయి హైదరాబాదు రాజ్యంలోని జుడీషియల్ కమిటీ (సుప్రీం కోర్టు)లో వకాలతు ప్రారంభించాడు.

నిజామాంధ్ర మహాసభలతో కొండా లక్ష్మణ్ అనుబంధం 1942లో ప్రారంభమైంది. మాదిరాజు కోటేశ్వరరావుగారి అధ్యక్షతన వరంగల్ జిల్లా ధర్మవరం గ్రామంలో 1942వ సంవత్సరం మే 22, 23, 24వ తేదీలలో తొమ్మిదవ ఆంధ్ర మహాసభ జరిగింది. కొండా లక్ష్మణ్ మెట్రిక్యులేషన్ పరీక్ష పాసై ఆర్థిక ఇబ్బందువల్ల కళాశాల విద్య మానేసి సాయంకాలం పూట హైకోర్టు తరపున నడిపే రెండు సంవత్సరాల న్యాయవాద వృత్తి కోర్సులో చేరి చదువుకున్నారు. కొండా లక్ష్మణ్ వకీలుగా పనిచేస్తూ కాంగ్రెస్ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొన్నాడు. కొండా లక్ష్మణ్ బాపూజీ 1943లో చేనేత సంక్షేమ సంఘం ఏర్పాటుకు కృషి చేసినారు.

ఆ సంఘానికి కొండా లక్ష్మణ్ బాపూజీ అధ్యక్షుడుగా, బద్దం ఎల్లారెడ్డి ప్రధాన కార్యదర్శిగా పని చేసినారు. ఆ సంవత్సరమే నిజాం రాష్ట్ర పద్మశాలీ కష్ట నివారణ మహాసభను నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ తాలూకాలోని మోర్తాడ్‌లో నిర్వహించారు. నిజాం రాష్ట్ర పద్మశాలి సభను కరీంనగర్ జిల్లా సిరిసిల్లలో నిర్వహించారు. 1944 నుండి సెకండ్ గ్రేడ్ పరీక్ష పాసై న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తూ వచ్చాడు.

కొండా లక్ష్మణ్ బాపూజీ రాజకీయ నేపథ్యం గల అన్ని కేసులను ఫీజు లేకుండా ఆ రోజుల్లో వాదిస్తూ వచ్చినాడు. కొన్ని పర్యాయాల్లో కేసుల ఖర్చు కూడా కొండా లక్ష్మణ్ బాపూజీయే భరిస్తూ వచ్చాడు. కొండా లక్ష్మణ్ అన్ని పార్టీల వారికి న్యాయవాదిగా తన సహాయాన్ని అందించాడు. అన్ని పార్టీల వాళ్ళు కొండా లక్ష్మణ్‌ను వారి స్వంత మనిషిగా భావించేవారు. కమ్యూనిస్టు నాయకుడు రావి నారాయణరెడ్డి కొండా లక్ష్మణ్ బాపూజీని ఎంతో ప్రేమగా చూసేవారు. ఆరుట్ల రామచంద్రారెడ్డి, బద్దం ఎల్లారెడ్డిలు 1942లో జరిగిన 9వ ఆంధ్రమహాసభ కాలం నుండి బాపూజీతో సన్నిహితంగా మెలుగుతూ వచ్చారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ 1947లో ముస్లిం మిలిటెంట్ రజాకార్లుగా ప్రజలపై చేసే అత్యాచారాలకు వ్యతిరేకంగా సాయుధ దళాలను నిర్మించి ప్రజలను రక్షించడానికి పూనుకున్నారు. నైజాం రాజ్యాన్ని ఇండియన్ యూనియన్‌లో కలవాలని ఉద్యమించారు. 27-06-1947 తేదీన పోలీసుల అరెస్టులను తప్పించుకోవడానికి రహస్య జీవితంలోకి వెళ్లారు.

27-06-1948న రహస్య ఉద్యమ కాలంలో మద్రాసులో డాక్టర్ శకుంతలాదేవితో పెళ్లి జరిగింది. చేనేత ఉద్యమ పితామహులైన గుంటుక నరసయ్య పంతులు కొండా లక్ష్మణ్ బాపూజీ పెళ్లికోసం అనేక సంబంధాలు వెతికాడు. డా. శకుంతలాదేవిగారితో బాపూజీ పెళ్ళి జరగడానికి కృషి చేశారు. గుంటుక నర్సయ్య పంతులు షష్టిపూర్తి సందర్భంగా 1964లో ఆయన జీవితచరిత్రను కొండా లక్ష్మణ్ బాపూజీ సంపాదకులుగా పుస్తకంగా వెలువరించారు. గుంటుక నర్సయ్య జీవిత చరిత్రను ఊట్ల కొండయ్య కవి రాశారు. ఆ జీవిత చరిత్రలో కులవృత్తి సంఘాల ఉద్యమ నిర్మాణాలు ఎలా సాగాయో నిక్షిప్తం చేశారు.

18-09-1948న హైదరాబాద్ రాజ్యం పోలీసుచర్య ద్వారా ఇండియన్ యూనియన్‌లో కలపబడింది. దాంతో

... 27-11-1948 కొండా లక్ష్మణ్‌పై గల 13 అరెస్టు వారెంటులను ఉపసంహరించడంతో బ్రిటిష్ ప్రాంతమైన మచిలీపట్నం నుండి హైదరాబాదుకు చేరుకున్నారు. 01-01-1949 నుండి బాపూజీ తిరిగి అడ్వకేటుగా ప్రాక్టీసు ప్రారంభించారు. 1951లో లా ప్రాక్టీస్‌ను గమనించి హైకోర్టు కొండా లక్ష్మణ్ బాపూజీ కన్ఫర్డ్ అడ్వకేట్‌షిప్ ఇచ్చింది.నైజాం రాష్ట్రం ఇండియన్ యూనియన్‌లో చేరిన తర్వాత 1948 సెప్టెంబర్ 17వ తేదీ నుండి నవంబర్ 1, 1956 దాకా ఒక ప్రత్యేక రాష్ట్రంగా కొనసాగింది.

అప్పుడు బూర్గుల రామకృష్ణారావు ముఖ్యమంత్రి. కొండా లక్ష్మణ్ బాపూజీ 1952లో తొలిసారిగా ఆసిఫాబాదు నియోజక వర్గం నుంచి శాసనసభ్యులుగా గెలిచారు. అదే సంవత్సరం శాసనసభ డిప్యూటీ స్పీకరుగా ఎన్నికయ్యాడు. 1962లో స్వల్పతేడాతో ఓటమి చెందాడు. అయితే ప్రత్యర్థి పాల్పడిన అక్రమాలపై కేసువేసి గెలిచారు. 1965 ఉప ఎన్నికల్లో తిరిగి ఎన్నికయ్యారు. 1967లో భువనగిరి నుంచి విజయం సాధించారు. కాసు బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో కేబినెట్ మంత్రిగా పనిచేస్తూ 1969లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో పదవికి రాజీనామా చేశారు.

1972లో భువనగిరి నుంచి ఎన్నికయ్యాడు. 1949లో ప్రభుత్వం చేనేత సహకార సంఘం ఏర్పాటుకు అంగీకరించింది. కొండా లక్ష్మణ్ బాపూజీ సేకరించిన భవనంలో పద్మశాలి హాస్టల్ ప్రారంభించారు. దానితో దేశమంతా 50కి పైగా చేనేత సహకార సంఘాలను ప్రారంభించారు. 1950 ఫిబ్రవరి 19న హైదరాబాద్ హ్యాండ్లూమ్ వీవర్స్ సెంట్రల్ కో-ఆపరేటివ్ అసోసియేషన్ రిజిష్టర్ చేశారు. దానికి కొండా లక్ష్మణ్ బాపూజీ అధ్యక్షులుగా వ్యవహరించారు. మే 1951లో రాష్ట్ర చేనేత వృత్తిదారుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. దానికి ముఖ్య అతిథిగా వచ్చిన టంగుటూరి ప్రకాశం పంతులు కొండా లక్ష్మణ్ బాపూజీ ఇంట్లో బస చేశారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ స్టేట్ కాంగ్రెస్‌లో రామానంద తీర్థ, జనార్ధన్ రాయ్ దేశాయ్ గ్రూపులో చురుకుగా పాల్గొన్నాడు. 1960 ఆంధ్రప్రదేశ్ కేబినెట్ మంత్రి హోదాలో ఎక్సైజ్, గ్రామీణ, చిన్నతరహా పారిశ్రామిక, చేనేత, టెక్స్‌టైల్, జౌళి పరిశ్రమల శాఖామంత్రిగా పనిచేశారు. దామోదరం సంజీవయ్య మంత్రివర్గంలో మంత్రిగా చేరారు.

1960-61లో దామోదరం సంజీవయ్య ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో వ్యతిరేక శిబిరం ఆయనను దింపాలని ప్రయత్నించారు. బాపూజీ సంజీవయ్యగారికి మద్దతుగా నిలిచారు. దామోదరం సంజీవయ్య మంత్రివర్గం 1962 ప్రారంభంలోనే రాజీనామా చేయాల్సి వచ్చింది. 1967లో నల్లగొండ జిల్లా భువనగిరి నియోజకవర్గం నుండి శాసనసభ్యుడిగా ఎన్నికై కాసు బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో సమాచార, పౌర సంబంధ, కార్మిక శాఖల కేబినెట్ మంత్రిగా పనిచేశాడు.

కొండా లక్ష్మణ్ బాపూజీ 1952 నుండి 1978 వరకు శాసనసభకు ఎన్నికయ్యారు. బాపూజీ ఎమర్జెన్సీని వ్యతిరేకిస్తూ 1975లో కాంగ్రెస్‌ను విడిచిపెట్టినా గాంధేయవాదిగానే జీవితాంతం కొనసాగారు. 23 సంవత్సరాలు ఎమ్మెల్యేగా, డిప్యూటీ స్పీకర్‌గా, వైస్ ప్రెసిడెంట్‌గా, రెండుసార్లు కేబినెట్ మంత్రిగా విశిష్టమైన సేవలందించి తనదైన శైలిలో చరిత్ర సృష్టించారు. ఎన్నో అంశాలను తెరమీదకు తెచ్చి వాటిని పరిష్కరించడంలో కొండా లక్ష్మణ్ కృషి ఎంతో గొప్పది.

ఇక ప్రత్యేక తెలంగాణ ఉద్యమం విషయానికి వస్తే...

1969లో జై తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి మద్దతుగా మంత్రి పదవికి రాజీనామా చేశారు. బాపూజీని అరెస్టు చేసి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. విడుదలయ్యాక తెలంగాణ ఉద్యమాన్ని మళ్లీ కొనసాగించారు. 1972లో శాసనసభకు భువనగిరి నుండి మరోసారి ఎన్నికయ్యారు. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ, జె. ఈశ్వరీ బాయి, టి.ఎన్. సదాలక్ష్మి రాజకీయ రంగం నుండి ప్రత్యేక తెలంగాణ కోసం ఉద్యమిస్తున్న విద్యార్థి, యువజన ఉద్యమాలకు మద్దతు ఇస్తూ, సామాజిక ఉద్యమంలోకి దూకిన సమరశీలురు.

డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఉద్యమంలో ప్రవేశించి వీరిని వెనక్కి నెట్టిన క్రమం, అనేక చారిత్రక పత్రాలు సాక్ష్యంగా నిలిచాయి. దళిత రచయితల, కళాకారుల, మేధావుల ఐక్యవేదిక 1992లో ఏర్పాటు చేసినప్పుడు దానికి ఆహ్వాన సంఘం నాయకులుగా అనేక

బాధ్యతలను మీద వేసుకొని అంబేద్కర్ భవన్‌లో ఘనంగా జరగడానికి కృషి చేశారు.

ఈ సంస్థ కొన్నేళ్ల పాటు వారింట్లో కేంద్ర కార్యాలయం నడిపించు కోవడానికి ఉచితంగా ఆఫీసు గదులను ఇచ్చారు. అదే సమయంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల ఐక్యత కోసం బస్సు యాత్రలను నిర్వహించారు. బహుజన సమాజ్ పార్టీ నేత కాన్షీరాం గారితో అనేక దఫాలుగా చర్చలు జరిపారు. కలిసి పని చేయడానికి ఒక అవగాహనకు రావడం జరిగింది. నిర్మాణ పరంగా అది మధ్యలోనే ఆగిపోయింది.

1997 నుండి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తనవంతు కర్తవ్యం స్వాతంత్ర్య సమరయోధులను, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులకు ఒక తాటి మీదకి తెచ్చి అనేక కార్యక్రమాలు తీసుకున్నారు. చలో ఢిల్లీ కార్యక్రమంతో అన్ని పార్టీల్లో, సంస్థల్లో ఒక కదలికను తీసుకొచ్చారు. ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ రాష్ట్రం కోసం చివరి క్షణం దాకా కృషి చేశారు.

2001లో తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పడినప్పుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ దానికి కేంద్ర కార్యాలయంగా తన ఇల్లునే అందించిన సహృదయ సౌజన్య శీలి. దాంతో 09-02-2002 కొండా లక్ష్మణ్ బాపూజీ ఇంటిని ఆయన లేని సమయంలో నేలమట్టం చేశారు. అప్పటి అధికార ప్రభుత్వం కొండా లక్ష్మణ్ బాపూజీపై కక్ష కట్టింది.

ఆ భవనంలోని అన్ని రికార్డులను, స్థిర, చరాస్థులను ప్రభుత్వాధికారులు తీసుకొనిపోయారు. డాక్టర్ శకుంతలాదేవి తదితరులు ఎంత అడ్డుకున్నా బలవంతంగా ఖాళీ చేయించి బహాళ అంతస్తుల భవనాన్ని కూల గొట్టించారు. 2002-2006 కొండా లక్ష్మణ్ బాపూజీ ఇంటిస్థలాన్ని, భవనాన్ని సుప్రీం కోర్టు కొండా లక్ష్మణ్ బాపూజీకే చెందుతుందని తీర్పు ఇచ్చింది. అయినప్పటికీ నాటి ప్రభుత్వం తీసుకుపోయిన రికార్డులను, ఆస్తులను తిరిగి ఇవ్వలేదు.

2005లో ఆగష్టు 9న భారత రాష్ట్రపతిచే ఎమినెంట్ ఫ్రీడం ఫైటర్‌గా గౌరవించబడ్డారు. 26-02-02007లో సత్యాగ్రహ ఉద్యమం నూరేళ్ల పండగ సందర్భంగా తత్సంబంధిత కమిటీలో సభ్యులుగా నియమించబడ్డారు. 19-09-2007న స్వాతంత్ర్య సమరయోధుల స్క్రీనింగ్ కమిటీకి చైర్మన్‌గా నియమించబడ్డారు. బాపూజీ సురవరం ప్రతాపరెడ్డి తదితరులు స్థాపించిన రెడ్డి హాస్టల్ వలె పద్మశాలి విద్యార్థుల కోసం హైదరాబాద్‌లో హాస్టల్, సంఘ భవనం అవసరమని భావించారు.

బాపూజీ చేనేత సహకార సంఘాలు, పద్మశాలి సంఘాలు ఏర్పాటు చేయడం, స్వంత భవనాలు నిర్మించడంలో కీలకపాత్ర వహించారు. అఖిల భారత పద్మశాలి సంఘం, నైజాం రాష్ట్ర పద్మశాలి సంఘం నిర్మాణంలో చరిత్రాత్మకమైన పాత్ర నిర్వహించారు. నిండుగా 97 ఏండ్లు పరిపూర్ణంగా జీవించిన కొండా లక్ష్మణ్ బాపూజీ ఒక చక్కని ఆర్టిస్టు కూడా. మనిషి పుట్టుక నుండి మరణించేదాక వివిధ దశలను తన కుంచెతో చిత్రించిన తాత్వికదృష్టి.

ఆరోగ్యం విషయంలో ఆయన జీవితం అనుసరించదగినది. రోజూ ఉదయం యోగాసనాలు, ధ్యానం చేయడం, మిత ఆహారం తీసుకోవడం, ప్రతి పనిని క్రమశిక్షణాయుతంగా పని చేయడం, ప్రతిదీ ఫైల్ చేసి రికార్డు చేయడం అనేది వీరి నుంచి నేర్చుకోవాల్సిన సుగుణాలు. తన ఇంట్లో అనేక దినపత్రికలు తెప్పించి, గ్రంథాలయం నడిపేవారు. ఇలా రాజకీయ నాయకులు తన ఇల్లును సామాజిక కార్యక్రమాల కోసం, గ్రంథాలయం కోసం ఉపయోగించడం అరుదైన విషయం.

కొండా లక్ష్మణ్ బాపూజీ తన జీవిత కాలంలో ఎంతోమంది మహనీయులతో, నాయకులతో, సామాజిక ఉద్యమకారులతో సత్సంబంధాలు కొనసాగించారు. జవహర్‌లాల్ నెహ్రూ, లాల్‌బహదూర్ శాస్త్రి, సర్వేపల్లి రాధాకృష్ణన్, ఇందిరాగాంధీ, కామరాజ్ నాడార్, నిజలింగప్ప... మొరార్జీ దేశాయ్, టంగుటూరి అంజయ్య, కె.వి. రంగారెడ్డి, సురవరం ప్రతాపరెడ్డి, రాజీవ్ గాంధీ ... సోనియా గాంధీ, మన్మోహన్ సింగ్ మొదలుకొని వందల వేల జాతీయ నాయకులతో, రాష్ట్ర నాయకులతో సత్సంబంధాలు ఉండేవి.

జీవితమంతా కొండా లక్ష్మణ్ బాపూజీ బీసీ, ఎస్సీ,

ఎస్టీ, మైనారిటీ నాయకులను, కార్యకర్తలను ప్రోత్సహిస్తూ వచ్చారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఆత్మగౌరవంతో జీవించారు. అందువల్ల 1978 నుండి 1988 మధ్య గవర్నర్ అయ్యే అవకాశాలు ఉన్నప్పటికీ చంచాగిరి చేయడం ఇష్టం లేక వదులుకున్నారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటును చూడకుండానే సెప్టెంబరు 21, 2012న 97 సంవత్సరాల వయస్సులో హైదరాబాదులో తన సామాజిక, రాజకీయ, జీవనయాత్రను చాలించారు.

తొమ్మిది దశాబ్దాల తెలంగాణ సామాజిక చరిత్ర, ఉద్యమాలు, కార్యక్రమాలు, సహకార రంగ వికాసం, సామాజిక, ఆర్థిక న్యాయం, సమసమాజం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వానికి సంబంధించిన అనేక సంఘటనలు, పరిణామాలు కొండా లక్ష్మణ్ బాపూజీ గారి జీవితంతో ముడిపడి వున్నాయి.

కొండా లక్ష్మణ్ బాపూజీ వంటి వ్యక్తిత్వం, సౌశీల్యం, సంకల్ప బలం, త్యాగశీలత నేటి సమాజానికి ఎంతో ఆదర్శనీయమైనవి. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అట్టడుగు వర్గాల నుండి స్వయంకృషితో ఎదిగిన జాతీయ నాయకుడు. ప్రజల మనిషి స్వాతంత్ర్య సమరయోధుడు. సామాజిక న్యాయం, సామాజిక మార్పు కోసం తన జీవితాన్ని అంకితం చేసిన త్యాగధనుడు కొండా లక్ష్మణ్ బాపూజీ.

# 77 కొండపల్లి శేషగిరిరావు

– డా॥ సురభి వాణీదేవి

ప్రఖ్యాత తెలంగాణ చిత్రకారులు శ్రీ కొండపల్లి శేషగిరి రావు గురించి చెప్పడం అదృష్టంగా భావిస్తున్నాను.

కీర్తిశేషులు కొండపల్లి శేషగిరి రావు గారు వరంగల్ జిల్లాలోని పెనుగొండలో జనవరి 7, 1924 సం॥లో జన్మించారు. 1942లో ఆంధ్రా మెట్రిక్యులేషన్ పరీక్ష పూర్తి చేసుకొని హైదరాబాద్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ లోని దీన్‌దయాళ్ నాయుడు వద్ద చిత్రకళని అభ్యసించారు. 1945లో కమలాదేవితో వివాహం జరిగినది. వీరికి ఆరుగురు కుమారులు ఒక కుమార్తె.

చిన్నతనం నుండే చిత్రకళపై మక్కువ ఉన్న కొండపల్లి శేషగిరి రావు, సాతాని బుచ్చయ్య పంతులు అనే ఆయన వేసిన కోతిబొమ్మ తనలోని చిత్రకారుణ్ణి మేలుకొలిపిందంటారు.

డ్రాయింగ్ టీచర్ మహమద్ షరీఫ్ ప్రోత్సాహంతో ఎలిమెంటరీ పరీక్షలకు ట్రైనింగ్ ఇచ్చారు. చెట్లు, కాలువలు, చేమలు, జింకలు, పులులు, పక్షులు ప్రభావితం కాబడ్డ శేషగిరి రావు గారిని నవాబు మెహదీ జంగ్ విశ్వభారతి శాంతినికేతన్‌కు పంపారు. అక్కడ ఆయన నందలాల్ బోస్, అవనీంద్రనాథ్ టాగూర్ వద్ద శిష్యరికం చేశారు. అఖిల భారతస్థాయి శిక్షణను పొందారు. కాపీయిస్టుగా ప్రారంభమైన ఆయన జీవితం సృజనాత్మకతతో మంచి కళాకారుడి పరిణతి పొందింది. అక్కడి శిక్షణ వల్ల దుఃఖంలో సుఖాన్ని వికారంలో అందాన్ని, నలుపులో తెలుపును, చీకటిలో వెలుగును, వెలుగులో రంగులను గుర్తించారు.

బనస్తరి విద్యాపతి వద్ద కుడ్య చిత్రాలలో శిక్షణ పొందారు. 20వ శతాబ్దం తొలిరోజుల్లో ప్రారంభమైన అవ్యక్త చిత్రకళను సైతం అర్థం చేసుకొని తను ఆనందించడమే కాక ప్రపంచానికి చెప్పగల నైపుణ్యం సాధించారు. దాదాపు 34 సం.రాలు హైదరాబాద్‌లోని స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో చిత్రకళా అధ్యాపకునిగా సేవలందించారు.

1949లో కొండపల్లి శేషగిరి రావు గారు వేసిన "సంతాల్ నృత్యం" అన్న చిత్రం అఖిల భారత చిత్రకళా ప్రదర్శనలో ప్రథమ బహుమతి గెలుచుకుంది. 1958లో పరామర్శ అన్న చిత్రం బంగారు పతకాన్ని సాధించగా క్షమ అన్న చిత్రం కలకత్తా చిత్ర ప్రదర్శనలో సిల్వర్ మెడల్ గెలుచుకుంది.

కైరో, ఇటలీ, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా వంటి అనేక దేశాలలో ఆయన చిత్రాలు ప్రదర్శించబడ్డాయి. మన దేశంలోని ఇంచుమించు అన్ని రాష్ట్రాలలోను శేషగిరిరావు గారి చిత్రాలు ప్రదర్శించబడ్డాయి. కొండపల్లి శేషగిరి రావు గారు వేసిన చిత్రాలలో వరూధిని, ప్రవరాఖ్యుడు, పాండవ వనవాసం, దమయంతి, శకుంతల లాంటి చిత్రాలు పురాణ ఇతిహాస, రామాయణ పాత్రలకు జీవం పోసిన

చిత్రాలుగాను, తద్వారా ఆయన సంప్రదాయ చిత్రకారునిగా ఖ్యాతి గడించారు. విజయ నగర సామ్రాజ్య స్థాపన దృశ్యాన్ని ఆయన చిత్రించిన తీరు మరెవ్వరికీ సాధ్యం కాలేదు. తెలుగు తల్లి సముజ్వల రూప చిత్రణ ఆయనకు ఎనలేని పేరు ప్రతిష్టలు తెచ్చింది.

ఈ చిత్రాలలో భారతీయత, జాతీయత ప్రస్ఫుటంగా ఉండటమే కారణం. ఆయన వేసిన వాటర్ కలర్ వాష్ చిత్రాలలో అవనీంద్రనాథ్ ఠాగూర్, నందలాల్ బోస్ ముద్రలూ కానవస్తాయి. శేషగిరిరావుగారి చిత్రాలలో ముఖ్యంగా మూడు శైలులు కనిపిస్తాయి. అవి 1. రామాయణ, మహాభారత, ఇతిహాస పాత్రల చిత్రణ 2. వంగ చిత్రకారులైన అవనీంద్రనాథ్ ఠాగూర్, నందలాల్ బోస్‌ల శైలి, ఛాయలు, 3. ఇటాలియన్ రినాయిసెన్స్ (పునర్వికాస దశ) ఛాయలు.

ఆయన రేఖా చిత్రాలలో క్లుప్తత, సొగసు, గీతలపై వున్న సాధికారత కనిపిస్తాయి.

ప్రకృతిలో దాగి వున్న లయబద్ధమైన సంగీతానికి అద్భుతమైన రూపాలు ఆయన వేసిన రాయగిరి కొండ గుట్టలు.

అధునాతన శైలిలో వేసిన "చనిపోయిన ఆవు" కోర్కెలు, రాజ్యాధికారం, క్షమ లాంటి చిత్రాల ద్వారా నైరూప్య చిత్రకారుడిగా కనిపిస్తారు. ఆంధ్రప్రదేశ్ హరిజనోద్యమం అన్న కుడ్య వర్ణ చిత్రం శేషగిరిరావు గారి సామాజిక చైతన్యానికి, స్ఫూర్తికి నిదర్శనం. ఇంతే కాకుండా కాకి పడగలనే ఒక పురాతన చిత్రకళా సంప్రదాయాన్ని ప్రపంచం దృష్టికి తీసుకొని వచ్చిన ఆ కళాకారులకు ప్రభుత్వంలో గుర్తింపు తీసుకొని వచ్చిన చిత్రకారుడు ఆయన.

రామప్ప దేవాలయంలోని నంది మెడ చుట్టూ ఉన్న హారాన్ని ఎంతో స్పష్టంగా చిత్రించిన చిత్రం నేటికీ మనందరికీ ప్రామాణికంగా నిలిచింది.

సహజంగానే మా నాయనగారు భారత మాజీ ప్రధాన మంత్రి కీ.శే. శ్రీ పి.వి. నరసింహారావుగారు కవులు, కళాకారులు, పండితులతో ఎంతో గౌరవంగా, స్నేహంగా ఉండేవారు. తరచు పండిత గోష్ఠులు, చర్చలు మా ఇంట్లో జరుగుతుండేవి. ఒకనాడు శేషగిరిరావుగారిని పిలిచి నేను వేసిన బొమ్మలు చూపిస్తూ, ఫైన్ ఆర్ట్స్ కాలేజిలో చేరుతానంటుందని చెప్పారు. బొమ్మలు బాగున్నాయని ప్రోత్సహిస్తూ నన్ను ఆర్ట్స్ కాలేజిలో జాయిన్ చేసిన శేషగిరిరావు గురించి ఎంత చెప్పినా తక్కువే.

1984లో ప్రిన్సిపల్‌గా పదవీ విమరణ అయిన తరువాత కూడా ఎంతో నియమ నిబద్ధతతో ఆ వయస్సులో కూడా కొత్త పద్ధతులు కనుక్కోవాలనే పట్టుదల మాలాంటి వారికి స్ఫూర్తిదాయకం.

ప్రతి సంవత్సరం దసరా నవరాత్రుల్లో మొదటి రోజున తప్పక దుర్గాదేవి చిత్రం ప్రారంభించే వారు. దసరా నాటికి ఆ చిత్రం పూర్తయ్యేది. అలా అనేక సంవత్సరాలు దుర్గాదేవిని అనేక రూపాలలో, వర్ణాలలో, చిత్రించిన శేషగిరిరావు గారు ధన్యజీవులు. ఆ చిత్రాలు చూసిన వారు అమ్మవారి ప్రతిరూపాలుగా భావించేవారు. వారు ఎంతో ముచ్చటపడి చిత్రించిన గజలక్ష్మి చిత్రం ఒక దీపావళి నాడు ఇవ్వడం నేనెప్పటికి మరువలేను.

1982వ సంవత్సరంలో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి టి. అంజయ్యగారు ఆయనతో వేయించిన చిత్రం తెలుగు వెలుగులు అందరినీ అలరించిన ఆ చిత్రంలో తెలుగువారి వైభవం ఎంతో ప్రస్ఫుటంగా హృద్యంగా రూపొందించారు.

సుమారు 60 అడుగుల పొడవు 10 అడుగుల ఎత్తు గల చిత్రం మన రాష్ట్రంలో వున్న అతి పెద్దచిత్రంగా నమోదయింది. ఈ కాన్వాస్ విశ్వామిత్రుని చిత్రంతో ప్రారంభమయి, బూర్గుల రామకృష్ణరావు చిత్రంతో పూర్తవుతుంది. ఆ చిత్రం మధ్యలో తెలుగువారి ఆరాధ్యదైవమైన శ్రీ తిరుమల వేంకటేశ్వర స్వామి వారి చిత్రం ఉంటుంది. ఆ చిత్రానికి ఇరువైపులా తెలుగు నేలను ఏలిన సామ్రాట్టులైన శాతవాహనుడు, గౌతమీ పుత్ర శాతకర్ణిలతో పాటు, రుద్రమదేవి లాంటి చారిత్రక ఆనవాళ్లే కాక బౌద్ధ మతానికి చెందిన నాగార్జునుడు, త్యాగయ్య, అన్నమయ్య లాంటి వాగ్గేయకారులు, నన్నయభట్టు, వేమన మొదలైన కవులు రాజ రాజ నరేంద్రుడు, శ్రీకృష్ణ దేవరాయలతో పాటు పరమత సహనానికి ప్రతీకగా నిలిచిన కులీ కుతుబ్ షా, వరంగల్ కాకతీయ తోరణం, రామప్ప దేవాలయ నాగినులు,

నాగార్జున సాగర్ డ్యామ్, చార్మినార్ లాంటివి ఎన్నో చిత్రించబడ్డాయి.

ఒక్క చిత్రంతో తెలుగు దనాన్ని తెలుగు దర్పాన్ని వారి చరిత్రని చిత్రించిన కొండపల్లి శేషగిరిరావు గారి ప్రతిభ అనన్య సామాన్యం.

ఉత్తమ కళ కాలాలకు అతీతం దానికి భూత భవిష్యత్ వర్తమానాలు ఏకమవుతాయి. ప్రాచీన కళ, ఆధునిక కళ అనే పేర్లు చారిత్రక, వ్యావహారాలకు సంకేతాలు మాత్రమే. కళాకారుడు స్వతంత్రుడు. చిత్రకళ ఎన్ని రూపాలలో పిలువబడ్డా నాలుగు కాలాలపాటు నిలిచినదే ఉత్తమ కళగా భావించాలి.

2003 సం.లో ఉల్చి ఆర్ట్ గ్యాలరీ చీరాల వారు చిత్రకళకు తెలుగు దనాన్ని, తెలుగుకు చిత్రకళా వైభవాన్ని తెచ్చిన శేషగిరిరావుగారిని విశ్వ కళాతపస్వి బిరుదుతో సన్మానించారు. భారత ప్రభుత్వం 1980 నుంచీ ఆయనను ప్రొఫెసర్ ఎమిరటస్‌గా గుర్తించి గౌరవించడం ఈ సందర్భంగా గమనార్హం. కళ ద్వారా సామాన్యుల నుంచి మాన్యులు కళా విమర్శకులు. అలాగే సాటి సుప్రసిద్ధ చిత్ర కళాకారుల వరకు అందరి మన్ననలు ఆయన పొందారు. అన్ని పత్రికలలోనూ ఆయన చిత్రాలు ప్రచురితమయ్యాయి. అలాగే ఆయన మీద అనేక వ్యాసాలు, పుస్తకాలు ప్రచురిత మయ్యాయి. తెలుగు రాష్ట్రాలలోనే కాక సమస్త భారతావనిలో ఆయన విశేష ఆదరణ, గౌరవం పొందారు. అక్టోబర్ 2012 సం.లో తన చివరి మజిలీ ముగించిన శేషగిరిరావు గారు....

'గీత నా పల్లవి
కాంతి కల్పనాక్రాంతి పథము
దక్కు దృశ్యము అమృత దీపమ్ము లిచట
మధ శూన్యంబు రూప ప్రస్థాన యాత్ర' అని అంటారు.

1995లో శేషగిరిరావుగారు చిత్రించిన మాన్యువల్ పెయింటింగ్ ఇప్పటికీ భారతీయ విద్యాభవన్ భవనంపై చెక్కుచెదరకుండా ఉంది. ఇందులో పలు అంశాలు పామరులకు కూడా అర్థమయ్యే రీతిలో కనిపిస్తాయి. అలాగే మైత్రి వనం అనే మరో ప్రభుత్వ భవనంలోపలి హెరిటేజ్ గ్రాన్యువల్స్‌లో చిత్రించిన చిత్రం అద్భుతం.

# 78 కోవెల సంపత్‌కుమారాచార్య

**– డా॥ గంట్ర లక్ష్మణరావు**

ఏదో ఒక్కటి పూవు చాలుగద తానీజివికన్ గ్రమ్మ
శోభా దారిద్ర్యము రూపు మాపగ, సుధా ప్రాభాత
రేఖావళీ సాదుత్వమ్ములు చిమ్మగా, నయిన సంసార
హేలా విలా సాది శ్రీ మృదు పుష్ప సంచయము
విన్యాసించె నొక్కుమ్మడిన్

శ్రీమాన్ కోవెల సంపత్కుమారాచార్యులు తెలుగు సాహిత్య క్షేత్రంలో వివిధ రకాల కావ్య, శాస్త్ర, విమర్శనాదుల పాదులను తవ్వి ఎందరో శిష్యులనే మొక్కలను నాటిన సాహితీ వనమాలి.

చారిత్రక ప్రసిద్ధిగాంచిన వరంగల్లు నగరంలో శ్రీవైష్ణవ సంప్రదాయ పండిత వంశంలో శ్రీమాన్ కోయిల్ కందాడై రంగాచార్యులు గారి కనిష్ట పుత్రుడుగా 26 జూన్ 1933 (శ్రీ ముఖ ఆషాడ చతుర్థి జయవారం) జన్మించారు. శ్రీ మాన్ రంగాచార్యులు గారు ఉభయ వేదాంతులు. గొప్ప విద్యాంసులు. ఉపన్యాసకేసరి, సుబోధక సుధామణి వంటి బిరుదులు పొందినవారు. నాకు మా నాయనగారే మొదటి గురువు అని తెలిపారు.

బందరు దగ్గర చిట్టి గూడూరు ప్రాచ్యకళాశాలలో 1949లో చేరి శ్రీ మల్లంపల్లి విశ్వేశ్వర శర్మగారు, శరభయ్య గారు మొదలైన గురువుల వద్ద భాషా ప్రవీణ పూర్తి చేశారు. ఈ కాలంలో వ్యాకరణ ఛందస్సులంటే పెద్దగా ఇష్టముండేవి కావని తరువాతి కాలంలో వాటినే పూర్తిగా ఇష్టపడి వాటిపై కృషి చేసి గ్రంథాలు రచించవలసి రావడం విశేషం. ఆయా రచనలచేత ప్రభావితుడై విశ్వనాథ సత్యనారాయణను గురువుగా భావించారు. ఆయన రచనలే తనను పరోక్షంగా సాహిత్యంలో ఎంతో ఉన్నతుడిని చేశాయని చెపుతుండేవారు.

పద్యకవిత్వం, సంప్రదాయ కవిత్వంతో పాటు సంస్కృత కావ్యాలు, నాటకాలు మొదలైనవి అధ్యయనం చేశారు. ఆకాలంలోనే తోటి విద్యార్థుల వద్ద, పండితుల వద్ద హిందీ, ఇంగ్లీషు భాషలను నేర్చుకున్నారు. కన్నడం కూడా నేర్చుకున్నారు.

1953 సిద్దిపేట ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా చేరారు. మానుకోట, హనుమకొండలలో ఉపాధ్యాయులు గాను, 1966లో జగిత్యాల కళాశాల ఉపన్యాసకులుగా, తరువాత కాకతీయ విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా పని చేశారు. పనిచేసిన ప్రతిచోటా ఒక సాహిత్య వాతావరణాన్ని సృష్టించి విస్తరించడం ఆయన స్వాభావిక లక్షణం.

సి. నారాయణరెడ్డి ఎం.ఏ. విద్యార్థిగా ఉన్నప్పుడు రాసిన విశ్వగీతి కావ్య సౌందర్యాన్ని వివరిస్తూ సాహిత్య వ్యాసం. చిట్టిగూడురు ప్రాచ్యకళాశాలలో వీడ్కోలు సమావేశం లోనే తమ గురువులను గురించి పద్యాలు రాశారు.

1954లో హృద్గీత పేరుతో కోవెల సుప్రసన్న గారితో కలిసి ఒక శతకం వెలువరించారు. దానికి విశ్వనాథ పీఠిక రచించి ఆశీర్వదించారు. ఆ ఇద్దరు జంటకవులుగా ఆనంద

లహరి, శబరి కథాంవ కావ్యాన్ని రచించి విశ్వనాథ సత్యనారాయణకు అంకితం చేశారు.

ఆయన జీవితకాలమంతా సాహిత్యం ప్రధానంగా మూడు విభాగాలుగా ఒక ఉద్యానవనాన్ని సృష్టించారు. ఒకటి సృజన. తనదైన భావనతో, తనదైన ఆశయంతో సమకాలీన మైన అంశాలకు స్పందిస్తూ కవిత్వం రచించడం. పద్యం, గేయం, వచనపద్యం అనే మూడు ప్రక్రియల్లో అద్భుతమైన స్వకీయమైన ముద్రతో రచనలు చేశారు. రెండవది వ్యాకరణ ఛందశ్శాస్త్ర పరిశోధనలో రచనలు వెలువరించడం. మూడ వది విమర్శనారంగంలో ప్రాచీనాధునిక ప్రాచ్య పాశ్చాత్య భూమికల్లో వివిధ రకాలైన విమర్శనా రచనలు, విమర్శల పరిశోధనలు చేయడం.

ఈ మూడు విభాగాలలో విజ్ఞులు పండితులైన వారు ఎవరికి వారు సంపత్కుమార ఛందశ్శాస్త్ర వేత్త అనీ, పద్య కవి అనీ, వచనపద్య లాక్షణిక వేత్త అనీ, విమర్శకాగ్రేసరుడని భావించేస్థాయిలో రచనలు చేశారు.

కోమటి వేమారెడ్డి కూర్చిన గాథా సప్తశతీ సారములోని వంద గాథలకు తెలుగు అనువాదం చేశారు.

గాథలందు మరియు గానమ్ములందు, తం
త్రీమనోజ్ఞ వాద్య రీతులందు
ప్రౌఢ కాంతలందు రసికులు కానట్టి
వారికదియ శిక్ష వసుధలోన..... వంటి పద్యాలు ఇందులో ఉన్నాయి.

1967లోనే దిగంబర కవిత్వానిక ఎదురుగా నిలబడడానికి సంపత్కుమార, సుప్రసన్న, వేంనరసింహారెడ్డి, పేర్వారం అనే నలుగురు కవులు చేతనావర్తం పేరుతో ఒక కవితా సంకలనం వెలువరించారు. దేశీయతా భూమికతో జాతీయతా వాదంతో సమసమాజాన్ని నిర్మించాలనే ధ్యేయంతో ఈ సంకలనం వెలువడింది. ఇది ఒక విధంగా సంచలనాన్ని ఆలోచనను రేకెత్తించింది. 1970లో చేతనావర్తం రెండవ సంకలనం వెలువరించారు. దానికి సంపత్కుమార పీఠిక రాశారు.

దేశకాల సమాజ త్రిపుటి / అన్నిటికీ కేంద్రమైన వ్యక్తి
అనంత వైవిధ్యంగల మనఃప్రవృత్తి / అన్ని దశల్లోను
మానవ సమగ్ర వికాసం
ఆధునిక భావన, అనుభూతి ప్రసారణ
అనంత జగచ్చైతన్యావగాహన
నా కవితకు ప్రేరణాలు

స్పందనలో దోహదాలు... అంటూ దేశం, జాతి, ఆలోచన, ఆచరణ మొదలైన ఒక దిశానిర్దేశం ఇందులో స్పష్టమవుతుంది.

అంతర్మథనము పేరుతో ఒక విశిష్టమైన విలక్షణమైన శతకాన్ని యతీంద్రా వ్యాజ రామానుజా అనే మకుటంతో రచించారు. ఇందులో వైయక్తికమైన అనుభూతులతో పాటు సమకాలీనమైన సామాజం పట్ల కూడా మథనం పొందిన తీరు కనపడుతుంది.

బస్సుల్ గాల్చుట రైళ్ళు గూల్చుట జన ప్రాణమ్ములన్ దీయుటల్
కస్సుంబుస్సుల విప్లవమ్ములివి సంఘుమ్మున్ సమానించునా
హిస్సాకోసము చంపులాడుకొని తామీ నాయకుల్ మాకు శ్రే
యస్సుందెత్తురె నమ్మిటెట్టులు యతీంద్రా వ్యాజ రామానుజా!

కాలస్పృహ పేరుతో అనంత కాలతత్వాన్ని ధ్వనింప జేస్తూ ప్రకృతిలోని పరిణామాలను ఋతువులుగా వర్ణిస్తూ మానవజీవితానికి ఎట్లా అన్వయమవుతాయో వివరిస్తూ రచించిన పద్యకవితా సంకలనం ఇది. ప్రకృతికీ మనిషికీ ఉన్న వ్యంగ్యార్థ రమణీయమైన భావ ప్రకటనలున్నాయి.

ఏమి? మోదుగు తానంత ఈడు పోయి
గూడ సింగారములు చేసికొనుచు నుండె
ఎండిపోయిన గుండెలో నింత వేడి
రక్తములు చిమ్మునేమొ ఈ ప్రభువు మధువు...... వంటివి ఆలోచింపజేస్తాయి.

గోదాదేవి ఆత్మవేదనానుభవాన్ని ఆముక్త పేరుతో పద్యకావ్యంగా రచించారు. తెలుగు విశ్వవిద్యాలయ పుర స్కారం పొందినదీ కావ్యం. ఈ కావ్యంలో ఛందోవిశేషాలు చూపించారు. చంపకం ఉత్పలమాల కలిపి సంయుక్త పేరుతో, మత్తకోకిలను కొద్దిమార్పుచేసి ఆముక్త పేరుతో పద్యాలు రాశారు. ఇంకా ఛందఃప్రయోగాలు ఇందులో ఉన్నాయి.

చింతయంతి పేరుతో మరో పద్యసంకలనం. ఇది చిన్నప్పుడు వారి నాన్నగారు చెప్పిన ఒక చిన్న సంఘటనా విశేషం. దీన్ని కావ్యంగా రూపొందించారు. దానితో పాటు

సుపర్ణ ధార, ద్విధా, శ్రీమతి వంటి కొన్ని ఖండికలు చేర్చారు. శ్రీమతి ఖండికలో ఒక పద్యం..

> 'కామమొకండె నిత్యము జగమ్మును గ్రమ్మినదేమొ? తా యశః
> కామము గానువచ్చు, ధనకామము గూడను కానువచ్చు, స్త్రీ
> కామము కానువచ్చు, నిది కాదగు కాదగదంచు లేదు – నా
> కామ తమస్సు జీల్చు వెలుగై చను దేవి సమావరించుతున్....'

ఆంజేయాయమ్ పేరుతో హనుమంతుని గూర్చి ఒక శతకాన్ని, చేరాకు ఒక శతమానం పేరుతో ఒక చమత్కార శతకాన్ని రచించారు.

వీటన్నిటికంటె ముందు 1950 ప్రాంతాలలో రచించినప్పటికీ ఆలస్యంగా ముద్రించి ఆవిష్కరించి డా. వెల్చాల కొండలరావుగారికి అంకితం ఇచ్చిన అపూర్వ గేయ కావ్యం అపర్ణ. ఆధునిక ఇతివృత్తంతో గేయకథా కావ్యం. ఇందులో పలురకాల గేయాల నడకలు ఉన్నాయి. పద్యమైనా, గేయమైనా, వచనపద్యమైనా తనదైన శైలి, దేశీయమైన భావనా పునాదిగా, వివిధ రకాలు ప్రయోగాలతో రచించిన సంపత్కుమార సృజన తనతరంలో విలక్షనంగానే భావించదగినది.

1960లో లక్షణ దీపిక పేరుతో సులభ వ్యాకరణం విద్యార్థులకు ఉపయోగపడే రీతిలో తేలికగా అర్థమయే టట్లుగా రచించారు. ప్రాచీనాలంకార శాస్త్రాలు మొదలుకొని తెలుగులో అప్పకవీయం వరకు అనేక గ్రంథాల నవలోకనం చేసి 'తెలుగు ఛందోవికాసము' అనే గ్రంథాన్ని రచించి పోటీకి పంపించారు. ఆంధ్రప్రదేశ్ అకాదమిప్రచురణకు తగిన పారితోషికం ఇచ్చి ప్రశంసించారు. నిజానికి తెలుగులో వచ్చిన అత్యంత ప్రామాణికమైన ఛందో గ్రంథము సంపత్కుమారగారి తెలుగు ఛందో వికాసము మాత్రమే నేటికీ నిలిచి ఉన్నది. 1990లో తెలుగు అకాడమి ఈ గ్రంథాన్ని పునర్ముద్రణ చేసి అందరికి అందుబాటులో తెచ్చింది. ఛందస్సులో వీరి కృషిని గమనించి తెలుగు అకాడమీ వారి కోరిక మేరకు 1977లో తెలుగు ఛందఃపదకోశము రూపొందించి అందించారు.

అప్పటికి తెలుగులో విరివిగా వెలువడుతున్న వచన కవిత్వాన్ని వచన పద్యం అనాలని, వచన కవితకు కూడా కొన్ని నియమాలుంటాయని తెలుపుతూ భారతిలో వ్యాసాలు రాశారు. భాషాశాస్త్రంలో పోటాపోటీగా అనేక వ్యాసాలు సాధికారికంగా, సోదాహరణంగా, సోపపత్తికంగా రచించారు. ఆనాటికి ఇద్దరికీ వ్యక్తిగత పరిచయం లేదు. కాని ఇద్దరూ ఎంతో సంయమనంతో వ్యక్తిగత విమర్శల ప్రస్తావన చేయకుండా కేవలం విషయానికే పరిమితమయి తమభాషా వ్యాకరణ ఛందో విషయాల పరిజ్ఞానాలను తవ్విపోస్తూ ఎదురుకోవడం విశేషం. అంత సౌమనస్యంగా ఒక విషయంపై విరుద్ధ భావాలు ప్రకటించడం ఆనాటి సాహితీలోకంలో గొప్ప ఆదర్శమయింది. తరువాత చేకూరి, సంపత్కుమార ఇద్దరూ కలిసి వచనపద్యం లక్షణ చర్చ పేరుతో వారిరువురి వ్యాసాలూ ఒకే సంకలనంగా ప్రచురించి సాహిత్యలోకాన్ని విస్మితులను చేశారు. విజ్ఞులను చేశారు. వచన పద్యం అని పిలువడానికి నేటికీ ఎందరో అంగీకరించాల్సిన వాదన సంపత్కుమార చేశారు.

ఛందస్సులో మరింత కృషి చేసి కూచిమంచి తిమ్మకవి లక్షణ సార సంగ్రహం గ్రంథాన్ని 1971లో పరిష్కరించి విపుల పీఠిక రచించారు. కూచిమంచి వెంకటరాయని ఛందోగ్రంథం సుకవి జన రంజకం తాళపత్ర ప్రతిని 1976లో పరిష్కరించి విపుల పీఠికతో అప్పటి ఆంధ్రప్రదేశ్ అకాడమీవారికందించారు. తెలుగు ఛందో భూమికలు పేరుతో 1993లో ఒక పుస్తకం రచించారు. ఈ పీఠికలు, మరికొన్ని వ్యాకరణ గ్రంథాల పరిష్కరణ పీఠికలు కలిపి తెలుగు ఛందస్సులో కొన్ని వెలుగులు పేరుతో ఒక పుస్తకాన్ని 2003లో ప్రచురించారు. అన్నమాచార్యుల కీర్తనలలోని ద్విపదలు, రగడలు, మాత్రాఛందోవైవిధ్యంపై వ్యాసాలు రచించారు. ఛందస్సులో ఏ సంశయానికైనా వెంటనే సమాధానం చెప్పగల మహావేత్త సంపత్కుమార ఒక్కరే అనే ఖ్యాతి పండితలోకంలో ఆయనకే దక్కింది.

విమర్శనారంగంలో పూర్వాలంకారికుల సిద్ధాంతాలు మొదలుకొని ఆధునికుల సిద్ధాంతాల వరకు అధ్యయనం చేయడమే కాక విశ్లేషించి సమన్వయం చేస్తూ 'తెలుగులో ఆధునిక విమర్శ సాంప్రదాయక రీతి' అనే సిద్ధాంత గ్రంథాన్ని వెలువరించారు. ఆధునికులలో కందుకూరి, కట్టమంచి మొదలుకొని శ్రీశ్రీ, శేషేంద్రల వరకు గల అనేక ప్రతిపాదనలను తార్కికంగా వివేచించారు. సోదాహరణంగా విపులీకరించి వివరించారు. ఆధునిక విమర్శలో పాశ్చత్య ధోరణులు, ప్రభావాలను కూడా వివరించారు.

విశ్వనాథ రామాయణంలో యుద్ధకాండ శిల్పావ తారికి, చలం పురూరవ రచనపై చేసిన విమర్శతో పాటు పలు విమర్శలు పాఠకుల పండితుల సాహితీ వేత్తల మన్నన లందుకున్నాయి. సంపత్కుమారగారి విమర్శనా ధోరణి ఏ కవినీ రచయితనూ కరుకుగా తప్పుపడుతున్నట్లుండదు. పాఠకునికి అనేక విశేషాలు తెలుపుతూ విషయపరిజ్ఞానాన్ని కలిగిస్తాయి. సాహితీ వికాసాన్ని కలిగిస్తాయి. ఒక ఆత్మీక ప్రకటన వలె ఉండి రచయితకు, పాఠకుడికి ఇద్దరినీ ఒప్పించే సున్నితమైన వ్యక్తీకరణ ఉంటుంది. తెలుగు పూర్వకవుల కావ్య దృక్పథాలు, కన్యాశుల్కం మరోవైపు, విశ్వనాథ సాహిత్య వ్యక్తిత్వం, కిన్నెరసాని పాటలు వస్తువిన్యాసం మొదలైన విమర్శలు వేనికవే సాటి. ఆయన విమర్శలు ఆయా రచనల లోతులను చూడమే కాక విమర్శ ఎట్లాఉండాలి? ఎట్లా ఆలోచించాలి? ఒక రచనను ఎట్లా చదవాలి? అనే విధానాలు కూడా పరోక్షంగా తెలుపు తున్నట్లుగా ఉంటాయి. ఒక విధంగా విమర్శకు సంబంధించిన పాఠాలు చెపుతున్నట్లు ఉంటాయి.

ఆధునిక ప్రక్రియలైన కథలు, నవలలు, నాటకాలు, కూడా ఆయన విమర్శతో భాగమయినాయి. తనను విబేధించిన వారితో ఎప్పుడూ తాను కలహించలేదు. తన శక్తితో నిరూపించి అవుననిపించడమే ఆయన సహజమైన నైపుణ్యం.

విశ్వనాథ రామాయణంలో ఒక ఘట్టం ఇప్పుడే రాసినానని వినిపించారట. సంపత్కుమార పెదవి విరిచి విశ్వనాథ రాసినట్లుగా లేవన్నారట. వెంటనే విశ్వనాథ ఆ కాగితాలు చించేసి తరువాత తిరిగి కొత్తగా రాసుకున్నారట. విశ్వనాథ పద్యాలను ఆయన ఎదుట అంతధైర్యంగా అంత సున్నితంగా చెప్పగల పాండితీ విమర్శనా పటిమ సంపత్కుమారగారిది.

ఇవన్నీ కాగా, 1969, 70లలో వరంగల్లుకు చెందిన ఒక వందసంవత్సరాల కాల పరిధిలోని సాహితీ వేత్తల వివరాలు సేకరించి మనపండితులు, కవులు, రచయితలు, అనే పేరుతో ఒక సంకలనం వెలువరించారు. అది ఈనాటి తెలంగాణ సాహితీ వేత్తలకు ప్రతిజిల్లాకు అంతటి కృషి చేయడానికి ఒక మార్గదర్శనంగా నిలిచింది. సంపాదకీయాలు, పాత్రికేయ వ్యాసాలు, అముద్రితాలుగా ఉన్న రచనలు ఇంకా ఉన్నాయి. ఆచార్య కోవెల సంపత్కుమారాచార్య కవి, పండితుడు, ఛందశ్శాస్త్ర వేత్త, గొప్ప విమర్శకుడు. ఇవన్నీ ఎంతగొప్పగా ఉన్నా అహంభావం అణుమాత్రం కూడా లేని నిరాడంబర జీవి. ఏ పురస్కారా లకు, సన్మానాలకు ఎదురుచూడలేదు. రాలేదని పెదవి విరవలేదు.

రాజీవ్ ప్రతిభా పురస్కారం రాష్ట్ర స్థాయిలో అందుకున్నప్పుడు మా వంటి విద్యార్థులందరినీ పిలిచి తన ఆనందాన్ని పంచుకున్నారు. ఎప్పుడూ లాల్చీ ధోతీ నుదుట సంప్రదాయబద్ధంగా ఉండే నామం ఎన్నడూ మారలేదు. అయితే ఎంత సంప్రదాయంగా కనిపిస్తారో అంత ఆధు నికుడు. ఆధునిక కవిత్వాన్ని, ఆధునిక భావాలను అమితంగా ఆదరించి ప్రేమిస్తాడు. తనతోటి ఆచార్యులు పండితులతో ఎట్లా ఉంటారో తన విద్యార్థులతో కూడా అంతే స్నేహంగా ప్రేమగా ఉత్సాహంగా ఉండేవారు. నిత్యం స్నేహితులతో, విద్యార్థులతో గడపటం, చమత్కారంగా మాట్లాడటం, ఏనాడూ కోపం లేకపోవడం ఆయన వ్యక్తిత్వాన్ని మరో అంతస్తు పెంచాయి. సుప్రసన్న, రామకోటి శాస్త్రి, కాళోజీ, వానమామలై, జువ్వాడి, గౌతమరావు, చేరా, బేరా, వెల్చాల కొండలరావు, లక్ష్మణ యతీంద్రులు మొదలైన వారందరితో ఒక సాహితీ కుటుంబంగా గడిపిన అదృష్టవంతుడు. సహృదయుడు.

అపార పాండిత్యమూ, అమిత శిష్యవాత్సల్యమూ, ఆత్మీయ స్నేహభావమూ సంపత్కుమారను సాహిత్య రంగంలోనే కాక సామాజిక రంగంలో కూడా ఉన్నతుడిని చేశాయి. వివిధ ప్రక్రియల్లో ఆయన రచనలు నాటిన మొక్కలు డా. అనుమాండ్ల భూమయ్య, ఆచార్య బన్న అయిలయ్య, నేనూ (రచయిత) మావంటి ఎందరో ఆయన నాటిన మొక్కలం.

ఆచార్య సంపత్కుమార నిన్నటి శతాబ్దంలో శిఖర ప్రాయమైన సాహితీవేత్త. డా. వెల్చాల కొండలరావుగారన్నట్లు ఆయనొక ఎన్‌సైక్లోపీడియా, ఒక రెఫరెన్స్, ఒక పెద్ద దిక్కు. ఆగస్టు 5, 2010లో పరమ పదాన్ని అందుకొని సాహితీ జగత్తులో అమరులయ్యారు. అందరికీ ఇష్టమన ఆచార్య కోవెల సంపత్కుమారాచార్యులు గారు సాహితీక్షేత్ర వనమాలి.

79

# కృష్ణమాచార్య శతావధాని

– డా॥ సి. హెచ్. లక్ష్మణ చక్రవర్తి

“పూర్వము మన తెలంగాణ ప్రాంతమున ఎందరో మహా పండితులు కవులు, మహాకావ్యకర్తలు జన్మించియున్నారు. కాని వారి జీవితములు వ్రాసి లేనందున ప్రాంతీయ చరిత్ర కందకున్నారు. వారి కావ్యములు ముద్రణాది సౌకర్యములు లేనందున కాలగర్భంలో కలిసి పోయినవి”ని తెలంగాణ ప్రాంత స్థితిని గురించి అవగాహన చేసుకుని మాట్లాడిన పండితులు శిరిశనహల్ కృష్ణమాచార్యులు. తాను స్వీయ కవితాను జీవనము వ్రాయడానికి కారణం తన గొప్పతనం చెప్పుకోవడానికి కాదని, తన కవితాత్మక జీవితాన్ని వివరించడం ద్వారా తన ప్రాంత స్థితిని, తన కాలపు కవుల పరిస్థితిని చెప్పడం లక్ష్యమన్నారు. వారు 13-8-1905న రంగనాయకమ్మ, వేంకటాచార్యులు దంపతులకు నిజామాబాదు జిల్లా మోర్తాడులో జన్మించారు. స్వీయ కవితాను జీవనము 1986లో రచించారు. అంటే సుమారు 81 సంవత్సరాల కవితా జీవితం, అందులో పరచుకుని ఉన్నదన్నమాట. ఇది వారి చిట్ట చివరి రచన.

చిన్నప్పుడు తండ్రి దగ్గర ఐదేళ్ల వయసులో విద్యాభ్యాసం ప్రారంభించిన వారికి 9 సంవత్సరాలకే వివాహమైంది. ఈ సంఘటన వారు బాల్యవివాహాలు నిరసిస్తూ కవిత్వం వ్రాయడానికి ప్రేరణగా నిలిచింది. కరీంనగర్ జిల్లా బండలింగాపురంలోని మాతామహుల దగ్గర సంస్కృత నాటక అలంకారాలు, కొన్ని సంప్రదాయ గ్రంథాలు చదివారు.

నల్లగొండ జిల్లా వారైన కనకాపురపు శ్రీనివాసాచార్యుల దగ్గర తర్కం, కుందోర్ఘుల వెంకన్న దగ్గర జ్యోతిషం, కోరుట్లలో సేనాపతి నరసింహాచార్యుల దగ్గర వ్యాకరణం, తెలుగు కావ్యాలు చదివి మద్రాసులోని శ్రీ పెరుంబూదూరు వేదాంత కళాశాలలో మీమాంసా, న్యాయ, వేదాంత శాస్త్రాలు చదివారు గీతాభాష్యం, ఉపనిషత్తు భాష్యాలు, శ్రీభాష్యం, భగద్విషయాలు అధ్యయనం చేశారు.

తెలంగాణ ప్రాంతంలో వేదాంత సంస్కృత విద్యలు నలుగురికీ పంచాలన్న లక్ష్యం వారికి ఉండేది. కోరుట్ల సంస్కృత కళాశాలలో అధ్యాపకులుగా ఉన్నప్పుడే పొనుగోటి ఆనందమాంబకు విద్యాబోధన చేశారు. ఆమె 8 సంవత్సరాల వయసులోనే అవధానం చేయడానికి వీరి శిష్యరికం కారణమంటారు. ఆమెకు సంస్కృతం, కవితా రచనలో మెల కువలు నేర్పించారు. తెలంగాణ ప్రాంతంలోని చాలామంది పండితులు వారి శిష్యులే అంటే ఆశ్చర్య పడనవసరంలేదు. కోరుట్ల ఉభయవేదాన్త కళాశాలలో ప్రధానోపాధ్యాయులుగా ఉండి ఎంతోమందికి విద్యాదానం చేశారు. ‘కళాశాలాభ్యుదయము’ అన్న కృష్ణమాచార్యుల వారి రచనలో ఈ కళాశాల విశేషాలను, విశిష్టతను గమనించవచ్చు.

సంస్కృతం, తెలుగు, తమిళ భాషలలో పండితులైన వీరు అనేక రచనలు చేశారు. సంస్కృతంలో మనస్సందేశ కావ్యం, సంపత్కుమారసంభవమ్, గురువంశ మహాకావ్యమ్,

మనోజవిజయ భాణమ్, ధర్మపురి లక్ష్మీనృసింహ సుప్రభాతం, ప్రపత్తి, స్తోత్రం, మంగళా శాసనం జియ్యరు స్వామి చరిత్రం వంటి కావ్యాలు, తత్వార్థ ప్రకాశిక, అర్చిరాది మార్గం, శ్రీ వచన భూషణం, రహస్యత్రయం, వేదాంత దీపం, పూర్వ పక్ష సిద్ధాంత సంయోజనం వంటి గద్య రచనలు చేశారు. తెలుగులో కళాశాలాభ్యుదయము, మనస్సందేశము, ఆంధ్ర మహానాటకము, రామానుజచరిత్ర కావ్యాలు విశిష్టాద్వైత మతసంగ్రహము, స్వీయ కవితానుజీవనము అన్న వచన రచనలు చేశారు. విశ్వకర్మ శతక ఖండన మండనము, గీతాచార్య మత ప్రభావము, పద్మావతీ పరిణయము, రుక్మిణీ కళ్యాణము, గరుడ గర్వాపహరణము, కృష్ణగారడి, ఆధ్యాత్మ భారత హరికథ, గాంధీ జీవిత చరిత్ర, ప్రజాస్వామ్యము, అభినవకుచేలోపాఖ్యానము, రత్నమాల, శతవిధ బంధ పద్య శతకము, శృంగార పంచ బాణ విజయబాణం వంటివి ముద్రితా ముద్రిత లభ్యాలభ్య రచనలు.

1940లో సేనాపతి నరసింహాచార్యుల దగ్గర విద్యాభూషణ బిరుదు, తిరుమల తిరుపతి దేవస్థానం వారి పండిత సన్మానం (1955) ఉభయ వేదాంతాచార్య బిరుదు పెద్ద జియ్యరు స్వామి వారి నుండి (1973) ప్రపంచ తెలుగు మహాసభల కవి సన్మానం--(1975) తెలుగు విశ్వ విద్యాలయం వారి పురస్కారం (1992) మొదలు అనేక సాహితీ సంస్థల నుండి సన్మానాలు గౌరవాలు పొందారు. 40 అష్టావధానాలు, 5 శతావధానాలు చేసిన, చిత్రబంధ కవిత్వాలు రచించిన కృష్ణమాచార్యులు నైజాం రాష్ట్రాద్య శతావధాని బిరుదును పొందారు. అది వారికి అన్వర్థనామ ధేయమైంది. అలా కృష్ణమాచార్య శతావధానిగా వారు ప్రసిద్ధిని పొందారు.

16 సంవత్సరాలలో తొలి సంస్కృత శ్లోకం రచించిన వారు తన రచనా యాత్రను సంస్కృత మనోజ విజయ భాణంతో ప్రారంభించారు. పెద్దపల్లి దగ్గరి నంబులాద్రి నరసింహ రథోత్సవమే ఇందులోని ఇతివృత్తం. తొలి తెలుగు కవిత కంద పద్యం. నాటి కరీంనగర్‌ను

కరివర సుభక్త్యా, కరమగుటన్ ప్రాంత భూప కమనీయభజత్
కరకం నికరములనుగన, కరినగరంబ నగ సార్థకరమై
యొప్పన్

హరి భక్తులకు, రాజులకు పన్నులు చెల్లించే సంపన్నులకు నిలయం కరీంనగరమని వర్ణించారు.

ఒకరోజు రాత్రి సరస్వతీదేవి కలలో వచ్చి ఒక సమస్యను పూరించమని అడిగింది. ఉత్పలమాలలో పూరించారు. అలా ప్రారంభమైన వారి ధారణ, పూరణలు అష్టావధానాలు, శతావధానా చేయడానికి పురిగొల్పింది. 1928లో జరిగిన రాజా అనంతకిషన్ రావు ఏర్పాటు చేసిన శతావధానం మరో కారణం. అవధానం మంత్రోపాసన బలమన్న అభిప్రాయాన్ని కృష్ణమాచార్య శతావధాని కాదంటారు. అది ధారణ శక్తి ప్రజ్ఞాభ్యాసంతో కూడిందన్నది వారికున్న స్పష్టమైన అభిప్రాయం.

చిత్ర బంధ కవిత్వాలను రచించిన కృష్ణమాచార్యులు అందులో ఆధునిక దృష్టిని తన జాతీయాభావాన్ని ప్రదర్శించారు. వంద రకాలుగా చిత్ర కవితను నిర్వహించారు. 'చిత్రప్రబంధం' పేరుతో 1940 ప్రాంతంలోనే రచించిన ఈ రచన ఇటీవలె ముద్రితమైంది. భారతదేశ జాతీయ పతాకం, రాట్నం, గడియారం, విమానం, సైకిలు, నిచ్చెన వంటి చిత్రబంధ కవిత్వాలు ఈ చిత్ర ప్రబంధంలో కనిపిస్తాయి. ఇవి పూర్వులు రచించిన చిత్ర బంధ కవిత్వానికి భిన్నమైనవి.

శ్రీశంకరులు, శ్రీరామనుజాచార్యులు, మధ్వాచార్యులు లేదా తాత్త్వికుల జీవిత చరిత్రలను కావ్యంగా మలచాలంటే వారి జీవిత విశేషాలు, చరిత్ర తెలిస్తే సరిపోదు. ఆయా తాత్త్వికులలోని తత్త్వం తెలిసి ఉండాలి. సిద్ధాంత రహస్యాలు, విశిష్టాద్వైత తత్త్వం పరిపూర్ణంగా తెలిసిన కృష్ణమాచార్యుల వారి వల్ల రామానుజచరిత్రకు తాత్త్విక కావ్యంగా గౌరవం దక్కింది. అనేక ఉపనిషత్తులు, స్తోత్రాలు, విశిష్టాద్వైత రహస్యాలు ఈ రచనలో స్వేచ్ఛానువాద రూపంలో కనిపిస్తాయి.

గాంధీ తాత నీతి శతకంలో కృష్ణమాచార్యులవారి గాంధేయ వాదాన్ని చూడవచ్చు. విదేశీ వస్త్ర బహిష్కరణ, గాంధీ సమకాలీనులైన నాయకుల పట్ల కవికున్న దృక్పథం ఈ శతకంలో చూడవచ్చు. ఆంధ్ర మహా నాటకము హనుమటన్నాటకానువాదము. 14 అంకాలున్న ఈ నాటకం 14లో కాలకు ప్రతీకగా నిర్మించారు. స్తుతి గీతములు

కొందరు వైష్ణవాచార్యులు వ్రాసిన రచనలకు అనువాదాలు. ఇంతటి ప్రౌఢ కవిత్వాన్ని రచించిన కృష్ణమాచార్యులు రుక్మిణి కళ్యాణము, గరుడ గర్వాపహారము, పద్మావతి పరిణయము వంటి పౌరాణికాలు, గాంధీజీ జీవితము ప్రజారాజ్యము వంటి సాంఘికాలను హరికథలుగా రచించారు. ఇవి ఆచార్యులవారికున్న ప్రాచీనాధుక దృక్కోణాన్ని చెబుతాయి. సంస్కృతంలో వారు రచించిన మనస్సందేశకావ్యం అర్చిరాది మార్గాన్ని కవితాత్మకంగా వివరించేది. గురువంశ మహా కావ్యములో నమ్మాళ్వారు, నాథముని, యామునాచార్యులు, శ్రీరామానుజులు, నంజియ్యరు నంబిళ్ళై, వేదాంతదేశికులు, వరవరమునుల వైభవాన్ని ఐదాశ్వాసాలలో వర్ణించారు. వీరిలో ఒక్క నమ్మాళ్వారు తప్ప మిగతా వారంతా వైష్ణవ ఆచార్యులు. జియ్యరు చరిత్ర పెద్ద జీయరు వారి జీవితాన్ని వర్ణించేది. సంపత్కుమార సంభవం మేల్కోటై క్షేత్రమహాత్మ్యాన్ని తెలిపే కావ్యం.

గురు పరంపరాగతమైన సాంప్రదాయిక విద్యను అభ్యసించినా బాల్య వివాహం, వితంతు వివాహం, జాతీయాభిమాన విషయాలలో ఆధునిక దృష్టి కలవారు కృష్ణమాచార్యులు. వితంతు వివాహం ప్రోత్సాహిస్తూ యువతకు ప్రబోధాత్మక కవితలను అందించారు.

వేదార్థ సంగ్రహ సమీక్ష, రామానుజులవారి వేదాన్త దీపం, రంగ రామానుజుల విషయ వాక్య దీపిక, కృష్ణమాచార్యుల తత్త్వసారము వంటివి సంస్కృతం నుండి తెలుగులోకి అనువదించారు. ఆళ్వారుల సాహిత్యాన్ని అనువదించారు.

సంస్కృతం తెలుగు భాషలలో, సంస్కృత తమిళ వేదాంతాలలో గాఢమైన పాండిత్యం ఉండడంవల్ల ఉభయ భాషా కవిగా, ఉభయ వేదాంత పండితులుగా ప్రసిద్ధి పొందారు. సంస్కృతం తప్ప మరొకటి భాష కాదనుకునే పండితుల కాలంలో పుట్టినా తెలుగు భాషలో సారస్వత రచన చేశారు. తెలుగులోనూ ఒక కావ్య సంప్రదాయానికే పరిమితం కాకుండా స్తుతిగీతాలు, హరికథలు, శతకాల వంటి దేశీ సారస్వతానికి పెద్దపీత వేశారు. ఇది వారి విశాల దృక్పథాన్ని సమన్విత దృష్టిని మన ముందు నిలుపుతుంది. 20వ శతాబ్దపు తెలంగాణ పండితులలో ప్రసిద్ధులు విశిష్టులు కృష్ణమాచార్య శతావధాని.

80

# కొత్తూరు సీతయ్య గుప్త

– డా॥ కర్నాటి లింగయ్య

శం నోమిత్రః శంవరుణః!! శంనో భవత్వర్యమా శంనో ఇంద్రో బృహస్పతిః!! శంనో విష్ణు విష్ణురురుక్రమః

దేశభక్తి, ప్రజాహిత చింతన మూర్తీభవించిన నిస్వార్థ నిరాడంబర ప్రజా సేవకులు శ్రీ కొత్తూరు సీతయ్య గుప్త. వారు పుట్టింది అతి సామాన్య కుటుంబంలో, ఒక చిన్న వ్యాపార సంస్థలో ఉద్యోగిగా జీవితం ఆరంభించారు. ఏ వ్యాపార సంస్థలో పనిచేసినా లక్షలు ఆర్జించే వ్యవహార దక్షులు. వృత్తిని బట్టి వ్యాపారస్తులైనా, ప్రవృత్తిని బట్టి దేశభక్తుడు, జాతీయవాది, గాంధీతత్త్వాభిమాని. ప్రజాహిత చింతనగల సంఘ శ్రేయోభిలాషి, నిజాం నిరంకుశ పరిపాలనకు వెరవని ధైర్యశాలి. ఆర్యసమాజ్ నిర్మాణానికి, ప్రచారానికి తన జీవితం అంకితం చేసిన చైతన్యశీలి. అనేక సాంఘిక, సాంస్కృతిక సేవా సంస్థల స్థాపనలో, నిర్వహణలో క్రియాశీల ప్రోత్సాహమిచ్చిన సంఘ సేవా పరాయణులు. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో ప్రజాసేవా రంగంలో వీరు ప్రముఖంగా కనిపిస్తారు.

పూర్వపు హైదరాబాదు సంస్థానంలో తెలుగు ప్రజల అభ్యున్నతికి వారి న్యాయమైన హక్కులు, అధికారాలను సాధించడానికి అవిరళకృషి చేసిన జాతీయవాదులలో పేర్కొనదగిన ప్రజా సేవాతత్పరులు శ్రీ సీతయ్య గుప్త గారు. నిజాం నిరంకుశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగిన వివిధ ఉద్యమాలలో ఆయన నిర్వహించిన పాత్ర శ్లాఘనీయమైనది. నిజాం నిరంకుశ పరిపాలనను అంతరింపచేసి హైదరాబాదు భారత యూనియన్‌లో విలీనమైన తరువాత రాష్ట్ర నిర్మాణానికి నిర్విరామ కృషి సలిపి తన ఆకాంక్షను సాధింపగలిగిన ప్రముఖులు శ్రీ సీతయ్య గుప్త.

హైదరాబాదు నగరంలో అనేక సామాజిక, సాంస్కృతిక, విద్యావిషయక, వాణిజ్యవర్తక, నిర్మాణ సేవా సంస్థల స్థాపనలోనూ, వాటి నిర్వహణలోనూ సీతయ్యగారు నిర్వహించిన పాత్ర అమోఘమైనది. జంట నగరాలలోని వర్తక ప్రముఖులలో వీరికి గల స్థానం విశిష్టమైనది. వర్తక, వాణిజ్య సంస్థలు నెలకొల్పటంతోపాటు, కార్మిక సంఘాలు కూడా స్థాపించి యజమానులు, కార్మికులు మధ్య సామరస్య సుహృద్భావాలను నెలకొల్పటానికి కృషి చేసిన నిర్మాణ కార్యకర్త, గాంధేయవాది శ్రీ సీతయ్యగారు.

శ్రీ సీతయ్యగారు తేది 10–8–1911న హైదరాబాదు నగరానికి 20 మైళ్ళ దూరంలో ఉన్న బహదూర్ గూడలో జన్మించారు. వీరి తండ్రి శ్రీ కొత్తూరు రామన్న, తల్లి శ్రీమతి అన్నమ్మ. అయిదుగురు అన్నదమ్ములలో సీతయ్యగారు నాల్గవ వారు. వీరు శంషాబాద్ వీధి బడిలో చదువుకున్నారు. శ్రీ వేంకటస్వామి గారనే ఉపాధ్యాయులు ఈయన గురువుగారు. తెలుగుతోపాటు ఆనాటి రాజభాష అయిన ఉర్దూ భాష నేర్చి, హిందీ ప్రావీణ్యత పొంది, సిద్ధాంత శాస్త్రి (బి.ఏ)తో

సమానము అగు డిగ్రీని పొందినారు. భారత, భాగవతాది గ్రంథాలు, సుమతి శతకం, దాశరథి, వేమన శతకాలు కంఠస్థం చేశారు. అమరమూ, ఆంధ్రనామ సంగ్రహం వంటి నిఘంటు గ్రంథాలు అధ్యయనం చేశారు. మరియు వ్యాపార సంబంధమైన లెక్కలు, గణిత శాస్త్రం నేర్చుకొన్నారు.

శ్రీ సీతయ్య గుప్త గారు తల్లిదండ్రులను వారి చిన్నతనంలోనే కోల్పోయారు. 1928లో కుటుంబ బాధ్యత వారి భుజస్కందములపై పడుటవలన వారు ఉద్యోగము చేయవలసివచ్చింది. అందుకే వారు శంషాబాదు నుండి హైదరాబాదు నగరమునకు తరలివచ్చి ఉస్మాన్‌గంజ్‌లో శ్రీ కొడారపు లక్ష్మీనర్సయ్య గారి వ్యాపార సంస్థలో చిన్న గుమస్తాగా చేరారు.

సీతయ్య గారి పని చూచి సేట్‌గారు సంతృప్తి చెందారు. సంవత్సరమునకు రెండువందల రూపాయలు వేతనం ఇస్తామన్నారు. ఉద్యోగం ఖాయపరచుకొని ఉద్యోగంలో చేరి జాగ్రత్తగా కష్టపడి పనిచేసేవారు. కొద్దిరోజుల్లోనే ఆ సంస్థలో అన్ని విభాగాలలో జరిగే వ్యాపార కార్యకలాపాలు ఆయనకు కరతలామలకములైనవి. అకౌంట్సు, అజమాయిషీ తదితర వ్యాపార సంబంధ వ్యవహారాలలో వారు బాగా ఆరితేరారు. వీరికి ఏ పని అప్పగించినా ఆ పని అత్యంత బుద్ధికుశలతతో, విశ్వాసము, నిజాయితీతో నిర్వహించి యజమాని మన్నన లకు పాత్రులైనారు. ఏ పనిచేసినా ఒకరు తప్పుపట్టడానికి వీలు లేకుండా సమర్థతతో దానిని నిర్వహించే వ్యక్తి అని పేరు తెచ్చుకున్నారు సీతయ్య గుప్త గారు. ఉన్న ఉద్యోగ సంస్థ భాగస్వాములు విడిపోవటం వలన తదుపరి సొంత వ్యాపార సంస్థను స్థాపించి వర్తక ప్రముఖునిగా ప్రసిద్ధి చెందారు. 1930లో సీతయ్య గారికి వివాహం జరిగింది. వారికి ఐదుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. హైదరాబాదు విమోచన ఉద్యమంలో పాల్గొని స్వాతంత్ర్య సమరయోధునిగా పరిగణింపబడిరి.

వీరు తల్లిదండ్రులను కోల్పోయినను అధైర్యము చెందక కష్టపడి పనిచేయటం ప్రారంభించిరి. ఆహార ధాన్యముల కమీషన్ వ్యాపారము చేయ మొదలిడి అందు గణనీయమైన స్థానము సంపాదించిరి వీరు. ఆం.ప్ర. ధాన్య వ్యాపార సంఘమునకు పన్నెండు సం.లు కార్యదర్శిగాను, తదుపరి పదకొండు సం.లు అధ్యక్షులుగాను పనిచేసి సంఘమునకు ఎనలేని సేవ యొనర్చిరి. వీరు కొంతకాలము చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్‌లో కార్యనిర్వాహక సభ్యులుగా ఉండి, ఆం.ప్ర. వ్యాపార సమాఖ్యకు అధ్యక్షులై ఆ సంస్థల అభ్యుదయమునకు పలు విధములుగా పాటుపడిరి.

శ్రీ సీతయ్య గారు బాల్యము నుండియు సంఘ సేవా కార్యములందధికమైన శ్రద్ధ వహించుచు, పేదలను, దీనులను, కష్టముల నుండి కాపాడుటకు అవిరళమైన కృషి చేయుచుండిరి. వారి కార్య నిర్వహణ శక్తి అప్రతిమాన మైనట్టిది. వీరు గుమస్తాగా పనిచేయు కాలమున తోటి గుమస్తాల ఇబ్బందులను తొలగించుట కొరకు గుమస్తాల సంఘమును స్థాపించి, యజమానులతో సంప్రదించి, గుమస్తాలకు అనేక సౌకర్యములను కల్గించియుండిరి. హైదరాబాదు పురపాలక సంఘమునకు మేయరుగా నుండిన శ్రీ ధరణిధర్ సంఘ్వీ, శ్రీ బాల్ రెడ్డి మున్నగు పెద్దల సహకారముతో గుమస్తాలకు వారపు సెలవుల సౌకర్యమును కలిగించారు. గుమస్తాల సంఘం పటిష్టంగావించియుండిరి. తరువాత వారి విషయములు తను ఎం.ఎల్.ఏ. గా ఉన్న కాలంలో ప్రభుత్వ దృష్టికి తెచ్చి షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టమును అమలుపర్చునట్లు ప్రయత్నించి కృతార్థులైరి. వీరి కృషి వలన చాలా కాలము నుండి ఎదుర్కొను సమస్యలు పరిష్కరింపబడుట సంభవించెను.

శ్రీ సీతయ్యగారు దక్షిణ మధ్య రైల్వే సికిందరాబాదు విభాగమునకు అఖిల హైదరాబాదు హమాలీల సంఘమునకు తొమ్మిది సం.లు. అధ్యక్షులుగా ఉండి హమాలీల సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళి సర్వ సౌకర్యములను కలిగించిరి. తదుపరి ఆం.ప్ర. ప్రభుత్వం శాసనసభ ద్వారా హమాలీల సౌకర్యములకు సంబంధించిన చట్టమును ఆమోదింపచేశారు.

సంఘ సేవా పరాయణులైన శ్రీ గుప్తగారు క్రమంగా రాజకీయ రంగమున కూడా ప్రవేశించుట సంభవించెను. నిజాం ప్రభుత్వ కాలమున ఏర్పరచిన ఆంధ్ర మహాసభలో చేరి హైదరాబాదు జిల్లా మహాసభకు ఆరు సంవత్సరములు ఉపాధ్యక్షులుగా పనిచేసిరి. శ్రీ రామానంద తీర్థగారి ఆధ్వ ర్యమున రాష్ట్ర కాంగ్రెస్ ప్రతినిధుల సమావేశమునకు సంబంధించిన ఆహ్వాన సంఘమునకు వారు కార్యదర్శులుగా నియమింపబడిరి. సత్యాగ్రహోద్యమమును ఉధృతపరచినం

దులకు నిజాం ప్రభుత్వంవారు వారెంట్ జారీ చేసిరి. అప్పుడు వీరు బెజవాడ సరిహద్దుల్లో ఉండి నైజాం ప్రభుత్వమునకు విరుద్ధంగా పనిచేసిరి. వీరు హైదరాబాదు పట్టణ కాంగ్రెస్ సంఘమునకు కార్యదర్శిగాను, రాష్ట్ర కాంగ్రెస్ సంఘమునకు కోశాధ్యక్షులుగాను రెండు సంవత్సరములు పనిచేసిరి.

హైదరాబాదు పట్టణ పురపాలక సంఘంలో వీరు ఏడు సంవత్సరములు కౌన్సిలర్‌గా ఉండిరి. తరువాత ఆం.ప్ర. రాష్ట్ర శాసనసభకు హిమాయత్‌నగర్ నియోజక వర్గం నుండి వరుసగా రెండు పర్యాయములు శాసన సభ్యులు (ఎమ్.ఎల్.ఏ.)గా ఎన్నుకొనబడిరి. తన నియోజకవర్గము అభివృద్ధి కొరకు అహర్నిశలు కృషి చేసిరి. హైదరాబాదు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ అధ్యక్షులుగా పదకొండు సం.లు. మరియు హైదరాబాదు నగర కాంగ్రెస్ సంఘమునకు అధ్యక్షులుగా ఎన్నుకొనబడిరి.

శ్రీ సీతయ్య గుప్త గారు సాంఘిక, రాజకీయ వ్యవహారములందే గాక, సారస్వత విద్యారంగములందు కూడా సాటిలేని సేవలందించారు. హైదరాబాదు నందలి ఆంధ్రసారస్వత పరిషత్తుకు వారు నాలుగు సంవత్సరములు కోశాధికారిగా ఉండిరి. ఆ సమయమున శ్రీ దేవులపల్లి రామానుజరావు గారు, పులిజాల హనుమంతరావు గారు కార్యదర్శులుగా ఉండి తెలుగు భాషాభివృద్ధికి ఎనలేని కృషి చేసిరి.

శ్రీ సీతయ్య గుప్త గారు తెలుగు భాషకు వలెనే హిందీ భాషకు కూడా ప్రాముఖ్యతనిచ్చి హైదరాబాదులో దక్షిణ హిందీ ప్రచార సభ స్థాపించిన సభ్యులలో ఒకరు. హిందీ ప్రచార సభకు శాశ్వత సభ్యులుగా ఎన్నుకోబడినారు. హిందీ ఆర్ట్స్ కళాశాల, కేశవ మెమోరియల్ ఉన్నత పాఠశాల, మహరాజ్‌గంజ్‌లో ప్రాథమిక పాఠశాల వృద్ధికి కృషి చేస్తూ వివిధ పదవులను అలంకరించారు. శ్రీగుప్త గారు ధూల్ పేటలోని ప్రభాత్ హిందీ విద్యాలయమునకు అధ్యక్షులుగా ఉండిరి. ఈ విధముగా శ్రీ గుప్త గారు హైదరాబాదు నందలి పెక్కు విద్యా సంస్థలకును, గ్రంథాలయములకును అందిం చిన సేవలు ప్రశంసనీయమైనవి.

శ్రీ గుప్త గారు హైదరాబాదునందలి కాచిగూడలోని వైశ్య విద్యార్థి వసతిగృహ వ్యవస్థాపకులలో ప్రముఖులు. ఈ విద్యార్థి వసతి గృహమునకు పది సం.లు. ప్రధాన కార్యదర్శిగాను, పది సం.లు. అధ్యక్షులుగాను ఉండిరి. ఈ వైశ్య విద్యార్థి వసతిగృహ ట్రస్టు బోర్డుకు కూడా అధ్యక్షులుగా కొన్ని సం.లు. ఉండిరి. ఈ విద్యార్థి గృహమున కుల మత బేధము లేకుండా 300 మంది విద్యార్థులకు పైగా వసతి, భోజన సౌకర్యములు సమకూర్చుటకు కృషి చేసినారు.

శ్రీ గుప్త గారు ఖైరతాబాదు నందలి వాసవీ సేవా కేంద్రమును 1971లో స్థాపించి దానికి అధ్యక్షునిగాను మరియు వాసవీ ఫౌండేషన్‌కు అధ్యక్షులుగా ఉండిరి. ఈ సంస్థ ఆధ్వర్యంలో మూడు సం.ల. బి.కామ్. ఆనర్సు తరగతు లను నిర్వహించుచు పలువురి విద్యార్థులకు ఉపయోగపడు నట్లుగా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ & కామర్స్ కళాశాల స్థాపించి కార్యనిర్వాహక సంఘ అధ్య క్షులుగా ఉండి ఎనలేని సేవలందించారు. వైద్య రంగంలో ప్రజలకు సేవలందించే ఒక ఆశయంతో 1984లో వాసవీ మెడికల్ & రీసెర్చ్ సెంటర్ అను ట్రస్టును నెలకొల్పి దీనికి 2000 చదరపు గజాల స్థలమును కేటాయించిన ఘనత వారికి దక్కింది. ఈ సెంటర్‌లో హాస్పిటల్ నిర్మించి అన్నిరకాల వ్యాధిగ్రస్తులకు అండగా నిలిచింది. ఈ సెంటర్‌లో ఎక్స్‌రే మొదలుకొని అన్ని ఆధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయి.

1982లో వాసవీ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకును స్థాపించారు. దానికి రెండు పర్యాయములు చైర్మన్‌గా, పొట్టి శ్రీరాములు స్మారక సమితి, ప్రకాశం అభివృద్ధి అధ్యయన సంస్థ, సర్దార్ వల్లభాయ్ పటేల్ స్మారక సమితికి కార్యకర్తగా ఉండి ఆ మహనీయుని స్మారక సభలను ఘనంగా నిర్వహిం చారు. ఈ విధంగా శ్రీ గుప్తగారు పెక్కు రాజకీయ, సాంఘిక, విద్యా, సారస్వత గ్రంథాలయ సంస్థలయందు కార్యదర్శులు గానో, అధ్యక్షులుగానో, సభ్యులుగానో, ప్రముఖ స్థానములను అలంకరించుకుని వాటి నిరంతర అభ్యుద యమునకు కృషి చేశారు. మహిళల అభివృద్ధి కొరకు మహిళా సంఘాలను ఏర్పరచుటయేగాక కాచిగూడలో వైశ్యవిద్యార్థిని (బాలికలు) వసతిగృహమును స్థాపించి సకల సౌకర్యములన్నింటిని కల్పించారు. అలాగే వైశ్యజాతిలో కవులను ఒక దగ్గరకు చేర్చుటకు "వాసవీ సాహిత్య పరిషత్తు" 13-7-1977లో ఏర్పాటు చేసి, రాష్ట్రంలోని కవులను, రచయితలను, కళా

కారులను, పండితులను సంఘటితపరచి తెలుగు భాషను అభివృద్ధిపరచుటయే పరిషత్తు యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ సంస్థకు శ్రీ సీతయ్య గుప్త గారు గౌరవ అధ్యక్షులుగా ఉండి ఎన్నో కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

శ్రీ సీతయ్య గారు దళిత పక్షపాతి. అందుకే వీరు హైదరాబాదులోని బోరబండ గ్రామంలో "కొత్తూరి సీతయ్య నగర్" అని నామకరణం చేసి అనేకమంది హమాలీలకు గృహనిర్మాణం చేయించి సమాజంలో సేవాజ్యోతిగా నిలిచారు. ఆయన 87వ యేట శ్రీ ఈశ్వర నామ సం.ర. శ్రావణ శుద్ధ పాడ్యమి, సోమవారం 04-08-1997లో తనువు చాలించారు. వారి స్ఫూర్తి మనందరిని ముందుకు నడిపిస్తుందని విశ్వసిస్తున్నాము.

శ్రీ సీతయ్య గుప్తగారు త్రికరణశుద్ధిగల మానవతా మూర్తులు. దీనార్త జనులన్నా వారికి సానుభూతి మెండు. వారు ఏ పని చేపట్టినా దానిని అత్యంత సమర్థతతో హృదయపూర్వకంగా నిర్వహించుటకు ప్రయత్నించేవారు. కార్యదక్షతవలనే వారు చేపట్టిన పనులు చాలా గొప్పగా నిర్వహించారు. వారి జీవితంలో వారి ఆశయాలను సమర్థంగా నెరవేర్చారు. శ్రీ సీతయ్య గుప్త వారికి 'సర్దార్' 'వైశ్యరత్న' 'సేవారత్న' మొదలగు బిరుదులు ప్రముఖ సంస్థల నుండి స్వీకరించారు.

శ్రీ సీతయ్య గారు తెలుగు, హిందీ భాషలయందు గంటల తరబడి చాలా చక్కగా ఉపన్యాసం చేసేవారు. వీరు ధర్మమార్గ పరాయణులు, క్రమశిక్షణ పరాయణులు, దయామయులు, విద్యాసంపన్నులు, వినయమూర్తులు. అందుచేతనే వారు హైదరాబాదు నగర పుర ప్రముఖులలో నొకరై తమ కులమువారి చేతనే గాక, అన్యులచేత కూడా ప్రశంసింపబడిరి. వారి హృదయాలలో స్థిరంగా నిలిచిపోయారు. వారు స్థాపించిన, నిర్వహించిన సంస్థలన్నీ 'మూడు పువ్వులు, ఆరు కాయలు'గా విరాజిల్లుతున్నాయి. అవి నేటి యువత, నేటితరం ఆస్వాదించుతున్నారు.

# 81 కుమారయ్య (జస్టిస్)

**– అన్నవరం దేవేందర్**

ఆయన జీవితాన్ని సమున్నతంగా గెలుచుకున్న న్యాయ కోవిదుడు. జనధర్మం కోసం అత్యున్నత న్యాయ పీఠాన్ని అధిరోహించిన బహుజనుడు. సత్వర న్యాయం కోసం పరితపించిన న్యాయమూర్తి. నిరాడంబర జీవితం ఆయన ఆచరణ. ఆయన జస్టిస్ నాంపల్లి కుమారయ్య, జగిత్యాల జిల్లా, (అప్పటి కరీంనగర్ జిల్లా) కొడిమ్యాల మండల కేంద్రంలో శాలివాహన దంపతులైన నర్సింలు – లక్ష్మమ్మలకు ఆయన 15.6.1901లో జన్మించారు. పని చేస్తేనే బతుకుతెరువు అయిన కుటుంబంలో పుట్టి అంచెలు అంచెలుగా విద్యార్హతలు సాధించారు. కుమారయ్య ఏ తరగతిలో ఉన్న ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడు అయ్యేవాడు. ఆయన విద్యాదాహాన్ని గమనించిన తండ్రి ఆయనను కొడిమ్యాలలో ప్రాథమికవిద్య, కరీంనగర్‌లో ప్రాథమికోన్నత విద్య, వరంగల్‌లో ఉన్నత విద్యను ఆనాటి నిజం ప్రభుత్వ పాఠశాలలో ఉర్దూ మీడియంలో చదివించారు. అనంతరం ఆయన ఆగకుండా ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చేరి డిగ్రీ, న్యాయశాస్త్రం విద్యను అభ్యసించారు. అనంతరం జరిగి హైదరాబాద్ సివిల్ సర్వీసెస్ పరీక్షకు రాసి ప్రథమ ర్యాంక్‌లో ఉత్తీర్ణులయ్యారు. హైదరాబాద్ సివిల్ సర్వీస్ అంటే ఇప్పటి ఐ.ఏ.ఎస్. లెక్క. హైదరాబాద్ రాజ్యంలో 1931లో ఆయన సివిల్ సర్వీస్‌కు ఎంపికయ్యారు. ఆ పరీక్షలో ఎంపికైన వారి జాబితాను అప్పటి ప్రధాన న్యాయమూర్తి సర్ నవాబ్ మిర్జాయార్‌జంగ్ ఉన్నతాధికారులు సమర్పించి ఒకరిని జ్యుడిషియరీకి ఎంపిక చేయమని కోరారు. అందరి పరీక్షాపత్రాలను చూసిన ఆయన కుమారయ్యను జ్యూడిషియరీకి ఎంపిక చేరారు. జాబితాలోని మొదటి వ్యక్తికి తనకు నచ్చిన డిపార్ట్‌మెంట్‌ను ఎంపిక చేసికోవచ్చు. అందువల్ల కుమారయ్య రెవెన్యూ డిపార్ట్‌మెంట్ కావాలని కోరుకున్నారు. ప్రధాన న్యాయమూర్తి అయి వచ్చిన తర్వాత అయ్యన్ని న్యాయ స్థానంకు పంపుతానని ప్రధాన న్యాయమూర్తి హామి ఇచ్చారు. కాని కుమారయ్య లక్నోలో ట్రైనింగ్ పూర్తి చేసికొని వచ్చేసరికి నవాబ్‌జంగ్ ప్రధాన న్యాయమూర్తిగా రాజీనామా చేసి హైదరాబాద్ వదలి వెళ్ళిపోయారు. అందువల్ల కుమారయ్య మున్సిఫ్ మెజిస్ట్రేట్‌గా 1935లో ఉద్యోగంలో చేరాల్సి వచ్చింది.

ఆ తర్వాత 1943లో అడిషనల్ జిల్లా మేజిస్ట్రేట్‌గా పదోన్నతి పొందారు. 1946లో జిల్లా మెజిస్ట్రేట్‌గా పదోన్నతి పొందారు. 1948 సెషన్స్ జడ్జిగా, 1955లో హైదరాబాద్ హైకోర్ట్‌కు జడ్జిగా పదోన్నతి పొందారు. అప్పటికి ఆంధ్రప్రదేశ్ విలీనం కాలేదు. హైకోర్టులో జడ్జిగా చేరిన తర్వాత 1956లో ఆంధ్రరాష్ట్ర హైదరాబాద్ రాష్ట్రంలో విలీనం అయిన తర్వాత అడిషనల్ జడ్జిగా ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్‌లో పనిచేశారు. తిరిగి ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్‌కు 1957లో జడ్జిగా పదోన్నతిలో చేరారు. 1969లో చీఫ్ జస్టిస్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ హైకోర్టుగా అత్యున్నత పదవిలోకి ఎక్కారు. జూన్ 15, 1971లోని ఆయన పదవీవిరమణ చెందారు.

ఆయన జడ్జిగా ఏ స్థాయిలో పని చేసినా న్యాయవాదుల వాదనని శ్రద్ధగా దయతో ప్రేమపూర్వకంగా విని తీర్పులు చెప్పేవారని ప్రసిద్ధి. ఆయన తీర్పుల్లో ప్రజలకు న్యాయం అందించాలన్న తపన కనిపించేది. అయితే అందుకోసం ఆయన తన పరిధులు దాటినట్లుకూడా లేదు. కేసులను త్వరితంగా పరిష్కరించడానికి కుమారయ్య తీవ్రంగా పరిశ్రమించేవారు. హైకోర్ట్ న్యాయమూర్తిగా నియమకం పొందాక కేసుల్ని త్వరితంగా పరిష్కరించేందుకు అవసరమైన చర్యల్ని చేపట్టి అందుకోసం కృషి చేసినారు. హైకోర్ట్‌లోని విభాగాలను పునర్వ్యవస్థీకరించారు. తన పదవీకాలంలో హైకోర్ట్‌లో కేసులు చాలావరకు తగ్గుముఖం పట్టాయి. ఆయన ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన కాలంలో రాష్ట్రంలోని దాదాపు అన్ని కోర్టులను తనిఖీ చేశారు. ఆ తర్వాత సమావేశాలు నిర్వహించి అవసరమైన సూచనలు అందచేసేవారు. సబార్డినేట్ కోర్ట్‌లు ఎలాంటి తప్పిదాలు లేకుండా కేసులను పరిష్కరించేందుకు ఆయన మౌఖిక సూచనలు చేసేవారు. అట్టి సూచనలతో హైకోర్ట్ 1970, 71లో ఒక పుస్తకాన్ని వెలువరించింది. ఆ పుస్తకాలు న్యాయమూర్తులకు ఇప్పటికీ ఉపయోగపడుతున్నాయి.

హైకోర్ట్ చీఫ్ జస్టిస్‌గా పదవీ విరమణ పొందిన తర్వాత 1979లో ప్రపంచ బ్యాంక్ ట్రిబ్యునల్ జడ్జిగా రెండు పర్యాయాలు పనిచేశారు. మూడోసారి అవకాశం వస్తే కూడా ఆయన ఇష్టపడకుండా ఇంటి వద్దనే ప్రశాంత జీవనం గడపసాగారు.

కుమారయ్యకి తెలుగు, ఉర్దూ, మరాఠి, ఆంగ్లం భాషల్లో ప్రావీణ్యతగలదు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఆయన మొట్టమొదటి హైకోర్ట్ చీఫ్ జస్టిస్‌గా పనిచేసి రికార్డ్ సృష్టించారు. మారుమూల పల్లెలో కుమ్మరి కులం నుంచి ఇంతగా ఎదిగినవారు ఆ కాలంలో దాదాపుగా లేరు. హైకోర్ట్ జడ్జిగా దళిత బహుజనులు దాదాపు లేనికాలంలో ఆయన శ్రమించి అంచెలు అంచెలుగా ఎదిగారు. పేద కుటుంబం నుంచి వచ్చినందున పేద ప్రజలపట్ల అవ్యాజమైన అనురాగంతో ఉండేవారు. సత్వరంగా న్యాయం అందిస్తేనే న్యాయం జరిగినట్లు అని నమ్మే ఆయన ఆచరించి చూపారు. నిరాడంబర జీవితం ఆచరణకు మచ్చుతునకగా ఆయన ఉద్యోగ విరమణ సందర్భంలో చెప్పిన “ఈ ప్రపంచంలో ఎవరూ పరిపూర్ణులుకాదు. వైఫల్యాలు లేకుండా ఎవ్వరూలేరు. నా చర్యలవల్ల ఏదైనా మంచి జరిగిదే అది భగవంతుని కృపవల్ల జరిగింది. ఏదైనా చెడుగానీ అపజయంగానీ సంభవించినట్లు అయితే అవి నా లోపాలవల్ల జరిగాయి” అన్న మాటలు గుర్తుకువస్తాయి.

జస్టిస్ కుమారయ్య తీర్పు చెప్పిన కేసుల్లో ఖాసీంరజ్వీ, అయక్ అలీ తప్పించుకున్న కేసు ముఖ్యమైనది. అట్లాగే సాలర్‌జంగ్ ఎస్టేట్ వ్యవహారాల కేసులను కూడా ఆయన పరిష్కరించారు. చీఫ్ జస్టిస్‌గా పనిచేస్తున్న కాలం తర్వాత తను అగ్రికల్చరల్ ఇన్‌కంటాక్స్ ట్రిబ్యునల్, ఎలక్షన్ ట్రిబ్యునల్‌కు వేజ్‌బోర్డ్, పబ్లిక్ సెక్యూరిటీ మేజర్స్ అడ్వయిజర్ బోర్డ్‌లకు వేరు వేరు కాలాల్లో చైర్మన్‌గా వ్యవహరించి పలు సామాజిక ప్రయోజనంగల జడ్జిమెంట్‌లు ఇచ్చారు. ప్రివెంటివ్ పెటెన్షన్ ఆర్ట్‌కు అడ్వయిజరీ బోర్డ్ మెంబర్‌గా కూడా పని చేశారు.

జస్టిస్ నాంపల్లి కుమారయ్యకి స్వయాన సోదరుడు నాంపల్లి రాజేశం ప్రఖ్యాత సోషలిస్ట్ నాయకుడు. ఆయన జార్జి ఫెర్నాండెజ్ మధులిమయెతో సాన్నిహిత్య సంబంధాలు ఉండేవి. కొంతకాలం ఇంజనీర్‌గా హైదరాబాద్ రాష్ట్రంలో పనిచేశారు. చాలా సంవత్సరాలుగా ‘ఆకాశిక్’ అనే ద్విభాష (తెలుగు, ఇంగ్లీషు) పత్రికను సికిందరాబాద్ నుండి వెలువరించారు. ఇటీవలనే ఆయన మరణించారు.

జస్టిస్ కుమారయ్యకు కాకతీయ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ఇచ్చి గౌరవించింది. ఆయనకు ఐదుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. సత్యం, న్యాయం అందించడం నిరాడంబర జీవితం ఆచరించడంలో ఈ బహుజనబిడ్డ తెలంగాణ వైతాళికుల్లో ఒకరు.

ఆయన 96 సంవత్సరాలు జీవించి 2005లో అమరత్వం పొందారు.

# 82 ఎం.ఎల్. జయసింహా

**– పి.వి. రామమోహన్ నాయుడు**

దేశ స్వాతంత్ర్యానికి ఎంతో కాలం పూర్వమే హైదరాబాద్ నగరం ప్రపంచ పటంపై భాసిల్లుతుండేది. ప్రపంచంలో సంపన్న రాజ్యంగాను, విలాసవంతమైన రాజప్రసాదాలు, బహు భాషలు, విభిన్న సంస్కృతుల సంగమంగా, సామరస్య సహజీవన సౌందర్యానికి సంకేతంగా హైదరాబాద్ నగరాన్ని చెప్పుకొనేవారు. అలాంటి నగరానికి ప్రపంచం ప్రఖ్యాతి తెచ్చిన వారిలో క్రీడాకారులు ఉన్నారు. ఒలింపిక్స్‌లో భారత ఫుట్ బాల్ జట్టుకు ఏడుగురు ఆటగాళ్లను ఇచ్చిన నగరంగా, భారత క్రికెట్ జట్టుకు మేలిమి తరగల్లాంటి ఆటగాళ్లను అందించిన జట్టుగా హైదరాబాద్‌కు క్రీడా చరిత్రలో ఎంతో ప్రాముఖ్యత ఉంది.

అలా హైదరాబాద్ క్రికెట్‌కు వన్నె తెచ్చిన మేటి ఆటగాడు జయసింహాగా అందరికీ పరిచితుడైన ప్రముఖ క్రికెటర్ మొట్గంహళ్లి లక్ష్మి నర్సు జయసింహా. జయ్‌గా ఆయన అభిమానులు ప్రేమతో పిలుచుకొనేవారు. 1939 మార్చి 3వ తేదిన హైదరాబాద్‌లో సంపన్న కుటుంబంలో జన్మించాడు జయసింహా. ఆయన తల్లి లక్ష్మి. తండ్రి లక్ష్మి నర్సు పేరొందిన కాంట్రాక్టర్. బేగంపేట విమానాశ్రయంతో పాటు అనేక నిర్మాణాలను చేపట్టిన అగ్రశ్రేణి గుత్తేదారు. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో సికింద్రాబాద్ కంటోన్మెంటును నిర్మించిన కాంట్రాక్టర్ ఆయనే. అందుకే ఆడింది ఆటగా పాడింది పాటగా జయసింహ బాల్యం వైభవంగా గడిచింది.

హైదరాబాద్ నుంచి ప్రపంచ క్రికెట్ పటంపై జిగేల్‌మన్న పేరు ఎం.ఎల్.జయసింహా. హైదరాబాద్ రంజీ జట్టుకు, దక్షిణ మండలం జట్టుకు నాయకత్వం వహించి ఎన్నో విజయాలు నమోదు చేసుకున్న మేటి క్రికెట్ కెప్టెన్ జయసింహా. కుడిచేతి వాటం ఆల్ రౌండర్. మీడియం పేస్ బౌలర్‌గా జట్టు బౌలింగ్‌ను ప్రారంభించే జయసింహా ఆనక బంతి పాతపడ్డాక తన ఆఫ్–స్పిన్ మాయాజాలం చూపేవారు. తన మేధస్సుతో, వ్యూహాలతో ప్రత్యర్థులను తికమక పెట్టేవారు. అలాగే బ్యాటింగ్‌లోను అన్ని స్థానాలలో ఆయన ఆడి తన సత్తా చాటుకున్నారు. తొలినాళ్ళల్లో మిడిల్ ఆర్డర్‌లో బ్యాటింగ్‌లు దిగిన జయ్ తరువాతి రోజుల్లో జట్టులో టైగర్ పటౌడి, దిలీప్ సర్దేశాయ్, చందు బోర్డే, రూసీ సూర్తి, అజిత్ వాడేకర్ వంటి మేటి క్రికెటర్ల మధ్య తన స్థానం పదిలపరుచుకోవడానికి ఓపెనింగ్ ఓపెనర్‌గా జట్టు బ్యాటింగ్‌ను ప్రారంభించారు.

ధీటైన బౌలింగ్‌కు, ధాటిషాట్లు, చక్కని ఫీల్డింగ్‌తో క్రికెట్ అభిమానులను ఆకట్టుకున్న జయసింహా సొగసైన బ్యాటింగ్‌కు పెట్టింది పేరు. తరువాతి రోజుల్లో మహమ్మద్ అజారుద్దీన్ ఆట శైలి జయసింహా తీరుకు దగ్గరి పోలికలు ఉండేవి. అదే మణికట్టు మాయాజాలం, అదే మృదువుగా పచ్చికపై జారుకొనే షాట్లు, అజార్, వి.వి.ఎస్. లక్ష్మణ్‌లు కూడా ప్రదర్శించినా జయసింహ ఆట తీరు అనుపమాన

మైనది, అసామాన్యమైనది, మరింత ప్రత్యేకమైనదిగా, క్రికెట్ విశ్లేషకులు పేర్కొంటుంటారు. క్రీడా మైదానంలోను, వెలుపల కూడా జయ్ ఒక రాకుమారుడిలా వెలిగారు. ఆ కాలంలో ఆయనకు షోమ్యాన్‌గా పేరు. మెడలో స్కార్ఫ్ ధరించి, ఇన్-షర్టు వేసిన సిల్క్ చొక్కా, మణికట్టు, కాలర్ గుండీలు పెట్టుకొని, కాలర్ వెనుకవైపు పైకి ఎత్తిపెడుతూ ఆయన ధరించే శైలి ఆ తరం కుర్రకారులో విపరీతమైన మోజు కలిగించింది. సినిమా కళాకారులు సైతం జయసింహా శైలిని, స్టైల్‌ను అనుకరించేవారు. హిందీ నటుడు జితేంద్ర తొలి నాటి చిత్రాల్లో జయసింహను అనుకరించి తన అభిమానం చాటుకున్నవాడే..

1967-68లో ఆస్ట్రేలియా పర్యటనకు మంచి ఫాంలో ఉన్న జయసింహాను జట్టు నుంచి సెలెక్టర్లు తప్పించారు. అయితే పర్యటన మధ్యలో ఉండగా ఆటగాళ్ళు గాయాలు పాలై జట్టు పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయి ఉంది. అప్పుడు ప్రత్యేక విమానంలో జయసింహాను రప్పించారు. విమానం దిగి బ్రిస్బేన్ టెస్ట్ మ్యాచ్‌లో అడుగు పెట్టిన జయ్ ప్రయాణపు బడలికను కూడా పక్కన పెట్టి తన బ్యాట్‌తో మెరుపులు మెరిపించాడు. వరుస ఇన్నింగ్‌లలో సొగసైన 74, 101 పరుగులు చేసి భారత్ పరువు కాపాడాడు. ఇది భారత క్రికెట్ చరిత్రలో ఓ మరపురాని ఘట్టం.

టెస్ట్ జరిగిన 5 రోజులూ బ్యాటింగ్ చేసిన అరుదైన రికార్డ్ జై పేరున చెక్కుచెదరకుండా ఉంది. 1959-60లో కలకత్తాలో జరిగిన చివరి టెస్ట్‌లో ఈ అరుదైన ఘట్టం సంభవించింది. మ్యాచ్ జరుగుతున్న మొదటి రోజు చివర్లో జయసింహా బ్యాటింగ్‌కు దిగి 20 పరుగులతో నాట్ అవుట్‌గా మిగిలారు. రెండోరోజు మళ్ళీ బ్యాటింగ్‌కు వచ్చారు. జట్టు ఆల్ అవుట్ అయ్యాక మూడో రోజు చివర్లో తన రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్‌కు దిగిన జయ్ ఆ రోజు ఆట ముగిసేసరికి నాట్ అవుట్‌గా మిగిలారు. అనంతరం 4వ రోజంతా నింపాదిగా అదీ కేవలం 59 పరుగులు చేసి నాట్ అవుట్‌గా మిగిలారు. చివరి రోజు బ్యాటింగ్‌కు దిగి మరో 15 పరుగులు జోడించి అవుట్ అయ్యారు. దీంతో టెస్ట్ జరిగిన 5 రోజులూ జయ్ బ్యాటింగ్ చేసినట్లయ్యింది.

నెమ్మదిగా ఆరంభించి స్థిరపడ్డాక బౌలర్లకు చుక్కలు చూపించడం ఆయన నైజం. వెనుక అడుగు పైన మిడ్ ఆన్‌కు ఎడంగా షాట్ కొట్టడంలో జయసింహాకే చెల్లిందని ప్రఖ్యాత ఆఫ్ స్పిన్నర్ ఎర్రపల్లి ప్రసన్న తన పుస్తకం వన్ మోర్ ఓవర్‌లో పేర్కొన్నారు.

నవాబ్ ఆఫ్ పటౌడిగా, టైగర్ పటౌడిగా సుపరిచితుడైన మేటి క్రికెటర్ మన్సూర్ అలి ఖాన్ పటౌడి సమకాలీనుడవటంవల్ల భారత జట్టుకు నాయకత్వం వహించే అవకాశాన్ని జయసింహా పొందలేకపోయాడు. అయితే జయ్ నాయకత్వంలో ఎలాంటి భేషజాలకు పోకుండా టైగర్ పటౌడి హైదరాబాద్ రంజీ జట్టుకు ఆడేవాడు. 1969-70లో వెస్ట్ ఇండీస్, ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్ళిన జట్టుకు జయసింహా నాయకత్వం వహించడానికి అనువైన సమయం. పటౌడి తప్పుకోవడంతో జయసింహా ఒక్కడే జట్టులో ఉన్న అనుభవజ్ఞుడు. సహజంగా ఆయననే కెప్టెన్సీ వరిస్తుందని అంతా ఊహించారు. అభిమానులు ఒకటి తలిస్తే సెలెక్టర్లు మరొకటి తలిచారు. ఎంపిక కమిటీ చైర్మన్ విజయ్ మర్చంట్ తన నిర్ణయాత్మక ఓటుతో అజిత్ వాడేకర్‌ను కెప్టెన్‌గా చేశారు. అయినా ఎలాంటి పొరపొచ్చాలు లేకుండా జయసింహా ఆ పర్యటనలో జట్టుకు పెద్ద దిక్కుగా నిలిచారు. జట్టును నడిపించడంలో అజిత్ వాడేకర్ కు మెళకువలు, వ్యూహాలు అందించారు. అవి ఫలించి వెస్ట్ ఇండీస్, ఇంగ్లాండ్ జట్లను వారి స్వంత గడ్డపై మొదటిసారి ఓడించిన అరుదైన రికార్డ్ భారత్ నమోదు చేసుకోగలిగింది. జయసింహా తనకన్నా సీనియర్ ఐనప్పటికీ ఎలాంటి అరమరికలు లేకుండా తనకు మార్గదర్శిగా నిలిచారని అజిత్ వాడేకర్ పేర్కొనడం జయ్ క్రీడా స్ఫూర్తికి మచ్చుతునక. అదే పర్యటనలో తొలి టెస్ట్ ఆడుతున్న సునీల్ గవాస్కర్‌కు కూడా జయ్ ఎన్నో సలహాలు, సూచనలు ఇచ్చి ఒక మేటి ఆటగాడికి తొలిరోజుల్లో నైతిక స్థైర్యం అందించారు.

1959 నుంచి 1971 వరకు 12 ఏళ్ళపాటు సాగిన జయసింహా క్రికెట్ క్రీడా ప్రస్థానంలో 39 టెస్ట్ మ్యాచ్‌లు ఆడి 2,056 పరుగులు 30.68 సగటుతో చేశాడు. వాటిలో 3 శతకాలు కూడా ఉన్నాయి.

1961-62లో ఇంగ్లాండ్‌తో జరిగిన రబ్బర్ సీరీస్‌లో వరుసగా 56, 51, 70, 127 పరుగులు సాధించాడు. మొత్తం 399లతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. జట్టు ప్రారంభ బ్యాట్స్ మాన్‌గా 1963-64

సీరీస్‌లో 444 పరుగులతో ఆయన రాణించారు. కలకత్తా, ఈడెన్ గార్డెన్‌లో జరిగిన 3వ టెస్ట్‌లో జయ్ చేసిన అద్భుతమైన 129 పరుగులు మరపురానివి.

రంజీ ట్రోఫీ మ్యాచుల్లో హైదరాబాద్, దక్షిణ మండలం జట్ల తరపు అది 13,515 పరుగులు చేశాడు. వాటిలో ఎంతో ప్రతిభావవంతంగా ఆయన చేసిన 33 సెంచరీలు జయసింహా పేరును క్రికెట్ యవనికపై మెరిసేలా చేశాయి. ఫీల్డింగ్‌లోను తన సత్తాను చాటిన జయ్ మొదటి తరగతి క్రికెట్ మ్యాచుల్లో 157 క్యాచులు పట్టారు. ఎందరో యువ క్రికెటర్లను ఆయన తీర్చి దిద్దారు. జయసింహా తర్ఫీదులోనే ప్రముఖ స్పిన్నర్లు ఎం.వి. నరసింహా రావు, ముంతాజ్ హుస్సేన్, గోవింద్ రాజ్‌వంటి మేటి పేస్ బౌలర్ రాణించారు. నౌషీర్ మెహతా, అబ్దుల్ హాయ్, జయంతి లాల్, వహిదియార్ ఖాన్, కృష్ణమూర్తి వంటి గొప్ప ఆటగాళ్ళు జయసింహా శిక్షణ, మార్గదర్శకత్వంలోనే రాటు తేలారు. హైదరాబాద్ క్రికెట్‌కు వన్నె తెచ్చారు.

ప్రపంచ మేటి బాట్స్ మాన్ సునీల్ గవాస్కర్ కూడా తాను గడ్డుకాలం ఎదుర్కొంటున్న తరుణంలో జయ్ వద్దకు వచ్చి మెళకువలు నేర్చుకున్నవాడే. తన బ్యాటింగ్ శైలిని మెరుగు పరుచుకున్నవాడే.

అజారుద్దీన్‌ను ఎంపిక కోసం సెలెక్షన్ కమిటి సభ్యుడుగా జయసింహా పోరాటమే చేశారు. ఆనాటి ఎంపిక కమిటిలో సభ్యుడిగా ఉన్న జయ్ అజారుద్దీన్‌కు స్థానం కల్పించక పోతే తన సభ్యత్వానికి రాజీనామా చేసి పత్రికల ఎదుట తన నిరసన తెలుపుతానన్నారు. దాంతో దిగివచ్చిన ఎంపిక కమిటీ అజారుద్దీన్‌కు జట్టులో స్థానం కల్పించింది. తొలి మూడు టెస్టుల్లో వరుస శతకాలు కొట్టి అజారుద్దీన్ సృష్టించిన చరిత్ర ప్రపంచానికి తెలిసిందే. భారత్ జట్టుకు ఎక్కువ విజయాలను అందించిన కెప్టెన్‌గా తరువాతి రోజుల్లో అజార్ నిలిచాడు. యువ అజార్‌లోని నైపుణ్యాన్ని గుర్తించి జయ్ ఆనాడు అతని కోసం పట్టుబట్టక పోతే దేశం ఒక ప్రతిభావంతుడిని కోల్పోయినట్లయ్యేది.

ఆటగాడిగా రిటైరయ్యాక జయసింహా భారత జట్టు సెలెక్టర్‌గా ఆకాశవాణిలో క్రికెట్ ప్రత్యక్ష వ్యాఖ్యాతగా తన అనుభవాన్ని అందించారు. వ్యాఖ్యాతగా లా లా అమర్నాథ్‌తో సమఉజ్జీగా రాణించారు. ఆటను కన్నులకు కట్టినట్లు చెప్పడమే కాకుండా ఆటలోని మలుపులపై తనదైన అభిప్రాయాన్ని ఆయన చెప్పే తీరు క్రికెట్ పాఠాలు వంటివే.

మృదుభాషి. స్నేహశీలియైన జయసింహాకి ప్రపంచ క్రికెటర్లు ఎందరో స్నేహితులు, అభిమానులు. భారత మేటి క్రికెటర్ సునీల్ గవాస్కర్ తన కుమారుడికి జయసింహా పేరు కలిసి వచ్చేలా "రోహన్ జయ్ విష్ గవాస్కర్" అని నామకరణం చేసి తన అభిమాన క్రికెటర్‌కు నివాళి అర్పించారు. తన ఆరాధ్య క్రికెటర్లు రోహన్ కన్హాయ్, జయసింహ, గుండప్ప విశ్వనాథ్ ముగ్గురి పేర్లను కలిపి తన కుమారుడికి గవాస్కర్ నామకరణం చేసాడు.

వజీర్ సుల్తాన్ టుబాకో సంస్థలో పి.ఆర్.ఓ.గా చాలా కాలం పని చేసిన జయసింహా ప్రజా సంబంధాలు నెరపడంలో నేటి కార్పోరేట్ సమాజానికి ఒక ఆదర్శంగా నిలిచారు.

ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో చాలా రోజులు బాధపడిన జయసింహా తన 60వ ఏట 1999 జూలై 7వ తేదిన తన అశేష అభిమానులను, తాను ఎంతగానో ప్రేమించే హైదరాబాద్‌ను వదిలి తనువు చాలించారు.

జయసింహా నిష్క్రమణతో భారత క్రికెట్ తన సమ్మోహన శక్తిని కొంత మేరకు కోల్పోయింది. హైదరాబాద్ తన సొగసరి ప్రియ పుత్రుడికి దూరమయ్యింది.

జయసింహా తొలి అభిమాని ఆయన భార్య శ్రీమతి జయంతి అని చెప్పాలి. ఆయన నుంచి అలవరచుకున్న స్నేహ సౌరభాలు పంచుతూ గడుపుతున్నారు. ఇద్దరు కుమారులు వివేక్ జయసింహా, విద్యుత్ జయసింహా కూడా మొదటి తరగతి క్రికెటర్లు. యువ క్రికెటర్లను తీర్చిదిద్దే సంస్థను నెలకొల్పి తండ్రి బాటలో నడుస్తున్నారు. ఉత్తమశ్రేణి ఆటగాడిగా, హైదరాబాద్ నుంచి ప్రపంచ స్థాయికి ఎదిగిన క్రికెట్ దిగ్గజంగా జయసింహా మనందరి హృదయాల్లో నిలిచి ఉంటాడు.

# 83 ఎం.ఎస్. ఆచార్య

– డా॥ రామా చంద్రమౌళి

మాడభూషణం శ్రీనివాసాచార్య అనే పేరు చాలా మందికి పూర్తిగా తెలియదు. అందరికీ ఆయన ఎం.ఎస్. ఆచార్యగా మాత్రమే చాలా బాగా తెలుసు. ఆయన వరంగల్లు పత్రికారంగపు కురు వృద్ధులు. 'మాట కటువు మనసు వెన్న' అని చాలామంది విజ్ఞులచేత ప్రశంసించబడ్డ ఆచారి గారితో మాట్లాడుతున్నప్పుడు కాస్త ఒళ్ళూ మనసూ దగ్గరపెట్టుకుని స్పృహతో మాట్లాడ్తే మంచిది. అని ఎవరికి వారు తడుముకునేట్టు చేస్తూనే ఎన్నడూ ఎవరినీ భయపెట్టకనే భయపెట్టిన అమృత హృదయుడు. నాకు తెలిసి ఆయన అచ్చమైన మహా మానవుడు. నా వెంటబడి అద్భుతమైన కవిత్వాన్ని రాయించి, దాన్ని 'జనధర్మ' పత్రికలో సీరియలైజ్ చేసినారు.

"ఇదేమిటి సార్.. కవిత్వాన్ని సీరియలైజ్!.. "అనంటే.. " ఔను.. నవలలనే చేయాల్నా.. మనం కవిత్వాన్ని కూడా సీరియలైజ్ చేసి.. కవిత్వ సౌందర్యాన్ని కూడా చాటి చెబుదాం" అని చేసి చూపి.. దాన్ని 'శిలలు వికసిస్తున్నాయి' అన్న మార్మిక మకుటంతో పుస్తకంగా వెలువరించారు. ఎం.ఎస్. ఆచార్య సాహసి. ప్రయోగశీలి. శ్రమజీవి. దేనికోసమూ వెంపర్లాడని నిరాడంబరుడు. నిరామయుడు.

జె.పి.ఎన్. రోడ్‌లో 'జనధర్మ' ఆఫీస్.. అంటే.. ముందు గది దర్వాజా దగ్గరే ఒక టేబుల్ ముందు కూర్చుని చెవుల్లో వినికిడి యంత్రంతో నిరంతరం అక్షరాలతో కుస్తీపడ్తూ.. ఒక యోగిలా కనిపించే ఆచార్య, వెనుక శృతిలా శబ్దిస్తూ అచ్చు యంత్రం.. దాంతో కుస్తీ పడ్తూ ఇద్దరు వర్కర్స్.. మా యెల్దండి రమేషో..(ఇప్పుడు ఆంధ్రజ్యోతి విలేకరి) లేక మా శ్రీధరో.. (ఇప్పుడు భారత ప్రభుత్వ సమాచార హక్కు కమీషనర్).. అప్పుడప్పుడు మా రాజగోపాలాచారో (ఇప్పుడు విశ్రాంత ప్రొఫెసర్) కనిపించేవారు. ఎందుకో నాకు అక్కడికి వెళ్లినప్పుడల్లా సరస్వతీ పాదమంజీరాల మృధుమదుర ధ్వని వినిపిస్తున్నట్టనిపించేది. ఎప్పుడూ ఎవరో ఒకరు సాహిత్య కారుల సందర్శనమే అక్కడ.. కోవెల సంపత్కుమార గారో, సుప్రసన్నగారో, కొండబత్తిని జగదీశ్వర రావుగారో, కొండా కచో కాళోజీగారో.. అది అక్షర క్షేత్రం. అంతటా జ్ఞాన పరిమళం. 'జనధర్మ' వారపత్రిక నడుస్తూ నడుస్తూ.. 'జనధర్మ సాహిత్య ప్రత్యేక సంచికగా' ముస్తాబవుతూండడం.. దానికి మహామహులు తమ తమ రచనల్ని పంపుతూండడం.. నాలాంటి నూనూగు మీసాల యువ కవులు తాజా వ్యాసాలనూ, రచనలనూ అప్పటికప్పుడు చదివే భాగ్యానికి మురిసిపోవడం.. ఆచారిగారి అనుగ్రహంతో నేనుకూడా ఆ పెద్దలతో సమంగా అక్షర పంక్తిలో చేరిపోవడం.. "మౌళీ.. నీ కథ.. నీ కవిత వీళ్ళకంటే ఏం తక్కువగా ఉందిరా.. విజృంభించు.. "అని ఆచారిగారు వెన్ను తట్టడం జరిగేది. ఆయన ఏ కొద్ది ప్రతిభ ఉన్న ఏ అక్షరకారునికైనా చేయందించి ప్రోత్సహించాడు. వరిష్ఠులైన రచయితలెందరో కె.జగదీశ్వర రావు.. దేవులపల్లి సుదర్శనరావు, బి.

నాగేశ్వరరావు, తురగా కృష్ణమోహనరావు, వరవరరావు, అంపశయ్య నవీన్, కోవెల సంపత్కుమార, కోవెల సుప్రసన్న, పేర్వారం జగన్నాథం, డా. ఇందుర్తి ప్రభాకరరావు, సురమౌళి, హీరాలాల్ మోరియా, తురగా జానకీరాణి, డా. మాదిరాజు రంగారావు, ప్రముఖ జర్నలిస్ట్‌లు డి. సాయిబాబా, టంకశాల అశోక్, యం. శ్రీధర్ రచనలు విరివిగా వచ్చేవి. ప్రతి రెండు నెలలకొకసారి వెలువడే 'జనధర్మ ద్వైమాసిక సాహిత్య పత్రిక' నొకదాన్ని ఆచార్యగారు సుప్రసన్న గారి సంపాదకత్వంలో తెచ్చేవారు. అది రాష్ట్ర స్థాయిలో ఎంతో ప్రామాణికంగా వెలుగొందేది. దాంట్లో ఒక రచన వచ్చిందంటే.. అప్పటి ప్రామాణిక పత్రిక "భారతి"లో వచ్చినంత పొంగిపోయేవారు రచయితలు.

సాహిత్యంలో అనేకానేక ప్రయోగాలు కూడా చేశారు ఆచార్యగారు. ప్రముఖ రచయితలైన కె.ఎల్.నరసింహారావు, సింగరాజు లింగమూర్తి, గోపాలశాస్త్రి, మునిమాణిక్యం నరసింహారావు, రావూరి భరద్వాజ గార్లతో గొలుసుకట్టుగా 'పెళ్లి ముచ్చట్లు, పేచీలు, బస్తకాపురం, మరికొన్ని పేచీలు, స్వగ్రామానికి' అన్న ఉపశీర్శికలతో రచించిన సమగ్ర నాటకాన్ని ప్రచురించి, ఒక కథా వస్తువును తీసుకుని వివిధ రచయితలు ఏ విధంగా విచిత్రమైన మలుపులు త్రిప్పి సమగ్రపరుస్తారనేదానికి నిదర్శనంగా ప్రయోగాత్మక జమిలి రచనను వెలువరించారు. ఐతే ఈ మొత్తం నాటకం పేరు 'గిలిగింతలు'. (27-7-1961 నుండి 7-9-1961 దాకా ప్రచురితం). ఇది బహుళ జనాదరణ పొందింది.

ఎం.ఎస్. ఆచార్య గారి జీవితంలోకి తొంగి చూస్తే కొన్ని పరమ సత్యాలు గోచరిస్తాయి మనకు. అవి 1) మనిషికి జీవితం జన్మతః ఒక ఘటనగా సంభవించినా 'ఎరుక', 'స్పృహ' ఉన్న మనిషి తన జీవితాన్ని తనే నిర్మించుకోవచ్చని. 2) తన మనస్తత్వాని బట్టి చిత్తశుద్ధితో, క్రమశిక్షణతో, ఒక కార్యాచరణ ప్రణాళికతో గనుక మనిషి ప్రయత్నిస్తూ పోతే తప్పక లక్ష్యించిన జీవితాన్ని మనిషి తప్పక పొందగలుగుతాడని. 3) జీవితంలో మనిషి ఎక్కడా రాజీ పడకుండా కూడా అద్భుతంగా జీవించవచ్చని. 4) అంతిమంగా మనిషి జీవితాన్ని ఒక 'ఉత్సవ' సదృశంగా జీవించవచ్చని.

బయట బాగా డబ్బున్న పెట్టుబడిదారుల ఆధిపత్యంలో దినపత్రికలు నడుస్తున్న 1980లలో.. సరియైన అర్థబలమూ, అంగబలమూ లేని ఆచార్య గారు తనకు అత్యంత ఆంతరంగికులైన ఎం. వీరాస్వామి గారిని, వసతి కోసం బేతి నర్సయ్య గారినీ, ఆలోచనా లోచనంగా, అక్షయ తూణీరంగా కొండబత్తిని జగదీశ్వరరావు గారినీ నమ్ముకుని వరంగల్లు జన జీవనంతో పెనవేసుకున్న తన ఆర్ద్ర ప్రేమతో, అనుబంధంతో వరంగల్లు నగరంలో వెలువరించిన మొట్ట మొదటి దినపత్రికగా 'జనధర్మ' ద్వై వారపత్రిక. అది 'వరం గల్లు వాణీ' గా అవతరించింది. అప్పుడు ఆ అడుగు ఎంతో సాహసోపేతమైనదే కాకుండా ఆశ్చర్యకరమైంది కూడా.

ఒక వ్యక్తి గురించిన విజయాలగురించి తెలుసుకోవడం కంటే ముందు ఆ వ్యక్తి అసలు బకతడమెలా నేర్చుకున్నాడో తెలుసుకోవడం అత్యంత స్ఫూర్తిదాయకంగా ఉంటుంది. మాడ భూషణం శ్రీనివాసాచార్య సూర్యాపేటలో 3 అక్టోబర్ 1924న జన్మించారు. బాల్యమంతా నెల్లికుదురులో గడిచింది. వారిది పండితుల కుటుంబం. లక్ష్మీకటాక్షం లేదుగాని అందరూ సరస్వతీ పుత్రులే. తన నాన్న గారిదగ్గరే చిన్ననాడు సంస్కృతం నేర్చుకున్నారు. శబ్ద మంజరి, బాల రామాయణం, ధాతు మంజరి, రఘువంశం, కుమార సంభవం, మేఘ సందేశం, పంచోపనిషత్తులు, తిరుప్పావై, వంటి ఆధ్యాత్మిక విద్యలన్నీ కంఠోపాఠమైపోయిన తర్వాత .. ఇక వాస్తవ జీవిత పఠనంలోకి ప్రవేశించారు. అప్పుడు సూర్యపేట కేంద్రంగా ఉవ్వెత్తున సాగుతున్న 'తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటానికి' రాష్ట్ర నాయకులైన దేవులపల్లి వెంకటేశ్వర రావుతో పరిచయం ఏర్పడి.. యువకుడైన ఆచార్య గారిలో ఉద్యమ స్ఫూర్తి రగిలి 'సంగం' పని మీద నల్గొండ జిల్లాలోని చందుపట్ల, రేపాల, టేకుమట్ల, వల్లభాపురం, నకిరేకల్ మొదలైన పలు గ్రామాల్లో పర్యటించేవారు. మనసునిండా అట్టుడుకుతున్న రజాకార్ల, దేశ్ ముఖ్‌ల దౌర్జన్యాల ప్రతిఘటనేచ్ఛ... మరోవైపు కేన్సర్ వ్యాధితో తల్లిగారి మరణం.. ఆ కారణాలవల్ల కుటుంబమంతా ఉదరపోషణార్థం వరంగల్లుకు చేరుకుని.. ఇక జీవికాన్వేషణ.

మొదట డాక్టర్ లక్ష్మణ్ సా పవార్ వద్ద నెలకు 12 రూపాయల జీతంపై కాంపౌండర్ ఉద్యోగం, తర్వాత బచ్చెవాలా శ్రీ రాజన్ సా గారితో పరిచయమేర్పడి సికిందరాబాద్ ప్రయాణం, నెలకు 15 రూపాయల జీతం.

దూరప్రాంతాలకు వ్యాపార నిమిత్తం పర్యటనలు... చివరికి మళ్ళీ ఉమర్జీకర్ యొక్క 'హిందూ సేవా సంఘం'ను వరంగల్లులో స్థాపించటానికి తిరిగి వరంగల్‌కు ప్రయాణం.. యువజన ఆర్గనైజేషన్స్ నిర్వహణలో 'ప్రతాప రుద్ర దళం' ఏర్పాటు.. ఖత్రీల పాఠశాలలో అధ్యాపక వృత్తి.. నెలకు 25 రూపాయల జీతం.. ఇలా.. 'రోలింగ్ స్టోనే 'కాని గ్యాథరింగ్ సం మాస్.. చివరికి విధి ఆయన్ను పత్రికా రంగం వైపు తరిమింది.. ముస్త్యాల శంకర్ రావు రూపంలో వచ్చి, అప్పుడు ప్రాచుర్యమున్న 'ఆంధ్ర పత్రిక' ఏజంట్‌గా 1948లో.. అటు తర్వాత అదే 'ఆంధ్ర పత్రిక'కు విలేఖరి.. అప్పుడు రోజూ 23 కాపీలు అమ్మే పత్రికను 1450 కాపీలు అమ్మే పత్రికగా తీర్చి దిద్ది.. విజృంభించారు. అప్పుడు మదరాసు నుండి వచ్చే 'ఆంధ్రపత్రిక' కట్టల్లో నిజాంకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటానికి మద్దతుగా.. రహస్యంగా కొన్ని కరపత్రాల కట్టలను ఉద్యమకారులకు అందజేయుట.. ఇక్కడ వృత్తికీ, ప్రవృత్తికీ మధ్య ఘర్షణ.. అప్పుడప్పుడు పోలీసులకు పట్టుబడుటం, మళ్ళీ బయటకు రావడం ఈ లోగా 'ఆపరేషన్ పోలో' పోలీస్ చర్య.. నిజాం లొంగుబాటు.. అప్పటికి పి.వి. నరసింహారావు, పాములపర్తి సదాశివరావు గారలు నడుపుతున్న 'కాకతీయ పత్రిక'లో కొన్నాళ్ళు పని చేయడం.. ఈ పరంపరలో 1958 నవంబర్‌లో ముస్త్యాల శంకరరావు, యాదగిరి ఆర్య, దివ్వెల హనుమంతరావు, ఎం.ఎస్. ఆచార్య .. నలుగురూ కలిసి 'జనధర్మ' వారపత్రికను ప్రారంభించారు. తర్వాత క్రమంగా ఒక్కరొక్కరు వాళ్ళ వ్యక్తిగత కారణాలవల్ల విడిపోవడంతో ఆచార్య గారొక్కరే 1971లో బాలాజీ ప్రింటింగ్ ప్రెస్‌ను ఆరంభించి.. ఒంటరి ప్రయాణం.

సర్వస్వతంత్రత, స్వావలంబన అన్న అతి మూలమైన స్వేచ్ఛకు సంబంధించిన అంశాల స్వాధీనతతో ఇక ఆచార్య గారు తనదైన పద్ధతిలో పత్రికను నడిపి అనతికాలంలోనే వరంగల్లు పౌరుల్లో 'జనధర్మ' అంటే మన పత్రిక అన్న ఆత్మీయ భావనను పాదుకొల్పగలిగి తన పదునైన సంపాదకీయాలతో రాష్ట్ర స్థాయి సంపాదకులకు దీటుగా వెలువరిస్తూ వరంగల్లు పేరునూ, కీర్తినీ, ప్రతిష్ఠనూ ఇనుమడింపజేశారు.

ఆ తర్వాత 1971లో 'వరంగల్లు వాణి' ఆవిర్భావం' ఆచార్యగారి స్వప్న సాక్షాత్కారమే.

ముందే చెప్పినట్టు.. ఆయన కలం పదునైనది. వాక్కు దారుణా ఖండల శస్త్ర తుల్యమైనది. అందుకే పచ్చి నిజాలను బహిర్గత పరిచే ఆయన నిజాయితి కొందరికి నచ్చేది కాదు. ఐనా నిప్పు తన దహించే గుణాన్ని మార్చుకోదుగదా.

వ్యక్తి ప్రతిభ ఎప్పుడూ తను పనిచేస్తున్న కార్యస్థానాన్నిబట్టి ప్రాచుర్యంలోకి వస్తుంది . వజ్రం కిరీటంలో ఉన్నదా, ముంజేతి కంకణంలో ఒదిగి ఉన్నదా.. పాదరక్షను అంటిపెట్టుకుని భాసిస్తున్నదా అన్నది ప్రధానమైన అంశమే. కలంను కరవాలంగా ఝళిపించిన ఆచార్య ఢిల్లీలో ఉంటే జాతీయ స్థాయి జర్నలిస్ట్, హైదరాబాద్‌లో ఉంటే రాష్ట్ర స్థాయి జర్నలిస్ట్. కాని ఆయన వరంగల్లులోనే ఉన్నారు. తన జనజీవితంతో పౌరుల ఆత్మను ముడివేసుకుని.

ఎం.ఎస్. ఆచార్య ప్రజా హృదయ పీఠాన్ని అధిష్టించిన 'హూమన్ జర్నలిస్ట్'.. హృదయ లేఖకుడు.

# 84 మచ్చ వీరయ్య

– డా॥ బి.వి.ఎన్. స్వామి

మచ్చ వీరయ్య తండ్రి, తాతల ఊరు బావుపేట (ఆసిఫ్‌నగర్). జిల్లా కరీంనగర్. బావుపేటలో బండి పోశెట్టి అనే గురువు వద్ద శిష్యరికం చేసి తాత్త్విక చింతన అలవరచుకొన్నాడు. ప్రతి దినం కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూనే జ్ఞానబోధ, భజన కీర్తనలు పాడుతూ భగవన్నామ స్మరణలో కాలం గడిపేవాడు. పేద కుటుంబం. పని చేస్తేనే పొట్ట గడిచే పరిస్థితి. ఇలాంటి స్థితిలో బక్కయ్య అకాల మరణం చెందాడు. ఆయనను నమ్ముకున్న భార్యాపిల్లలు వీధినపడ్డారు. దాయాదులు చేరదీయలేదు. భార్య లక్ష్మమ్మ పుట్టినిల్లు బెజ్జంకి మండలంలోని గునుకుల కొండాపురం. దిక్కులేని కూతురితోపాటు ఐదేండ్ల మనమడు, రెండేండ్ల మనమరాలిని అమ్మమ్మఐన బూట్ల లస్మవ్వ తమ ఇంటికి తీసుకొని వచ్చి పెంచి పెద్ద చేసింది. మేనమామ బూట్ల వీరయ్య కూడా పిల్లలకు అండగా నిలిచాడు.

ఈ విధంగా కొండాపురంలో ఆశ్రయం పొందిన మచ్చ వీరయ్య ఆ ఊరికి రెండు కి.మీ. దూరంలో ఉన్న గుండ్లపల్లెకు వెళ్ళి 3వ తరగతి వరకు చదువుకున్నాడు. విద్యాగురువు శ్రీ రామానుజం అయ్యవారు. ఆయన దగ్గర బాల రామాయణం పూర్తిగా చదువుకున్నాడు. రాముని గుణగణాలను విని తదుపరి రామాయణమంతా చదివాడు. సీతారాముల కష్టసుఖాలు హృదయంలో నిలుపుకున్నాడు. ఎన్ని కష్టాలెదురైనా భగవంతునిపై భారం వేసి ఆయన స్మరణలోనే కాలం గడిపాడు. 14వ యేట మేనమామ కూతురు బుచ్చి రామక్కతో వివాహం జరిగింది. మేనమామ మరణంతో కుటుంబ భారం పైనపడింది. చనిపోవడానికి ముందు మేనమామ తనకున్న కొద్దిపాటి పొలాన్ని, పెరడును, కొడుక్కు, అల్లునికి సమానంగా పంచి ఇచ్చాడు. బావమరిది పనికి వంగలేని సోమరిపోతు అవడంవల్ల పొలం పనులతోపాటు, చేనేత వృత్తికూడా మచ్చ వీరయ్య చేసాడు. ముందుగా చెల్లెలి పెండ్లి, తర్వాత బావమరిది మరియు ఇద్దరు మరదండ్ల పెండ్లిళ్లు చేసి స్వంతంగా ఇల్లు కట్టుకొని వేరే కాపురం పెట్టాడు. వీరయ్యకు నలుగురు సంతానం. ఒక కొడుకు, ముగ్గురు బిడ్డలు, కొడుకుకు 14 సం. వయస్సు రాగానే 1964లో కరీంనగర్‌లోని పద్మనగర్‌కు మకాం మార్చి అతని చదువుపై దృష్టి పెట్టాడు. నేత వృత్తితోపాటు పాల వ్యాపారం కూడా చేస్తూ కొడుకును ఎం.ఏ. చదివించాడు. అతని పేరు హరిదాసు. ఆయనకు లెక్చరర్ ఉద్యోగం రాగానే వీరయ్య అన్ని పనులు మానుకొని జీవత పర్యంతం భగవశ్చింతనలోనే కాలం గడిపాడు.

ఇంతటి జీవిత నేపథ్యం, అనుభవం ఆయనను కవితామార్గం పట్టించాయి. అందుకే ఆయన సహజకవి, ఆశుకవి. ఒక్కమాట చెప్పాలంటే వరకవి. బాల్యం నుండి సీస పద్యాలు, కందపద్యాలు, కందార్ధ దరువులు, తత్త్వాలు, భజనకీర్తనలు ఆలపించేవాడు. ఐతే అప్పటికి యతిప్రాసలు,

ఛందస్సు తెలిసిన వయసుకాదు. శేషప్ప, సిద్దప్ప, సుమతి, వేమనలను బాగా చదివాడు. కవితా మర్మాలు అంతగా తెలియకున్నా కొన్నివందల పద్యాలను, గేయాలను, కీర్తనలను, తత్త్వాలను ఆశువుగా పలికి "భక్తితత్త్వ ప్రకాశిక" (1987), "శ్రీ వాణీ స్తోత్రము" మరియు హితబోధ (1999) అనే పుస్తకాలను అచ్చువేయించాడు. 1977లో రాసిన రామశతకం "భక్తితత్త్వ ప్రకాశిక"లో కనపడుతుంది. శ్రీ వాణీకృప, తాడ్వాయి శబరిమాత ఆశీర్వాదబలంతో తాను రచనలు చేసినట్లు చాలాచోట్ల చెప్పుకున్నాడు. వీరయ్య సీస పద్యాల మూస శేషప్ప పద్యాలను పోలి ఉంటుంది. అప్పుడప్పుడు ప్రపంచ నడవడిని గమనించి కవిధోరణిలో అశువుగా పాటలు, గేయాలు రాసి పాడుకునే అలవాటు వీరయ్యకు సహజంగానే అలవడింది.

**కవితా ప్రస్థానం**

1. భక్తి తత్త్వ ప్రకాశిక: ఇది వాణీస్తుతితో ప్రారంభమవుతుంది. ఈ సీస పద్యంలో ఆరు పెద్ద పాదాలు తదుపరి గీతపద్యంలో ఎనిమిది పాదాలు కనిపిస్తాయి. భావ పరిపూర్తి కొరకు రాసినట్లు తోస్తుంది.

మకుటం: "బాసరాదేవి! కృపనీదె వాసిగాను
దాస హృదయేశ్వరీ! నిన్ను దలతు జనని!"

అప్పకావ్యంగాని, ఛందస్సుగాని చదవకుండానే కేవలం వాణీమాత పాదపద్మాలను మాత్రమే నమ్మి రాస్తున్నానంటాడు ఈ పద్యంలో. శ్రీవాణి తాను రాయబోయే పద్యాలలో వెలిగి సకల జనులకు ఆ భావమెరిగించి, వారికి సద్బుద్ధి కలిగించి, తత్త్వం తెలిసిన జ్ఞానులకు ముక్తిని ప్రసాదించాలని భక్తుల పక్షాన మొరలిడుతున్నాడు.

ఇదే పుస్తకంలో "రామ శతకము" 108 పద్యాలలో కందాలలో రచించాడు శ్రీకారంలో మొదలు పెట్టాడు. మనిషి జన్మ అన్ని జన్మలలోకి ఉత్తమమైనది. దాన్ని సద్వినియోగం చేయాలంటే ఎల్లప్పుడూ భగవంతుని ధ్యాసలోనే జీవితం గడపాలి. కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూనే పంచేంద్రియాలను భగవంతుని స్మరణలో లీనం చేయాలని ఈ క్రింద పద్యంలో చెప్పాడు.

"వినరా చెవితో శబ్దము -
అనరా నోటెపుడు నీవు హరిశ్రీ యనుచున్
పనిరా యిది పోయెదనుక -
కనరా నీ ముందు వెలుగు కన్నుల రామా.

వయసు మీరిన తర్వాత కూడా వీరు జ్యోతిష్యం, వాస్తు, పంచాంగం ఆసక్తితో నేర్చుకున్నాడు. ఇంటికి వచ్చిన పేదలు ఏమైనా ఇస్తే తీసుకునేవాడు. లేదంటే లేదు. సజ్జన సాంగత్యం, కలుపుగోలుతనం, నిరంతర ఈశ్వరధ్యానం - వీరయ్యకు అబ్బిన సుగుణాలు. అవే ఈ క్రింది పద్యంలో కొలువుదీరాయి.

"వినవలె మంచిదె, కనవలె
- తనవలె లోకము, అనవలె మనవారనియున్
కనవలె శ్రీ గురుమూర్తినె -
తినవలె తన చేతి చెమట తియ్యన రామా"

అసంతృప్తి, స్వార్థములతో ఏడ్చే మనిషి, దేవుని కోసం దేవులాడడని వాపోతున్నాడు కవి.

"పొట్టున్న బట్టకేడ్చును -
బట్టాపొట్టున్న తోడు బాధకు యేడ్చున్
మెట్టుకు తోడున్న వెనుక -
యెట్లా అని డబ్బుకేడ్చు యెప్పుడు రామా"

పేదవాడు కట్నాలిచ్చి వరులను కొనుక్కోవడమెంత కష్టమో అనుభవించినవాడు కనుక వీరయ్య స్త్రీ జన పక్షపాతంతో వరకట్నాలపై తన నిరసన గళాన్ని వినిపిస్తున్నాడు.

ఆడా మగావాడు పెరిగె -
ఈడా పిల్లేమొపెరిగె ఇంపుగ చూడన్
ఈడూ జోడూ అక్కర -
అడూదాన్నెందుకంట అడుగుట రామా
పిల్లనుగన్నా తండ్రికి -
ఉల్లాసంబెట్లు వుండు పుర్విలో చూడన్
తెల్లముగ తెలుసుకొనక -
కొల్లలుగా డబ్బు గుంజకోరిరి రామా!

ఈ శతకంలో దాదాపు 15 పద్యాల్లో వరకట్న దురాచారం గురించి ఏ కరువు పెట్టడాన్ని చూస్తే వీరయ్య మనసును ఈ కట్న పిశాచి ఎంతగా కలచివేసిందో అర్థమవుతుంది. ఇచ్చినవాడు ఈగ అంటారు కాని నా

దృష్టిలో పులి అంటాడొక సందర్భంలో. "యోగా – ధ్యానం"ల యుగం ఇది. ఇయమిత పద్ధతిలో వీటి ప్రచారం, ఆచరణలు సాగుతున్నకాలం ఇది. వీటి సారాంశాన్ని ఆనాడే ఈ విధంగా చెప్పాడు.

తినవలె మితాహారము –
అనవలె శ్రీరామ యనుచు అనుదినమందున్
కనుగొని పని చేయగవలె –
వినయముతో మెదలి మంచి వినవలె రామా!

ఈ పుస్తకంలో మచ్చ వీరయ్య 14 కందార్థ దరువులు రచించాడు. కందపద్యపు మొదటి పాదాల తర్వాత నాలుగవ పాదం దరువుత కొనసాగుతుంది. ఈ విధమైన కంద పద్యాల మూలాలు కేవలం తెలంగాణలోనే కనిపించడం విశేషం. మచ్చుకు ఒకటి.

"మచ్చా" వంశమునందున –
యిచ్చతోనే బుట్టి యిచట" వీరయ్య పేరన్
మెచ్చియు లోకులు పిలువగ –
యిచ్చియు మేల్ వరమూ నాకూ
లయికనూ కాపాడూ వర్థిల్లజేసీ వాసిగా నేడూ
పుల్లా బ్జాక్షిరో! నిన్నూ యెల్లా కాలము దలుతూ
మెల్లగా వచ్చీ నా కల్లారీ బోగొట్టి –
యికనూ కాపాడూ...

శ్రీ లక్ష్మీదేవి స్తోత్రం 2 పద్యాలు, వేంకటేశ్వర స్తోత్రం 6పద్యాలు శివస్తోత్రం 17 పద్యాలు, శ్రీ వాణీస్తోత్రం 5 పద్యాలు – ఇవన్నీ సీస పద్యాల్లోనే రాయడం విశేషం. ఇంకా ఈ పుస్తకంలో భజనలు, మహిళహారతులు, కీర్తనలు, తత్త్వాలు, రాగతాళ యుక్తంగా రచింపబడ్డాయి.

క్రింది పద్యం మచ్చ వీరయ్య జీవితాన్ని స్వభావోక్తి రమ్యంగా అద్దంపట్టి చూపిస్తున్నది.

సీ. అన్నంబు పెట్టంగ అడ్డగించను లేదు
దానమీయంగ వద్దనగలేదు
పరుల సొమ్ముకు నేను భ్రాంతి చెందను లేదు
పరస్త్రీల పొందునే బడయలేదు...

గీ. దీన జన పోష! మాహేశ! దివ్యమూర్తి!
నాగభూషణ! ముక్కంటి! నన్ను బ్రోవు!

మూడు దినంబుల పోకదరా! అనే తత్త్వంలో
– తప్పదు మృత్యువు తనువుకురా –
యెప్పుడొ తెలువదు యెరుగవురా
పాముకు బుసము విడిచినవిధము –
పారిపోయెదవు కనుమికరా

అని హెచ్చరిస్తూ, భార్యాపిల్లలు, మిద్దెలు – మేడలు, బాంగారు – ఇవేవీ వెంటరావు, శాశ్వతమైనది భగవత్సాన్నిధ్యమే. ఐతే దాని కొరకు తపస్సు చేయాల్సిందేమిలేదు. సాటి మనుషులకు సాయంచేస్తే చాలునంటూ... అందరొక్కటని ఆలోచించిన ఇందుధరుడు నీ యిష్టదైనమిక అని లోకానికి చాటి చెప్తాడు.

"ప్రపంచ నడవడి" పేరుతో వీరయ్య 14 కవితలల్లాడు. లోకం పోకడలను గమనించి అప్పటికప్పుడే కైగట్టి ఆలపించినవి ఇవి. జనాభా పెరుగుదల గూర్చి ఇట్లంటాడు.

"విలువా మేముందీ, లోకం –
బలూపెరుగుతుందీ
మోటార్లెక్కిన సీటు దొరుకదు –
హోటలు బోయిన చోటు దొరుకదు
బాట నడచినా బిందుకొరగవలె –
చోటు కుత్తెమై చొరబడకష్టము" ॥విలువ॥

సీ. పదియేండ్ల వయసులో వరికల్పు కలియుచు
బాలునప్పుడే చాల బాధపడితి
పితృసుఖమును లేక పీడింపబడుచుండి
అమ్మమ్మ యింటిలో నణగియుంటి
మేనమామకు తోడుగా నేను మెలగుచు
కాలంబు గడిపితి కరువులోనె
జనకుని యెడబాసి శనిగరం రోడ్డుకు
తట్ట మోసితి నేను గుట్టుదనుక

గీ. కొనకు నిను జేరవలెనను కోర్కెతోడ
వేడుకొనుచుంటి నా పైన ప్రేమ జూపు
ఆ యనంతసాగర గిరులలందు వెలయు
రాగి దొనచోట నిలిచిన రాణి! వాణి!

**హితబోధ**

"పుత్రా" మకుటుంలో 58 కింద వాక్యాల్లో రాసిన శతకమిది.

"జననీ జనకుల సాకెడి - తినయుండొకడైన
చాలు తనివిని గూర్చున్
జననీ జనకుల సాకిని - తనములు పెక్కున్ననేమి?
దండుగ పుత్రా?

ఈ పద్యం చదువుతుంటే "తల్లిదండ్రిమీద దయలేని పుత్రుడు" అనే వేమన పద్యం గుర్తుకురాకమానదు.

"మంచి చెడు రెండు కులములు -
ఎంచిననివి కలువ వెప్పుడు చూడన్
మంచిని విడనాడకుమీ - వంచన, మరి చెడును
విడువవలమును పుత్రా"

పై పద్యం చదువుతుంటే ''మంచి చెడ్డలు మనుజులందున - ఎంచి చూడగ రెండె కులములు" అని తెలిపిన గురజాడ జ్ఞాప్తికి వస్తాడు.

లోకానికి కనువిప్పు కలిగించాలన్న ఉద్దేశ్యంతో "పితృయజ్ఞములు" పేరుతో ఒక కరపత్రం తీశాడు. "తల్లిదండ్రులు బతికి ఉన్నంతకాలం వారిని ప్రేమతో ఆదరించడం కొడుకులు, కోడండ్ర కనీస ధర్మమనీ, అదే పితృయజ్ఞము, లేదా శ్రీద్ధకర్మ అనీ" దాని సారాంశము.

మాతాపితరులె మన దేవతలని మది గమనించండీ
జన్మనచ్చిన తల్లిదండ్రుల సేవలు చేయండి
వారే దేవతలను కోరాడీ
కనిపెంచిన ఈ జననీ జనకుల కరుణతో చూడండీ
వారినే దేవతలనుకోండి
ఇంటి దేవతల మరచిపోయి జగమంత
దిరుగకండీ....

అని ఒక పాటలో తెలిపిన మచ్చ వీరయ్య కాలాను గుణంగా కవిత్వం రాసాడు. 1919లో జన్మించిన వీరు తన 86వ యేట తేది 01.05.2005న పరమపదించారు.

85

# మాడపాటి హనుమంతరావు

– డా॥ టి. గౌరీశంకర్

నిజాం నిరంకుశ పాలనలో అణగారిపోయి, నిద్రాణావస్థలో ఉన్న తెలంగాణా ప్రాంతానికి కొత్త ఊపిరులూది, మేల్కొలిపిన వైతాళికులలో మాడపాటి హనుమంత రావు అగ్రగణ్యులు. ఆ కాలంలో ఇక్కడి తెలుగు భాషను 'తెలంగీ – ఫేడంగీ' (ఒక ఆకారంలేని భాష) అని ఆనాటి అధికారులు ఎగతాళి చేసే సమయంలో తెలంగాణాలో తెలుగు భాషా సాంస్కృతిక పునరుజ్జీవనానికి జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తి హనుమంతరావు. గ్రంథాలయోద్యమం, సంఘ సంస్కరణ, వయోజన విద్య, స్త్రీ విద్య, మహిళాభ్యుదయం, సాహిత్య వికాసం, సాంస్కృతికాభివృద్ధి వంటి అనేక ఉద్యమాలలో పాల్గొని, తెలుగు జాతి ప్రగతికి పాటుపడినవారు మాడపాటి హనుమంతరావు. ఆయన ప్రత్యక్షంగా రాజకీయాలలో పాల్గొనకపోయినా, ఎందరో రాజకీయ నాయకులను తయారు చేసిన నిస్వార్థ సేవా పరాయణులు. అందుకే 'ఆంధ్రా పితామహుడు' అని ప్రజలందరి చేత కీర్తింపబడ్డాడు. ఆనాటి రాష్ట్రంలోని తెలుగువారి చేతనే గాక కన్నడిగులు, మరాఠీలు, ముస్లింలు – సమస్త ప్రజల చేత గౌరవాదరాభిమానాలు అందుకొన్నారు.

సౌమరస్యం, మృదుస్వభావం, నిరాడంబరత, నీతి నిజాయితీ, క్రమశిక్షణ, సత్ప్రవర్తన వంటివి ఆయనలోని విశిష్ట గుణాలు. అవి పుట్టుకతోనే అమరిన పెట్టని ఆభరణాలు! వీరిని మనవారు అటు జాతీయ స్థాయిలో, భారత రాజకీయాలలో కీలకపాత్ర పోషించిన 'గోపాలకృష్ణ గోఖలే'తో పోల్చటం వీరి వ్యక్తిత్వాన్ని తెలియ జేస్తుంది.

మాడపాటి హనుమంతరావు 1885 జనవరి 22వ తేదీన కృష్ణాజిల్లా నందిగామ తాలూకా కొప్పునూరు గ్రామంలో జన్మించారు. తండ్రి వెంకటప్పయ్య, తల్లి వెంకట సుబ్బమ్మ. తండ్రి ఆ గ్రామ కరణంగా పనిచేశారు. హనుమంతరావు అయిదేళ్ళ వయసులో ఉండగానే తండ్రి మరణించాడు. దానితో సూర్యాపేటలో మేనమామ దగ్గర పెరిగారు. 1899లో ఉర్దూ మిడిల్ పరీక్ష పాసై, ఆ తరువాత హనుమకొండ ఉన్నత పాఠశాలలో చేరి మద్రాసు విశ్వవిద్యాలయ మెట్రిక్యులేషన్ పరీక్ష ఉత్తీర్ణులయ్యారు. 1904లో వరంగల్ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో నెలకు రూ. 40/– జీతంతో 'మీర్‌మున్షీ' (హెడ్ గుమాస్తా) ఉద్యోగం ఎనిమిదేళ్ళపాటు చేశారు. ఆ తరువాత హైదరాబాదు వెళ్ళి, ప్రభుత్వ శాసన సభా విభాగంలో అనువాదకునిగా అయిదేళ్ళు పని చేశారు.

ఆ సమయంలోనే పట్టుదలతో ప్రైవేటుగా చదివి, న్యాయశాస్త్రంలో పట్టభద్రులయ్యారు. 1917 నుంచి న్యాయవాద వృత్తిని చేపట్టి ఇరవై ఏళ్ళపాటు ఆ వృత్తిలో కొనసాగారు. ఇది ఆయన జీవితంలో గొప్ప మలుపును తీసుకొని వచ్చింది. చిన్నతనంలోనే హనుమంతరావు కందుకూరి వీరేశలింగం పంతులు సంఘ సంస్కరణోద్యమానికి, కొమర్రాజు వెంకటలక్ష్మణరావు సాహిత్యోద్యమానికి, నాటి జాతీయోద్యమంలో భాగమైన వందేమాత

రోద్యమానికి అత్యంత ప్రభావితులైనారు. వీటి ఫలితంగానే వీరు నాటి హైదరాబాదు సంస్థానంలోని ఉద్యమాలకు ఊతంగా నిలిచారు.

తెలుగు భాష పట్ల ఆయనకు అపారమైన అభిమానం. ఒకసారి 'హిందూ సంఘ సంస్కరణ సభ' 1921 నవంబరు 12వ తేదీ రాత్రి హైదరాబాదులోని వివేకవర్ధనీ ఉన్నత పాఠశాల సభా మందిరంలో జరుగుతుంది. పూణె మహిళా విశ్వవిద్యాలయ సంస్థాపకుడు దొండే పంత్ కార్వే దీనికి అధ్యక్షత వహించాడు. వక్తలు ఉర్దూ, మరాఠీ, కన్నడ భాషలలో మాట్లాడారు. మాడపాటి వారు తమ మాతృభాష అయిన తెలుగులో మాట్లాడారు. ఆయన మీద ఉన్న గౌరవంతో అక్కడ ఉన్నవారు ఆయన ప్రసంగాన్ని విన్నట్లు నటించారు. మరొక నాయకుడు తెలుగులో మాట్లాడుతుంటే అభ్యంతర పెట్టారు. తెలుగులో మాట్లాడరాదని అవమానించారు. ఇందుకు మాడపాటి వారు బాధపడ్డారు, మనసు నొచ్చుకున్నారు. చివాల్న లేచి సమావేశం నుంచి వెళ్ళిపోయారు. వారి ఆత్మాభిమానం దెబ్బతిన్నది. తెలుగువారి వ్యక్తిత్వాన్ని నిరూపించడానికి ఆ రాత్రికి రాత్రే తెలుగు వారంతా కలిసి 'నిజాం రాష్ట్ర ఆంధ్ర జన సంఘం' అన్న దానిని స్థాపించారు. దానికి మాడపాటి వారిని కార్యదర్శిగా నియమించారు. 1923లో హనుమకొండలో ఏర్పడిన ఈ కేంద్ర సంఘం కొద్ది కాలంలోనే రాష్ట్ర వ్యాప్తంగా యాభై స్థానిక సంఘాలుగా విస్తరించింది. 1930లో జోగిపేటలో సురవరం ప్రతాపరెడ్డి అధ్యక్షతన ప్రథమాంధ్ర మహాసభ జరిగింది. నాటి నుండి 1945 దాకా ప్రతి ఏటా ఈ మహాసభలు జరిగాయి. 1935లో సిరిసిల్లలో జరిగిన మహాసభకు హనుమంతరావు అధ్యక్షతన వహించారు. ఇది రాజకీయ సభకాదనీ, తెలుగు జాతి అభ్యుదయానికి పాటుపడే సాంస్కృతిక సంఘమని నిజాం ప్రభుత్వాన్ని ఒప్పించడానికి మాడపాటి ఎంతగానో ప్రయత్నించారు.

ఆ రోజులలో ప్రజలలో రాజకీయ చైతన్యం కలిగించడానికీ, భాషా సాంస్కృతికాభిమానం వారిలో పెంపొందించడానికీ గ్రంథాలయాలు ప్రధాన కేంద్రాలుగా పనిచేశాయి. ఆ రోజులలో గ్రామ ప్రజల మీద పటేల్-పట్వారీలు, పోలీసులు జులుం బాగానే ఉండేది. రైతుల్ని అన్యాయంగా పన్నుల వసూళ్ళ పేరుతో పీడించేవారు. వెట్టిచాకిరీలు చేయించుకొనేవారు. అటువంటి దుర్భర పరిస్థితులలో ఉన్న గ్రామీణులను విజ్ఞానవంతులను చేయడానికి గ్రంథాలయాలు, రైతుల సమస్యల పరిష్కారానికి రైతు సంఘాలు, వ్యాపార వాణిజ్య పరిస్థితులు చక్కబెట్టడానికి వర్తక సంఘాలు వెలిశాయి.

ఒకవైపు స్వాతంత్ర్య సముపార్జనాకాంక్ష, వేరొక వైపు ప్రజాహిత సేవా కార్యక్రమ తత్పరత, మరొకవైపు గ్రంథాలయ పురోగతి నిరతి – ఈ మూడు మాడపాటి వారిలో ముప్పిరిగొని వారిని ముందుకు నడిపించాయి. ఆ రోజులలో గ్రంథాలయ సభలు, సాంస్కృతిక సభలు జరపడం నిజాం ప్రభుత్వం దృష్టిలో ఘోరమైన నేరం. వీటిని చట్టపరంగా ఎదుర్కొని నిలదొక్కుకోవడంలో హనుమంతరావు కృషి మరువరానిది. గ్రంథాలయ వ్యాప్తిలో వీరు బాగా కృషి చేశారు. 1904 జనవరి 26న హనుమకొండలో శ్రీ రాజ రాజనరేంద్ర గ్రంథాలయ భవనం శంకుస్థాపన చేయించారు. 1912 నాటికి దానిని పూర్తిస్థాయిలో అభివృద్ధి పరిచారు. 1914-15లో శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయానికి కార్యదర్శిగా పనిచేశారు. అంతకుముందే 1912లో డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డి గారిని ఆహ్వానించి గ్రంథాలయ స్వంత భవనానికి ప్రారంభోత్సవం జరిపించారు. హైదరాబాదులోని గౌలిగూడ ప్రాంతంలో 'బాలసరస్వతీ గ్రంథాలయం' నాంపల్లిలోని ఎత్తయిన గుట్టమీద 'వేమన గ్రంథాలయం' స్థాపనలో, వాటి అభివృద్ధిలో మాడపాటి వారు ముఖ్యభూమికను పోషించారు.

ఆనాటి ప్రభుత్వం వాక్ స్వాతంత్ర్యాన్ని, పత్రికా స్వేచ్ఛను అణచివేస్తుంటే అందుకు నిరసనగా ఆంధ్రమహాసభ ఆందోళన చేపట్టింది. క్రమంగా పౌరహక్కుల పరిరక్షణకు పూనుకొని, ప్రజలను సంఘటితపరచింది. ప్రజలు తమ హక్కులను గుర్తించేటట్లు చేసింది. ప్రజా సమస్యలపై కరపత్రాలు అచ్చువేసి, పుస్తకాలు ప్రచురించింది. 'ఆంధ్ర మహాసభ' సంస్థాన ప్రజలలో గొప్ప సంచలనాన్ని సృష్టించింది. మహిళా సభలను జరుపుతూ స్త్రీలలో చైతన్యాన్ని రగిలించింది.

ఆనాడు మాడపాటివారు స్త్రీ విద్యా విషయికంగా చేసిన కృషి ప్రత్యేకించి పేర్కొనదగినది. 1926లో హైదరాబాదులోని నారాయణగూడ ప్రాంతంలో ఆంధ్రబాలికోన్నత పాఠశాలను స్థాపించి, మాతృభాష అయిన తెలుగు మాధ్యమంలో బోధనను నడిపించారు. అది ఈనాటికీ

వెలుగొందుతుంది. అదే విధంగా రావు బహద్దూరు వెంకట్రామారెడ్డి మహిళా కళాశాల ఏర్పాటులో కూడా మాడపాటి వారి ప్రమేయం ప్రముఖమైంది.

మాడపాటివారు తెలుగు, ఉర్దూ, ఇంగ్లీషు భాషలలో మంచి ప్రావీణ్యాన్ని గడించారు. ఫారసీ, మరాఠీ భాషలలో కూడా పరిచయం ఉంది. ఆయా భాషలలో పలు రచనలు చేశారు. తెలుగులో నవలలు, కథలు రాశారు. తెలంగాణలో 'నీలగిరి పత్రిక', 'గోలకొండ పత్రిక', 'దేశబంధు', 'సుజాత' వంటి వార్తా పత్రికలు, ఇతర పత్రికలు మాడపాటి వారి తోడ్పాటుతోనే పెంపొందాయి. 'ముషీరె-దక్కన్' అనే ఉర్దూ పత్రికకు వీరు చాలాకాలం సంపాదకీయాలు రాశారు. 'తెలంగాణ ఆంధ్రోద్యమం', 'రోమన్ సామ్రాజ్య చరిత్ర', 'క్షేత్రకాలపు హింద్వార్యులు', 'గారీ ఖాల్డీ జీవితం', 'రాజ్యాంగ సంస్కరణలు' మొదలైన గ్రంథాలు రచించారు. 'పర్షియన్ కవుల'పై పలు వ్యాసాలు రచించారు. బంకించంద్ర ఛటర్జీ 'ఆనంద మఠం' నవలను తెనిగించారు. వివిధ తెలుగు, ఉర్దూ పత్రికలలో కథలు, కథానికలు రాశారు. వీటిలో కొన్నింటిని 'మల్లికాగుచ్ఛము' అనే పేరుతో ప్రచురించారు.

1946లో మాడపాటి హనుమంతరావు షష్టి పూర్తి ఉత్సవం జరిగింది. హైదరాబాదులో కడప కోటిరెడ్డి, కొండా వెంకట రంగారెడ్డి వంటి ప్రముఖుల ఆధ్వర్యంలో ఈ సభలు ఎంతో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వారిని రూపాయి నాణెలతో తులాభారం తూగించారు. 'హనుమంత రాయ సంచిక' పేరుతో ప్రత్యేక సంచికను వెలువరించారు. వివిధ ప్రదేశాలలో సత్కార సభలు జరిపి, సన్మాన పత్రాలు సమర్పించారు. ప్రజలు భూరి విరాళాలు అందించారు. ఆ సొమ్ములో అధికభాగం ఆయన మహిళా విద్యాలయాలకే వినియోగించారు. మిగిలిన మొత్తంతో 'ఆంధ్ర చంద్రికా గ్రంథమాల'ను స్థాపించి, దాని పక్షాన 'ప్రాచీనాంధ్ర నగర ములు', 'రాజకీయ పరిజ్ఞానం', 'నిజాం ఆంధ్రోద్యమం' వంటి పుస్తకాలను అచ్చొత్తించారు. ఆయన తన జ్ఞాపకాలతో 'ఆంధ్రోద్యమ చరిత్ర' రాశారు.

1951 నుంచి 1954 వరకు మాడపాటి హనుమంత రావు హైదరాబాదు నగర కార్పొరేషన్‌కు మూడుసార్లు మేయర్‌గా పనిచేశారు. 1958లో ఆంధ్రప్రదేశ్ శాసన మండలికి తొలి అధ్యక్షుడై, ఆరేళ్ళు సభా కార్యక్రమాలను నిరాటంకంగా నిర్వహించారు. 1955లో భారత ప్రభుత్వం వీరికి 'పద్మభూషణ్' బిరుదు నిచ్చి గౌరవించింది. ఈ బిరుదు ఆనాడు పొందిన తొలి తెలుగు వ్యక్తి ఇతనే కావడం గమనార్హం. 1956 నవంబర్ 4వ తేదీన ఉస్మానియా విశ్వ విద్యాలయం వీరికి గౌరవ డాక్టరేట్ – డి.లిట్‌ను ప్రదానం చేసింది. ఆ విశ్వవిద్యాలయం సెనేట్‌లో శాశ్వత సభ్యులుగా ఉన్నారు. ఆయన గౌరవార్థం ఆయన పేరిట అక్కడ బంగారు పతకాన్ని ఏర్పాటు చేశారు. 1965లో 'హైదరాబాదు కో-ఆపరేటివ్ యూనియన్'కు కార్యదర్శిగా ఉన్నారు. 'సహకారోద్యమ' వ్యాప్తికి పాటుపడినందుకుగాను, మాడపాటి వారికి 'సహకార రత్న' అనే బిరుదు నిచ్చారు.

'జీవరక్ష ప్రచారిణీ సంఘం', 'హిందూ మత సంస్కార సంఘం', 'ఆది హిందూ సేవాసమితి' మొదలైన వాటితో వారికి సంబంధం ఉండేది. 'ఆర్య సమాజం', 'బ్రహ్మ సమాజం', 'దివ్యజ్ఞాన సమాజాల'తో కలసి పనిచేశారు. ఆ రోజుల్లో ఆయన చేపట్టని ఉద్యమమే లేదు, ఆయన చేయూత నివ్వని సంస్థయే లేదు. మాడపాటి వారు అగ్రవర్ణానికి చెందిన వారైనప్పటికీ వెనుకబడిన వర్గాల వారికి, నిమ్న కులాల వారికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చి, వారిని ముందుంచే వారు. 'ఆంధ్ర మహిళా సభ'కు మాడపాటి వారి సతీమణి శ్రీమతి మాణిక్యమ్మ నాల్గవ అధ్యక్షులుగా ఎన్నికై సమర్థంగా దానిని నడిపించారు.

ఇంతటి ఉదాత్త చరిత్ర కలిగిన మాడపాటి హనుమంతరావు 1970 నవంబర్ 11వ తేదీన, తన 86వ యేట కన్ను మూశారు. 1972లో వారి ఏకైక కుమారుడు సుకుమార్, 1980లో వారి సతీమణి పరమపదించారు. 1985 ఏప్రిల్ 4వ తేదీన మాడపాటి హనుమంతరావు శత జయంత్యుత్సవం జరిగింది. దానిలో ప్రజాసేవకు అంకిత మైన ఆయన జీవిత విశేషాలను సంస్మరిస్తూ, పరిపూర్ణ జీవితాన్ని అనుభవించిన ధన్యజీవిగా ఆయనకు నివాళు లర్పించారు.

ఆనాటి కౌన్సిల్‌లో ప్రతిపక్షనాయకుడైన మగ్దూం మొహియుద్దీన్ 'తన ఉన్నతాదర్శాలతో, త్యాగాలతో ఏ ఒక్క పార్టీ అభిమానాన్నేగాక ఆయన యావదాంధ్రుల అభిమానాన్ని చూరగొన్నారు' అని మాడపాటి హనుమంతరావును ప్రస్తుతించారు.

# 86 మడికొండ సత్యనారాయణ శాస్త్రి

– డా॥ మోత్కూరి మాణిక్యరావు

తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్ జిల్లా యందలి మడికొండ గ్రామం గొప్ప విద్యావేత్తలకు, పండితులకు, కవులకు, రచయితలకు, సంగీతజ్ఞులకు పుట్టినిల్లు. ఈ గ్రామానికి పూర్వ ప్రసిద్ధనామం 'మణిగిరి'. పైన పేర్కొన్న వివిధ మణి స్వరూపులకు నిలయం కావడంతో మణిగిరి ఈ గ్రామానికి సార్థకనామంగా భాసిల్లింది. కాలాంతరంలో మణిగిరి గ్రామనామం వ్యవహారంలో మడికొండగా మారి, ఆ పేరే స్థిరవ్యవహార నామంగా స్థిరపడింది.

నిజాం రాష్ట్ర ప్రథమశతావధాని బిరుదును పొందిన కీ.శే.శ్రీ – వీరవల్లి నృసింహాచార్యులు మడికొండవారే. వారి వారి రంగాల్లో ప్రఖ్యాతులైన వానమామల సోదరులు, కాళోజీసోదరులు, పల్లా దుర్గయ్య, బిరుదురాజు రామరాజు, మడికొండ సత్యనారాయణ శాస్త్రి, అనుముల కృష్ణ మూర్తి ఇప్పటికీ పెంచుకున్న వారే. కీ.శే. తేటిరెడ్డి గోపాలరెడ్డి గారు, గొప్ప సంస్కృత విద్యాంసులు. కవిత్వము మరియు కవులనిన వీరికి ఆదరము ఎక్కువ. వీరి కాలంలో కవిసార్వభౌములు శ్రీ పాద కృష్ణమూర్తి గారు, తిరుపతి వేంకట కవులు, వీరిని సందర్శించి, వీరితో ఘనసన్మానాన్ని పొందారు. మడికొండ గ్రామము ఇప్పటికీ ఎందరో విద్యాధికులకు నిలయం.

ఆనాటి మడికొండ గ్రామంలో పల్లా పాపయ్య నర్సమ్మ దంపతులకు మూడవ కుమారుడిగా (6-8-1913) సత్యనారాయణ శాస్త్రి జన్మించారు. యుక్తవయస్సులో అదే గ్రామంలో మడికొండ జనార్దనం సత్యమ్మ దంపతులచే దత్తపుత్రుడిగా స్వీకరించబడి, ఇంటి పేరు మారి పల్లా వారి నుండి మడికొండ వారుగా మారారు.

పల్లా పాపయ్య దంపతులకు నలుగురు కుమారులు. ఒక కూతురు. కూతురు రామక్కను మడికొండలో నివసించే అనుముల ఆగయ్య గారికిచ్చి వివాహం చేశారు. పెద్ద కొడుకు పల్లా వీరయ్య గారు ఆ కాలంలోని ప్రముఖ ఆయుర్వేద వైద్యులు. రెండవ కొడుకు పల్లా వేంకటయ్యగారు పేరు పొందిన పౌరోహితులు. మూడవ కొడుకైన మడికొండ సత్యనారాయణ శాస్త్రి గారు కాలాంతరంలో గొప్ప సంగీత సాహితీవేత్తగా, ప్రముఖ హరికథకులుగా బహుళ ప్రచారాన్ని పొందారు.

నాలుగవ కుమారుడు పల్లా దుర్గయ్య గారు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి తొలి తెలుగు ఎం.ఏ పట్టాను పొంది, ఉస్మానియా విశ్వవిద్యాలయం అధ్యాపకవర్గంలో పనిచేసి, కవిగా, విమర్శకుడిగా ప్రసిద్ధులయ్యారు.

సత్యనారాయణ గారికి బాల్యం నుండి సంగీతమంటే చాలా ఇష్టం. వారి తాతగారు, నాన్నగారు కూడా సంగీత విద్యాంసులు కావడం వారికి కలసివచ్చింది. సంగీతంలో మొదటి గురువు వారి తండ్రి పల్లాపాపయ్య గారే. తండ్రి దగ్గర నేర్చుకున్న సంగీతాన్ని శ్రద్ధతో సాధన చేసేవారు.

ఈ లోపు వీరి సంగీతాభివృద్ధికి కారణమైన ఒక

సంఘటన జరిగింది. పైన పేర్కొన్న కళాభిమాని, వితరణ శీలియైన గోపాలరెడ్డి గారి వద్దకు కూచిపూడి గ్రామం నుండి వెంకట నారాయణగారు మరియు సహచర వర్గం విచ్చేశారు. భామాకలాపం నృత్య నాటకాన్ని ప్రదర్శించడంలో వారు సుప్రసిద్ధులు. వారం రోజుల పాటు కార్యక్రమం నిర్ణయించ బడింది. వెంకట నారాయణ గారితో సహకార గానం చేసే వ్యక్తికి తీవ్ర జ్వరం రావడంతో నిర్వాహకులకు పాలుపోలేదు.

మడికొండలో సంగీతం పాడేవారు ఎవరైనా ఉంటేవారి సహాయం తీసుకోవాలని నిర్ణయించుకొని, దాని గూర్చి వెంకట నారాయణ గారు ఆరా తీశారు.

వారికి 12 ఏళ్ళ వయస్సులో ఉన్న సత్యనారాయణ శాస్త్రి పేరు ఎక్కువ మంది సూచించారు. దానితో పాపయ్యగారి దగ్గరికి వచ్చి సహకార గానం కొరకు సత్యనారాయణను పంపించమని కోరారు. అలా కూచిపూడి వారితో సహకార గానం చేసే అవకాశం దొరకడం భవిష్యత్తుకు ఉపయోగకరంగా వారికి మారింది.

రోజువారి కార్యక్రమాన్ని బట్టి, వారికి సహకార గానం పాడటానికి తగిన శిక్షణనిచ్చి, సత్యనారాయణగానాన్ని, తమకు అనుకూలంగా తీర్చిదిద్దారు. సహకార గానం సత్ఫలితాన్నిచ్చింది. 'భామకల్ప' నృత్యనాటకం ఊరిజనాన్ని ఆకట్టుకుంది. "భవిష్యత్తులో నువ్వు గొప్ప సంగీతాన్ని పాడతావు" అని ఆ బాలుణ్ణి కూచిపూడి వెంకటనారాయణ గారు ఆశీర్వదించారు.

సత్యనారాయణ తండ్రిగారైన పాపయ్య గారు వీరికి సంగీత నేర్పేవారు. కాని పాఠశాల విద్యను ప్రోత్సహించలేదు. తమతోపాటు పౌరోహిత్యానికి రమ్మనేవారు. ఆ పరిస్థితుల్లో సత్యనారాయణ ఏడవ తరగతి వరకు మాత్రమే చదువగలిగారు.

పాపయ్యగారు, పౌరోహిత్యంలో, పంచదశకర్మలు, షోడక కర్మలు దేవతా కల్యాణాలు వేదోక్తవిధిలో చేసేవారు. తండ్రి గారి వద్ద 15 సంవత్సరాల వయస్సులో సత్య నారాయణ ఇవన్ని నేర్చుకున్నారు. అలాగే జ్యోతిష్యం, వాస్తు విద్యలలో ప్రావీణ్యత సంపాదించారు. ప్రస్తుతం కాజీపేట ప్రాంతంలో ఉండే 50 శాతం ఇళ్ళకు సత్యనారాయణ గారే ముగ్గుపోయించారు. మడికొండ గ్రామానికి చుట్టూ ఉండే కొన్ని ఊళ్ళలో ఆయన 'సత్తెయ్య' గారు' గా బాగా పరిచయం.

ప్రముఖ కవి వానమామల వరదాచార్యుల వారి పెద్దన్నయ్య, శ్రీవేంకటాచార్యుల వారి వద్ద సంస్కృత భాష, పంచకావ్యాలు, సాహిత్యాన్ని అభ్యసించారు. గురువర్యులంటే భక్తి ప్రపత్తులు చాలా ఎక్కువ. అలవికాని అభిమానం.

వరంగల్ జిల్లాలోని కమలాపురం నివాసియైన శ్రీ గంగు రామకృష్ణయ్య గారి వద్ద సంగీతం నేర్చుకున్నారు. వారు గాత్ర సంగీతం పాటు వయోలిన్ వాద్యంలో నిష్ణాతులు. వారి వద్ద అయిదు హరికథలు నేర్చుకున్నారు. వారి శిష్యుడు సత్యనారాయణను తనతోపాటు పాడమని, ఆ విషయంలో తగిన శిక్షణ ఇచ్చారు. రాగం, ఆలాపన, పల్లవి, అనుపల్లవిలు ఎలా పాడాలో నేర్పించారు.

శిష్యుడు సత్యనారాయణతో కలిసి వేరే గ్రామాలలో సంచారం చేసి హరికథలు చెప్పేవారు. ఇతను మా అబ్బాయి. ఇతని హరికథలు కూడా ఏర్పాటు చేయండి, అని చెప్పి హరికథలు ఏర్పాటు చేయించారు. ఆ హరికథలకు గురువు గారు స్వయంగా వయోలిన్ వాయించారు. రామకృష్ణయ్య గారి వద్ద నేర్చుకున్న తర్వాత హరికథా విద్యను నిర్దుష్టంగా, సమగ్రంగా నేర్వాలనే బలమైన కోరిక కలిగింది. ఆ కోరికే ఆ తర్వాత సత్యనారాయణ గారు చేసిన నిరంతర కఠోర సాధనకు కారణమైనది. ఆ తర్వాత హరికథా విద్యను సామాన్య ప్రజల మధ్యకు తీసుకవెళ్ళే ప్రయత్నాన్ని వేర్వేరు స్థలాలలో సంచారంతో ప్రారంభించారు.

తనకు పక్కవాయిద్యాలుగా తబలాకై పెద్దపెల్లి మల్లయ్య మరియు హార్మోనియంకై మల్లేశంలను సహచరులుగా చేర్చుకొని వివిధ స్థలాలలో కరికథలు చెప్పడం ప్రారంభించారు. జనగామ, నవాబుపేట, నశికల్ దేవస్థానం, యాదగిరిగుట్ట, పెద్దపల్లి, మంథని, హుజూరాబాద్, భువనగిరి, రామగిరి, కారేపల్లి, ఆలేరు మొదలైన పలుచోట్ల తమ హరికథలతో జనాన్ని పరవశింపచేశారు. వీరికి పి.వి.నరసింహారావు గారు ఒక కథకు హార్మోనియం వాయించారు.

యాదగిరిగుట్ట, నశికల్, కొత్తకొండ దేవస్థానాల్లో సత్యనారారాయణ గారు ఆస్థానపండితులుగా, ఆస్థాన హరికథకులుగా నియమింపబడినారు. సుమారు 1950 సంవత్సరం నుండి 1995 సంవత్సరం వరకు ఆకాశవాణి

హైద్రాబాద్‌లో హరికథా కళాకారులుగా బహుళ సంఖ్యలో హరికథా గానం చేశారు. మడికొండ సత్యనారాయణ శాస్త్రిగా–ఆకాశవాణి శ్రోతలకు వారు సుపరిచితులు.

వీరు ఎక్కువగా నారాయణ దాసు, బాలాజీ దాసు, పరిమి సుబ్రహ్మణ్యం గార్ల హరికథలు చెప్పేవారు. తరచుగా అంబరీషోపాఖ్యానం, కుశలవవిజయం, జానకీశపథం, ప్రియంవద చరితం, భక్తమార్కండేయ, యదార్థ రామాయణం, సీతా కళ్యాణం, రుక్మిణీ కల్యాణం, హరిశ్చంద్ర మొదలైన కథలు చెప్పేవారు.

**స్వీయ రచనలు**

నామదేవచరితము, బుద్ధ మహాభినిష్క్రమణం, మయూర ధ్వజ, జగన్నాథస్వామి చరిత్ర మొదలైనవి. బుర్రకథ(భారతం), కీర్తనలు, భజనలు చేశారు.

ములుకనూరు గ్రామంలో బంగారు ఉంగరంతో అనంతారంలో బంగారు పతకంతో సన్మానించారు. పెద్దపల్లిలో వరుసగా 80 రోజులు, 80 హరికథలు చెప్పారు. అక్కడి ప్రజలు బంగారు పతకంతో సన్మానించారు. చివరిగా ఆకాశవాణి హైద్రాబాద్‌లో హరికథా కార్యక్రమం రికార్డింగ్ తర్వాత, ఆకాశవాణి వారు మడికొండ సత్యనారాయణ శాస్త్రి గారితో ఇంటర్వ్యూ జరిపారు.

ఒక ప్రశ్నకు సమాధానంగా వారు హరికథా ప్రక్రియను 'హరికథ కథనాన్ని' ఒక ఉపన్యాసంగా పేర్కొన్నారు. ఒక ఉపన్యాసకుడు తన విషయాన్ని పలు సందర్భాలను ఉటంకిస్తూ ఎలా పరిపుష్టం చేస్తారో, హరికథకులు తమ కథను వివిధ కళలతో పరిపుష్టం చేయాలని చెప్పారు. అందుకై హరికథను రాణింపజేయడానికి హరిదాసుకు సంగీతం, సాహిత్యం, నృత్యం, అభినయం, వాక్పటిమ, వాక్చాతుర్యం వీనిలో ప్రవేశం, ప్రావీణ్యత అవసరమని పేర్కొన్నారు.

సత్యనారాయణ గారికి, వీటన్నిటిలో ప్రావీణ్యత ఉన్న విషయం వారి నెరిగిన వారందరికీ తెలిసిన విషయమే.

వరంగల్ జిల్లా, మరియు తెలంగాణ రాష్ట్రం గర్వించ దగ్గ హరికథా కళాకారుల్లో మడికొండ సత్యనారాయణ శాస్త్రి గారు మొదటి వరుసలో ఉండే ధన్యజీవి.

87

# మామిడిపల్లి సాంబశివశర్మ

– డా॥ విష్ణువందనాదేవి

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర క్షేత్రం భారతదేశ పుణ్యక్షేత్రాల్లో ఒకటై దక్షిణ కాశిగా పిలువబడు తుంది. వేములవాడకు సాహిత్యపరంగా ఎంతో పేరుంది. విక్రమార్జున విజయాన్ని రచించిన 'పంపన', కవి జనా శ్రయాన్ని రచించిన వేములవాడ భీమకవి ఇక్కడివారే. నేటి కాలంలో వీరికి సాటిరాగల కవిత్వము రాసి ఎందరినో మెప్పించి ఒప్పించిన కవి "మధురకవి మామిడిపల్లి సాంబశివశర్మ గారు". వీరు సంప్రదాయ కవిగాక గేయకవి, జానపద కవికూడా. సంప్రదాయ కవిగా కొనసాగుతూనే మారుతున్న సామాజిక పరిస్థితులకు అనుగుణంగా తన మార్గాన్ని మార్చుకొని కవిత్వాన్ని సామాన్యులకు దగ్గరగా తీసుకొని వచ్చినవారు సాంబశివశర్మగారు.

పండితుడు, కవి, పురాణ ప్రవచనం, హరికథలు, గానం, సంగీత దర్శకత్వం, నటన, సంస్కృత, తెలుగు, హిందీ భాషలలో అనర్గళంగా మాట్లాడే నేర్పు, అవధానం ఇలా ఎన్నింటిలోనో తనకంటూ ప్రత్యేకతను కలిగినవారు శర్మగారు. గురువుల దగ్గర నేర్చుకున్నది చాలా తక్కువ. అన్నీ స్వయంగా నేర్చుకున్నవే. త్రికాండ అమరాన్ని, ఆంధ్రనామ సంభవాన్ని చిన్నతనంలోనే చదివినవారు. మేధాదక్షిణామూర్తిని ఉపాసన చేసినవారు. ఏది విన్నా, చదివినా మళ్ళీ చెప్పగలిగే శక్తి కలిగినవారు.

ఇన్ని ప్రత్యేకతలు కలిగిన శర్మగారి జీవితము ఎన్నో ఒడుదుడుకులలో సాగినా, వారు సాహిత్యపరంగా ఎంతో ఉన్నతిని సాధించారు. 1920 సంవత్సరంలో జన్మించి 1988 జనవరి 9 పుష్య బహుళ పంచమిరోజు దివంగతులై నారు. తన బాధలను రామునికి విన్నవిస్తూ కీర్తనలు రచించిన త్యాగయ్య మాదిరిగా తానూ సంకీర్తనలు రచించి భగవం తునిలో ఐక్యం అయినవారు సాంబశివ శర్మగారు మరుగున పడిపోయిన తెలంగాణా కవి.

ఆచార్య సి. నారాయణరెడ్డి గారు, అనంతరాజశర్మ గారు, మునుగోటి కృష్ణమూర్తి గారు, వజ్జల సాంబయ్య గారు, చొప్పకట్ల చంద్రమౌళి గారు శర్మగారి సమకాలికులు. డా.సి. నారాయణరెడ్డి గారు సాంబకవి గారి హరికథలు విని ఉత్తేజం పొందిన వాడినని చెప్పేవారు.

శర్మగారి రచనలన్నింటినీ చూస్తే, చదివితే వీరి గురించి సమకాలికులు చెప్పే విషయాలు వింటే ఆశ్చర్యం కలుగక మానదు కాకపోతే పలుకుబడికై పాకులాడే మనఃస్తత్వం లేకపోవడంవల్ల వీరికి రావలసిన ఖ్యాతి, పేరు రాలేదేమో!

వర్తమాన సమాజంపై పడి దోచుకుంటున్న అన్ని వర్గాలను తీవ్రంగా విమర్శిస్తారు. తాను ఏదీ మొదలు పెట్టినా దాన్ని చివరివరకూ వదిలేవారుకాదు. 1940-50 ప్రాం తంలో భారతదేశంలో ముఖ్యంగా తెలంగాణా ప్రాంతంలో ప్రజలు కాస్త సేదదీరడానికి హరికథలూ, బుర్రకథలూ, నాట కాలే ఆధారం. వాటిని ఆసరా చేసుకొని ప్రజలకు దగ్గరగా

ఉంటూ తన కవిత్వంతో సమాజాన్ని ఆలోచింపచేసినవారు సాంబశివశర్మగారు.

శర్మగారు శివభక్తులు, పుట్టి పెరిగింది రాజేశ్వరుని సన్నిధిలో. దాంతో తన రచనల్లో శైవ సంబంధి రచనలు కనిపించినా, తరువాత అద్వైత సిద్ధాంతాన్ని పాటిస్తూ సకల దేవతా సంబంధిత రచనలు, సమాజాన్ని అనుసరిస్తూ సమాజంలోని లోటుపాట్లను ఎత్తి చూపిస్తూ ఆధునికమైన భావాలను తన పద్యాల ద్వారా వినిపిస్తారు.

శర్మగారు రచించిన రాజేశ్వర సుప్రభాతంలో – తన మొదటి శ్లోకంలో భారతమాతని స్తుతిస్తూ తన దేశభక్తిని చాటుకుంటారు.

"యస్యామూర్ధ్ని హిమాలయస్య
శిఖరశ్చంచత్కిరీటాయతే
యస్యాశ్రోణితటే సరిత్సముదయా సౌవర్ణవాసాయతే
యస్యా వక్షసి పుష్పిత క్షితిజరా జిస్త్రార 'హారాయతే
సాప్యాయాద్భరతాంబికా నిజజన స్వారాజ్య
లక్ష్మీపదం" –

ఈ సుప్రభాతాన్ని గురించి డా.సి. నారాయణరెడ్డి గారు ముందుమాట రాస్తూ ఈ ఒక్క శ్లోకం చాలు. "ఏమి ఎత్తుగడ హిమగిరి శృంగమంత ఎత్తైనది" అంటారు. శర్మగారు తన రచనలన్నింటిలో కన్నతల్లికి, జన్మభూమికి ప్రాధాన్యతనిస్తారు.

గత కాలంలో ప్రాచుర్యానికి నోచుకోని పేదల దేవుడైన కొమరవెల్లి మల్లన్న సుప్రభాతాన్ని రచిస్తూ శర్మగారు సుప్రభాతంలోని శ్లోకాలలో కర్షకులు, కార్మికులు వారి పని పాటలు, పల్లెలను వర్ణిస్తారు.

"ఉత్థాయకర్షక గణోహల మాదదానః
బధ్వావయుగేషు వృషభాన ఖియాంతివాపీః
నిర్యాతి కార్మిక చయో ధృత వస్తు హస్తః
కొంరెల్లి మల్లన విభోతవ సుప్రభాతం"

కర్షక, కార్మికులు దినచర్య మొదలుపెట్టారని, ఆవులు, ఎద్దులు, మేకలు తమ తమ నివాసాల నుంచి మేతకై బయలుదేరాయని, కాపరులైన గొల్లలు దండధారులై బయలుదేరారనీ, కర్షకులు నాగళ్ళకు ఎద్దులను కట్టుకొని వ్యవసాయానికి వెలుతున్నారనీ, కార్మికులు కూడా తమ పనిముట్లను తీసుకొని తమ పనికొరకై బయలుదేరుతున్నారనీ, శ్రమ జీవుల జీవన విధానాన్ని కళ్ళముందు తన పద్యాలలో చూపిస్తారు. సుప్రభాతంలో సామాజిక స్పృహను జోడించడం చెప్పుకోదగ్గ విషయం.

శంకరాచార్య సుప్రభాతంలో – దేవుడిని పూజించడానికీ, వేడుకోవడానికీ కులంతో, మతంతో, జాతితో, లింగబేధంతో పనిలేదనీ, అందరీ, అందరికీ దేవుడు ఒక్కడే అన్న విషయాన్ని స్పష్టంగా వినిపిస్తారు.

అలాగే గంగా సుప్రభాతంలో – నీటి కోసం భగీరథుడు పడిన కష్టాలను, వాటిని అధిగమించి గంగను భూమిపైకి తీసుకొచ్చే విధానాన్ని శర్మగారు వర్ణిస్తూ –

"తే దుర్మదంమద విఘూర్ణిత లోచనాభ్యాం" అంటారు. నీరు సకల ప్రాణికోటికి జీవనాధారమని అలాంటి గంగకి నమస్కరిస్తున్నాను అంటూ గంగను త్రివర్ణ (ధర్మార్థకామముల) ఫలరూపమైన మోక్షాన్ని ఇచ్చేదానిగా వర్ణిస్తారు.

బాసర సరస్వతీ సుప్రభాతంలో సరస్వతీ అంటే చదువులతల్లీ అని చెప్పి ఊరుకోకుండా –

"జిహ్వాసుతే విలసనాచ్చ తురాననోభూత్" అంటూ బ్రహ్మ నాలుగు నాలుకలపైన నీవు నడయాడంవల్లనే బ్రహ్మ చతురాననుడు అయినాడని, చేతులందు ఉండడంవల్లనే లిపికర్త అయినాడని, నీ చేతిని గ్రహించడంవల్లనే సృష్టికర్త అయినాడని, ఇదంతా నీ గొప్పతనమేకానీ, బ్రహ్మదికాదని, సృష్టికి మూలం 'స్త్రీ' అని పేర్కొంటారు.

శాంతికి, ప్రశాంతతకు గుర్తుగా పేర్కొనే తెలుపు రంగును సరస్వతీ దేవికి ఆపాదిస్తూ, శర్మగారు విద్యవల్ల వినయమూ, సహనమూ, ఓర్పూ, దయ, కరుణ మొదలైన గుణాలన్నీ కలుగుతాయని ఇవన్నీ కలిగి ఉన్న మనిషి వివేకవంతుడిగా, సౌమ్యుడిగా మారి శాంతిని కోరుకుంటాడనీ, అవన్నీ విద్యవల్లనే సాధ్యమని అంటూ సరస్వతీదేవికి ఇష్టమైన రంగు తెలుపని, నిండు పున్నమి వెన్నెలను, మెల్లగా వీచే గాలులను, తెల్లని కలువలను, హంసలను ఉపమానాలుగా పేర్కొంటారు.

"జ్ఞాన ప్రదాయని సమస్త కళాప్రపూర్ణే
పూర్ణేందు కుందసిత పద్మమరాళవర్ణే
వర్ణాత్మికే విశదగండ విశాలకర్ణే

గీర్వాణి వాసర సరస్వతి సుప్రభాతం" అంటారు.

వీరు రచించిన 'కుంజవిహారం' అనే కావ్యంలో –

"ప్రేమయేగదా భూమికి ప్రియతమంబు
శాంమే గదా జగతికి శర్మదంబు
త్యాగమే కదా వసుధకు తారకంబు
ధర్మమే గదా ధరణికి దైవతంబు"

అంటూ ప్రేమ, శాంతం, త్యాగం, ధర్మం ఎంత విలువైనవో, వాటి అవసరం సమాజానికి ఎంత అవసరమో తెలియజేస్తారు. 1950–70 ప్రాంతంలో శర్మగారు సమకాలీన వ్యవస్థనూ, సమస్యలనూ వస్తువుగా గ్రహించి తమ రచనలను కొనసాగించారు. లోభ సంహారం, మా దేవరలోని పద్యాలను పరిశీలిస్తే ఈ విషయం తెలుస్తుంది. కాలాన్ని కలుషితం చేస్తున్న మానవుల దృష్టి మార్గాన్ని నిరోధించడానికి, ప్రజలు తమ నీతి, నిజాయితీలేని ప్రవర్తనకు సిగ్గుపడి తలవంచుకొని తమ ప్రవర్తనలను మార్చుకోవాలన్న ఆలోచనతో నేను ఈ కృతులను రచిస్తున్నానని తనముందు మాటలో శర్మగారు పేర్కొన్నారు.

"సంఘంలో నీతి నియమాలు నశించాయి. ప్రేమ, త్యాగం, దయ ఎక్కడా కనిపించడంలేదని, దంభమను రావణుని ఉదరమున లోభమను అమృతం ఉన్నంతవరకూ పాపమనే శిరస్సును ఎన్నిసార్లు ఖండించినా అన్నిసార్లు పుడుతూనే ఉంటుంది. 'పాపసంహారం' కావాలంటే 'లోభసంహారం' కావాల్సిందే అంటారు".

"హక్కులు భారతీయులవియంచు
స్వతంత్రత వచ్చెనంచుమా
ప్రక్కన బల్లెమైన పరదేశపు
పాలన పోయెనంచు మా
యక్కఱలెల్ల దీర్చి మము హాయిగ
మంచు ప్రభుత్వమింకచే
జిక్కెనటంచు నుచ్చితిమి 'సీ' యవి
స్వప్నసమంబు లాయెరా'

స్వాతంత్రము వచ్చిన తర్వాత దేశము బాగుపడు తుందనీ, అందరికీ కూడు, గుడ్డ అందుబాటులోకి వస్తాయని ఆశపడ్డానని అవన్నీ అడియాసలు అయ్యాయని ఆవేదన చెందుతారు. 'ఛీ' అని చీదరించుకోవడంలోనే కవి ఆవేదన, ఆవేశము వ్యక్తమవుతున్నాయి.

"శాసనమందు మాయ,
జనసంఘములందున మాయ, దేవతా
వాసములందు మాయ,
పదవాసుల నాల్కలయందు మాయ ఆ
ఫీసులయందు మాయ,
మహాపీసులయందున మాయ పాంసులా
హాసమునందు మాయ,
భాషగ్రగణలందున మాయలోభమా"

అంటూ అంతటా మోసము, మాయ నిండి ఉందని, నిజాన్ని నిర్భయంగా చెపుతారు.

"పండినవి సస్యముల? మహాపాతకముల
నిండినవి చెర్వులా? అవినీతి తతుల
పెరిగినవి విభవమ్ములా? విప్లవముల
తలచినది విశ్వహితమా? నిర్దయులమతమ"

అని పై ప్రశ్నలను సమాజము ముందు పెడుదూ "బొంకులాడే" పదాలు మాట్లాడుతూ తిరిగేవారు భూమికి, సంఘానికి బరువంటారు.

"నీతులు గుమ్మరింతురు
వినీతులవోలె నటింతురాపయిన్
జీతములేని నౌకరియు జేతురు
లంచపుటాస జేసివి
ఖ్యాతి గడించుకోదలచి
ఖద్దరు దుస్తులు దాల్చుచుందురీ
ప్రేతల సంస్కరింపుమవలీలగ
లేమలవాడ దేవరా!"

ఈ "ప్రేతల" సంస్కరింపుమవలీలగ అన్న ప్రయోగం కొత్తగా కనిపిస్తుంది. నేడు సమాజంలో ఎక్కడో కొంతమంది తప్ప చాలావరకు నాయకులంతా బ్రతికి ఉన్న శవాలనీ, అలాంటివారివల్ల సమాజానికీ, దేశానికీ ఒరిగేది ఏమీలేదనీ, అలాంటి వారిని నీవే సంస్కరించాలని ఆ దేవుడిని వేడుకుంటారు.

నేడు 'లంచం' అనే వ్యసనానికి అలవాటుపడి దేశాన్ని తాకట్టు పెడుతున్నారని అంటూ – దొరికిన రోజు సిగ్గెగ్గులు లేకుండా తిరిగి సమాజంలో తిరుగుతున్నారని బాధపడుతూ

"లంచము నిచ్చువారల విలాసపు

జూపులు గారవింతురా
డించిన యట్టులాడెదరు
తీవిగా టెక్కులు పెక్కు జూపిరా
వించిన తావుకేదెదరు బింకము సంకము కప్పగింతురీ
వంచకులన్ దలంచుకొన వచ్చునే లేమలవాడ దేవరా

60 సంవత్సరాల క్రితమే ఇంత ఆధునికంగా, ఆవేదనతో తనదైన శైలిలో రాసి, చదివిన ప్రతి పాఠకుని ఆలోచింపజేసేవిగా ఉంటుంది వీరి కవిత్వం.

"సంఘమునకు వివేకలోచనము లేదు
రిక్తులనశక్తుల మన్పుఱేడు లేదు
మారుపడకున్న మనకు సేమంబు లేదు
ఖలులు నశియింపకున్న సౌఖ్యంబు లేదు" –

సంఘానికి వివేకమనే 'చూపు' లేదని, అసహాయులను ఆదుకునే రాజు లేడని, మార్పు అనేది లేకపోతే, రాకపోతే క్షేమం లేదని, దుర్మార్గులు నశించకుంటె సౌఖ్యం, సుఖం అనేవి లేవని, సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను, వాటి కారణాలను, విశ్లేషించి సంఘాన్ని బాగుచేయాలని కవిగా సాంబశివశర్మగారు ఆలోచించేవిధంగా సందేశాన్ని ఇస్తారు.

ఇంతటి ప్రతిభ కలిగిన వ్యక్తి తన పద్యకావ్యాలు, సుప్రభాతాలు, నాటకాలు, బుర్రకథల ద్వారా సమాజాన్ని చైతన్య పరిచిన 'మహామనిషి', వేములవాడ దేవస్థానపు ఆస్థానకవిగా ఉండిన మధురకవి మామిడిపల్లి సాంబశివశర్మ గారు మన తెలంగాణా ప్రాంతమునకు చెందినవాడు కావడం మనమందరము గర్వించదగిన విషయము.

88

# మందపాటి వెంకట్రాజు

– డా॥ ఎం. పురుషోత్తమాచార్య

ప్రసిద్ధి పొందిన నల్లగొండజిల్లాలో పోచమ్మచర్ల (పోశించర్ల) పేరుతో గల హుజూర్‌నగర్ పట్టణంలో 08-12-1919 నాడు శ్రీ మందపాటి వెంకట్రాజు సుబ్బమ్మ, గురువారాజు దంపతులకు జన్మించారు. తండ్రి చిన్నపాటి వ్యవసాయదారుడు. ఉన్న కొద్దిపాటి భూమి కూడా తాకట్టులో పడి హరించుకుపోయింది. వెంకట్రాజుగారు ముగ్గురాడ పిల్లలు పెదనర్సమ్మ, కృష్ణవేణమ్మ, చిననర్సమ్మల తరువాత జన్మించిన నాలుగో సంతానం. ఆయనకు యుక్తవయస్సు వచ్చేనాటికి ఇల్లు తప్ప ఏమీ మిగలలేదు. అందుకని వెంకట్రాజు యాయవారం చేసుకుంటూ గడిపారు. ఆయన చదువు ఆరవ తరగతి వరకే సాగింది.

ఒక మిత్రుని సహకారంతో ఏలూరు వెళ్ళి వారాలు చేసుకుని వెంకట్రాజు జీవింపసాగారు. అక్కడే గగ్గులు అనే నామాంతరం గల నల్లాన్ కృష్ణమాచార్యులు అనే సంగీత విద్వాంసునితో పరిచయం ఏర్పడింది. కృష్ణమాచార్యులు అప్పటికే 'ఉష' (1939) అనే సినిమాలో కృష్ణునిగా నటించియున్నారు. రాజుగారి కంఠం విని ఆచార్యుల వారు తన వెంట తీసుకవెళ్ళి "చండిక" (1940) సినిమాలో రాజుగారి చేత ఒక పాట పాడించారు. అంతేగాక స్వయంగా సంగీతవిద్యను కూడా బోధించారు.

పరిస్థితులు కుదరక వెంకట్రాజు ఖమ్మం చేరి సంగీత పాఠాలు చెప్పుకుంటూ జీవించసాగారు. అక్కడా కుదరక తిరిగి హుజూర్‌నగర్ చేరి సంగీతకచేరీలు ఇవ్వడం ప్రారంభించారు. సూర్యాపేట, నల్లగొండ, హైద్రాబాదు, ఖమ్మం, జగ్గయ్యపేట, మెదక్, గుమ్మడిదల, దేవరకొండ, కోదాడ మొదలైన చోట్లలో కచేరీలు చేశారు.

హైద్రాబాదులోని ఖైరతాబాదు దక్కన్ రేడియోస్టేషన్‌లో మ్యూజిక్ ప్రొడ్యూసర్‌గా చేరి వెంకట్రాజుగారు ఎంతోమంది వర్ధమానగాయకులను లోకానికి పరిచయం చేశారు. అందులో ప్రముఖులు ఎం.వి.ఎన్. ఆచార్య, మాస్టర్ విశ్వం, ఎం.ఎల్.ఎన్. చారి, ఎం. చిత్తరంజన్ మొదలైనవారు. రాజుగారు సంగీతంలోనే కాక క్యారం, చెస్, క్రీడల్లో కూడా మంచి ప్రావీణ్యం సంపాదించారు.

కందిబండ, గణపవరం గ్రామాలకు చెందిన దేశ్‌ముఖ్‌లు కొందరు ఒక సినిమా తీయాలనుకుని రాజుగారి ద్వారా మద్రాసుకు చేరారు. 1952లో వారు శుభోదయపతాకం కింద హెచ్.వి. బాబు దర్శకత్వంలో 'ఆదర్శం' అనే సినిమాను తీశారు. జగ్గయ్య, జానకి నాయికా నాయకులుగా ఉన్న ఆ సినిమాకు అశ్వద్థామ సంగీత దర్శకుడుగా పని చేశారు. ఆ సినిమాలో వెంకట్రాజుగారితో కొన్ని పాటలు పాడించారు. సినిమా విజయవంతం కాలేదు, కాని వెంకట్రాజు మాత్రం మద్రాసులోనే ఉండిపోయారు.

కొన్ని రోజుల తరువాత రాజుగారు హుజూర్‌నగర్‌కు వచ్చి కుటుంబ పరిస్థితులను పర్యవేక్షించారు. కొంత

ఆలోచించి కుటుంబాన్ని మద్రాసుకు తీసుకువెళ్ళే ప్రయత్నం చేశారు. కాని ఆయన ఇల్లాలు అనసూయమ్మ అందుకు ఒప్పుకోలేదు. ముగ్గురు కొడుకులు పాండురంగరాజు, కృష్ణంరాజు, సత్యనారాయణ రాజు ఇంకా చిన్నపిల్లలు. కుమార్తె రంగనాయమ్మకు వివాహం చేయవలసి యున్నది. అందరు మద్రాసు వెళితే ఈ బాధ్యతలన్నీ సక్రమంగా నెరవేరడంలో ఎన్నో సమస్య లొస్తాయని నచ్చజెప్పింది. రాజుగారు ఆ బాధ్యతలన్నీ భార్యకు అప్పజెప్పి తానొక్కడే మద్రాసుకు చేరుకున్నారు.

1953లో ఈస్టిండియావారు తీసిన "పక్కింటి అమ్మాయి" సినిమా దర్శకులు సి. పుల్లయ్యగారి ప్రోత్సాహంతో రాజుగారు ఆ సినిమాలో నాయికకు సంగీత గురువు పాత్రలో కాసేపు కనిపించే అవకాశం పొందారు. ఆ సినిమాలో రేలంగి, అంజలి ప్రధానపాత్రధారులు. అయితే సినిమారంగాన్ని వదులుకోకూడదనే ఉద్దేశ్యంతో రాజుగారు ఆ పాత్రను ఒప్పుకొన్నప్పటికీ రాజుగారి దృష్టంతా సంగీతం మీదనే ఉంది.

1958లో ప్రసిద్ధ సినీసంగీత దర్శకులు టి. చలపతి రావుగారితో పరిచయం ఏర్పరచుకున్న రాజుగారు సినీ సంగీత దర్శకత్వంలో ఉండే మెలకువలన్నీ ఆయన దగ్గర క్షుణ్ణంగా నేర్చుకున్నారు. అప్పుడే మాస్టర్ వేణుకూడా రాజు గారికి పరిచయమైనారు. ఆయన రాజుగారి బాణీలను ఎంతో ఇష్టపడేవారు.

ఓసారి చలపతిరావుతో కలిసి వెంకట్రాజుగారు రిక్షాలో వెళుతూ ఉండగా సన్నగా ముసురుపడుతున్న ఆ వేళలో ఒయ్యారంగా నడిచి వెళుతున్న ఓ అమ్మాయిని చూసి వెంకట్రాజుగారు "నిలువవే వాలుకనులదానా" అని అప్రయత్నంగా పాడారు. అది విన్న చలపతిరావు మెచ్చుకుని దాన్నే పల్లవిగా చేసి కొనసరాజుగారితో పూర్తి పాట రాయించుకున్నారు. ఆ పాటను 1959లో విడుదలైన "ఇల్లరికం" సినిమాలో అక్కినేని నాగేశ్వరరావుగారి మీద చిత్రించారు. ఈ పాటను పాడిన ఘంటసాల గారు చెప్పినట్టు గానే ఆ సినిమా 25 వారాలు ఆడి ప్రజాదరణ సంపాదిం చింది. ఈ సినిమాలో 'నేడు శ్రీవారికి' అనే యుగళగీతంలోని కనెక్షన్ హమ్మింగ్‌ను సూచించి పాటకు నిండైన సుశ్రావ్యతను తెచ్చిన వెంకట్రాజుగారిలో నిగూఢంగా దాగియున్న ప్రతిభను చలపతిరావుగారితో బాటు సంగీతకారులందరూ బాగా గుర్తించారు.

అటు సినిమా పనులను, ఇటు సంగీత కచేరీలను నిర్వహించుకుంటూనే వెంకట్రాజు గారు హుజూర్‌నగర్‌లో జరిగే త్యాగరాజ ఉత్సవాలకు హాజరయ్యేవారు. అభిమానుల ప్రోత్సాహంతో కమ్మని లలితగీతాలను, ఒకటి, రెండు త్యాగరాజ కీర్తనలను హార్మోనియం వాయించుకుంటూ మధురంగా ఆలపించి ఆనంద పరిచేవారు. ఆయనకు కాకరవాయి రామమోహనశర్మగారు తబలాతో సహకరించే వారు. అప్పుడే ఆయన తన కూతురైన రంగనాయకమ్మకు మేనల్లుడు రామరాజుతో వివాహం జరిపించారు. ఆ సందర్భంగా అప్పటి సుప్రసిద్ధ సంగీత విద్వాంసులు శ్రీమాన్ ఎం. సీతారామానుజాచార్యులుగారి శాస్త్రీయ సంగీత కచేరీని నిర్వహించారు. సంగీతం పట్ల ఆయనకు అంతటి గౌరవం, ప్రేమ ఉన్నాయి. పెండ్లి పనులు ముగించుకుని రాజుగారు తిరిగి మద్రాసుకు చేరుకున్నారు.

టి. చలపతిరావుగారి ప్రోత్సాహంతో వెంకట్రాజు కన్నడ సినీరంగంలోకి అడుగుపెడుతూనే 1960లో వి.ఆర్. స్వామి దర్శకత్వంలో తీసిన "భక్త కనకదాస" సినిమాకు మొట్టమొదటిసారి సంగీతదర్శకత్వం చేపట్టారు. ఆ సినిమాకు జాతీయపురస్కారం లభించడం, రాజుగారి సంగీతానికి ప్రత్యేకమైన గుర్తింపు రావడం అన్నీ కలిసి రాజుగారి డిమాండ్ పెంచాయి. ఈ సినిమాలో రాజకుమార్, కృష్ణ కుమారి నాయికానాయకులు. దీనిలోని పాటలన్నీ సంగీత రసజ్ఞుల మెప్పు పొందాయి. వాటిలో 'శృంగారశీల' అనే పాట విశేషప్రజాభిమానం పొందింది. ఈ సినిమాతోనే రాజు గారికి సినీసంగీతదర్శకునిగా ఒక మంచి గుర్తింపు వచ్చింది.

ఆ తరువాత కన్నడంలోనే వరుసగా "రాజా సత్యవ్రత, ధర్మస్థళ మహాత్మ్యం, తేజస్విని, చంద్రకుమార, జీవనతరంగ, నందాదీప" అనే సినిమాలకు సంగీతం సమకూర్చి కన్నడ సినీసంగీతరంగంలో తిరుగులేని సంగీతదర్శకునిగా మంచి ప్రసిద్ధిని పొందారు. అప్పుడే తెలుగు సినిమారంగం నుండి పిలుపురాగా వెంకట్రాజు గారు శ్యాంప్రసాద్ ప్రొడక్షన్స్ పతాకం కింద వై.ఆర్. స్వామి దర్శకత్వంలో తయారైన "స్వర్ణగౌరి" సినిమాకు సంగీతదర్శకునిగా పనిచేశారు. ఈ సినిమాలో కాంతారావు, కృష్ణకుమారి నాయికానాయకులు.

ఈ సినిమాను తెలుగు, కన్నడ భాషలలో నిర్మించి ఏకకాలంలో విడుదల చేశారు.

'స్వర్ణగౌరి' సినిమాలోని పాటలన్నీ విశేషాభిమానాన్ని పొందాయి. వీటిని కన్నడంలో ఎస్. కరీంఖాన్, తెలుగులో అనిసెట్టి రాశారు. 'జయమీవే జగదీశ్వరి' పాటను ఎస్. జానకితో పాటు ఎం. చిత్తరంజన్ ఆలపించారు. "ఆశలన్నీ కలబోసి" పాటను విన్న మాస్టర్ వేణు ఎంతో ఉప్పొంగిపోయి ఆ స్ఫూర్తితో తాను సంగీతం అందించిన "మురళీకృష్ణ" (1964) సినిమా కోసం 'మ్రోగునా ఈ వీణ' పాటను రూపొందించుకోవడం రాజుగారి బాణీలకున్న మాధుర్యశక్తికి చక్కని నిదర్శనం. "జయజయ నారాయణా" అనే పాటను రాగమాలికలో పాడడానికి మొదట కొంచెం తేలికగా తీసుకున్న మంగళంపల్లి బాలమురళీకృష్ణగారు తరువాత పాట బాణీలోని గాఢతత్వాన్ని, ఒకే రాగం అని భ్రమింపజేసే గొప్పతనాన్ని గ్రహించి అద్భుతంగా ఆలపించారు. రికార్డింగు జరిగిన తరువాత ఆయన రాజుగారిని ప్రశంసలతో ముంచెత్తారు.

వెంకట్రాజుగారు 'రాజా సత్యవ్రత' సినిమాకు పనిచేస్తున్నప్పుడే ఆయన దగ్గర ఎ. అప్పలరాజు, విజయభాస్కర్, ఎం. రంగారావు, ఎం.వి.ఎన్. ఆచార్య అనేవారు అసిస్టెంట్లుగా చేరారు. సినిమాల్లోనే కాక ప్రయివేటు రికార్డుల రంగంలో కూడ రాజుగారు ఎంతో కృషి చేశారు. ఘంటసాల గారి "పుష్ప విలాపం" స్ఫూర్తితో కరుణశ్రీగారి "పాకీపిల్ల" పద్యాలను వెంకట్రాజుగారు మృదుమధురంగా ఆలపించగా హెచ్.ఎం.వి.వారు రికార్డుగా విడుదల చేశారు. దీనికి అప్పటి ఆకాశవాణి కళాకారులు శ్రీ ఉపద్రష్ట కృష్ణమూర్తిగారు వాద్యబృందాన్ని నిర్వహించారు. అదే విధంగా పిఠాపురం నాగేశ్వరరావు, రాణి, కోమల, పి.బి. శ్రీనివాస్ మొదలైన కళాకారులతో "ఆంధ్రదేశమా వర్ధిల్లు, అత్తవారి ఇంటికెళ్ళే చెల్లెలా, వద్దోవద్దో పెండ్లి, నలుగుకు లేచి రారా, హారతీ మీరేల ఇవ్వరే" వంటి పాటల్ని ఎన్నో పాడించి వెంకట్రాజుగారు ప్రజాభిమానాన్ని విశేషంగా సంపాదించారు. "ఎంత మంచి చిన్నది, చిన్నిపూవే వాడినా, కృష్ణా ముజ్జగాలు, ఓహో ప్రతిశ్రుతీ, మోవి చిగురుపై, రాబోకు రాబోకురా, మెరుపులు పూవుల దండగా" మొదలైన లలితగీతాలకు మధురమైన బాణీలను సమకూర్చి వర్ధమానగాయకులతో పాడించారు. వెంకట్రాజుగారు స్వరపరచిన దాశరథిగారి "భూధరమో సాగరమో" పాటను మంగళంపల్లి బాలమురళీకృష్ణగారు ఆలపించి ఎంతో ప్రచారంలోకి తెచ్చారు.

చిత్తరంజన్‌గారిని 'స్వర్ణగౌరి' సినిమా ద్వారా రాజుగారు పరిచయం చేయగా ఆ తరువాత చిత్తరంజన్ 'కులదైవం' మొదలైన మరికొన్ని సినిమాల్లో పాటలు పాడడమే కాక కొన్నిటికి సంగీతదర్శకత్వం కూడా వహించి పలువురి ప్రశంసలు పొందారు.

హుజూర్‌నగరులోని చిన్ననాటి మిత్రులైన ఎం. వెంకట నరసింహాచార్యులు గారిని పిలిపించుకుని వెంకట్రాజుగారు తన దగ్గర హార్మోనిస్టుగా చేర్చుకున్నారు. "స్వర్ణగౌరి" సినిమాపాటలను పాడే విషయంలో గాయనీగాయకులకు శ్రీ ఆచార్యులవారే చక్కని శిక్షణ ఇచ్చారు. తన సినిమాలకు ఆచార్యులవారు అందిస్తున్న సహాయసహకారాలను పరిశీలించిన వెంకట్రాజుగారు ఆచార్యులవారికి "నాగ మోహిని" సినిమాకు సహాయసంగీత దర్శకత్వ బాధ్యతలను అప్పగించాలను కున్నారు. తరువాత రెండు తెలుగు సినిమాలకు సంగీతం సమకూర్చు అవకాశాన్ని అద్భుతంగా ఉపయోగించుకుందామనుకున్నారు. వాటిలో ఘంటసాలగారి చేత పాడించవలసి వున్నది కూడా. కాని కొంతకాలం నుంచి వేధిస్తున్న క్షయవ్యాధి తీవ్రరూపం దాల్చింది. ఇవేవీ జరక్కుండా చేసింది.

దాని ఫలితంగా 1963 ఏప్రిల్ 17న వెంకట్రాజుగారు కన్నుమూశారు. వెంకట్రాజుగారి మొదటి ఇద్దరు కుమారులు గతించారు. చివరివారు సత్యనారాయణరాజు ఉపాధ్యాయునిగా పనిచేసి ఇటీవలే రిటైర్ అయ్యారు. వెంకట్రాజుగారు భౌతికంగా మన మధ్యన లేకున్నా ఆయన అందించిన సుమధుర సంగీతరసధునులు మాత్రం సంగీతప్రపంచంలో అవిచ్ఛిన్నంగా ప్రవహిస్తూనే ఉన్నాయి.

89

# మందుముల నరసింగరావు

– షబ్నవీజ్ వెంకటరంగారావు

పాత్రికేయుడిగా, రెండు ఆంధ్ర మహాసభ సమావేశాల అధ్యక్షునిగా, రయ్యత్ పత్రిక సంపాదకుడిగా, సంస్థానంలో హిందూ ముస్లిం సమైక్యత కోసం తన శక్తి మేరకు కృషి చేసిన దార్శనికుడిగా, ఆత్మకథా కర్తగా, రాజకీయ మేధావిగా, చరిత్రలో నరసింగరావు స్థానం సుస్థిరం.

మహబూబ్‌నగర్ జిల్లాలో ముందుముల వారి కుటుంబానికి ఎంతో పేరున్నది. పాలమూరు జిల్లాకు చెందిన సమరయోధులలో ప్రముఖుడైన ముందుముల నరసింగరావు మార్చి 17, 1896లో ప్రస్తుత రంగారెడ్డి జిల్లా చేవెళ్ళలో జన్మించారు. స్వగ్రామమైన తలకొండపల్లిలో ప్రాథమిక విద్య పూర్తిచేసి 1912లో హైదరాబాదు వచ్చి ఉన్నత విద్య నభ్యసించారు. న్యాయశాస్త్రంలో పట్టభద్రులయ్యారు. బాల్యంలోనే ఉర్దూ, పర్షియన్ తదితర భాషలలో బాగా పరిచయం ఏర్పడింది.

1916లో తన తోటివారితో కలిసి వామన్ నాయన్ అధ్యక్షతన "యంగ్‌మెన్ యూనియన్" ను స్థాపించారు. 1921లో న్యాయవాద వృత్తికి స్వస్తి చెప్పి పత్రికారచన, రాజకీయాలు చేపట్టారు. రయ్యత్ అనే ఉర్దూ వార్తా పత్రికకు వ్యవస్థాపక సంపాదక బాధ్యతలు చేపట్టారు. రయ్యత్ ద్వారా నిజాం నిరంకుశాన్ని ఎండగడుతూ ప్రజలను చైతన్యపర్చారు. 1927లో ప్రారంభించబడిన రయ్యత్ వార్తాపత్రిక నిజాం ప్రభుత్వంపై విమర్శలు చేసినందుకు నిషేధానికి గురై 1931లో దినపత్రికగా పునః ప్రారంభమైంది.

సుదీర్ఘకాలంపాటు ప్రచురితమైన "రయ్యత్" ప్రముఖ రచయిత – వెల్తురి మాణిక్యరావు అభివర్ణనల్లో చెబితే "నిజాం రాష్ట్రంలో భావ విప్లవాన్ని తెచ్చిన రయ్యత్ సంపాదకులైన ముందుముల భారతదేశంలోనే ఉత్తమ పత్రికా సంపాదకుల స్థాయికి చెందినవారు. రయ్యత్ విశేషాల్ని నరసింగరావు తమ ఆత్మకథ "యాభై సంవత్సరాల హైదరాబాద్"లో నమోదు చేశారు. ముందుముల వారి మాటల్లోనే చెబితే...

"పత్రికా రచన గురించి నేను ఎక్కడా తర్బియత్ తర్బీద్ (ట్రైనింగ్) పొందలేదు. కనీసం బాగా నడుస్తున్న పత్రికల్లో చేరి పని నేర్చుకొని యుండలేదు. అనుభవాలు సాధించియుండలేదు. నిజంగా విచారిస్తే ఏ విశ్వవిద్యాలయములోనైనా చేరి పత్రికా రచనకు అనుగుణ్యమైన రాజకీయ ఆర్థిక విషయాల గురించి విద్యాభ్యాసము చేయు భాగ్యము నాకు లభించలేదు. నేను ఎంతవరకు సమర్థుడునా అన్న విషయము ఆలోచించకుండ ఈ రంగములో కాలు పెట్టినాను. ఆ కాలములో ప్రభుత్వ సమాచారశాఖ అనునది యేదిలేదు. పత్రికా ముద్రణ గురించి నియమాల ననుసరించి సర్వాధికారాలు పట్టణ పోలీస్ కమీషనర్ (కొత్వాల్) కే ఉండేవి. పత్రికా ముద్రణకు సంబంధించిన దరఖాస్తు కొత్వాల్ సాహెబు వద్ద

పెట్టుకోవలసి వచ్చేది. దరఖాస్తు మంజూరు చేసే అధికారము కొత్వాలువే. పత్రికలను కంట్రోలులో పెట్టుబకునే సర్వాధికారాలు కొత్వాలు సాహెబుకుండేవి. ఆ కాలములో రాజబహదూరు వెంకట రామారెడ్డి గారు కొత్వాల్ పదవిపై నుండిరి. నేను రయ్యత్ వారపత్రిక ముద్రించుటకు వీరి వద్దనే దరఖాస్తు పెట్టుకొని అనుమతిని పొందితిని. పత్రికా నిర్వహణకు కావలసిన యేర్పాట్లు యేమిలేవు. ఆర్థికంగా కూడా యే యేర్పాట్లు లేవు. నా ఆర్థిక పరిస్థితి ఏమి బాగాలేదు. పెట్టుబడి పెట్టు భాగస్థుడు కాని, లేక యజమాని కాని లేడు. నేనే యజమానికి, నేనే ఉద్యోగిని, నేనే పెట్టుబడిదారుడను, నేనే వర్కింగ్ జర్నలిస్టును".

తొలుత రయ్యత్ పత్రికను "దక్కన్ లా రిపోర్ట్ ప్రెస్"లో అచ్చు వేసేవారు. సంస్థాన ఆర్య సమాజ నాయకులలో ప్రముఖులైన పండిట్ నరేంద్రజీ కొంతకాలంపాటు పత్రికకు మేనేజర్గా ఉన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం పట్టభద్రుడు బషీర్ అహ్మద్ తాహీర్ మొదట ఉప సంపాదకులుగా పని చేశారు. ఇమ్రోజ్ పత్రిక ద్వారా విఖ్యాతుడైన అమర పాత్రికేయుడు షోయబుల్లాఖాన్ తొలుత రయ్యత్లో నరసింగరావు దగ్గర ఉప సంపాదకులుగా ఉన్నారు. రయ్యత్కు ప్రభుత్వ ప్రకటనలు లేవు! హైదరాబాద్ పుర ప్రముఖుల్లో కొందరు ఆర్థికంగా ఆదుకున్నారు.

నరసింగరావును తెలంగాణా ముట్నూరి కృష్ణారావుగా అభివర్ణించవచ్చు. కోస్తాలో "కృష్ణాపత్రిక" అందించిన చైతన్యాన్ని హైదరాబాద్ రాష్ట్రంలో "రయ్యత్" సాధించింది. కృష్ణా పత్రికలో ముట్నూరివారు రాసే సంపాదకీయాలు అత్యంత సమగ్ర రీతిలో ఉండేవి. రయ్యత్లో నరసింగరావు కూడా అట్లాగే సవివరమైన సంపాదకీయాలు రాసేవారు. వీటిని ఉన్నతస్థాయికి చెందిన సంపాదకీయాలుగా పేర్కొంటారు.

ముందుముల నరసింగరావు మితవాది. ఆయన ప్రజా జీవితం ఆ సాంతం మితవాద వైఖరితోనే కొనసాగింది. తెలంగాణాలో 1930లో తొలి సమావేశాన్ని జరుపుకున్న ఆంధ్ర మహాసభలో ఆరంభదశలో మితవాదులవే అధిక బలం. వారిలో నరసింగరావు ఒకరు. రయ్యత్ పత్రిక ద్వారాను, హైదరాబాద్ సంస్థానం విషయంలో సమగ్ర అవగాహన ఉన్న మేధావిగానూ 1930ల నాటికే నరసింగరావు గుర్తింపును పొందారు. అందుకే 1937 డిసెంబరు నెలలో నిజామాబాద్లో నిర్వహించిన (ఆరవ) ఆంధ్ర మహాసభకు నరసింగరావును అధ్యక్షుడిగా ఎంపిక చేశారు. అక్కడ ఒక విచిత్రమైన పరిస్థితి ఏర్పడింది. నరసింగరావు ఉర్దూలో అద్భుత వైదుష్యాన్ని సాధించారు. కానీ ఆయనికి తెలుగులో లోతైన ప్రవేశంలేదు. అధ్యక్షులు నరసింగరావుతో సహా అందరూ ఉర్దూలోనే ప్రసంగించటంతో సభలోనే ఉన్న తెలుగు భాషా వాదులు తమ నిరసన తెలిపారు. అయితే "ఆంధ్ర మహాసభ ఆంధ్ర భాషాసభకాదు" అని రావి నారాయణరెడ్డి, కొండా వెంకటరెడ్డి వంటివారు గట్టిగా చెప్పడంతో భాషా వివాదం సద్దుమణిగింది.

ఆనాటి హైదరాబాద్ సంస్థానంలో నెలకొన్న వాతావరణంపట్ల పూర్తి అవగాహనతో ఉంటూ, బాధ్యతాయుత వైఖరిలో వ్యవహరించిన మేధావి ముందుముల. సంస్థానంలో మత ఉద్రిక్తతలులేని ప్రశాంత స్థితి ఉండాలన్న సంకల్పంతో ఆయన చేసిన కృషి ఇందుకు నిదర్శనం. 1938 నాటికి సంస్థాన పరిస్థితులు సజావుగాలేవు. ఆరంభంకాక మునుపే కాంగ్రెస్పై సర్కారు నిషేధాన్ని విధించింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థులు వందేమాతరం ఆందోళనను నిర్వహించారు. హిందువుల మత సంబంధమైన హక్కులను కోరుతూ ఆర్య సత్యాగ్రహం జరిగింది. ఈ స్థితిలో హిందూ ముస్లిం ఐక్యత ఎంతో అవసరమని నరసింగరావు భావించారు. ఈ సందర్భంలో నరసింగరావు ఎంతో వివేచనతో వ్యవహరించారు. చర్చల కోసం మహాత్మగాంధీని, మౌలానా అబ్దుల్ కలాం అజాద్ను కలుసుకుందామని బహదూర్ జంగ్కు సూచించారు. అయితే సంస్థానంలో బాధ్యతాయుత ప్రభుత్వ ఏర్పాటు అన్న కీలకాంశంపై సయోధ్య కుదరలేదు. చర్చలు నిర్వహించే విషయంలో నరసింగరావు ప్రదర్శించిన దార్శనికత ఎంతో గొప్పది. ఆయన అభిప్రాయాలకు ఆ కాలంలో సంస్థానంలో ఎంతో విలువ వుండేది.

వెల్దుర్తి మాణిక్యరావు తమ "హైదరాబాద్ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర" అనే గ్రంథంలో ఇట్లా రాశారు... అఖిల భారత స్టేట్ పీపుల్స్ కాన్ఫరెన్స్ కు కర్ణధారిగా ఉండిన పండిత జవహర్లాల్ నెహ్రూగారి వద్దకు హైదరాబాద్కు సంబంధించిన ఏ కాగితాలు వెళ్ళినా "వాటిని పరిశీలించవలసింది"గా నరసింగరావు వద్దకు పంపేవారు. ఇదీ నరసింగరావు స్థాయి.

ఇంక రాష్ట్ర స్థాయిలో – రయ్యత్ పత్రికలో నరసింగ రావు గారేమి రాసినారో చూతామని స్వయంగా నిజాం నవాబు మీర్ ఉస్మాన్ ఆలీఖాన్ ఆతురత చెందేవాడు. ప్రతీవారం రయ్యత్ సంపాదకీయ వ్యాఖ్యలు తప్పక చదివేవాడు.

నరసింగరావు మితవాదే అయినప్పటికీ ఆనాటి నిజాం వ్యతిరేక పోరాటంలో ఆయన కూడా ఎన్నో ఇబ్బందులు అనుభవించక తప్పలేదు. చిత్తశుద్ధితో వ్యవహరించే నాయకుడు కనుక ఈ ఇబ్బందుల్ని నిబ్బరంతో భరించారు. పలు పర్యాయాలు రయ్యత్ పత్రికను నిలిపివేయవలసి వచ్చింది. నిజాం సర్కారు ఆయనపై హైదరాబాద్ దాటి బయటకు వెళ్ళకూడదనే నిషేధాన్ని విధించింది. 1947 నవంబరు 24వ తారీఖున అరెస్టు చేసింది. నరసింగరావును ముషీరాబాద్ జైలుకు తరలించారు. నెలరోజుల తరువాత సర్కారులో స్థానమిస్తామని తెలిపారు. అయితే నిజాం మంత్రి మండలిలో చేరేందుకు నరసింగరావు నిరాకరించారు. గాంధీయ సిద్ధాంతాలు, విలువలపట్ల నరసింగరావు విశ్వాసం తిరుగులేనిది ఈ దిశలో ఆయన పలు బాధ్యతలు చేపట్టారు. 1954లో ల్యాండ్ కమీషన్ ఛైర్మన్‌గా వ్యవహరించారు.

బూర్గుల రామకృష్ణారావు ఆరంభించిన భూ సంస్కరణల ప్రయత్నాలకు ఇది మార్గదర్శనం చేసింది. నీలం సంజీవరెడ్డి హయాంలో తొలుత. అటు తరువాత దామోదరం సంజీవయ్య మంత్రి వర్గంలోనూ మంత్రి పదవులు నిర్వ హించారు. స్థానిక స్వపరిపాలన, రోడ్లు, భవనాలు, హోంవంటి కీలక శాఖల్ని సమర్థవంతంగా చేపట్టారు. మంత్రి మండలి సభ్యులుగా ఆయన ఎంతో నిరాడంబరంగా ఉండే వారు. హంగులు – ఆర్భాటాలు అసలు ఎంతమాత్రం వచ్చేవికావు.

నరసింగరావు తమ జీవిత చరమ దశలో ఆత్మకథా రచన చేశారు. ఈ ఆత్మకథ పేరు "యాభై సంవత్సరముల హైదరాబాద్". ఇది అతి విశిష్టమైన ఆత్మకథ. ఇందులో ఆయన స్వంత విషయాల్ని స్వల్పంగానూ, అప్పటి సంస్థాన స్థితిగతుల్ని విస్తారంగానూ వివరించారు. నాటి హైదరా బాద్‌ను గురించి తెలుసుకోవాలనుకునే వారికి ముందుముల వారి రచన మంచి మార్గాన్ని చూపింది. ఈ రచనలోని ఒక విశేషాన్ని చూడండి. "హైదరాబాద్ పట్టణంలో మోటారుకార్లు వాడటం ఏ సంవత్సరంలో ఆరంభమైనది చెప్పటం కష్టం. కాని ప్రప్రథమం పాయెగా నవాబు "ఎక్బాలు ద్దౌలా" ఒక పాత నమూనా మోటారు వాడటం ఆరంభించినారట. తదుపరి ముపల్లంజంగ్ కమాల్ యార్ జంగ్, రాజురాయ రాయాన్, లక్ష్మణ్ రాజ్ కొత్త తరహా మోటార్లు కొన్నారట. పాయెగా నవాబు జఫర్ జంగ్ తమ స్వంత వాడకమునకు కొన్న ఒక మోటారు కారును ఆరవ నిజాం మహబూబ్ ఆలిబాద్‌షా గారికి కానుకగా సమర్పించుకున్నాడట. ఆ తర్వాత మహబూబ్ ఆలి బాద్‌షా మరియు ఆయననుసరించి ఇతర జాగీరుదార్లు ప్రభుత్వ పెద్ద ఉద్యోగస్థులు, మోటారు కార్లు వాడటం ఆరంభించినారు. నేను ఆ కాలపు పోలీసు మంత్రి వహబుజంగ్ మోటారు కారులో హైదరాబాద్ పట్టణంలో తిరుగుచుండగా చూసినాను. ఆయన మోటారు వెనుక ముందు ఇద్దరిద్దరు గుర్రపు సవార్లుండేవారు. 1911 సం.లో హైదరాబాద్‌లో ఉన్న మోటారుకార్ల సంఖ్య (118) ఒక వంద పదునెనిమిది అని ఆ కాలపు ప్రభుత్వ రికార్డులలో వ్రాసిపెట్టినారు.

"యాభై సంవత్సరాల హైదరాబాద్" గ్రంథంలో "పత్రికలు – పత్రికాధిపతుల బాధ్యతలు" అంటూ రాసిన అంశాలలో ఈ వ్యాసాన్ని ముగించటం సముచితం.

"వాక్స్వాతంత్ర్యం, బహిరంగ సభలు పెట్టుకునే స్వేచ్ఛలేని రాష్ట్రములో కొంతవరకైనా పత్రికల ద్వారా చైతన్యము కలిగించవచ్చునని నేను నమ్మేవాడిని. ఆ నమ్మ కముతో పత్రికా రచన ఆరంభించినాను. శాసన సభలులేని మరియు ప్రభుత్వమును విమర్శించే వ్యతిరేక పక్షంలేని పరిపాలనలో పత్రికల ప్రాముఖ్యత చాలా ఉంటుందని గ్రహించినాను. రాజకీయ పార్టీలు లేని రాజ్యములో ప్రజాభి ప్రాయము కల్గించడము ప్రజా సమస్యలను ఎదుర్కొనడం మరియు ప్రజల కష్టసుఖాలు ప్రభుత్వ దృష్టిలోకి తేవడం పత్రికల బాధ్యత. నిద్రిస్తున్న యాజమానిని కావలి కాసే కుక్క ఏ విధంగా మేల్కొల్పుతుందో అదేవిధంగా నిద్రిస్తున్న ప్రజలను మేల్కొల్పి తమ ప్రజాస్వామ్య హక్కులు సాధించుకొనుటకు సిద్ధపరచటమే "రయ్యత్" బాధ్యత అని తలచి సమస్యలు చర్చించేవాడిని. అంతవరకు ప్రభుత్వ అధి కారులను పొగుడుతూ వచ్చిన ఆచారానికి భిన్నంగా వారు అవలంబించే అవకతవక చర్యలను బాగా విమర్శించేవాడిని.

ప్రభుత్వమంటే ప్రజల్లోనున్న భయము పోగొట్టవలెనను దృష్టితో కొన్ని కొన్ని పర్యాయములు ఘాటుగా విమర్శించేవాడిని.

ఇక్కడొక అంశాన్ని తప్పకుండా గుర్తించాలి. స్వామి రామానందతీర్థ, బూర్గుల రామకృష్ణారావు, పల్లెర్ల హనుమంతరావు, ముందుముల నరసింగరావు – వీరందరూ నిజాం పాలనా కాలంలో కాంగ్రెసు సంస్థ కోసం పని చేసినవారు. ఇంకా ఇటువంటి ఎంతోమంది ఆ రోజుల్లో పలు త్యాగాలు చేశారు. అయితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ అనంతరం వీరిని పూర్తిగా విస్మరించటం లేదా వారి స్థాయికి తగిన గుర్తింపును కల్పించకపోవడం కనబడుతుంది. ముందుముల నరసింగరావు విషయంలోనూ ఇదే జరిగింది. ఆయన 1960వ దశాబ్ది మధ్య భాగం తరువాత క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉన్నారు. నరసింగారావు మరణానంతరం చాలాకాలంపాటు ఆయన గురించిన ప్రస్తావనలు కూడా ఎక్కడా వినిపించలేదు. అయితే తెలంగాణా ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సందర్భంలో ఆనాటి త్యాగధనుల్ని గురించి తిరిగి గుర్తుకు చేసుకునే సంప్రదాయం బలపడింది. ఈ వరుసలో నరసింగరావు వంటి ప్రముఖుల విలక్షణ మూర్తిమత్వాల గుర్తించిన విశ్లేషణ జరుగుతోంది. రయ్యత్ పత్రిక ద్వారా ఆయన సాగించిన సామాజిక సేవను గురించి ఇప్పుడు చాలామంది సమీక్షిస్తున్నారు.

మార్చి 12, 1976న ముందుముల నరసింగరావు గారు మరణించారు.

# 90 మఖ్దూం మొహియుద్దీన్

– ఆచార్య ఎస్వీ సత్యనారాయణ

ఈ లోకం నీ కోసం – ఎంత పరితపించెనో
ఈ ధరిత్రి నీ రాకకు – ఎంత నిరీక్షించెనో
తోరణాలు తీర్చి జనం – దారుల్లో నిలిచిరే

పద పదవే గీతమా! – పదవే నా ప్రాణమా! – అంటూ జనజీవన చైతన్య గీతం కోసం పరితపించిన ధన్యజీవి మఖ్దూం.

'తూరుపు పడమర ఉత్తర దక్షిణ
సమస్త దిక్కుల ప్రపంచమంతా
మనదే మనదే మనదేనండోయ్
ఇంగ్లీష్, అమెరికా, చీనాదేశపు
సమస్త జాతుల శ్రామిక యోధులు
మనమే మనమే మనమేనండోయ్'

అన్న అంతర్జాతీయ దృష్టిని ఉర్దూ కవిత్వానికిచ్చిన ప్రగతిశీలకవి మఖ్దూం. హైదరాబాద్ నగర సంస్కృతిపై విరిసిన అందమైన పల్లెపందిరి మఖ్దూం. సంస్థాన విమోచనోద్యమంలో సాయుధ సమర సంతకం మఖ్దూం.

మఖ్దూం పూర్తి పేరు అబూ సయీద్ ముహమ్మద్ మఖ్దూం మొహియుద్దీన్ ఖాద్రి. అప్పటి మెదక్ జిల్లాలోని ఒక పేద ముస్లిం కుటుంబంలో 1908 ఫిబ్రవరి 4న మఖ్దూం పుట్టాడు. తండ్రి గౌస్ మొహియుద్దీన్ తహసీల్ ఆఫీస్‌లో గుమస్తాగా పనిచేసేవాడు. మఖ్దూం నాలుగో ఏట అతని తండ్రి పోవడం వల్ల పినతండ్రి బషీరుద్దీన్ పోషణలో మఖ్దూం పెరిగాడు. బషీరుద్దీన్ గుమాస్తాగా ఉద్యోగ జీవితం ప్రారంభించి, తహసీల్దార్‌గా పదోన్నతి పొందాడు. ధార్మిక నిష్ఠగల ఆచార పరాయణుడు. కమ్యూనిజాన్ని అభిమానించే వాడు. ఇంట్లో అందరూ కలిసి ఒకేసారి భోంచేసేవాళ్ళు. భోజన సమయంలో రష్యన్ అక్టోబర్ విప్లవం గురించి, సామ్యవాదం గురించి ప్రస్తావించేవాడు. మఖ్దూం సహజం గానే తన చిన్నాన్న బషీర్ ప్రబోధాలతో ప్రభావితుడైనాడు. బాల్యంలోనే అతనికి భూస్వామ్య వ్యవస్థ పట్ల, నిరంకుశ రాజరికం పట్ల ఏహ్యాభావం ఏర్పడింది.

1934లో మఖ్దూం తన మొదటి భావగీతం 'టూర్' రచించాడు. అదే సంవత్సరం తన మిత్రుడు మీర్ హసన్ సహకారంతో 'హోష్ కే నాఖూన్' అనే నాటకాన్ని రాశాడు. బెర్నార్డ్ షా తొలి నాటకం 'విధురుల గృహాలు' నాటకానికి ఇది అనుసరణ. ఈ నాటకాన్ని రవీంద్రనాథ్ ఠాగోర్ సమక్షంలో హైదరాబాద్‌లో విజయవంతంగా ప్రదర్శించారు. నాటకంలోని మఖ్దూం పాత్రను ఠాగోర్ ప్రశంసించడంతో పాటు, తమ శాంతినికేతనానికి వచ్చి, చదువుకోవాల్సిందిగా మఖ్దూంను ఆహ్వానించాడు. ఆనాటి జ్ఞాపకాల ప్రేరణతో 1935లో మఖ్దూం 'ఠాగోర్ అతని కథ' అనే గ్రంథాన్ని రాసి, ప్రచురించాడు. ఆ తరువాత మఖ్దూం 'ముర్షదే కామిల్' (సమర్థ పురోహితుడు) అనే మరో నాటకాన్ని రాసి, ప్రదర్శించాడు.

సరిగ్గా ఆ రోజుల్లోనే అతనికి కమ్యూనిస్టు గ్రూపులతో సంబంధాలు ఏర్పడ్డాయి. ఔరంగాబాద్ గ్రూప్ పరిచయంతో నాటి కమ్యూనిస్టు పార్టీ రహస్యపత్రిక 'నేషనల్ ఫ్రంట్'ను సంపాదించి, చదివేవాడు. నాగపూర్ మిత్రుల సహాయంతో 1939లో మఖ్దూం హైదరాబాద్ స్టూడెంట్స్ యూనియన్‌ను స్థాపించాడు. అదే సంవత్సరంలో హైదరాబాద్‌లోని సిటీ కాలేజీలో అతడు ఉర్దూ అధ్యాపకుడిగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించాడు.

1940లో మఖ్దూం, రాజ్‌బహద్దూర్ గౌర్, మరికొం దరు మిత్రులతో కలిసి కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం స్వీక రించారు. హైదరాబాద్ నగరంలో ఒక పార్టీ యూనిట్ ఏర్పడింది. దానికి మొదటి కార్యదర్శి మఖ్దూం. 1940–41 మధ్య కాలంలో సంస్థానంలోని అనేక ప్రాంతాల్లో ప్రజల పోరాటాలు పెల్లుబుకసాగాయి. మరోవైపు కార్మికుల సమ్మె పోరాటాలు మొదలయ్యాయి. ఆల్విన్ మెటల్ వర్కర్స్, వజీర్ సుల్తాన్ టుబాకో కార్మికులు, రైల్వే కార్మికులు, ఔరంగాబాద్ మిల్లు కార్మికులు సమ్మెలు చేస్తున్నారు. నాందేడ్‌లోని ఉస్మాన్‌షాహీ మిల్లు కార్మికుల్లోనూ, వరంగల్‌లోని ఆజంజాహీ మిల్లు కార్మికుల్లోనూ అశాంతి మొదలయ్యింది. తన ఉత్తేజకరమైన ప్రసంగాలతో, ఉద్వేగభరితమైన గీతాలతో కార్మికులను, విద్యార్థులను, రచయితలను ప్రభావితం చేస్తున్న మఖ్దూం 1941లో ఉద్యోగానికి రాజీనామా చేసి, పూర్తికాలం ఉద్యమకారుడిగా పోరాట జీవితాన్ని ప్రారంభించాడు.

'అడువులు కొండల అనుంగుబిడ్డలు –
పొలాల పొత్తిట పెరిగిన పాపలు
లేచిరి క్రోధోద్ధత భీకరులై –
సమరోధృత కౌక్షేయకకరులై
తళతళ తళతళ మెరిసెను కొడవలి –
ఎగిసి ఎగిసి నర్తించెను నాగలి'

అంటూ మఖ్దూం 'తెలంగాణ'పై ప్రసిద్ధ గేయాన్ని రాశాడు.

'భారతావనిలో అగ్రగామిగా తెలంగాణ
సృష్టిస్తోంది నవోదయం
ఆహ్వానం పలుకుతోంది కొత్త దిశకు తెలంగాణ
విప్లవం పురిటిగడ్డ తెలంగాణ' – అంటూ భారత

జాతీయోద్యమంలో విశిష్ట స్థానం సంపాదించిన తెలంగాణా సమరభూమిని మఖ్దూం కీర్తించాడు. ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో విపరీతమైన పని ఒత్తిడిలోనూ మఖ్దూం కవితాసృజనను నిర్లక్ష్యం చేయలేదు. అతని కవితాహృదయం విశ్రమించలేదు.

సుర్ఖ్ సవేరా (అరుణోదయం) – 1944, గులెతర్ (తాజాపువ్వు) – 1961, బిసా తెరక్స్ (నాట్యవేదిక) – 1966 పేరిట మూడు కవితా సంపుటులను ప్రకటించాడు.

1947 సెప్టెంబర్ మాసంలో నిజామాంధ్ర ప్రాంతంలో చారిత్రాత్మక సాయుధ పోరాట ప్రకటనపై రావి నారాయణ రెడ్డి, బద్దం ఎల్లారెడ్డిగార్లతో పాటు సంయుక్త సంతకం చేసిన మఖ్దూం క్రియాశీల రాజకీయ జీవితాన్ని గడిపాడు.

'జీవితం సుఖరూపం – జీవితం దుఃఖకూపం
అదే వాద్యం సంగీతమదే – సంకెల ఝంకారమదే'
– అంటూ మఖ్దూం జీవితాన్ని నిర్వచించాడు.

మౌలికంగా అతడు నజమ్ రాసే కవి, గజల్లు కూడా రాశాడు. ఫిరాక్ గోరక్‌పురి, ఫైజ్ అహ్మద్ ఫైజ్, మజ్రూహ్ సుల్తాన్ పురీల గజల్ల ప్రభావంతో ప్రణయంలో ప్రళయాన్నీ, ప్రళయంలో ప్రణయాన్నీ ప్రతిఫలింపజేశాడు.

మఖ్దూం గీతాల్లో అధిక ప్రాచుర్యం పొందిన గీతం 'ఒక మల్లెపందిరి నీడ క్రింద...''

'మల్లె పందిరి నీడ క్రింద ...
మధుశాల సమీపాన ఆ మూల
రెండు శరీరాలు ప్రళయాగ్నిలో కాలిపోతున్నాయి.
వలపు సహజీవనాక్షరము వారికి –
వలపు ఇలవేల్పు వారికి
వలపె తమ మృతిపాన్పు –
వైద్యుడా! తెలుపవయ్యా!

నీ సంచి లోపల ప్రేమ రసాయనోపాయమ్ము ఉన్నదా?!' – అని ఉద్వేగ భరిత స్వరంతో కవి ప్రశ్నిస్తున్నాడు. ఈ గీతాన్ని అమితంగా ప్రేమించిన మఖ్దూం ఉద్యమ సహచరుడు రాజ్ బహద్దూర్ గౌర్ తన ఇంటి గేటుపై మల్లెపందిరి పెంచుతూ, తాను జీవించినంత కాలం తమ ఇంటిని 'చంబేలీ కా మండువా' (మల్లెపందిరి) గానే పరిగణించాడు.

వరంగల్ నగరానికి వెళ్లే సాహితీ ప్రేమికులు వేయిస్తంభాల గుడినీ, ప్రజాకవి కాళోజీని సందర్శించేవారు. అలాగే హైదరాబాద్ నగరానికి వచ్చే ప్రముఖులు చార్మినార్‌నీ, మఖ్దూంనీ దర్శించేవారు. అలాంటి అరుదైన సందర్శనీయ సాహితీ వైతాళికుల్లో మఖ్దూం ప్రముఖుడు.

మఖ్దూంలో కేవలం భావుకత మాత్రమే కాదు. భావ పరిణతి, పరిపక్వత లున్నాయి. జీవితాన్ని గురించి సమగ్ర అవగాహన ఉంది' అంటూ రాజ్ విశ్లేషించాడు.

'వస్తున్నది వస్తున్నది – వస్తున్నది వస్తున్నది
నవజీవన పతాకాన్ని – ఎగరేస్తూ వస్తున్నది
నవ సమాజ కథాకళిని – వినిపిస్తూ వస్తున్నది
విజయాలను సౌఖ్యాలను – వెంట తీసుకొస్తున్నది'

అంటూ మరో ప్రపంచ నిర్మాణాన్ని కలలు గన్న విప్లవ కాల్పనిక కవి మఖ్దూం 1969 ఆగస్టు 25న గుండెపోటుతో అకాల మరణానికి గురయ్యాడు. వందలాది మిత్రుల ఆదరాభి మానాలను, వేలాది ప్రజల హృదయాలనూ చూరగొన్న అమృత హృదయుడు మృత్యువు ముందు ఓడిపోయాడు. కవిగా, నాటక రచయితగా, వక్తగా, ఉత్తమ ఉపాధ్యాయుడిగా, కార్మికోద్యమ నేతగా, కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగా, బహుముఖీన మైన కృషిని కొనసాగించిన మఖ్దూంను స్మరిస్తూ ఫైజ్ అహ్మద్ ఫైజ్....

'నువ్వు జ్ఞప్తికి వస్తూనే ఉన్నావు రాత్రంతా
వెన్నెల మనసుని బాధిస్తూనే ఉంది రాత్రంతా
ఒకసారి వెలుగుతూ వేరొకసారి ఆరుతూ

దుఃఖదీపం గాలికి రెపరెపలాడుతూనే ఉంది రాత్రంతా' అంటూ స్మృతిగీతం రాశాడు. అలాగే మరో ప్రసిద్ధ ఉర్దూ కవి ఖ్వాజా అహ్మద్ అబ్బాస్...

'అతను జ్వాల, అతను మంచు కూడా
అతను విప్లవానికి పిలుపు, అందె రవళి కూడా
అతను జ్ఞానం, కర్మబుద్ధి కూడా
అతను మందుగుండు ఘాటైన వాసన

అతను మల్లెపూల సువాసన కూడా' అంటూ నివాళులర్పించాడు.

నేడు మఖ్దూం లేడు. అతని ఆదర్శాలున్నాయి. అతని ఆశయాలున్నాయి. స్వప్నాలున్నాయి. వాటి కోసం పునరంకితం కావడమే ఆ మహామనీషికి మనం అర్పించగల నిజమైన నివాళి.

## 91 మంత్రి శ్రీనివాసరావు

– డా. జె. విజయకుమార్

నిజాం కళాశాలలో సాధారణ విద్యార్థిగా చేరిన ఓ తెలంగాణ యువకుడు చదువుతోపాటు నాటకాలపై దృష్టి సారించాడు. ఆ అభిరుచి అంతటితో ఆగిపోకుండా లండన్ వెళ్ళి నాటక రంగంలో అధ్యయనం చేసేలా బాటలు వేసింది. నటశిక్షణలో ఉన్నత విద్యనభ్యసించిన ఆయన తెలుగు నాటకం రంగంలో ఆధునిక నాటక ప్రయోగాలకు మార్గదర్శకుడయ్యాడు. అంతేకాకుండా దక్షిణ భారతదేశంలో తొలిసారిగా ఏర్పడిన రంగస్థలం విభాగానికి యూనివర్సిటీ స్థాయిలో అధిపతి అయ్యారు. ఆయన ఎవరోకాదు మంత్రి శ్రీనివాసరావు.

మంత్రి శ్రీనివాసరావు రంగారెడ్డి జిల్లా కందుకూరు సమీపంలోని బచ్చుపల్లిలో మంత్రి రామచంద్రరావు, రాజ్యలక్ష్మి దంపతులకు 1928 జనవరి 1న జన్మించారు. ఆయన పాత నగరంలోని ముఫీద్ – ఉల్ – ఆలం హైస్కూలులో ప్రాథమిక విద్యనభ్యసించిన తరువాత నిజాం కళాశాలలో ఇంటర్, డిగ్రీ, మాస్టర్ డిగ్రీలను పూర్తిచేశారు. అప్పట్లో నిజాం కళాశాల గొప్ప సాంస్కృతిక కేంద్రంగా వర్థిల్లేది. అక్కడ అధ్యాపకుల ప్రోత్సాహంతో విద్యార్థులు షేక్స్పియర్, బ్రెక్ట్, చెకోవ్‌ల ఆంగ్ల నాటకాలను నిజాం కళాశాల వార్షికోత్సవాల్లో విరివిగా ప్రదర్శించేవారు. ఈ నేపథ్యమే కళాశాలలో చేరిన మంత్రి శ్రీనివాసరావుపై ప్రభావం చూపింది. 1945లో నిజాం కళాశాల విద్యార్థిగా చేరిన మంత్రి నాటకాలపట్ల ప్రభావితుడై ఆంగ్ల నాటకాలతోపాటు తెలుగు నాటకాలను ప్రదర్శించడం మొదలుపెట్టారు.

మంత్రి శ్రీనివాసరావు నిజాం కళాశాలలో చదువుతున్నపుడే ప్రముఖ సాహితీవేత్త, జర్నలిస్టు అబ్బూరి వరద రాజేశ్వరరావుతో స్నేహం ఏర్పడింది. మంత్రి నాటక ఆసక్తిని గమనించిన ఆయన ప్రపంచ నాటక రంగాన్ని పరిచయం చేసాడు. అంతేకాదు సరోజినినాయుడి కుమారుడు జయసూర్య ద్వారా కావలసిన నాటక పుస్తకాలను సంపాదించి మంత్రికి ఇచ్చేవాడు. ఈ అధ్యయనమే మంత్రి శ్రీనివాసరావు ఆధునిక తెలుగు నాటకంవైపు దృష్టి సారించేలా చేసింది. అదే సమయంలో నాటక రంగ ప్రముఖులు ఏ.ఆర్. కృష్ణతో పరిచయం ఏర్పడింది.

ఆధునిక నాటక ప్రయోగాలపట్ల ఇద్దరి భావాలు ఏకసూత్రం కావడంతో నాటక వికాసం కోసం నడుం కట్టారు. 1952లో ఇండియన్ నేషనల్ థియేటర్ (INT) హైదరాబాద్‌లో ప్రారంభించారు. హైదరాబాద్‌లో ఆంగ్ల నాటకాల వ్యాప్తికి కృషి చేసిన హరీంద్రనాథ్ ఛటోపాధ్యాయ భార్య కమలాదేవి ఛటోపాధ్యాయ జాతీయ నాట్య సంఘానికి అధ్యక్షులుగా ఉండేవారు. ఆమె ప్రోత్సాహంతో మంత్రి శ్రీనివాసరావు, ఏ.ఆర్. కృష్ణలు INT నాటకోత్సవాలను సిటీ కాలేజీలో ఘనంగా నిర్వహించారు. ఇందులో బెల్లంకొండ

రామదాసు 'మాస్టార్జీ' నాటకాన్ని ప్రదర్శించారు. ఈ నాటకం హైదరాబాద్, ఇతర తెలంగాణా ప్రాంతాల్లో విశేషంగా ఆదరించడంతో మరిన్ని కొత్త నాటకాలు ఆవిష్కృతమయ్యాయి.

అబ్బూరి రామకృష్ణారావు బహుభాషావేత్త. ప్రఖ్యాత కవి, తెలుగు నాటక ప్రయోగాల మార్గదర్శిగా ప్రసిద్ధులు. వరద రాజేశ్వరరావు ద్వారా అబ్బూరి వారి పరిచయం ఏర్పడ్డది. అబ్బూరి ఆధునిక నాటక ప్రయోగాలపట్ల మంత్రి ప్రభావితుడయ్యాడు. నాటకాన్ని ఆధునిక దృక్కోణంలో దర్శించడం మొదలుపెట్టాడు. ఆ రోజుల్లోనే మంత్రి నటశిక్షణ, నాటక ప్రదర్శన, శాస్త్రీయ పద్ధతిలో సాగాలని పరితపించాడు. ఇందువల్లనే తరువాత కాలంలో మంత్రి శ్రీనివాసరావు అబ్బూరికి ప్రియశిష్యుడయ్యాడు.

హైదరాబాద్ నాట్య సంఘం ఏర్పడిన తర్వాత మొదటిసారిగా సికింద్రాబాద్ మహబూబ్ కాలేజ్ వేదికగా నాటక పోటీలు నిర్వహించారు. మంత్రి సారథ్యంలో 'ఇన్స్పెక్టర్ జనరల్' నాటకాన్ని ప్రయోగాత్మకంగా ప్రదర్శించారు. ఈ నాటకం మంత్రికి గుర్తింపు తెచ్చిపెట్టింది. 1957లో INT నాటకోత్సవాల సందర్భంగా కుందుర్తి ఆంజనేయులు వచన కవితాశైలిలో రాసిన 'ఆశ' నాటకాన్ని మంత్రి ఎక్స్పరిమెంట్ డ్రామాగా ప్రదర్శించారు. ఈ నాటకానికి ఆయనే ప్రయోక్త. ఈ నాటకంలో మంత్రి, ప్రొఫెసర్ రమామేల్కొటే కలిసి నటించారు. ఈ నాటకం మంత్రిని సృజనాత్మక నాటక ప్రయోక్తగా నిలబెట్టింది.

అట్లానే శ్రీశ్రీ రచించిన 'విదూషకుడి ఆత్మహత్య' నాటకాన్ని మంత్రి ఉత్తమ ప్రయోగంగా మలిచాడు. శ్రీశ్రీ మొదటగా దీనిని రేడియో నాటకంగా అందిస్తే, ఆ తరువాత మంత్రి ఏ.ఆర్. కృష్ణలు ఈ నాటకాన్ని రంగస్థలానికి అనువుగా నాటకీకరణ చేసి ప్రదర్శించారు. గ్రీకు నాటకాల కోరస్ సంప్రదాయాన్ని ఈ నాటకంలో ప్రవేశపెట్టారు. తెలుగు నాటక చరిత్రలో ఈ ప్రయోగం ప్రముఖంగా పేర్కొనదగింది. ప్రఖ్యాత నాటక ప్రయోక్త అబ్బూరి రామకృష్ణారావు ఈ నాటక ప్రదర్శన చూసి "As a highly successfull example of an experimental production by Mantri" అని కితాబిచ్చారు.

1957లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం సంగీత నాటక అకాడమీని ఏర్పాటు చేసింది. ఇందులో మంత్రి శ్రీనివాసరావును అకాడమీ సభ్యుడిగా ప్రభుత్వం నియమించింది. అకాడమీ ప్రారంభోత్సవాల సందర్భంగా 'నిచ్చెనలు' అనే నాటికను ప్రదర్శించారు. ఇందులో మంత్రి శ్రీనివాసరావు, పన్నూరి రామారావు మొదలైనవారు నటించారు.

మంత్రి సంగీత నాటక అకాడమీ సభ్యుడిగా కార్యక్రమాల్లో ప్రధాన భూమిక పోషించారు. ఆయన అందించిన అనేక సలహాలు తెలుగు నాటక నిర్మాణానికి దోహదపడ్డాయి. 1959లో మంత్రి శ్రీనివాసరావు హైదరాబాద్ ఎగ్జిబిషన్ సొసైటీ సహకారంతో ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో 40 రోజులపాటు సంగీత, నృత్య, నాటకోత్సవాలను నిర్వహించడం ఆయనలోని కళాతృష్ణకు నిదర్శనం. ప్రఖ్యాత రంగస్థల నటులు పృథ్వీ రాజ్‌కపూర్, దమయంతి జోషిలను అతిథులుగా హైదరాబాద్‌కు రప్పించి ఆనాటి కార్యక్రమాలను విజయవంతం చేశారు.

**ఉద్యోగిగా మంత్రి శ్రీనివాసరావు**

హైదరాబాదులో పోలీస్ యాక్షన్‌కు పూర్వం నిజాం ప్రభుత్వంలో పోలీసు శాఖలో మంత్రి శ్రీనివాసరావు పనిచేసేవారు. ఆ తరువాత హైదరాబాద్ రాష్ట్రం సెక్రటేరియట్‌లో అనువాదకుడిగా సేవలందించారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం ఏర్పడ్డాక సమాచార శాఖలోని అనువాద విభాగంలో కొత్త ఉద్యోగంలోకి మారారు. ఆ విభాగానికి ప్రముఖ సాహితీవేత్త డా. బోయి భీమన్న అధిపతిగా ఉండే వారు. తరువాతికాలంలో అదే శాఖలో పౌరసంబంధాల అధిపతిగా నియమితులయ్యారు. ఒకవైపు ఉద్యోగం చేస్తూనే నాటక రంగానికి అంకితమై పనిచేశారాయన. ఈ ఉద్యోగం ఎంతోమంది కవులు, కళాకారులను పరిచయం చేసింది. ఆయన చేసే నాటకరంగ కార్యక్రమాలకు దోహదపడేలా చేసింది.

**తొలితరం నటశిక్షణ అధ్యాపకుడు**

నాటకరంగానికి శాస్త్రీయపద్ధతిలో నటీనటులను తయారుచేయాలన్న సంకల్పంతో 1959తో నాట్యవిద్యాలయం హైదరాబాదులో ఏర్పడింది. అబ్బూరి రామకృష్ణారావు డరెక్టరుగా ఏ.ఆర్. కృష్ణ. మంత్రి

శ్రీనివాసరావులు అధ్యాపకులుగా విద్యార్థులకు నటనలో శిక్షణనందించేవారు. ఆనాటి నాట్యవిద్యాలయం ఒక థియేటర్ లేబరేటరీగా పనిచేసేది. ఇక్కడ సరికొత్త ప్రయోగాలకు ఓ రూపాన్నిచ్చి ఆధునిక ప్రక్రియలో నాటకాలను ప్రదర్శించేవారు. 'కన్యాశుల్కం', 'మృచ్ఛకటికం' వంటి నాటకాలను ప్రయోగాత్మకంగా ప్రజల్లోకి తీసుకువెళ్ళారు.

'కన్యాశుల్కం' నాటకాన్ని గొప్ప గొప్ప నటులు ఇదివరకే ప్రదర్శించినప్పటికీ మంత్రి శ్రీనివాసరావు నిర్వహణ, అబ్బూరి రామకృష్ణారావు దర్శకత్వం, అబ్బూరి గోపాలకృష్ణ డిజైన్‌తో పబ్లిక్ గార్డెన్‌లో విభిన్న సాంకేతిక అంశాలతో ప్రదర్శితమైంది. ఆ రోజుల్లో ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన చైనీస్ గార్డెన్ (సరోర్‌బాగ్)లో కొత్త తరహా రంగాలంకరణతో వేదికపై తెరలు లేకుండా 'లైట్సాఫ్ – లైట్సాన్'లోనే 'కన్యాశుల్కం' నాటకాన్ని ప్రదర్శించారు. ఆనాటి ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య పూర్తి నాటకాన్ని చూసి నటీనటులను అభినందించారు. ఆ రోజుల్లో గొప్ప ప్రయోగంగా ఆ తరంవారు ఇప్పటికీ చెప్పుకుంటారు. అదేవిధంగా మంత్రి నిర్మాణ సారథ్యంలో ఏ.ఆర్. కృష్ణ దర్శకత్వంలో 1964 తొలిరోజుల్లోనే 'మృచ్ఛకటికం' గొప్ప ప్రయోగాత్మక నాటకంగా ప్రదర్శింపబడింది. ఈ నాటకాన్ని హైదరాబాద్‌లోనే కాకుండా వరంగల్, ఖమ్మం, సూర్యాపేట వంటి అనేక ప్రాంతాల్లో ప్రదర్శించారు.

ఆ తరువాత నాటి భారత రాష్ట్రపతి డా. సర్వేపల్లి రాధాకృష్ణ ఆహ్వానం మేరకు 'మృచ్ఛకటికం' నాటకాన్ని రాష్ట్రపతి భవన్‌లో ప్రదర్శించారు. ఈ ప్రదర్శన భారతీయ నాటక విమర్శకులను అబ్బురపరచింది. హైదరాబాద్ కేంద్రంగా ఇటువంటి గొప్ప ప్రయోగాత్మక నాటకాలు ప్రదర్శిస్తారని ఇప్పుడే తెలిసింది అన్నారట. ఈ ప్రదర్శన చూసిన రాష్ట్రపతి ప్రతి నటుడ్ని అక్కున చేర్చుకుని తెలుగులో మాట్లాడుతూ అభినందించారట. ఆ రోజు అందులో పాల్గొన్న నటులకు ఓ తియ్యటి జ్ఞాపకంగా మిగిలింది.

నిరంతరం నాటకం గురించి ఆలోచించే మంత్రికి నాటక ప్రయోగాలపట్ల వ్యామోహం తగ్గలేదు. రాష్ట్ర సమాచార శాఖలో పనిచేస్తున్న సమయంలోనే ఆయన 1961లో సంవత్సరంపాటు సెలవు తీసుకుని ప్రముఖ బ్రిటిష్ రంగస్థల నిపుణులు 'హెర్బట్ మార్షల్' బొంబాయిలో నిర్వహిస్తున్న నటశిక్షణ పాఠశాలలో ప్రత్యేక కోర్సును పూర్తిచేశారు. అక్కడ "డైరీ ఆఫ్ అనేఫ్రాంక్" ఆంగ్లనాటకంలో ప్రాముఖ్యత కలిగిన పాత్రను పోషించి అభినయ ప్రదర్శనలో తన ప్రత్యేకతను చాటాడు. ఆ తరువాత 1963లో నటనలో ప్రత్యేక శిక్షణ నిమిత్తం లండన్‌లోని బ్రిటిష్ డ్రామా లీగ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. భారతదేశం నుండి కేవలం నలుగురిని మాత్రమే ఎంపిక చేసే ఈ కోర్సుకు అనేక వడపోతల్లో మంత్రి శ్రీనివాసరావు ఎంపికయ్యారు.

విమానంలో వెళ్ళడానికి ఆయన దగ్గర సరిపడా డబ్బు లేకపోవడంతో 13 రోజులపాటు ఓడపై సముద్ర ప్రయాణం చేసి మంత్రి శ్రీనివాసరావు లండన్ చేరుకున్నారు లండన్‌లో సంవత్సరంపాటు శిక్షణ కొనసాగింది. ఈ మధ్యలో శ్రీనివాసరావు తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. అయినప్పటికీ వార్షిక పరీక్షల్ల ఉత్తీర్ణత పొంది విదేశాల్లో 'యాక్టింగ్ డిప్లొమా' సాధించిన కీర్తి మంత్రి శ్రీనివాసరావుకు దక్కింది. లండన్ నుండి హైదరాబాదుకు తిరిగి వచ్చిన తరువాత మంత్రి శ్రీనివాసరావు తన చివరి మజిలీ వరకు నాటకాన్ని వదలలేదు. విదేశాల్లో నేర్చుకున్న విద్యను మంత్రి తెలుగునాట నాటక వ్యాప్తికి ఉపయోగించారు.

విద్యార్థులకు నటశిక్షణ, ఆధునిక నాటక ప్రయోగాలపై మార్గనిర్దేశకత్వం చేశారు. చెకోవ్, ఇబ్సన్, స్టానిస్లవిస్కీ, స్ట్రిండ్ బర్స్ ఎవరి గురించి మాట్లాడినా మంత్రి సాధికారికంగా మాట్లాడేవారు. మంత్రి ఆలోచనలు ఎంతో ఉన్నతంగా ఉండేవి. ఆ రోజుల్లో నడుస్తున్న తెలుగు నాటకాల ధోరణికి ఆయనలోని ఆలోచనలకు విరుద్ధంగా కనిపించేవి. అయినప్పటికీ ప్రయోగాత్మక నాటకాలను ప్రజల దగ్గరకు తీసుకెళ్ళడానికి ఆయన నిరంతరం తపనపడేవారు.

అందులో భాగంలోనే సంస్కృత, ఆంగ్ల నాటకాలను తెలుగులోకి అనువదించి ప్రదర్శనలుగా తీసుకురావడానికి మంత్రి విశేషంగా కృషి చేశారు. చెకోవ్ 'Jubilee' నాటకాన్ని తెలుగులో 'వార్షికోత్సవం'గా, 'A Dolls House' నాటకాన్ని 'బొమ్మరిల్లు'గా, 'Proposal' నాటకాన్ని 'ప్రధానం'గా, ఇంకా 'మృచ్ఛకటికం', 'ప్రతాపరుద్రీయం' వంటి సంస్కృత నాటకాలను తెలుగులోకి అనువదింపజేసి ప్రదర్శించారు.

**ఆంధ్ర విశ్వవిద్యాలయ తొలి రంగస్థల శాఖాధిపతిగా...**

ఆంధ్ర విశ్వవిద్యాలయం 1966లో నాటక శాఖను (Theatre Arts Dept.) ప్రారంభించింది. అప్పటివరకూ భారతదేశంలో కేవలం National School of Drama (NSD) మాత్రమే ఉండేది. ఉద్యోగ ప్రకటన ద్వారా హైదరాబాద్ నాట్య విద్యాలయంలో అధ్యాపకుడుగా పనిచేస్తున్న మంత్రి శ్రీనివాసరావును ఆనాటి విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ శ్రీనివాస అయ్యంగార్ నాటకశాఖ ఆచార్యుడిగా ఎంపిక చేశారు. విశ్వవిద్యాలయ స్థాయిలో బోధనార్హతలు ఆ రోజుల్లో మంత్రి శ్రీనివాసరావుకు ఉండంతో దక్షిణ భారతదేశంలో ఏర్పడిన తొలి రంగస్థల శాఖకు ఆయన మొదటి శాఖాధిపతిగా నియమితులయ్యారు.

అప్పటివరకూ తెలుగుశాఖకు అనుబంధంగా నడుస్తున్న కోర్సుకు ప్రముఖ తెలుగు నాటక ప్రయోక్త, నటులు కె. వెంకటేశ్వరరావు అక్కడ స్టేజ్ డైరెక్టర్‌గా పనిచేసేవారు. మంత్రి శాఖాధిపతిగా నియమితులయ్యాక ఆంధ్ర విశ్వవిద్యాలయం నాటక శాఖను నాటక ప్రయోగశాలగా మార్చాడు. స్టానిస్లవిస్కీ నటశిక్షణ పద్ధతిలో ఎందరినో ఉత్తమ నటులుగా తీర్చిదిద్ది విశ్వవిద్యాలయ ప్రతిష్టను పెంచారు.

మంత్రి తెలంగాణ భాషను, యాసను ఎంతగా ప్రేమించేవాడో తాను పనిచేస్తున్న ప్రాంత మాండలికాన్ని కూడా అంతే గౌరవించేవాడు. మాండలికాల్లోనే ప్రజల జీవితం దాగుందని ఆయన భావన. ఇక్కడి మాండలికాల్లో ప్రదర్శిస్తే ప్రజలు నాటకాన్ని ఆదరించి బ్రతికిస్తారని మంత్రి విశ్వసించాడు. ఆ ప్రయత్నం ఆంధ్ర విశ్వవిద్యాలయం నాటక ప్రయోగాల్లో కనిపిస్తుంది. ఆ ప్రాంత సంస్కృతిని ప్రతిబింబించేలా గణేశ్ పాత్రలో శ్రీకాకుళం మాండలికంలో 'కొడుకు పుట్టాల' నాటకాన్ని, అత్తిలి కృష్ణారావుచే విశాఖ మాండలికంలో 'యుగసంధ్య' నాటకాన్ని రచించేలా మంత్రి దోహదపడ్డారు. విద్యార్థులచే ప్రదర్శితమైన ఈ నాటకాలకు ఆ రోజుల్లో ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. దానికి మంత్రి మార్గదర్శకత్వమే మూల కారణం.

సాక్షి రంగారావు, వంకాయల సత్యనారాయణ, అత్తిలి కృష్ణారావు, కృష్ణచైతన్య, ఎస్.కె. మిశ్రో, రామవరపు శరత్‌బాబు, డా. తంబూ చంద్రశేఖర్, కొత్తుర్తి భాస్కరరావు, ఆచార్య రామవరపు శరత్‌బాబు తరువాత కాలంలో ఇక్కడి నాటకశాఖకు శాఖాధిపతులయ్యారు. మంత్రి ఆంధ్ర విశ్వవిద్యాలయం నాటకశాఖకు 1966 నుండి 1974 వరకు శాఖాధిపతిగా సేవలందించారు. ఆయన నిర్వహణలో ప్రదర్శించిన అనేక నాటక ప్రయోగాలు తెలుగు నాటక వికాసానికి బాటలు వేశాయి.

తెలుగు అకాడమీ ప్రచురించిన 'రంగస్థలశాస్త్రం' అనే పాఠ్యగ్రంథానికి మంత్రి రచయితగా ఉన్నారు. సుదీర్ఘకాలంగా నాటకరంగంలో తలమునకలై పనిచేస్తున్న మంత్రి శ్రీనివాసరావుకు తన ఆరోగ్యంపట్ల శ్రద్ధ ఉండేది కాదు. ఆంధ్ర యూనివర్శిటీలో పనిచేస్తున్న కాలంలోనే అనారోగ్యంతో బాధపడ్డారు. రంగస్థల కళల శాఖ విద్యార్థులు ప్రదర్శించబోయే నాటక ఏర్పాట్లలో మునిగిపోయిన సమయంలోనే మంత్రి తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. అత్యవసర వైద్య నిమిత్తం విశాఖలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కానీ 9 అక్టోబరు 1974లో అకాల మరణం చెందారు. అప్పటికాయనకు 46 ఏండ్లే. తెలుగు ఆధునిక నాటక వికాసానికి, తెలంగాణ ఆధునిక నాటక చైతన్యానికి మంత్రి శ్రీనివాసరావు చేసిన కృషి చిరస్మరణీయం.

# 92 మాటేటి రామప్ప

– డా॥ యం. దేవేంద్ర

బహుముఖ ప్రజ్ఞాశాలి, పరోపకారి, తెలంగాణావాది, వెస్ట్రన్ జ్యోతిష ద్రష్ట, ఉన్నత పదవులను అధిరోహించిన మేధావి మాటేటి రామప్ప గారు. ఒక సామాన్య వ్యక్తి అసామాన్యంగా ఎదగడం వెనుక ఎంతటి కార్యదీక్ష, పట్టుదల కఠోరశ్రమ దాగివుంటుందో అందుకు ఉదాహరణ మాటేటి రామప్ప గారు.

మాటేటి రామప్ప గారు 1916లో ఏప్రిల్ 20వ తేదీన ఆనాటి వరంగల్ జిల్లాలోని శనిగరం గ్రామంలో జన్మించారు. తల్లిదండ్రులు లచ్చమ్మ, సాయన్నలు పద్మశాలి కులంలో, దిగువ మధ్యతరగతి కుటుంబానికి చెందినవారు. తండ్రి చిన్న వయసులో చనిపోవడంతో తల్లి బతుకుదెరువు కోసం హైదరాబాదుకు వలసవచ్చింది. అందువల్ల రామప్ప గారి విద్యాభ్యాసం హైదరాబాదులోనే కొనసాగింది.

రామప్ప గారు చదువులో చాలా చురుకైన విద్యార్థి. ఎన్ని కష్టాలెదురైనప్పటికి చదువును ఆపకుండా మ్యాథమెటిక్ ఆప్షనల్‌తో బి.ఏ. చదివి గోల్డ్‌మెడల్ సాధించారు. ఆ రోజుల్లో డిగ్రీ చదువడమంటే మామూలు విషయంకాదు. రామప్ప గారికి డిగ్రీ పూర్తయిన వెంటనే 1940లోనే గెజిటెడ్ తాహసిల్దార్ ఉద్యోగం వచ్చింది. ఆ తర్వాత రామప్ప గారు వెనకకు తిరిగి చూడలేదు.

ఉద్యోగజీవితంలో అంచలంచెలుగా ఎదిగి 1943లో డిప్యూటి కలెక్టర్‌గా, 1948లో రాయచూర్ కలెక్టర్‌గా ఉన్నత పదవి బాధ్యతలను నిర్వహించారు. అంతేకాకుండా నిజాం మున్సిపల్ కమీషనర్‌గా, సివిల్ సప్లైస్‌కి డైరెక్టర్‌గా ఇలా అనేక పదవులను అధిరోహించి తనదైన ప్రతిభను కనబరిచారు. తెలంగాణలో ఆనాడు ఎంతోమందికి ఉద్యోగ భిక్షను ప్రసాదించారు. బీదవారికి లేదనకుండా సహాయం చేసేవారు. దయాగుణం, దానగుణం, క్షమాగుణం కలిగిన ఉదారవ్యక్తిత్వం రామప్ప గారిది. ఎంతోమంది పేదకుటుంబాలకు వెన్నుదన్నుగా నిలిచారు.

రామప్ప గారికి 12 ఏండ్ల వయస్సులో మధ్యతరగతి కుటుంబానికి చెందిన లక్ష్మీదేవి గారితో పెండ్లి జరిగింది. వారికి నలుగురు పుత్రసంతానం. వారందరిని కూడా ఉన్నతచదువులు చదివించి ఆచార్యులను, డాక్టర్లను చేయగలిగారు. కుటుంబ విషయంలో భార్యపిల్లలకు ఏ లోటు రాకుండా చూసుకున్నారు.

రామప్ప గారు బహుముఖ ప్రజ్ఞాశాలి. పదవీబాధ్యతల్లో నిరంతరం తలమునకలైనప్పటికి కూడా తనకు ఇష్టమైన జ్యోతిష శాస్త్రాన్ని అధ్యయనం చేస్తూనే వచ్చారు. పాశ్చాత్య జ్యోతిష పద్ధతి ద్వారా అనగా సూర్యమాన జ్యోతిషాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసి పట్టు సాధించారు. ఎంతోమంది ప్రముఖులు జ్యోతిషం చెప్పించుకోవడం కోసం రామప్పగారి ఇంటి తలుపు తట్టేవారు. ఆనాడు రాజకీయ ప్రముఖులైన బెజవాడ గోపాలరెడ్డి, మర్రిచెన్నారెడ్డి, ఎన్.టి. రామారావు

మొదలైన వారికి జ్యోతిష గురువుగా కీర్తిని గడించారు.

రామప్ప గారు జాతకం విషయంలో కుండబద్దలుకొట్టినట్లు చెప్పేవారు. అట్లా చెప్పాలంటే సబ్జెక్టు విషయంలో సంపూర్ణ అవగాహన ఉండాలి. కాలాన్ని లెక్కకట్టగల సమర్థత ఉండాలి. ఈ రెండూ రామప్పగారిలో ఉన్నాయికాబట్టే... జ్యోతిష్యుడిగా కూడా ఒక వెలుగు వెలిగారని చెప్పవచ్చు. ఆ తర్వాత కాలంలో తన ఆత్మీయ స్నేహితుడు దేవులపల్లి రామానుజారావు గారి సలహామేరకు రామప్ప గారు సంస్కృత భాషను నేర్చుకున్నారు. ఆ రోజుల్లో రవ్వా శ్రీహరి గారు, రామప్పగారి ఇంటికి వెళ్ళి సంస్కృతం నేర్పించారు. రామప్ప గారు సంస్కృత భాషను నేర్చుకొని తద్వారా భారతీయ జ్యోతిష్య శాస్త్రాన్ని కూడా అధ్యయనం చేశారు. ఈ విధంగా రామప్ప గారు నిరంతరం జ్యోతిషశాస్త్రాన్ని పరిశోధన దృక్పథంతో పరిశీలించి మెలకువలను సాధించేవారు.

రామప్ప గారు తెలుగు, సంస్కృత భాషలే కాకుండా ఆంగ్లం, ఉర్దూ, హిందీ, పర్షియన్, అరబిక్ భాషల్లో మాట్లాడగలరు. రామప్ప గారి సాహిత్య కృషి గురించి కూడా చెప్పుకోవాలి. దయానందస్వామి వేదభాష్యాలను ప్రసంగించేవారు. ఖురాన్, భగవద్గీతను పోల్చి చెప్పేవారు. వేమన సాహిత్యాన్ని హిందీలోకి, ఉర్దూలోకి అనువాదం చేశారు. ఈ గ్రంథాన్ని ఆనాడు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అచ్చు వేసింది. ఉర్దూ అకాడమీ వారి కోరికమేరకు తెలుగు, ఉర్దూ భాష నిఘంటువును తయారుచేశారు. ఉన్నత పదవుల్లో కొనసాగుతూ ఇన్ని పనులు చేయడమంటే ఆషామాషికాదు. అయినప్పటికి రామప్ప గారు ఇష్టంగా చేసేవారు.

రామప్ప గారు అక్షరాల తెలంగాణవాది. ఆనాడు హైదరాబాదు, ఆంధ్రరాష్ట్రం కలిపి భాషాప్రయుక్త రాష్ట్రం ఏర్పాటు చేయాలని రాజకీయనాయకులు సంప్రదింపులు జరుపుతుంటే రామప్ప గారు ప్రభుత్వ ఉద్యోగి అయివుండి కూడా పెద్దమనుషుల ఒప్పందాన్ని వ్యతిరేకించారు. ఫజల్ అలీ కమీషన్‌కు స్వయంగా లేఖ రాసి హైదరాబాద్ రాష్ట్రం ఎందుకు ఆంధ్రరాష్ట్రంలో కలవకూడదో కారణాలతోసహా లేఖలో విశ్లేషించారు. అయినప్పటికి ఆంధ్రప్రదేశ్ ఏర్పడక తప్పలేదు. ఆనాడు నీలం సంజీవరెడ్డి బాహాటంగా "తెలంగాణ వాళ్ళకి తెలివిలేదు" అన్నప్పుడు రామప్ప గారు ప్రభుత్వ ఉద్యోగినని తెలిసి కూడా చూడకుండా నీలం సంజీవరెడ్డిని నిలదీశారు. ఆ తర్వాత కొద్దిరోజులకే 'పూలకుండీలు కనబడుటలేదు' అన్న చిన్న అపవాదుతో రామప్ప గారు పదవి నుండి అర్థాంతరంగా తొలిగింప బడ్డారు. అయినా రామప్ప గారు అధైర్యపడలేదు. ఆ సమయంలో తన ఆస్తులను అమ్ముకొని కుటుంబ ఖర్చులు వెళ్ళదీసుకున్నారు. తిరిగి మర్రిచెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టిన తర్వాత రామప్ప గారికి మంచిరోజులు వచ్చాయి.

1980 – 81 ప్రాంతంలో మాటేటి రామప్ప గారు అప్పటి అంతర్జాతీయ తెలుగు సంక్షేమ డైరెక్టర్‌గా నియమించబడ్డారు. 1975లో హైదరాబాద్‌లో జరిగిన మొదటి ప్రపంచ తెలుగు మహాసభల తీర్మానం మేరకు 1976 సెప్టెంబర్‌లో అంతర్జాతీయ తెలుగు సంస్థను ఆనాటి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇతర రాష్ట్రాలలో, ఇతర దేశాలలో నివసించే తెలుగువారికి భాషా సాంస్కృతిక సేవలు అందించడం ఈ సంస్థ ప్రధాన ఉద్దేశ్యం, మొదటి మహాసభల తీర్మానం మేరకు రెండవ ప్రపంచ తెలుగు మహాసభలను ప్రభుత్వం ఈ సంస్థ ద్వార మలేషియాలో జరుపవలసి ఉంది. రామప్పగారు ఈ సంస్థకు డైరెక్టర్‌గా పదవీబాధ్యతలు స్వీకరించిన సమయంలో శ్రీ వందేమాతరం రామచంద్రా రావు ఛైర్మన్‌గా ఉన్నారు.

రామప్పగారి ఆధ్వర్యంలో ఆనాటి ముఖ్యమంత్రి కీ.శే. టి. అంజయ్య గారి నేతృత్వంలో 1981 ఏప్రిల్‌లో మలేషియాలోని కౌలాలంపూర్‌లో రెండవ తెలుగు మహాసభలు విజయవంతగా నిర్వహించిన ఘనత రామప్ప గారికి దక్కింది. అనంతర కాలంలో ఈ సంస్థ శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో విలీనమై అంతర్జాతీయ తెలుగు కేంద్రం అన్న పేరుతో పనిచేస్తోంది.

తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పడిన తరువాత మాటేటి రామప్ప గారు తమ సేవలను విశ్వవిద్యాలయానికి అందిస్తూనే వచ్చారు. విశ్వవిద్యాలయ జ్యోతిషశాఖలో ఆయన చాలాకాలం అతిథి అధ్యాపకులుగా విద్యార్థులకు జ్యోతిషశాస్త్రాన్ని బోధించారు. జ్యోతిషశాస్త్రంపై వీరు రచించిన ఆంగ్లపుస్తకాన్ని విశ్వవిద్యాలయం ప్రచురించింది.

రామప్ప గారు చనిపోయే ముందురోజు కూడా క్లాసు తీసుకున్నాడు. అంతకంటే ముందురోజు విశ్వవిద్యాలయం వారిని తన నెలజీతం ఇవ్వమని అడిగి తీసుకున్నారట. చనిపోయే ముందురోజు కరెంట్ బిల్, నల్లబిల్‌తోసహా చెల్లించి విదేశాల్లో ఉన్న మనవడికి డబ్బు పంపించారట. రామప్ప గారు జ్యోతిషం తెలిసినవారు కాబట్టి చనిపోయేది ముందుగానే తెలిసిందని వారి కుటుంబసభ్యులు విశ్వసించడంలో ఆశ్చర్యంలేదు. మాటేటి రామప్ప గారు 1991 ఆగస్టు 30వ తేదీన పరమపదించారు. వీరు దివంగతులైన తర్వాత వీరి కుటుంబ సభ్యులు విశ్వవిద్యాలయంలో కొంత నిధిని ఏర్పాటు చేసి ప్రతిమేట మాటేటి రామప్ప స్మారకోపన్యాసాలను ఇప్పిస్తున్నారు.

# 93 మిద్దె రాములు

– ప్రొ॥ ననుమాస స్వామి

ఒగ్గు కథ సాంప్రదాయకమైన యాదవ కుల సంస్కృతిని తెలిపే ఒక కళారూపం. హిందూ దేవతలైన రేణుక ఎల్లమ్మ, మల్లన్న, బీరన్నల పురాగాథలను కీర్తించడానికి రూపొందిన కళారూపంగా దీన్ని పేర్కొనాలి. యాదవులైన కుర్మల సామాజిక సమూహం తమ కుల మూల పురుషుని వీరగాథలను ఆలపించేందుకు ఏర్పర్చుకొన్న అపురూప కళారూపం ఈ ఒగ్గు. నాట్యం, నాటకం, సంగీత గానాల సమ్మిశ్రితమైన ఒక కళగా దీన్ని చెప్పుకోవాలి. తెలంగాణ జానపద కళకు పూర్వ వైభవానికి పట్టుకొమ్మలాంటిది, ఈ ఒగ్గు కథే. జానపద కళల్లో ఒగ్గు కథను మించిన కళారూపం మరొకటుండదని చెప్తే అతిశయోక్తి కాదేమో!

సంప్రదాయం ప్రకారంగా కుర్మల గురువులైన ఒగ్గు కళాకారులు ఈ ఒగ్గు కథాగానం చేయడం సామాన్యంగా కనిపిస్తోంది. ఆ సామాజిక వర్గానికి చెందని ఒక కళాకారుడు, ఒగ్గుదీక్ష ఎరుగని గౌడ కులస్తుడు ఒక గొప్ప కళారూపాన్ని నేర్చుకొని, దానికే ప్రపంచ ఖ్యాతిని తెచ్చిపెట్టాడు. అహర్నిశలు ఆ కళామతల్లీ సేవలో జీవితాన్ని తెరిచి ఆ కథకు విశేష ప్రాచుర్యాన్ని కల్పించాడు. ఆయనెవరోగాదు ఆయనే ఒగ్గు విద్దె నేర్చిన మిద్దెరాములు. నిరక్షరాస్యుడైన ఆయన మౌఖికంగా ఒగ్గు కథను అభ్యసించి యాదవుల చేతనేగాదు, కళాభిమానులచేత ప్రశంసలు పొందాడు. తన ప్రజ్ఞా పాటనాలతో ఎందరో ఒగ్గు కళాకారులను ప్రభావితం చేశాడు. అందుకే ఒగ్గు కథంటే మిద్దె రాములు, మిద్దె రాములు అంటే ఒగ్గు కళా రూపమన్నంత నుడి ఏర్పడింది. ఒగ్గు కథా పితామహుడు వల్లమ్ పెద్ద వీరయ్య. ఆ కథకు జన జీవాలు కలిగించింది. ఆయన కొడుకు సత్తయ్య. ఆ కళా రూపాన్ని విశ్వ వ్యాప్తం చేసింది చుక్క సత్తయ్య. నిజంగా పండిత పామరులను పరవశింపజేసి అంతర్జాతీయంగా గుర్తింపు తెచ్చినవారు మాత్రం మిద్దె రాములు. ఒగ్గు కథా గానంలో సానికీబాలప్ప, టైరిమల్లోకం, ఆవుల ముత్యాల, ఎర్ర మల్లేష్, శ్రీశైలం, రాంబాబు, నాగేష్, సిద్ధప్ప, పళ్ళం వీరేశం, మహేష్, క్రిష్ణయాదవ్ లాంటివారు ఒగ్గు కథకు విశేషా స్థానం కల్పించడానికి కృషి చేస్తున్నారు.

**మిద్దె రాములు ఎవరంటే...**

నాటకం, నృత్యగాన సంగీత సమ్మిళితమైన ఒగ్గు కథాగానాన్ని ఆకాశ మంతెత్తు నిలబెట్టినవాడు, ఒగ్గు కథా గానం ద్వారా తెలంగాణ జానపద కళకు పేరు తెచ్చినవాడు, ఒగ్గు కథకు ఒడుపు నేర్పినవాడు, ఎల్లయ్య కొడుకు ఈ మిద్దె రాములు. కరీంనగర్ జిల్లా వేములవాడ మండలం, హనుమాజీపేట గ్రామంలో 1941లో ఆయన జన్మించారు. పేదరికంవల్ల ఆయన చదువుకోలేకపోయాడు. కథవిన్నా పాటవిన్నా వెంటనే చెప్పే తెలివి తేటలు ఆయనకున్నాయి. మౌఖికంగానే ధారణ చేయగల ఏక సంధాగ్రాహి,

చిన్నప్పటినుండి ఒగ్గు కథ మీద పెంచుకున్న అభిమానంతో ఒగ్గు వాళ్ళు చెప్పే ఎల్లమ్మ కథ, మల్లన్న కథలు తరచూ వినేవాడు. ఆ కళను అభ్యసించాలనే తాపత్రయంతో ఒగ్గు కథకుల చుట్టూ తిరిగేవాడు. ఎండు తుమ్మకాయలు గుజికుచ్చుకొని గజ్జెల్లా కాళ్ళకు కట్టుకొని ఒగ్గు నాట్యం ఆడేవాడు. అసంఖ్యాకమైన కథలు మౌఖికంగా నేర్చుకొని, జానపద రాగాలను ఆపోసన పట్టేవాడు. జన్మతః వచ్చిన శృతి జ్ఞాపకం ఆయనకు వరమైంది. లయాత్మకంగా అడుగులు వేయడం అబ్బింది. అసామాన్యమైన ప్రతిభ ఆయనకు ఉంది. పుట్టింది గౌడ కులంలోనైనా నేర్చుకొన్నది యాదవ ఒగ్గుకథ. భాషంతా తెలంగాణ యాసే. తన కథాగానాపటిమతో పురాణ పాత్రలను ప్రేక్షకుల ముందు నిలిపేవాడు. పద గుంఫన శైలిలో పురాణగాథలను రక్తి కట్టించేవాడు. ఆయన హావ భావ విన్యాసాలలో ఒగ్గు కళకు జీవం ఉట్టిపడేది. ప్రాచీన సంప్రదాయానికి చెందిన ఒగ్గు కథాగానానికి పూర్వవైభవం తెచ్చిపెట్టాడు.

**జాతీయ అంతర్జాతీయ గుర్తింపు**

తెలంగాణ జానపద కళారూపానికి జాతీయ అంతర్జాతీయ గుర్తింపు తెచ్చింది మిద్దె రాములే. వీరాభిమానంతో ఒగ్గు కథా గానాన్ని నేర్చుకొని దానికి ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధిని కలిగించింది ఆయనే. ఒకసారి కరీంనగర్ సర్కస్ గ్రౌండ్‌లో కాంగ్రెస్ జాతీయ మహాసభ జరుగుతున్నప్పుడు మిద్దె రాములు ఒగ్గు కథాగానం ఏర్పాటు చేశారట. ఆనాడు దేశ ప్రధాని ఇందిరాగాంధి రావడం ఆలస్యం కావడంతో ప్రేక్షకులకు వినోదం కల్పించడానికి రాత్రంతా మిద్దె రాములు ఒగ్గు కథాగానం వినిపించి సమయం తెలియకుండా చేశాడట. దానితో ఆయన జాతీయంగా జానపద కళాకారుడిగా గుర్తింపు పొందారు. అలాగే దేశం నలుమూలలా ఒగ్గు కథ ప్రదర్శనలిచ్చి పరభాషీయులచేత మన్ననలు పొందారు.

మారిషష్ ప్రభుత్వం మూడవ మారిషస్ తెలుగు మహాసభలు జరిపింది. దానికి ప్రత్యేక జానపం కళాకారుడిగా మిద్దె రాములుకు ఆహ్వానం అందింది. అప్పుడు తమ ఒగ్గుకథ కళాకారుల బృందంతో రాములు మారిషస్ చేసుకొన్నాడు. మారిషస్ దేశ ప్రధాని జగన్నాథ్, గవర్నర్ రంగస్వామి ముందు రాములు ఒగ్గుకథా గానాప్రదర్శన ఏర్పాటు చేశారు. కథా ప్రారంభంలోనే రాములు తన పదగుంపున శైలిలో వారిని మైమరిపింపజేశారు. ఒగ్గులో ప్రత్యేకశైలి ఎల్లమ్మ బోనం నృత్యమే. బోనం ఎత్తేప్పుడు వేప మండలు పట్టుకొని, కాళ్ళకు గజ్జెలు కట్టుకొని ప్రత్యేకమైన శైలిలో నాట్యం చేయడంలో రాములు దిట్ట. నెత్తిమీద బోనం ఎత్తుకొని నేలమీద పాము మెలికల్లా తిరగడమేగాదు, నేలమీద పడవేసిన పైసలను నోటితో పట్టుకుంటుంటే చూసిన దేశ ప్రధాని గవర్నరు తన్మయత్వం పొందారట. మారిషస్ తెలుగు ప్రేక్షకులంతా కన్నులార్పకుండా చూశారట. ఆ తర్వాత అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పథకాలను ఒగ్గు కళా ప్రదర్శన ద్వారా ప్రచారం చేసి మన్ననలను పొందాడు. అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ముందు ఒగ్గు కథను ప్రదర్శించి ఆయన తెలంగాణా ఒగ్గును కీర్తించేట్టుగా చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత తొలి తెలంగాణ సాంస్కృతిక సంబరాల్లో ఒగ్గు కథకు పట్టం కట్టి ప్రారంభ కళా ప్రదర్శనగా జరిపారు. అప్పుడు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఒగ్గు కథాగానం మీది గౌరవంతో హైదరాబాద్ మాదాపూర్‌లోని తెలంగాణ సాంస్కృతిక సారథి భవనానికి మిద్దె రాములు పేరు పెట్టారు. దానితో ఒగ్గు కథకుడు మిద్దె రాములు పేరు స్థిరస్థాయిగా నిలిచిపోతుంది.

ఆ విధంగా దేశప్రధాని ఇందిరాగాంధి ప్రశంసలు, మారిషస్ దేశ ప్రధాని జగన్నాథ్, గవర్నర్ రంగస్వామి గారల ప్రశంసలు అందుకొన్న గొప్ప ఒగ్గు కథా కళాకారుడు మిద్దె రాములు. ఆయన ఒగ్గు కళకు చేసిన కృషికే రాజీవ్ గాంధి పురస్కారం, రాష్ట్ర ప్రతిభా పురస్కారం, హంస పురస్కారాల్లాంటి జాతీయ, అంతర్జాతీయ అవార్డులు, రివార్డులు ఎన్నో ఆయన అందుకొన్నాడు.

**పదగుంపనం, కథాగానం, నాట్య విన్యాసం**

ప్రేక్షకులని కన్నులార్పకుండా చేయాలన్నా, చెవులు రెక్కించి వినేటట్టు చేయాలన్నా, పదగుంఫనం శైలిలో వచనాన్ని చెప్పడం మిద్దె రాములుకు బాగా తెల్సు. ఒగ్గు కథా గాన ప్రారంభంలో తెలంగాణ యాసలో పదంమీద పదం, కలిపి చెప్పడంలో నోరు తిరిగినవాడు మిద్దె రాములు. లయాత్మకంగా వచనం సాగడం చూసి ప్రేక్షకులు నోరెళ్ళ బెడతారు. ఆ ప్రారంభమెట్ల ఉంటుందో వినండి.

**వచనం**

'హరి హరియ రఘునందనా!

హరిహర బ్రహ్మాండామా !

హరిలోక సంచారమా !

మద్దూరి మారిండ్లు !

మారేడుగడ్డ, మర్మమ్మతల్లి!

బుద్ధి చెప్పిన దానా బూరాంచారీ!

విద్య చెప్పినవాడు వీరాడామల్లు!

చదువు చెప్పిన వాడా!

సంద మహాంకాళీ!

అన్ని విద్దెలు చెప్పి ఆట నేర్పినవాడా! హరి హరియ హాఁ...'

**దరువు**

అది దేవి దండాలే భూదేవి దండాలే

లోక జంకారా నీకైనా దండాలే

దండము నారాయణో దాపరా మందేమో

అమ్మలారా! అక్కలారా మీకు దండాలే

రామ రామా రామ రామా!

ఆలకించి బోవరయ్యా....!

చల్తీ దరువు

'బంగారి ఒద్దాయం గుప్పాడీ బొమ్మల్లా

కుంకుమ బెట్టాడా కురులు దిద్దాడా

ఎంచక్కా గవ్వాలు ఎడమకాలు కట్టేనా

పగడాల గజ్జెలు కుడి కాలు కట్టేనా

అబ్బే మల్లె పువ్వులో నిత్యా మల్లె పువ్వులో'

ఈ విధంగా కథాగానం అశువుగా సాగిపోతుంటుంది. మౌఖిక సంప్రదాయ సంగీత, రాగాల్లో అద్భుతంగా ఒగ్గు కథాగానం చేయడం మిద్దె రాములుకే సాధ్యం. ఈ కథా గానం మంజరి ద్విపదలో సాగిపోతున్నట్టుగా ఉంటుంది. పదాడంబరాల కోసం తప్ప అర్థపుష్టి కోసం నిర్మితమైనవిగాదు.

**ఎల్లమ్మ బోనం**

పురాణగాథల కథాగానాల్లో శక్తి దేవత ఆరాధనలు ఎంతో ప్రాధాన్యాన్ని సంతరించుకొంటున్నాయి. ఒగ్గు కథలాంటి కథాగానాల్లో ప్రదర్శించే ఎల్లమ్మ బోనానికి తెలంగాణలో తరగని ఆదరణ కనిపిస్తోంది. రేణుక ఎల్లమలాంటి శక్తి దేవతలకు ప్రతీకగా భండారి (పసుపు) ని ఉపయోగించడం కనిపిస్తోంది. 'కొమురెల్లి మల్లన్నతోడ బుట్టింది ఎల్లమ్మ' అని కురుమ జాతి వారు ప్రగాఢంగా విశ్వసిస్తారు. పసువుల బుట్టింది కాబట్టి ఒగ్గులు మొహానికేగాదు, దేహమంతా పసువుని పూసుకొంటారు. మల్లన్న పట్నాల్లో రతి రాసేప్పుడు పసువును విరివిగా వాడడం కూడా కనిపిస్తోంది.

ఆరుగురు కళాకారులు ప్రదర్శించే ఎల్లమ్మ ఒగ్గు కథలో రాములు బోనం నెత్తిన ఎత్తుకొని నాట్యం చేస్తుంటే ఎవరైనా కన్నులు మరల్పకుండా ఉత్కంఠంతో తిలకించవలసిందే. రవ్వలహారం మెడలో ధరించి, నెత్తిన బోనం ఎత్తుకొని, చేతుల్లో వేపమండలు పట్టుకొని, కాళ్ళకు గజ్జెలు కట్టుకొని డప్పులు, డోళ్ళు మోగుతుంటే, సఫీరా ధ్వనిస్తుంటే బోనం కింద పడకుండా చిందులు వేస్తూ గానం చేసేవాడు. చిందులు వేయడం ఆపి నెమ్మదిగా నేలమీద కూర్చొని, కుడిప్రక్కకు, ఎడమపక్కకు వొరుక్కుంటూ కాళ్ళు చేతులు లేపి ఆహా అనిపించేవాడు. ఇక నేలమీద దొర్లుతూ పాము మెలికల్లా తిరుగుతూ కూడా నెత్తిన బోనం కింద పడకుండా నేలమీద పడేసిన పైసలు నోటితో పట్టుకొంటే ప్రేక్షకులు తన్మయత్వంలో మునిగిపోయేవారు.

జానపద కళా బ్రహ్మ, ఒగ్గు కథక చక్రవర్తి బిరుదాంకితుడైన మిద్దె రాములు 2010 నవంబర్ 11నాడు కన్ను మూశారు.

# 94 మోత్కూరు మధుసూదనరావు

– డా॥ మడికొండ శ్యాంసుందర్

కాకతీయుల రాజధాని ఓరుగల్లు పట్టణానికి సమీపంలోని కవిపండితులకి ఆలవాలమైన 'మడికొండ' గ్రామమునందు, శ్రీ మోత్కూరు మధుసూదన రావు గారు 19–3–1914 సంవత్సరంలో శ్రీ మోత్కూరు శ్యామరావు–పుల్లమ్మ పుణ్య దంపతులకు గర్భశుక్తి ముక్తాఫలంగా జన్మించినారు. మోత్కూరు మాణిక్యరావు, వెంకటమ్మ దంపతులకు సంతానం కలుగనందున దత్తపుత్రునిగా వెళ్ళినారు. మడికొండ గ్రామము నేటి వరంగల్ జిల్లాలోని హన్మకొండ మండలమున ఖాజీపేట రైల్వే స్టేషన్‌కు సుమారు 5 కిలోమీటర్లు దూరంలో శ్రీ మెట్టురామలింగేశ్వర స్వామి కరుణా కటాక్షములతో వర్ధిల్లుచున్నది. "అచట బుట్టిన చిగురుకొమ్మైన చేవ" అని అల్లసాని వారన్నట్లు ఈ గ్రామములో జన్మించిన, స్థిరపడిన వారిలో పండిత కవులలో డా.వానమామలై వరదా చార్యులు, జగన్నాధాచార్యులు, డా.పల్లా దుర్గయ్య, మడికొండ సత్యనారాయణ శాస్త్రి, అనుముల కృష్ణమూర్తి, కాళోజీ నారాయణరావు సోదరులు మొదలగు వారు ప్రముఖులు. వీరి సమకాలీనులైన శ్రీ మోత్కూరు మధుసూదనరావు గారు బాల్యము నందు విద్యాభ్యాసము శ్రీ కాళోజీ రంగారావు గారి వద్దను, ప్రాథమిక , మాధ్యమిక, ఉన్నత విద్యలను హన్మకొండ వరంగల్ పట్టణములందును అభ్యసించి, ఉపాధ్యాయవృత్తిలో ప్రవేశించినారు. తను పదవీ విరమణ పర్యంతము ప్రధానోపాధ్యాయులుగా పని చేసి విశేషానుభవము గడించినారు.

హుజూరాబాద్, పరకాల, హసన్ పర్తి, ధర్మాసాగర్, కాజీపేట మొదలైన గ్రామములందు వీరిని ప్రధానో పాధ్యాయులుగా తెలియని వారలు అరుదు. వీరు బాల్యము నుండియే లలిత కళలపట్ల ఆదరభావమును, ఆసక్తిని పెంచుకొని నాటకకళాకారునిగా గయోపాఖ్యాన నాటకమున గయుని గాను, శ్రీ కృష్ణ రాయబార నాటక మునందు ధర్మరాజు, అక్రూరాదిపాత్రలను, "విషాద తిమ్మరుసు" నాటకమున శ్రీ కృష్ణ దేవరాయలు మొదలైన పాత్రలను ధరించి గాయకునిగా, నటునిగా మెప్పులందినారు. వీరు ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వహించిన ప్రతి గ్రామములోనూ, గయోపాఖ్యాననాటకముతోబాటు, స్వీయ విరచితమైన "సార్థకజీవి" పద్య గద్యాత్మక సాంఘిక నాటకము లను స్థానిక ఔత్సాహిక కళాకారులను కూడగట్టుకొని ప్రదర్శనలిచ్చెడివారు. తమ సార్థజీవి నాటకంలో అంధభిక్షుక పాత్ర వివేక సాగర్ పోషణలో విశేషప్రతిభను కనబరిచినారు.

పద్య పఠనమునందు "అభినవ అద్దంకి"గా నాటి శ్రీకృష్ణ పాత్ర ధారులు శ్రీ ముచ్చెర్ల సత్యనారాయణ గారిచే మెప్పు పొందినవారు. ఉపాధ్యాయ వృత్తి నిర్వహించిన ప్రతిగ్రామములోనూ వీరి ఇంటిలో అనేక మంది శిష్యులు ఆశ్రయమును పొంది విద్యాభ్యాసము చేసారు. వీరి ధర్మపత్ని శ్రీమతి సరస్వతీ బాయిగారు తమ సంతానముతో బాటు శిష్య సంతతిని గూడా ప్రేమాదరభావంతో చూసేవారు.

''వందనలయందు వేవురువచ్చిరేని, అన్నపూర్ణకునుద్ది యౌనతని గృహిణి'' అని పెద్దనగారు సోమిదమ్మను వర్ణించినట్లు, రాత్రింబవళ్ళు తమ బంధుమిత్ర గణాన్నీ, సంతానాన్నీ, శిష్య సంతతినీ సమాదర భావంతో చూసి వండివడ్డించేవారు.

శ్రీ మోత్కూరు మధుసూదనరావు గారు సరస్వతీ బాయి గార్లకు 4 గురు మగ సంతానం, 6గురు ఆడ సంతానం. ఇంత మందితో వీరి యిల్లు కళకళలాడుచుండెడిది. వీరు ఎక్కడ ఉన్ననూ, ఆ యింటిలో, పాఠశాలలో కవితా గోష్ఠ'లు, నాటకముల రిహార్సల్సు, సంగీత సాధనలు వెల్లివిరిసేవి. సాయంకాలము నుండి రాత్రి ప్రొద్దు పోయే వరకూ అను నిత్యకార్యక్రమంగా కొనసాగుచుండెడివి. సర్వశ్రీ పాటిమెట్ల భద్రయ్యగారు, మోత్కూరు హన్మంతరావు, గోపాలకిషన్ రావు, భట్టు వెంకటయ్య, బి.ఎల్.ఎన్.రాజు మొదలైన వారు పాల్గొని ఆనందించెడివారు.

"హరికథల" పట్ల గూడా వీరికి అమిత ప్రీతి. హైద్రాబాదు, విజయవాడ మొదలైన ఆకాశవాణి కేంద్రముల నుండి ప్రసారమయ్యే హరికథా గానములు, శనివారం రాత్రి ప్రసారమయ్యే జాతీయ సంగీత కార్యక్రములు, రాత్రి ప్రొద్దు పోయే వరకు శ్రద్ధా భక్తులతో ఆలకించి పరవశించేవారు. ఈ ప్రసంగ వ్యాసకర్త కూడా వీరి శిష్యుడే!

ఆచార్య డా.పల్లా దుర్గయ్య గారు, మధుసూదన రావు గారు ఆబాల్య మిత్రులు. ఒకే ఊరివారు. వీరికి తాము ఒకే కుటుంబ సభ్యులము అను భావనతో ఆ మరణ పర్యంతము మెలగినారు.

"స్పర్థయావర్ధతే విద్యా" అన్నట్లు పోటీగా కవిత్వరచన చేపట్టేవారు. ఇందుకు శ్రీ దుర్గయ్యగారి "పాలవెల్లి" ఖండ కావ్యంలోని "సీతవలపోత" అను శీర్షిక, మధుసూదనరావు గారి ఖండకావ్యం "మధుమంజరి" లోని "సీతవలపోతం" శీర్షికలు చక్కని ఉదాహరణ.

వీరి రచనలు(1) శ్రీ వెంకటేశ్వర శతకము (2) సార్థక జీవి సాంఘిక నాటకము(3) చిత్ర పద్యకావ్యము (4) మధుమంజరి పద్య, గేయ ఖండ కావ్యములు ముద్రితములైనవి. "ముందంజ" అనే ఏకాంకిక "మావూరు" అను లఘు పద్యకావ్యములు అముద్రితములైననూ, లుప్తములైనవి. "విశ్వసాహితి" అధ్యక్షులు వీరిని 'మధురకవి' బిరుదులతో సన్మానించినారు. కనుల శ్రీ ఆనాల దామోదర్ రెడ్డి గారు సాహిత్య ప్రస్థానమున వీరికి తోడుగా నిల్చినారు. వీరు తమ గ్రామము మడికొండ పౌరాణిక నామధేయమైన "మణిగిరి" పేర "మణిగి ప్రచురణలు" అనే సంస్థను నెలకొల్పి తమ కావ్యములను ప్రచురింపజేసినారు. ఇవి యన్నియు అభిమానులకోరిక మేరకు వితరణ జేయబడి యుండుటచే, ఇటీవల వీరి కుమారులు డా.మోత్కూరు మాణిక్యరావు, లయన్.మోత్కూరు మనోహర్ రావు మహేందర్, మధూకర్ రావు గారల సమిష్టి కృషివల్ల "మణిగిరి ప్రచురణ"ల పేరునే మధుర కవి మోత్కూరు మధుసూదనరావు సాహితీ సంకలనమును పేర పునర్ముద్రింపబడి అవిష్కృతమైనది.

1).వీరి రచనలందు "శ్రీ వెంకటేశ్వర శతకము" 1972 సంవత్సరం నందు ప్రచురించబడినవి. తన ఆరాధ్య దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ముక్తి ప్రధానాంశములుగా కవి తన ఆవేదనను స్వామి సన్నుతి, లోక వర్తనము, ప్రధానముగా సులభ గ్రాహ్యశైలిలో అత్యంత సుందరముగా రచించి ధన్యులైనారు. ప్రచురణలో వీరి జ్ఞాతులగు శ్రీ మోత్కూరు గోపాల కిషన్ రావు గారు హార్దికంగా, ఆర్థికంగా తోడ్పడినారు.

2). ''సార్థకజీవి'' అను సాంఘిక నాటకము పద్యగద్యాత్మకమై 1988 సంవత్సరంలో ప్రచురింపబడినది. నాయకుడగు "సుధీర్" పాత్రతో విద్యా విషయక ప్రాముఖ్యతను, వితంతు వివాహావశ్యకతను, కుటీర పరిశ్రమల స్థాపనతో ఇతరులకు ఉపాధి కల్పనను చక్కగా సమర్థవంతంగా వివరించినారు. నాయకుని తండ్రి అంధభిక్షుక పాత్ర "వివేక సాగర్" గా ఆ పాత్రలో జీవించి ప్రేక్షకులను మెప్పిం చెడి వారు. జిల్లా కలెక్టర్ గారితో తన కృషికి ఫలితంగా "సార్థకజీవి" అనే బిరుదాన్ని స్వీకరించినారు. సామాజిక స్పృహ, దీనియందు ప్రధానాంశముగా రచించి కవి కూడా "సార్థక జీవి" అయ్యాడు. డా.విశ్వనాథ రావుగారు దీని ప్రచురణకు కావలసిన సహాయం, సహకారము లందించినారు.

(3)"చిత్ర" అనే పద్యకావ్యం సుమారు 500 పై చిలుకు పద్యాలతో రచింపబడి 1988 సంవత్సరంలోనే ప్రచురింపబడినది. చిత్ర ను ఉపనాయిక ప్రధాన పాత్ర

ధారిగా కుల వివక్ష, వర్ణాంతర వివాహము మొదలైన సమస్యలను తన వాక్చాతుర్యముతో పరిష్కరించి ప్రణయబంధములో నున్న నాయిక సుశీల, నాయకుడగు హరిహరులకు వివాహ బంధములో గూర్చుటయేకాక, తాను గూడా నాయకుని సోదరుడగు మురహరుని పెండ్లియాడి, చిత్రవిచిత్రమైన మలుపులతో గూడిన కథాంశమును సుఖాంతముజేసినది. తన 2వ అల్లుడగు శ్రీ బి.సుబ్బారావు గారు దీని ప్రచురణకు తోడ్పాడు నందించినారు.

4).మధుమంజరి: ఇది దాదాపు 21 ఖండికలతో కూర్చబడిన పద్య, గేయాత్మక ఖండకావ్యము. 1991 సంవత్సరంలో అప్పటి ఎం.పి శ్రీ.వి.రాజేశ్వరరావు గారు తమ తల్లి దండ్రుల జ్ఞాపకార్థము దీనిని ప్రచురింపజేసినారు. "భగవానుడు కలడా-లేడా?" అను సంశయాత్మక శీర్షికతో ప్రారంభమై "కలడుకలడను వారి హృత్తమ మందు, కలిగియుండెడినెపుడు నా కన్నతండ్రి, లేడు లేడను వారికి లేమియందె ఉండి లేనట్లు కన్పించు చుండునెపుడు" అనే తీర్పుతో ముగించినాడు. "కలడుకలండనెడి వాడు కలడో? లోడో?" అను సందేహము ఆర్తితో నున్న గజరాజుకు కూడా కల్గి, ఆ విష్ణుమూర్తి వచ్చి రక్షించినట్లు భాగవతంలో పోతనగారు "గజేంద్రమోక్షం"లో వివరించిన తీరుగా ఉన్నది ఈ శీర్షిక. అత్యంత సుందర మైన రచన.

"ఉపాధ్యాయుడా?" అనే శీర్షికలో ఉపాధ్యాయ వృత్తి యొక్క పవిత్రత, ప్రాముఖ్యతలను, శిష్యుని ఉపాధ్యాయునిగా తీర్చిదిద్దు విధానమును చక్కగా వివరించి, తన వ ృత్తికి సార్థకతను చేకూర్తినాడు". వితంతు బాలిక శీర్షికలో బాల వితంతు వివాహావశ్యకతను కరుగిరసార్ద్రంగా వివరించినాడు. ఆంగ్లంలోని Thomos Grey యొక్క Elegyకి ఆంధ్రానువాదంగా "రుద్రభూమి" అనే శీర్షికను గేయ, పద్యాలలో తనివిదీర వర్ణించి, మరణానంతర దృశ్యాన్ని కరుణ రసస్ఫోరకంగా రచించాడు. సుమారు 50 పద్యాలలో తన మొదటి ధర్మపత్ని రుక్మాబాయి మరణాన్ని "పత్నీవియోగము" అనే శీర్షికలో, సంసారబంధంలోని వివిధ అనుభవాలను వర్ణించి శ్రోతలకంట తడి పెట్టించినారు. రచయిత భావనాపటిమ ఇందులో పరాకాష్టనందు కొన్నది. అంతేకాక బాలురలో దైవత్వాన్నీ, మద్యపానం వల్ల కలుగు అనర్థాల్ని వివిధ శీర్షికలలో వర్ణించి తన విశ్వజనీనతను చాటినాడు కవి. సత్యనారాయణస్వామి మంగళహారతితో ఖండికలను ముగించినాడు. పదవీ విరమణానంతరం సుదీర్ఘ జీవితం గడిపి 1996 సంవత్సరంలో డిసెంబర్ 25వ తేదీన స్వగ్రామమైన మడికొండలో భగవదైక్యమును పోందినాడు.

# 95 ముకురాల రామారెడ్డి

– డా॥ జి. చెన్నకేశవరెడ్డి

శ్రీ. శే. ముకురాల రామారెడ్డి గారు తెలంగాణ ముద్దు బిడ్డలలో ఒకరు. అప్పటి మహబూబునగరం జిల్లా కల్వకుర్తి తాలూక ముకురాల గ్రామంలో 1929వ సంవత్సరంలో జన్మించారు. వారి చదువు ఒక బడిలోగాని, ఒక గురువు దగ్గరగాని స్థిరంగా సాగలేదు. వీధిబడి నుంచి విశ్వవిద్యాలయం చదువుదాకా చాలావరకు స్వయం కృషితోనే సాగింది. ఆంధ్ర (తెలంగాణ) సారస్వత పరిషత్తు నిర్వహించే 'విశారద' పాసై, ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ వృత్తిని నిర్వర్తిస్తూ, ప్రైవేటుగా B.A., B.Ed., M.A. చదివి ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడై, మహబూబునగర్ డిగ్రీ కళాశాలలో తెలుగు ఉపన్యాసకులుగా పనిచేస్తూ, తెలుగు అకాడమిలో 1970వ సంవత్సరంలో చేరి 17 ఏళ్ళపాటు వివిధ హోదాలలో పనిచేసి, ఉప సంచాలకులుగా రిటైరైనారు. తెలుగు అకాడమిలో ఉద్యోగం చేస్తూ, ఆచార్య సి. నారాయణరెడ్డి గారి పర్యవేక్షణలో 'ప్రాచీనాంధ్ర కవిత్వం ఆదర్శాలు – పరిణామాలు' అనే అంశంమీద పరిశోధన చేసి Ph.D. పట్టా పొందారు. 1946–48 ప్రాంతంలో విద్యార్థి దశలోనే గ్రంథాల యోద్యమం, నిజాం వ్యతిరేక పోరాటంవంటి ప్రజా ఉద్యమాలలో పాల్గొన్నారు. 'దుందుభి' మాస పత్రికకు గంగాపురం హనుమచ్చర్మత్ కలిసి సంపాదక బాధ్యతలు నిర్వహించారు.

ముకురాల స్వయం కృషితో తెలుగు, ఇంగ్లీషు, సంస్కృతం, హిందీ, ఉర్దూ భాషలను గట్టిగా చదువుకొన్న వ్యక్తి. ఉపాధ్యాయ వృత్తి నుంచే ఆయన కవితలు, విమర్శన వ్యాసాలు రాస్తూ వచ్చారు. ప్రచురితమైన వాటిలో ఆయన తొలికృతి దేవరకొండ దుర్గం ఈ గేయ కావ్యం 1957లో అచ్చయింది. దేవరకొండ దుర్గం 8 పేజీల లఘు కావ్యమైనా, ఆయనకు అమోఘమైన కీర్తిని తెచ్చిపెట్టింది. దేవరకొండ దుర్గం రాచకొండ రాజ్యంలోని భాగం, వెలమప్రభువులు పాలించిన ప్రాంతం. ఈ సీమను పాలించిన ప్రభువులలో సర్వజ్ఞ సింగభూపాలుడు ప్రసిద్ధుడు. ఈ కావ్యంలో కథ ఏమీలేదు. కేవలం వర్ణనాత్మకమైన, ప్రశంసాత్మకమైన కావ్యం.

'అలరాచకొండలో
తలిరాకు మొలబాకు నాజోకు భోగినిషోకు
కవిరాజురాజు సింగమనీని దర్బారు కవులకే
వాకట్టు గట్టు వాగ్యుద్ధములు
తిరుగునా కలలో గిరగిరన
నా అంతరంగమే ఒక చిత్రరంగమై భ్రమియించు
ఒకనాడు వెలమలకు ఉనికిరా ఈ కొండ
ఇదియె దేవరకొండ ఇదియె దేవరకొండ
ఇదెకొండ, ఇదెకోట – ఈ కొండ కిదిదండ
ఇట ఎన్నడో ఎగిరెనటరా తెలుగుజెండ
ఏనాటిదీ వీర ధాని దేవరకొండ' అని నాటి పురాణ

వైభవాన్ని వర్ణిస్తారు.

'నేలతల్లి కెరుక నింగి సామి కెరుక
నాటి కతలు వెతలు నాటి మాట
మనసు రకగనేడు వినిపించు నొక్కటే
గాలిపిల్ల వాని జీవి మాట' అని నేటి జీర్ణస్థితిని కళ్ళకు కట్టిస్తాడు.

నవ్వేకత్తులు: ముకురాలా రెండో కావ్యం దీన్ని కవిగారే 'జాతీయ విప్లవ కావ్యం' అని పేర్కొన్నారు. ఇది 1971లో ప్రచురితమైంది. ఈ కావ్యంగా ఆధునిక సమాజానికి సంబంధించిన కావ్యం. (1) నీ కోసమె బ్రతికెదవా? (2) నీ జాతీయుల రక్షణతో జీవిక గడిపెదవా? (3) నీ నా నచ్చుక.

ఈ కావ్యాన్ని రెండు భాగాలుగా రాయడం జరిగింది. సంప్రదాయం చచ్చిపోతున్నదని ఏడుకొండలవాడికి వినతిపత్రం (దరఖాస్తు) ద్వారా విన్నవించడం మొదటి భాగం. రెండో భాగం ఎండార్స్‌మెంట్. కొత్త సమాజం కావలసిందేనని, అది కొత్తగా రూపొందవలసిందేనని, దానికి ముఖ్యంగా కావలసింది కొత్త వ్యవస్థేనని ఈ కావ్యంలో ప్రతిపాదించడం జరిగింది. మొదటి భాగాన్ని పద్యంలోను, రెండో భాగాన్ని గేయంలోను రచించడంలో కవికిగల ఉచితజ్ఞోత వెల్లడైంది. సంకుచిత స్వార్థాల కోసం రకరకాల ఆలోచనల్నే ఆయుధాలుగా వాడుతున్నవారిని కవి అధిక్షేపిస్తూ ప్రశ్నలనే కత్తులుగా నూరినాడు.

1962లో చైనా మన దేశంమీద దండయాత్ర జరిపింది. చైనాకు పాకిస్తాన్ వత్తాసు నిచ్చింది. అలాగే పాకిస్తాన్ ఎప్పుడూ మనదేశం మీద కయ్యానికి కాలు దువ్వుతూ ఉంటుంది. ఈ రాజకీయ పరిణామాలను దృష్టిలో పెట్టుకొని ముకురాల 'నవ్వేకత్తులు' కావ్యాన్ని రచించినాడు.

"మార్పువాది వచ్చె మనిషికి శత్రువై – కడల
ఊర్లు వల్లకాడులయ్యె
రజత గిరుల దాకె రక్త వసంతాలు –
వీరభద్రుడొళ్ళు నిరువదేమి"?

అని అంటారు. దేశంమీద దండయాత్ర జరిగినపుడు ప్రతిదేశవాసి ఒళ్ళు విరిచిన వీరభద్రుడు కావాలని కవి ఉద్దేశం.

"రక్తమును పంచుకొన్నవారంట – అన్నదమ్ములంట,
ద్విజాతి సిద్ధాంతమంట
జాతిపితయంతవాడె ఈ వైర మరణము మధ్య –
తానె దుర్మరణమయ్యె" అని అంటారు.

దేశ విభజన సమయంలోను, ఆ తర్వాత జరిగిన, జరుగుతున్న మతకలహాలను, పాకిస్తాన్‌తోటి వైరాన్ని సూచిస్తున్నది. దీనికి మూలకారణం.

"హేతుమతి పెరగని సంఘంలో – మతముంటుందీ
– మనిషిని మనిషినీ విడదీయిస్తూ" అని కవి భావం.

భారత విదేశాంగ నీతిలోని లోటే చైనా దాడికే, పాకిస్తాన్ కోతి చేష్టలకూ కారణమైందని, లౌకిక రాజ్యాంగం అని చెప్పుకొంటూ, వివిధ మతాలకు స్వాతంత్ర్యం ఉండటం దేశంలో మతకలహాలకు ద్విజాతి సిద్ధాంతాలకు మూలకారణమైందని ముకురాల నిశ్చితాభిప్రాయం.

"ఒక జాతిది ఒక సత్యం –
ఒక జెండా, ఒక్క పాట
అడగవోయి సముద్రాల – అలలు తాకినంతమేర
ఒక జాతిది ఒక తత్త్వం ఒక గమ్యం ఒక్క మాట
అడుగు నేటి తత్త్వం హద్దులు ఏర్పడిన మేర

అని తన జాతీయ తత్త్వమేమిటో తన కవిత ద్వారా వెల్లడిస్తాడు. 'నవ్వేకత్తులు' శీర్షికలాగే రచనా సంవిధానం కూడా విలక్షణతను సంతరించుకొన్నది. ఈ కావ్యాన్ని 'భారత జీతీయ ప్రతిష్ఠ కోసం, తన – మన – ధన సంపత్తులు అర్పించిన త్యాగమూర్తులకు అంకితం చేసి, తన జాతీయ భావాన్ని చాటుకొన్నాడు.

హృదయశైలి: 1957 నుంచి 77 వరకు అప్పుడప్పుడు వివిధ అంశాలమీద రాసిన 36 కవితల సంపుటే 'హృదయశైలి'. 'శాంతి వచనమ్' అనే ఖండికలో

"ఓ శాంతీ! ఎంతమెత్తని పేరు నీది –
నీ విలాసం పాతదే
అయినా నీతో సంధి చేసుకొనే సమయం కొత్తది
అన్ని దేశాల్లోనూ, అన్ని ఫొటోల్లోనూ నెగ్గిన
విశ్వసుందరివిగా" అని ఛలోక్తి విసురుతారు.

'బుబమ్మకథ' అనే ఖండిక చక్కని హాస్యాన్ని, వ్యంగ్యాన్ని

మేళవించి సందేశాత్మకంగా రాసిన కవిత 'బుబమ్మ' అంటే ' బువ్వా బట్టా అంటూ' 'బు. బ' కోసం రోజూ అరవంగా అరవంగా ఆమె పేరు బుబమ్మాయె. ఆ బుబమ్మ

దట్టి ముడుపు కట్టలేదు దర్గచుట్టు తిరగలేదు
అయినా ఏటా ఒక్కడు మైనాకుడుగాపుడతాడు
ఇచ్చినవాడు మరిస్తే – ఇంటినిండ పిల్లలు
బతికి బైటపడితె చాలు బలుసుకూర తింటరంట
పెట్టబువ్వ చాలనపుడు కట్టబట్టలేనప్పుడు పుట్టిస్తే పాపం
అంగట్లో తిరునాళ్ళో దొంగల చేస్తే పాపం

అని ఈ విధంగా సాగిపోతుంది. 'పందికి పది, నందికి నాలుగు' అనేది పాత సామెత ఒకరు లేదా ఇద్దరు చాలు అంతేకాని 'బుబమ్మలు' కావద్దని కవిగారిచ్చిన సందేశం.

పాలమూరు జిల్లాను వలసల జిల్లా అంటారు. దేశంలో ఏ ప్రాజెక్టు కట్టినా, ఏ రోడ్డు వేసినా, పంట పొలాలకైనా పాలమూరు లేబరు తరలివెళ్ళవలసిందే. వలస కూలీలుగా తూర్పు కోస్తాకు వెళ్ళిన పాలమూరు జాలర్లు కొందరు 1977 నాటి తుఫానులో చిక్కుకుని మరణించిన ఉదంతం ముకురాల రామారెడ్డి చేత 'పాలమూరు జాలరీ' అనే గొప్ప పాటను రాయించింది. ఆ పాట ఇది

కూలి మస్తుగ దొరుకుతాదని కోస్తదేశం పోతివా
ఎన్నడొస్తవు లేబరీ పాలమూరు జాలరీ
కోస్త బెస్తల పడవలల్లో కూలివయ్యిన కర్మమెందుకు
ఎగువ కృష్ణా ఆనకట్టను ఇంతవరకు వేయనందుకు
ఏడ ఉంటివో లేబరీ ఎన్నడొస్తావు జాలరీ
గుర్తు తెలియని పీనుగులతో గోతి పాలైపోతివా!
ఎక్కడుంటివి లేబర్ – ఎన్నడొస్తవు మళ్ళెందుకొస్తవు జాలరీ

అప్పటి ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణానది తొలి అడుగు మోపేది పాలమూరు జిల్లాలోనే అయిన, ఈ పాట రాసేనాటికి కృష్ణానదిపై జూరాల ప్రాజెక్టు నిర్మితం కాలేదు. ఈ జిల్లాలో రెండు నదులు పారుతున్నా పాలకుల కుతంత్రాలవల్ల పాలమూరు జిల్లా వలసల జిల్లా అయిన దుస్థితిని ఈ పాటలో రాసి, కన్నీటి ఊటను ఉబికించినాడు ముకురాల.

అందుకే ప్రజల కష్టాలు చూసిన వాడుగానేకాక, స్వయంగా రైతుబిడ్డ అయిన ముకురాల 1969 నాటి తొలి తెలంగాణ ఉద్యమంలో ప్రముఖ కవులందరూ సమైక్యాన్ని కోరినా, కాళోజి లాగా ప్రత్యేక తెలంగాణాను కోరుతూ కవితలు రాశాను.

పల్లెతమ్ములు పూట గడవక –
పస్తువుంటే మొలకసీమన
పూడుబావికి మోట తోల్తే –
సాగినన్నల పొలాలకు సాగరం కాల్వ
తమ్ముని కొడుకు 'ఎమ్మే' చదివి –
తయిదరొట్టెకు నోచకపోతే
'బియ్యే' తప్పిన అన్న కొడుకును 'పియే' హోదా?
కోటి తమ్ముల చేతిముద్దకు నోటి బుక్కకు –
ప్రణాళికయైనట్టి పోచంపాడు పాడా
ఫైటులేందే రైటులేదని ప్రజాస్వామ్యం చెప్పుచున్నది.
ఈ అసహనం, ఈ ద్వేషం –
వెక్కిరింతలు విషపు చూపులు
మనసు విరిగిన మాటలన్నీ మరచుటెన్నడు?" అని ఆక్రోశిస్తాడు.

సమైక్య పాలనలో తెలంగాణవారికి నీటి పంపకంలో, ఉద్యోగ నియామకాలలోను జరుగుతున్న అన్యాయానికి, తెలంగాణ భాష, సంస్కృతిపట్ల అవహేళన, అపహాస్యం చూపుతున్న అన్నల ధోరణికి తీవ్రంగా స్పందించి ఎంతో ఆవేదనతో రాసిన కవిత.

కాళిదాసు రచించిన 'మేఘ సందేశ' కావ్యాన్ని ముకురాల 'మేఘదూత' అనే పేరుతో గేయానువాదం చేశారు. కావ్యం చివరి ముగింపులో కాళిదాసు మేఘూనికి మార్పు తీసుకొనిరావడం జరిగింది. దశేంద్రియ జీవితంకాని 'మేఘం' సందేశాన్ని ఎట్లా తీసుకొనిపోతుంది అని ప్రశ్నించిన కాళిదాసు, చివరికి సందేశాన్ని తీసుకొనిపోయి చెప్పినట్లు రచించడం యుక్తంవాదని, పూర్వాకాలం కార్మికులు విమర్శించినందుకుగాను, రామారెడ్డి సహజమైన రీతిలో ముగించడానికి కొత్తగా సన్నివేశ కల్పన చేసినాడు. యక్షుని భార్య దీనావస్థను గురించి ఆనోటా ఆనోటా కుచేలుని

భార్యకు అందంగా ఆమె భర్తతో చెప్పి యక్షుని శిక్ష తగ్గింపజేస్తుంది.

"మనుషులుండేదిదాక – గగన భాగాల మేఘాలు మెదలెడిదాక

విరహవీణల మీటి వినగవచ్చునది – కాళిదాసుని విధురకలత కావ్యమిది"

అని కాళిదాసుని ప్రశంసతో కావ్యాన్ని ముగిస్తాడు. ముకురాల 'పుట్ట గోచిలింగ పూలరంగ' అనే మకుటంతో హాస్యపూరితమైన, వ్యూహాత్మకమైన శతకం కూడా రాశారు. మచ్చుకొక పద్యం

"మూతిమీసమూడి ముప్పైత్తు కోవేద
పేడియయ్యు లక్ష్మి గూడవేద
మీసముండినంత రోసాలు సాగునో
పుట్ట గోచిలింగ పూలరంగ"

ముకురాల రాసిన 'రాక్షసజాతర' అనే దీర్ఘ కవిత అముద్రితం.

మొత్తంమీద వీరి కవిత్వంలో ముకురప్రాయంగా కనిపించే ప్రధానలక్షణం వక్రోక్తి! సూటిగా దేన్ని చెప్పడు. తెనుగు నుడికారం. జాతీయాలు, తెలంగాణా పలుకుబడి భాష, ముఖ్యంగా పాలమూరు భాష ఆయన కవిత్వంలోని మౌమి గుణాలు.

ముకురాల ఎంతటికవో అంతటి విమర్శకుడు, పరిశోధకుడు కూడా. వీరి సిద్ధాంత వ్యాసం "ప్రాచీనాంధ్ర కవిత – ఆదర్శాలు, పరిణామాలు" ఒక మౌలికమైన, ప్రామాణికమైన పరిశోధనాగ్రంథంగా గణితి కెక్కింది. ప్రాచీన, ఆధునిక కవులమీద, ఇతర విషయాల మీద రాసిన విమర్శన వ్యాసాలు 'ఉపరిశోధన', 'సాహిత్య సులోచనాలు' అనే పేర్లతో వెలువడినాయి.

ముకురాల కొన్ని కథలు కూడా రాశారు. అవి 4, 5 కథలకంటె మించవు. అయినా 'విడిజోడు' అనే కథకు కృష్ణాపత్రికవారు ద్వితీయ బహుమతి (1958) నిచ్చి, తమ పత్రికలో ప్రచురించుకొన్నారు. ముకురాల పుంఖాను పుంఖంగా రచనలు చేయకపోయినా, రాసిన ప్రతి రచన ఒక పుత్తడి రచనే. ఆయన కలం ఎంత బలమైనదో, కంఠం కూడా కంచుకంఠం కావడంవల్ల కవిసమ్మేళనాలలో శ్రోతలను ఆకట్టుకొన్నాడు. వక్తగా కూడా రాణించినాడు.

ముకురాల రామారెడ్డి గారికి జరిగిన సన్మానాలలో ఆలిండియా రేడియో న్యూఢిల్లీ నుంచి జాతీయ కవిగా సన్మానం (1976), ఆధునిక పరిశోధకుడిగా తెలుగు విశ్వవిద్యాలయం ప్రత్యేక సన్మానం (1988), కవిరాజు సూతపురాణ వ్యాఖ్యను భారత ఉపరాష్ట్రపతి సన్మానం (1996), పద్యకవితకు మధునాపంతుల అవార్డు (1966) ముఖ్యమైనవి.

తెలుగు అకాడమిలో ఉద్యోగిగా ఉంటూ తెలుగు భాషా సాహిత్యాలకు చేసిన సేవ కూడా ప్రస్తుతించదగినదే. ముఖ్యంగా 'పరిపాలన న్యాయపదకోశం' తయారీ వీరి ఆధ్వర్యంలోనే కొనసాగింది. 'తెలుగు సాహిత్య పదకోశాన్ని' మిరియాల రామకృష్ణగారితో కలిసి రచించారు. కార్యాలయ పదావళి, రెండో భాషగా తెలుగు బోధన కార్యక్రమాలు, వాచక రచనలు (తెలుగు), శబ్ద సంపద పరిశీలన మొదలైన ప్రాజెక్టులను ఎంతో దక్షతతో పర్యవేక్షించి, పని చేయించి తాము పనిచేస్తున్న సంస్థకు పేరుప్రతిష్ఠలను తెచ్చిన ఉన్నతోద్యోగి (వీరు మార్చి 3, 2003 నాడు కల్వకుర్తిలో మరణించినారు).

తెలంగాణ కావ్యాలలో ముకురాల రామారెడ్డిది బలమైన గొంతుక, విశిష్టమైన కవిత్వం. వినూత్నమైన పరిశోధన చేసిన పరిశోధకుడు.

# 96 నల్లా నరసింహులు

**– డా. రామా చంద్రమౌళి**

"ఒక వీరుడు మరణిస్తే/వేల కొలది ప్రభవింతురు
ఒక నెత్తుటి చుక్కలోన/ప్రళయాగ్నులు ప్రజ్వరిల్లు"

ఇదీ 1945 నుండి 1951 వరకు నిజాం ప్రభుత్వ దన్నుతో రజాకార్లు, దేశ్ ముఖ్‌లు, సర్ దేశ్ ముఖ్‌లు, దేశాయి, సర్ దేశాయిలు, జమీన్‌దార్లు, మక్తేదార్లు అమాయక లక్షలాది తెలంగాణా ప్రజలపై దశాబ్దాలుగా కొనసాగించిన రాక్షస, పైశాచిక అణచివేత, హత్యాకాండ, దోపిడీకి వ్యతిరేకంగా, అప్పటిదాకా 'బాంచెను నీ కాళ్ళు మొక్కుత దొరా' అని బానిస బ్రతుకులనీడ్చిన లక్షలాది పేద రైతాంగ జనం తమ చేతులనే, శరీరాలనే ఆయుధాలుగా చేసుకుని జరిపిన ప్రపంచ ప్రసిద్ధి చెందిన 'తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట' సందర్భంలో ప్రతి వ్యక్తీ నినదించిన ప్రతిఘటనా నినాదం.. చేసిన సింహ గర్జన, పోరు ఉరుము... అప్పటి నిజాం పాలనలో ఉన్న హైదరాబాద్ రాష్ట్రంలోని 7430 గ్రామాల్లో ఆయన తన స్వంత ఖర్చులకోసం "సర్ఫేఖాస్" అని పిలువబడే దాదాపు 40% భూములుండేవి. ఇవి నిజాం స్వంతపాలనలో ఉంటే మిగిలిన 60% భూమి 'ఖాల్సా' లేక 'దివానీ' అని పిలువబడే భూమి ప్రభుత్వ దళారులైన పైన చెప్పిన ప్రైవేట్ దొరల అజమాయిషీలో నిజాం తరపున పన్నులు వసూలు చేసే అధికారాన్ని దఖల్ చేస్తూ పరిపాలించబడేది. ఆ అప్రత్యక్ష అధికారాన్ని చేజిక్కించుకుని కొందరు భూస్వాములు వేల లక్షల కొద్దీ ఎకరాల భూమిని తమ అజమాయిషీలో పెట్టుకుంటే.. ఆ భూములను సాగుచేసి పంటలను పండించే రైతులుమాత్రం ఒట్టి కౌలుదార్లై, కూలీలై, దొరల గడీల్లో వెట్టి బానిసలై బతుకులనీడుస్తున్న నిస్సహాయ దయనీయ కాలంలో.. ఉదాహరణకు మానుకోటకు చెందిన జన్నారెడ్డి ప్రతాపరెడ్డి కుటుంబం ఒక లక్షా యాభై వేల ఎకరాల భూమిని, విసునూరు దేశ్‌ముఖ్ రాపాక రామచంద్రారెడ్డికి అరవై గ్రామాలను ఆవరించిన నలభై వేల ఎకరాల భూమి, సూర్యాపేట దేశ్‌ముఖ్‌కు ఇరవై వేల ఎకరాల భూమి.. ఇలా దున్నే వాళ్ళు లక్షలాది. దిక్కుమొక్కు లేని లక్షలాది పేద జనమైతే వాళ్ల మీద.. ఆ వ్యవసాయ ఫలాన్ని అనుభవిస్తూ సర్వాధికారాలను కలిగి తరతరాలుగా ప్రజలను హింసిస్తూ దోపిడీ చేస్తున్న పదుల సంఖ్యలో భూస్వాములు.. ఒక అసమసమాజంగా కునారిల్లుతున్న 1945 దశకంలో.. పెను ఉప్పెనై పోటెత్తిన తెలంగాణా సాయుధ విముక్తి పోరాట కెరటాల్లో ఒక మహోత్తుంగ తరంగమై విప్లవించినవాడు శ్రీ నల్లా నరసింహులు, జనగామ ప్రాంత దళ నాయకుడు. చారిత్రాత్మక 'తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటాని' కి నాయకత్వం వహించిన 'ఆంధ్ర మహాసభ' లో అత్యంత కీలక పాత్ర వహించి వేలాది మంది యోధులతో నిజాం ప్రభుత్వాన్ని ప్రతిఘటిస్తూ వీరోచిత విముక్తి పోరాటంలో ఎన్నో త్యాగాలు చేసి, ఎన్నోసార్లు పోలీసులకు పట్టుబడి, చిత్ర హింసలకు గురై, కోర్ట్ కేసులనెదుర్కొని, మూడుసార్లు

ఉరిశిక్షలు విధించబడి, కోర్టులలో అత్యంత ధైర్యంగా తన వాదనలను వినిపించి న్యాయస్థానాల చేతనే 'తెలంగాణా టైగర్' అని కీర్తించబడ్డ సామాన్యుడే ఐన అసామాన్య వీరకిశోరం నల్లా నరసింహులు.

90 సంవత్సరాల సుదీర్ఘ భారత స్వాతంత్ర్య పోరాటం తర్వాత 1947 ఆగస్ట్ 15న బ్రిటిష్ పాలకులనుండి ఇండియా స్వేచ్ఛా స్వతంత్రాలను పొందితే నిజాం దుష్ట పాలనలో మగ్గిపోతూ స్థానిక భూస్వాముల, రజాకార్ల కబంధ హస్తాలనుండి విముక్తికోసం తమ సాయుధ పోరాటాన్ని కొనసాగిస్తూ తన సహ భారత పౌరులతోపాటు స్వాతంత్ర్యాన్ని పొందలేక తాను మాత్రం నిజాం హైదరాబాద్ పోలీస్ యాక్షన్ తర్వాతే, నిజాం భారత యూనియన్ ప్రభుత్వానికి లొంగిపోయిన అనంతరమే సెప్టెంబర్ 17, 1948న భారతదేశంలో విలీనమై నిజమైన రెండవ స్వాతంత్ర్యాన్ని పొందింది. ఇది తెలంగాణాకు సంబంధించి ఒక విచిత్రమైన ప్రత్యేక ఘటన. ఈ రెండు చిత్రమైన సందర్భాల మధ్య కాలంలో జరిగిన వేలాదిమంది మరణాలకూ, ఊచ కోతలకూ, మాన భంగాలకూ, హత్యలకూ, పైశాచిక హింసకూ సాక్షమై నిలిచిన సంధి సమయానికీ, చారిత్రాత్మక పదిలక్షల ఎకరాల భూ విముక్తి తర్వాత దాన్ని పేదలకు పంచిన ప్రజా విజయ ఘటనకూ నడుమ గగనమెత్తు పోరుప్రతీకై నిలిచిన వాడు నల్లా నరసింహులు.

నరసింహులుది తెలంగాణా సాయుధ పోరాటానికి తన వీరమరణంతో అంకురార్పణ చేసిన యోధుడు దొడ్డి కొమురయ్య పుట్టిన కడవెండి గ్రామం. అది అప్పటి జనగామ తాలూకాలో ఉంటూ నరరూప రాక్షసుడు విసునూరు దేశ్‌ముఖ్ రాపాక రామచంద్రారెడ్డి ఏలుబడిలో ఉన్న, అతని తల్లి జానమ్మ ప్రత్యక్ష పాలనలో మగ్గుతున్న ఊరు.. కడవెండి. నరసింహులుది అతి మామూలు పేద పద్మశాలి కుటుంబం. చేనేత పని చేసి జీవిస్తూ, జానమ్మ గడీలోకి వెట్టికి వెళ్ళొచ్చే బీద కుంటుంబానికి చెంది ఉర్దూ మీడియంలో ఏడవ తరగతి వరకు మాత్రమే చదువుకున్నవాడు నరసింహులు. బక్కగా, నల్లగా, అతి మామూలుగా కనిపించే వ్యక్తిని కడివెండి పరిస్థితులు అనివార్యంగా దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమిస్తూ, ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ఏండ్లకు ఏండ్లు అజ్ఞాతంలో ఉంటూ విప్లవించిన సాయుధ యోధుణ్ణి చేసి చరిత్రలో నిలిచిపోయే వీరునిగా రూపొందించాయి అప్పటి పరిస్థితులు.

పరిస్థితులేమిటంటే .. గ్రామాలన్నింటిలోనూ ప్రజలకు భూములు లేవు.. అన్నీ దొరల భూములే. దాదాపు అందరూ కౌలు రైతులే. ఏ ఒక్కరిద్దరికో కొద్ది భూమి ఉన్నా దొర మనుషులు ఏదో రకంగా ఆ భూమిని జప్తు చేసుకునే నిరంతర ప్రయత్నాలే . ప్రజలను కులాలు కులాలుగా, మతాలు మతాలుగా విభజించి పాలిస్తూ, గడీలోకి వెట్టికి రప్పించుకుంటూ, ఎవరైనా ఎదురు తిరిగితే తమ గూండాలతో భయపెట్టి శారీరక హింసతో హడలగొడ్తూ, పోలీసుల సహకారంతో, రజాకార్ గూండాలతో, తామే స్వయంగా పోషించే మనుషులతో.. దాడులు జరుపుతున్న స్థితిలో.. అస్సలే ఐకమత్యం లేని జనం.. జనాన్ని కూడగట్టి గడ్డిని తాడులా పేనగల నాయకత్వ లేమి. మనిషిని ప్రతిరోజూ చంపుతూ బతికే శవంగా మార్చేది భయం. భయంతో తెలంగాణా అంతా వందలకొద్దీ గడీల కింద నలిగిపోతూ ప్రజలు కాలగర్భంలో కలిసిపోతున్న బీభత్స సందర్భంలో 'ఆంధ్ర మహా సభ' రూపంలో ప్రవేశించిన కమ్యూనిస్టుల ఆగమనం ఒక కొత్త వసంతాన్ని తెచ్చింది తెలంగాణా నేలపైకి.

పుచ్చలపల్లి సుందరయ్య, రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, భీమిరెడ్డి నరసింహారెడ్డి, నైతిక విలువలతో, మానవీయ ప్రవర్తనా పరిమళంతో, తమకున్న ఆస్తులను ప్రజలపరం చేసి, తమ భార్యా పిల్లలతో, కుటుంబ సభ్యులతో సహా ప్రజారంగంలోకి దూకి దిక్కుమొక్కు లేని జనానికి 'మేమున్నాం.. మీకోసం మేమున్నాం' అని ప్రతి గ్రామీణున్నీ సంఘటిత పరుస్తూ, వరుసగా "ఆంధ్ర మహా సభలను" నిర్వహిస్తూ.. చైతన్యాన్నీ, ధైర్యాన్నీ, శాస్త్రీయమైన అవగాహనతో గ్రామ దళాలను నిర్మిస్తూ, 'సంఘం' పేరుతో మంట అంటుకున్న అడవిలా విస్తరిస్తూ వస్తున్న క్రమంలో.. బీద చేనేత కార్మికుడైన తన తండ్రి కడివెండి ఊరి దొరసాని జానమ్మ దౌర్జన్యానికి బలై మరణిస్తే.. ఇక ప్రతిఘటనా రంగంలోకి భువనగిరిలో జరిగిన 11వ 'ఆంధ్ర మహాసభ' ద్వారా గ్రామ దళ నిర్మాణంతో రంగంలోకి దూకిన నల్లా నరసింహులు మూడవ తరగతి చదువుకున్న తన భార్య

వజ్రమ్మతో సహా అజ్ఞాతంలోకి వెళ్ళి.. ఉద్యమ వ్యాప్తి, గెరిల్లా శిక్షణ .. దొరల గూండాలపై ప్రతిఘటన, దాడుల వ్యూహ రచన.. గ్రామ రక్షక దళాల ఏర్పాటు.. మహిళా కామ్రేడ్‌ల తయ్యార్.. వాళ్లలో కూడా పోరాట పటిమను నింపే శిక్షణా తరగతులు.. ఇదంతా ఒక ప్రజాశక్తి నిర్మాణ లోకమయ్యింది నరసింహులుకు.

అగ్గి అంటుకున్న అరణ్యాన్ని ఆర్పడం అంత సులువు కాదు. జనగామ తాలుకా లోని ఎన్నో గ్రామాల్లో 'సంగం' దళాలను నిర్మించి, స్వయంగా నాయకత్వం వహించి, పార్టీ అగ్ర నాయకుల సమన్వయంతో విప్లవించిన కొదమ సింహం నరసింహులు. ఆయన తన పార్టీ విధేయునిగా అట్టడుగు కార్యకర్తలను సంఘటిత పరుస్తూ, చైతన్య పరుస్తూ, అటు అగ్ర నాయకత్వంతో పార్టీ బలోపేతానికి పాటుపడ్తూ దొరలకూ, రజాకార్లకూ సింహ స్వప్నమై నిద్రలేకుండా చేశాడు. మొట్టమొదటి తిరుగుబాటు తన స్వంత ఊరు కడివెండి నుండే మొదలుపెట్టి.. అనూహ్యంగా తన సహచరుడు, వీరుడు దొడ్డి కొమురయ్యను కోల్పోయాడు. అదే 'తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటానికి' అంకురార్పణయ్యింది. దరిమిలా 1947 సెప్టెంబర్ 11న నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా, దోపిడీ దారులైన భూస్వాములను తరిమికొట్టేందుకు 'సాయుధ పోరాటా'నికి పిలుపు ఇవ్వబడింది.

ఇక అక్కడినుండి నిప్పుల కొలిమైన తెలంగాణా నేల నాలుగు చెరగులా .. ప్రత్యేకించి భూస్వామ్య వ్యవస్థ బలంగా పాతుకుపోయిన నల్గొండ, ఖమ్మం, వరంగల్లు, కరీంనగర్ జిల్లాలలో ఎర్ర జెండాల నీడలో లక్షలాది మంది నిరక్షరాస్య సుశిక్షిత ప్రజాసైన్యం ఎక్కడికక్కడ దొరల గడీలపై, ఖాసిం రజ్వీ నాయకత్వంలో పని చేసే రజాకార్ల, నిజాం పోలీసు క్యాంప్‌లపై మెరుపు దాడులు చేస్తూ.. ప్రతీకార జ్వాలల్లో తరతరాలుగా బందీ ఐపోయిన ప్రజల అప్పుపత్రాలను కాలబెడ్తూ, గడీలను ధ్వంసం చేస్తూ, దొరలను ప్రజా కోర్టుల్లో నిలబెట్టి శిక్షిస్తూ, వేలకొద్దీ ఎకరాల భూములను విముక్తం చేస్తూ, బహిరంగంగానే 'దున్నేవాడికే భూమి' ని పంచిపెడ్తూ .. ఆ క్రమంలో వందలు వేలమంది కర్కశ నిజాం సైన్యాలకూ, రజాకార్లకూ బలై ప్రాణాలను కోల్పోతూ 1951 వరకు అంతటా ఒక బీభత్స యుద్ధకాండ. అప్పుడే సంభవించిన ఘటనలు.. బందగీ వీరోచిత ప్రతిఘటన.. దరిమిలా హత్య.. చాకలి ఐలమ్మ వీరోచిత పోరాటం.. ఆకునూరు, మాచిరెడ్డిపల్లి తిరుగుబాట్లు.. తిమ్మాపురం, అల్లీపురం.. బక్కవంతులగూడెం, మేళ్ళచెరువు ఊచకోతలు.. అటు సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావు రాసిన 'మా భూమి' నాటకాన్ని 128 దళాలు 980 ప్రదర్శనలివ్వగా 18 లక్షల మంది తిలకించి ఉత్తేజితులవ్వడాలు.. జెండా పండుగ నాడు పర్కాలలో భయంకర సామూహిక హత్య, తర్వాత బైరాన్ పల్లి లో వందల మందిని చెట్లకు కట్టేసి, స్త్రీలను నగ్నంగా బతుకమ్మ ఆట ఆడించి, అమానుషంగా చెరిచి, 118 మందిని కాల్చి చంపడాలు..

ఉద్యమం హైదరాబాద్ నగరానికి కూడా వ్యాపించి అనేక డెన్‌లు, కమ్యూనిస్ట్‌ల కమ్యూన్‌ల ఏర్పాట్లు, అజ్ఞాత దళాల రహస్య కదలికలతో హింసా, ప్రతిహింసలతో తెలంగాణా అగ్నిగుండమై ప్రజ్వరిల్లడాలు.. అంతా ఒక అఖండ శృంఖల చర్య. దాదాపు నూట ఇరవై రెండు దళాలనూ, ఆత్మార్పణ గెరిల్లా సమూహాలనూ నిర్మించి, నాయకత్వం వహించి, కదనరంగంలో ముందుండి నడిపించి అనేకసార్లు పోలీసులను ముప్పుతిప్పలు పెట్టి, అప్పుడప్పుడు పట్టుబడి ఘోరాతిఘోరమైన హింసను సహించి, అనేక కేసుల్లో ఇరికించబడి, మూడుసార్లు ఉరిశిక్షలు విధించబడి.. అజేయంగా నిలిచిన నల్లా నరసింహులును ఒకసారి.. పోలీస్ చర్య అనంతరం యూనియన్ సైన్యాలు నిషిద్ధ కమ్యూనిస్ట్ పార్టీ సభ్యులను అడవుల్లోకి తరుముతూ వందలమందిని హత్య చేస్తున్నపుడు, అప్పటికి సికిందరాబాద్ జైల్లో 12 మందిలో ఒకడిగా ఇక రేపు ఉరితీయ బడ్తాడనగా అంతర్జాతీయ కమ్యూనిస్ట్ సంస్థల, భారత ట్రేడ్ యూనియన్ల ఆందోళన ఫలితంగా ఉరితీతకు 12 గంటలముందు ఉరిశిక్ష నిలిపివేయబడి..

అసలు ఈ నల్లా నరసింహులు ఎవడు.. అని అప్పటి యూనియన్ సైనిక జనరల్ జె.ఎన్. చౌదరి నల్లగొండ జైలుకు చూడ్డానికి వచ్చినపుడు, ఆ జిల్లా ఎస్.పి. ధన్‌రాజ్ నాయుడు సంకెళ్ళతో ఉన్న నరసింహులునును "టైగర్ ఆఫ్ తెలంగాణా" అని పరిచయం చేశాడు. నిరంతరం గర్జిస్తూ ఉరిమే పులి నరసింహులు.

అప్పటి హెూం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు తెలంగాణాలో నిజాంకు వ్యతిరేకంగా విముక్తి పోరాటం చేస్తున్న కమ్యూనిస్ట్‌లు నెహ్రూ ప్రభుత్వాన్ని కూలదోయడానికి ప్రయత్నిస్తున్నారని స్టేట్ కాంగ్రెస్ ఇచ్చిన తప్పుడు నివేదికలవల్ల నిషేధానికి గురై, లక్షలాది కరపత్రాలను హెలికాప్టర్‌ల ద్వారా అజ్ఞాత నాయకులనూ, క్యాడర్‌నూ లొంగిపోవాల్సిందిగా హెచ్చరించిన నేపథ్యంలో.. నరసింహులు వంటి అనేకమంది యోధులు నల్లమల అడవుల్లోకి, రాచకొండ అరణ్యాల్లోకి నిష్క్రమించి.. మళ్ళీ ఒక ప్రతిఘటన. చివరికి విచిత్రమైన పరిస్థితుల్లో 1951 అక్టోబర్ 21న 'సాయుధ పోరాటాన్ని' విరమిస్తున్నట్టుగా జాతీయ కమ్యూనిస్ట్ పార్టీ ప్రకటన ఒకటి వెలువడి.. అఖండాగ్ని చప్పున చల్లారిపోయింది. అప్పటికి నరసింహులు భార్య వజ్రమ్మ అరెస్ట్ అయి జైళ్ళో ఉంటూ కటకటాల్లోనే ఒక ఆడ శిశువును ప్రసవించింది.

తర్వాత 1952లో జరిగిన జనరల్ ఎన్నికల్లో నిషిద్ధ పార్టీ కావడంవల్ల కమ్యూనిస్ట్‌లు పీపుల్స్ డెమోక్రటిక్ ఫ్రంట్ పేర ఎన్నికల్లో పోటీ చేసి తెలంగాణాలోని మొత్తం 98 శాసన సభ, 15 పార్లమెంట్ స్థానాల్లో కాంగ్రెస్ 46 సీట్లు సాధిస్తే పి.డి.ఎఫ్. 35 స్థానాలనూ, 7 పార్లమెంట్ సీట్లనూ కైవసం చేసుకుని తన ప్రజాదరణను చాటి చెప్పింది. రాష్ట్ర నాయకుడు రావి నారాయణ రెడ్డి నల్లగొండ నుండి పోటీ చేసి నెహ్రూకంటే, దేశంలోనే అందరికన్నా అత్యధిక మెజారిటీని సాధించాడు. నరసింహులు పోటీ చేయలేదు. ప్రజాస్వామ్యం పేరుతో భారతదేశంలో పరిపాలన ప్రారంభమైన తర్వాత కూడా తనపై ఉన్న అనేక కేసులతో సతమతమై.. కోర్టుల చుట్టూ తిరిగి తిరిగి, చివరికి అప్పటి శాసనసభ ప్రతిపక్ష నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య చొరవతో చివరి ఉరిశిక్షనుండి బయటపడి.. అంతిమంగా 1959 జనవరి 26 న స్వేచ్ఛా ప్రపంచంలోకి వచ్చాడు నరసింహులు. తర్వాత బొంబాయి, షోలాపూర్ లలో పార్టీ క్యాడర్ వేలమందితో ఘనంగా ఆదరించబడ్డా.. చివరికి శేష జీవితమంతా, మిగిలిన నిరంతర వీరోచిత అనంతమైన రక్తసిక్త పోరాట స్మృతులతో తానూ తన ధర్మపత్ని వజ్రమ్మ చారిత్రాత్మక తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటంలో భూమికోసం, భుక్తికోసం, విముక్తి కోసం అసువులు బాసిన 4000 మంది వీరులనూ, పీడిత ప్రజలకు పది లక్షల ఎకరాల భూమి పంపక విజయాలనూ స్మరించుకుంటూ.. 'జీవితమే ఒక నిరంతర పోరాటం' అన్నతృప్తితో మిగిలిపోయారు.

నరసింహులు 1993 నవంబర్ 5న అనంత వాయువుల్లో విలీనమై.. కడివెండి ప్రజలకు 'జీవితమంతా తను నమ్మిన సిద్ధాంతం కోసమే బతికిన మహా వీరునిగా' ఒక పోరాట వారసత్వమై శాశ్వత సజీవుడయ్యాడు. వీరునికెన్నడూ మరణం లేదు. అతడు ఎప్పుడూ ప్రజల గుండెల్లో నిరంతర స్ఫూర్తియై ప్రజ్వలిస్తూనే ఉంటాడు.

# 97 నటరాజ రామకృష్ణ

**–కళాకృష్ణ**

భావరాగ తాళం తెలిసిన నాట్య కళా ప్రపూర్ణులు భరతకళాప్రపూర్ణ బిరుదాంకితులు నటరాజ రామకృష్ణ. ఆయన నాట్యయోగి. తన జీవితాన్నే నాట్యకళకి అంకితమిచ్చిన మహామనిషి. నాట్య గ్రంథాల రచయితగా మరో భరతముని నాట్యమే అతని శ్వాస నిశ్వాసలు. ఆయన నిలువెత్తు నిండైన విగ్రహమే నాట్య కళ. అంగ, ఉపంగ, ప్రత్యంగ స్వరూపం శాస్త్రంలో చెప్పిన లక్షణ లక్ష్యాల శరీరాకృతి నటరాజరామకృష్ణ. చతుర్విదాభినయాలు ఆయన ఆకారాన్ని ఆసరా చేసుకున్నాయి.

వారి మృదువైన హస్తవిన్యాసాలను 'ఆంగికాభినయం' ఆక్రమించుకొంటే చంద్రబింబంలాంటి ముఖ వర్చస్సును, విశాల నేత్రాలను 'సాత్వికాభినయం' స్వాధీన పరుచుకుంది.

వెండికొండలాంటి తెల్లని వస్త్ర ధారణనను మిణుకు మిణుకు మనే అబ్రకము మెరుపులను 'ఆహార్యాభినయం' అలంకరించుకొంది.

ఆయన సుస్వరాన్ని మృదుమధుర వాక్కులను 'వాచికాభినయం' వరించింది. ఉత్తముడు, సంస్కారవంతుడు, దయాశీలి, దానకర్ణుడు, కరుణా హృదయుడు, కళాకారుడు, కళా పోషకుడు, కళాప్రపూర్ణ రామకృష్ణ ఇన్ని సుగుణాలుండి తెలుగువారి నాట్యముద్దు బిడ్డగా జన్మించడం తన పూర్వజన్మ సుకృతమే.

పూవు పుట్టగానే పరిమళిస్తుందంటారు పెద్దలు. ఆ పుష్పం, దైవారాధనకు, అలంకరణమే, సుగంధ ఘ్రాణానికి ఉపయోగపడుతుందంటారు. ఆ కోవకే చెందుతారు కీ.శే. నటరాజరామకృష్ణగారు. నిశ్శబ్దం నుండి 'శబ్దమైన' తరంగాలు సృష్టిలో లీనమై ఎన్ని రసాను భూతులను కలుగ చేస్తాయో అలాగే నాట్య శబ్దంగా జన్మించి నాట్యకళాచరిత్రలో లీనమై పరమాత్మ పద సన్నిధిని చేరిన పరమ పురుషుడు నాట్య కళా సవ్యసాచి నటరాజరామకృష్ణ.

శివపార్వతుల తాండవ, లాస్య పద్ధతులను అర్ధ నారీశ్వరుడివలె తన నృత్య యాత్రలో పునరుద్ధరించి పునః సృష్టిచేసిన పుణ్యమూర్తి. మనిషి, ఎక్కడపుట్టి పెరిగినా, తన దేశానికి తన ప్రాంతానికి ఏమి చేసాడనేది ముఖ్యం. ఆ కోణంలో చూసినట్లయితే రామకృష్ణగారు నృత్యకళా ప్రపంచంలో ప్రథమ వ్యక్తి అని చెప్పవచ్చు.

తెలుగువారి స్త్రీల లాస్య నర్తనరీతులను "ఆంధ్ర నాట్యం"గా, పురుషుల పౌరుషేయ వీరరరస ప్రధాన్య 'పేరిణి'ని పునరుద్ధరించి ప్రచారంలోకి తెచ్చి ప్రపంచ నృత్య కళాచరిత్రలో శిఖరాగ్రాన్ని చేరుకున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే తెలుగువారి నృత్య కళా విధానాన్ని ప్రపంచానికి ఎలుగెత్తి చాటిన నాట్యకళా వైతాళికులు డా॥ నటరాజుగారు.

**బాల్యం గురించి**

పుట్టింది బాలీ ద్వీపంలో అయినా బాల్యం అంతా సికింద్రాబాదు వారాసిగూడలోనే గడిచింది. కారణం తండ్రి

రైల్వే అధికారి కావడం. 3వ ఏటనే తల్లిని కోల్పోయిన రామకృష్ణ, తండ్రి, ఆయాల పెంపకములో పెరిగారు. తండ్రిగారు రామకృష్ణ పరమహంస భక్తుడైనందున వారి పిల్లలకు రామకృష్ణ, శారద అని పేర్లు పెట్టుకున్నారు. ఏలోటు లేకుండా కుమారుడిని, కూతురిని పెంచి పెద్దచేసారు. రామకృష్ణ గారి తల్లి వరంగల్లు జిల్లా కొలనుపాక వాస్తవ్యురాలు. సంగీతంలో ప్రావీణ్యమున్న విదుషీమణి. తండ్రి తూర్పుగోదావరి జిల్లా రాజోలు వాస్తవ్యులు. ఉద్యోగ రీత్య తెలంగాణ ప్రాంతములో నున్నందున కొలనుపాక వాస్తవ్యురాలిని పెళ్లి చేసుకొని హైదరాబాదులోనే స్థిరపడి రామకృష్ణ మిషన్‌తో సంబంధ బాంధవ్యాలు ఏర్పరుచుకున్నారు.

బాల్యం నుండి రామకృష్ణ నృత్యం వైపు ఆసక్తి చూపుతున్నట్లు తెలుసుకొన్న తండ్రి మనం నాట్యం చెయ్యకూడదు మనం నాట్యకళా పోషకులం మాత్రమే అని హెచ్చరించారు. కాని రామకృష్ణగారు చాటు మాటున నృత్యకళాకారులను చూడడము, అనుకరించడము మొదలు పెట్టాడు. ఇవన్నీ సోదరి చూసి తండ్రికి ఫిర్యాదు చేసేది. ఆయన రామకృష్ణను దండించేవారు. అయినా పరిస్థితి యథా తథంగా ఉండేది.

**మద్రాసులో విద్యాభ్యాసము:**

ప్రాథమిక విద్యను సికింద్రాబాదులో ముగించి మాధ్యమిక విద్యకు మద్రాసు మైలాపూర్ రామకృష్ణ మఠానికి చెందిన స్కూలుకు కూతురు శారదను, రామకృష్ణను పంపించారు. కారణము క్రమశిక్షణ, ఆధ్యాత్మిక చింతన ఏర్పడి విద్యావంతులవుతారని. ఆ బాధ్యతను స్వామి శాశ్వతానందగారు స్వీకరించారు. రామకృష్ణను చూడగానే మరో వివేకానందుడు అవుతాడేమోనని ఆ ముఖ వర్చసు విశాల నేత్రాలను చూసి ఆశపడ్డారు స్వామి శాశ్వతానంద. (ఆయనను నేను చూసాను) ఆ మఠ గ్రంథాలయములోనే ఆధ్యాత్మిక ఆగమ గ్రంథాలను చదివి నాట్యకళలో అభిరుచిని పెంపొందించుకున్నారు. నాట్యాన్ని అభ్యసించాలని మీనాక్షి సుందరం పిళ్ళై వద్ద శిష్యునిగా చేరి భరత నాట్యం నేర్చుకున్నారు. నాట్యంపైగల అభిరుచిని ఆసక్తిని చూసి స్వామిజీ సంతోషించేవారు. రామకృష్ణను ప్రత్యేకంగా చూసేవారు. ఈ విషయం తెలుసుకున్న తండ్రి బాధపడి ఎంత చెప్పినా వినడము లేదని ప్రహ్లాదుని హరినామ స్మరణవలె రామకృష్ణ నాట్య స్మరణ ఎక్కువైనదని భావించి ఎలాగైనా మాన్పించాలని నిశ్చయించుకొన్నాడు.

**నాగపూర్ - నటరాజ బిరుదు**

నాట్యం నుండి దృష్టి మరల్చాలనే ముఖ్య ఉద్దేశంతో ఉన్నత విద్యకొరకు నాగపూర్ పంపించడము జరిగినది. అక్కడ కూడా రామకృష్ణ మిషన్‌లో ఉండేవారు. రామకృష్ణగారు ఎట్టి పరిస్థితుల్లోను నాట్యం చేయడముగాని, నేర్చుకోవడము కాని జరుగకూడదని తండ్రిగారు గట్టిగా శాసించారు. అలా జరిగినట్లయితే నీకు నాకు మన కుటుంబముతో ఎలాంటి సంబంధముండదని హెచ్చరించారు. చివరికి ఎక్కడా మాపేరు కూడ ఉచ్చరించరాదని బెదిరించారు. తండ్రిగారి మాటకాదనలేక నాట్యకళపైనున్న మమకారం చంపుకోలేక ఏకాంతంగా ఎన్నోసార్లు దుఃఖించారట. అది చూసి స్వామిజీలు ఓదార్చేవారట. (ఇది స్వామి స్వరూపానంద గారి నుండి నేనువిన్న విషయం).

పట్టువీడని విక్రమార్కునివలె తండ్రి నెదిరించి నాట్యకళపై మొగ్గు చూపుతూ విద్యలో కూడ ప్రథమ శ్రేణి నందుకున్నారు. యూనివర్శిటిలో బి.ఎ. చదువుతూ ఆ ప్రాంతముననున్న గురువులు సిద్ధాజీ, చంపాబాయిల వద్ద కథక్, టుమ్రీ, గజల్స్‌కు అభినయం నేర్చుకొన్నారు. అప్పటికే నాయుడుపేట రాజమ్మవద్ద అభినయం నేర్చుకొన్నందున కొంత సులభతరమైంది.

అదే సమయములో రామకృష్ణ మఠం వదిలి వేయడం తండ్రి సహాయాన్ని నిరాకరించడము రామకృష్ణకు ఆహారము సరిగా లేక బీదరికం ప్రారంభమైనది. బీదరికాన్ని ఆకలిని అధిగమించి నృత్య సాధన చేసి అందరిచే శభాష్ అనిపించుకున్నారు. నృత్య కళపై నున్న ఆసక్తిని గమనించి స్థానికులు తెలుగువారు సహాయ సహకారాలు అందించి నృత్య కళాసాధనకు తోడ్పడ్డారు.

నాట్య కళా ప్రదర్శనలు, నాట్యకళలో కృషి, ఆ కళాసక్తిని వారి ద్వారా, వీరి ద్వార తెలుసుకున్న బండారు సంస్థానాధీశులు శ్రీ గణపతిరావు పాండేగారు రామకృష్ణ స్నేహితులు రాంభావ్ సర్‌దేశ్ గారి ద్వారా ఆహ్వానాన్ని పంపి రామకృష్ణ నృత్య ప్రదర్శనను ఏర్పాటు చేసారు. అప్పటికే ఆ ఆస్థానంలో రామ్‌గఢ్‌కు చెందిన ఆస్థాన నర్తకులు

కళ్యాణ్‌జీ కార్తిక్‌లు నృత్య ప్రదర్శనలిచ్చి ప్రశంసలందు కున్నారు.

ఎంతో మంది సంగీత విజ్ఞులు, నాట్యకళాకారులున్న ఆ సంస్థానంలో ప్రదర్శించడము ఒక ప్రక్క సంతోషంగా ఉన్న మరో ప్రక్కన సవాలుగా మిగిలింది. రాంభావ్ కృష్ణగీతాన్ని హిందీలో ఆలపిస్తుండగా రామకృష్ణ మైమరిచి నృత్య, అభినయాలను తాళ,లయలకు పోటీగా నర్తిస్తుంటే చూసే ప్రేక్షకులు పండితులు పరవశించిపోయారు. తన్మయత్వంతో ఆనందముతో మైమరచిపోయి రాజుగారు లేచి వారెవాహ్ 'నటరాజ్' అని ఆలింగనం చేసుకొన్నారట. నాటి నుండి రామకృష్ణ 'నటరాజ రామకృష్ణ' అయ్యారు.

తండ్రిగారు ఇంటిపేరు కూడ చెప్పకూడదని చెప్పడం వల్ల ఆ నటరాజు బిరుదే ఇంటిపేరుగా పెట్టుకున్నారు.

అప్పటి వరకూ ఆర్థిక బాధలతో అర్థాకలితో గడిపిన జీవితానికి ఆర్థికంగా నిలదొక్కుకున్నాడు. ఆనాటి నుండి నటరాజుగారు నాట్యకళను ఒక దీక్షగా, పట్టుదలగా, ఆలోచనగా, తపనగా తన జీవన గమనమే నాట్యకళా యాత్రగా సాగించారు.

**నెల్లూరు, గుంటూరు, విశాఖపట్టణంలో నృత్య కళా ప్రచారం**

తెలుగువారి నృత్య కళలు, చరిత్ర, సంస్కృతి గొప్ప తనాన్ని తెలుగు ప్రాంత ప్రజలకు ప్రచారం చేసే ఉద్దేశంతో నాగపూర్ వదలి ముందుగా నెల్లూరు చేరుకున్నారు. అందుకు సహకరించిన పెద్దలు శ్రీ రమణారెడ్డిగారు (సినీనటులు). రెడ్డిగారు ఆశ్రయాన్నిచ్చి, పెద్దలను పరిచయం చేసి నృత్య సంస్థ స్థాపించడానికి సహకరించారు. అప్పటి వరకు ఉన్నత కుటుంబాల బాలికలు, నృత్యం నేర్చుకోవడము తప్పుగా భావించిన పిల్లలను ఆ సంస్థలో చేర్చి నృత్యం నేర్పడము ప్రారంభించారు.

ఆ సంస్థ నుండే శ్యామకౌండిన్య అనే నర్తకి అనేక ప్రదర్శనలిచ్చి నాట్య కళా ప్రచారానికి నటరాజ రామకృష్ణగారికి సహకరించింది. ఒకవైపు శిక్షణ, మరొక వైపు పాఠశాలల్లో, కళాశాలల్లో ప్రదర్శనా పూర్వక ప్రసంగాలతో అటు విద్యార్థులకు ఇటు ప్రజలకు అవగాహన కల్పించారు. వారి కృషిని ప్రచారాన్ని చూసిన పలువురు ప్రశంసించగా "జమీన్", "ఆంధ్రప్రభ", "ఆంధ్రపత్రిక"లవారు నటరాజుగారు వ్రాసిన వ్యాసాలను ప్రచురించసాగాయి.

రామకృష్ణగారు నాగపూర్‌లో ఉన్నప్పుడే నాట్యకళ గురించి 'నృత్యాంజలి' అనే పేరుతో వ్యాసాలు వ్రాసి ఆంధ్రప్రభ పత్రికలకు పంపేవారు. ఆ వ్యాసాలతో తెలుగువారి నృత్యకళపై ఆదరణ గౌరవము పెరిగి ప్రతివారు వారి పిల్లలకు నృత్యం నేర్పించాలని నిర్ణయించుకున్నారు.

నృత్యకళ గురించి వ్యాసాలు వ్రాయడం గాని, ప్రదర్శన పూర్వక ప్రసంగాలు చేసేవారుగాని లేనందున నటరాజుగారికి మంచి పేరు ప్రఖ్యాతలు వచ్చాయి. సరళమైన భాష చదువరులను ఇట్టే ఆకర్షించే వ్యాసాల తీరును చూసిన అప్పటి ఆంధ్రప్రభ సంపాదకులు నార్ల వెంకటేశ్వర్లుగారు ఆశ్చర్యపోయి మెచ్చుకొన్నారట. వారి మేనమామ గుంటూరులో నివసించేవారు. విషయం తెలుసుకొన్న వారి మేనమామ గుంటూరుకు ఆహ్వానించి వారి పిల్లలకు నాట్యం నేర్పమన్నారట. ఆ విధంగా మకాం నెల్లూరు నుండి గుంటూరు మార్చుకొన్నారు రామకృష్ణగారు. అచ్చట కొంత కాలం ప్రచారం, శిక్షణనిస్తున్న సమయంలో విశాఖ పట్టణం సంగీత సభవారు నృత్య ప్రదర్శన ఇవ్వమని ఆహ్వానించారు. ఆ ప్రదర్శనకు ప్రముఖులందరూ హాజరయ్యారు. ముఖ్యంగా ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు కృష్ణన్‌గారు, తెన్నేటి విశ్వనాథంగారు. ఆ ప్రదర్శన చూసిన పెద్దలు, పండితులు, నాట్యాభిమానులు ప్రశంసించి విశాఖ పట్టణంలో నృత్య కళా ప్రచారము చేయమని తద్వారా నాట్యకళ నలుమూలలా ప్రచారం అవుతుందని సలహానిచ్చారు. వడ్డాది బాపిరాజు గారు కూడ అదే విషయం చెప్పి వారింట్లోనే వారి తమ్ముడు కూతురుకు శిక్షణ నివ్వమని అడిగారు. వారే నేటి ప్రఖ్యాత నృత్యకళాకారులు గురువులు ఉమారామారావు. సుమతీ కౌశల్. సినీనటి చంద్రకళ కూడ నటరాజరామకృష్ణ వారి వద్ద నృత్యం నేర్చుకున్నారు.

వారు విశాఖపట్టణంలో ఉన్నపుడే ప్రఖ్యాత కూచిపూడి నాట్యగురువు వేదాంత లక్ష్మీనారాయణ శాస్త్రిగారి వద్ద కూచిపూడి, పెండేల సత్యభామగారివద్ద నవజనార్దనము అభ్యసించారు. విశాఖలో నున్నపుడే బొబ్బిలి, మాడుగుల విజయనగర సంస్థానాలను సందర్శించి అచ్చటనున్న సంగీత నృత్యకళలను కళాకరులను కలుసుకొన్నారు. వారి అనుభవాలు, సంప్రదాయ పద్ధతులు శాస్త్రం గురించి తెలుసుకొని వాటి గురించి ప్రసంగాల్లో ప్రస్తావించేవారు.

బడే వెంకటరత్నం, జీవరత్నమ్మ కళావరురింగు

మద్దెలరాయుడు గంధం లక్ష్మీకాంతము మొదలగు ఆరాధన ఆస్థాన నర్తకీమణులను కలిసి వారి నృత్య విశేషాలను, ఆలయ, ఆస్థాన పారిజాత సంపూర్ణ నృత్య స్వరూపము తెలుసుకొని గ్రంథస్తము చేసారు. కన్యాకుమారి నుండి కాశ్మీరు వరకు పర్యటించి వివిధ నృత్య సంప్రదాయాలను చూసి, విషయసేకరణ చేసి, కొన్ని నేర్చుకొని నాట్యంపై దాదాపు 40 పుస్తకములు వ్రాసారు. అందులో కొన్ని కేంద్ర ప్రభుత్వ బహుమతులు కూడ గెలుచుకున్నారు. ముఖ్యమైనవి దాక్షిణాత్యుల నాట్యకళా చరిత్ర, డాన్సింగ్ బెల్స్ (తెలుగు అనువాదము నర్తనబాల).

విస్సా అప్పారావుగారి పరిచయముతో క్షేత్రయ్య పదాల అభినయం ప్రదర్శనలు, పరిశోధనలు చేసారు. వారితో ప్రయాణించి ఇతర రాష్ట్రాలల్లోని పండిత సభల్లో పాల్గొన్నారు. ప్రతి అంశానికి సంప్రదాయ వ్యాఖ్యానం వ్రాసుకొని అలవోకగా పండితులను పామరులను మెప్పించేవారు.

**హైదరాబాదులో స్థిరనివాసము - తెలంగాణ ప్రాంతంలో నృత్యకళాసేవ:**

హైదరాబాదులో నివాస మేర్పరచుకొన్న తరువాత ఉమారామారావు, సుమతీ కౌశల్‌తో పాటు ఎందరో నృత్య కళను నేర్చుకొని ప్రదర్శనలిచ్చారు. హైదరాబాదులో ఎ.ఆర్. కృష్ణగారు, శ్రీనివాసాచార్యులవారు, గోపాల్ రాజు, భట్, మొదలయిన నాటక, కళాకారులతో పరిచయం ఏర్పడింది. ఆలంపూర్‌లో జరిగిన సాహిత్య సారస్వత సభల్లో నటరాజుగారిని నాట్యంపై ప్రసంగించమని కోరారు. ప్రసంగానంతరము పెద్దలందరూ తెలుగువారికి, తెలుగు నాట్యానికి గర్వించదగ్గ వ్యక్తి రామకృష్ణగారని పొగిడారు. ఎ.ఆర్. కృష్ణగారితో కలిసి తెలంగాణ ప్రాంతాన్నంతటనీ సందర్శించి సంగీత నృత్య సంప్రదాయాల గురించి తెలుసుకొన్నారు. ఇతర తెలుగు ప్రాంతాలకంటే తెలంగాణ ప్రాంతం కళలకు వెనుక బడినదని గ్రహించారు.

ఉత్తమ కళాకారులు, కళాసంపద, చరిత్ర, శిల్పకళ సంగీత నృత్యకళాకారులున్నప్పటికి ఆదరణ, పోషణ లేక కళాకారులు, కళారీతులు మరుగున పడ్డాయని తెలుసు కొన్నారు. ముఖ్యకారణం ఆనాటి దేవదాసి చట్టం. సమాజంలో జమీందారులు, దొరలు, సామంతులు ఆ కళాకారులను వారి అవసరాలకు ఉపయోగించుకొని చిన్న చూపు చూడడం. ఇతర తెలుగు ప్రాంత స్త్రీ నర్తకులవలె తెలంగాణ స్త్రీ నర్తకులు సాహసించక పోషకుల ఆధీనులయి అవమానింపబడ్డారు. అదే తెలంగాణ సంగీత నృత్యకళలు క్షీణించడానికి కారణము. ఈ పరిస్థితులకు చేయూత నివ్వాలని ఆనాటి సంగీత నాటక అకాడమీ సహాయాన్ని కోరారు.

వారి నృత్య నికేతనంలో చేరిన వారిలో కొందరికి ఉచితంగా కూడా నృత్యం నేర్పించేవారు. శ్రీనివాసకళ్యాణం కుమార సంభవం, మేఘ సందేశం వంటి నృత్య నాటికలను తయారు చేయుటకు సంగీత నాట్యకళాకారులను వివిధ ప్రాంతాల నుండి రప్పించి భోజన, వసతులిచ్చి ఎన్నో ప్రదర్శనలిచ్చారు. అందులో ఉజ్జయినిలో జరిగిన ప్రదర్శనకు కుమార సంభవానికి బంగారు కలశం బహుమతిగా గెలుచుకొన్నారు.

తెలంగాణ, ఆంధ్ర, రాయలసీమ, కోనసీమ, తూర్పు ప్రాంతాలను పర్యటించి, పరిశోధన చేసి మరుగున పడిన ఎన్నో నృత్య రీతులను వెలికి తీసి ప్రచారములోకి తెచ్చారు.

దాదాపు 250 నుండి 300 మంది స్త్రీ నర్తకులను తెలుగు ప్రాంతములో కలుసుకొని సంప్రదాయ పద్ధతులను తెలుసుకొని గ్రంథస్థము చేసారు. దేవదాసీలు రాజదాసీల నాట్య విరమణతో వారి విశిష్ట కళ మరుగున పడకూడదని కొత్త పోకడలతో నవీన రంగ స్థలముపై ప్రదర్శించే ఒక క్రమాన్ని ఏర్పాటు చేసారు. హైదరాబాదు అల్వాలు వెంకటేశ్వర ఆలయ నర్తనరీతులు నర్తకీమణులను, వర్గల్ ఆలయ నర్తకీమణి రమామణి మొదలుకొని ధర్మపురి, పెద్దపల్లి, నిజామాబాదు, మానకొండూరు, ఇల్లంతకుంట, గద్వాల, వనపర్తి, జటప్రోలు, మహబూబ్‌నగర్, శ్రీరంగాపురం, నల్లగొండ, వరంగల్లు, ఆదిలాబాదు మొదలగు ప్రాంతాల్లో నున్న స్త్రీల నర్తనరీతులను, ఆంధ్ర, రాయలసీమల్లో నున్న నర్తనరీతులను ఒకే తాటిపైకి తెచ్చి వివిధ పేర్లతో పిలువబడుచున్న ఆ నృత్య కళలకు ఆంధ్ర నాట్యమనే నవీన నామకరణం చేసారు. ఇది 1970లో జరిగింది. అప్పటికి తెలుగువారందరు ఒకే రాష్ట్రంలో నున్నారు. ఈ సదస్సులకు, కార్యక్రమాలకు కంకణం కట్టుకున్న వారిలో ముఖ్యులు అన్నాబత్తుల బులి వెంకటరత్నమ్మ, ప్రముఖ నృత్య కళాకారిణి, ముమ్మిడివరం వాస్తవ్యులు, గొల్లకలాపం ప్రదర్శించుటలో ప్రసిద్ధురాలు.

**పేరిణి తాండవము:**

బాల్యమంతా భాగ్యనగరంలో గడిచింది. కొన్నేళ్ళ తరువాత హైదరాబాదులో స్థిరనివాసం ఏర్పరచుకొన్నారు.

తల్లిగారి జన్మస్థలం కొలను పాక. తెలుగువారి ఇతర ప్రాంతాలకంటె తెలంగాణ ప్రాంతమంటేనే ఇష్టం. తరుచు కొలనుపాక వెళ్ళి శివాలయంలో పూజలు చేసి దాన ధర్మాలు చేసేవారు (నేను వారితో పాటు వెళ్ళేవాణ్ణి).

ఆయన నృత్యకళా పరిశోధనలో, ఎందరో సంగీతజ్ఞులను, వాద్యకాండ్రను, నృత్యకళాకారులను సందర్శించినప్పటికీ ఇంకా ఏదో అసంతృప్తి ఉండేదట. ఎవరూ చేయనిది, చరిత్రలో చిరస్థాయిగా నిలిచేది రూపకల్పన చేసి భారతీయ నృత్యకళకు అంకితమివ్వాలని నిశ్చయించుకొన్నారు. ఆ పరిశోధన ఫలితమే పేరిణి పునఃసృష్టి. మగవారిలోని మగటిమిని, పురుషుడు పురుషునిగానే నర్తించే వీరరస ప్రాధాన్య పేరిణిని రూపకల్పన చేయాలని, అది అన్ని నాట్యప్రక్రియల కన్నా భిన్నంగా ఉండాలని ఆలోచించి లభ్యంగా నున్న నాట్యశాస్త్ర గ్రంథాలను, నాట్యానికి సంబంధమున్న ఇతర శిల్పకళ, చిత్రకళ, సాహిత్యాన్ని అవపోసన పట్టి పూర్తిగా మరుగునపడి ఆనవాలు కూడ లేని పేరిణిని 1973న పునఃసృష్టి చేసి ప్రజల ముందుంచారు. ప్రశంసలున్న చోట విమర్శలున్న పట్టించుకోకుండా అప్పటి ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ, నృత్య అకాడమీల సహాయంతో నాట్య కళాకారులను వాయిద్య కళాకారులను తయారు చేసి దేశమంతా శభాష్ అనే విధంగా ప్రచారం చేసారు. తెలుగు వారి పౌరుషేయనృత్యం అంటే 'పేరిణి' అనుకునేలా చేసారు. ప్రపంచ నృత్య కళలోనే ఇది కలికితురాయిలాంటిది. అది తెలంగాణ ప్రాంతములో రూపకల్పన జరిగినందున ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం దానికి ప్రాముఖ్యతనిచ్చి ప్రచారము చేస్తున్నది. కొన్ని మార్పులు చేసి నిపుణులను సంప్రదించి ఒక శాస్త్రీయ నృత్యకళకుండవలసిన సూత్రాలను జోడించి ఈ రాష్ట్ర నృత్యకళగా భవిష్యత్తరానికి అందించాలని భావిస్తుంది. అది జరిగిననాడు నటరాజుకు నిజమైన శాశ్వతమైన గుర్తింపు లభించినట్లవుతుంది.

**తారామతి ప్రేమావతి– వారి సంగీత నృత్యకళ పరిశోధన:**

నిజాం పరిపాలనలో ఎందరో నృత్య సంగీత కళాకారులు వారి భాషలో ఆడి పాడి మెప్పించి ఒప్పించారు. కుతుబ్‌షాహి కాలంలో ప్రముఖ నర్తకులుగానున్న తారామతి, ప్రేమావతులు ముఖ్యులు. క్షేత్రయ్య గోలుకొండ కోటను సందర్శించినపుడు ఈ నర్తకీమణులు నాట్యం చేసేవారట. వారెంతటి గొప్ప కళాకారులు కాకపోతే కుతుబ్‌షాహీల సమాధి ప్రక్కల సమాధి కట్టిస్తారు. వారి పేరుమీద గ్రామాలు ఇస్తారు! వారి పేరు మీద చారిత్రక కట్టడాలు కట్టిస్తారు! వారి సంగీత నృత్యకళలను ప్రపంచానికి తెలియజేయడానికి హిందు ముస్లిం ఐకమత్యాన్ని తెలిపేందుకు చిహ్నాలైన తారామతి బారామతి ప్రేమావతి మందిరాలను దర్శించి పాతబడి కూలిపోతున్న దశలో వున్నవాటిని వారి స్వంత ధనాన్ని ఖర్చు చేసి శుభ్ర పరచి వాటి విలువను, ఆనాటి సంగీత సంప్రదాయాలను వ్యాసాలుగా చిన్న పుస్తకాలుగా ప్రచురించి అటు ప్రభుత్వానికి ఇటు ప్రజలకు వాటి విలువను ఆ కళామూర్తుల గౌరవాన్ని తెలియచేసారు. దాదాపు 8 సం॥లు కష్టపడిన తరువాత ప్రభుత్వము వారు పట్టించుకొని తారామతి బారాదరిని కొత్త అందాలతో టూరిస్టులను ఆకర్షించే విధంగా నేడు రూపుదిద్దారు. ఇదంతా నటరాజ రామకృష్ణ కృషి పరిశోధనా ఫలితమే. కుతుబ్‌షాహిల తరువాత ఆ కట్టడాల గురించి, పవిత్రత గురించి ప్రచారములోకి తెచ్చింది కేవలము నటరాజ రామకృష్ణగారే. దానికి ప్రతిఫలంగా ఆయన ప్రభుత్వం నుండి చిల్లిగవ్వకూడా ఆశించలేదు. తండ్రి ఆస్తిపాస్తులనే ఆశించని ఆయన ఇతరుల నుండి ఏమి ఆశిస్తారు. అందుకే చాలా మంది నీవు సాధువులాంటివాడవని అనేవారు.

ఆయన నృత్యకళకు చేసిన సేవలో లెక్కలేనన్ని సన్మానాలు, సత్కారాలు, అవార్డులు, రివార్డులు, గౌరవ డాక్టరేటులు, రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల గుర్తింపులు బంగారు కిరీటాలు మొదలగునవెన్నో ఎన్నెన్నో. కాని మదర్ థెరిసా చేతుల మీద సన్మానము పొందినపుడు నా జీవితానికి ఇది పెద్ద కిరీటమని సంతోషించారు.

తెలంగాణ ప్రాంత మారుమూల గ్రామానికి చెందిన నన్ను చేరదీసి రాయిలా ఉన్న నన్ను నృత్యరత్నంలా మలిచి ప్రపంచ స్థాయిలో గుర్తింపు నిప్పించారు. తల్లిదండ్రులు జన్మనిస్తే గురువుగా జీవితాన్నిచ్చారు. తల్లిలా ప్రేమగాలాలించి, తండ్రిలా క్రమశిక్షణ నేర్పి గురువుగా విద్యా బుద్దులు చెప్పించి గురువు అనే పదానికి నిర్వచనమయ్యారు. 35 సం॥ల వారి శిష్యరికంలో ఎప్పుడూ ఎవరికీ దక్కని అదృష్టం నాకు దక్కింది. అదే ఆయన అంతిమ సంస్కారాలు నిర్వహించడము. నా ఈ జీవితానికి అది చాలు.

# 98 నెల్లూరి కేశవస్వామి

– డా॥ పత్తిపాక మోహన్

నెల్లూరి కేశవస్వామి స్వాతంత్ర్యానంతర తెలంగాణ కథకుల్లో ఒకరు. అయితే అందరూ తెలంగాణ కథకుల్లాగే వందల కథలు రాసినా ఎన్నో దొరక్కుండా పోయాయి. అదృష్టమేమిటంటే ఆయన 1969లో, 1981లో కొన్ని కథలనైనా కథా సంపుటాలుగా వెలువరించడం వల్ల తెలుగు సాహిత్యానికి కొన్ని మాత్రం దక్కాయి. చాలామంది రచయితలు రాసినా స్వంత పత్రికలు లేకపోవడంతో రాసింది అచ్చుకావడం తక్కువ. అచ్చయినవి పుస్తకాల రూపంలో తేవడం తక్కువ. అలా వందలాది కథలు సాహిత్య చరిత్రలో యువతరాలకు అందకుండా పోయాయి.

1902 నుంచి ప్రారంభమైన తెలంగాణ కథ సామాజిక పరిణామాలను చిత్రిస్తూ వస్తున్నది. బండారు అచ్చమాంబ తొలి కథకురాలని చరిత్ర స్పష్టంచేసింది. కొమర్రాజు వెంకట లక్ష్మణరావు, మాడపాటి హనుమంతరావు 1910 నుంచి కథలు రాశారు. ఆ సమయంలోనే ఎనభై మందికి పైగా ప్రసిద్ధ కథకులు తెలంగాణ కథను సుసంపన్నం చేశారు. ఈ సంఖ్య 1956 నవంబర్‌లో తెలంగాణ–ఆంధ్రరాష్ట్రం ఏకమయ్యాక ఎదిగిన రచయితల సంఖ్య వందలాదిగా ఉంది. నేటి రచయితల సంఖ్య గణించడం కూడా కష్టమే. కారణం.. ఇన్నాళ్ల తెలంగాణ సాహిత్య సంస్కృతుల వికాసం వ్యాప్తిలో ఐకాన్‌గా నిలిచింది. ఈ సందర్భంగా ఒకచోట ప్రముఖ కథకులు, విమర్శకులు బి.ఎస్.రాములుగారన్నట్లు 'తెలంగాణ కథ భారతీయ సాహిత్యంలో ప్రేమ్‌చంద్, కిషన్ చందర్, రాహుల్ సాంకృత్యాయన్‌ల వారసత్వాన్ని పుణికి పుచ్చుకొని ముందుకు సాగుతున్నది' అన్నది అక్షరాల సత్యాలు. మిగులు సమయం, మిగులు ధనం ఉన్న ప్రాంతాల్లోని రచయితల్లాగా కాకుండా తెలంగాణలోని మెజార్టీ రచయితలు ప్రజల పక్షం వహించి రాయడం ఒక గొప్ప విశేషం. మార్కెట్ కోసం గానీ, తాత్కాలిక శృంగారం, ప్రేమ, సెక్స్, భయానక, డిటెక్టివ్, హారర్, కాలక్షేప, వ్యాపార రచనలు తెలంగాణ ప్రాంతం నుంచి తక్కువ అని చెప్పారు.

ప్రజల పక్షం వహించి రాసిన రచయితల్లో హైదరాబాద్‌లో పుట్టి పెరిగి, ఇక్కడి జీవితాలను చిత్రించిన కథకులు నెల్లూరు కేశవస్వామి. నిజాం కాలేజీలో డిగ్రీ చదివి ఉస్మానియా యూనివర్సిటీలో ఇంజినీర్‌గా పట్టభద్రుడై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ నీటిపారుదల శాఖలో ఇంజినీరింగ్ పనిచేసి రిటైరయ్యారు. నాగార్జున సాగర్ డ్యాం నిర్మాణంలో ఇంజినీర్‌గా భాగం పంచుకున్నారు. పదవీ విరమణ వరకూ అక్కడే పనిచేశారు. ఆ సమయంలో వారితో కలిసి పనిచేసిన బాలసాహితీవేత్త, కథకులు వాణిశ్రీ ఆ రోజులను జ్ఞాపకం చేస్తూ ఆ రోజుల్లో నాగార్జున సాగరం వీరివల్ల సాహిత్య సాగరమైంది అంటారు. కేశవస్వామి హైదరాబాద్‌లో నివసిస్తూ తెలంగాణ జీవితాలను, సంస్కృతిని తెలుగులో చిత్రించిన రచయిత.

హైదరాబాద్ రాజ్యం స్వాతంత్ర్యానికి పూర్వం ఒక ప్రత్యేక దేశంగా, రాజ్యంగా సొంత కరెన్సీని, సైన్యాన్ని కలిగి ఉంటూ ఐక్యరాజ్య సమితిలో సభ్యదేశం. 50 దేశాల్లో తన రాయబారులను నియమించుకొని సాగిన స్వతంత్ర రాజ్యం. 17 సెప్టెంబర్ 1948లో పోలీస్ యాక్షన్ అనే పేరుతో సైనికచర్య ద్వారా ఇండియన్ యూనియన్ హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ హైదరాబాద్ రాజ్యాన్ని ఇండియన్ యూనియన్‌లో విలీనం చేశారు. 13 సెప్టెంబర్, 1948న హైదరాబాద్ రాజ్యంలోకి ఇండియన్ యూనియన్ సైన్యాలు ప్రవేశించాయి. 17 సెప్టెంబర్, 1948న నిజాం రాజు లొంగిపోయినట్టు ప్రకటించడం, ఇండియన్ యూనియన్‌లో విలీనమైనట్టు సర్దార్ వల్లభాయ్ పటేల్ ప్రకటించడం, ఒప్పందాలు కుదుర్చుకోవడం జరిగింది. అయితే ఈ చారిత్రక, సామాజిక పరిణామాలను సంక్షుభిత సమాజాన్ని, మానసిక సంఘర్షణను కథల రూపంలో నిక్షిప్తం చేసిన వారు చాలా తక్కువమంది కనిపిస్తారు. అయితే ఈ సామాజిక పరిణామాలకు సాహిత్యరూపం ఇచ్చి, సామాజిక, చరిత్ర రచన చేసిన కథకులు నెల్లూరి కేశవస్వామి. ఒక్కమాటలో చెప్పాలంటే వీరి చార్మినార్ కథలు హైదరాబాద్ రాజ్యం చరిత్రను, సంస్కృతిని, మానవ సంబంధాలను, ముస్లింల జీవితాలను అపూర్వంగా చిత్రించిన డాక్యుమెంటరీ చిత్రాలు.

నెల్లూరి కేశవస్వామి చాలా కథలు రాశారు. తొలి సంపుటి 'పసిడి బొమ్మ' ఆగస్టు 1969లో వెలువడింది. ప్రసిద్ధ తెలంగాణ రచయిత భాస్కరభట్ల కృష్ణారావుకు అంకితం ఇవ్వబడింది. ఇందులోని కథలు రచయిత ప్రారంభ దశను తెలపడంతో పాటు.. క్రమంగా రచయితగా ఎదిగిన క్రమాన్ని స్పష్టంచేస్తాయి. ముందుమాటలో కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యులుగా పనిచేసిన పోతుకూచి సాంబశివరావు ఇలా పేర్కొన్నారు.

'తెలుగు కథా సాహిత్యంలో రమణీయమైన పోకడలు కల్పించిన ప్రసిద్ధ రచయితల కోవలోకి చెందిన వారు శ్రీ నెల్లూరి కేశవస్వామి. తెలంగాణలో సాధన సమితి సాధించిన సాహిత్య కృషికి శ్రీ కేశవస్వామి మూలస్తంభాలలో ఒకరు. కథా గమనం, నాటక ప్రదర్శన రక్తికట్టేలా కలం మలచడంలో కేశవస్వామి తనకు తానే సాటి అని నిర్భయంగా చెప్పవచ్చు. ఈ కథల సంపుటిలో 'పసిడి బొమ్మ', 'అలవాటు' 'అభిమానం' 'పాలపొంగు' 'పరీక్ష' 'అక్కయ్యపెళ్లి' కథలున్నాయి. పరిసర సమాజ వాతావరణం క్షుణ్ణంగా పరిశీలించి మానసిక అంతర్గత భావాలు తరచి చూసిన వివిధ దృక్కోణాల్లో ఈ కథలు ప్రస్ఫుటమవుతున్నాయి. కథల కంటే కొన్ని గల్పికలు మరపురాని వ్యంగ్యం, హాస్యం, చమత్కారం సమ్మిళితమై అలరారుతున్నాయి.

'పసిడిబొమ్మ' కథలో నిరుద్యోగం మగవాళ్లను కేవలం నిరుద్యోగులుగా మిగిల్చితే మహిళలను వేశ్యగా మారాల్సిన అనివార్యతను ఎలా ముందుకు తెచ్చిందో అందుకు వారిలోని అశక్తత, పిరికితనాలు ఎలా కారణమో వివరిస్తుంది. శంకరంతో, రాజారావు లేచిపోయిన విషయం ఎవరో గుర్తు చేయడంతో కథ ప్రారంభమవుతుంది. ఆర్టిస్టు రామారావు ఒక పసిడిబొమ్మతో కలిసి లేచిపోయాడు. అకస్మాత్తుగా రాజారావు ఇల్లు విడిచి వదిలిపోతూ ఉత్తరం రాసి పెట్టిపోయాడు. రాజారావు గురించీ, ఆయన భార్య గురించీ ఆలోచిస్తూ శంకరం ఒకసారి వారింటికి వెళ్లిన చిరునామా ననుసరించి వెళ్తే రాజారావు అప్పటికే ఇల్లు వదిలి వెళ్లిపోయాడని ఆయన భార్య చెప్పింది. ఒంటరి స్త్రీని అలా వదిలి వెళ్లడం తప్పని అనుకున్నాడు శంకరం. తిండికి కటకటతో ఆమె విధిలేక వ్యభిచారం చేస్తోందని అతనికి అర్థమవుతుంది. చివరకు ఆమె అతనికి ముఖం చూపించలేక ఇల్లు వదిలి వెళ్లిపోతుంది. ఇదీ కథ. 1960ల సామాజిక పరిణామాలు, నిరుద్యోగుల స్థితుల్ని చిత్రించారు రచయిత.

కార్మికవర్గ చైతన్యం ఎక్కడ ఉన్నా ఆ చైతన్యం పరిమళిస్తూనే ఉంటుంది. అది వ్యక్తిత్వంలో, జీవితంలో ఒక 'అలవాటు'గా మారుతుంది. ఈ కథలో ఇద్దరు మిత్రులు కాలక్రమంలో చెరోదారి పడతారు. ఒకరు కార్మిక నాయకుడుగా, మరొకరు వారినదుపు చేసే యాజమాన్యంలో భాగంగా మారతారు. సూరి అధికారిగా ఉంటాడు. ఆయన మిత్రుడు గోపి ఆరోగ్యం బాగు చేసుకోవడానికి తప్పకుండా విశ్రాంతి తీసుకోవాల్సిందేనని డాక్టర్లు చెబుతారు. పాత స్నేహితున్ని ఆరేళ్ల తర్వాత కలుసుకోవడానికి సూరి దగ్గరకు ఈ సందర్భంగా వెళతాడు. అక్కడ సూరి కింద పనిచేసే కూలి చనిపోతాడు. కూలీలు, అతని భార్యాపిల్లలు నష్టపరిహారం కోసం అడుగుతారు. దాన్ని సూరి వ్యతిరేకిస్తాడు. గోపి సూరీకి తెలియకుండా వారిని కలిసి

వారు ఎలా సమ్మె చేయాలో, ఎలా కోర్కెలు సాధించుకోవాలో ఉపదేశించి వస్తాడు. అంతదాకా అణిగిమణిగి ఉన్న కూలీలు సమ్మెకు పూనుకోవడం, గట్టిగా మాట్లాడటం ఎలా జరిగిందో సూరికి అర్థం కాదు. తర్వాత విషయం తెలుసుకుంటాడు. వెంటనే గోపికి రైల్వే టికెట్ అడ్వాన్స్ బుకింగ్ చేసుకొని తీసుకొస్తాడు. రేపు ప్రయాణమని చెబుతాడు. కథ ముగింపులో కొసమెరుపు ఉంటుంది. ఎవరి ప్రయాణానికి టిక్కెట్ తీసుకొచ్చాడో కథ చివరిలో తెలుస్తుంది. గోపి లాంటి వాడు తన వెంట ఉంటే తన పని అయినట్టే అని భావిస్తాడు. 'అలవాటు' కథ కార్మికవర్గ, పేదల పక్షపాతం జీవితంలో ఒక వ్యక్తిత్వంగా, అలవాటుగా మార్చుకున్న కార్యకర్తల గురించి రాసిన మంచి కథ.

'అభిమానం' కథలో అంటరానితనం తరతరాలుగా దళితుల్లో సృష్టించిన అభద్రతను, వ్యక్తిత్వ హత్యాకాండను ఆవిష్కరించింది. వెంకట్రావు దళితుడు. చిన్న ఉద్యోగం చేస్తూ పెద్ద ఉద్యోగం కోసం ఎదురు చూస్తుంటాడు. తాను దళితుడని ఎవరికీ తెలియకూడదని తెలిస్తే అవమానిస్తారని, చిన్నచూపు చూస్తారని సంకోచిస్తూ లోలోన బాధపడు తుంటాడు. కొన్నాళ్లకు హరిజనుల కోసం ప్రత్యేకించబడిన ఒక పోస్టు ప్రకటన చూసి అతని గుండెలు తీవ్రంగా కొట్టుకోసాగాయి. ఆ ప్రకటన 'రండి, ఈ ఆఫీసర్ పదవి స్వీకరించండి' అని ఆహ్వానిస్తున్నట్టుగా తోచింది. కానీ తాను దళితుడనని చిన్నప్పుడు హేళన చేసిన అవమానాలు, అనుభవాలు గుర్తుకువచ్చి స్నేహితులంటేనే హడలెత్తిపోయేది వెంకట్రావుకు. ఇలా ఎన్నో అంశాల్ని, అప్పుడప్పుడే ఎదుగుతున్న క్రమంలో సామాజిక పరిణామాలను, మనస్తత్వాన్ని చిత్రించిన చక్కని కథ ఇది.

ప్రభుత్వ ఉద్యోగం ఒక దాస్యం లాగా ఎలా ఉంటుందో ఆ క్రమాన్ని 'ప్రజ, ఉద్యోగి, మంత్రి' కథలో కాస్త వ్యంగ్యంగా చిత్రించారు కేశవస్వామి. మరో కథ 'పాలపొంగు' కథ స్వాతంత్ర్యానికి పూర్వం 1946లో 'భారతి'లో ప్రచురించ బడింది. స్వాతంత్ర్య పూర్వ జీవితాలను, పరిణామాలను ఈ కథ ప్రతిఫలించింది. మరో కథ 'అక్కయ్య పెళ్లి' కథ ఉత్తర ప్రత్యుత్తరాల రూపంలో, శైలి, శిల్పంలో రాయబడింది. 'అతిథి' కథలో పట్నంవాసులు చుట్టాల పేరిట, మిత్రుల పేరిట వచ్చే వారి భారాన్ని మోయలేని స్థితి వల్ల వారిని ఎలా వదిలించుకోవాలో చేసే రకరకాల ఉపాయాలను చక్కగా చిత్రించారు.

కథకులు కేశవస్వామి అనగానే గుర్తుకొచ్చేది 'చార్మినార్' కథల సంపుటి. ఇందులో విముక్తి, కన్నెరికం, రూహిఅఫ, షరీఫా, ప్రతీకారం, అదృష్టం, యుగాంతం, వంశాకురం, కేవలం మనుషులం, భరోసా, ఆఖరి కానుక అనే శీర్షికలతో 11 కథలున్నాయి. 1981లో మొదటి ముద్రణ వెలువడింది. జీవితాన్ని, సమాజాన్ని, మనుషులను పలు కోణాల్లో పరిశీలించి, విశ్లేషించిన ఈ కథలను ఆనాటి ప్రముఖ తెలంగాణ కథకుల్లో ఒకరైన డి.రామలింగం 'జలతారు మేలిముసుగు' పేరుతో రాసిన ముందుమాటలో ఇలా అంటారు.

'చార్మినార్' అనే పేరును బట్టే ఈ కథల విశిష్టత వ్యక్తమవుతోంది. గోల్కొండ రాజ్యాన్ని పరిపాలించిన మహ్మద్ కులీ కుతుబ్‌షా క్రీ.శ. 1591లో ఆ కట్టడం తదాదిగా నడిచిన చరిత్రకు, పెంపొందిన సంస్కృతికి, విలసిల్లిన నాగరికతకు సాక్షిగా నిలిచి ఉన్నది. సహనానికి, సభ్యతకు పేరుపడ్డ గోల్కొండ నవాబుల తరువాత, ఈ ప్రాంతం మొఘల్ చక్రవర్తుల ఆధీనమై.. మొఘల్ సామ్రాజ్య క్షీణదశలో అసఫ్ జాహీ వంశీయుల ఏలుబడి క్రిందికి వచ్చి ఎన్నెన్నో అనుభవాలు పొంది, 1948లో భారత యూనియన్‌లో విలీనమైంది. ఈ అనుభవాలన్నింటి మూలంగా ఈ ప్రాంతం పాతను కొంతమరిచి, ఏవేవో కొత్తవి తెచ్చుకుని ఒకానొక జీవన విధానాన్ని అలవరుచుకొని, దానికి రంగులు, రుచులు, వాసనలు చేర్చుకుని ఒకానొక సంస్కృతిని రూపొందించు కున్నది. అది పాలకుల సంస్కృతి, ప్రాభవము, ప్రాబల్యము గల వారి జీవన విధానం. అది నిస్సందేహంగా ఫ్యూడల్ సంస్కృతి. కొందరు దానిని ఆప్యాయంగా 'హైదరాబాదు సంస్కృతి' అని నేటికీ వ్యవహరిస్తున్నారు. ఆ సంస్కృతికి వారసులైన వారి జీవితాలలోని మంచిచెడ్డలకు సాహిత్య రూపమే 'చార్‌మీనార్' అని నామకరణం చేయబడ్డ ఈ కథా సంపుటి.

కేశవస్వామి సన్నిహిత మిత్రుల్లో ఒకరు, కథారచయిత గూడూరి సీతారాం నేషనల్ బుక్ ట్రస్ట్ కోసం నెల్లూరి కేశవస్వామి ఉత్తమ కథలను సంకలనం చేశారు. ఆయన కేశవస్వామి కథల్లో నవాబులు, దేవిడీలు, మహబూబ్ కి

మెహందీ, కోఠాలు, దివాన్ ఖానాలు, జనానా ఖానాలు, బేగం సాహెబాలు, దుల్హన్ పాషాలు, పాన్‌దాన్, పరాటా కీమా, దాల్చా, నమాజులు, పరదాల వెనుక జీవితంలోని సంస్కృతి, సంఘటనలు ఎన్నో ఒక్కచోట రాశిపోసినట్లు కనిపిస్తాయని అంటారు.

'విముక్తి' కథలో నవాబుల కుటుంబాల్లో ఎందరో దాసీలు ఉండేవారు. వారిని పురుషులు వాడుకునే వారు. ఆ సంస్కృతిని వ్యతిరేకించే తరం కూడా ఆ కుటుంబంలోంచే ఎదిగిన క్రమం సుల్తాన్ పాత్ర ద్వారా చూస్తాము. సుల్తాన్ తమ ఇంటి దాసి పిల్ల షీరాని వాడుకొమ్మని తల్లి, వదిన తదితరులు ప్రతిపాదించి గదిలోకి పంపిస్తారు. ఆ పద్ధతిని అసహ్యించుకుని దాసి షీరాని సుల్తాన్ పెళ్లాడాలనుకుంటాడు. తల్లితో ఆగ్రా, అజంతా, ఎల్లోరా చూసివస్తానని చెప్పి అనుమతి తీసుకొని ఆమెకు తెలియకుండా షీరాను వెంట తీసుకొని ఢిల్లీకి వెళ్లి అక్కడినుంచి అలీఘర్ వెళ్లిపోతాడు. పదిరోజుల తర్వాత అమ్మకు ఉత్తరం రాస్తాడు. 'అమ్మీజాన్! నేను మీకు ప్రియమైన ఆఖరి సంతానాన్ని, ఆ ప్రేమానురాగాలు, ఆదరాభిమానాలతోనే నన్ను క్షమిస్తారని ఆశిస్తున్నాను. ఏనాటికైనా మీరు షీరాని హృదయపూర్వకంగా మీ చిన్నకోడలుగా గుర్తిస్తారని ఆశ. ఆనాడే మేమిద్దరం మీ ఆశీస్సులకై దగ్గరకు రాగలము. అంతవరకు దూరాన్నుంచే మమ్మల్ని దీవించండని ప్రార్థిస్తూ ఇట్లు మీ ప్రియమైన చిన్నకొడుకు సుల్తాన్'. ఈ హృదయ సంస్కారం రోజురోజుకు పెరగడమే మానవీయ విలువలకు నిదర్శనం. ఆనాడు ఈ కథ రాయడం నిజంగా గొప్ప పరిణామమే. పాటకచేరీలు చేస్తూ ముజ్రాల వృత్తిలో జీవిస్తున్న తల్లీకూతుళ్లను 'కన్నెరికం' కథలో చూడవచ్చు. 1979 ఏప్రిల్‌లో 'ఆంధ్రప్రభ' వారపత్రికలో అచ్చయ్యింది ఈ కథ.

నెల్లూరి కేశవస్వామి పేరు చెబితేనే గుర్తొచ్చే కథ 'యుగాంతం'. హైదరాబాద్ రాజ్యంలో 1946–50ల మధ్య ఎలా కొనసాగాయో చాలామందికి తెలియదు. అంతదాకా ఎందుకు 1888–90ల్లో నేను చదువుకున్న సాంఘిక శాస్త్రంలో మద్రాసు ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రి గురించి, ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాక అప్పటి ముఖ్యమంత్రి గురించి చదువుకున్నాను. ఇదే సమయంలో హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు చరిత్ర ఎక్కడా కనిపించలేదు. హైదరాబాద్ రాష్ట్ర చరిత్ర ఆంధ్రప్రదేశ్ ఏర్పడటంతో పూర్తిగా మూలకు నెట్టివేయబడింది. ఈ 'యుగాంతం' కథ ఒక సామాజిక, రాజరిక వ్యవస్థ అంతమవుతూ ఒక నూతన దశలోకి సమాజం, మానవ సంబంధాలు మారుతున్న పరిణామాల్ని చిత్రించింది. 'యుగాంతం' అనే పేరుకు సార్థకతను చేకూర్చింది.

"17 సెప్టెంబర్, 1948 పోలీస్ యాక్షన్ మొదలై ఆనాటికి మూడోరోజు" అని కథ ప్రారంభం అవుతుంది. 'హైదరాబాద్ ప్రత్యేక రేడియో ప్రసార కేంద్రం దక్కన్ రేడియోలోంచి రాత్రింబవళ్లు ఎడతెరిపి లేకుండా ప్రసారాలు వస్తున్నాయి. వీటి ప్రకారం హైదరాబాద్ సైన్యాలు, ఇత్తెహాదుల్ ముసల్మీన్ రజాకార్ (స్వచ్ఛంద) దళాలు కలిసి భారత సైన్యాన్ని తరిమి కొట్టేస్తున్నాయి. వాళ్ల ధైర్య సాహసాల్ని పొగుడ్తూ, భారత ప్రభుత్వాన్ని అనేక రకాలుగా తిట్టిపోస్తూ... పాటలు, పద్యాలు, ఉపన్యాసాలతోనూ, 'ఖాసింరజ్వీ జిందాబాద్', 'ఆజాద్ హైదరాబాద్ పాయిందాబాద్' అన్న నినాదాలతోనూ హోరెత్తిచ్చేస్తోంది రేడియో. కానీ నగరం మాత్రం ప్రశాంతంగానే ఉంది. ఆఫీసులు, స్కూళ్లు, కాలేజీలు, దుకాణాలు తెరిచే ఉన్నాయి. ప్రజల దినచర్యల్లో చెప్పుకోదగ్గ మార్పేమీ రాలేదు. హిందువులు భయం, భయంగా బిక్కుబిక్కుమంటూ వంచిన తలలు ఎత్తకుండా మౌనంగా తమతమ పనులు చేసుకుంటూనే ఉన్నారు.

'యుగాంతం' నిజంగానే ఒక యుగాంతాన్ని చిత్రించిన గొప్ప కథ. హైదరాబాద్ రాజ్యంలోని ప్రత్యేక పరిణామాలను, సామాజిక చరిత్రను ఈ కథ ఒక డాక్యుమెంటులా మనముందుంచుతుంది. ఆ సంక్షుభిత వాతావరణంలో హిందూ, ముస్లింల సఖ్యత కోసం ఎందరో ప్రజాస్వామిక వాదులు నడుంబిగించారు. రచయితగా నెల్లూరి కేశవస్వామి ఈ సంఘటనల పట్ల చలించిపోయి తాను అనుభవించిన స్నేహం, ఆత్మీయత, కులాతీత, మతాతీత మమతలు, ఓల్డ్ సిటీ జీవితాల్ని చార్మినార్ కథలుగా వెలువరించారు. ఇవి కేవలం కథలు కావు. వాస్తవ జీవితాల, సామాజిక పరిణామాలను, సామాజిక చరిత్రను నిక్షిప్తం చేసిన చారిత్రాత్మక కథలు.

అందులో భాగంగా చూసినపుడు కేశవస్వామి రాసిన 'రూహీ ఆపా' కథ మహోన్నతమైన మానవీయ సంబంధాలను మనిషిలోని సున్నితమైన హృదయాన్ని కులమతాలకు అతీతంగా స్పందించే మనిషిని చిత్రించిన కథ. 'కన్నెరికం' కథకు మరో మూలంగా ఈ కథ కొనసాగుతుంది. ముత్రాల జీవితాన్ని 'కన్నెరికం' కథ ఒక బాధాకరమైన కోణంలో చిత్రిస్తే అలాంటి జీవితాల్లో ఆనందించే, జీవితమంతా హృదయంలో దాచుకునే సంతోష సన్నివేశాలు 'రూహీ ఆపా'లో చిత్రించారు. రెండు కథలు కూడా పాత్రలకు అవే పేర్లు ఉంచడంలో రచయిత ఒక స్పష్టమైన దృష్టితోనే రాశాడని చెప్పకనే తెలుస్తున్నది. సొంత కూతురిలా నవాబు, నవాబు కొడుకు ఒక ముత్రాల రమణిని గౌరవించిన తీరును చిత్రించడం ద్వారా ముస్లిం నవాబుల్లో కొనసాగిన హృదయ సంస్కారాన్ని రచయిత ఒడిసిపట్టాడు.

వీరి 'యుగాంతం' 'విముక్తి' కథలను ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి ఆంగ్లంలోకి అనువదించారు. అవి ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ వారు భారతీయ భాషల్లో ముస్లిం సంస్కృతిపై వచ్చిన కథా సంకలనంలో చేర్చారు. 'అలవాటు' కథను ముదిగొండ వీరభద్రశాస్త్రి ఆంగ్లంలోకి అనువదించగా... తెలుగు యూనివర్సిటీలో వారు 'తెలుగు షార్ట్ స్టోరీస్' పుస్తకంలో ప్రచురించారు.

ఇందులోని షరీఫా, ప్రతీకారం, అదృష్టం, వంశాంకురం, కేవలం మనుషులం, భరోసా, ఆఖరి కానుక కథలు దేనికవే ప్రత్యేకమైనవి, విశిష్టమైనవి. 'వంశాంకురం' కథలో ముస్లిం పెళ్లి సంబంధాలు ఎలా ఉంటాయో, కొడుకు పుట్టాలనే ఆశ ఆడపిల్లల జీవితాలను ఎలా అతలాకుతలం చేసి ఆత్మహత్యకు పురిగొల్పుతాయో హృదయ విదారకంగా చిత్రించింది. 'కేవలం మనుషులం' కథలో హుస్సేన్ మిర్జా, మహబూబ్‌రాయ్ సక్సేనా దశాబ్దాల స్నేహితులు. వారి కుటుంబాలు స్నేహంగా కలిసి ఉంటాయి. రెండో తరంలో వారి పిల్లలు ఇష్టపడి పెళ్లి చేసుకోవాలనుకుంటారు. ఇరువురు తల్లిదండ్రులకు ఇది ఊహకు అందని విషయం. మతాల సరిహద్దులను చెరిపివేసిన స్నేహం, పరిచయం, ప్రేమ, పెళ్లిగా మార్చుకొన్న ఆదర్శాల రెండోతరం గురించిన చక్కని కథ ఇది.

'భరోసా' కథ నమ్మిన పేదలను నట్టేట ఎలా ముంచుతారో భరోసాను భగ్నం చేసిన యదార్థ కథ. 'ఆఖరి కానుక' కథ రోజురోజుకు పేదరికంలోకి ఈడ్వబడుతున్న ముస్లిం కుటుంబాలు అరబ్బు దేశాల షేక్‌లకు తమ కూతుళ్లను ఇచ్చి పెళ్లి చేసి తద్వారా కాస్త ఆర్థిక సౌలభ్యం పొందాలనుకునే దుస్థితిని తెలియజేస్తుంది. 'అమీనా' దుర్భర జీవితం గురించి కేశవస్వామి రాసిన కథ ఆ తరువాత దశాబ్దాలుగా హృదయ విదారకంగా కొనసాగుతూ వచ్చింది. నిజంగానే ఒక అమీనా కేసు అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశమైంది.

విశిష్టమైన వస్తు, శిల్ప నైపుణ్యంతో మహోన్నతంగా రాయబడిన నెల్లూరి కేశవస్వామి కథలన్నీ గోల్కొండ గనుల్లో లభించిన ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కోహినూర్, జాకోబ్ వజ్రాల వంటివి. హైదరాబాద్ 'గంగా జమునా తహజీబ్'కు నిదర్శనాలుగా నిలుస్తాయి. ఒక యుగపు సామాజిక చరిత్రకు అద్దంపడతాయి.

# 99 నీలాజంగయ్య

**– ఆచార్య జి.చెన్నకేశవరెడ్డి**

శ్రీ।। శే।। నీలాజంగయ్య గారు నీలగిరి (నల్లగొండ) జిల్లా, దేవర కొండ తాలుకా ఇదంపల్లి గ్రామంలో 9-2-1939లో జన్మించారు. తల్లిదండ్రులు రాజయ్య, రాములమ్మగారలు వీరికి చిన్నప్పుడే అజ్మతుల్లా అనే ఉర్దూ కవి పరిచయ భాగ్యం వల్ల కవిత్వం పట్ల ఆసక్తిని పెంచుకొని 15వ ఏటనే 'బాలగీతాంజలి' గ్రంథం రచించారు. అప్పటి నుంచీ తన కాయం చాలించేవరకు 27-11-1991 వరకు కలం విడువ కుండా 52 ఏళ్ళ వయసుకే ఏభైకి పైగా గ్రంథరచనలు చేశారు. వాటిలో నలభైమాత్రం ముద్రితమైనాయి.

నీలాజంగయ్య స్వయంకృషితో పైకి వచ్చిన వ్యక్తి ఆంధ్రసారస్వత పరిషత్తు 'విశారద' పాసై, ఉపాధ్యాయుడిగా ఉంటూ, B.O.L., M.O.L. డిగ్రీలను ప్రైవేటుగా చదివి సాధించినారు. వీరికి బడి అన్నా, అంగడి అన్నా, ఒక గడిలో ఇమడటం అన్నా ఇచ్చగించని స్వేచ్ఛాజీవి, వీరి తండ్రి గారు చిన్నపెట్టుబడితో వ్యాపార రంగంలో ప్రవేశపెట్టితే, అను వంశిక వృత్తి అయిన 'వాణిజ్యాన్ని' వదిలి, తన ప్రవృత్తికి సరిపడే 'వాణిని' ఆరాధించి 'కవిరత్న'గా ప్రశస్తికెక్కినారు. చిన్ననాడే, రెక్కలు వచ్చీరాకముందే కట్టుబట్టలతో ఇంటిని వదిలిపెట్టి విశాలమైన విశ్వంలోకి నిస్సంకోచంగా నిర్భయంగా అడుగుపెట్టారు. నిలకడ లేకుండా ఎక్కడెక్కడో తిరిగారు. ఎందరెందరితోనో సహవాసం చేశారు. మొదట్లో రాజకీయ నాయకులతో కలిసి మెలిసి తిరిగారు. రకరకాల పార్టీలలో కార్యకర్తగా మెలిగారు. ఆ తండ్రి చెప్పిన నూకల్ని అమ్ముకోవడం కంటే, తన ఊహల్ని నమ్ముకోవడమే మంచిదని భావించారు. రంగులు మార్చేటి ఊసరవెల్లి రాజకీయాలు ఆ ఊహాజీవికి సరిపడలేదు. శాస్త్రాధ్యయనం కొంత కొరవడినా తన లోక సంచారం వల్ల అలవడిన అపార అనుభవ సంపదతోనే కావ్యాలెన్నో అల్లి 'సహజకవి' అనిపించుకొన్నారు. ఎంతో భావావేశమూ, రచనావేగమూ ఉన్నవారీయన. ఒక భావం మనస్సులో మెదిలితే చాలు కలం కాగితం మీద కదలడం, రచన పూర్తి కావడం జరిగేది. ఒక భావం ఎలాతోస్తే అలా రాయడం ఆయన ప్రత్యేకత. సానపట్టాలన్న పట్టింపు ఉండేది కాదు ఈ పుట్టురత్నానికి.

అవిరామంగా, సరళసుందరంగా, అనర్గళంగా కవితారచన చేయగల సాహసి. వీరు నల్లగొండ జిల్లాలో పదేళ్లపాటు బడిపంతులుగా ఉంటూ ఆ తర్వాత హైదరా బాదుకు వచ్చి ఇరవై ఏళ్ళపాటు ఎంతో పని ఒత్తిడి ఉన్న తెలుగు అకాడమీలో పనిచేస్తూ ఏభైకి పైగా రచనలు చేసి, నలభైకి పైగా గ్రంథాలను ముద్రింపజేసుకోవడం ఆశ్చర్య కరమే. తెలుగు అకాడమిలో ఇంటర్మీడియట్, డిగ్రీ పాఠ్య గ్రంథాల భాషాసవరణ, ప్రచురణ, కవులు, రచయితలు, గ్రంథాలను గురించి కోశాల నిర్మాణం (సాహిత్యకోశం 1, 2 భాగాలు), బడిపిల్లల 'శబ్దసంపద'ను పట్టికలుగా తయారు చేయడం వంటి తన ప్రవృత్తికి సరిపడే ప్రాజెక్టులలో పనిచేయడం వల్లా అటు తెలుగు అకాడమీ పనిని, ఇటు

తన తెలుగు కృతుల రచనా వ్యాసంగాన్ని అలుపనేది లేక బలుపేలక్ష్యంగా శ్రమ పడిన జీవి. “ఒకరి పొగడ్తలకు గాక నావిధి నేను నిర్వహిస్తాను. బ్రతుకు ముగిసిన విధి నిర్వహణ ముగుస్తుంది. అందాకా నా బ్రతుకుకు విశ్రాంతి లేదు” అని తానే చెప్పుకొని కన్నుమూసే దాకా కన్ను తెరిచి పనిచేసిన వ్యక్తి.

నీలా జంగయ్య ముద్రిత గ్రంథాలలో బుచ్చిలింగ పద్యాలు, రామలింగ పద్యాలు, శారదాంబ పద్యాలు, చిద్విలాసం వంటి శతకరచనలు ఉన్నాయి. ‘శతకం’ అంటే ఒక మకుటంలో నూరో, నూటఎనిమిది పద్యాలతోనో ముగిస్తారు కాని జంగయ్య శారదాంబ పద్యాలను ‘చారుగుణ కదంబ శారదాంబ’ అనే మకుటంలో 516 పద్యాలను, ‘చిద్విలాసం’ కృతిలో ‘శ్రీశైలవాస, చిద్విలాస’ అనే మకుటంలో 403 పద్యాలను రచించారు. అట్లాగే ‘లచ్చనంగ బతుకు బుచ్చిలింగ’ అనే మకుటంలో ‘బుచ్చిలింగశతకం’ రాశారు. ఇవన్నీ ఆటవెలది శతకాలే. వేమన్నదీ ఆటవెలదే కదా!

‘జ్ఞానమందిరం’, ‘ఆవేదన’, ‘విప్లవస్వరాలు’, ‘మహా ప్రపంచం’, ‘దర్శనం’, ‘సంస్కారభూషణం’, ‘కాంతిచక్రం’ వంటి పద్యకృతులెన్నో రాశారు. ‘మధువనం నా పాటలు’, ‘బతుకు బాటలో పాటల మూట’ వంటి గేయ కృతులను, ‘చిత్కళ’ అనే గేయ కావ్యాన్ని రాసారు. ‘కన్యకాపరమేశ్వరి చరిత్ర’, ‘మాణిక్యప్రభు చరిత్ర’, ‘వైశ్యకులదీపిక’ వంటి బుర్ర కథలను రాశారు. బుర్రకథలను రాయడమేకాదు. బుర్రకథలు చెప్పినవారు కూడా, ‘విస్ఫులింగాలు’, ‘కవిరత్న’ వంటి ఎన్నో బిరుదులు పొందినా ‘కవిరత్న’ మాత్రం ఆయన పేరుతో అతికిపోయింది.

వీరి అముద్రిత రచనలలో ముఖ్యమైనవి ‘శ్రీకన్యకా పరమేశ్వరి చరిత్ర’ అనే పద్యకావ్యం. ఇది రాశిలోనేకాక, రసదృష్టితో కూడా బృహత్ కావ్యం. ఈ కావ్యం ప్రచురితమై ఉంటే నీలాజంగయ్య గారి కీర్తి కిరీటంలో నీలమణియై నిలిచిఉండేది. అన్నీ ఒక ఎత్తు, ఇదొక ఎత్తు. ఈ కావ్యమే ముద్రితం కాకపోవడం పెద్దలోటే. వీరి కావ్యాలకు వాన మామలై, దాశరథి, సి.నారాయణరెడ్డి, సోమ సుందర్ వంటి కవి పండితులెందరో పీఠికలు రాసినా, తన కృతి మీద తానే ఒక పీఠిక లాంటిది ముందుమాట రాసుకునే అలవాటు జంగయ్యగారి కున్నది. ఇటువంటి పీఠికల ద్వారా ఆయన కవితాశయం, తనకృతి రచనోద్దేశం వెల్లడించుకొనేవారు. వీరి గ్రంథాలకు తానే పీఠికలు రాసుకోవడమే కాక, సాటి కవుల, రచయితల గ్రంథాలకు పీఠికలు రాశారు. వీరి రచనలలో ‘తెలుగులో తత్త్వకవులు’ అనేది గొప్పపరిశోధన గ్రంథం. తత్త్వకవుల గురించి ఎన్నో మౌలిక విషయాలు చెప్పారు. కందుకూరి రుద్రకవి జన్మస్థలం మీద చక్కటి పరిశోధనాత్మక వ్యాసం రాశారు.

మహామహోపాధ్యాయ ఎలకూచి బాలసరస్వతి ‘మల్ల భూపాలీయవలు’, పుష్పగిరి తిమ్మన రచించిన ‘నీతి శతకము’ వంటి గ్రంథాలకు పీఠికలు రాశారు.

జంగయ్య గారెన్ని రచనలు చేసినా ప్రధానంగా పద్యకవి. వీరి పద్యాలు ధారాశుద్ధి శోభితం. ఉదాహరణకు...

“నాకొక రూపొసంగి కరుణన్ మధుజీవనమిచ్చి పెంచితీ
వాకమలాక్షి! విశ్వనుత ఓ నవభావసముజ్జ్వల ప్రభూ!
నీకయి గుండెతంబురను నిర్మల నాదములీన మీటితిన్
రా! కయిసేయరా! కవితా రాగవసంతములంది యాడగన్”
(దర్శనము ప్రట. 2)

జంగయ్యగారు ఎక్కువగా పద్యరూపంలో కవిత్వం రాసినా, కవితావస్తువు మాత్రం అభ్యుదయకరమైనది. ఆధునిక సమాజానికి చెందినది. సంఘంలో జరుగుతున్న దురాగతాలపట్ల, నెలకొన్న దురాచారాల పట్ల ఎంతో ఆవేదనతో, ఆవేశంతో కవిత్వం రాశారు. కొన్ని చోట్ల మెత్తని అధిక్షేపం, సునిశిత వ్యంగ్యం దర్శనమిస్తాయి.

ఉదాహరణకు

“హలము గొన్న రైతు కలముబట్టిన కవి
నేల దున్ని కాగితాల దీర్చి
ఒకడునింగి జూచె నొకడు దిక్కులగాంచె
శ్రీ శ! శైలవాస ! చిద్విలాస!”
(చిద్విలాసం ప్రట. 22)

“నా కవిత్వము దీన జనమ్ము కొరకు
పతిత మానవ జాతిగూర్య
విశ్వసాహిత్యమునకు శాశ్వతయశస్సు
గూర్చుటకు గోరదెట్లు? – – –”
అని తనకవిత్వాశయాన్ని చెప్పుకొన్నారు.

వీరి కృతులలో ‘చిత్కళ’ ప్రత్యేకమైనది. గేయ ఛందస్సులలో బుర్రకథలు రాసిన జంగయ్య ‘చిత్కళ’ అనే గేయకావ్యం రాశారు. దీని ఇతివృత్తం ముఖలింగక్షేత్ర స్థల

పురాణమే అయినా, ప్రకృతి పరిరక్షణ ప్రబోధమే ప్రధానంగా సూచితమైనది. గేయంలో కూడా వసుచరిత్ర వంటి ప్రౌఢ పద్యకావ్యాల ఈ కావ్యంలో ఉన్న నడకలు స్ఫురింప చేయడమనేది వీరికి ఛందస్సు మీద ఉన్న అధికారానికి నిదర్శనం.

ఉదాహరణకు...

(1)ఇమ్ముగ వనాలు రుచి
రమ్ముగ తరుల్ మధుర
సమ్ములొదవన్ ఫలభ
రమ్ములగుచున్‌జి

(2)సుందర మధూకతరు
లందు మధుధారలు ప
సందుగరసప్రసవ
విందులొనరించన్

జంగయ్యగారు తన కృతులను ప్రముఖ రాజకీయ నాయకులకు, వణిక్ శ్రేష్ఠులకు, కవి పండితులకు అంకితమిచ్చారు. అటువంటి వారిలో అప్పటి ముఖ్యమంత్రి మర్రిచెన్నారెడ్డి, కొణిజేటి రోశయ్య, కొత్తూరి సీతయ్యగుప్త, వేలూరు దుర్వాసులు గుప్త, దేవులపల్లి రామానుజారావు, కాళోజి నారాయణరావు, తూమాటి దోణప్ప, ఉండేల మాలకొండారెడ్డి వంటివారు. ప్రముఖులకు అంకితమివ్వడమే కాక, ప్రముఖ కవి శ్రీ ఉత్పల సత్యనారాయణాచార్య రచించిన 'స్వప్నాలదుప్పటి'ని, ప్రముఖ విమర్శకుడు, పండితుడు డా॥ గుమ్మా శంకర రావు రచించిన 'జాతీయాలు–తీరుతాయాలు' అనే గ్రంథాలను అంకితం పొందిన అదృష్టవంతుడు.

జంగయ్యగారు తాను నమ్మిందే, తాను భావించిందే కవిత్వంగా రాశారు. ఎరువు భావాలన్నీ, ఎరుకలేని సిద్ధాంత రాద్ధాంతాలన్నీ ఎంత మాత్రం గిట్టేది కాదు. కవితారచనలో ఎంతో లక్ష్యశుద్ధి, చిత్తశుద్ధి ఉన్నవారు.

ఎంతో కీర్తినార్జించినా నిరాడంబరంగా నిగర్విగా అమాయకుడిగా, దాపరికం లేని బోళామనిషిగా అందరి ఆప్యాయతను చూరగొన్నారు. జంగయ్యగారు తన పేరుకు తగినట్లు ఒక్కచోట నిలకడగా ఉండేవాడు కాదు. ఎక్కడెక్కడో తిరిగి ఎప్పుడోరాత్రి పదింటికి ఇంటికి చేరేవారు. 'రోజు కొక్కొక్క చోట నీ జంటనగరాల కనిపించు జంగ మకల్ప కంబు' అని ఆయన కవి మిత్రులు ఉత్పల సత్యనారాయణాచార్యులు అన్నారు. జంటనగరాలలోనే కాదు, రాష్ట్రంలో ఎక్కడ ఎవరుపిలిచినా కాదనకుండా వెళ్ళి కవితాగానం చేసి బేష్ అనిపించు కోవడమే తప్ప ఏ మాత్రం భేషజాలు చూపేవారు కాదు.

"శ్రవణ భాషణ దర్శన స్పర్శనముల
చిత్తమలరించు నట్టిదే చెలిమి చెలిమి
చెలిమి విలువెంత గొప్పదో తెలిసికొన్న
కవివతంసుని జంగయ్య కలిమికలిమి"
(ఉత్పల–స్వప్నాలదుప్పటి)

అని ఉత్పల రాసిన పద్యం జంగయ్య గారెంత స్నేహశీలో తెలుపుతున్నది. జంగయ్యగారి అభిమానులు 1976 డిసెంబరులో ఆయన కలంపట్టి పాతికేళ్లయిన సందర్భంలో ఆయనకు సారస్వత రజతోత్సవాన్ని 1989 ఫిబ్రవరిలో యాభై ఏళ్లజన్మదినాన స్వర్ణోత్సవాన్ని జరిపి రెండు సందర్భాలకు ప్రత్యేక సంచికలను వెలువరించినారు. ఆ సంచికలలో వారి రచనల మీద ఎన్నో వ్యాసాలు, సాటి కవి పండితుల ప్రశంసాపూర్వక, ఆశుపూర్వక కవితలు ఉన్నాయి. ఈ రెండు సంచికలు వారి కవితాకీర్తికి పతాకాల వంటివి. కవిరత్న నీలాజంగయ్య గారి మరణానంతరం అభిమానులు పూనుకొనివారి పేర పెద్దకుమారుడు నీలాశ్రీధర్ ఆధ్వర్యంలో ఒక అవార్డును ప్రతి ఏటా వారి జన్మదిన సందర్భంగా ఇచ్చే సంప్రదాయాన్ని నెలకొల్పినారు. తొలి అవార్డు ప్రముఖ కవి శ్రీమాన్ ఉత్పల సత్యనారాయణాచార్యగారికి, ఆ తర్వాత బాపురెడ్డి, గుంటూరు శేషేంద్ర శర్మ మొదలైన వారికి ప్రదానం చేస్తూ వచ్చారు.

చివరగా నీలాజంగయ్యగారి కవిత్వాన్ని ప్రశంసిస్తూ ప్రముఖకవి యర్రం విశ్వనాథగుప్త రాసి పద్యంతో ముగిస్తాను.

"నీవు విశిష్టశీలివి వినిర్మల భావ సమన్వితుండవున్
నీవు రచించి మించితి నకేక రసాంచిత కావ్యరాజముల్
వావిరిగా నుతింపనిను పాఠక పండితలోక మెంతయున్
భావి తరాల సత్కవులు ప్రస్తుతి చేతురుగాక జంగయా"

# 100 ఒద్దిరాజు సోదరులు

**– డా॥ కొండపల్లి నీహారిణి**

తెలంగాణలో ఆనాడు, సంస్కరణ భావ విజృంభణతో సాహిత్య వికాస చైతన్య దీప్తులు ప్రసరించిన ఒద్దిరాజు సోదరులు బహు భాషా కోవిదులు, సకల శాస్త్ర కళాకోవిదులు. ఒద్దిరాజు సీతారామ చంద్రరావు గారు, ఒద్దిరాజు రాఘవ రంగారావు గార్లు ఏడేళ్ళ వయసు తేడాతో ఒకే తల్లి గర్భాన జన్మించిన అన్నదమ్ములు. వీరిది వరంగల్ జిల్లా ఇనుగుర్తి గ్రామం. రంగనాయకమ్మ, వెంకటరామారావు గార్లు వీరి తల్లిదండ్రులు అమ్మానాన్నల సంస్కారాన్ని, పాండిత్యాన్ని వారసత్వంగా తెచ్చుకున్న ఒద్దిరాజు సోదరుల దేహాలు వేరైనా ఆత్మలొక్కటేనన్నట్లు పెరిగారు. 1887 ఏప్రిల్ 2 పెద్దవారిది. 1894 ఏప్రిల్ 4 చిన్నవారిది జయంతులు, పదేళ్ళ క్రితమే శతజయంతి ఉత్సవం జరుపుకొన్నాయి.

తెలుగు, సంస్కృతం, తమిళం, కన్నడం, ఉర్దు, పార్శీ, హిందీ, ఇంగ్లీష్ వంటి అష్టభాషల్లో ప్రవీణులైన ఒద్దిరాజు సోదరులు ప్రబంధాలు, కావ్యాలు, నవలలు, నాటికలు, నాటకాలు, కథలు, కథానికలు, కవితలు, వ్యాసాలు, ప్రహసనాలు, శతకాలుగా దాదాపు 75 గ్రంథాలకు పైగా రచనలు చేశారు. ఒద్దిరాజు సోదరులు, ఇనుగుర్తి సోదరులుగా ప్రసిద్ధికెక్కిన వీరు సాహిత్యంతోపాటు సంగీతశాస్త్రాన్ని, జ్యోతిష్యశాస్త్రాన్ని, విజ్ఞానశాస్త్రాలై వైద్యశాస్త్రాన్ని నేర్చుకున్నారు. హోమియోపతిలో డిగ్రీ చదివి, పట్టా పొందిన తర్వాత ఆయుర్వేదం, ఆల్లోపతి వైద్యాల్ని క్షుణ్ణంగా నేర్చుకొని, తాము కనుగొన్న 'తిక్త' అనే మందును కలరా, మలేరియా వంటి జబ్బులకు ఇస్తూ ప్రజలను కాపాడేవారు. 'మధిర' అనే మందును కనుగొని పశువులకు కూడా వైద్యం చేసి రైతులకు సేవ చేసేవారు. ఏ ఆధునిక వైద్య సౌకర్యాలు లేక అలమటించే సమాజానికానాడు సోదరులు ఉచితసేవ చేసేవారు.

తెలుగు భాషా సేవ చేసేందుకు, విజ్ఞాన ప్రచారిణీ గ్రంథమాలను ఇనుగుర్తిలో 1918లోనే స్థాపించారు. మద్రాసునుండి ప్రింటింగ్ ప్రెస్ భాగాలను కొనుక్కొని వచ్చి స్వయంగా బిగించుకొని ముద్రణా యంత్రాన్ని సిద్ధం చేసుకున్నారు. వారి గ్రంథాలతోబాటు ఇతరుల గ్రంథాలను ముద్రించి, ఉచితంగానే ఇచ్చేవారు. విద్యావకాశాలు ఎండమావులైన తెలంగాణ పల్లె జీవితాల్లో వెలుగులు నింపాలని ఆధునిక భావాలు ప్రజ్వరిల్లాలనివీరి ఇంట్లో ఎంతోమంది పేదలకు చదువులు చెప్పించేవారు, మూఢనమ్మకాలు పోవాలని ఎంతో కృషి చేసేవారు. కనీస ప్రయాణ సౌకర్యాలు కూడాలేని ఆ మారుమూల పల్లెటూళ్ళో తెనుగు పత్రికను స్థాపించి, తెలుగు భాష వెలుగులీనాలని అర్థపుష్కరకాలం, అహర్నిశలు శ్రమించారు. 1922లో ఇనుగుర్తిలోని తమ ఇంట్లో నుండి నడిపిన పత్రిక తెనుగు పత్రిక ప్రారంభంతో 500 కాపీలతో ప్రచురించారు. ఒద్దిరాజు సీతారామచంద్ర రావు గారు సంపాదకులు అక్షరాలను కూర్చడం, ప్రూఫులు దిద్దుకోవడం, వార్తలు సేకరించడం, వ్యాసరచన చేయడం, పత్రికను బట్వాడా చేయడంవంటి పనులన్నీ ఒంటిచేత్తో

నడుపుకున్న సోదరులు శ్రమ జీవులు. 'వార్తయందు జగము వర్ధిల్లుచున్నది' అనే సూక్తిని పత్రిక టైటిల్ దగ్గర ముద్రించిన వీరు అత్యంత సాహసంతో శక్తిసామర్థ్యాలతో ఎటువంటి వార్తలనైనా నిర్భయంగా ప్రచురిస్తూ 6 ఏళ్ళు దిగ్విజయంగా నడిపారు. దేశ కాలపరిస్థితులు, సమస్యలు, సూచనలు ప్రతిబింబిస్తూ వీరు వ్రాసిన సంపాదకీయాలు ఎంతో గొప్పగా ఉన్నాయి. దేశభక్తి అణువణువునా పొగసూపిన వైనం వివిధ వ్యాసాల్లో ఉన్నది. పద్యావళి, వ్యాసావళి, నిజాం రాష్ట్రం వార్తలు, లేఖలు, సాహిత్య విషయాలకు స్థానమిచ్చిన ఈ తెనుగు పత్రిక ఆంధ్రోద్యమానికి చేయూత నిచ్చింది. తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవనానికి ఒద్దిరాజు సోదరుల 'తెనుగు పత్రిక' ఎనలేని సేవచేసింది.

ఒద్దిరాజు సోదరుల పాండిత్య ప్రకర్షను తెలియజేసే 'సౌదామినీ పరిణయం' పద్నాలుగు వందల ఎనభైఐదు గద్యపద్యాలతో కూడిన చంపూ కావ్యం. ఇందులో ఆరు ఆశ్వాసాలున్నాయి. దైవస్తుతి గ్రంథకర్తల వంశాభివర్ణనలతో 88 గద్య పద్యాలతో అవతారిక అలరారుతున్నది. సౌదామిని శ్రీకృష్ణులు ఈ కావ్య నాయికా నాయకులు. విప్రలంభ శృంగారంతో కూడిన కొన్ని వర్ణనలతోను, పురవర్ణన, హిమగిరివర్ణన, తపోవన వర్ణన, ఋతువర్ణనలతో కథాగతికి ఒదిగిన ఈ ప్రబంధం పూర్వప్రబంధాలతో పోలుతుంది. ఈ కావ్యంలోని శైలి ప్రౌఢంగా, పాండితీస్ఫోరకంగా ఉన్నది. కవులకి సంస్కృత భాషాభిమానం ఉందని తెలిపే వర్ణనలున్న ఈ ప్రబంధం సాహిత్యాభిమానులకు ఆనందాన్ని కలిగించేలా ఉన్నది.

సామాజిక, సాంఘిక విషయాలు, భాషా విషయాలు కథాకథన వైచిత్రితో కూడిన ఒద్దిరాజు సోదరుల పద్య కావ్యాలతో లభ్యమైనది అనాథబాల, ఖడ్గతిక్కన, నిస్వార్థ దరిద్రులు, బిచ్చమెత్తుకునే ఒక చిన్న బాలిక ప్రమాదంలో పడితే చేరదీసి పెంచి, పెళ్ళి చేసిన ఒక పూజారిలోని భావ చైతన్యమే అనాథబాల కావ్యం. 336 పద్యాలతో చక్కని కథాబలంతో సరళంగా సాగిన ఈ కావ్యం 1949లో రచింప బడింది. సంఘ సంస్కరణకు తొలిమెట్టు వ్యక్తి సంస్కారమే ప్రధానమనే ధ్వనితో, కులమతాలకతీతమైన జీవకారుణ్య భావనతో మానవసేవయే మాధవసేవ అంటూ మానవత్వాన్ని ఆలంబనగా తీసుకొని రచించిన 'అనాథబాల' కావ్యం సంస్కరణవాదులకు, సాహితీప్రియులకు సంతృప్తినిచ్చే కావ్యం. సాంస్కృతిక పునరుజ్జీవనంలో సాహిత్యవికాసం ముఖ్య ఆయుధమన్నట్లు నడిపారీకావ్యాన్ని.

అనేక సూక్తులతో, లోకోక్తులతో వర్ణ విశేషాలతో చక్కని ఇతివృత్తంతో సాగిన ఖడ్గతిక్కన పద్యతిక్కన పద్యకావ్యం దేశీయత, జాతీయతా భావాలను రంగరించి రచించారు. స్వాతంత్ర్యానంతరం ఏర్పడిన పరిస్థితులను దృష్టిలోపెట్టుకొని నవ్య సాంప్రదాయంతో ప్రాచీన కథను జోడిస్తూ వ్రాసిన ఖడ్గతిక్కన కావ్యంలోని కవితాస్రవంతిని, చైతన్య పూరితమైన సాహిత్యాన్ని కవులు అందించారు.

మన భారతీయ తాత్త్వికవేత్తలు, మేధావులు రూపొందించిన ధర్మార్థకామమోక్షాలైన చతుర్విధ పురుషార్థాల ప్రాముఖ్యతను వివరించే ప్రయత్నంలో వ్రాసిన 'నిస్వార్థ దరిద్రులు' అనే కావ్యం ఒద్దిరాజు సోదరుల నిరాపేక్ష భావాన్ని ప్రతిబింబిస్తుంది. ఎవరి బ్రతుకు వారిదే, ఏ ప్రభుత్వాలపైనా ఆధారపడకుండా ఆదర్శంగా బ్రతకాలి ప్రజలను అనే ఆలోచన రేకెత్తించారీ కావ్యంలో. సమాజ గతికి ఏది ప్రధానమో దాన్ని చెప్పదలచుకున్న ఉద్దేశ్యంతో పాత్రల్ని మలిచారు.

ఒద్దిరాజు సోదరులు నాటికలు నాటకాలు చాలా వ్రాశారు. అనురాగాలు, ఆప్యాయతలతో జీవనం చేసే కుటుంబపరమైన నాటకాలెక్కువగా ఉన్నవి. సంసార యానంలో కలిగే ఇబ్బందులు, వాటిని ధైర్యంగా ఎదుర్కొనే పరిస్థితులు ప్రతిబింబిస్తూ నడిపారు. కథాంశం ఏమాత్రం తక్కువకాకుండా వ్రాసిన ఈ నాటకాల్లో వరకట్నం, అవిద్యవంటి బాధలు, మద్యం సేవిస్తూ భార్యను దండిస్తూ ఇబ్బందిపెట్టే వారి స్వభావాలను, సహవాసదోషంవల్ల కలిగే అనర్థాలను చూపుతూ, వాటికి పరిష్కారమార్గాలను చూపుతూ వ్రాశారు. ఆ కాలపు పోలీసు వ్యవస్థ, న్యాయాధికారుల ప్రవర్తనతో బాధితుల్లో మార్పులు తీసుకురావడం వీరి నాటకాల్లో చూస్తాం. కష్టపడి సంపాదించిన ధనాన్ని ఏవిధంగా ఖర్చు చేయాలో, మేనరిక వివాహాలు, వరకట్న సమస్యలు, ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో కుటుంబాల్లో పెరిగే దూరాలు, అట్లే గయ్యాళితనం చూపే ప్రభావంతో వచ్చే కష్టాలు గురించి వ్రాశారు. స్త్రీల ఔన్నత్యం కోసం 'సంఘాలు' ఉండాలని కోరుకోవడంవంటివి 7 దశాబ్దాల

క్రితమే వ్రాసిన మార్గదర్శులు వీరు. ఈ ఉత్తమ నాటకాలు ఇప్పుడు 'దుష్టపంచాయితీ' 'మేనరికం' అనే పేర్లతో పది నాటకాలు రెండు పుస్తకాలుగా ఒద్దిరాజువారి కుటుంబ సభ్యులు ఈమధ్యే ముద్రించారు.

ఎల్లన, తులసీబాయి, చింతాదేవి, రుధిరాభిషేకం వంటి పది నాటికలను ఈ సోదర కుటుంబాలు ముద్రణలోకి తెచ్చారు. ఆనాటి సుజాత, గోలకొండ పత్రికల్లో ఈ ఏకాంకికలు అచ్చుయినవే! వీటిలో సతీసహగమనాన్ని ఖండిస్తూ వ్రాసిన తులసీబాయి నాటికైనా, స్త్రీల యుద్ధ, రాజకీయ ప్రతాపాన్ని ప్రదర్శించే చింతాదేవి నాటికైనా ఆలోచనాత్మకంగా ఉన్నాయి. ప్రేమపాశం దేశభక్తికి గొడ్డలిపెట్టు ఎట్లా అవుతుందో చక్కగా ప్రస్ఫుటించారిందులో! కులముకన్న గుణం ప్రధానమనీ, శౌర్యం కేవలం క్షత్రియులకే ఉండదనీ అద్భుతంగా వ్రాసిన 'ఎల్లన' నాటిక నేటికీ ప్రదర్శన యోగ్యంగా ఉన్నది.

ఒద్దిరాజు సోదరులు వ్రాసిన కథలు, నవలలు ఒక దానిని మించి మరొకటి గొప్పగా ఉన్నవి. స్నేహం విలువను తెలియజెప్పే రక్తమూల్యం కథ, శీల సంపద విలువ చెప్పే లండన విద్యార్థి కథ, భూమాత అంతటి ఓపిక ఉండే స్త్రీలు సరైన విద్యనందించి, ఉన్నతంగా చూస్తే వారి కుటుంబాలకు అవధుల్లేని కీర్తిని సంపాదించిపెడ్తారన్న సందేశమిచ్చిన నీవేనా కథ గొప్పగా ఉన్నది. సైన్స్‌ను ఎంత వాడుకోవాలో అంతే వాడుకోవాలి. విచ్చలవిడిగా ఉపయోగిస్తే అంతం చేస్తుందని హెచ్చరించే హాస్యకథ 'అదృశ్యవ్యక్తి' కథ ఇష్టంగా చదివింపజేసేకథ. 'పనిలేని న్యాయవాది' కథ అంతే గొప్ప కథ. సున్నితమైన హాస్యాన్ని పండిస్తూ దేనికదే గొప్ప కథగా ఒద్దిరాజువారి కలం నుడి జాలువారాయి. గుప్తత క్లుప్తత, చదివింపచేసే శైలి, ఆలోచింపజేసే కథ, చక్కని భాషా సంపదతో ఈ కథలు అలరారుతున్నాయి.

రుద్రమదేవి, శౌర్యశక్తి, భ్రమర, వీరావేశము, బ్రాహ్మణ సాహసము, ముక్తలవ, వరాహముద్ర, స్త్రీ సాహసము వంటి ఎన్నో నవలలు రచించిన ఒద్దిరాజు సోదరుల నవలలన్నీ లభ్యమై ఉంటే ఎంతో బావుండేది. అద్భుతమైన వీరి పుస్తక భాండాగారాన్ని ఆనాడు ముష్కరులు అగ్నికి ఆహుతి చేశారట. అనేకకనేకమైన గొప్ప గ్రంథాలు, తాళపత్రాలు, పురాణ కావ్యాలు, పలుభాషా సాహిత్య విశేషాల పుస్తకాలతోపాటు వీరు వ్రాసిన రచనలూ అన్నీ ఆనాటి రజాకార్, మూమెంట్ సమయంలో కాలిపోయాయి. ఆ గ్రంథాలయం బూడిదైనందుకు విశిష్టమైన సంపదను పోగొట్టుకున్నట్టు విలపించారట ఒద్దిరాజు సోదరులు. ఆ మౌనదుఃఖంలోంచి అన్ని రచనలూ మళ్ళీ వెలువడలేదు.

1918లో ప్రథమ ముద్రణ చేసిన 'రుద్రమదేవి' నవల ఓరుగల్లు రాణి గొప్పదనాన్ని చాటుతూనే స్త్రీ శక్తి ఎంతటి అపూర్వమైందో రుద్రమదేవి పరిపాలనాదక్షత ఎంత గొప్పగా ఉండేదో తెలియజేసిందీనవల. మద్రాస్‌నుండి కొమర్రాజుగారి ఆధ్వర్యంలో 'విజ్ఞాన చంద్రికా గ్రంథాల' వారి బంగారు పతకాన్ని అందుకున్న నవల రుద్రమదేవి నవల. ఇక జీర్ణావస్థలో ఉన్న 'వీరావేశము', 'శౌర్యశక్తి' వంటి అద్భుత నవలలోని, భావాలూ, సందేశాలు జీర్ణమైపోకుండ ముద్రణకు పూనుకోవాలి. రవీంద్రనాథ్‌ఠాగూర్' 'ది రెక్' నవలను 'నౌకాభంగం' పేరున అనువదించిన ఈ నవల తెలుగు భాషా పిపాసలకు మనోహరంజకాన్ని కలిగిస్తుంది. ఈ మధ్యే దీన్ని ముద్రించారు.

ఒద్దిరాజు సోదరులు సంస్కృతం భాషలో ఉద్దండ పండితులు. పాణినీయ అష్టాధ్యాయి వ్యాకరణ సూత్రాలకు తెలుగు వ్యాఖ్యాంశాలను రచించారు. కృష్ణస్తవః, శ్రీస్తవః, ఉత్సవానందః, వైభవస్తవః వంటి రచనలు, శతకాలు వీరి పాండితీ గరిమను తెలుపుతాయి. ఆ వర్ణనలు, ఆ పద గుంఫనలు అద్భుతం. ఆ రోజుల్లో కాంచీపురం రామానుజ గ్రంథమాల వారి ప్రచురణలో వీరి సంస్కృత రచనలు కొన్ని ముద్రించారు.

అనువాద రచనలలో ముఖ్యంగా 'ముదలాయిరం', 'వణ్ణమదజ్ఞల్' వంటి తమిళ రచనలు చేసిన ఒద్దిరాజు సోదరులు శ్రీవైష్ణవ సంప్రదాయవాదుల కాబట్టి సంప్రదాయార్థ బోధకాలైన తమిళ గ్రంథాలను, సర్వజన సౌభ్రాతృత్వాన్ని కోరిన రామానుజుల మార్గ సంప్రదాయాలను విశదీకరించారని తెలుస్తుంది. ఆర్తి ప్రబంధం, సప్తగాథా వ్యాఖ్యానం వంటివి కొన్ని ఆ పద్ధతినిపోలి ఉన్నాయని పెద్దలు వివరించారు.

'మాన్యువల్ ఆఫ్ ఇంగ్లీష్ గ్రామర్' అనే ఇంగ్లీష్ వ్యాకరణ గ్రంథాన్ని వ్రాశారు సోదరులు. దీన్ని ఈ మధ్యే వీరి కుటుంబ సభ్యులు ముద్రించారు. ఇందులో ఎన్నో

ఇంగ్లీష్ పదాలకు కొత్త కొత్త తెలుగు పారిభాషక పదాలను ఉపయోగించారు. రవీంద్రుని రచనల ప్రభావం షేక్స్పియర్ వంటి కవుల ప్రభావం బాగా పడిన ఒద్దిరాజు సోదరులు ఇంగ్లీష్‌లో The Flower, The Pride of the Wealth వంటి కవితలూ వ్రాశారు.

ఒక్క 'లోకేశ్వర శతకం' చదివితే చాలు ఒద్దిరాజు సోదరుల తాత్త్వికత, ఆధ్యాత్మికత, భక్తిభావ చింతనలెంత ఆదర్శంగా ఉన్నాయో తెలుస్తుంది. అనేకమైన వ్యాసాలు, కవితలు, పేరడీలు, చాటువులు, చతుర సంభాషణలు ఒద్దిరాజువారిలోని పరిశీలనత్వాన్ని, హాస్యప్రియతత్వాన్ని, సామాజిక నేపథ్యాన్ని తెలుపుతాయి. ఆనాటి ప్రముఖ పత్రికల్లో వీరి రచనలు విరివిగా ముద్రించేవారు. మద్రాస్, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, బందర్, హైదరాబాద్ వంటి ఎన్నో ప్రాంతాల్లో కవితాగోష్ఠులకు వెళ్ళి సభను మెప్పించేవారట.

ఒద్దిరాజు సోదరులు సకల కళాపారంగతులు. వీరి గృహ ముఖద్వారంపైన కళాత్మకమైన చక్కదాన్ని వీరే స్వయంగా చేశారట. ఆ డిజైన్లలో వీరి పేర్లు, భగవద్గీత శ్లోకము వచ్చేలా చెక్కారు. తాపీపని, చెక్కపనీ వీరే చేసేవారట. కుమ్మరం, వడ్రంగం వంటి చేతిపనులు చేసేవారు. వీరు తొడుక్కునే చెప్పులు, వేసుకునే సంచులు వీరే తయారు చేసుకునేవారట. వీణ, ఫిడేలు, తంబుర వంటి వాయిద్యాలపై సంగీతం వాయించే ఒద్దిరాజు సోదరులు అష్టకోణాకృతిలో 'మహతి' అనే వీణను, సాధారణ కృతిలో కచ్ఛపి అనే వీణను వీరే స్వయంగా తయారుచేసుకొని హృద్యంగా వాయించేవారట. స్వయంగా చేసి, అందరూ చేయగలరని నమ్మకం కలిగిన వస్తువుల తయారీ పనులను గురించి 362 పేజీల 'చేతిపనులు' అనే గ్రంథాన్ని వ్రాశారు. సిరాలు, సబ్బులు, హేర్ ఆయిల్స్, ఐస్‌క్రీమ్స్ షర్బతులు వంటివెన్నో ఎట్లా తయారు చేయాలో విధానాలు వ్రాశారు. 1920లోనే 'బాల విజ్ఞాన మంజూష' అనే పుస్తకాన్ని ముద్రించారు. ఇందులో 108 ప్రశ్న జవాబులు ఉన్నాయి. ఒక తాతను మనవడు అడిగినట్లు, జవాబులు ఇచ్చినట్లు వ్రాశారు. ఆకాశం ఊడిపడ్తుందా? మేఘాలెట్లా తయారవుతాయి? వంటి ప్రశ్నలకు శాస్త్రసంబంధమైన జవాబులుగల ఈ పుస్తకం చాలా ఉపయోగమైంది. పునః ముద్రణకు నోచుకోవాల్సినది.

ఫొటోలు తీయించుకుంటే ఆయుక్షీణమనే మూఢ నమ్మకాన్ని ఆ కాలంలో వీరు ఫొటోలు దిగి ప్రజల భయాన్ని పోగొట్టి, నేర్చుకొని 'ఛాయకర్షణము' (ఫొటోగ్రఫీ) అనే పుస్తకాన్ని వ్రాశారు. 36 పేజీలలో 81 పాయింట్లతో వివరంగా ఉందీపుస్తకం. రసాయన, భౌతికశాస్త్ర విషయాలపైన శాస్త్ర, సాంకేతిక పారిభాషిక పదాలు గ్రంథంగా వ్రాశారు. 'అనాటమి' శారీరక శాస్త్రాన్ని వ్రాశారు. ముత్యాలవంటి చేతివ్రాతలో తాము వ్రాసిన పుస్తకాలను తామే బౌండ్ చేసుకొనేవారు.

వేదాలను నీతిశాస్త్రాలను, శతకాలను పుక్కిటబట్టిన ఒద్దిరాజు సోదరులు ఎందరో విద్యార్థులకు, శిష్యులకు, విద్యాదానంతోపాటు అన్నదానం కూడా చేశారట. సకల సౌకర్యాలను ఉచితంగా కల్పించి శిష్యులతో ఎన్నో పరీక్షలను వ్రాయించేవారట. ఏ క్రొత్త విషయాన్ని తెలుసుకున్నా అందరికీ తెలియజెప్పే కృషీవలురు వీరు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంవారు ఈమధ్యనే వీరు వ్రాసిన కవితలను 'హరివిల్లు' పుస్తకంగా వేశారు. సాహిత్యంలో ఏకసూత్రులు ఉన్న సోదరుల జీవనగమనంలో రామలక్ష్మణులు వీరేనా అన్నట్లు ఉండేవారట.

దేశభక్తి, సాహిత్యభక్తి రెండూ స్రవంతులుగా ప్రవహించిన ఈ దైవ భక్తులైన ఒద్దిరాజు సోదరులు తెలుగు భాషపై ఒక చక్కని పద్యాన్ని వ్రాసి ధన్యులయ్యారు. మనల్ని ధన్యులజేశారు.

సీ. ఏరంగు పూత సింగారము గావలె  
కెందామరల రేకులందములకు  
ఏ అత్తరువు చేర్పులెందులకయ్యె  
మెట్టదామరల బూపుట్టువులకు?  
ఏ మెత్తరికముల నెక్కింపగావలె  
ముద్దైన ఆ వెన్నముద్దలకును?  
ఏకమ్మ చక్కారపాకు, చేర్పగ వలె  
దాకొని పండినదా కులుకులను?

తే.గీ. తనకుగల చక్కదనమది తనకుగాని  
వేరొకటి చేర్ప మిక్కిలి ఐలయునెట్లు?  
తెలుగులో విదుగాపుల పలుకులన్ని  
గలుపబేకురు నెట్టుల కులుకుదనము!

# 101 పి.వి. నరసింహారావు

– డా॥ వి.వి. రామారావు

పి.వి.నరసింహారావు!
తెలుగు వాడి తేజం!
ఒక చైతన్యఝురి!
ఒక అద్భుత సాహితీలహరి
బహుముఖప్రజ్ఞాశాలి.. బహుభాషావేత్త..
అంతేకాదు.. కాలం, సమాజపత్మం మీద చేసిన అందమైన హస్తాక్షరి

బీజం నుండి భూజం వరకు ఆయన వ్యక్తిత్వం ఎదిగింది. బిందువు నుండి సింధువు వరకు ఆయన ప్రజ్ఞ బహుముఖీనంగా విస్తరించింది.

పి.వి. గారి అపురూప వ్యక్తిత్వాన్ని పరిచయం చేయడానికి భాష చాలదు. ఆయన మేథస్సును అంచనా వేయడానికి ఊహ చాలదు. దేశం(రాజకీయ రంగం)లో సమకాలీన సంక్షుభిత రాజకీయాలను మేధావులు కూడా ప్రభావితం చేయగలరని పి.వి. గారి ద్వారా నిరూపితమైనది.

పి.వి. నరసింహారావుగారు 1921లో జూన్ 28వ తేదీన వరంగల్ జిల్లా వర్ధంపేట మండలం, లక్నపల్లి గ్రామంలో రుక్మాబాయమ్మ, సీతారామారావు దంపతులకు జన్మించారు. తరువాత కరీంనగర్ జిల్లా భీమదేవరపల్లి లోని వంగర గ్రామానికి చెందిన రంగారావు, రత్న బాయమ్మలకు దత్తుడై, తొలుత వేలేరులో, తదుపరి హన్మకొండలో చదువు కొన్నారు. వందేమాతరం ఉద్యమంలో పాల్గొని ఉన్నత పాఠశాల చదువుల నుండి బహిష్కరణకు గురైనారు. నిజాం రాష్ట్రం వీడి పూనా నగరంలోని ఫర్గూసన్ కాలేజిలో చేరి బిఎస్సీ వరకు చదివారు. ఆ తరువాత నాగపూర్ యూని వర్సిటిలో 'లా' చదివి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై స్వర్ణ పతకం పొందారు.

పి.వి. గారు హైదరాబాద్ తిరిగి వచ్చి శ్రీ బూర్గుల రామకృష్ణారావు గారి వద్ద జూనియర్‌గా చేరి న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. కాని నిజాం నిరంకుశత్వవిధానాలు, రజాకార్ల ఆగడాలు వారిని స్థిమితంగా ఉంచలేకపోయాయి. స్వామీ రామానందతీర్థగారి పిలుపుతో స్వాతంత్ర్యోద్యమంలో చేరారు. టి.హయగ్రీవాచారి, కె.వి.నర్సింగరావు, గోవింద రావు షరాఫీ ప్రభృతులతో కలిసి మహారాష్ట్రలో చాందా నగరం చేరి అజ్ఞాతవాసం చేస్తూ సమరశంఖారావం చేశారు.

1948లో పోలీసు చర్య వల్ల హైదరాబాద్ సంస్థానం విముక్తిపొంది, భారత్ యూనియన్‌లోకి విలీనమయ్యాక, పి.వి.గారు మార్క్సిస్టు మిత్రుడు పాములపర్తి సదాశివరావు గారితో కలిసి 'కాకతీయ' వారపత్రికను నిర్వహించారు. చిత్రమేమిటంటే ఆర్యసమాజోద్యమంతో ఎదిగి, ప్రజాకవిగా మారిన కాళోజి నారాయణరావు – కమ్యునిజం వైపు వెలుగు చూపిన పాములపర్తి సదాశివరావులకు–ఆప్తమిత్రుడయ్యారు పి.వి.

పి.వి.గారు మౌలికంగా సామ్యవాది. సౌమ్యశీలి.

1951లో అఖిల భారత కాంగ్రెసు కమిటీలో సభ్యునిగా చేరి, 1952లో కరీంనగర్ D.C.C. అధ్యక్షుడయ్యారు.

1957లో కరీంనగర్ జిల్లా మంథని నియోజకవర్గం నుంచి అసెంబ్లీకి పోటీ చేసి గెలుపొందిన పి.వి. గారు తమ రాజకీయ ప్రస్థానానికి శ్రీకారం చుట్టారు. ఆ తరువాత 1962, 67, 72 సంవత్సరాల్లో కూడా శాసనసభ్యునిగా గెలుపొంది మంథని ప్రాంతాభివృద్ధికి పాటుపడినారు.

1962లో నీలం సంజీవరెడ్డిగారి మంత్రివర్గంలో మొదటిసారిగా న్యాయశాఖ, జైళ్ళు, సమాచార శాఖ మంత్రిగా చేరారు. 'ఓపెన్ జైలు' ప్రతిపాదన తెచ్చి మొదటి ఓపెన్ జైలును అనంతపురంలో ఏర్పాటు చేయించారు. ఖైదీల సంక్షేమం కోసం పలు చర్యలు తీసుకున్నారు. వరంగల్ జైలు ఖైదీలకు అజంజాహి మిల్లు కార్మికుల ద్వారా తివాచీలు, చద్దర్లు తయారు చేయించడంలో శిక్షణ యిప్పించారు.

1964-67 మధ్యకాలంలో దేవాదాయ శాఖ మంత్రిగా శిథిలమైన దేవాలయాలను ఉద్ధరించడానికి బడ్జెట్టు మంజూరు చేయించారు.

1967లో పి.వి. గారు వైద్య ఆరోగ్య శాఖామాత్యులయ్యారు. గర్భవతులైన గ్రామీణ పేద స్త్రీలకు సత్వర వైద్యసదుపాయం అందేలా ఏర్పాట్ల చేయించింది పి.వి.గారే.

1968-71లో తనకు అత్యంత యిష్టమైన విద్యాశాఖమాత్యులై ఎన్నో సంస్కరణలు చేపట్టారు. తెలుగు అకాడమికి రూపకల్పన చేసింది పి.వి. గారే.

1969లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం వువ్వెత్తున ఉబికింది. 1971లో కాంగ్రెస్ పార్టీ అధిష్ఠాన వర్గం పి.వి. గారిని ముఖ్యమంత్రిగా నియమించింది. ముఖ్యమంత్రిగా చరిత్రాత్మకమైన భూసంస్కరణల చట్టాన్ని ప్రవేశ పెట్టి నూతన ప్రజాస్వామిక విప్లవానికి నాంది పలికినారు. తెలంగాణ రాష్ట్రంలోని భూస్వాములకు పి.వి. గారి సంస్కరణలు నచ్చలేదు. కాంగ్రెస్ అధిష్ఠాన వర్గానికి మొరపెట్టుకున్నారు. రాబోయే ఎలక్షన్లలో పార్టీకి భారీ పరాజయం తథ్యమని పి.వి. సమర్థుడైన నాయకుడు కాదని ఫిర్యాదుల వెల్లువ వెళ్ళింది. దానికి జై ఆంధ్ర ఉద్యమం తోడైంది. రాష్ట్రంలో అనిశ్చిత రాజకీయ పరిస్థితి ఏర్పడిందని నాటి ప్రధాని ఇందిరాగాంధీ పి.వి. గారితో రాజీనామా చేయించింది. దాంతో పివిశకం ముగిసిందని నాటి తిరుగుబాటు దారులు సంతోషించారు. కానీ అధిష్ఠాన వర్గం పి.వి. గారిని 1974లో అఖిల భారత కాంగ్రెస్ పార్టీకి ప్రధాన కార్యదర్శిగా నియమించి, రాష్ట్రానికన్నా దేశానికే పి.వి. గారి సేవలు అవసరమనే సంకేతాన్ని అందించింది.

1977లో కాంగ్రెస్ పార్టీ, దేశ వ్యాప్తంగా ఘోర పరాజయం పొందిన తరుణంలో, పి.వి. గారు హనుమకొండ నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ఎన్నికై తొలిసారిగా పార్లమెంటులో అడుగుపెట్టి, ప్రతిపక్షంలో కూర్చొని తన ప్రతిభాపాటవాలు ప్రదర్శించారు. కీలకమైన పబ్లిక్ అకౌంట్స్ కమిటికే చైర్మన్‌గా ఎన్నికై దేశమంతా పర్యటించి, వివిధ ప్రభుత్వరంగ సంస్థలు పనిచేస్తున్న తీరు తెన్నులను నిశితంగా పరిశీలించారు.

1980లో లోక్ సభ ఎన్నికల్లో, తిరిగి హనుమకొండ నియోకజవర్గం నుంచి గెలిచి, శ్రీమతి ఇందిరాగాంధి మంత్రి వర్గంలో, విదేశాంగ మంత్రిగా చేరారు. తన బహుభాషా ప్రావీణ్యంతో అసమాన ప్రతిభతో భారతదేశ విదేశాంగ విధానాన్ని అలీన రాజ్య సిద్ధాంతాన్ని, ఐక్యరాజ్యసమితి, మొదలు అనేక దేశాలలో చాటిచెప్పి విదేశాలకు మనదేశం పట్ల గల గౌరవభావాన్ని అధికం చేశారు.

శ్రీమతి ఇందిరాగాంధీ హత్య అనంతరం, శ్రీ రాజీవ్ గాంధి ప్రధాని కావడంలో కీలకపాత్ర పోషించారు. రాజీవ్ మంత్రివర్గంలో మానవ వనరుల అభివృద్ధిశాఖను జవహర్ నవోదయ విద్యాసంస్థలు, జాతీయ సాక్షరతా మిషన్, నెహ్రూయువకేంద్ర మొదలైన 40 విభాగాలతో ప్రతిపాదించి, ఆ శాఖకు క్యాబినెట్ హోదా మంత్రిగా, 1985నుండి 1989 వరకు, అమూల్యమైన సేవలందించారు.

1991లో రాజీవ్ గాంధి దారుణంగా హతుడైన అత్యంత క్లిష్టపరిస్థితుల్లో పి.వి. గారు దేశప్రధానిగా పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఉగ్రవాదం, తీవ్రవాదం బుసలు కొడుతున్న తరుణమది. ఆర్థికవ్యవస్థ ఛిన్నాభిన్నమై మన బంగారం నిల్వలను కూడా విదేశాలకు తాకట్టు పెట్టవలసిన దుస్థితిలో దేశం వున్నది. పి.వి. నేతృత్వం వహించింది మైనారిటి ప్రభుత్వానికి. గోల్డ్ బాండ్ స్కీం వంటి పలు పథకాలు ప్రవేశపెట్టి 50 సంవత్సరాల్లో సున్నాశాతం

అభివృద్ధిరేటును 7% స్థాయికి పెంచి ఆర్థికంగా ఘన విజయం సాధించారు. పాకిస్తాన్, చైనా, అమెరికాలు పర్యటించి ఆయా దేశప్రభుత్వాల వైఖరులనీ భారత్‌కు అనుకూలంగా మార్చారు. తనకంటూ ఓ బలమైన వర్గాన్ని ఏర్పరచుకోలేకపోయిన పి.వి. గారు, నెహ్రూ కుటుంబేతర వ్యక్తిగా దేశానికి నాయకత్వం వహించి అపరచాణక్యునిగా పేరు తెచ్చుకున్నారు.

రాజకీయనాయకులలో సాహితీ సాంస్కృతిక స్పర్శ కనిపించదు. కానీ పి.వి. గారిలో మరో కోణం సాహిత్యం. వారు అష్టభాషా ప్రవీణులు. 28 భాషల్లో ప్రవేశమున్నది. ఎన్నో గ్రంథాలకు పీఠికలు రాశారు. లోపలిమనిషి, అబల జీవితం, గొల్ల రామవ్వ, నీలిరంగుపట్టుచీర, సహస్రఫణ్ మొదలైన రచనలు వారి సాహితీ సృజనకు నిదర్శనాలు. ప్రాశ్చ పాశ్చాత్య రచనలెన్నో అధ్యయనం చేసిన మేధావి. సాహిత్యంతో పాటు హిందుస్థానీ సంగీతాన్ని బాగా ఆస్వాదించేవారు.

1975లో కౌలాలంపూర్‌లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల్లో కీలకపాత్ర వహించారు. 1982లో వరంగల్ లో జరిగిన పోతన పంచశతి ఉత్సవాలకు మూలపురుషుడు పి.వి. గారే హైద్రాబాద్‌లో ఉర్దూ విశ్వవిద్యాలయానికి కృషి చేశారు. తిరుపతిలో రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠాన్ని, నెలకొల్పారు. ఆకాశవాణిలో సంస్కృతం ఉర్దూ-భాషల్లో వార్తలు చదవటాన్ని ప్రవేశపెట్టింది పి.వి. గారే.

పి.వి. గారికి ఎనమండుగురు సంతానం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన కీ॥శే॥ పి.వి.రంగారావు వీరి జ్యేష్ఠపుత్రులు. సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం ఎంపి, పారిశ్రామికవేత్త కీ॥శే॥ పి.వి.రాజేశ్వరరావు గారు వీరి ద్వితీయ పుత్రులు. మూడోకొడుకు పి.వి. ప్రభాకరరావు గారు వ్యాపారవేత్త. శారద, సరస్వతి, వాణి, జయ, విజయలు కుమార్తెలు. వీరిలో శ్రీమతి సురభివాణీ దేవి అంతర్జాతీయ చిత్రకళాకారిణిగా పేరుతెచ్చుకున్నారు.

1970లో భార్య సత్యమ్మ మరణించినా, 1980లో మాతృవియోగం కలిగినా చలించక, ప్రజాసేవకే తన జీవితాన్ని అంకితమిచ్చిన స్థితప్రజ్ఞుడు శ్రీ పి.వి.

పి.వి. గారు వ్యక్తులకు, అధినేతలకు విధేయుడు కాదు. తను నమ్మిన కాంగ్రెస్ పార్టీకే విధేయుడైనారు. అందుకే వారు ఎన్నడూ పార్టీని వీడలేదు. వెన్నుపోటుకు గురైనారే కానీ వెన్నుపోటు పొడవలేదు.

ఆధునిక భారతచరిత్రలో అరుదైన శకాన్ని సృష్టించి, అభ్యుదయ భావాలతో జీవించిన ఆధ్యాత్మిక వేత్త, రాజకీయ వేదాంతి.

" నేనొక చైతన్యోర్మిని
దిక్కుల ప్రగతి శకలమును
ఇది నా సంతత కర్మ-
మరే హక్కులు లేవునాకు.

ఈ విధానం నిశీధి, మహిత జాగృతీ పుంజముగ వెలుగుటయే
నా తపస్సు
వెలిగించాలి - నా ప్రతిజ్ఞ"

అని ఎన్నడో 1972 ప్రాంతంలోనే తన దృక్పథాన్ని కవితాత్మకంగా చాటి చెప్పారు.

"మనం బతకాలంటే కలిసి బతకడం నేర్చుకోవాలి" అని చెప్పిన పి.వి. గారి జీవన మహా ప్రస్థానం 2004 సంవత్సరం డిసెంబర్ 23వ తేదీన ముగిసింది. జాతి ఓ గొప్ప మేధావిని కోల్పోయిందని ప్రపంచదేశాలు సంతాప సందేశాన్ని ప్రకటించాయి.

పి.వి. గురించి మహాకవి దాశరథి ఏనాడో చెప్పిన కవిత -

" మా పి.వి. మేధావి 'మధుర కళాజీవి'
అతని వంశం వాగ్దేవి - అతని పరం నవ భావి"

ప్రజాకవి కాళోజి అన్నట్లు - పి.వి. ఓ మహాపురుషుడే కాదు ఓ మధురమైన కల.

## 102 పైడి జైరాజ్

– పొన్నం రవిచంద్ర

భారతీయ సినిమా మాటలు నేర్వక ముందు మూకీ యుగంలోనే తెలంగాణ గడ్డమీద పుట్టిన పైడి జైరాజ్ ముంబాయి చేరుకుని స్టార్‌గా ఎదిగి తన కీర్తి బావుటాను ఎగురవేశాడు. అటు మూకీ సినిమాల్లోనూ తర్వాత వచ్చిన టాకీ సినిమా ప్రపంచంలోనూ తనదైన విలక్షణతను చాటుతూ భారతీయ సినీ యవనికపై వెలుగొందినవాడు పైడి జైరాజ్. ఆరడుగుల ఆజాను బాహుడైన జైరాజ్ ఆనాటికి అత్యంత వెనుకబడ్డ కరీంనగర్‌లో పుట్టి, హైదరాబాద్ నగరంలో చదువుకుని, నటనపైన, సినిమా రంగంపైన వున్న మక్కువతో ముంబాయి చేరుకుని అంచెలంచెలుగా ఎదిగి భారతీయ సినీ చరిత్రలో చిర స్థాయిగా మిగిలిపోయాడు. సినిమా వికాసానికి తన జీవిత కాలంలో చేసిన సేవలకుగాను 1980లోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమయిన దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును అందుకుని తెలంగాణా కీర్తిని నలుదిశల వ్యాపింపచేశాడు.

సెప్టెంబర్ 28వ తేది 1909వ సంవత్సరం కరీంనగర్‌లో జన్మించిన పైడిపాటి జయరాజ్ ఇండియన్ నైటింగేల్ సరోజిని నాయుడు భర్త ఎం. గోవిందరాజులు నాయుడుకు మేనల్లుడు. బాల్యంలోనే జైరాజ్ కుటుంబం కరీంనగర్ నుండి హైదరాబాద్ వెళ్ళి స్థిరపడింది. జైరాజ్‌కు చిన్నప్పటినుండి నాటకాలంటే ఇష్టం. 1913లోనే దాదాసాహెబ్ ఫాల్కే హిందీ సినిమాకు పురుడు పోశాక రంగుల కళ దేశమంతా విస్తరించింది. అందుకే కావచ్చు నిజాం కాలేజ్‌లో చదువుచున్నపుడే సినిమాల్లో హీరోగా చేయాలన్న కోరిక జైరాజ్‌కు కలిగింది. అందుకే అన్న సుందర రాజ్ తన తమ్ముడు ఇంజనీరై హైదరాబాద్‌లో పనిచేయాలన్న అభిష్టానికి భిన్నంగా సినిమా నటుడు కావాలని నిర్ణయించుకున్నాడు. ఏదో సందర్భంలో సరోజిని నాయుడు జైరాజ్‌ను తన అల్లుడుగా కాకుండా స్వయం కృషితో నీ ప్రతిభ ఏమిటో నీ కాళ్ళపై నిలబడి నిరూపించుకోవాలని ఉపదేశించడంతో జైరాజ్ పట్టుదలతో సినీరంగంలో తన ప్రతిభను పరీక్షించుకోవాలని 1928లో ముంబాయి రైలు ఎక్కాడు. ఆ రోజుల్లో తెలుగు సినిమా పరిశ్రమ ఇంకా కళ్ళు తెరవలేదు. హిందీ సినిమాల్లో మూకీ ట్రెండ్ నడుస్తుంది. అలాంటి టైమ్‌లోనే అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ముంబాయి వెళ్ళాడు జైరాజ్. తెలుగువాళ్ళంతా మద్రాస్ వెళ్ళి వేషాలు వెతుక్కుంటుంటే తెలంగాణాకు చెందిన జైరాజ్ మాత్రం పది అడుగులు ముందుకు వేసి ముంబాయిలో తొలితరం బాలీవుడ్ నటుడుగా పునాది వేశాడు.

పైడి జైరాజ్ ముంబాయిలో అడుగుపెట్టే సమయానికి అనేక హిందీ సినిమాలు రిలీజ్ అవుతున్నాయి. అప్పటికే బాలీవుడ్‌లో చాలా కాంపిటీషన్ ఉంది. సంపన్న కుటుంబాలకు చెందిన వారికి మాత్రమే సినిమా అవకాశం దక్కేది. ఆరడుగుల ఎత్తు ఆకట్టుకునే శరీర సౌష్టవం, ఇతర నటులను తలదన్నే రూపంతో జైరాజ్ పదిమందిలో ప్రత్యేకంగా కనిపించేవాడు. అయినా అవకాశాల కోసం

జైరాజ్ ఎదురు చూశాడు. అదే సమయంలో ముంబాయిలో మహావీర్ ఫిలిం కంపెనీలో పనిచేసే తన చిన్ననాటి స్నేహితుడు మావరేర్కర్ అనే నిర్మాత దగ్గరకు తీసుకువెళ్ళి పరిచయం చేశాడు.

జైరాజ్ తెలంగాణాలో పుట్టడం, హైదరాబాద్‌లో చదువుకోవడం కారణంగా ఉర్దూ, హిందీ, ఇంగ్లీష్, భాషల్లో అనర్గళంగా మాట్లాడటంతోపాటు, ఆయన అందానికి శరీర సౌష్టవానికి ముచ్చటపడి మావరేర్కర్ తన సినిమాలో అవకాశం ఇవ్వడమేకాక ఆయనే స్వయంగా జైరాజ్‌కు మేకప్ చేయడం ఆయన సినీ జీవితంలో అనుకోని మలుపు. అయితే ఆ సినిమా పూర్తి కాకపోయినప్పటికీ అదే సినిమా దర్శకుడు నాగేంద్ర మజుందార్ తన సొంత చిత్రం 'జగమ్ గాతి జవాని' అనే మూకీ చిత్రంలో జయరాజ్‌కు సహాయ నటుడిగా అవకాశం ఇచ్చారు. ఆ చిత్రంలోని కథానాయకుడు మాదవ్ ఖేల్‌కు గుర్రం స్వారీ, యుద్ధం చేయడం రాకపోవడంతో ఆయా సన్నివేశాల్లో ముసుగు వేసుకుని జైరాజ్‌ను నటింపచేసారు. ఆ తర్వాత నాగేంద్ర మజుందార్ నవజీవన ఫిల్మ్ వారి 'రస్సేరి రాణి' చిత్రంలో జైరాజ్‌ను హీరోగా పరిచయం చేశారు.

'ది ప్రిజెన్ ఆఫ్ జెండా' అనే ఇంగ్లీష్ నవల ఆధారంగా తీసిన ఈ చిత్రంలో జైరాజ్ ప్రక్కన ఫేమస్ హీరోయిన్ మాధురి నటించింది. ఈ చిత్రం అప్పటి మూకీ చిత్రాలలో ఐదు వారాలు నడిచి సంచలనం సృష్టించింది. దాంతో నవజీవన్ ఫిల్మ్‌కి జయ్‌రాజ్ మరో నాలుగు సినిమాలు చేశారు. తర్వాత శారద ఫిల్మ్ కంపెనీ ద్వారా జహీరున్నీసా హీరోయిన్‌గా 'మహాసాగర్ నో మోతి' అనే పెద్ద చిత్రంలో హీరోగా చేశారు. అది గొప్ప సక్సెస్ కావడంతో మూకీ చిత్రాల్లో గొప్ప నటులైన దిల్లీ మోరియా, శాంతారాం, జాన్ మార్చంట్, పృథీరాజ్ కపూర్‌ల సరసన జైరాజ్ చేరారు. అప్పుడు శారద ఫిల్మ్‌కి మరో ఐదు చిత్రాలు చేశారు. అలాగే 1930లో 'స్పార్కింగ్ యూత్' అనే మూకీ చిత్రంతోపాటు 'ట్రయాంగిల్ ఆఫ్ లవ్', 'మాతృభూమి', 'ఫైట్ ఇన్ టూ డెత్' చిత్రంలో కథానాయకుడిగా నటించారు.

1931లో మొట్టమొదటి టాకీ చిత్రం 'ఆలం అరా' వచ్చినప్పటికీ స్వయంగా పాడుకోలేకపోవడంవల్ల వెంటనే జైరాజ్‌కు ఛాన్స్ రాలేదు. తర్వాత అదే ఏడాది హిందీ, ఇంగ్లీష్, ద్విభాషా చిత్రం 'షికారి'లో బౌద్ధ సన్యాసి పాత్రను పోషించారు.

జైరాజ్ మొదటి పౌరాణిక చిత్రం 'అహల్య ఉద్దార్'లో హీరోగా వెలిగిపోయాడు. ఈ చిత్రంతో యాక్షన్ ఎడ్వంచర్ చిత్రాల్లో ఆయనకు అనేక సినిమాల్లో నటించే అవకాశం వచ్చింది. ఆయన మొట్టమొదటి సాంఘిక విప్లవాత్మక సినిమా మున్షీ ప్రేమ్‌చంద్ ప్రేమకథపై 'మిల్‌మజ్దూర్', 1936లో ఇండియన్ ఫిల్మ్ కార్పొరేషన్ కరాచిలో చేసిన 'బేరోజ్‌గార్' సినిమాలో లీలా చిట్నీస్ పక్కన హీరోగా చేశాడు. కరాచీలో 'గ్యాంగ్‌లో' అనే మరో చిత్రాన్ని చేశాడు. అనంతరం ముంబాయి తిరిగి వచ్చిన తరువాత ననూభాయ్ దేశాయ్ మునియోటోన్‌కి మూడు సినిమాలు, జియాసర్హది దర్శకత్వంలో 'అఫ్సానా', సాకేశ్‌కీ దర్శకత్వంలో 'మురాద్' చిత్రాలు చేశాడు. 'రైఫిల్ గర్ల్' అనే చిత్రం ద్వారా హీరో యూసుఫ్ ఆఫంది కంటే జయరాజ్‌కి గొప్ప పేరు వచ్చింది. అప్పటికే జయ్‌రాజ్ పేరుమీద సినిమాలు నడిచే స్థాయికి చేరుకున్నాయి.

ఫ్రాంజ్ ఆస్టిమ్ దర్శకత్వంలో జయ్‌రాజ్ హీరోగా 1936లో రూపొందించిన 'బాబీ' అనే చిత్రం ముంబాయిలో స్వర్ణోత్సవం జరుపుకోవడం, కలకత్తాలో 80 వారాలపాటు నడిచి చరిత్రను సృష్టించింది. ఇంకా 'పురంజన్‌దేవతన్', 'బిజిలి', 'మాల' చిత్రాలు జయ్‌రాజ్‌ని సూపర్‌స్టార్ చేయడంతో ఆయన క్రమ క్రమంగా ప్రఖ్యాత హీరోగా ఎదిగి భారతీయ చలన చిత్ర రంగంలో అభిమానుల ప్రశంసలు సంపాదించుకున్నారు.

1939లో జయ్‌రాజ్ పంజాబీ వనిత సావిత్రిని పెళ్ళాడడం, అంతవరకు నెలకి 300 రూ.లు ఉన్న జీతం కూడా 600 రూ.లకు పెరగడం జరిగింది. 1942లో దిలీప్‌రాజ్, తర్వాత జయతిలక్, కూతుళ్ళు జయశ్రీ, దీప, గీత జన్మించారు.

పెళ్ళి తర్వాత బి.ఎమ్. వ్యాస్ చిత్రం 'ప్రఖ్యాత', కె.ఎ. అబ్బాస్ సినిమా 'నయా దునియా', ప్రకాశ్ ఫిల్మ్ వారి 'నయా కహాని', నవయుగ వారి 'నయీ తరాన', 'పన్నా' చిత్రాలు సజరసఖ్వీ దర్శకత్వంలో చేయటం ఆయన సినీ జీవితంలో

మరికొన్ని మలుపులు, నవయుగ వారి సాదన్ కా ఘర్ చిత్రం చేస్తున్నప్పుడే జైరాజ్ పూనాలో స్థిరపడ్డారు. తర్వాత శాలిమార్ వారి 'ప్రేమ్ సంగీత్' బాంబే టాకీస్ వారి 'అమియా', 1943లో బాలీవుడ్ ఫేమస్ నిర్మాణ సంస్థ షాలిమార్ పిక్చర్ చక్రవర్తి దర్శకత్వంలో రూపొందించిన 'హమారీ బాత్' చిత్రంలో టాప్ హీరోయిన్ దేవికారాణి సరసన చేయటం జరిగింది. ఈ చిత్రం మ్యూజికల్‌గా సూపర్ హిట్ అవటంతో బాలివుడ్‌లో జైరాజ్ స్టార్ స్టేటస్ సంపాదించుకున్నారు. ఇది దేవికారాణి చివరి చిత్రం.

జైరాజ్ అనేక చిత్రాలలో ఎన్నో రకాల పాత్రలు పోషించినప్పటికి జాతీయ నాయకుల పాత్రలు దేశానికి గుర్తెందేవి – ప్రేరణ కలిగించేవి. ఒక నటుడిగా ఈ పాత్రలే తనకు ఎక్కువగా సంతృప్తినిచ్చినట్లు ఆయన చెప్పేవారు. జైరాజ్ చిత్ర జీవితంలో 1946 నుంచి చారిత్రాత్మక సినిమాల్లో పనిచేసిన ఎనిమిది ఏళ్ళు ప్రాధాన్యమైనవి. 1946లో మహారాణా ప్రతాప్ సోదరుడైన శక్తిసింగ్‌గా నటించిన 'రాజ్‌పుటాని' మొదటి చారిత్రాత్మక సినిమా, తర్వాత 'షాజహాన్' చిత్రంలో తాజ్‌మహల్ రూపకర్త అయిన 'భంగత్ రాజ్ శిరాజి' పాత్ర పోషించారు. 'అమర్‌సింగ్ రాథోడ్', 'వీర దుర్గాస్', 'పృథ్వీరాజ్ చౌహాన్', 'రాణా ప్రతాప్', 'టిప్పుసుల్తాన్', 'రజియా సుల్తానా', 'అల్లాజిదాల్', 'రాణా హమీర్' మొదలైన చిత్రాలలో చారిత్రక పాత్రలు పోషించి అందర్నీ అలరించారు. 'షహీద్–ఎ–అజం' చిత్రంలో చంద్రశేఖర్ ఆజాద్ పాత్రలో జైరాజ్ లీనమై నటించడంతో ఆయనకి ఆ పాత్ర విశేషమైన ఖ్యాతిని తెచ్చిపెట్టి లక్షలాది యువకులు ఆయన అభిమానులయిపోయారు.

జైరాజ్ చేసిన ఒకే ఒక ఫాంటసీ చిత్రం 'హతీంతాయి' ఒక గొప్ప సినిమా, అందులో షకీలా పై చేసిన 'సర్వర్‌దిగార్ ఆలమ్' అనే పాట ఎంత పాపులర్ అంటే హైదరాబాద్ నిజామ్ ఆ పాటని 10 సార్లు రివైండ్ చేయించుకొని చూసారట.

జైరాజ్ మొట్టమొదటి మల్టీస్టారర్ చిత్రం కె.ఎ. అబ్బాస్ నిర్మించిన 'చార్ దిల్ చార్ రహే'లో రాజ్‌కపూర్, మీనాకుమారి, షమ్మీకపూర్‌లతో కలిసి నటించారు. జైరాజ్ హీరోగా మీనా కుమారి బాలనటిగా నటించిన ఈ సినిమాలోని ఫొటోలు చూస్తూ జైరాజ్ ఎప్పుడూ ఆనాటి అనుభూతులు జ్ఞాపకం చేసుకునేవారు. ఆయన సినీ జీవితంలో నటించిన 'శకారి', 'ముజ్దార్', 'తీరందాజ్', 'పిక్‌పాకెట్', 'బాబీ', 'ముంతాజ్ మహల్', 'రజీయా సుల్తానా', 'సాజన్‌కా ఘర్', 'ప్రేమ్ కహానీ', 'హమారీ బాత్', 'ప్రేమ్ సంగీత్', 'షన్నా', 'రిటర్న్ ఆఫ్ మిష్టర్ సూపర్‌మాన్', 'పరివార్', 'మధుర్ మిలన్', 'పతీత పావన్', 'ఔరత్ కా దిల్', 'అంజుమాన్' లాంటి అనేక చిత్రాలు ఆయనకు మంచి గుర్తింపుని తెచ్చిపెట్టాయి.

జైరాజ్ హీరోగా చేసిన చివరి చిత్రం 1965లో వచ్చిన 'కుహీకౌన్ ముజ్జికౌన్', తర్వాత జైరాజ్ కేరెక్టర్ ఆర్టిస్ట్‌గా పేరు తెచ్చుకున్నారు. జైరాజ్ తన 70 వసంతాల సినీ ప్రయాణంలో 11 మూకీ సినిమాల్లో నటించి తన సత్తా నిరూపించుకొని, 156కు పైగా టాకీ సినిమాల్లో హీరోగా మొత్తం దాదాపుగా 300 సినిమాల్లో పైగా నటించారు. 1931లో ప్రారంభమైన టాకీ యుగంలో ఆయన "షికారి" ఉర్దూ చిత్రంలో హీరోగా టాకీల్లో ప్రవేశించి తర్వాత కాలంలో శాంతారాం, పృథ్వీరాజ్‌కపూర్, షమ్మీకపూర్‌ల లాంటి హీరోల సరసన మరో పెద్ద హీరోగా పేరు తెచ్చుకున్నారు. నిరుపారాయ్, శశికళ, దేవికారాణి, మీనాకుమారి, మాధురి, షకీలా, శోభనా లాంటి హీరోయిన్‌ల సరసన కథా నాయకుడిగా నటించి అనేక విజయాలను సొంతం చేసుకున్నారు. ఆరడుగుల అందగాడైన 'జైరాజ్' హిందీ చిత్రరంగంలో 1930లో వచ్చిన 'జగ్‌మతి జవాని' చిత్రంతో మొదలైన విజయపరంపర 1995 'గాడ్ అండ గన్' చిత్రం వరకు కొనసాగింది. జైరాజ్ బుల్లితెరపై సైతం కాలు మోపారు. 1990లో 'ఖూన్ బారీ మాంగ్' అనే టీవీ సీరియల్‌లో నటించారు. వాళ్ళబ్బాయి 'దిలీప్‌రాజ్' 'అస్మాన్ హహత్' చిత్రంలో నాయకుడిగా నటించినా ఆ తరువాత ఆయన సినిమా రంగానికి దూరంగానే ఉండిపోయారు.

జైరాజ్ తెరమీదనే కాకుండా తెర వెనుక కూడా కీలక పాత్ర పోషించారు. కెమెరా, సెట్, ల్యాబ్ ఎడిటింగ్ నేర్చుకున్నారు. హీరోగా బిజీగా ఉన్న సమయంలోనే దర్శకుడుగా మారాడు. 1945లో దిలీప్ కుమార్ రెండవ సినిమా 'ప్రతిమ'ను జైరాజ్ డైరెక్టు చేసాడు. 1959లో 'రాజ్‌ఘడ్', 'మొహర్' లాంటి సూపర్ హిట్ చిత్రాలకు

దర్శకత్వం వహించారు. ఆ రెండు సినిమాల్లోనూ తన శిష్యుడు షమ్మీకపూర్‌కు హీరోగా అవకాశమిచ్చారు. అప్పటి టాప్ హీరోలు రాజ్‌కపూర్, షమ్మీకపూర్‌లు జైరాజ్‌ను 'పాపాజీ' అని పిలిచేవారు. 1951లో ప్రసిద్ధ ఆంగ్లకవి టెన్నిసన్ రాసిన ఓ కవిత ఆధారంగా నర్గీస్, భరత్ భూషణ్‌లతో 'సాగర్' చిత్రాన్ని స్వయంగా నిర్మించి దర్శకత్వం వహించారు. కానీ ఈ చిత్రం ఫ్లాప్ కావడంతో మళ్ళీ సినిమాలు తీయలేదు. ప్రముఖ సంగీత దర్శకులు నౌషాద్‌ను వెండితెరకు పరిచయం చేసింది కూడా జైరాజ్.

విలక్షణమైన నటుడిగా వైవిధ్యమైన పాత్రలు పోషించిన జైరాజ్ హిందీ, ఉర్దూ భాషలతోపాటు కొన్ని మరాఠీ, గుజరాతీ భాషా చిత్రాలలో కూడా నటించారు. మరాఠీ, గుజరాతీ సినిమా రంగానికి ఆయన చేసిన సేవలకు గుర్తుగా గుజరాత్, మహారాష్ట్ర ప్రభుత్వాలు జైరాజ్‌ను ఘనంగా సత్కరించాయి. 1939 నుండి సినీ ఆర్టిస్ట్ అసోసియేషన్‌లో సభ్యుడిగా ఉంటూ కళాకారుల సంక్షేమ కోసం ఎంతగానో కృషి చేశారు. అంతేకాకుండా మాజీ సైనికుల సంక్షేమం కోసం, జాతీయ విపత్తులు సంభవించినప్పుడు సంగీత కచేరీలు నిర్వహించి జైరాజ్ విరాళాలు సేకరించేవారు.

హిందీ, ఉర్దూ, గుజరాతీ, మరాఠీ భాషా చిత్రాలలో నటించిన జైరాజ్ తెలుగువాడై ఉండి కూడా ఒక్క తెలుగు చిత్రంలో కూడా నటించలేకపోయానన్న బాధని ఆయన సన్నిహితుల వద్ద ప్రస్తావించేవారట. తెలుగులో చిత్తూరు నాగయ్యతో కలిసి ఒక చిత్రం నిర్మించటానికి సన్నాహాలు చేసుకున్నా నాగయ్య గారు మరణించడంతో ఆ ప్రయత్నం నిలిచిపోయింది.

ఆగష్టు 11వ తేది 2000 సంవత్సరంలో ముంబాయిలో తన 90వ యేట తుది శ్వాస విడిచిన పైడి జైరాజ్ చలన చిత్ర సీమలో తనదైన శైలితో నటనా చాతుర్యంతో సంచలన విజయాలను సాధించి భారతీయ సినిమా వికాసానికి తన జీవితకాలం కృషి చేసాడు. మూకీ నుంచి టాకీ దాకా జయకేతనాలెగరేసి డెబ్భైమైళ్ళ సినీ చరితకు వారధిగా నిలిచిన తొలితరం నటుడు, దర్శకుడు, నిర్మాత అయిన పైడి జైరాజ్ పేర తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో పురస్కారాన్ని ఏర్పాటు చేయాలన్న నిర్ణయం తీసుకోవడం ముదావహం, అభినందనీయం.

# 103 పైడిమర్రి వెంకట సుబ్బారావు

**– మేరెడ్డి యాదగిరి రెడ్డి**

భారతదేశము నా మాతృభూమి
భారతీయులందరూ నా సహోదరులు
నేను నా దేశమును ప్రేమించుచున్నాను
సుసంపన్నమయిన బహువిధమయిన
నాదేశ వారసత్వసంపద నాకు గర్వకారణము
దానికి అర్హుడనగుటకై కృషి చేయుదునని,
నేను నా తల్లిదండ్రులను ఉపాధ్యాయులనూ,
పెద్దలందరినీ గౌరవింతునని,
నా దేశముపట్ల నా ప్రజల పట్ల భక్తిశ్రద్ధలు
కలిగి వుందునని ప్రతిజ్ఞ చేయుచున్నాను
వారి శ్రేయోభివృద్ధులే, నా ఆనందమునకు మూలము.

ఈ ప్రతిజ్ఞ మన పాఠశాలలో విద్యార్థులు ప్రతి నిత్యం ప్రార్థన సమయంలో చదవడం మనందరికీ విదితమే. ప్రాథమిక స్థాయి నుండి హైస్కూల్ స్థాయి వరకు అన్ని పాఠ్యపుస్తకాలలో పొందుపరచాయి కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు. అయితే ఎందువల్లో ఈ రచయిత పేరు చాలాకాలం అజ్ఞాతంగా వుండిపోయింది. జనగణమన, వందేమాతరం, తర్వాత అదే కోవలో నిత్యం మనపాఠశాలలో విద్యార్థులచే చదివిస్తున్న ప్రతిజ్ఞ రచయిత పైడిమర్రి వెంకటసుబ్బారావు. గత రెండు సంవత్సరాలుగా తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు ప్రతిజ్ఞ రచయితగా పైడిమర్రి వెంకట సుబ్బారావు పేరు పాఠ్య పుస్తకాలలో ప్రచురించడం వారి పేరు వెలుగులోకి రావడం సంతోషకరమైన విషయం.

పైడిమర్రి సుబ్బారావు తెలంగాణాలో నల్లగొండ జిల్లా కేంద్రానికి అతి సమీపంలోని అన్నెపర్తి గ్రామంలో జూన్ 10, 1916లో జన్మించారు. వీరి తల్లిదండ్రులు రాంబాయమ్మ, రామయ్య. వీరి విద్యాభ్యాసం నల్లగొండలోనే జరిగింది. వీరి కుటుంబం ఇప్పటికి నల్లగొండలోనే వుంది.

సుబ్బారావు బహుముఖ ప్రజ్ఞాశాలి. కవి, కథకుడు, నవలాకారుడు, నాటకకర్త. రచనా వ్యాసాంగంలోని వివిధ ప్రక్రియలలో చేయి తిరిగినవాడు. బహుభాషా కోవిదుడు. తెలుగు, ఇంగ్లీషు, హిందీ, ఉర్దూ, సంస్కృతం, పార్సీ భాషలలో వీరికి ప్రావీణ్యం వుంది.

సుబ్బారావు అప్పటి హైదరాబాదు రాష్ట్రంలో వుద్యోగంలోచేరి ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత ట్రెజరీ శాఖలో చేరి వివిధ జిల్లాలో పనిచేశాడు. హైదరాబాదు, బీదరు, నిజామాబాదు, ఖమ్మం, నల్లగొండ, నెల్లూరు, విశాఖ పట్నం జిల్లాలలో జిల్లా కోశాధికారిగా పనిచేశాడు. వారు విశాఖపట్నంలో పనిచేస్తున్నప్పుడు 1962లో చైనా యుద్ధం వచ్చింది. చైనా విద్యార్థులు యువకులకు దేశభక్తిని పెంపొందించే అంశాలు వాళ్ళ పాఠ్యపుస్తకాలలో వుండడం సుబ్బారావు గమనించారు. మనదేశపు విద్యార్థులు, యువతలో దేశభక్తిని ప్రేరేపించే వుద్దేశ్యంతో 'ప్రతిజ్ఞ' రాశారు సుబ్బారావు. తను రాసిన ప్రతిజ్ఞను ప్రముఖ సాహితీవేత్త, స్వాతంత్ర్యపోరాట యోధులు, తనకు సన్నిహితుడైన తెన్నేటి

విశ్వనాథానికి చూపించాడు. సుబ్బారావు అనేక సాహిత్య విషయాలు తెన్నేటితో చర్చించేవారు.

తెన్నేటి విశ్వనాథం, సుబ్బారావు రాసిచ్చిన ప్రతిజ్ఞను అప్పటి విద్యాశాఖామాత్యులు పి.వి.జి. రాజుకు చూపించారు. ఇది చాలా బాగుందని దేశభక్తిని పెంపొం దిస్తుందని అప్పటి ముఖ్యమంత్రి కాసుబ్రహ్మానంద రెడ్డితో చర్చించి 1963లో పాఠ్యపుస్తకాలలో పొందుపరచి ప్రతిరోజూ విద్యార్థులచే చదివించాలని ఉత్తర్వులిచ్చారు. ఆ తర్వాత ఒకటి రెండు సంవత్సరాలకు కేంద్రప్రభుత్వం, ఇతర రాష్ట్రాలవారు తమ తమ భాషలలో అనువదించి తమ పాఠ్యపుస్తకాలలో పొందుపరిచారు.

పైడిమర్రి వెంకట సుబ్బారావు, నిరాడంబరుడు, నిగర్వి, మృదుభాషి, మితభాషి, ఆడంబరాలకు దూరంగా వుండేవారు. 1988లో తను చనిపోవడానికి కొద్దిరోజుల ముందు మూడవతరగతి చదువుతున్న తన మనుమరాలు 'ప్రతిజ్ఞ' చదువుతుంటే విని సంతోషించి ప్రతిజ్ఞ తను రాసిన విషయం తన కుటుంబసభ్యులకు తెలియచేశాడు. అలా ఈ విషయం బయటపడింది.

సుబ్బారావు కవిత్వం, కథలు, నాటికలు, నవలలు, వందలాదిగా పద్యాలు రాశాడు. అనువాద రచనలు చేశాడు. సుబ్బారావు జీవితం – సాహిత్యం అనే అంశంపై పి.హెచ్.డి. కి సరిపడ సమాచారముంది. వీరికి తెలంగాణా తొలితరం కథకుడుగా పేరుంది. వీరు చిన్న అంశాన్ని తీసుకుని చక్కటి కథగా మలచడంలో నేర్పరి. జమీందారులు, భూస్వాములను నిరసిస్తూ ఎన్నో కథలు రాశాడు. ఆయన కథలు ఆసక్తికరంగా పాఠకులు చదివించేటట్లు వుంటాయి. వీరి కథలలో జాతీయాలు, సామెతలు చోటుచేసుకున్నాయి.

ఆయన రాసిన కథలలో నౌకరి, పిల్లపోదు, రాజులు, బడిగంటలు ముఖ్యమయినవి. ఉషస్సు కథా సంకలనంలో వీరి కథ చోటు చేసుకుంది. 'నౌకరి' కథ 1952 నాటి ముల్కీ వుద్యమానికి సంబంధించిన కథ. ముల్కీ వుద్యమంలో పాల్గొన్న వారికి వుద్యోగం రాకపోవడం ఈ కథలో ముఖ్యాంశం.

'రాజులు' అనే కథలో రాజులు అనే వ్యక్తి గ్రామంలో అందరి తలలో నాలుకలా మెలిగి అందరి అవసరాలు తీరుస్తుంటాడు. ఏ ప్రతిఫలాపేక్ష లేకుండా సేవ చేసాడు. పెండ్లి, పిల్లలు, నా అన్నవారు లేరు. ఏ గ్రామమో తెలువదు అటువంటి వ్యక్తి అకస్మాత్తుగా చనిపోతే జనమంతా వెళ్ళి అతని అంతిమ సంస్కారం ఘనంగా జరిపిస్తారు. వీరి కథల మధ్యన చిన్నచిన్న పాటలు కూడా చూడవచ్చు.

"పాడిపంటలు మాకు భగవంతుడిస్తాడు
వాని దయ వుంటే లోపమేమి లేదు
బీదసాద మాకు సోదరీసోదరులు
పెట్టిపోతలు మాకు విడిపోని ధర్మాలు"

అంటూ తెలంగాణా ఆత్మీయతను చాటుకుంటాడు.

వీరి 'పిల్లిపోదు' కథ జీవకారుణ్యానికి చెందిన కథ. మునిమాణిక్యంలా ఈ కథలో కొంచెం హాస్యం గూడా జోడించారు సుబ్బారావు. పిల్లి చూలాలై పిల్లలు కంటే ఆ యింటి యిల్లాలు కన్నబిడ్డల్లా ఆ పిల్లికి సపర్యలు చేయడం ఈ కథలోని ముఖ్య విషయం. ఇలా వైవిధ్యమైన విషయాలు కథ చెప్పే నైపుణ్యం వీరి కథల్లో వుంది. అందుకే తెలంగాణా తొలితరం కథకులలో స్థానం పొందారు. వీరి కథలలో పాత్రోచితంగా ఉర్దూ పదాలు వాడారు.

1956 నాటికే వీరు బ్రహ్మచర్యము, గృహస్తు జీవితం, స్త్రీ ధర్మము, ఫిరదౌసి, తార, శ్రీమతి అనే నాటకాలు రచించి వాటిని ప్రదర్శనాయోగ్యంగా తీర్చిదిద్దారు. 1951 నాటి 'సుజాత' పత్రికలో శ్రీమతి నాటకం వెలువరించాడు. ఇందు బిందుసారుని అనంతరం రాజ్యానికి వచ్చినవారు బౌద్ధ మతానికి విద్రోహం చేయడం ఈ నాటకంలోని ముఖ్యవిషయం.

ఈ నాటకాలతో పాటు పద్దెనిమిది సంవత్సరాలకే సుబ్బారావు కాలభైరవుడు అనే నవలను కూడా రాశాడు. ఈ నవలతో పాటు ప్రకృతి, దేవదత్తుడు, తులసీదాసు, త్యాగరాజు, మొదలైన పద్యకావ్యాలు కూడా వీరి కలం నుండి వెలువడ్డాయి. వీటితో పాటు సింగపురీ వృకేసరీ శతకం, బాలరామాయణం, వేంకటేశ్వరస్తుతి వంటి భక్తి రచనలు చేశాడు. శ్రీకృష్ణదేవరాయల అష్టదిగ్గజాలపై పద్యాలు వెలువరించాడు.

"మా కవితాపితామహుడు మంజుల భాషతో వరూధినీ
వ్యాకుల మోహరక్తి బ్రవరాఖ్యుపరాజ్ముఖ ధీరధృతి

నీలోకములో జీరమ్మురసలుబ్బుల చిత్తులుల్లసిల్లగా
నీ కతన్ రచించెనొక నిస్తుల చిత్రమాలీల దీర్చున్"
ఇది అల్లసాని పెద్దనపై రాసిన పద్యం.

వీరు హిందీ నుండి గీతామీమాంస, దైవభక్తి, మీమాంస త్రయము తెలుగులోకి అనువాదం చేశారు.

పైడిమర్రి సుబ్బారావు రాసిన రెండు పద్యాలను సురవరం ప్రతాపరెడ్డిగారు గోలకొండ కవుల సంచికలో వేశాడు. అవి మహారాజు కిషన్‌ప్రసాద్‌పై వ్రాసిన పద్యాలు. కిషన్‌ప్రసాద్ నిజాం నవాబు దగ్గర ప్రధానిగా వుండి ప్రజల మన్ననలను పొందినవారు.

"ప్రతిభావంతునకున్ నిజాం ప్రభునకు బాసిల్లగా మంత్రివై
మతిమంతుడవు నీవు గల్గదల భర్మంబందు గందంబు రీ
తితగున్ దుల్యము లేని సత్పదము వర్తింపగ సత్కార్య
సత్కృతులకున్దక్కువలేదు మాసుకృతమే కృష్ణ ప్రసాధిపా!"

ఇలా వీరు పద్యరచనలో అందెవేసిన చేయిగా పేరుగాంచారు. 1945-46లో నల్లగొండలో జరిగిన ఆంధ్ర సారస్వత పరిషత్ వార్షికోత్సవాలలో ప్రముఖపాత్ర వహించారు. సర్వేల్‌లోని సర్వోదయ ఆశ్రమం వారి అద్భుతవాహిని గ్రంథానికి వివిధ విషయాలతో విపుల పీఠిక రాశారు.

వీరు తరచు కాంచనపల్లి చిన వెంకటరామారావు ఆధ్వర్యంలో జరిగే యువరచయితల సమితి సాహితీ సమావేశాలలో పాల్గొనేవారు. 1970, 74, 83లలో జరిగిన జిల్లా రచయితల సభలలో పాల్గొని కవితాగానం చేశారు. యాదగిరి లక్ష్మీనర్సింహస్వామి క్షేత్రంలో కవితాగోష్టిలో సన్మానం పొందారు. జిల్లా గ్రంథాలయంలో జరిగే అన్ని సాహితీ కార్యక్రమాలలో పాల్గొని సేవలందించారు. ఉద్యోగ విరమణ అనంతర సర్వోదయ నాయకుడు మద్ది నారాయణరెడ్డి కోరిక మేరకు సర్వేల్ గురుకుల పాఠశాలలో స్వచ్ఛందంగా సూపరిండెంట్‌గా సేవలందించారు.

సుబ్బారావు సంస్కృత భారతమును కొంతమేర తెలుగులోకి అనువదించారు. 'పతంజలి' యోగప్రదీపికను సంస్కృతం నుండి తెలుగులోకి అనువదించారు. అరబ్బీలో వున్న గ్రంథం జీవిత మహాపథం పేరుతో తెలుగులోకి అనువదించారు. ఇలా చాలా గ్రంథాలు తెలుగులోకి అనువదించారు. వీరి ఇంటిలోని గ్రంథాలయంలోని పుస్తకాలన్నీ గీతావిజ్ఞాన కళాశాల నల్లగొండ వారికి అందచేశారు.

వీరి రచనలు ఆ రోజుల్లో గోల్కొండ భారతి, ఆంధ్ర పత్రిక, ఆనందవాణి, నవజీవన్ పత్రికలలో వచ్చాయి. వీరు సామాజికసేవా పరాయణులు. దేశభక్తి పరాయణులు. జాతిని జాగృతం చేసే రచనలు చేశారు. వీరు వుద్యోగ విరమణ అనంతరం నల్లగొండలోని గాంధీపార్క్‌లోని ఆర్యవైశ్యమందిరంలో ప్రతినిత్యం పేదవారికి ఉచిత హోమియో వైద్యం అందించేవారు. ఆయన 13 ఆగస్ట్ 1988న కాలధర్మం చెందారు. ఆయన మరణించిన ఆయన రాసిన ప్రతిజ్ఞ ప్రతి నిత్యం లక్షలాదిమంది విద్యార్థుల నోళ్లలో విన్పిస్తుంది. కారణజన్ముడు పైడిమర్రి సుబ్బారావును తెలుగు సాహితీలోకం ఎప్పటికీ మరువలేనిది.

104

# పాకాల యశోదారెడ్డి

– డా॥ సుంకిరెడ్డి నారాయణ రెడ్డి

స్వాతంత్ర్యానంతర తెలంగాణ తొలితరం కథకుల్లో ప్రసిద్ధ కథకురాలు యశోదా రెడ్డి. రేడియో ధారావాహిక కార్యక్రమం ద్వారా "మహాలక్ష్మి ముచ్చట్లు" అనే పేరుతో తెలంగాణ భాషను తెలుగు ప్రపంచానికి పరిచయం చేసిన తొలి రచయిత్రి యశోద రెడ్డి.

తెలంగాణ మారుమూల గ్రామంలో జన్మించి హైద్రాబాదు నగరానికి వచ్చి, విద్యాభ్యాసం చేసి ఒక యూనివర్శిటీలో ప్రొఫెసర్ అవ్వడమనేది ఆనాడు చాలా అసాధారణమైనటువంటి విషయం.

ఆమె 1929 ఆగష్టు 8వ తేదీన మహబూబ్‌నగర్ జిల్లాలోని మిదినేపల్లి గ్రామంలో జన్మించింది. అక్కడే ప్రాథమిక విద్యాభ్యాసం చేసింది. ఆమె ఎంత జ్ఞాపకశక్తి కలిగివున్నది అంటే ఒకసారి పాఠశాలకు వెళ్ళినపుడు పుస్తకాలు తేనందుకు ఆమెను క్లాసు బయటే సార్ వుంచినపుడు క్లాసు బయటినుంచే ఆమె పాఠం విని ఆ పాఠంలో అక్షరం పొల్లుపోకుండా వినిపించినటువంటి అద్భుతమైన ఏక సంథాగ్రాహి యశోద రెడ్డి.

ఆ తరువాత విద్యాభ్యాసం ముగుస్తున్నటువంటి క్రమంలోనే తెలంగాణ చిత్రకారుడు పి.టి. రెడ్డిగారితో వివాహం జరిగింది. ఆయనతోపాటు నారాయణగూడలోనే ఇల్లు తీసుకొని అక్కడే నివాసం ఏర్పరచుకుని అప్పటినుంచి ఆమె చనిపోయేంత వరకు ఆ నివాస గృహంలోనే వున్నారు.

ఆమె ఒక గ్రామీణ ప్రాంతం నుంచి ఒక నిరక్ష్యరాశ్యులైనటువంటి కుటుంబం నుంచి వచ్చి, ఎం.ఎ., పి.హెచ్.డి. చేసి యూనివర్శిటీలో చేరడమనేది మామూలు విషయం కాదు.

ఆమె తెలుగులో హరివంశాల మీద పి.హెచ్.డి చేసింది. సంస్కృత హరివంశం, నాచ సోమనాథుడి హరి వంశం, ఎర్రన హరివంశం, భైరవి కవి హరివంశం మొదలైనటువంటి హరివంశాలని తులనాత్మక అధ్యయనం చేసి తన సిద్ధాంత గ్రంథంలో నిరూపించింది.

తులనాత్మక అధ్యయనానికి అది ఒక తొలిమెట్టుగా విమర్శకులు భావిస్తారు. ఆ పి.హెచ్.డి. అనంతరం ఆమె ఉస్మానియా యూనివర్శిటిలో ప్రొఫెసర్‌గా చేరి సుదీర్ఘకాలం ప్రొఫెసర్‌గా తన విధుల్ని నిర్వర్తించారు.

ఆమె విద్యుక్తధర్మంలో ఎంత నిర్మొహమాటి అంటే ఎవ్వరినీ లెక్క చేయనటువంటి ముక్కుసూటిగా పోయే తత్వం. అందుకని ఆమె అనేక సందర్భాలలో ఇబ్బందులు కూడా ఎదుర్కొంది. ఆర్ట్స్ కళాశాల మెట్లు ఎక్కనివ్వకుండా చేసినటువంటి ఇబ్బందుల్ని కూడా ఆమె ఎదుర్కొంది.

అధికార భాషా సంఘం అధ్యక్షురాలిగా 1990–93 మధ్య పనిచేసింది. అప్పుడు ఆమెవద్ద నేను పి.ఎస్.గా అంటే పర్సనల్ సెక్రటరీగా పనిచేయడం జరిగింది. అప్పుడు యశోదా రెడ్డిగారి ప్రతిభ ఏమిటో, ఆమె ఎంత ముక్కు

సూటిగా వెళుతుందో, తన అభిప్రాయాలకు విలువ నీయనటువంటి వారిని ఎవరినీ లెక్కచేయనటువంటి స్థితిలో వుంటుందో, ఆమెకు ఎంత సాహిత్య ప్రతిభ వున్నదో, సాహిత్య పాండిత్యం వున్నదో నేను దగ్గరినుండి గమనించడం జరిగింది.

ఆమె ఎంతటి బహుముఖ ప్రజ్ఞావంతురాలు అంటే ఆమె కేవలం కథలు రాయడమే కాకుండా, అనేక మైనటువంటి పరిశోధనా గ్రంథాలు రాసింది. అనేక రేడియో ప్రసంగాలు చేసింది. అనేక సభల్లో ఉపన్యాసాలు ఇచ్చింది. ఆమె గొప్ప వక్త కూడా.

చాలా అద్భుతంగా తన జ్ఞాపకశక్తితో వేలాది పద్యాలని ఒప్పజెప్పి, వేలాది పద్యాలని కోడ్‌చేసి ప్రేక్షకుల్ని మంత్రముగ్ధుల్ని చేసేటటువంటి వాగ్ధాటి ఆమె సొంతం.

ఆమె పరిశోధనా గ్రంథాల్లో మనం పేర్కొనదగినటు వంటి గ్రంథాలు చాలా సుప్రసిద్ధమైనటువంటి గ్రంథాలు వున్నాయి. వాటిలో ఒకటి ఆంధ్ర సాహిత్య చరిత్ర వికాసం. ఇది ఆంధ్ర సాహిత్య చరిత్ర ఎట్లా వికాసనం చెందిందనే విషయాన్ని ఈ గ్రంథంలో తెలియపర్చింది. తన అన్ని గ్రంథాల్ని పరిశీలించినపుడు ఆమెకు ప్రాచీన సాహిత్యం మీద ఎంత అధికారం వున్నదో, పాశ్చాత్య సాహిత్యం మీద కూడా అంతే అధికారం వుందని, ఆధునిక సాహిత్యం మీద కూడా అంతే అధికారం వున్నదన్న విషయం మనకు అర్థమవుతుంది. ఆమె రెండో గ్రంథం 'పారిజాతాపహరణ పర్యాలోచనం'.

నంది తిమ్మన రాసినటువంటి పారిజాతాపహరణ ప్రబంధాన్ని ఆమె అద్భుతంగా విశ్లేషించింది. అదేవిధంగా ఎఱ్ఱాప్రెగడ అనే గ్రంథంలో సంస్కృత హరివంశానికి – ఎర్రన హరివంశానికి వున్నటువంటి సామ్యబేధాన్ని తులనాత్మకంగా వివరించి చెప్పింది. అదేవిధంగా ఎఱ్ఱప్రగడ రాసిన నృసింహ పురాణం అనువాద విధానం గురించి రాసినటువంటి ప్రబంధ వాఙ్మయం. ఇది 1975 ప్రపంచ తెలుగ మహాసభల సందర్భంగా వెలువడినటువంటి గ్రంథం.

ప్రబంధ వాఙ్మయ పరిణామ వికాసాల గురించి చాలా సంక్షిప్తంగా రాసినటువంటి గ్రంథం. చాలా ప్రామాణికంగా రాసినటు వంటి గ్రంథం ఇది. ప్రబంధ లక్షణాలేమిటి అని విశ్లేషించి వాటిని మనుచరిత్ర, వసుచరిత్ర, ఆముక్తమాల్యద, కళాపూర్ణోదయం, పారిజాతాపహరణం, విజయవిలాసం మొదలగునటువంటి గ్రంథాల్లో వున్నటువంటి విశిష్టతను తన అద్భుతమైనటువంటి ప్రతిభతో విశ్లేషించింది. అంతేకాకుండా ఆమె పోతన భాగవతసుధ, భాగవత కల్ప కుసుమావళి అనే గ్రంథాల్లో ఆ పద్యాలకు అద్భుతమైన వ్యాఖ్యానం రాసింది. ఆ వ్యాఖ్యాన మాధుర్యంలో ప్రేక్షకులు, పాఠకులు ఓలలాడారు.

ప్రాచీనమైనటువంటి కావ్యాలే కాకుండా ఆమె దేశీకావ్యాల్ని కూడా విశ్లేషించింది. అందుకు ఆమె రాసినటువంటి ద్విపద వాగ్మూలం ఒక ఉదాహరణ.

అంటే సాంస్కృతిక ఛందస్సుల మీద ఆమెకు ఎంత అధికారం ఉన్నదో దేశీఛందస్సు అయినటువంటి ద్విపద మీద కూడా అంతే అధికారం ఉన్నదనే విషయాన్ని మనకు ఈద్విపద వాంగ్మూల గ్రంథం తెలియజేస్తుంది. వారిదే ఇంకొక పరిశోధనాత్మకమైన గ్రంథం "భారతదేశంలో భారతంలో స్త్రీ" – అంటే మహాభారతంలో స్త్రీని ఎట్లా వ్యాఖ్యానించింది. భారతదేశంలో స్త్రీ యొక్క స్థానం ఏమిటనేదాన్ని చాలా లోతుల్లోకి వెళ్ళి ఆమె విశ్లేషించింది.

ఇందులో వున్నటువంటి స్త్రీ పాత్రను సాంప్రదాయక దృక్కోణం నుంచీ, ఆధునిక దృక్కోణం నుంచి కూడా విశ్లేషించడం ఇక్కడ గమనించవలసిన విషయం.

సాంప్రదాయక దృక్కోణం నుంచి కుంతీ, ద్రౌపది, గాంధారి, సుధేష్ణ, ఉత్తర, దమయంతి, శకుంతల మొదలై నటువంటి పాత్రల్ని విశ్లేషించింది. ఇక ఆధునిక దృక్కోణం నుంచి ప్రద్వేషిని అనే ఒక కథానాయిక కథని విశ్లేషించింది. పుట్టుగుడ్డి అయినటువంటి దీర్ఘతముని భార్య అయినటువంటి ఈ ప్రద్వేషిని ఒక ఆధునిక స్త్రీలాగా ఎట్లా భర్తని ఇంటి నుంచి వెళ్ళగొట్టిందో ఆమె అద్భుతంగా దీంట్లో విశ్లేషించింది. అంటే నన్ను వెళ్ళిపొమ్మంటున్నావు అని భర్త అడిగినపుడు ఒక తర్కబద్ధమైనటువంటి సమాధానం ఆమె ఎట్లా చెప్పిందో విని ఇక్కడ వివరించింది.

"పతియు భరియించు కావున భర్త అయ్యే, భామ భరియింపబడును గావున భార్య అయ్యే, పరగనయ్యె మలయుందు వీడ్వడియే విల్లులోన ఎల్లకాలము

భరియింతుగాన" కాబట్టి సంపాదన లేకుండా తిని కూర్చొని నామీద ఆధిపత్యం చేస్తున్నట్లయితే నేనెట్లా భరిస్తాను. కాబట్టి నువ్వు సంపాదించి నన్ను భరియిస్తే నువ్వు భర్తవు, నువ్వు సంపాదించకుండా తిని కూర్చొని పైగా నామీద ఆధిపత్యం చెలాయించడం అనేది సరియైనటువంటిది కాదు. కాబట్టి నువ్వు నాకు భర్తగా వుండటం తగదు అని చెప్పి ఇంటి నుంచి ఆమె ఎట్లా బయటికి వెళ్ళగొట్టిందీ అని చెప్పే ఒక ఆధునిక దృక్కోణం నుంచి విశ్లేషించింది యశోదా రెడ్డి.

అదేవిధంగా ఆ గ్రంథంలో ఉపసంహారం అనే భాగంలో "మారుతున్న సమాజంలో స్త్రీ" అనే శీర్షిక కింద ఆమె ఈవిధంగా అన్నది. "స్త్రీకి సమాన హక్కులు ఉండాలని, స్త్రీ సమస్యా పరిష్కారం కోసం కృషి చేయాలని" అందుకే ఈ గ్రంథాన్ని రాశానని ఆమె పేర్కొన్నారు. అంటే ఆమె కేవలం పరిశోధన కోసం కాకుండా ఆధునిక దృక్కోణం నుంచి అసలు స్త్రీ గురించి మాట్లాడటమే స్త్రీ పాత్రల గురించి మాట్లాడటమే ఆధునిక దృక్పథం వున్నట్లు మనకు అర్థమవుతుంది.

అంతేకాకుండా ఆమె హిందీ కవయిత్రులు అనే పుస్తకాన్ని కూడా అనువాదం చేసింది. అంటే దాని ద్వారా స్త్రీపట్ల ఆమెకు ఒక ప్రత్యేకమైనటువంటి అభిలాష వున్నదన్న విషయం మనకు ఈ గ్రంథాల వల్ల తెలుస్తుంది.

ఈ పరిశోధనాత్మకమైనటువంటి, విమర్శనాత్మకమైనటువంటి గ్రంథాలే కాదు. ఆమె అద్భుతమైనటువంటి కథలు రాసింది. ఆమె కథల్ని నేషనల్ బుక్ ఫెస్ట్ వాళ్ళు "ఉత్తమ కథలు" అనే పేరుతో ఒక సంపుటిగా వెలువరించింది. అచ్చమైన తెలంగాణ గ్రామీణ జీవితాలను కల్పనకు, వాస్తవికతకు మధ్య అంతరాన్ని చెరిపివేసిన ముత్యాల లాంటి కథలు ఇవి.

యశోదా రెడ్డి కథలు మంచిని పెంచే కథలు, మానవత్వాన్ని తట్టిలేపే కథలు, ఆర్ద్రత నిండిన కథలు, వేలాది తెలంగాణ భాషా పదాలను, సంస్కృతీ వైవిధ్యాలను, మాటతీరును బంగారంలో వజ్రాల్లా తన కథలో పొదిగారు.

భాష, సంస్కృతి, నుడికారం, మానవ సంబంధాలు, పరిణామాల చిత్రణ, ప్రధాన లక్ష్యం అయినప్పటికి గ్రామీణ జీవనం వారి వారి వ్యక్తిత్వాలు, జీవన ప్రమాణాలు దశాబ్దాల తరబడి ఎలా కొనసాగాయో సామాజిక శాస్త్రాల కన్నా మిక్కిలి శక్తివంతంగా కథల్లో చిత్రీకరించారు.

స్వాతంత్ర్యానంతరం గ్రామీణ, సామాజిక పరిణామాలకు ఈ కథలు నిలువెత్తు సాక్ష్యాలుగా నిలుస్తాయని ఆ కథల గురించి బి.ఎస్. రాములు గారు వ్యాఖ్యానించారు.

ఈ వ్యాఖ్యానం ఆమెయొక్క కథల విశిష్టతను తెలియజేస్తుంది. ఆమె 'ధర్మశాల' అనే కథా సంపుటిలో 24 కథల్ని, అదేవిధంగా "మా ఊరి ముచ్చట్లు" అనే కథా సంపుటిలోనూ, ఎచ్చమ్మ కథలు అనే కథా సంపుటిలోనూ తెలంగాణా మాండలిక మాధుర్యాన్ని చాలా అద్భుతంగా వ్యక్తం చేసింది.

అంటే తెలంగాణ భాషను ఎవ్వరూ పట్టించుకోనటువంటి పరిస్థితుల్లో తెలంగాణ భాషకు ప్రాధాన్యతనిచ్చి తన కథల్లో తెలంగాణ భాష విశిష్టతను ఉదాహరణ సహితంగా వ్యక్తం చేసింది. ఈ కథాసంపుటితో పాటు "భావిక", "ఉగాదికి ఉయ్యాల" అనే కవితా సంపుటిలను కూడా ఆమె వెలువరించింది.

అందులో కూడా తన స్త్రీ దృక్పథాన్ని గురించి చెప్తూ ' స్త్రీలంటే ఎవరనుకున్నారు. మీరు దిశతిప్పిన బొమ్మలా, మీ చేతిలో చిత్విలా, మీకు వీచే విసనకర్రలా, మీకాళ్ళ సోపానాలా, సాగనివ్వం. ఇక ఈ పురుషుల హతకుల సార్వభౌమత్వం కూలిపోతుంది. ఈ ఎద్దు మొద్దుల అహంభావపు అధికారం. సాగుతుందిక స్త్రీ చైతన్య రథం' అని తన స్త్రీ దృక్కోణాన్ని, స్త్రీకి, పురుషుడికీ సమాన హక్కులుండాలనే దృక్కోణాన్ని తన కవిత్వంలో వ్యక్తం చేసింది.

సమతాభావనని తన కవితాసంపుటిల్లో వ్యక్తం చేసింది. ఈరకంగా ఒక పండితురాలిగా, ఒక వక్తగా, ఒక పరిశోధకురాలిగా, ఒక విమర్శకురాలిగా, ఒక కథకురాలిగా, ఒక కవయిత్రిగా విభిన్నమైనటువంటి పాత్రల్ని పోషించినటువంటి బహుముఖ ప్రజ్ఞాశాలి యశోదా రెడ్డి గారు.

# 105 పాలకుర్తి ఐలమ్మ

**– డా॥ తిరునగరి దేవకీదేవి**

నైజాము రాజ్యాన ఉయ్యాలో నల్లగొండ జిల్లాలో ఉయ్యాల
ఎట్టి చాకల్దమ్మ ఉయ్యాలో ఎత్తైన మనిషమ్మ ఉయ్యాల
పెద్దపై సంతైన ఉయ్యాలో బొట్టైన పెట్టింది ఉయ్యాల
పాలకుర్తిలోన ఉయ్యాలో ఎట్టిన చాకల్దమ్మ ఉయ్యాల
ఎట్టి చాకల్దమ్మ ఉయ్యాలో గట్టిదే ఐలమ్మ ఉయ్యాల
సంగమే పెట్టింది ఉయ్యాలో తానె సంగామాయె ఉయ్యాల
సంగంలో యువకులూ ఉయ్యాలో తన తనయూలైరి ఉయ్యాల

పాలకుర్తి ఐలమ్మ, చాకలి ఐలమ్మ, చిట్యాల ఐలమ్మ, ఎట్టి చాకలి ఐలమ్మ. అన్నీ ఆమె పేర్లే. అక్షరం తెలియదు. కానీ హక్కుల పోరాటం తెలుసు. ఆర్థికంగా వెనుకబాటు తనమే ఆకలి తీర్చుకోవడానికి ఆరాటపడక తప్పని పరిస్థితే. అయినా ఆకలెరిగి అన్నం పెట్టడం, ప్రేమ ఆప్యాయత, కలివిడితనం వంటి లక్షణాలకు ఆమె చిరునామా. ఆమె పోరాట జెండా. ఉద్యమం ఆమె ఊపిరి. తెలంగాణ రైతాంగ పోరాట భూమిక ఐలమ్మ చురుకుదనం ఆమెకే స్వంతం. స్వార్థానికి ఆమడంత దూరం. ఆత్మనిబ్బరానికి మచ్చుతునక. 1895లో కృష్ణాపురం గ్రామం, రాయపర్తి మండలం, వరంగల్లు జిల్లాలో పుట్టింది. చిట్యాల గ్రామానికి చెందిన నర్సయ్యను పెండ్లి చేసుకోవడంతో చిట్యాల ఐలమ్మ అనే పేరు ముందుకొచ్చింది. ఐదుగురు కొడుకులకు, ఒక బిడ్డకు జన్మనిచ్చింది. ఆర్థిక ఒడిదొడుకులు, అందుబాటులో లేని దవాఖానాలు; భూస్వాములకు తలకు మించిన భారంతో వెట్టిచాకిరీ చేయాల్సిన పరిస్థితి. కారణాలేమైనా కావచ్చు. అన్నీ కావచ్చు. ఆమె ఇద్దరు కొడుకులను పోగొట్టుకుంది.

స్వంతభూమి లేకున్నా కులవృత్తి బట్టలుతకడమే అయినా ఆలుమగలు వ్యవసాయం చేసుకోవడానికి ముందుకొచ్చారు. కౌలుగా తీసుకున్న నాలుగెకరాలలో రెండెకరాలు నాట్లేసి, మిగిలిన రెండెకరాల్లో మెట్టపంట వేసినారు. సహకరించడం సహకారం తీసుకోవడం రెంటికీ ఆమె సిద్ధమే. వ్యవసాయానికి గ్రామరైతుల సహకారం తీసుకోవటం ఆమెకు అందుబాటులోని వ్యవహారమే. పొలం కౌలుకు తీసుకున్నది. మల్లంపల్లి మఖ్తేదారు నర్సింహారెడ్డికి కన్నుకుట్టింది. విసునూరు రామచంద్రారెడ్డికి అతని కుట్రలు పడగలు విప్పినాయి. అధికారదర్పాన్ని గాలంగా వేసినాడు. మల్లంపల్లి మఖ్తేదారు కొడుకు కొండల్‌రావు, పోలీసు పటేల్ శేషగిరిరావు ఇద్దరూ ఆ గాలానికి చిక్కినారు. ఐలమ్మ పేరిట ఉన్న పొలం విసునూరి రామచంద్రారెడ్డి పేరిట బదిలీ అయింది.

నిజాం నిరంకుశ దొరలవారి భూస్వాముల పాలనలో ప్రభుత్వం ఇజారాదారులపై గ్రామనిర్మాణం చెరువు నిర్మాణం వంటి అనేక ఆంక్షలను మోపేది. అందువల్ల తమ్ముతాము బలవంతులుగా నిలదొక్కుకునే క్రమంలో ఆ ఇజారాదారులు

ఇతర రైతులను కౌలుదారులను తమ దోపిడీతో దుర్మార్గంతో అనేక ఇబ్బందుల పాల్జేసేవారు. ఈ క్రమంలో ఇజారా దారులు ఏకమై సాధారణజనాన్ని మోసం చేసేవారు. ఇదే సమయంలో 1921లో తెరమీదికి వచ్చిన ఆంధ్ర జనసభ ఆంధ్రమహాసభగా పరిణామం చెందింది. అందరికీ అక్షరజ్ఞానం, గ్రంథాలయోద్యమం ముందుకు వచ్చింది. ఆ ముసుగులో సంఘం అనేక సమావేశాలను జరుపుకునేది. ఆ సమావేశాలలో భూస్వాముల దుర్మార్గాలు, వెట్టిచాకిరి, అధిక పన్నులు, నిర్బంధ వసూళ్ళు వంటి అనేక అంశాలపై చర్చలు జరిగేవి. ఆ క్రమంలోనే సంఘ సభ్యులు చైతన్య మౌతూ వచ్చారు. సహకార సంఘాలుగా ఏర్పడినారు. తిరుగుబాటుకు సిద్ధమయ్యారు. భూస్వామి రామచంద్రారెడ్డి వలన పొంచి ఉన్న ప్రమాదాన్ని ముందే పసిగట్టిన ఐలమ్మ సంఘం ఆశయాలను అర్థం చేసుకొంది. ఆ సమావేశాలకు హాజరైంది. గ్రామ పరిస్థితులతో పాటు సంఘం లక్ష్యాలను అవగాహన చేసుకొంది. కుటుంబ సభ్యులను సంఘంలో చేరడానికి ప్రోత్సహించింది. అదే గురితో తానూ సంఘంతో మమేకమైంది.

తన ఇంటిలోని ఒక భాగాన్ని సంఘం కార్యకలాపాలకై కేటాయించింది. సంఘకార్యకలాపాలు జోరుగా పుంజు కొన్నాయి. సంఘం తన శత్రువు. దాని వల్ల తనకు నష్టం వాటిల్లబోతున్నదన్న విషయాన్ని విసునూరి రామచంద్రారెడ్డి అర్థం చేసుకున్నాడు. ఐలమ్మను పొలంనుండి బేదఖల్ చేయడంతోపాటు ఆమె కుటుంబాన్ని సంఘాన్ని దెబ్బతీయడం ద్వారా తన దుర్మార్గాలు, దోపిడీని కొనసాగిం చుకోవచ్చని భావించినాడు. ఐలమ్మ కౌలుభూమిని తన పేర వ్రాయించుకొన్న తదనంతరం సంఘం కార్యక్రమాలను అడ్డుకునే క్రమంలో పాలకుర్తి సభను భయాందోళనల పాలు చేయాలని భావించాడు. ఒకవైపు గూండాలను, మరోవైపు పోలీసులను ప్రజల మీదకు పురిగొల్పాడు. ఆరుట్ల రామచంద్రారెడ్డిపై హత్యాయత్నం చేశాడు. అదే క్రమంలో ఐలమ్మ భర్త, ఆమె ఇద్దరు కొడుకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషనుకు తీసుకపోయినారు. లాఠీలకు పనిచెప్పి నారు. గోర్లలో సూదులు గుచ్చినారు. జుట్టుకు తాడుకట్టి వేలాడదీసినారు. ఆ దెబ్బలకు ఐలమ్మ భర్త నర్సయ్య చేయి పడిపోయింది. ఈ విధంగా ఐలమ్మ కుటుంబంలోని మగవాళ్ళంతా పోలీస్ స్టేషన్ నుండి కోర్టుకు, కోర్టు నుండి రిమాండ్‌కు, రిమాండు తదుపరి ఖైదీలుగా వెళ్ళిన పరిస్థితి. అయినా ఐలమ్మ గుండె నిబ్బరం కోల్పోలేదు. ధైర్యం సడలలేదు. వెనుకంజ వేయడమంటే విసునూరి రామచంద్రారెడ్డిని ప్రోత్సహించడమే. అతని దుర్మార్గాల కొనసాగింపే అని భావించింది.

ఆమె ఇంట్లో సంఘం కార్యకర్తలు మూడునెల్లు ఉన్నారు. ఐలమ్మ ఆదర్శంగా ఇతర కుటుంబాలు, కార్యకర్తలకు ఆశ్రయం కల్పించినారు. సుమారు అరవైమంది కార్యకర్తలు గ్రామంలో ప్రతిరోజు కవాతు చేసేవారు. ఐలమ్మ కార్యకర్తలకు తిండిని సమకూర్చేది. ఆ తిండి సజ్జ గట్కో జొన్న గట్కో లేదా కేవలం సల్లబొట్టో. అవే కార్యకర్తలకు పంచభక్ష్య పరమాన్నాలు. అవేవీ తనయింట్లో సమకూర్చలేని సందర్భంలో ఐలమ్మ వారి ఆకలిని తీర్చేందుకు గ్రామంలో ఇల్లిల్లూ తిరిగి అడుక్కొని వచ్చేది. ఈ విధమైన ఐలమ్మ చైతన్యవంతమైన పనులకు సంబంధించిన వార్త పలు గ్రామాలకు పాకింది.

ఐలమ్మ కుటుంబ సభ్యులు జైలుపాలు అయిన అనంతరం అదే అదనుగా ఆమె కౌలుభూమిని జప్తు చేసుకుంటున్నట్లు గూండాల ద్వారా తెలియ చెప్పినాడు, బెదిరించినాడు, హెచ్చరించినాడు. ఐలమ్మ తన కౌలు భూమిని తాను దక్కించుకునే క్రమంలో విసునూరి మాలీ పటేల్‌ను కలిసింది. తన పొలం జోలికి రావద్దని బ్రతిమిలాడింది. మూడువందల రూపాయలతో పాటు పది తూముల వడ్లను దండుగ రూపంలో చెల్లించింది. మాలీ పటేల్ తాత్కాలికంగా మౌనం వహించినాడు. ఐలమ్మను వ్యవసాయం చేసుకోమని చెప్పినాడు. కాని ఐలమ్మ పొలం కోతకు వచ్చిన సమయంలో రామచంద్రారెడ్డి గుండాలు ఆమె పంటను ఆమెకు దక్కకుండా చేయాలనే ప్రయత్నాలను ముమ్మరం చేశారు. అదే సమయంలో దేవులపల్లి వెంకటేశ్వర్లు సూర్యాపేట నుండి కార్యకర్తలను వాలంటీర్లను ఐలమ్మకు ఆసరాగా పంపించినాడు. కానీ గూండాలు వారిని అడ్డుకున్నారు. అప్పుడు ఐలమ్మ అపర కాళికైంది. స్వయంగా తాను పొలంలో ముందడుగేసి తన బొందిలో ప్రాణముండగా ఇతరులకు పంట దక్కనీయనని హెచ్చరించింది. ఈ భయానక వాతావరణంలో పంటపొలం కోయడానికి ఎవరూ ముందుకు రాలేదు.

ఆ సమయంలో భీంరెడ్డి నర్సింహారెడ్డి ప్రమేయంతో బాలెం సూర్యపేట నుండి వచ్చిన ఆంధ్రమహాసభ కార్యకర్తలు ఐలమ్మ పంటను కోసి రాశి పోయడమే కాదు మూటలుగా సిద్ధం చేసినారు. పోలీసులు గూండాలు అడ్డుకుంటున్నా సంఘం నాయకులూ అంటే భీంరెడ్డి నర్సింహారెడ్డి, కట్కూరి రామచంద్రారెడ్డి, కోట వెంకటరెడ్డిలు కార్యకర్తలతో పాటు స్వయానా ఆ మూటలను ఐలమ్మ యింటికి చేర్చినారు. కానీ ఈ క్రమంలో చాలామంది కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసినారు. అయినా ఎంతో మంది తప్పించుకున్న కార్యకర్తలూ లేకపోలేదు. గూండాల రాక్షసకృత్యాలకు ఐలమ్మ అదరకుండా బెదరకుండా కొంగు నడుముకు చుట్టింది. కొడవలి చేతబట్టింది. ఆ అగ్నికణాన్ని చూసి గూండాలు తోకముడిచినారు. కానీ ఈమెకు సాయంగా వచ్చిన వారిని అరెస్టు చేసిన పోలీసులు అమానవీయంగా హింసించినారు. వారి ఆచూకికై వచ్చి ఆపట్ల లక్ష్మీనర్సింహారెడ్డిని రామచంద్రారెడ్డి గూండాలు రఘునాథపల్లి స్టేషన్లో అడ్డుకొన్నారు. కచ్చరాన్ని పాలకుర్తి చెరువులో వేసి తొక్కినారు. అతణ్ణి వివస్త్రుణ్ణి చేసి అవమానించి పంపినారు. అటుపై ఐలమ్మ అరస్టైన తన కుటుంబ సభ్యులను విడుపించుకునే క్రమంలో పడరాని పాట్లు పడింది. గూండాల దాడి పొంచి ఉన్నా పేషీలకు పోవడానికి వెనుకాడలేదు. జనగామ కోర్టులో తీర్పు తనకు వ్యతిరేకంగా రావడంతో హైదరాబాదు కోర్టుకు అప్పీలు చేయించుకొన్నది. నిద్రాహారాలను అధిగమిస్తూ నిరంతరంగా తన పొలం విముక్తికై అడుగులు వేస్తూనే పోయింది.

మొత్తం మీద భర్త, కొడుకులకు జైలు నుండి విముక్తి లభించింది. కాని విసునూరి రామచంద్రారెడ్డికి ఆమెపై కోపం కసి రెట్టింపయినాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా హైదరాబాద్ సంస్థానంగానే కొనసాగుతూ స్వతంత్ర్య ప్రతిపత్తితో ఉండటం సంఘానికి మింగుడు పడలేదు. ఆంధ్రమహాసభ అచ్చంగా కమ్యూనిస్టుల సంఘంగా చెలామణిలోకి వచ్చింది. కమ్యూనిస్టులకు ఆశ్రయం కల్పిస్తుందన్న నెపంతో ఐలమ్మ ఇంటిపై పోలీసుల రజాకార్ల దాడులు అధికమయ్యాయి. ఆమె ఇంటికి నిప్పు పెట్టినారు. ఇంట్లో వస్తువులను ధాన్యాన్ని ఇతర వస్తువులను ధ్వంసం చేసినారు. పెళ్ళై ఇద్దరు పిల్లల తల్లైన ఐలమ్మ బిడ్డపై ఘోరంగా అత్యాచారం చేసినారు. ఫలితంగా ఆమె భర్త ఆమెను వదిలించు కొన్నాడు. సైనిక చర్యానంతరం నిజాం లొంగిపోయినా కమ్యూనిస్టు రాజ్యం స్థాపించాలన్న ఆకాంక్షతో సాయుధ పోరాటాన్ని కొనసాగించినారు. ఆ పోరాటం నెహ్రూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మలుపు తిరిగింది. ప్రభుత్వ మిలటరీ యంత్రాంగం రజాకార్లను మించి ఉద్యమకారులను నానాహింసలు పెట్టింది. దుర్భరమైన అణచివేతను తట్టుకోలేక విధిలేని పరిస్థితుల్లో పార్టీ ఉద్యమాన్ని విరమించింది. వట్టికోట ఆళ్వారు స్వామి గారు రచించిన ప్రజలమనిషి నవలలో అన్నమ్మ ఈ ఐలమ్మకు ప్రతిరూపమే.

ఇంతగా పోరాటం చేసిన ఐలమ్మను, పోరాటానికి వెనుదన్నై నిలిచిన ఐలమ్మను పోరాట విరమణానంతరం పార్టీ విస్మరించింది. తాను కౌలు చేసిన భూమిని అందుబాటులోకి తెచ్చుకునేందుకై ఆమె పైసలు చెల్లించక తప్పలేదు. ఏది ఏమైనా సాయుధ పోరాట నాయకత్వం ఆంధ్రా కమ్యూనిస్టు నాయకుల అభీష్టాలకనుగుణంగా సాగటం వల్ల తెలంగాణా పోరాట వీరులు ఎంతగానో నష్టపోయారు. అందుకు ఐలమ్మ ప్రజలెరిగిన సాక్ష్యం. మరగున పడిన మహావీరులెందరో. ఐలమ్మ 1985 సెప్టెంబర్ 10న మరణించింది. ఆమె పోరాటస్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆ క్రమంలో ప్రభుత్వం టాంక్‌బండ్‌పై ఆమె విగ్రహాన్ని ప్రతిష్టించి మన మట్టి పరిమళాన్ని గౌరవించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# 106 పల్లా దుర్గయ్య

**– ఆచార్య మసన చెన్నప్ప**

తెలంగాణ అనగానే కాకతీయుల రాజధాని వరంగల్లు గుర్తుకు వస్తుంది. వరంగల్లు జిల్లాలోని మడికొండ గ్రామం, మహాకవులకు, పండితులకు పుట్టినిల్లు.

పల్లా దుర్గయ్యగారి స్వగ్రామం ఈ మడికొండే. దుర్గయ్యగారు 25–5–1914 తేదీన పల్లా నర్సమ్మ పాపయ్య దంపతులకు జన్మించాడు. తల్లిదండ్రులకు వీరు 5వ సంతానం. తండ్రిగారికి వ్యవసాయం ఉంది. పౌరోహిత్యం కూడా చేసేవారు. కాని దుర్గయ్యగారికి పౌరోహిత్యం అబ్బలేదు.

దుర్గయ్యగారి 3వ అన్నగారైన మడికొండ సత్తెయ్యగారు మంచి హరికథకులుగా పేరుగాంచినారు. ఆకాశవాణి హైద్రాబాద్ కేంద్రంలో అర్ధశతాబ్దికి పైగా హరికథలు వినిపించారు.

దుర్గయ్యగారికి వారి తల్లిగారి వల్ల చదువుపట్ల శ్రద్ధ గలిగింది. పైగా బాల్యమిత్రులైన కాళోజి సోదరులు, వానమామలై సోదరులు దుర్గయ్యగారిని ప్రోత్సహించడం వల్ల కూడా దుర్గయ్యగారు విద్యపట్ల శ్రద్ధవహించారు.

బిరుదురాజు రామరాజుగారు, అనుముల కృష్ణమూర్తి గారు మిత్రులే ఐనప్పటికీ – దుర్గయ్యగారి కంటె చిన్నవారు. కాని వారి స్నేహం గొప్పది.

దుర్గయ్యగారు మడికొండలో ప్రాథమిక విద్యనభ్యసించి, హనుమకొండలో హైస్కూల్‌వరకు చదువుకున్నారు.

మడికొండకు, హనుమకొండ 12 కి.మీ. దూరం. ప్రతిరోజు నడిచి వెళ్లవలసి వచ్చేది బడికి. ప్రయాణ బడలికవల్లనూ, ఆర్థికంగా పేదవారుకావడంవల్లనూ బాల్యంలోనే దుర్గయ్యగారు అనారోగ్యానికి గురయ్యారు. ఐనా దుర్గయ్యగారు పట్టువిడువని విక్రమార్కులై చదువులో అందరికంటె మిన్నగా రాణించారు.

దుర్గయ్యగారి మీద బహుభాషాకోవిదులైన వానమామలై వెంకటచార్యుల ప్రభావం ఉంది. దుర్గయ్యగారికి మెట్రిక్యులేషన్‌లో ఉండగానే పెళ్లైంది. ఐనా దుర్గయ్యగారు వరంగల్‌లో ఇంటర్ చదివి, హైదరాబాదులో పరీక్ష రాసి పాసైనారు. ఆ తర్వాత 1938లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బి.ఏ.లో చేరి 1940లో అందులో ఉత్తీర్ణులయ్యారు. 'వందేమాతరం' ఉద్యమం కారణంగా ఒక సంవత్సరం వృథా ఐంది.

అదే సంవత్సరం తొలిసారిగా ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగులో స్నాతకోత్తర తరగతులు మొదలు కావడం, అందులో దుర్గయ్యగారు విద్యార్థిగా చేరిపోవడం జరిగింది. అంతేకాక, 1942లో జరిగిన ఎం.ఏ. తెలుగు పరీక్షలో ఉత్తీర్ణులై మొత్తం విశ్వవిద్యాలయంలోనే పట్టభద్రులైన తొలి ఎం.ఏ. తెలుగు విద్యార్థిగా కీర్తికెక్కారు.

మడికొండ నుంచి హనుమకొండకు వెళ్లడమే కష్టమైన రోజుల్లో, హనుమకొండ నుండి హైదరాబాదుకు రావడం

ఇంకెంతో కష్టం. ఐనా దుర్గయ్యగారు హైదరాబాదుకు వచ్చి చదువుకోవడంలో వారి మూడవ అన్నగారైన సత్యనారాయణ గారి ప్రోత్సాహం ఎంతగానో ఉంది. అన్నగారు ప్రదర్శించిన గయోపాఖ్యానం నాటకంలో దుర్గయ్యగారు కూడా గయుని వేషం వేయవలసి వచ్చింది. వచ్చిన డబ్బుతో మొదటిసారి హైదరాబాదుకు వచ్చి అప్పటి తెలుగుశాఖ అధ్యక్షులైన రాయప్రోలు సుబ్బారావుగారిని కలుసుకోవడం, వారి సహాయంతో ఫ్రీషిప్ రావడం, చదువుకొనసాగడం దుర్గయ్యగారి విద్యాభ్యాసంలో మరువలేని సంఘటనలు.

దుర్గయ్యగారు 1943లో చాదర్‌ఘాట్‌లో కొత్తగా మొదలైన జూనియర్ కళాశాలలో మొదట పార్ట్‌టైం లెక్చరర్‌గా చేరి ఆ తర్వాత పూర్తికాలపు లెక్చరర్‌గా 13 ఏండ్లు పని చేశారు. ఆ తర్వాతనే ఉస్మానియా యూనివర్శిటీ నిజాం కళాశాలలో ఆచార్యులుగా నియమితులై 1976లో పదవీ విరమణ చేశారు.

దుర్గయ్యగారి ఇల్లు కవులతో, పండితులతో నిండి సరస్వతీ నిలయంగా భాసించేది. ప్రతిరోజు ఏవో సాహిత్యగోష్ఠులు జరిగేవి. వాటిలో దాశరథి, రామరాజు, నారాయణ రెడ్డి, కాళోజి, వానమామలై మొదలైన ఉద్దండ పండితులు పాల్గొనేవారు. ఇంకా ప్రముఖ కవి చిత్రకారులు డి. రామలింగంగారు, భాస్కరభట్ల కృష్ణారావుగారు సమావేశాలలో పాల్గొనేవారు.

మరొక్క ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే వట్టికోట ఆళ్వారుస్వామి స్థాపించిన దేశోద్ధారక గ్రంథమాల శ్రీదుర్గయ్యగారి ఇంట్లోనే నడిచేది.

సమావేశాలకు, గ్రంథాలయానికి వచ్చే ప్రముఖులతో డా॥ దుర్గయ్యగారి ఇల్లు ఎప్పుడు చూసినా సందడిగా ఉండేది.

దుర్గయ్యగారు పిహెచ్.డి. పరిశోధనకి తీసుకున్న అంశం "ప్రబంధవాఙ్మయ వికాసము – రాయల యుగము" అనేది. ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం గారు పర్యవేక్షకులు. వారు రచించిన పిహెచ్.డి. సిద్ధాంతగ్రంథానికి సంబంధించిన ప్రాశస్త్యాన్ని తెలియజేసే సంఘటనను వివరించక తప్పదు.

'సమగ్రాంధ్ర సాహిత్యం' రూపకల్పనలో తలమునకలైన ఆరుద్రగారు ఒక రోజు పల్లా దుర్గయ్యగారింటిలో ప్రత్యక్షమయ్యారు. వారికి తోడుగా దాశరథిగారు, గుమ్మడి వెంకటేశ్వరరావుగారున్నారు.

పల్లా దుర్గయ్య గారింట్లో ఎవరు వెళ్లినా రుచికరమైన భోజనం, ఫలహారాలు లభించేవి.

ఆరుద్రగారు కూడా ఫలహారం స్వీకరించి "మీ సిద్ధాంత గ్రంథం చూసి ఒక పావుగంటలో ఇస్తాను" అని థీసిస్ తీసుకొని దుర్గయ్యగారి స్టడీరూంలోకి వెళ్లారట. ఉదయం 8 గం॥ల నుంచి మధ్యాహ్నం 12 గంటల దాకా ఆరుద్ర రూం నుంచి బయటకు రాలేదట. బహుశా ఆరుద్రగారికి దుర్గయ్యగారి పరిశోధన గ్రంథం ఎంతో నచ్చిందని వేరుగా చెప్పవలసిన పనిలేదు.

దుర్గయ్యగారి మీద కళాశాలలో ప్రభావం చూసిన ఆచార్యులు రాయప్రోలువారు, ఖండవల్లివారు. వీరితో పాటు నవ్యాంధ్ర సాహిత్యవీధులు కూరుగంటి సీతారామయ్య గారు కూడా ప్రభావం చూపారు. రాయప్రోలువారు పద్యపాఠం చెప్పేటప్పుడు కుర్చీలో కూర్చొనేవారు కాదు. నిలబడి పద్యాన్ని గొంతెత్తి చదివేవారు. వారి ప్రభావం దుర్గయ్య గారి మీద కూడా పడింది.

ఆ రోజుల్లో ఉర్దూలో బి.ఏ. చదివే ఏర్పాటుండేది. దుర్గయ్యగారు బి.ఏ. దాకా ఉర్దూ మీడియంలోనే చదివారు. తెలుగు ఐచ్ఛికాంశం మాత్రమే. తెలుగు భాషది విచిత్రమైన దుస్థితి. ఇంటర్‌లోను, ఎం.ఏ.లోను ఒక్కరంటే ఒక్కరే తెలుగు విద్యార్థి. వారే దుర్గయ్యగారు. ఇక బి.ఏ.లో మాత్రం వారికి ఒక తోడు దొరికింది. ఆరుట్ల రామచంద్రారెడ్డి గారే ఆ తోడు.

తెలుగు చదివి ఏం చేస్తారని హేళన చేసేవాళ్లు ఆ రోజుల్లో ఉన్నారు. ఉర్దూకు గౌరవం. ఐనా, తెలుగులో చదివి, తెలుగు గౌరవాన్ని ఇనుమడింప జేసిన దుర్గయ్యగారు 'దుర్గమే' అని చెప్పవచ్చు.

తెలుగును ఐచ్ఛికంగా చదివి, తెలుగు ఉపన్యాసకులుగా ఉద్యోగ జీవితం ఆరంభించినప్పుడు చాదర్‌ఘాట్ కాలేజీలో నెలకు వారికి లభించే జీతం అనండి, భృతి అనండి

– కేవలం 66 రూపాయలే. ఐనా శాశ్వతో ద్యోగాన్ని విడిచి కళాశాల ఉద్యోగానికి రావడం వారదృష్టం గానే భావించినారు.

దుర్గయ్యగారికి ఆంధ్ర సాహిత్యచరిత్రను బోధించడ మంటే ఎంతో ఇష్టం. దానితో పాటు విమర్శ అన్నా పద్య కవిత్వం – వచన కవిత్వమన్నా, ఛందస్సు, అలంకార శాస్త్రం అన్నా వారికెంతో ఇష్టమైన బోధనాంశాలు.

పరిశోధనలో ఉద్దండులైన దుర్గయ్యగారి దగ్గర చేరిన పరిశోధకులలో మాదిరాజు రంగారావుగారు, జి.వి. సుబ్రహ్మణ్యంగారున్నారు.

దుర్గయ్యగారిలో ఒక గొప్ప పరిశోధకులే కాదు, గొప్ప సృజనాత్మక కవి కూడా.

వారి "ప్రబంధ వాఙ్మయవికాసం – రాయల యుగం" అనే పరిశోధన గ్రంథం అటు పండితులకు ఇటు పరిశోధకు లతో పాటు, సాహిత్య విద్యార్థులకు నేటికీ ఒక ఆధార గ్రంథంగా భాసిస్తుంది. కుమార సంభవం, శృంగార నైషధం, శృంగార శాకుంతలం వంటి ప్రబంధ పూర్వయుగకావ్యాలలో ప్రబంధ లక్షణాలున్నవి. ఐనప్పటికీ అవి అనువాదాలు కనుక ప్రబంధాలుగా లెక్కింపబడలేదని దుర్గయ్యగారు తెలియ జేశారు.

రసవంతములైన, స్వోపజ్ఞములైన స్వతంత్రకావ్యాలే తెలుగులో ప్రబంధాలని, ఐతే, కిరాతార్జునీయం ఆధారంగా మనుచరిత్ర, మాఘకావ్యం ఆధారంగా పారిజాతాపహరణం రచింపబడినాయని వివరించినారు.

సంస్కృత భాషాసాహిత్యాలతో సమాన గౌరవాన్ని సంపాదించి పెట్టినవి తెలుగు ప్రబంధాలని నిరూపించినారు.

దుర్గయ్యగారు సృజనాత్మక కవి. వారి లేఖిని నుండి 'పాలవెల్లి', గంగిరెద్దు' అనే రెండు సృజనాత్మక రచనలు వెలువడ్డాయి. పాలవెల్లి పద్యగేయ సమ్మిశ్రితమైన కవితా సంపుటి. విద్యార్థి దశ మొదలుకొని జీవితంలోని అనేక సందర్భాలను పద్యాలలో, గేయాలలో వర్ణించిన తీరు పాలవెల్లిలో వెల్లి విరిసింది.

దుర్గయ్యగారి అనల్పకల్పనాశక్తి, వర్ణనాపటిమ, దేశీయలు, స్వభాషలోని అందచందాలు అనేవి 'గంగిరెద్దు' అనే ఖండకావ్యంలో కనిపిస్తాయి.

సంప్రదాయబద్ధమైన ఛందస్సులో రచింపబడినప్పటికీ, కథావస్తువు నవ్యమైంది. ఎవరూ అంతవరకు స్పృశించనిది. మొత్తం కావ్యం కరుణరస ప్లావితమై పాఠకుల హృదయాలను ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా ఇందులోని 'సంక్రాంతి' పద్యాలు తెలుగువారి నాలుకల మీద నాట్యం చేశాయి. తెలంగాణ పల్లెపట్టులను గూర్చి ఇంత సహజసుందరంగా చిత్రించే ఖండకావ్యం మరొకటి లేదనిపిస్తుంది. ఈ కావ్యరచన వల్లనే దుర్గయ్యగారికి 'పల్లెకవి' అనే పేరు సార్థకమైంది.

దుర్గయ్యగారి లఘుకృతిలో గ్రామాల్లో తిరిగే భిక్షుక జానపద కళాకారుల ఆటపాటలను వాస్తవదృష్టితో వర్ణించినారు.

ఇందులో గంగిరెద్దులవాడు ఎద్దుకు శిక్షణను ఇచ్చి గంగిరెద్దుగా మార్చడం, ఊరూరా తిప్పుతూ ఆటలాడించడం వంటి వర్ణనలు సహజమైనవి. పల్లె వాతావరణంపై కవికి గల మమకారం, ప్రశంసనీయమైంది. ఇందులో తెలంగాణ మాండలికాలను, నుడికారాలు, సామెతలను చూడవచ్చు.

గంగిరెద్దులవారు ఇచ్చిన శిక్షణను గూర్చి దుర్గయ్యగారు ఎంతో చక్కగా వర్ణించినారు.

"కాళ్లు మోకరించి కఱ్ఱనేలను మోపి
పండుమనుచు భువి పరుండజేసి
కఱ్ఱమీదికెత్తి కడుచక్కగానిల్పి
లెమ్మటంచుబలికి లేవనెత్తు" అని.

ఒకరోజు ఊరివారి హేళనకు గురైన ఎద్దు, గంగిరెద్దుగా మారి బసవేశ్వరునిగా వారిచేతనే సత్కరింప బడిందని చెప్పడం వల్ల – లోకస్వభావం ఎలాంటిదో తెలిపినట్లైంది.

ఆ పద్యం వినండి :

"గొప్ప విద్వాంసుగతిసేల్వగప్పుకొనియె
గజ్జెగట్టె గొప్పకళాధికారికరణి
ధనికువలె హేమభూషణాళిని ధరించె
భోగి క్రియ గంధమాల్యానుభోగముగనె"

లోకం ఎప్పుడూ ఒకే తీరుగా ఉండదనే దానికి గంగిరెద్దు చక్కని ఉదాహరణ. ప్రథమ ముద్రణకు రాళ్లపల్లి

అనంత కృష్ణశర్మగారు, ద్వితీయ ముద్రణకు దాశరథి గారు పీఠికలు రాయడం వల్ల 'గంగిరెద్దు' కావ్యవైశిష్ట్యం ఏ పాటిదో తెలుస్తుంది.

"దుర్గయ్యగారిది ఇదొక గొప్ప సాహసమైన ప్రయత్నం" అని రాళ్లపల్లి తమ పీఠికలో రాయగా, దాశరథి తమ పీఠికలో "కరుణరసం కట్టలు త్రెంచుకుని ప్రవహించే కావ్యం గంగిరెద్దు" అని ప్రశంసించారు.

కన్నతల్లి చనిపోతే, కోడె ఇల్లు విడిచి పోవడాన్ని దుర్గయ్యగారు ఇట్లా వర్ణించారు గంగిరెద్దులో.

"తండ్రి గొట్టెనేని తల్లి కోపించిన
కనులు మూసికొని టికెట్టులేక
రైలుబండిలో జొరబడు బాలుని భంగి
ఇల్లు విడిచె కన్నతల్లి పోవ"

అంటారు. ఆధునికమైన ఉపమానాలకు ఈ కృతి ఆలవాలమైంది.

దుర్గయ్యగారి రచనలలో "చతుర వచోనిధి" ఉత్తమ విమర్శనగ్రంథం. మనుచరిత్రలో పెద్దన చూపిన చతురవచోనిధిత్వం, ఎన్నో వ్యాసాలలో ఇందులో నిరూపితమైంది. 'మను చరిత్ర' సమగ్రంగా దర్శనమిస్తుంది ఇందులో.

దుర్గయ్యగారి సృజనాత్మక రచనలలో ఒకటి 'పారిజాతాపహరణం' అనే గేయ కృతి. ఇది వారి శతజయంతి సందర్భంగా ప్రచురితమైంది.

"ఏ వేళల ఏ సుందరి
ఏ విలాసములు గోరిన
ఆ వేళల ఆ సుందరి
నా విలాసముల దేల్చును"

అని శ్రీకృష్ణుని లీలలను చక్కగా గానం చేశారు దుర్గయ్య గారీ కావ్యంలో.

అధ్యాపకులుగా ఉద్యోగబాధ్యతలు నిర్వహిస్తూ, అటు పరిశోధనలోనూ, ఇటు సృజనాత్మక రచనలోనూ తనదైన ముద్రవేసిన పల్లా దుర్గయ్యగారు తెలంగాణ రచయితలలో అగ్రశ్రేణికి చెందినవారని చెప్పక తప్పదు.

# 107 పల్లెర్ల హనుమంతరావు

– డా॥ అమ్మంగి వేణుగోపాల్

చరిత్ర ఒక శిల్పి సమరాలవు వ్యక్తిత్వాలను చెక్కుకుంటుంది. ఆ వ్యక్తిత్వాలే చరిత్ర పురుషులుగా మిగిలి పోతారు. అట్లాంటి తెలంగాణ చరిత్ర పురుషులలో 'దక్కన్ గాంధీ', 'తెలంగాణ కేసరి' పల్లెర్ల హనుమంతరావు ఒకరు.

పల్లెర్ల హనుమంతరావు బూర్గుల రామకృష్ణారావు గారి మంత్రి వర్గంలో మంత్రిగా పనిచేశారని చెప్పటం అంత ముఖ్యమైన విషయం కాదు. ఆ మంత్రి వర్గంలో ఇతరులెంతో మంది వుంటారు. వారిలో లేని ఎన్నో ఇతర విశిష్టత లుండటం మూలంగా ప్రజలు 'దక్కన్ గాంధీ', 'తెలంగాణ కేసరి' అన్న బిరుదులు ఇచ్చి వారిని గౌరవించుకున్నారు.

హనుమంతరావు 1908లో జన్మించారు. తండ్రి పల్లెర్ల శివరామయ్యగారు నిజాం ప్రభుత్వంలో పనిచేశారు. హనుమంతరావు 15 సంవత్సరాల ప్రాయంలోనే తమ తండ్రి, తల్లి గారిని కోల్పోయారు. దీంతో పెదనాయిన కిష్టయ్యగారి పెంపకంలోనే వీరు పెరిగి పెద్దవారయ్యారు.

చరిత్ర పుటలు తిరగేస్తే హనుమంతరావు పూర్వీకులు మహబూబ్‌నగర్ జిల్లాలోని లోకాయపల్లి సంస్థానానికి చెందినవారు. ఈ సంస్థానాధీసుల దేశభక్తి అపారమైనంది. 1857లో మొదటి స్వాతంత్ర్య సమరాన్ని సమర్థించటమే కాక, రాణి ఝాన్సీబాయి చేసిన తిరుగుబాటును బలోపేతం చేయటానికి లోకాయపల్లి మహారాణి తమసైన్యాన్ని పంపించారట! పల్లెర్ల వంశంవారు లోకాయపల్లి నుండి మహబూబ్ నగర్ పట్టణానికి వలసవచ్చారు. అచిరకాలంలోనే తమ సేవలతో ఆవూరి వారి మనసులు గెలుచుకున్నారు.

ఆరవ నిజాం మహబూబ్ అలీపాదుషా పేరు మీద నెలకొల్పబడ్డ మహబూబ్‌నగర్ ఎప్పుడూ నీటి సమస్యతో సమమతమవుతూ వచ్చింది. చివరి నిజాం అస్తవ్యస్త విధానాల మూలంగా తెలుగుతోపాటు కన్నడ మరాఠీ భాషలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. గస్తీ నిషాన్ 53 ఉత్తర్వుల ప్రకారం వాక్ సభాస్వాతంత్ర్యాలు హరించబడ్డాయి. తెలుగులో బోధించే వీధి బడులు మూతపడ్డాయి. తెలుగు మీడియంలో బోధన సాగేది కాదు. ఈ నేపథ్యంలో పల్లెటూళ్ళనుంచి చదువుకోసం వచ్చే పేద, మధ్యతరగతి విద్యార్థులకు పల్లెర్లవారి ఇల్లు ఒక ఆశాకిరణంగా, ఒక శరణాలయంగా వుండేది. కిష్టయ్య, శివరామయ్య, హనుమంతరావు, శ్రీనివాసరావు, వినాయక రావు గార్లు తరతరాలుగా మహబూబ్‌నగర్ జిల్లాలో విద్యావ్యాప్తికి కృషి చేస్తూ వచ్చారు.

మొదట హనుమంతరావు సతీమణి సరస్వతమ్మగారు, ఆ తదుపరి శ్రీనివాసరావుగారి సతీమణి కమలమ్మగారు అల్లసాని పెద్దన్న వర్ణించినట్లు 'వండినలయుదు వేవురువచ్చిరేని' అన్న పద్ధతిలో – చుట్టాలకు, మిత్రులకు,

విద్యార్థులకు వండి పెడుతూ వచ్చారు. ఇతరులకు ఆదర్శంగా వుండటం హనుమంతరావుకు బాల్యం నుండే అలవడ్డ లక్షణం. ఈ దశలో కుటుంబ వ్యక్తిగా కాక సమాజ వ్యక్తిగా తనకుతాను తీర్చిదిద్దుకునే అవకాసం వారికి లభించింది.

మహబూబ్‌నగర్ లోనే హనుమంతరావు మెట్రిక్‌లో ఉత్తీర్ణులై, ఆ తర్వాత హైదరాబాదులో న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. ప్రముఖ రచయిత నందగిరి వెంకటరావుతో కలిసి మహబూబ్‌నగర్‌లో ప్రాక్టీసు మొదలుపెట్టారు. తొందరలోనే అగ్రశ్రేణి వకీలుగా పేరు తెచ్చుకొన్నారు.

అయితే 1926 నాటికే వారికి జిల్లాలో కాంగ్రెస్ నేతగా పేరు వచ్చిన సంగతి మరువరాదు. తమ 18వ ఏట వారు హరిజనోద్ధరణకు నడుంకట్టి, మిత్రుల సాయంతో పాతమహబూబ్‌నగర్‌లో హరిజనుల దేవాలయ ప్రవేశ కార్యక్రమం విజయవంతంగా జరిపించారు. ఈ సంఘటన తర్వాత దగ్గరి బంధువులు, నాయీ బ్రాహ్మణులు పల్లెర్ల కుటుంబాన్ని వెలివేసినట్లుగానే చూసేవారు. కాని హనుమంతరావు గాంధేయ భావజాలం నుంచి రెప్పపాటు కాలం కూడా దూరం జరగలేదు. ఈ దశలో హనుమంతరావు వంటి యువకులను కదిలించే సంఘటనలు, పరిణామాలు ఎన్నో చోటు చేసుకున్నాయి. గ్రంథాలయ ఉద్యమానికి, తెలుగు పాఠశాలల ఏర్పాటుకు పట్టుకొమ్మగా నిలిచిన ఆంధ్రజన సంఘం, తెలంగాణలో సాంఘిక సంస్కరణలకు రాజకీయ చైతన్యానికి ఆధారస్తంభంగా నిలిచిన ఆంధ్రమహాసభ, ఉస్మానియా యువ విద్యార్థులను సానబెట్టిన వందేమాతర ఉద్యమం, నిషేధాల మధ్య వికాసం చెందుతున్న కాంగ్రెస్ పార్టీ, నిజాం మూలంగా చోటు చేసుకుంటున్న మతాంతరీకరణలు, వాటిని ఎదుర్కుంటున్న ఆర్య సమాజ్ – ఇవన్నీ హనుమంతరావు దృష్టిపథం నుంచి తప్పించుకుపోలేదు.

గాంధీజీ పిలుపు మేరకు క్విట్ ఇండియా ఉద్యమ సందర్భంగా వకీలు వృత్తిని వదులుకుని పూర్తి స్థాయి కాంగ్రెస్ రాజకీయ కార్యకర్తగా రూపొందారు. అయితే అప్పటికే వారు కల్వకుర్తి, అచ్చంపేట, ఆలంపూర్ ప్రాంతాలలో అనేక సత్యాగ్రహ కార్యక్రమాలను చేపట్టి, ప్రభావ శీలంగా పనిచేశారు. ఈ దశలో కాంగ్రెస్ బలహీనంగా వున్న ప్రాంతాలను గుర్తించారు. గుల్బర్గా, బీజాపూర్, ఔరంగాబాద్ ప్రాంతాలలో పార్టీ యూనిట్లను నెలకొల్పటం జరిగింది. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులైన తర్వాత ఖాధీగ్రామోద్యోగ కార్యక్రమాలను ముమ్మరం చేశారు. దీంతో నిజాం ప్రభుత్వం వారిని 1937లో మొదటిసారి అరెస్టు చేసి 4 నెలలపాటు జైలులో నిర్బంధించింది. గాంధీజీ 1942లో సత్యాగ్రహానికి పిలుపునిచ్చారు. ఆ సందర్భంలో హనుమంతరావు మహబూబ్‌నగర్ చౌరస్తావద్ద వ్యష్టి సత్యాగ్రహం చేశారు. వేలాది పట్టణ ప్రజలు చూస్తుండగా వారిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంలో వారు గుల్బర్గా, హైదరాబాదు జైళ్లలో వున్నారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నిజాం ప్రభుత్వం మీద ఒత్తిడి పెరిగింది. ఇండియన్ యూనియన్‌లో హైదరాబాద్ రాష్ట్రాన్ని విలీనం చెయ్యాలన్న డిమాండు రోజురోజుకు బలోపేతం కాసాగింది. దీంతో నిజాం వత్తాసుతో కాశీం రజ్వీ తన హంతక ముఠాను రజాకార్లు అన్న పేరుతో రంగంమీదకు దించాడు. ఈ దారుణ పరిస్థితులలో ప్రతిచర్యకు గురయ్యేది అమాయకులైన మైనారిటీ ప్రజలేనన్న అవగాహనతో హనుమంతరావు వారికి రక్షణ కల్పించారు. తమ ఇంట్లో ఆశ్రయం ఇచ్చి రక్షించటం ద్వారా నిజమైన గాంధీ అనుచరుడునిపించుకున్నారు. స్థానికులైన తెలుగు నేతల నుంచి ఈ విషయమై కొంత వ్యతిరేకత వచ్చినా పల్లెర్ల వారు ఏమాత్రం వెనుకంజవేయలేదు. ఈ సందర్భంలో నిజాం ప్రభుత్వం మూడవసారి హనుమంతరావును అరెస్ట్ చేసింది. ఫలితంగా 1947 ఆగస్టు నుంచి 1948 సెప్టెంబర్ వరకు వివిధ జైళ్లలో రాజకీయ ఖైదీగా వున్నారు.

నిజాం పాలన అంతరించి హైదరాబాదు రాష్ట్రం ఏర్పడిన తర్వాత హనుమంతరావు జీవితంలో రెండవదశ ప్రారంభమయింది. 1952లో సాధారణ ఎన్నికలు వచ్చాయి. వారు మహబూబ్‌నగర్ నియోజక వర్గం నుంచి శాసనసభకు పోటీ చేసి మంచి మెజారిటీతో విజయం సాధించారు. అప్పుడే వారు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులుగా పార్టీ విజయం కోసం జిల్లా వ్యాప్తంగా పర్యటించారు. నెహ్రూగారి ఆశీస్సులతో బూర్గుల రామకృష్ణారావు ముఖ్యమంత్రి అయ్యారు. మంత్రి వర్గ విస్తరణలో హనుమంతరావుకు మంత్రి పదవి

వరించింది. రెవెన్యూ, ఎక్సైజ్, అటవీ, దేవాదాయ శాఖల మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత నిర్విరామంగా పలు కార్యక్రమాలను చేపట్టారు. వీరి కృషి మూలంగా రక్షిత కౌలుదారీ చట్టం అమలులోకి వచ్చింది. వెట్టి చాకిరీ నిర్మూలించబడింది. ఒక కుటుంబానికి గరిష్ఠంగా 55 ఎకరాల ఖుష్కే భూమిని నిర్ణయించటం జరిగింది. ఇంకా అనేక ప్రగతిశీల చట్టాలను అమలులోనికి తెచ్చి భూ సంస్కరణలకు శ్రీకారం చుట్టిన ఘనత హనుమంతరావుకే దక్కుతుంది.

ఈ కాలంలోనే పల్లెర్ల హనుమంతరావు జీవితంలో అత్యంత ప్రధానమైన ఘటన చోటు చేసుకుంది. అదే సర్వోదయ నాయకులు వినోబాభావే గారితో పరిచయం! వినోబాభావే 1951 ఏప్రిల్ నెలలో శివరాంపల్లిలో సర్వోదయ సమ్మేళనం ప్రారంభించారు. అక్కడ నుండి పాదయాత్ర చేసి పోచంపల్లి వెళ్ళారు. అక్కడ జరిగిన సభలో హరిజనులకు 100 ఎకరాల భూమిని దానం చేయటానికి వెదిరె రామచంద్రారెడ్డి గారు ముందుకు రావటంతో వినోబాభావే భూదానోద్యమం ప్రారంభమయింది. దీని ప్రభావంతో హనుమంతరావు మిత్రులతో కలిసి 'సర్వోదయ ప్రేమ మండలి'ని స్థాపించి శ్రమదాన్, జీవన్ దాన్, భూదాన్ – వంటి కార్యక్రమాల పట్ల చైతన్యం కలిగించారు. ఇది వరకు క్రమశిక్షణతో నిర్వహిస్తూ వచ్చిన మద్యనిషేధం, హరిజనోద్ధరణ, ఖాదీ గ్రామోద్యోగ్, వయోజన విద్య, హిందీ ప్రచార్ వంటి గాంధీజీ కార్యక్రమాలు కూడా ప్రారంభమయ్యాయి.

ఆ తర్వాత వినోబాభావే ఎప్పుడు వచ్చినా వారి వెంట వుండి భూదానోద్యమం గొప్పదనాన్ని అర్థం చేసుకుంటూవచ్చారు. ఒకసారి తమ మహబూబ్ నగర్ జిల్లాలో కూడా పర్యటించమని ప్రార్థిస్తే – "మీ జిల్లా నుంచి 50,000 ఎకరాల భూమిని భూదానం కింద ఇప్పిస్తానని మాట ఇస్తే తప్పక వస్తాన"ని వినోబా అన్నారు. పల్లెర్ల హనుమంతరావు ఏ మాత్రం వెనుకంజ వేయక 'తప్పకుండా ఇప్పిస్తాన'ని మాట ఇచ్చారు. ఇది వారి ఆత్మవిశ్వాసాన్ని ధైర్యాన్ని నిరూపించే సంఘటన. వారు అప్పుడు రెవెన్యూ మంత్రిగా వుండటం మూలంగా, ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు మద్దతుతో జిల్లాలోని అన్ని తాలూకాలు పర్యటించి భూస్వామ్యవర్గాలతో అనుకూల వాతావరణం బీదవాళ్ళలో చైతన్యం సృష్టించగలిగారు. ఫలితంగా కల్వకుర్తి, కొల్లాపూర్, నాగర్ కర్నూల్ తాలూకాలలో, భూస్వాముల నుండి, ఇతర పెద్ద వ్యవసాయదారుల నుండి 50,000 ఎకరాలు సేకరించి వినోబాభావే గారికి సమర్పించుకున్నారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన ఈ సందర్భంలో రఘుపతిపేట అనే ఊళ్ళో జరిగిన సభలో ప్రజలు పల్లెర్లహనుమంతరావుకు 'తెలంగాణ కేసరి' అన్న బిరుదును చంద్రునికో నూలు పోగుగా ప్రదానం చేసి ధన్యులైనారు. ఆ తర్వాత వారు సోషలిస్టు భావాలున్న సర్వోదయనాయకులు జయప్రకాశ్ నారాయణ్ గారితో కూడా కలిసి పనిచేశారు. 1952 నుండి 1965 వరకు భారత్ సేవక్ సమాజ్‌కు హనుమంతరావు అధ్యక్షులుగా ఉన్నారు.

ఆ తర్వాత సాధారణ ఎన్నికలలో వారు పార్లమెంటుకు పోటీ చేయవలసి వచ్చింది. మహబూబ్‌నగర్‌లోనే కాదు తెలంగాణలో ఎక్కడపోటీ చేసినా హనుమంతరావు గెలుస్తారన్న భావన అధిష్టానవర్గానికి కలిగిందంటే అది సామాన్యమైన విషయం కాదు. వారు 1957, 1962 ఎన్నికలలో మెదక్ నియోజకవర్గం నుంచి పోటీచేసి మంచి మెజారిటీతో గెలుపొందారు. ఆయనతో పోటీ చేసింది సామాన్యుడు కాదు. కమ్యూనిష్టునాయకుడు, మహాకవి మగ్దూం మొహియుద్దీన్. అందులో ఆయన మెదక్‌జిల్లాకు చెందిన వాడు. పోటీ చేసిన ఇద్దరు పరస్పరం గౌరవించుకున్నారు. ఒకచోట మగ్దూం మాట్లాడిన ఎన్నికల సభలోనే అదే వేదిక మీద హనుమంతరావు ఉపన్యసించి ఓటర్ల మనసు దోచుకున్నారు! స్వాతంత్ర్య పోరాటంలో, పార్టీ నిర్మాణంలో, భూదానోద్యమంలో, త్రికరణశుద్ధిగా పాల్గొని త్యాగధనులని పేరుపొంది, అన్ని వర్గాల ప్రజల విశ్వాసాన్ని చూరగొనటంతోపాటు సమకాలికులలో ఉన్నతుడన్న గుర్తింపు పొందారు. 11 నెలల పాటు జైల్లో వుండి 1948లో విడుదలై వచ్చిన తర్వాత జరిగిన సభలో ప్రజలు హనుమంతరావును 'దక్కన్ గాంధీ' అని ప్రేమతో పిలుచుకున్నారు.

వారు పార్లమెంటు సభ్యులుగా వున్నప్పుడే మహబూబ్ నగర్‌కు చెందిన విద్యార్థినీ విద్యార్థులు డిగ్రీ చదువుల కోసం దూరప్రాంతాలకు వెళ్ళవలసివస్తున్నదని గుర్తించారు. దీంతో మిత్రులతో కలిసి వారు 'మహబూబ్‌నగర్ విద్యా సమితి'ని స్థాపించారు. ప్రజల నుంచి, భూస్వాముల నుంచి విరాళాలు

వసూలు చేసి, ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని పొంది 1965లో ఎం.వి.ఎస్. కళాశాలను స్థాపించారు. ప్రజల విరాళాలతో పట్టణ శివారులో కళాశాల కోసం 45 ఎకరాల భూమిని కొన్నారు. ఇక్కడే కళాశాల భవనాలు వెలిశాయి. పల్లెర్ల హనుమంతరావు ఆశీస్సులతో ఎం.వి.ఎస్. కళాశాల-ప్రభుత్వ కళాశాలగా, పి.జి. కళాశాలగా కూడా అభివృద్ధి చెంది జిల్లాలోనే అగ్రస్థానంలో వుంది.

హనుమంతరావు మహబూబ్‌నగర్ జిల్లా రాజకీయాలకు దిక్సూచిగా వుండి, సామాజిక, ఆర్థిక వ్యవసాయ రంగాలకే కాక విద్యారంగానికి కూడా అమూల్యమైన సేవలందించారు. వినోబాభావే చెప్పిన శ్రమదాన్, జీవన్ దాన్, భూదాన్ వంటి సర్వోదయ ప్రణాళికలో విద్యాదాన్‌ను కూడా చేర్చిన మహనీయులు-హనుమంతరావు గారు ధన్యజీవి.

# 108 పందిళ్ల శేఖర్‌బాబు

**– డా॥ గన్నమరాజు గిరిజా మనోహర బాబు**

'జా గ్రహ పాఠ్యం ఋగ్వేదాత్
సామభ్యో గీతమేవచ
యజుర్వేదా దభినయాన్
రసాన్ అధర్వణ దపి'

నాటకం ఒక సమాహార కళ. ముఖ్యంగా అది చతుర్వేద సార సంగ్రహమైన కళ. పాఠ్యం ఋగ్వేదమైతే గీతం సామవేదం, అభినయం యజుర్వేదం, రసం అధర్వణ వేదం. సర్వ వేద సారమైనది కనుకనే 'కావ్యేషు నాటకం రమ్యం'. సాహిత్యంలో అత్యున్నత స్థాయిని నాటకానికి ఇచ్చారు కాబట్టి "నాటకాంతం హి సాహిత్యం" అని కూడా ప్రవచించారు.

ఓరుగల్లు కళల పుట్టిల్లు అని ప్రసిద్ధి. ఆ పేరు స్ఫురించ గానే కాకతీయులు వారి సామ్రాజ్య వైభవం, నాటి రాజుల కళాపోషణ, అప్పటి కళారూపాలు, నృత్య శాస్త్రాలు, శిల్ప విన్యాసాలు కళ్లకు కడతాయి. కళారూపాలన్నీ రంగస్థల చైతన్యంలో భాగాలే అయినా రంగస్థలమంటే నాటకంగా మాత్రమే స్థిరపడింది. దీన్ని నాటక రంగానికే పరిమితం చేసి ఆలోచిస్తే వరంగల్‌లోని నాటక చైతన్యం అపూర్వంగా దృశ్యమానం అవుతుంది. ఆ చైతన్యంలో ఒక వెలుగు కిరణమే ప్రసిద్ధ పౌరాణిక రంగస్థల నటుడు, దర్శకుడు కీర్తిశేషులు పందిళ్ల శేషుబాబు.

ఆయనొక నటతపస్వి, ఆయన శ్వాసించింది నాటకం, ఆయన ప్రేమించింది నాటకం. ఆయన తన ప్రతిభ చూపించింది నాటకం. సాధారణంగా సమాజానికి దిశానిర్దేశం చేయడానికై కొందరు కారణజన్ములు జన్మించి తమ కార్యాన్ని నిర్వర్తించి నిష్క్రమిస్తూ ఉంటారు. ఆ కోవలోని వారే పందిళ్ల శేషుబాబు గారు.

1961 సెప్టెంబర్ 2వ తేదీన కీర్తిశేషులు పందిళ్ల రాజయ్య శాస్త్రి, సుచేత దంపతులకు వరంగల్ జిల్లాలోని ధర్మసాగర్ గ్రామంలో జన్మించారు. ప్రాథమిక విద్యాభ్యాస మంతా స్వగ్రామంలోనే సాగింది. కొంతవరకు ఉన్నత విద్య వరంగల్‌లో సాగింది. ఉన్నత విద్యాభ్యాసం చేయాలనుకున్న శేఖర్‌బాబు గారికి తండ్రిగారి హఠాన్మరణం కొత్త బాధ్యతలు తెచ్చిపెట్టడం వలన ఉద్యోగ జీవితంలోకి ప్రవేశించాల్సి వచ్చింది. కుటుంబ బాధ్యతల్ని సక్రమ రీతిలో నిర్వహిస్తూనే ఉద్యోగ బాధ్యతలను కూడా మరింత శ్రద్ధతో కొనసాగిస్తూనే.. ప్రైవేటుగా ఎం.ఎ. ఎల్.ఎల్.బి. విద్యను సాధించడం వారిలోని అకుంఠిత దీక్షకు నిదర్శనం.

తన ప్రధానాభిరుచి పౌరాణిక నాటకం. దాని దిశగా ప్రస్తానిస్తూ 1998లో 'తెలంగాణ డ్రెమొటిక్ అసోసియేషన్' స్థాపించారు. పౌరాణిక పద్య నాటక పునరుత్తేజం నిమిత్తం నడుంకట్టారు. కొంతకాలం వరంగల్ జిల్లా పద్యనాటక కళాపరిషత్ కొరకు పనిచేసి తదనంతరం పద్యనాటక ప్రాచుర్యం కొరకు తెలంగాణ డ్రెమొటిక్ అసోసియేషన్‌ను

స్థాపించి ముందుకుసాగి తన ప్రతిభ జిల్లాస్థాయికే పరిమితం చేయక దాన్ని మరింత విస్తృతపరిచారు.

మొదటి నుంచి నాటకాభిమాని అయిన శేఖర్‌బాబు గారు ధర్మసాగర్ హైస్కూల్లో 8వ తరగతి చదువుతున్నప్పుడే 'ఆత్మహత్య' అనే సాంఘిక నాటకంలోని సన్యాసిరాజు పాత్ర ద్వారా రంగస్థల ప్రవేశం చేసి అప్పుడే ఆ నాటికకు దర్శకత్వం కూడా చేశారు. చేయడమే గాక.. ఆ నాటకం ద్వారా వారు ఉత్తమ నటునిగా, ఉత్తమ దర్శకునిగా బహుమతులు కూడా పొందారు. వారి నాటకాభిమానానికి అదే గొప్ప స్ఫూర్తి నిచ్చింది. అనుకోకుండా 1998లో 'పాలకుర్తి' జాతర సందర్భంగా ఏర్పర్చిన నాటకోత్సవాల్లోని కృష్ణరాయబారం పడక సీనులో కృష్ణ పాత్రధారి రాని కారణంగా శేఖర్‌బాబు గారు ఆ పాత్ర ధరించి మెప్పించారు. అదే వారి తొలి పౌరాణిక నాటకరంగ ప్రవేశం.

అప్పటినుంచి వారు పౌరాణిక నాటక రంగంలో ఒక గొప్ప నటునిగా వెలిగి తమదైన గుర్తింపును తెచ్చుకున్నారు. తొలి సాంఘిక నాటకంలోని రెండుపేజీలున్న డైలాగును ఏకబిగిన చెప్పడం, ఆపద్ధర్మంగా నటించిన శ్రీకృష్ణ పాత్రకు సంబంధించిన పద్యాలను రాగయుక్తంగా ఆలపించడం ద్వారా అనేకమంది పెద్దల ప్రశంసలు పొంది నాటకరంగంపై మరింత మక్కువ పెంచు కున్నారు. పాత్ర హావభావాల్లో ప్రత్యేక శ్రద్ధ చూపించే పాత్రధారికి నాటకరంగం పెద్దపీట వేస్తుంది. కీర్తిశేషులు శేఖర్‌బాబు గారి విషయంలోనూ అదే జరిగింది. అటువంటి వారి పాత్రకు మంచి రాణింపు లభిస్తుంది. కొత్తవారికి స్ఫూర్తిదాయకమై నిలుస్తుంది. అందుకే వారి పౌరాణిక పాత్రలకు గొప్ప రాణింపు వచ్చి.. అనేక బహుమతులకు, పురస్కారాలకు కారణమైంది.

శేఖర్‌బాబు గారిలోని సునిశిత పరిజ్ఞానం, మేధాశక్తి ఆయన వృత్తికి, ప్రవృత్తికి బాగా తోడ్పడ్డాయి. దేవాదాయ, ధర్మాదాయ శాఖలోని తన ఉద్యోగం ఆయనలో ఒక దైవీ భావనను ప్రోదిచేయడం కారణంగా శ్రీకృష్ణ, శ్రీరామ వంటి పాత్రలు ఆయనలోని ఒకానొక గురుభావం ఆలంబనంగా నిలిచి.. తన నట జీవితంలోనే అవి మైలురాళ్లుగా నిలిచాయి. ప్రతిభావంతులైన ఇతర నటులతో సాన్నిహిత్యాన్ని పెంచుకుని వారి నటనలోని వైవిధ్యాన్ని సంపూర్ణంగా ఆకళింపు చేసుకుని తనను తాను తీర్చిదిద్దుకునే ప్రయత్నం చివరివరకు చేస్తూనే ఉండటం శేఖర్‌బాబులోని నాటక తృష్ణకు ఒక సజీవ ఉదాహరణ. కేవలం నటునిగానే కాక.. నిర్వహణ సామర్థ్యం కలిగిన వ్యక్తి గనుక తాను స్వయంగా ప్రదర్శనలివ్వడమే గాకుండా పౌరాణిక, సాంఘిక నాటక పరిషత్‌లు సమర్థంగా నిర్వహించిన దక్షుడు కీర్తిశేషుడు శేఖర్‌బాబు.

తన స్వయం కృషితోనే సాధించుకున్న శేఖర్‌బాబు గారు కంప్యూటర్ ద్వారా ఒక ప్రత్యేక వెబ్‌సైట్‌ను కూడా ప్రారంభించి తన అనేక ప్రదర్శనలను అందులో నిక్షిప్తం చేశారు. అన్ని తరాల వారికి అందుబాటులో ఉంచి.. తెలుగు పౌరాణిక నాటక రంగానికి కొత్త పాఠాలు, కొత్త రీతిలో బోధించే యత్నం చేశారు. సమర్థుడైన కార్యకర్త కావడం మూలాన దాదాపు 9 సంవత్సరాల పాటు రంగస్థల కళాకారుల ఐక్యవేదికకు అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహించి వరంగల్‌లో నాటక కళాపరిషత్‌లను నిర్వహించి పలు సంస్థల ప్రశంసలను అందుకున్నారు. వృత్తితో పాటు, ప్రవృత్తిని కూడా సమర్థంగా నిర్వహించగలడన్న కీర్తిని కూడా సంపాదించుకున్నారు.

ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన పాలకుర్తిలో ఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న సందర్భంలో స్వామి దర్శనం నిమిత్తం వచ్చే భక్తుల సౌకర్యార్థం అక్కడి రాతిగుహను విశాలపర్చి స్వామి దర్శనాన్ని సులభం చేసి.. భక్తుల ఇబ్బందిని తొలగించేందుకు చేసిన కృషి వారి నిబద్ధతకు నిలువెత్తు నిదర్శనం. ఉద్యోగ విషయంలో ఎవరికైనా సాయంచేస్తూ న్యాయశాస్త్రంలో మెళకువలు తెలిసిన వ్యక్తి గనుక శాఖాపరమైన, సర్వీసు పరమైన ఎన్నెన్నో చిక్కులను చక్కదిద్ది ఎన్నో సలహాలతో తోటి ఉద్యోగులకు సాయపడేవారు. ఆ తత్వం వల్లనే వారు అందరికీ స్నేహపాత్రులయ్యారు.

ఓరుగల్లు రంగస్థలానికి ముఖ్యంగా పౌరాణిక రంగస్థలానికి శేఖర్‌బాబు గారి ప్రవేశం ఒక కొత్త కదలికలు తెచ్చిందనడంలో ఎటువంటి సందేహం లేదు. అప్పటికే పలు సంస్థలు ప్రదర్శనలిస్తున్నా వీరు ఈ రంగంలో కాలుమోపిన పిదప ఓరుగల్లు పౌరాణిక రంగస్థలం రాష్ట్రమంతా తనదైన ముద్రతో జైత్రయాత్ర చేసింది. తనదైన ముద్రవేసింది. కేవలం తెలుగు రాష్ట్రాల్లోనే కాక.. బెంగుళూరు, మైసూరు, మహారాష్ట్ర వంటి పలుచోట్ల కూడా అనేక ప్రదర్శనలిచ్చి వరంగల్ పౌరాణిక నాటక ఘనకీర్తి బాహుటా ఎగరడానికి కీర్తిశేషులు

పందిళ్ల శేఖర్‌బాబు గారి ఉనికి ప్రధాన కారణమన్నది నిర్వివాదాంశం.

తిరుపతిలో శ్రీ వేంకటేశ్వర నాట్య కళాపరిషత్ వారు 2007లో నిర్వహించిన నాటకోత్సవాలలో బాబుగారు 'శ్రీ కృష్ణరాయబారం' నాటకాన్ని ప్రతిభావంతంగా ప్రదర్శించి రెండు బంగారు 'గరుడ అవార్డు'లను సాధించారు. 2001లో శ్రీ కాళహస్తీశ్వరా లలిత కళాపరిషత్ నుంచి 'యయాతి' నాటకానికై ఉత్తమ ద్వితీయ ప్రదర్శన పురస్కారం అందు కోవడంతో పాటు అదనంగా నాలుగు జ్యూరీ అవార్డులు సాధించారు.

వారిలో నటన, దర్శకత్వం వంటి వాటితో పాటు.. గుణనిర్ణయం చేయగలిగే సామర్థ్యం ఉన్నది కనుకనే రాష్ట్రంలోని పలు నాటక సంస్థలు వారిని గుణనిర్ణేతగా ఆహ్వానించాయి. రాష్ట్ర ప్రభుత్వ నంది నాటకోత్సవాల ప్రాథమిక పరిశీలనలోనూ రవీంద్ర భారతిలో పీఎంకేఎం సాంఘిక నాటక పోటీలకు వారు గుణనిర్ణయం నిమిత్తం ఆహ్వానింపబడటం వారి నిర్ణాయక శక్తిపై నిర్వాహకులకు ఉన్న గౌరవాన్ని తెలుపుతున్నది. సునిశిత దృష్టితో నిష్పాక్షికంగా రాగద్వేషాలకతీతంగా ప్రతిభను గుర్తించగల నిష్ణాతుడు కనుకనే పలు నాటక సంస్థలు వారిని గుణనిర్ణయ కమిటీల్లోకి ఆహ్వానించారు. ఇది వారి రంగస్థల జీవితంలో మరో కలిక తురాయి. వారిలోని సమర్థతకు గీటురాయి.

పౌరాణిక నాటక రంగంలో రిహార్సిల్స్ నిమిత్తం బాగా కష్టాలు పడవలసిన అవసరం కలుగుతూ ఉంటుంది. ఈ విషయంలో శేఖర్‌బాబు గారు మిక్కిలి శ్రద్ధతో ప్రవర్తించే వారు. తోటి పాత్రధారులకు గానీ, మహిళా పాత్రధారులకు గానీ, హార్మోనిస్టులకు గానీ ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆర్థిక విషయాలను కూడా పరిగణనలోనికి తీసుకుని నిర్వహించుకునేవారు. ప్రదర్శన నిమిత్తం కూడా ఎంతదూరం వెళ్లవలసి వచ్చినా ఎటువంటి వ్యయప్రయాస లకు లెక్కచేయకుండా వెళ్లి వచ్చేవారు. బహుమతులు అందుకున్నా, అందుకోకపోయినా నిరాశ చెందకుండా నాటక ప్రదర్శనలే ప్రధానంగా భావించి ప్రవర్తించే శేఖర్ బాబు గారి కృషి అమోఘం. తమ జీవితమంతా పౌరాణిక నాటక రంగానికి అంకితం చేసిన వ్యక్తి కాబట్టే ఇటీవల వరంగల్‌లో వారి స్మృతితో వారంరోజుల పాటు పద్య నాటకోత్సవాలు నిర్వహించబడ్డాయి.

ఈ పద్య నాటక సప్తాహారానికి స్థానిక వదాన్యులే కాకుండా శేఖర్‌బాబు గారి అభిమానులతో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా తమవంతు సహకారాన్ని అందించారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన పలు నాటక సంస్థలు ఈ పద్యనాటక సప్తా హారంలో తమతమ నాటకాల్ని ప్రదర్శించాయి. హుజూర్ నగర్, ధర్మపురి, మధిర, హైదరాబాద్ వంటి పలు ప్రాంతాల నుంచి అద్భుతమైన తమ ప్రదర్శనలిచ్చి.. ఓరుగల్లు ప్రజలను పులకింపజేసి.. కీర్తిశేషులు పందిళ్ల శేషుబాబు గారికి నిజమైన నివాళు లర్పించాయి.

ఈ సందర్భంలోనే ఈ కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యే శ్రీ దాస్యం వినయ భాస్కర్ గారు, స్థానికమేయర్ శ్రీ నన్నపనేని నరేందర్ గారు, రాష్ట్ర శాసనసభాపతి శ్రీ సిరి కొండ మదుసూదనాచారి గారు, రాష్ట్ర ఆర్థిక శాఖామాత్యులు శ్రీ ఈటల రాజేందర్ గారు, తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి గారు, తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ గారు, మాన్య ముఖ్యమంత్రి గారి ఓఎస్డీ శ్రీ దేశపతి శ్రీనివాస్ గారి వంటి ప్రముఖులే గాక, స్థానిక ప్రజలు, ప్రజాప్రతి నిధులు పాల్గొని కీర్తిశేషులు పందిళ్ల శేఖర్ బాబు గారి సేవ లను కొనియాడమే గాక ఆ సందర్భంలో వారి జ్ఞాపకంగా "స్మృతి శేఖరం" అనే ఒక ప్రత్యేక సంచికను కూడా ఆవిష్కరించుకోవడం విశేషం.

తమ 54వ యేటనే 2015, ఏప్రిల్ 4వ తేదీన తనువు చాలించిన కీర్తిశేషులు పందిళ్ల శేఖర్‌బాబు గారి పౌరాణిక నాటకం నిలిచినన్నాళ్లు వెలుగుతూనే ఉంటుంది. తెలుగు నాటక రంగంలో చిరంజీవిగా శేఖర్‌బాబు గారు నిలిచే ఉంటారు.

# 109 పార్వెళ్ళ గోపాలకృష్ణశర్మ

**– జి.వి. కృష్ణమూర్తి**

కవి విద్వాంసులు, అష్టావధాని, కరీంనగర్ నన్నయ్య, బ్రహ్మశ్రీ పార్వెళ్ల గోపాలకృష్ణశర్మ గారు కరీంనగర్ జిల్లా, చొప్పదండి మండలము "చాకుంట" గ్రామములో శ్రీ పార్వెళ్ళ రఘుపతిశర్మ – యశోదాబాయి దంపతుల ద్వితీయ గర్భ జనితులుగా ఈశ్వర నామ సం.ర ఆషాడశుద్ధ అష్టమి తేది 31.07.1937న జన్మించారు. వీరు H.S.C. వరకు కరీంనగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించినారు. స్వయం కృషితో తెలుగులో పాండిత్యము సాధించి, ఆంధ్ర సారస్వత పరిషత, ప్రాచ్యభాష అయిన D.O.L. మరియు B.O.L. పరీక్షలకు ప్రైవేటుగా హాజరయి ఉత్తీర్ణులయినారు.

తరువాత ఉస్మానియా విశ్వవిద్యాలయము నుండి స్వయంకృషితో M.A. (తెలుగు) పట్టాను పొందారు. వీరు సంస్కృతాంధ్ర పండితులు. సంస్కృతమును స్వయంగా నేర్చుకొన్నారు. మరియు చిత్రకారులు. అష్టావదాన లబ్ద ప్రతిష్ఠులు. పంచాక్షరీ జప పరాయణులు. కృత యాత్రానుభవ కృతార్థులు. అనంత శ్రీ విభూషితులగు కరపాత్ర స్వామి పూజ్య పాద కర కమలమంతి కృత పూర్ణాభిషిక్తులు. శ్రీ విద్యాపాసకులు. వీరు మొట్టమొదట మాందాపురములో SGBT ఉపాధ్యాయునిగా మొదటిగా నియమించబడినారు. తరువాత తెలుగు పండితులుగా పదోన్నతి గావింపబడి వివిధ ఉన్నత పాఠశాలలో పనిచేసినారు. జూనియర్ లెక్చరర్‌గా, సిరిసిల్లా జూనియర్ కాలేజి ప్రిన్సిపాలుగా, డిగ్రీ కాలేజి లెక్చరరుగా పనిచేసి పదవీ విరమణ గావించినారు.

వీరు తెలుగులో రచించి ముద్రించిన పద్యకావ్యములు మూడు. అవి 1. వాసంతి 2. పంచ ముఖాంజనేయము 3. సౌందర్య లహరి.

అముద్రిత రచనలు. 28. అవి వరుసగా 1. నానార్థ రత్నమంజూష 2. విషమ ప్రపంచము 3. పర్ణవిలాపము 4. వేణునాదయము 5. వేంకటేశ్వర శతకము 6. ముక్తకములు 7. శివానందలహరి 8. కార్తీక మహోత్సవము 9. పాండురంగ శతకము 10. పాఱువేట 11. విష్ణు సహస్రనామములు (శంకర భాష్యానువాదము) 12. కన్నీరు 13. సంగ్రమ రామాయణము 14. భాగవత విశేషములు 15. పుష్ప విలాపము 16. నాగపూజ 17. గణపతి 18. యంత్రానుభవము 19. స్పర్శ 20. పంచకన్యలు 21. కల్యానావాణి 22. గీతా మహత్యము 23. స్వప్నములు 24. మధుర స్మృతులు 25. పండుగలు 26. ఆచారములు – సంప్రదాయములు 27. భువన విజయము 28. వైనపు వైనము

వాసంతి: ఇది పద్య ఖండకావ్య సంపుటి. ఇందులో 1. సుప్రభాతము 2. ప్రార్థన 3. సౌమ్య వసంతము 4. అభిలాష 5. త్రిమూర్తులు 6. ప్రణయాంచు 7. శిశింప 8. ఆదిత్యము 9. విచికిత్స 10. విపరీతము 11. కవితా మీమాంస 12. నిష్ఠుర సత్యము 13. ఓ కవీ!

14.ఆత్మార్పణము 15. చంద్రశేఖరా! అను 15 ఖండితలు కలవు.

వీరి రచనలలో భావ గాంభీర్యము, భావనాపటిమ, రచనా రమణీయకము, కల్పనాచమత్కృతి, రసపోషణ, ఉదాత్తశైలి పదపదమునవున్న దనుటలో అతిశయోక్తిలేదు. ఈ కావ్యము శివసుప్రభాతముతో మొదలై చంద్రశేఖర స్తుతి పాఠముతో నంతమైనది. ఈ ఉపక్రమోప సంహారములు శివాత్మకములై శివంకరములై కృతి విలక్షతను చాటుచున్నవి. వీరి మొదటి పద్యములో ప్రకృతి కాంత తన మధుర పంజుల గళపేటిక విప్పి విశ్వవీణపై శివరంజని రాగము మేళవించి ప్రభాత గీతములు పాడును శివస్వామిని మేలుకొల్పుచున్న రసవత్తర రమణీయ కల్పన ఆహ్లాదముగానున్నది.

శ్రీ గిరిజా మనోహర విశించి ముహూర్తము వేళయయ్యె నీ
కై గళ పేటి విప్పి కలకంఠ రవంబున విశ్వ వీణ పై
రాగము మేళవించి శివరంజనియై నిను మేలుకొల్పెదున్
భోగి విభూషణ ప్రకృతి భోగిని కన్నులు విప్పుమా ప్రభూ!

ఇందులోని 'త్రిమూర్తులు' ఖండికలో వారు తెల్పిన త్రిమూర్తులు. 1. సుభాస్ చంద్రబోస్ 2. గాంధీ మహాత్ముడు 3. వల్లభాబాయి పటేలు. ఆ త్రిమూర్తులవలెకాక వీరి కర్తవ్యములు. ఆధునిక భారత జాబిత్యవసరమగు నేతృత, మాతృత, సౌభాతృతయై యున్నవి. కవి జాతి శ్రేయస్సును, సమాజ వికాసమును, విశ్వ కల్యాణమును, దృష్టిలోపెట్టుకొని రచన చేసెననుటకు యిట్టి వెన్నెని ఈ కృతిలో కానవచ్చును.

**పంచ ముఖాంజనేయము**

మెదక్ జిల్లా సమీపమున గోసముద్రమను పేర ఒక సరోవరము కలదు. దాని చివర శ్రీ పంచముఖాంజనేయ స్వామి ఆలయమున్నది. కవిగారు ఆ స్వామిని దర్శించి, ఆంజనేయ ఆవిర్భావాది సకల కృత్తమును సేకరించి, భక్త్యావేశముతో స్వామి వృత్తమే వస్తువుగా ఈ కావ్యమును రచించెను. ఇది భక్తి ప్రధాన రసముగా సాగిన కావ్యము. వీర, శౌర్య, అద్భుతాది రసములును ప్రపంచింపబడినది. ఇది చాతుర్వర్ణ వ్యవస్థ, స్వామి మహత్త్యముల నొప్పుచు, భక్తి వైరాగ్య భావములతో విలసిల్లుచున్నది. శివకేశవుల కభేద భావముతో సంఘమును సంస్కరింపబూనిన దీకావ్యము. ఇందులోని భాష సరళ సుందరపై సలక్షణమైనది. భావములు రమణీయము. ఇది మూడు ఖండములుగా విభజింపబడినది. 1. ఆవిర్భావ ఖండము 2. విక్రమ ఖండము 3. ఉత్తర ఖండము.

కవిగారు ఇందు సందర్భోచితముగా హనుమన్ పటలము, హనుమత్ సుప్రభాతమును హనుమత్ మహత్యయమును తెలియజేసినారు. ఈ కావ్యము ఆకృతిని చిన్నదయ్యు, భక్తిభావ ప్రకటనమందున, కవితా కళా సంపన్న తందును మిన్నయై విరాజిల్లుచున్నది. కథా కథనము నందును, కథా సంగ్రహకరణమునందును, చూపిన నేర్పు ప్రశంసనీయమైయున్నది. పద్యములన్నియు భావబంధు రములు, ప్రసన్నములును, ధారామద్ది శోభితములునై యున్నవి.

ఉదాహరణకు ఇందులోని పురవర్ణము...

శ్రీలకు తానకంబయి సమృద్ధిగ
పంట మంతి పంటలన్
చేల పొలాల రాసులుగ
జేయగనొప్పు మెదమ్మరంబునన్
దాలయమై వసించుటకు
నక్కటికంబు వహించు స్వామినే
నా లలిత ప్రవృత్తులును
వాంచితమున్నెర పేర్చియేలుతన్

ఇటువంటి అందమైన పద్యములు ఈ కృతిలో యింకెన్నోగలవు.

**సౌందర్యలహరి**

ఇది శంకర భగవత్పదుల సౌందర్యలహరి సంస్కృత శ్లోకాలకు తెలుగు పద్యములలో చేసిన అనువాద గ్రంథము మూలభావములకు అనుగుణంగా సరళ సుందర శైలిలో సాగిన కృతి.

సౌందర్యలహరిలోని మంత్ర రహస్యములు, యంత్ర రహస్యములు, తంత్ర రహస్యములు, యోగ రహస్యములు, సాధక రహస్యముల గల ప్రతి శ్లోకమునకు మూలము నతిక్రమింపకుండా శంకర భాగవత్పదుల కవితా హృదయము మార్దకవిత మరింత పరిపుష్ట మొనర్చు పద్ధతిలో అనువాదము బహురమ్యముగా సాగినది. మంత్ర తంత్ర రహస్యాదులలో ప్రవేశము లేనివారు సైతము కవితా

సౌందర్యముతో తృప్తులగునట్లు అనువాదము సాగినది.

మచ్చునకు...

శివశక్తియుక్తా అను శ్లోకమునకు

శివశక్త్యాయుక్తోయడి భవతి శక్తః ప్రభవితుం
నచే దేవం దేవో నఖలు కుశలః స్పందితురుపి
అత్రస్యా మారాద్యాం హశిహర విశించాడిఖిరపి
ప్రణతు స్తోతంవా నా కథ మకృత పుణః ప్రభవతి
శివుడును శక్తియుక్త తనె సృష్టినొనర్పగ జాలు గానిచో
నవని కదల్పనుం గదల నైనను జాలదు నందు చేతనే
శివ! హరి ధాతృ రుద్ర పశిసేవ్యవు,
నిన్గత జన్మపుణ్య సం
భవ ఫలితంబుగా కొలువ పొడగ
మ్రొక్కగ గల్గు నేరికిన్

ఇంకొక శ్లోకము

మూలము:

హరిశ్త్వా మూరాధ్య ప్రణత జన సౌభాగ్య జననీమ్
పురా నారీ భూ త్వా పురశిపు మపిక్షో భమనయత్
స్మరో పిత్వాం నత్వా రతినయన లేహ్యేన వపుషో
మునీ నామవ్యంతః ప్రభవతి హిమోహాయ జగతామ్

అనువాదము:

హరి నిను గొల్చియే ప్రణతులైన
జనంబుల దీర్చిదిద్దు మా
తరొ పుర వైశి మోహమున దద్దయు
దేల్చెడి స్త్రీత్వ మందె నా
మరుడును నిన్నుగొల్చి రతి
మానసహారి సురూప మంది డు
స్తర తప మాచరించు ముని
చక్రమ వక్రత నిగ్రహించెదును
మూల భావమునకనుగుణముగా రచన సాగినది.

ఈ రచనలతోపాటు అనేక ప్రాంతములలో అష్టావధానములు జేసి పంచి అవధానిగా పేరు గాంచినారు. నిరాడంబరముగా, నియమబద్ధమైన జీవితమును సాగిస్తూ, కరీంనగర్‌లో మాలాంటి వారికి పెద్ద దయగా నుండి సందేహాలను నివృత్తి జేస్తూ, ప్రబంధ కార్యముల లోతులను తెలియజేస్తూ మాకు విజ్ఞాన సంధాయియై తెలుగు సాహిత్యములో విశేష కృషి సల్పి 'వాచస్పతి' బిరుదాంకితులై విరాజిల్లిన బ్రహ్మశ్రీ పార్వెళ్ళ గోపాలకృష్ణ శర్మ గారు ధన్యులు.

# 110 పేర్వారం జగన్నాథం

**- డా॥ తిరునగరి**

అభ్యుదయ కవితోద్యమ తరువాత తెలుగు సాహితిలో అకర్షించినవారు చేతనా వర్తకవులు. మనిషి ఆత్మానుభూతి నుంచి సమాజ చైతన్యంలోకి ప్రయాణిస్తున్నాడనే స్పృహతో వీరు కవిత్వం రాశారు. దీనిని చేతనా వర్తమానిగా పిలిచారు. తెలంగాణకు చెంది, ఓరుగల్లు నేలకు చెందినవారు సుప్రసన్న, పేర్వారం జగన్నాథం, సంపత్కుమార, వేనరెడ్డి. చేతనావర్తకవిగా సుప్రసిద్ధులైన పేర్వారం జగన్నాథం గారు ప్రధానంగా అధిక్షేప కవి.

పఠాభి 'ఫిడేలు రాగాలు డజన్, కవితా సంపుటిని రచించి అధిక్షేప కవిగా ప్రసిద్ధులయ్యారు. పఠాభి తరువాత వెంటనే గుర్తుకు వచ్చే కవి పేర్వారం జగన్నాథం గారు. పఠాభి తరువాత వ్యంగ్యాన్ని సందర్భోచితంగా ప్రయోగించి 'ఔరా, అనిపించిన కవి పేర్వారం. పఠాభి నగర జీవనాన్ని వస్తువుగా స్వీకరించి వ్యంగ్యంగా, అధిక్షేపాత్మాకంగా వచన కవిత్వం రచించి సఫలీకృతులయ్యారు. పేర్వారం సమాజం ప్రజల ఆశల్ని కలల్ని ఎలా విచ్ఛిన్నంచేసిందో తమ కవిత్వంలో శక్తివంతంగా ప్రదర్శించారు.

ఆధునిక వచన కవితలో ఇంతటి వ్యంగ్యాన్ని, అధిక్షేపాన్ని రంగరించిన కవి పేర్వారం జగన్నాథంగారే అంటే అతిశయోక్తికాదు. స్వతంత్రభారతదేశంలో పెరిగిన దోపిడి, లంచగొండితనం, అవినీతి ఈ కవిని కలచివేసినై. సునాయాసంగా సంపన్నులు కావడానికి రాజకీయ రంగప్రవేశం ఒకటే మార్గం అని భావించిన వాళ్ళను చూసిన తరువాత తన కవితలో వ్యంగ్యాన్ని ప్రతిష్టించడం అవశ్యమని ఆయన భావించారు. రాజకీయ వాతావరణాన్ని, కుహనా సంస్కారాన్ని చూసి పేర్వారం గుండెలో అగ్నిపర్వతాలు బ్రద్దలైనై.

ఆయన వక్రోక్తి, ని ఆశ్రయించి రచించిన కవిత్వం వృషభపురాణం, కవిత్వానికి దేశ సంక్షేమాన్ని కోరి సందేశం ఇవ్వడం ఎంత ముఖ్యమో, అభివ్యక్తి మార్గానికి చెందిన శిల్ప నైపుణ్యం కూడా అంతే ముఖ్యం. 'దేశాన్ని జాతినీ మానవతనూ విస్మరించిన కవిత్వం నేల విడిచిన సాము లాంటిది. కేవలం నినాదాల్ని వల్లిస్తూ కవిత్వమని బుకా యించకుండా రమణీయంగా వ్యంగ్య విలసితంగా చెప్పడమే నా లక్ష్యం' అన్నారు పేర్వారం జగన్నాథంగారు. పేర్వారం జగన్నాథం గారు ప్రస్తుత జనగామ జిల్లా, రఘునాథపురం మండలంలోని ఖిలా షాపురంలో 23-8-1934 నాడు జన్మించారు. శ్రీమతి సయ్యమ్మ, సంతాజీ ఆయన జననీ జనకులు. ప్రాథమిక విద్యను స్వగ్రామంలో, ఉన్నతపాఠశాల విద్యను హనుమకొండలో అభ్యసించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి తెలుగు సాహిత్యంలో ఎం.ఏ. పూర్తి చేశారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న వరంగల్ ఆర్ట్స్ సైన్స్ కళాశాలలో తెలుగు ఉపన్యాస

కులుగా చేరారు. తరువాత వరంగల్ పోస్టుగ్రాడ్యుయేట్ సెంటరులో పని చేశారు. అదే కాకతీయ విశ్వవిద్యాలయంగా అవతరించింది. అక్కడి నుండి ప్రొఫెసరుగా పదవీ విరమణ చేశారు.

ఉద్యోగ జీవితంలో కాకతీయ విశ్వవిద్యాలయం అధ్యక్షుడుగా, పాఠ్యప్రణాళికా సంఘ అధ్యక్షుడుగా కాకతీయ అధ్యయాన కేంద్రం డైరెక్టరుగా. ఆం.ప్ర. సాహిత్య అకాడమీ సహాయ కార్యదర్శిగా, ఆంధ్ర సారస్వత పరిషత్తు ఉపాధ్యక్షుడిగా, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్‌గా ఆయన పనిచేశారు.

పేర్వారం మాతృభాష ఆరెభాష ఐనా విద్యార్థి దశ నుంచే ఆయన సాహిత్యంపట్ల మక్కువ పెంచుకున్నారు.

హైస్కూలులో చొల్లేటి నరసింహశర్మ గారు తెలుగు అధ్యాపకులుగా రచనవైపు దృష్టిని మళ్ళించారు. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఎం.ఏ. చదివేకాలంలో ఆచార్య దివాకర్ల వేంకటావధాని, కురుగంటి సీతారామయ్య, చెలమ చర్ల రంగాచార్యులు, ఖండవల్లి లక్ష్మీరంజనం, బిరుదురాజు రామరాజు గార్లు అధ్యాపకులు. ఆ సాహితీమూర్తుల బోధన, స్ఫూర్తి జగన్నాథంగారిని కవిగా, సాహితీమూర్తిగా తీర్చిదిద్దినై. విశ్వ విద్యాలయ విద్యార్థిగానే జగన్నాథం గారు రచించిన కవితాసంపుటి. సాగరసంగీతం, ఎందరో సాహితీపరుల ప్రశంసలనందుకుంది.

**పేర్వారం రచనలు**

సాగర సంగీతం (1960); చేతనావర్తం (1,2, భాగాలు) (1967–1970); వృషభపురాణం (1984); ఎస్.ఇ.ఆర్.టి., మైసూర్ వారికి ప్రాంతీయ కళాశాలలో పాఠ్యగ్రంథంగా నిర్ణయింపబడింది.

గరుడపురాణం (1995), సాహిత్యావలోకనం – సాహిత్యవాసి సంపుటి; సాహిత్యావలోకనం – సాహిత్యవ్యాస సంపుటి (1982); సాహితీవసంతం, (వ్యాస సంపుటి) (1992); ఆరె జానపద గాథలు (1986); ఆరె జానపద గేయాలు (1957); ఆరె జానపద సాహిత్యం – తెలుగు ప్రభావం – సిద్ధాంతం.

పేర్వారం జగన్నాథంగారు ప్రతిస్మాత్మక పురస్కారాలనెన్నో అందుకున్నారు. ఆచార్యులుగా దక్షిణ భారత విశ్వ విద్యాలయాలలో జరిగిన సదస్సులలో పత్రాలు ఎన్నో సమర్పించారు. పేర్వారం అనేక పత్రికలలో ప్రచురించిన రచనలు పరిశీలించారు.

ఆధునిక తెలుగు సాహిత్యంలోనే గొప్ప అధిక్షేప రచన వృషభపురాణం అని పేరు పెట్టడంలోనే వ్యంగ్యం కనిపిస్తుంది. పాల్కురికి సోమనాథుని బసవపురాణం, ఈ పేరుపెట్టడానికి ప్రేరణ. సమాజ సంస్కరణ ధ్యేయంగా బసవపురాణం రచన సాగింది. పేర్వారం వృషభపురాణం. రాజకీయాలను, నాయకులను ఎత్తిపొడిచే, విమర్శించే వ్యంగ్యకవిత్వం. ప్రజల్ని పీడించే ఆబోతుల వ్యంగ్యప్రదర్శనం.

రాజకీయ వృషభం గూర్చి చెబుతూ
'మరునాడు పొద్దుపొడవకముందే
వైతాళికలు నిదురులేపగా
బుద్ధగమలో బౌద్ధమతం స్వీకరించి
అశోకసమ్రాట్టు సమాధిపై
పూలగుచ్ఛం సమర్పించి
రాజధానికి తరలివస్తూ
దారిలో కనపడ్డ గోవుల్ని
పద్యశీలకు పంపింది.' అని వాడిగా వ్యంగ్యంగా చెబుతారు.

తెలంగాణాలో ప్రజల్ని పీడించిన నాయకులు, రజాకార్లు, స్వాతంత్ర్యానంతరం రాజ ప్రముఖ బిరుదులు, ఉన్నత పదవులతో సత్కరింపబడడాన్ని చూసి ఈ కవి

పూర్వాశ్రమంలో వారు
పక్కా రజాకారు
ప్రస్తుతం వారొక మంత్రి గారికి
బావమరిది
వారి పెద్ద కుమారుడు
ఖాదీబోర్డుకధ్యక్షుడుగా
ఇటీవలే నామినేటెడ్, అంటూ మేడిపండ్ల
పొట్టలు చీల్చారు

నమ్మినవాళ్ళను మోసగించే వారిని పేర్వారం మందలించిన వైనం. ఆయన ధర్మాగ్రహాన్ని వెల్లడిస్తుంది.

ఇక ముందెప్పుడూ
విశ్వాసంలేని కుక్కల్ని పెంచుకొని

గుర్రుపెట్టి నిద్రపోకండి

చుట్టూ దొంగలున్నారు జాగ్రత్త, అన్న పంతుల్ని చదవగానే ఆ దొంగలెవరో పాఠకులు గ్రహిస్తారు

జగన్నాథంగారికి పేరు తెచ్చిన కవిత 'స్వయంవరం,

'విడాసత్యవంతుడుకాదు'

అందుకే నేను సావిత్రిలా నటించలేను.

యముడు మునుపటంత ధర్మరాజు కాదు

తెగించి వెంటబడితినా

యమునితో లేచి

స్త్రీ సమస్యలపట్ల ఆయనకున్న అవగాహనను పై పంక్తులలో మనం గమనించవచ్చు.

వృషభ పురాణంలోని ప్రతి కవితలో పేర్వారం వ్యంగ్య వస్తు వైభవాన్ని సహృదయాలు గుర్తిస్తారు. సమకాలీన సమాజానికి సంబంధించిన వస్తువును ఎన్నుకోవడంలోనూ దాన్ని తనదైన బాణిలో శక్తివంతంగా వ్యక్తీకరించడంలోనూ ఆయన నైపుణ్యం కన్పిస్తుంది. పేర్వారం వారు కావ్యకర్తేకాదు, సాహితీబంధుబృందంవంటి సాహిత్యసంస్థను హన్మకొండలో స్థాపించి ఎందరో సాహితీపరులను ప్రోత్సహించారు. సదస్సులోద్భవించారు.

వివిధ రచయితల సాహిత్యవాస్తు సంపుటులను ప్రచురించారు. వానిలో అభ్యుదయ కవితా ఇతర ధోరణుల వంటి మంచి వ్యాస సంపుటలను ప్రచురించింది మరోసాహిత్యగ్రంథం. ఆయన ప్రచురించిన దశీయ కవిత ప్రస్థానం. పేర్వారం చకుని పరిశోధకుడు ఆయన పిహెచ్‌డి సిద్ధాంత గ్రంథం 'ఆరెజానపదం సాహిత్యం తెలుగు ప్రభావం. ఆచార్య రవ్వా శ్రీహరి గారితో కలిసి సిద్ధం చేసిన గ్రంథం ఆరెభాషా నిఘంటువు చిరకాలం నిలిచే గ్రంథం.

అభ్యుదయ కవిత్వానంతర ధోరణులు ఆయన సంపాద కత్వంలో వెలువడిన ప్రసిద్ధ సాహితీవేత్తల వ్యాససంకలనం. సాహితీపరులకు సర్వకాలాలకు రిఫరెన్స్ గ్రంథం.

తెలంగాణాలో దాదాపు ఐదు దశాబ్దాలపాటు సాహిత్యసంస్థల ద్వారా, కళీ వేదికల ద్వారా, ఎందరినో కవులుగా సాహితీస్రష్టలుగా, విమర్శకులుగా వెలుగులోనికి తెచ్చారు. ఆధునిక యుగంలో తెలంగాణంలో సాహిత్య చైతనను రావడానికి కారణభూతులుగా పేరొందారు. ఆయన నిండుమానంబు నవనీత సమానం.

గ్రేట్ ఇండియన్ సర్కస్, వంటి కవితలను పేర్వారం మాత్రమే రచించారు. ప్రాపంచిక అనుభవాలను ఇంత సహేతకంగా సమగ్రంగా ఆవిష్కరించిన కవులు అరుదు. ఇంత సరళ సుందరంగా చెప్పినవారు అరుదు.

'మానవ ప్రవృత్తుల మౌలిక న్వపాలన వెలికితీయడంలోనూ సర్వమానవ సహోదర జీవనాశయానికి అవరోధంగా ఉన్న సంఘర్షత శక్తుల్ని వెలువరించడంలోనూ పేర్వారం కవిగా కొనసాగించిన కృషి అసాధారణమైంది. అన్న డా॥పి.వి. రమణ మాటలు అక్షర సత్యాలు.

విశ్వశ్రేయస్సే లక్ష్యంగా జీవనానుభవాలను అధిక్షేపరీతిలో అభినవంగా ఆవిష్కరించిన విశిష్ట కవి తెలంగాణ ముద్దుబిడ్డ ఆచార్య పేర్వారం జగన్నాథం తెలుగు సాహిత్య లోకానికి ప్రాతఃస్మరణీయులు.

# 111 పొట్లపల్లి రామారావు

– వి.ఆర్. విద్యార్థి

పొట్లపల్లి రామారావుగారు ఒక గొప్ప తాత్విక కవి. తమతరం సాహితీ మిత్రులచే 'అజ్ఞాత మహాకవి'గా పిలువబడ్డవారు. తొలితరం కథకులు. కవిత్వం, కథ, నవల, గల్పికలు, లేఖలు – ఇలా అనేక ప్రక్రియల్లో సాహిత్య సృజన చేసినవారు. ఏదో కొన్ని సందర్భాల్లోతప్ప సభలకూ సమావేశాలకూ, చర్చలకూ, ఉపన్యాసాలకు దూరంగా ఉంటూ వచ్చారు. ఒక మారుమూల పల్లెటూల్లో రైతులతో, పాలేరులతో, పనిమనుషులతో వాళ్ళలో ఒకరిగా జీవించారు.

పండ్ల తోటల్లో, కంచెల్లో, చెరువు కట్టమీద వాగుబద్దున కూర్చుని, గుట్టల శిఖర రేఖల్నీ తాకుతూ, చుట్టూ కనుచూపుమేర ధ్యాన సరస్సు అలలుగా వ్యాపిస్తూ ప్రకృతిలో కల్సిపోయి పక్షులగొంతై, మబ్బుల తేమై, సూర్యోదయాల, సూర్యాస్తమయాల వెలుగు రాశులై అతీతాన్ని తన అణువణువులో నింపుకుని, కృత్రిమ విలువల్నీ, క్షణికమైన గొప్పతనాల్నీ, ఆస్తుల్నీ, అంతస్థుల్నీ దులుపుకుని సహజమైన 'జీవితం' వేలుపట్టుకుని 'కాలిబాట' మీద సాగిపోయినవారు పొట్లపల్లి రామారావు గారు. వారు కవి మాత్రమేకాదు, ఒక తత్వవేత్త. దార్శనికులు. తెలంగాణ తాత్విక, సాంస్కృతిక, రాజకీయ ప్రపంచాలకు వెలుగులు పంచిన నక్షత్రం.

పొట్లపల్లి రామారావుగారు 20 నవంబర్ 1917న వరంగల్ జిల్లా 'తాటికాయల' గ్రామంలో చెల్లమ్మ, శ్రీనివాసరావు దంపతులకు జన్మించారు. వీరిది పెద్ద భూస్వామ్య కుటుంబం. తండ్రి శ్రీనివాసరావుగారు చుట్టూ నాలుగూళ్ళకు ఒక పెద్ద దొర. చిన్న వయసులోనే ఎంతో పేరు ప్రఖ్యాతి సంపాదించినవారు. వ్యవసాయంలో ప్రతిభా వంతులు. వీరు 'వెలమ' సామాజిక వర్గానికి చెందినవారు. ఎందరో జీతగాళ్ళు, ఆడ, మగ పనిమనుషులు వీరి పనులు చూసుకునేవాళ్ళు. ఊరి పెత్తనమంతా తమ చేతుల్లో ఉండేది. వరంగల్ సుబేదార్ (నాలుగైదు జిల్లాలకు కల్పి ఒక సుభా. ఆ సుభా ప్రభుత్వాధిపతి సుబేదార్)తో సాన్నిహిత్యము ఉండేది.

శ్రీనివాసరావు గారికి నలుగురు కుమారులు, ఒక కుమార్తె, రామారావుగారు మూడో సంతానం. ఐతే గొప్పగా సాగిపోతున్న ఈ కుటుంబంలో పెను విషాదం చోటుచేసుకుంది. శ్రీనివాసరావుగారి హటాన్మరణంలో కుటుంబం ఆగమయింది. ఈ కుటుంబాన్ని గొప్పగా చూసిన దాయాదులే, బంధువులే, ఆశ్రితులే, సన్నిహితులే వారి ఆస్తుల్ని దోచుకున్నారు. వెండి, బంగారం, డబ్బును తస్కరించారు. భూముల్ని ఆక్రమించారు. ఆస్తుల, భూముల వివరాలు తెలియని చెల్లమ్మ ఐదుగురు చిన్న పిల్లల్తో కష్టాల కడలిలో మునిగిపోయింది. అప్పుడు రామారావుగారి వయస్సు పన్నెండేళ్ళు. ఎలాగో రామారావుగారి పెద్దన్నయ్య పదహారేళ్ళ వయస్సులో తేరుకొని ఇంటి పెత్తనం చేతబట్టారు. ఏడవ తరగతి చదువుతున్న రామారావుగారి చదువు అంతటితో ఆగిపోయింది. హన్మకొండకో, హైదరాబాద్‌కో వెళ్ళి చదువుకునే ఆర్థిక స్థోమతలేదు. ఊరికే పరిమితమయ్యారు.

రామారావుగారికి తమ పదహారోయేట మేనమామ కూతురైన వెంకట నర్సమ్మగారితో వివాహమైంది. వీరికి రమాదేవి, సుజాత, నిర్మల అని ముగ్గురు కూతుళ్ళు గోపాల రావు అని ఒక కుమారుడు.

చిన్నతనం నుండే భిన్నమైనతత్వం రామారావుగారిది. వారిలో దొరతనపు ఛాయలు మచ్చుకైనా లేవంటారు. కులమత భేదాలు, ధనిక, పేద తారతమ్యాలు లేకుండా అందరితో కల్సిమెల్సి ఉండేవారట. సమగౌరవం, ప్రేమ, కరుణ పంచేవారట! ఉన్నంతలో ఏదో కొంత ఆర్థిక సహకారం కష్టాల్లో ఉన్నవారికి అందించేవారట.

తాము వివాహితులైనా, ఆర్థిక పరిస్థితులు బాగాలేకున్నా, కుటుంబ బాధ్యతలెన్నో ఉన్నా వారి మనసంతా అధ్యయనం మీద, పోరాటాలమీద ఉండేది. వరంగల్లులోని ప్రముఖ గ్రంథాలయాల్లోని గ్రంథాలన్నీ చదివి, హైదరాబాద్ వెళ్ళి అక్కడ రెండేళ్ళపాటు ఉండి రెడ్డి హాస్టల్‌లోని గ్రంథాల్నీ, స్టేట్ లైబ్రరీలోని గ్రంథాల్నీ చదివివొచ్చారు. ఆ క్రమంలోనే సంస్కృతం, ఇంగ్లీష్, ఫార్సీ, అరబ్బీ, ఉర్దూ భాషల్లో రచనలు చేశారు.

సాహిత్యం, దేశభక్తి, నిజాం పాలనను అంతమొందించ డానికి జరిగిన పోరాటం, గాంధీజీ నాయకత్వంలో నడిచిన భారత స్వాతంత్ర్య సంగ్రామం – వీరి జీవితంలో ముఖ్య మైనవి. వందేమాతరం ఉద్యమానికి గూడా ఆకర్షితు లయ్యారు రామారావుగారు. జీవితాంతం గాంధీయ వాదిగా ఉన్నారు.

24 నవంబర్ 1988న నిజాంకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో పాల్గొని వరంగల్లులో అరెస్టయిన మొదటి జట్టులో రామారావుగారున్నారు. వీరితో అరెస్టయిన వారిలో హయగ్రీవాచారి, ఇటికాల మధుసూదన్‌రావుగారున్నారు. సుమారు ఆరు నెలలపాటు జైలు జీవితం గడిపి 10 ఏప్రిల్ 1939న విడుదలయ్యారు. అరెస్టయినప్పుడు రామారావు గారు స్టేట్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు. వీరు జైలులో ఉన్న కాలంలో చాలా రచనలు చేశారు. 'జైలుకథలు' అక్కడ రాసినవే! ప్రఖ్యాత బెంగాలీ కవి నజ్రుల్ ఇస్లాం సైనికుడిగా యుద్ధ రంగానికి వెళ్ళి మొదటి ప్రపంచ యుద్ధం 1914లో కవిగా తిరిగొచ్చినట్లు రామారావుగారు పోరాట యోధుడిగా జైలుకు వెళ్ళి రచయితగా తిరిగి వచ్చారని కాళోజీగారు రామారావుగారి 'ఆత్మవేదన'కు ముందుమాటలో 1957లో అన్నారు.

1928లో హైదరాబాద్ రాజ్యంలో రెండు సంస్థలు పుట్టినవి. ఒకటి – నిజాం పాలనను సమర్థించే 'ఇత్తెహాద్ ముస్లిమీ', రెండవది – నిజాంను వ్యతిరేకించే, తెలుగు భాషా సంస్కృతులను కాపాడుకునే 'ఆంధ్ర మహాసభ'. అప్పటికే ఆంధ్రజన సంఘం ఏర్పడ్డది. జాతీయోద్యమం, వందేమాతర ఉద్యమం, ఆర్యసమాజం, తర్వాత స్థాపించబడిన అభ్యుదయ రచయిత సంఘం, గ్రంథాలయోద్యమం – వీటన్నిటి ప్రభావం రామారావుగారిపై ఉంది. ఇవన్నీ కొంతవరకు వీరి సాహిత్య జీవితాన్ని ప్రభావపరిచినా తమ స్వంత ఆలోచన, తాత్విక ధోరణి మసకబారలేదు. 1952లో సర్వోదయ నాయకులు వినోబాభావేకు తమకున్న కొద్ది భూమిలో నుండి పదెకరాలు అప్పగించి భూదానోద్యమానికి 'జే' కొట్టారు.

స్వాతంత్ర్యానంతరం, ముఖ్యంగా హైదరాబాద్ రాజ్య విమోచనానంతరం గాంధీజీ సలహాని తు.చ. తప్పకుండా పాటించారా అన్నట్లు రామారావుగారు కాంగ్రెస్ పార్టీ క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉన్నారు. ఒంటరిగా, గ్రామానికే పరిమితమై ఋషిలాంటి జీవితం గడిపారు. అసంఖ్యాకంగా రచనలు చేశారు. చివరి రోజుల్లో ఉర్దూ కవిత్వం రాశారు.

వీరి ప్రచురిత కవితా సంపుటిలు 1. చుక్కలు 2. మెరుపులు 3. ఆత్మవేదన 4. అక్షరదీప్తి 5. నాలో నేను వచన రచనల్లో.

1. జైలు మరి కొన్ని కథలు 2. నాటికలు 3. నీలవేణి (అసంపూర్ణ నవల) 4.సైనికుడి జాబులు 5. గ్రామ చిత్రాలు (మా ఊరు) చుక్కలు మిత్రమండలి హన్మకొండచే 1965లో ప్రచురింపబడింది. రెండోసారి కాళోజీ నారాయణరావు గొర్రెపాటి వెంకటసుబ్బయ్యగారి సహకారంతో దేవీనగర్ (కర్ణాటక) 1974లో ప్రచురించారు.

వీరి కవిత్వం 'దిక్కులు' అనే వీడియో కవితా సంకలనంలో రికార్డు చేశారు (వి.ఆర్. విద్యార్థి సంపాదకులుగా).

యం. భూపాల్‌రెడ్డిగారు వీరి రచనలన్నీ సేకరించి పి.హెచ్.డి. పరిశోధనా గ్రంథం ప్రచురించారు (2012లో). అదే సంవత్సరం భూపాల్‌రెడ్డిగారి సంపాదకత్వంలో పొట్లపల్లి వరప్రసాద్‌రావు ఫౌండేషన్‌వారు వీరి సమగ్ర సాహిత్యాన్ని రెండు పెద్ద సంపుటాలు (కవిత్వం, వచనం)గా

ప్రచురించారు. సుప్రసిద్ధ మూవీ మేకర్, డైరెక్టర్ వీరి కథల్ని 2012లోనే ప్రచురించారు. పొట్లపల్లి రామారావుగారి మేనల్లుడు (అల్లుడుగూడా) కె. లక్ష్మణ్‌రావుగారు కుమారుడు గోపాల్‌రావుగారు రచనల సేకరణలో సహకరించారు.

పొట్లపల్లి రామారావుగారికి కాళోజీ రామేశ్వర్ రావు(షాద్) కాళోజీ నారాయణరావు గారలు గౌరవనీయులు. రచయితగా నిలిచిపోవడానికి చాలా సహకరించారు. కాళోజీ సోదరులతోబాటు వట్టికోట ఆల్వారుస్వామి, బిరుదురాజు రామరాజు, దాశరథి కృష్ణమాచార్యులు ఆప్తులు. వయసులో చిన్నవారైనా వరవరరావుగారు చాలా సన్నిహిత మిత్రులు. వారి కుటుంబాల మధ్య గొప్ప బాంధ్యవ్యం కొనసాగింది.

ఇది పొట్లపల్లి రామారావుగారి శతజయంతి సంవత్సరం. తెలంగాణ ప్రభుత్వం, రామారావుగారి అభిమానులూ వారి శతజయంతి ఉత్సవాల్ని ఘనంగా జరపాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేస్తున్నాను. వారి రచనలన్నిటినీ వారిపై పరిశోధన చేసిన భూపాల్‌రెడ్డి గారి సహకారంతో పునః ప్రచురించాలని కోరుతున్నాను.

కాళోజీ మాటలతో ఈ నా భాషణని ముగిస్తాను. “పొట్లపల్లి రామారావు ప్రపంచ పౌరుడు. అతడు విశ్వ కుటుంబి. రంగు, రూపు, దేశం, వేషం, భాష, సంస్కృతి మొదలగు వాటిపేర పాటించబడే విభేదాలేవీ పాటించేవాడుకాదు. మానవునిలోని ఆత్మీయతను పెంపొందించి విశ్వమానవ సౌభాతృత్వం నెలకొల్పితేనే గాని ప్రపంచ శాంతి చేకూరదని అతడి ధృడ విశ్వాసం”.

పొట్లపల్లి రామారావుగారి కవితల్లో కొన్ని రచనలు –

“భూదేవి నాగటికి పాదివ్వబోకు
వరుణదేవా నువ్వు కురియబోకయ్యా
విత్తనాలూ మొలకెత్తబోకండి
నదులార మీరింక కదిలేరుసుమ్మి
సాగరా నీవింక స్థంబించిపొమ్మి
గాలిదేవా నీవు కదిలేవు తండ్రీ
కోడెగిత్తల్లార కాడికందేరు
కష్టజీవీ నువ్వు కదదొలగవయ్య
చూదాము ఈ ప్రభువు ఏ మేలుతారో
చూదాము ఏ ప్రజలు పన్నులిస్తారో”

ప్రజలపక్షాన నిలబడి గళమెత్తిన కవి రామారావుగారు. ఈ కవితలో సహాయ నిరాకరోద్యమ ఛాయలు కన్పిస్తాయి. రామారావు కవిత్వాన్ని ఇష్టపడే మన మాజీ ప్రధాని పి.వి. నర్సింహారావుగారు ఈ క్రింది కవితను ఎన్నికల్లో ఉపన్యాసం చేస్తూ ఉటంకించేవారట.

“సిలువెక్కించిన మేమే నిలువెక్కించిన మేమే
ఉరి ఎక్కించిన మేమే కరి ఎక్కించిన మేమే
ధూళి జల్లిన మేమే పూలు జల్లిన మేమే
ఎవరమో మేమెవరమో మీరించుకైన
ఎరుగుదురా?”

మరో కవితలోని కొన్ని పాదాలు–
“భూమి నుండి త్రవ్వి తీసిన
బంగారాన్ని కాపాడుకోవడం కోసం
దాని గర్భంలో నుంచే
త్రవ్వి తీసిన ఇనుముతో
కటకటాలు నిర్మించి
దానిలో ఖైదీ అయ్యాడు మనిషి”

రామారావుగారి ‘కాలిబాట’ అనే గేయం బాగా ప్రాచుర్యం పొందింది. అందులో నుండి –

“అదిగదిగో కాలిబాట
అందాల కాలిబాట
యెటనుండో మెటనుండో
ఏ సుదూర స్థలము నుండో

.... .....

ఈ రాకో, మొరాకో
ఈజిప్టో, సిరియాకో
యెక్కడికో, యెక్కడికో
ఎవరెరుగని ఏ భూమికో
పాదమేసి పాదమెదక
పల్లైతేం ఢిల్లైతేం
స్వేచ్ఛా జీవన ప్రియుల
ఇచ్చతోడ జన్మించిన
కాలిబాట నాపినట్టి
ఘనుడు కానరాడు భువిని....

ఇట్లా పొట్లపల్లి రామారావుగారి ప్రతి కవితలో ఒక ప్రత్యేకత ఉంటుంది. తాత్వికత ఉంటుంది.

# 112 ప్రభాకర్‌రెడ్డి

– హెచ్. రమేష్‌బాబు

తెలంగాణ నుండి సినిమాల్లోకి వెళ్ళినవారు సంఖ్యాపరంగా తక్కువగానే ఉంటారు. అలా వెళ్ళిన వారిలో పూర్తిస్థాయిలో స్థిరపడినవారు అరుదుగా కనిపిస్తారు. ఆ అరుదైన వారిలో ఒకరు డాక్టర్ మందడి ప్రభాకరరెడ్డి. విలక్షణ నటుడిగా ప్రభాకర్‌రెడ్డి పోషించిన ప్రతినాయక పాత్రలే మనకు ముందుగా గుర్తుకు వస్తాయి. నిజానికి ఆయన సినీ జీవితంలో విలనీ వేషాలకు సమాంతరంగా సాత్వికమైన వేషాలు వేసి గొప్పగా మెప్పించిన సంగతి చాలామంది దృష్టికి పోలేదేమోననిపిస్తుంది. ఇది మాత్రమే కాదు, ప్రభాకర్‌రెడ్డి గారు గొప్ప రచయితగా, దర్శక నిర్మాతగా విభిన్నమైన సినిమాలు తీశారు.

తెలుగు సినిమా రంగంలో ఈవిధంగా తెలంగాణ సత్తా చాటిన డా॥ ప్రభాకరరెడ్డి 1936 జూలై 1న నల్లగొండ జిల్లా తుంగతుర్తిలో జన్మించారు. లక్ష్మారెడ్డి – కౌసల్య తల్లిదండ్రులు. నిజానికి సినిమాల్లోకి ప్రవేశించే నాటికి ఆయన జీవితంలో సినిమా అంత కథ జరిగింది. అప్పటి వరకూ సామాజిక చైతన్య కార్యక్రమాల్లో పాల్గొన్న విషయం చాలా తక్కువమందికి తెలుసు. ఆయన చదువు తొలుత సూర్యపేటలో జరిగింది. నిజాం వ్యతిరేక పోరాటం చాలా ఉధృతంగా జరుగుతున్న రోజులవి. సాహిత్యం, కళలపట్ల మోజు పెంచుకున్న యువకుడైన ఆయన తన కర్తవ్యాన్ని గుర్తెరిగి బుర్రకథల్లో పాత్రధారి అయ్యారు. "సై సై" అంటూ రౌద్రంగా కళ్ళు పెద్దగా చేసి ప్రేక్షకుల రక్తాన్ని ఉడుకెత్తించే వారు. దాంతోనే ప్రభాకర్‌రెడ్డిలోని నటనా శక్తి నెమ్మదిగా బయటికి రాసాగింది. ఏదో నాటకంలో అవకాశం వస్తే ఏం మాట్లాడకుండానే వెళ్ళి వేషం వేయించుకుని స్టేజిపై మంచి నటననే ప్రదర్శించారు. ఇంక తనకు నటన వచ్చుననే మనసును మెల్లగా రంగస్థలంవైపు మళ్ళించారు. అదే ఆయన నట జీవితాన్ని మలుపు తిప్పింది. ఆయన మనసు సినిమాల వైపు మళ్ళింది. ఇంతలో అతను మెట్రిక్ పాసయ్యారు. అంతటితో చదువు ఆపేసి హాయిగా సినిమాల్లో ప్రయత్నాలు చేద్దాం అని నిర్ణయించుకున్నారు. తనకెలాగూ తెలుగు, ఉర్దూ, హిందీ భాషల్లో మంచి ప్రవేశం ఉండటంవల్ల హిందీ, తెలుగు రంగాల్లో గట్టిగానే ప్రయత్నాలు చేశారు. కానీ ఎక్కడా అంత సరైన ప్రతిస్పందన రాలేదు. దాంతో హైదరాబాదు వెళ్ళి ఇంటర్‌లో చేరారు. నాటకాల్లో వేషాలు వేయడం కొనసాగించారు. ఇంటర్ పూర్తవగానే ఎం.బి.బి.ఎస్.లో చేరారు. వైద్య కళాశాలలో అప్పటిదాకా ఆగిపోయిన నాటకాల ప్రదర్శన ప్రభాకర్‌రెడ్డి రాకతో మళ్ళీ ఊపందుకున్నవి. అప్పటి వరకూ మెడికల్ కాలేజీలో తెలుగు నాటకాలు అంతగా వేసేవారుకారు. ప్రభాకర్‌రెడ్డి చేరిన తర్వాత నాటక పోటీల్లో మెడికల్ కాలేజీ తరఫున ప్రధానంగా పాల్గొనడం మొదలైంది. ఆయన ఉత్సాహాన్ని చూసి ప్రొఫెసర్లు మరింత ప్రోత్సహించడం మొదలుపెట్టారు. పాల్గొన్న ప్రతి పోటీలోనూ ఏదో ఒక బహుమతి ప్రభాకర్‌రెడ్డి గెలుచుకు వచ్చేవారు.

ఈ పోటీల పరంపరలో హైదరాబాదులో జరిగిన అంతర్ విశ్వవిద్యాలయ నాటక పోటీల్లో తన బృందంతో ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఆ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వచ్చిన ప్రముఖ దర్శకులు జి. రామినీడు, తాపీ చాణక్యలు ప్రభాకర్‌రెడ్డి నటనను చూసి ప్రత్యేకంగా అభినందించి తమ సినిమాల్లో అవకాశం ఇస్తామని మాటిచ్చారు. ఎన్నాళ్ళుగానో ఎదురు చూస్తున్న సినిమా అవకాశం తానుగా నడచి వచ్చినట్లయ్యింది ప్రభాకర్‌రెడ్డికి.

ఇంతలో తెలంగాణ నుండి ఒక భిన్నమైన సినిమా తీద్దామని ఉప్పునూతల పురుషోత్తమరెడ్డి తన మిత్రులతో కలిసి మంజీరా పతాకంపై తీసిన "చివరకు మిగిలేది" (1960) చిత్రంలో మానసిక వైద్యుడి పాత్ర పోషణతో తెలుగు సినిమా పరిశ్రమకు పరిచయమయ్యారు. యాదృచ్ఛికమైన విషయమేమిటంటే ఈ సినిమా దర్శకుడు జి. రామినీడు. కాగా చాలా మందికి తెలియని విషయం ఒకటుంది. చివరికి మిగిలేది సినిమా బెంగాలీ చిత్రం "దీప్ జలా జాయ్" కు రీమేక్. అందులో కీలకమైన డాక్టర్ పాత్ర వేసింది ప్రసిద్ధ బెంగాలీ నటుడు పహాడీ సన్యాల్. ఆ వేషం తెలుగులో వేసింది మన ప్రభాకర్‌రెడ్డి. "చివరికి మిగిలేది' వ్యాపార పరంగా విజయం పొందలేకపోయినా విమర్శకుల ప్రశంస లందుకున్నది. ప్రభాకర్‌రెడ్డి నటన చాలామందికి నచ్చింది. సావిత్రిని నటిగా మరో మెట్టుపైన నిలబెట్టిందీ చిత్రం.

'చివరికి మిగిలేది' తరువాత వెంటనే ప్రభాకర్‌రెడ్డికి మరో సినిమాలో అవకాశం రాలేదు. పెద్ద నటుడినైపోతా ననుకున్న మనోడికి ఇదో నిరాశ. ఇక వెళ్ళి హైదరబాదులో ప్రాక్టీసు పెట్టుకుందామని తిరిగి వచ్చి ఆ పని చేశారు. కానీ ఇంతలో బి.ఎ. సుబ్బారావు 'భీష్మ' (1962), హేమాంబరధరరావు "తండ్రులూ కొడుకులు" (1961) సినిమాల్లో వేషాలిచ్చి వెనక్కి పిలిపించారు. కానీ ఈ రెండు సినిమాల తరువాత మరో వేషం రాలేదు. కానీ ఈ సారి మాత్రం పోవాలనుకోకుండా "ఎలాగూ వచ్చాం... తాడో పేడో తేల్చుకుందాం" అని కాస్త గట్టిగా ప్రయత్నాలే చేయ సాగారు. అవస్థలుపడైనసరే సినిమాల్లో స్థిరపడిపోవాలని నిర్ణయించుకున్నారు. ఆ పట్టుదలే ఆయనకు 1963లో పి.ఎ.పి. వారి 'పునర్జన్మ'లో మంచి ప్రాధాన్యత ఉన్న పాత్రలో నటించే అవకాశం వచ్చేలా చేసింది. 'పునర్జన్మ'లో నెగిటివ్ షేడ్స్ ఉన్న పాత్రతో మంచి పేరు తెచ్చుకున్న ప్రభాకర్‌రెడ్డికి ఆ తరువాత మళ్ళీ వెనక్కి తిరిగి చూసుకునే అవకాశమే కలుగలేదు. 1970 నాటికి 50 సినిమాల్లో నటించారాయన.

అసలు ప్రభాకర్‌రెడ్డి సినిమాల్లోకి రావడమే పెద్ద లక్ష్యంతో వచ్చారు. ఏదో ఉత్సాహంతో సినిమాల్లో నటించేసి తెరపై కనిపించి అక్కడితో తృప్తిపడాలని కాదు. తన అభిరుచి మేరకు విభిన్న పాత్రల్లో నటించాలని, నూతన పంథాలో కథలు సమకూర్చుకుని సినిమాలు తీయాలని తీర్మానించు కున్నారు. వీలైతే తాను సైతం దర్శకుడవ్వాలనుకున్నారు. దీంట్లో గొప్ప సంగతేమిటంటే ఆయన పైన అనుకున్నవన్నీ చేసి చూపించారు. అయితే అప్పటి వరకు తెలంగాణ వాళ్ళు సినిమాల్లో నటించి తృప్తిపడటంవద్దే ఆగిపోయారు. కానీ మన ప్రభాకర్‌రెడ్డి అక్కడే ఆగిపోకుండా కథా రచయితగా, దర్శక నిర్మాతగా విజయవంతమైన చిత్రాలు తీశారు.

**దర్శక నిర్మాతగా...**

ప్రభాకర్‌రెడ్డికి తొలి చిత్రం 'చివరికి మిగిలేది'లో నటిస్తున్నప్పుడే లక్ష్మీదీపక్‌తో పరిచయమైంది. ఆ చిత్రానికి అసిస్టెంట్‌గా పని చేశారు దీపక్. ఈయన కూడా తెలంగాణవాడే. హైదారాబాదీ కావడంవల్ల ఇద్దరికి మంచి స్నేహం కుదిరింది. మంచి ప్రతిభ ఉన్న లక్ష్మీదీపక్‌ను తానే దర్శకుడుగా పరిచయం చేస్తూ తొలిసారిగా నిర్మించిన సినిమా 'పచ్చని సంసారం' (1970). కృష్ణ – వాణిశ్రీ నటించారు. సినిమా హిట్ కావడంతో వీరి కాంబినేషన్‌లో ఆ తర్వాత మంచి సినిమాలు వచ్చాయి. ఆ తరువాత ప్రభాకర్‌రెడ్డి లక్ష్మీదీపక్ డైరెక్షనన్‌లో "పండంటి కాపురం" (1972) తీసి పెద్ద విజయం సాధించారు. ఎస్.వి. రంగా రావు, గుమ్మడి, కృష్ణలతో కలిసి నటిస్తూ తీసిన ఈ సినిమా తెలుగు సినిమా కుటుంబ కథా చిత్రాల్లో మైలురాయిగా నిలిచింది. ఇది మొదలు ప్రభాకర్‌రెడ్డి సక్సెక్‌ఫుల్ ప్రొడ్యూసర్‌గా, లక్ష్మీదీపక్ డైరెక్టర్‌గా పేరు పొందారు. మద్రాసులో ప్రభాకర్‌రెడ్డి కనిపించినచోట మళ్ళీ వేరేగా లక్ష్మీదీపక్‌ని వెదుక్కునే అవసరమే ఉండేదికాదు ఆ రోజుల్లో.

"పండంటి కాపురం" తరువాత ప్రభాకర్‌రెడ్డి లక్ష్మీదీపక్ డైరెక్షన్‌లో 'గాంధీ పుట్టిన దేశం' (1973), "నాకూ స్వతంత్రం

వచ్చింది" (1975), 'కార్తీకదీపం' (1979) వంటి విజయవంతమైన సినిమాలు నిర్మించారు. ప్రభాకరరెడ్డి పరిశ్రమలో అడుగుపెట్టిన తరువాత తొలుత అర్థం చేసుకున్నదేమిటంటే మొదట తన భాషను మార్చుకోవడం. భాష మార్చుకున్నా తన మూలాలను మరిచిపోలేదు. ఆయన లక్ష్మీదీపక్ తరువాత మరో హైదరాబాదీ డైరెక్టర్ బి. భాస్కరరావును ప్రమోట్ చేయడం ప్రారంభించారు. 'గృహప్రవేశం' (1982), 'ధర్మాత్ముడు', 'కుంకుమతిలకం' (1983) సినిమాలు భాస్కర్‌రావు దర్శకత్వంలో నిర్మించారు. ఆ రకంగా తెలుగు సినిమా రంగంలో తెలంగాణ వారిని ప్రోత్సహించారాయన. ఇంకా ఆయన 'పల్లె పిలిచింది', యువతరం కదిలింది (1980) చిత్రాలు నిర్మించారు. మొత్తం 21 చిత్రాలకు కథలు సమకూర్చి 27 చిత్రాలను నిర్మించిన ప్రభాకరరెడ్డి చిత్రాల్లో మధ్య తరగతి కుటుంబ గాథలు, సామాజిక చైతన్య కథాంశాలే ఉండటం గమనార్హం.

**విలన్‌గానే కాదు విలక్షణ పాత్రల్లో కూడా...**

ప్రభాకర్‌రెడ్డి నటించిన సినిమాలన్నింటిలో సింహభాగం ప్రతినాయక పాత్రలు వేసినవే ఉన్నా ఆయన సాత్వికమైన పాత్రల్లో కూడా తనదైన ముద్ర వేశారు. రక్తసంబంధం (1962), బొబ్బిలియుద్ధం (1964), పల్నాటియుద్ధం, నవరాత్రి (1966), ఉమ్మడి కుటుంబం, రక్తసింధూరం (1867), భలే తమ్ముడు, మాతృదేవత (1969), అక్కాచెల్లెలు, రెండు కుటుంబాల కథ (1970), మట్టిలో మాణిక్యం (1971), అమ్మమాట, పండంటికాపురం (1972), ఒకనారి వంద తుపాకులు (1973), అల్లూరి సీతారామరాజు (1974), తీర్పు (1975), భక్తకన్నప్ప (1976), కల్పన (1977), దేవదాసు మళ్లీ పుట్టాడు, యుగపురుషుడు (1978), గోరింటాకు (1979), నకిలీమనిషి (1980) ముందడుగు (1983), అనుబంధం (1984), హరిశ్చంద్రుడు (1981), ఓ తండ్రి తీర్పు (1985), చిన్నకోడలు (1990) వంటి సుమారు వంద చిత్రాల్లో తండ్రి, తాతగా, మామగా, అన్నగా స్నేహితుడిగా పాత్రలు పోషించి మెపొందారు.

**పౌరాణిక జానపదాల్లోనూ...**

మళ్ళీ నటుడుగా ప్రభాకర్‌రెడ్డి సినిమాల విషయానికి వస్తే ఆయన పౌరాణిక, జానపదాల్లో కూడా నటనకు మంచి అవకాశమున్న వేషాల్లో కనిపించారు. 'భీష్మ'లో శంతనుడిగా, నర్తనశాల, పాండవ వనవాసం, 'శ్రీకృష్ణ పాండవీయం' చిత్రాల్లో కర్ణుడిగా, దాన వీర శూర కర్ణ, శ్రీమద్విరాట పర్వంలో ధర్మరాజుగా, సరస్వతి శపథంలో బ్రహ్మగా, శ్రీ కృష్ణావతారంలో బలరాముడుగా జీవించారాయన. ఇక దుష్టమంత్రిగా, సేనానిగా జానపదాల్లో నటించారు. రణభేరి, గండికోట రహస్యం, విక్రమార్క విజయం, కంచుకోట, సింహాసనం వంటివి వాటిలో కొన్ని.

**విలనీకి విశ్వరూపం**

ప్రభాకర్‌రెడ్డి విలన్ వేషాలతో మెప్పించిన చిత్రాలనేకం ఎన్.టి.ఆర్., కృష్ణ, శోభన్‌బాబు, కృష్ణంరాజు, చిరంజీవిల వరకు హీరోలను ఢీకొనగలిగిన విలన్ ఆయనే. ప్రతినాయక పాత్రలు వేసిన ఆయన చిత్రాల్లో కొన్ని: ఉయ్యాల జంపాల, దొరికితే దొంగలు (1965), బ్రహ్మచారి (1967), ఆత్మీయులు, గండికోట రహస్యం, జగత్ కిలాడీలు, నాటకాల రాయుడు (1969), మారిన మనిషి (1970), మోసగాళ్ళకు మోసగాడు, జగత్ జంత్రీలు, మోసగాడొస్తున్నాడు జాగ్రత్త, రామాలయం, జీవితచక్రం, కూతురు కోడలు (1971), పెత్తందార్లు (1970), కిలాడి బుల్లోడు, పాపం పసివాడు, పిల్లా? పిడుగా? ((1972), మాయదారి మల్లిగాడు, నేనూ నా దేశం (1973), సంసార సాగరం, నిప్పులాంటి మనిషి, నిజరూపాలు, భూమి కోసం, అందరూ దొంగలే, దీక్ష, కన్నవారి కలలు (1974), ఎదురులేని మనిషి, కథానాయకుని కథ, గుణవంతుడు (1975), మహాకవి క్షేత్రయ్య, రామరాజ్యంలో రక్తపాశం (1976), ఖైదీకాళిదాసు, యమగోల (1977), కటకటాల రుద్రయ్య, కె.డి. నెం.1, సొమ్మొకరిది సోకొకడిది, లాయర్ విశ్వనాథ్ (1978), రంగూన్ రౌడి, యుగంధర్, మండేగుండెలు (1979), శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి మహాత్మ్యం, గురు, సర్దార్ పాపారాయుడు, రాముడు పరశురాముడు (1980), తోడుదొంగలు, సత్యం శివం, పార్వతీ పరమేశ్వరులు, కిరాయి రౌడీలు (1981), బొబ్బిలిపులి, నా దేశం, సంఘర్షణ, కలియుగదైవం (1983), అల్లుళ్లొస్తున్నారు జాగ్రత్త, మెరుపుదాడి (1984), అగ్ని పర్వతం, బుల్లెట్, కళ్యాణ తిలకం, చట్టంతో పోరాటం (1985), విశ్వనాథ

నాయకుడు (1987), అంతిమతీర్పు, చిన్నోడు పెద్దోడు (1988) తదితర చిత్రాలు.

కథా రచయితగా, నిర్మాతగానేగాక ప్రభాకర్‌రెడ్డి దర్శకుడుగా మరో అడుగు ముందుకు వేసి హీరో కృష్ణతో 'ప్రతిభావంతుడు' (1986) తీశారు. ప్రయోగాత్మకంగా కృష్ణకు అన్ని పాటలూ జేసుదాసుతో పాడించి సక్సెస్ సాధించిన ప్రభాకర్‌రెడ్డి ఎన్టీఆర్‌తో రాజకీయంగా విభేదించి ఆయనకు వ్యతిరేకంగా "మండలాధీశుడు" (1987), 'ప్రచంఢ భారతం' (1988), 'గండిపేట రహస్యం' (1989) సినిమాలు తీసిన ధైర్యశాలి. ఆయన దర్శకత్వంలో చివరగా తయారైన చిత్రం 'కామ్రేడ్'. ఈ చిత్రంలో కె.జి. సత్యమూర్తి, మాష్టార్జి పాటలున్నాయి. కాని సినిమా విడుదల కాలేదు.

తన 36 సంవత్సరాల సినీ జీవితంలో 450కి పైగా సనిమాల్లో నటించిన ప్రభాకర్‌రెడ్డి నటునిగా, నిర్మాతగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అవార్డులు అందుకున్నారు. 'పండంటి కాపురం (1972) సినిమాకు జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రాంతీయ చిత్రం అవార్డును అందుకోగా, 1980లో 'యువతరం కదిలింది' సినిమాకు ఉత్తమ ద్వితీయ చిత్రంగా, ఉత్తమ నటునిగా 1981లో 'పల్లె పిలిచింది' సినిమాకు ఉత్తమ నటునిగా 'గృహ ప్రవేశం' చిత్రానికి ద్వితీయ ఉత్తమ కథ రచయితగా నంది అవార్డులు అందుకున్నారు. ఆయన ప్రధాన పాత్ర పోషించిన "తీర్పు" (1974) తృతీయ ఉత్తమ చిత్రంగా నంది అవార్డు అందుకున్నది. పోతే మన 'ఎన్‌కౌంటర్' శంకర్‌ని సినిమా రంగానికి తెచ్చింది డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి గారే.

ప్రభాకర్‌రెడ్డి తెరముందు, తెర వెనుకనే గాకుండా పరిశ్రమలో సినీ కార్మికుల సంక్షేమం కోసం విశేషమైన సేవలందించారు. మద్రాసు నుండి పరిశ్రమ హైదరాబాదుకు తరలి వచ్చాక 1991లో 'ట్విన్‌సి క్లబ్'ను స్థాపించి పేద కళాకారులకు రూ.500 పెన్షన్ అందజేశారు. ఫిలిం వర్కర్స్ హౌసింగ్ సొసైటి చీఫ్ ప్రమోటర్‌గా సినిమా కళాకారులకు పక్కా ఇండ్లు నిర్మించి ఇచ్చారు. 'చలన చిత్ర పరిశ్రమ కార్మికుల సమాఖ్య' నెలకొల్పి ఆ సంస్థ అధ్యక్షునిగా కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎంతగానో కృషి చేశారు. పరిశ్రమలో ఎవరికి ఆపద వచ్చినా నేనున్నానని ముందుకు వచ్చే ప్రభాకర్‌రెడ్డి ఎందరో సినీ కార్మికులు అనారోగ్యంతో బాధపడినపుడు వారికి వైద్య సౌకర్యాలు కల్పించడానికి చూపిన చొరవ వారి ప్రాణాలను కాపాడింది. 'డా॥ప్రభాకర్‌రెడ్డి చలన చిత్ర కార్మిక చిత్రపురి' ఆయన పేర వెలసింది. ఆ మహా నటుడు 1997 నవంబర్ 26న తన 62వ ఏట కాలం చేశారు.

ఎన్.టి.ఆర్. వంటి మహా నటుడికి ధీటైన విలన్‌గా పేరు తెచ్చుకుని, ఇతర విలన్ పాత్రధారులకన్నా విభిన్నంగా నట జీవితాన్ని గడిపారు. నటన, రచన, దర్శక నిర్మాణం, కార్మిక సంక్షేమం వీటన్నింటి కలబోతే మన ప్రభాకర్‌రెడ్డి సినీ జీవితం. వారు తెలంగాణ కళాపుత్రుడు కావడం మనకెంతైనా గర్వకారణం.

# 113 పులిజాల గోపాలరావు

– పున్న అంజయ్య

"జా ను తెలుంగు పల్కులు నిజామున మా తెలంగాణ సీమ మాగాణ పొలాలలో విరివిగా ఫలియించిన పంటలోని విన్నాణెపు దివ్యమౌ మణుల నైపుణితో జతచేసి మీ పదధ్యానములో మునింగితి –" అంటూ తిరుపతి వేంకటేశ్వరునికి భక్తితో విన్నవించుకున్న కవి పులిజాల గోపాలరావు.

వృత్తి వ్యవసాయమైనా కవితా వ్యవసాయం చేసి తెలుగు పంటపొలాలలో అనేక కవితామృద ఫలాలనం దించిన గోపాలరావు 1911లో చండూరు మండలం దోనిపాముల గ్రామంలో శ్రీమతి పులిజాల క్రిష్ణవేణమ్మ – నర్సింహారావు దంపతులకు జన్మించారు. చండూరు సాహితీ మేఖల సంస్థ సభ్యులు. ఈ సంస్థ వ్యవస్థాపకులైన అంబటిపూడి వెంకటరత్నంశాస్త్రి ప్రభావం ఈ కవిపై ఎంతో వుంది.

1949–50లో స్థాపించబడిన ఆంధ్ర సారస్వత పరిషత్‌లో సభ్యులుగా కొంతకాలం వున్నారు. పులిజాల హనుమంతరావుతో కలిసి సాహిత్యగోష్టులలో, కవి సమ్మేళనాలలో చురుకుగా పాల్గొన్నారు.

దోనిపాముల గ్రామానికి చెందిన మరోకవి అలువాల శేషయ్యతో కలిసి జంటకవులుగా కవితా రచన, నాటక రచనలు చేశారు. వీరిరువురి గురించి గోలకొండ కవుల సంచికలో సురవరం ప్రతాపరెడ్డి ప్రస్తావించడం జరిగింది.

**గోపాలరావు రచనలు**

1. రామచంద్ర ప్రభూ శతకం, 2. ఖడ్గ తిక్కన (పద్యకావ్యం), 3. శతక మంజరి, 4. తెలుగు పొలము, 5. వియోగ గీతి, 6. ధర్మజీవన్ (నాటకం)

"ఇతరుల కష్టాలు చూచి సహించలేని మెత్తదనం, వీలయిన సహాయం ఆర్తులకు అందించే కారుణ్యం, రసాన్ని అనుభవించగలిగే రసహృదయం అందరిలో వుండవేమో కానీ ఇవన్నీ కలిగిన కవి గోపాలరాయడు" అని అంబటి పూడిచే ప్రశంసలకు పాత్రులైన కవి గోపాలరావు.

గోపాలరావు ఆర్ద్రకవి. మెత్తటి గుండె. కానీ వీరు రాసిన ఖడ్గ తిక్కన వీరకావ్యం. కత్తిని, కలాన్ని సమానంగా నడిపించిన వంశానికి చెందిన ఖడ్గ తిక్కన శౌర్యం ఎందరో కవులను ఉత్తేజితుల్ని చేసింది. ఆంధ్రప్రతికలో ప్రచురితమైన తిక్కన కథను చదివి గోపాలరావు దాన్ని పద్యకావ్యంగా మలిచారు. ఇందులో ఆయన కవితాధార అనర్గళమై, తిక్కన చేతి ఖడ్గధార వలె అలరారిందనుటలో అతిశయోక్తి లేదు.

"భాగవతము నాకు పఠనీయగ్రంధమ్ము
భారతమ్ము నాకు ప్రాణరక్ష" అని కవి తన ప్రస్తావనలో తెలుపుకోవడం అభినందనీయం.

గోపాలరావు రచించిన 'శతకమంజరి' ఒక భక్తిరస విభావరి. ఇది వెంకటేశ్వర శతకం, భద్రాద్రి రామశతకం మరియు రామయతండ్రీ శతకాల త్రయం. ఈ శతకంలో

కవి కొండపై వెలసిన వెంకటపతి స్తుతి ఏ యెండకాగొడుగు పట్టినట్టు, లోకున మనఃస్థితిని చాలా చక్కగా వర్ణించారు.

ఇద్దరు లేక ముగ్గురంటూ సంతానపు తోక పెంచొద్దని కందంలో అందంగా ఎలా చెప్పారో చూడండి.

రెండే కన్నులు కరములు
రెండే కర్ణములు కాళ్ళు రెండే రెండే
రెండైన సంతు ఇక చా
లండీ యని చాటుమయ్య రామయ్య తండ్రీ

ఈ కవి మూడోరచన "తెలుగు పొలము". ఇది 1981లో అచ్చయ్యింది. ఇందులో 14 శీర్షికా ఖండిక లున్నాయి. ఇందులో ఎక్కువ భాగం ఆనాటి పల్లె బతుకును, పోలీస్ యాక్షన్‌కన్నా ముందున్న స్థితిగతులను ప్రతిబింబించారు. "సాగు ముచ్చట్లు" శీర్షికలోని అన్ని పద్యాలు వేమన్న పోకడలను గుర్తుకు తెస్తాయి. ఉదాహరణకు ఈ క్రింది పద్యాన్ని పరిశీలించండి.

కొద్ది మూల్యమిచ్చి కొనరాదు గొడ్డును
బట్టకధిక ధరను పెట్టరాదు
కఱ్ఱు గుచ్చునేల కరువేల యుండురా!
తెలిసి నడుచుకొనర తెలుగు రైత
ఇలాంటి పద్యాలింకెన్నెన్నో....

1986లో "వియోగ గీతి" అనే ఖండ కావ్యాన్ని అచ్చువేయించారు. కవి తన ప్రణయనీ వియోగ వేదనా తరంగాలను లేఖినీ ముఖ పరిస్రుతముగా 'వియోగ గీతి'లో నింపి అవ్యక్తానుభూతి పొందారు. ఇందులో ప్రణయాంకము, దివ్యస్మృతులు, బాల్యస్మృతులు మొదలగు శీర్షికలున్నాయి.

గోపాలరావు చివరి రచన "ధర్మ జీవన్" నాటకం దోనిపాముల గ్రామానికి చెందిన కవి మిత్రుడు అలువాల శేషయ్య కూడా "శివధనుర్భంగ"మనే నాటకాన్ని రచించారు. పద్యవిద్యలో ప్రావీణ్యత సంపాదించిన గోపాలరావు పద్యనాటక రచనలో కూడా తన ప్రత్యేకతను చాటుకున్నారు. ఈ నాటకం గోపాలరావు ధర్మానురక్తినీ, పరోపకార చింతననూ ఎత్తి చూపుతుంది.

సాహితీమేఖలతో తనకున్న అనుబంధాన్ని
చదువుకొనంగ నాకు తమ సన్నిధిలో
నవకాశముండియున్
జదువగ నోచనైతినని "భక్త్యంజలి"లో చెప్పుకునే నిజాయితీ వుంది.

"మాదు తెలంగాణ పొలాల కలాల దున్ని
బంగారము పంటలు పండిస్తామనే" ఆత్మ విశ్వాసం వుంది.

దేశాన్ని బాగు చేయడం మాని, దేశాన్ని దోచుకునే స్వార్థపరులు, నాయకుల ఆటలను ఎండగడుతూ రాసిన పద్యం.

తెలుగునేలపైన తెగలు రెండయిపోయి
తెగినదాక లాగదీయనెంౘు
తెలుగుతల్లికంటె తేమలద్దునెవారు
దేశభక్తి కిదియ దిటవురామ" అంటూ భద్రాద్రి రామునితో తన సంశయాన్ని వెల్లడించారు.

తెలంగాణ రాకముందే ఈ కవి ఇష్టదైవంతో మొరపెట్టుకున్న తీరు అద్భుతం.

"మాదు తెలుగు సంస్కృతి సమాధులు వందలు వేయి హైదరాబాదున వింతలై కనులపండువుగా తిలకింపనైను ఆచ్ఛాదను నిల్పుమా" అంటూ తెలంగాణాలో పోలీసు చర్య జరిగినప్పటి నుండి అప్పుడప్పుడు తటస్థ పడిన పరిస్థితులను భక్తితో విన్నవించుకున్న తీరు అమోఘం.

పలుకుతేనెలో మధురభావాలు, భాష సరళమైన కవిత్వం భావోపేతమై ప్రతి పద్యంలో తెలుగుదనం ఉట్టిపడేలా, ప్రతిపాదంలో తెలుగుసీమ ప్రతిబింబించేలా తెలుగు భాష ఔన్నత్యానికి ఎంతో కృషి చేసిన గోపాలరావు చిరస్మరణీయులు. ఈ కవి 1986లో అస్తమించారు.

114

# పులిజాల వెంకట రంగారావు

**– వేణు సంకోజు**

స్వాతంత్ర్యం త్వరగా సిద్ధించి తీరుతుందని విశ్వసించి, ఆ దిశలో ఎంతో కృషి చేసిన మహనీయులు శ్రీ పులిజాల వెంకటరంగారావుగారు. వీరొక మంచి రచయిత, బహుభాషా పాండిత్యం గల మేధావి. 1929లో స్థాపింపబడిన ఆంధ్రమహాసభ స్థాపన కారులలో ఒకరైన శ్రీ పులిజాల వెంకటరంగారావుగారు చరితార్థులు, చిరస్మరణీయులు.

నిజాంకు వ్యతిరేకంగా సాగిన స్వాతంత్ర్య ఉద్యమానికి ఊపిరిపోసి, వేలాది మంది కార్యకర్తలను స్వాతంత్ర్య సమర యోధులుగా రూపొందింపజేసినవి ఆంధ్రమహాసభలే. 1934లో ఖమ్మంలో జరిగిన మూడవ ఆంధ్రమహాసభకు అధ్యక్షత వహించి యున్నారు పులిజాలవారు. ఎన్నో సాహసాలతో కూడిన రంగారావుగారి జీవితం సమాజానికి, ముఖ్యంగా యువతరాలకు ఆదర్శప్రాయం.

1901వ సం॥రం ఫిబ్రవరి నెలలో 01వ తేదీన పులిజాల రంగారావుగారి జననం. వీరి విద్యాభ్యాసం 1912లో (స్పెషల్) హన్మకొండలోనూ, 1912 నుండి 1916 వరకు చాదర్‌ఘాట్ హైస్కూల్, హైదరాబాదులోను కొనసాగింది. 1916 నుండి 1919 వరకు మరల హన్మకొండలో జరిగింది. ఆ తరువాత 1920–21వ సంవత్సరాల్లో హైదరాబాద్‌లో న్యాయవాద పట్టాను పుచ్చుకున్నారు.

ఆనాటి ఆచారం ప్రకారం పులిజాలగారి వివాహం 1914లో అనగా 14వ యేటనే, రాంబాయమ్మతో జరిగింది. ఆమె (రాంబాయమ్మగారు) ఒక పుత్రునికి జన్మనిచ్చి, కన్ను మూసినారు. ఆమె కుమారుడు కూడా 28 సంవత్సరాలకే అన్ని విధాల యోగ్యుడనిపించు కొని, యింకా బాగా అభివృద్ధిలోకి వస్తాడనుకుంటున్న సమయంలో కాలధర్మం చెందినాడు.

చేతికందిన కుమారుని మరణం రంగారావుగారికి తీరని వ్యథను మిగిల్చింది. పుత్రశోకాన్ని ఆయన చిరకాలం తన గుండెల్లోనే దాచుకున్నారు. తరువాత 1924లో రంగారావుగారి రెండవ వివాహం కమలాబాయితో జరిగింది. ఆమె దోమలపల్లి వారి ఆడపడుచు. దోమలపల్లి వారిది పెద్ద ఆస్తి, సంపన్నమైన కుటుంబం.

కమలాబాయిగారి ద్వారా రంగారావుగారికి యిద్దరు కుమారులు, యిద్దరు కుమార్తెలు కలిగినారు. పెద్ద కుమారుడు – పులిజాల రామ్మోహన్‌రావు, నల్లగొండలోనే నివాసముంటూ, తండ్రిగారి నుండి వకాలత్ వృత్తిని స్వీకరించి, సమర్థవంతంగా వృత్తి ధర్మాన్ని నిర్వహించటంతో పాటు, “రెడ్‌క్రాస్” నిర్వహణ బాధ్యతను స్వీకరించి, సమర్థవంతంగా నిర్వహిస్తూ వచ్చినారు. కొండుపల్లి వాసుదేవరావుగారి కుమార్తె డా॥ పద్మ (శిశువైద్య నిపుణురాలు)ను వివాహమాడియున్నారు. ఈ మధ్యనే అనారోగ్యం వల్ల – రామ్మోహనరావుగారు తమ తనువును చాలించి యున్నారు. రెండవ కుమారుడు శ్యామోహన్‌రావుగారు పట్టభద్రులు. మెడికల్ రిప్రజెంటేటివ్‌గా హైదరాబాదులో స్థిరపడి యున్నారు. చేతినిండా, విసుగులేకుండా పని

చేయటానికి తమను తాము రూపొందించుకున్నారు.

విద్యార్థి దశ నుండీ పుస్తకాల మీద శ్రద్ధ, విస్తృత అధ్యయనపు సామర్థ్యం మెండుగా వుంటూ వచ్చినవి పులిజాల రంగారావుగారికి. సాహిత్యంతోపాటుగా సంగీతంలో కూడా ప్రవేశం కలిగి, అతి త్వరలోనే వారు శ్రావ్యంగా రాగాలాపనలు చేస్తూ రాగలిగినారు. శాస్త్రీయంగా పాడుకునేందుకు మిక్కిలిగా యిష్టపడేవారు. ముఖ్యంగా, పద్యాలను రాగ–భావయుక్తంగా పాడుతూ, యువతరానికి ప్రేరణ కలిగించాలనెంచుతూ వుండేవారు. నాటకాలను ఎంతో యిష్టపడటమే కాకుండా, కొన్ని–కొన్ని పాత్రలను కూడా ధరిస్తూ వుండేవారు. స్త్రీ పాత్రలను కూడా పోషిస్తూ, ప్రేక్షకులను రంజింపచేస్తూ వచ్చేవారన్నది సమకాలికుల అభిప్రాయం.

సాహిత్యం విషయంలో కేవలం అభిమానంతో చర్చించడానికే పరిమితం కాకుండా, ఉత్తమ రచనలను చేస్తూ వచ్చినారు రంగారావుగారు. వారి కాలానికి చెందిన అనేకానేక అంశాలమీద, వాంఛితమూ – ఉదాత్తమూ అయిన భావాలకు చోటిస్తూ, ఆనాటి దిన – వార – మాస పత్రికల్లో వ్యాసాలను ప్రకటిస్తూ వచ్చేవారు. తమ కాలానికి అవసరమూ, అనివార్యమూ అయిన రచనలతో పాటుగా, పద్యరచనకూడా సముచితమైన స్థానాన్ని కల్పించుకుంటూ వచ్చేవారు రంగారావుగారు.

లక్ష్యాన్ని సాధించే విషయంలో ఎన్నెన్నో సాహసాలకు, అకుంఠిత దీక్షకు తార్కాణమౌతూ, యువతకు ఆదర్శ ప్రాయంగా నిలిచేవారు. 1929లో స్థాపింపబడిన 'ఆంధ్ర మహాసభ'ల స్థాపనకూ, నిర్వహణకూ శ్రీరంగారావుగారు కనబరచిన శ్రద్ధ, నిబద్ధతలన్నవి నిస్సందేహంగా, అనితర సాధ్యాలే అవుతాయి.

ప్రజాక్షేమమే ప్రతిఫలాపేక్ష అనుకున్న రంగారావుగారు ప్రతి ఒడిదుడుకు నుండి బయటపడటానికి ఒక ప్రశాంత పథం వుండి తీరుతుందని నమ్మినట్టి శాంతి కాముకులు. అదే సమయంలో, రంగారావుగారిది అతి కఠినమైన నిజాయితీ కూడా. అందువల్ల వారి సరసన నిలబడి పనిచేయడానికి జంకేవారు చాలామంది. మీటింగులు పెట్టి, పది పర్యటనలు చేసి, డబ్బును వృథా చేసే బదులు, ఒక గ్రంథాలయాన్ని స్థాపించడమో, ఒక సహకార సంఘాన్ని నెలకొల్పడమో చేయబూనితే అది ఉత్తమ సేవకాగలదని భావించేవారు. ఇందువల్లనే పేరాశలు గలవారి మధ్య ఆయన యిమడలేకపోయారు. పెద్దపనిలోను, చిన్నపనిలోను వారిది ఒకేవిధమైన శ్రద్ధ. వారికి అప్పగించిన ఏ బాధ్యతలోను, యింకొకరి సహాయాన్ని వారు కోరలేదు. అందువల్లనే 'అసాధారణ కార్యసాధనాపరునిగా' పెద్దల ప్రశంసలను పొందగలిగినారు. పిన్నవయస్సులోనే అందరి దృష్టిని ఆకర్షించగలిగినారు.

ఇరవయ్యవ శతాబ్దంలో రంగారావుగారు నల్లగొండ జిల్లాకు భీష్మాచార్యుల వంటివారు. ఏ పనిని మొదలుపెట్టినా, అది పూర్తయ్యేవరకు వారు నిద్రపోలేదు. సహచరులనూ నిద్రపోనివ్వలేదు. విపరీతమైన పట్టుదలతో పనిలో నిమగ్నమౌతూ వుండిపోయేవారు.

1921లో ప్రారంభమైన ఆంధ్రోద్యమం ఎనిమిది సం॥ల పాటు అనగా 1929 వరకు మొదటిదశను పూర్తి చేసుకొని, ఆ తరువాతి 2వ దశలోకి ప్రవేశించిన పిదప – ఈ ఉద్యమం – గ్రంథాలయాల స్థాపన, వెట్టిచాకిరి విముక్తి, వర్తక సంఘాల అభివృద్ధి కొరకు కృషి; వార్తాపత్రికల ప్రచురణ, చిన్నపుస్తకాల ముద్రణ వంటి వాటితో తెలంగాణా – ఆంధ్రుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేసింది.

నల్లగొండలో జరిగిన ఆంధ్రజనసంఘం సమావేశంలో పాల్గొన్న స్ఫూర్తితో పులిజాల వెంకటరంగారావుగారు ఆంధ్ర మహాసభలకు తగిన సహాయమందించి, ఆంధ్రోద్యమానికి పూర్తిగా అంకితులైనారు.

దాదాపు ఆరు దశాబ్దాల పాటు వివిధరంగాలలో ప్రజాభ్యుదయానికీ గణనీయమైన కృషి చేసిన పులిజాల రంగారావుగారు నిరాడంబర, నిస్వార్థ, ప్రజాసేవాతత్పరులు, పూర్ణ పురుషులు, ప్రజానాయకులు. నిద్రాణమైవున్న తెలంగాణ ప్రజలలో జాగృతి కలిగించడానికి అవిరళ కృషిచేసిన వైతాళికులు, కృషీవలురు. కనుకనే వారిని గురించి 'నూరుశరత్తుల పులిజాల రంగారావు" గ్రంథ రచయిత శ్రీ జి. వెంకటరామారావుగారు – "కవితారసపు జల్లు / ఖడ్గాల గలగల్లు / పులిజాలకే చెల్లు" నని శ్లాఘించి యున్నారు.

# 115 ఆర్. విద్యాసాగర్ రావు

– డా॥ జె. విజయకుమార్‌జీ

సాగునీటిపై సాధికారికంగా మాట్లాడమేకాదు. నదీ జలాల్లో తెలంగాణకు న్యాయంగా దక్కవలసిన వాటాపై విద్యాసాగర్‌రావు చేసిన కృషి తెలంగాణ ప్రజలకు మార్గదర్శకత్వంగా నిలుస్తుంది. ఆయన ఉద్యమ కాలంలో నీటి నిజాలను నిగ్గుతేల్చి తెలంగాణ మట్టి రుణాన్ని తీర్చుకున్న ముద్దుబిడ్డ. ఉద్యమంలో కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అడుగులో అడుగై నడిచిన విద్యాసాగర్‌రావు బీడు భూములకు నీటిని ఎలా తరలించారో మేధో యజ్ఞం చేశారు. అందుకే ఆయన 'సాగునీటి నిపుణుడి'గా యావత్తు తెలంగాణ ప్రజలకు దీపపు స్థంభమై కనిపిస్తారు. కానీ, నటుడిగా, నాటక రచయితగా, ప్రయోక్తగా ఈ తరానికి దాదాపు తెలియదు. విద్యాసాగర్‌రావు జీవితంలో జలవిజ్ఞానం, నాటక విజ్ఞానం ఒక జమిలిగా కనిపిస్తాయి. ఆయన చేసిన వృత్తి జలశాస్త్రవేత్తగా నిలబెడితే, ప్రవృత్తి నటుడిగా, రచయితగా నాటకరంగంలో సుస్థిరం చేసింది.

ఆర్. విద్యాసాగర్ రావు నల్లగొండ జాజిరెడ్డిగూడెంలో 1939 నవంబర్ 14న ఆర్. రాఘవరావు, లక్ష్మయ్య దంపతులకు జన్మించారు. తండ్రి ఉపాధ్యాయుడు కావడంతో ఇంట్లో వారంతా ఉన్నత చదువుల్లో రాణించారు. ఆయన విద్యాభ్యాసం 10వ తరగతి వరకు సూర్యాపేటలో సాగింది. విద్యాసాగర్‌రావు బాల్యం నుండి చదువుతో పాటు ఆటలు, సాహిత్యం, నాటకాలపట్ల ఆకర్షితుడయ్యాడు. ఎక్కువ సమయం లైబ్రరీలో గడిపేవాడు. గిరీశం కలం పేరుతో కవిత్వాలు రాయడం, సినిమా పత్రికల్లో సినిమా రివ్యూలు పంపడంతో ప్రారంభమైన రచనా వ్యాసాంగం తర్వాత కాలంలో ఆయనను నాటక రచయితగా, కాలమిస్టుగా, వ్యాస కర్తగా ఆవిష్కరించింది. ఉన్నత చదువులకు హైదరాబాద్ నిజాం కళాశాలలో చేరిన విద్యాసాగర్‌రావు ఇంటర్ కాలేజి ఉత్సవాల్లో నాటకాలను ప్రదర్శించడం హాబీగా మార్చు కున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఇంజ నీరింగ్‌లో చేరినప్పటికి ఆయన ధ్యాసంతా నాటకంపైనే ఉండేది. ప్రతిరోజు సాయంత్రం నాటకం మిత్రులతో గడపడం అలవాటయింది. ఇంజనీరింగ్ చదువుకుంటున్న సమయం లోనే నాట్య విద్యాలయంలో నటశిక్షణలో డిప్లొమ కోర్సును పూర్తి చేసారు. అబ్బూరి రామకృష్ణారావు, మంత్రి శ్రీనివాసరావు, ఎ.ఆర్. కృష్ణలు అధ్యాపకులుగా ఉండేవారు. మంత్రి శ్రీనివాసరావును నాటక రంగంలో తనకు మొదటి గురువుగా విద్యాసాగర్‌రావు పేర్కొంటారు.

స్టాన్‌స్లావిస్కీ నట శిక్షణతోనే తాను నటుడిగా రూపొందానని అంటారు. ఆయన ఆనాటి తరగతి గది జ్ఞాపకాలను గుర్తుచేస్తూ నట శిక్షణలో భాగంగా మంత్రి శ్రీనివాసరావు తనను ఏదైనా పాత్రను నటించి చూపమని అడిగితే దానికి ఆయన "సార్! ముందు మీరు చేసి చూపించండి. నేను చేస్తానని" సమాధానం చెప్పాడట. దానికి మంత్రి "నేను చెబితే నీవు చేయడంకాదు, నీకు నీవుగా

ప్రయత్నించాలి అని యు ఫీల్ ఇట్ అండ్ యాక్ట్ ఇట్ – నటుడు పాత్రలో జీవించడంకాదు, పాత్రలో నటించాలి" అని అన్నారట. దీనిని ప్రేరణగా తీసుకొని తాను నటుడుగా మారానని అంటాడు విద్యాసాగర్‌రావు గారు.

నాట్య విద్యాలయంలో సినీ నటులు త్యాగరాజు, ప్రఖ్యాత రంగస్థల నటులు భానుప్రకాష్, లక్ష్మీ కనకాల, రవీందర్‌రెడ్డి వంటి వారు ఆయనకు సహ విద్యార్థులు. అక్కడ మృచ్ఛకటికం, కన్యాశుల్కంవంటి నాటకాలు ప్రయోగాత్మకంగా ప్రదర్శించబడ్డాయి. నాట్య విద్యాలయం విద్యార్థులు ప్రదర్శించిన అనేక నాటకాల్లో నటుడిగా పాల్గొన్నారు. వాటిలో 'తప్పెవరిది', 'కీర్తిశేషులు' వంటి నాటకాలు నటుడిగా ఆయనకు గుర్తింపు తెచ్చిపెట్టాయి.

విద్యాసాగర్‌రావులోని సాహిత్యాభిరుచి తెలుగు భాషావేత్త చేకూరి రామారావు అదేవిధంగా అభ్యుదయ రచయిత వరవరరావులకు దగ్గరయ్యేలా చేసింది. కొంతకాలం కవిత్వ రచనలు సాగించిన ఆయన నాటకాలు ప్రదర్శించడంలోనే సంతోషాన్ని వెతుకున్నాడు. నాటకాలతో పాటు ఆల్ ఇండియా రేడియోలో యాంకర్‌గాను, రేడియో నాటకాలలోను పాల్గొనేవారు. అక్కడే మాజీ గవర్నర్ వి.యస్. రమాదేవితో పరిచయం ఏర్పడింది. ఆమెతో కలిసి నాటకాలను ప్రదర్శించడంతోపాటు రేడియో కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా పనిచేసారు.

ఉస్మానియాలో ఇంజనీరింగ్ పూర్తయ్యాక కోఠి ఉమెన్స్ కళాశాలలో మెయింటెనెన్స్ ఇంజనీర్‌గా, రాష్ట్ర నీటిపారుదల శాఖలో ఇంజనీర్‌గా పని చేశారు. 1960 నుండి ప్రారంభమైన విద్యాసాగర్ రావు ఉద్యోగ ప్రస్థానం కేంద్ర జలవనరుల సంఘం చీఫ్ ఇంజనీర్ స్థాయికి ఎదిగేలా చేసింది. ఒకవైపు ఉద్యోగం మరోవైపు నాటకం ఆయన జీవితంలో భాగంగా మారాయి. దేశ విదేశాల్లో పర్యటనలు, ఉద్యోగం కొనసాగుతున్నప్పటికి ఆయన నాటకరంగాన్ని విస్మరించలేదు. వృత్తిలో ఎంత ఒత్తిడి ఉన్నప్పటికి ప్రవృత్తిగా నాటకంతో అనుబంధాన్ని కొనసాగించాడు. విద్యాసాగర్‌రావు జీవితంలో జల విజ్ఞానం, నాటక విజ్ఞానం ఒక జమిలీ కలయిగా కనిపిస్తాయి. ఇంజనీర్‌గా పనిచేస్తున్న విద్యాసాగర్ రావుకు డబ్బులు ఆర్జించాలనే ధ్యాస ఏనాడు ఉండేదికాదు. ఉద్యోగాన్ని తన కుటుంబానికి ఆసరాగా చేసుకున్నాడేకాని తన మనసుకు నచ్చిన నాటకం, సాహిత్యాన్ని వదల్లేదు. ఆయన తెలంగాణ ఉద్యమంలో అడుగుపెట్టే వరకు నాటకం ఆయనతోనే కొనసాగింది. "నాటకంలో వేషం లేకున్నా పర్వాలేదు. కర్టెన్ లాగినా చాలనుకునే విద్యాసాగర్ రావు నాటకాన్ని అమితంగా ప్రేమించాడు, అరాధించాడు. తెలుగు నాటక రంగంలో 'వీలునామా', 'తప్పెవరిది'. 'కీర్తిశేషులు' వంటి నాటకాలు ఆయనకు నటుడిగా గుర్తింపు తెచ్చిపెట్టాయి. ఆయన పరిషత్తు నాటకాల్లో మద్దూరి విజయలక్ష్మి, గరిమెళ్ళ రామ్మూర్తి, సోమేశ్వరరావు వంటి వారితో కలిసి నాటకాలు ప్రదర్శించారు.

1962లో విద్యాసాగర్‌రావుకు యు.పి.యస్.సి. ఇంటర్వ్యూ ద్వారా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం వరించింది. ఈ కొత్త ఉద్యోగంలో చేరాలా వద్దా అని ఆలోచిస్తున్న సమయంలో ఢిల్లీ నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా వంటి నాటక సంస్థలు ఆయనను ఢిల్లీ వెళ్ళేందుకు ప్రేరేపించాయి. అక్కడ నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ప్రదర్శించే నాటకాలను తప్పకుండా చూస్తూ ఆయన తనలోని నటున్ని మరింత పదును పెట్టుకున్నాడు. ఢిల్లీ తెలుగు అసోసియేషన్ వంటి కళాసంస్థలతో జతకట్టి తెలుగు నాటకాలను, హిందీ నాటకాలను ప్రదర్శించేవారు. 'మట్టె బంగారం', 'పంజరంలో పక్షులు', 'ఇదేమిటి', 'ఈ ఇల్లు అమ్మబడును', 'వానవెలసింది' వంటి ఎన్నో నాటకాలు ప్రదర్శించి గుర్తింపు పొందారు. సుదీర్ఘకాలం ఢిల్లీ, అహ్మదాబాద్, రూర్కెలాలో పని చేయడంవల్ల ప్రతిచోట నాటక మిత్రులను ప్రోది చేసింది. తొలి రోజుల్లో 'గిరీశం' పేరుతో కవిత్వం రాసిన ఆయన కలం నాటక రచనలవైపు పరుగులు తీసింది. ఎన్నో సృజనాత్మక నాటకాలు ఆయనచే ఆవిష్కరించబడ్డాయి.

విద్యాసాగర్‌రావు నటుడిగానే కాకుండా నాటక రచయితగా, దర్శకుడుగా నాటక రంగంలో ఆయన పాదముద్రలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. 1960 నుండి 75 వరకు ఆయన నాటక రచనా ప్రస్థానంలో 2 నాటకాలు, 11 నాటికలు రచించారు. ఆనాటి సంఘటనలు సమాజంలోని నెలకొన్న అంశాలు వీరి నాటక రచనకు కథావస్తువులయ్యాయి.

ఆయన 'క్షంతవ్యులు', 'గుడ్‌బై' నాటకాలు రాశారు. అదేవిధంగా 'దేవుడయ్య', 'గంధర్వులే తీరుస్తారు', 'కొత్తదారి', 'ఆప్‌కీ అదాలత్', 'నారు మనది-నీరు వాడిదా', 'ప్రధానం', 'వార్షికోత్సవం', 'ఓ ఆఫీసు కథ', 'నిన్న - నేడు - రేపు', 'ఇంటర్వ్యూ'లను నాటికలుగా రచించారు. 1972లో ఫ్యామిలీ ప్లానింగ్ ఆఫ్ ఇండియా, ఆల్ ఇండియా రేడియో, దూరదర్శన్‌లు సంయుక్తంగా కుటుంబ నియంత్రణపై జాతీయ నాటక పోటీలను ఆహ్వానించాయి. విద్యాసాగర్ రావు తెలంగాణ మాండలికంల 'నారు మనది - నీరువాడిదా' నాటికను వ్రాసి పోటీకి పంపారు. గంపెడు సంతానంతో సంసారాన్ని పోషించలేక చేతులెత్తేసి, తప్పుకాదని సమర్థించుకునేవారిని, భవిష్యత్తు తరాన్ని ప్రశ్నార్థంగా మార్చిన పెద్ద తరాన్ని సున్నితంగా మేల్కొలిపింది. ఈ నాటిక జాతీయ పోటీల్లో మొదటి బహుమతి అందుకుంటే, కొర్రపాటి గంగాధరరావు నాటిక రెండవ బహుమతి అందుకుంది. ఆ తర్వాత 'నారు మనది - నీరు వాడిదా' నాటిక ఆకాశవాణి, దూరదర్శన్‌లో ప్రసారమైంది. రంగస్థలంపై అనేకసార్లు ప్రదర్శితమైంది.

'గుడ్‌బై' నాటకంలో స్వరూపం పురుషుడు. స్వభావం స్త్రీ అయిన పాత్రను సృష్టించి కథను నడుపుతాడు. అమాయకత్వాలను, అవసరాలను ఆసరాగా చేసుకుని పరాన్నజీవులుగా బ్రతికే మనుషుల నిజస్వరూపాలను రచయిత ఆవిష్కరిస్తాడు. హోమోసెక్సువల్ ఇతివృత్తంపై తెలుగులో వచ్చిన మొదటి నాటకంగా పేర్కొనవచ్చు. వికటించిన వ్యక్తిత్వాలకు పరివర్తనవైపు మళ్ళించేందుకు 'క్షంతవ్యులు' నాటకం రాశారు. అనుమానాల మధ్య జీవన ప్రయాణం అసాధ్యమంటూనే అనుమానాలకు సమాధానం ఇవ్వకుండానే రచయిత నాటకాన్ని ముగిస్తాడు. 'దేవుడయ్య' నాటికలో దేవుడుగా కీర్తించబడే వ్యక్తి అసలు రూపాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తాడు. బైటికి కనబడే వ్యక్తిత్వం, లోపల అసలు తత్వం బొమ్మబొరుసులుగా ఉంటాయి. గుండెలు పిండే ఉత్కంఠతో కథ సాగుతుంది. 'గంధర్వులే తీరుస్తారు' నాటకలో పెద్దతరం - చిన్నతరం మధ్య ఉండే అంతరాన్ని ఆవిష్కరిస్తాడు. కొడుకు పెంపకపై ఖర్చు పెట్టిన డబ్బును పెళ్ళి చేసి కట్నంగా రాబట్టుకోవాలనుకుంటాడు తండ్రి. కట్నం లేకుండానే పెళ్ళి చేసుకోవాలనుకునే అమ్మాయి. వీరిద్దరి మధ్య నలిగిన ఓ పెళ్ళీడుకొచ్చిన అబ్బాయి కథను ఆసక్తికరంగా రాశారు. గత శతాబ్దపు పూర్వార్థంలో భారతదేశంలో నిరుద్యోగ అభ్యర్థులు ఎత్తుకు పై ఎత్తులు వేసి ఉద్యోగాన్ని పొందేందుకు పడే పాట్లు రచయిత ఆసక్తికరంగా రచించారు. ప్రముఖ హిందీ నాటక రచయిత శంకర్ శేష్ 'కిస్సాకుర్సికా' స్కిట్‌ను స్ఫూర్తిగా తీసుకుని 'ఓ ఆఫీసు కథ' నాటికగా మలచారు. ఫార్స్ నాటక ప్రక్రియలో సాగుతుంది. గవర్నమెంటు ఆఫీసులో బాధ్యతలేని ఉద్యోగులు, కాలానికి శిలువ వేసి స్వంత లాభం చూసుకునే ప్రబుద్ధుల కథ ఇది. హాస్యానికి పెద్ద పీట వేసి వ్యంగ్యాత్మకంగా సాగుతుంది. చెకోవ్ వ్రాసిన 'ప్రపోజల్' నాటికను 'ప్రధానం'గా 'జూబ్లీ' నాటికను 'వార్షికోత్సవం'గా అనువాదం చేసారు. తెలుగు నేటివిటితో ప్రదర్శనకు అనువుగా రచయిత నాటకీకరణ చేసారు.

విద్యాసాగర్‌రావు రచనలో 'కొత్తదారి' స్కిట్ ప్రక్రియకు సంబంధించింది. యం.వి.యస్. హరనాథరావు 'యక్షగానం' నాటిక తరహాలో కళాకారుడి ఆవేదనను ఆవిష్కరిస్తుంది. పగటివేషగాడైన 'లత్కోర్‌సాబ్' కొడుకులేని తనకు తన కళను ఎలా బ్రతికించుకోవాలో మదనపడుతుంటాడు. కూతురు ముందుకొచ్చి 'లత్కోర్ సాబ్'నై జీవిస్తానంటూ తండ్రి కొత్త ఆశలను చిగురింపచేస్తుంది. ప్రధాని మోడీ చేపట్టిన 'బేటి బచావో - బేటి పఢావో' స్ఫూర్తికి ఈ నాటిక ప్రతిరూపం. ఓ ప్రముఖ టీవీలో రజత్‌శర్మ నిర్వహించే 'ఆప్‌కీ అదాలత్' షోను స్ఫూర్తిగా తీసుకొని 'ఆప్‌కీ అదాలత్' పేరుతోనే నాటికను రాసారు. సమాజంలో ఉన్న భిన్న రూపాలను న్యాయస్థానంలో ప్రవేశపెట్టి సమాజంపట్ల బాధ్యతలేని వారిని ఎండగడుతూ పిడివాద మనస్తత్వాలపై కొరడా ఝుళిపిస్తాడు రచయిత. విద్యాసాగర్ రావు గారి నాటక రచనలో ఇది చివరిది.

ఎమర్జెన్సీ కాలంలో ఆనాటి రాజకీయాలను నిరసిస్తూ 'నిన్న, నేడు - రేపు' నాటికను రచించారు. గరిమెళ్ళ రాంమూర్తితో కలిసి ఈ నాటికను ప్రదర్శించాలనుకున్నారు. నిర్బంధాలతో నెలకొన్న నాటి పరిస్థితులు అనుకూలించకపోవడంతో ప్రదర్శించలేకపోయారట. అయితే ఈ నాటిక ప్రతి దొరకలేదు. విద్యాసాగర్ రావు రాసిన నాటికలు, నాటకాలను ఆయన స్వయంగా నటుడిగా, దర్శకునిగా రంగస్థలంపై ప్రదర్శించారు. విద్యాసాగర్‌రావు

రచనల్లోని ప్రతి నాటిక ఒక ప్రత్యేకతను సంతరించుకున్నదే.

విద్యాసాగర్ రావు ఉద్యోగ విరమణ తర్వాత ఢిల్లీ విశ్వవిద్యాలయం నుండి లా డిగ్రీని పూర్తి చేసారు. హైదరాబాద్ తిరిగి వచ్చాక కొంతకాలం దూరదర్శన్‌లో ప్రశ్నోత్తరాల కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జెమినీ టీవీలో మూడు సీరియళ్ళను ప్రొడ్యూస్ చేసారు. ఈ సందర్భంలోనే దర్శకుడు అల్లాణి శ్రీధర్‌తో పరిచయం ఏర్పడింది. విద్యాసాగర్ రావులోని జల విజ్ఞానాన్ని పసిగట్టిన అల్లాణి వి. ప్రకాశ్ మరియు పత్రిక సంపాదకులు రామచంద్రమూర్తికి పరిచయం చేసారు. వీరి ప్రోద్బలంతోనే వివిధ పత్రికల్లో ''నీళ్ళు – నిజాలు'' పేరుతో వ్యాసాలు రాయడం మొదలుపెట్టారు. విద్యాసాగర్ రావు రాసిన వ్యాసాలు, ప్రసంగాలు తెలగాణ నీటిపారుదలపై మేధావులను సైతం ఆలోచింపచేసాయి. ఆయనలోని జలవిజ్ఞానమే కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు దగ్గరయ్యేలా చేసింది.

విద్యాసాగర్‌రావు గారి నాటక రచనలు ముద్రణా రూపంలోకి తీసుకువచ్చి, ప్రదర్శింపచేయాలనే ఆయన కోరిక మేరకు తెలంగాణ థియేటర్ రీసెర్చ్ సెంటర్ ప్రయత్నాలు ప్రారంభించింది. నాటక ప్రదర్శనకు సిద్ధంకమ్మని వారు మమ్మల్ని ఆదేశించారు. వారే స్వయంగా మాతో వచ్చి మామిడి హరికృష్ణగారిని కలిసి నాటక ప్రదర్శనలకు రవీంద్రభారతి వేదికపై ప్రదర్శించాలని 2017 మే 18, 19 మరియు 20 తేదీలను ఖరారు చేయించారు. ఒకవైపు నాటకాల రిహార్సల్స్ కొనసాగుతూనే ఉన్నాయి. ప్రదర్శనలకు సన్నద్ధమవుతున్నాం. కానీ దురదృష్టవశాత్తు ఆర్. విద్యాసాగర్‌రావుగారు 2017 ఏప్రిల్ 29న ఆఖరి శ్వాస విడిచి తన జీవన నాటకరంగం నుండి నిష్క్రమించారు.

ఈ స్థితిలో ఆర్. విద్యాసాగర్ రావు రచించిన నాటకాల పుస్తక ముద్రణ మరియు ప్రదర్శనను వాయిదా వేయాల్సి వస్తుందేమోనని పరిశోధకులు భావించారు. కానీ సర్వశక్తులు కూడగట్టుకొని విద్యాసాగర్ రావు గారికి ఇచ్చిన మాటను టిటిఆర్‌సి సంస్థ నిలబెట్టుకుంది. ఆయన రాసిన నాటకాలను "ఆర్. విద్యాసాగర్ రావు నాటకాలు – నాటికలు"గా పుస్తకాన్ని తీసుకురావడంతోపాటు ఆయన రచించిన నాటకాలను రవీంద్రభారతి వేదికపై 2017, మే 18, 19 & 20 తేదీలలో మూడు రోజులపాటు ఘనంగా నాటకోత్సవాలను నిర్వహించింది. ఆర్. విద్యాసాగర్ రావు జలసాగరుడేకాదు, కళాసాగరుడని తెలంగాణ సమాజానికి తెలంగాణ థియేటర్ రీసెర్చ్ సెంటర్ పరిచయం చేసింది. ఆయన నాటకాలను ప్రదర్శించి విద్యాసాగర్ రావుకు కళానివాళిని అర్పించింది.

116

# రాజా బహద్దూర్ వెంకట్రామారెడ్డి

– డా॥ టి. గౌరీశంకర్

ఆ నాటి నిజాం రాష్ట్రంలో నిజాయితీకి, సాహసానికి, విద్యుక్త ధర్మానికి మారుపేరుగా నిలిచిన మహోన్నత వ్యక్తి రాజా బహద్దూర్ వెంకట్రామారెడ్డి. ప్రభు భక్తితోపాటు ప్రజాసేవానురక్తి కలిగిన వీరు తెలంగాణా పోతుగడ్డపై పుట్టిన పులిబిడ్డగా చరిత్రకెక్కారు. క్రమశిక్షణ, కఠోర పరిశ్రమ, గట్టి పట్టుదల – వీటితో జీవితంలో రాణించిన రాజాబహద్దూర్ వారు ఎంతటి ఆజానుబాహులో అంతటి హృదయ వైశాల్యం కలిగినవారు.

నేటి మహబూబ్‌నగర్ జిల్లాలోని వనపర్తి సంస్థానంలో ఉన్న రాయణిపేట అనే గ్రామంలో వీరు 1869 ఆగష్టు 22వ తేదీన జన్మించినట్లు సురవరం ప్రతాపరెడ్డి ఒక చోట పేర్కొన్నారు. వీరి తల్లిదండ్రులు బారమ్మ, కేశవరెడ్డి. వీరి ఇంటిపేరు 'పాశం', గోత్రం 'ముదునోళ్ళ'. రెడ్డిగారు చిన్నతనంలోనే తల్లిదండ్రులను పోగొట్టుకొన్నారు. ఆయన బాల్యం తొమ్మిది సంవత్సరాల వరకు రాయణిపేటలోని అమ్మమ్మ కిష్టమ్మ వద్దనే గడిచింది. ఆనాటి విద్యావ్యవస్థలోని ఆచారం మేరకు ఖాన్గీ అంటే ప్రైవేటు బడిలో తొమ్మిదో ఏడు దాకా చదువుకొని, తొమ్మిది నుండి పన్నెండవ ఏడు నాటికి ఉర్దూలో 'పహిలీ' పూర్తి చేసి, ఫారసీలో 'కరీమా' అనే పుస్తకాన్ని చదివేశారు. బాల్యంలో ఊరిలోని భట్రాజుల వద్ద పెద్ద బాలశిక్ష, సుమతీ శతకం, నరసింహ శతకం, కూడికలు, తీసివేతలు, వడ్డీ లెక్కలు మొదలైనవి నేర్చుకున్నారు. ఆ తరువాత మేనమామగారితో కలిసి రాయచూరు వెళ్లి, అక్కడ పందొమ్మిదో ఏడు వచ్చే వరకు విద్యాభ్యాసం చేశారు. ఉర్దూభాషలో ప్రావీణ్యాన్ని సంపాదించడంతోపాటు తెలుగు, కన్నడ, మరాఠీ భాషలలో మంచి పట్టును సాధించారు. చిన్నతనంలోనే భారత, భాగవతాలు చదివారు. తెలుగులో జాబులు ఎంతో చక్కగా, కుదురుగా రాసేవారు.

రెడ్డిగారి మేనమామ అకస్మికంగా చనిపోవడంతో వారి జీవితం అనుకోని మలుపు తిరిగింది. నజర్ మహమ్మద్‌ఖాన్ అనే సీనియర్ పోలీసు ఉద్యోగి వెంకట్రామారెడ్డిని చేరదీసి జీవితంలో ముందుకు నడిపించాడు. దాని ఫలితంగా పద్దెనిమిదేళ్ళ ప్రాయంలోనే అంటే 1886లో రెడ్డిగారు ముదిగల్లు ఠాణాకు నాల్గవ దర్జా పోలీసు అమీన్ అంటే సబ్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగంలో చేరారు. మేనమామ ఉద్యోగంలోకి బదిలీ అయ్యి వచ్చిన పఠాన్ మహ్మద్‌ఖాన్ పదిహేడు సంవత్సరాల రెడ్డిగారికి తమ పోలీసు శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని వాగ్దానం చేసి వెంట తీసుకొని వెళ్లాడు. అప్పట్లో రెడ్డిగారు కావలసినంత పొడుగు, తగినంత శారీరక పుష్టి లేకపోవడం, దానికి తోడు ఎత్తు బూట్లు తొడుక్కొని, దళసరి బట్టలు ధరించి వెళ్ళిన రెడ్డిగారిని చూసి అక్కడి అధికారులు "ఇంత చిన్న పిల్లవాడికి ఉద్యోగమేమిటి? ఇంకా కొంతకాలం చదువుకోనివ్వండి, అవసరమైతే నెలకు 50 రూపాయల ఉపకారవేతనం ఇద్దాం" అని అన్నారట. కానీ

ఆనాటి రెడ్డిగారి ఆర్థిక పరిస్థితిని బట్టి అతనికి ఏదో ఒక ఉద్యోగం అనివార్యమని భావించిన పఠాను అక్కడి జిల్లా పోలీస్ డైరెక్టర్‌గా ఉన్న ఆంగ్లేయుడి సహాయంతో, అధిక ప్రయత్నంతో రెడ్డిగారికి ఈ సార్జంట్ ఉద్యోగం ఇప్పించగలిగాడు. నెలకు 60 రూపాయల జీతం, గుర్రపు స్వారీ, దాని అలవెన్సు కింద నెలకు 20 రూపాయలు ఇచ్చేవారు. మొదటి ఉద్యోగ నియామకం లింగుసూనూరులో జరిగింది. అక్కడికి తహసీల్దారుగా వచ్చిన మౌల్వీ ఫాబాబ్‌గారితో రెడ్డిగారికి పరిచయం ఏర్పడింది. వారి ద్వారా ఉద్యోగ నిర్వహణలో మెళకువలను బాగా తెలుసుకొన్నాడు. ఇంకా ఉర్దూ భాషలోని కవితలను విని, చదివి, రాయడం కూడా నేర్చుకున్నాడు. ఆనాటి రాజ్యవ్యవస్థలో నాలుగు పాలనా విభాగాలుండేవి. ప్రతి విభాగానికి ఒక పోలీసు సదర్ మోహతెమీం ప్రధానాధికారిగా ఉండేవాడు. పోలీసు సిబ్బందికి యూనిఫారమ్ ఉండేది కాదు. కొందరు ధోవతులు, కొందరు పట్కాలు, కొందరు కోట్లు ధరించేవారు. చేతిలో కర్రగాని, కత్తిగాని పట్టుకొనేవారు. ఇది ఆనాటి పోలీసు వ్యవస్థలోని వస్త్రధారణ.

ఆ సమయంలోనే ముదగల్లు తహసీల్దారు 'మౌల్వీ షాఖాఖీ సాబ్' ఆదరణ లభించింది. ఆయన ద్వారా ఉద్యోగంలోని మెలకువలన్నీ గ్రహించారు. అటు తరువాత ముదగల్లు నుండి యాద్గీర్ రాణాకు బదిలీ అయ్యారు. ఆ సమయంలో అక్కడ జరగిన అరబ్బుల దోపిడీని ఎంతో చాకచక్యంతో అరికట్టగలిగారు. అప్పుడు జరిగిన హిందూ ముస్లింల మతకలహాలను రూపుమాపారు. వారి మధ్య సృహద్భావ వాతావరణాన్ని నెలకొల్పారు. యాద్గీర్ నుంచి తిరిగి లింగుసూనూర్ అంటే ఈనాటి కల్వకుర్తికి వచ్చారు. అక్కడ కూడా చెలరేగిన దోపిడీ దొంగల ఆటకట్టించారు. దానితో వీరికి మంచిపేరు రావడమే గాక, ఎక్కడ దొంగల బెడద ఉంటే అక్కడికి వీరిని పంపడం పరిపాటి అయింది.

ఆ రకంగా వీరు నిజాయితీ, సమర్థత, విధుల నిర్వహణలో చాకచక్యం వల్ల నాల్గవ దర్జా నుండి మూడవ దర్జా అమీనుగా పదోన్నతిపై నాగర్‌కర్నూల్ వెళ్ళారు. అప్పుడే బ్రిటిష్ ఇండియా సైన్యం నుండి నేరం చేసి పారిపోయి వచ్చిన డగ్లస్ అనే సోల్జర్‌ను పట్టుకోవడంలో రెడ్డిగారు కృతకృత్యులయ్యారు. దానితో వీరి పేరు ప్రతిష్ఠలు ఇనుమడించాయి. ఇందూర్ నుంచి ఎల్గందల్ జిల్లాకు వచ్చి, అక్కడ కొంతకాలం కోర్టు ఇన్‌స్పెక్టర్‌గా, ఆ తరువాత పోలీసు మొహతెమీంగా పనిచేశారు. అనంతరం జిల్లా పోలీసు అధికారిగా నియమింపబడ్డారు. ఆ సమయంలోనే అక్కడ ఒక హత్యకేసును ఎంతో నేర్పుతో ఛేదించగలిగారు. అటు నుంచి గుల్బర్గాకు బదిలీ అయ్యారు. అక్కడ ప్లేగు వ్యాధి బారిన పడిన వారిని కాపాడారు. ఆ తరువాత నిజామాబాదుకు, ఆ పిదప ఔరంగాబాదుకు వెళ్ళారు. అక్కడ తల ఎత్తిన హిందూ యువకుల ఆందోళనను అణచివేశారు. పిమ్మట అత్రాఫ్‌బల్దా అంటే ఈనాటి రంగారెడ్డి జిల్లాలో రెండేళ్ళు పనిచేసి వనపర్తి సంస్థానానికి కార్యదర్శిగా నియమింపబడ్డారు. అత్రాఫ్ బల్దా అంటే సర్ఫెఖాన్. హైదరాబాద్ పొలిమేరలలో ఉన్న గ్రామాలతో కూడిన జిల్లా. దీనిపై వచ్చే ఆదాయం నిజాం ప్రభువుకు చెందుతుంది. ఈ బల్దాకు సమర్థుడైన పోలీసు అధికారి కావాలని నిజం నవాబు ఆంగ్లేయాధికారిని సంప్రదిస్తే అతను రెడ్డిగారి కంటే సమర్థులు మరెవరూ లేరని కితాబునిచ్చాడట. అక్క పనిచేస్తున్న కాలంలో రెడ్డి బంధువు, బాల్య స్నేహితుడు వనపర్తి సంస్థానాధిపతి రెండవ రాజా రామేశ్వరరావు ప్రభుత్వాన్ని సంప్రదించి రెడ్డి గారిని తమ వనపర్తి సంస్థానానికి సెక్రటరిగా నియమించుకున్నారు. అక్కడ రెండేళ్ళ పాటు పనిచేశారు రెడ్డిగారు.

నిజాం నవాబ్ మీర్ మహబూబ్ అలీఖాన్ బహద్దూర్ పాలనా కాలంలో మొహతెమింగా ఉన్న రెడ్డిగారు ప్రాణాలకు తెగించి ఆనాటి అరబ్బు దుండగుల ఆటకట్టించారు. దీనితో నిజాం నవాబు దృష్టిని ఆకర్షించారు. ఆనాటి హైదరాబాదు రాష్ట్రంలో ఉన్న ఒక కోటి 44 లక్షల మంది ప్రజలలో డెబ్బై లక్షల మంది తెలుగువారు. వీరిలో ఎంతోమంది పండితులు, విద్యాధికులు ఉన్నప్పటికీ ఆంగ్ల విద్య పరిచయం లేని, ఆధునిక నాగరికత అబ్బని, అతి సామన్యుడైన రెడ్డిగారు నిజాం ప్రభువు మెప్పుకు పాత్రుడు కావడమంటే ఆయనలోని గొప్పతన మేమిటో మనకు స్పష్టమవుతుంది. ఆయన నిజాయితీ, సమదృష్టి, సేవానిరతి ఇందుకు కారణాలు. హైదరాబాదు నగర కొత్వాలుగా ఉన్న ఆనాటి ఇమాద్జంగ్ బహద్దూర్ ప్రధాన సహాయకునిగా రెడ్డిగారు నియుక్తులయ్యారు. ఇమాద్జంగ్ మరణానంతరం నిజాం ప్రభువు వెంకట్రామారెడ్డినే కొత్వాలుగా నియమించారు. నిజాం పాలనలో హైదరాబాదు నగర కొత్వాలుగా నియమింపబడిన మొదటి హిందువు రెడ్డిగారే. అప్పటి నుంచి వీరు ఇటు

ప్రభువుల సేవకు, అటు ప్రజాసేవకు అంకితమయ్యారు. ఆ కాలంలోనే బ్రిటిష్ ఇండియాలోని ఖిలాఫత్ అహ్మదాబాద్ నుంచి కొందరు దుండుగులు హైదరాబాదులోకి చొరబడి అల్లర్లు సృష్టించారు. చెలరేగిన అరబ్బులు, పఠానులు, రోహిలాల ఆగడాలను అడ్డుకొని ధైర్యసాహసాలతో అహోరాత్రులు శ్రమించి నగరంలో శాంతిభద్రతలను కాపాడారు.

ఆనాడు హిందువుల పండుగలు, మహ్మదీయుల పండుగలు వచ్చినాయంటే కొట్లాటలు జరుగడం తథ్యం. ఇది ముందుగానే గ్రహించిన రెడ్డిగారు చాకచక్యంతో తగిన ఏర్పాట్లు చేసి తగాదాలు తలెత్తకుండా చేసేవారు. ఉన్నతాధికారులు తమ శాఖను తనిఖీ చేయడానికి వస్తారని ముందే తెలుసుకొని రెడ్డిగారు శాఖను చక్కదిద్ది వారికి తప్పులను, లోపాలను దొరకనివ్వకుండా వారి నుంచి 'చాలాక్ ఆద్మీ' అన్న మెప్పులను పొందేవాడు. ఒకసారి బొంబాయి నగరంలో లోకమాన్య బాలగంగాధర్ తిలక్ గారికి బ్రిటీష్ ప్రభుత్వం రాజద్రోహం నేరం కింద జైలుశిక్ష విధించింది. అప్పుడు బెంగాలులో రాష్ట్ర విభజనపై బెంగాలీలు వందేమాతరం గీతాన్ని ప్రచారం చేస్తూ అహింసా మార్గాన ఆందోళన చేపట్టారు. వీటి పర్యవసానంగా ఔరంగాబాద్‌లోని యువకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున అల్లర్లు చేసారు. వీటిని అణచివేయడానికి సమర్థుడైన హిందువు పోలీసు అధికారిని నియమించాలని భావించిన నిజాం ప్రభుత్వం రెడ్డిగారిని అక్కడికి బదిలీ చేసింది. రెడ్డిగారు అక్కడి ఆందోళనకారులను స్వయంగా కలిసి, వారి భుజం తట్టి నచ్చచెప్పి పరిస్థితులను చక్కదిద్దారు.

రెడ్డిగారి కొత్వాల్ కచేరీ ఎప్పుడూ ప్రజలతో, ప్రభుత్వాధికారులతో నిండి ఉండేది. ప్రజల రకరకాల సమస్యలను స్వయంగా, సావధానంగా విని పరిష్కరించే వారు. న్యాయస్థానాలలో కేసుల పరిష్కారాలలో జరిగే జాప్యాన్ని నివారించేవారు. సరి అయిన న్యాయం జరగని సందర్భాలలో తమ కచేరీలోనే విచారణలు జరిపి తీర్పు లిచ్చేవారు. వారి న్యాయశాస్త్ర పరిజ్ఞానానికి న్యాయమూర్తులు సైతం ముగ్ధులయి మెచ్చుకొనేవారట. గణపతి ఊరేగింపు సందర్భంలో వచ్చిన తగాదాను అప్పటికప్పుడు పరిష్కరించి ఊరేగింపును సజావుగా నడిపించారు. రైల్వే కూలీల సమ్మెను సామరస్యంగా ఎదుర్కొన్నారు. వీరు ప్రభువుల పట్ల ఎంతో విధేయంగా ఉండేవారో, ప్రజల పట్ల అంత దయాళువుగా మెలిగేవారు.

వీరు కొత్వాల్‌గా ఉన్నకాలంలో వేల్స్ యువరాజు, వైస్రాయ్ హైదరాబాదు నగరానికి వచ్చినప్పుడు కొత్వాల్ వెంకట్రామారెడ్డిగారు చేసిన ఏర్పాట్లు, వ్యవహరించిన తీరు, ప్రదర్శించిన సమయస్ఫూర్తి ఆ యువరాజును సైతం ఆకట్టుకొన్నాయి. వారి ప్రశంసలతో పాటు, వారి నుంచి వెండి సిగరెట్ కేసును బహుమతిగా కూడా అందుకొన్నారు. 1921లో నిజాం ప్రభువు తమ జన్మదినోత్సవం నాడు రెడ్డిగారికి 'రాజాబహద్దూర్' అనే బిరుదు ప్రదానం చేశారు. 1931లో బ్రిటీష్ ప్రభుత్వం జార్జి చక్రవర్తి నుంచి ఓ.బి.ఇ. అంటే ఆర్డర్ ఆఫ్ ది బ్రిటీష్ ఎంపైర్ అనే బిరుదును కూడా వీరు పొందారు.

గాంధీగారు రెడ్డిగారి హయాంలోనే నిజాం రాష్ట్రానికి వచ్చారు. అప్పుడు హోం మినిష్టర్‌గా ఉన్న సర్ ట్రెంచ్ ఆ సమయంలో జరుగుతున్న ఖాదీ ప్రదర్శనలను గాంధీజీ చూడకూడదని నిషేధాజ్ఞ విధించారు. గాంధీగారికి కోపం వచ్చి తిరిగి వెనక్కి వెళ్ళి పోవడానికి సిద్ధమయ్యారు. ఆ సమయంలో రెడ్డిగారు స్వయంగా కల్పించుకొని సంయమనంతో గాంధీగారితో మాట్లాడి శాంతపరచి పరిస్థితి చక్కదిద్ది కార్యక్రమాన్ని అనుకున్నట్టుగానే జరిపించారు. అప్పటి హరిజనులలో నెలకొని ఉన్న మురళీలు, బసవి రాండ్రనే దురాచారాన్ని రెడ్డి గారు రూపుమాపారు. అంటే ఆడపిల్లలను యావజ్జీవం వేశ్యావృత్తిలోకి దింపడం. ఈ అనాచారాన్ని తుడిచి వేయడానికి రెడ్డి గారు నడుం బిగించి విజయం సాధించారు. దీనితో పాటు ఆయన శాసన సభ్యులుగా ఉన్న కాలంలో వితంతు వివాహ చట్టం, వెట్టిచాకిరీ వ్యతిరేక చట్టాలను కూడా చేయించారు.

ఆనాటి పోలీసు శాఖను అధునాతన పరచిన మేధావి రెడ్డిగారు. దాదాపు 48 సంవత్సరాల ఉద్యోగ జీవితం అనంతరం ఆయన 1933 ఏప్రిల్‌లో పదవీ విరమణ చేశారు. ఉద్యోగ విరమణానంతరం ఆయన నిజాం సొంత ఎస్టేట్ సర్ఫెఖాన్‌కు ప్రత్యేక అధికారిగా నియమింపబడ్డారు.

ధర్మవంతరాజా శివరాజ బహద్దూర్ ఎస్టేట్ కమిటికి అధ్యక్షునిగా ఉండి, 11 సంవత్సరాలలో ఆ ఎస్టేట్ అప్పులన్నీ తీర్చడమే గాక, పాఠశాలలు నెలకొల్పి విద్యావ్యాప్తికి కృషి

చేశారు. ఈ రకంగా ధర్మవంత రాజా శివరాజ బహద్దూర్ సంస్థానాన్ని సముద్ధరించారు. బీదరైతులకు సహకరించారు. భూమి ఆదాయశాఖ, పోలీసు శాఖలను సంస్కరించి ముందుకు నడిపించారు. గ్రామ పునర్నిర్మాణ కార్యక్రమాలను నిర్వహించారు. బాల్య వివాహాలను రద్దు పరచి, వితంతు వివాహాలను ప్రోత్సహించారు. మూఢాచారాలను వ్యతిరేకించారు. అన్నిమతాల, కులాల వారిని చేరదీశారు. సురవరం వారి 'గోలకొండ పత్రిక'కు అండగా నిలిచారు. శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం, వేమనాంధ్ర భాషానిలయం, బాల సరస్వతి గ్రంథాలయం పురోభివృద్ధికి సహకరించారు. 1945లో ఓరుగల్లులో జరిగిన ఆంధ్ర సారస్వత పరిషత్తు ద్వితీయ వార్షికోత్సవాన్ని ఆయన ప్రారంభించారు. ఆంధ్రోద్యమానికి చేయూతనిచ్చాడు.

స్త్రీ విద్య కోసం వీరు చేసిన సేవ మరువరానిది. హైదరాబాదులో బాలికలకు మాతృభాషలో చదువు చెప్పే పాఠశాల లేదని గ్రహించిన, మాడపాటి హనుమంత రావుగారు నారాయణగూడలో ఏర్పాటు చేసిన బాలికల పాఠశాలకు రెడ్డిగారి దక్షతను గ్రహించి అధ్యక్షులుగా నియమించారు. రెడ్డిగారు తమ బంగళా వెనుక భాగంలోనే పాఠశాల శాశ్వత భవన నిర్మాణం కోసం భూరి విరాళాలు సేకరించి ఆదుకొన్నారు.

రెడ్డి విద్యార్థి వసతి గృహం, రెడ్డి బాలికల వసతి గృహం, ఆంధ్ర విద్యాలయం పరోపకారిని బాలికల పాఠశాల మొదలైన వాటిని తమ భవన భాగాన్ని ట్రస్టుగా మార్చి ఆ ఆదాయాన్ని వాటికి సమంగా పంచారు. బర్కత్‌పురాలోని మహిళా కళాశాల స్థాపనకు కారకు లయ్యారు. నాటి నుంచి నేటికి ఆర్‌బివి, ఆర్‌ఆర్ కాలేజీగా రాణిస్తునే ఉంది. ఇటు నారాయణగూడలోని మాడపాటి హనుమంతరావు బాలికల పాఠశాల అటు బర్కత్‌పురలోని రావుబహద్దూర్ వెంకట్రామ రెడ్డి మహిళ కళాశాల – ఈ రెండింటి మధ్య నెలకొల్పబడిన రెడ్డిగారి నిలువెత్తు విగ్రహం ఆ సంస్థలను చేయ్యెత్తి సదా దీవిస్తు ఉన్నట్లు మనకు కనిపిస్తూ ఉంటుంది.

రాజాబహద్దూర్ వెంకట్రామారెడ్డి గారు ఒక మహాసంస్థ వంటి వారు. ప్రజా సంస్థలకు ఆనాటా రాజకీయపార్టీలకు, యువజన సంస్థలకు, విద్యార్థులకు సన్నిహితులుగా ఉండే వారు. కాంగ్రెస్, కమ్యూనిస్ట్ పార్టీల మధ్యగానీ లేదా స్టేట్ కాంగ్రెస్‌లోని రెండు వర్గాల మధ్య గానీ, వివాదాలు తలెత్తినప్పుడు ఈయన మధ్యవర్తిగా వ్యవహరించి ఇరుపక్షాలతో చర్చలు జరిగి తగవులు సామరస్యంగా పరిష్కరించేవారు.

అస్పృశ్యత దురాచారాన్ని నిరసించారు. హరిజనోద్ధరణ సంఘాలకు సహాయ మందించాడు. అనాథ బాలల ఆశ్రమాలకు, కుష్టునివారణ కార్యక్రమాలకు, జంతు హింసా నివారణ సంస్థలకు ఆయన ఆర్థికంగా తోడ్పాటును అందించారు. కుష్టు రోగుల చికిత్సాలయాలను స్వయంగా నెలకొల్పారు. ఆనాడు హైదరాబాద్ రాష్ట్రంలో పర్వర్ధాలను అంటే పెంపుడు పిల్లలను ధనికులు, రాజులు, నవాబులు తమ సేవలో ఉంచుకొని వారిని శాశ్వతంగా బానిసలుగా చేసుకొనేవారు. ఈ దురాచారానికి స్వస్తి పలకడానికి రెడ్డిగారు శాసనసభలో శిశువుల సంరక్షక చట్టాన్ని చేయించారు. వృద్ధాశ్రమాలను పోషించారు. ఆనాటి హైదరాబాద్ నగరంలో మహ్మదీయ స్త్రీలకు లేడి హైదరీక్లబ్ ఉన్నట్లుగానే హైందవ స్త్రీల కోసం కూడా బొగ్గులకుంటలో లేడీస్ రిక్రియేషన్ క్లబ్ నిర్మించారు. ఆంధ్ర యువతి మండలి భవన నిర్మాణానికి స్థలం కేటాయించారు.

రెడ్డిగారి 14-15 ఏళ్ళ వయస్సులోనే రంగమ్మగారితో వివాహం జరిగింది. వారికి ఒక కుమారుడు. ఆయనే రంగారెడ్డి గారు. రెండవ భార్య వల్ల లక్ష్మారెడ్డి అనే కుమారుడు, నరసమ్మ అనే కుమార్తె కలిగారు. వీరంతా విద్యావంతులై ఉన్నతోద్యోగాలలో, వివిధ పదవులలో రాణించినవారే. రెడ్డిగారు ఇందూర్‌లో ఉన్న కాలంలో గంగయ్య అనే అనాథ బాలుణ్ణి చేరదీసి పెంచి పెద్ద చేశారు.

ఇంతటి సేవాపరాయణులు, మానవతామూర్తి అయిన రాజాబహద్దూర్ వెంకట్రామారెడ్డి 1951లో అనారోగ్య పీడితులై 1953 మే ఒకటవ తేదీన హైదరాబాద్‌లో కన్నుమూశారు. ఆయన వ్యక్తిత్వం, సేవానిరతి, అభ్యుదయ కాంక్ష, సంస్కరణా దృష్టి, ఆదర్శ ప్రాయమైనవి. తెలంగాణ ప్రజలకు ఆయన పెన్నిధి వంటి వారు.

# 117 రాజన్ బాబు

– పి.వి. రామమోహన్ నాయుడు

ఛాయాచిత్ర కళాజగత్తులో తెలంగాణవాడి ప్రజ్ఞను జిగేల్ మనిపించిన కళాతపస్వి రాజన్ బాబు. చీకటి వెలుగులు, నలుపు తెలుపుల కలనేతలోని సౌందర్యాన్ని తన చతురతతో కెమెరాలో బంధించి అద్భుతమైన ఫోటోలుగా మలచిన ధన్యజీవి ఆయన. "సృజనాత్మక ఫోటోగ్రఫీ"లో ఆయనకు ఆయనే సాటి. వైవిధ్యం ఆయన ఫోటోగ్రఫిలోని సుగుణం. సృజనాత్మక ఛాయాగ్రహణమైనా, ఫ్యాషన్ ఫోటోగ్రఫియైనా, జర్నలిజం ఫోటోగ్రఫి అయినా అన్నింటి లోనూ ఆయన చేయి తిరిగిన శిల్పి. బ్లాక్ అండ్ వైట్ ఫోటోగ్రఫిలో ఎన్నో రంగులు మెరిపించిన భావుకుడు రాజన్ బాబు. గిరిజన గుస్సాడి నృత్యమైనా, భామాకలాపంలోని ప్రణయ ఘట్టమైనా, సూర్యుడి కిరణాలు దట్టమైన అడవిలో ఆకుల కోణాలను తాకి నీడలుగా ప్రతిఫలించే కమనీయ దృశ్యమైనా ఆయన కెమరాలో శాశ్వతంగా ఒదిగి పోవలసిందే. నలుపు తెలుపులో నగ్నచిత్రమైనా కవితా స్పర్శను గుభాళించ వలసిందే.

కరీంనగర్ జిల్లా కోరుట్లలో పద్మశాలి కుటుంబంలో 1938, ఫిబ్రవరి 9 న జన్మించిన రాజన్ బాబు తండ్రి తమ కులవృత్తియైన చేనేతలో నేర్పరి. "టై అండ్ డై" ప్రక్రియలో రంగులద్దడంలో మేటి కలంకారి. తండ్రి నుంచి అనువశికంగా అబ్బిన కళేమో, రంగులు వాటి చాయలతో కదంబాలు ఆడుకోవడం, బొమ్మలు గీయడం, పెయింటింగ్‌లు వేయడం రాజన్ బాబుకు చిన్నతనం నుంచే ఆసక్తి. ఊళ్ళోని పొలాలు, వాగులు, వంకలు, హనుమంతుని బండ, ఇలా కనిపించిన ఎన్నో దృశ్యాలు, కదిలించిన ఎన్నెన్నో అంశాలను కన్నులకింపుగా రూపొందించేవాడు. ఇది గమనించి బొంబాయిలో ఉండే పెద్దమ్మ కొడుకు రాజన్ బాబుకు ఒక చిన్న కేమెరా బహూకరించాడు. అయితే కెమెరా దొరికింది. మరి రీళ్ల మాటేమిటి? చుట్టాలు, స్నేహితుల ఫోటోలు తీసి రీళ్ల మందం డబ్బులు పోగేసి, మిగిలిన రీల్లతో తన అభిరుచిని కొనసాగిస్తూ మురిసిపోతుండేవాడు. అప్పటినుంచి ఆయనకు కెమెరాయే లోకం అయ్యింది. ఆ బుజ్జి పెట్టేతోనే లోకమంతా. పొద్దస్తమానం ఫోటోగ్రఫిలో నిమగ్నమైన రాజన్ బాబు పదవ తరగతి పరీక్షలో మునక వేసాడు. చదువుకు గండి పడింది. ఏమి చేయాలో తోచని పరిస్థితి. ఎలాగో తెలుసుకొని హైదరాబాద్ వెళ్లి జె.ఎన్.టి.యులో ఫైన్ ఆర్ట్స్ డిప్లమో కోర్సులో చేరాడు. రాజన్ బాబు శ్రద్ధాసక్తులు, రంగులపై ఆయనకున్న పట్టును గమనించిన అధ్యాపకులు మొదటి సంవత్సరం పూర్తికాక మునుపే రెండవ సంవత్సరం లోకి ప్రమోట్ చేశారు. పైగా లెక్చరర్లు దండ్లమూడి మధుసూదన రావు, సార్నికలు డ్రాయింగ్ షీట్స్, రంగులు అన్నీ కొనిచ్చి మరీ ప్రోత్సహించేవారు. దాంతో నిరాటంకంగా అభిరుచి మేరకు బొమ్మల సృజనలో నిమగ్నమైపోయాడు.

ఫైన్ ఆర్ట్స్ పూర్తి కావొచ్చింది. డిగ్రీలో చేరడానికి పదవ తరగతి పాస్ అయివుండాలి. దాంతో రాజన్ బాబు ప్రయత్నాలు మొదలయ్యాయి. ఒక పక్క డిప్లమో చేస్తూనే పదవ తరగతి పరీక్షలు రాసి పాసయ్యాడు. దాంతో జె.ఎన్.టి.యులో అప్లయిడ్ కోర్సులో ప్రవేశం లభించింది. ఈ కోర్సులో ఫోటోగ్రఫి కూడా భాగం. అందుకుగాను ప్రతిబింబాలు అనే అంశంపై ఫోటోలు తీసుకురమ్మని లెక్చరర్ ఇబ్రహీం అలి పంపించారు. తమ కాలేజి ఆవరణలో నిలిపి ఉన్న ప్రిన్సిపాల్ కారుపై ప్రతిబింబిస్తున్న కాలేజి భవనం ప్రతిమను క్లిక్ మనిపించి తీసుకెళ్ళి చూపాడు. అదే ఫోటో రాజన్ పాల్గొన్న మొదటి పోటీలోనే రెండవ బహుమతి సాధించి పెట్టింది. దీంతో ఆత్మస్థైర్యం పెరిగింది. అప్పటి వరకు తాను పల్లెవాడినని, సామాన్య కుటుంబం నుంచి వచ్చానని, ఆంగ్లం రాదని రాజన్‌లో దాగివున్న ఆత్మ న్యూనత పటాపంచలై పోయింది. ఫొటోగ్రఫి తన బతుకుకు బరోసాగా నిలుస్తుందనే నమ్మకం ఆరంభించాడు. అదే సమయంలో సృజనాత్మక ఫొటోగ్రఫి వైతాళికుడు, ఫొటోగ్రఫి జీనియస్ రాజ త్రయంబక్ రాజబహద్దూర్ వద్ద శిష్యరికం చేసే బంగారు అవకాశం లభించిది. ఇది రాజన్ బాబు జీవితాన్ని మలుపు తిప్పింది.

ఒక దిశను, లక్ష్యాన్ని నిర్దేశించుకోనేట్లు చేసింది. సాధారణ ఫోటోలు తీయడం నుంచి శైలి, శిల్పం ఉండే కవితాత్మక ఫోటోలు తీయడం వరకు ఎన్నో మెళుకువలను రాజ త్రయంబక్ రాజబహద్దూర్ తనదైన శైలిలో రాజన్‌కు నేర్పారు. అప్పటి నుంచి నిరంతరం తనను తాను రాజన్ సాన బెట్టుకున్నారు. తనలోని అభినివేశానికి ప్రయోగాలు తోడై సంపూర్ణ సృజనాత్మక ఫొటోగ్రాఫర్‌గా రూపుదిద్దుకున్నారు. ఎన్నో పరీక్షలు ఎదుర్కొని ఫొటోగ్రఫిలో తన సంతకాన్ని శాశ్వతంగా నిలుపుకున్నారు. మానవ అనాటమీ, గిరిజన సంస్కృతి, సంప్రదాలపై ఫోటోలు తీయడంలో రాజన్ బాబుది అరుదైన శైలి. గిరిజన జీవన శైలిపై అధ్యయనం చేయడానికి, చిత్రీకరించడానికి ఆయన అరకులో అణువణువు తిరిగారు. ఆదిలాబాద్ అడవుల్లో గొండులతో సహవాసం చేశారు. అందుకే ఆ కథా వస్తువులపై ఆయన చిత్రాలు సజీవంగా వుంటాయి.

గిరిజన వివాహాలు, గోండుల గుస్సాడి, ధింసా దరువులు, ఆనందం, నావలయానం అన్నీ కళ్ళకు కట్టినట్లు ఫొటోలు తీశారు. మానవ అనాటమీని ప్రకృతికీ సారూప్యతను ఆపాదిస్తూ, దానికి వేదాంతాన్నిముడివేస్తూ ఎన్నో ఛాయాచిత్రాలు సృజియించారు. నగ్నత్వంపై చిత్రించినా, గిరిజన జీవన శైలిపై క్లిక్ మనిపించినా అందులో కళాత్మకతను జొప్పించి మనోహర చిత్రాలుగా ఆవిష్కరించడం ఆయన శైలి. చుట్టూ ఉన్న ప్రకృతిని, వెలుగు నీడలను, శరీరాకృతికి సంధించి కమనీయ శ్రుతులు పలికించడం ఆయన కెమేరాకు అలవాటైన విద్య.

"స్త్రీ శరీరం– సౌందర్యం" అనే అంశంపై ఫోటోలను తీయడంలో ఆయన నేర్పరి. హైదరాబాద్‌లో మోడళ్ళు దొరకని కాలంలో అవగాహనలేని గిరిజన యువతిని మోడల్‌గా తీసుకొని ఆమెకు తర్ఫీదు ఇచ్చి తన ఇతివృత్తానికి తగ్గ ఫోటోలను తీయడానికి చాల అవస్థలు పడ్డారు. అయితే ఆ ప్రయత్నం అనేక ఫొటోగ్రఫి ప్రదర్శనల్లో రాజన్ బాబుకు మంచి ప్రశంసలు, పురస్కారాలు సాధించిపెట్టింది.

లండన్ జ్యూరీలో కూడా రాజన్ బాబు పనితనానికి మంచి స్పందన లభించింది. "స్త్రీ నగ్న సౌందర్యం" అనే ఇతివృత్తంపై ఆయన తీసిన ఛాయా చిత్రాలను జ్యూరీలోని మహిళా సభ్యురాలు మెచ్చుకోవడం ఆయనకు మరింత నైతికబలం కలిగించింది. ఈ అరుదైన గౌరవం కోసమే ఆయన ఎన్నో కష్టనష్టాలకు ఎదురొడ్డి ఫొటోగ్రఫిలో కృషి జరిపారు.

బ్లాక్ అండ్ వైట్ ఫొటోగ్రఫిలో వెలుగు నీడలను ఆయన వాడుకున్నట్లు, చీకటి వెలుగులతో ఆయన ఆడుకున్నట్లు వేరెవ్వరికి సాధ్యపడదు. అందుకే బ్లాక్ అండ్ వైట్ ఫొటోగ్రఫిలో దేశమే గర్వించే స్థాయికి రాజన్ బాబు ఎదిగారు. రాజన్ బాబు కృషిని ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఫొటోగ్రఫి సంస్థలన్నీ గుర్తించాయి. 1970లో ఫ్రాన్స్‌లోని ఆర్టిస్ట్ ఆఫ్ ఫెడరేషన్ ఇంటర్నేషనల్ ఫొటోగ్రఫి ఆర్ట్, 1983లో లండన్‌లోని రాయల్ ఫొటోగ్రఫి సొసైటిల అసోసియేట్‌షిప్ లభించింది. ప్రపంచ ఫొటోగ్రాఫర్ల బంగారు కల వంటి రాయల్ ఫొటోగ్రఫి సొసైటి ఫెలోషిప్ 1987లో రాజన్‌కు లభించింది. నగ్న చిత్రాలపై (న్యూడ్ ఫొటోగ్రఫి) ఆయన సమర్పించిన పరిశోధనా వ్యాసానికి రాయల్ ఫొటోగ్రఫి సొసైటి ఆయనకు ఫెలోషిప్ ప్రధానం చేసింది.

నిజానికి ఈ పురస్కారాన్ని పొందిన ఏకైక తెలుగు వ్యక్తి కూడా ఆయనే. ఆనక ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఫెలోషిప్ ఇచ్చి రాజన్ బాబును గౌరవించుకోంది. కంప్యూటర్లు, గ్రాఫిక్స్ ఏవీ లేని రోజుల్లో విజన్ మిక్సింగ్‌లో ఎన్నో ప్రయోగాలు చేసిన పరిశోధకుడాయన

చాలా కాలంపాటు జె.ఎన్.టి.యు.లో లెక్చరర్‌గా పని చేశారు. తన ఛాయాచిత్ర కళా పాండిత్యాన్ని ముందు తరాలకు పంచారు. అనంతరం రాజన్ స్కూల్ అఫ్ ఫొటోగ్రఫి నెలకొల్పి ఎందరికో విద్యాదానం చేశారు. ఎన్నో సెమినార్లు, వర్క్ షాప్‌ల నిర్వహణలో ముఖ్య భూమిక పోషించారు, కొన్నాళ్ళు కొత్తగూడెం థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఫొటో గ్రాఫర్‌గా పని చేశారు. అక్కడే సర్ అనే బ్రిటిష్ ఇంజనీర్‌తో పరిచయం ఏర్పడింది. ఆయన వద్దే ఇండస్ట్రియల్ ఫొటోగ్రఫిలో మెళుకువలు నేర్చుకున్నారు. 1991లో హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ ఫొటోగ్రఫీ సదస్సులో రాజన్ బాబు నిర్వహించిన చురుకైన పాత్రకుగాను “మాన్ అఫ్ ది కన్వెన్షన్” సత్కారం పొందారు. ఫొటోగ్రఫీ రాజన్‌కు ప్రాణం. సృజనాత్మక ఫొటోగ్రఫిలో ప్రచారం కల్పించి ఎక్కువ మందికి తర్ఫీదు ఇచ్చి ఆ శైలికి దాని పరిధి విస్తృతపరచాలని తహతహలాడేవారు.

రాజన్ బాబు శిష్య గణం రాష్ట్రంలోనే కాకుండా దేశవ్యాప్తంగా విస్తరించి వున్నారు. ఫొటోగ్రఫి పట్ల అభిరుచి ఉన్నప్పటికి ప్రభుత్వ డిప్లొమో లేదా డిగ్రీ పొందడానికి విద్యార్హతలు ప్రతిబంధకంగా పరిణమించిన యువతీ యువకులకు రాజన్ బాబు ఆశాకిరణమయ్యారు. రాజన్ బాబును ఆశ్రయించి ఫొటోగ్రఫిలో మెళుకువలు నేర్చుకొని ఆనక ఫొటోగ్రాఫర్లుగా వృత్తి జీవితంలో రాణించినవారు కోకొల్లలు. పాత్రికేయ రంగంలో గుర్తింపు పొందిన ఫొటోగ్రాఫర్లలో ఆయన శిష్యులు ఎందరెందరో...

హైదరాబాద్, కరీంనగర్, వరంగల్‌తో సహా చాల ప్రాంతాల్లో వర్క్ షాప్‌లు నిర్వహించి స్థానిక యువతలో ఫొటోగ్రఫిపట్ల అవగాహన, మక్కువ పెరగడానికి రాజన్ బాబు నిరంతరం శ్రమించేవారు.

రాజన్ బాబు శిష్య గణం రాష్ట్రంలోనే కాకుండా దేశవ్యాప్తంగా విస్తరించివున్నారు. ఫొటోగ్రఫిపట్ల అభిరుచి ఉన్నప్పటికి ప్రభుత్వ డిప్లొమో లేదా డిగ్రీ పొందడానికి విద్యార్హతలు ప్రతిబంధకంగా పరిణమించిన యువతీ యువకులకు రాజన్ బాబు ఆశాకిరణమయ్యారు. రాజన్ బాబును ఆశ్రయించి ఫొటోగ్రఫిలో మెళుకువలు నేర్చుకొని ఆనక ఫొటోగ్రాఫర్లుగా వృత్తి జీవితంలో రాణించినవారు కోకొల్లలు. పాత్రికేయ రంగంలో గుర్తింపు పొందిన ఫొటోగ్రాఫర్లలో ఆయన శిష్యులు ఎందరెందరో...

హైదరాబాద్, కరీంనగర్, వరంగల్‌తో సహా చాలా ప్రాంతాల్లో వర్క్ షాప్‌లు నిర్వహించి స్థానిక యువతలో ఫొటోగ్రఫిపట్ల అవగాహన, మక్కువ పెరగడాని8కి రాజన్ బాబు నిరంతరం శ్రమించేవారు. ఆగస్టు 25న తన 73వ ఏట కన్ను మూశారు. అయినా చీకటి వెలుగులు సరగాలాడే ప్రతి సన్నివేశంలోనూ మన తెలంగాణా బిడ్డడు రాజన్ బాబు జ్ఞాపకాలు మెరుస్తూనే ఉంటాయి.

# 118 రామానంద తీర్థ

– డా॥ టి. గౌరీశంకర్

స్వామి రామానంద తీర్థ హైదరాబాదు సంస్థానంలో స్వాతంత్ర్య సమర శంఖారావాన్ని పూరించిన వీరసేనాని సంస్థాన విమోచనోద్యమంలో కీలకపాత్రను పోషించిన పోరాటయోధుడు. సంస్థాన ప్రజల విముక్తి కోసం ఉద్యమాలను నడిపిన విప్లవనాయకుడు. ఇక్కడి ప్రజలకు ఉద్యమాల ఉగ్గుపాలుపోసి, తిరుగుబాటు తత్వానికి బాటలు వేసిన మార్గదర్శి. అణచివేతల నుంచి తలలు పైకెత్తి, పిడికిలి బిగించి నిరంకుశ ప్రభుత్వాన్ని నిలదీసి ప్రశ్నించే ధైర్య సాహసాలను నూరిపోసిన శౌర్యవంతుడు. యవ్వన దశలోనే అవివాహితునిగా సన్యాసం స్వీకరించిన యోగి పుంగవుడు, ఆధ్యాత్మిక ప్రవక్త. యావజ్జీవితాన్ని సమాజసేవకు, దేశారాధనకు వెచ్చించిన త్యాగధనుడు. నిజాం ప్రభుత్వాన్ని ఢీకొన్న ఆయన సాహసం, ప్రజలను జాగృత పరచడంలో ఆయన సలిపిన కృషి అసమానమైనది.

నిస్వార్థపరుడు, నిరాడంబర జీవి, త్యాగశీలి, దేశ భక్తుడు, గాంధేయవాది సత్యాహింస సిద్ధాంతాల ద్వారానే స్వాతంత్ర్యం సాధించవచ్చునని ప్రగాఢంగా విశ్వసించిన వాడు. నిరుపేదల పట్ల, అణగారిపోయిన అట్టడుగు వర్గాల పట్ల, దళిత ప్రజల పట్ల ఆయనకు ఉండిన స్పందన అపారమైనది. వారి జీవితాలు మెరుగుపడాలనీ, వెలుగులు నిండాలని అహరహం ఆలోచిస్తూ, ఆ దిశగా అడుగులేస్తూ ఉండేవాడు. కొందరు ఇతనిపై తీవ్రవాది అనే ముద్రను కూడా వేశారు. ప్రజలలోని పేదరికాన్ని తొలగించాలంటే, ధనస్వామ్య వ్యవస్థపై అదుపు ఉండాలనే వారు. సామ్యవాదం, ప్రజాస్వామ్యపు విలువల పట్ల అత్యంత గౌరవం కలిగిన వారు. వాటి విధానాల అమలు పట్లు అచంచలమైన దీక్ష కలిగిన వారు.

స్వామి రామానంద తీర్థ కర్ణాటకలో పుట్టినప్పటికీ, మహారాష్ట్రలో విద్యాభ్యాసం చేసి, రాజకీయ కార్యకలాపాలు కొనసాగించినప్పటికీ ఆయన రాజకీయ నాయకత్వం సంపూర్ణంగా వికసించి, విరాడ్రూపాన్ని ప్రదర్శించింది మాత్రం తెలంగాణలోనే.

స్వామిజీ పూర్వాశ్రమంలోని పేరు వెంకటేశ్ భావన్‌రావ్ ఖడ్గీకర్. ఈయన 1903 అక్టోబర్ 3వ తేదీన గుల్బర్గా జిల్లాలోని చిన్మెల్లా జాగీర్ అనే గ్రామంలో జన్మించారు. ఇది పూర్వపు కర్ణాటక ప్రాంతంలోనిది. వీరు షోలాపూర్‌లో మెట్రిక్యులేషన్ చదువుతూ, దానికి స్వస్తి పలికి, 1921లో గాంధీజీ ప్రారంభించిన సహాయ నిరాకర ణోద్యమంలో పాల్గొన్నారు. ఆ తరువాత పూణెలోని తిలక్ విద్యాపీఠం నుంచి ఎం.ఏ. పట్టా పొందారు.

ఆనాడు కార్మిక నాయకునిగా పేరు పొందిన ఎన్.ఎం. జోషికి కార్యదర్శిగా కార్మిక రంగంలో కొంతకాలం పనిచేశారు. బొంబాయి బట్టల మిల్లు కార్మికులను సంఘటిత పరచడంలో వీరి ప్రజాసేవ ప్రారంభమైంది. ఆ తరువాత 1929లో ఉస్మానాబాద్ జిల్లా ఇప్పర్గి గ్రామంలోని ఉన్నత

పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా పనిచేశారు. నెలకు 70 రూపాయలు జీతం లభించేది. దానిలో నుండి ఒక్క పైసా కూడా తన కోసం వాడుకోకుండా, ఆ పాఠశాల వదిలి వెళ్ళేటప్పుడు జమ అయిన తన వేతనం మొత్తం డబ్బును అదే పాఠశాలకు విరాళంగా ఇచ్చారు. మెట్రిక్ తరగతికి ఇంగ్లీషు పాఠాలు చెప్పేవారు. ఆ పాఠశాలలో అనంతరావు కులకర్ణి అనే దేశభక్తుడు కరస్పాండెంట్‌గా పనిచేసేవారు. ఆయన ధ్యానేశ్వరీమాత ఉపాసకుడు. యువకుడైన వెంకటేశ్ ఆయన ప్రభావంలో పడిపోయి ఆధ్యాత్మిక రంగంలోకి అడుగుపెట్టాడు. దాదాపు ఆరేళ్ళు ఉపాధ్యాయవృత్తిలో ఉండి, అనంతరం బీడ్ జిల్లాలోని మోయినాబాద్‌లో యోగీశ్వరి పేరుతో స్వయంగా ఉన్నత పాఠశాలను స్థాపించారు. భిక్షాటన చేస్తూ జీవితం గడిపారు.

గృహస్థ జీవితం రాజకీయోద్యమాలలో పని చేయడానికి ఆటంకం అని భావించి వీరు వివాహం చేసుకోలేదు. భారతీయ సంప్రదాయాన్ని అనుసరించి గురుకుల దీక్ష ఆత్మోన్నతికి తోడ్పడుతుందని అభిప్రాయపడ్డారు. ఆ జన్మ బ్రహ్మచారిగా ఉండి కఠోరమైన సన్యాసాశ్రమాన్ని తమ 29వ ఏటనే అంటే 1931లో స్వామి తీర్థా స్వీకృతిలో స్వీకరించి స్వామి రామానందతీర్థగా మారిపోయారు.

1938లో మరాఠా ప్రాంత మహాసభకు స్వామీజీ కార్యదర్శిగా పనిచేయడంతో వారి రాజకీయోద్యమ రంగ ప్రవేశం జరిగింది. అప్పటి నుంచి వీరు రాజకీయాలలో క్రియాశీలంగా పని చేస్తూ వచ్చారు. ఇందుకు హైదరాబాదు నగరాన్ని వారు కార్యక్షేత్రంగా ఎంచుకొన్నారు.

తెలంగాణాలో ఒకవైపు ఫ్యూడల్ వ్యవస్థ, మరొకవైపు దారిద్ర్యం, పేదరికం, వీటి వల్ల ప్రజలలో తిరుగుబాటు తలఎత్తితే, ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా అణచివేతకు పూనుకొనేది. దాని వల్ల నిరంతరం ప్రభుత్వానికి, ప్రజలకు నడుమ సంఘర్షణ జరుగుతూ ఉండేది. ఇది అరాచకానికి, హింసాత్మక ఘటనలకు దారి తీసేది. దానివల్ల ఎల్లప్పుడు అల్లకల్లోలం, అలజడి, అశాంతి చెలరేగుతుండేది.

ఇటువంటి పరిస్థితులను చక్కబెట్టి, ప్రజలకు ప్రశాంతమైన జీవితాన్ని ప్రసాదించ దానికి స్వామీజీ నడుం బిగించారు. తెలంగాణ వెనుకబాటు తనానికి కేవలం మత దురహంకారమో, నిరంకుశత్వమో కారణం కాదు. ఇక్కడి సాంఘిక, ఆర్థిక పరిస్థితులే ప్రధాన కారణమని స్వామిజీ భావించారు. అందువల్ల ముందుగా వాటిని సంస్కరిస్తే ప్రజల సమస్యలు వాటంతట అవే పరిష్కరింపబడతాయని ఆయన ఉద్దేశం.

1938 అక్టోబరు 24వ తేదీన హైదరాబాదు స్టేట్ కాంగ్రెసు ఏర్పడింది. దానికి స్వామిజీ కార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు. ఈ సంస్థకు సంపూర్ణ స్వరూపం ఏర్పడక ముందే నిజాం ప్రభుత్వం దానిని నిషేధించింది. ఆ నిషేధాజ్ఞను ఉల్లంఘించినందుకు స్వామిజీ జైలు శిక్షకు గురయ్యారు. ప్రభుత్వం ఆయనను అరెస్టు చేసి, కాళ్ళకు బేడీలు తగిలించారు. ఒక నిక్కరు, గొంగలి, చెంబు, కంచం ఇచ్చారు. ఆయనతో రోజూ ఎనిమిది గంటలు పనిచేయించారు. మొదటిసారే ఆయను పదిహేను నెలలు జైలులో ఉంచారు. రాష్ట్రంలో వందేమాతరం ఉద్యమం కూడా అప్పుడే వచ్చింది. గాంధీజీ సూచనపై స్టేట్ కాంగ్రెసు తన సత్యాగ్రహాన్ని విరమించుకుంది. నాయకులందరూ సేవాశ్రమం వెళ్ళి గాంధీజీతో సంప్రదింపులు జరిపారు. సేవాశ్రమం నుంచి తిరిగి రాగానే స్వామిజీ ఆనాటి సంస్థాన ప్రధాని సర్ అక్బర్ హైదరీకి లేఖ రాస్తూ ప్రజాపోరాటాలను, మతపోరాటాలుగా భావించరాదని హెచ్చరిస్తూ తన పోరాటాన్ని తిరిగి కొనసాగించారు. 1940 నవంబరు 11వ తేదీన స్వామిజీని ప్రభుత్వం మళ్ళీ అరెస్టు చేసి పదిహేను మాసాలు నిజామాబాద్ కోట జైలులో ఉంచింది. 1946-47లలో స్వామిజీ మూడవసారి అరెస్టయి మరో 16 నెలలు కారాగార జీవితం గడిపారు. 1946లోనే స్వామిజీ స్టేటు కాంగ్రెసుకు అధ్యక్షునిగా ఎన్నుకోబడ్డారు. హైదరాబాదు సంస్థానం స్వాతంత్ర్య పోరాట చరిత్రలో నాలుగున్నర సంవత్సరాలుగా సుదీర్ఘ జైలు జీవితం అనుభవించింది స్వామి రామానంద తీర్థయే. దేశానికి స్వాతంత్ర్యం లభించిన రోజున ఢిల్లీలో నెహ్రూ ఇచ్చిన జాతీయ పతాకం తీసుకొని హైదరాబాదు రాగానే స్వామిజీని పోలీసులు తిరిగి అరెస్టు చేసి చంచల్‌గూడ జైలులో నిర్బంధించారు. పోలీసు చర్య తరువాత ఆయన విడుదలయ్యారు.

హైదరాబాదు సంస్థానంలోని కాంగ్రెసు రాజకీయోద్యమం ఆనాడు రెండు రకాలుగా నడిచింది. ఒకటి

మితవాద ధోరణితో, రెండోది తీవ్రవాద ధోరణితో. ఒక వర్గం నిజాం నవాబుతో సంప్రదింపులు జరుపుతూ సఖ్యంగా రాజకీయ పరిష్కార మార్గం గురించి సయోధ్యతో ఆలోచించడం మంచిదనే దృష్టితో ఉండేది. ఇక మరో వర్గం తెలంగాణలోని యువత. వీరు తీవ్రవాద కార్యక్రమాలతో తప్ప నిజాం పాలనను అంతమొందించడం సాధ్యం కాదనే అభిప్రాయం కలిగి ఉండేది. ఈ వర్గం వరు స్వామిజీని తమ నాయకునిగా బలపరిచారు. స్వామిజీ స్టేట్ కాంగ్రెస్ అధ్యక్షులుగా కాగానే సంస్థాన ప్రజా ఉద్యమంలో అతివాద రాజకీయాలను ప్రవేశపెట్టారు. దానితో ఆయనపై తీవ్రవాది అనే ముద్రపడింది.

స్వామిజీ స్టేట్ కాంగ్రెసు అధ్యక్షులుగా ఉన్న సమయంలోనే ఆయన తెలంగాణలోని గ్రామాలలో పర్యటించారు. ఆ రోజులలో గ్రామాలలోని పరిస్థితులు అత్యంత దారుణంగా ఉండేవి. రజాకార్లు ఈ సంస్థానంలోని ముస్లిమ్‌లు రాజులనీ, మహమ్మదీయేతరులందరూ వారికి దాసులనే నినాదాలతో అరాచకాన్ని సృష్టించసాగారు. ప్రజలపై అనేక రకాల అకృత్యాలు చేస్తూ భయోత్పాతం కలిగించారు. ఒక వైపు మిలటరీ, పోలీసుల దాడులు, మరొకవైపు కమ్యూనిస్టు దళాల దాడులు. ఈ రెండింటి మధ్య ప్రజల జీవితం నలిగిపోయేది. పోలీసులను పగటి దొరలని, కమ్యూనిస్టులను చీకటి దొరలని ఆ రోజులలో అంటూ ఉండేవారు. దీన్నే 'రాత్‌కీ సర్కార్, దిన్‌కే సర్కార్' అనేవారు. ఇటువంటి అననుకూల వాతావరణంలో స్వామిజీ గ్రామాలలోకి అడుగుపెట్టారు. ఆయనకు ఎటువంటి అధికారం లేదు. పోలీసు రక్షణ లేదు. అయినా వెనుకడుగు వేయలేదు. భయంతో గ్రామాలను వదిలి వెళ్ళిపోతున్న రైతులను పిలిచి వారికి ధైర్యాన్ని నూరిపోశారు. వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపారు. పల్లెప్రాంతాలలో జీవచ్ఛవాలలా ఉన్న ప్రజలకు మళ్ళీ ప్రాణం పోశారు. వారికి బ్రతుకుపై ఆశలు చిగురింపజేశారు.

1947లో భారత స్వాతంత్ర్యావతరణ అనంతరం హైదరాబాదు సంస్థానం భారత యూనియన్‌లో కలవదనీ, స్వతంత్ర రాజ్యంగానే ఉంటుందనీ నిజాం ప్రకటించడంతో మళ్ళీ తెలంగాణలో స్వాతంత్ర్యోద్యమం తలయెత్తింది. ఆ సందర్భంలో నిజాం ప్రభుత్వం వేలాది కార్యకర్తలను నిర్బంధించింది. దారుణమైన విధానాలను అమలు జరిపి ప్రజలను భయకంపితుల్ని చేసింది. ఆ భయంకర పోరాట సమయంలో స్వామి రామానంద తీర్థ స్టేట్ కాంగ్రెస్ ఉద్యమానికి సారథ్యం వహించి నిజాం ప్రభుత్వాన్ని ఎదుర్కొన్నాడు. చివరికి పోలీసుచర్యతో నిజాం నవాబు, రజాకారు ముష్కర మూకలు భారత సైన్యానికి లొంగిపోయి హైదరాబాదు సంస్థానాన్ని భారత ప్రభుత్వంలో విలీనం చేయడం జరిగింది.

స్వామిజీ స్టేట్ కాంగ్రెసు అధ్యక్షులుగా ఉన్న కాలంలోనే హైదరాబాదులో భూసంస్కరణలు జరిగాయి. హైదరాబాదు కౌలుదారీ చట్టం వచ్చింది. ఇది అందరికీ ఆమోదయోగ్యం గానే గాక ఆనందదాయకంగా మారింది. దేశానికంతటికీ మార్గదర్శకంగా నిలిచింది. బూర్గుల ప్రభుత్వ హయాంలో ఈ భూసంస్కరణలను వీరు వేగవంతం చేయించారు.

1952లో హైదరాబాదులో మొదటిసారిగా అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్లీనరీ సమావేశాలు జవహర్‌లాల్ నెహ్రూ అధ్యక్షతన జరిగాయి. ఆహ్వాన సంఘం అధ్యక్షులుగా స్వామిజీ సారథ్యంలో జరిగిన ఏర్పాట్లను పెద్దలందరూ మెచ్చుకొన్నారు.

స్వామిజీ మొదటిసారి గుల్బర్గా నుంచి, రెండవసారి ఔరంగాబాదు నుంచి లోక్‌సభకు పోటీ చేశారు. హైదరాబాదు స్టేట్ కాంగ్రెసు నాయకత్వాన్ని వదిలేసిన తరువాత స్వామిజీ నిర్మాణాత్మకమైన కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆధ్యాత్మిక రంగంలో పూర్తిగా నిమగ్నమయ్యారు. హైదరాబాదు ఖాదీ సమితి అధ్యక్షునిగా పనిచేశారు. తెలంగాణ ప్రముఖ కాంగ్రెసు నాయకులు పి.వి. నరసింహారావు, జమలాపురం కేశవరావు, కోదాటి నారాయణరావు, ఇంకా కాళోజీ మొదలైన ప్రముఖులంతా స్వామిజీ శిష్యులే.

స్వామిజీది ఒకరికి లోబడి ఉండే తత్వం కాదు. తలెత్తి ప్రశ్నించే నైజం. పోలీసు చర్య తరువాత కమ్యూనిస్టులను అణచివేసే తీవ్రహింసా పద్ధతిని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. స్వామిజీ కేంద్రంపై తీసుకొని వచ్చిన ఒత్తిడి వల్లనే రాష్ట్రంలో మిలటరీ పాలనను తొలగించి ఎం.కె. వెల్లోడి ముఖ్యమంత్రిగా సివిల్ ప్రభుత్వం ఏర్పాటయింది. కమ్యూనిస్టులు జరిపిన సాయుధపోరాటాన్ని కూడా స్వామిజీ సమర్థించలేదు.

నల్లగొండ జిల్లా హుజూర్‌నగర్ తాలూకా చిల్లేపల్లి అనే గ్రామంలో కుటీరం ఏర్పాటు చేసుకొని కొంతకాలం అక్కడి ప్రజలకు శాంతిబోధలు చేశారు. స్వామిజీ షష్టిపూర్తి ఉత్సవం హైదరాబాదులో లాల్‌బహదూర్ శాస్త్రిగారి అధ్యక్షతన అత్యంత వైభవంగా జరిగింది. ఆ సందర్భంలో ఆయన పట్ల అశేష జనవాహిని ప్రకటించిన భక్తి గౌరవాలు స్వామిజీకి ప్రజలలో ఉన్న ఆదరణ ఎటువంటిదో స్పష్టం చేశాయి. ఇంతటి మహనీయుడైన ఆయన 1972 జనవరి 22వ తేదీన హైదరాబాదులో తుదిశ్వాస విడిచారు. పలురాష్ట్రాలలోని ఆయన శిష్యులు ఆయన స్మారకార్థం 'స్వామి రామానందతీర్థ సాంఘిక, ఆర్థిక పరిశోధన సంస్థ'ను హైదరాబాదులో స్థాపించారు. గత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నెలకొల్పిన 'గ్రామీణ విశ్వవిద్యాలయా'నికి స్వామి రామానంద తీర్థ పేరును పెట్టి ఆయనకు నివాళులర్పించింది.

# 119 రావెళ్ళ వెంకట్రామారావు

**– జ్వలిత**

తెలంగాణ ఉద్యమ వనంలో తొలి గేయమైన "కదనాన శత్రువుల కుత్తుకల నవలీల – నుత్త రించిన బలోన్మత్తులేలిన భూమి – ధీరులకు మొగసాలరా! – తెలంగాణ వీరులకు కాణాచిరా" అనే పాటతో యాభైఏళ్ళ కిందనే తెలంగాణ స్వరాష్ట్ర కాంక్షను రగిలించిన కవి, పెన్నుగన్ను సమానంగా ఉపయోగించి నిజాం నిరంకు శత్వానికి ఎదురు నిలిచిన కవి రావెళ్ళ వెంకట రామారావు గారు.

వారి తండ్రి లక్ష్మయ్య తల్లి సుబ్బమ్మ. 1930 జనవరి 30న ఖమ్మం జిల్లా ముదిగొండ దగ్గర గోకినపల్లిలో పుట్టారు. ఒక అన్న ఇద్దరు తమ్ములు ఒక చెల్లి మొత్తం అయిదుగురు. వారు రెండవ సంతానం. వారి అన్న రావెళ్ళ సత్యనారాయణ ఖమ్మం సమితి ప్రెసిడెంటుగా పని చేశారు. సి.పి.యం. తరుపున చిన్నతమ్ముడు రావెళ్ళ కృష్ణారావు పోస్టల్ శాఖలో పని చేశారు. అందరికంటే ఆఖరున భాగ్యమ్మ గృహిణి.

1951 జులై2న సుగుణమ్మతో పెళ్ళయ్యింది. నలుగురు కొడుకులు. పెద్దకొడుకు మాధవరావు, ఆగ్రో ఫార్మ్‌లో ఉద్యోగి, రెండో కుమారుడు మహేశ్వరరావు సింగరేణిలో, మూడవవాడు మనోహరవర్మ (కొత్తగూడెం) సింగరేణి ఉద్యోగం, నాల్గోవాడు బుజ్జి అంటారు పేరు లక్ష్మణవర్మ సింగరేణి ఉద్యోగం చేస్తున్నారు.

వీరు కవి, గేయ రచయిత, కథకులు. వీరి కథ 'తెలుగు స్వతంత్ర'లో వచ్చాయి. కాసా సుబ్బారావు సంపాదకులు మద్రాసు నుండి వచ్చేది ఆ పత్రిక. ఇప్పుడు కాపీలు లభించడం లేదు. కథ పేరు "దాగని నిజం". కవులకు సంబంధించిందే ఆరోజుల్లో నిజంగా జరిగిందే అనవచ్చు.

వారి మొదటి కవిత ఒకసారి పొలంలో కలుపు తీస్తుంటే "మీకెందుకు బాబు ఈ కష్టం" అని కూలి మనిషి వారించాడట అప్పుడే "కలుపు మొక్కల ఏరివేతతో చేనుకు బలం– రజాకార్ల తరిమి వేతతో మనకు బలం" అన్నది వారి మొదటి కవితా వాక్య. వారి మిగిలిన రచనలు రాగజ్యోతులు, చైతన్యస్రవంతి, పల్లె భారతి, తాండవహేళ, అనతల తల్పం మొదలైనవి.

వారు జాషువా స్మారక పురస్కారం, గురజాడ అప్పారావు పురస్కారం, దాశరథి పురస్కారం అందుకున్నారు.

వారి తాతగారు గుంటూరు జిల్లా సత్తెనపల్లి వాసి, 100 ఎకరాల ఆసామి పేరు వెంకట్రామయ్య "90 ఎకరాలు అమ్ముకొని 10 ఎకరాలు మేము ఉంచుకుంటాం సంతకం చెయ్యండి" అని కృష్ణా జిల్లా పెద్ద మనుషులు అంటే "నేను సంతకం చెయ్యను, లేని వాళ్ళకు ఇవ్వండన్నారట ఖమ్మంలో. హీరాలాల్ మోరియా, కొలిపాక మధుసూధనరావు ఇటికాల నీలకంఠరావు, ఊటుకూరు రంగారావు ఇంకా చాలామంది కవులు ఉండేవారు, గ్రంథాలయాలు దేవాలయాల కోసం పని చేశారు కూడా చిన్నపుడు. ఉద్యమం నుండి బయటికొచ్చిన తరువాత కూడ కలిసిపని చేశారు, కలిసి ఈతకొట్టారు. గోకినపల్లి జూనియర్ కాలేజి వార్షికోత్సవాలకు

ప్రముఖ నాగభైరవ కోటేశ్వరరావును ఒకసారి, ఐఏయస్, ఐవైఆర్ కృష్ణారావును ఒక సారి తీసుకొచ్చారు.

వారు ఉద్యమంలోకి రావటానికి కారణం సమాజంలో అసమానతలు వారిని ఇబ్బంది పెట్టేవి. దోపిడీకి వ్యతిరేకంగా ఏదైనా చెయ్యాలనిపించేది వారికి. ఆ సమయంలో రజాకార్ల రాక్షస కృత్యాలు ఎక్కువయ్యాం. రజాకార్ల తీరు నచ్చక నెత్తురు ఉడికి పోయ్యేది వారికి. ఎన్నో కుటుంబాలు రజాకార్ల బారిన పడ్డాయి. బిడ్డలను పోగొట్టుకున్న తల్లులు, భర్తలను పోగొట్టుకున్న భార్యలు కళ్ళముందు కదులుతుండేవారు. ఎందరో ఆడపడుచులను పొట్టన పెట్టుకున్నారు రజాకార్లు. రజాకార్లు దేశ్‌ముఖ్‌లపై తెలంగాణా అంతా తిరగబడ్డది. 14 ఏళ్ళ వయసులో ఉద్యమంలోకి వచ్చారు రావెళ్ళ వేంకటరామారావు. ఆంధ్రమహాసభ సభ్యునిగా సొంత ఊరు గోకినపల్లి కేంద్రంగా 100 గ్రామాల్లో దళాలు ఏర్పాటు చేశారు. వందలాది మందికి శిక్షణనిచ్చారు.

వారు 'తెలంగాణ షేర్' అనే బిరుదు పొందారు. తెలంగాణ వాదం, నైజాం వ్యతిరేకన్న కారణంగా అరెస్టు చేశారు. దళ కమాండర్‌గా పని చేశారు. కేసు విచారణ సందర్భంగా ఢిల్లీ సుప్రీం కోర్టులో హాజరు పరిచారు. న్యాయవాదులు అబద్దాలాడుతుంటే కోపంతో జడ్జి వెనక ఉన్న గాంధీ చిత్రపటాన్ని చూపిస్తూ "ఉస్కూ పల్టాదో ముజె షరమ్ ఆరహా హై ఉస్కా మూ నై దేఖనా చాహతా హూ ఓతో ఝూటా బాత్ హై" అని గట్టిగా అరిచారట. అపుడు న్యాయవాదులు "యే తెలంగాణ షేర్‌హై" అన్నారట. నిజాంకు వ్యతిరేకమే కానీ ఏ కేసులు లేనందున చేతిలో 30 రూపాయలు పెట్టి వదలి పెట్టారట.

ఆ కేసులో వారిని చాలా జైళ్ళకు మార్చారు. జైలు నుండి తప్పించుకొనే ప్రయత్నాలు చేసి విఫలమయి నాలుగు సంవత్సరాల ఆరు నెలలు ఆరు రాష్ట్రాలు తిప్పారు. ముందు ఖమ్మం తీగల జైలు తర్వాత వరంగల్‌కు మార్చారు. అక్కడి జైల్లో గోడలు పగలగొడుతున్న పిండిప్రోలు రాంబాయమ్మను నిజాం సైనికులు కాల్చి చంపారు. ఆ ఘటనలోనే అదే జైల్లో ఉన్న రావెళ్ళ తప్పించుకొని కాళోజి ఇంటికి వెళ్ళారు. కొద్దికాలంలో మళ్ళీ పట్టుబడ్డారు. మిగిలిన ఖైదీలతో కలిసి సొరంగం తొవ్వుతుంటే పట్టుకున్నరు. ఖమ్మం, వరంగల్, హైదరాబాద్, ఢిల్లీ, ఔరంగాబాద్ గుల్బర్గా, జూల్నా జైళ్ళలో మూడు నెలల కొకసారి మారుస్తూ తిప్పేవారట. జైలు నుండి 1948 జనవరి 30న విడుదలయ్యారు. తరువాత గాంధీగారి సబర్మతీ ఆశ్రమంలో వారితో రెండురోజులున్నారు. వారికి గాంధీగారంటే అభిమానం. ఒకసారి నాగపూర్ విద్యార్థులు చింత చిగురు ఎండు చేపలు వండి పెట్టారట. వాంతులు విరోచనాలయి బాధ పడ్డారట. ఇందిరాగాంధీ మన రాష్ట్రం వచ్చినపుడు వేదిక మీద వీరు మాట్లాడారట.

రావెళ్ళ వెంకటరామారావు 1944లో రాసిన "కదనాన శత్రువుల కుత్తుకల నవలీల – నుత్తరించిన బలోన్మత్తులేలిన భూమి – ధీరులకు మొగసాలరా – తెలగాణ వీరులకు కాణాచిరా..." అనే పాట.... దేశపతి శ్రీనివాస్, జయరాజు, యశపాల్ వంటి గాయకులు పాడుతుంటే వారు చాలా ఆనందపడ్డారు. అప్పుడు అన్ని సభల్లో ఇదేపాట చాలా ఉత్సాహంగా పాడేవారు.

వారికి ఉద్యమంలో బాగా నచ్చిన సంఘటన ఒకటి ఉన్నది. ఓసారి వారి దళం నేలకొండపల్లి పోరుబండలో రాత్రి మకాం వేసినపుడు రావెళ్ళ వారి తుపాకి కొరియర్ యానాది వెంకన్నకిచ్చి పడుకొన్నారట. మొత్తం 300 మంది నిజాం సైన్యం వారిని చుట్టు ముట్టారట. యానాది వెంకటన్న తుపాకి వదలి పారిపోతే రావెళ్ళ పై ఒకడు ఒక రౌండు కాల్చడంతో తూటా తగిలిందట. అయినా తుపాకి అందుకొని కాల్పులు జరిపారట. అవతలి వాళ్ళు ఎక్కువ మంది వాళ్ళ దగ్గర మంచి తుపాకులున్నాయి. అయినా తెగించి రావెళ్ళ వేంకట్రామారావు వాళ్ళను సూటిగా కాల్చి వాళ్ళ తుపాకి గుంజుకొని కాల్చి పారిపోయారట. అప్పుడు కొద్దిలో ప్రాణాపాయం తప్పిందట లేకపోతే బుల్లెట్ గుండెలో దూరేది.

వారి జీవితంలో విచిత్రమయిన విషయంగా ఒకటి చెప్పేవారు. అది రాజేశ్వర పురం కోట గురించి. ఆకోట రైతులకు బాగుండేది. కొండపల్లి కోట కర్ణాలది. మహారాష్ట్ర సెటిలర్స్ పెళ్ళికొడుకులను హత్య చేసి నిస్సంతులుగా 4 తరాలు పెత్తనం చేసారట అది ఆ కాలంలో విచిత్రం.

తెలంగాణ అనేది కోట్ల మంది ప్రజల కోరిక ఐక్యంగా పోరాడితే తెలంగాణ తొందరగనే రావచ్చు అనేవారు. వారి చివరి దశలో భార్య సుగుణమ్మతో తన స్వగ్రామం గోకినపల్లిలో ఒక చిన్న ఇంట్లో వుంటూ, పక్షవాతంతో బాధపడుతూ తెలంగాణ రాష్ట్రం కల నెరవేరక ముందే 10 డిశంబర్ 2013లో మరణించారు.

# 120 రావి నారాయణరెడ్డి

– డా॥ సుంకిరెడ్డి నారాయణరెడ్డి

రావి నారాయణ రెడ్డి గారిని నేను 30 సంవత్సరాల క్రితం కలిసాను. అప్పటికి ఆయన 70 యేండ్ల వయస్సులో కూడా మొహంలో తేజస్సు తగ్గని ఒక నాయకుడిలాగా కనిపించారు.

తెలంగాణ పేదరైతుల్లో శ్రమజీవుల్లో చైతన్యం కలిగించిన ప్రజానాయకుడు రావి నారాయణరెడ్డి. జాగీరుదారులు, భూస్వాములకు వ్యతిరేకంగా సాగిన పోరాటాలకు నాయకుడు. తెలంగాణ కమ్యూనిస్టు పార్టీలో అగ్రనాయకుడు.

చిత్తశుద్ధి, త్యాగం, ఆత్మార్పణ, ప్రజాభ్యుదయాన్ని కోరే దీక్షానిరతి, నిజాయితీని కలిగిన మహాపురుషుడు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని ముందుండి నడిపిన విప్లవవీరుడు రావి నారాయణ రెడ్డి.

ఆయన నలగొండ జిల్లా, భువనగిరి తాలూకా, గొల్లెపల్లి గ్రామంలో 1908 జూన్ 4వ తేదీన జన్మించారు. ఆయన తండ్రి రావి గోపాల్‌రెడ్డి, తల్లి వెంకటరావమ్మ. వారిది దొరల కుటుంబం. తల్లిదండ్రులకు ఆయన 14వ సంతానం. 12 సంవత్సరముల వయస్సు వచ్చేవరకు రావి నారాయణ రెడ్డి గొల్లెపల్లిలో విద్యాభ్యాసం చేశారు. భువనగిరిలోని మిడిల్ స్కూల్‌లో 4వ తరగతి చదివారు.

ఆ తరువాత ఆయన హైద్రాబాద్ లోని రెడ్డి విద్యార్థి వసతిగృహంలో చేరినారు. రెడ్డి హాస్టల్‌కు అనుబంధంగా వున్న మిడిల్ స్కూల్‌లో ఫస్ట్‌ఫోరమ్ చదివారు. చాదర్‌ఘాట్ లోని హైస్కూల్‌లో 1927లో మెట్రిక్యులేషన్ పాస్ అయి నిజాం కాలేజీలో ఇంటర్‌మీడియట్‌లో చేరారు.

అప్పటికే ఆయనకు ప్రజాసేవ చేయాలనే దృక్పథం వుండేది. అందుకే ఆయన స్కౌట్స్‌లో చేరారు నిజాం కళాశాలలో ఇంటర్ చదువుతున్న రోజుల్లోనే మహాత్మాగాంధీ ఆత్మకథ చదివి, జాతీయభావాల పట్ల ప్రభావితులయ్యారు.

ఆ తరువాత ఆ ప్రభావంతో ఆయన బద్దెం ఎల్లారెడ్డి తదితరులతో కలిసి కాకినాడ వెళ్ళి సత్యాగ్రహంలో పాల్గొన్నారు. ఆ ఉత్తేజంతోనే తమ ఊరు గొల్లెపల్లిలో ఖాదీ ఉత్పత్తి కేంద్రాన్ని స్థాపించి నూలు వడకడం, ఖద్దరు నేయడం వంటి నిర్మాణ కార్యక్రమాలు చేపట్టారు.

1933లో హైద్రాబాద్‌లో హరిజన సేవా సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఈ సంఘానికి వామన్‌నాయక్ అధ్యక్షుడుకాగా, రావి నారాయణరెడ్డి కార్యదర్శి. అస్పృశ్యతా నివారణ గురించి ప్రచారం చేయడం, సహపంక్తి భోజనాలతో ప్రజల విద్యావికాసానికి కృషి చేయడం ఈ సంఘం యొక్క లక్ష్యాలు.

హరిజనుల కోసం సుమారుగా 100 స్కూళ్ళను స్థాపించారు. తరువాత ఆ సంఘానికి అధ్యక్షుడు కూడా అయి 1938లో స్టేట్ కాంగ్రెస్‌లో చేరేదాకా కొనసాగారు. ఈలోగా 1921వ సంవత్సరంలో ఆంధ్రజన సంఘం ఏర్పడింది. ఒకవైపు విజ్ఞానాభివృద్ధి కోసం గ్రంథాల యోధ్యమాలు, రైతుల ఇక్కట్లు తొలగించడం కోసం రైతు

సంఘాలు, వ్యాపారుల పరిస్థితులు బాగుచేయడానికి వర్తక సంఘాలు నెలకొలిపినారు.

వెట్టిచాకిరికి వ్యతిరేకంగా తెలంగాణ పల్లెలు మేల్కొన్నాయి. ఆ రోజుల్లో అలుముకున్న గాంధాంధకారంలో కాంతిరేఖ ఆంధ్ర జన సంఘం. ఈ సంఘాలన్నింటికి ఒకే కేంద్ర సంఘం వుండాలన్న సంకల్పంతో 1930లో ఆంధ్ర మహాసభ ఏర్పడింది. యువ కార్యకర్తగా ఆంధ్రమహాసభల్లో 6వ సభవరకు కార్యకర్తగా పాల్గొని 1940 నాటి 7వ సభ నాటికి కీలక స్థానానికి వచ్చారు.

ఈలోగా నెహ్రూ ''డిస్కవరీ ఆఫ్ ఇండియా'' జయప్రకాష్ నారాయణ గారి "సోషలిజం ఎందుకు" రచనలు చదివి, సోషలిజం వైపు ఆకర్షితులైనారు. అప్రకటిత కమ్యూనిస్ట్ పార్టీలో 1939 చివరిలో సభ్యులు అయినారు. 1941 సంవత్సరంలో చిలుకూరు సభకు ఆయన అధ్యక్షుడైనారు. ఆ అధ్యక్షోపన్యాసంలో జాతీయ, అంతర్జాతీయ సమస్యలను ప్రస్థావించి తమ కమ్యూనిస్ట్ దృక్పథంతో తెలంగాణలో వున్నటువంటి స్థానిక సమస్యలను కూడా ప్రస్థావించారు. అప్పటిదాకా జరిగినటువంటి ఆంధ్ర మహాసభలకు భిన్నంగా ఇక్కడ రాజకీయ సమస్యలను ప్రస్థావించడం ఈ సభయొక్క విశేషం.

అప్పటివరకు సాంస్కృతిక కార్యక్రమాలకే పరిమిత మైనటువంటి ఆంధ్రమహాసభ అప్పటివరకు మహాధనులకు, విద్యార్థులకే పరిమితమైనటు వంటి ఆంధ్ర మహాసభ ఈ సభతో ప్రజా సమస్యల మీద దృష్టి పెట్టడమనేది గమనించ తగినటువంటి విశేషం. ఈలోగా బ్రిటీష్‌వారు 1935లో ఒక చట్టం తీసుకొచ్చారు. ఈ చట్టం ప్రకారం ఇతర రాష్ట్రాలలో ఎన్నికలు, మంత్రివర్గాలు ఏర్పడు తున్నాయి. ఆ ప్రభావంతో నిజాం రాష్ట్రంలో కూడా ఇటువంటి బాధ్యతాయుత ప్రభుత్వం రావాలనే ఆలోచన ఆనాటి నాయకులకు కలిగింది.

ఆ ఉద్దేశ్యంతోనే 1938లో స్టేట్ కాంగ్రెస్‌ను స్థాపించుకోవాలనే అభిప్రాయం రాష్ట్ర నాయకులకు కలిగింది. రావి నారాయణ రెడ్డి, బూర్గుల రామకృష్ణారావు మొదలగు వారితో సన్నాహక సంఘం కూడా ఏర్పాటు చేయడం జరిగింది. ఆ సంఘం నుంచి సత్యాగ్రహం చేయాలనే నిర్ణయం కూడా జరిగింది. అయితే ఆనాటి నిజాం నిరంకుశపాలనలో సత్యాగ్రహానికి మించి ఆలోచించడం కూడా సాధారణమైన విషయం కాదు. తెలంగాణలో సత్యాగ్రహం చేయడానికి ముందుకు వచ్చిన ఏకైక యువకుడు రావి నారాయణ రెడ్డి.

1938 నవంబరులో సుల్తాన్ బజారులో జరిగిన సత్యాగ్రహంలో ఆయన అరెస్ట్ అయి 2నెలలు జైలుకెళ్ళారు. సంస్థాన చరిత్రలో ప్రభుత్వ ఆజ్ఞలను ధిక్కరించడం ఒక సాహసం. ప్రభుత్వ ఆజ్ఞలను ధిక్కరించి ఈరకంగా సత్యాగ్రహ దళాలు జైలుకి వెళుతున్నాయన్న వార్త ప్రజలలో విశేష సంచలనాన్ని కలిగించింది. అయితే గాంధీ ఈ సత్యాగ్రహాన్ని ఆపించారు. ఈలోగా ఆంధ్ర మహాసభ కార్యక్రమాలు జరుగుతూనే వున్నాయి. 1944లో రావి నారాయణ రెడ్డి అధ్యక్షతన భువనగిరిలో జరిగిన ఆంధ్రమహాసభలో అతివాద, మితవాద వర్గాల మధ్య భిన్నమైన అభిప్రాయ భేదాలు వచ్చాయి. ఆ తరువాత ఆంధ్ర మహాసభ రెండుగా చీలిపోయింది.

ఒకటి జాతీయ ఆంధ్రమహాసభ, రెండవది రావి నారాయణరెడ్డిగారి నాయకత్వంలో ఉన్న కమ్యూనిస్ట్ ఆంధ్రమహాసభ. కమ్యూనిస్ట్ పార్టి నాయకత్వంలో తెలంగాణలో జరిగిన రైతాంగ సాయుధ పోరాటం భూస్వామి వర్గాలకు వెన్నులో చలి పుట్టించింది. రైతులను జాగృతం చేయడంలో ఆపార్టీ జరిపిన కృషి తెలంగాణలో చారిత్రాత్మకమైంది.

భూస్వాముల ఆగడాలకు అడ్డుకట్టవేయాలంటే పోరాటం తప్ప వేరే మార్గం లేదని ఆంధ్ర మహాసభ అభిప్రాయపడింది. గెరిల్లా యుద్ధం ప్రారంభించాలని తెలంగాణ రథసారథి రావి నారాయణ రెడ్డి కమ్యూనిస్ట్ పార్టీలోపల వున్న బి.ఎన్. రెడ్డి, బద్దం ఎల్లారెడ్డి మొదలగువారు పోరాటం చేయాలని నిర్ణయించారు.

ఈ నాయకుల పిలుపు మేరకు తెలంగాణలో సాయుధ పోరాటం ఉధృతంగా ముందుకు సాగింది. బ్రహ్మాండమైన ఈ పోరాటానికి రావి నారాయణరెడ్డి నాయకత్వం వహించారు. భారత స్వాతంత్ర్య సమరంలో తెలంగాణ సాయుధ పోరాటం సువర్ణాక్షరాలతో లిఖింప తగింది. ప్రపంచవ్యాప్తంగా ఈ పోరాటం ప్రఖ్యాతిగాంచింది. కమ్యూనిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ పోరాటం ఉధృతంగా ముందుకు సాగుతుంటే భయాందోళనకు గురైన నిజాం ప్రభుత్వం 1946 నవంబరులో కమ్యూనిస్ట్ పార్టీని

నిషేధించింది. 1946 నుండి 1951 వరకు జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి రావి నారాయణరెడ్డి నాయకత్వం వహించారు.

1948 సెప్టెంబరు వరకు నైజాం పోలీసులు - ప్రజాకారులకు వ్యతిరేకంగా బ్రహ్మాండమైన పోరాటం జరిగింది. పోలీసు చర్య తరువాత కూడా ఈ పోరాటాన్ని కొనసాగించాలనే వాదనని రావి నారాయణరెడ్డి తిరస్కరించారు.

సోషలిస్టు సమాజ స్థాపనకు హింసావాదమే ఏకైక లక్ష్యమన్న పిడివాదాన్ని ఆయన అంగీకరించలేదు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పోలీసు చర్యకంటే ముందు తక్కువమంది ప్రజలు మరణించారని, ప్రజలు వారిని సమయస్ఫూర్తితో కాపాడు కున్నారని నారాయణ రెడ్డి అభిప్రాయ పడ్డారు.

పోలీసు చర్య తరువాత పార్టీ సభ్యులు, ముఖ్య నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో మరణించారని ఇది యదార్థ సత్యమని నారాయణ రెడ్డి పలు సందర్భాలలో వ్యాఖ్యానించారు. యూనియన్ ప్రభుత్వ బలగాలు రంగంలోకి దిగినపుడు పోరాటాన్ని నిలిపివేస్తే పార్టీకి ఎక్కువ నష్టం జరిగేది కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఏమైతేనేమి 1951లో పోరాటాన్ని నిలిపివేయక తప్పలేదు.

పోరాటాన్ని ఆపినప్పటికి హోలిస్టిక్‌గా తరువాత జరిగిన సాయుధ పోరాటం గురించి, జరిగిన నష్టం గురించి, కోల్పోయిన పార్టీ క్యాడర్ గురించి పార్టీ వేదికపై చర్చించక పోవడాన్ని కూడా రావి నారాయణ రెడ్డిగారు తప్పుపట్టారు.

హైద్రాబాద్ సంస్థానంలో వయోజన ఓటింగ్ ఆధారంగా ప్రజాస్వామిక ప్రభుత్వం స్థాపించటానికి ఈ పోరాటమే కారణ భూతమైంది. వెట్టిచాకిరి నుండి ప్రజలకు విముక్తి లభించడానికి, అక్కన్నదేవి వసూళ్ళు పోవడానికి ఈ పోరాటమే కారణం. తెలంగాణ సాయుధ పోరాటమే భూ సంస్కరణలు ప్రవేశపెట్టడానికి బాటలు వేసిందని రావి నారాయణ రెడ్డి అన్నారు.

భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేని ఒక అభ్యుదయ కౌలుదారి చట్టం ఇక్కడ ప్రవేశ పెట్టడం కూడా ఈ పోరాట ఫలితమే. ఈ పోరాటం ద్వారా దాదాపు 10 లక్షల ఎకరాల భూమి పేదరైతుల స్వాధీనమైంది. రైతుల నుండి అక్రమంగా భూస్వాములు లాక్కున్న భూములను తిరిగి రైతులు స్వాధీనం చేసుకున్నారు.

ఉద్యమనేత, సాయుధ పోరాటయోధులకు తల మానికంగా నిలిచారు రావి నారాయణ రెడ్డి. ఆయన కేవలం సిద్ధాంతాలకు మాత్రమే పరిమితం కాలేదు ఆయన. తండ్రి 3వేల ఎకరాల భూస్వామి. అతనికి నలుగురు కొడుకులు. రావి నారాయణ రెడ్డిగారు తనవంతుగా 700 ఎకరాల భూమివస్తే, అందులోనుంచి 500 ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేసారు. అంతటి ఉత్తమ సంస్కారుడు రావి నారాయణ రెడ్డి. ఈ సందర్భంలో ఆయన 5 సంవత్సరాల జైలు, రహస్య నిర్భంధాలను అనుభవించారు. ఈలోగా 1952లో జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికల్లో నలగొండ పార్టీ నియోజకవర్గంలో పోటీచేసి భారతావని మొత్తంమీద ఏ వ్యక్తికి రానటువంటి అతిపెద్ద మెజారిటీతో ఎన్నికై భారత ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ద్వారా పార్లమెంటులో ఘనసన్మానం పొందారు.

1957 ఎన్నికల్లో భువనగిరి నుంచి శాసనసభకు ఎన్నికై ప్రతిపక్ష నాయకుడిగా తన బాధ్యతలను సమర్ధ వంతంగా నిర్వర్తించారు. 1962లో కూడా తిరిగి భువనగిరి నుండి పోటీ చేసి శాసన సభకు ఎన్నికయ్యారు.

ఒక సందర్భంలో సొంత తన బావమరిదితో పోటీచేసి, తన బావమరిదిని లెక్కచేయకుండా ఆయనమీద అఖండమైన మెజారిటి సాధించి ఎన్నికైనారు.

చివరగా ఆయన 1967 నుండి స్వచ్ఛందంగా రాజకీయాల నుండి నిష్క్రమించారు. తెలంగాణలో మొదటి నుంచి చివరిదాకా తాను నమ్ముకున్నటువంటి సిద్ధాంతాలకు నిబద్ధుడై దానికి కట్టుబడి జీవితాంతం రాజకీయాలతో వున్నటువంటి నిష్కల్మష హృదయుడు రావి నారాయణ రెడ్డి.

# 121 సదాశివుడు

– వఝుల శివకుమార్

తెలంగాణ బీళ్ళను తడిపిన గోదారి పాట సదాశివుడు

"తలాపునా పారుతుంది గోదారి, నీ చేనూ, నీ చెలుకా ఎడారి, రైతన్నా! నీ బతుకు అమాస, నీ చుట్టూ సిరులు ఉన్నా నికేది దక్కదన్నా / నీ చేతిలోని బువ్వే నీ నోటి కందదన్నా / చేతికి మూతికి నడుమ గీత గీసిరన్నా / మోసపోతివన్న అరిగోసపడితివన్నా "అంటూ ఆయన రాసిన పాట ఉద్యమానికి ఊపిరి పనిచేసింది. ఆ పాటే అందరినీ ఆలోచింపజేసే పోరు బాటైంది. ఆయన పాట దగాపడ్డ తెలంగాణ పల్లె జీవితాల చిత్రికైంది. నీళ్ళు, నిధులున్నా తెలంగాణలో ఎందుకు బతుకలేకపోతున్నామో... మోసం చేసిందెవరో తన కవిత్వం, పాటలతో ప్రజల్ని చైతన్యవంతం చేశారు.

తలాపున గోదావరి పారుతున్నా తెలంగాణ గొంతెండు తున్న తీరును తన గొంతెత్తి పాడిన గాయకుడు. ఎండి బీటలు వారిన తెలంగాణ బీళ్లను చూసి కన్నీళ్ళను సిరా చుక్కగా మార్చి పాలకులను ప్రశ్నించిన కవిగాయకుడు. బతికినంతకాలం తెలంగాణను పలవరించి, మన పాలన మనకే కావాలని నినదించిన ఉద్యమకారుడు అతని పాటలు విముక్తి ఉద్యమ సాంస్కృతిక కార్యాచరణకు చుక్కానిలా పని చేసినాయ్.

ఆయనే కీ.శే. మల్లావఝుల సదాశివుడు. ఉత్తర తెలంగాణా పారిశ్రామిక ప్రాంతమైన గోదావరిఖని నుంచి పాటల శివుడిగా ప్రసిద్ధుడైన ఆయన తన రాతలనిండా జనసామాన్యం వాడుక భాషలో, చిన్న చిన్న పదాలతో లోతైన భావాలను అగ్ని కీలలలాంటి భావనలను పలికించారు. పాఠశాలలోనూ పాటల శాలలోనూ తన గురువు స్వర్గీయ చొప్పకట్ల చంద్రమౌళి అని, తన పాటలో తడీ, తండ్లాట, మార్దవం తెలంగాణా మట్టి పెట్టిన భిక్షే అని సవినయంగా చెప్పుకునేవాడాయన. సమాజాన్ని చూసి చేతనైనంతచేసి పాట రాసి పల్లవించమన్న ఒక ప్రజాపోరాటయోధుని మాటనే బాటగా కదిలి, అతనిచ్చిన చూపుతోనే సమాజాన్ని చూసి సంక్షోభాల మూలాలను గ్రహించి ప్రజల పాటై నినదించిన ప్రజా చైతన్య స్వరం సదాశివుడు.

తెలంగాణ అనే పదాన్ని ఉచ్చరించడానికి సైతం వెనుకాడుతున్న కాలంలో నిర్బంధాన్ని ధిక్కరించి నీటి వాటా పంపిణీలో జరుగుతున్న అన్యాయాలమీద పాటను ఎక్కుపెట్టి తన తెగువను ప్రదర్శించిన కవి, గాయకుడు, బడిపంతులే అయినా, కష్టాల చీకట్లలో కూరుకుపోయి ఉన్నా, తాను బలహీనుడిని కాదూ, కలం గళం సంధించిన సంపూర్ణ మానవుడిని అని సగర్వంగా ప్రకటించుకున్నా తెలంగాణా తల్లి గుండె చప్పుడు ఆయన.

మలిదశ ఉద్యమానికి సాంస్కృతిక ప్రేరణలేని సమయంలో ఆయన పాటే ఉద్యమానికి చుక్కానిలా పనిచేసిందనడంలో ఎలాంటి సందేహం లేదు.

ఆయన పాట దగాపడ్డ తెలంగాణ పల్లె జీవితాల చిత్రికైంది. నీళ్ళు, నిధులున్నా తెలంగాణలో ఎందుకు బతుకలేకపోతున్నామో, మోసం చేసిందెవరో తన కవిత్వం, పాటలతో ప్రజల్ని చైతన్యం చేశారు. సదాశివుడు పుట్టింది 02-09-1943న కరీంనగర్ జిల్లా (నేడు పెద్దపల్లి జిల్లా) రామగుండం మండలంలోని మురుమూర్ గ్రామంలో తండ్రి వెంకట క్రిష్ణయ్య తల్లి లక్ష్మీనరసమ్మ. వృత్తిరీత్యా ప్రభుత్వ ఉపాధ్యాయుడైనా అప్పటి సామాజిక పరిస్థితుల్లో విప్లవ మార్గం పట్టి రైతుకూలీ పోరాటాలు, యువజన సంఘాల నిర్మాణంలో కీలక పాత్ర వహించారు. అనంతరం సామాజిక ఉద్యమాల్లో కొనసాగుతూనే ఉపాధ్యాయ సంఘాల నాయకత్వాన్ని కూడా కొనసాగించారు.

20 ఏళ్ళ పాటు విప్లవ, అభ్యుదయ గీతాలెన్నింటికో ఊపిరి పోశారు. ఆయన పాటలు నాటి పాలకులు తీరును ప్రశ్నించినవే. వలస బతుకుల వలపోతకు అద్దంపట్టినట్టు ఆయన రచించి, గానం చేసిన "ఏమున్నదక్కో... ఈ ఊళ్ళే మనకింక ఏమున్నదక్కా.. ఇళ్ళు సర్దుకున్న... ముల్లె సర్దుకున్న ఎళ్ళిపోతావున్నా ఈ ఊళ్ళే మనకింక ఏమున్నదక్కా" ఈ పాట వినని తెలుగోడు ఉండడు. ఆర్. నారాయణమూర్తి ఎర్రసైన్యం కోసం సదాశివుడు రాసిన ఈ పాట దిక్కులేని పక్షుల్లా వలసపోయే తెలంగాణా రైతుల వెతలను కట్టింది.

ఈ పాట గురించి చెప్పుతూ నేనూ ఊరు విడిచి ముల్లె సదురుకొని బయల్దేరిన్నాడు ఏ మట్టిమీది మమకారం తన గాత్రాన్ని గద్గదం చేసిందో ఆ మమకారమే తన పాటకు అశ్రులిపిగా అమరిందని ఇవాళ ఆ వేదనే వలసల దుఃఖంగా ప్రవహించిందని అంటాడు. దళారులు తమ దోపిడీ విధానాల కింద స్వార్థ రాజకీయల అండతో అప్పుకింద భూమిని, ఇళ్ళనూ లాక్కుంటే అన్నీ పోగొట్టుకున్న రైతు గుండెకోత పాట నిలువెల్లా కన్నీటిసెగై కమ్ముకున్నది అంటాడు.

అంతేకాక "జాబిలమ్మకు జిలుగు పోగుల దుప్పటి కప్పిన చేతులివి" అంటూ చేనేత కార్మికుల జీవనశైలిని అర్థంగా వర్ణించాడాయన. వరకట్న రక్కసి కోరలకు బలవుతున్న ఆడబిడ్డల చూసి కళ్ళు చెమర్చాడాయన. చిన్న వయస్సులోనే తనువు చాలిస్తున్న అబలలను చూసి "పారాణి ఆరలేదు చెల్లెలా... అప్పుడే నూరేళ్ళు నిండాయా చెల్లెలా?" అని అన్నగా ఆక్రోశించాడు. ఇలా ఒక్కటని కాదు ఆయన పాటలన్నీ వినేవారి గుండెకు సూటిగా గుచ్చుకుంటాయి. ఆలోచనలు రగిలిస్తాయ్. ఆయన పాటల్లోని పల్లె వాతా వరణం పల్లె ఆత్మకు అద్దంపడుతాది, పల్లె పాయిరానికి పాదాలు కడుగుతాది.

బతుకు తత్వాలను బతుకమ్మ జెప్పంగా పల్లె పాడిన పచ్చ పచ్చని పాటకు ఆనవాలు తానై ప్రతిధ్వనించిండు.

గత పాలకుల పన్నాగాలను ఎండగడుతూ "ఇంకుడు గుంతల ఇగురుంజెప్పవ్ అన్నో ఓరన్నా! మా చెరువు కుంటలను మింగిందెవరో చెప్పవేందిరోరన్నా! అంటాడు. రైతులూ, చేనేత కార్మికులూ, కూలీలూ, కష్టాలు పడుతున్న స్త్రీలూ, బాల కార్మికులూ, పల్లెలూ, రాజ్యం దౌష్ట్యానికి బలైన ఎందరో అమరులు సదాశివుడి పాటల్లో ప్రాణమున్న చరణాలైండ్రు.

వరంగల్ జనార్దన్‌కు స్మృతిగీతాన్ని సమర్పిస్తూ" మహర్షీ నా తెలంగాణా వాల్మీకీ! వలసవాదం అణచివేత ఇంకానా ఇకపై సాగవంటూ యుద్ధం ప్రకటించి / నేలకొరిగిన వీరుడా! పరాజితుల కోసం సాగిన నీ పాట మా దగ్గర స్వరంజీవిగా ఉంది / అది గాలై ఏరై హోరై / అంతటా విస్తరిస్తోంది... మా కోటి రతనాల వీణపై కదన కుతూహలమై మోగుతుంది / అంటూ ఆయన దీక్షను తన గొంతుకెత్తుకొని ఉద్యమ ప్రస్థానానికి పునరంకితమౌతాడు. తన పాటలను అభిమానించిన కాళోజీ, శివసాగర్‌ల వంటి మహాకవులతో ప్రేమగా శివుడూ అని పిలిపించుకుని తనదైన నడకను సార్థకం చేసుకున్నాడు.

కేవలం ఉద్యమ పాటలే కాకుండా 90వ దశకంలో కరీంనగర్ జిల్లాలో చేపట్టిన అక్షరాస్యత కార్యక్రమం అక్షర ఉజ్వల కోసం ఆయన ఎన్నో పాటలు రాశారు. రాయడమే కాకుండా కంచుకంఠం లాంటి ఆయన గొంతుతో ఎన్నో వేదికల మీద స్వయంగా ఆలపించాడు. పారిశ్రామిక ప్రాంతంలో మరియు ఉత్తర తెలంగాణా పల్లెల్లో, కాలనీల్లో

వర్ధుల శివకుమార్‌తో కలిసి ఔత్సాహికులైన ఏలేశ్వరం వెంకటేశ్వర్లు వంటి యువకులను ప్రోత్సహించి వారి సహకారంతో పలు సాహిత్య సాంస్కృతిక సంస్థల స్థాపనలో ముఖ్య భూమికను పోషించాడు. గ్రంథాలయోద్యమంలో చురుకుగా పాల్గొని ఊరూరా నిర్వహింపబడిన గ్రంథాలయ సభల్లో స్ఫూర్తివంతమైన తన ప్రసంగాలతో ప్రజలలో చైతన్య బీజాలు నాటారు.

స్వయంగా ప్రజా సాంస్కృతికోద్యమ నిర్మాణంలో భాగంగా చేతన సాహితి సాంస్కృతిక సమాఖ్యను స్థాపించి ఎందరో గాయనీ గాయకులను తీర్చిదిద్దారు. పారిశ్రామిక ప్రాంతంలోని ఎందరో ప్రసిద్ధ గాయకుల గొంతుల్లో పాటలై పరవళ్ళు తొక్కాడు.

సదాశివుడు రాసిన పాటలను ఎర్రకుంకుమ పేరుతో ఆడియో క్యాసెట్, పుస్తకం, సైరన్ పేరుతో ఆయన కవితలను పుస్తక రూపంలోకి తీసుకువచ్చారు. ఎర్రకుంకుమతో పాటై పోటెత్తిన శివుడు కాలేరన్నల నిత్యఘర్షణలనూ, స్వేదనదుల్లో తడిపి ఆరేసుకుంటున్న బండకిందిబతుకుల పెనుగులాటలనూ తన కవితా స్వరాలుగా ఈ సైరన్ కవితా సంపుటిలోనూ మోగించాడు. తెలంగాణా నేల విముక్తి కోసం పాటను ఉద్యమ బాటగా స్వీకరించి కలమెత్తి కవనమై, గొంతెత్తి నాదమైన ఈ కవి గాయక యోధుడు 2005 నవంబర్ 25న ఆకస్మికంగా తనువు చాలించాడు.

మనకు అమూల్యమైన తన పాటలను, కవితలనూ వదిలి ఆయన గొంతు మూగబోయింది. ఆయన పాట మాత్రం ఉద్యమమై తెలంగాణను మోసుకొచ్చింది.

పల్లె గొంతు పెగిలితే పాట
నేల చెమ్మగిల్లితే పాట ఆ పాటే సదాశివుడు
ఎన్నెల కోనల ఊపిరి ధారలమీద
అక్షరాల అగ్ని కణం సదాశివుడు
కాలేరన్నల దిగులు చీకట్లమీద
జ్వలత్ కవనాల జైత్రయాత్ర సదాశివుడు.

2007 నుంచి ప్రతి ఏడాది సదాశివ స్మారక అవార్డులను సాంస్కృతిక రంగంలో రాణిస్తున్న వారికి అందజేస్తున్నారు. గోదావరిఖని కేంద్రంగా సదాశివుడి సంస్మరణ కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రతి ఏడాది ఒక సాహితీ మూర్తిని ఆయన స్మారక అవార్డుతో సత్కరిస్తున్నారు.

# 122 సాహు

– అన్నవరం దేవేందర్

ఆయన గోండు గూడెం వెలుగురేక. గిరిజనుల గుండె చప్పుడు. గిరిజనుల చరిత్రను లోకానికి అందించిన దార్శానికుడు అడవిలో వెలుగులు పంచిన సూర్యుడు ఆయన సాహు ఈ మారు పేరే గోండు భాషకుచెందినది అసలు పేరు శనిగరం వెంకటేశ్వర్లు ఆయన కవి రచయిత ఉద్యమకారుడు. ఇతడు వెలుగునాట ఆ మాటకువస్తే అందరికీ పరిచయమైన 'కుమ్రం భీం' చరిత్రను గిరిజనుల మౌఖిక గాథల్లోంచి వెలికి తీసి అందించిన వారిలో ఆయన సహరచయిత. మరో కుమ్రం భీం నవలను సాహు, అల్లం రాజయ్యలు కల్సి 1984లో వెలువరించారు.

ఉద్యమాల్లో ఉండి గొప్ప సాహిత్యం సృష్టించినవారు అందరూ సాహిత్య చరిత్రలో ప్రాచుర్యం పొందకపోవచ్చు. ఎందుకంటే వాళ్ళకు రచనలే అసలు పనికాదు. అసలు వృత్తి ఉద్యమం. అందునా రహస్యోద్యయం. ఆ కారణాల వల్ల పాటలు కళలకు సాహిత్య ప్రవంతికి కొంచెం తక్కువగానే తెలుస్తాయి. సాహు కథలు రాసిండు, పాటలు రాసిండు. తెలుగు, గోండు, హిందీ భాషల్లోనూ రాసి పాడిన గాయకుడు.

"నీ కన్నీరు నా కన్నీరు
కలిగినోల్లకు పన్నీరాయె
ఒంటిగ నువ్వే శోకం పెడితే
ఎట్లా చిన్న తమ్మయా!"

అని ఆయన రాసి పాడిన పాటలు 1980 దశకంలో ఊరూర ఉద్యమ వేదికల మీద అందరూ పాడుకున్నారు. ఇదేకాకుండా వెట్టిచాకిరి బానిసత్వంకు వ్యతిరేకంగా జరిగి ఆందోళనల్లో పాటలీ ప్రధానం పాటలు జనం భాషలో బాణిని పట్టుకొని ఆకట్టుకుంటాయి. ఆ పాటల్లో సమస్య పోరాటం పరిష్కారం ఉండవచ్చు అందువల్ల జానపద జనం బాణీల్లో ఉన్న సాహిత్యం విస్తృతమయింది. అట్లనే

"పొదల పొదల గట్ల నడుమ
పొడిచెనొక్క చందమామ
కొమురెల్లి కొండల్లోనా! ఓ రాజన్న
కొలిమి అంటుకున్నదిరో... ఓ రాజన్న"

ఈ పాట ఆ కాలంలో రేతు కూలి సంఘాల విద్యార్థి సంఘాల్లో సభల్లో ఊరురిల్లో పాడేవారు. ఆ కాలంలో ఈ పాటలు ఎవరు రాసిండ్రో కూడా పేరు ప్రచారం అయ్యేది కాదు జన నాట్యమండలి పాటలుగా ప్రసిద్ధమయ్యేవి. అనంతర కాలంలో ఇవి సాహు రాసిన పాటలు అనే విషయం అవగాహనకు వచ్చేది.

ఇట్లా సాహు అనేక పాటలు రాసినాడు. ఇంద్రవెల్లిలో గిరిజనుల సభ మీద కాల్పుల అనంతరం 'రగల్‌జెండా' అనే నృత్య రూపకం రూపొందించి కూడా సాహు ఈ ప్రదర్శన మొత్తం ఆదివాసీలపై జరుగుతున్న దోపిడి అంసాలు

త్యాగాలపై అక్కడ జరుగుతున్న నైజాన్ని కళ్ళకు కట్టినట్లు రూపొందించారు. ఈ 'రగల్‌జెండా' వందలుకాదు ఆరోజుల్లో వేలాది ప్రదర్శనలు జరిగాయి.

సాహు అసలు పేరు శనిగరం వెంకటేశ్వర్లు కరీంనగర్ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని మాణిక్యాపూర్‌లో 1955 అక్టోబర్ 2 గాంధీ మహాత్ముని జన్మదినంనాడే జన్మించారు. ఆయన తండ్రి స్వాతంత్ర్య సమరయోధుడు. నైజాం వ్యతిరేక పోరాటంలో గాంధేయ వర్గం అవలంబించిన మహనీయుడు. మాణిక్యాపూర్ గ్రామమే మొత్తం స్వాతంత్ర్య పోరాట వారసత్వం పుణికిపుచ్చుకున్నది. అక్కడి నుంచి ఎంతోమంది పూర్తిస్థాయి ఉద్యమ కార్యకర్తలుగా జీవితాల్ని త్యాగం చేసినవారున్నారు. వెరసి సాహు పూర్తిస్థాయి రాజకీయ జీవితంలోకి వెళ్ళి మనకు 'కొమురంభీం'ను అందించిన రచయిత.

1980కి ముందు మనందరికీ మన్యంలో అల్లూరి సీతారామరాజు గురించే తెలుసుకాని మన నేలమీదనే నిజం రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడిన ఆదిలాబాద్ జిల్లాకు చెందిన కొమురంభీం గుర్చి తెలియదు. ఇప్పుడైతే పాఠ్యపుస్తకాల్లో ప్రభుత్వ రికార్డుల్లో ఆదివాసి గిరిజన వీరున్ని తలచుకొని గౌరవిస్తున్నాం. అసలు కొమురంభీం గూర్చి ప్రపంచానికి సాహు, అల్ల రాజయ్యలు రాసిన నవలద్వారానే తెల్సింది. సాహు అజ్ఞాత జీవితంలో ఉండగా గొండు భాష నేర్చుకున్నారు.

1979 ప్రాంతంలో ఆదిలాబాద్ అడవుల్లో అజ్ఞాతంలో ఉన్న క్రమంలో 'భీం' పోరాటం గూర్చి మాట్లాడుకోవడం విన్నాడు. ఆయనకు అప్పటికే గొండు భాష తెల్సుకాబట్టి ఒక రచయితగా పరిశోధకుడుగా ఆయన పుట్టింది, పెరిగింది, పోరాటం చేసింది, ఆయా గోండు నాయకుల ద్వార కొమురంభీ. వారసుల ద్వారా రీసెర్చి చేసిండు. ప్రఖ్యాత కథ, నవలా రచయిత అల్లం రాజయ్యతో చంద్ర పంచుకున్న ఇద్దరూ కల్సి నవలకు శ్రీకారం చుట్టింద్రు. ఇది 1983లో పుస్తకంగా బయటకు వచ్చింది. కొమురంభీం 1940లోనే అమరుడయ్యిండు. ఆనాటి పచ్చ పచ్చ జ్ఞాపకాల చరిత్రను వెలికితీసిన తర్వాత ఆయన ఆదివాసుల హక్కుల కోసం రాజ్యంపై తుపాకితో యుద్ధం చేసిన చరిత్రగా లోకానికి తెల్సింది. అనంతరం ఇదే కథ సినిమాగా కూడ వచ్చింది. ఇప్పుడు కొమురంభీం విగ్రహాలు అంతటా కన్పిస్తున్నాయి.

సాహు, అల్లం రాజయ్య వెలికి తీసిన చరిత్రాత్మకమైన చరిత్ర ఇది. ఇది గాకుండా సాహు ఎన్నో కథలు రాసిండు. కరీంనగర్ బుక్‌ట్రస్ట్‌వారు 1985లో వెలువరించిన 'అడవిలో వెన్నెల' కథా సంకలనంలో కన్నీటి నీటికథ, పెళ్ళికావాలి, కాయిదా, సాంప్రదాయం, ఐదు రూపాయల కథ, భూమి కొరకు, రక్తపింజెర, జెండా కథ, ఆకలి, మరడ్‌యడుం పాయం. నిర్ణయం కథలు ప్రఖ్యాతమైనవి. ఇవి కథలు అనే కంటే ఆదివాసి జీవితాలు అంటే బాగుంటుంది.

సాహు విద్యార్థిదశలో ఉన్నప్పుడే విప్లవ రాజకీయ అవగాహన ఏర్పరుచుకున్నాడు. 1975లో హుజురాబాద్‌లో 'జనసాహితీ' సంస్థను ఆవునూరి సమ్మయ్య, నరెడ్ల శ్రీనివాస్ తదితర మిత్రులతో కల్సి స్థాపించారు 1975లోనే మహా కవి శ్రీశ్రీని హుజూరాబాద్‌కు ఆహ్వానంచి బహిరంగ సభ ఏర్పాటు చేశారు. అదే సభలో శ్రీశ్రీ ఊగరా ఊగరా ఊరి కొయ్యందుకొని ఊగరా అనే పాటను రాసి పాడారు. హుజురాబాద్ పురవీధులగుండా సాహు, ఆవునూరి సమ్మయ్య తదితరులు ఊరేగింపు తీసారు. అనంతరం సాహు విప్లవరాజకీయల్లోకిపోయి 1976లో 'మీసా' చట్టం కింద డిటెన్యూ అయి జైలుశిక్ష అనుభవించాడు. తిరిగి బెయిలుపై 1977లో బయటికి వచ్చారు. హుస్నాబాద్ ప్రాంతంలో అడవిలోకి వెళ్ళారు. అప్పుడే అడవిలో 'గొండు' భాషను అభ్యసించాడు.

జైలు జీవితంపై కూడా సాహు ఎన్నో కథలు రాసారు. జైలులో 'బందీ' అనే రాత పత్రికను వెలువరించారు. ఇంద్రవెల్లిలో గిరిజనులపై పోలీసు కాల్పుల అనంతరం 'రగల్‌జెండా' అనే బ్యాలెను రచించారు. రగల్‌జెండా బ్యాలెను దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో జన నాట్యమండలి ప్రదర్శించింది. సాహు తెలుగు, హిందీ, గోండు భాషలోనూ పాటలు రాశారు. రెండవసారి ఆదిలాబాద్‌లో 1983లో అరెస్ట్ అయి వరంగల్, విశాఖపట్నం జైల్లలో గడిపారు. జైలు నుంచి 1988 లో విడుదల అయ్యేవరకు విరసం సభ్యునిగా కొనసాగారు.

సాహు అనంతరం బి.యస్. రాములుకు విప్లవ ఉద్యమాల సాహిత్యంపైన సామాజిక స్థితిగతుల లోటుపాట్లపై ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇందులో ఆయన విభేదిస్తున్న అంశాలను ఏ కరువుపెట్టారు.

సాహు ఆదివాసి ప్రజల గుండెల చప్పుడు. గిరిజనుల్లో వెలుగు నింపేందుకు వాళ్ల భాషలోనే ఆడి పాడి మాట్లడి ఆ చరిత్రలో లీనమయిన సాహు సాహసి. చరిత్రకారుడు చరిత్ర నిర్మాత.

1993 మార్చి 16న సాహు గుండె పోటుతో మాణిక్యాపూరం గ్రామంలోనే కన్ను మూసాడు. అయితే ఆయన ‘కొమురంభీం’ జీవిత చరిత్రను వెలికితీసిన రచయితగ గొప్ప పాటల రచయితగా తెలుగు సమాజంలో సాహిత్యంలో పేరెన్నికగన్నాడు. సాహు ఒక వ్యక్తికాదు ఆదివాసుల శక్తి. అతడు తెలంగాణ వైభవానికి స్థంభం వంటివాడు.

# 123 సైబ పరంధాములు

– కందాళై రాఘవాచార్య

పెద్దబజారు చిన్నసందులోని కళాత్మకమైన దర్వాజా లోంచి సన్నగా – సన్నని నడిమి పాపిట ఒత్తైన వెంట్రుకలతో, చేతిలో ఎన్నో పుస్తకాలతో స్టూడియో 'ఆకృతి'కి నడిచి వెళ్తుంటే కళా సెలయేరు పారుతున్నట్లనిపిస్తుండేది... ఆ కళామూర్తే సైబ పరంధాములు.

కీ.శే. సైబ పరంధాములు, శ్రీ సైబ లింయ్య, శ్రీమతి గంగూబాయి దంపతులకు 08-4-1945న నిజామాబాద్ నగరంలో జన్మించారు.

అప్పటి మల్టీపర్పస్‌లో చదివి గోల్డ్‌మెడల్ సంపాదించారు. అనారోగ్య కారణాల వల్ల బి.టెక్. పూర్తి చేయలేక పోయారు. ఇది ఒకవైపు వారి శారీరక కోణం. కాని వారి అంతరాంతరాల్లో అనేక కళలు సజీవంగా నడుస్తూ ఉండేవి.

కొంతకాలం శ్రీరాధాకృష్ణ విద్యాలయం ఎయిడెడ్ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నా వారి అనంతమైన కళాజీవనానిక ఆ వృత్తి కట్టేసినట్లుగా అనిపించింది. తానే స్వయంగా 'ఆకృతి' స్టూడియోను ప్రారంభించారు.

పూసలగల్లి – జవహరురోడ్‌లో ఉండే ఆ స్టూడియో, కళాకారులను, చిత్రకారులకు, కవులకు కూడలైంది. 'ఆకృతి'ని అందరి చిరునామాగా మార్చివేసిన కళామూర్తి సైబ. మనిషిలో ఒక కళ ఉంటేనే ఎంతో గొప్ప. సైబ పరంధాములులో కవిత్వం, చిత్రకళ, ఫోటోగ్రఫి, నఖచిత్రం, శిల్పం ఇలా అన్ని కళలు పూర్ణమై ఉన్నాయి.

1969 మకరసంక్రాంతి 14న ప్రారంభమైన ఇందూరు భారతి మూలస్తంభాలలో వీరు ముఖ్యులు. ఇందూరు భారతి ద్వారా 'చౌరస్తా' కవితా సంకలనానికి వీరు చిత్రాలు గీశారు. ఇది సాహితీ చరిత్రలో అపూర్వఘట్టం. చౌరస్తా కవులని తెలునాట సైబ, ఎ. సూర్యప్రకాష్, బద్దూరి నరసింహం, శ్రీపాద స్వాతి సుప్రసిద్ధులు.

వీరి ఇంట్లోనే గ్రంథాలయం ఏర్పాటు చేశారు. యువ కవులకు కొత్త కొత్త కవితా సంకనాలు ఇక్కడి నుండే ప్రాప్తించేవి. అనేక మంది కవులకు మార్గదర్శకత్వం వహించేవారు. ఇందూరు భారతి అనేక గ్రంథాలకూ సైబ గీసిన బొమ్మలే ముఖ్యచిత్రాలు. చూస్తుండగానే మనిషి ముఖాకృతిని క్షణంలో పెన్సిల్‌తో చిత్రించేవారు.

టౌను హాలులో జుగల్‌బంది ఉత్సవంలో ఒక కళాకారుడు తబలా వాయిస్తుంటే దానికనుగుణంగా చిత్రాలు పెయింట్ చేశారు. ఈ అద్భుత చిత్రాలు ఇప్పటికి నిజామాబాద్ ఎఫ్.ఎమ్. ఆకాశవాణి కేంద్రంలో కుడ్య చిత్రాలుగా మనకు సైబను జ్ఞాపకం చేస్తాయి. అనాటి ఉత్సవానికి కలెక్టర్ శంకరన్ విచ్చేసి సైబను అభినందించారు.

సైబసార్ గీసిన నిలువెత్తు గాంధీగారి ఫోటో అప్పట్లో వ్యాపారవేత్త వెలాస్య సాయిరెడ్డి కొన్ని వేలకు దక్కించుకున్నారు. చాలా కాలం శాంతినివాస్ లాడ్జ్‌లో ఎదురుగా ఉండేది. కవి మిత్రులు వచ్చినప్పుడు సైబ పెయింట్ చేసిన

గాంధీగారి అద్భుత కళా ఖండాన్ని చూపించేవాళ్లం. ఇక ఫోటోగ్రఫీ అంటే సైబకు ఆరవ ప్రాణమే. దానిని వ్యాపారంగా భావించక ప్రవృత్తిగానే స్వీకరించేవారు. పెండ్లిళ్లకు, సభా కార్యక్రమాలకు ఫోటో తీయడానికి వెళ్లినా ఇంత డబ్బు కావాలని డిమాండ్ చేసేవారు కారు. గోలుకొండ కోటలో అంతర్జాతీయ ఫోటోగ్రాఫర్‌ల మేళ 1973లో జరిగినప్పుడు సైబ తీసిన అనేక ఫోటోలకు అవార్డులు లభించాయి. కవి మిత్రుల పెండ్లిళ్లకు సైబ కెమెరాతో విచ్చేసేవారు. వారు తీసిన ఆల్బమ్‌లు దాదాపు అందరి మిత్రుల ఇండ్లల్లో ఆయన జ్ఞాపకంగా ఉన్నాయి.

సైబకు ఉన్నవి రెండే చేతులైనా కలంతో కవిత్వం రాస్తూ – కుంచెతో చిత్రాలు వేస్తూ – కెమెరాతో ఫోటోలు తీసేవారు – దారువును శిల్పాలుగా మలిచేవారు. వారు మొదట్లో 'వెన్నెల' అనే లిఖిత మాసపత్రిక బాల సాహిత్యం కోసం ఆవిష్కరించారు.

తరువాత ఇందూరు భారతి ద్వారా ఆవిష్కరింపబడ్డ కొన్ని చిత్రాలు, వెలుగులో రావటానికి సంకలనాలుగా మలచ బడటానికి రూపశిల్పి వీరే.

ప్రముఖుల సన్మాన పత్రాలకు సైబ డిజైన్‌లు కూర్చేవారు. జగ్గయ్యకు సమర్పించిన చిట్టిబాబు, ఈమని శంకర శాస్త్రులకు వేదికపై అందజేసిన అనేక సన్మాన పత్రాలకు సైబ ఆకృతే ముఖ్యం.

కవిగా సైబ పరంధాములు అనేక రచనలు గావిం చారు. సైబ పద చిత్రాలు, సైబ శబ్ద చిత్రాలు, భావ చిత్రాలు, భావ గీతాలు మొదలైన సంకనాలకు అనేక అవార్డులు లభించాయి. వీటికి తాను వేసిన చిత్రాలే అంతర్వాహినిగా అద్భుతాలు! కేవలం కవిత్వమే కాకుండా వీరు అనేక సంగీత రూపకాలు రచించారు. ఇవి రేడియోలోనూ వేదికలపై ప్రసారము – ప్రదర్శన ఐనాయి.

వీరు రచించన 'సిద్ధార్థ' నృత్యరూపకం మహారాష్ట్రలోని నాందెడ్ జిల్లాలో ప్రదర్శింపబడి మన్ననలందుకుంది. విషజ్వాల, ప్రత్యూష చిత్రాలకు కళాదర్శకత్వం వహించారు. ఆర్మూర్ ప్రజలు సైబ పరంధాములు గారికి మహోన్నత వేదికపై ప్రముఖులు, పెద్దలు, కవులు, కళాకారుల సమక్షంలో 'కళానిధి' బిరుదుతో సన్మానించారు. ఇటు కవులకు శిక్షణనిచ్చి ఎందరో ప్రముఖ కవులుగా తీర్చిదిద్దారు. సాహితీ సేవలో క్లుప్తగోష్టులు, చర్చలు, కవితా పఠన పోటీలు నిర్వహించి కవులకు అండదండగా ఉండేవారు.

ఎందరో ఫోటోగ్రాఫర్లను అవుట్‌డోర్‌కు తీసుకువెళ్లి శిక్షణ నిచ్చేవారు. ముఖ్యంగా వాటిలో ఖిల్లా, నందిగుట్ట, సారంగపూర్, అలీసాగర్ యాత్రలు మరువలేనివి. ఈ రోజున స్టూడియోలు పెట్టుకొని జీవితాన్ని గడుపుతున్నారు ఆయన శిష్యులు ఎందరెందరో!

నిజామాబాదులో తమ ఆకృతి సంస్థ ద్వారా అనేక ఆర్ట్ ఎగ్జిబిషన్‌లు నిర్వహించారు అలిశెట్టి ప్రభాకర్. చిత్రాలు, చంద్ర చిత్రాలు, సిద్దిపేట రాజయ్య గారి పెయింటింగ్స్ సైబ నిర్వహించి అనేక చిత్రకారులకు స్ఫూర్తి దాతలైనారు.

Lions, Lio లాంటి అనేక సంస్థలకు తమ సేవల నందించి – సభలు జయప్రదం జరిగేలా పర్యవేక్షణ జరిపేవారు. వీరి స్టూడియోను దర్శించిన ప్రముఖులు దాశరథి, ఆరుద్ర, జగ్గయ్య, సినారె గారలు.

ఇందూరు ఉత్సవాలకు జ్ఞానపీఠ అవార్డు గ్రహీత సి.నారాయణరెడ్డి గారు విచ్చేసినప్పుడు అస్వస్థతగా ఉన్న సైబను ఎన్నో మెట్లు ఎక్కి వచ్చి పలకరించారు. సైబ కృషిని, చిత్రాలను చూసి ప్రశంసించారు. ఆ వేళ సైబ ఇంట్లో వీధి జాతరే ఐంది.

సైబ నిరంతరం సేవా కార్యక్రమాల్లో వుండటంవల్ల ఒత్తిడి, ఎల్లవేళలా సంచారం, సమావేశాలు, అవుట్‌డోర్ ఫోటోగ్రఫీ సమావేశాలు – పని ఒత్తిడితో సైబకు అనారోగ్యం కలిగింది. ఎంత అనారోగ్యంగా ఉన్న సైబసార్ సమావేశం అంటే – సై అనేవారు. వారు చాలాసార్లు అనారోగ్యంగా వున్నా, వారి మార్గదర్శకత్వంలో పెద్ద సమావేశాలు నిర్వహించాం. సైబకి ముగ్గురు మగపిల్లలు. శశాంక, సారిక, తూనిక. ఇప్పుడు సారిక మాత్రమే మిగిలున్నారు. భార్య 'అహల్య' సైబని అమ్మలా చూసేది. సైబకి ఆడపిల్లలంటే ఎంతో ఇష్టం. ఇందూర్ వాస్తవ్యురాలు, అప్పుడే డిగ్రి కళాశాల మెట్లెక్కిన అయినంపూడి శ్రీలక్ష్మిని స్వంత కూతురిలా చూసుకునేవారు. ఆ దంపతులు – తాను ప్రముఖ

కవయిత్రిగా, వ్యాఖ్యాతగా నిలబడటానికి కారణభూతులు సైబ. అలాగే పంచారెడ్డి లక్ష్మణ్, చందనరావు, సమీర, బద్ధూరిల స్నేహం మర్చిపోలేనిది.

ఒకసారి రక్తహీనతతో ప్రభుత్వ వైద్యశాలలో చేరినప్పుడు అనుకోకుండా విచ్చేసిన మహాకవి ఆరుద్ర సైబను పరామర్శించారు. అంత అనారోగ్యస్థితిలోనూ సైబసారు పెన్సిల్‌తో ఆరుద్ర చిత్రం గీసి అందించి చేతులు జోడించి కృతజ్ఞతలు చెప్పారు. వరంగల్లు సమావేశాలకు వెళ్లినప్పుడు సైబ ఆరోగ్యం చాలా క్షీణించింది. త్వరలోనే కోలుకున్న వారిపై పనిభారం వేసేవారం కాదు. ఒక్కోరోజు స్టూడియోకు వెళ్ళకున్నా – కవిమిత్రులను కలువకున్నా సైబకు పొద్దుపోయేది కాదు.

తరువాత కాలంలో స్టూడియో ఆకృతిని పెద్దబజారుకు మార్చారు. ఇంటికి దగ్గర అవడం కొంత అనుకూలం. ఇక్కడ ఉన్నప్పుడే చాలా సంకలనాలు తన చేతితో రాసి ముద్రించారు.

సైబ గీసిన చిత్రాలు ఆంధ్రప్రభ, ఆంధ్రభూమి, ఆంధ్రపత్రికల్లో ప్రచురణమైనాయి. అనేక కవితలకు పత్రికలవారు వీరి ఫోటోలను సందర్భానుసారం కళాత్మకంగా వేసేవారు.

అది 15-08-1997 భారత స్వాతంత్ర్య దినోత్సవం. సైబ శ్వాస పీల్చుకోవడం చాలా కష్టమైంది. ఈ రోజే అంతిమశ్వాసను ఈ లోకానికి ఇచ్చేసి సైబ కీర్తిశేషులైనారు. అంతిమ యాత్రలో నిజామాబాద్ కళాకారులు కొన్ని కిలోమీటర్ల పర్యంతం వాటికకు కదలివచ్చారు. కళామూర్తిని కోల్పోయిన దుఃఖాన్ని ఆపుకోలేకపోయారు.

కవిత్వం, ఫోటోగ్రఫీ, చిత్రలేఖనం మూడు ముమ్మూర్తులా కలిసిన త్రివేణి సంగమం కళానిధి మన సైబ పరంధాములు. వీరు క్షణం క్షణం ఎప్పుడు కార్యక్రమం నిర్వహించినా స్మృతికి వస్తూనే ఉంటారు.

తెలంగాణ ప్రభుత్వం సైతం కీ.శే. కళానిధి పరంధాములు గారి కళాసేవను ప్రశంసించి పెద్ద సభను స్మృతిగా నిర్వహించింది. వారి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించింది. సైబ సహధర్మచారిణి శ్రీమతి అహల్యగారు సభకు హాజరై సంభావనను గ్రహించారు. అలాగే రాష్ట్ర ఆవిర్భావానంతరం భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణగారు 'సైబ' ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి, 75వేల రూపాయలు ఆర్థిక సహకారం అందివ్వటం ద్వారా తెలంగాణ కళాకారులకు రాష్ట్రావిర్భావం ద్వారా వెలుగురోజులు వచ్చాయనిపించింది. ప్రముఖ చలనచిత్ర దర్శకులు బి. నరసింగరావు రూపొందించిన 'ఆర్ట్@తెలంగాణ' పుస్తకంలో కూడా సైబగారి చిత్రాల్ని వేసి వారికి కళా నీరాజనం అందించడం ఇందూర్ వాసులకి గర్వకారణం.

కళామూర్తి సైబ పరంధాములు శరీరంతో భౌతికంగా లేకున్నా ఇందూరు నగరం ప్రతి ఉత్సవంతో ఆయనను జ్ఞాపకం చేసుకుంటూనే ఉంది. ఈనాడున్న కవులు, ఫోటోగ్రాఫరులు, చిత్రకారులు ఆయన తీర్చిదిద్దిన జ్ఞాపికలే!

ఈనాటికి ఆకృతి స్టూడియో దగ్గరకు వెళ్లినా – వారున్న వీధిలోకి వెళ్లినా వారి మృదువైన కవితాగానం – వారి వర్ణమయ చిత్రాలు వినిపిస్తాయి, కనిపిస్తాయి.

## 124

# సామల సదాశివ (యాది)

**– తుమ్మూరి రాంమోహన్‌రావు**

తెలుగు వారికి ఉర్దూ భాష మాధుర్యాన్ని రుచి చూపిన వారిలో అగ్రగణ్యులు డా. సామల సదాశివ మాస్టారు. ఆదివాసుల జిల్లా, అడువుల జిల్లా అని పేరు వడసిన ఆదిలాబాదు జిల్లాకు సదాశివ మాస్టారు జిల్లా అన్న ప్రాచుర్యం రావడానికి దశాబ్దాల ఆయన సాహిత్య కృషితోపాటు, పెద్దవారితో పిన్న వారితో వారేర్పరుచుకున్న సాన్నిహిత్య ప్రేమానురాగాలు కూడా కారణాలు.

తన ప్రతిభ ప్రస్తావన రానీయకుండా ఎదుటి వారిలోని ప్రతిభా పాటవాలు పసి గట్టడంలో ప్రసిద్ధులు సదాశివ సారు. పనివారు, పసివారల నుండి పండితులు, ప్రతిభా వంతులదాకా తనకు పరిచయమైన వారిలోని, ప్రావీణ్యాలను మానవతా విలువలను, సౌజన్య సౌశీల్యాలను గుర్తించి పనిగట్టుకుని ముచ్చట్ల రూపంలో ప్రజావళికి పలు పత్రికల ద్వారా వెలువరించిన వితరణ శీలి సదాశివ. ఇప్పుడంటే రవాణా సౌకర్యాలున్నాయి. ఫోన్‌లున్నాయి. పత్రికలు, టీవీల వంటి పలు మాధ్యమాలున్నాయి. ఊరూరికి బడులున్నాయి. కాలేజిలున్నాయి. కాని ఏడెనిమిది దశాబ్దాల కిందటి ఆదిలాబాదు జిల్లాను గురించి ఆలోచిస్తే, సదాశివ బాల్యాన్ని తలచుకుంటే ఆశ్చర్యం కలుగక మానదు. పుట్టిననప్పటినుండి చివరి శ్వాస వరకు ఏ కొన్నినాళ్ళో బయటి ఊళ్ళల్లో గడిపినా జిల్లాను వదిలిపెట్టకుండానే అక్కడనుంచే ప్రపంచ వ్యాప్తంగా పరిచయాలు పెంచుకున్నారంటే ఆయన లక్ష్యశుద్ధి ఎంత గొప్పనైనదో ఊహించవచ్చు.

సదాశివ మాస్టారు పుట్టింది ఒకప్పటి ఆదిలాబాదు ఇప్పటి కొమురం భీము జిల్లా కాగజునగరం ప్రాంతంలోని తెనుగుపల్లె. అది అప్పటికీ పల్లెనే. ఆ పల్లెలోని పూరి గుడిసెలో కన్ను తెరిచిన సదాశివ బాల్యం. తండ్రి నాగయ్య పంతులు బడి పంతులుగా పని చేసిన కాగజ్ నగర్ సమీపంలోని నవెగాంలో గడచింది. అది నైజాం జమానా, బళ్ళల్లో ఉర్దూ మీడియంలో బోధన జరిగేది. సారు కూడా ఉర్దూ మీడియంలోనే చదువుకున్నా తండ్రి నేర్పిన తెలుగుతో ఇంట్లో ఉన్న భారత భాగవతాలు చదివి తెలుగు భాష పై పట్టు చేజిక్కించుకున్నారు. అలాగే అరబ్బీ తెలిసిన గురువు దగ్గర అరబ్బీ నేర్చుకున్నారు.

వరంగల్లులో మెట్రిక్ వరకు చదివి స్వంత జిల్లాలో ఉపాధ్యాయ వృత్తిలో చేరినారు. ఒకవైపు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే, మరోవైపు సాహిత్య రంగంలో ప్రవేశించి పద్యాలు, కథలు, వ్యాసాలు రాసి పత్రికలకు పంపడం, పండిత ప్రకాండులతో ఉత్తర ప్రత్యుత్తరాలు నెరపడంతో గుర్తింపదగిన స్థాయికి చేరుకోవడమేకాదు పలువురి ప్రశంసలకు పాత్రులైనారు. సదాశివ గారు తొలుత తన పద్యకృతి ప్రభాతము వెలువరించారు. ఆ పిదప సాంబశివ శతకము, నిరీక్షణము లఘు కావ్యములను వెలువరించారు. ఈ రెండింటికీ ముందు మాట వ్రాసిన కప్పగంతుల లక్ష్మణ శాస్త్రి గారు సదాశివ పద్య రచనను మనసారా కొనియాడారు.

ఆ తరువాత మంచి మాటలు, ధర్మ వ్యాధుడు, విశ్వామిత్రము, అంబపాలి, వంటి పలు పద్య కృతులు రాసినారు. ఇవిగాక అమ్జద్ రుబాయీలు అందమైన తేటగీతల్లోకి తర్జుమా చేశారు. వీరి రుబాయీల అనువాదాలు చూసి మురిసిపోయిన వేలూరి శివరామ శాస్త్రి సదాశివలోని నిర్దుష్ట పద్య రచనా శైలిని, భావ గాంభీర్యాన్ని ప్రస్తుతించారు. ఒకవైపు తెలుగు రచనలు కొనసాగిస్తూనే మరోవైపు ఉర్దూ పత్రికలకు వ్యాసాలు రాస్తుండేవారు. ఈ తరుణంలోనే గోలకొండ పత్రిక సంపాదకులు సురవరం ప్రతాపరెడ్డి గారు పద్య కవిత్వం పక్కకుపెట్టి పారసీ, అరబ్బీ, ఉర్దూ భాషలలోని విశేషాల గురించి రాయమని సూచించడంతో సదాశివ గారు వారి మాటకు విలువనిచ్చి తన దిశను మార్చుకున్నారు.

ఇక అప్పటి నుంచి సదాశివ తన దృష్టినంతా ఉర్దూ అరబ్బీ ఫారసీ భాషా సాహిత్యాలవైపు మళ్ళించి ఫారసీ కవుల ప్రసక్తి, గాలిబు జీవిత చరిత్ర, ఉరుదూ సాహిత్య చరిత్ర వంటి పుస్తకాలు ప్రచురించారు. గీటురాయి, మిసిమి పత్రికల్లో గజల్ రుబాయీ వంటి ప్రక్రియల గురించిన సాధికారిక వ్యాసాలు రాశారు. సియాసత్ పత్రిక ద్వారా తెలుగులోని ప్రసిద్ధ కవులను ఉరుదూ వారికి పరిచయం చేసి ఇరు భాషల వారధియైనారు. సామల సదాశివ.

ఇదంతా ఒక పార్శ్వమైతే సదాశివ సంగీతజ్ఞత ఆయనకు ఎందరో అభిమానులను సమకూర్చింది. ఆదిలాబాదుకు ఆనుకుని ఉన్న మహారాష్ట్ర సంస్కృతీ సంప్రదాయాల ప్రభావం తెలంగాణ ప్రాంతంపై ఉన్నది. అది ఆదిలాబాదులో మరీ ఎక్కువ. తరచుగా హిందూస్తానీ కచేరీలు వినడం ఆ మాధుర్యానికి అలవాటుపడటంతో హిందూస్తానీ సంగీత గాయనీ గాయకులు, గాయన పద్ధతులు, ఘరానాలు మొదలైన విషయాలపై పట్టు సాధించారు. తనకు తెలిసిన విషయాలను, తాను అనుభవించిన ప్రతి రసరమ్య సన్నివేశాలను ముచ్చట్లుగా అటు పాఠకులకు, ఇటు తనను కలువడానికి వచ్చిన అభిమాన శ్రోతలకు చెబుతుండేవారు. అవును ఆయన రచనలు చదివే పాఠకులకు చదివినట్లుగా కాకుండా ఆయన చెబుతుంటే విన్నట్లుగా ఉండేవి. అదే వారి వచన రచనలోని విశేషం.

అవే తరువాత మలయ మారుతాలు, సంగీత శిఖరాలు, యాది, స్వరలయలు పుస్తకాలుగా వెలువడ్డాయి. ఇందులో ఒక్కో పుస్తకం ప్రత్యేకతను సంతరించుకుని సదాశివకు ఎనలేని కీర్తి ప్రతిష్టలను సంపాదించి పెట్టాయి. వాకాటి పాండురంగారావు గారి అభ్యర్థనతో ఆంధ్రప్రభకు మలయమారుతాలు రాస్తే ఎంతోమంది సంగీత సాహిత్య ప్రేమికులు ఆయనకు అభిమానులయ్యారు. అట్లే మాన వీయతా పరిమళాలతో యాది పేరుతో, వార్త ఆదివారం అనుబంధంలో ఆయన రాసిన వ్యాసాలు ఆయనను యాది సదాశివను చేశాయి. ఇక స్వరలయలు ఏకంగా ఆయనకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును తెచ్చిపెట్టింది. హైదరాబాదుకు చెందిన సూఫీకవి అమ్జద్ రుబాయీలను సదాశివగారు అనువదిస్తే దానికి పరిచయం పేరిట ముందు మాట రాసిన వేలూరి శివరామశాస్త్రి గారు సదాశివ నిర్దుష్ట పద్య రచనా విధానానికి, భావ గాంభీర్యానికి మురిసిపోయి ప్రశంసల జల్లులు కురిపించారు.

సూఫీయిజాన్ని అరటిపండు ఒలిచిపెట్టినట్లు చెప్పేవారు. ఆయన సాహిత్యజ్ఞత ఎంత లోతైనదో సంగీతజ్ఞత అంత గొప్పది. ఇంకో విచిత్రమైన విషయ మేమిటంటే ఆయన మంచి తైల వర్ణ చిత్రకారుడు కూడ బళ్ళో చదువుకునే రోజుల్లో చిత్రలేఖన ఉపాధ్యాయులుగా దీనదయాళ్ నాయుడు, పిళ్ళై బొమ్మలు వేస్తుంటే స్ఫూర్తి పొంది నేర్చుకున్నారు. దాంతో సదాశివ మాస్టారు ఉపాధ్యాయులపై పని చేసిన కాలంలో నాటకాలకు అవసరమయ్యే పరదాలను చిత్రించడం, తమ కవితలకు తగిన బొమ్మలు గీయడం, ముఖాకృతుల చిత్రాలు వేయడం చేస్తుండేవారు. ప్రసిద్ధ చిత్రకారులు కాపు రాజయ్య తన తొలి దశలో సారు దగ్గర చిత్రకళలో మెళుకువలు నేర్చుకున్నారట.

బహుముఖ ప్రజ్ఞాశాలియైన సదాశివ అనేక ప్రక్రియల్లో పట్టు సాధించారు. వారు రాసిన కొన్ని కథలు అప్పట్లో సుజాత పత్రికలో ప్రచురించబడ్డాయి. వారు అపశ్రుతి, రేవతి అనే రెండు నవలలు కూడా రచించారు. మరాఠీ నుండి కేశవ సుత్ జీవిత కథ తెనిగించారు. పలు పుస్తకాలకు ముందు మాటలు రాసారు. నాటకాలకు సందర్భోచిత పద్యాలు రాసిచ్చారు. సదాశివ గారి జీవితంలో కాళోజీ సోదరుల మైత్రి ఒక ప్రధాన ఘట్టం. వారి గురించి ప్రస్తావించని ముచ్చట ఉండదు. తలచుకుని పరవశించని

రోజు ఉండదు. అదొక అపూర్వ మైత్రీబంధం. పూర్వజన్మల బంధం. దానికి ఒక కారణం ఆ సోదరుల అన్యోన్య ప్రేమానుబంధం.

ఆయనకు అన్ని వర్గాలవారితోనూ, అన్ని వాదాల వారితోనూ, అన్ని ప్రాంతాలవారితోనూ సత్సంబంధాలు ండేవి. ముఖ్యమైన విషయం ఒకటి చెప్పుకోవాలి. ఆదిలాబాద్‌కు చెందిన గొండి వీరుడు కొమురం భీం. నిజామ్ దురాగతాల నెదిరించి ప్రాణ త్యాగ మొనర్చిన ఉద్యమ కారుడు. మాస్టారు పాఠ్యపుస్తక రచయితగా ఉన్నప్పుడు కొమురం భీం జీవిత విశేషాలను తెలుగు పాఠ్యాంశంగా చేర్చారు. ఉత్తర భారత దేశం నుండి వచ్చి ఆదిలాబాదులో స్థిరపడి, ఆదివాసులతో మమేకమై, వారిలోని కళాత్మక నైపుణ్యాలను పునఃరుద్ధరించడానికి కంకణం కట్టుకున్న కళాశ్రమ నిర్వాహకులను రవిశర్మంటే ఎంత అవ్యాజ ప్రేమో మాటల్లో చెప్పనలవికానిది. ఆయన నుండి స్ఫూర్తి పొందడానికి అనేక మందికి ఆయనను పరిచయం చేసిన ఘనత సదాశివ గారికి దక్కుతుంది.

రచనలలో వ్యక్తులను పరిచయం చెయ్యడంలో మాస్టారికి అనితర సాధ్యమైన శైలి. ప్రస్తుతించే పద్ధతిలోగాక ప్రస్తావనలోనే వ్యక్తుల గొప్పతనాన్ని గోచరింపజేయడం ఆయనలోని విశేషం. మంచిని పంచడం మమతల్ని పంచడం, మానవతా విలువల్ని పెంపొందించడం ఆయన నుంచి ప్రతి ఒక్కరూ నేర్చుకోవలసిన అంశం. యౌవన దశలో యోగాభ్యాసం కూడా చేసేవారట. త్రాటకం అభ్యాసం చేసిన వారని విన్నాను. అన్నీ నిర్చిన భావయోగి, కర్మయోగి డా. సామల సదాశివ.

ఉద్యోగం చేస్తూనే స్నాతకోత్తర విద్యను సాధించిన సదాశివ గారిని పదవులు, పరస్కారాలు వెతుక్కుంటూ వచ్చాయి. ఉపాధ్యాయులుగా, పాఠశాలల తణిఖీ అధికారిగా, ఉపాధ్యాయ శిక్షణ సంస్థ లోధకుడిగా పనిచేసిన సదాశివ పదోన్నతిపై భద్రాచలం కళాశాల పరిని పాలుగా చేసి పదవీ విరమణ పొందారు. ఉరుదూ భాషాభిజ్ఞులుగా రెండు దశాబ్దాలు ఆం.ప్ర. సాహిత్య అకాడమీ ఉర్దూ సలహా సంఘ సభ్యులుగా, విజ్ఞులుగా, మూడేళ్ళు కాకతీయ విశ్వవిద్యాలయ సెనేట్ మెంబరుగా గౌరవ పదవులలంకరించారు. వీరి అనువాదాలకు గుర్తింపుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పురస్కారాన్ని పొందారు. అలాగే పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుండి ప్రతిభా పురస్కారాన్ని గౌరవ డాక్టరేటును, కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేటును పొందారు. వీరి 'స్వరలయల'కు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. ఇవికాక మరెన్నో సన్మాన సత్కారాలు జరిగినా అవన్నీ చంద్రునికో నూలు పోగు వంటివే. ఇటీవల వీరి రచనలపై పరిశోధనలు మొదల య్యాయి.

ఆకాశవాణిలో వీరు చేసిన ప్రసంగాలు ఎందరో రసజ్ఞులైన శ్రోతలనలరించాయి. తొణుకు బెణుకులేని వీరి కంఠస్వరం, సహజసుందరి శైలి, చిన్న చిన్న వాక్యాలతో వీరి ప్రసంగం శ్రోతల నలరించేదిగా ఉండేది. కరీంనగర్ విశ్వనాథ పీఠంవారు సదాశివ అభినందన సంచికగా ఏడువందలకు పైగా పేజీలుగల జయంతి సంచిక ఆదిలాబాదు ఆకాశవాణి కేంద్రంలో ఆవిష్కరణ జరిగినప్పుడు ఒక పండుగలా అనిపించటం అతిశయోక్తి కాదు. మాటల కందని మహనీయుల గురించి ఎంత చెప్పినా తక్కువే. తెలంగాణా వైతాళికులలో ఒకరయిన డా. సామల సదాశివ మాస్టారు 11 మే 1928న జన్మించి 7 ఆగస్టు 2012లో పరమపదించారు. భౌతికంగా లేకున్నా వారి స్ఫూర్తి చిరకాలం ఉంటుంది.

# 125 శంకర్ (జైకిషన్)

– హెచ్. రమేష్‌బాబు

హిందీ సినిమా సంగీతాన్ని నౌషాద్, సి. రామచంద్ర, అనిల్‌బిశ్వాస్‌లు ఏకఛత్రాధిపత్యంగా ఏలుతున్న కాలం అది. నూనూగు మీసాలు కూడా రాని ఇద్దరు కుర్రాళ్లు ఆ ముగ్గురి అంశను కలబోసుకొని బాలీవుడ్ వెండి తెరవెనుక ప్రత్యక్షమయ్యారు. వారే శంకర్ – జైకిషన్‌లు.

బాలీవుడ్‌లో భారతీయ సినీ సంగీతాన్ని రెండున్నర దశాబ్దాల పాటు చకచ్చకితం చేసిన సంగీత కోవిదులు శంకర్ – జైకిషన్‌లు. వీరు సినిమాలకు పని చేసిన కాలమంతా ఒక 'స్వర్ణయుగమే'. ఈ శంకర్ – జైకిషన్‌లలోని శంకర్‌సింగ్ రఘువంశీ అచ్చమైన మన హైదరాబాదీ పహిల్వాన్. 1922 అక్టోబర్ 15న హైదరాబాదులో పుట్టాడు. తండ్రి రాంసింగ్, తల్లి ఎల్లమ్మ. చిన్నప్పటి నుంచే సంగీత నాట్యాలంటే ఆసక్తి చూపి బడికి వెళ్ళే రోజుల్లోనే శాస్త్రీయ సంగీతంపై దృష్టి పెట్టాడు. కథక్ నృత్యంలోనూ శిక్షణ పొందాడు. నెమ్మదిగా అతని అడుగులు రంగస్థలం వైపు నడిచాయి. సత్య నారాయణ, హేమావతి థియేటర్ గ్రూపులో చేరి నాటకాల్లో వేషాలు వేయడం మొదలుపెట్టాడు. సంగీతానికి కూడా చేరువగానే మసలుకునేవాడు.

హైదరాబాద్‌లో తాలింఖానాలో కసరత్తులు చేసిన వస్తాదుగా కుస్తీలు పట్టిన మన శంకర్ సింగ్. అంతే ఇష్టంగా తబాలాపై దరువు వేశాడంటే మోగిపోయేది లయగా. ఏది ఏమైనా సరే, నేర్చుకున్నది చాలని బొంబాయి చేరుకున్న శంకర్ కొంతకాలం హుస్న్‌లాల్ – భగత్‌రాంల వద్ద శిష్యరికం చేశాడు. ఆ తరువాత అనుకోకుండా పృథ్వీరాజ్ కపూర్ దృష్టిలో పడ్డాడు. పృథ్వీ థియేటర్‌లో నెల జీతానికి కుదిరాడు. వారి నాటకాలకు తబలా వాయించేవాడు. 1929 నవంబర్ 21న గుజరాత్‌కు చెందిన బల్సార్‌లో జన్మించిన జైకిషన్‌తో ఒకనాడు శంకర్‌కి పరిచయం కలిగింది. హార్మోనియం నేర్చుకున్న జైకిషన్‌తో ఏర్పడిన ఆ పరిచయం మంచి స్నేహంగా మారింది.

జైకిషన్‌ను శంకరే తన వెంట తీసుకెళ్లి పృథ్వీరాజ్‌తో చెప్పి ఉద్యోగం ఇప్పించాడు. అయితే జైకిషన్‌ది ఎడమ చేతివాటం. మన శంకర్ మాత్రం కుడిచేతినే ఉపయో గించాడు. ఇలా ఈ కుడి ఎడమలు రెండూ కలిసి బాలీవుడ్‌లో ఆనాడు మధుర స్వరాలను సృష్టించాయి. అద్భుతమైన సినిమాలు తీయాలని కలలు గంటున్న రాజ్‌కపూర్, కవులు హస్రత్ జైపూరి, శైలేంద్రలు అప్పటికి అక్కడ ఉండనే ఉన్నారు. వారికి శంకర్ జైకిషన్‌లు తోడైయ్యారు. ఇంకేముంది, భారతీయ సినిమాలో నూతన అధ్యాయానికి తెర లేచింది. రాజ్‌కపూర్ మొదటి సినిమా 'ఆగ్' (1948) తీయాలనుకున్నప్పుడు రామ్ గంగూలీని మ్యూజిక్ డైరెక్టర్‌గా, అసిస్టెంట్స్‌గా శంకర్ – జైకిషన్‌లను తీసుకున్నారు. కానీ, తన సినిమా బాణీలను రామ్ గంగూలీ ముందుగానే బయటకు వినిపిస్తున్నాడని తెల్సుకుని రాజ్‌కపూర్ తన

తరువాతి సినిమాకి శంకర్ – జైకిషన్‌లే సంగీత దర్శకులన్నారు. ఆ చిత్రం 1949లో వచ్చిన 'బర్సాత్'.

'బర్సాత్ మె హమ్‌సె మిలే తుమ్ సజన్', 'హవామె ఉడ్తాజాయే', 'రాజాకీ ఆయేగీ బారాత్' పాటలు వీరిని మొదటి చిత్రంతోనే హిమాలయ శిఖరాలపై కూర్చో పెట్టాయి. ముఖ్యంగా 'రాజాకీ ఆయేగి బారాత్' పాట రాసిన శైలేంద్ర కవిత్వం మన శంకర్ సంగీతానికి సరైన జోడి అయ్యింది. అట్లనే – హస్రత్ జైకిషన్ బాగా కుదిరాడు. ఇట్లా థీమ్ సాంగ్స్ శంకర్ – శైలేంద్రలు చేస్తే, డ్యూయెట్ సాంగ్స్ జైకిషన్ – హస్రత్‌లు చేయడానికి ఎవరంతట వారే డిసైడ్ అయిపోయాడు. అయితే, ఏ పాటను ఎవరు చేశారన్నది బయటికి చెప్పకూడదనేది వీరిరువురి మధ్య ఉన్న ఓ ఒప్పందం. దీనికి లోబడే వాళ్లు చాలాకాలం పనిచేశారు. శంకర్ – జైకిషన్‌లు ఇట్లా రాజ్‌కపూర్ సినిమాలకు శాశ్వత సంగీత దర్శకులుగా చాలా కాలం పనిచేశారు.

ఈ నేపథ్యంలో శంకర్ – జైకిషన్ సంగీతం సమకూర్చిన కొన్ని చిత్రాలు : 1949లో – బర్సాత్, 1951–60 దశకంలో ఆవారా, బాదల్, కాలీఘటా, నగీనా, దాగ్, పరబత్, పూనమ్, ఆహ్, ఆస్, ఔరత్, నయాఘర్, పతితా, షికస్త్, బాద్‌షా, బూట్‌పాలిష్, మయూర్ పంఖ్, పూజా, సీమా, శ్రీ 420, బసంత్ బహార్, చోరీచోరీ, హాలాకు, కిస్మత్‌కే ఖేల్, న్యూఢిల్లీ, పట్‌రాణి, రాజ్‌హఠ్, బేగునాహ్, కట్‌పుత్లీ, బాఘీ సిపాహీ, యహూదీ, అనాడీ, ఛోటీ బహెన్, కన్హయ్యా, లవ్‌మేరేజ్, మై నషే మే హూ, షరారత్, ఉజాలా, కాలేజ్ గర్ల్, దిల్ అప్నా ప్రీత్‌పరాయీ, ఏక్‌ఫూల్ చార్‌కాంటే, జిస్ దేశ్‌మే గంగా బహ్‌తీ హై, గబన్, సింగపూర్, 1961–1971 దశకంలో ఆస్‌కాపంఛీ, బాయ్‌ఫ్రెండ్, జబ్‌ప్యార్ కిసీసే హోతాహై, జంగ్లీ, ససురాల్, ఆషిక్, ఆస్లీనక్లీ, హరియాలీ ఔర్ రాస్తా, ప్రొఫెసర్, రంగోలి, దిల్ ఏక్ మందిర్, హమ్‌రాహీ, ఆయీ మిలన్ కీ బేలా, రాజ్‌కుమార్, సంగమ్, సాంఝ్ ఔర్ సవేరా, ఆర్జూ, గుమ్‌నామ్, జాన్‌వర్, ఆమ్రపాలి, లవ్ ఇన్ టోక్యో, సూరజ్, తీస్రీకసమ్, రాత్ ఔర్ దిన్, బ్రహ్మచారి, మేరే హుజూర్, యకీన్, మేరానామ్ జోకర్ వంటి చిత్రాలకు శంకర్ – జైకిషన్‌లు అందించిన సంగీతాన్ని ప్రేక్షకులు ఎప్పటికీ మర్చిపోలేరు.

**హిందీ సినీ సంగీతంలో శంకర్–జైకిషన్లు ఎన్నో ప్రయోగాలు – మరెన్నో అద్భుతాలు చేశారు.**

శంకర్ – జైకిషన్‌లు ఆ కాలంలో ఎక్కువ శాతం పాటలన్నీ శాస్త్రీయ సంగీతంలో చేసినవే. ఆ సమయంలో 'బర్సాత్' పాటలతో మొత్తం భారతీయులనే వారు సమ్మోహితం చేశారు. శంకర్ – జైకిషన్‌లు ఎన్ని ప్రయోగాలు చేశారో చెప్పడం అసాధ్యం.

పంకజ్ మల్లిక్ తప్ప ఆర్కెస్ట్రేషన్‌కి అంత ప్రాధాన్యమివ్వని ఆ కాలంలో భారీ సంఖ్యలో ఆర్కెస్ట్రాతో పాటలు చేయడంలో వారు విజయం సాధించారు. నృత్య గీతాలకు, క్లాసిక్ గీతాలను ట్యూన్స్ చేయడంలో శంకర్‌ది అందెవేసిన చేయి. వీరి చిత్రాల్లో దాదాపు ప్రతి సినిమాలో టైటిల్ సాంగ్ చేసింది మన శంకరే. శైలేంద్ర పాటలకు ఎక్కువ మ్యూజిక్ చేసింది కూడా శంకరే అని చాలా మందికి తెలుసు.

ఈ జంట 'చోరి చోరి' (1956), 'అనారీ' (1959), 'దిల్ అప్నా ప్రీత్ పరాయీ' (1960), 'ప్రొఫెసర్' (1962), 'సూరజ్' (1966), 'బ్రహ్మచారి' (1968), 'పెహచాన్' (1970), 'మేరానామ్ జోకర్' (1971), 'బేయిమాన్' (1972), చిత్రాలకు ఫిలింఫేర్ అవార్డులు పొందారు. వీరి సంగీతంలో పాడిన లత 'చోరిచోరి' చిత్రానికి, రఫి 'ససురాల్', 'సూరజ్' చిత్రాలకు, ఆషా భోంస్లే 'షికార్', 'నైనా' చిత్రాలకు గాను ఉత్తమ గాయనీ గాయకులుగా అవార్డులు అందుకున్నారు.

శంకర్, జైకిషన్‌లు పాశ్చాత్య బాణీలు అనుకరిస్తారనే అపవాదు ఒకటి ఉండింది. కానీ, వారి బాణీలుంటేనే డిస్ట్రిబ్యూటర్లు సినిమాలు కొనే కాలం అది. అట్లాంటి సమయంలో 'బసంత్ బహార్' వచ్చింది. ఈ చిత్రానికి ముందుగా అనిల్ బిస్వాస్‌ను ఎంపిక చేశారు భరత్ భూషణ్. కానీ, డిస్ట్రిబ్యూటర్లు శంకర్ – జైలే కావాలని తేల్చేశారు. అయిష్టంగానే వీరిని ఎంపిక చేశారాయన. కానీ, మన శంకర్ – జైలు దీన్నొక మహత్తర అవకాశంగా, సవాల్‌గా తీసుకుని అద్భుతమైన పాటలు కూర్చారు.

శంకర్ – జైకిషన్‌లకు అత్యంత ప్రీతిపాత్రమైన రాగం భైరవి. నిజానికి అప్పటికే నౌషాద్, అనిల్ బిస్వాల్ భైరవి రాగాన్ని ఆధారం చేసుకొని అనేక పాటలకు స్వరకల్పన

చేశారు. అయితే అదే భైరవిని శంకర్ – జైకిషన్‌లు తమ సంగీతానికి ప్రాతిపదిక రాగంగా పెట్టుకొని పాటలను రూపొందించారు. సునో చోటీసి గుడియాకి లంబి కహానీ (సీమా), బర్సాత్‌మే హమ్‌సే మిలే తుమ్ (బర్సాత్), కిసీసె అప్నా బనాకె ముజుకో (పతిత), మైపియా తేరీ (బసంత్ బహార్), మెరానామ్ రాజు (జిస్ దేశ్‌మే గంగా బెహతీ హై), బోల్ రాధాబోల్ (సంగమ్) ఇంకా ఎన్నో సుమధుర స్వరకల్పనలు శంకర్–జైకిషన్‌లు సృష్టించారు.

రాజ్‌కపూర్ తరువాత ఆయ సోదరుడు షమ్మీకపూర్ చిత్రాలకు సంగీతం చేయడంలో కూడా శంకర్ – జైకిషన్‌లు బాగా పాపులర్ అయ్యారు. అయితే, ఈ ఇద్దరి స్నేహం కొందరికి కన్ను కుట్టి ఉంటుంది. ఎలా జరిగిందో ఏమో కానీ, 'ఎవరు, ఏ పాట చేశారనేది బయటికి చెప్పకూడదన్న' ఒప్పందం కాస్తా అనుకోకుండా ఉల్లంఘించబడింది. 'సంగం' (1964) లోని 'ఏ మేరా ప్రేమ్ పత్ర్ పడ్ కర్' పాటకు తానే ట్యూన్ చేశానని తన భార్య పల్లవికి రాసిన ప్రేమ లేఖలో, హస్రత్ చేత పాట రాయించానని 'ఫిలిం ఫేర్'లో జైకిషన్ రాశాడు. దాంతో శంకర్ – జైకిషన్‌ల నడుమ విభేదాలు పొడసూపాయి. ఒప్పంద ఉల్లంఘన జరిగిందని శంకర్ అభ్యంతర పెట్టాడు.

'దిల్ ఏక్ మందిర్' తరువాత వారిద్దరూ విడిపోయారు. ఆ తరువాతి చిత్రాలకు విడిగానే సంగీతం సమకూర్చు కున్నారు. అయితే, ఎవరికి వారు రెండు పేర్లను వాడు కున్నారు. కొన్నాళ్లు అలా శంకర్, జైకిషన్‌లుగా కొనసాగారు. వారు విడిపోయాక రాజ్‌కపూర్ కోరిక మేరకు 'మేరా నామ్ జోకర్' సినిమాకు మాత్రం కలిసి పని చేశారు. 1948 నుండి 1971 వరకు శంకర్ – జైకిషన్‌లు చేసిన సినిమాల సంఖ్య సుమారు 180. ఒక్కో సినిమాకు అయిదు లక్షలు పారితోషికం తీసుకున్న రికార్డు వీరిది.

జై కిషన్ 1971 సెప్టెంబర్ 12న తనువు చాలించారు. అప్పుడు సంగీతం అంతా జైకిషన్ చేశారని, శంకర్ దేనికీ పనికి రాడని కొందరు నిందలు మోపారు. దీంతో అవకాశాలు సన్నగిల్లాయి. రెండేళ్లు ఒక్క సినిమా కూడా లేకుండా గడిపిన శంకర్ మళ్లీ 'సన్యాసి' చిత్రంతో పెద్ద హిట్ కొట్టారు. ఆ తరువాత స్వతంత్రంగా 30 సినిమాలకు సంగీతాన్ని సమకూర్చి తన సత్తాను చాటాడు.

**శంకర్ వెండితెరపై తెలంగాణ బతుకమ్మ పాటకు పట్టం కట్టిన సంగతి ప్రత్యేకంగా చెప్పుకోవాలి.**

శంకర్ చొరవవల్లే అప్పట్లో 'ఫిలింఫేర్' అవార్డుల్లో గాయనీ, గాయకులకు చోటు కల్పించారు. ఫలితంగా లతాకు వరుసగా 'ఉత్తమగాయని' అవార్డులొచ్చాయి. కాని తరువాతి రోజుల్లో లతాతో శంకర్‌కు అభిప్రాయభేదాలు వచ్చాయి. గాయనీ శారదను ఎక్కువగా ప్రోత్సహించడం ఇందుకు కారణంగా చెప్తారు.

శంకర్ వెండితెరపై తెలంగాణ బతుకమ్మ పాటకు పట్టం కట్టిన సంగతి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. శంకర్ హైదరాబాదీ కావడం వల్ల ఆయన్ను హైదరాబాద్ తెలంగాణ సంస్కృతి నీడలు వీడ లేదనడానికి తన కంపోజింగ్సే సాక్ష్యాలుగా నిలిచాయి. 'శ్రీ 420'లో ముఖేష్‌తో పాడించిన 'రామయ్యా వస్తావయ్యా! రామయ్యా వస్తావయ్యా!' పాట నేటికీ ఎవర్‌గ్రీన్ సాంగ్. అట్లాగే 1964లో విడుదలైన 'రాజ్‌కుమార్' చిత్రంలోని 'నాచ్‌రే మన్ బతుకమ్మ' పాట, జెమినీ వాళ్ళు 1969లో తీసిన 'షత్రంజ్'లో బతుకమ్మ బతుకమ్మ బతుకమ్మ – ఎక్కడ పోతావ్‌రా, ఇక్కడ ఇక్కడ రా!!" పాటను మహమూద్, రఫీ, శారదలచే పాడించా రాయన.

ఆ రోజుల్లో ఈ ఒక్క పాట కోసమే చిత్రం హిట్ అయ్యింది. అదీ మన శంకర్ గొప్పతనమే. ఆ తరువాత 1971లో తెలుగులో వచ్చిన 'జీవిత చక్రం' సినిమాకి శంకర్ సంగీత దర్శకత్వం వహించారు. అందులో 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో, బంగారు గౌరమ్మ ఉయ్యాలో...' పాట తెలంగాణ సంస్కృతిని ఆయన మరచిపోలేదనడానికి నిదర్శనం. అలా శంకర్ ఆనాడే మన బతుకమ్మకు పట్టం గట్టారు.

శంకర్ సినిమా రంగానికి అందించిన సేవలకు గుర్తింపుగా 1979లో 'పద్మశ్రీ' పురస్కారం లభించింది. ముంబాయిలో ఒక వీధికి శంకర్‌జైకిషన్ పేరు పెట్టారు. ఇండస్ట్రీలో కొచ్చి తొలిరోజుల్లోనే యోధాను యోధుల సంగీతంతో పోటీపడి జయించిన ఆయన ఒక సందర్భంలో డెబ్బైల్లో వచ్చిన ఆర్డీ బర్మన్, లక్ష్మీ–ప్యారే, కళ్యాణ్‌జీ ఆనంద్‌జీల రణగొణుల హోరులో ఇమడలేని తానుగానే

సినిమాలు తగ్గించుకున్నట్టు చెప్పారు. బాలీవుడ్ వైభవానికి ఎంతో కృషి సల్పిన శంకర్ 1987 ఏప్రిల్ 26న కాలం చేసి తన స్వరయాత్రను ముగించాడు. హైదరాబాద్ నుండి హిందీ చిత్రసీమకు జైరాజ్ అజిత్, చంద్రశేఖర్‌ల తరువాత వెళ్లిన శంకర్ అక్కడ చేసిన స్వరయాత్ర దేశదేశాల్లో మార్మోగింది. రష్యా, జపాన్ వంటి దేశాల్లో ఆవారా, శ్రీ420 సినిమా పాటలు మార్మోగినవి. రాజ్‌కపూర్ సినీ విజయాలలో శంకర్ - జైల పాత్ర ఎంతైనా ఉంది. వారు బాణీలు సమకూర్చిన ఎన్నో వందల పాటలు స్వర ప్రపంచాన్నింకా ఏలుతూనే ఉన్నాయి. తెలంగాణ ప్రజలంతా గర్వించదగిన సినీ సంగీత దర్శకుడు శంకర్‌సింగ్ రఘువంశి.

## 126

# శేఖర్

– చేతన కె.

పేజీల కొద్ది పూర్తిగా చదివితేగానీ అవగాహనకాని అంశాన్ని, ఒక కార్టూన్ చూడగానే తెలుసుకోవచ్చు. భాషకందని భావాన్ని, మాటలకందని సొగసుల్ని, కఠోర సత్యాన్ని, నగ్న నైజాన్ని, వెలుగునీడల సమ్మిశ్రంగా.... సమాజహితం కోసం అందించేదే కార్టూన్.

మాటల ద్వారాకాక కార్టూన్. ద్వారా ప్రయోజన ద్వారాలు తెరువగల కళ ఒక కార్టూనిస్టుది మాత్రమే. అటువంటి కార్టూన్ని ప్రేమించిన గొప్ప వ్యక్తి.

కీ॥శే॥ కంభాలపల్లి చంద్రశేఖర్

నల్లగొండ నేలలో పుట్టిన ఆయన, తెలుగు కార్టూన్‌కు అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చి, అమెరికా ప్రభుత్వ ఆహ్వానంతో ఆ దేశంలోని పలు రాష్ట్రాల్లో అధ్యయన పర్యటన జరిపిన తొలి తెలుగు వ్యంగ్య చిత్రకారుడు. కార్టూన్ కళా రంగంలో ఏకలవ్యుడై మార్గదర్శకులను ఎంచుకొని జనం పక్షాన కుంచెపట్టి తనను తాను తీర్చిదిద్దుకుని, ప్రజా ఉద్యమాల్లో తనవంతు సేవలు అందించినవారు శేఖర్.

కంభాలపల్లి వెంకయ్య, మల్లమ్మల రెండో సంతానమైన శేఖర్ చిన్నప్పటి నుండి ఇక్కట్ల మధ్యనే పెరిగాడు. తల్లిదండ్రులు రైతు కూలీలు. పిల్లల్ని ఇంటిదగ్గరే వదిలేసి వ్యవసాయ పనుల కోసం పొలాలకు వెళ్ళాల్సిన దైన్యం రెక్కాడితే కానీ డొక్కాడని స్థితి. తోటి పిల్లలతో ఆడుకుంటూ తనకంటే చిన్న పిల్లలు 6 గురి ఆలనా పాలనా చూసుకోవల్సి వచ్చేది. ఎంత పేదరికాన్ని చవిచూసినా ప్రతిభను పెంచుకోవటంలో వెనుకడుగు వేయలేదు శేఖర్. చిన్నప్పటి నుండి లైబ్రేరిలకు వెళుతూ – ఊర్లలోకి వచ్చే జానపద కళాకారుల జీవన విధానాలు గమనిస్తూ యువతతో మమేకమవుతూ ఉండేవారు. 4వ తరగతి వరకు సూర్యపేటలోని అడవి దేవులపల్లిలో చదువుకున్న శేఖర్ ఆ తర్వాత అన్నగారైన చంద్రయ్యగారి దగ్గరకు వచ్చేశారు. ఆర్థికంగా పాఠశాల బాధ్యతలు స్వీకరించలేని తల్లిదండ్రుల అన్నగారి దగ్గరకు పంపిస్తేనన్నా నాలుగు రీతుల ప్రపంచజ్ఞానం తెలుస్తుందని ఆశపడ్డారు. మొదటి మలుపు నల్గొండలో పడితే మరో మేలిమలుపు బి.ఏ. చదవటానికి ఉస్మానియా యూనివర్శిటీకి వచ్చినప్పుడు పడింది.

యూనివర్శిటీ వాతావరణం శేఖర్‌లో విపరీతమైన మార్పుల్ని తెచ్చింది. సౌమ్యుడు, నిరాడంబరుడు, నిగర్వి, స్నేహశీలి అయిన శేఖర్ ఆలోచనలు మరింత పరివ్యాపితమై ఉద్యమాల వెంట, బడుగుజనాల బాధలవెంట పయనించటం ఆరంభమయ్యింది. ఆలోచనల పరిధిని అడుగడుగునా పెంచుకున్న శేఖర్ మిత్రబృందంలో నాయకత్వ లక్షణాలను పెంచుకున్నారు. సహజంగా కార్టూనిస్టులందరూ అంతర్ముఖులు. కానీ శేఖర్ సవ్యసాచి. ఒక దశలో కార్య నిర్వాహకుడుగా, కార్యకర్తగా, నాయకుడిగా, స్ఫూర్తి ప్రదాతగా అనేక పాత్రల్ని ఒకేసారి పోషించేవాడు.

చాలామంది ఎన్నెన్నో ఆశయాలున్నాయని చెప్తారు. 'చెప్తారు కోతి చెయ్యరు ఒక్కటి' అంటుంటారు అలాంటి వాళ్ళను చూసినప్పుడు కానీ శేఖర్ ఏది చెప్తాడో అదే చేస్తాడు. తాను నమ్మిన సిద్ధాంతాన్ని చివరికంటూ నిలబెట్టుకుంటూ నడిచిన ధీశాలి. అందుకే మనసుకు నచ్చిన అమ్మాయిని పెళ్ళికి కలుపుతీసే స్థాయి నుండి కంప్యూటర్ ఆపరేట్ చేసే చేర్చాడు. శేఖర్ అంటే అది. అది కుటుంబమైనా సమాజ మైనా ఆశతో ఆశయాన్ని బ్రతికించుకుంటాడు. సమాజం ఆరోగ్యంగా బ్రతకటం కోసం అహర్నిశలు కష్టపడ్డాడు.

ఆయన తన జీవితకాలంలో 46 వేల కార్టూన్లు వేసారు. సుమారు పది భాషల్లో ఆయన కార్టూన్లు వెలువడ్డాయి. మెయిన్, పాకెట్, సండే శీర్షికల కార్టూన్లు, పోస్టర్లు, చిన్నా చితకా ఉద్యమ పత్రికలకు వేసే కవర్‌పేజీ కార్టూన్లు, రాజకీయ పార్టీల ప్రచారానికి బినామి పేర్లతో వేసే కార్టూన్లు అన్ని కలిపి వెలిసి అన్ని వేల సంఖ్యకు చేరాయి

1996లో బెల్జియమ్‌లో జరిగిన కార్టూన్ ఎగ్జిబిషన్‌లో పాల్గొని ఉత్తమ కార్టూనిస్ట్‌గా అవార్డు అందుకున్నారు. హిందుస్తాన్ టైమ్ 1998లో నిర్వహించిన పోటీలో పాల్గొని విజేతగా నిలిచారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉత్తమ కార్టూనిస్టు (2006) గ్రహీతగా, పదునైన చురకలు వేస్తూ పత్రికా రంగంలో పొలిటికల్ కార్టూనిస్ట్‌గా పాతికి సంవత్సరాలు పూర్తిచేసుకున్నారు. కార్టూనిస్టు శేఖర్.

తన తొలి కార్టూన్ 1984లో అచ్చయిందని చెప్పేవారు శేఖర్ గారు. తొలిరోజుల్లో ఆయన 'కంభా' అనే పేరుతో కార్టూన్లు వేస్తూ ఉండేవారు. 1989 జూన్ 16న ప్రజాశక్తి దినపత్రికలో ఆయన తొలి పొలిటికల్ కార్టూన్ ప్రచురింపబడింది. ప్రజాశక్తి దినపత్రికలో కార్టూనిస్టుగా నిలద్రొక్కుకున్న తర్వాత ఆయన ఆలోచనాసరళ, కార్టూన్ల స్వభావం, పూర్తిగా మారిపోయాయి అని అనేవారు. అప్పటివరకు 'కంభా' పేరుతో 'అప్పడాల కర్ర' టైపు కార్టూన్లు వేసిన ఆయన, మారిన తన ఆలోచన దృక్పథంతో 'శేఖర్' పేరుతో రాజకీయ కార్టూన్లు వేయటం మొదలుపెట్టారు. ప్రతి అంశాన్ని పీడితుల కోణంలో సమాజంలోని భిన్న దొంతరల కోణంలో పరిశీలిస్తూ కార్టూన్లు వేయడం ప్రారంభించారు.

ఎక్కువగా ఆర.కె. లక్ష్మణ్‌ని గురుతుల్యుడిగా భావించే వారు. రాజకీయాలను ఆయన విశ్లేషించే తీరును ఎక్కువగా స్టడీ చేసేవారు. అవసరాలకొద్ది ఇతర సీనియర్ కార్టూనిస్టుల శైలిని అనుకరిస్తూ కొంతకాలానికి తనదైన "శైలిని" క్రియేట్ చేసుకున్నానని చెప్తూండేవారు.

ఎమ్.ఎ., ఎల్.ఎల్.బి. చేసినా కూడా, కేవలం 1200 రూపాయల జీతానికి ఏరి కోరి కార్టూనిస్ట్ ఉద్యోగం చేసేవారని వారి శ్రీమతి చంద్రకళ చెప్తుంటే, ఆశ్చర్య పోయేవాళ్ళం. అది శేఖర్ గారికి కార్టూన్ రంగంమీద గల ప్రేమ, కమిట్‌మెంట్ అని తరువాత అర్థమైంది. కార్టూన్ రంగం కోసం రెండూ ప్రభుత్వ ఉద్యోగాలను వదులుకున్న ఘనత శేఖర్ గారిది.

దినపత్రికల్లో వృత్తిపరంగా వేసే కార్టూన్లకంటే ప్రవృత్తి పరంగా, ఇతర ఆర్థిక అవసరాల కోసం మారుపేర్లతో కనీసం సంతకం చేయడం లేకుండా వేసిన కార్టూన్లు కోకొల్లలు. ఇక సిండికేట్ ద్వారా ఇతర భాషల్లో వచ్చిన కార్టూన్లు తెలుగు పాఠకులకు తెలియనే తెలియదు. అలా ఫ్రీలాన్సర్‌గా వివిధ సంస్థలకు పనిచేస్తూ, "చేతన పబ్లికేషన్స్" పేరిట పుస్తక ప్రచురణలు కూడా చేసారు. ఆ తరువాత ఆయన ప్రజాశక్తి, ఆంధ్రప్రభ, ఇండియన్ ఎక్స్‌ప్రెస్, ఆంధ్రజ్యోతుల్లో పొలిటికల్ కార్టూన్ ఎడిటర్‌గా పని చేసారు.

వృత్తిలో బిజీగా ఉన్నా, నిరక్షరాస్యురాలైన తన భార్య చంద్రకళను చదివించుకున్నాడు. తనచేత 'కలుపు తీసిన.... కంప్యూటర్ చేసిన అనే పుస్తకం రాయించారు. అందుకే "కొమ్మ చెక్కితే బొమ్మరో – కొలిసి మొక్కితే అమ్మరో" అన్నట్టు నన్ను తయారుచేసారు అని శేఖర్ గారి గురించి ఆ పుస్తకంలో చెప్పింది.

కేవలం రోజువారి రాజకీయ కార్టూన్లే కాకుండా, అగ్రదేశాల పెత్తనం మీద, ప్రపంచీకరణం మీద, మతోన్మాదం, అధిక ధరలు, అమెరికా డాలర్ రుబాబులపై ఇతర కార్టూనిస్టులు ఎవరూ ముట్టని అంశాలపై లెక్కకు మిక్కిలి కార్టూన్లు గీశారాయన. మారుతున్న కాలానికి అనుగుణంగా 'శేఖర్ టూన్స్' సిండికేట్‌ను దిగ్విజయంగా నడిపి తెలుగు సత్తా చాటిన అత్యుత్తమ కార్టూనిస్ట్ శేఖర్.

కార్టూన్ ఐడియాల మీద ఆయనకు విపరీతమైన కమాండ్ ఉంది. నిద్రలో లేపి అడిగినా దేనికి ఎలా వేయాలో చెప్పగలిగే నేర్పు అతని స్వంతం. కొందరు బొమ్మ మీద శ్రద్ధ పెడితే, ఆయన ఐడియాల మీద శ్రద్ధపెట్టి 'ఠఫీ' మని పేల్చేవారు. ఇంట్లో ఎటు చూసినా నోట్సులు, ఆ నోట్సుల్లో ఐడియాలు. ఆయన పూర్తిగా కార్టూన్ రూపంలోకి మలచని ఐడియాలు అనేకానేకం అలానే ఉన్నాయి. అంత శ్రమపడ్డానికి చాలా ఓపిక కావాలి. ఎంతో ప్రేమ వాటిమీద ఉండాలి.

కార్టూనిస్టుగా శేఖర్ గారు గీసిన వేలాది కార్టూన్లు దేశంలోని, విదేశాల్లోని అణేక భాషల్లో వచ్చాయి. ఒక ప్రాంతీయ భాషా పత్రికలో కార్టూనిస్టుకి ఇంతగా అంతర్జాతీయ స్థాయి గుర్తింపు రావడం అసాధారణ. వేలాది కార్టూన్లు వేసిన కమ్యూనిస్టుగా తాను గోడలపై రాసిన రాతలే తనకు స్ఫూర్తి అంటారు. "ఒక ఆర్ట్ ఫామ్‌గా కార్టూన్ చాలా గొప్పది. కార్టూన్ రాత్రికి రాత్రి అద్భుతాలు సృష్టించక పోవచ్చు, కానీ ఒక ఆలోచన సృష్టించే కార్టూన్ దాని పని అది చేసుకుపోతుంది" అంటారాయన.

'ప్రపంచంలో ఏ మూల పీడిత ప్రజలున్నా, చూసి ఒక చిత్రకారుడిగా మనం స్పందిస్తాం. అలాంటిది మనం పుట్టిన గడ్డమీదే సమస్యలు ఉన్నప్పుడు స్పందించకపోతే ఎలా' అంటూ 'గిదీ తెలంగాణా' పుస్తకం వెలువరించారు. తెలుగు కార్టూనిస్టులకి ఎవరికి రాని అమెరిగా ఆహ్వానం తనకి వచ్చినప్పుడు భారతదేశంలో ఉన్న అవకతవకలు అన్నీ చమత్కారంగా చూపే కార్టూన్లతో 'కలర్స్ ఆఫ్ ఇండియా' అనే పుస్తకం వేశారు.

వేర్వేరు అంశాలమీద అప్పటికే పారాహుషార్, శేఖర్‌టూన్, బ్యాంక్‌బాబు వంటి అనేక పుస్తకాలు ప్రచురించి నప్పటికి, అచ్చయిన తన కార్టూన్లలో ఇప్పటికీ వాడిపోని కార్టూన్లలో కనీసం ఏడెనిమిది కార్టూను సంపుటాలు తేవచ్చు అంటారు ఆయన.

పాతికేళ్ళ శేఖర్ కార్టూన్ ప్రయాణంలో అనేక ఆటు పోట్లు ఉన్నాయి. పాత్రికేయ వృత్తిలో ఉండే కులం కుళ్ళు వల్ల అనేక ఒత్తిళ్ళను ఎదుర్కొన్నారు. ఎన్నోసార్లు మానసిక వ్యథకు గురయ్యేవారు. అయినా అధైర్యపడకుండా వాటిని అధిగమిస్తూ అన్నేళ్ళు కార్టూనిస్టుగ నిలదొక్కుకోవడం అంటే సామాన్యమైన విషయంకాదు. క్యాన్సర్‌తో బాధపడిన ఆయన, ఆరోగ్యం సహకరించకపోయినా నాచేయి కదులుతున్నది చాలు అని సంబరపడుతూ కార్టూన్లు వేయడం ఆయనకే సాధ్యం.

తన శరీరంలోని క్యాన్సర్‌లో ఆయనకు ఈ వ్యవస్థను పట్టిపీడిస్తున్న కుల క్యాన్సర్ కనిపించింది. తాను వ్యక్తిగా తనదైన ఈ క్యాన్సర్ మీద కాక, కుల క్యాన్సర్‌పై యుద్ధం చేయాలని నిర్ణయించుకున్నారు. ఇదొక సాహసం. శేఖర్ గారు క్యాన్సర్ వ్యాధిపై పోరాడుతూనే సమాజంలో నెలకొన్న కులవివక్షతను ఎండగడుతూ 'క్యాన్సర్' పేరుతో కార్టూన్ల పుస్తకాన్ని తెచ్చారు.

చివరి రోజుల్లో ఒకవైపు అనారోగ్యం, మరోవైపు కార్టూన్లతో రాజకీయ యుద్ధం చేస్తున్న శేఖర్‌బాబు, ఆయన రజతోత్సవ కార్యక్రమంలో ఆప్యాయంగా అక్కున చేర్చుకుని ఘనంగా సత్కరించుకున్నారు. అతని మిత్రబృందం.

దీర్ఘకాలంగా పోరాడుతున్న మృత్యువుకి అతను తలొగ్గక తప్పలేదు. మరణం అనివార్యం. కానీ మరణాన్ని కూడా సవాలు చేస్తూ చివరి వరకూ కార్టూన్ కళకి అంకితమైన ఆయన్ను తలచుకుంటే, కార్టూన్లపట్ల ఆయన తపన, ప్రేమ, అంకితభావం అన్నీ మనకు అవగత మవుతాయి. దాదాపు రెండేళ్ళు క్యాన్సర్‌తో బాధపడిన ఆయన, సంకల్ప బలంతో దాన్ని జయించే ప్రయత్నం చేసి మే 19, 2014న కన్ను మూసారు. మే 20, కార్టూనిస్టుల దినోత్సవానికి ఒకరోజు ముందు కన్ను మూసారు.

అతని వ్యక్తిత్వంలో ఎదురీదేతత్వం, సాధించే పట్టుదల మొదటి నుండిబట్టి, కష్టకాలంలో అతనలా జీవించడం సాధ్యపడింది. నేడు ఆయన మన మధ్య భౌతికంగా లేకున్నా ఆయన కార్టూన్లు మాత్రం సజీవంగా ఉంటాయి.

127

# షోయబుల్లాఖాన్

– దేవులపల్లి ప్రభాకరరావు

దాదాపు వంద సంవత్సరాలు నిరంతరంగా కొనసాగి అంతిమ విజయంతో లక్ష్యాన్ని సాధించిన భారత జాతీయ, స్వాతంత్ర్య, ఉద్యమాలలో నిరంకుశ పాలకుల నిర్బంధాలకు, అమానుష చర్యలకు, అక్రమ ఆంక్షలకు గురి అయి చెఱసాలలో కఠిన శిక్షలు అనుభవించిన, ఉరికంబా లెక్కిన, శరీరాలలో బుల్లెట్లు నిండిన, బాకుల పోట్లతో శరీరాలు ఛిద్రమయి రక్తం చిందిన, చివరికి అమూల్య ప్రాణాలను కోల్పోయిన దేశభక్తులు, స్వాతంత్ర్య సమర యోధులు అనేకులు, అసంఖ్యాకులు, దేశభక్తి, మాతృభారతి సేవానురక్తి జలపాతాలయి పొంగివచ్చి కొందరు గళమెత్తగా, మరి కొందరు కలాలను ఎత్తినారు.

దేశభక్తులందరికి, స్వాతంత్ర్య యోధులందరికి, సకల భారత జనకోటికి స్ఫూర్తినిచ్చింది. ఆలంబనమయినది. ముందుకు నడిపించింది కఠోర వజ్ర సంకల్పం – స్వాతంత్ర్య సాధన ప్రబల ఆకాంక్ష. స్వాతంత్ర్య సాధన అగ్నిహోత్రంలో ఉతుతాభక్తిగ ఎవరికి అందిన సమిదలనువారు జ్వలింప జేసారు. భారత జాతీయ, స్వాతంత్ర్య ఉద్యమాల చరిత్రలో భారతీయ పత్రికలు, పాత్రికేయులు, పత్రికా రచయితలు, సంపాదకులు అత్యంత సాహసవంతంగా నిర్వహించిన పాత్ర మహోజ్వలమయినది. అదొక ఉజ్వల అధ్యాయం. దేశభక్తి ఉద్దేశించిన పత్రికల, స్వాతంత్ర్య యోధులయిన పాత్రికేయుల, పత్రికా రచయితల, సంపాదకుల గొంతు నొక్కడానికి, వారి మేధస్సులను బంధించడానికి, వారి కలాలకు సంకెళ్లు వేయడానికి బ్రిటిష్ పాలకులు పలు దుష్టచట్టాలను ప్రవేశపెట్టి పత్రికా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు భంగం కల్గించారు.

అయినప్పటికీ, అన్ని అవరోధాలను ఎదుర్కొంటూ స్వాతంత్ర్య ప్రియులు పత్రికా ప్రచురణను కొనసాగించారు. తమ పత్రికల ద్వారా స్వాతంత్ర్యోద్యమాన్ని విజృంభింప జేయడానికి అపార కృషి జరిపారు. గాంధీజీ మొదట దక్షిణాఫ్రికాలో, తరువాత స్వదేశంలో తన ఆశయాలకు సిద్ధాంతాలకు కాహళిగా హరిజన్, నవజీవన్ పత్రికలను స్వయంగా తన సంపాదకత్వంలోనే ప్రచురించారు. గాంధీజీ కంటే ముందు గత శతాబ్ది ప్రారంభంలో భారత జాతీయ, స్వాతంత్ర్య ఉద్యమాలలో ప్రముఖ స్థానం ఆక్రమించిన లోకమాన్య బాలగంగాధర తిలక్ స్వరాజ్యం నా జన్మహక్కు అని గర్జించి యువతరాన్ని ఉత్తేజపరిచారు.

ఆయన సంపాదకత్వంలో, మార్గదర్శకత్వంలో ప్రచురిత మయిన రెండు పత్రికలు కేసరి (మరాఠీలో) మరాఠా (ఇంగ్లీషు). మహామేధావి తిలక్ ఈ రెండు పత్రికలలో రాసిన వ్యాసాలు వాటిలో, ఆయన ఇతర రచనలు ఆంగ్లేయ పాలకులకు ఆగ్రహం కల్గించాయి. ఆయనకు వ్యతిరేకంగా 1898లో ఒక కేసుపెట్టి 18 మాసాల కఠిన కారాగార శిక్ష విధించారు. 1908లో మరో కేసు పెట్టి 6 సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష విధించి మాండలేల

(బర్మాల) నిర్బంధించారు. మాండలే జైలులో తిలక్ ఆరోగ్యం బాగా దెబ్బతిన్నది. అయినప్పటికి ఆ జైలులోనే ఆ మహా భాష్యకారుడు గీతారహస్య వ్యాఖ్యానం రచించారు. బ్రిటిష్ ఇండియాతో పోల్చినపుడు హైదరాబాద్ తదితర సంస్థానాలలో రాచరిక నిరంకుశత్వం ప్రజల హక్కులను జీవితాలను విపరీతంగా అణగదొక్కింది. నాటి హైదరాబాద్ సంస్థానంలో ఒకవంక నిజామ్ నిరంకుశ పాలన, మరోవంక నిజామ్ ప్రోత్సాహంతో మతోన్మాద పైశాచిక మూకల రాక్షసత్వం, అమానుష కృత్యాలు భయంకర పరిస్థితిని సృష్టించాయి.

కవులు, రచయితలు, సంపాదకులు, పత్రికా రచయితలు, మేధావులు, దేశభక్తితో, మానవతా దృక్పథంతో, ఆవేశంతో ఆవేదన పొందిన భయానకమైన రోజులవి. నిజాంరాజు నిరంకుశ పాలనల మతోన్మాదులు చెలరేగి అరాచకం, అగ్నిగుండం సృష్టించిన భయంకరమయిన రోజులవి. మారణ హోమం మండిన ఆ రోజుల్లో నిజాం నిరంకుశత్వాన్ని, నిజాం నీడలో పడగలిప్పి బుసకొట్టిన మతోన్మాదాన్ని అమానుషత్వంతో చెలరేగిన దుండగులను నరరూప రాక్షసులను ధైర్యసాహసాలతో ప్రతిఘటించి, వనవత్వ విలువల పరిరక్షణ నిమిత్తం కంకణం కట్టిన నిరుపమాన యోధుడు.

పాత్రికేయుడు, పత్రికా సంపాదకుడు పోయబుల్లాఖాన్, పూర్వపు హైదరాబాద్ రాష్ట్రవిముక్తి ఉద్యమ, స్వాతంత్ర్య సమర చరిత్రలో ప్రముఖుడు షోయిబ్ పాత్ర రక్తాక్షరాలతో లిఖితమవుతుంది. ఆయన అసమానత్యాగం ఉత్తేజపరచే ఒక ఉజ్వల అధ్యాయం. ఆ అమరవీరుని గాథ ఆదర్శ ప్రాయం. చిరస్మరణీయం, హిందూ – ముస్లిం సోదరత్వానికి సజీవ ప్రతీక షోయబుల్లాఖాన్.

షోయబ్ పుట్టింది వరంగల్లు జిల్లా మానుకోటలో. ఆయన తండ్రి హబీబుల్లాఖాన్ నిజాం సర్కారులో ఒక పోలీసు అధికారి. షోయబ్ జననానికి చారిత్రక ప్రాధాన్యం ఉంది. దాదాపు వంద సంవత్సరాల కిందట అప్పుడే భారత రాజకీయ రంగంలో అడుగుపెట్టి ఒక వినూత్న రీతి స్వాతంత్ర్య సమరానికి శంఖారావం విన్పించిన గాంధీ మహాత్ముడు దేశమంతటా పర్యటిస్తూ 1920 అక్టోబర్ 12న తేదీన విజయవాడ నుంచి వార్ధ రైలులో వెళ్లుతూ మానుకోట రైలు స్టేషనులో కొద్ది నిమిషాలు ఆగి అక్కడకి చేరిన అసంఖ్యాక ప్రజలకు దర్శనం ఇచ్చారు. ఆ రోజు పోలీసు అధికారి హబీబుల్లాఖాన్ మానుకోట స్టేషనులో శాంతి భద్రతల బాధ్యత, విధి నిర్వర్తించడానికి నియుక్తులయ్యారు.

గాంధీ మహాత్ముడి నిరాడంబరత్వం, ఆయన ముఖంలోని తేజస్సు హబీబుల్లాఖాన్‌ను బాగా ఆకర్షించాయి. స్టేషనులో విధి నిర్వహణ తరువాత ఇంటికి వెళ్ళిన హబీబుల్లాఖాన్‌కు కొడుకు పుట్టిన శుభవార్త తెలిసింది. తన పసిబిడ్డ ముఖంలో హబీబుల్లాఖాన్‌కు గాంధీ మహాత్ముడు కన్పించాడు. ఆ బిడ్డకు షోయబుల్లాఖాన్ అని నామకరణం చేసారు.

ముద్దుగా అందరు ఆ బిడ్డను 'గాంధీ షోయబ్' అని పిలిచేవారు. షోయబ్‌లో చిన్నప్పటి నుంచే చురుకుతనం ఎక్కువ. బాల్యంలోనే షోయబ్ రచనా పాటవం వికసించింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఆయన పట్టభద్రుడు. పట్టభద్రత అనంతరం పత్రికా రచయితగా ఆయన జీవన రంగంలో ప్రవేశించాడు. షోయబ్ పత్రికా రచన మొదట తేజ్ వారపత్రికలో ప్రారంభమయింది. సామాజిక ప్రయోజనంతో, నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా, మజ్లిస్ ఇత్తెహాదుల్ ముసల్మీన్ మతోన్మాదాన్ని ఖండిస్తూ తన లేఖినిని శక్తివంతమయిన ఒక అస్త్రంగా ప్రయోగించడానికి షోయబ్ కంకణం ధరించాడు.

నిజాం నిరంకుశ పాలనలో జరుగుతున్న అన్యాయాలను, అక్రమాలను, అరాచకత్వాలను, తీవ్రంగా విమర్శిస్తూ షోయబ్ రాసిన వ్యాసాలు తేజ్ పత్రికలో ప్రచురితమయినాయి. మజ్లిస్ ఇత్తెహాదుల్ ముసల్మీన్ అధిపతి కాసింరజ్వీ దుష్ట విధానాలను, మతతత్వాన్ని, అక్రమ చర్యలను విమర్శించినందుకు నిజాం ప్రభుత్వం తేజ్ పత్రికను నిషేధించింది.

ఆ రోజుల్లో ప్రముఖ స్వాతంత్రోద్యమ నాయకులు మందుముల నరసింగరావు సంపాదకత్వంలో వెలువడుతున్న 'రయ్యత్' ఉర్దూ పత్రికలో షోయబ్ రచయితగా ప్రవేశించాడు. రయ్యత్ పత్రికలో గూడ షోయబ్ నిర్భయంగా నిజాం నిరంకుశత్వాన్ని, దమన నీతిని, మతోన్మాదాన్ని ఖండిస్తూ రాసాడు. నిజాం ప్రభుత్వం రయ్యత్‌ను సైతం నిషేధించింది.

షోయబ్ స్వయంగా, తన సంపోదకత్వంలో ఇమ్రోజ్

పత్రికను ప్రారంభించాడు. నిజాం నిరంకుశ పాలనను, మతతత్వాన్ని అధికారుల దమన నీతిని బట్టబయలు చేసి ఖండించే వార్తలకు, వ్యాఖ్యలకు, సునిశితం విమర్శలకు, చురకలకు షోయబ్ తన పత్రికలో అత్యధిక ప్రాధాన్యం ఇచ్చాడు. స్వతంత్ర భారత యూనియన్‌లో హైదరాబాద్ సంస్థానం బేషరతుగా విలీనం కావాలని షోయబ్ తన పత్రికలో గట్టిగా వాదించాడు.

ఆ రోజుల్లో అది అతి సాహసం. ఖాసిం రజ్వీ బహిరంగంగానే షోయబ్ మీద విమర్శలు కురిపించసాగాడు. తన పత్రికలో గాంధీ మహాత్ముడిని ప్రస్తుతిస్తున్న షోయబ్ ముస్లింలకు వ్యతిరేకి అని ఖాసిం రజ్వీ ప్రచారం కొనసాగించాడు. షోయబ్‌ను బెదిరిస్తూ ఆకాశరామన్న ఉత్తరాలు రాసాగినవి. నిజాలను వ్యతిరేకించే వారి చేతులను నరికి వేస్తామని బెదిరించారు.

ఈ అనామకుల ఉత్తరాలతో 1948లో హైదరాబాద్ సంస్థానం పరిస్థితి అదుపు తప్పి భయంకర స్వరూపం ధరించింది. ఆ సంవత్సరం ఆగస్టు 20వ తేదీన ఇమ్రోజ్ సంపాదకుడు షోయబ్‌కు మరో బెదిరింపు లేఖ వచ్చింది. అందులో ఆయనను రజ్వీ అనుయాయులు ఘోరంగా దూషించారు. ఆ రోజు సాయంత్రం హైదరాబాద్ నగరం కాచిగూడలో గల ఇమ్రోజ్ పత్రిక కార్యాలయానికి వెళ్ళి బూర్గుల రామకృష్ణారావు తదితరులు షోయిబ్‌తో చాలసేపు ముచ్చటించారు.

ఆ రోజే అందిన బెదిరింపు లేఖ ప్రస్తావన వచ్చింది. రజ్వీ అనుచరులు మతోన్మాదులని, దుర్మార్గులని, జాగ్రత్తగా ఉండాలని రామకృష్ణారావు ఆందోళన స్వరంతో షోయబ్ కు సలహా ఇచ్చాడు. నేను గాంధీ మహాత్ముడి అడుగు జాడలలో, అహింసా మార్గంలో నడుస్తూ అన్యాయాలను, అక్రమాలను వ్యతిరేస్తున్నాను. మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్నాను. నా మాతృభూమి భారతదేశం కోసం ప్రాణత్యాగం చేయడానికయినా సిద్ధమే.... అని షోయబ్ నిశ్చలంగా రామకృష్ణారావుతో అన్నాడు. తరువాత ఆగస్టు 22వ తేదీన షోయబ్ రాత్రి 12 గంటలకు యదాప్రకారం పత్రిక పని పూర్తి చేసి దగ్గరలో ఉన్న ఇంటికి వెళ్ళుతున్నాడు. ఆ నడిరాత్రి షోయబ్ మీద రజాకార్ రక్కసులు, మతోన్మాదులు దాడి చేశారు. మొదట ఆయన మీద తుపాకి కాల్పులు జరిపారు. తరువాత కత్తులతో ఆయన రెండు చేతులను దుండగులు నరికివేసారు. షోయబ్ వెంట ఉన్న సహచరుడు ఇస్మాయిల్ ఖాన్ గూడ దుండగుల దాడిలో గాయపడ్డాడు. ఇస్మాయిల్ ఖాన్ బిగ్గరగా వేసిన కేకలు విని చుట్టుపక్కల వారు బయటికి వచ్చారు. రజాకార్ దుండగులు పారిపోయారు. రక్తపు మడుగులో షోయబ్ ను వెంటనే ఆసుపత్రికి తరలించారు. 'ఇమ్రోజ్ పత్రిక ప్రచురణ ఆగరాదు. ధర్మం జయస్తుంది...' అన్న చివరి సందేశంతో దేశభక్తుడు, యువ సంపాదకుడు షోయబుల్లాఖాన్ ఆసుపత్రిలో చేరిన కొన్ని గంటలకే అమరుడయ్యాడు. అప్పుడు షోయబ్ వయస్సు ఇరవయి ఎనిమిది సంవత్సరాలు.

ఆ రోజుల్లో భారతప్రభుత్వపు ఏజెంట్ జనరల్‌గా హైదరాబాదులో ఉన్న జాతీయ నాయకుడు. భారత రాజ్యాంగ రచన కమిటీ సభ్యుడు కె.ఎమ్. మున్షీ. యువ సంపాదకుడు షోయబ్ జాతీయవాది.

దేశభక్తుడు, సాహసవంతుడయిన జర్నలిస్ట్ అని మున్షీ ప్రశంసించారు. పూర్వపు హైదరాబాద్ సంస్థానం విముక్తి ఉద్యమ చరిత్రలో, విశేషించి నాటి పాత్రికేయులు అత్యంత సాహసవంతంగా నిర్వహించిన పాత్రలో యువసంపాదకుడు. స్వాతంత్ర్య సమరయోధుడు, మానవతావాది షోయబుల్లాఖాన్ త్యాగ గాథ నిరుపమానమయినది. ఉన్నత పాత్రికేయ ప్రమాణాలకు విలువ ఇచ్చే పాత్రికేయులు, సంపాదకులందరికి షోయబ్ ఆదర్శప్రాయుడు.

128

# సిద్ధప్ప వరకవి

– డా॥ బి.వి.ఎన్. స్వామి

ఆయన చదివింది ఏడవతరగతి. ఆరు భాషలపై ఆయనకు పట్టుంది. చేపట్టింది ఉపాధ్యాయ వృత్తి. సమాజ సేవ ఆయన ప్రవృత్తి. స్వరాజ్య ఉద్యమంలో రూమి టోపీకి బదులుగా, గాంధీ టోపి ధరించి విధులకు వెళ్ళి నందుకు ఉపాధ్యాయ ఉద్యోగం నుండి నిజాం ప్రభుత్వం ఆయనను తొలగించింది. అప్పటి నుండి తన ప్రవృత్తి కనుగుణంగా వాస్తు, వైద్య, ఆయుర్వేద శాస్త్రాల్లో ప్రాముఖ్యం సంపాదించి ప్రజలకు సేవ చేసారు. ఆయనే సిద్దప్ప వరకవి. కోహెడ మండలం గుండారెడ్డి పల్లెకు చెందిన లక్ష్మమ్మ, పెద్ద రాజయ్యలకు 1903లో జన్మించారు. 1984లో తాను చనిపోయే రోజును ముందుగానే ప్రకటించి తేది. 23.3.1984 రోజున సాయంత్రం 3 గంటలకు ప్రాణాలు విడిచారు. తెలంగాణ తొలి సమాజ వేదాంత కవి, గోల్గొండ కవి, తత్వకవిగా పేరు పొందారు.

తెలంగాణాలో నిజాం కాలాన సంక్లిష్టమైన పరిస్థితు లుండేవి. ఒకవైపు అవిద్య, అనారోగ్యం, అసమానతలు, నిజాం సైన్యం, దొరలు, దేశ్‌ముఖ్‌ల ఆగడాలతో ఈ ప్రజలు అసహాయులై దీనంగా కాలం గడిపారు.

అలాంటి ప్రజలను స్వాంతన పరచడానికి ఈ ప్రాంతంలో వరకవులు పుట్టుకొచ్చారు. అందులో ప్రసిద్ధుడీ సిద్దప్ప. భక్తి భావన ముందు అసమానతలు, కుల భేదాలు కానరావు కనుకనే అంతా ఒక్కటే అని నినాదించాడు. ఆ మాట ప్రజలకు బలాన్ని ఇచ్చింది. మూఢ విశ్వాసాలను ఖండించి ప్రజలకు జ్ఞానమార్గాన్న చూపించారు. తమ కష్టసుఖాలను పట్టించుకొని, వాటి పరిగీతమార్గాలను చూపించటంవల్ల ప్రజలకు ఆరాధ్యుడయ్యాడు. అందుకే శిష్యగణం తయారయ్యారు. జలస్థంబన ఊరి జనం మంచి చెడ్డలు బ్రహ్మంగారు కాలజ్ఞానం చెప్పినట్లు, వీరు తన వద్దకు వచ్చిన ప్రజలకు భవిష్యత్తు బోధించి వారికి ధైర్యాన్ని ఇచ్చి పంపేవారు. ఆపాటి మాట సాయం అనేది ఆనాడు ఒక పెద్ద బాధ్యత అది నెరవేర్చి సిద్దప్ప వరకవి చిరస్మరణీయు డయ్యాడు.

సిద్ధప్ప వరకవి జ్ఞానబోధిని నాలుగు భాగాల్లో రచించి వరకవిగా గొప్ప పేరుతోపాటు యక్షగానాలు, స్తోత్రాలు, వర్ణమాలలు, సుభాషితాలు, హితబోధలు, వేదాంత తత్వకీర్తనలు, కాలజ్ఞానములు, కందార్ధదరువులు, నక్షత్రమాలలు వంటి ఎన్నో రచనలు చేసారు. సురవరం ప్రతాపరెడ్డి తన గోల్కొండ పత్రికలో రాసారు. నీల జంగయ్య తెలుగు తత్వకవి పరిశోధన గ్రంథంలో వేమన, కబీర్‌దాస్ పద్య పోలికలు ఎలా ఉన్నాయో సిద్ధప్ప రచనలోనూ అలా ఉన్నాయని అన్నారు.

పల్లెలో పుట్టి పెరిగినవాడవటంవల్ల, తన కులవృత్తిని విడువకపోవటంవల్ల, నిత్యం ప్రజలలో సేవా సంబంధాలు నెరపటంవల్ల సిద్దప్ప సాహిత్యంలో తెలంగాణ పలుకుబడులు

తేలియాడతాయి. తన కులవృత్తిలో భాగంగా మట్టి తడపడం, కుండలు చేయడం, వాము పెట్టడంవంటివన్నీ చేస్తూనే మంత్రముగ్ధులను చేసే గొప్ప కవితాత్మక ప్రయోగాలు చేసారు. ఆయన తన గురించి గొప్పలు ఎప్పుడు చెప్పుకోక పోగా, తనలోని అక్షరశక్తికతటికీ బాసరమ్మ (బాసర సరస్వతీదేవి) కృపాకటాక్షణాలే కారణమని ప్రకటించడం విశేషం. సీసం, గీతం, కందం, ఆటవెలది, తేటగీతి వంటి పద్యాల శైలిలో అద్భుతంగా, సరళసుందరమైన పద ప్రయోగాలు చేసారు. వీరి పద్యాలు, వేమన పద్యాలవలె పండిత పామర నాలుకలపై తారాడతాయి.

సామాజిక స్థితిగతులకు స్పందించి రచనలు చేయడం, దురన్యాయాలను దునుమాడడం వీరికి ఇష్టమైన కర్తవ్యాలు. దొరలు, పెత్తందారులు, దేశీయులు, దేశ్‌ముఖ్‌లు వంటి పెత్తందార్లపై తన పద్యాలలో విరుచుకపడ్డారు.

బూతి జంద్యాలు చేతుల రాతి లింగాలు
చేతురూ శివపూజ చెలుల ఇంట
చక్కనీ దండాలు చంక కమండలాల్
పడకవేతురు -- పడుచులకునూ!

అంటూ నేడు చూస్తున్న దొంగస్వాముల బాణాన్ని నాడే తేటతెల్లం చేసారు. పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, యోగివేమనలను ఆదర్శంగా చేసుకొని సాహితీసేద్యం చేసారు.

ఆకాశమొక్కటే తెప్పలతీరులెన్నో
జలా ఒక్కటే అయినా చెట్ల సారంవేరు
మానవ జన్మ ఒక్కటేకాని గుణాలు వేరు

ఇలా ఎన్నో తత్వ ప్రబోధనలు సిద్దప్ప వరకవి రచనల్లో మనకు కనిపిస్తాయి.

"చదువులేదిక నాంధ్ర సంగ్రహంబులలెస్స,
కనిచూడలేదొక్క కావ్యమైన
నోట బల్కియు చేత నొనరంగ వ్రాసింది చెలువొంద
మీ పాదసేవకుడను"

అని వినమ్రంగా తెలిపాడు. వాడివరంచే కవిత్వానికి చేరువై పద్యం రాయగలిగానని, అందుకే తాను వరకవినని తెలుపుకున్నాడు. "గొప్పవాడనుగాను, కోవిదుడనుగాను తప్పులున్నను దిద్దుడీ తండ్రులార" అని విశదపరిచాడు. చాలామంది తాత్వికుల్లానే సిద్ధప్ప కూడా వైరాగ్యాన్ని బోధించారు. ప్రజలు ఈ బోధనలను కళ్ళకద్దుకున్నారు.

సీ. అజ్ఞానియే శూద్రుడవనిలో నెవడైన
సుజ్ఞానియే యాత్మ సుజనుతడు
వేదంబు జదివినా విప్రుడా విహితుండు
బ్రహ్మమెరిగిన వాడే బ్రాహ్మణుడు
వర్తకంబును జేయు వణిజుండు వైశ్యుండు
అవని పాలించె నరుడె ప్రభువు
సకల నిందలు నోర్చు సదయిడు నరుడౌను
మత భేద విడిచిన యతివరుండు

గీ. జన్మచేతను వీరింక కలియంషమున
పేరు గాంచిన యెవరెవరి బేర్మి పనులు
వినుడి మాయప్ప సిద్దప్ప విహితుడప్ప
కనుడి కరమొప్ప కవికుప్ప కనకమప్ప

అంటూ చాతుర్వర్ణ లక్షణాలను పునర్నిర్వచించి, భావజాలపరంగా సమతను సాధించాడు. చాలా పద్యాలలో ఆర్తి, వేదన, సంఘరీతిపట్ల కసి, అసమానతలపట్ల అసహ్యం కనపడుతుంటాయి.

సీ. ఏ కులంబని నన్ను ఎరుకతో నడిగేరు
నా కులంబును జెప్ప నాకు సిగ్గు
తండ్రి బొందిలివాడు తల్లి దాసరి వనిత
మా తాత మాలోడు మరియు వినుడి
మా యత్త మాదిగది మామ యెరుకలవాడు
మా బావ బల్జతడు మానవతుడు
కాపువారీ పడుచుకాంత దొమ్మరి వేశ్య
భార్యగావలె నాకు ప్రాణకాంత

ఈ విధంగా కులవాదాన్ని నిరసిస్తాడు. సమస్త కులాల విరాట్ స్వరూపంగా కనిపిస్తాడు.

"రాతి బొమ్మల మొదట రాశిగా అన్నంబు
తినమన్న యా రౌతు తినదురన్న
తినెడి వాడవు నీవె తీవంబు చెందేవు
కానలేవు నీలోని తిమిరములను
పేదలకు అన్నంబు పెటు ధైర్యంబులేదు
గట్టురాళ్ళకు తిండి పెట్టగలవే...." అంటాడు.

వీరి పద్యాల్లో జాషువా, కాళోజీల అడుగుజాడలు కనపడతాయి. భక్తి మార్గంలో ఉంటూనే మూఢ భక్తిని

నిరసించాడు. జ్ఞాన మార్గంలో పయనిస్తూ కొత్త దాడులు చూపాడు. ఛందస్సును పుక్కిట పట్టుకున్నా. వ్యాకరణాన్ని తోసివేయలేదు.

తెలంగాణలో మరణం తరువాత కూడా బతికున్న సిద్దప్ప వరకవి అత్యంత ప్రసిద్ధుడు. సిద్దప్ప జ్ఞాపకార్థం 1996లో అతని సమాధి వద్ద విగ్రహప్రతిష్ట ఏర్పాటు చేశారు. ప్రతి కార్తీక పౌర్ణమి రోజున నలుమూలల నుంచి వచ్చిన వీరి శిష్యులు విగ్రహం సాక్షిగా గురుపూజోత్సవాన్ని జరుపుతారు. కార్తీక పౌర్ణమే కాకుండా గురుపౌర్ణమి పాల్గుణ బహుళ సప్తమి రోజుల్లో ఆశ్రమంలో అన్నదానాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుపుతుంటారు. 1984లో సిద్దప్ప వరకవి భౌతికంగా ఈ లోకం నుండి వెళ్ళిపోయినా శిష్యుల చేతుల ద్వారా సారస్వతిభిమానుల గుండెల్లో చిరస్థాయిగా ఉన్నాడు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడినాక, కొత్తగా తీర్చిదిద్దబడిన తెలుగు వాచక పుస్తకాల్లో ఒకటైన తొమ్మిదవ తరగతి తెలుగు వాచకంలో సిద్దప్ప వరకవి జ్ఞానబోధిని రెండవ భాగం నుంచి ఒక సీసపద్యం "కోపంబు మనుషులా కొంపముంచు" అనే పద్యాన్ని చేర్చారు. అలా సిద్దప్ప ఎదుగుతున్న చిన్నారుల నోళ్ళలో నానుతున్నాడు.

## 129 సిరికొండ వెంకటరావు

– డా॥ వెల్చాల కొండలరావు

సిరికొండ వెంకట్రావు గారు కరీంనగర్ జిల్లా సిరికొండ గ్రామంలో జన్మించి ఉస్మానియా యూనివర్సిటీలో ఎం.ఎ., ఎల్.ఎల్.బి. వరకు చదివి, న్యాయవాదిగా సిద్ధిపేటలో స్థిరపడ్డారు. జులై నెల 13, 1933నాడు జన్మించిన వెంకట్రావు గారు మార్చి నెల 10, 2010 సంవత్సరంలో పరమపదించారు. మెదక్ జిల్లాకు చెందిన సిద్ధిపేటలో బహు ప్రతిభావంతునిగా, సాహిత్య ప్రియునిగా, సాహిత్య ప్రోత్సాహకునిగా, సంఘసేవకునిగా, పుట్టపర్తి సాయిబాబా ప్రియభక్తునిగా, మెదక్ కరీంనగర్ జిల్లాల్లోనే కాక తెలంగాణా ప్రాంతంలో, హైదరాబాదు నగరంలో చాలామంది మేధావులకు, సాహిత్యవేత్తలకు, సంఘసేవకులకు తెలిసినవారు.

విమర్శకుల్లో ఎంతో చక్కని విమర్శనాత్మక, పరిశోధనాత్మక దృష్టి దృక్పథమున్న వారుంటారు. వారు గ్రంథకర్తలు కాకపోవచ్చు, వ్రాత రూపేణా వారి అభిప్రాయా లను అట్టే వెలిబుచ్చక పోవచ్చు. అయినా వారు బహు గ్రంథాలు చదివినవారు కావచ్చు. సాహిత్య చర్చల్లో పాల్గొని వారి ప్రతిభా పాటవాలతో ఎంతో మందిని ప్రభావితం చేసి పలువురి ప్రశంసలందు కున్నవారు కావచ్చు.

సాహిత్య సభలకు, సదస్సులకు రచయితలెంత ముఖ్యమో, బాగా తెలిసిన శ్రోతలు, విమర్శకులు కూడా అంతే ముఖ్యం. వీరు లేకపోతే వారు లేరు, వారు లేకపోతే వీరు లేరు. రచయితలను ప్రావోక్ చేసెడివారే సద్విమర్శకులు. విశ్వనాథ వారిని బాగా ఇన్స్పైర్డ్‌గా మాట్లాడించాలంటే వారికి ప్రావోక్ చేసే విమర్శకుడైనా, శ్రోతైనా కావాలని వారిని విన్నవారు అప్పట్లో అంటుండే వారు, అలా వారిని ప్రావోక్ చేసేవారు కూడా.

ఒకప్పుడు తెలంగాణలో కొందరి ఇళ్ళల్లో కావ్య పఠనాలు జరిగేవి. వాటిని వినడానికి చాలామంది మంచి సాహిత్యాభిరుచి కలవారు వచ్చేవారు. రచనలపై, రచయితలపై చర్చా గోష్ఠులు జరిగేవి. అచటికి మేధావులు, కవులు, విమర్శకులు, సాహిత్య ప్రియులు మాత్రమే ఎక్కువ వచ్చేవారు. రచనలపై, రచయితలపై చర్చాగోష్ఠులు జరిగేవి. అచటికి మేధావులు, కవులు, విమర్శకులు, సాహిత్య ప్రియులు మాత్రమే ఎక్కువ వచ్చేవారు. అవి మేథో ప్రేరణకు, హృదయ స్పందనకు, ఆలోచనా అవలోకనలకు ఎంతో నిండుగా, మెండుగా, సరదాగా నడిచేవి. అలాంటి కొద్ది మంది మేధావులు పాల్గొనే మితమైన ఇంటలెక్చువల్ మీట్స్ ఇపుడు బహు అరుదైపోయాయి. ఇపుడన్నీ పెద్ద వేదికల పాలై ఎక్కువ ఆవిష్కరణ, అభినందన సభల్లాంటివై పోయాయి.

అలాంటివి కరీంనగర్‌లో జువ్వాడి గౌతంరావు గారింట్లో, సిద్ధిపేటలో సిరికొండ వెంకటరావు గారింట్లో ఎంతో ఇంపుగా, సొంపుగా జరిగేవి. అవి తెలంగాణలోని

సాహిత్య కృషీవలులను ఎంతో ప్రోత్సహించి, వారిం సరిపోయే శ్రోతలను, విమర్శకులను, విశ్లేషకులను సమకూర్చేవి. అవి వికాసవంతమైన చర్చాగోష్ఠులు. అందరూ ఖులాసాగా కూర్చొని సాహిత్య కబుర్లు చెప్పుకుంటూ, సాహిత్య రచనల గురించి వినుకుంటూ మధ్య మధ్య 'అబ్బా ఎంత బాగున్నాయండీ'యని అనుకుంటూ చప్పట్ల, వహ్వాల మధ్య ఎంతసేపు విన్నా విసుగు రాకుండా ఉర్దూ ముషాయిరాలలా సాగేవి.

ఇదంతా ఎందుకు చెప్పవలసి వస్తుందంటే ఆ రోజుల్లో అలాంటి ఇంటలెక్చువల్ గ్యాదరింగ్స్ లేకపోతే, వాటిద్వారా చక్కని సాహిత్య వాతావరణాన్నే అవి సృష్టించకపోతే ఈనాటి తెలంగాణా ప్రముఖ కవులెందరో వారి సృజనాత్మక రచనలు చేయడానికి ఆస్కారముండేది కాదు. ఒకనాడు రాజులు, ప్రభుత్వాలు, సాహిత్య సంస్థలు చేసినంత పనిని జువ్వాడ గౌతమరావు గారిలాంటి, సిరికొండ వెంకటరావుగారి లాంటివారు వారి ఇళ్ళల్లో చేసేవారు. అలాంటివేవీ ఈనాడు? ఈనాటివన్నీ ఫార్మల్ సమావేశాలే కాని, ఇన్ఫార్మల్, ఇంటలెక్చువల్ సమావేశాలు కావు? ఆనాటివి చిన్నవైనా ఒక వ్యక్తియొక్క రచన యొక్క సాహిత్య విశిష్ఠతను అంచనా వేయడానికి ఎంతో అక్కరకొచ్చేవి? ఎవరు ఔనన్నా, కాదన్నా ఆనాటి వాటికి రాసెక్కువ, ఈనాటి వాటికి వాసెక్కువ అని అనవలసి వస్తుంది.

వెంకట్రావు గారు రచనలు అట్టే ఎక్కువ చేయక పోవచ్చు కాని వాటికన్నా ఎక్కువ సాహిత్య విస్తరణకు కావలసినవన్నీ చేస్తూ, పండితులచే, మేధావులచే, కవులచే కొనియాడబడ్డారు. విమర్శకులచే సద్విమర్శకుడనిపించు కున్నారు. పరిశోధకులచే, విద్యార్థులచే వారంతటి పుస్తక ప్రియులు, సాహిత్యప్రియులు, పరిశోధనా ప్రియులు, సాహిత్య ప్రోత్సాహకులు అరుదంటే అరుదని అనిపించు కున్నారు. వారి ఇల్లే ఒక గ్రంథాలయం. అది ఎప్పుడూ పదిమంది కవులచే, రచయితలచే కళకళలాడే ప్రతిభా పరిమళ ప్రాంగణం. వారి చిరునవ్వుతో ఆహ్వానించే ఆహ్వానమే అచటికొచ్చేవారికి పాయసం. వారి వినయతే, వినమ్రతే వారు వారందరికందించే పరమాన్నం. వారి స్వాగత సుస్వాగత పలుకులు, మర్యాదలు, వినయ విధేయతలే వారింటికి వచ్చే వారందరికీ ఆనందం, బ్రహ్మానందం. ఆయన ఒకరికి జ్ఞానిగా కనబడితే ఒకరికి ధ్యానిగా కనబడేవారు. ఒకరికి మేధావిగా కనబడితే మరొకరికి పుస్తకారాధకుడిగా, ఒకరికి వారు సృజనకు వారు స్ఫూర్తి ప్రదాతగా, స్వరవరంగా వినబడితే, మరొకరికి సద్విమర్శ దృష్టి దృక్పథం గల వటవృక్షంగా కనబడేవారు. ఒకరికి దాతగా కనబడితే మరొకరికి సాహిత్య సారస్వత విధాతగా కనబడేవారు.

వారు ఎంతోమందిని ప్రభావితం చేశారు, ఎంతో మందిని సాహిత్య పఠనంవైపు, సాహిత్య రచనవైపు ప్రోత్సహించారు. ఎంతోమందిలో సాహిత్యాభిరుచిని పెంచి, వారి స్వీయ సాహిత్యాభి రుచిని వారికి పంచి, ఎన్నో పుస్తకాలు స్వయానా చదివి, ఇతరులకు 'ఇవిగో ఇవి బాగున్నాయి' చదవండని అందించేవారు. వాటిలో నుండి మచ్చుకు కొన్ని వినిపించేవారు కూడా. ఇక ఇంతకన్నా సాహిత్యసేవ మరేముంటుంది? మన విశ్వవిద్యాలయాలు, అకామీలు, వివిధ విద్యా సాహిత్య సాంస్కృతిక సంస్థలు చేయవలసిన ముఖ్యమైన పనులు ఇవేకదా మరి? ఇలా చేసిన, చేస్తొన్న వారికి కూడా మనం మన తెలంగాణా సాహిత్య చరిత్రలో తగిన స్థానం కల్పించాలి కదా మరి? అదే కదా మరి మనం వారికి అర్పించగల సరియైన కృతజ్ఞతాంజలులు, నివాళులు...

**అతడు**

అతడెంతో తెలివైన వాడు, తెలిసినవాడు కూడా
వృత్తిరీత్యా న్యాయ-వాది,
ప్రవృత్తిరీత్యా న్యాయ-నిధి.
ఆదర్శరీత్యానే కాదు, ఆచరణరీత్యా కూడా
నిత్య సత్యవాది, ధర్మవాది.
చల్లని మెల్లని గొంతు,
సుతిమెత్తని మనస్సు,
చిగురులాంటి చిరునవ్వు
అగరులాంటి చుట్టుముట్టు
అన్నిటా ఒక సంస్కార సహృదయ పడికట్టు.
అతనితో గడపడమదొక శాంతి,
ఆత్మిక, ఆధ్యాత్మిక ప్రశాంతి
అతని ఒక్కమాట చాలు,

ఒక్క పరామర్శ,
ఒక్క సద్విమర్శ
ఒక్క శుభాకాంక్ష
ఒక్క అభినందన
ఒక్క కంటితళుకు
ఒక్క కంటి మెళుకు,
ఒక్క కరచాలన
ఒక్క "వెన్నుతట్టు", "మునివ్రేళ్లతో ముట్టు",
అదొక అనిర్వచనీయ అనుభవం.
అతడందరి బంధువు
దయా సింధువు
ప్రేమ విందువు
అమృత బిందువు,
అజాత శతృవు.
సాంప్రదాయ వాదే కాని
వలువలకు చెందిన సాంప్రదాయ వాది కాదు.
విలువలకు చెందిన సాంప్రదాయ వాది,
సవ్యతతూ కూడిన నవ్యతావాది.
విశాలత, గాఢత, గాంభీర్యత, భారసామ్యత,
తులనాత్మకత
తెలిసినవాడు.
బెణకని నీతి, తొణకని రీతి కలవాడు,
స్థిర సుస్థిరతలు ఆశించేవాడు,
స్మిత వర్చస్సుడు, "స్థితప్రజ్ఞుడు".
జీవితమంతా ఒక త్యాగంగా, యాగంగా గడిపినవాడు,
కుల మత భేదాలకతీతుడని అందరిచే కొనియాడ బడినవాడు.
అంతిమ యాత్రలో అందరిచే కన్నీటి వీడ్కోళ్ళు అందుకున్నవాడు.
నీతి నిజాయితీల్లో నిప్పులాంటివాడు,
విద్యావంతుడు, వికాసవంతుడు,
వినయవంతుడు, వివేకి,
అనేకానేక భావాలు, విలువలు,
సంస్కృతులు, సాంప్రదాయాలు,
సాహిత్యాలు, విశ్వాసాలెరిగినవాడు.

తన భావాలను ఇతరులపై రుద్దక
ఇతరులవి సావధానంగా వినేవాడు,
క్రమశిక్షణ, నియమపాలన, కృతజ్ఞతాశీలన
మాట, మర్యాద, మన్ననలు తూ.చ. పాటించేవాడు.
మనుష్యులను, వారి మనసులను, మమతలను
వ్యక్తిత్వాలను, మంచితనాలన, ప్రతిభలను
సహృదయాలను అట్టే పరికించి పట్టుకునేవాడు.
వాదనలో వేదంలా చిక్కని చక్కని వాక్పాడి కలవాడు.
ఎంతో లోతైన భావకుడు,
నిరంతర అధ్యయిని, సద్విమర్శకుడు
నవ్యత, సవ్యత, భావ్యత, తెలిసినవాడు.
క్రొత్తందనాన్ని, స్వచ్ఛందనాన్ని అట్టే పట్టుకునేవాడు.
సృజనాత్మకతను నచ్చేవాడు, మెచ్చేవాడు.
వ్యక్తిని వ్యక్తిత్వంతో కొలిచేవాడు,
అతిశయోక్తికి వెనుకాడేవాడే కాని
వలసిన చోట అభినందించుటకు
వెనుకంజవేసేవాడు కాదు.
ఎంత రూపపొడగరో అంత గుణపొడగరి,
ఎంత ఆకర్షణీయుడో అంత ఆత్మీయుడు,
ఎంత బంధువులకు బంధువో,
స్నేహితులకు సింధువో
అంత అందరికీ ఆమోదమైన అందరివాడు.
ఎంతో ఆత్మీయంగా, సాత్మీయంగా, ఆదరంగా
సాదరంగా, అన్యోన్యంగా మనసిచ్చి మాట్లాడేవాడు.
'సత్యసాయి' సత్యాలు, విలువలు, ప్రేమలు
పెంచి పంచిన పరమ భక్తుడు.
అందరి మనసులు, మమతలు
మర్యాదలు చూరగొన్నవాడు.
తీర్థంలాంటి, సార్థంలాంటి, సారంలాంటివాడు.
అందరి గుండెల్లో గుడి ఘంటల్లా మ్రోగినవాడు.
అందరి మనస్సుల్లో ఆమనిలా నిలిచిపోయినవాడు.
అతడిక లేడు.
ఉన్నట్టుండి కలలా మాయమయాడు,
కాలగర్భంలో కలిసిపోయాడు.

# 130 సిరిప్రెగడ భార్గవరావు

**- డా॥ తిరునగరి**

పల్లెలు మా నివాసములు పచ్చని పంట పొలాలు మా మనః

పుల్లత గూర్చు చైత్రములు, బోదెల పైని రసాల శాఖికా

పల్లవముల్ గ్రసించు చిరుపాటలదియాని తేనెతేటలు

జిల్లు పికంబు మా యనుగుచెల్లెలు గానమె మాదు ప్రాణమౌ''

అని కంఠమెత్తి పాడిన కవికోకిల సిరిప్రెగడ భార్గవరావు.

ఎక్కడో నల్లగొండజిల్లాలోని చండూరు సమీపముగల చిరుపల్లె గూడ్రెపల్లిలో సిరిప్రెగడ జన్మించారు. ఆయన జనన తేది కూడా సాహితీలోకానికి తెలియదు. చాలా పిన్న వయస్సులోనే 1963లో ఆయన అస్తమించారు.

1934లో గుంటూరు జిల్లా 'ఏదుబాడు' నుండి 'కవిరత్న' అంబటిపూడి వేంకటరత్నంగారు నల్లగొండ జిల్లాలోని చండూరుకు వచ్చి అక్కడే స్థిరనివాస మేర్పరచు కున్నారు. కృష్ణభక్తులైన అంబటిపూడివారు సంస్కృతాంధ్ర భాషా విశారదులు,విద్వత్కవులు. చండూరు పరిసరప్రాంతాల ప్రజల ఆదరాభిమానాలు అనతికాలంలో ఆయనకు దండిగా లభించాయి. ప్రజల సహకారంతో తమ ఆశ్రమంలో కృష్ణభక్త సమాజాన్ని స్థాపించారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలతో కృష్ణసంకీర్తన సభలు నిర్వహించారు. సహజంగా కవులైన అంబటిపూడి 'సాహితీ మేఖల' అనే సంస్థను స్థాపించారు. అనేకమంది శిష్యులను కూడగట్టుకున్నారు. వారితో సంస్కృత కావ్యాలు పూర్వాంధ్ర కావ్యాలు, నవ్యాంధ్ర కావ్యాలు చదివించారు. సాహిత్య దేశికులుగా వారికి భాష పట్ల, సాహిత్యం పట్ల అభిమానం కలిగించడంలో కృతకృత్యు లయ్యారు. వారి శిష్యులలో సిరిప్రెగడ భార్గవరావు, పులిజాల హనుమంతరావు, ధవళ శ్రీనివాసరావు, పులిజాల గోపాల రావు, మద్దోడు సత్యనారాయణ, తాడిశెట్టి నరసింహగుప్త, మంచుకొండ శివలింగయ్య వంటి ప్రముఖులు ఉన్నారు. వారిలో భార్గవరావు సంస్కృతాంధ్రభాషావ్యవసాయం ఎక్కువగా చేసినవారు. ఆయనది కవితారూప తపస్సు, పద్యరచనలో తనదైన శైలీ రమ్యతను సాధించారు. గంగాఝరీ ప్రవాహ సదృశం అయన కవితాధార. ఆయన జీవించి ఉండగా రచనలేవీ ముద్రింపబడలేదు. భార్గవరావు మరణానంతరం 1967లో ఆయన పద్య రచనలన్నీ 'భార్గవానందలహరి' పేరుతో గ్రంథంగా వెలువడింది. అది సాహితీ జగత్తును ఓ కుదుపు కుదిపింది. ఆకృతిని చదివి ప్రశంసించని సాహితీపరుడు, సహృదయుడు లేడు.

సిరిప్రెగడ భార్గవరావు నవ్యభావకవి. కవితా తపస్వి, రససిద్ధుడు. తెలంగాణపు ముద్దుబిడ్డ. భార్గవరావు శోకమే పద్యమై పొంగివచ్చింది. భావకవుల కవిత్వం వలెనే సిరిప్రెగడ కవిత్వమంతా ఆత్మాశ్రయమే. సంప్రదాయ మూల్యాలను పరిరక్షించి, అద్భుతమైన పద్యాలను రచించిన భార్గవరావును, నవ్యభావకవి అని విమర్శకులు పేర్కొన్నారు.

ఆనాటి కవి ప్రవరకందరికీ నీడనిచ్చిన కవితా మాకందం సాహితీమేఖల, భార్గవానందలహరిలో

'వీణానిక్వణనమ్ముతోడ, కబరివిన్యస్తపుష్పానన
ధ్యానమ్ముక శ్రుతిగూర్చియున్ గళమునెత్తంబాపు ఆ వేళనీ
సానందద్యుతి చంద్రికా లలితలాస్యన్యాస మైసర్గిక
శ్రీ నైర్మల్యముఖంబు జూపగదె తల్లీ సాహితీ మేఖలా'

అంటూ ఆ సంస్థ గొప్పతనాన్ని సిరిప్రెగడ ప్రస్తుతించారు. వృత్తరచనలో, శిల్పతో శబ్దాలంకార ప్రయోగము ఆరితేరిన కవి సిరిప్రెగడ. భార్గవానందలహరిలో

పన్నీరు, కన్నీరు, మున్నీరు, భక్త్యాంజలి అనేవి ప్రధాన శీర్షికలు.

పన్నీరులో – ప్రాంజలి, గానేందిర, ఏకాంతగోష్ఠి, నెలబాలుడు, మధురయామిని, తెలుగుతల్లి, మధులక్ష్మి, ఓదార్పు ఆవేదన అన్న ఖండకావ్యాలున్నై.

కన్నీరు, సతీవియోగంతో రచించిన శోకకావ్యం.

మున్నీరులో – యశోద పిలుపు, వేణుగానం, ఏకాంత గోష్ఠి, రాధికా విరహగీతి, అందాల కలము, భావమైత్రి వంటి పదమూడు ఖండికలున్నై.

భక్త్యంజలిలోని నాలుగు ఖండకావ్యాలు ఆయన గురుదేవులైన అంబటిపూడి వేంకటరత్నంగారిని ప్రస్తుతిస్తూ రచించినవే.

'కోతలు వద్ద నాయెడ దక్కునే నవనీతము
భిక్షపెట్టి ప్ర
శ్లీత మనోజ్ఞగానరస సిధువుచే నుపశాంతి గూర్చి లీ
లాతత పాదనూపుర ఝుళంఝుళ రమ్యరమమున్ స్ఫుర
ద్గీతికలందజేసి జగతిన్ నను నిల్పెడి వాణి మ్రొక్కెదన్
అని (ప్రాంజలి)

వాణిని కవి ప్రశంసించిన తీరు మనోజ్ఞం.

కన్నులరమోడ్చి కమ్మని కంఠమెత్తి
సుందరోహకరంబితానందగగన
యానములలోన మోహనగార ఝుల
నాలపింతుమురమ్ము నాయందునీవో వంటి పద్యాలు
(ఏకాన్త గోష్ఠి)

సిరిప్రెగడ భావకవితా సౌందర్యాన్ని ఎత్తి చూపుతాయి. కృష్ణశాస్త్రిని తలపుకు తెస్తాయి.

'నాలోన వందబృందానమ్ములు లేచి
దిగ్దిగంతల నర్తిల్లనిమ్ము
నాలోన వేయిరత్నాకరంబులు పొంగి
శంపాలతత గౌగిలింపనిమ్ము
నాలోన లక్షఘంటానాదములు మించి
నినదించి జగమెల్ల నిండనిమ్ము
నాలోన గోటి చందన సౌరభములూరి
ఆసీమ ఈ సీమ నలమనిమ్ము
నీ యశోవైభవ ప్రవాహయామాన
గౌతమీకృష్ణవేణి ప్రపూతశీత
నవ పయోధార నాహృదానందవిధి
కావ్య కమనీయసారై కదలనిమ్ము (తెలుగుతల్లి).

సిరిప్రెగడ పోతన్నలాగా పోతపోసిన సీసపద్యాల రచన ఆయన కవితా ప్రౌఢిమకు శైలీరమ్యతకు పరమోదహరణాలు.

సిరిప్రెగడ 'కన్నీరు' పద్యాలు వింటే శిలలు ద్రవించి ఏడుస్తాయి. భార్యవియోగంతో క్రుంగిపోయి ఆయనలోని శోకం ఏరై పారింది. తెలుగు సాహిత్యంలో భార్యావియోగం వస్తువుగా దువ్వూరి, విశ్వనాథ వంటి ప్రముఖులు రచించిన కావ్యాలు అందరికీ తెలిసినవే. నేనెరిగినంతవరకు 'కన్నీరు' వంటి శోకకావ్యం తెలుగుసాహిత్యంలో రాలేదు.

శోకబంధురమైన జీవితం గడుపుతూ ఉండగా భార్గవుడికి వివాహమయింది. తన జీవితం సుఖప్రదమైందని ఆనందించాడు. కొద్దికాలం అర్ధాంగిలో స్వర్గాన్ని దర్శించాడు, అనుభవించాడు. తాను సర్వస్వంగా భావించిన ఆమె అకస్మాత్తుగా కన్ను మూసింది. భార్గవరావు భూనభోంత రాళాలు ద్రవించి పోయేలా విలపించాడు. ఆయన జీవితపు సొంపుల మేడలు కూలిపోయినాయి. కన్నీటి కణాలే మిగిలినాయి.

'నా యానందయవై దరస్మితమవైన వెల్లువై చూడ్కివై
నా యుత్సాహమలై సుధారంజనివై నాశయ్యపై సుప్తివై
నా యిష్టంబుల ప్రోవువైమానసువై నా సర్వమై నేనయై
మాయంబైతివి నీవు నీవులేని జగతీ మధ్యన నే
మిధ్యగాన్.' (కన్నీరు)

అన్న ఒక్క పద్యం చాలు సిరిప్రెగడ హృదయం దుఃఖార్ణవమైందని చెప్పడానికి.

కన్నీరులోని ప్రతిపద్యం ఘోషించిన కవినేత్రాల నుండి రాలిన అశ్రుకణం..

'కనుదోయిన్ ముకుళించినన్ దెరచినన్
కమ్రస్మితంబొప్పమో
హనధావళ్య సుచేతవై
నూసితవర్ణాన్వీత సచ్ఛోళవై
కనువిందై త్రిజగన్మనోజ్ఞ
లలనాకల్యాణ ఖండంబ! నిన్
క్షణమైనన్ మరువంగ జాలన సుతుల్ జ్వాలారు
నందాకనున్ (కన్నీరు)

కన్నీరులో అసలైన కవి హృదయము పొంగి పొరలి ప్రవహించినది అన్నారు కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి.

సిరిప్రెగడ భార్గవరావు అంబటిపూడి వేంకటరత్న దేశికుల అంతే వాసిత్వంలో ఎదిగిన కవి కుమారుడు. ఆ గురుదేవులకు శిష్యుడు భుక్తితో సమర్పించుకొన్న ప్రసూనాంజలి భక్త్యంజలి.

'బ్రతుకెల్లన్ వడగట్టి సత్కళకుధారన్వోసి యుద్రద్రసాం
చిత సత్కావ్యములన్ రచించి కవులన్ సృష్టించి
నిద్రాణమై
న తెలంగాణమునందు నింపె కవితానంద
ప్రవాహోర్మిలా
లితరజ్యన్నవనాద సద్గళ కళాలీలా విభూతుల్ వేసన్
(ముగ్గురుదేవులు)

అని తెలంగాణలో అంబటిపూడి చేసి సాహితీసేవను ప్రస్తుతించారు.

జీవితంలో దెబ్బలు తిన్నవాడు భార్గవరావు. ఆ బాధలోంచి అద్భుత కవిత్వం పలికినవాడు. భార్గవుడు వాఙ్మయ తపస్వి అన్నారు రాయప్రోలు.

ఈ కవి చక్కగా నిర్దుష్టముగా పద్యములు వ్రాయగల వాడని, భావసంగ్రహణ బుద్ధియని తోచినది ఈ చిన్నికావ్య మాతని యశఃపతాకగా నిలుచుగాక, ఇది విశ్వనాథ ప్రశంస.

'తెలంగాణము తెలుగుతల్లి అందాలకోరె. ఆ తల్లి తన కొప్పులో ముద్దుగా ముడుచుకొన్న ఒక మల్లెమొగ్గ మన భార్గవుడు' అన్నారు మహాకవి శేషేంద్ర.

జీవనగాథను కవితామయం చేసి పిన్న వయసులోనే అస్తమించిన సిరిప్రెగడ భార్గవరావు. తెలుగు వారు గర్వించే తెలంగాణ మహాకవి. ఒకే ఒక వేదనామయ కావ్యం 'భార్గవానందలహరి ద్వారా సాహిత్య ప్రపంచంలో దేదీప్యమానంగా వెలిగే కవిద్యుమణి.

తెలుగువారికి పోతనలా ప్రాతఃస్మరణీయుడైన మధురకవి. సిరిప్రెగడ భార్గవరావు వేలకలంబుగైకొని చిగిరిన భావపరంపరా విమద్దాలల నాలలాడుచు రపోదయసిద్ధి గడించుకొన్న రాగాలసమైన సత్కవిభావము సిరిప్రెగడది.

తెలుగు కవితా సామ్రాజ్యంలో కలకాలం నిలిచే కవిచక్రవర్తి, ఆరని తెలంగాణ కవితాజ్యోతి సిరిప్రెగడ.

'జయన్తితే సుకృతినో
రస సిద్ధాః కవీశ్వరాః
నాస్తితేషాయశః కాయే
జరామరణ జంభయమ్'.

# 131 సుద్దాల హనుమంతు

**– శ్రీరామోజు హరగోపాల్**

పల్లెటూరి పిల్లగాడా
పసులుగాసే మొనగాడా
పాలు మరిచి యెన్నాళ్ళయ్యిందో ఓ పాలబుగ్గల
జీతగాడా
కొలువు కుదిరి ఎన్నాళ్ళయ్యిందో'

తెలంగాణలో ఈపాట పాడని పల్లె లేదు. పట్నం లేదు. జనుల నాలుకల మీదికెక్కిన ఈ అర్ద్ర మానవతాగీతం రాసింది తెలంగాణా సాయుధపోరాటంలో పెన్నూ, గన్నూ ధరించి పోరాడిన ప్రజాగెరిల్లాకవి సుద్దాల హనుమంతు. సాయుధ పోరాటకాలంలో ప్రజల్ని యోధులుగా మార్చిన పాటలెన్నో ఆయన రాసాడు. ఆమరణాంతం నమ్మిన సిద్ధాంతాలను ఆచరించినవాడు. ఆచరణకు అడ్డుపడ్డ అన్నింటినీ తృణప్రాయంగా త్యాగం చేసిన ధన్యజీవి. కాలం కడుపుతో వుండి కన్న తెలంగాణ సాయుధ విప్లవకవి సుద్దాల హనుమంతు.

సుద్దాల హనుమంతు నేటి యాదాద్రి–భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలంలోని పాలడుగులో పుట్టాడు. నిజానికి వీరి తాతలవూరు ఇడుకుడ. హనుమంతు తాత పేరు కృష్ణహరి, వెంకటరావమ్మ నాయనమ్మ పేరు. తాతగారు హరికథ కళాకారుడు. హనుమంతు తండ్రి బుచ్చిరాములు. తల్లి లక్ష్మీనరసమ్మ. బుచ్చిరాములు, ఆయన సోదరులైదుగురు కళాకారులే. 30 సంవత్సరాల పాటలు వీధినాటకాలు ప్రదర్శించినవారు. పాలడుగు గ్రామానికి వచ్చి స్థిరపడిన బుచ్చిరాములు మంచి పేరున్న ఆయుర్వేద వైద్యుడు.

హనుమంతుకు చిన్నపుడు బాగా చదువుకోవాలని ఉన్నా కానిగిబళ్ళల్లో వేసే శిక్షలకు భయపడి సరిగా బడికి వెళ్ళేవాడు కాదు. తనకిష్టమైన ఆటలు, పాటలు, ఈత, గుర్రపుస్వారీలలో ఆరితేరాడు. పాలడుగుకు వచ్చిన లక్ష్మీనారాయణ అనే ప్రభుత్వ ఉపాధ్యాయుని కారణంగా తిరిగి బళ్ళో చేరి రెండో తరగతి పూర్తిచేశాడు. గొప్ప మానవతావాదియైన ఆ గురువు నుంచి ఎంతో స్ఫూర్తిని పొందానన్నాడు సుద్దాల. హరికథ చెప్పడానికి పాలడుగు వచ్చిన ఆధ్యాత్మిక గురువు ఆత్మకూరి అంజన్‌దాసుగారికి శిష్యుడైపోయి, ఆయన వెంట డ్రామా కంపెనీ సభ్యుడిగా రెండేండ్లు వూళ్ళెన్నో తిరిగాడు. హనుమంతుగారిది కోకిల గొంతు. పద్నాలుగేండ్ల వయసొచ్చేసరికి గొప్ప గాయకుడు, నటుడయ్యాడు.

ఆరోజుల్లో గ్రామాల్లో వెట్టిచాకిరి విధానముండేది. ఆ పనిచేసేవాళ్ళని వెట్టివాళ్ళని పిలిచేవారు. ఒక్కపైసా కూలీ అడుగకుండా దొరలు, నిజాం ఉద్యోగులకు అడిగిన పనులన్నీ చెయ్యాలె. వంతుకొచ్చిన బరువులను మోసేవాండ్లను బరువొంతు లోండ్లు అనేవారు. ఒకరోజు పదిరోజుల్నుంచి జ్వరంతో వుండి తిండిలేక వున్న పాపయ్యది బరువొంతుల డ్యూటి. ఉద్యోగి ఆజ్ఞయింది. బరువులు మొయ్యలేనని

కనికరించమని వేడుకున్న పాపయ్యను ఆ ఉద్యోగి తన్ని ఈడ్చుకపోవడం చూసి హనుమంతు మనసు కలతపడ్డది. ఆ సన్నివేశం మనసులో వుండిపోయింది. తర్వాతికాలంలో ఆ సంఘటనే 'వెట్టిచాకిరి విధానమో రైతన్న, ఎంత చెప్పిన తీరదో కూలన్న' అనే పాటగా రచించబడ్డది.

ఊరు విడిచి హైదరాబాద్ పట్నం చేరి వ్యవసాయ శాఖలో గుమస్తాగా పనిచేసాడు సుద్దాల హనుమంతు. ఆకాలంలో బుద్వేలులో వుండేవాడు. నైజాంపాలనను వ్యతిరేకించే ఆర్యసమాజంలో చేరి, కార్యకర్తగా పనిచేసాడు. అప్పుడే 'యదార్థ భజనమాల' అనే పాటలపుస్తకం రాసాడు. ఆర్య సమాజంలో చేరి, విద్యాలంకార్ వినాయకరావ్, రుద్రదేవ్, మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి వంటి వారితో పరిచయాలుండేవి. ఆర్యసమాజంతో సంబంధాలున్నాయని వ్యవసాయశాఖ అధికారి హనుమంతు ను పరుషంగా మందలించడంతో రోషంతో ఉద్యోగానికి రాజీనామా చేసాడు. బుద్వేలులోనే వుంటూ బతుకుతెరువు కొరకు దర్జీపనిని చేపట్టాడు.

ఆ తర్వాత 1944లో భువనగిరిలో జరిగిన ఆంధ్ర మహాసభలో రావినారాయణరెడ్డి ఉపన్యాసం విని కమ్యూనిస్టు గా మారాడు. జీవితాంతం కమ్యూనిస్టుగానే వుండిపోయాడు సుద్దాల.

తెలంగాణ సాయుధ ఉద్యమంలో భాగంగానే ఇప్పటి జనగామ జిల్లాలోని సుద్దాలకు చేరుకుని స్థిరపడ్డాడు. అపుడు సుద్దాల గ్రామం దొరలపాలన కిందనే నలుగుతూవుండేది. సుద్దాలలో పొరుగు గ్రామాలలో 1946 ప్రాంతంలో తొలిసారిగా ఎర్రజెండాను, జాతీయజెండాను ఎగరేసాడు హనుమంతు. అప్పటినుండి పార్టీ అప్పగించిన 'కళారంగం' బాధ్యుడిగా, ప్రజలను పోరాటానికి సిద్ధపరిచే కర్తవ్యదీక్షతో రచనలు చేసాడు. జానపద కళారూపాలైన బుర్రకథ, గొల్లసుద్దులు, బుడబుక్కలపాట, పిట్టలదొర పదం, పకీర్ల పదాలను ప్రక్రియలుగా ఎన్నుకొని పాటలు, పదాలు ఏన్నో రాసాడు.

హనుమంతు జీవితం తెలంగాణ సాయుధపోరాటంతో మమేకమైంది. ప్రజలమధ్య పాటై ప్రవహించిన సాంస్కృతిక జీవనది సుద్దాల. 'బాంచెన్ దొరా నీ కాల్మొక్త'నన్న బడుగు లతో బడితెలు, తుపాకులు పట్టించి పోరుబాటలో నడిపించిన సాహసస్ఫూర్తి, సాంస్కృతిక సేనాని సుద్దాల హనుమంతు. బతుకంతా నమ్మిన కమ్యూనిజానికి, నిజానికి అంకితం చేసినవాడు. కడదాక పోరుబాట వొదలకుండ నడిచిన కామ్రేడ్ ఆయన. పెన్నూ, గన్నూ చేతపట్టి ఉద్యమంలోకి దూకిన సుద్దాల హనుమంతు తన జీవితంలో నిజాయితీని, పోరాటతత్వాన్ని ఎప్పుడు ఎక్కడ ఎన్నడు విడిచి పెట్టలేదు. తను నమ్మిన విలువల కొరకు బతుకంతా త్యాగాలు చేస్తూనే వున్నాడు. ఏ ఆశలకు, ప్రలోభాలకు లొంగలేదు. ఆఖరికి మృత్యువై వచ్చిన కాన్సర్‌కు కూడా.

ఆయన స్వప్నం సమసమాజం. ప్రజాస్వామ్యీ కరించబడిన ప్రజాజీవనం. మానవత్వం నిండిన మరోలోకం. ఆ ఆశావహమైన దృక్పథంతోనే

'ప్రజా ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం
ప్రజా ప్రభుత్వం సాదిస్తాం
నిజాములో ప్రతిబజారులో మా
ధ్వజం ఎర్రనిది ఎగురేస్తాం
.............................
చేయెత్తి ప్రతిన చేసాము దేశ
క్షేమంబు కొరకు పోరాడ్తాం' అని రాసాడు.

ఒకసారి ఓగ్రామంలో సభలో సుద్దాల హనుమంతు పాట పాడుతుండగా రజాకార్ల దాడి మొదలైంది. భయపడి పారిపోతున్న ప్రజల్ని చూసి అక్కడున ఓ ముసలమ్మ 'ఎందుకు బయపడి చస్తరు. వచ్చినోల్లు వందమందిలేరు. మనం వెయ్యిమందిమున్నం. వెయ్యిర దెబ్బ వెయ్యొహె' అనడం విన్న సుద్దాల అప్పటికప్పుడే ఆశువుగా అల్లినపాట

'వెయ్‌రా దెబ్బ వెయ్
దెబ్బకు దెబ్బ వెయ్ రా వెయ్
..................................
దయ్యపు గుండాగొయ్యలు రాజాకారులు
కయ్యానికి మనపైబడి వచ్చిరి
ఇయ్యర మొయ్యర దంచర బడిశతో
కుయ్యో మొర్రన కోయర చురికతో' అని ఆవేశంతో

పాడుతుంటే ప్రజలు తిరుగబడి, రజాకార్లను ఎదిరించి తరిమికొట్టారట. అది సుద్దాల పాటబలం ప్రజలకు సాహసమిచ్చిన ఉద్యమగళం.

పోరాటకాలంలో దిన దినగండాల నెదుర్కుంటూ,

అజ్ఞాతంగా సంచరిస్తూ, సాయుధంగా దళంతో రాత్రింబవళు ళ్ళ అడవుల్లో, గుట్టల్లో తిరుగుతూ, దొరల, భూస్వాముల ప్రైవేటు సైన్యాలను, రజాకార్లను ఎదుర్కొంటూ గెరిల్లా సైనికుడై పోరు సాగించాడు సుద్దాల హనుమంతు.

రజాకార్ల నాయకుడు గడ్డం అమీన్, గంటా పాపిరెడ్డిని కాల్చివేసిన సమయంలో వెంట్రుకవాసిలో చావును తప్పించుకున్నాడు. ముళ్ళకంపలు కప్పుకుని కందకంలో దాగి శత్రువుల కంటపడకుండ దాడినుండి బయటపడ్డాడు. దళంతో తిరుగుతూ గ్రామాల్లో పంచాయితీ కమిటీలను ఏర్పర్చడం, ప్రజల భూముల్ని తాకట్టుపెట్టుకున్న దొరల దస్తావేజులను తగులబెట్టడం, పేదలకు దాన్యం పంచడం. స్వాదీనం చేసుకున్న భూముల పంపకాల్లో పాల్గొన్నాడు సుద్దాల.

1947లో ఏదో పురుగు ముట్టడం వల్ల తీవ్ర అనారోగ్యం పాలైన హనుమంతుని అజ్ఞాతవాసానికి వెళ్ళమని పార్టీ ఆదేశించింది. మారువేషాలతో బొంబాయికి చేరుకున్న సుద్దాల హనుమంతు, జానకమ్మ దంపతుల్ని వరంగల్ రవివర్మ ఫోటో స్టూడియో అధినేత బిట్ల నారాయణ ఆదరించి, ఆశ్రయమిచ్చాడు. హనుమంతు అజ్ఞాతంలో వున్నా ఆయన పాటలు ప్రజలకు కంఠో పాఠమైనాయి. పోరాటగీతాలైనాయి. ప్రజలను పోరాటయోధులుగా మారడానికి స్ఫూర్తినిస్తూనే వున్నాయి.

నైజాం పాలన అంతమైనాక తిరిగి సుద్దాలకు చేరాడు హనుమంతు. గ్రామపార్టీ కార్యదర్శిగా బాధ్యతలను నెరవేర్చాడు. ఇంటి బాధ్యతల కొరకు ఆర్.ఎం.పి. వైద్యుడిగా జీవితాన్ని ప్రారంభించాడు. ఆయుర్వేద వైద్యవర అన్నది ఆయన వైద్యసేవలకు దక్కిన గౌరవం.

తెలంగాణా సాయుధపోరులో అమరులైన యోధులను కీర్తిస్తూ

'జోహార్లు జోహార్లు జోహార్లు

అమరవీరులార మీకు జోహార్లు' అన్నపాట తెలంగాణ సాయుధపోరాటం అనే గొల్లసుద్దులు రాసాడు సుద్దాల. వేలాది వీరులు ప్రాణాలను దారవోసి సాధించిన తెలంగాణ సాయుధపోరాట ఫలాలను దండుకున్నది మళ్ళీ దొరలు, భూస్వాములే. భూస్వామ్యమూలాలు తుదముట్టలేదు. స్వప్నించిన ప్రజారాజ్యం రానేలేదు. ఉద్యమవీరునిగా గెలిచాడు. ప్రజగా ఓడిపోయాడు సుద్దాల హనుమంతు.

హనుమంతు ఒకరోజు సుద్దాల పొరుగు గ్రామం తేరాలకు వెళ్ళి వస్తూ తొవ్వలో పసులను అధమాయించలేక, కాళ్ళకు గుచ్చుకున్న ముండ్లను తీసుకోలేక రాతిగుండుమీద కూర్చుని ఏడుస్తున్న పసులకాపరి పిల్లగాడు బత్తుల అబ్బయ్య కాలిముండ్లు తీసి, ఓదార్చాడు. వాని బదులు తనే పసులను అదమాయించాడు. వాని రూపమే కండ్లల్లో మెదులుతుంటే సుద్దాల గుండెలో పాట గూడు కట్టుకుంది. ఇంటికి వస్తూ దారిలో అల్లుకున్న పాటే

'పల్లెటూరి పిల్లాగాడా

పసులుగాసే మొనగాడా

పాలుమరిచి ఎన్నాళ్ళయిందో ఓ పాలబుగ్గల జీతగాడా

కొలువు కుదిరి ఎన్నాళ్ళయిందో...' ఈ పాటను 'మా భూమి' సినిమా టైటిల్ సాంగ్‌గా తీసుకున్నారు బి. నరసింగరావు. కాని, అప్పటికి కవి ఎవరో తెలియదు. ప్రజాకవుల సంప్రదాయమది. రాసిన పాటలను తమ పాటలుగా ఎప్పుడూ చెప్పుకోరు. కాని, వాళ్ళని గౌరవించడం సామాజికుల బాధ్యత.

సుద్దాల హనుమంతు వ్యక్తిగతంగా కరుణాకాతరుడు. కళ్ళముందు ఎవరన్నా కష్టాల్లో వుంటే తట్టుకునేవాడు కాదు. ఏదో ఒక సాయం చెయ్యందే మనసున పట్టనివాడు. మంచిమాట విన్నా, మంచిపాట విన్నా ఆయన కళ్ళు జలజలా వర్షించేవి. కూతురు భారతి 'పల్లెటూరి పిల్లగాడా' పాటను పాడుతుంటే తాను హార్మోనియం వాయిస్తూనే వలవలా ఏడ్చేసేవాడు. ఇంత మార్దవం, కోమలమైన మనసున్న మనిషి అంత కర్కశమైన సాయుధపోరాటంలో ఎట్ల పాల్గొన్నాడు. తుపాకీపట్టి యుద్ధమెట్టా చేసాడు'. ఇంత మెత్తటి మనసున్నోడివి ఎట్ల తుపాకిపట్టి పోరుచేసి శత్రువులను మట్టుపెట్టినవని అడిగితే.

'ప్రజలబాధల పట్ల కూడా అంత తీవ్రంగానే స్పందించగలిగాను కాబట్టే ఎంత కర్కశమైన తుపాకీనైనా చేతపట్టి యుద్ధం చేసాను. కలంపట్టి అంతే తీవ్రతతో ప్రజలకొరకు పాటలు రాసాను' అన్నాడు సుద్దాల హన్మంతు.

ఆయన పాటల్లో 'రణభేరి మ్రోగింది, సంఘం

వచ్చింది, ఔనంటావా ఇది కాదంటావా, చిందొర పెద్దొర, వా వారెవా వహ్వారెవా, దొరలు – భూస్వాములు, మంటలు మంటలు మంటలు, ఇంకెన్నడు సోషలిజం, వ్యవసాయ కూలి, శివగోవింద పదం, నందామయా గురుడ పదం ప్రసిద్ధమైనవి. సుద్దాల అసంపూర్ణంగా రాసిన 'వీర తెలంగాణ' యక్షగానాన్ని ఆయన పెద్దకొడుకు సుద్దాల అశోక్ తేజ పూర్తి చేసి పుస్తకంగా అచ్చువేయించాడు.

తెలంగాణ సాయుధపోరాటం ప్రపంచ ప్రజోద్యమాల లోనే మకుటాయమానమైంది. ఆ ఉద్యమంలో అసమాన వీరగాయక పరంపరలో తలనెత్తుకోతగిన మనిషి సుద్దాల హనుమంతు.

హనుమంతు జీవితం తెలంగాణ సాయుధపోరు వేరు వేరు కావు ఒక్కటే. ఆయన పాటలన్నీ ఉద్యమ ప్రేరణనిచ్చే అగ్నిగీతాలే. మానవత్వం పరిమళించే సౌమ్యగీతాలూ వున్నాయి. బతుకే పాటైనవాడు. పాటను పోరుబాటగా వేసినవాడు బతుకంతా సమసమాజ స్వప్నాన్ని శ్వాసించిన సుద్దాల హనుమంతు తెలంగాణకే కాదు సమస్త ఉద్యమ ప్రపంచానికి వైతాళికుడే.

132

# సుమిత్రాదేవి

– డా॥ ముక్తేవి భారతి

సాంఘిక సేవా రంగంలో కృషి చేసిన మహిళలెందరో ఉన్నారు. సమాజంలో వున్న దురాచాలను రూపుమాపటానికి వారంతా దీక్ష పూనినవారే. అనాథలు, పతితలు, భ్రష్టులు లాంటి వారెవరైనా సరే, వారందరికీ తమవంతు సేవలందించటానికి వెనుకాడక ముందుకొచ్చే సాంఘిక సేవా తత్పరులైన మహిళామణులకు సమాజం ఎప్పుడూ కృతజ్ఞతలు చెప్పుకోవలసిందే.

సాంఘిక సేవారంగంలో ఒక ప్రత్యేకమైన స్థానాన్ని పొంది, తెలంగాణా ప్రాంతం నుంచి వచ్చిన గొప్ప నాయకురాలు సుమిత్రాదేవి. దళితవాడలో పుట్టి, మహోన్నత వ్యక్తిత్వంతో అలరారిన సుమిత్రాదేవి విశిష్టమైన సేవలందించిన సంఘసేవిక, సంస్కారహృదయం మానవీయ విలువలకు పట్టం కట్టిన ఆదర్శమహిళ దళితురాలై, సాంఘిక సేవాతత్పరురాలై విశేషమైన కీర్తి నార్జించిన వ్యక్తి సుమిత్రా దేవి.

ఈమె వివాహమాడిన వ్యక్తి క్షత్రియవంశీయుడైన దేవీప్రసాద్. సుమిత్రాదేవి, దేవిప్రసాద్‌లది ఆదర్శదాంపత్యం. భర్తను గురువుగా భావించి వారి అడుగుజాడలలో నడిచి, వారి ఆశయాలకు అనుసరించింది సుమిత్రాదేవి. సంఘసేవ, దేశసేవ లక్ష్యంగా జీవితాన్ని సార్థకం చేసుకుంది సమిత్రాదేవి. తన భార్య కూడా తనతోబాటు రాజకీయల్లోకి రావాలని, తోటి మానవులకు సేవలందించాలని కోరుకున్నారు దేవీప్రసాద్‌గారు. భార్య సుమిత్రాదేవిని గాంధీయవాదిగా తీర్చిదిద్దారు. గాంధీ సిద్ధాంతాలు ప్రచారం చేస్తూ, గాంధీ శిష్యురాలయింది సుమిత్రాదేవి. సత్యాహింసలు గాంధీగారి ఆయుధాలైతే, అవే తనూ స్వీకరించాలని త్రికరణశుద్ధిగా విశ్వసించింది సుమిత్రాదేవి. గాంధీగారి వార్ధా ఆశ్రమం ఆమెను చాలా ఆకర్షించింది. వార్ధా ఆశ్రమంలో గాంధీ గారితోపాటు సేవాకార్యక్రమాలు చేస్తూ, మూడు సంవత్సరాలున్నారక్కడ. అక్కడనుంచి శ్రమసేవిక శిక్షను పొందటం సుమిత్రాదేవి జీవితంలో గొప్ప మలుపు.

సుమిత్రాదేవి కులమతాలకు అతీతంగా ఎదిగి పోయారు. గొప్ప కవయిత్రి అయిన సరోజినీ నాయుడుతోను, గడ్డిమోపు నెత్తినపెట్టుకు అమ్ముకునే ఆడవాళ్ళతోను సమంగా సమరస భావంతో మెలిగి అందరి మన్ననలను పొందారు. సుమిత్రాదేవిని అందరూ కూడా అక్క అని ఆత్మీయంగా పిలిచేవారు. అలాగే భావించి గౌరవించేవారు.

సుమిత్రాదేవి ఎన్ని పదవుల్లోవున్నా, అపదవులు ప్రజాసంక్షేమం కోసమే ఉపయోగించారు.

సుమిత్రాదేవి రాష్ట్ర కాంగ్రెస్ సభ్యురాలయ్యారు నగరపురపాలక సంఘం ప్రతినిధిగా ఎన్నుకోబడ్డారు. గృహపరిశ్రమల సలహా సంఘ సభ్యురాలు. జిల్లా డెవలప్ మెంటు బోర్డు సభ్యురాలు. వెనుకబడిన తరగతుల సంస్థకు ఇండియన్ కాన్ఫరెన్స్ ఆఫ్ సోషల్ సర్వీసుకు సభ్యురాలు

గౌరవ మెజిస్ట్రేటు. ఉస్మానియా విశ్వవిద్యాలయ సిండికేట్ సభ్యురాలు. ఈ పదవులేవీ ఆమెకి అధికారాన్ని, అహం కారాన్ని అందియలేదు. ఈ పదవులు బాధ్యతలు ఆమెను సంఘ సంస్కర్తగా, దళిత వర్గాల సేవలె దోహదం చేస్తాయి. శాసన సభ్యులు ఆమె మాటను గౌరవించి సుమిత్రక్కా అని పిలిచేవారు.

సుమిత్రాదేవి చేసిన మంచి పనులెన్నెన్నో. తన డబ్బు ఖర్చు చేసి ఓ మంచి పనికి అంకురార్పణ చేసారు. అదే చిక్కడపల్లి (హైదరాబాద్)లోని ఆర్య యువజన పాఠశాల. ఈ పాఠశాలను ఎంతో విజయవంతంగా నడిపి, విద్యార్థుల జీవితాలలో వెలుగు నింపారు.

గాంధీ మార్గానుయాయి అయిన సుమిత్రాదేవి, ఖాదీ, చెరఖా ప్రచార కేంద్రాలు నెలకొల్పారు. అంతేకాక, సుమిత్రా దేవి రాష్ట్ర కాంగ్రెస్ సభ్యురాలయినప్పుడు జగ్‌జీవన్ పాఠశాల నడిపారు. కొన్ని సందర్భాలలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా సత్యాగ్రహం చేసి అరెస్టయ్యారు.

సుమిత్రాదేవి గారి సంఘీక సేవాకార్యక్రమాలు ఎన్నో మార్గాలలో సాగేవి. నిజాం ప్రభువు, కోడలు దుర్రెషనబేగమ్ గారి ఆధ్వర్యంలో నడుపబడే ఆహార ధాన్యాల చౌక దుకాణాలలో సభ్యురాలిగా చేసారు.

సుమిత్రాదేవిగారు సంఘంలో సభ్యురాలిగా వుంటూ కార్యనిర్వహణ దక్షురాలిగా పేరు పొందారు. ఆంధ్రయువతీ మండలి కార్య నిర్వాహక సభ్యురాలిగా పనిచేసారు. నిజాం రాష్ట్రంలో నిమ్నజాతి మహా సభకు అధ్యక్షురాలిగా ఎన్నికై, చాలా సేవలందించారు దళిత సంఘాలకు చేయూతనిచ్చారు.

స్త్రీలకై సేవచేయుట ఆమె లక్ష్యమైంది. పోలీసు చర్య తర్వాత, రెస్క్యూ వర్క్ ఆర్గనైజేషన్‌లో సభ్యురాలిగా చేరి స్త్రీలను ఎన్నోవిధాల రక్షించారు. దళితులకై ఐదువందల యిళ్ళు కట్టించి, ఆ ఇళ్ళలో వారిని ప్రవేశపెట్టడం కోసం చాలా శ్రమించారు. శాసన సభ్యురాలిగా ప్రజలమధ్యకెళ్ళి వారి అవసరాలు కనుగొనేవారు సుమిత్రాదేవిగారు. ఆవిధంగా రాజేంద్రనగర్, హయత్‌నగర్, మేడ్చల్‌లకు ఎంతో మేలు జరిగింది.

దళిత వాడలో మంచినీటి కరువును గుర్తించిన సుమిత్రాదేవి చాలా ఆవేదన చెందారు. ఆమె బాధ్యతగా అరవై మంచినీటి బావులు చెరువులు తవ్వించటం, మరపు రాని మహోపకారం. విద్యుత్‌దీపాలు పెట్టించారు. ఆమె చేసే సేవా కార్యక్రమాలు చాలామందికి జీవనోపాధి కల్పించాయి.

సుమిత్రాదేవి గారి మనసు సహకార వ్యవసాయ పద్ధతిపై నిల్చింది. రెండువేలకుపైగా సహకార వ్యవసాయాన్ని ప్రవేశపెట్టి గొప్ప ఉపకారం చేసారు. ఉప్పల అన్నోజీగూడ గ్రామంలో దళితులకు భూమి మాత్రమే కాకుండా, భూమి దున్నటానికి వారికి ఎద్దులను కూడా పంచిపెట్టడం ఎంత ప్రత్యేకమైన పనో తల్చుకుంటే సుమిత్రాదేవి గారి సమర్థతకి ఆశ్చర్యపోక తప్పదు.

సమాజంలో జరిగే అక్రమాలను, అన్యాయాలను చూసి సహించలేకపోయేవారు. భార్య ఉండగా ద్వితీయ వివాహం చేసుకోరాదనే చట్టం వచ్చింది. ప్రభుత్వోద్యోగులు చేస్తే వారి ఉద్యోగాలు పోతాయి. ఇతరులు శిక్షార్హులే. ఈ చట్టం స్త్రీలకు న్యాయం చేస్తుందనిపించింది సుమిత్రాదేవికి. కాని ఒక విషయం ఆమె దృష్టికొచ్చింది. ఇద్దరు ప్రభుత్వ డాక్టర్లు భార్యలుండగా మళ్ళీ వివాహం చేసుకున్న విషయం ఆమెకు తెలిసింది. సుమిత్రాదేవి మనసు రగిలిపోయింది. ఆ ఇద్దరినీ ఉద్యోగాల నుంచి తొలగించాలని ఆమె రాష్ట్ర శాసనసభ వద్ద ఆ సంఘటనను పలువిధాల విమర్శించి, స్త్రీకి జరిగే అన్యాయాన్ని సాటి స్త్రీగా తను క్షమించనని, అందరి మనసులు కరిగేట్టుగా ప్రసంగించింది సుమిత్రాదేవి.

"ఆ ప్రసంగం చాలా చారిత్రాత్మకమైంది. ఇప్పటి సభ్యుల హృదయాల్లో ఇంకా ఆ ప్రసంగం నిలిచేవున్నది ప్పటికి" అని 'తేజోమూర్తులు' గ్రంథంలో ఇల్లిందల సరస్వతీదేవిగారన్నారు.

సుమిత్రాదేవి దళితజాతుల సంక్షేమానికే ఆమె జీవితాన్ని అంకితం చేసిందంటే అతిశయోక్తికాదు. ఆమె చదువుకోకపోయినా, దళిత పిల్లలుగూడ చదువుకోవాలని ఆమె కాంక్షించింది. దళిత స్త్రీ జనాభ్యుదయ లక్ష్యంతో ఉప్పల గ్రామాలలో బాపుజీ సేవా సదనాన్ని నిర్మించింది. ముప్పయిమందిదాకా దళిత స్త్రీలు ఆ సమాజంలో చేరి చేతిపనులలో శిక్షణ పొంది జీవనోపాధిని పొందారు. బాలబాలికలు దగ్గర పాఠశాలల్లో చదువుకున్నారు. ఆర్య

సమాజ పద్ధతులు ఆ సేవాసదనంలో ప్రవేశపెట్టారు. ప్రార్థన చేయుటం, కవాతు చేయటం, కర్రసాము నేర్పటం మొదలైనవి నిత్య కార్యక్రమాలు.

నిస్వార్థ సేవాపరాయణురాలైన సుమిత్రాదేవి రాజకీయ బాధితుల కోసం ప్రభుత్వం యిచ్చిన పదెకరాల భూమిని ఈ సంస్థకు విరాళంగా యిచ్చేసారు. ఆమెకు మంత్రి పదవి ఇస్తామంటే తిరస్కరించారన్న విషయం వింటే ఆమె వ్యక్తిత్వం ఎంత గొప్పదో తెలుస్తుంది.

సుమిత్రాదేవి విశిష్ఠ వ్యక్తిత్వం గురించి ఎన్నో కోణాల లో ఆవిష్కరించారు. ఇన్మందుల సరస్వతీదేవిగారు. "మా తల్లి సల్లగుంటే మాకు బుక్కెడు బువ్వ దొరుకుద్ది" "మా యమ్మ సల్లగుంటె తల దాచుకోటానికి గుడిసెయిస్తది" "ఆ తల్లి సల్లగుంటే దున్నుకోటానికి చేరడు భూమియిస్తుంది" చల్లటివేళ ఇలా దళిత వర్గాలు ఆమె దొడ్డ మనసునూ శక్తి సామర్థ్యాలను తలుచుకుని ఆశలను వెలిబుచ్చుకుంటూ వుంటారు" అన్నారు. దీన జన బంధువుగా, కరుణామయిగా, బీదలపాలిట పెన్నిధిగా సుమిత్రాదేవి అందించిన సేవలు చిరస్మరణీయాలు.

సుమిత్రాదేవి గొప్ప సాహసవంతురాలు. చాలాసార్లు రజాకార్లను ఎదిరించారు. చాలాసార్లు ఏదో వంకతో నేరం మోపి, అరెస్టు చేసి వ్యానులో ఎక్కిస్తే సుమిత్రాదేవి వారందరితో పోట్లాడి, వాదించి, వారిని బెదరగొట్టినపుడు, రజకార్లు వ్యానులో ఆమెను ఊరంతా తిప్పి, ఆమెముందు నిలువలేక, చివరకు, ఆ వ్యాన్‌లో ఎక్కించిన స్త్రీలందర్నీ హుస్సేన్‌సాగర్ కట్టమీద వదలి వెళ్ళిపోవటం సుమిత్రాదేవి ధైర్యసాహసాలకి, స్త్రీల విజయానికి ఉదాహరణలు.

రాజబహదూర్ వేంకటరామరెడ్డి కళాశాల భవనానికి శంఖుస్థాపన జరగాలి. ఆ స్థలంలో దళితుల గుడిసె లున్నాయి. ఆ గుడిసెలు తియ్యాలి. నాయకురాలు సుమిత్రాదేవి ఆ గుడెసెలు తీయడానికి వీల్లేదంది. వేమండగవున్న మాడపాటి హనుమంతరావుగారు సుమిత్రాదేవిని బతిమాలాడారు. ఎన్నోవిధాల నచ్చచెప్పారు. సుమిత్రాదేవి పట్టువీడలేదు. గుడిసెల సంగతి తేల్చకుండా కళాశాల శంఖస్థాపన చేయనీయనంది. మరొకచోట స్థలం చూపించండి. గుడిసెలు అక్కడ వేసుకోటానికి తగిన డబ్బు ఇయ్యండి అని హనుమంతరావుగారితో మాట్లాడింది. ఆమె మాట నెగ్గింది. వేరొకచోట గుడిసెల నిర్మాణం పూర్తయింది. సుమిత్రాదేవి కళ్ళలో ఆనందభాష్పాలు. హనుమంతరావు గారితో వాగ్వాదానికి దిగినా, ఆయనపై తనకున్న గౌరవంతో, ఆ కాలనీకి హనుమంతరావు కాలని అని పేరు పెట్టడం సుమిత్రాదేవి సహృదయం.

దళిత వర్గాలు అందరితో సమంగా హక్కులు పొందాలనీ, వారిని ఉన్నతస్థాయిలో చూడాలని సుమిత్రాదేవి కోరిక. దళిత వర్గాలు ఆమెను దేవతలా సేవిస్తారు. ఆమె వారిపాలిట కల్పతరువని విశ్వసిస్తారు. ఆమె దళిత స్పృహతో వారి జీవితాలలో వెలుగులు ప్రసరింపజేసిన తేజోమయి.

# 133 సురవరం ప్రతాపరెడ్డి

– డా॥ ఎల్లూరి శివారెడ్డి

చరిత్ర గిరుల్ని చీల్చుకుంటూ సంస్కృతి సరితుల్ని గవేషించే నిశితమైన చూపు, గంభీరగళంతో స్వచ్ఛందమైన అభిప్రాయాల్ని ధీరంగా వెల్లడించే వాక్కు, ఆత్మగౌరవాన్ని ప్రతిపదంలో విరజిమ్మేగమనం, ఇతిహాస పురాణ శాస్త్రప్రబంధాల ఆంతర్యాన్ని ఆకళించు కొన్న జ్ఞానపిపాసి, సురవరం వారి ఆత్మీయగుణాలు. గోలకొండ పత్రిక ఫిరంగి మోతలతో నిజాం గుండెలో దడ పుట్టించి తెలంగాణ జనావళిని జాగృతం చేసిన ధీరుడాయన. రాజకీయాలలోని కాలుష్యానికి దూరంగా స్వాతంత్ర్య సమయసంజనితమైన ఉత్తమాభి రుచితో జీవితం సాగించిన సంస్కార సంపన్నుడు శ్రీ సురవరం ప్రతాపరెడ్డిగారు.

విద్యార్థి దశలో వేదం వేంకటరాయశాస్త్రి, వీరేశలింగం పంతులు, మానవల్లి రామకృష్ణకవిగారి జీవితాల నుంచి ఉత్తేజం పొంది రచనా వ్యాసంగాన్ని చేపట్టారు. విద్యార్థి దశలో ఎన్నో వైఫల్యాలను రుచిచూసి మేథాస్థాయిని పెంచుకున్నారు. పరాజయాలను విజయసోపానాలుగా మలచుకోవడం విద్యార్థి దశలోనే అలవరించు కున్నారు. వకీలు వృత్తిని చేపట్టినా అది ఆయనకు రుచించలేదు. చిన్నప్పుడే వారి పితృవ్యులు రామకృష్ణారెడ్డి ప్రోత్సాహంతో హైదరబాదులో కొత్వాలు వెంకటరామారెడ్డి గారి సహకారంతో తరువాత హైదరాబాదును కార్యరంగంగా చేసుకున్నారు. విద్యార్థి దశలోనే 'దేశబంధు' అనే పత్రికను స్థాపించాలని దినచర్య పుస్తకంలో రాసుకున్నారు. హైదరాబాదు వాతావరణం రానురాను ఆయనకు నచ్చలేదు. తిరిగి వెళదామనుకున్నారు. రాజా బహద్దరు వెంకటరామారెడ్డిగారు హైదరాబాదులోనే ఆయనను ఉంచాలనే భావించి ప్రతాపరెడ్డికి ఇష్టమైన పత్రికాస్థాపనకు అంగీకరించి ఆర్థికంగా సహకరించారు. ఆ విధంగా 10–5–1026 నాడు గోలకొండ పత్రికను ద్వైవార పత్రికగా వెలువరించారు. ఉర్దూ పత్రికలే తప్ప తెలుగు పత్రికల ముఖం చూడని ఆనాటి పాఠకుల్లో ప్రతాపరెడ్డిగారు తెలుగుభాషపట్ల భాషాభిమానాన్ని పెంచారు. గోలకొండ పత్రికలో నిర్వహణలో ఆయన ఎన్నో చేదు అనుభవాల్ని ఎదుర్కొన్నారు. ప్రతి చేదు అనుభవం ఆయనలో కార్యదీక్ష పెంచింది. గోలకొండ పత్రిక సంపాదకత్వాన్ని తరువాతి కాలంలో వదలుకోవలసి వచ్చినపుడు మిత్రుల కోరిక మీద 'ప్రజావాణి' పత్రికకి కొన్నాళ్లు సంపాదకులుగా వ్యవహరించారు. తెలుగుదేశం ఆ రోజుల్లో ఉద్దండపండితులై పత్రికా సంపాదకత్వాన్ని స్వీకరించిన వారిలో కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు, ముట్నూరి కృష్ణారావుగారు, సురవరం ప్రతాపరెడ్డిగారు ప్రముఖులు.

సురవరం వారు గ్రంథాలయోద్యమానికి గణనీయసేవ చేశారు. గాడిచర్ల హరి సర్వోత్తమరావుగారు గ్రంథాలయోద్యమానికి వారు చేసిన కృషి విశిష్టమైనదని ప్రశంసించారు. 1930 మార్చినెలలో నిజాం రాష్ట్రాంధ్ర ప్రథమ మహాసభ జోగిపేటలో వైభవంగా జరిగింది. ఆ సభకు ప్రతాపరెడ్డిగారు అధ్యక్షులు. 'ఆంధ్రదేశపు మట్టి అది

మాకు కనకము' అని గీతావళితో మారుమ్రోగిన ఆ సభలో రెడ్డిగారు భాషాసంస్కృతుల పరిరక్షణకు జనం నడుంకట్టాలని ప్రబోధించారు. ఆ రోజుల్లో హైదరాబాదులో ఏ సమావేశం జరిగినా అందులో సురవరం వారిది ప్రముఖపాత్ర. నిజాం పరిపాలనలో అన్నివిధాలా మగ్గుతున్న తెలంగాణ జనావళిని ఉద్బోధించటానికి ఎంతగా కృషిచేశారో గోలకొండ పత్రికలోని రాతలు, రచనలు ఉదాహరణలు.

ప్రతాపరెడ్డిగారి రచనల్లో అన్నీ విశిష్టమైనవే. అయినా ఆంధ్రుల సాంఘిక చరిత్ర, రామాయణ విశేషములు, హిందువుల పండుగలు జాతి చెప్పుకోదగిన గొప్ప రచనలు. కచకుచ వర్ణనలతో నిండిన ప్రబంధ రచనల్ని, సూక్ష్మేక్షికతో పరిశీలించి అందులో జనసామాన్య జీవితాన్ని దర్శించారు. ఆంధ్రుల సాంఘిక చరిత్రలో తూర్పు చాళుక్యయుగం నుంచి పందొమ్మిదవ శతాబ్ది పర్యంతం ఆంధ్ర సంస్కృతిలోని ప్రధాన విషయాల్ని తేటతెల్లం తెలిపి తెలుగువారికి సాంఘిక చరిత్ర తత్వాన్ని చాటారు. 1949లో వెలువడ్డ ఆ గ్రంథం ఈనాటికి అద్వితీయం. మరోగ్రంథం తత్తుల్యమైనది. ఈనాటికి వెలువడలేదు. అదే ఈనాటికి పరిశోధకులకు కరదీపిక. ఇది ఆంధ్రప్రదేశ్ నుంచి కేంద్రసాహిత్య బహుమతి పొందిన తొలిగ్రంథం. ఈ బహుమతిని వారు అప్పటికి కీర్తిశేషులు కావడం వల్ల వారి శ్రీమతి స్వీకరించారు. 'హిందువుల పండుగలు' భారతీయుల – ముఖ్యంగా తెలుగువారి పర్వాల్ని, వ్రతాల్ని గురించి విశదపరుస్తుంది. పండుగల వెనుక ఉన్న పరమార్థాన్ని చారిత్రక దృష్టితో సమీక్షించారు. ఆయన సత్యదృష్టి ముందు ఏ మతమౌఢ్యాల అడ్డుగోడలు నిలువవు. శాస్త్రీయ దృక్పథంతో విషయ విశ్లేషణ చేయడం వారికి వెన్నతో పెట్టిన విద్య. 'రామాయణ విశేషములు' ఆయన గ్రంథావలోకన దక్షతకూ, విచక్షణ శీలానికి నిదర్శనం. వాల్మీకి రామాయణాన్ని ఆధ్యాత్మిక కోణం నుంచి భావించడం వేరు, శాస్త్రీయ దృక్పథంతో అనుశీలించడం వేరు. ఒక్కొక్క శీర్షిక క్రింద చర్చించిన విషయం ఆయన విషయ పరిజ్ఞానానికి మచ్చుతునక. మనకు తెలియని ఎన్నో విశేషాల్ని రాసులుగా పోసి రచనలు చేశారు. ఈనాడూ అది చాలా విలువైన గ్రంథం.

సురవరం వారు మంచి కవితలు సృజించారు. మహబూబునగరు భాషలో సీసాలు దండకాలు రచించారు. 'అవి బాలిగ! నీవు అట్టుకుసోని కిస్కింత సేపు కాళ్లాత్తి పోసే కసేపు, పైటాలదుకునంలో పదిసేర్లసంజర ఇప్పిచ్చ రారోరి ఎల్లపోడ' అని రచించడం మాండలికం మీద ఆయన కున్న అభిమానానికి నిదర్శనం. ప్రబంధరచనల్ని పుసిలించిన సురవరంవారు ఆ స్థాయిలోనే గొప్ప పద్యాలు నిర్మించారు. చూడండి.

పరిపూర్ణాభావనాంభస్తరంగోద్వేగ
గౌతమీగంభీరగమనమునకు
ఆలంపురీ నందనారామ విభ్రాజి
మల్లోబఫలరాజిమధురరుచికి
ఇంద్రకుమారీ సమాయుక్త పరిపూత తుంగాపయస్సు
మాధుర్యఉనకు
ఖండశర్కర జాజఖర్జూదగోక్షీర ద్రాక్షాదియుత
రామరసమునకును
అమృతనిష్యంద వల్లకాహ్లాదమునకు, రాగిణీ
దివ్యసమ్మోహరాగమునకు
తేనెతేటంపు నవకంపుసోనలకును, సాటియగును మా
తెనుగు భాషామతల్లి

ప్రాంతీయాభిమానం ఇందులో ప్రస్ఫుటంగా కనిపిస్తున్నది. జాతీయాభిమానం, రాష్ట్రీయాభిమానం, ప్రాంతీయాభిమానం ఆయన మనసులో ముప్పేటలుగా అల్లుకున్నాయి. మద్యపానం గురించి దానివల్ల సంక్రమించే అవలక్షణాలను గురించి సరళంగా, సరసంగా చెప్పారు. "ధనమా వ్యయమై పోవును, మనమా చురుకుందనమును మానును, యశమా దినదినమును క్షీణించును. తనువా చెడిపోవు కల్లుద్రావుట చేతన్" అన్నారు. ప్రతాపరెడ్డిగారి పద్యాలను సేకరించి ప్రచురించగలిగితే ఒక చక్కని కవితా సంపుటి సిద్ధమవుతుంది. సురవరం వారు తెలంగాణా గ్రామీణ జీవితాన్ని చిత్రిస్తూ ప్రముఖంగా పదమూడు కథలు రచించారు. ఆ కథల్లో నిజాం ప్రభుత్వ దౌర్జన్యాన్ని ప్రతిఘటిస్తు వస్తున్న యువకుల్లోని ఆవేశాన్ని చిత్రించారు. ఇక ఆయన కథారచన శిల్పానికి తలమానికం 'నిరీక్షణ' కథ. ఇది అనేక భారతీయ భాషల్లోకి అనూదితమైంది. 'నా కథల్లో ఉర్దూపదాలు కొంచెం ఎక్కువే' అని ఆయనే చెప్పుకున్నారు. అవి ఒక సంపుటంగా వెలువడ్డాయి. ముఖ్యంగా 'వింత విడాకులు' కథ చదివితే నాటి తెలంగాణ సామాజిక వాతావరణం కళ్లముందు

కదలాడుతుంది. వారు అణా(గ్రంథమాల పక్షాన రెండు చిన్నకథా సంపుటులు 'మొగలాయి కథలు' అనే పేరుతో వెలువయించారు. అవి చక్కని అధిక్షేప రచనలు. నిజాం కాలం నాటి అధికరుల దౌర్జన్యాన్ని అధిక్షేపించిన ఈ కథల్లోని వ్యంగ్యధోరణి ఎంతో సరసంగా ఉంది.

'హైందవ ధర్మవీరులు'లో ప్రతాపరెడ్డిగారి దేశాభిమానం నిలువెత్తుగా నిలిచింది. సోమనాద్రి, తానాజీమాలుసురే లాంటి కథలు కణకణలాడే నిప్పుకణికలు. ఇది ఆనాడూ ఈనాడూ పఠనీయగ్రంథం. రాజతరంగిణిలోని వస్తువును ఆధారంగా తీసుకొని 'ఉచ్చలవిషాదం' నాటకాన్ని రచించారు. ఇది విషాదాంత నాటకం. 'ఘనసువాసనలిచ్చి గాలికి తలయూచి మరునాడువాడునే మల్లెపువువ' లాంటి మనోజ్ఞమైన పద్యాలు ఇందులో ఉన్నాయి. ఇక మరొక నాటకం 'భక్త తుకారాం'. భక్తతుకారాం నాటకాన్ని భక్తి అనురాగాల భావసంగమంగా, రసతీర్థంగా తీర్చిదిద్దారు. చక్కని నుడికారంతో వ్యావహారిక భాషలో రచించింది ఈ నాటకం. భక్త చరిత్రలో మహిమల జోలికి పోకుండా జీవితంలోని ఉదాత్తతను ప్రకటించడం సురవరంవారి మానవతాదృష్టికి ఎత్తిన మణిదీపం. ఆయన వందలకొలది వ్యాసాలు రచించారు. ఎవరూ ఊహించని అంశాలపై వారు వ్యాసాలు రచించారు. మామిడిపండు, తాంబూలసేవనం లాంటివి నాటికి సరికొత్త అంశాలు. లిపి సంస్కరణ గురించి లఘుపుస్తకం వెలువరించారు. అందులో కన్నడ తెలుగులకు ఏకలిపి ఎలా ఉండవచ్చో సూచనలు చేశారు.

ప్రపంచభాషలకు ఏకలిపిని ప్రతిపాదిస్తూ జార్జ్ బెర్నార్డ్‌షాకు లేఖరాశారు. వయోజనవిద్య కోసమని 'యువజన విజ్ఞానము' అనే గ్రంథాన్ని సంతరించారు. సామాన్యజనానికి రాజ్యాంగ విధానాన్ని తెలియపరచటానికి 'ప్రజాధికారములు', 'ప్రాథమిక స్వత్వములు' అనే గ్రంథాలను రచించి ప్రకటించారు. ఆయన సంఘసంస్కరణ వాంఛ ఎంత ప్రగాఢమైందో 'సంఘోద్ధరణం' గ్రంథం చెబుతుంది. పల్లెపట్టుల పస తెలిసినవారు గనుకనే 'గ్రామజనదర్పణం' గ్రంథం రచించారు. అనేక జానపద గాథలు సేకరించి అనాదృతాలైన ఆ పాటల విశిష్టతను లోకానికి చాటి చెప్పారు. గోలకొండ పత్రికలో అనేక జానపద గేయాలు ప్రకటించి వాటి ప్రాముఖ్యతను స్పష్టీకరించారు. తాళపత్రగ్రంథాలు సంపాదించి పండిత పరిషత్తులకు అందించారు. సురవరం వారి గ్రంథ పరిష్కరణకు, పీఠికారచనకు వావిళ్లవారు ప్రకటించిన 'శుకసప్తతి' ఒక నిదర్శం. ఎవరో తెలంగాణలో కవులు లేరు అని చులకనగా మాట్లాడితే అలాంటి వారి నోరు మూయించడానికి తెలంగాణలోని ప్రముఖులైన 354 మంది కవులతో 'గోలకొండ కవుల సంచిక' వెలయించి తెలంగాణ సాహిత్యవేత్తల ఆత్మగౌరవాన్ని నిలబెట్టారు. 'విజ్ఞాన వర్ధినీ పరిషత్తు' స్థాపించి ఎందరో రచయితల్ని పరిశోధకులను తీర్చిదిద్దారు. ప్రతాపరెడ్డిగారు వ్యక్తికాదు ఒక సంస్థ అన్నది అక్షరాలా యథార్థమే.

ప్రతాపరెడ్డిగారు రాజకీయాల్లోకి ప్రవేశించినా పులుగడిగిన ముత్యంలా ప్రకాశించారు. వనపర్తి నుండి 1952లో శాసనసభా సభ్యులుగా ఎన్నికయ్యారు. తెలుగు వారందరూ ఆయన విద్యామంత్రి అవుతారని ఆశించారు. జరిగిన పరిణామాలను చూసి సురవరం వారు 'నేనూ నా వంటివారు రాజకీయాల చీకటి బజారులో పనికిరామని' స్నేహితునికి లేఖ రాశారు. ఆయనవి ఎప్పుడూ తెలుగువారి అలసత్వానికి పరితపించే పెదవులు. తెలుగువారిలో రవీంద్రనాథులు, బంకించంద్రులు, జగదీశచంద్ర బోసులు, తిలక్‌లు, భండార్కర్‌లు మృగ్యమైపోయారని ఆయన ఆవేదన. ఆయన తెలుగువారికి వెలుగులు చూపిన దీపస్తంభం.

# 134 టి. మాధవరావు

**-వారాల ఆనంద్**

తెలంగాణ తొలితరం సినీ దర్శకుల్లో తాళిబొట్టు మాధవరావుది ప్రముఖస్థానం. 1970లో తీసిన మొట్టమొదటి చిత్రం 'తాళిబొట్టు'తో టి. మాధవరావు ఇంటిపేరు తాళిబొట్టు అయిపోయింది. ఆ సినిమాలో కృష్ణ, విజయనిర్మల, కృష్ణంరాజు, రాజబాబు, రమాప్రభలు ముఖ్య తారాగణంగా పనిచేశారు. కె.వి. మహదేవన్ సంగీతాన్ని అందించిన ఈ సినిమాకు తానే స్వయంగా రచన చేసుకున్నారు మాధవరావు. 1934లో హనుమకొండలో జన్మించిన మాధవరావు ఇంటిపేరు తిరునగరి. వరంగల్‌లో మెట్రిక్ పూర్తయింతర్వాత కొంతకాలం టీచర్‌గా పనిచేశారాయన. చిన్నప్పటినుంచే నటనపట్ల ఆసక్తికలిగిన మాధవరావు మద్రాస్ సినీరంగంలో ప్రవేశించాడు. హాస్య పాత్రలు, మోనోయాక్టింగ్ బాగా చేసే మాధవరావు గాత్రం కూడా బాగా వుండేది. బాగా పాడేవారు. కొంతకాలం హిందూస్థానీ సంగీతం కూడా నేర్చుకున్న మాధవరావు మిత్రులందరి ప్రోత్సాహంతో సినిమాలో చేరేందుకు 1958లో మద్రాస్ రైల్ ఎక్కేశాడు.

మొదట గాయకుడిగా సినిమాల్లో చేరేందుకు ప్రయత్నాలు ప్రారంభించాడు. కానీ అప్పటికే అనేకమంది గాయకులు రంగంలో వుండడం మాధవరావు తెలంగాణ నుంచి రావడం వల్ల సంగీత రంగంలో ఆయనకు ప్రవేశం లభించలేదు. అయినా నిరాశ చెందకుండా ఎట్లో ఒకతీరు సినిమాల్లో ప్రవేశించడమే లక్ష్యంగా మద్రాసులో వుండి పోయాడు. సినిమాలకు సంబంధించి ఏ అవకాశం వచ్చినా వదలకుండా పనిచేయడం ఆరంభించాడు. మద్రాస్ వెళ్ళినా రెండేళ్లకు దర్శకుడు జగన్నాథ్ వద్ద 'శ్రీకృష్ణ రాయబారం' సినిమాకు సహాయ దర్శకుడిగా చేరిపోయాడు. దాని తరువాత వెంటనే సేలంలో తయారయిన బి.ఎస్. నారాయణ దర్శకత్వం వహించిన 'మాంగల్యం' సినిమాకు సహాయ దర్శకుడిగా పనిచేశాడు. అక్కడే ఆయనకు ప్రముఖ కవి, సినీ రచయిత ఆత్రేయతో పరిచయం ఏర్పడింది.

ఆత్రేయకు మాధవరావులోని అంకితభావం నచ్చి అభిమానంతో సహకరించడం మొదలు పెట్టాడు. ఆ పరిచయం ముందుకు వెళ్లడానికి మాధవరావుకు ఎంతో వుపయోగపడింది. అప్పటికే ఆత్రేయ సినీరంగంలో విజయ వంతమయిన కవిగా నిలబడ్డాడు. ఆదుర్తి సుబ్బారావు లాంటి వాళ్లతో కలిసి అనేక సినిమాలకు పనిచేశాడు. ఆత్రేయ సూచనల మేరకు మాధవరావుకు ఆదుర్తి దగ్గర సహాయ దర్శకుడిగా పనిచేసే అవకాశం వచ్చింది. 1961 నుంచి దాదాపు దశాబ్ద కాలంపాటు వారి సహచర్యం నిలిచింది. ఆదుర్తి వద్ద దర్శకత్వం, ఫిల్మ్ టెక్నిక్‌కు సంబంధించి అనేక అంశాలు నేర్చుకున్నానని మాధవరావు చెప్పుకున్నారు. 1962లో 'మంచి మనసులు', 1964లో 'మూగమనసులు', 1965లో 'తేనెమనసులు', 1966లో 'కన్నె మనసులు', 1968లో 'సుడిగుండాలు' తదితర సినిమాలకు సహాయ దర్శకుడిగా పనిచేశారు. తర్వాత హిందీ సినిమాలు మిలన్,

మన్మామీత్, దొలి, దర్పణ్ తదితర సినిమాలకు కూడా పనిచేశారు.

ఆదుర్తి వద్ద దర్శకత్వం, ఆత్రేయ వద్ద స్క్రిప్ట్ రైటింగ్‌లో పాల్గొని స్క్రీన్ ప్లేకు సంబంధించి మెళకువలు నేర్చుకున్నాడు.

ఇక మొదటి నుండి నటన పట్ల ఎంతో ఆసక్తి వున్న కారణంగా మాధవరావు పలు సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు కూడా వేశారు. మంచి మనసులు సినిమాలో అక్కినేనికి మిత్రుడిగా, మూగమనసులులో సూర్యకాంతం ఇంట్లో వంట వాడుగా, తేనె మనసులు, కన్నె మనసులు లో చిన్న పాత్రల్లో కనిపించారాయు. ఆదుర్తి దగ్గర పనిచేస్తున్నప్పుడే వెంకట్రామ రాజు అనే నిర్మాత సినిమా నిర్మించే ప్రయత్నాల్లో వుండగా మాధవరావుకి పరిచయం అయ్యారు. అలా వారి పరిచయం 'తాళిబొట్టు' సినిమా నిర్మాణానికి దారి తీసింది. అదే ఆయన తొలి సినిమా అయింది. ఆ సినిమాలో హీరోపాత్రకు కృష్ణ, హీరోయిన్‌గా విజయ నిర్మల, ఇతర పాత్రల్లో కృష్ణంరాజు, రమాప్రభ, రాజబాబులు నటించారు. ఈ సినిమా కోసం కేవలం కథ కోసమే అనేక ఏళ్ళు కృషి చేశారు మాధవరావు. తాళిబొట్టు విజయవంతమైన సినిమాగా నిలవడంతో మాధవరావుకు మంచిపేరు వచ్చింది. అంతే కాకుండా ఆదుర్తిలాంటివాళ్ళు కూడా సినిమాని ప్రశంసించారు. అంతేకాదు హిందీలో సూరజ్ ఫిల్మ్స్ అనే సంస్థ సినిమా కోసం కొత్త దర్శకుడి కోసం వెతుకుతున్న తరుణంలో ఆదుర్తి సుబ్బారావు మాధవరావు పేరు సూచించడంతో ఆయనకు హింది సినిమా చేసే అవకాశం వచ్చింది. తెలంగాణ నుంచి వచ్చిన వాడు కావడంతోపాటు, హిందీ భాష పైన మంచి పట్టు వుండడం కూడా మాధవరావుకు కలిసొచ్చింది. సంజీవ్ కుమార్ హీరోగా నటించిన ఆ సినిమా 'సూరజ్ ఔర్ చందా' దానితోపాటు హిందిలో మాధవరావు 'బహారోంకి మంజిల్' సినిమానూ రూపొందించాడు. దానికి కొంచెం ముందే 1972లో శోభన్‌బాబు, సావిత్రి, ప్రభాకర్‌రెడ్డి, చంద్రకళలు ప్రధాన తారాగణంగా 'కన్నతల్లి' సినిమాకు దర్శకత్వం వహించారాయన.

దాని తర్వాత తన స్వస్థలం వరంగల్ చేరుకొని తెలంగాణకు చెందిన కథతో సినిమా తీయాలనే సంకల్పంతో కృషిచేయడం ఆరంబించారు. వరంగల్‌లో కాకతీయ పిక్చర్స్ పేర చిత్ర నిర్మాణ సంస్థను ఏర్పాటు చేశారు. వరంగల్‌కు చెందిన కొంతమంది మిత్రుల్ని కలుపుకొని 1977లో దాశరథి రాసిన నవల 'చిల్లర దేవుళ్లు'ను సినిమాగా తీసేందుకు పూనుకున్నారు.

నిజాం పరిపాలన కాలం నాటి అరాచకాలూ, అణచివేతలూ సాయుధ పోరాట నేపథ్యం పరిస్థితులు చిల్లర దేవుళ్లు నవలలో దాశరథి అత్యంత వాత్సవికంగా చిత్రించారు. ఆకాలం నాటి సామాజిక రాజకీయ నేపథ్యాన్ని నవలలో చిత్రించినంత సాధికారంగానే మాధవరావు తన పరిమితుల మేరకు తన సినిమాలో చూపించే ప్రయత్నం చేశాడు. కొంత రియలిస్టిక్ ధోరణిలో చిత్రిస్తూనే ముందుకు సాగారు. చిల్లర దేవుళ్లు కథాకాలం 1936-42 ప్రాంతం లోనిది. కథాస్థలం తెలంగాణాలోని ఓ చిన్న పల్లెటూరు.

నవల ప్రారంభంలో సారంగపాణి అనే సంగీత ఉపాధ్యాయుడు బతుకుతెరువు కోసం విజయవాడ నుంచి ఆ ఊరికి వస్తాడు. ఊరి నడుమ దేశ్‌ముఖ్ రామారెడ్డి గడీ ఉంటుంది. అది ఊరి మొత్తానికీ ఏకైక భవంతి కాగా కరణం వెంకట్రావుతో పాటుగా మరికొందరికి మామూలు ఇళ్లు ఉంటాయి. మిగతా ఊరందరివీ పూరీ గుడిసెలు. నిజాం పాలనలో సంప్రాప్తించిన అధికారం, స్వేచ్ఛలతో స్వార్థంతో దొర, కరణం ఊరిని పూర్తి ఆదిపత్యంతో పరిపాలిస్తూ ఉంటారు. సంగీతం పట్ల ఆసక్తి ఉన్న దొర పాణికి తన గడీలో ఆశ్రయమిస్తాడు. రోజు సారంగపాణి పాటలు వింటూ, అతనికి ఊళ్ళో కరణం కూతురు తాయారుతో పాటుగా రెండు మూడు సంగీత పాఠాలు ఏర్పాటు చేస్తాడు.

సారంగపాణికి ఊళ్ళో దొర సాగిస్తున్న ఎదురులేని పాలనతో పాటు ఆయన మాటే శాసనమని తెలుస్తుంది. తన అధికారాన్ని ఏమాత్రం తక్కువచేసినా దొర ఎలాంటి కఠిన శిక్షలు విధిస్తాడో తెలుస్తుంటుంది. దొరకీ, కరణానికి నడుమ స్వార్థపూరితమైన వైరం వున్నా ప్రజల్ని అణచి వేయాల్సి వచ్చినప్పుడు మాత్రం ఇద్దరూ ఏకమైపోవడం కూడా చూస్తాడు. గడీలో ఆడబానిసగా పనిచేస్తున్న వనజది వేశ్యకన్నా దారుణమైన జీవితం. ఐతే ఆమె సారంగపాణిని ప్రేమిస్తుంది. దొర కూతురు మంజరి, మరోవైపు కరణం కూతురు తాయారు కూడా అతనిపై మనసు పడతారు.

తాయారు మరో అడుగు ముందుకు వేసి తనను పెళ్లి చేసుకుంటే తండ్రి కరణీకం ఇప్పిస్తాననీ లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందనీ హెచ్చరిస్తుంది.

మరోవైపు భూతగాదాల్లో లంబాడీలను కరణం మోసం చేయగా ఆదుకోవాల్సిన పోలీసులు కరణానికి మద్దతుగా ప్రజలపైనే కాల్పులు జరుపుతారు. ఓ లంబాడీ స్త్రీపై అత్యాచారం చేయబోగా ఆత్మగౌరవంతో తనను తాను కాపాడుకునేందుకు పోలీసు అధికారిని చంపుతుంది. ఆ వెంటనే తానూ ఆత్మహత్య చేసుకుంటుంది. నిజాం మనుషులు కూలీలను బలవంతంగా ముస్లీం మతంలోకి మారిస్తే, ఆ తర్వాత అటు హిందువులూ కాలేక, ఇటు ముస్లీంలుగానూ మనలేక పడే బాధలూ చిత్రీకరించింది. దొర బండి రోడ్డుపై వెళ్తూన్న సమయంలో బండికి ముందు మనిషి తప్పుకోమని అరుస్తూ పరుగులు పెట్టడం వంటివి చూపించారు. ఆపనిచేసే మనిషి వెట్టి చాకిరీతో తిండి లేక ఎంత కునారిల్లిపోతాడో కూడా చిత్రించారు. నిజాం పాలనలో దెబ్బతింటున్న తెలుగు భాషా సంస్కృతుల సముద్ధరణకు కంకణం కట్టిన మాడపాటి హనుమంతరావు కృషిని పాణి తెలుసుకోవడమూ నవలలో ఉంటుంది. సాయుధ పోరాటానికి ముందున్న తెలంగాణ జీవితాన్ని చిత్రించే పనిని నవలలో ఎంతగా విజయవంతంగా చేశారో సినిమాలో కూడా తాళిబొట్టు మాధవరావు అంతే విజయ వంతంగా చేశారు.

తొలి తెలంగాణ సినిమా ఇది. ఈ సినిమాలో వినయ్ కుమార్, ఉమాభారతి ప్రధాన పాత్రల్లో నటించారు. వరంగల్ జిల్లా, ఆత్మకూరు దేశాయ్ గడిలో చిత్రీకరణ జరుపుకున్న ఈ సినిమా భూస్వాములు – పేదరైతుల మధ్య పోరాటాన్ని చక్కగా చూపించింది. కే.వీ. మహదేవన్ అందించిన సంగీతం ఈ సినిమాని మ్యూజికల్‌గా కూడా టాప్ పొజిషన్‌లో నిలిపింది. 'కలువకు చంద్రుడు ఎంతో దూరం' అనే పాట బావుకతతో ఉండగా 'ఏటికేతం బట్టి ఎయిపుట్లు పండించి ఎన్నడూ మెతుకరగరన్నా..... నేను గంజిలో మెతుకెరగరన్నా' అనే పాట రైతు దయనీయ స్థితికి అద్దం పడుతుంది.

ఇక చిల్లర దేవుళ్ళు సినిమాలో ఆత్రేయ రాసిన రెండు పాటలు విశేష ప్రాచుర్యం పొందాయి. కె.వి. మహదేవన్ సంగీతం ఎంతో గొప్పగా తోడయింది. ఒకట 'కలువకు చంద్రుడు ఎంతో దూరం, కమలానికి సూర్యుడు మరీ మరీ దూరం...', రెండవది 'పాడాలనే వున్నది....'. ఇక వీటిని మించి తెలంగాణ గ్రామాల్లో జనం పాడుకునే గొప్ప పాట 'ఏటికేతం బట్టి ఎయిపుట్లు వండించి ఎన్నడూ మెతుకెరుగనన్నా... గంజిలో మెతుకెరుగరన్నా, కాల్జేయి కడుక్కోని కట్టమీద కూసుంటే కాకి తన్ని పోయెరన్నా..., కాకిపిల్లా తన్ని పోయెరన్నా...' ఇల్లా అద్భుతంగా గుండెలోతుల్లోంచి సాగే పాటను దర్శకుడు మాధవరావు చిల్లర దేవుళ్ళు సినిమాలో సందర్భోచితంగా ఉపయోగించు కున్నారు. మహదేవన్ సంగీతంలో నరసింహ మూర్తి పాడారు. జానపద పాటలకు రచయితలంటూ రాసిన కవులంటూ వుండరు. అవన్నీ జనం తమ బాధల్నీ, సంతోషాల్నీ వ్యక్తం చేసుకునే గీతాలు. అలాంటి ఈ పాట అప్పటినుంచీ మరింత ప్రాచుర్యం పొందింది.

ఇలా తెలంగాణ గడ్డమీద పుట్టి గొప్ప సినిమాలు తీసిన దర్శకుడు తాళిబొట్టు మాధవరావు.

# 135 తాడేపల్లి లక్ష్మీకాంతారావు

**- హెచ్. రమేష్‌బాబు**

కత్తిపట్టి మెరుపువేగంతో శత్రువును మట్టి కరిపించే 'విజయసింహుడు'. ఆపదలో ఉన్న రాకుమారిని రక్షించే 'ఖడ్గవీరుడు'. తెలుగు జానపద చిత్రసీమలో అజేయుడు 'అగ్గిదొర'. నటనలో అసామాన్య ప్రతిభా సంపన్నుడు. వెండితెరపై కత్తియుద్ధాలతో స్వైరవిహారం చేసి తొలి తెలంగాణ సినీ కథానాయకుడిగా పట్టాభిషిక్తుడైన మన మహానటుడు తాడేపల్లి లక్ష్మీకాంతారావు.

టి.ఎల్. కాంతారావు పేరు చెప్పగానే మనకు ఆయన నటించిన సుమారు 50 జానపద సినిమాలు ఒకదాని వెంట ఒకటి గుర్తుకు వస్తాయి. ధైర్యవంతుడు, సాహసవంతుడూ అయిన రాకుమారుడు మాంత్రికుని మాయాజాలం నుండి తన రాజ్యాన్ని రాకుమారిని ఎలా రక్షిస్తాడో కాంతారావు సినిమాలు చూస్తే మనకు ఒక స్వాప్నిక జగత్తు ఆవిష్కార మవుతుంది. ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల వారి చేతుల్లో, ఒకే సామాజిక వర్గం కనుసన్నల్లో నడిచే తెలుగు సినిమా రంగంలో ఒక తెలంగాణవాడిగా, ఒక అగ్ర హీరోగా కాంతారావు నిలద్రొక్కుకుని మనగలిగాడంటే అదొక అరుదైన జీవన విజయగాథ. అతడు మనవాడు. మన కథానాయకుడు. అచ్చ తెలంగాణవాడు.

నల్గొండ జిల్లా కోదాడ దగ్గరలోని గుడిబండ గ్రామంలో తాడేపల్లి కేశవరావు – సీతారామమ్మ దంపతులకు 1923 నవంబర్ 16న జన్మించారు కాంతారావు. మూడేళ్ళ ప్రాయంలోనే తండ్రిని కోల్పోయారాయన. కోదాడలోనే ఉర్దూభాషలో వస్తానియా (7వ తరగతి) వరకు చదువుకున్నా రాయన. చిన్నతనంలోనే నాటకాల పట్ల ఆసక్తి పెంచుకున్న కాంతారావు రంగస్థలంపై చిన్న చిన్న వేషాలు వేశారు. ఆ సమయంలోనే ఒకసారి తమ వూరికి 'సురభి' నాటక కంపెనీ వచ్చింది. వాళ్లంతా కొన్నాళ్లు అక్కడే మకాం వేసి వరుసగా నాటకాలు వేయాలనుకున్నారు. ఊరి పటేల్ మన కాంతారావు గనుక, ఆయన అనుమతి తప్పనిసరి. కాబట్టి వెళ్లి కలిశారు. ఎట్లయినా తాను అనుమతి ఇస్తేనే నాటకాలు ఆడతారని గ్రహించిన కాంతారావు నటించాలనే తన కోర్కెను తీర్చుకోవడానికి ఇదే అవకాశమని 'నాకు మీ నాటాకాల్లో వేషాలిస్తే అనుమతిస్తా' నని కండీషన్ పెట్టారు. దీంతో వాళ్లు అయిష్టంగానే ఒప్పుకున్నారు.

ఆవిధంగా తొలిసారిగా సురభి నాటక సమాజం వారి నాటకంలో బ్రహ్మదేవుని వేషం వేశారు కాంతారావు. ఆతరువాత మధుసేవ, కనకతార, గయోపాఖ్యానం వంటి తెలుగు నాటకాల్లో, హిందీలో మేవాడ్, బొబ్బిలి వంటి నాటకాల్లో నటించారు. ఇంతలో ఆయన మనసు సినిమాలవైపు మళ్లింది. అప్పటికే ఖర్చులకు పదెకరాల భూమి అమ్మివేశారాయన. ఆ డబ్బుతో మద్రాసు వెళ్లారు. 1952 డిసెంబర్‌లో విడుదలైన 'ఆదర్శం' సినిమాలో ఇద్దరు హీరోల్లో ఏదో ఒక వేషం వస్తుందని ఆశించినా ఏ అవకాశం

రాలేదాయనకు. ఆ రెండు వేషాలూ జగ్గయ్య, రామశర్మలకు దక్కినవి. ఇది తెలంగాణ నిర్మాతలు తీసిన తొలిచిత్రం.

మద్రాసులో సినిమాల్లో నటించడానికి చేసిన ప్రయత్నాలు ఏవీ ఫలించకపోవడంతో కాంతారావు ఇంటికి తిరిగి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఈమధ్యకాలంలో మద్రాసులో వేసిన 'మేవార్' నాటకంలో 'మొహబ్బత్‌ఖాన్' వేషం వేయవలసిన టి.కృష్ణ (ఎడిటర్) కారణాంతరాల వల్ల పాల్గొనలేక పోతున్నానని ఆ పాత్రను కాంతారావును వేయవలసిందిగా కోరారు. అప్పటికే పలు హిందీ నాటకాల్లో నటించిన అనుభవం ఉండటంవల్ల ఆ వేషం కాంతారావు వేశారు. నాటకంలో ఆయన నటన చాలామంది ప్రశంసలందు కున్నది. మరునాడు 'రోహిణీ' ఆఫీసుకు వెళ్లగానే అక్కడున్న వారంతా చుట్టుముట్టి అభినందించడం మొదలు పెట్టారు.

అప్పుడు టి.కృష్ణ రోహిణీవారి 'నిర్దోషి'(1951) సినిమాకు పనిచేస్తున్నాడు. "సినిమాల్లో నటించాలనే సరదా తీరకుండానే ఎట్లాపోతా"వని 'నిర్దోషి'లో ఒక పల్లెటూరి రైతు వేషం వేయించాడు. ఒకే ఒక్క డైలాగ్ ఉన్న పాత్ర! కానీ ఆయన నటన, పలుకు రెండూ నచ్చి వెంటనే ఆ పాత్రకు నాలుగు డైలాగులు రాయించి రీషూట్ చేయించారు దర్శకుడు హెచ్.ఎం. రెడ్డి. సరిగ్గా ఇక్కడే కాంతారావు నట జీవితం మలుపు తిరిగింది. నటనలో నిగూఢమైన మెరుపును కనిపెట్టిన రెడ్డిగారు కెమెరామెన్ పి.ఎల్. రాయ్‌ని పిలిచి ముఖవర్చస్సును, సౌండ్ ఇంజనీర్‌ని పిలిచి డైలాగ్ డెలివరీ పరిశీలించి "ఇతడే నా తరువాతి సినిమా హీరో" అని ప్రకటించారు. అట్లా తెలుగు సినిమా రంగంలోకి తొలి తెలంగాణ హీరో ప్రవేశం జరిగింది. దాదాపుగా ఇదే కాలంలో ఆర్. నాగేశ్వరరావు వచ్చినా అతడు విలన్ వేషాలకు ఎంపికైనారు.

1953లో "ప్రతిజ్ఞ" సినిమాతో మన కాంతారావు హీరోగా వెండితెరకు పరిచయమైనారు. అదీ తెలుగు, తమిళ భాషల్లో, తమిళంలో బాగా ఆడకపోయినా తెలుగులో శత దినోత్సవాలు జరుపుకున్నది. హీరోయిన్‌గా సావిత్రి, ప్రతినాయకునిగా నెల్లూరు రాజనాల కల్లయ్య నటించారు. అయితే రాజనాలకు మొదటి నుండీ హీరో వేషంపై మోజు ఉండటంతో తనకు విలన్ వేషం వచ్చినా యూనిట్‌వారిని మేనేజ్ చేసుకుని టైటిల్స్‌లో తన పేరు ముందుగా, తరువాత కాంతారావు పేరు వచ్చేటట్లు చేశారు. దాంతో కాంతారావును విలన్‌గా అనుకునే పరిస్థితి వచ్చింది. ఈ పరిస్థితి నుండి బయటపడటానికి చాలాకాలమే పట్టింది మన కాంతారావుకి. తెలుగు సినిమా రంగంలో తెలంగాణ వారి పట్ల ఎలాంటి వివక్షత వుంటుందో ఈ సంఘటన మనకు నిదర్శనంగా నిలుస్తుంది.

'ప్రతిజ్ఞ' సినిమా విజయవంతమైనా ఆ వెంటనే రెండో సినిమాకు అవకాశం రాలేదు. రెండేళ్ల తరువాత గాని విఠలాచార్య సాంఘిక చిత్రం 'కన్యాదానం' (1955)లో నటించారాయన. ఈ సినిమా అంతగా ఆడకపోయినా ఎన్.టి.ఆర్. తీసిన 'జయసింహ' (1955)లో తమ్ముడు విజయసింహుడు వేషం ఇచ్చారు. జయసింహ గొప్పవిజయం సాధించి కాంతారావుకి మంచి పేరు రావడమే గాక భవిష్యత్తుకు ఆటంకాలు లేని బాట వేసి పెట్టింది. ఆ తరువాత 'భక్తమార్కండేయ', 'గౌరీమహాత్మ్యం' (శివునిగా), 'ఇలవేలుపు' లో గెస్ట్‌రోల్‌లో (1956), 'సతీ అనసూయ' (1957), శ్రీరామాంజనేయ యుద్ధం, గంగా గౌరీ సంవాదం (1959) పౌరాణిక చిత్రాల్లో ప్రాధాన్యత ఉన్న వేషాలు వేసిన కాంతారావు నట జీవితాన్ని మలుపు తిప్పిన దర్శకుడు విఠలాచార్య. తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో సినిమాలు నిర్మించి విడుదల చేయడం ఆయనలోని ప్రత్యేకత.

ఆ తరువాత విఠలాచార్య తానొక జానపదం తీయాలనుకుని కాంతారావును హీరోగా ఎంపిక చేసుకుని 'జయ-విజయ' (1959) తీశారు. ఈ సినిమా విజయం సాధించడంతో కాంతారావు - విఠలాచార్యల కాంబినేషన్‌లో ఎన్నో హిట్ జానపదాలు రూపొంది తెలుగు సినిమారంగంలో జానపద చిత్రాలకు ఒక అధ్యాయం ఏర్పడింది. విఠలాచార్య డైరెక్షన్‌లో కాంతారావు 'కనకదుర్గ పూజా మహిమ-(1960)', 'వరలక్ష్మీ వ్రతం-(1961)', 'మదన కామరాజు కథ -1962)', గురువును మించిన శిష్యుడు-1963', 'నవగ్రహ పూజామహిమ-1964)', విజయసింహ-1965', 'జ్వాలా ద్వీప రహస్యం-1966', 'ఇద్దరు మొనగాళ్లు-1967', 'భలే మొనగాడు', 'పేదరాశి పెద్దమ్మ-(1968)' చిత్రాలతో కలిపి మొత్తం డజను సినిమాల్లో హీరోగా నటించారు. ఈ కాంబినేషన్‌లో కాంతారావు పక్కన నాయికలుగా కృష్ణ కుమారి, రాజశ్రీలను తప్ప మరొకరిని ఆ రోజుల్లో ఊహించేవారు కారు.

తెలుగులో భారీ కలెక్షన్లు చేసిన 'అగ్గిదొర(1967)'ను తమిళంలో 'మాయా మోదరం (మాయా ఉంగరం)' పేరుతో డబ్ చేశారు. తమిళనాడులో ఎమ్.జి.ఆర్., శివాజీగణేషన్‌ల మాదిరిగా మన కాంతారావు భారీ కటౌట్లు పెట్టారు. డబ్బింగ్ చిత్రం స్ట్రెయిట్ చిత్రం కన్నా అధిక వసూలు చేసింది. అంతకుముందే 'గురువును మించిన శిష్యుడు' సినిమా కూడా 'వీర మనోహర' పేరుతో డబ్ అయి బాగా ఆడింది. దాంతో తమిళంలో జానపదాలకు పెట్టింది పేరైన ఎం.జి.ఆర్.తో మన కాంతారావును పోల్చుతూ నీరాజనాలు పట్టారు. సేలమ్‌లోని డిస్ట్రిబ్యూటర్లంతా కలిసి ఆయన్ను అక్కడికి తీసుకెళ్లి శతదినోత్సవాలు చేసి ఆంధ్రా ఎం.జి.ఆర్. అని ఘనంగా సత్కరించారు.

జానపద చిత్రాల్లోనే గాక పౌరాణికాలలో సైతం తనదైన ముద్ర వేయగలిగిన పాత్రలు పోషించగలగడం మన కాంతారావులోని ప్రత్యేకత. కాగా తెలుగు సినిమా పౌరాణికాల్లో నారదుని వేషానికి ఆయనకే పేటెంట్ హక్కు ఉండింది. నారదునిగా కాంతారావు తొలిసారిగా 'గంగా గౌరీ సంవాదం-(1958)'లో నటించారు. ఆ తరువాత రెండు దశాబ్దాలకు పైగా నారదునిగా కాంతారావును తప్ప మరొకరిని ఊహించుకునే పరిస్థితే లేదు.

ఒకవైపు సాంఘికాలలో అక్కినేని -జగ్గయ్యల కాంబినేషన్, మరోవైపు జానపద, పౌరాణిక, సాంఘికా లన్నింటిలోనూ కాంతారావు - ఎన్టీఆర్‌ల జోడి విజయయాత్ర సాగించినవి. కంచుకోట, మర్మయోగి, చిక్కడు దొరకడు వంటి జానపదాలు ఇక పౌరాణికాలు సరేసరి. సాంఘికాలలో రక్తసంబంధం(1961), ఆప్తమిత్రులు(1963), దేశ ద్రోహులు(1964), ఆడబ్రతుకు(1965), పల్నాటి యుద్ధం (1966) చారిత్రాత్మకం, ఏకవీర(1969) వంటి చాలా చిత్రాలు వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చినవి. తెలంగాణకు చెందిన ఉప్పునూతల పురుషోత్తమరెడ్డి తన మిత్రులతో కలిసి బెంగాలీ సినిమా 'దీప్ జాలాజాయ్'ను తెలుగులో 'చివరకు మిగిలేది'గా తీశారు. ఇందులో కాంతారావుది ప్రత్యేకపాత్ర. సినిమా కళాత్మకంగా గొప్ప సినిమాగా పేరు తెచ్చుకున్నది. సావిత్రి నటన ఉన్నత శ్రేణికి చెందినదిగా విమర్శకుల ప్రశంసలందుకున్నది. కానీ ఆర్థికంగా ఫెయిలైంది.

ఈ సినిమా తరువాత మలయాళంలో నీలా ప్రొడక్షన్స్ వారి 'భక్త కుచేల', ఉదయ స్టూడియోస్‌వారి 'కృష్ణకుచేల' పోటీగా తయారై 1961 నవంబర్‌లో విడుదలైనవి. ప్రేమ్‌నజీర్ కృష్ణుడుగా నటించిన 'కృష్ణకుచేల' కన్నా, సి.ఎస్.ఆర్. కుచేలునిగా, కాంతారావు కృష్ణుడుగా నటించిన 'భక్తకుచేల' బాక్సాఫీసు వద్ద విజయం సాధించింది. కృష్ణుడిగా కాంతారావు నటనకు మంచి పేరు వచ్చింది. ఆ వెంటనే నీలా ప్రొడక్షన్స్ సుబ్రహ్మణ్యం కాంతారావు కృష్ణుడుగా 'గురువాయిరప్పన్' సినిమా తీశారు. ఇలా మొత్తం మూడు మలయాళ చిత్రాల్లో నటించిన కాంతారావును అప్పటి గురువాయూర్ దేవస్థానం వారు పది తులాల వెండి ఫలకం మీద బంగారం పూత వేసిన స్వర్ణ పతకంతో అప్పటి కేరళ గవర్నర్ వి.వి.గిరి చేతుల మీదుగా సత్కరించారు. మళయాళీలు ఆయనను గౌరవంగా "కణ్ణన్"(కృష్ణుడు) అని పిలిచేవారు. ఇదేకాలంలో కన్నడంలో 'కంఠీరవ', 'ఆశాసుందరి' చిత్రాల్లో హీరోగా నటించారు.

కాంతారావు సినిమాల్లోకి వచ్చి పదిహేనేళ్లు గడిచాక నెమ్మదిగా పరిశ్రమలో కుట్ర రాజకీయాలకు తెరలేచింది. సాటి హీరోలతోపాటు, విఠలాచార్య, భావనారాయణ వంటి దర్శక నిర్మాతలు ఇందుకు కారకులైనారు. పరిశ్రమ నుండి ఆయనను తప్పించేందుకు అన్ని ప్రయత్నాలు చేయించారు. ఎంతగానో కాంతారావుచే లాభపడిన విఠలాచార్య, భావ నారాయణలు చాలా రకాలుగా కాంతారావును వేధించేవారు. ఇట్లాంటి పరిస్థితుల్లో ఆయన స్వంతంగా సినిమా నిర్మాణం తలపెట్టారు. ఇక పరిశ్రమలో నిలదొక్కుకోవాలంటే సినిమా నిర్మాణమొక్కటే మార్గమని (1969లో) తానే హీరోగా వేదాంతం రాఘవయ్య దర్శకత్వంలో 'సప్తస్వరాలు' చిత్రం నిర్మించారు. అప్పట్లో తెలంగాణ ఉద్యమం ఉద్ధృతంగా నడుస్తున్నది. ఆ సమయంలో భావ నారాయణ పోటీగా కృష్ణహీరోగా 'లవ్ ఇన్ ఆంధ్రా' తీసి 'ఒక తెలంగాణ వాడి సినిమా చూస్తారా ఆంధ్రావాడి సినిమా చూస్తారా' అని పోటీగా విడుదల చేశారు. కానీ రెండు సినిమాలు పరాజయం పాలైనవి.

సప్తస్వరాలు ఫెయిలైనా ఆ వెంటనే 'గండర గండడు' తీసి కొద్దిగా లాభపడినా సప్తస్వరాలు మిగిల్చిన అప్పులు అలాగే ఉన్నవి. స్వంతంగా సినిమాలు తీస్తుండటం వల్ల

బయటినుండి రావలసిన హీరో వేషాలు ఆగిపోయినవి. పోగొట్టుకున్న చోటే వెదుక్కోవాలని మలయాళ చిత్రం "నానుంపెణ్" సినిమాను తెలుగులో "ప్రేమజీవులు(1971)" పేరుతో తీశారు. సినిమా ఘోరంగా పోయింది. ఆ వెంటనే హిందీలో వచ్చిన "గుమ్‌నామ్" ఆధారంగా "గుండెలు తీసిన మొనగాడు(1974)" తీసి మరోసారి చేతులు కాల్చుకున్నాడు. ఆఖరుకు వాణిశ్రీ రీఎంట్రీ చిత్రం "స్వాతి చినుకులు(1989)" తీసినా నష్టాలే వచ్చాయి. ఇట్లా సినిమా నిర్మాణం అచ్చిరాకపోవడం అటుంచితే, ఇటు రావలసిన అవకాశాలు రాకుండా పోయినవి. నెమ్మదిగా అన్నయ్య, తండ్రి వంటి క్యారెక్టర్ రోల్స్ వేయనారంభించారు.

ఇక ఆయన నటించిన సాంఘిక చిత్రాలను కూడా ప్రస్తావించుకోవాలి. శభాష్ రాముడు, శభాష్ రాజా, బికారి రాముడు, పెళ్లికాని పిల్లలు, ఖైదీకన్నయ్య, శాంతి నివాసం, చిట్టి తమ్ముడు, ఎదురీత, కానిస్టేబుల్ కూతురు, మంచిరోజులు వస్తాయి. తోబుట్టువులు, చదువుకున్న భార్య, శ్రీమతి, మా వదిన, పిన్ని, ఎవరు మొనగాడు వంటి చిత్రాలు కాంతారావు నటించిన సాంఘికాలలో కొన్ని, కృష్ణకుమారి, దేవిక, రాజశ్రీ, కాంచన, భారతి, జయంతి వంటివారు ఆయనకు రెగ్యులర్ హీరోయిన్లు. వారిదంతా సుమారు రెండు దశాబ్దాలపాటు సాగిన విజయవంతమైన కాంబినేషన్. ఆయన నటించిన సినిమాల సంఖ్య 400 పైనే.

క్యారెక్టర్ రోల్స్‌లో ఆయనది విలక్షణమైన ముద్ర. దేవుడు చేసిన మనుషులు, సాహసవంతుడు వంటి చిత్రాల్లో విలన్‌గా కూడా నటించిన కాంతారావు – బాల భారతం, మహాకవి క్షేత్రయ్య, నేరము–శిక్ష, అల్లూరి సీతారామరాజు, దేవదాసు, శ్రీసీత కథ, గాజుల కృష్ణయ్య, పాడిపంటలు, ముత్యాలముగ్గు వంటి సుమారు 200 చిత్రాల్లో క్యారెక్టర్ రోల్స్ చేశారు. ఇక డజన్లకొద్ది టి.వి. సీరియల్స్‌లో నటించారు. ఆయన నటించిన ఆఖరి చిత్రం 'శంకర్‌దాదా జిందాబాద్(2007)'.

సంపాదించినదంతా నిర్మాతగా పోగొట్టుకొని 1990 లో హైదరాబాద్‌కు తమ మకాం మార్చిన కాంతారావు ఏ ఆదెరువు లేక చిన్న చిన్న వేషాలు వేస్తూ కాలం గడిపారు. అప్పటికే ఆయనకు నలభై ఏండ్ల సినీ జీవితం ముగిసింది. ప్రభుత్వాల తరపున ఎట్లాంటి గుర్తింపు రాలేదు. ఎందరో శ్రేయోభిలాషులు చేసిన సాయంతోనే జీవికను గడిపారు.

పాలకులు కాంతారావు నటనారంగ సేవలను గుర్తించకపోయినా తెలుగునాట పలు సాంస్కృతిక సంస్థలు, వ్యక్తులు ఆయనను ఘనంగా సత్కరించాయి. గురుమూర్తి రాష్ట్ర సమాచార శాఖామంత్రిగా ఉన్నప్పుడు 'నటప్రపూర్ణ' బిరుదుతో సత్కరించారు. పాలకొల్లులో అల్లురామలింగయ్య స్వర్ణకమలంతో, సామర్లకోటలో అభినందనవారి "చిత్తూరు నాగయ్య" అవార్డుతో సన్మానించారు. 1987లో వంశీ అవార్డు అందుకున్నారు. 1966లో నూరు చిత్రాలు పూర్తయిన సందర్భంగా పుట్టిన గడ్డ కోదాడలో ఘనంగా ఆయనకు పౌరసన్మానం జరిగింది. ఇంకా రామినేని ఫౌండేషన్ పురస్కారంతో గౌరవింపబడ్డారు. చివరి రోజుల్లో అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ నగరంలోని నల్లకుంటలో ఒక కిరాయి ఫ్లాట్‌లో జీవనం గడిపిన కాంతారావు 2009 మార్చి 22న తుదిశ్వాస విడిచారు. ప్రస్తుతం ఆయన భార్య హైమావతికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నెలనెలా పదివేల జీవనభృతి ఇస్తున్నది.

తెలుగు సినిమారంగం అంటేనే ఆంధ్రావారికి ఆలవాలమని వారి ఆధిపత్యంతో కొనసాగుతున్న కాలంలో పరిశ్రమలోకి కాలుమోపి మందబలం, అర్థబలం ఉన్న వారితో సమానంగా తనదైన స్థానాన్ని నిలబెట్టుకున్న మహానటుడు మన కాంతారావు. నిజానికి కాంతారావే గనుక తెలుగు సినిమా రంగంలోకి వెళ్లకుంటే జానపద సినిమాల ప్రభావమే ఉండేది కాదనడంలో అతిశయం లేదు. ఆయన జనం మెచ్చిన నటుడు. సామాన్య ప్రేక్షకుడి ఊహలకు కార్యరూపమిచ్చి తెలుగు సినిమా కళామతల్లి నుదుటి తిలకంగా నిలిచిపోయారు. మొత్తంగా తెలుగు సినిమా రంగంలో తెలంగాణ ప్రాంతం నుండి ప్రాతినిధ్యం వహించి మన ఆత్మ గౌరవ పతాకంగా ఎగిరిన జానపద కథా నాయకుడు తాడేపల్లి లక్ష్మీకాంతారావు.

# 136 తెలకపల్లి రామచంద్రశాస్త్రి

**– వేదార్థం మధుసూదన శర్మ**

ఒక దేశం యొక్క సంస్కృతి, సంప్రదాయాలు దాని సాహిత్యంలో ప్రతిబింబిస్తాయి. సమస్త భారతదేశం యొక్క సంస్కృతి సాహిత్యంలో ప్రతిబింబించి కనిపిస్తుంది. భారతీయ హృదయానికి సంస్కృత సాహిత్యం దర్పణం వంటింది. అందుకే "ప్రతి భారతీయుడు గర్వించవలసిన అద్భుత సంపద సంస్కృత వాఙ్మయములే" అని మనదేశ మొదటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ తన 'డిస్కవరీ ఆఫ్ ఇండియా'లో పేర్కొన్నాడు.

క్రీస్తుపూర్వం 3000 సంవత్సరాల నాడే ఋగ్వేదంతో ఆరంభమైన సంస్కృత సాహిత్య సృష్టి ఇప్పటి వరకూ నిరంతరాయంగా కొనసాగుతూనే ఉంది. ఇటువంటి నిరంతర సృష్టి ఏ సాహిత్యంలోనూ కనిపించదు.

అలాంటి గొప్పదైన సంస్కృత సాహిత్య సృష్టిలో తన వంతు పాత్రను నిర్వహించిన వారు మాన్యులు, కీర్తిశేషులు శ్రీ తెలకపల్లి రామచంద్రశాస్త్రిగారు. దాదాపు పన్నెండు సంవత్సరాల నిరంతర సంస్కృత భాషాధ్యయనం వల్ల ఆయన కలం నుండి ఎన్నో రచనలు జాలువారాయి. ఆశువుగా సంస్కృత శ్లోకాలను అలవోకగా చెప్పే శ్రీ రామచంద్ర శాస్త్రిగారు ఎన్నో సన్మానాలను, బహుమతులను, పండితుల మెప్పును, బిరుదులను పొందడం వింతేమీ కాదు. పూర్వపు పాలమూరు జిల్లా, నేటి నాగర్‌కర్నూలు జిల్లాలోని కోడేరు మండలం రాజాపురం అనే గ్రామంలో జన్మించారు శ్రీ శాస్త్రిగారు.

"కవులున్నారు, పండితులున్నారు, పండిత ప్రకాండు లున్నారు" అని గర్వంగా ప్రకటించిన శ్రీ కేశవపంతుల నరసింహశాస్త్రిగారి మాటల ప్రకారం ఈ మూడు విశేషణాలు కలబోసిన మూర్తిమత్వం వీరిది. స్వయంగా కవి. వీరు కవికాంతా స్వయంవరం మొదలుకొని రవీంద్ర తపఃఫలం వరకు 15 రచనలు వెలయించారు. సంస్కృతంలో వ్యాకరణం, సాహిత్యం, వేదం, ఆయుర్వేదం, జోతిష్యం, ధర్మశాస్త్రాలలో పాండిత్యం సముపార్జించారు. శాస్త్రిగారు చేసిన చర్చలు, వాదాలు, నిరూపణలు వారి పండిత ప్రకర్షకు నిదర్శనాలు.

పాలమూరు జిల్లా సాహిత్య చరిత్రను ఒకసారి పరిశీలిస్తే క్రీ.శ. 1000 సంవత్సరం నాటికే సంస్కృతంలో శాస్త్ర రచన కొనసాగినట్లు తెలుస్తున్నది. ఆలంపురవాసి అయిన మంధాన భైరవుడు రాసిన భైరవతంత్రం మొదటిది అని చెప్పవచ్చు. ఇంకా జటప్రోలు సంస్థానంలో శేషభట్టరు సింగరాచార్యులు, కవితార్కిక సింహ శ్రీనివాసాచార్యులు, రాఘవాచార్యులు, వేదాంతాచార్యులు, కవి కంఠీరవ కృష్ణమాచార్యులు, అక్షింతల సుబ్బశాస్త్రి, తిరుమల బుక్కపట్నం శ్రీనివాసాచార్యులు, హొసదుర్గం కృష్ణమాచార్యులు

మొదలైనవారు సంస్కృత సాహిత్యంలో ఉద్దండ పండితులుగా పేరుగాంచారు. వీరి వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని సంస్కృత భాషా సాహిత్య చరిత్రలో తన కంటూ ఒక ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్నారు శ్రీ తెలకపల్లి రామచంద్ర శాస్త్రిగారు. వీరి గొప్పతనాన్ని చెప్పవలసి వస్తే శ్రీ విశ్వనాథ సత్యనారాయణకు సహోపన్యాసకులని, బెజవాడ గోపాలరెడ్డి, మరుపూరు కోదండరామిరెడ్డి, వై. బాలకృష్ణారెడ్డి, కౌతా సోదరులకు గురువులని చెబితే చాలు.

వీరు కర్నూలు, శ్రీకాళహస్తి, ఆకిరిపల్లి, చిట్టిగూడూరు, బందరు మొదలైన ప్రాంతాలలో విద్యాభ్యాసం చేసి, విద్య ముగిసిన తర్వాత బందరు కళాశాలలోనే సంస్కృత ఉపన్యాసకునిగా పనిచేసిన ప్రతిభావంతులు.

ఆనాడు సంస్థానాలలో ఉండే కవి పండితుల మధ్య శాస్త్రచర్చలు, వాదోపవాదాలు జరగడం సాధారణం. అయితే జటప్రోలు సంస్థాన ఆస్థాన పండితులైన శ్రీరామచంద్ర శాస్త్రి, శ్రీ వెల్లాల సదాశివశాస్త్రి మధ్యకూడా ఇలాంటి వాదోప వాదాలు జరిగి, రచనలుగా రూపుదిద్దుకున్నాయి. రామచంద్ర శాస్త్రి 'భారతీ తారామాల' కృతిని వెలయిస్తే, సదాశివ శాస్త్రి 'భారతీ తారామాల ఖండనం' రాశారు. సదాశివశాస్త్రి 'రామచంద్ర పంచకం' పేర రామచంద్రశాస్త్రిని విమర్శిస్తే, రామచంద్రశాస్త్రి 'సదాశివాష్టకం' పేర ప్రతి విమర్శ చేసారు. ఈ పరస్పర దూషణలు, నిందాత్మక కరపత్రాలు, రాజుగారికి ఫిర్యాదులు, తీర్పులు మొదలైన వాటి ద్వారా ఆనాటి సాహిత్య వాతావరణాన్ని అర్థం చేసుకోవచ్చు.

శ్రీ తెలకపల్లి రామచంద్రశాస్త్రిగారు ఇంకా లలితాస్త్ర వర్షురి, హయగ్రీవ శతకం, హనుమత్సుప్రభాతం, మామిళ్లపల్లి నృసింహ సుప్రభాతం, ఉమామహేశ్వర సుప్రభాతం, ధూమశకట ప్రమాదం, రవీంద్ర తపఃఫలం, కృష్ణవేణీ స్తుతి, గణేశ పంచరత్నములు, శ్రీ శారదా స్తుతి శతకం, కవితాకాంతా స్వయంవరం వంటి ఎన్నో రచనలు చేశారు. ఇవి శాస్త్రిగారి కోమల పదావళికి, సరసమధురమైన శబ్ద సంయోజనకు, భావానుగుణమైన భాషకు, పదలాలిత్యానికి, స్వాభావికమైన అలంకార రచనకు, వివిధ రసాల సహజ సుందర అభివ్యక్తీకరణకు, ఔచిత్య పోషణకు, పాత్రల సజీవ శిక్షణకు నిదర్శనాలుగా నిలుస్తాయి.

శాస్త్రిగారి కల్పనతో సృష్టించిన కావ్యం 'కవితా కాంతా స్వయంవరం'. ఇది సంస్కృత రచన. సరస్వతి బ్రహ్మల కథ. వీరికి ఇద్దరు కూతుళ్లు, కవిత, గీత వారి పేర్లు. పెళ్లీడు వచ్చిన తర్వాత కవిత తండ్రితో చెప్పి స్వయంవరం ఏర్పాటు చేయిస్తుంది. చాలామంది స్వయంవరానికి వస్తారు.

శాస్త్రిగారు ప్రతీకాత్మకంగా రచించిన కావ్యం కనుక 'కవిత' వరుని ఎంపిక శాస్త్రి హృదయదర్పణమే. కవిత అనుకొంటుందిట్లా. వ్యాకరణ శాస్త్ర పండితుడు 'తండ్రి' వంటి వాడు కనక కుదరదు. వేదపండితుడు, తార్కికుడు 'అన్న' వంటివారు కనక కుదరదు. కనుక కవిత రాసే శక్తి కలవాడిని వరిస్తానని భావించి శ్రీకృష్ణుని వరిస్తుంది. ఇదే నిర్ణయాన్ని 'గీత' కూడ ఆచరిస్తుంది. ఈ కథ ద్వారా శాస్త్రిగారు 'కవి' ప్రాధాన్యతను చెప్పాడు. ఇందులో 'కవి' పట్ల శాస్త్రి భావన, కవిత్వం పట్ల తన అభిరుచి వ్యక్తమైనాయి.

కవులకు లోకం తెలిసి ఉండాలి. వాదించడానికి వెనకాడని ధీరత ఉండాలి. ముఖంలో తేజస్సు, మనస్సులో వివేకం ఉన్న ప్రేమికులకే కవిత్వం సాధ్యపడుతుందని, పాట, గానం దానితో పాటే నడుస్తుందని ప్రతీకాత్మకంగా శాస్త్రిగారు వర్ణించిన తీరు అమోఘం.

ఇలాంటి గొప్ప పాండిత్యం ఉన్న శాస్త్రిగారు తన పాండితీ ప్రతిభకు ప్రతిఫలంగా శ్రీ బులుసు అప్పన్న శాస్త్రిగారిచే 'అభినవ కాళిదాస', శ్రీ సురవరం ప్రతాపరెడ్డి గారిచే 'సాహిత్య కల్పద్రువ', 'కవికుల తిలక', 'అలంకార నటరాజ' బిరుదులను పొందారు.

గీర్వాణ భాషలో పండితుడుగా, శాస్త్ర చర్చల్లో దిట్టగా గొప్ప కార్యనిర్వాహకుడిగా, ఆశుకవితా దురంధరుడిగా, గొప్ప అధ్యయన శీలిగా, నాయకునిగా, హస్త కళానిపుణుడిగా బహుముఖీనమైన ప్రతిభా వ్యుత్పత్తులు సొంతమైన శ్రీ తెలకపల్లి రామచంద్రశాస్త్రిగారు చిరస్మరణీయులు. తెలంగాణకే కాక భారతదేశానికి గర్వకారణం.

# 137 తోటపల్లి సుబ్రహ్మణ్యం

– జి. వెంకట రామారావు

సుబ్బయ్యా ! ఎంత పనిచేశావయ్యా. ఇదంతా ముఖ్యమంత్రిగా నేను చేయలేనిది నీవు చేశావు' అని ఆశ్చర్యపోయారు హైదరాబాద్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ బూర్గుల రామకృష్ణారావు. ఏమిటది..?

1926 ఏప్రిల్ 23న నాగర్ కర్నూలు సమీపంలోని పాలెం గ్రామంలో వైదిక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన సుబ్బయ్య అసలు పేరు తోటపల్లి సుబ్రహ్మణ్యం. తండ్రి సత్యమూర్తి, తల్లి భగీరథమ్మ. బాల్యంలో ఆయనకు పాఠశాల చదువు అబ్బలేదు. పౌరోహిత్యం చేసినా అభివృద్ధికి ఆమడదూరంలో పాలమూరు జిల్లాలో ఆర్థిక పరిపుష్టి దొరకలేదు. జాతి, కుల, మత వివక్షలకు అతీతంగా తన తోటి మనుషుల్ని ప్రేమించి వారి అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేసిన మహానాయకుడు పాలెం సుబ్బయ్య. ఆయన సంపన్నుడు కాని మధ్యతరగతి రైతు.

1200 మంది జనాభా గల తన పల్లెకు డిగ్రీ కాలేజీ, హైస్కూలు, గుడి, మంచినీరు, ప్రజా – పశువైద్యం, దక్షిణ తెలంగాణ మండల వ్యవసాయ పరిశోధన సంస్థ, రాష్ట్రంలో తొలి వ్యవసాయ పాలిటెక్నిక్ కాలేజీ, వ్యవసాయ ఉత్పత్తుల ద్వారా నడిచే ఆగ్రో–ఇండస్ట్రీ, కుటీర, చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటు, రుణ, బ్యాంకుల సౌకర్యం... అన్నీ ఒకదాని వెంట ఒకటి వరుసగా పాలెంలో నెలకొనేలా సుబ్బయ్య చేసిన కృషి, ఆయన అసమాన కార్యదక్షతను రుజువు చేస్తుంది. పాలెం ఒక కుగ్రామం. అక్కడ ఎలాంటి వనరులు లేవు. రాజకీయ స్థానాలు ఆయన అధిష్ఠించ లేదు. రాజకీయాలకు దూరంగా ఉంటూ వచ్చారు.

బిజినేపల్లి బ్లాకులో ఒక ప్రైమరీ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వ కార్యక్రమంలో ఉంది. దాన్ని పాలెం తీసుకురావాలని సుబ్బయ్య అభిప్రాయం. ఎం.పి.ఒ.ను విచారించగా రెండెకరాల స్థలం, పదివేల రూపాయల ప్రజావిరాళం ఇస్తే పి.హెచ్.సి. సాధ్యమవుతుంది. గ్రామంలో స్థలం, డబ్బు వారికిస్తారు. తను సొంతంగా రెండెకరాలు, ప్రభుత్వానికి పదివేలు చెల్లించాడు. సుబ్బయ్య పథకం ఫలించింది. పాలెంకు వైద్యశాల వచ్చింది. ఉచిత భోజనం, నివాస సౌకర్యాలు ఉంటేనే పాఠశాలను అభివృద్ధిపరిచే వీలవుతుందని గ్రహించిన సుబ్బయ్య వెంటనే హాస్టల్ ప్రారంభించాడు. కులవివక్షకు దూరంగా హాస్టల్లో విద్యార్థులకు ప్రవేశం కల్పించాడు.

ఒకే హాస్టల్‌లో హరిజన, గిరిజన, మైనార్టీ, రెడ్డి కులాల విద్యార్థులను ఉంచిన ధైర్యశాలి. ఎందరో పేదపిల్లలు ఓరియంటల్ కాలేజీలో చేరి భాషా పండితులై ఆ తర్వాత ఉస్మానియా విశ్వవిద్యాలయానికి తెలుగు అధిపతులైనారు. హాస్టల్ రావడం వల్ల ఎంతోమేలు జరిగింది. ఎందరో పేద విద్యార్థుల పిల్లలకు హాస్టల్ ఆలంబనమైంది. తొలుత అందులోకి గ్రాంటు లభిస్తే, అది దినదినాభివృద్ధి చెంది

చివరకు 400 మందికి పెరిగింది. ఉపాధ్యాయుల సంఖ్య ఒకటి నుంచి 36కు పెరిగింది.

విద్య, వైజ్ఞానిక, సాహిత్య విషయాల్లో పాలెం ఆదర్శ గ్రామంగా నిలవడానికి నిలువెత్తు ప్రభావం సుబ్బయ్య. నీలం సంజీవరెడ్డి మొదలుకొని చెన్నారెడ్డి వరకు ఏదో ఒక కార్యక్రమానికి పాలెం వచ్చినవారే. బ్రహ్మానందరెడ్డి, పి.వి.నరసింహారావు, టి.అంజయ్య, వెంగళరావు, చెన్నారెడ్డి ముఖ్యమంత్రులు ఈ విద్యా సంస్థల విషయంలో ఎంతో శ్రద్ధ చూపి.. ఆర్థిక బాధలు గానీ, అధ్యాపకుల కొరత గానీ లేకుండా చేశారు. వారి వద్దకు సుబ్బయ్యకు నేరుగా ప్రవేశం లభించేది.

పాలెం సుబ్బయ్య స్కూల్లో సీటు అంత సులభంగా లభించేది కాదు. ముఖ్యమంత్రి విజయ భాస్కరరెడ్డి ఓరియంటల్ కళాశాల సీటు కోసం అప్పుడు జిల్లా పరిషత్ ఛైర్మన్ ఒక విద్యార్థికి పాఠశాల సీటు ఇవ్వమని సిఫారసు చేశారంటే సుబ్బయ్య స్కూలు, కాలేజీ స్థాయి ఏ పాటిదో అర్థమవుతుంది. 1960ల్లోనే విద్యా విధానంలో ఆయన నూతన విధానాలకు శ్రీకారం చుట్టారు. ఆయన చెప్పి చేయలేదు. చేసి చూపించాడు.

ఆ రోజుల్లో రైలు పట్టాల వెంట ఉన్న ముఖ్యమైన ఊళ్లు షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, మదనాపురం లోనే టెలిఫోన్ ఎక్స్ఛేంజీలు ఉండేవి. ఆ పరిస్థితుల్లో జడ్చర్ల నుంచి పాలెంకు ఒకే వారంలో టెలిఫోన్ ఎక్స్ఛేంజీ తీసుకువచ్చారంటే సుబ్బయ్య ఎంత పట్టుదల వ్యక్తో తెలుసు కోవచ్చు. ఆయన తలపెట్టిన అభివృద్ధితో లబ్ధిపొందింది అణగారిన వర్గాల వారే.

నిస్వార్థంగా సేవలందించిన సుబ్బయ్య ఏనాడూ కూడా రాజకీయ పార్టీల వల్ల గానీ, ఎన్నికల వల్ల గానీ పదవుల్లోకి రాలేదు. ఆయన సేవలు విస్తృత స్థాయిలో వినియోగించు కునేవారు. పీవీ ఆయనకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వజూపినా తిరస్కరించారు. జలగం వెంగళరావు 'పద్మశ్రీ' పురస్కారానికి సిఫారసు చేసినా రాజకీయాలు అడ్డువచ్చి దాన్ని ఇతరులు తన్నుకుపోయారు.

యాదృచ్ఛికమో లేక దైవ నిర్ణయమో కానీ సంపూర్ణ సూర్యగ్రహణం 1980లో వచ్చింది. ప్రపంచంలో అత్యధిక సూర్యగ్రహణ సమయం, సంపూర్ణ గ్రహణం పాలెంలోనే సంభవిస్తుందని దేశ విదేశాల శాస్త్రజ్ఞులు తేల్చిచెప్పారు. నాలుగు నిముషాల 48 సెకన్ల పాటు సూర్యగ్రహణం పాలెంలో ఉంటుందని చెప్పడంతో ఒక్కసారిగా దేశవిదేశీ ఖగోళ శాస్త్రజ్ఞులు పాలెం చేరుకున్నారు. ప్రపంచమంతటా పాలెం పేరు మార్మోగింది. చెన్నారెడ్డి తన క్యాబినెట్‌తో ఇక్కడకు ప్రవేశించారు. ఏమాత్రం సౌకర్యాలు లేని పాలెంలో అందరికీ సుబ్రహ్మణ్యమే వసతులు కలిగించారు. దీనికి ముగ్ధులైన అమెరికా అధ్యక్షుడు రొనాల్డ్ రీగన్ ఇక్కడివారి సహకారానికి కృతజ్ఞతలు వెల్లడిస్తూ ఒక అభినందన పత్రంపై సంతకం చేసి పంపించాడు. జాతీయంగానే గాక అంతర్జాతీయంగా పాలెంకు ఖ్యాతితెచ్చిన సుబ్రహ్మణ్యం అభినందనీయుడు.

విశ్రాంతి, విరామం లేకుండా పాలెం గ్రామానికి నలభై వసంతాలు సేవచేసిన సుబ్బయ్యకు అది ఎంతో సంతృప్తి నిచ్చింది. ప్రజల కోసం తన ఆస్తిని కర్పూరంలో కరిగించిన వ్యక్తి. గ్రామ సౌకర్యాల కోసం తనకున్న 40 ఎకరాల భూమి అమ్మేశారు. ప్రజా సేవలకు తనకున్న ఆస్తులన్నీ పోయాయి. ఇక మిగిలింది ఆయన కాంస్య విగ్రహమే. ఆ మహనీయుడు 1986 జూన్ 23న కన్ను మూశారు.

# 138 తుర్రెబాజ్ ఖాన్

– డా॥ ఏనుగు నరసింహారెడ్డి

ఒక జాతి ఔన్నత్యాన్ని తెలిపే జీవనాడి లాంటి నానుడులుంటాయి. ఆ నానుడుల వెనుక ఉత్తేజ పరిచే వీరత్వం ప్రదర్శించే ధిక్కార స్వరం కనిపిస్తే 'ఆయన ఏమన్నా తురుంఖానా?' అని ప్రశ్నిస్తారు, తురుంఖాన్ అయితే మాత్రం ఎవరూ ఆపలేరు అనే అర్థంలో. ఇంతకీ ఎవరీ తురుంఖాన్? ఆయన ధిక్కారమేమిటి? ఆయన వీరత్వ మేమిటి? త్యాగమేమిటి?

1857 జూలై 17న కోఠిలోని బ్రిటీష్ రెసిడెన్సీ మీద మెరుపు వేగంతో దాడిచేసి, పట్టుబడి, తప్పించుకొని, ఎన్‌కౌంటర్‌లో తల మొండెం వేరు వేరు చేయబడి బ్రిటిష్ వాళ్లచే భయంకరమైన హెచ్చరిక ప్రదర్శన చేయబడ్డ హైదరాబాద్ భూమిపుత్రుడు తుర్రెబాజ్ ఖాన్‌ది ఆ ధిక్కారం, వీరత్వం, అపురూపమైన త్యాగం.

బేగంబజార్ వాస్తవ్యుడైన రుస్తుంఖాన్ కొడుకు తుర్రెబాజ్ ఖాన్. లభించిన ఆధారాలను బట్టి తుర్రెబాజ్ 1820–30 ల మధ్య జన్మించి ఉంటాడు. అతడు జన్మించ డానికంటే ముందే ప్రజ్వరిల్లిన 'వహబీ' ఉద్యమ ప్రభావం తుర్రెబాజ్ మీద ఉన్నది. మహ్మదీయ మతానికి పూర్వ వైభవాన్ని తీసుకురావడం కోసం సౌదీ అరేబియాకు చెందిన అబ్దుల్ వాహెద్ నెజ్జీ అనే అతను ప్రారంభించిందే వహబీ ఉద్యమం. ఆ ఉద్యమ లక్షణం ఆంగ్లేయులకు, క్రైస్తవ ప్రచారానికి వ్యతిరేకంగా పోరాడడం. సౌదీలో ప్రారంభమైన వహబీ 1830 ప్రాంతంలో పెషావర్ ద్వారా భారత దేశంలోకి ప్రవేశించింది. 'షా వలీ ఉల్లా దేహ్లావీ' దీన్ని భారతదేశంలో ప్రచారం చేసాడు. హైద్రాబాద్‌లో 1838లో విలాయత్ అలీ, సలీం అనే ఇద్దరు వహబీలు ప్రవేశించి ఆంగ్లేయ వ్యతిరేక ప్రచారం చేసారు. నిజాం సోదరుడు ముబారిజుద్దౌలా వహబీకు పూర్తి మద్దతు ఇచ్చి, శిక్షకు గురై జైలులో పెట్టబడ్డాడు. అలా స్వయానా నిజాం సోదరుడే బ్రిటిష్ రెసిడెంటు ప్రోద్బలంతో జైలుపాలు కావడమే కాకుండా జైలులోనే 1854లో దయనీయమైన మరణాన్ని చవిచూసాడు. 1853లో బేరారును నిజాం నుండి ఆంగ్లేయులు లాక్కున్నారు. అంతకు ముందే కర్నూలు ఆంగ్లేయుల పాలయింది.

ఈ సంఘటనలన్నీ గమనిస్తున్న యువ తుర్రెబాజ్ ఉగ్రుడయ్యాడు. బ్రిటిష్ వాళ్ళను తీవ్రంగా వ్యతిరేకించ సాగాడు. వ్యక్తిగతంగా తుర్రెబాజ్ అనేక బ్రిటిష్ వ్యతిరేక చర్యలకు ఒడిగట్టాడు. గతంలో ఎన్నోసార్లు అరెస్టు కూడా అయ్యాడు. గుల్బర్గా, ఫిస్కల్, మన్‌కడపలలో అతని మీద కేసులు నమోదై ఉన్నాయి. ఒక సందర్భంలో అతని మెడకు చెక్కబంధం కూడా వేయబడింది. ఈ చక్రబంధం వల్ల నిద్రపోవడానికి సరిగా పడుకోరాకుండా ఉండేది.

1857 మే మాసంలో ఉత్తర భారతదేశంలో చాలాచోట్ల బ్రిటిష్ వాళ్లకు వ్యతిరేకంగా సైనిక తిరుగుబాట్లు జరిగాయన్న వార్తలు హైదరాబాద్ చేరాయి. ఆ వార్తలతో ప్రేరేపితుడైన

తుర్రేబాజ్ బ్రిటిష్ రెసిడెన్సీ మీద దాడి చేసి హైదరాబాద్ సంస్థానంలో ఆంగ్లేయుల పాలన అంతమొందించాలను కున్నాడు. ఇదిలా ఉండగా జూన్ 10, 1857 నాడు బ్రిటిష్ వ్యతిరేక ప్రచారం చేస్తున్నాడనే నెపంతో మౌల్వీ ఇబ్రహీంను బెదిరించారు, నిఘా పెట్టారు. జూన్ 12 నాడు అతన్ని అరెస్టు చేసారు. 1857, జూన్ 23న దఫేదార్ మీర్ ఫిదాలీ కెప్టెన్ అబ్బాట్‌ను కాల్చివేయడానికి ప్రయత్నించాడు. ఆంగ్లేయులు మిర్ ఫిదాలీని పట్టుకొని ఉరి తీసారు. బ్రిటిష్ వారిపై దాడిచేసినట్లు రికార్డయిన జమేదార్ చీతాఖాన్‌తో పాటు 13 మంది భారతీయ సైనికులు ఔరంగాబాద్ నుండి తప్పించుకొని హైదరాబాద్ చేరుకొని నిజాంను శరణు జొచ్చారు. నిజాం తన దివాన్ సలార్‌జంగ్ సలహాప్రకారం చీతా ఖాన్ బృందాన్ని రెసిడెంటుకు అప్పజెప్పాడు. అలా వాళ్ళు రాకాసి ఒడికి చేరిపోయారు. కోఠీ రెసిడెన్సీలోని నేలమాళిగలో వాళ్ళను బందీ చేసి చిత్రహింసలకు గురిచేసారు. బ్రిటిష్ వాళ్ళకు వ్యతిరేకంగా పోరాటం చేసిన దేశభక్తులు చిత్ర హింసలకు గురికావడం తుర్రేబాజ్‌ఖాన్‌ను కలచి వేసింది. ఆ దేశభక్తులను విడిపించడం కోసమైనా రెసిడెన్సీ మీద దాడి చేయాలని నిర్ణయించుకున్నాడు. తుర్రేబాజ్ మౌల్వీ అల్లా ఉద్దీన్‌తో చర్చించాడు. ఇతర రోహిల్లా వీరులను పోరాటానికి సంసిద్ధపరిచాడు. ముహూర్తం నిర్ణయించబడిందో లేదో కాని దాడి చేయాలనే నిర్ణయం జరిగిపోయింది. రెసిడెన్సీ మీద దాడికి నాలుగు రోజుల ముందు మొగిలిగిద్దకు వెళ్ళి కొన్ని ఆయుధాలను తెచ్చు కున్నాడు, గుర్రాలకు దాణాకోసం వెళ్తున్న నెపంతో.

జులై 17 రోజున మక్కా మజీదులో ప్రార్థన సమయం ఉద్రిక్తంగా మారింది. ఇమామ్ చేస్తున్న శాంతి ప్రవచనాలను యువత అడ్డుకొంది. మక్కా మజీదు గోడల మీద పోస్టర్లు వెలసాయి. మజీదు మినార్ల నుండి ఆకుపచ్చ జండాలు జారిపడ్డాయి. ప్రజలంతా ఆ జెండాలను చేతబూనారు. తుర్రేబాజ్ ఖాన్ చేతిలో జెండా పూని గుర్రం మీద ముందు భాగాన దౌడు తీసాడు. మక్కా మజీదు నుండి బేగం బజారు దిశగా ప్రయాణించి మౌల్వీ అల్లాఉద్దీన్ సిద్ధపరచిన 500 మంది రోహిల్లా వీరులను కలుసుకున్నాడు.

మజీదు వద్ద నమాజు పూర్తి చేసుకున్న పెద్దమనుషులు ఉపద్రవ తీవ్రతను తగ్గించడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. నలుగురు మౌల్వీలు ప్రతినిధి బృందాన్ని నిజాం వద్దకు పంపి రెసిడెన్సీలో బందీలుగా ఉన్న చీతాఖాన్ బృందాన్ని విడిపించుటకు ప్రయత్నించాలని భావించింది. నలుగురు మౌల్వీలు వెళ్ళారు. నిష్ప్రయోజకంగా వెనుదిరిగారు. ఆ నలుగురు మౌల్వీలలో అల్లా ఉద్దీన్ కూడా ఒకరు. రాయబారం ఫలించదని ఆయనకు ముందే తెలుసు. అందుకే రోహిల్లా వీరులను సంసిద్ధం చేసే వెళ్ళారు. వెనక్కు తిరిగి రాగానే రెసిడెన్సీ దిశగా కదలిక ప్రారంభించారు.

రాయబారం విఫలం కాగానే ఏదైనా దాడి జరిగే అవకాశం ఉందని పసిగట్టి దీవాన్ సాలార్‌జంగ్ రెసిడెంటుకు సమాచారమిచ్చి జాగరూకపరిచాడు. మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో రెసిడెంట్ డేవిడ్‌సన్ తనకు అందుబాటులో ఉన్న సైన్యాన్ని సంసిద్ధపరిచాడు. సాలార్‌జంగ్‌ను కొంత సైన్యంకోసం అర్థించాడు కాని వాళ్ళు వచ్చేదాకా ముహూర్తం ఆగదని డేవిడ్‌సన్‌కు తెలిసిపోయింది.

మొదట తుర్రేబాజ్ ఇతర రోహిల్లా వీరులు పుత్లీబౌలీ దిశగా నడిచి అబ్బాన్ సాహెబ్ ఇంటి ముందుకు చేరారు. అబ్బాన్ సాహెబ్ ఇంటి ఎదురుగా ఉన్న రెసిడెన్సీ గేటులోపల సైనికులు మరఫిరంగితో సిద్ధంగా ఉన్నారు. అంతలో మౌల్వీ అల్లాఉద్దీన్ అతని అనుచరులలో సహావచ్చి తుర్రేబాజ్‌ను కలుసుకున్నాడు. మాక్కామజీదు వద్ద జన సమూహం మాయమైంది. సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో 500 మంది ప్రజలు రెసిడెన్సీ నైరుతి గేటు వద్ద గుమిగూడారు. సమయం చూసుకొని రోహిల్లాలు రెసిడెన్సీ పడమటి గోడకు ఎదురుగా ఉన్న అబాన్ సాహెబ్, జైగోపాలన్ దాసులు రెండంతస్తుల భవనాలను ఎక్కేసారు. అబ్బాన్ సాహెబ్ ఇంట్లోకి చేరుకోగానే మూమెంట్ కోసం అబ్బాన్ సాహెబ్, జైగోపాల్ దాస్, ఆజం అలీ ఖాన్‌ల ఇండ్లమధ్య అడ్డుకోడల్ని కూలగొట్టారు. రెసిడెంటు నైరుతి గేటును పగులగొట్టి షావుకార్ల ఇండ్లమీద నుండి దాడి చేద్దామని తుర్రేబాజ్, అల్లాఉద్దీన్‌ల పథకం. సాయంత్రం 6.30 గం॥లకు తుర్రేబాజ్ నాయకత్వంలోని రోహిల్లాలు రెసిడెన్సీ గార్డెన్ గేటును కూలగొట్టారు. ఇంకొక గేటును అల్లా ఉద్దీన్ ధ్వంసం చేసాడు. ఈ దశలో రెసిడెన్సీ నుండి కమాండర్ బ్రీవెట్ కాల్పులు ప్రారంభించాడు. ఏడు రౌండ్లు కాల్చాడు. రోహిల్లాలు చెదిరిపోయారు. ఫైరింగ్ ఇరవై నిమిషాలపాటు నడిచింది.

రాత్రి 8.30 గం॥ల వరకు దాదాపు తిరుగుబాటు దారులంతా చెదిరి పోయారు. తుర్రెబాజ్, అల్లాఉద్దీన్ మరికొద్దిమంది అనుచరులు షావుకార్ల ఇండ్లల్లో వేచి ఉన్నారు. చివరి కాల్పులు తెల్లారగట్ల 4 గంటల దాకా సాగాయి. దాడి విఫలమైంది. 32 మంది చనిపోయారు. 25 మంది శవాలను తీసుకొని రోహిల్లాలు తప్పించుకున్నారు. 7 శవాలు రోడ్డుమీద పడి ఉన్నాయి. అందులో ఇద్దరు చిన్న పిల్లలు కూడా శవాలై పోయారు. తెల్లవారగట్ల 6 గంటలకు మిగిలిన వీరులంతా బేగంబజార్‌లోని తుర్రెబాజ్ ఇంటికి చేరారు. నగరంలో ఉండడం ఎంతమాత్రం శ్రేయస్కరం కాదని ఒక్కొక్కరు ఒక్కో ప్రాంతానికి వెళ్ళిపోయారు.

తుర్రెబాజ్ కొత్వాల్‌గూడ ద్వారా షాద్‌నగర్‌కు దగ్గరలో ఉన్న మొగిలిగిద్దకు పారిపోయాడు. అక్కడి నుండి ఇతర రోహిల్లా వీరులు ఉంటున్న సాత్కల్వ ప్రాంతానికి చేరాడు. తుర్రెబాజ్, అల్లా ఉద్దీన్‌లను అరెస్టు చేయమని అందరు కలెక్టర్లకు, అధికారులకు ఆదేశాలు జారీలు అయినాయి. జమేదార్ బుద్ధఖాన్‌కు జవానులుగా ఉన్నవాళ్ళు తుర్రెబాజ్‌ను గుర్తించి కాల్పులు జరిపారు. ఒక తూటా తొడలో, మరొక తూటా మోకాలు పైభాగాన తగిలింది. తుర్రెబాజ్ గుర్రాన్ని చంపివేసారు. జాన్ మహ్మద్ అనే సహచరుణ్ణి చంపి తుర్రెబాజ్‌ను అరెస్టు చేసారు. తుర్రెబాజ్‌కు ఒక కంటి కింద ఉన్న మచ్చవల్ల ఆయనను గుర్తుపట్టి అరెస్టు చేయగలిగారని జులై 22, 1857న సాలార్‌జంగ్ బ్రిటిష్ రెసిడెంటుకు రాసిన లేఖ నెం. 1061 ద్వారా తెలుస్తుంది.

తుర్రెబాజ్‌ను హైద్రాబాద్‌కు తరలించి విచారణ చేసి అండమాన్‌లో యావజ్జీవ కారాగార వాస శిక్ష విధించాలని నిర్ణయించారు. యావజ్జీవ కారాగారశిక్షను ఉరిశిక్షగా మార్చమని రెసిడెంటు డేవిడ్‌సన్ గవర్నరు జనరల్‌ను కోరాడు. గవర్నరు జనరల్‌కు ఆ అధికారం ఉన్నా హైదరాబాద్ కోర్టు విధించిన శిక్షను తాను మార్చ బోనన్నాడు. అండమాన్‌కు తరలించక ముందు హైద్రాబాద్‌లో కస్టడీ నుండి జనవరి 18, 1859న తుర్రెబాజ్ తప్పించుకోగలిగాడు. తుర్రెబాజ్ తలకు 5000 రూ॥ల నజరానా ప్రకటించింది ప్రభుత్వం. తుర్రెబాజ్ మెదక్ జిల్లా తూప్రాన్‌లో ఖుర్బాన్ అలా, జమేదార్ మహ్మద్ ఖాన్‌ల కంటబడి తప్పించుకోబోయాడు. కత్తితో పోరాటం చేయబోగా ఖుర్బాన్ అలీ తుపాకితో కాల్చి చంపాడు తుర్రెబాజ్‌ను. అలా 23-1-1859న చనిపోయిన తుర్రెబాజ్‌ఖాన్ మృతదేహాన్ని హైద్రాబాద్ తీసుకువచ్చి తలను మొండాన్నీ వేరు చేసి కోఠీలో భీభత్సంగా కొన్ని రోజులపాటు ప్రదర్శనకు పెట్టారు. తెలంగాణ త్యాగానికి, నిజాయితీకి మహా సంకేతం తుర్రెబాజ్‌ఖాన్. వీరత్వానికి పర్యాయపదం తురుంఖాన్.

ఆనాటి బ్రిటిష్ రెసిడెంట్ చెప్పినట్లు కొద్దిపాటి ఆర్థిక వెన్నుదన్ను, ఒకింత ప్రణాళిక ఉండి ఉంటే బ్రిటిష్ సామ్రాజ్యవాదం ఉద్వాసన హైదరాబాద్ నుండే ఆరంభమయి ఉండి ఉండేది.

# 139 ఉత్పల సత్యనారాయణాచార్య

**- ఆచార్య జి.చెన్నకేశవరెడ్డి**

శ్రీ॥ శే॥ శ్రీమాన్ ఉత్పల సత్యనారాయణాచార్య జగమెరిగిన కవులు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు, రాష్ట్రప్రభుత్వ 'హంస' అవార్డులను పొందిన వారు. తెలుగు విశ్వవిద్యాలయం విశిష్ట పురస్కార గ్రహీతలు దత్తపీఠ (గణపతిసచ్చిదానంద స్వామి) ఆస్థానకవులు. ఇవికాక మరెన్నో పురస్కారాలు అందుకొన్నారు. కలం పట్టిన నాటి నుంచి అరవయ్యేళ్లకు పైగా అవిశ్రాంతంగా రచనా వ్యాసంగం సాగించి, దాదాపు డెబ్బై గ్రంథాలు రచించిన కవిశేఖరులు.

ఉత్పల ఖమ్మం జిల్లా చింతకానిగ్రామంలో 4-7-1928న జన్మించారు. 2007 సంవత్సరంలో హైదరాబాదులో పరమపదించారు. వీరి తల్లిదండ్రులు శ్రీమతి అలివేలమ్మ, శ్రీమాన్ రఘునాథాచార్యులు.

పేదరికం వల్ల ఆయన చదువు ఒడిదుడుకులతో సాగింది. స్వయంకృషితో ఉన్నత విద్యనభ్యసించారు. తొలి నాళ్లలో సర్దార్ జమలాపురం కేశవరావు అనుయాయి అయి రాజకీయాల్లోను, ఉద్యమాల్లోను పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిగా ఆయన ఉద్యోగ ప్రస్థానం మొదలైంది. మధ్యలో కొంతకాలం తెలుగు అకాడమీలో పనిచేసి, జూనియర్ కళాశాల ఉపన్యాసకునిగా రిటైరైనారు. 'భువన విజయం' ట్రూపులో అష్టదిగ్గజ కవులలో ఒకడుగా ఉండి, యావదాంధ్ర దేశమంతా పర్యటించి పలు ప్రదర్శనలిచ్చారు. అమెరికాలో కూడా పర్యటించి తన తీయని కంఠంతో తెలుగు పద్యాల మాధుర్యాన్ని విదేశాంధ్రుల వీనులకు విందొనరించినారు. చిత్రసీమలో ప్రవేశించి కొన్ని మధురమైనపాటలు రాశారు. అయితే ఆ రంగం ఆయన తత్త్వానికి సరిపడకపోతే త్వరలోనే బయటపడ్డారు.

ఉత్పల కిశోర ప్రాయంలోనే కుమార సంభవం, దక్ష యజ్ఞం, గంగావతరణం వంటి గేయకృతులను రాశారు. అవి చందమామ, బాలమిత్రమాసపత్రికలలో ప్రచురితమైనందువల్ల వాటిని బాల సాహిత్యంగా భావించారు.

ఉత్పల పద్యరచనలలో పేర్కొనదగినవి కీచుని వీడ్కోలు, గాంధారి, ఉత్పలిని, తపతి, ఈ జంటనగరాలు-హేమంతశిశిరాలు, పాతబస్తీవిలాసం, శతరూప, స్వప్నాల దుప్పటి, రాసపూర్ణిమ, శ్రీ కృష్ణ చంద్రోదయం, శైవలినీ రాగాలు-ఉత్తలినే పరాగాలు మొదలైనవి.

నవలలో పేర్కొనదగినవి విష బిందువు(ఇది సామాజిక రాజకీయ నవల), రాజమాత. 'రాజమాత' ఆంధ్రభూమి వార పత్రికలో చాలాకాలం సీరియల్‌గా వచ్చి సంచలనాన్ని కలిగించిన నవల.

భాసుని 'ప్రతిజ్ఞాయేగంధరాయణీయమ్' అనే సంస్కృత నాటకాన్ని తెనిగించినారు. రామనాంశ్ త్రిపాఠి హిందీలో రాసిన 'మిలన్'కు 'జ్యోత్స్న' అనే పేరుతో స్వేచ్ఛానువాదం చేశారు.

ఆధునిక పద్యకవుల్లో ఉత్పలకు అగ్రేసర స్థానమున్నది. దాశరథి, మధునాపంతుల, వానమామలై వంటి వారి కోవలో నిలుస్తారు. అలంకార శాస్త్రాలను కంఠదఘ్నంగా చదువుకొన్న సంస్కారం వారి కావ్యాలలో ఎల్లెడలా ప్రతిబింబిస్తుంది. 'ఆలోచనామృతం' అనే పేరుతో అలంకార శాస్త్ర గ్రంథాన్నే రాశారు. ఉత్పల పద్యరచనలలో 'ఈ జంట నగరాలు–హేమంత శిశిరాలు', 'పాతబస్తీ విలాసం' ఆధునిక సమాజానికి సంబంధించినవి. పద్యం ప్రాచీన సమాజానికి, సంప్రదాయానికి సంబంధించిన కవితా రూపమని, ఆధునిక సమాజం, సమస్యల చిత్రణకు పనికిరాదనే అభిప్రాయాన్ని పరాస్తం చేసి, పస కలిగిన, పసందైన, పకపకానవ్వించగలిగే 'ఈ జంటనగరాలు–హేమంతశిశిరాలు', 'పాతబస్తీ విలాసం' రాసి పదుగురి చేతా మెప్పింపు పొంది, పద్యరచనకు పట్టుగొమ్మ అయినారు.

ఈ జంట కావ్యాలు– జంట నగరాల జీవితానికి సంబంధించినవి. 'జంట నగరాలు–హేమంతశిశిరాలు' సికింద్రాబాదు, మూసీకి ఎడమవైపునున్న హైదరాబాదు వాసులకు సంబంధించినదైతే, 'పాత బస్తీ విలాసం' పూర్తిగా మూసీకి కుడివైపునున్న పాతబస్తీ వాసుల జీవితానికి సంబంధించినది. ఈ రెండు కావ్యాల రచనా విధానం క్రీడాభిరామాన్ని తలపిస్తుంది. 'ఈ జంటనగరాలు–హేమంత శిశిరాలు' కావ్యానికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు లభించింది.

ఈ కావ్యంలో నాయకుడు, సాహిత్యాభిమానమున్న చిరుద్యోగి. పేవ్‌మెంటు మీదున్న పుస్తకాల షాపులో మనుచరిత్ర కనబడితే, కొని ఇంటికి తీసుకొని వెళ్లి చూస్తే, అసలైన రసవంతమైన వరూధిని–ప్రవరుని వృత్తాంతం కత్తిరింపుకు గురికావడం రోడ్డు మీద నడుస్తుంటే కాలి జోడు తెగిపోవడం, ఆ తెగిన జోడు ఎలా ఉన్నదంటే "దెబ్బతిని విలవిలలాడి త్రెళ్ల పక్షిపగిచి పూర్తిగా తెగనది పాదరక్ష" చెప్పులరిగియరిగి చీలలే మిగిలెను, ముచ్చెవాడు గూడ ముట్టదేదేమో' అని అనుకొంటూ, బాగు చేయించడానికి జేబులు వెదికితే, డబ్బులు కనిపించకపోవడంతో అట్లాగే ఈడ్చుకొంటూ, ముచ్చెటమలు పట్టిన ముఖంతో ముచ్చెవాడికి తన గోడు చెప్పుకొని, మరుసటిరోజు ఇస్తానని, బాగు చేయించుకొని, మరుసటి రోజు వెళ్లితే, ఆ ముసలి ముచ్చెవాడు అచ్చోట లేకపోతే ఆ రుణాన్ని తీర్చడానికి ఇప్పటికీ వెతుకుతున్నానని కరుణామయ, హాస్యపూరిత వృత్తాంతం. తన బదిలీ కోసం ఒక మిత్రుడు, 'పదవులు ద్యోగాలు పైరసీ వల్లేనే ప్రాప్తించుగాని, అర్హతను గాదు, పైరవీ వల్ల నా ఫీసుఫైళ్లు కదలు, కార్డు రైళ్లు విమానలోకమ్ము కదలు, పైరవీ చేయకున్ననే పనియుగాదు, పైరవీ చేయకెవ్వండు పైకి రాడు' అని ఇచ్చిన హితవుతో, తన బదిలీ కోసం ఒక పైరవీ సుందరిని ఆశ్రయిస్తే, ఆమె టాక్సీ తెమ్మంటే తీసుకొని రాగా, టాక్సీలో పోతున్నప్పుడు ఆయన హృదయ స్పందన ఎలా ఉన్నదంటే..

"ఉన్నవి ఐదు రూప్యములు, ఒప్పులకుప్పకు రుద్రాక్షపండ్లకై
చన్నవి రెండు, మీటరు వెసన్ పరువెత్తుచుండె, జేబులో
నున్నవి మూడు, డ్రైవరడహో కఠినాత్మడు, కారులో గూ,
ర్చున్నను దాని క్రిందబడి రూప యేపనట్లు కుందితిన్"

ఆ పైరవీ సుందరి ఒక ఆఫీసులో ఆఫీసరుతో మాట్లాడటానికి వెళ్లినపుడు, టాక్సీ కిరాయిని భరించలేనని, తన బదిలీ సంగతిని గాలికొదిలేము చల్లగా జారుకోవటం అందులో వృత్తాంతం. ద్వ్యర్థి కావ్యంలోని అచ్చుతప్పుల వల్ల అది త్ర్యర్థి కావ్యమైందని ఒక చెణుకు పద్యం చెణికినాడు.

కోనసీమనుంచి ఒక మిత్రుడు నెలాఖరు రోజుల్లో వచ్చి ఇంట తిష్ఠ వేయడం, ఆయనకు జంట నగరాలను చూపుతూ, దారిలో తారసిల్లిన ఉస్మానియా విశ్వవిద్యాలయం, అసెంబ్లీ హాలు వంటి భవనాలను, వ్యక్తులను, విగ్రహాలను వర్ణిస్తూ చెప్పిన పద్యాలతో నడిచిన కావ్యమిది.

'శతరూప' కావ్యానికి బీజం ప్రథమ మిధునం. ఆ స్త్రీ పురుషులక్రమానుషంగాన్ని వ్యంగ్యమధురంగా చిత్రించారు ఉత్పలవారు. సి.నారాయణరెడ్డి గారన్నట్లు 'ఈ కావ్యం ప్రౌఢ పద్య విద్యకే కాదు, పరిణత భావుకతకు కూడా రత్న ముకురం'.

'రాస పూర్ణిమ' కావ్యం నుంచి ఉత్పల పూర్తిగా కృష్ణభక్తుడే. కృష్ణునికి సంబంధించిన ఇతివృత్తాల మీదే కావ్యాలు రచిస్తూపోయారు. ఆ ఉత్పలా, ఈ ఉత్పలా పూర్తిగా భిన్నంగా కనిపిస్తారు. మొదటి ఉత్పల పద్యరూపంలో కవిత చెప్పినా ఎంతో సామాజిక స్పృహ ఉన్న సమకాలీన ఆధునిక మహాకవి. రెండో ఉత్పల పూర్తిగా తన మనస్సునూ, వచస్సునూ, కర్మలనూ కృష్ణార్పణం చేసిన పరమ భాగ వతోత్తముడు.

'రాస పూర్ణిమ' పండ్లమ్ముకొనే వృద్ధ పుళిందాంగన కథ. కృష్ణుడు ఆమె నుంచి పండ్లను తీసుకోగా, బదులిమ్మని అడిగితే, కృష్ణుడు వడ్లగింజలిస్తే అవే దారిలో నవరత్నాలైతే, వాటిని యమునానది ఒడ్డుననే పారబోసి, కృష్ణభక్తితో తానూ ఒక గోపికయై 'మంజరి' అయిన ఇతివృత్తం.

తర్వాత రచించిన 'శ్రీ కృష్ణచంద్రోదయం' కావ్యానికే కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించినది. ఆరాధ్యుడు శ్రీకృష్ణుడు, ఆరాధిక రాధ, వారిదగు లీలావి–స్తారమెలో కాద్భుత సంసారము– ఈ సర్వ భువన సామర్థ్యంబున్' అనే సందేశమే ఇతివృత్తం. దీన్ని 'శ్రీ గణపతి సచ్చిదానంద స్వామికి అంకితమిచ్చారు. నవ్వువన్నెలలు చిమ్మే శ్రీకృష్ణుడు ఈకృతిలో చంద్రుడయ్యాడు.' శ్రీ అంటే రాధ అని ఉత్పల వ్యాఖ్యానం.

"నవ్వుము స్వామి! నీనగవునంగల మోహకతన్ భజించి దవ్వుల వారు నీమృదు పదంబుల ప్రాలుదు రంతరాత్మలన్

నెవ్వగ దీర, ఏక స నిషమునై కనుపట్టునట్టినీ
నవ్వది నందనందన! అనాదిగ
సాగుననంతకాలమున్"

దీనికి పీఠిక రాసిన జి.వి.సుబ్రహ్మణ్యంగారు ఉత్పల వారి శ్రీకృష్ణకావ్యాలలో ఇది ఉజ్వల నీలమణి! శ్రీ కృష్ణ కావ్యకర్తలలో ఉత్పలవారు కవి శిఖామణి అన్న మాటలు అక్షరసత్యాలు.

ఇక కృష్ణుని మీదనే భాగవతదశమస్కందంలోని చిన్నచిన్న ఇతివృత్తాలను తీసుకొని ఎంతోపెంచి, 'వేణుగీతం', 'యశోదానందగేహిని', 'గోపీగీతం', 'భ్రమరగీతం', 'యుగళ గీతం' వంటి వచనకృతులను రాశారు. ఈ వచనకృతులలో ప్రతివాక్యం కవితాత్మకం, కృష్ణభక్తి భరితం, కృష్ణశాస్త్రి వచనంలోని 'తడి', చలం వచనంలోని 'వడి' పడుగు పేకల్లాగా అల్లుకున్నట్లుగా ఉంటుంది ఈ కృతులలోని వచనం. ఉదాహరణకు.

"శ్రీ కృష్ణుని మురళీరవం మర్త్యలోకం నుంచి సుషిరసోపాన పంక్తుల ద్వారా నాదమయమైన ఇంద్రధనస్సు ద్వారా అమరలోకానికి చేరుకొని, అక్కడి నుంచి, ఆనందఝరిని పృథ్వీతలం మీదికి ప్రవహింపజేస్తుంది. సమస్త జీవకోటికి అలౌకిక స్ఫూర్తిని కలిగిస్తుంది. మనమే కాదు ప్రౌఢలైన వ్రజాంగనలు సైతం ఆ వంశీనాదాన్ని విని, ఉత్కంఠిత నయనాలతో బృందావన వీధులలో, సందులలో, నికుంజ పుంజాలలో ఆ వేణుమాధవుని చూడాలని ఎదురు తెన్నులు చూస్తుంటారు. అపార ప్రేమ మిశ్రితమైన ఆనందం అతని పిల్లనగ్రోవి పాటలో అభివ్యక్తమవుతుంది."

ఎంతటి కవితాత్మకమైన, లయాత్మకమైన వచనమిది. వేణు ధరుని గురించి వేసటలేకుండా వేయి విధాలుగా అలివేణులు వేనోళ్ల చెప్పుకోవడం చదువముచ్చటగా ఉంటుంది ప్రతిపంక్తీ.

ఉత్పల వారి హృదయపుటం ఉత్పలినీ పరాగ కోశం, అనురాగ భరితం, ఆయన మనిషిని ప్రేమిస్తారు. మమతను పూజిస్తారు. మానవుని మనుగడకు దోహదం చేసే మంచి సంస్థలను మనసారా మెచ్చుకొంటారు. మనిషిలోను, సంస్థలోను ఏ కొంత మంచి ఉన్నా, ఏ కొంత మంచి చేసినా, జరిగినా కొండంత పులకించిపోయి ప్రశంసలు కురిపిస్తారు పుష్పవృష్టిలా పద్యాలను. అలా కురిపించిన పద్యాలను ఏరి కూర్చినమాల 'శైవలినీ రాగాలు – ఉత్పలినీ పరాగాలు' దాశరథి చెప్పిన పద్యం చిత్తగించండి.

"ఓ కమనీయ కోమల మహోదయ! దాశరథీ త్వదీయ
మా
ధ్వీక ఝరీధురీణ పదవీథులలో అనవద్య పద్య వి
ద్యా కృషి సల్పి, నీదునవదాత యశః
కలమాంకురంబులన్
లోకమునందు నాటెదన్ అనుగ్రహమెప్పటివోలె
జూపవె"

"పద్య రచనా శిల్పంలో సమకాలిక ఆంధ్రకవులలో

ఉత్పలతో సమానులు ఒకరిద్దరు ఉందురేమో కాని, ఆయనను మించినవారు నిస్సందేహంగా లేరు. శృంగార, హాస్య, కరుణ రసాలను పోషించడంలో ఉత్పలకు ఉత్పలయే సాటి" అన్న దేవులపల్లి రామానుజరావుగారి మాటలలో అతిశయోక్తి ఏ మాత్రం లేదు. అంతా సత్యమే!

బాలసాహిత్యం నుండి భాగవత సాహిత్యం దాకా సాగిన ఆయన కవితాప్రస్థానంలో ప్రతి అడుగూ, ప్రతినుడుగూ భావ బంధురం, సుమసుందరం, నాదమయం, జగన్నాథమయం, ఎనభై ఏళ్ళ పాటు మనమధ్య మసలి వెళ్లినవారు మరెవరో కాదు లీలాశుకులే, పోతన్ననే. వీరందరి మూర్తి ఉత్పల వారిలోనే దర్శించాం.

140

# వడ్డేపల్లి సోదరులు

– డా॥ బెల్లంకొండ సంపత్ కుమార్

ఇరవయో శతాబ్ది తొలినాళ్ళలో లబ్ధ ప్రతిష్ఠులైన కవులు, రచయితలు, పత్రికా సంపాదకులలో వడ్డేపల్లి సోదరులు పేరెన్నిక గలవారు. వారిది మెదక్ జిల్లాలో ఏ వసతులు లేని మారుమూల గ్రామమైన మక్తావడ్డేపల్లి. వడ్డేపల్లి సోదరులలో పెద్దవాడు – బెల్లంకొండ నరసింహాచార్యులు. 1896లో జన్మించాడు. చిన్నవాడు బెల్లంకొండ వెంకటాచార్యులు. 1905లో జన్మించాడు. తల్లిపేరు రుక్మిణమ్మ. తండ్రి లక్షణాచార్యులు. ఆ పూటకు సర్దుకు పోయే బీదరిక కుటుంబం.

కవి పండిత కుటుంబమైనా ఛాందస భావాలు గలవారు కాదు. వ్యవసాయం చేస్తూ జీవించారు. తెలంగాణా ప్రాంతంలో ఒద్దిరాజు, దాశరథి, కాళోజి మొదలయిన సోదరుల కృషి అనివార్యంగా వస్తున్నది. వారిలో బెల్లంకొండ సోదరులు చెప్పుకోదగినవారు. సురవరం ప్రతాపరెడ్డి గారు "వడ్డేపల్లి సోదరులని" పిలవడం వలన వారికి ఆ ఊరిపేరిటనే పేరు సార్థకమైంది.

తండ్రి చిన్నతనంలోనే మరణించడం వలన తల్లి కుటుంబ భారాన్ని వహించింది. ఆమె ఆనాటికే విద్య నేర్చుకొని ఉండటం వల్ల సాయం పాఠశాల నిర్వహించింది. నాటి పాలనా భాష ఉర్దూ కావడం వలన పిల్లలిద్దరికీ స్థానికంగా ఉండే మోల్‌సాబ్ దగ్గర ఉర్దూ నేర్పించింది. సిద్దిపేటలో సూర్యనారాయణ శాస్త్రి వద్ద శిష్యరికానికి పంపించి సంస్కృత, ఆంధ్ర, ఆంగ్లభాషలు నేర్పించింది. అక్కడి నుండి నల్లాన్ చక్రవర్తుల నరసింహాచార్యుల వద్దకు పంపించి తమిళ, కన్నడ భాషలు, తిరువాయి మొజి పాశురాలు, సేవాకాలం అభ్యసింప జేసింది. అక్కడనే సంస్కృత కావ్యాలు, అమరం నేర్చుకున్నారు. రుక్మిణమ్మ దగ్గరి బంధువుల దగ్గర బెల్లంకొండ నరసింహాచార్యులు ఆయుర్వేదం, వెంకటాచార్యులు శిల్పం, చిత్రలేఖనం నేర్చుకున్నారు. వెంకటాచార్యులు నఖచిత్రాలు వేయడంలో నేర్పరి. విద్య అభ్యసిస్తున్న దశలోనే ఇరువురూ అవధాన ప్రక్రియ సాధన చేశారు.

ఇంటికి పెద్దదిక్కయిన తల్లి అంటువ్యాధుల బారినపడి మరణించడం వలన సోదరులపై కుటుంబ భారం పడ్డది. సోదరులిద్దరికీ వ్యవసాయమంటే, ఊరంటే వదలలేని ప్రేమ. తల్లి మరణానికి వగచి వారు "మాతృనివేదన" ఆశు పద్యాలు చెప్పారు. అక్కడి నుండి వారు జంట కవులుగా రచనా వ్యాసంగాన్ని ప్రారంభించారు. కలిసి కథలు, అనువాదాలు, దేశబంధు పత్రిక నిర్వహణ చేశారు.

గోలకొండ కవుల సంచికలో బెల్లంకొండ నరసింహాచార్యులు, వెంకటాచార్యుల కవిత్వం, ఇతర వివరాలు పేర్కొనబడ్డాయి. ఇరువురు కలిసి చేసిన రచనలేకాక స్వతంత్ర రచనలు చేశారు. వారి పద్యరచన నాటకీయంగా కనుల ముందు కదలాడినట్టుగా ఉంటుంది. రామభార్గవ సంవాదం

లో బెల్లంకొండ నరసింహాచార్యుల రచనను ఇందుకు ఉదహరించవచ్చు. సందర్భానికి అవసరమైన ఛందస్సును వాడారు. వృత్తపద్యాలయిన చంపక, ఉత్పల, మత్తేభ, శార్దూలాలు సంస్కృత సమాసయుక్తంగా వీరరసంతో కూడి ఉన్నాయి. సీసగీతం, కందం, తేటగీతులు సరళంగా ఉన్నాయి.

బెల్లంకొండ నరసింహాచార్యుల సంపాదకత్వంలో.....

సోదరులు ఇద్దరూ 1926లో దేశబంధు పత్రికకు శ్రీకారం చుట్టారు. 'దేశబంధు' పేరు పట్ల ఆనాటి నిజాం ప్రభుత్వం, మంజీర కావర్తనం, నిజాం రాష్ట్రాభ్యుదయ పరమార్థమే తప్ప రాజకీయ దురుద్దేశ్యం లేదని, లిఖిత పూర్వక హామీ పత్రం మీద చిన్ననాడు ఉర్దూ నేర్పించిన మోల్‌సాబ్ జమానత్ సంతకం చేయడం వలన చాలా కాలానికి అనుమతి వచ్చింది. రాజకీయ, పాలనాజోక్యం లేకుండా పత్రిక నడుపుకోవచ్చని వెంటవెంటనే నివేదికలు సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది.

సోదరులిద్దరూ మదరాసు నుండి ముద్రణాలయం సామగ్రి పోగు చేసుకొని 1927లోనే దేశబంధు పత్రికను ప్రారంభించారు. సురవరం ప్రతాపరెడ్డి, మాడపాటి హనుమంతరావు వంటివారు దేశబంధును ప్రోత్సహించారు.

పత్రికా నిర్వహణకు కాగితం అవసరమైనందున దూరప్రాంతాల నుండి కాగితం తెచ్చుకోవడం శ్రమ, అదిక వ్యయంతో కూడుకొని ఉండటం వలన స్థానికంగా గూడూరు పల్లెలో కాగితం పరిశ్రమను కుటీర పరిశ్రమగా తీర్చిదిద్దారు. కాగితం రవాణాకు గుర్రం బండిని వాడడంతో నవాబులు ఆగ్రహించి జరిమానా విధించారు. ప్రత్యామ్నాయంగా గాడిదను ఉపయోగించారు. అభ్యంతరకరమైన విషయాలు ప్రస్తావించారని ప్రతులు నిలుపుదల చేసి జరిమానా విధించారు. ఎన్నో కష్టాలు ఎదుర్కొంటూ వారు పత్రిక నడవడం సాహసోపేతమైంది. పత్రికలో ధార్మిక విషయాలతోపాటు సమకాలీన విషయాలకు ప్రాధాన్యత నిచ్చారు. సాహిత్యానికి పెద్దపీట వేశారు. తోకచుక్క దేశానికి అరిష్టమని జ్యోతిషులు చెప్పేవార్తలను "పిచ్చివార్తలు"గా ప్రకటించారు. పునర్వివాహాలు ప్రోత్సహించారు. దేవాలయ ప్రవేశాన్ని దాని అవసరాన్ని ప్రచురించారు. శేషభట్టర్‌లాంటి వారి "అంటరాని వాడు" పద్యాలను ఈ పత్రికలో ప్రథమంగా ప్రచురించి మన్ననలందుకున్నారు. వేద విషయాలు శాసన పాఠం వివరాలు, యోగతరంగిణి, సంస్కృత పాఠాలను వివిధ శీర్షికలుగా నిర్వహించారు. వ్యవసాయ పనులలో ఆటంకాలను, నక్కలదాడిని, జాగ్రత్తలను తెల్పారు. స్త్రీ విద్య, పాఠశాలల స్థాపన, సర్వమత జనుల ఐక్యత, గ్రంథాలయాల స్థాపన, మత్తు వస్తువుల నిరాకరణ, స్త్రీ పురుషుల వివాహ వయసు, వివాహకాలంలో నిరర్థక వ్యయం తీసివేయుట, విధవా వివాహాలు, పిల్లల ఆరోగ్యం, బహిరంగ సభలను ప్రభుత్వం ఆపకుండా ఉండుట, అనాథ వికలాంగులకు తప్పక సహాయం చేయుట ఖాస్గీ పాఠశాలలపై ప్రభుత్వ నిర్బంధం నివారించుట వంటివి పరమ శ్రేయంగా తలచి సంపాదకీయంలో సమర్థించారు.

దేశబంధు సోదరులు "సర్వజన సమ్మతములై దేశ హితముగా" ఉన్న విషయ వ్యాసాలను ఆహ్వానిస్తూ ప్రకటన చేశారు. పరస్పర కలహాస్పద విషయాలకు, మత విషయా లకు చోటులేదని పత్రికలో స్పష్టంగా తెలియపర్చారు.

1927లో వెలువడిన దేశబంధు పత్రికలో మొదటి సారిగా మెదక్ జిల్లా కథకుల రచనలు అచ్చు వేశారు. కథలో వెనకబడి లేమని ఈ పత్రిక రుజువు చేసింది. శేషభట్టర్ వెంకట రామానుజాచార్యులు, వానమామలై లక్ష్మణాచార్యులు, హకీం అడవయ్య, పెద్దమందడి కృష్ణకవి, గుప్తయోగ, మేఘాద్రి పెరుమాళ్ళు, మిట్టదొడ్డి రామదాసకవి, వెంకట రాజన్న లాంటి పండితుల రచనలను ప్రచురించారు.

బెల్లంకొండ సోదరుల కథలు, నవలలు, అనువాదాలు చేశారు. బెల్లంకొండ నరసింహాచార్యులు, 'సియాసీ సభలు' కథ రాశారు. ఇది చారిత్రాత్మక సందర్భంలో వచ్చిన రాజకీయ కథ. ఈ కథ దొంతి దొరల పరిసరాలలోని పాములబండ కేంద్రంగా మొదలవుతుంది. కుల వ్యవస్థను, భూస్వామ్య విధానాన్ని నిరసించిన కథ సియాసీ సభ అంటే ఏమిటనే ప్రశ్నకు "నిజాం రక్కసి ఫర్మానాలను ధిక్కరించి మెదులుకొను వ్యూహమని" జవాబు పలికించాడు. నిజాం ఉత్తర్వులను ధిక్కరించి బతుకుతామా? అన్నంత నిర్బంధంలో రచయిత సాహసంగా కథను మలిచాడు. ఈ కథలో జనులందరి ఐక్యతను కోరాడు. కుల వివక్షతను ప్రశ్నించాడు. "పుట్టుకమైల, చావు మైల, మట్టి మైల మనం మనుషులం

మైలకాము. దేవుడు చెప్పింది ముక్తి" అని గజేంద్రమోక్ష ఘట్టాన్ని మొసలి నుండి చక్రాయుధం ఏనుగును ముక్తి చేసిన సందర్భాన్ని రచయిత ప్రస్థావించాడు. "తెలుగు సాహిత్యంలో వెట్టికి వ్యతిరేకంగా రాసిన తొలికథలలో దీనికి ప్రత్యేకస్థానం ఉందని" సంగిశెట్టి శ్రీనివాస్ మెతుకు కథల ముందు మాటలో పేర్కొన్నారు. ఈ కథ గస్తి నిషాన్ తిర్పన్‌ను వ్యతిరేకిస్తుంది.

బెల్లంకొండ వెంకటాచార్యులు రాసిన "భక్త విజయము" కథ వడ్డేపల్లి నుండి ప్రారంభమవుతుంది. భక్తజనుల సమీకరణ నరసింహావతారమెత్తి రాజ్యం దుర్మార్గాలను ఎదిరించడం కథలోని ఇతివృత్తం.

వడ్డేపల్లి సోదరులు ఇద్దరు కలిసి రాసిన కథ "సంఘ సంస్కార సభ". గ్రంథాలయం స్థాపించినందుకు, ఇంట్లో గ్రంథాలు దొరికినందుకు ఎదురైన నిర్బంధాన్ని ఈ కథలో చిత్రించారు. బాలింతస్త్రీ అని కూడా చూడకుండా ఆమె డొక్కలో తన్నినందుకు విలవిలలాడడం ఆనాటి దౌర్జన్యాన్ని కండ్లకు కడుతుంది. రఫియొద్దీన్ గ్రంథాలయాలను, అణా గ్రంథమాలను, ప్రజల విద్యను ప్రోత్సహించే ఆలోచనాపరుడు. ఆ జాగీరు ప్రాంతంలోనే నౌకరుగా ఉంటూ ప్రభుత్వం ఇచ్చిన ఇల్లును కాదని ఊరూరా తిరుగుతూ గ్రంథాలయాలు నిర్వహించడం పట్ల ఆయన పై జహంగీర్ సేన గిరఫ్‌దార్ ఉత్తర్వులు జారీ చేశారు. పెద్ద జంగు జరిగే సూచన కనబడడం వలన సేనలు వెనుదిరగడం, శతసహస్ర గూడాలకు విజ్ఞాన వ్యాప్తి జరగడం, శారీరక దారుఢ్యం, కుస్తీ, సారస్వత గ్రంథాలయ స్థాపనకు అందరూ ఉద్యుక్తం కావడం ఒక ఆశావహ దృక్పథంగా ఈ కథ సాగింది. ఏ ప్రాంత ప్రత్యేకతలు ఆ ప్రాంత రచనల ద్వారా తెలుసుకోగల వీలును గల కథలుగా డా. నందిని సిధారెడ్డిగారు మెతుకు కథలకు తొలిమాట రాశారు. స్థలకాలాల చారిత్రక కోణంలోంచి ఆడెపు లక్ష్మీపతి ఈ కథలను పరిశీలించారు.

బెల్లంకొండ సోదరులు సాహిత్యాన్ని, పత్రికలను ఊపిరిగా నమ్ముకొని జీవించారు. తాముగా నేర్చుకున్న ఉర్దూభాష పాలకులతో వ్యవహరించడానికి, సంస్కృతం పరిజ్ఞానానికి, సాహిత్య అవగాహనకు ఉపయోగపడింది. వారు మూఢ నమ్మకాలను వ్యతిరేకించారు. విదేశాలలో సంస్కృత ప్రభావం. సంస్కృత సాహిత్యానికి విదేశీయుల సేవ వారిని ప్రాథమికంగా ఆలోచింపజేసింది. స్వభాష కోసం ఏదైనా చేయాలని తపనపడ్డారు. "మనము సల్పునట్టి కృషియే చరిత్రము జనుల జీవనమే చరిత్రము ఇంతకన్నా ఇంకేమి కావలయునని పత్రికా సంపాదకుల గోష్ఠి సభ ట్రూప్ బజారు హైదరాబాదు నందు 1927వ సంవత్సరం సమావేశంలో ప్రకటించారు. ఆ ఆలోచనా విధానమే "దేశబంధు" పత్రికను అనివార్యంగా నడిపింపజేసింది.

బెల్లంకొండ నరసింహాచార్యులు, తమ్ముడు వెంకటాచార్యులు పలు ప్రాంతాలకు వెళ్ళి అవధానాలు చేశారు. అవధానాలు చేయగా వచ్చిన అభిమాన పూర్వక పారితోషికాన్ని పత్రిక కోసం ఉపయోగించారు. బెల్లంకొండ వెంకటాచార్యుల నఖ చిత్రాల వలన పోగైన ధనం దేశబంధు నిర్వహణకు ఉపయోగించారు.

బెల్లంకొండ సోదరులలో నరసింహాచార్యులు బహుగ్రంథ కర్త. ఆయన రామాశ్వమేథం, ఆంధ్రవిశ్వ గుణదర్పణం, ప్రభావతీ ప్రద్యుమ్నం, మండోదరి పరిణయము, భాగవత సంగ్రహము, రామాయణ సంగ్రహము, మీనాక్షి సత్యభామ గర్వాపహరణము, ఉత్తర కళ్యాణము, కుశలవ వివాహము, అభిమన్యు వివాహము, కీచక వధ, తులసీ వివాహము, కనకసేన విజయము, ఉగ్రపాండ్య చరిత్రము, చీనా సుందరి నవల, మల్లికార్జున కీర్తనలు, శ్రీ శివభక్త విజయము ఐదుభాగాలు రచించాడు.

సోదరులు 'ఋణ సంపాదనే' కన్నడ అనువాదం. 'లవంగి' మరాఠి అనువాదం, అకారాది కథల ప్రయోగం చేశారు. ఆ కథలలో ఎనిమిది మాత్రమే లభ్యమైనాయి. వీరి పట్ల ఇంకా సమగ్ర కృషి జరగవలసి ఉన్నది.

# 141 వడ్లకొండ నరసింహారావు

**– డా॥ చీదెళ్ళ సీతామహాలక్ష్మి**

ఉర్దూ రాజభాషగా ఉన్న నిజాం నిరంకుశ పరిపాలనలో తెలుగు భాషా సంస్కృతులు వెలవెలబోతున్న సమయంలో మాతృభాషలో అందులోనూ స్త్రీ విద్యకు ప్రాధాన్యతనివ్వడం, సాంస్కృతిక పరంగా ప్రజలను చైతన్యపర్చడం, నాటి జనాభాలో అత్యధికంగా ఉన్న బలహీన, బడుగు వర్గాలు. తాడిత, పీడిత, దళిత జనోద్ధరణకు, వారి అభ్యున్నతికి నిరంతరం కృషిచేసిన సంఘసేవా తత్పరుడు.. సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా గళం విప్పి, కలం నడిపిన సంఘ సంస్కర్త, తెలంగాణలో జరిగిన ఉద్యమాలకు అపారమైన సేవలుచేసి ప్రజలలో చైతన్యం కలిగించిన నవయుగ వైతాళికుడు వడ్లకొండ నరసింహారావు గారు.

ఆచార కట్టుబాట్లు ఉన్న బ్రాహ్మణ కుటుంబంలో 1893 జనవరి 20వ తేదీన హన్మకొండలో శివరామయ్య, రత్నమ్మ దంపతులకు తృతీయ సంతానంగా జన్మించారు. వరంగల్ రంగశాయిపేట పాఠశాలలో మెట్రిక్ వరకు చదివిన వడ్లకొండ విద్యార్థి దశలోనే సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 1908లో విద్యార్థి సంఘాన్ని స్థాపించిన సంవత్సరమే మూసీ నదికి వరదలు వచ్చినపుడు బాధితుల కోసం విద్యార్థుల పక్షాన నిలబడి విరాళాలు సేకరించారు. బందరు జాతీయ కళాశాల సహాయనిధికి విరాళాలు సేకరించారు. పువ్వు పుట్టగానే పరిమళిస్తున్నట్లుగా బాల్యం నుంచే సమాజ సేవాతత్పరత మొగ్గ తొడిగింది. మేనమామ కూతురు వేంకటమ్మతో వివాహం జరిగింది. ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. పెద్దకుమార్తె నందగిరి ఇందిరాదేవి రచయిత్రిగా పేరు గడించడమే కాక, నైజాం ప్రభుత్వ కాలంలో ఏర్పాటైన 'దక్కన్ రేడియో' కార్యక్రమాల్లో పాల్గొన్న తొలి మహిళ.

మెట్రిక్ చదివేతే చాలు ఆ రోజుల్లో ఏదో ఒక ఉద్యోగం తప్పకుండా వచ్చేది. తాను చదువుకొన్న పాఠశాలలోనే ఉపాధ్యాయునిగా, ప్రధానోపాధ్యాయునిగా పనిచేశారు. తర్వాత నిజాం రాష్ట్ర వ్యవసాయ శాఖలో ఆడిటర్ ఉద్యోగం రావడం వల్ల 1910లో హైదరాబాద్‌కు మకాం మార్చారు. ఆ శాఖలో 30 సంవత్సరాలకు పైగా ఉద్యోగం చేసి అంచెలంచెలుగా ఎదిగి రిజిస్ట్రార్ స్థాయి వరకు చేరి పదవీ విరమణ చేసిన తర్వాత కూడా ఐదు సంవత్సరాలు ఉద్యోగంలో కొనసాగారంటే ఆనాటి నిజాం ప్రభుత్వానికి ఈయన పట్ల ఉన్న విశ్వాసానికి, పనితనానికి గొప్ప నిదర్శనంగా చెప్పుకోవచ్చు. అకౌంట్లు, ఆడిట్, పరిపాలనా విషయాలలో వడ్లకొండకు గొప్ప పరిజ్ఞానముండేది.

నిజాం పరిపాలన కాలంలో ఉర్దూ తప్ప మిగతా మాతృభాషలు బోధించే పాఠశాలలపై 1925లో గస్తీ నిషాన్-53 చట్టం నిషేధాన్ని ప్రకటిస్తూ అమల్లోకి వచ్చింది. ప్రభుత్వ ఉద్యోగంలోనే ఉంటూ స్వీయ సంస్కృతి, భాష పట్ల అభిమానంతో వడ్లకొండ వారు మొక్కవోని ధైర్యంతో తన సమకాలీకుడు మాడపాటి హనుమంతరావు గారితో

కలిసి ఇంటింటికీ తిరిగి చందాలు వసూలు చేయడం, విద్యార్థులను సేకరించి ఆంధ్ర బాలికల ఉన్నత పాఠశాలను స్థాపించడంలో, నిర్వహించడంలో అహర్నిశలు కృషిచేశారు. బాలికల కోసం పాఠశాలను స్థాపించడం అట్టి దుర్భర పరిస్థితుల్లో సాహస కార్యంగానే చెప్పక తప్పదు. వ్యయ ప్రయాసల కోర్చుకోవడమే గాక, అద్దె కట్టలేని పరిస్థితుల్లో అద్దెకున్న తన ఇంటిలోని నాలుగు గదుల్లో మూడు గదులను స్కూలుకే ఇచ్చి ఒక్క గదిలోనే సంసారం నడిపిన పరోపకారి వద్దకొండ. పరిచారికలను పెట్టుకొనే స్తోమత లేక పాఠశాల గదులను తెల్లవారకముందే ఊడ్చి ఆ విషయం ఎవరికీ తెలియకుండా జాగ్రత్తపడిన సేవాతత్పరుడు, నిగర్వి, అపర గాంధీ మహాత్ముడు.

ఈనాడు అభ్యున్నతి పొందిన మాడపాటి హనుమంతరావు ఉన్నత పాఠశాలగా ఉన్నా ఆనాటి నిజాం ప్రభుత్వం వారు గుర్తింపు ఇవ్వలేదు. తెలంగాణలో ఉన్నందుకు ఆంధ్ర విశ్వవిద్యాలయం వారు గుర్తింపు ఇవ్వనపుడు వద్దకొండ వారు ప్రయత్నం చేసి పుణెలోని కార్వే మహిళా విశ్వ విద్యాలయానికి అనుబంధంగా విద్యార్థుల చేత పరీక్షలు రాయించారు.

స్త్రీ విద్య కోసం పరితపించే వద్దకొండ పరోపకారిణీ బాలికా పాఠశాల ఏర్పాటులో భాగ్యరెడ్డి వర్మ గారికి సహాయం చేశారు.

వెట్టిచాకిరి నిర్మూలనకు కృషిచేశారు. శ్రీ కృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం కోసం రజతోత్సవాలు, స్వర్ణోత్సవాల్లో కార్యదర్శిగా ఉండి చక్కగా నిర్వహించారు.

హైదరాబాద్ రాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు గారు అధ్యక్షులు. వద్దకొండ పైసా పైసాకు లెక్కచూపి ఖర్చు విషయంలో కచ్చితంగా ఉండి 'ఐరన్ ఫైనాన్షియర్' అని పేరు తెచ్చుకున్నారు.

రజాకార్ల దమనకాండ ఎదుర్కోవడానికి ప్రభుత్వోద్యోగి అయిఉండి కూడా స్వాతంత్ర్య సమర యోధులకు అండగా ఉండి కావలసిన సహాయం అందించారు. తెలంగాణ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా, హైదరాబాద్ కాంగ్రెస్ కార్యాలయ కార్యదర్శిగా వివిధ హోదాల్లో పనిచేశారు. ఆయుర్వేదం పట్ల అభిమానంతో 1950లో ఆల్ ఇండియా ఆయుర్వేదిక్ యూనియన్ గౌరవ సలహాదారునిగా ఉండి 'ప్రజాసేవాసక్త' బిరుదును పొందారు. ఆంధ్రోద్యమం, ఆయుర్వేదోద్యమం, ఆంధ్ర వైద్యులు అను పుస్తకాలను ప్రచురించారు. విశాల దృక్పథం, మానవత్వం కలిగిన మహనీయులు వద్దకొండ.

అన్ని వర్గాల ప్రజలను ముఖ్యంగా బలహీన వర్గాల వారికి ఎంతో సేవచేసిన సంఘసేవా తత్పరుడు. మాల మాదిగ కులానికి చెందినవారు ఎలా నిర్బంధ శ్రమకు గురవుతున్నారో 'బలోతా ఇనాం' పేరుతో గ్రామంలోని మాలమాదిగలకు ఇచ్చిన ఇనాం భూములకు ప్రతిఫలంగా 'దొరా'కు వచ్చిన అధికారులు ఉచితంగా ఊడిగం చేయించు కోవడం న్యాయసమ్మతం కాదని, అందుకు చట్టాలు అంగీకరించవని అర్థమయ్యే భాషలో 'వెట్టిచాకిరి' అనే పుస్తకాన్ని రచించి, తెలంగాణ వికాసోద్యమంలో ఒక ముఖ్యపాత్రను పోషించిన గొప్ప అభ్యుదయవాది వద్దకొండ చేసిన సేవ చిరస్మరణీయం.

వెనుకబడిన కులాల వారికి సంఘాలు ఏర్పాటు చేసుకోవడంలో, సమావేశాలు నిర్వహించుకోవడంలో, తెలుగు భాష విద్యా బోధనలో, సహపంక్తి భోజనాలు చేసి సమీకరించడంలో కొండంత అండగా ఉన్న గొప్ప కృషీవలుడు వద్దకొండ. అనుకున్న పని ఎంత కష్టమైనా సాధించే పట్టుదల కలవాడు, ఉదార స్వభావి.

ఎంత కష్టపడ్డా శ్రమకు తగ్గ గుర్తింపు మాత్రం వద్దకొండకు దక్కలేదు. ఆయన అజ్ఞాత కార్యశూరుడు. 1955 అక్టోబర్ 28వ తేదీన తుదిశ్వాస విడిచినను తెలంగాణ ప్రజల మనసులో చెరగని ముద్రవేసిన గొప్పమనీషి, చైతన్యదీప్తి, ధైర్యశాలి, భావి తరాలకు స్ఫూర్తి, ప్రజలు మరిచిపోలేని మహనీయుడు. కీర్తిశేషులు, తెలంగాణ ముద్దుబిడ్డ, నిశ్శబ్ద సంస్కర్త, నవయుగ వైతాళికుడు శ్రీ వద్దకొండ నరసింహారావు గారు.

# 142 వానమామలై జగన్నాథాచార్యులు

**– ఆచార్య రావికంటి వసునందన్**

రైతు వాల్మీకి – ప్రజాకవి శేఖర" బిరుదాంకితులైన మహాకవి శ్రీ వానమామలై జగన్నాథాచార్యుల వారు. వరంగల్ జిల్లా మడికొండ వీరి స్వగ్రామం. తల్లి సీతాంబ. తండ్రి బక్కయ్యశాస్త్రి. శ్రీ బక్కయ్య శాస్త్రిగారిది అమోఘమైన అద్భుత కంఠస్వరం. మైకులులేని ఆ కాలంలో మూడూ మైళ్ళ దూరం వినపడేలా గంభీరస్వరంతో బక్కయ్య శాస్త్రిగారు పురాణం చెబుతుంటే – దూర దూరాల ప్రజలు కూడా ఎక్కడి వారక్కడే కూర్చొని ఆలకించేవారట!

"బ్రతికి బక్కయ్య శాస్త్రిగారి పురాణం వినవలె, చచ్చి స్వర్గానికి పోవలె" అనేదట. ఆనాటి ప్రజానీకం, అలాంటి మహనీయుని పుత్రరత్నం – మన ప్రజాకవి శేఖర శ్రీ వానమామలై జగన్నాథాచార్యులవారు. వీరి తమ్ముడే అభినవ పోతన బిరుదాంకితులైన "పోతన చరిత్రము" రచించిన మహాకవి డా. వానమామలై వరదాచార్యులవారు.

శ్రీ జగన్నాథాచార్యులవారి అత్యద్భుత సృష్టి "రైతు రామాయణము". 3000 పద్యాలపై చిలుకు మహాకావ్యం. తెలుగు కవిత్వంలోని అన్ని పోకడలూ పోయిన అలంకార పరిచం. తెలంగాణా గ్రామీణ, రైతాంగ వ్యవహారంలో ఉన్న వేల పదాల రాశి ఇది. పల్లె జీవనశైలిని ప్రత్యక్షం చేసే అపూర్వమైన ఆశ్చర్యకర కావ్యం. వీరి రైతు వాల్మీకి – ప్రజాకవి శేఖర – బిరుదులను సార్థకం చేసిన కృతి. శ్రీ వ్రతగీతి, తెలుగుబిడ్డ శతకం, కార్పాస లక్ష్మి వంటివి వీరి ఇతర రచనలు.

వీటిలో 'శ్రీవ్రతగీతి' – ధనుర్మాసంలో శ్రీ ఆండాళ్ వ్రతం సందర్భంగా చెప్పిన 'తిరుప్పావై' తమిళ గేయ కావ్యానికి తెలుగు అనుసరణం. ఆమె రోజూ సుప్రభాతాన్నే ఒక పాట శ్రీరంగనాథుని మీద అల్లి ఆయన సేవగా ఆలపించేది. అలా ఒక నెల రోజులపాటు ప్రతిదినమూ శ్రీ ఆండాళ్ ఆల్వార్ ఆశువుగా రచించిన ఆ గేయాలను 'పాశురాలు' అంటారు. ఇవి ముప్పై కలసి 'తిరుప్పావై' అన్న పేరుతో ప్రపంచ ప్రసిద్ధాలైనవి. వాటికి మక్కికి మక్కీ అనువాదంగాకాక, చాలావరకు స్వతంత్ర భావాలు సంతరించుకొన్న అనుసరణ కావ్యం ఆచార్యుల వారి తెలుగు శ్రీవ్రతగీతి.

దీనిలో తెలుగు సంస్కృత శబ్దములు పడుగు – పేకవలె కలదిరిగి ఉన్నవి. "నాళాతుంగఘనస్త తటిపై నిద్రించు భద్రాత్ము గోపాలున్ మెల్లగ మేలుకొల్పు శ్రుతిదీప్త" అనే ఆచార్యులవారి మొదటి పద్యంలోనే వారి సంస్కృతపద వైభవం, ఆండాళ్ ఆరాధనా సంప్రకటితములైనాయి. ఇది "నీళాతుంగస్తనగిరితటీ!" అనే సుప్రసిద్ధ శ్లోకానికి అనుసరణ మైనా స్వతంత్రమై సాగింది.

ఇక ఆచార్యుల వారి తెలుగు పలుకుబడల వరుస–

“మాగిదినపు తొలి నెలలో మంచు మరియు వెన్నెలలో అంటూ ధనుర్మాసాన్ని వర్ణించడం” తేనె వలపు చెలులూర! అని ఆండాళ్ తన తోటి కన్యలను సంబోధించడం కావ్యాది లోనే కలకండ పలుకులవంటి కమ్మని తెలుగు పదాలు. చిలిపివాడైన శ్రీకృష్ణుని చూపులలో “కలువలు చెలగి పూసినవట. ఆవ్రత దినములలో ఆండాళ్ నెరికురులు ముడవలేదట – కనుల కాటుక దిద్దలేదట.” ఐనా సహజ సౌందర్యశోభ–

“పెందలకడ తీర్థమాడి కందొర గాటుక దిద్దము
అందాల కురుల సన్నని మందారములను ముడువము
మా పెద్దలొనర్చని మరి యే పనులును సేయబోము
కొండెములను చాడీలను గోరంతము చెప్పబోము
చేతనైన దానమ్మును జేతుము ధర్మము జేతుము
ఖ్యాతిగ మను జీవితమును గలిగి వెలిగి జీవింతుము”

అంటూ కవి ఎంతటి ముద్దు ముద్దు తెలుగు పలుకులలో చిత్రించినారో!

“కొండెత్తున –కడవలకొలదిగ – ఒడువని సిరి – తిరుమేన – పిడుగుటగ్గి – కాలుమేను – పులుగు జతలు – పిల్చా! ఇటులే చిరమ్ము” వంటి ప్రయోగాలు ఆచార్యుల వారికే సాధ్యం.

వీరి జీవన సాఫల్యకృతి – Life work - “రైతు రామాయణము”. కవిత్రయానికి భారతంవలె, పోతనకు భాగవతంవలె! ఇది రామాయణ మహాకావ్య నాయకుడు శ్రీరామచంద్రునికి పోలికగా రైతు రాముడిని చిత్రించిన కృతి. కర్షక జీవనరీతి ప్రధానమైన ఆరాశ్వాసాల అద్భుత పద్యప్రబంధం. రామాయణంలోనూ కాండలు ఆరేకదా! ఐతే ఇది శ్రీ జగన్నాథాచార్యుల వారి ఊహా సంజనిత కల్పిత కథా కావ్యం.

“వస్తానని రానైతివి సుస్తీ చేసినదె” వంటి అచ్చ తెలంగాణ పల్లె పదాలతో కూర్చినది. ఎక్కడనో ఒక్కచోట పల్లీయ పదాల పోహళింపు, నుడికారం వెయ్యడమే గొప్ప! అలాంటిది కావ్యమంతా తెలంగాణా జానపద శబ్దమయం చెయ్యడం ఎంత గొప్ప! అంతటి ‘రామచక్కందనపు’ కృతి ఇది. నిజానికి సీత చక్కందనము మీదనే రామరావణయుద్ధం, మొత్తం రామాయణమే నడిచింది. మరి “రామచక్కందనము” నుడికారానికి ఎలా ఎక్కిందో తెలియదు. ఇలాంటివన్నీ ఎన్నో తెలిసిన పల్లె పదాల మయబ్రహ్మ జగన్నాథాచార్యులవారు.

వాల్మీకి రామాయణంలో వలెనే ఈ రైతువాల్మీకి రైతు రామాయణంలోనూ ఆరు కాండాలున్నాయి. అవి వరుసగా – శిశుకాండము, శిక్షణ కాండము, కళ్యాణ కాండము, కృషికాండము, నిర్బంధకాండము, విజీయకాండము అనేవి. వీటిలో రామాయణంలోని అరణ్యకాండ బదులు ‘కృషి కాండము’ వచ్చింది. రామాయణ అరణ్యకాండలోని శ్రీరాముడు చేసింది – రాక్షస సంహార రూపమైన కృషేకదా!

ఇక్కడ రైతురాముడు చేసింది పాడిపంటల అభివృద్ధి. రైతుజన సంఘాభ్యుదయమనే కృషి. అందుకని ఇక్కడ ఇది కృషి కాండమైనది. రైతుల అభివృద్ధి నోర్వలేక, వారికి వెన్నుపూసవంటి రైతురాముని సత్కార్య నిరతి సహించలేక పాపాల పుట్టఐన పాపారావు, రావణుని ప్రతిరూపం – ఈ కావ్యంలోని రైతు రాముని భార్య సీతను అపహరించి నిర్బంధిస్తాడు. అందుకని రామాయణంలోని ‘సుందరకాండ’ ఇక్కడ ‘నిర్బంధకాండ’ అయింది.

దీనికి మూలకారణం కూడా శూర్పణఖ వంటి పాపారావు చెల్లెలు ‘సుందరమ్మ’. రాముని తమ్ముడు లక్ష్మణుని వలచి విఫలురాలౌతుంది. దానితో రైతురాముని భార్య సీత సౌందర్యాన్ని పూసగుచ్చినట్టు, కైపు తలకెక్కునట్టు అన్న పాపారావుకు వర్ణించి చెప్పి, సీత నిర్బంధానికి కారకురాలైంది. ఇది రైతు రామాయణం కథా విలక్షణత! మరి, ఇన్ని మాటల తర్వాత అసలీ కావ్యం కథ ఏమిటో తెలుసుకోవాలని పించడలేదూ?

ఈ కావ్య కథానాయకుడు రైతురాముడు. అతని తమ్ముడు లక్ష్మణుడు. వారిద్దరి భార్యలు వరుసగా సీత, ఊర్మిళ. బంటు హనుమన్న. సీతజాడలు తీయించిన రైతురాముని స్నేహితుడు ధర్మారావు – సుగ్రీవునికి ప్రతీక. రైతుల అభ్యుదయం పోరాటలో పాపారావుకు బుద్ధిచెప్పి రాముడు సీతను తెచ్చుకొనుట, రైతురాజ్యస్థాపనము, ఆ ఊరు రామాపురానికి రైతురాముని గ్రామపెద్దగా పాపారావు స్థానంలో ఎన్నుకోవడంవంటి కథా ఘట్టాలు. అచ్చం రామాయణేతి వృత్తాన్నే స్ఫురణకు తేవడంలేదా?

ఇది రైతు రామాయణం కాబట్టి కవి – దీనిలోని ఆశ్వాసాలకు కాండములనే పేరు పెట్టారు. శిశుకాండలో వృద్ధులైన రైతురాముని తల్లిదండ్రులు దైవపూజాదికాలు చేసి సంతానం పొందడం – పిల్లల అభివృద్ధి వర్ణితాలు. శిక్షణ కాండలో రామలక్ష్మణుల విద్యాభ్యాసం, రామాపురం గ్రామాభ్యున్నతికై దీక్షబూని రాముడు నిరక్షరాస్యులైన రైతులను చేరదీసి వారికి ఇతోధిక విద్యాబుద్ధులు నేర్పి, కాపు సంఘాన్ని స్థాపించి వారిలో చైతన్యం తీసుకురావడం, నూత్న వ్యవసాయ పద్ధతులను నేర్పి వారిని శాంతియుత హరిత విప్లవ యోధులుగా మార్చడం కథాంశాలు.

ఇక కల్యాణ కాండలో సీతా ఊర్మిళలతో రామ లక్ష్మణుల వివాహం, కృషి కాండలో దుర్భిక్షం, కరువు కాటకాల నుండి రైతాంగాన్ని తన పలుకుబడితో రైతు రాముడు అధికార అర్థిక సహాయం చేయించి, వారిని నిరాశా నిస్పృహల నుండి మరల్చడం వర్ణితాలు. అంతలో విధవయైన పాపారావు చెల్లెలు సుందరమ్మ లక్ష్మణుని మోహించి, తిరస్కృతురాలై ఆ కసితో సీతను పాపారావుచేత నిర్బంధింప జేస్తుంది.

విజయకాండలో సుగ్రీవుని స్ఫురణకు తెచ్చే ధర్మారావు సాయంతో రైతురాముడు పాపారావు గుట్టు రట్టుచేసి, నలుగురిలో ఛీ అనిపించి సీత చెఱ విడిపిస్తాడు. ఆ తర్వాత రామాపురానికి రైతు రాముడు గ్రామపెద్దగా అభిషిక్తుడు కావడం వంటి అచ్చం రామాయణ కథాంశాలను రైతు జీవితానికి అన్వయించిన శ్రీ వానమామలై జగన్నాథా చార్యులవారి కావ్యం "రైతురామాయణం" సార్థక నామ ధేయాన్ని సంతరించుకున్నది.

ఇక ఇందులోని పల్లీయత, రైతు జన సాధారణమైన పదాల, నుడికారాల, సమాసాల ప్రయోగం–

"పచ్చుతి పేర్చి తీర్చిన తివాచులు పచ్చిక బీళ్ళు, కొండలో
దిచ్చులు గొట్టుచున్ పరుగు దీసెడి మేల్ సెలయేళ్ళు, నింగికిన్
నిచ్చెన లెత్తినట్లుగ వనీస్థలి నిల్చిన బట్టతాళ్ళు, పైర్
పచ్చులచుట్టు కోట దరబాగులు దీర్చిన కొండ చాళ్ళునున్"

అని రామాపురాన్ని వర్ణించడంలో ప్రకృతి వర్ణన – అంచులు దిద్దుకొన్నది.

"చేయిరెక్కలు నాలుగోయన నిమ్మడి
పాటొనర్చెడి చతుర్బాహుడతడు
నలుమూలలగల పంట పొలాల దానమై
నలుముఖాలన్ జూచు నలువయతడు
పశుపోషణమ్మునన్ ప్రత్యేకమాయొక
కనుగల్గి వెలుగు ముక్కంటి యతడు
పూని వేగన్నులన్ జేని మొక్కల సదా
రక్షించుకొను సహస్రాక్షుడతడు
చిట్టిగొడ్డలింగొని జెట్టు గొట్టునపుడు
అపర పరశురాముడు, దండిహులమనుగొని
కదల బలధాముడును బాలికాపువెంట
రమణి కూడిరాన్ శ్రీ రఘురాముడతడు"

అంటూ రైతుని రాముడిగా వరుసగా నారాయణుడు, బ్రహ్మ, శంకరుడు, ఇంద్రుడు, పరశురాముడు, బలరాముని తో పోల్చి చివరికి సీతతో కూడిన శ్రీరాముడని వర్ణించడం అత్యద్భుతం.

"పంటలక్ష్మికి తొలియాట పట్టుబక్క
కాపుజనముల పాలి బంగారు గట్టు
కదుపు మొత్తాలు పురికట్టు కాటకాలు
కరువులరికట్టు పెరటికల్పకపు చెట్టు
పట్టణముల యాయువుపట్టు పల్లిపట్టు
అదియెలేక నగరజీవి యాటకట్టు"

అంటూ పల్లెను గాంధీజీ భావించిన గ్రామ స్వరాజ్య భావనతో, కర్షక ప్రాధాన్యత చిత్రించిన తీరు అనన్య సామాన్యం. అలాంటి పల్లెలో –

"పచ్చ చేమంతి పూదోట, పసిడికోట,
పడుచు పరువాల పాల మీగడల తేట
చిలిపి సిగ్గు సింగారాల జిలుగుమూట
పల్లె చెలిమోర్తు జను వరి పంపునాట"

అంటూ నాట్ల ఘట్టాన్ని పరమ రమణీయంగా వర్ణించడం కవిగారి మరోకృతి "కార్పాసలక్ష్మి"ని స్ఫురణకు తెస్తుంది. అంతేకాదు పాపారావు రాక్షస బలగాలను–

“అతని పటాలముల్ యమభటావళితిం బ్రతిరూప
మచ్చు మా
 కుతుకలదాక సంజుళుల కూరలు మెక్కుచు నల్లగల్లు
ద్రావి తలకు బోసుకోదగిన వెక్కసపాటున మస్తు
దూలుచున్
గుతుపల వోలె నా యినుప గలిండ్లటులుంద్రుణ నా
మొదల్”

సరై అంటూ చేసిన రచన పల్లె పదాల మూటకదా? ఇలా ఎన్నని చెప్పడం? చెప్పబూనితే కావ్యమంతా జానపద భాషారీతికి ఉదాహరణగా చెప్పాలె!

రైతు రామాయణం పరువానికి వచ్చిన ఇక్షుర్సిండం – అమృత భాండం! అది తెలుగు జాతికి అందించిన మధురకవి శ్రీ వానమామలై జగన్నాథాచార్యుల వారు పల్లె కవితకు ప్రాతఃస్మరణీయుడు.

# 143 వానమామలై వరదాచార్యులు

**– ఆచార్య రావికంటి వసునందన్**

"ఉత్తమ కవితాలేఖన
చిత్తమ్మెల్లారకు మరక చిక్కునె కూర్పన్
విత్తమ్మా? నేరిచికొ
పొత్తమ్మా? పూర్వజన్మ పుణ్యమెకాకన్"

అని కంఠోక్తిగా కవిత్వం గురించి తమ అభిప్రాయం ప్రకటించిన మహాకవి అభినవ పోతన డా. వానమామలై వరదాచార్యులు గారు. వీరి మహాకావ్యం "పోతన చరిత్రము" 5వేల పై చిలుకు పద్యగద్యాల సమాహారం. శ్రీమాన్ వానమామలై మహాకవే కాక, పోతనవలెనే మహాభక్తుడు. వాగీశ్వర మహామంత్రోపాసనచే సాక్షాత్ శ్రీ సరస్వతీ దేవిని ప్రసన్నం, ప్రత్యక్షం చేసుకొన్న ధన్యాత్ములు, పుణ్యాత్ములు.

వీరి తల్లి సీతమ్మ, తండ్రి బక్కయ్య శాస్త్రి. మైకులులేని పూర్వకాలంలో మూడు మైళ్లు వినబడే కంచుకంఠంతో, మేఘగంభీరస్వరంతో పురాణ ప్రవచనం చేసేవారట వీరు. "తింటే గారెలే తినాలె, వింటే బక్కయ్య శాస్త్రి పురాణమే వినాలె" అనేది ఆనాటి నానుడి.

వరంగల్ దగ్గరి మడికొండ వరదాచార్యుల జన్మస్థలం. చిరకీర్తి నార్జించిన కాళోజీ, పల్లా దుర్గయ్య, బిరుదరాజు రామరాజు గారి వంటి ప్రసిద్ధ వ్యక్తులందరూ మడికొండవారే! వీరికి సమకాలికులే! కలిసిమెలిసి ఆడుకొన్నవారే! వీరి పుట్టిన తేదీ పరీధావి నామ సం॥ శ్రావణ బహుళ ఏకాదశి – సరియైన ఇంగ్లీష్ తేదీ 16 ఆగస్టు, 1912. పరమపదించిన తేదీ రక్తాక్షి నామ సం॥ అశ్వయుజ శుద్ధ అష్టమి, 31 అక్టోబర్, 1984. బిరుదులు : అభినవ పోతన, అభినవ కాళిదాసు, ఆంధ్రకవి వతంస, మధురకవి, కవి కోకిల, ఉత్ప్రేక్షా కవి చక్రవర్తి, మహాకవి శిరోమణి, కవి శిరోవతంస మొదలైనవి.

ఎన్నెన్నో మధురకృతులు వెలయించిన శ్రీమాన్ వరదాచార్యుల వారి జీవితం నిరంతర పీడామయం. యౌవనంలో తీవ్రక్షయవ్యాధితో మైసూరు శానిటోరియంలో పదిసార్లు ఆపరేషన్లు, చెడిపోయిన ఒక ఊపిరితిత్తి తీసివేత, అంతిమ సమయంలో పక్షవాతం, 26 మాసాలపాటు కోమాలో ఉండటం వీరనుభవించిన బాధలు. రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డు, స్వర్ణాభిషేకం, స్వర్ణకంకణం, స్వర్ణగండ పెండేరం, వారణాసి విశ్వవిద్యాలయం వారి డి.లిట్., తెలుగుదేశం నిండా అనేక సన్మాన సత్కారాలు, ఎం.ఎల్.సి. పదవి వీరందుకొన్న వైభవాలు. సుమధుర, సంగీత స్వరసంయుతంగా కోకిల గళంతో కావ్యగానం చేయడం వీరి ప్రత్యేకత!

వయః పరిమితినీ, విద్యార్హతలనూ సడలించి రాష్ట్ర ప్రభుత్వం, శ్రీ బూర్గుల రామకృష్ణారావుగారి ముఖ్యమంత్రిత్వంలో వీరికి ఉపాధ్యాయ పదవీ నియామకం చెయ్యడం వీరి "సహజ పాండిత్యానికి" నిదర్శనం.

పోతన వలెనే సహజ పాండిత్య విభాసితులైన అభినవ పోతన శ్రీమాన్ వానమామలై వరదాచార్యులు వ్యవసాయమూ చేసిన కృషీవలులు కూడా. సాహిత్యంలో, వ్యక్తిత్వంలో ముమ్మూర్తులా పోతన మూర్తీభవించిన అభినవ పోతన – మహాకావ్యం "పోతన చరిత్రము". ఈ మహాకావ్య రచనకు వీరికి పన్నెండేళ్లు పట్టింది. ఇందులోని "భోగినీలాస్యం" – కూర్చున్న చోటునుండి లేవకుండా రాత్రంతా సమాధిస్థితిలో విరచించిన అత్యద్భుత సంగీత సాహిత్య నాట్యమయ ఘట్టం.

పన్నెండు స్కంధాలతో పరిపూర్ణమైన పోతన శ్రీమహా భాగవతం వలెనే; అభినవ పోతన విరచితమైన "పోతన చరిత్రము" కూడా ద్వాదశాశ్వాస విలసితం. అంతగా ఇతివృత్త పటుత్వంలేని పోతన జీవన ఘట్టాలను ఒక మహాకావ్యంగా, మలచడం వరదాచార్యులవారు చేసిన గొప్ప తపస్సు! "విన్ననఖింత భాగవత విశ్రుత పీఠికలోన తాను పోతన్న వచించినంతను … మనమ్మున దోచినంత" – అనే పద్యం మూడు మార్గాల కూడలిగా పోతనకావ్యం ఉన్నదని తెలుపుతున్నది.

ఓరుగల్లు 'బమ్మెర' పోతన్న కడపజిల్లా "ఒంటిమిట్ట" వాడని ఒక వాదం. పోతన చరిత్ర రచనా కాలంలో ఉండేది. ఆ ప్రవాదాన్ని కూడా తోసివేయక వరదాచార్యుల వారు – 'పోతన తన ప్రవాసకాలంలో, సర్వజ్ఞసింగ భూపాలుని ధాటికి స్వస్థలం విడిచిపోయిన సమయంలో తన భాగవతాన్ని ఒంటిమిట్టలోని కోదండ రామస్వామికి అంకితం చేసినాడని వ్రాసి – ఒక అద్భుతమైన సమన్వయదృష్టిని ప్రదర్శించారు. ఆ సమయలో వ్రాసిన ఒక పద్యం –

"చిన్ననటంచునెంచకయె సిగ్గొక ఇంచుకలేక భక్తపో
తన్నను గూడి భాగవతతత్త్వముబాడ గళమ్మువిప్పితిన్
నన్నిక దిట్టిపొందు కరుణంగని దీవెనలిందునాల్గుకో
ట్లన్నల మంగళార్థమయి ఆంధ్రపదాల
నివాళిబట్టితిన్."

ఈ పద్యాన్ని బహుశా, తర్వాత వానమామలై పీఠికల్లో చేర్చి ఉంటారు. ఇందులో తన "అభినవ పోతన" తనంతో పాటు – మంగళార్థమయి అనే ప్రయోగంలో "కావ్యం యశసేర్థవృతే శివేతరక్షతయే" అనే పూర్వాలంకారిక నిర్వచనదృష్టి కూడా ఉన్నది.

"ముందర నీకు మ్రొక్కి కలముంగయిబూనితి, దాని
జిహ్వపై
నందము చిందగా బదములందు సువర్ణపుటందెలూని
తద్ధింధిమితైతతోమ్మనుచు దివ్యరసధ్వనులూరె
నాట్య మిం
పొందగజేయవే! సహృదయుల్విబుధుల్ వినుతింప
భారతీ!"

అనే కావ్య ప్రారంభ సరస్వతీస్తోత్రంలో సంగీతసాహిత్య నాట్య వైభవాల ధ్వని ఉన్నది.

పోతన్న భాగవత రచనా సందర్భంలోని ఈ పద్యంలో 'స్వభావోక్తి' అనే అలంకారం అంచులు దిద్దుకున్నది. ప్రక్కనున్న ముల్లుగొని, పచ్చులు విచ్చెడి తాటికమ్మపై జెక్కుదొడంగె ముత్తియపు చేరుల దీరుచు నక్షరాళి, పై కెక్కిడు బొమ్మలన్ నుదుట నేర్పడు రేఖలు – భావవాహినిన్ జక్కని యానకట్టన సౌరులు దిద్దగ దన్మయాప్తతన్.

ఈ పదాల పోహళింపులో పోతన్నమూర్తి చెక్కిన శిల్పంలా దర్శనమియ్యడం లేదా?

రుచిరార్థసూక్తులకు పోతన చరిత్రము పెన్నిధి.

"ధరనుపాధ్యాయుడెదొ యొక్క తరుణమందు
భ్రాంత పరిమిత జనులకు పాఠమిపను
కాని సత్కవి వాణి శిక్షణ మొసంగు
సకలకాలమ్ములందు విశ్వప్రకృతికి"

వంటి పద్యాలు వరదాచార్యుల సూక్తినిధిత్వానికి ఆనవాలు.

వ్యక్తుల, పాత్రల చిత్రణం – వర్ణనమే కాక తదితర సందర్భాల్లోని కవిత్వ వైచిత్రి కూడా అద్భుతం. ఒక ఎద్దుల బండి ఎక్కి శ్రీనాథుడు పోతన్న దగ్గరికి వస్తాడు. ఆ సందర్భంలో చేసిన వర్ణనం –

"చకచకగిత్తల కదముకు
త్రకిట ధికి ధకిటగా మృదంగధ్వని టక్
టికుమనుకేదారాహతి
నికటతటిని శకటమొకటి నిలిచినయంతన్."

దీనిలోని మృదంగధ్వని పూర్వక అక్షర విన్యాసం అభినవపోతనకు ఉన్న మహాశబ్దాధికారాన్ని వెల్లడించడం లేదా?

పోతనవలెనే అభినవపోతన కూడా తన మహాకావ్యాన్ని శ్రీరామాంకితం చేశారు.

సొమ్ములయాసలో బడక క్షుద్రనృపాలుర నీసడించి చొక్కమ్మగు భక్తి భాగవత కావ్యరమన్ గృతినిచ్చె నీకు శ్రీ బమ్మెర పోతరాజుతని భవ్యచరిత్రమునే మహాప్రబంధమ్ము నొనర్చి నిన్ను కృతినాథునిగా నొనరించి చెప్పెదన్.

"సుతుని గొప్పలగీర్తింప నతిముదమున
వినుచు దనుదాన చెడి జనకుని వలె
నాలకింపవె దేవ! మహానుభావ!
జనవినుతకీర్తి! శ్రీరామచక్రవర్తి!"

అనే పద్యాల్లో తనకూ పోతన్నకూ ఉన్న సమాన లక్షణాలైన నిరీహ, నిత్య సంతృప్తి, భగవద్భక్తి వంటి వాటిని వరదాచార్యులు ధ్వని గర్భితం చెయ్యడం గమనార్హం. ఇలా ఎంత చెప్పినా సరిపోలని వరదాచార్యుల పోతన చరిత్రము ప్రకృతి చిత్రణకూ మానవ స్వభావ చిత్రణకూ మంచికీ మానవతకూ ఒక రత్నదర్పణం.

తెలుగు సాహిత్యంతో వరదాచార్యుల వారు వెలయించిన మహానాటకం 'వైశాలిని' వారికున్న – 'అభినవ కాళిదాస' బిరుదాన్ని అన్వర్థం చేస్తున్నది. రచనలో, పాత్రచిత్రణలో, సంభాషణా వైఖరిలో దానికదే సాటి. శ్రేయోరాజ్యస్థాపన జరగాలనే ఆకాంక్షతో రచించిన ఈ తొమ్మిదంకాల మహానాటకానికి మూలకథ మార్కండేయపురాణంలో కొంత ఉన్నది. అవీక్షితుడు, వైశాలినిని పెండ్లి ఆడటం ప్రధాన కథ. చాలా కల్పనలతో మిశ్రకథగా ఆచార్యులవారు రూపొందించిన ఈ నాటకంలోని సన్నివేశ కల్పనం, సంవిధాన చాతుర్యం, రసపోషణం, కవితా సౌందర్యం అద్వితీయాలు.

"ప్రాణమేగుట మృత్యువు కానెకాదు
నరుడు అభిమానహతుడైన నాడె చచ్చు,
మనుపుట్టుట జన్మమ్ము కానెకాదు
కీర్తి యుదయించునాడె యామూర్తి పుట్టు!" వంటి పంక్తులు ఉత్తమ మానవతా ప్రతిపాదకాలు. ఈ నాటకం శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఎం.ఏ.కు పాఠ్యగ్రంథంగా కొంతకాలం ఉన్నది.

కులమతాలకు అతీతమైన మానవతా ప్రబోధంతో వెలువడిన సుమధుర గేయ కావ్యం 'విప్రలబ్ధ'. ఏటిలో కొట్టుకొని పోతున్న ఒక మహ్మదీయ బాలికను ఒక విప్రుడు కాపాడి ఆమెకు 'లక్ష్మి' అని పేరు పెట్టి, అల్లారు ముద్దుగా పెంచుతాడు. ఆమెకు 'రాముడు' అనే ఒక రైతుతో వివాహం జరిపిస్తాడు. కులమతాల సంకుచితత్వాలకు అతీతంగా వెలసిన ఈ విప్రలబ్ధ కావ్యం అంతా గేయమయమే!

"నీవెవడవు నీవెవడవు నిజం చెప్పుమానవుడా!
నిజముగ మానవుడ వీవు – నీజాతియె మానవత
ఆలరంగదేదియైన పాలరంగు ఒక్కటియే!"

అని ప్రబోధించే సర్వమానవ సౌభ్రాతృత్వ రచన ఇది.

"వచ్చెను వచ్చెను వర్షాలు మావసుధారాణికి తలంబ్రాలు పంటచేలకు ప్రాణాలు" అని ముగ్ధమనోహరంగా వర్ణిస్తూనే వాటిని, "వరికంకులనోళ్లకు చనుబాలు" – అని మాతృ మధుర హృదయంతో విరచించడం కేవలం వరదాచార్యులకే సాధ్యమేమో!

చంద్రుడట, చుట్టూ చుక్కలతో కలిపి "చదల పిల్లలకోడి తిరిగినట్టుంటాడట!" ఈ భావనకు గొప్ప కృషీవల హృదయం కావాలి. చదలు అంటే ఆకాశం. చదలు అంటే కోడి, తన పిల్లలతో కలిసి ఏరుకొని తినే చదలు. ఎంతటి విశ్లేషరమ్యం ఇది!

"ఎవ్వరీ చిన్నది ఎంతబాగున్నది?
కన్ను ఇక్కడనుండి కదలనంటున్నది!
పెదవి చెలియలికట్ట నొదుగు సిగ్గుల కడలి
నవ్వు ముత్యాల్ బోసి నా గుండె కొన్నది"

అని నాయిక లక్ష్మిని చూసి నాయకుడు రైతు రాముడనుకోవడం ఎంతటి సహజ పల్లీయ వర్ణన! "సిగ్గుల కడలి నవ్వు ముత్యాలు" అనే ప్రయోగం మన అలంకార శాస్త్రంలో పూర్ణోపమ! వాళ్లిద్దరికీ అదేమి తెలియదు పరిపూర్ణ స్నిగ్ధ ప్రణయం తప్ప.

అరవైకి పైగా ఇలా అత్యద్భుతంగా అభినవ పోతన డా. వానమామలై వరదాచార్యులు సృష్టించిన మహోన్నత సాహిత్యంలో మరికొన్ని – మణిమాల, ఆహ్వానం, జయధ్వజం, స్తోత్రరత్నావళి, గీతరామాయణం, సూక్తి వైజయంతి, స్తవరాజపంచశతి, అభ్యుదయ నాటికా సంపుటి,

రైతుబిడ్డ, దాగురింతలు, వ్యాసవాణి వంటి మేటి రచనలు వాటికవే సాటి.

“వరదాచార్యులు మద్గురూత్తములు శ్రీవాగీశ్వరీలబ్ధి
దివ్యరసోల్లాస కవిత్వ విద్యులు తలంపన్
పోతనామాత్యులే
కరుణన్ రెండవసారి బుట్టిన తెలంగాణమ్మునన్
వానమా
మల వంశాంబుధి చంద్రులై సుక విరాణ్మందార
బృందారులై!”

# 144 వందేమాతరం రామచంద్రారావు

– డా॥ యం. దేవేంద్ర

వందేమాతరం రామచంద్రారావు అసలు పేరు వావిలాల రామచంద్రారావు. ఆనాడు నిజాంకు వ్యతిరేకంగా పోరాటం చేసి అనేకసార్లు జైలుకు వెళ్ళిన ధీశాలి. 'వందేమాతరం' తన ఊపిరిగా నినదించిన సత్యాగ్రహి, అంతేకాదు గొప్పవక్త, ఆర్య సమాజ కార్యకర్త, అధికార భాషాసంఘం అధ్యక్షులుగా ఉండి తెలుగు భాష ఉన్నతి కోసం తపించిన సంస్కర్త.

వందేమాతరం రామచంద్రారావు 1917లో ఏప్రిల్ 25వ తేదీన, మహబూబ్ నగర్ జిల్లాలో, రామలక్ష్మమ్మ రామారావు దంపతులకు జన్మించారు. వీరిది సంప్రదాయ కుటుంబం. వీరి అన్న వీరభద్రరావు కూడా నిజాంకు ఎదురొడ్డి నిలిచిన ధీరుడు. రామచంద్రరావుకు తల్లిదండ్రుల సాహచర్యం వలన బాల్యదశయందే సంస్కార భావాలు అలవడ్డాయి. విద్యార్థి దశలోనే ఆర్య సమాజ కార్యకర్తగా శిక్షణ పొందారు. ఆనాడు హైదరాబాదు ఘర్షణలు జరుగుతుండేవి. ఒకవైపు ఆర్యసమాజం హిందూమతంలో దురాచారాలను నిర్మూలిస్తూనే మరొకవైపు హిందువుల ఐక్యత కోసం పాటుపడేది. నిజాం ప్రభుత్వం మాత్రం ఆర్య సమాజాన్ని మతవిరోధ సంస్థగా భావించేది.

వందేమాతరం గారు హిందువులందరినీ ఒక త్రాటిపై నడిపించడానికి ఎంతో ప్రయత్నించారు. హైందవ సమాజంలో కుల, వర్ణ వ్యవస్థవల్ల ఐకమత్యం కొరవడిందని గ్రహించి కులరహితమైన ఆర్య సమాజ సిద్ధాంతాలపట్ల ఆకర్షితుడై వాటిని అనుసరించారు. ప్రజలందరిని ఆర్య సమాజంవైపు మళ్ళించారు. ఒక వారందరిని ఒక సంఘటిత శక్తిగా రూపొందింపచేశారు. హైదరాబాదులోనే గాక ఢిల్లీలోని ఆర్యసమాజ ప్రధాన కేంద్రాల్లో కూడా అనేక కీలక పదవులను నిర్వహించి దేశవ్యాప్తంగా ఆర్య సమాజాన్ని ప్రచారం చేశారు. దేశభక్తిని చాటారు.

ఆనాడు భారతదేశమంతటా స్వాతంత్ర్యోద్యమం దశలవారిగా బలపడుతుంటే స్వయం ప్రతిపత్తి కలిగిన హైదరాబాదు రాష్ట్రంలో పరిస్థితులు వేరుగా ఉన్నాయి. బ్రిటిషు పరిపాలనతో సంబంధం లేకుండా నిజాం తనదైన శైలిలో పరిపాలనను కొనసాగిస్తున్నాడు. కాబట్టి తెలంగాణ ప్రజలకు స్వాతంత్ర్యకాంక్ష ఉన్నప్పుడు నిర్బంధంలో ఉండి పోవల్సిన పరిస్థితి. నిజాం రాష్ట్రంలో అన్ని విద్యాసంస్థల్లో ప్రార్థనాగీతం నిజాంకు సంబంధించినదే పాడేవారు. కాని 1938 నవంబరు 30వ తేదీన ఉస్మానియా విశ్వ విద్యాలయంలో చదివే విద్యార్థులు సాహసించి 'వందే మాతరం' గీతం ప్రార్థనగీతంగా ఆలపించారు. ఆ రోజు చరిత్రలో కీలకమైన రోజుగా చెప్పవచ్చు. ఆలపించడమే కాకుండా ఆనాటి యువ విద్యార్థులు అచ్యుతరెడ్డి, హరిహరరావు దేశపాండే, వి.కె. రెడ్డి నాయకత్వంలో ఉస్మానియా విద్యార్థులు ఒక కార్యాచరణ సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అనతికాలంలో 'వందేమాతరం' ఉద్యమంగా

మారి తెలంగాణ వ్యాప్తంగా నిజాంకు వ్యతిరేకంగా పోరాటం మొదలైంది.

అంతకంటే ముందే 1938 అక్టోబరు 22వ తేదీన గౌలిగూడలో హిందూ పౌరహక్కుల సంఘం తరపున యశ్వంతరావు, దిగంబరరావు జోషి, జుక్కల్కర్ తదితర నేతలు నిజాం సర్కారు వైఖరికి నిరసనగా ఒక గొప్ప ప్రజాప్రదర్శనకు పిలుపునిచ్చారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కొంతమంది ఉత్సాహంతో ప్రసంగించారు. వారిలో రామచంద్రారావు ఒకరు. ఊహించిన విధంగానే ప్రభుత్వం ప్రదర్శనకారుల్ని అదుపులోకి తీసుకుంది. ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అట్లా అరెస్టయిన వారిలో రామచంద్రారావు కూడా ఉన్నారు. జైల్లో తనతోపాటు స్వామి రామానంద తీర్థ ఉన్నారు. శిక్షను అనుభవించే ఆర్యసమాజ కార్యకర్తల జంధ్యాలన్నీ తీసివేశారు. రామచంద్రారావు గారి నాయకత్వంలో జైల్లో నిరసన దీక్షకు కూర్చున్నారు. తమకు జంధ్యాలు వేస్తేనే భోజనం చేస్తామని ప్రకటించారు. అప్పుడు జైలు అధికారులు దిగిరాక తప్పలేదు. దానితో రామచంద్రా రావు సామాన్యుడు కాదని అధికారులకు తెలిసివచ్చింది.

సత్యాగ్రహులైన ఖైదీలు రోజూ సంధ్యావందనం ఆచరించేవారు. అటు తర్వాత వందేమాతరం అంటూ నినదించేవారు. ఈ విషయంలో జైలు అధికారులకు తీవ్రమైన అసహనం ఉండేది. వారు ఈ నినాదాన్ని పలకవద్దని పలుమార్లు ఖైదీలను హెచ్చరించారు. ఖైదీలు ఈ హెచ్చరికల్ని ఎంతమాత్రం ఖాతరుచేయలేదు. ఈ విషయం కాస్తా నిజాం రాష్ట్రపు జైళ్ళ డైరెక్టర్ జనరల్ హెచ్.బి. హాలిన్స్ వరకు చేరింది. ఆయన చంచల్‌గూడ వచ్చి సత్యాగ్రహులైన ఖైదీలకు హెచ్చరికలు జారీ చేశాడు. అయినప్పటికీ ఖైదీలు వందేమాతరం నినదించడం మానలేదు. వారి నాయకుడిగా ఉన్న రామాచంద్రరావు మీదికి జైలు అధికారుల దృష్టి మళ్ళింది. ఆయనను తీవ్రంగా హింసించాలనుకున్నారు. కట్టివేశారు. కరడుగట్టిన నేరస్తుడితో ఆయనను కొట్టించారు. కొట్టిన ప్రతికొరడా దెబ్బకు వందేమాతరం అంటూ నినదిస్తూనే ఉన్నాడు. కొట్టిన దెబ్బల కారణంగా శరీరమంతా రక్తం కారుతున్నప్పటికీ వందేమాతరం గొంతెత్తి పలుకుతూనే ఉన్నారు. రామచంద్రా రావు స్పృహతప్పి పడిపోయేవరకు కొడుతూ పోయారు జైలు అధికారులు. నిజాం సర్కారు ఎంతగా హింసించినా రామాచంద్రారావులోని పోరాట పటిమ ఎదుగుతూ వచ్చిందేకానీ బలహీనంకాలేదు. చంచల్‌గూడ జైలు నుండి విడుదలైన కొంతకాలానికే తిరిగి ఉద్యమంలో చేరారు.

గౌలిగూడ రామమందిరం ప్రాంతంలో అశేష ప్రజానీకాన్ని ఉద్దేశించి "బాధ్యతాయుత ప్రభుత్వాన్ని సాధించితీరుతాను" అంటూ ప్రతిజ్ఞ చేశారు. ప్రభుత్వం అతడిని తిరిగి అరెస్టు చేసింది. రాజద్రోహ నేరాన్ని మోపింది. 1941లో రామచంద్రారావు జైలు నుండి విడుదలయ్యారు.

హైదరాబాదు సంస్థానంలో కె.ఎం. మున్షీ భారత ఏజెంట్ జనరల్‌గా ఉన్నరోజుల్లో ఆయనకు సహకరిస్తూ వందేమాతరం సోదరులు ఎన్నో సాహసాలు చేశారు. ఈ విషయాన్ని దాశరథి రచించిన యాత్రాస్మృతిలో ఒకచోట పేర్కొన్నారు. "తన రాష్ట్రాన్ని స్వతంత్ర రాష్ట్రంగా నిలబెట్టుకోవడానికి నిజాం నవాబు చేస్తున్న సన్నాహాలలో కొత్త కొత్త ఆయుధాల ఉత్పత్తి ఒకటి. ముఖ్యంగా జపాన్ టైప్ త్రీనాట్ త్రీ రైఫిల్ బ్లూప్రింట్ శ్రీ మున్షీకి కావలసివచ్చింది. ఆ పని మేం చేస్తామని వందేమాతరం సోదరద్వయ ముందుకు వచ్చారు. ఒక చీకటిరాత్రి, నిజాం సైన్యాల అధిపతి ఎల్.ఎ. డ్రూస్ విశ్వాసపాత్రుడైన జె.సి.ఓ. ఒకడు ఉండేవారు. అతడు గోల్కొండలోని మోతీమహల్‌లో ఉన్న ఆయుధ నిర్మాణశాలకు అధికారి, ఎలాగో అతని కన్నుగప్పి ఈ ఇద్దరు సోదరులు ఆయుధ నిర్మాణశాలలో ప్రవేశించారు. పులినోట్లో తలపెట్టినట్లే. పద్మవ్యూహంలో ప్రవేశించినట్టే. ప్రశాంతచిత్తంతో వజ్ర సంకల్పంతో నిర్దుష్టమైన పథకం ప్రకారం ఆ రహస్యాన్ని సాధించారు. శ్రీ మున్షీకి అందించారు." ఎంతటి సమయస్ఫూర్తి ఉంటే తప్ప ఇట్లాంటి సాహసకృత్యాలు సాధిస్తారు. ఈ విధంగా అఖిల భారతస్థాయిలో కె.ఎం. మున్షీ వీరసావర్కర్ వంటి ప్రశంసల్ని అందుకున్నవారు వందేమాతరం సోదరులు.

రామచంద్రారావు తొలుత హైదరాబాదు రాష్ట్రంలోనూ, అటు తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ క్రియాశీలంగా పనిచేశారు. శాసనసభకు స్వతంత్ర అభ్యర్థిగా పోటిచేసి గెలిచారు. 1969లో జరిగిన తెలంగాణ ఉద్యమాన్ని బలపరిచారు. చిన్నరాష్ట్రాలు ఏర్పడాలని కోరుకున్నారు.

1980 ప్రాంతంలో ఇప్పటి మర్రిచెన్నారెడ్డి ప్రభుత్వం వీరిని అంతర్జాతీయ తెలుగు కేంద్రానికి ఛైర్మన్‌గా నియమించింది. ఆ హోదాలో వీరు రాష్ట్రేతర ప్రాంతాలలో విదేశాలలో ఉన్న తెలుగువారికి అనేక భాషాసేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఆ తర్వాత 1981లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా నియమించింది. తెలుగు భాష అమలు కోసం నిరంతరంగా కృషి చేశారు.

ఈ విధంగా జీవితంలో అనేక సాహసాలు చేసి, ఉద్యమం ఊపిరిగా జీవించి అనేక పదవులను అలంకరించి ప్రజావ్యక్తిగా చరిత్రలో నిలిచిన సాహసి వందేమాతరం రామచంద్రారావు.

# 145 వాంకుడోత్ జోగ్యా నాయక్

**- డా॥ వి. రామకోటి**

తనువులోను అణువణువున తర తరాల పోరాటం... భూమి కోసం, భుక్తికోసం, చైతన్యం కోసం, రేపటి తరానికి మంచి భవిష్యత్ కావాలనే తపనతో పోరాటం నాడు తెలంగాణాలో కన్పించిన వాతావరణం. ప్రజా వ్యతిరేకంగా పాలన సాగించిన నైజాం రాజ్యంలో ప్రజల ఆర్తి, ఆరాటం, బలిదానాలు, త్యాగాలు ప్రజల దుస్థితికి తార్కాణాలు. ఒకరకంగా చెప్పాలంటే తెలంగాణ మొత్తం చీకటి కాలంగా పేర్కొనవచ్చును. ఆ రోజుల్లో ప్రజలందరు నిజాంకు కొమ్ము కాస్తున్న దొరలకూ, దేశ్‌ముఖ్‌లకు తల వంచి హీనంగా బతకవలసి వచ్చింది.

ఇంతటి గడ్డుపరిస్థితి తెలంగాణలో నెలకొని ఉండటం విచారకరం. అయితే దీనిని ఎదిరించడంలో ఎందరో మహనీయులు హింస, అహింసా (గాంధేయ) మార్గాలతో తమ తమ పోరాటశక్తిని చూపారు. అయితే కాలం చెరిపేసిన జ్ఞాపకాలలో నైజాం రాజు పాలనను ఎదిరించిన వారిలో పేరున్నవారు మాత్రమే ఈనాటికీ పోరాట యోధులుగా నిలచిపోయారు. కాని చరిత్ర పుటలకెక్కని వారిని శోధించి సమాజానికి అందించవలసిన అవసరం పరిశోధకులపై ఉంది.

నైజాం రాజ్యంలో దొరలు, దేశ్‌ముఖ్‌ల ఆగడాలు భరించలేని బడుగు, బంజార తెగలవారు అణచబడ్డ చరిత్రకు సాక్షీ భూతంగా నిలిచారు. అయితే వారిని మనుష్యులుగా మలిచిన నాటి నిప్పు కణాలు చరిత్రలో మణిపూసలుగా నేటికీ తళుకులీనుతునే ఉన్నాయి. తెలంగాణాలో గ్రామాల అభ్యున్నతి కోసం సమాజ వికాసం కోసం జాతి ఔన్నత్యం కోసం బంజారాలు ఆజన్మాంతం శ్రమించారన్నది స్పష్టపడే విషయం. ఈ నేపథ్యంలో నిజాం రాజుకు కొమ్మకాస్తున్న దొరలను, దేశముఖ్‌లను ఎదిరించి లంబాడ జాతికి మరో గాంధీలా వెన్నుదన్నుగా నిలిచి పోరాడిన అహింసామూర్తి జోగ్యా నాయక్ వాంకుడోత్.

జోగ్యా నాయక్ నేటి జనగాం జిల్లా లక్ష్మక్కపల్లి గ్రామ నివాసి. ఈయన తన కుటుంబాన్ని పోషించుకోవడమే కాకుండా ఆ గ్రామ తండా వాసులతోపాటు ఇతర గ్రామ ప్రజల బాగోగులను చూసుకునేవాడు. ఈ బంజారాలు బంజర భూములను సాగులోకి తీసుకొచ్చి పుట్లకు పుట్లు పంటదీస్తుంటే దీనిని చూసి భరించలేని ఆ గ్రామ దొర పుసుకూరి రాఘవరావు ఆ భూమిని తీసుకొని వీరిని మరో చోటుకు పంపించేవాడు. ఈ విధంగా ఆ గ్రామంలోనే అనేకచోట్లు తిరిగిన లంబాడాలు జోగ్యా నాయక్ ఆధ్వర్యంలో దొరను ధిక్కరించడంతో భూ పోరాటానికి బీజం పడింది. ఈయన ఆధ్యర్యంలో అనేకమంది బంజార యువకులు దొరలను తీవ్రంగా వ్యతిరేకించి పోరాటాలకు సన్నద్ధులయ్యారు. ఆ సమయంలో ఉన్న క్రిమినల్ ట్రైబ్స్ (Criminal Tribes) (CT) యాక్టుతో దొరలు వీరిని దొంగలుగా ముద్రవేశారు. ఈ చట్టాన్ని కూడా వ్యతిరేకిస్తూ

జోగ్యా నాయక్ భారత స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా హైదరాబాదుకు వచ్చిన గాంధీ గారిని కలిశారు. గాంధీగారి సలహాతో తన పోరాటాన్ని గాంధేయ (అహింసా) మార్గంలో నడిపించిన ఉద్యమ యోధుడు బంజార నాయకుడు శ్రీ జోగ్యా నాయక్.

ఒకసారి విసునూరి రామచంద్రారెడ్డి బండిలో తాను కూర్చొని ఇద్దరు దళితులతో బండి లాగిస్తూ బండి వెనకాల మరొక దళితున్ని చేతులు కట్టేసి చెన్నూరు నుండి మంచుప్పల రోడ్డుపై కొట్టుకుంటూ పరుగెత్తిస్తుంటే, దీనిని గమనించిన జోగ్యానాయక్ బండికి అడ్డంగా పరుగెత్తి బండిముందు అడ్డంగా పడుకున్నాడు. నన్ను చంపిన తర్వాతే వారికి శిక్ష వేయమని దొరకు సవాల్ విసిరాడు. ఆనాటి నుండి ఆయన ధైర్యసాహసాలకు నాటి జనం జేజేలు పలికారు.

ఆ తరువాత గ్రామ ప్రజలు జోగ్యానాయక్‌ను తమ నాయకునిగా ఎన్నుకున్నారు. కమ్యూనిస్టులకు, నిజాం రాజుకు దొరల ఆగడాలను వివరించే బాధ్యతను ఆయనకప్పగించారు. నాయకత్వ లక్షణాలు, మాట్లాడే చతురత, సమయస్ఫూర్తి, గాంధీ స్ఫూర్తితో దొరలను ధిక్కరిస్తూ నాటి జనం గుండెల్లో శాశ్వత కీర్తిని సంపాదించుకున్నాడు. దొరలు తనను అంతమొందించడానికి పన్నే కుట్రలను భగ్నం చేస్తూ సమయస్ఫూర్తితో మెలిగేవాడు.

జోగ్యానాయక్ ప్రేరణ నాటి బంజార యువకులపై బలంగా పడింది. కమ్యూనిస్టులు తండాలకు వచ్చి సమకాలీన పరిస్థితులను వివరించి పోరాటాలకు సిద్ధం చేసేవారు. అటువంటి వారిలో పాలకుర్తి సమీపంలో కొండాపురం గ్రామంలో లకావత్ హేమ్లా బంజార తెగలో పాలకుర్తి ఏరియా తొలి కమ్యూనిస్టు నాయకుడు గండర గండరలుగా పిలువబడ్డ జాటోతు ఠాన్యా నాయక్, దర్యా నాయక్‌లు కర్రలు, గొడ్డళ్ళు, కత్తులు, తుపాకుల (303)తో రజాకార్లపై రౌడీలపై విరుచుకపడ్డారు. ఒక సందర్భంలో రౌడీలను నరసింహస్వామి హిరణ్యకశ్యపుణ్ణి చంపినట్లుగా చంపారని ఈ ప్రాంత వాసులు ఇప్పటికి కథల కథలుగా చెప్పుకుంటారు. జాటోతు ఠాన్యా నాయక్ పోరాటపటిమ లంబాడ సమాజానికి ఒక స్ఫూర్తి.

ధరావత్ బగ్యానాయక్, ధరావత్ పంతుల్యాలు కూడా మొండ్రాయి గ్రామంలో దొరలను తీవ్రంగా ప్రతిఘటించి తరిమికొట్టారు. తమ భూములను కాపాడుకోగలిగారు.

సింహం కడుపున సింహమే పుడుతుందన్నట్లుగా జోగ్యానాయక్ కడుపున ధైర్యానికి నిలువెత్తు దర్పణమైన తార్యా నాయక్‌ను ఈ సందర్భంగా ప్రస్తావించడం అనివార్యం. ఇతని పోరాట పటిమ అమోఘం. లంబాడజాతి పోరాటయోధుల కీర్తి కిరీటంలో కలికితురాయి. తార్యా నాయక్‌ను తుపాకి తార్య అనడం ఇప్పటికి ఒక రివార్డే అవుతుంది. పోరాటయోధులు ఆరుట్ల రామచంద్రారెడ్డిని లక్ష్మక్క పల్లి గ్రామానికి తీసుకు వచ్చి నిజాం వ్యతిరేక పోరాటంలో ఆ గ్రామ దొర అయిన రాఘవరావుకు వ్యతిరేకంగా ఎడ్లబండ్లతో ఊరేగించి ఆ దొర ఇంటిముందు వ్యతిరేక నినాదాలు చేస్తూ అనేక గ్రామ ప్రజలను ఒక్క త్రాటిపైకి తీసుకు వచ్చిన జోగ్యానాయక్‌కు తోడుగా నిలబడ్డాడు తనయుడు తార్యానాయక్.

జోగ్యానాయక్ నిజాం వ్యతిరేకంగా భూపోరాటం చేసిన కాలంలో లక్ష్మక్క పల్లిగ్రామం దొరపై కేసుపెట్టడానికి తన గ్రామం నుండి భువనగిరి కోర్టుకు సుమారు 70 కి.మీ. నడిచి వచ్చిన సంఘటన తార్యానాయక్‌పై చూపింది. లంబాడా జాతిని ఉద్ధరించడానికి, సామాజిక న్యాయం, గౌరవం, రక్షణ వంటి వాటికై అనునిత్యం శ్రమించిన శక్తిశాలి. తండ్రి ఆశయం, చైతన్య స్ఫూర్తిని మనసు నిండా నింపుకొని దొరలపై యుద్ధం ప్రకటించాడు. నిజాం ప్రభుత్వంలో పెద్ద వర్గానికే పరిమితమైన తుపాకిని తన చతురతతో లైసెన్స్ తుపాకి సంపాదించి తుపాకి తార్యగా ప్రసిద్ధుడయ్యాడు.

మనం మనం జనం జనం కలిసి కదిలితే బలం బలగం అన్నట్లు అందరి కోసం బతకడమే సిద్ధాంతంగా ముందుకు సాగాడు. తార్యానాయక్ తండ్రి నుండి వచ్చిన వారసత్వం, పోరాడేతత్వం అతనిని మానవతవాదిగా మార్చాయి. బలం అంటే తార్యానాయక్ తన కులం, తన జాతియే కాకుండా మానవత బలమని చాటాడు. ఈ తత్వమే ఈయనను వెనుకబడిన జాతులకు ఆప్తుణ్ణి చేసింది. చదువుతో

పని ఏమి హృదయమున్న చాలు అన్నట్లు తల్లిదండ్రుల నుండి తెచ్చుకున్న పరోపకార జ్ఞానం పరమాత్మ జ్ఞానంగా మలుచు కున్నాడు. శ్రమను నమ్ముకున్న తార్య ఆశ్రమఫలం పరాయి పరం కాకుండా ఉద్యమాలకు ఊపిరి పోశాడు. హైదరాబాద్ సంస్థానంలో జాగీరుదారులు, భూస్వాములు, జమిందారులు చేసే దౌర్జన్యాలను ఎదిరించడంలో తార్యనాయక్ ముఖ్య భూమికను పోషించాడు. ఆరుట్ల రామచంద్రారెడ్డి నాయకత్వంలో పోరాటం చేస్తూ పుస్కూరు రాఘవరావు, విసునూరి రామచంద్రా రెడ్డిలు చేసే దుర్మార్గాలను ముందే పసిగట్టి వారిచేత ఆక్రమించబడ్డ భూములను తిరిగి బంజారాలకు ఇప్పించిన పోరాటయోధుడు. ఆరుట్ల రామచంద్రారెడ్డిపై జరిగే హత్యాయత్నాన్ని పసిగట్టి, భగ్నంచేసి ఆయనకు దన్నుగా నిలబడ్డాడు.

లంబాడ ప్రజల హక్కులను నేల రాస్తున్న దొరలపై కర్కశంగా ప్రవర్తించాడు. అజ్ఞానం, అమాయకత్వం, అవిద్య ఏ జాతి ఎదుగుదలకైనా అవరోధాలని భావించి, వాటిని రూపుమాపడానికి జీవితాంతం కృషి చేశాడు. బిరుదులు, గుర్తింపులకు అతీతంగా సమాజ సేవ చేసే మహనీయుల సరసన సగౌరంగా నిలబడగలిగిన వ్యక్తి తార్యా నాయక్ తండ్రి జోగ్యానాయక్.

లంబాడ జాతి ఉద్ధరణ కోసం తమ జీవితాలను తరింపచేసిన వ్యక్తులు. బంజార యోధులు జోగ్యా నాయక్, తార్యా నాయక్‌లు. తెలంగాణ ప్రజలు నిజాం రాజ్యం నుండి విముక్తులై స్వాతంత్ర భారతావనిలో కలిసినపుడు ప్రజాస్వామ్యంలో లంబాడాలకు లభించిన హక్కులను చూసిన జోగ్యా నాయక్ 1987లోను, తార్యానాయక్ 2015లోను తెలంగాణ చరిత్ర శిఖరాలను చేరారు.

తెలంగాణ చరిత్రలో మరచిపోలేని పుటలు వాంకుడోత్ జోగ్యానాయక్.

"మీకు మీరై జన్మించారు
ఎందరి కోసమో జీవించారు"

# 146 వరహాల భీమయ్య

– డా॥ రంగి కమల

పుణ్యదంపతులు శ్రీ వరహాల రాజన్న, శ్రీమతి అంబక్కగార్ల ఏకైక పుత్రుడు వరహాల భీమయ్య గారు. 1911, అక్టోబర్‌లో ఆయన జన్మించారు. మంథనిలో 7వ తరగతి వరకు విద్యాభ్యాసము చేసి, 8వ తరగతి కరీంనగర్‌లో 9, 10 తరగతులు హన్మకొండలో పూర్తి చేసారు. హైద్రాబాదులోని సిటీ కళాశాల నుండి ఇంటర్‌పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు.

ఉస్మానియా యూనివర్శిటీ నుండి బి.ఎస్సీ., తర్వాత రసాయనశాస్త్రంలో ఎం.ఎస్సీ. పట్టా సంపాదించారు. ఉస్మానియా యూనివర్శిటీ నుండి ఫస్టుర్యాంకు సంపాదించి గోల్డ్‌మెడల్ స్వంతం చేసుకొన్నారు. వీరు కరీంనగర్ హైస్కూల్లో టీచరుగా కొద్దిరోజులు ఉద్యోగం చేసి ఆ తర్వాత హన్మకొండలోని హైస్కూలుకు బదిలీ అయినారు.

తెలంగాణాలోని ఒక మారుమూల అగ్రహారంలో, సామాన్య కుటుంబంలో జన్మించిన ఆయన బాల్యం, విద్యాభ్యాసం అంచెలంచెలుగా అభివృద్ధి చెందింది.

1949-50 ప్రాంతంలో హైద్రబాదులోని సుల్తాన్ బజార్ విఠల్ మారుతిగల్లీలో నివాసముండే గట్టు పురుషోత్తం గారింటికి సాయంత్రం వేళల్లో మంథని విద్యార్థులు, ఉద్యోగులు చేరుకునేవారు. అక్కడ ఆనాటి వివిధ రాజకీయ, విద్యారంగ విషయాల గురించి ఆసక్తికర చర్చలు జరిగేవి. ముఖ్యంగా శ్రీ భీమయ్యగారు ఆ సందర్భంలో చెప్పే విశేషాలతో చాలామంది ప్రభావితమయ్యేవారు. గ్రామాల నుండి విద్యార్జనకు వచ్చే విద్యార్థులకు ఉచితవసతి కల్పించాలని గౌలిగూడ అక్బర్‌బాగ్‌లోని శంకర్‌సేఠ్ హోటలు వద్ద నరసిన బుచ్చయ్య అనే షావుకారు ఒక ధర్మశాలను ఉచితంగా యిచ్చారు. ఇప్పటికి దాన్ని మంథని గ్రామస్థులు ఉపయోగించుకుంటున్నారు.

పోలీస్ యాక్షన్ తర్వాత నిజాం నవాబు భారత సేనలకు లొంగిపోయి, అప్పటి కేంద్ర ప్రభుత్వంలోని పెద్దలతో ముఖ్యంగా ఉక్కుమనిషి సర్దారు వల్లభ్‌భాయి పటేల్ గారితో ఒప్పందం చేసుకొని తన అధికారాలను మిలటరీ అధికారి జె.ఎస్. చౌదరికి అప్పజెప్పిన రోజులవి.

ఆ మిలటరీ ప్రభుత్వంలో అప్పటి హైద్రాబాదు రాష్ట్రంలో కర్ణాటక, మరాఠ్వాడా మరియు తెలంగాణ ప్రాంతానికి చెందిన కొంతమంది కాంగ్రెస్ నాయకులను గవర్నింగ్ కౌన్సిల్‌లోకి తీసుకోవటం జరిగింది. అలా అధికారం చేపట్టిన వ్యక్తుల్లో శ్రీ ధోండేరాజ్ బహదూర్‌గారు, శ్రీ డి.జి. బిందు, శ్రీరామాచారి, శ్రీ వి.బి. రాజు వంటి ప్రముఖులుండిరి. శ్రీ ధోండేరాజ్ మహారాజ్‌గారు తన పి.ఏ.గా శ్రీ వరహాల భీమయ్యగారిని నియమించు కున్నారు. కొద్ది రోజులకే ఈ మిలటరీ ప్రభుత్వంపైన అనేక ఆరోపణలు

వెల్లువెత్తిన నేపథ్యంలో అప్పటి భారత ప్రధాని శ్రీ జవహర్ లాల్ నెహ్రూ గారు సివిల్ ప్రభుత్వం ఏర్పాటు చేసి సి.యం. వెల్లోడిగారికి అధికారాలప్పజెప్పారు. శ్రీ ధోండేరాజ్ బహదూర్, శ్రీ బూర్గుల రామకృష్ణారావుగారు వంటి ప్రముఖులు అధికారపగ్గాలు చేపట్టారు.

విద్యాశాఖ నిర్వహించిన శ్రీ ధోండేరాజ్ నమ్మకస్తుడు నీతిమంతుడైన వరహాల భీమయ్యగారిని పి.ఏ.గా నియమించుకున్నారు. ఆ తర్వాత శ్రీ బూర్గుల రామకృష్ణారావు ముఖ్యమంత్రి అయ్యారు. అప్పుడే ఏర్పడిన కాంగ్రెస్ ప్రజాప్రభుత్వంలో నిజాయితీ, ముక్కుసూటిగా వ్యవహరించే తత్త్వం వంటి సద్గుణాలు నచ్చినందున ముఖ్యమంత్రిగారికి మంచిసలహాదారుగా భీమయ్యగారిని నియమించారు. మంచి పనిచేసి, ప్రశంసలందు కున్నారు.

1950–51లో అప్పటి ప్రభుత్వం విద్యా సంస్కరణలకు నాంది పలికింది. పాఠశాలల్లో ఉర్దూమీడియంలో విద్యా బోధన జరిగే రోజులవి. తెలుగులో విద్యాబోధన జరగాలనే చారిత్రక నిర్ణయం తీసుకోబడినది. దీనికి శ్రీ వరహాల భీమయ్యగారి అకుంఠిత కృషి, దూరదృష్టి ఎన్నటికీ మరువరానిది.

మంథనిలో మొట్టమొదటి మిడిల్ స్కూలును హైస్కూలుగా అప్ గ్రేడ్ చేయించిన ఘనత శ్రీ భీమయ్య గారిదే. హైస్కూల్ హెడ్‌మాస్టరుగా శ్రీ వేంకటాచారి తర్వాత శ్రీ గోవిందాచారి హెచ్.ఎమ్‌గా ఉండిరి.

1954లో శ్రీ లోకే కిషన్‌రావుగారు మంథని హైస్కూల్లో గణితం బోధించేవారు. ఆయన హైద్రాబాదుకు బదిలీ అయినారు. అప్పుడు, గణితం బోధించటానికి శ్రీ డి. రాజన్నగారిని, ఇంగ్లీషు బోధించటానికి శ్రీ రంగయ్య నాయుడుగారిని శ్రీ భీమయ్యగారు బదిలీ చేయించినారు.

శ్రీ రంగయ్యనాయుడు హెచ్.ఎం.గా ఉన్న సమయం లో ఓల్డ్ బాయిస్ మీటింగ్ వారు 3 రోజులు ఒక పెద్ద ఉత్సవం జరుపుకున్నారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసి అందరిని ప్రోత్సహించి, ఆశీస్సులందించారు.

శ్రీ భీమయ్యగారు హై క్వాలిఫయిడ్ మరియు జీనియస్. యువకులెందరికో ఆయన రోల్‌మోడల్‌గా నిలిచారు. ఎందరో ఆయనను ఆరాధ్య భావంతో గౌరవించేవారు. వారి మాటలనెంతో శ్రద్ధగా విని ఉన్నత స్థానాలకు చేరుకో గలిగారు.

ఆ రోజుల్లో కరీంనగర్ జిల్లా మొత్తంలో రెండే పాఠశాలలుండేవి. ఒకటి కరీంనగర్‌లో, మరొకటి మంథని. ఎక్కడెక్కడో సరిహద్దు ప్రాంతాల్లో పనిచేసేవారిని, కుటుంబా లకు దగ్గరగా రప్పించారు. పాఠశాల అభివృద్ధికి వారు తోడ్పడేలా చేసారు. మిలట్రీ గవర్నమెంట్‌లో మెంబర్ ఆఫ్ ఎడ్యుకేషన్‌గా ఉన్నప్పుడు నూతన విధానలనెన్నిటినో ప్రవేశపెట్టారు. రీజినల్ లాంగ్వేజ్ ప్రాంతీయ భాష ఉర్దూ నుండి తెలుగుకు మార్పించారు.

ఆడపిల్లలకు చదువులు చెప్పించటం శుద్ధ దండగ అని భావించే ఆ రోజుల్లో, వీరు ప్రభుత్వ బాలుర హైస్కూలు శ్రీ వేంకటరాజన్న అవధాని కూతురు ప్రేమలతాదేవి శ్రీలోకే లక్ష్మణశర్మ కూతురు క్రాంతికుమారి ఉన్నతపాఠశాలలో ధరఖాస్తు పెట్టుకుంటే ఆడపిల్లలకు అడ్మిషన్స్ ఇవ్వటానికి రూల్సు ఒప్పుకోవన్నారు. రాజన్న అవధాని హైద్రాబాద్ వచ్చి శ్రీ భీమయ్యగారిని కలిసి విషయం వివరించారు. వెంటనే ఒక ప్రభుత్వ ఉత్తర్వు జి.ఓ. ద్వారా బాలుర హైస్కూల్లో బాలికలకు విద్యాభ్యాసానికి అనుమతి ప్రసాదించారు. ఆ తర్వాత ఎంతో మంది ఆడపిల్లలు చదువుకొని ఉన్నతస్థానాల్లో రాణించారు. భీమయ్యగారు స్వయంగా తన కూతుర్లు రాధ, కమలలని మాడపాటి హన్మంతరావు స్కూల్లో ఆ రోజుల్లో చదివించారు.

శిఖాం (పర్దా బండ్లల్లో) ఆడపిల్లలు వచ్చి చదువు కునేవారట. భీమయ్యగారా పద్ధతిని మార్పించి, స్వేచ్ఛగా స్త్రీలు చదువుకునేటట్లు చేశారు. ఇలా శ్రీ భీమయ్యగారు స్త్రీ విద్యావ్యాప్తికి ఎనలేని కృషి చేసిన మహనీయులు. హైద్రాబాద్ స్టేట్ ప్రజలందరికి ప్రాతఃస్మరణీయుడు.

1938లో ఆయన సిటీ కాలేజీలో లెక్చరర్‌గా ఉన్నప్పుడు అనేకమంది విద్యార్థుల కాయన యింట్లో ఆశ్రయమిచ్చి అన్నంపెట్టి ఆదుకున్నారు. ఆ సమయంలో ఆయన మార్గదర్శకత్వంలో, ప్రోత్సాహంతో ఎదిగిన వారెందరో. భీమయ్యగారి మాతృమూర్తి అంబక్క అర్ధరాత్రి అతిథులు వచ్చినా వండి వార్చి అరుసుకునే మంచిగుణమున్న మనీషి. భీమయ్య గారికి జన్మనిచ్చిన తల్లి అన్న, జన్మభూమి మంతని అన్నా ఎనలేని గౌరవం.

ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావుగారి పర్సనల్ సెక్రటరీగా ఉన్న సమయంలో ముఖ్యమంత్రిని మంథని దర్శింప తీసుకొని వచ్చారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాల షెడ్లను, చదువుకుంటున్న విద్యార్థుల స్థితిగతులను తెలియజేశారు. ఆయన ద్వారా ప్రాథమిక స్థాయి నుండి హైస్కూలు వరకు అభివృద్ధి చేసారు. బూర్గుల వారు వెంటనే లారీలలో వందలాది రేకులను పంపగా, తిరిగి షెడ్లను వేయించి స్కూలు నడిపించారు. ఇప్పటికి ఆ షెడ్లు చెక్కు చెదరకుండా ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. వాటి నీడన చదువుకున్న వెయ్యిమంది విద్యార్థులీనాడు దేశ, విదేశాల్లో ఉన్నత పదవుల్లో రాణిస్తున్నారంటే అది భీమయ్యగారి భిక్షే.

ఉద్యమకాలంలో రఘునాథ్ కాబే, పనకంటి గణపతి రావు అవధానుల (హకీం) కిష్టయ్య వంటి స్వాతంత్ర్య సమరయోధులను ఔరంగాబాద్, నిజామాబాద్ జైళ్ళకు వెళ్ళి పరామర్శించి వచ్చిన ధైర్యశాలి. విద్యావంతులు, వివేక వంతులైన మంథని వారికెందరికో జీవనాధారం కల్పించిన కల్పతరువాయన. ఆనాడు హైస్కూలే లేకుంటే పొరుగు ప్రాంతాలకు వెళ్ళి చదువుకునే స్థోమత ఎందరికుండేది? అక్కడ చదువుకున్నవారంతా ఇంజనీర్లు, డాక్టర్లై పిల్లపిల్లతరం వాడున్నారంటే దాని వెనుక త్యాగశీలి భీమయ్యగారి హస్తమే అనటం నిర్వివాదాంశము. కోఠిలోని వై.యం.ఐ.ఎస్.లో ప్రతి సాయంత్రం ఉండేవారని, విద్యావిషయాల్లో గ్రామీణ పరిస్థితులను మెరుగు పరచాలనే తపన ఆయన మాటల్లో ఉండేదని సమకాలికులంటుంటారిప్పటికి. ఆయన నిస్వార్థ సేవను తలచుకొని కృతజ్ఞత లర్పిస్తున్నారంటే ఆయనెంత గొప్ప వ్యక్తో ఇప్పటి తరానికి తెలుస్తున్నది. హైదరాబాదుకు పరీక్ష రాయటానికి వచ్చే బంధుమిత్రులెందరో వారింట్లో నెలలుండేవారట.

1934లో ఉస్మానియా యూనివర్శిటీ కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ నుండి బంగారు పతకాన్ని పొందారు. అనేక కార్యక్రమాలు అతి చిన్న వయసులో ముగించి, 6.1.1956 లో అకస్మాత్తుగా మరణించారు. అప్పటికే 6 గురు పిల్లలు, భార్య 6 నెలల గర్భవతి. ఆయన జ్ఞాపకార్థం మంథనిలో వరహాల భీమయ్య టోర్నమెంట్సుని డిసెంబర్ నెలలో విద్యార్థులచే ఆడించి, జనవరి 26కు బహుమతులంది స్తున్నారు. ఇంతకుముందీ ఆటలు తాలూకా లెవల్ నుండి జిల్లా స్థాయివరకుండేవి. వరహాల భీమయ్య మెమోరియల్ గోల్డ్ మెడల్ వారి కుటుంబ సభ్యులిప్పటికి కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్‌కిస్తున్నారు. 1973లో ఆ పతకం అందుకున్న వారిలో వైస్ ఛాన్సలర్ శ్రీ జె. అనంతస్వామి ఉన్నారు. ఇన్ని ప్రశంసలందుకొని, ఎంతోమందికి నిస్వార్థంగా సహాయపడిన మహామనీషి శ్రీ వరహాల భీమయ్యగారు.

147

# వట్టికోట ఆళ్వారుస్వామి

**- ఆచార్య ఎస్వీ సత్యనారాయణ**

తెలంగాణా నవలా సాహిత్యం... అనగానే స్ఫురించే మొదటి పేరు వట్టికోట ఆళ్వారుస్వామి. 'అబద్ధాసురుని పాలిట తల్వార్ ఆళ్వార్' అంటూ ఆళ్వారు స్వామిని కాళోజి అభివర్ణించాడు. దాశరథి తమ 'అగ్నిధార' కావ్యాన్నీ, కేతవరపు రామకోటిశాస్త్రి తమ పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథాన్నీ, దాశరథి రంగాచార్య 'జనపదం' నవలనూ శ్రీ వట్టికోట ఆళ్వారుస్వామికి అంకితమిచ్చి తమ గౌరవాన్ని ప్రకటించారు.

నల్లగొండ జల్లాలోని నకిరేకల్ సమీపాన గల 'మాధవరం' అనే గ్రామంలో 1915 నవంబర్ ఒకటిన నిరుపేద శ్రీవైష్ణవ బ్రాహ్మణ దంపతులు శ్రీమతి సింహాద్రమ్మ, శ్రీమాన్ రామచంద్రాచార్యులకు పుట్టిన బిడ్డ ఆళ్వార్ స్వామి.

నిరుపేద కుటుంబం, దుర్భర దారిద్ర్యం, బాల్యంలో చదువు వంటబట్టలేదు. బడిమాని, ఇంట్లోంచి పారిపోయి వచ్చి, హెూటల్ సర్వర్‌గా పనిలో కుదిరాడు. నెలకు నాలుగు రూపాయల జీతం. చాలీచాలని జీతంతో జీవితయాత్ర కొనసాగిస్తున్న ఆళ్వార్‌స్వామి పన్నెండవ ఏట, వారి తండ్రి మరణించారు.

నకిరేకల్ వాస్తవ్యులు శ్రీ కంచినేపల్లి సీతారామారావనే ఉపాధ్యాయుడికి వంట చేసి పెడుతూ, ఆళ్వార్ అతని వద్ద విద్యాభ్యాసం కొనసాగించాడు. ఆ ఉపాధ్యాయుడు సూర్యాపేటకు బదిలీ కావటంతో ఆళ్వార్ స్వామి కూడా గ్రామం నుండి తాలూకా కేంద్రానికి నివాసాన్ని మార్చాడు. కొత్త వాతావరణం, కొత్త పరిచయాలు అతనిలో నూతన ఉత్తేజాన్ని నింపాయి. 1928-29 సంవత్సరాల నడుమ శ్రీ కోదాటి నారాయణరావుగారితో సూర్యాపేటలో పరిచయం ఏర్పడింది.

కొంతకాలం గడిచాక కందిబండ గ్రామానికి చెందిన శ్రీ నారపరాజు రాఘవరావుగారింటికి ఆళ్వార్ స్వామి తన మకాం మార్చాడు. రాఘవరావు గారిది సంపన్న కుటుంబం. అతిథి, అభ్యాగతులకు ఆదరణ, గౌరవమిచ్చే కుటుంబంతో అతనికి అతి స్వల్పకాలంలోనే సాన్నిహిత్యం ఏర్పడింది. రాఘవరావుగారి సోదరుల్లో ఒకడిగా ఆళ్వార్ స్వామి కలిసిపోయాడు. నారపరాజు సోదరులు తమ తండ్రి జ్ఞాపకార్థం 'సీతారామ గ్రంథాలయాన్ని' నెలకొల్పారు. విలువైన గ్రంథాలనూ, అందుబాటులో ఉన్న పత్రికలనూ తమ గ్రంథాలయానికి తెప్పించడం ప్రారంభించారు. దీంతో సహజంగానే ఆళ్వార్‌స్వామి పఠనాసక్తి, పత్రికా పఠనం పెంపొందించాయి.

1933 ప్రాంతంలో శ్రీ యామనాచార్యుల ప్రోద్బలంతో ఆళ్వార్ స్వామి హైదరాబాద్ పట్టణానికి తన మకాం మార్చాడు. అప్పటికే హైదరాబాద్‌కు చేరి, అక్కడ గోలకొండ పత్రికలో శ్రీ కోదాటి నారాయణరావు ప్రూఫ్ రీడర్‌గా ఉద్యోగం చేస్తున్నారు. ఈ ఉద్యోగాన్ని మానేయాలని కోదాటి

వారు భావిస్తున్న రోజుల్లో, వారికి ఆళ్వార్‌స్వామి కన్పించాడు. శ్రీ సురవరం ప్రతాపరెడ్డి గారికి సిఫారసు చేసి, కోదాటి నారాయణరావుగారు ఆళ్వార్ స్వామికి గోలకొండ పత్రికలో ప్రూఫ్ రీడర్‌గా ఉద్యోగం ఇప్పించారు. నెలకు పదిహేను రూపాయల జీతం. అతికష్టంగా సరిపోయేది. జీతం సంగతి ఎలా ఉన్నా పత్రికాఫీసులో పనిచేయడం వలన సమాజాన్ని, జీవితాన్ని, సాహిత్యాన్ని అధ్యయం చేసే అవకాశం ఆళ్వార్‌కి దొరికింది.

కొంతకాలానికి ఆళ్వార్‌స్వామి ఈ ఉద్యోగం మానేసి, మళ్ళీ కందిబండలోని రాఘవరావు గారి కుటుంబాన్ని ఆశ్రయించాడు. అక్కడి గ్రంథాలయంలోని అనేక గ్రంథాలను ఆసక్తిగా పఠించాడు. అంతేకాదు క్రమంగా రచనా వ్యాసంగం ప్రారంభించాడు. ఆంగ్ల భాషాధ్యయనంపై అతని దృష్టి మళ్లింది. స్వయంకృషితో ఆంగ్లం నేర్చుకోవడం ప్రారంభించాడు.

నారపరాజు వారి కుటుంబం తరచుగా బెజవాడ వెళ్లి వస్తూ ఉండేది. ఆ కుటుంబంలో ఒక సభ్యుడిగా కలిసి పోయిన ఆళ్వార్‌కూడా బెజవాడకు వెళ్తూ ఉండడంతో, అక్కడి 'వెల్‌కం హోటల్' వారితో ఇతనికి పరిచయమేర్పడింది. హోటల్ యాజమాన్యంతో మాట్లాడి, అక్కడ సర్వర్‌గా ఉద్యోగంలో చేరాడు. ఉచిత భోజన వసతులతో పాటు అరవై రూపాయల నెల జీతానికి కుదిరాడు. తన సంపాదన నుండి ఎనిమిది రూపాయల ఫీజు చెల్లించి, ఇంగ్లీషు తరగతులకు హాజరయ్యాడు. జీతంరాళ్లను పొదుపుగా ఖర్చు పెడుతూ, కొంత డబ్బు మిగిల్చి పుస్తకాలనూ, పత్రికలనూ కొని చదవడం కొనసాగించాడు.

1934-36 నడుమ రెండేళ్ళపాటు బెజవాడ హోటల్ కార్మికుడిగా పని చేయడంతో ఆళ్వార్‌స్వామి జీవితం కొత్త మలుపు తిరిగింది. అప్పటి బెజవాడ, మద్రాసు రాజధానిగా బ్రిటిష్ పరిపాలనలో ఉండేది. నిజామాంధ్ర ప్రాంతంతో పోలిస్తే సాంస్కృతికంగా ఎంతో అభివృద్ధి చెందిన ప్రాంతం. పత్రికాస్వేచ్ఛ, సభా స్వేచ్ఛలుండేవి. వెట్టి చాకిరి ఉండేదికాదు. ఏదో ఒక మేరకు ప్రజలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలుండేవి.

నారపరాజు రాఘవరావుగారి కుటుంబ సభ్యుల అవసరాల నిమిత్తం 1936లో ఆళ్వార్‌స్వామి తన నివాసాన్ని బెజవాడ నుండి హైదరాబాదుకు మార్చాల్సి వచ్చింది. హైదరాబాదులో ఉన్నత విద్య చదువుకుంటున్న నారపరాజు కుటుంబ సభ్యులకు వంట చేసి పెడుతూ, తీరిక సమయంలో వారి వద్ద ఇంగ్లీషు విద్యను కొనసాగించాడు.

ప్రజాహిత సంస్థలతో, సంఘసేవకులతో, సాహితీ వేత్తలతో క్రమంగా ఆళ్వార్ స్వామి పరిచయాలు పెంచు కున్నాడు. సికింద్రాబాద్‌లోని యువకులను సమీకరించి, చైతన్యపరచి, వారిని సామాజిక సేవా రంగంవైపు ఆకర్షించాడు. గ్రంథాలయోద్యమంతో, ఆంధ్రోద్యమంతో సంబంధాలు ఏర్పడ్డాయి. నిజామాబాద్‌లో జరిగిన ఆరవ ఆంధ్ర మహా సభలో సికింద్రాబాద్ ప్రాంతం నుండి ఏకైక ప్రతినిధిగా హాజరయ్యాడు. 'ఆంధ్ర దేశ గ్రంథాలయ సంఘం'లో కొంతకాలం పాటు కార్యవర్గ సభ్యుడిగా బాధ్యతలు నిర్వహించాడు. శ్రీమతి రాచమల్ల సత్యవతీదేవి సంపాదకత్వాన ప్రారంభమైన 'తెలుగుతల్లి' పత్రికను కొంతకాలం పాటు ఆళ్వార్ స్వామి నిర్వహణ బాధ్యతలు చేపట్టి వెలువరించాడు. 1938లో శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు స్ఫూర్తితో 'దేశోద్ధారక గ్రంథమాల'ను ఆళ్వార్‌స్వామి నెలకొల్పాడు. ఆరవ ఆంధ్ర మహాసభలో అతివాదుల పక్షం వహించిన ఆళ్వార్‌స్వామి, చిలుకూరులో జరిగిన ఎనిమిదవ ఆంధ్ర మహాసభలో మితవాదుల వెనక నిలిచాడు.

1942 నాటి క్విట్ ఇండియా ఉద్యమ ప్రేరణతో సికింద్రాబాద్‌లో జరిగిన సత్యాగ్రహంలో కాంగ్రెస్‌వాదిగా పాల్గొన్న ఆళ్వార్‌స్వామిని నిజాం ప్రభుత్వం అరెస్టు చేసింది. సికింద్రాబాద్ జైలులో ఏడాదిపాటు జైలు జీవితాన్ని గడిపాడు. అక్కడే కమ్యూనిస్టు పార్టీ నాయకులతో సాన్నిహిత్యం ఏర్పడింది. కమ్యూనిజం ఆదర్శాలు, లక్ష్యాలు, పోరాట నిబద్ధతలతో ప్రభావితుడైనాడు. జైలు నుండి విడుదల కాగానే ఆంధ్ర మహాసభకు ఆర్గనైజర్‌గా పనిచేస్తూ హైదరాబాద్ జిల్లా శాఖకు అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. 1944లో మీర్జా ఇస్మాయిల్ ప్రధానిగా నియమింపబడ్డాడు. కమ్యూనిస్టు పార్టీపై విరుచుకుపడ్డాడు. పెద్ద ఎత్తున కార్యకర్తల అరెస్టులు జరిగాయి. ఆళ్వార్‌స్వామిని అరెస్టు చేసిన నిజాం పోలీసులు రెండేళ్ళ పాటు సంగారెడ్డి, గుల్బర్గా, హైదరాబాద్, వరంగల్ జైళ్ళలో తిప్పారు. కారాగార జీవితాన్ని గ్రంథ పఠనానికి, మేధోవికాసానికి ఉపయోగించుకున్నాడు. జైల్లో తోటి ఖైదీలకు చక్కని విజ్ఞానాన్ని అందించడంతోపాటు,

కమ్మని వంటకాలు వండి తినిపించేవాడు. రాజకీయ ఖైదీలతోనూ, సాధారణ ఖైదీలతోనూ ఆత్మీయంగా మెలిగిన ఆళ్వార్ స్వామి వారి జీవితానుభవాలను, కష్టసుఖాలను తెలుసుకున్నాడు. ఖైదీల సమస్యలపై జైలు అధికారులకు విజ్ఞప్తి పత్రాలు సమర్పిస్తూ, పరిష్కారం కోసం కృషి చేసేవాడు. తోటి ఖైదీల జైలుజీవితం, తన స్వీయ అనుభవాలను జోడించి 1950లో 'జైలు లోపల' కథలను రచించాడు. 'ప్రజల మనిషి', 'గంగు' అన్న రెండు గొప్ప నవలలను రచించి, తెలంగాణ సాయుధ పోరాట నవలా సాహిత్యానికి ఒరవడి దిద్దాడు.

1948 సెప్టెంబరు 17న హైదరాబాద్ విమోచనం జరిగిన తరువాత, అనేక మంది రాజకీయ ఖైదీలు జైలునుండి విడుదలయ్యారు. ఆళ్వార్‌స్వామి మాత్రం మరో ఏడాదిన్నర పాటు జైల్లో మ్రగ్గవలసి వచ్చింది. నిజాం ప్రభుత్వం అతనిపై మోపిన క్రిమినల్ కేసులే దానిక్కారణం. 'దేశోద్ధారక సూచి గ్రంథాలయం' పేరిట సికింద్రాబాద్‌లో ఒక రిఫరెన్స్ లైబ్రరీని ఏర్పాటు చేశాడు. అనేక అరుదైన ప్రాచీన గ్రంథాలను సేకరించాడు. కొత్త ప్రచురణలనూ సమకూర్చాడు. దిన, మాసపత్రికలు సంపుటాలను సంపాదించి పెట్టాడు.

పెదాలపై వెన్నెల వంటి చిరునవ్వు, హృదయంలో ప్రేమ నిండిన ఆత్మీయత, మాటల్లో మమకారం, చేతల్లో నిజాయితీ నిండిన ఉత్తమ మానవుడు శ్రీ ఆళ్వార్ స్వామి. పరిచయమైన ప్రతి వ్యక్తిపై ప్రగాఢమైన ప్రభావాన్ని వేసిన ఉన్నతమైన వ్యక్తిత్వం అతనిది. నమ్మిన సిద్ధాంతాల పట్ల నిబద్ధత, కార్యాచరణ పట్ల నిమగ్నత కలగిన ఆళ్వార్‌స్వామి చిత్తశుద్ధి అతని రచనల్లో ప్రతిబింబిస్తున్నది. అతనికి పరిచయమైన సామాజిక వాతావరణం, గ్రామీణ జీవన పరిణామాలు, వ్యక్తుల మనస్తత్త్వాలు అతని కథల్లోనూ, నవలల్లోనూ వ్యక్తమైనాయి. 1961 ఫిబ్రవరి 6న 'డిఫ్తీరియా' వ్యాధి వలన హృదయ చలనం ఆగిపోయిన ఆళ్వార్‌స్వామి అకాల మరణం పొందాడు. వినాదైన్యేన జీవనం, అనాయాస మరణం పొందిన ఆళ్వార్ స్వామి వేలాదిమంది మిత్రుల, సహచరుల, సన్నిహితుల హృదయాలలో శాశ్వత స్థానం సంపాదించుకున్నాడు.

# 148 వెలిచాల కేశవరావు

**- వి.కె. ప్రేమ్‌చంద్**

వెలిచాల కేశవరావుగారు చారిత్రక ప్రాముఖ్యత ఉన్న బొమ్మలమ్మ గుట్ట సమీపంలోని కురిక్యాలలో జన్మించారు. జన్మించిన సంవత్సరం నిక్కచ్చిగా తెలియదు. 1908 లేదా 1909 కావచ్చని వారే చెప్పుకున్నారు.

ఆయనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు కురిక్యాల గ్రామానికి చెందిన వెలిచాల కృష్ణారావు, రామక్క. పెంపకం తీసుకున్న తల్లిదండ్రులు కొండలరావు, రత్నమ్మ.

కేశవరావుగారు, వారిని పెంపకం తీసుకున్న తండ్రి కొండలరావు నివసించిన ప్రస్తుత రామడుగు మండలంలోని గుండి గ్రామంలో చాలా సంవత్సరాలు గడిపారు. ఏళ్ళు పైనబడ్డాక ఎక్కువగా కరీంనగర్ పట్టణంలోని వారి స్వంత ఇంట్లోనే ఉంటూ అడపాదడపా గుండి గ్రామానికి వెళ్ళి వచ్చేవారు.

కురిక్యాలలో బాల్యదశలో తండ్రిగారందించిన శిక్షణ కేశవరావుగారి సాహిత్య, సాంఘిక, రాజకీయ వికాసానికి పునాదులు వేసింది. వారి మాటల్లోనే చెప్పాలంటే...

“1917-18లో ఉప్పరమల్యాల భట్టుమూర్తి, గూడూరి లక్ష్మరాజు వద్ద భారత భాగవతాలు, అమరం ద్వికాండలు, పౌరాణికులు దేవరాజు నరసింహరాజువలె అభినయిస్తూ రసపోషణతో నేను ఆ పురాణగాథలను చెప్పగా విని మా నాన్నగారు ఏకసంథాగ్రాహి, ద్విసంథాగ్రాహి అని మెచ్చుకుంటూ బంధుమిత్రుల ముందు నాతో కథలు చెప్పిస్తూ, చదివిస్తూ మురిసేవారు. సంస్కృతశ్లోకాలు కూడా అనేకం నాకు కంఠస్థంగా ఉండేవి. ప్రతిదినం భారతం, భాగవతం చదివించేవారు. నా ఆంధ్రభాషా పరిజ్ఞానానికి వారే కారకులు. నా దురదృష్టం వల్ల వారు నా పదునాఱవ యేటనే మరణించారు.”

కేశవరావుగారి భార్య పేరు రాధాబాయి. ఆమె గుండి, గోపాల్రావుపేట గ్రామాలలో ఆపద్బాంధవి యని పేర్గాంచిన మహాసాధ్వి. కేశవరావుగారికి అయిదుగురు కుమారులు - కొండలరావు, జగపతిరావు, రామ్మోహన్‌రావు, ప్రేమ్‌చంద్, కరంచందర్‌రావు. ముగ్గురు కుమార్తెలు - చెన్నమనేని సుందరమ్మ (భర్త గోపాల్‌రావు), కాకులమర్రి వసుమతి (భర్త విజయరామారావు), తక్కల్లపల్లి లక్ష్మీదేవి (భర్త డా.దేవేందర్ రావు).

కేశవరావుగారికి తెలుగుభాష పైన, ముఖ్యంగా అనేక సంస్కృత తెలుగు పదాల పైన లోతైన అవగాహన, పట్టు ఉండడానికి, తదుపరి సాహిత్య కృషి చేయడానికి చిన్ననాడు వారు కంఠస్థం చేసిన అమరకోశం చాలా ఉపయోగపడింది.

సాహిత్య, సామాజిక స్పృహ కలిగిన కేశవరావుగారు సిరిసిల్లలో బూర్గుల రామకృష్ణారావు అధ్యక్షతన జరిగిన హిందూ మహాసభ సమావేశాల్లో పాల్గొన్నారు. గుండి లాంటి చిన్నగ్రామంలో నివసించినప్పటికీ మొదటినుండి దేశభక్తి, సాహిత్య పిపాస కలవారైనందున కృష్ణా పత్రిక, ఆంధ్రపత్రిక,

ఆంధ్రజ్యోతి లాంటి దినపత్రికలు, స్వతంత్ర, ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి లాంటి వారపత్రికలు, భారతి, జయంతి లాంటి సాహిత్య పత్రికలు తెప్పించుకుని చదివేవారు.

ప్రప్రథమంగా ముద్రితమై అప్పుడే మార్కెట్లోకి వచ్చిన కాళోజి నారాయణరావుగారి "నా గొడవ" కవితా సంకలనం కేశవరావుగారికిష్టమైన పుస్తకం. కాళోజి నారాయణరావు గారు కరీంనగర్ వచ్చినపుడు కేశవరావుగారి వద్దకు వచ్చి పోయేవారు. కాళోజి నారాయణరావు గారి ప్రభావం వలననే కావచ్చు అంతవరకు ఛందోబద్ధమైన పద్యకవిగా పేరుగాంచిన కేశవరావుగారు వచన కవిత్వంవైపు కూడా మొగ్గారు. ఇరు ప్రక్రియలలో రచనలు చేశారు.

వెలిచాల కేశవరావుగారికి తన కులంతో సహా అన్ని కులాలపైన గౌరవముండెడిది. తన కులమంటే అభిమానమే కాని దురభిమానం మాత్రం కాదు. తన కులంలో జన్మించిన గొప్ప వ్యక్తులతో స్ఫూర్తి పొందండని వెలమలనుద్దేశించి వ్రాసిన ఈ క్రింది సీసపద్యాలు చూడండి. ఇతర కులాలలో కూడా గొప్పవారున్నారు, అలాంటి వారు మన కులంలోనూ ఉన్నారు. కనుక మన కులాన్ని చిన్నదని, మనవారిని చిన్నవారని అనుకోకండని చెప్పిన పద్యాలివి. వారికి పద్యరచనపై, ముఖ్యంగా సీస పద్య రచనపై ఎంతో గుణాత్మక, సృజనాత్మక సాధికారత ఉందని కూడా ఈ పద్యాలు తెలియజేస్తాయి.

సీ॥ గాంధి యంతటి వాడు ఘనుడు మా బ్రహ్మన్న
కలదు మాలోనని గర్వపడుదు.
సర్వజ్ఞు పోలిన సర్వజ్ఞ సింగన్న
కలదు మాలోనని గర్వపడుదు.
సంగర రుద్రుడౌ లింగమ నాయుడు
కలదు మాలోనని గర్వపడుదు.
అపరాభిమన్యుడౌ యా బాలచంద్రుడు
కలదు మాలోనని గర్వపడుదు.
ఎవరినో యన్యులను జూచి యేలపొగడ
మురియు చుంటిరి యదుగులు ముందువైచి
స్థల చరిత్ర విమర్శనల్ సలుపుడయ్య
ఎందరో యశ్శకాయులు నిండుగలరు

సీ॥ మన వరంగలు కోట కనుమని మిము బిల్చె
మనపూర్వ గోత్రాల మరుగుదెల్ప
అదిగొ దేవరకొండ యతివేగ రమ్మనె
ఘనవీర సింగన్న ఘనత తెలుప
రాచకొండకు పోయి రావలెనది కూడ
విలువైన తన గత స్థితిని దెలుపు
రేచర్ల దుర్గమున్ జూచి రావలెనది
కబురంపె తద్గోత్ర కథను దెలుప
పానుగంటి పాల్వంచయు బాహుబలము
చూపి గెల్చిన గోల్కొండ సుందరమగు
భువనగిరి రామగిరి దుర్గములను మెదకు
నిర్మలయు వెలిగందులన్నేడు కనుడు.

(ప్రముఖ రచయిత్రి ముప్పాళ్ళ రంగనాయకమ్మ తండ్రి దద్దనాల లక్ష్మీ సత్యనారాయణయ్య గారు తాడేపల్లిగూడెం నుండి ప్రచురిస్తూ ఉండే 'పద్మనాయక' పత్రికలో పై పద్యాలు ముద్రింపబడినవి.)

వెలిచాల కేశవరావుగారు కులవివక్షకు బద్ధ వ్యతిరేకి. ఆ కాలంలోనే ఊళ్లోని దేవుని గుడిలో హరిజనులను ప్రవేశపెట్టడానికి పూనుకున్నవారు. ఆయన ఇంట్లో పనిచేసిన వాళ్లు ఎక్కువగా హరిజనులే. కులవివక్షను నిరసిస్తూ ఆయన రాసిన ఈ క్రింది పద్యం చూడండి.

గీ॥ కుల విచక్షణలేదు సద్గుణుల కెపుడు
జ్ఞానులను భక్తజనమును మౌనులగన
బ్రహ్మఋషి రాజఋషులును బహుజనులకు
పూజనీయు లాళ్వారాది పుణ్య పురుష
లెందరో నీచకులజులె యెంచిచూడ
బుద్ధి తక్కువ కులతత్వ పోకడేల?

సెప్టెంబరు 2, 1975 నాడు కరీంనగర్ సారస్వతజ్యోతి ఆధ్వర్యాన జరిగిన కవి సమ్మేళనానికి ఆయన అధ్యక్షులుగా వెలువరించిన కవితలో నుండి...

కం॥ పండిత పామర జనకవు
లుండిరి పూర్వమున నేడు నుందురు ముందున్
ఖండన మండన రచనలు
పండించిరి వారి వారి ప్రజ్ఞల కొలదిన్॥

పై పద్యం ద్వారా వారు కవితా ప్రక్రియలనేకాలు, అన్ని కాలాల్లోనూ ఉంటాయన్న భావనను వ్యక్తపరిచారు.

విశ్వనాథ సత్యనారాయణగారు ఎస్.ఆర్.ఆర్. కళాశాల ప్రిన్సిపాల్‌గా రావడం కరీంనగర్‌లో సాహిత్య వికాసానికి పెద్ద ఊపునిచ్చింది. ఆయన ప్రియశిష్యుడు జువ్వాడి గౌతమరావు కరీంనగర్ వాసి కావడం, ఆయన పద్యపఠనంలో దిట్ట అవడం, విశ్వనాథ మరియు గౌతమరావు ఆధ్వర్యంలో 'జయంతి' సాహిత్య పత్రిక వెలువడడం, కళాశాలలో అనేక కవిసమ్మేళనాలు జరగడం అన్నీ కలిసి కరీంనగర్‌లో సాహిత్య స్వర్ణయుగానికి ద్వారాలు తెరిచాయి. ఆ కాలంలోనే విశ్వనాథ వారు 'కేదారగౌళ' యను కావ్యాన్ని కేశవరావుగారికి అంకితమివ్వడం జరిగింది. ఆ సందర్భంలో విశ్వనాథగారు కేశవరావుగారిపై చెప్పిన పద్యం...

చం॥ ఒక కవి గొప్పవాడను పదూళ్లను నల్వురు
చెప్పికోగ, నీ
తికి నిలబడ్డ వాడనియు దేశము
మొత్తముమీద పెద్ద మ్రో
త కలుగ, నంకితమ్ముగను సత్కృతి
యొక్కడు గైకొనంగ కో
రిక కలవాని, వాణి కబరీగత సూనముగా
దలంచెదన్.
వెలమవారిలోన వెల్చాల కేశవ
రావనగ నొక 'యుమరావు' కలదు
చదువు కవిత సిరియు సంపత్తి కలవాడు
ఈ కరీంనగరపు టిరుగులందు.

విశ్వనాథ సత్యనారాయణగారు వారి అంకితపద్యాల్లో కేశవరావుగారి గురించి ప్రస్తావిస్తూ 'యుమరావు' అనే పదం వాడారు. ఇది ఒక అసాధారణమైన పద ప్రయోగం. యుమరావు / ఉమ్రావు అను పదానికి గొప్ప హృదయం కలవాడు (నోబుల్) అను అర్థం కూడా ఉంది. కనుక విశ్వనాథ ఆ పదాన్ని ఆ సందర్భంలో 'నోబుల్', 'సహృదయుడు' అనే అర్థాల్లో వాడారని తెలుస్తోంది. పై పద్యాల్ని ఫిబ్రవరి 9, 1975న కరీంనగర్ జిల్లా పరిషత్ హాల్‌లో విశ్వనాథ సత్యనారాయణ గారు స్వయానా చదివి వినిపించారు.

డా. అంబేద్కర్ వలె కేశవరావుగారు ఆస్తికత్వపు నమ్మకాలతో జీవితాన్ని ఆరంభించి, ఏళ్లు గడచిన తర్వాత నాస్తికవాదం వైపు మొగ్గుచూపారు. ఆయనవలెనే, మతం మానవత్వపు విలువల్ని పెంచేదిగా ఉండాలని భావించేవారు. ఆచారాలకన్నా సాంఘిక సేవలు మేలన్న భావానికి, గుళ్ళు గోపురాలకన్నా విద్యాలయాలు, వైద్యాలయాలు మున్నగు వాటికి ఎక్కువ ప్రాముఖ్యత ఉండాలని నమ్మారు. కేశవరావుగారు గ్రామీణాభివృద్ధి వాది. దవాఖానాలు ఎక్కువగా పట్టణాల్లోనే నెలకొల్పే ఆ రోజుల్లో గుండి గ్రామంలో ప్రైమరీ హెల్త్ సెంటర్ పెట్టాలని స్వయానా సత్యాగ్రహానికి పూనుకున్న గాంధేయవాది.

కేశవరావుగారు తన జీవితకాలంలో మూడు పుస్తకాలు ప్రచురించారు. ఊహాలోకం-64 (64వ ఏట చెప్పిన కవితలు, 1972), మిత్రనీతి (కవితలు, 1975), నేనూ నా జ్ఞాపకాలు (సంక్షిప్త ఆత్మకథ, కవితలు, 1977).

వయస్సులో పెద్దయినా కేశవరావుగారు మధ్య వయస్కులతో, యువకులతో మాట్లాడడానికి, పలువిషయాలు చర్చించడానికి ఆసక్తి చూపేవారు. ఆయనకు జీవితాంతం కొత్త విషయాలు నేర్చుకోవాలన్న తపన ఉండేది. ప్రపంచ జ్ఞానం ఎక్కువగా ఉన్నవారు కాబట్టి, వారిని కలవడానికి పలువురు సాహిత్యవేత్తలు, కవులు, సంస్కర్తలు, రాజకీయ వేత్తలు, విద్యావేత్తలు వస్తుండేవారు. అతని ఇల్లు ఎప్పుడూ సాహిత్య, సాంఘిక, రాజకీయ ఇష్టాగోష్ఠులకు వేదికగా ఉండేది.

కొంతకాలం ఆయన కరీంనగర్‌జిల్లా రచయితల సంఘం అధ్యక్షునిగా కూడా వ్యవహరించారు. ఆ సమయం లో వెలువడిన పుస్తకాల్లో "కరీంనగర్ మండల చరిత్ర" కూడా ఒకటి. ఈ పుస్తక ప్రచురణకు వారు ఆర్థిక సహాయ మందించారు.

కేశవరావుగారు స్వయానా కవిత్వం వ్రాయడమే కాక పలు రచయితలకు వారికి తోచిన రీతిలో సహాయం చేస్తుండేవారు. కరీంనగరం రచయితల సంఘ భవన నిర్మాణానికి కూడా వారు నిధులు సమకూర్చారు. అలా అతడు కవి పోషకుడు కూడా.

కేశవరావుగారు మే 13, 1989న సుమారు 82వ యేట హైదరాబాదులో మరణించారు.

ఈ వ్యాసాన్ని ముగించేముందు, "ప్రజాకవి శిరోమణి" రాజాపేట (చిలకలూరిపేట మండలం, గుంటూరు జిల్లా) కు చెందిన చెన్నుపల్లి సుబ్బారావుగారు కేశవరావుగారిపై చెప్పిన పద్యాలు ఉటంకించడం సబబేమో!

వెలిచాల వంశచంద్రా
కలకాలము నీదు కవిత కమనీయంబై
వెలుగుచు తెలుగు జగంబున
వెలయించు త్వదీయ కీర్తి విస్తారముగన్.

వెలమ కుల మండనుడవై
తెలుగమ్మకు సేవజేసి ధీనిధి వగుచున్
వెలగల కబ్బము లల్లుచు
సలలితముగ యశము గొనుము సర్వాంధ్రమునన్.

శారద నీపై నెంతో
గారవమును జూపుచుండె కడువేడుకతో
ధీరులు శూరులు మెచ్చగ
కీరితితో వెలుగుమయ్య కేశవరాయా!

149

# వెల్దుర్తి మాణిక్యరావు

– డా॥ గుమ్మన్నగారి బాల శ్రీనివాసమూర్తి

గత శతాబ్ది తొలి దశాబ్దాల్లో తెలంగాణ ప్రాంతంలో తెలుగు భాషా సాహిత్య సంస్కృతులపట్ల సర్కారు ఎటువంటి ఆదరణను చూపించలేదు. తెలుగు మాస్టరు పాఠశాలలు లేవు. తెలుగు కవులు – రచయితలకు ప్రభుత్వపరమైన సహాయము, సహకారము శూన్యమే. ఈ వాతావరణంలో తెలుగు భాషా సాహిత్య సంస్కృతుల పరిరక్షణను తమ విద్యుక్త బాధ్యతగా భావించిన అక్షర మూర్తులు తమ సంకల్ప సాధనకోసం విశేషమైన కృషి చేశారు. వీరి ప్రయత్నాలను ఏటికి ఎదురీదే సాహసంగా పేర్కొనవచ్చు. మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి, ఆదిరాజు వీరభద్రరావు, ఒద్దిరాజు సోదరులు, వట్టికోట ఆళ్వార్‌స్వామి ఈ వరుసలో పేర్కొనవలసిన కొందరు. ఇదే కోవలో చేరేవారు వెల్దుర్తి మాణిక్యరావు.

మాడపాటివారి మార్గదర్శత్వంలో కార్య నిర్వహణా దక్షతను, ప్రతాపరెడ్డి సాన్నిహిత్యంలో పత్రికా సంపాదక ప్రతిభను, దాశరథి కవిత్వం ద్వారా లలితమైన కవితాభివ్యక్తినీ అలవర్చుకున్న మాణిక్యరావు తెలంగాణ తేజోమూర్తులలో ఒకరు. తెలంగాణ సాంస్కృతిక విశేషాల అన్వేషణ ప్రారంభ మైన ఇటీవల క్రమంలో మాణిక్యరావు కృషి ఆయన సాహిత్య సృజన, చరిత్ర రచన, సంపాదకీయం వహించిన రచనలు, కవిత్వం ఇవన్నీ తిరిగి వెలుగులోకి వస్తున్నాయి. అయితే మాణిక్యరావు తను జన్మించిన మెదక్ జిల్లాలో సుప్రసిద్ధ సాహితీవేత్తగా దశాబ్దాల క్రితమే గుర్తింపును పొందారు. సుమారు నాలుగు దశాబ్దాల క్రితమే మల్యాలదేవీ ప్రసాద్ రచించిన మెదక్ మండల సాహిత్య చరిత్రలో మాణిక్యరావు ప్రస్తావన ఉంది.

పేరు ప్రఖ్యాతులు గాంచిన ఉత్తమ రచయితలలో వీరొకరు. ప్రబోధకరమగు రచనలు, సాంఘికాచరములు విమర్శించు రచనలు అబ్బురము గొల్పునవియేగాక ఆనందము కలిగించును. నీతిదాయకములగు వీరి రచనలు లోకమునకు సంఘానికి జాతికి ఉపకరించును. చీకటి వెలుగుబాటయై యుండును. ఆంధ్రోద్యమ కాలమున వీరు 'అణ్ణా' గ్రంథమాలను స్థాపించి తద్వారా ఆంధ్రలోకానికి జాగృతి కలిగించారు. 'మాణిక్యరావుగారు మణిపూసవంటి వారు' అని దేవీ ప్రసాద్ తమ గ్రంథంలో పేర్కొన్నారు.

1914వ సంవత్సరంలో మాణిక్యరావు జన్మించారు. మెదక్ జిల్లాలోని వెల్దుర్తి గ్రామం ఆయన స్వస్థలం. బాల్య విద్య స్వగ్రామంలో కొనసాగింది. అటు తరువాత మెదక్ పట్టణములో కొంతకాలంపాటు చదువుకున్నారు. అనంతరం హైదరాబాద్ చేరుకున్నారు.

అప్పటికి నగరంలో స్వచ్ఛంద స్థాయిలో తెలుగు భాషా సాహిత్య పరిరక్షణ ప్రయత్నాలు బలపడ్డాయి. సాధనా సమితివంటి సంస్థలు, ఆంధ్రమహాసభ సమావేశాలు ఇందుకు దోహదం చేస్తున్నాయి. మాణిక్యరావు ఖమ్మంలో జరిగిన మూడవ ఆంధ్ర మహాసభలో పాల్గొన్నారు. పెద్దలతో

ఇట్లా తొలి పరిచయం ఏర్పడింది. అప్పటికాయన ఇంకా ఇరవై సంవత్సరాలు కూడా నిండని యువకుడు. ఆ రోజుల్లో పలువురు భాషాభిమానులు గ్రంథమాలలు ఏర్పాటు చేసుకొని పుస్తకాలు ప్రచురించేవారు. ఒద్దిరాజు సోదరులు, వట్టికోట ఆళ్వార్ స్వామి ఈ దిశలో మునుముందు నిలిచారు. హైదరాబాద్‌లో కె.సి. గుప్త అనే భాషాభిమాని పేరుతో ప్రచురణలు ఆరంభించారు. కేవలం ఆరు పైసలకే చక్కని పుస్తకాలు విక్రయించేవారు. ఇది ఎంతో గొప్ప విషయం. ఈ పుస్తకాలు కూడా విజ్ఞాన వ్యాప్తిని కలిగించే రీతిలోనే ఉండేవి. వెల్దుర్తి మాణిక్యరావు గ్రంథమాలకు సంపాదకు లయ్యారు.

'అణ్ణా' గ్రంథమాల ఎన్నో రచనల్ని ప్రచురించింది. అందులో రెండు పుస్తకాలను నాటి నిజాం ప్రభుత్వ యంత్రాంగం నిషేధించింది. కె.సి. గుప్తాను నిర్బంధించింది. మాణిక్యరావు "రైతు" పేరుతో ఒక పుస్తకాన్ని రచించారు. 'అణ్ణా' గ్రంథమాల తరపున అనేక పుస్తకాలు వెలుగు చూడడం వెనుక వెల్దుర్తి వారి కృషి ఎంతో ఉంది. ఆనాటి నిర్బంధ కాలంలో ఒక రచయితగా ఆయన చూపించిన సాహసం, ఎన్నుకున్న వైఖరి, బాధ్యతాయుతమైన ధోరణి ఎల్లవేళల్లోనూ ఆదర్శప్రాయమైనవి. 'అణ్ణా' గ్రంథమాల విశేషాల్ని మహాకవి దాశరథి తమ ఆత్మకథలో వివరించారు.

నాటి సమాజంలో మద్యపాన వ్యసనాన్ని నిర్మూలించే సత్సంకల్పంతో ఒక మాస పత్రిక పనిచేసింది. దాశరథి పేర్కొన్న వివరాల ప్రకారం "ఆంధ్ర భాషా ప్రచారం బాగా జరగాలి. అత్యధిక సంఖ్యలో ప్రజలు పుస్తకాలు చదవాలి. తద్వారా విజ్ఞానాన్ని ఆర్జించాలి. ఇదే మా గ్రంథమాల ఆదర్శం" అని 'అణ్ణా' గ్రంథమాల ప్రచురణ కర్తలు తమ ఆశయాన్ని ప్రకటించారు. 'అణ్ణా' గ్రంథమాల కార్యాలయం బజారులో ఉండేది. నూరు పుస్తకాలు కొంటే వాటిని ఐదు రూపాయలకే విక్రయించేవారు. 'అణ్ణా' గ్రంథమాల తరపున ప్రచురించిన "నెహ్రూ జీవిత చరిత్ర" పుస్తకానికి బూర్గుల రామకృష్ణారావు పీఠిక రాశారు. 'ఖాదీ' అనే పుస్తకాన్ని మాడపాటి వారు పీఠికను రచించారు. కాళోజి కథల్ని 'అణ్ణా' గ్రంథమాల ప్రచురించింది. గ్రంథమాల రెండవ ప్రచురణ 'రైతు' అనే పుస్తకం. రైతుల్లో అశాంతి, తిరుగుబాటు వస్తుందని చెబుతూ నిజాం సర్కారు రైతు పుస్తకంపై నిషేధాన్ని విధించింది.

"మాణిక్యరావు గారు చక్కని కవి, ఆయనది సరళమైన శైలి" అని దాశరథి ప్రశంసలు అందుకున్న ప్రతిభావంతులు వెల్దుర్తి.

మాణిక్యరావు సంపాదకత్వంలో వెలువడిన "అణ్ణా గ్రంథము గ్రంథ ప్రచురణ రంగంలో ఆనాడు ఒక విప్లవాన్ని తెచ్చిందని చెప్పడం అతిశయోక్తి కానేకాదు" అని మహాకవి దాశరథి తమ యాత్రాస్మృతిలో వ్యాఖ్యానించారు. ప్రారంభ మైన ఈ పత్రికకు సర్కారులోని పెద్దల అండదండలు ఉండేవి. సమాజ సంక్షేమాన్ని ఆకాంక్షిస్తూ ఈ పత్రిక ప్రచురణ జరిగింది. మద్యపాన నిరోధ మాస పత్రికకు వెల్దుర్తి మాణిక్యరావు సంపాదకత్వం వహించారు. ఇదే పత్రిక ఉర్దూలోనూ వెలువడింది. దానికీ మాణిక్యరావే సంపాదకులు. తెలుగుతోపాటు ఉర్దూలోనూ ఆయనకు చక్కని రచనా ప్రతిభ అలవడింది. ఒక ప్రజ్వలమైన చెడు వ్యసనానికి వ్యతిరేకంగా వెలువడిన గొప్ప పత్రికగా మద్యపాన నిరోధ పత్రిక చరిత్రలో నిలిచిపోతుంది.

నాడు తెలంగాణ ప్రాంతంలో గోలకొండ ప్రముఖ పత్రిక. ఇతర పత్రికలు కూడా ఉండేవి. అవి సాహిత్య, ధార్మిక పత్రికలుగా గుర్తింపును పొందాయి. గోలకొండ మాత్రం తెలంగాణ సమాజ ప్రతిబింబంగా అందరి ఆదర్శాన్ని అందుకున్నది. ప్రతాపరెడ్డి గారి సంపాదకత్వంలో గోలకొండ వారానికి రెండుసార్లు వెలుగు చూసేది. రచనా ప్రతిభ కలిగిన మాణిక్యరావు గోలకొండ పత్రిక సంపాదక వర్గంలో చేరారు. ఉపసంపాదకులుగా బాధ్యతలు నిర్వహించారు. ఈ సమయంలోనే పలు రచనలు చేశారు. కథానిక ప్రక్రియపై ప్రముఖంగా దృష్టి పెట్టారు. తన వచన రచనా శైలిని మరింత సరళతరంగా తీర్చిదిద్దుకున్నారు. ఈ శైలి ఆయన అనంతర రచనల్లో కనబడుతుంది.

అప్పటి తెలంగాణ తెలుగు వచన రచయితలపై మున్షీ, ప్రేమ్‌చంద్ ప్రభావం ప్రగాఢంగా ఉండేది. ప్రేమ్‌చంద్ తన రచనల్లో చిత్రించిన పరిస్థితులకు నాటి తెలంగాణ సమాజం సన్నిహితంగా ఉండడం, ప్రేమ్‌చంద్‌లోని వాస్తవికతా ధోరణులు తెలంగాణ తెలుగు రచయితలను ఆకట్టుకున్నాయి.

మాణిక్యరావుపై కూడా ప్రేమ్‌చంద్ ప్రచారం ఉంది. ఆయన కథల్లో ఇది కనబడుతుంది.

కథానిక రచనా ప్రక్రియ సూత్రాలతో చూసినపుడు కొంత క్లిష్టమైనదిగానే కనబడుతుంది. నవలా ప్రక్రియలా ఉండే విస్తృతి కథానికలో ఉండదు కనుక కథానిక రచయిత అది చూచి సంభాషణల్ని నిర్మించుకోవాలి. సంక్షిప్తతతోపాటు ముగింపులో ఒక అనూహ్యరీతి కథానికలో కన్పించాలి. వెల్దుర్తివారు కథానిక ప్రక్రియ సూత్రాల్ని బాగా అర్థం చేసుకున్నారు. కొద్ది కథలే రాశారు కానీ అవి తెలుగు కథానికా చరిత్రలో నిలుస్తాయి. అందుకు ఎయిర్ మేల్ కథ ఒక చక్కని ఉదాహరణ. ఇది "పరిసరాలు" అనే కథల సంకలనంలో ప్రచురణ పొందింది. దాదాపు అరవై సంవత్సరాల నాటి కథ ఇది. ఈ కథలో మాణిక్యరావు స్థానీయమైన తెలుగు మాటల్ని ప్రయోగించారు. "ఉపాహారం" "కల్పి" "వర్సగా" "అంగి" "బేసిన్ లడ్డూ" "అల్మారి" "డబ్బి" "చాపతు" – ఇటువంటివి నాడే కాదు నేడూ తెలంగాణలో నిత్య జీవితపు వాడుకలో ఉన్నాయి. మాణిక్యరావు "స్వయంప్రకాశం" అనే పేరుతో రచనలు చేశారట. మాణిక్యరావు కథలు ఒక సమగ్ర సంకలన రూపంలో వెలువడవలసిన అవసరం ఉంది. శైలిలోనూ ఆయన విలక్షణత్వం ఎయిర్‌మేల్ కథలో కనబడుతుంది.

"ఆకుపచ్చని చీర ప్రకృతికన్య కోయిల కూతలలో కట్టుకునేది"

"పెదవులు నవ్వులపువ్వులు విసురుతున్నాయి, కండ్లు వలపు జల్లులు చల్లుచున్నట్టి"

"గడియారం ప్రతిగంట మోతలో హెచ్చరిక..."

'దయ్యాల పన్లడ' అనే నాటికతోపాటు పలు చాలా గేయాలు, మాణిక్యవీణ పేరుతో ఆధునిక వచన కవితలు, సామాజిక వ్యాసాలు ఎన్నో రచించారు వెల్దుర్తి మాణిక్యరావు. తొలుత పాత్రికేయుడుగా జీవన పయనాన్ని ప్రారంభించి ప్రభుత్వ ఉద్యోగిగా స్థిరపడ్డారు. హైదరాబాద్‌లో నివాసం ఏర్పర్చుకున్నారు.

మాణిక్యరావు బహుముఖ ప్రజ్ఞాశాలి. ఒకవైపు గ్రంథమాల సంపాదకత్వం, ఆ తరువాత గోలకొండ పత్రికలో ఉపసంపాదకత్వం, నాటిక, బాలగేయరచన, వచన కవితా సృజన, కథా రచన తదితర అంశాలపట్ల ఆసక్తిని పెంచుకోవడం – ఉర్దూ భాషా సాహిత్యాలపై పట్టును కల్గి ఉండడం. ఇదంతా మాణిక్యరావు జీవితంలో ఒక భాగమైతే చరిత్ర రచన మరొక భాగం. విశాలాంధ్ర అవతరణ తరువాత చాలా సంవత్సరాలపాటు ఆయన పెద్దగా రచనలేవీ చేయలేదు. అయితే 1980లలో మాణిక్యరావు ఒక బృహత్ చారిత్రక గ్రంథాన్ని రచించారు.

మరొక అతికీలకమైన చారిత్రక రచనకు సంపాదకత్వం వహించారు. ఆయన రచించిన సుదీర్ఘ సమగ్ర చారిత్రక గ్రంథం. 'హైదరాబాద్ స్వాతంత్రోద్యమ చరిత్ర' తెలంగాణ ఆధునిక చారిత్రక క్రమాన్ని, ఇక్కడ జరిగిన ఉద్యమాలు, నిజాం వ్యతిరేక పోరాటాల్ని గురించి తెలుసుకోవాలనుకునే వారికి "హైదరాబాద్ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర" నిత్య పారాయణ గ్రంథం.

1984వ సంవత్సరంలో హైదరాబాద్ స్వాతంత్ర్య సమరయోధుల సంఘం "హైదరాబాద్ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర"ను ప్రచురించింది. ఎనిమిదవందలపైచిలుకు పుటలున్న ఈ గ్రంథాన్ని రచించేందుకు ఐదు సంవత్సరాల కాలం పట్టింది. మాణిక్యరావు స్వయంగా ఆనాటి నిజాం వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్నారు. కనక ప్రామాణిక రీతిలో చరిత్రను రచించగలిగారు. తెలంగాణాలో జరిగిన ఉల్లేఖనీయమైన ఉద్యమాలను గురించి ఇక్కడి ఆధునిక చారిత్రక క్రమంపై చాలామంది దృష్టి నిల్పనిరోజుల్లో మాణిక్యరావు ఈ గ్రంథాన్ని రచించారు. ఈ నిజం విస్మరణకు వీలులేనిది. దేశ స్వాతంత్ర్యోద్యమ చరిత్రను రచయిత అంకితం చేశారు.

ఇక్కడ స్వాతంత్ర్య సమరయోధుడిగా మాణిక్యరావు నిబద్ధత వ్యక్తమవుతోంది. నాటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ డాక్టర్ శంకర్‌దయాళ్ శర్మ ఈ గ్రంథానికి పీఠికను రచిస్తూ "స్వాతంత్ర్యోద్యమ చరిత్రను ఒక తరం నుంచి మరొక తరం వారికి తెలియపరుస్తూ జాతి ధైర్య సాహసాలనూ వీరోచిత కృత్యాలనూ వెలుగులోకి తెచ్చేటువంటి సంఘటనలను, సన్నివేశాలను నమోదు చేసి చరిత్రగా తీర్చిదిద్ది గతాన్ని భద్రపరచడంకంటె ముఖ్యమైనది, పవిత్రమైనది వేరొకటి ఏమీలేదు.

శ్రీ వెల్దుర్తి మాణిక్యరావు రచించిన హైదరాబాద్ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర యధార్థాలు పాఠకుని ముందుంచి వాటిని సత్య సంధతతో వ్యాఖ్యానించేదిగా ఉన్నది. ఈ హైదరాబాదు స్వాతంత్ర్యోద్యమ చరిత్ర "సమగ్ర భోగట్టా ఇచ్చే గ్రంథంగా పండితులకూ చరిత్ర విద్యార్థులకేకాక అశేష తెలుగు పాఠక లోకానికి ఉపకరిస్తుందని ఆశిస్తాను" అని అభిప్రాయపడ్డారు.

నేటితరం వారి కోసం "హైదరాబాద్ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర"ను ఈ సందర్భంలో సంక్షిప్త రీతిలో సమీక్షించడం సముచితమే అవుతుంది. ఇందులో మాణిక్యరావు హైదరాబాద్ సంస్థాన చారిత్రక నేపథ్యాన్ని తొలి అధ్యాయాల్లో లోతుగా పరిచయం చేశారు. హైదరాబాద్‌లో 1857కు పూర్వం బ్రిటిష్ వ్యతిరేకత అంకురించినతీరు, 1857 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామ సంగతులు, హైదరాబాద్ సంస్థానంలో 19వ శతాబ్దిలోనే ప్రజా జాగృతి అంకురించిన వాస్తవమూ – వీటన్నింటినీ రచయిత ప్రామాణిక రీతిలో నమోదు చేశారు. అది హిందూ ఉద్యమం, ఆర్య సమాజ ఉద్యమం, మత ఉద్యమం, గ్రంథాలయోద్యమం, ఆంధ్ర మహాసభలు, గ్రంథమాలలు, హైదరాబాద్ మహా సభలు, పత్రికలు రాజ్యాంగ సవరణలు, కాంగ్రెస్ పార్టీ స్థాపన, సత్యాగ్రహ ఘట్టాలు – వీటన్నింటితోపాటు చరిత్రలో ప్రమాణంగా ప్రచారాన్ని పొందని ఘటనల కూడా ఈ గ్రంథంలో మాణిక్యరావు నమోదు చేశారు. భాగ్యనగర్ రేడియో నిర్వహణవంటివి ఇందుకు ఉదాహరణ.

ఆంధ్ర మహాసభల విశేషాన్ని రచయిత ఎంతో ఆసక్తికరంగా వివరించారు. సిరిసిల్లలో జరిగిన ఆంధ్ర మహాసభ విశేషాల్ని గురించి నా ప్రస్తావనలో మొదట జరిగిన మూడు సభావేదిక స్థలాలకు నామకరణం జరుగలేదు. సభా స్థలమైన సిరిసిల్లకు వేములవాడ సమీపం కాబట్టి వేములవాడ భీమకవి దివ్యస్మృతిగా సభావరణానికి భీమకవి, నగరం అని నామకరణము చేసినారు.

ఇక హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాల నుండి వందలాది ప్రతినిధులు ప్రత్యేక బస్సులలో సిరిసిల్ల చేరుకున్నారు. బస్సుల ఏర్పాటు బొజ్జం నర్సింలుగారు చేసినారు. ఇక మార్గమధ్యంలో అధ్యక్ష అధ్యక్షురాలితోపాటు నగర ప్రతినిధులందరికీ బీదు గోపాల్‌రెడ్డి గారు తూప్రాన్‌లో సత్కరించినారు. అట్లే కామారెడ్డిలో ప్రముఖులు సత్కరించారు. ఇట్లా అన్ని ఆంధ్ర మహాసభల విశేషాలు హైదరాబాద్ స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో విపుల రీతిలో లభిస్తాయి.

నాటి హైదరాబాద్ స్వాతంత్ర్యోద్యమ ప్రముఖుల్లో సర్దార్ జమలాపురం కేశవరావు ఒకరు. తెలంగాణ సర్దార్‌గా పేరున్న మహానాయకులాయన. నిజాం వ్యతిరేక పోరాటాల్లో చురుకుగా పాల్గొన్నారు. ధీరుడు, త్యాగి అయిన సర్దార్ లక్షలాది ప్రజానీకం అభిమానాన్ని చూరగొన్నారు. కందిలో జరిగిన చిట్టచివరి ఆంధ్రమహాసభకు అధ్యక్షత వహించారు. కాంగ్రెస్ ప్రముఖ నాయకుల్లో ఒకరు.

యైభై సంవత్సరాల లోపు వయస్సులోనే ఈ లోకం నుండి నిష్క్రమించిన సర్దార్ జమలాపురం కేశవరావు జ్ఞాపకాలు ఎందరిలోనో నిండుగా ఉండేవి. అయితే ఆయన జ్ఞాపకాలకు అక్షర రూపాన్ని అందించవలసిన అవసరాన్ని ఆయన మిత్రులు, అభిమానులు గుర్తించారు. పర్యవసానంగా ఒక చక్కని పుస్తకం వెలువడింది. "స్వాతంత్ర్య సమరము, నాటి జ్ఞాపకాలు, సంఘటనలు – సర్దార్ జమలాపురం కేశవరావు గారి పేరుతో మూడు దశాబ్దాల క్రితం ప్రచురణ పొందిన ఒక పుస్తకానికి హీరాలాల్‌మోరియాతో పాటు వెల్దుర్తి మాణిక్యరావు సంపాదకులు.

మాణిక్యరావుకు జమలాపురం కేశవరావుపట్ల అపరిమితమైన ఆదరణ ఉండేది. ఆయన కేశవరావును గురించి ఒక చక్కని గేయాన్ని రచించారు. ఇందులో కేశవరావు వ్యక్తిత్వం పరిచయమైంది. కేశవరావు జ్ఞాపకాల రూపకల్పనలో మాణిక్యరావు ప్రదర్శించిన శ్రద్ధాసక్తులు ఎంతో గొప్పవి. కేశవరావు గారు ప్రజా చైతన్యం కోసం బుర్రకథలు చెప్పడంలోనూ ప్రావీణ్యతను సాధించారన్న సంగతితోపాటు పలు అపూర్వ విశేషాలు జ్ఞాపకాలుగా ఉన్నాయి.

ఇటువంటి జ్ఞాపకాల రచనలు రేపటి చరిత్ర రచనాధ్యాయాలకు కీలకమైన ముడిసరుకులు అవుతాయన్న సత్యాన్ని మాణిక్యరావు ఆనాడే గుర్తించారు.

ఆ క్షణాన్ని సామాజిక చైతన్యం స్వాతంత్ర్య సాధనల కోసం వినియోగించిన రచయితలు, కవుల శ్రేణిలో వెల్దుర్తి మాణిక్యరావు చేరిపోయారు.

మాణిక్యరావు తన జీవితంలో పెద్దగా పురస్కారాలు సత్కారాలు అందుకోలేదు. తన రచనలద్వారా ఇవి తనకు దక్కాలని ఆయన ఆశించనూ లేదు.

మాణిక్యరావు గారి కొన్ని కథలు, బాలసాహిత్యం సైతం విస్తారంగా పాత్రికేయ రచనలు కూడా ప్రచారాన్ని పొందలేదు.

మాణిక్యరావు అన్ని రచనలను ఒక సమగ్ర సంకలనంగా తీసుకొనరావలసిన అవసరం ఎంతైనా ఉంది. ప్రముఖ పాత్రికేయుడు జి. కృష్ణ జ్ఞాపకాలతోపాటు మరెన్నో గ్రంథాలలో మాణిక్యరావు జీవిత విశేషాలు కొన్ని దొరుకుతాయి. శ్రద్ధతో వాటిని సమీకరించి మాణిక్యరావు సంక్షిప్త జీవిత చరిత్రనైనా రచించవలసిన అవసరమూ ఉంది.

# 150 వేముగంటి నరసింహాచార్యులు

– డా॥ చెప్పెల హరినాథ శర్మ

స న్నని గీరు నామము. ప్రసన్నో ముఖంబు భుజంబుపై జరీ

యన్నువ శాల్వ విద్వదమృతాంబుది

సంగ్రహరూపమొందిన

ట్లున్న బుధోత్తముని రసోజ్జ్వల కావ్య కళాప్రపూర్ణునిన్

గన్నులగంటి కప్రపుటనంటిని సత్కవి వేముగంటినిన్

సుప్రసిద్ధ సాహితీవేత్త"

ఉత్పల సత్యనారాయణాచార్యులు కలం నుండి జాలువారిన వేముగంటి నరసింహాచార్యుల రూప వర్ణన ఇది.

ఇప్పటికీ సిద్ధిపేట పురవీధులలో నిరాడంబరంగా తిరుగాడిన వేముగంటి జ్ఞాపకాలను ఆ ప్రాంత ప్రజలు అనునిత్యం నెమరువేసుకుంటూ ఉంటారు.

ఇరవయ్యవ శతాబ్ది ప్రథమార్థంలో జన్మించి ద్వితీయార్థంలో హృద్యమైన పద్యప్రసూనాలతో తెలుగు భారతిని అర్చించిన వేముగంటి తెలంగాణాకు వన్నె తెచ్చిన కవి పుంగవులలో అగ్రశ్రేణికి చెందినవారు. ఆరు దశాబ్దాలపాటు సాగిన తమ అద్భుత కవితాసృష్టితో పోతన, విశ్వనాథ, జాషువా, దాశరథి, కరుణశ్రీ వంటి కవుల సరసన సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న సాహితీమూర్తి ఆయన.

సిద్ధిపేట పట్టణంలోని సంప్రదాయ వైష్ణవ కుటుంబంలో 1930వ సంవత్సరం జూలై 14వ తేదీన శ్రీమతి రామమ్మ రంగాచార్యుల దంపతులకు వేముగంటి నరసింహాచార్యులు జన్మించారు. భారతదేశం దాస్యశృంఖాలలో మగ్గుతున్న కాలంలో, తెలంగాణాలో తెలుగు భాషా సాహిత్యాలు కొడిగట్టిన చందంగా ఉన్న సమయంలో జన్మించిన వేముగంటి నిరంతర పఠనతో తాత లక్ష్మణాచార్యులు, తండ్రి రంగాచార్యులు, తల్లి రాములమ్మలు అందించిన సంస్కార ప్రభావంతోపాటు చిరుప్రాయంలోనే శతక సాహిత్యం కంఠోపాఠం చేసారు. వీధిబడిలోని ప్రాథమిక విద్యాభ్యాసాన్ని పూర్తిచేసున్నారు.

వీరేశలింగం పంతులు వాచకాలతో సాగిన విద్యాభ్యాసంలో భాగంగా సంస్కృత, ఆంధ్ర పంచకావ్యాలు, రుక్మిణి కల్యాణం, గజేంద్రమోక్షం, వామనావతారంవంటి భాగవత గాథలు, అమరం, సుప్రసిద్ధ తెలంగాణ శతకాలు బోధించేవారు. ఇవి వారిలో బలమైన ముద్ర వేయడంతోపాటు వారు గొప్ప కవిగా ఆవిర్భవించేందుకు దోహదపడ్డాయి.

1946లో వరంగల్ విశ్వేశ్వర సంస్కృతాంధ్ర కళాశాలలో చేరి సంస్కృతాన్ని తెలుగును కూలంకషంగా అధ్యయనం చేశారు. 1946లోనే మదన్ మోహన్ మాలవ్య

పరమపదించినప్పుడు 'భాష్పాంజలి' పేరుతో వీరు రచించిన పద్యాలు అడవి బాపిరాజు సంపాదకత్వంలో వెలువడిన తెలుగు 'మీజాన్' పత్రికలో అచ్చయ్యాయి. ఇదే వీరి తొలి రచన.

అప్పటి నుండి వారి లేఖిని నిరంతరం జాలువార్చిన కవితాఖండికలు కాకతీయ, గోలకొండ, కృష్ణాపత్రిక, ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, ఆంధ్రభూమి, స్రవంతి, భారతి తదితర పత్రికలలో అచ్చయ్యాయి.

తర్వాతి కాలంలో ఆంధ్ర సారస్వత పరిషత్ వారి విశారద, ఉస్మానియా విశ్వవిద్యాలయం బి.ఓ.ఎల్. పరీక్షలలో ఉత్తీర్ణులై తెలుగుపండితునిగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించి వేలాది మంది శిష్యులను సాహితీ ప్రియంభావుకులుగా తీర్చిదిద్దారు. 1946లో మొదలైన వీరి కవితా రచన 2006 అక్టోబర్ 29న తుదిశ్వాస విడిచే వరకు నిరాఘాటంగా కొనసాగింది.

దేశభక్తి ప్రపూరితమైన 'ప్రబోధం' వేముగంటి వారి రెండవ రచన. ఆనాటి యువతలో దేశభక్తిని నింపి స్వాతంత్ర్యోద్యమం వైపు పరుగులెత్తించిన రచన ఇది. వీరపూజ, తిక్కన, ఆంధ్ర విష్ణువు, శ్రీ వివేక విజయం, భక్త రామదాసు, శ్రీ భాసర సరస్వతీవైభవం, మేలుకొలుపు, పురుపకరాము, కవితాకాహళి, భావతరంగిణి, తెనుగుబాల శతకం, బాల గేయాలు మొదలైన కావ్యాలతోపాటు వ్యాసకలాపం పేరిట ఒక వ్యాస సంకలనాన్ని వెలువరించారు.

రామో విగ్రహవాన్ ధర్మః అన్న వీరి పుస్తకం వాల్మీకి రామాయణంలోని ధర్మ సూక్ష్మాలను విడమరచి చెప్పింది.

భారతదేశంపై పాకిస్తాన్ దురాక్రమణకు పాల్పడినప్పుడు భారత వీర సైనికులు పాక్ మూకలను లాహోర్ వరకు తరిమికొట్టారు. ఆ సన్నివేశాన్ని 64 పద్యాలతో వీరపూజ అన్న లఘుకావ్యంగా మలిచారు.

"ఎవడురా పయినయిన్ నివురు గప్పిన
నిప్పురవల వెదకి సూద తివిరినాడు
ఎవడురా భీషణ వ్యవసాయ మిన్నాగు
కోరలు పెరుకగా కోరినాడు
ఎవడురా వాడు భయమించుకేని లేక
భరత ధాత్రిపై వచ్చినాడు"

అని గర్జించిన వారి కలం జాతీయభావాలను దేశభక్తిని రగిలించింది. ఈ కావ్యం రాష్ట్రపతి మహోదయులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రశంసలందుకున్నది.

కవిబ్రహ్మ ఉభయ కవిమిత్రుడు తిక్కన జీవితాన్ని, ఆనాటి చారిత్రిక సన్నివేశాలను జోడిస్తూ 321 పద్యాలలో నాలుగు ఉల్లాసాలుగా 'తిక్కన' కావ్యాన్ని రచించారు. తిక్కన రాజనీతిజ్ఞత, గణపతిదేవ చక్రవర్తి సభలో ప్రతిభా పాటవాలతో రాణించిన తీరు కళ్ళకు కట్టినట్లు ఈ కావ్యం చిత్రీకరించింది.

"ప్రతిభా పాండిత్య సమా
హితమగు నట్టులుగ లోకహితమీ కవితా
వ్రతమును సాగించెదనిక
బ్రతుకంతయు ముడుపుగట్టి భవ్యాత్ముడనై"

అని తిక్కన నోటి వెంట తమ కవితా లక్ష్యాన్ని ప్రకటించారు. విశ్వశ్రేయస్సే సాహిత్య ప్రయోజనమన్న సూక్తిని పునరుద్ఘాటించారు.

రెండువేల సంవత్సరాల నాటి ఆంధ్రజాతి వీరుని గాథను ఆంధ్రవిష్ణువు కావ్యంగా మలిచారు. కవిసామ్రాట్ విశ్వనాథ ఆంధ్ర నిశుంభుని వధించిన ఘట్టాన్ని ఆంధ్రప్రదేశ్ అన్న ఖండకావ్యంగా అందిస్తే వజ్జల కాళిదాసు ద్విపద కావ్యంగా రచించారు. అదే స్ఫూర్తితో వేముగంటి వారు 131 పద్యాల కావ్యంగా 'ఆంధ్రవిష్ణువు' సాహితీలోకానికి అందించారు. ఈ కావ్యం విశ్వవిద్యాలయాల పాఠ్యగ్రంథమైంది.

భారతీయ సంస్కృతీ వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పే ఆత్మ విస్మృతి నందిన జాతికి పునరుజ్జీవనాన్ని అందించిన మహనీయుడు స్వామి వివేకానంద. వారి మహిమాన్వితమైన జీవితకథను 150 పద్యాలతో శ్రీ వివేక విజయము అన్న కావ్యంగా వెలువరించారు.

భద్రగిరిపై శ్రీరామచంద్రుడికి భవ్యమైన ఆలయం నిర్మించి భక్తిపారవశ్యంతో రాముడిని మనసారా కీర్తించిన రామదాసు కథను 'భక్త రామదాసు' అన్న కావ్యంగా సమకూర్చారు. 302 పద్యాలతో రూపుదిద్దుకున్న ఈ కావ్యం వేముగంటి కావ్యాలలోకెల్లా పెద్దది. తెలంగాణా సంస్కృతికి జీవగర్ర అయిన బతుకమ్మ పండుగను ఈ కావ్యంలో అద్భుతంగా వర్ణించారు రామదాసు. సీతారామలక్ష్మణులకు చేయించిన ఆభరణాలను రమణీయంగా పేర్కొన్నారు.

సీతమ్మ కిమ్ముగా చింతాకు పతకమ్ము
చేయించే చక్కని శిల్ప మెసగ
రామయ్య తండ్రికి రతనాల కలికి తు
రాయి చేయించి అర్పణ మొనర్చె
భరతునకు మేలి పచ్చల పతకమ్ము
కైసేసే డెందంబు కందలింప
లక్ష్మణస్వామికి లలితమౌ ముత్యాల
పతక మర్పించే సంబరము వెలయ
కోరి శతృఘ్ననకును బంగారు తళుకు
కులుకు మొలత్రాడు నర్పించుకొని మురిసేను
స్వర్ణ మాణిక్య భూషణావళిని దైవ
తముల కర్పించి గోపన్న ధన్యుడయ్యె"

సీతమ్మకు చేయిస్తే చింతాకు పతకమ్ము అన్న రామదాసు కీర్తనను రమ్యమైన సీసపద్యంగా అందించారు.

సరస్వతీ మాత చతుష్షష్టి కళాప్రపూర్ణ. అందుకే అమ్మవారిని చతుష్షష్టి ఉపచారాలతో అర్చిస్తారు. చదువుల తల్లి సరస్వతీదేవి వెలసిన క్షేత్రం బాసర. బాసరగా, వ్యాసపురిగా ప్రశస్తికెక్కిన బాసరలో వెలిసిన సరస్వతీమాతను అరవైనాలుగు పద్యాలలో స్తుతిస్తూ శ్రీ బాసర సరస్వతీ వైభవం అన్న కావ్యంగా తీర్చిదిద్దారు.

ఆయన సంప్రదాయాన్ని ఎంతగా అభిమానించేవారో అంతే అభినివేశంతో సామాజిక సమస్యపై కొరడా ఝుళిపించేవారు. ప్రకృతి వర్ణనలలో ప్రబంధ కవులను మించిన పదగాంభీర్యాన్ని ప్రదర్శిస్తూనే అవకాశం చిక్కిన ప్రతిసారి సమాజంలోని దళిత, పేద వర్గాలపట్ల సాను భూతిని, సహానుభూతిని తమ రచనలలో ప్రదర్శిం చారు.

గ్రీష్మతాపాన్ని వర్ణించే సందర్భంలో మహా కార్యాలలోని వర్ణనకు తీసిపోని రీతిలో వారు నుడివిన ఈ పద్యాన్ని పేర్కొనవచ్చు.

"నల నీలాకాశ ఫాలభాగమునుండి
చినుచివు అగ్నికుంకుమరాలె
ఎండమావుల నీటికుండలెత్తుక దిశల్
దాహార్తులను కడు మోహపరిచె
వట్టిపోయిన కన్నెవాగు గుండెలలోన
వెచ్చని ఇసుకగుహల్లెన్నో లేచె
పచ్చ పచ్చని ఆకువలువలుజార్చి
కాననములు నగ్న తాండవమొనర్చె
నట్టనడి ఎండలోన బండలనుగొట్టు
చున్న శ్రమిక మానవుల నిట్టూర్పుసెగల
విధమునక వడగాడ్పులు విస్తరించె
గ్రీష్మ భీష్మాతపము చెలరేగినంత"

ఆంధ్రవిష్ణువు కార్యంలోని ఈ పద్యం వేముగంటి కల్పనావై చిత్రికి ఉదాహరణ. మరో పద్యంలో జీవ కారుణ్యాన్ని ప్రదర్శించారు.

"వాగాత్మికపై నితాంత భాసుర దిషణా
యోగాత్మికవై సురుచిత
భాగాత్మికమైన నీకు మ్రొక్కెద వాణీ" అంటూ శ్రీవాణీ వైభవాన్ని కీర్తించారు.

సరస్వతీ మాతకు ఆలయాలు చాలా తక్కువగా ఉన్నాయి. ఒకటి ఆదిలాబాద్ జిల్లా బాసరలో ఉండగా మరొకటి కాశ్మీర్‌లో ఉంది. సిద్ధిపేట జిల్లాలో వర్గల్ విద్యా సరస్వతీ ఆలయం, అనంతసాగర్ సరస్వతీ ఆలయాలు ఇటీవల వెలిసాయి.

"అమ్మ భారతి జగతి నీకాలయమ్ము
లొకటటొ రెండొ కలవనియు నులుక నేల

విశ్వమానవ మానవ వీధి నీకు
వేలుగానున్న మేలి కోవెలలు గావె"

సరస్వతీ ఆలయాలు తక్కువగా ఉన్నప్పటికీ విశ్వంలోని మానవుల మనస్సులన్నీ అమ్మ ఆలయాలే అన్న కవి భావన ఉదాత్తమైనది.

మదన్ మోహన్ మాలవ్య జీవితాన్ని 'భాష్పాంజలి' అన్న లఘుకావ్యంగా మలిచినట్లుగానే జాతిపిత గాంధీజీ త్యాగమయ జీవనగాథను 'బాపూజీ' అన్న ఖండకావ్యంగా రచించారు. "ఎవడైన నీ వంక కన్నెర్ర జేసి చూచేసేవి నా గుండె నారాచ మగును. ఎవడైన నీనీడ నొప్పించెనేని నర నరమ్మున వేడి నెత్తురులు పొంగు" అంటూ గాంధీజీ పట్ల తనకున్న భక్తినీ దేశభక్తి పట్ల అనురక్తినీ చాటుకున్నారు.

ఇవేకాక శ్రీవేంకటేశ్వరోదాహరణం, గణేశోదాహరణం వంటి లఘుకృతులు రచించారు. 1960వ సంవత్సరంలో గాంధీజయంతి సందర్భంగా సిద్ధిపేటలో సాహితీ వికాస మండలిని స్థాపించి సాహిత్య వ్యాప్తి కోసం కృషి చేశారు. సాహితీసదనం పేరిట సిద్ధిపేటలో తాను స్థాపించిన సంస్థకు చక్కటి భవనాన్ని నిర్మించారు.

ఎందరో యువకులను కవులుగా సాహితీవేత్తలుగా తీర్చిదిద్దారు. వేముగంటి వారికి పద్యమంటే ప్రాణం అయినా వచనాన్ని పలికారు. గేయాన్ని అద్భుతంగా మలిచారు. ఏ ప్రక్రియపట్ల ఏనాడూ ద్వేషాన్ని గానీ, వ్యతిరేక భావాన్నిగాని ప్రకటించని సమభావుకు డాయన. "మంజీరానాదాలు" అనే గేయ కావ్యం వీరి గేయ రచనాచమత్కృతికి నిదర్శనం.

"ఏనాటి దానవో ఏవీటి జాణవో గానమై మూగ
తెలంగాణ వీణను మీటి పలికింప

చకచకచ్చనిత పింఛములిచ్చుకొనుచు
నృత్యము చేయు నెమలిరాయని బెడంగు
పసిడి వన్నెల మేనిపై నల్లచారల
సాగియించు చెబ్బులి సొమ్ముగమ్ము
కల కలారావ సంకులమున ప్రకృతిని
పులకింపగాజేయు పులుగు సొగసు
భాసురములగు దీర్ఘపు కేసరములు
కెంపురాయి తురాయిగా సొంపులొలుక
దొరతనము సేయు మృగరాజు నెఱతనమ్ము
గలుగు వనరమా గరిమకు కవన వినుతి"

వనాలనూ, వన్యప్రాణులనూ కాపాడుకొందామనే భావనతో అందమైన సీసపద్యాన్ని అల్లడం వేముగంటి వారికే సాధ్యపడింది. మంజీరనాదాలు అనే గేయకృతిలో వర్షాకాలం ప్రవాహాలన్నిటికీ కొత్తదనాన్నిస్తుందని పలికే సందర్భాలు...

"పీడిత ప్రజ మనసు దూసుక
వెడలు చైతన్య ప్రవాహమొ
దుష్టచేష్టలు ధిక్కరించే
దుర్దరమ్మ గుజనసమూహమొ" అంటాడు.

ఎండాకాలంలో పిల్లకాలువలా మారే మంజీరానది వర్షాకాలంలో పీడిత ప్రజలు తిరుగుబాటు చైతన్య ప్రవాహంవలె, దుష్ట దోపిడీ దుశ్చేష్టల్ని ధిక్కరిస్తున్న వెల్లువలా తయారై నిలుస్తుందంటారు. ప్రవాహ ఉధృతిని జీవన సౌష్టంతో పోల్చడం సామాజిక చైతన్యాన్ని ప్రతిబింబించడం విశేషం.

రాగ స్రవంతివై వచ్చితివి అంటారు. రాయప్రోలు ప్రబోధం, విశ్వనాథ ఆంధ్రప్రశస్తి, దాశరథి రుద్రవీణ, అగ్నిధార జాషువా ఖండకావ్యాల ప్రభావం వీరి కావ్యాలపై కనిపిస్తుంది. సీసపద్యాన్ని అల్లడంలో శ్రీనాథుడి సోయగం భక్తిభావ బంధురతలో పోతన ప్రభావం, పద్యశిల్పాన్ని చెక్కడంలో నన్నయ శైలి వేముగంటి కావ్యాలలో అక్కడక్కడా తళుక్కుమంటాయి.

ఎంతటి ప్రాచీనుడో అంతటి ఆధునికుడిగా వేముగంటి కనిపిస్తారు. ప్రకృతి వర్ణనలో, సనాతన సంప్రదాయాభి మానంలో ఎంతటి అభిమానాన్ని ప్రదర్శిస్తారో కులమత వైషమ్యాలను నిరసించడంలో అంతటి తీవ్రతను చూపిస్తారు.

వేముగంటివారి రచనలను పలు విశ్వవిద్యాలయాలు పాఠ్యాంశాలుగా స్వీకరించాయి. తిక్కన కావ్యాన్ని ఉస్మానియా, ఆంధ్రవిష్ణువు కావ్యాన్ని శ్రీవేంకటేశ్వర విశ్వ విద్యాలయం.

గుల్బర్గా విశ్వవిద్యాలయం పాఠ్యాంశాలుగా స్వీకరిం చాయి. తెలంగాణా ప్రభుత్వం వీరి మంజీరా నాదాలను పాఠ్యాంశంగా స్వీకరించింది.

తెలుగు విశ్వవిద్యాలయం, గౌరవ డాక్టరేట్ ఇచ్చి సత్కరిస్తే, భారత మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి విద్వత్కవి అన్న బిరుదుతో సత్కరించారు. కవికోకిల, సుకవిభూషణ అన్నవి వారికున్న మరికొన్ని బిరుదులు.

"దినకరుండుండు నందాక తేజరిల్లు
గాత భవదీయ రసరమ్య కావ్య వితతి
ఓయి వేముగంటి సుకవీ వేయి వత్స
రాలు హృదయాలలో నీవు వ్రాలు గాత

అని ఆచార్య తిరుమల ఆకాంక్షించినట్లు తెలుగు పద్యానికి వెయ్యేళ్ళ చరిత్ర ఉన్నట్లు వేముగంటి పద్యానికి వెయ్యేళ్ళు నిలువగల సత్తా ఉంది.

## 151 వేముల పెరుమాళ్ళు

– డా॥ దేవరాజు మహారాజు

ఇంటికి వాకిలి సాక్షి అన్నట్టు ఈ తెలుగింటికి, ఈ తెలంగాణ ఇంటికి వాకిలి లాంటి వాడు వేముల పెరుమాళ్ళు. తెలుగు భాషా సంస్కృతుల గూర్చి, తెలుగు జీవనానికి సంబంధించిన జాతీయాల గూర్చి వేముల పెరుమాళ్ళు ఒక జీవిత కాలపు కృషి చేశారు. అయితే ఆ కృషి గురించి తెలుగు సాహితీ లోకంలో జరగాల్సినంత చర్చ జరగకపోవడం విచారకరం. పెరుమాళ్ళు మాటల్లోనే చెప్పాలంటే మన సాహిత్య చర్చలన్నీ 'ఉత్తుత్తి పుట్నాలు – మూడు మూడు కుప్పలన్నట్లుగా సాగుతున్నాయి'.

మంచి మనిషిగా, నిగర్విగా గుర్తింపు ఉన్న పెరుమాళ్ళు కొంతకాలం రాజకీయాలలో కూడా ఉన్నారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి కరీంనగర్ జిల్లాలోని రాయికల్ మండల అధ్యక్షులుగా ఎన్నికై కొద్దికాలం పనిచేశారు. 1989లో శాసనసభకు కూడా పోటీచేశారు. కానీ గెలవలేకపోయారు. అయినా ఆయన ప్రజా జీవితానికి దూరం కాలేదు. సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ ముందుండేవారు. అందువల్లే లేబర్ కాంట్రాక్టు సహకార సంఘం అధ్యక్షుడిగా, రాష్ట్రం టెలిఫోన్ కమిటీ సభ్యులుగా చాలాకాలం కొనసాగారు. అస్వస్థులై 17 సెప్టెంబర్, 2005 కన్నుమూసే నాటికి ఆయన వయసు 62 మాత్రమే.

వేముల పెరుమాళ్ళు 8 జనవరి, 1943న కరీంనగర్ జిల్లా రాయికల్ గ్రామంలో జన్మించారు. కోరుట్ల, జగిత్యాల, శ్రీకాళహస్తిలో హైస్కూలు చదువు పూర్తిచేసి గ్రామీణాభివృద్ధిలో డిప్లమా తీసుకున్నారు. ఇక సాహిత్య రంగాన గౌతమి సాహిత్య సమాఖ్య కరీంనగర్ కార్యవర్గ సభ్యులుగా అనేక సభలు నిర్వహించారు. స్వయంగా ప్రసంగాలు చేశారు. 'తెలంగాణ జాతీయాల'పై ఆకాశవాణి హైదరాబాదు కేంద్రం నుంచి ఎన్నో ప్రసంగాలు చేశారు. అవి గాఢమైన చింతనతో సూటిగా, స్పష్టంగా ఉండేవి. తన అనుభవాల్ని, ఆలోచనల్ని రంగరించి జాతీయాలను విశ్లేషిస్తూ ఉంటే ఎవరో వృద్ధ పండితుడు మాట్లాడుతున్నట్టు ఉండేది. నిజానికి అప్పుడాయన వయసు నలభైకి పైచిలుకు. చదువు స్కూలు పైనలే. కానీ ఆయన వాక్యం రసాత్మకం. శైలి ఒక ప్రవాహం. నిగూఢమైన అంశాల్ని వంగడిస్తున్నప్పుడు, వివరిస్తున్నప్పుడు ఆయనది మహా మేధావుల స్థాయి.

ఒక పది పుస్తకాలు ప్రచురించడానికి సరిపడినన్ని జాతీయాలు సేకరించిన పెరుమాళ్ళు అతి కష్టం మీద 2 వందల 70 పేజీల 'తెలంగాణ జాతీయాలు' 1998లో ప్రచురించగలిగారు. ఆ ఒక్క పుస్తకం అచ్చువేయడానికి పెద్దమొత్తంలో అప్పుకావడం వల్ల అది తనకు 'చిన్న ముండకు పెద్ద శోకం' అంటే శక్తికి మించిన పని అయ్యిందని చెప్పుకున్నారు. ఆ పుస్తకం చదివిన వారికి ఆయన స్థాయి ఏమిటో అర్థమవుతుంది. ఎవరూ పట్టించుకోని జాతీయాల్ని ఉడతా భక్తిగా సేకరించి, వాటికి వివరణలు, వ్యాఖ్యానాలు

రాసి ప్రసంగిస్తుంటే వినడం ఒక గొప్ప అనుభవం. ఆ విషయాన్ని ఆచార్య బిరుదురాజు రామరాజు, ఆచార్య నాయని కృష్ణకుమారి, డాక్టర్ దాశరథి రంగాచార్య వంటి నాటి సాహితీ ప్రముఖులు పుస్తకానికి రాసిన ముందు మాటలలో వివరించారు. విశ్వవిద్యాలయాలు, అకాడమీలు లేదా సాహిత్య సంస్థలు చేయాల్సిన పనిని వేముల పెరుమాళ్ళు ఒంటరిగా చేశారు. ఉడుంపట్టు, దీక్ష, కార్యశూరత్వం గలవారు ఎలాంటి మహాకార్యాన్నయినా అలవోకగా చేయగలరని 'తెలంగాణ జాతీయాలు' పుస్తకం చూస్తే తెలుస్తుంది. పాఠకులు 'తంతే పరుపులో పడ్డట్టు పడతారు'.

తెలుగు సంస్కృతి అంతా ఒకటే ! అయినా తెలంగాణ సంస్కృతిలో కొంత భిన్నత్వం ఉంది. భాషలో, యాసలో ప్రత్యేకత ఉంది. అందుకు కారణం సుమారు ఎనిమిది వందల సంవత్సరాలకు పైగా ఇతర జాతీయులు ఈ ప్రాంతాన్ని పాలించారు. తెలుగు చదవడం, రాయడం నిషేధింపబడ్డ రోజుల్లో కూడా తెలంగాణ ప్రజలు వారి భాషను, యాసను పదిలపర్చుకున్నారు. వారి సామెతల్ని, మౌఖిక సాహిత్యాన్ని, లిఖిత సాహిత్యాన్ని భద్రపరుచుకున్నారు.

నిజాం పాలకులు సృష్టించిన ప్రతికూలమైన పరిస్థితులలో కూడా ఇక్కడి ప్రజలు వాటిని కాపాడుకోవడం ఒక సాహసవంతమైన చర్య. వ్యవసాయ పరంగా చూస్తే ఈ ప్రాంతపు భూములు పెద్దగా పంటలు పండేవి కావు. రాళ్ళు, రప్పలు, గుట్టలు, నీటికొరత, వ్యాపారానికి కూడా అనువైన ప్రదేశం కాదు. అందువల్ల ఆర్థికంగా బలపడే అవకాశాలే లేవు. అంటే అన్ని రకాల ప్రతికూల పరిస్థితులలో తెలంగాణ ప్రజలు తమ భాషను, యాసను, సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకుంటూ వచ్చారన్నది మనం గ్రహించాలి. సహృదయంతో అందులోని గొప్పతనం అర్థం చేసుకోగల వారికైతే అది అర్థమవుతుంది. అది అర్థం చేసుకునే ఒక అవకాశం వేముల పెరుమాళ్ళు మనకిచ్చారు. 'ఇది గుర్రం – ఇది మైదానం' అన్నట్టు తేటతెల్లం చేశారు.

'తెలంగాణ జాతీయాలు' ఏకాగ్రతతో మనసుపెట్టి చదివిన వారికి తెలుగు జాతి ఔన్నత్యం గూర్చి తెలుస్తుంది. మన పండుగలు, పబ్బాలు, పెళ్ళిళ్లు, పేరంటాలు, క్రీడలు, విందులు, వినోదాలు, నమ్మకాలు, కట్టుబాట్లు, ఆచరణలో ఉన్న వివిధ విధానాలు, వాటివాటి ప్రత్యేకతలు అన్నీ కొంతవరకైనా తెలుస్తాయి. ఇంగ్లీష్ చదువులు ఎక్కువైపోయి, విదేశీ సంప్రదాయాలు మక్కువైపోయి తమ అస్థిత్వాన్ని తామే వదులుకుంటూ పరాయీకరణ చెందుతున్న నేటి యువతరం ఎంత సత్వరంగా తమను తాము గుర్తించుకుంటే అంత మంచిది. ఎన్నెన్నో అవరోధాల్ని తట్టుకుంటూ కొన్ని వేల సంవత్సరాల నుంచి అఖండ దీపంలా వెలుగుతూ వస్తున్న మన జానపద సంస్కృతి విలువను నేటితరం అర్థం చేసుకోవాలి. 'ఇంటోడు దొంగల్ల కల్సినట్టు కాకూడదు'.

మన పాతతరం మనుషులు ఏ రెండు నిముషాలు మాట్లాడినా అందులో పుష్కలంగా జాతీయాలు, సామెతలు, పొడుపు కథలు, పదాలు అలవోకగా వినిపించేవి. ఇప్పుడు ఈ మారిన కాలంలో అన్నీ మారిపోయాయి. 'చిత్తు బొత్తయ్యింది' అంటే తారు మారయ్యింది. భాష కాలుష్యమై పోయింది. యాస కాలుష్యమైపోయింది. జానపదుల ఆత్మసౌందర్యం గుబాళించే జాతీయాలు కనుమరుగై పోతున్నాయి. ఈ కనిపించని వరదల్లోంచి, ఉప్పెనలోంచి, వాయుగుండాల్లోంచి, సునామీల్లోంచి మనల్ని మనం రక్షించుకోకతప్పదు. అలాంటి ముఖ్యమైన విషయాన్ని ఎత్తి చూపి మన బాధ్యతను మనకు గుర్తు చేసిన పెరుమాళ్ళు చిరస్మరణీయులు.

పరభాషా దురాక్రమణ వల్ల మన జాతీయాలెన్నో కాలగర్భంలో కలిసిపోయాయని ఆయన ఆవేదన చెందారు. 'పోయింది పొట్టు, ఉన్నది గట్టి' అన్న పెద్దల వాక్యానికి కట్టుబడి, ఆయన తెలంగాణ మారుమూల పల్లెల్లోంచి జాతీయాలు పోగుచేశారు. ఆయనకు అదొక యజ్ఞం. అదొక తపస్సు. ఒక్కోసారి జాతీయం వెంట సామెత, సామెత వెంట జాతీయం కలిసి ఉంటాయి. తల్లీ పిల్లల్లాగా, అది విడదీయరాని బంధం. జాతీయాల్లో అక్కడక్కడా కొంత బూతు తొంగిచూస్తుంది. అయితే అది నాగరికులైన అక్షరాస్యుల దృష్టి కోణంలో మాత్రమే బూతు. వారి దృష్టిలో అంటే జానపదుల లేదా నిరక్షరాస్యుల దృష్టిలో అది బూతు కాదు. వారు అమాయకంగా, సహజంగా, స్వచ్ఛంగా, స్వచ్ఛందంగా పదాలు వాడతారు. మనం వాటిని వారి కోణంలోంచే, వారి స్థాయిలోంచే పరిశీలించాలి.

వేముల పెరుమాళ్ళు ఈ విషయంలో ఎంతో సాహసవంతుడు. తెలంగాణ జాతీయాల్ని పరిరక్షించడం తన కర్తవ్యమని, జీవిత ధ్యేయమని భావించారు. యథాతథంగా జాగ్రత్తగా వాటిని గ్రంథస్తం చేశారు. ఒకవిధంగా చెప్పాలంటే తరతరాల తెలంగాణ సామాజిక చరిత్రను గ్రంథస్తం చేశారన్న మాట. 'పిర్రలు చూసి పీటలు వేసే కాలమిది' వేముల పెరుమాళ్ళు వంటి వారి గూర్చి ఎవరు మాట్లాడుతారు ?

# 152 వేంకటరాజన్న అవధాని

– ప్రమోద్ అవధాని

అప్పటి నిజాం రాష్ట్రంలోని తెలంగాణా ప్రాంతం కరీంనగర్ జిల్లా మంథనిలో శ్రీ వేంకటరాజన్న అవధాని గారు తేది. 10.6.1909న శ్రీ కృష్ణయ్య అవధాని, శ్రీమతి సీతమ్మ దంపతులకు జన్మించారు.

శ్రీ అవధాని గారు నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన సంస్థాన విలీనకరణ, స్వాతంత్ర్య పోరాటపు ఉద్యమాలలో పాల్గొని, సత్యాగ్రహము చేసి నైజాం ప్రభుత్వము చేత అరెస్టుకాబడి, అప్పటి నిరంకుశ నిజాం పోలీసులచే చిత్రహింసలపాలైన వీరు, తమ జీవితంలో ఎంతో ధైర్యముగా ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా లెక్కచేయక అన్ని ఉద్యమాలలో ముందుండి, అప్పటి స్టేట్ కాంగ్రెస్ కార్యక్రమాల్లో పాల్గొని, తమ సర్వస్వాన్ని దేశం కొరకు సమర్పించడానికి సిద్ధపడి పోరాటం సాగించినారు.

1946లో అప్పటి ప్రభుత్వం వీరిని అరెస్టు చేసి 6 నెలలు కరీంనగర్ జిల్లా జైలులో బంధించింది.

శ్రీ వేంకట రాజన్న అవధాని గారు ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, కవి, పండితులు బహు భాషా కోవిదులు, సంఘ సంస్కర్త. అధివక్త (అడ్వకేట్) ఆయుర్వేద వైద్యులు. "వైద్యవర" బిరుదాంకితులు.

హైద్రాబాద్‌లో వకాలత్ చదవడానికి నివాసముంటున్న సమయంలో శ్రీ కాళోజి నారాయణరావు, శ్రీ వెల్దుర్తి మాణిక్యరావు గారలతో కలిసి ఆనాటి పరిస్థితులపై చర్చించుకొనేవారు. వారు ముగ్గురు "తెలంగాణా వైతాళిక సమితి" పేరుతో ప్రసిద్ధులు.

కొంతకాలం వీరు శ్రీ సురవరం ప్రతాపరెడ్డిగారి సంపాదకత్వంలో వెలువడిన అప్పటి "గోలకొండ పత్రిక"కు ఉప సంపాదకులుగా పని చేసినారు. తెలంగాణాలో కవులే లేరని, వీరికి కవిత్వమే రాదన్న ఒక అపవాదును సవాలుగా తీసుకొని ప్రతాపరెడ్డిగారు వెలువరించిన "గోలకొండ కవుల సంచిక"లో శ్రీ అవధానిగారి కవిత "మంథెనద్విజులు" అను శీర్షికతో ప్రచురింపబడుట అత్యంత విశేషం. శ్రీ అవధాని గారు శ్రీ సురవరం ప్రతాపరెడ్డి గారికి సన్నిహితులు, సమకాలీకులు. ప్రతాపరెడ్డి గారు వ్రాసిన "హిందువుల పండుగలు" అనే ఉద్గ్రంథానికి శ్రీ వేంకట రాజన్న అవధాని గారు 'పీఠిక' వ్రాసినారు. ఈ పుస్తకం ఇటీవలనే పునర్ముద్రించబడినది.

ఆనాటి "ఆంధ్రమహాసభ" కార్యకలాపాల్లో కరీంనగర్ జిల్లా కేంద్రంలో చాలా చురుకుగా పాల్గొని దానికి సారథ్యం వహించి, ఎంతోమంది యువకులను తమ వాగ్ధాటితో ఉద్యమంవైపు ఆకర్షింపజేసి చైతన్యవంతులను చేసిన ఘనత శ్రీ అవధానిగారిదే. అందుకేకావచ్చు అప్పటి మన భారత ప్రధాని శ్రీ పి.వి. నరసింహారావు గారు మంథని ప్రసక్తి వచ్చినపుడు తరచు "There were times when we used to derive inspiration from shri Avadhani garu" అని అంటుండేవారు.

ఓసారి శ్రీ పి.వి. గారు మంథనికి భారత ప్రభుత్వం విదేశాంగ శాఖామాత్యుల హోదాలో విచ్చేసినపుడు స్వయంగా శ్రీ అవధానిగారి ఇంటికి వెళ్ళి వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకొన్నపుడు వారు అన్న మాటలు "Mr. Avadhani, I have only friends like you, I have no followers and group".

1945-46 సంవత్సరంలో అవధానిగారు కరీంనగర్ లో తమ న్యాయవాద వృత్తి కొనసాగించుచున్న సమయంలో ఒకనాటి రాత్రి రజాకర్ ముష్కరులు వీరి ఇంటిమీద దాడి జరిపినపుడు, మొత్తం వారి కుటుంబ సభ్యులంతా కలిసి ఎంతో ధైర్యసాహసాలతో ఆ దాడిని ఎదుర్కొన్నారు. అవధాని గారు గ్రంథాలయోద్యమ నిర్మాతగా, సంఘసంస్కర్తగా అనేక సామాజిక కార్యక్రమాల్లో పాల్గొని జిల్లాలోని అన్ని ముఖ్యమైన సంఘటనలలో ముందుండి పని చేసినారు.

స్వాతంత్ర్యానంతరము శ్రీ అవధాని గారు అప్పటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అనువాద సంఘములో అనధికార సభ్యులుగా 1967-70 కాలంలో పని చేసినారు. సంగ్రహాంధ్ర విజ్ఞాన కోశపు ఏడవ సంపుటములో శ్రీ అవధాని గారు వ్రాసిన వ్యాసము ద్వారా మంథని ప్రాచీన వైభవమును గూర్చిన అనేక చారిత్రక విషయాలు మనకు తెలియుచున్నవి.

"Census of India 1971, Andhra Pradesh special survey reports on selected towns-Manthani" అనే ప్రభుత్వ సమాచార శాఖ తరఫున ప్రచురింపబడిన గ్రంథంలో (8వ పేజి) నాటి గణాంక శాఖ డైరెక్టర్ శ్రీ వేదాంతం I.A.S. ఆఫీసర్ గారు, అవధాని గారి గురించి ఇలా వ్రాసారు.

"I visited the town twice before finalizing this monograph and I acknowledge with thanks the enlightened conversations I had with Shri Venkata Rajanna Avadhani, a scholar of infecluctual eminence an Advocate and freedom fighters" అని వ్రాస్తూ వారిని ఎంతగానో కొనియాడారు.

మరల వారే ఈ గ్రంథం యొక్క 164-165 పేజీలలో శ్రీ అవధాని గారు సాహిత్య, సాంఘిక రంగాలలో చేసిన సేవలను ఉల్లేఖిస్తూ -

"In the year 1926, a Telugu Monthly manuscript Magazine (viz) Namely, 'Prabodha Chandrika' was started both in poetry and prose under the editor ship of Shri Avadhani, a local Scholar. The Editor himself a Scholar, Advocate, Social worker and" vaidya vara".

Shri Venkata Rajanna Avadhani is also author of (1) "Agni Shabda Mahatyam. (2) జన్మరహస్యం "He possesses very intimate knowledge of Art, literature, History and grouth of Manthani Town" అని వీరి ప్రతిభా పాటవాలను గురించి ఎంతగానో ప్రశంసించారు.

వీరు సంఘ సంస్కర్తగా అనాదిగా వచ్చుచున్న కొన్ని సాంఘిక మూఢాచారాలకు వ్యతిరేకంగా పోరాటము సలుపుటయేగాక 4 రోజుల "ఉపనయన" క్రతువును అనగా వడుగులను కుదించి ఒకరోజులో ముగించవచ్చని, తాము స్వయంగా తమ రెండవ కుమారుని ఉపనయనమును ఒకరోజులో నిర్వహించి ఈ ప్రాంతానికి మార్గదర్శులైనారు.

వీరు హరిజనోద్ధరణకు నడుము బిగించి ఒక హరిజన యువకుని తమవద్ద సహాయకునిగా నియోగించుకొన్నారు. అతనే స్వాతంత్ర్యానంతరము రాష్ట్ర శాసన సభ్యునిగా మేడారం రిజర్వుడు స్థానం నుండి ఎన్నికైనారు. ఇతను మంథని గ్రామ నివాసియైన గడిపెల్లి రాములు M.L.A. గారు. ఆనాటి ఏ రాజకీయ సభకైనా, సాహితీసభకైనా వీరు అధ్యక్షత వహించని సంఘటన ఈ ప్రాంతములో చాలా అరుదుగా ఉండేది.

అప్పటి కరీంనగర్ జిల్లా పరిషత్ ఆధ్వర్యాన జరిగిన ఒక సమావేశంలో ధారాళంగా సాగిన వీరి ఉపన్యాసము విని, ముగ్ధులై, కవి సామ్రాట్ శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గారు వీరి దగ్గరకు వచ్చి వీరిని వేదికపైననే ఆలింగనం చేసుకొని "తెలంగాణా ప్రాంతంలో కూడా ఇంత చక్కటి తెలుగులో మాట్లాడేవారు ఉన్నారని తెలిసి తాను ఆనందపరవశుడనైతి"నని ఎంతగానో శ్లాఘించారు.

మంథని M.L.A. గా పని చేసిన శ్రీ గులుకోట శ్రీరాములు గారి షష్ఠి పూర్తి సందర్భంగా ప్రచురింపబడిన విశేష సంచికలో శ్రీ వేంకట రాజన్న గారి జీవిత సంగ్రహము ప్రచురింపబడినది. భారత స్వాతంత్ర్య 25వ వార్షికోత్సవాల సందర్భంగా 1972లో భారత ప్రభుత్వపు తరఫున

అవధానిగారి త్యాగాలకు సేవలకు గుర్తింపుగా తామ్రపత్రము రవీంద్రభారతిలో బహూకరింపబడినది. పరకాల గ్రామ వాసులు, శ్రీ రేపాల నరసింహ రాములుగారు "కరీంనగర్ జిల్లా స్వాతంత్ర్యోద్యమ చరిత్ర - సజీవ కిరణాలు" అనే పుస్తకంలో శ్రీ అవధాని గారి జీవిత విశేషాలు, నాటి స్వాతంత్ర్య పోరాటంలో వారు నిర్వహించిన విశిష్ట పాత్రను గురించి ఫొటోలతోసహా ప్రచురించారు.

ఈ గ్రంథం పేజి 27లో ప్రచురింపబడిన గ్రూపు ఫొటోలో 1948 సంవత్సరపు కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీయుతులు వేంకట రాజన్న అవధాని, కె.వి. నర్సింగ్‌రావు, రఘునాథ్ రావ్‌కచే, బొద్ల భూపతి, గులుకోట శ్రీరాములు, బి.వి. రాంరెడ్డి, కాసం శివరాజం గుప్త, పి.వి. నరసింహారావు, బి. వేంకటరామారావు, బి. మురళీధర్ రావు గార్లను చూడవచ్చు. శ్రీ పి.వి. గారు అనేక సందర్భాలలో అవధాని గారిని తమ గురువులుగా భావించేవారు.

ప్రజాకవి, పద్మభూషణ్ శ్రీకాళోజి నారాయణ రావు గారికిని, వారి అన్నగారైన శ్రీ కాళోజి రామేశ్వర రావు గారికిని శ్రీ అవధానిగారు ఆప్తులు, మిత్రులు, శ్రీ కాళోజిగారి "నా గొడవ" 4వ సంచిక పరాభవ వర్షంను శ్రీ అవధాని గారు 1966 వరంగల్‌లో జరిగిన సభలో ఆవిష్కరించారు.

దాదాపు 60 సంవత్సరాల క్రితం మంథనిలో బాలికలకు 7వ తరగతి వరకే పాఠశాల విద్యావకాశాలు ఉండినవి. 10వ తరగతి చదవడానికి అవకాశాలేలేవు. ఆ సమయంలో ధైర్యముగా శ్రీ అవధానిగారు తమ రెండవ కుమార్తె శ్రీమతి ప్రేమలతాదేవికిని మరియు శ్రీ లోకీ లక్ష్మణ శర్మగారి కుమార్తె శ్రీమతి క్రాంతి కుమారికిని, అప్పటి హైద్రాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ బూర్గుల రామకృష్ణారావు గారి వద్ద సహాయకులుగా మరియు సలహాదారుగా పనిచేస్తున్న శ్రీ వరహాల భీమయ్యగారి చొరవతో ప్రభుత్వము నుండి ప్రత్యేక అనుమతి పొంది ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో బాలికలకు ప్రవేశము కల్పించి, 10వ తరగతి వరకు విద్యావకాశములను కల్పించినారు.

ఆడపిల్లలకు చదువు ఎందుకు? ఇంటిపని, వంటపని చూసుకుంటే చాలు. ఆడవాళ్ళు ఉద్యోగాలు చేసి ఊర్లేలాలా? అని అనుకొనే రోజుల్లో శ్రీ అవధానిగారి కృషి వలన అనేకమంది బాలికలకు తమ ఉన్నత విద్యాభ్యాసానికి మార్గదర్శకులైనారు. స్త్రీ విద్యను ప్రోత్సహించినారు. తమ అందరు కుమార్తెలను డిగ్రీ వరకు చదివించిన ఘనత శ్రీ అవధాని గారికే దక్కుతుంది.

ఆ తరువాతి కాలంలో బాలికలకు పదవ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణానికి కావలసిన స్థలాన్ని శ్రీరాజా వేంకట ముత్యంరావు గారి గదిని వారిచే మంథని ప్రజలకు దానమిప్పించిన ఘనత శ్రీ అవధాని గారి కుమార్తె శ్రీమతి ప్రేమలతాదేవి గారిదే అని తెలుపడం సమంజసంగా ఉంటుంది.

రాష్ట్ర ప్రభుత్వ పురావస్తు, మ్యూజియంల శాఖకు సలహాదారులుగాను, పంచాయతీరాజ్ వ్యవస్థ యొక్క ప్రాముఖ్యతను నాటి కాలంలో అమలులో ఉండిన వ్యవస్థకు అనుగుణంగా పంచాయితీ సమితుల సభ్యులకు తెలుపడానికి ప్రభుత్వము వారిపక్షాన ఉపన్యాసకులుగా కూడా పనిచేశారు.

శ్రీ అవధానిగారు తమ 87వ ఏట తేది 22.09.1995 నాడు మంథనిలోని వారి స్వగృహంలో తుది శ్వాస విడిచి ఇహలోకయాత్ర చాలించినారు.

# 153 వెంకట రామ నరసింహారావు

**– షబ్నవీసు ఇందిర**

నల్లగొండ జిల్లా సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమానికి, సాహితీ ప్రచారానికి, సంఘ సంస్కరణకు శ్రీకారం చుట్టిన షబ్నవీసు వెంకట రామ నరసింహారావు గారు తన జీవితాన్ని సాహితీ సేవకు, సమాజ స్ఫూర్తిని అర్పించిన మహానుభావులు.

వార్త లేనిచో లోకము అంధకార బంధురమవుతుందని భావించి వార్తలను ప్రజలకు అందచేసే పత్రికలేని పక్షంలో ప్రజలకు రక్షణ కరువవుతుందని పత్రిక అవసరాన్ని గుర్తించి నల్లగొండ జిల్లాలో 24 ఆగష్టు 1922లో 'నీలగిరి' అను పేర పత్రికను స్థాపించి ప్రజాసేవ చేసిన ధన్యుడు.

ఆనాడు నిజాం పాలనాకాలంలో నిర్బంధాన్ని అధిగమించి ఉస్మానియా ముద్రణాలయం స్థాపించి దాని ద్వారా 'సంస్కారిణి గ్రంథమాల' నెలకొల్పి దాని ద్వారా ప్రతి నెల ఒక మంచి పుస్తకాన్ని అందించి ఎనలేని సాహితీ సేవ చేశారు.

షబ్నవీసు వెంకట రామ నరసింహారావు గారు 1896 నవంబరు నెలలో షబ్నవీసు లక్ష్మీ నారాయణ రావు, రంగ నాయకమ్మలకు జన్మించారు. లక్ష్మీ నారాయణరావు గారి తండ్రి గోపాలరావు గారు నల్లగొండకు సమీపాన గల మామిళ్ళగూడెం గ్రామాన్ని మఖ్తాగా సంపాదించారు. వీరు ప్రతి సం॥ము హైదరాబాదు వెళ్ళి నిజాం ప్రధాని అయిన నవాబు సాలార్‌జంగ్ బహదూరును వారి అనుచరులను కలిసి వచ్చేవారు. లక్ష్మీ నారాయణ రావు గారు కొన్ని సంవత్సరములు ప్రభుత్వ ఉద్యోగము చేసి కొన్ని గ్రామాల్లో భూములు, వ్యవసాయం చేయిస్తూ మామిళ్ళగూడెంలో పెద్ద బంగళా కట్టించిన సంపన్నులు. వీరి కుమారుడు వెంకట రామ నరసింహారావు స్వయం కృషితో సంస్కృతాంధ్ర, పారసీ, ఉర్దూ భాషలలో పాండిత్యం సంపాదించినారు.

పదహారవయేట పులిజాల తిరుమలరావు, రామ చూడమ్మ గారి జ్యేష్ఠ కుమార్తె మరియు పులిజాల రంగారావు గారి సోదరి రాధమ్మను వివాహం చేసుకొని ఆ తరువాత ఆమె పేరును జానకీబాయిగా మార్చినారు. ఆమెకు ఆంధ్ర భాషలో ప్రవేశం కలిగించి, గ్రంథావతరానికై నరసింహారావు గారు చాలా కృషి చేశారు.

నల్లగొండలో ఆ రోజుల్లో మహబూబియా రీడింగు రూము అనే పేరున అనే గ్రంథాలయం ఉండేది. 18 మార్చి 1918లో ఆనాటి అవ్వల్ తాలుకు దార్ ఆధ్వర్యంలో వెంకట రామ నరసింహరావు ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసి ఆంధ్ర సరస్వతీ నిలయమనే పేరున ఒక గ్రంథాలయాన్ని స్థాపించి నిర్వహించారు. ఈ గ్రంథాలయం ఆ తర్వాత జిల్లా గ్రంథాలయ సంస్థలో విలీనం అయింది.

12 నవంబరు 1921 నాడు హైదరాబాదు నగరంలో సంఘ సంస్కార సభ, మహిళా విశ్వవిద్యాలయ స్థాపకుడు అయిన కార్వే పండితుని అధ్యక్షతన జరిగింది.

అతని అధ్యక్ష ఉపన్యాసం మరాఠీలోను, ఇంగ్లీషులోను జరిగింది. తదనంతరం వక్తలందరు మరాఠీ, ఉర్దూ, ఇంగ్లీషు భాషలలో అచ్చట ప్రవేశపెట్టిన తీర్మానాలపై ప్రసంగిస్తూ వచ్చారు. ఈ విషయం ఈ సమావేశానికి హాజరయిన తెలుగు ప్రముఖుల మనస్తాపానికి కారణమయింది. దానిలో నగరంలో సుప్రసిద్ధ న్యాయవాదిగా ఉన్న శ్రీ అలంపల్లి వెంకట రామారావు గారు ఒక తీర్మానంపై తెలుగులో ప్రసంగించడానికి ఉపక్రమించగానే సభికులు అరచి గోల చేసి ప్రసంగం కొనసాగనీయకుండా చేశారు. ఈ సంఘటన మాతృభాషకు జరిగిన అవమానంగా భావించి వెంటనే సభలోయున్న తెలుగువారు సభా కార్యక్రమాలు పూర్తికాక ముందే నిరసన తెలుపుతూ బయటకు వచ్చేసారు. ఈ సంఘటన ఆంధ్ర జనకేంద్ర సంఘ స్థాపనకు బీజం వేసింది. కొంతమంది ప్రముఖులు టేకుమాల రంగారావు, మాడపాటి హనుమంతరావు గారు, మిట్టా లక్ష్మీ నరసయ్యగారు, ఆదిరాజు వీరభద్రరావు గారు, నడింపల్లి జానకీరామయ్య గారు, బూర్గుల రామక్రిష్ణారావు గారు, ముందుముల నరసింగరావు గారు, బోయినపల్లి వెంకట రామారావు గారు, కొమ్మవరపు సుబ్బారావు గారు, బూర్గుల నరసింహారావు గారు, పండిట్ రామస్వామి నాయుడు గార్లు సమావేశమై ఆ రాత్రి ఆంధ్ర జన సంఘమును స్థాపించారు. సం॥ చందా ఒక రూపాయి నిచ్చువారు సభ్యులుగా తీర్మానించారు. నూరుగురు సభ్యులు గల ఆంధ్ర జన సంఘం మొదటి సమావేశం కొండా వెంకట రంగారెడ్డి అధ్యక్షతన రెడ్డి విద్యాలయంలో 1922 ఫిబ్రవరి 24న జరిగింది. మార్చి మరియు ఏప్రియల్ నెలలలో మరో రెండు సమావేశములు జరిగాయి.

ఈ ఉద్యమాన్ని ముందుకు తీసుకొని వెళ్ళటానికి షబ్నవీసు వెంకట రామ నరసింహారావు గారు 24 ఆగష్టు 1922లో 'నీలగిరి' పత్రికను నల్లగొండలో ప్రారంభించారు. ఆంధ్ర జన కేంద్ర సంఘ ప్రథమ సమావేశము హైదరాబాదు లోని ట్రూపు బజారులో గల మాడపాటి హనుమంతరావు గారి ఇంట్లో 27 జూలై 1923న జరిగింది. ద్వితీయ సమావేశము 'నీలగిరి' పత్రికా సంపాదకులు షబ్నవీసు వేంకట రామ నరసింహారావు కార్యాలయ ఆవరణలో నల్లగొండ నందు 21 మార్చి 1924న జరిపినారు. ఈ సమావేశానికి రావు బహదూర్ వెంకటరెడ్డి అధ్యక్షత వహించారు. తెలంగాణా జిల్లాల నుండి 7గురు ప్రతినిధులు, వివిధ జిల్లాల నుండి 50 మంది ప్రేక్షకులు హాజరయినారు.

ఈ సభలో చిత్రాడ జమిందారు, సాహిత్య పోషకుడు చెలికాని లచ్చారావు, శతక కవుల చరిత్ర గ్రంథకర్త, సాహితీవేత్త వంగూరి సుబ్బారావుల మృతికి సంతాపం ప్రకటించిరి. ఈ సభలో ప్రముఖులు కొన్ని ముఖ్యమైన నిర్ణయాలు తీసుకొనుట జరిగినది. మొదటిది – నిజాం రాష్ట్రంలో ఆంధ్రోద్యమ వ్యాప్తికి "నిజాం రాష్ట్రాంధ్రనిధి"ని ఏర్పాటు చెయ్యాలని దానికి కొండా వెంకట రంగారెడ్డి వ్యవహారకర్తలుగా ఉండాలని నిర్ణయించినారు. రెండవది – వేతనముతో పూర్తికాలము పని చేయుటకు ప్రచారకుని నియమించాలని, మూడవది – "ఆంధ్ర పరిశోధక మండలి" అను పేరుతో స్థాపితమైన ఐమట్టూజు వెంకట లక్ష్మణరావు మరణించిన తరువాత "లక్ష్మణ రాయ పరిశోధన మండలి"గా నామకరణము చేయబడిన పరిశోధన సంఘం ఆంధ్రజన సంఘము ఆఫీసులో పని చేయుచుండెను. దానిని కేంద్ర సంఘము యాజమాన్యము క్రింద వచ్చునట్లు నిర్ణయించి నారు. నాలుగవ నిర్ణయము – హెచ్.ఎస్.ఎస్.సి. ఉస్మానియా విశ్వ విద్యాలయపు, మెట్రిక్, ఇంటర్మీడియట్, బి.ఓ. పరీక్షలందు ఆంధ్ర భాషలలో ప్రథములుగా వచ్చిన వారికి బంగారు, వెండి పతకములతో సత్కరించాలని, ఐదవది – ఆంధ్ర వాఙ్మయం ప్రచారము చేయుటకు పరీక్షల నేర్పాటు చేయుటకు ఒక విధానము సిద్ధము చేయాలని నిర్ణయించి నారు. ఆరవది – నిజాం రాష్ట్రంలో ఆంధ్ర స్థితులను తెలుపు లఘు పుస్తకమును వ్రాయించి, తగిన వెలకు విక్రయించాలని నిర్ణయించినారు.

నల్లగొండ నందు ఈ సమావేశము ముగింపున బహిరంగ సభను పింగళి వెంకట రామారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభలో శేషాద్రిరావు వకీలు, మాల్వీ మన్సూర్ సాహెబ్, ఇంకొందరు నాయకులు ప్రసంగించారు. ప్రభుత్వం నందలి లామీరాల్ శాఖలో ఉద్యోగం చేయుచుండిన శ్రీ కూర్మారావు గారు కేంద్ర సంఘ సభ్యులకు ఆ రాత్రి విందును ఏర్పాటు చేసినారు. హైదరాబాద్ నుండి కాక తెలంగాణా జిల్లాల నుండి వెలువడిన తెలుగు పత్రికలు రెండు. ఇవి 1922లో ఆగష్టు నెలలో నాలుగు రోజుల

వ్యత్యాసంలో ప్రారంభమైనవి. 1922 ఆగష్టు 24న మొదలైన నీలగిరి పత్రిక మొట్టమొదటి పూర్తిస్థాయి రాజకీయ పత్రిక. ఆగష్టు 27న వరంగల్ జిల్లా మానుకోట, తాలుకా ఇనుగుర్తి నుండి "తెనుగు పత్రిక" ప్రచురింపబడింది. ఈ పత్రిక సంపాదకులు వొద్దిరాజు సీతారామచంద్రరావు, వొద్దిరాజు రాఘవ రంగారావు సోదరులు.

1925 వరకు నీలగిరి పత్రికను అత్యంత సమర్థతతో షబ్నవీసు వెంకట రామ నరసింహారావు గారు నడిపారు. ఆనాటి ప్రముఖ నాయకులైన మాడపాటి హనుమంతరావు, బూర్గుల రామకృష్ణారావు గారు, పులిజాల రంగారావు గారు తదితరులు వివిధ విషయాలపై ఈ పత్రికలో ఎన్నో కవితలు, వ్యాసాలు రాసేవారు. ఆ రోజులలో గుడిపాటి వెంకటాచలం రాసిన ఒక సంచలనాత్మకమైన కథను పత్రికలు ప్రచురించ డానికి నిరాకరించాయి. అప్పుడు షబ్నవీసు వారు నీలగిరి పత్రికలో ఆ కథను ప్రచురించి సంచలనం సృష్టించారు.

షబ్నవీసు వెంకట రామ నరసింహారావు గారు 'నీలగిరి' పత్రికతోపాటు "వీరేశలింగం కంఠాభరణ గ్రంథమాల" అని పేరు పెట్టారు. ఈ గ్రంథమాల పక్షాన దాదాపు పది పుస్తకాలను ప్రచురించారు. అందులో ఒకటి వెంకట నరసింహారావు గారి తండ్రి ప్రేరణతో "మామిళ్ళ గూడెం మఖ్తా, రామాశ్రీ ఆంజనేయ ధార్మిక దేహ" అనే మకుటంతో శేష భట్టారు రామానుజాచార్యులు రచించిన శతకం ప్రచురించారు. "సంస్కారిణి గ్రంథమాల" అనే సంస్థ ద్వారా నెలకో పుస్తకం అందించే కార్యక్రమంలో భాగంగా "బాలికా విలాపం" అను గ్రంథాన్ని 1921లో తొలి గ్రంథంగా రచించారు. ఈ గ్రంథంలో సమాజంలో ఉన్న దురాచారాలు, దుర్నీతి ప్రజలందరికి తెలియచేసే ఉద్దేశంతో రచించారు. ఎవరినీ కించపరిచే ఉద్దేశంతో ఈ "బాలికా విలాప" రచనను చేపట్టలేదని నరసింహారావు గారు తమ అవతారికలో పేర్కొన్నారు.

నీలగిరి పత్రికా ప్రచురణకు నరసింహారావు గారి భార్య జానకీబాయి గారి ప్రోత్సాహం ఎంతోఉంది. కందుకూరి వీరేశలింగం గారి స్ఫూర్తితో స్త్రీ విద్య, వితంతు వివాహం ప్రయత్నాల కృషి నరసింహారావు గారు, జానకీబాయిలు చేపట్టారు. జానకీబాయి వితంతు సోదరి పునర్వివాహానికై దంపతులిద్దరు ప్రయత్నిస్తున్న సందర్భంలో నరసింహారావు బాలికా విలాపం ద్వారా బాల్య వివాహ వ్యవస్థను అంతమొం దించడానికి ఈ రచనను అందించారు. ఒక బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన నలుగురు అక్కచెల్లెళ్ళ దీనగాథే ఈ 'బాలికా విలాపం'. పసి వయసులో పెళ్ళి జరిగి ఈ సోదరీమణులు ఆదరణ లేక, ఇతరుల సహాయంలేక, ఆత్మహత్యకు ప్రయత్నిస్తారు. ఆ గాథనే 'బాలికా విలాపం'గా రచించారు.

నరసింహారావు గారి భార్య జానకీబాయి జీవితాన్ని "ఉదయలక్ష్మీ" అను పేరుతో శేషాద్రి రమణ కవులు రచించిన 107 పద్యాలను కూడా ప్రచురించారు. షబ్నవీసు వెంకట రామ నరసింహారావు గారి భార్య జానకీబాయి నీలగిరి పత్రికా ప్రచురణకు ఎంతో ప్రోత్సాహాన్ని అందించింది. కాని పత్రిక ప్రారంభించిన రోజే ఆమె మరణించింది. ఆమె జ్ఞాపకార్థం పత్రిక ముఖపత్రం మీద...

"పూస ప్రాయము నందు యీ భూవిని విడిచి
స్వర్గగతయైన తన తల్లి షబ్నవీసు
జానకీబాయి స్మారక శాసనముగ
నీలగిరి పత్రికా పుత్రి నెగడుగాత"

అనే పద్యాన్ని ప్రచురించేవారు. ఆమె జ్ఞాపకార్థం దేశాభివృద్ధి, భాషాభివృద్ధికాక ఆమె ఆత్మశాంతికై నీలగిరి పత్రికను నడిపారు. జానకీబాయి భర్తకు అన్ని విషయాలలో సహకరిస్తూ ప్రోత్సాహానిచ్చి తోడు నీడగా నిలిచిన ఆదర్శ గృహిణి. స్త్రీకి విద్యలేని రోజుల్లో గ్రంథాలు చదివి ధర్మం, నీతిని గ్రహించిన సద్గుణశీలి. షబ్నవీసు వెంకట రామ నరసింహరావు మిత్రులైన శేషాద్రి రమణ కవులు జానకీబాయి మరణానికి తపించి తమ మిత్రుల ఆవేదన తమ ఆవేదనగా భావించి, తమను ఆదరించిన ఆమె జీవితాన్ని స్మృతి కావ్యరూపంగా "ఉదయలక్ష్మి" పేర మలిచి ఆమె చరిత్రను లోకోత్తరం చేశారు. ఆమె కార్యాచరణను గూర్చి తెలుపుతూ....

"సంఘ సంస్కరణమ్ము సలుప నెంచును గాని
విగ్రహారాధన విముఖగాదు
విధలా జనోద్వాలూ విధనియ్యగొను గాని
ప్రౌఢ వివాహ తత్పరత లేదు
స్త్రీ విద్యకై కృంగి చేయుచుండును గాని
స్త్రీ స్వతంత్రమున కాగింపబోదు

భర్త కేలూతతో పనులు తీర్చును గాని
స్వచ్ఛంద మతితోట సాగిరాదు
తల్లిగా తండ్రిగా పతి తలంచుగాని
శూన్య వాదంబునకు మదిజొచ్చనీదు
జానకీ బాయి నాజన్య నా హృదయంబు
లభయ వంశంబులకు కీర్తి నొసగసాగె"

జానకీబాయి చివరి రోజులలో కూడా భర్త నిర్వహించిన కార్యక్రమాలకు బాసటగా నిలిచింది.

నీలగిరి పత్రికకు శ్రీ వెంకట రామ నరసింహారావే సంపాదకులు. నీలగిరి పత్రిక ప్రథమ సంపాదకీయంగా జానకీబాయి మరణాన్ని గూర్చే రాయబడింది. దాదాపు అయిదు సం॥రాలు నీలగిరి పత్రికను నిర్వహించారు. ఒద్దిరాజు సోదరులు ప్రారంభించిన వరంగల్‌లోని తెనుగు పత్రిక, నల్లగొండలోని నీలగిరి పత్రిక ఒకేసారి ప్రారంభ మయి ఒకేసారి నిలిపివేయబడ్డాయి.

నీలగిరి పత్రికలో నిజాం దేశ వార్తలు, నీలగిరి గ్రంథాలయాలు, నవలా ప్రపంచం, తాళపత్ర గ్రంథాలు, వృత్తాంతములు, పుక్కిటి పురాణాలు మొ॥లు శీర్షికలు ఉండేవి. షబ్నవీసు వెంకట రామ నరసింహారావు వ్రాసే సంపాదకీయాలు, ఆనాటి రాజకీయ, సాంఘిక, సాహిత్య, సంగీత, శిల్ప కళలకు సంబంధించిన అనేక విషయాలపై ప్రముఖంగా ఉండేవి. ఈ నీలగిరి పత్రిక కొన్ని ప్రతులు నాంపల్లిలోని వేమన గ్రంథాలయంలో మాత్రమే నేటికీ చూడవచ్చు.

ఈ పత్రికలో బూర్గుల రామక్రిష్ణారావు, మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి, శేషభట్టరు రామానుజాచార్యులు, శేషాద్రి రమణ కవులు, గవ్వా అమృతరెడ్డి సోదరులు మొ॥వి. ఎందరివో రచనలు ప్రచురించేవారు. శేషభట్టరు వెంకట రామానుజాచార్యులు రచించిన "ఆంధ్ర నామ సంగ్రహం" లకు పేరడీ పద్యాలు నీలగిరి పత్రికలో ప్రచురించబడ్డాయి. కె. రాములు "బుద్ధుని సందేశం" అనే పేరుతో ఒక శీర్షిక నిర్వహించేవారు. ఆంధ్ర ప్రాంతం నుండి తెలంగాణాలో అడుగుపెట్టిన శేషాద్రి రమణ కవులను శ్రీ వెంకట రామ నరసింహారావు గారు ఆదరించి నల్లగొండలో వీరి అవధానాన్ని ఏర్పాటు చేసి ఆర్థికంగా తోడ్పాటును అందించారు. ఆ మైత్రి నరసింహారావు మరణం వరకు కొనసాగి నీలగిరి పత్రికలో అనేక వ్యాసాలను, పద్యాలను రచించారు.

22 ఫిబ్రవరి 1925న ఆంధ్ర గ్రంథాలయ మొదటి మహాసభ మధిరలో జరిగినప్పుడు పింగళి వెంకట రామారెడ్డి గారు అధ్యక్షత వహించారు. దానిలో నీలగిరి గ్రంథాలయం తరపున శ్రీ షబ్నవీసు వెంకటరామ నరసింహారావు కూడా పాల్గొన్నారు.

షబ్నవీసు వెంకట రామ నరసింహారావు గారు ఈ పత్రిక నిర్వహణ సందర్భంగానే అనారోగ్యంపాలై 18 అక్టోబరు 1929న మరణించారు. వీరి మరణం తెలంగాణా లో జరిగిన ఆంధ్రోద్యమానికి సాహితీ సాంస్కృతోద్యమాలకు తీరని లోటు.

నల్లగొండలో ఆంధ్ర సారస్వత గ్రంథాలయ స్థాపకుడు, దురాచారాల నిర్మూలనకు ధర్మపత్ని సహకారం పొందిన వాడు, భాషా, సంస్కృతి వ్యాప్తికి 'నీలగిరి' వార్తా పత్రిక నడిపినవాడు "షబ్నవీసు వెంకట రామ నరసింహారావు మన "తెలంగాణా తెలుగు తేజమే".

## Writers & Addresses

**A.M. Thayaru**
Plot No.302, Shiva Ganga Towers,
Father Balayya nagar, Old Alwal,
Secuderabad.

**Annavaram Devender**
406, Maruthi Heaven, Bharat Nagar,
Karimnagar-505 001.

**Dr. Bellamkonda Sampat Kumar**
302, Sri Shiva Towers, Majira Nagar Colony,
Rd. No. 9, Old Alwal, Secunderabad-10.

**Dr. Bheempalli Srikanth**
H.No. 8-5-38, Teachers Colony,
Mahbubnagar - 509 001.

**Chetan K.**
8-43/36/3, East Balaji Hills,
Nr. Ayyappa Temple, Boduppal-500 039.

**Deshapati Srinivas**
Quarter No. 99, Jalavayu Vihar,
Arjun Theater Road, Kukatpally, Hyd.

**Dr. Ammangi Venu Gopal**
11-9-317, Laxmi Nagar, Rd No. 4, Kothapet,
R.K.Puram, Hyderabad-102.

**Dr. Anugu Narsimha Reddy**
H.No. 3-14-50, Vijaya Sri Colony,
Vanasthalipuram, Dilsukhnagar, Hyderabad.

**Dr. B. Mallaiah Chary**
H.No.2-10-4-1/302, V.S. Apts.,
Near Bharat Petrol Pump, Gokale Nagar,
Ramanthapur, Uppal, Hyd-13.

**Dr. B.S. Ramulu**
201, Sulekha Golden Towers, 2-2-186/53/5,
Ramakrishna Nagar Bagh Amberpet,
Hyderabad - 500013.

**Dr. B.V.N. Swamy**
H.No. 9-6-161, Ram Nagar,
Karimnagar-505 001.

**Dr. Ch. Lakshmana Chakravarthy**
H.No. 2-3-402, Krishna Nagar Colony,
Machabollaram, Alwal,
Secunderabad-500 010.

**Dr. Chavva Venkata Reddy**
H.No. 1-9-37, Road No.1, Lane 27,
Ravi Shankar Colony, Habsiguda, Hyd-07.

**Dr. Cheedella Sitamahalakshmi**
Plot No. 30, Hasthinapuram Central,
Vyshalinagar Post, Sagar Road,
Hyderabad - 79.

**Dr. Cheppela Harinatha Sarma**
Government Degree and P.G. College,
Siddipet-502 103.

**Dr. Dasoju Padmavathi**
Plot No. 301, Sapthagiri Heights , Srinagar
Colony, Opp. Pochamma Temple, Kushaiguda,
Medchal Dist.

**Dr. Devaraju Maharaju**
G1, Aastha Heights, Opp. Aparna Sarovar,
HCU Post, Nallagandla, Gopanpalli Road,
Hyderabad-46.

**Dr. Devulapalli Prabhakar Rao**
Rajesh Nilayam, 1st floor, Street No. 3,
Nallkunta, Hyderabad-44.

**Dr. Gummannagari Bala Srinivas Murthy**
Street No. 20, 6-242/6, M.N. Reddy Nagar,
Nr.Suchitra Circle, Secunderabad.

**Dr. J. Chennaiah**
Plot No. 92, Flat no.502,
Jayabheri Vijayalakshmi Homes,
Motinagar,
Hyderabad-18.

**Dr. J. Vijayakumar ji**
Flat No. 405, ABR Residency,
Sai Ram Colony,
Saidabad, Hyderabad-500059.

**Dr. Karnati Lingayya**
Plot No. 26, H.No. 33-26, T.S.R. Nagar,
Phase-II, Meerpet P.O., Saroornagar Mandal,
Hyderabad-500097.

**Dr. Kondapalli Niharini**
H.No. 1-2-214/5/1, Domalguda,
Hyderabad-29.

**Dr. M. Devendra**
H.No. 12-5-35/A/9,4 FB, Ballad Estate,
Tarnaka, Secunderabad - 70.

**Dr. Madikonda Shyam Sunder**
H.No. 1-8-702/26/1/2, Flat No. 401,
Sai Amrutha Apts., Padma Colony,
Nallkunta, Hyderabad - 44.

**Dr. Masana Chennappa**
9-76-2, Uday Nagar Colony,
Boduppal, Hyderabad-92.

**Dr. Mavisri Manikyam**
H.No. 20-2009, Papi Reddy Nagar,
Serilingampalli, R.R. Dist.-19.

**Dr. Motkuri Manikya Rao**
Flat No. 301, Shiva Sai Apts., Gokale Nagar,
Ramanthapur, Hyderabad-13.

**Dr. Muktevi Bharathi**
Plot NO. 258, Road No. 4, Trinuthi Colony,
Mahendra Hills, Secunderabad-500026.

**Dr. Naleshwaram Sankaram**
16-11-774/1, Sharada Apts., Moosaram Bagh,
Hyderabad-36.

**Dr. Nanumasa Swamy**
12-10-682, Udayasri Nilayam, JRT Colony,
Seetaphal Mandi, Secunderabad-06.

**Dr. Nori Rajeshwar Rao**
Sai Amruth Apts., 4th floor, 402, Padma
Colony, Nallkunta, Hyderabad-44.

**Dr. Pasunuri Ravinder**
Flat No. 406, Gulmohar Park,
Serilingampally,
Hyderabad - 500019.

**Dr. Pattipaka Mohan**
National Book Trust of India,
Osmania University Campus, Hyderabad.

**Dr. R. Kamala**
Flat No. 502, Lotus Gagan Vihar Apts.,
Domalguda, Hyderabad-29.

**Dr. Ravikanti Vasunandan**
H.No.6-35/26, Malla Reddy Enclave,
Sai Colony, Berumguda, Hyderabad-32.

**Dr. S. Jathin Kumar**
Janta Hospiital, HMT Road, Chintal,
Hyderabad-54.

**Dr. S.M. Pran Rao**
H.No. 9-14/1, Ravinder Nagar Colony,
Habsiguda, Hyderabad-07.

**Dr. S.V. Satyanarayana**
Vice Chancellor, Telugu University,
Nampally, Hyderabad.

**Dr. Sangisetty Srinivas**
Flat no. 212, Nandanavanam Apts., Attapur,
Hyderabad-48.

**Dr. Sunkireddy Narayana Reddy**
Plot No. 69, Sai Nagar, Mushrupalli Road,
Nalgonda-508 001.

**Dr. Surabhi Vani Devi**
Surabhi Education Society, 86 Madhapur,
Hyderabad.

**Dr. T. Gowri Shankar**
1-1-217,Vivek Nagar,
Chikkadpally,Hyderabad-20

**Dr. Tirumala Srinivasa Charya**
A 40-201, Singapore (Sanskruti) Township,
Ghatkesar Mandal, Medchal Dist.,
Hyderabad-82.

**Dr. Tirunagari Devaki Devi**
Sai Ram Symphoy Buildings,
Flat No.13, 1st Floor, Anand Nagar,
Khairtabad, Hyderabad.

**Dr. Tirunagari Ramanujaya**
H.No.6-17/5, D.Nagar, Chintal HMT,
Hyderabad-54.

**Dr. V. Jaya Prakash**
T.S. Model School, Regoele (VDM),
Medak-502 290.

**Dr. V. Rama Koti**
H.No. 7-44-/2, Viharika Enclave,
Medipally-98.

**Dr. V.V. Rama Rao**
Flat No. 104, Highlight Heaven, Street No. 6,
Jaya Nagar, Habsiguda, Hyderabad-07.

**Dr. Veludanda Nityanandarao**
Department of Telugu,
Osmania University, Hyderabad.

**Dr. Vishnu Vandana Devi**
1-5-577/1, Chetana Housing Colony, Old
Alwal, Secunderabad - 500010.

**Dr. Yelluri Siva Reddy**
Siva Residency, 1-1-336/77, Vivek Nagar,
Chikkam, Hyderabad.

**Dr. G. Chennakeshava Reddy**
Plot no.5, Cyber Meadows, Masid Banda,
Cambridge School, Konpur, Hyderabd-84.

**G. Venkata Ramarao**
18-7-739/2, Gowlipura, Gandhi Statue,
Sri Ramnagar Colony, Hyderabad - 50.

**G.V. Krishna Murthy**
Retd. PGHO, H.No.8-5-434,
Raghavendra Nagar, Karimnagar - 505 001.

**Dr. Gandra Lakshman Rao**
H.No. 10-3-537, Vivekananda Puram, Rd.
No.3, Karimnagar-505 001.

**Dr. Gannamaraju Girija Manohara Babu**
2-11-501/5, Vijayanagar Colony,
Hanumakonda-506009.

**Gannu Krishnamurthy**
Retired Lecturer, Kamareddy.

**H. Ramesh Babu**
H.No. 15-108/20/A, Nagarkurnool - 509 205.

**Inampudi Shrilaxmi**
103, Durga Apartments, Durganagar Colony,
Somajiguda, Hyderabad-500082.

**Jwalitha**
Aksharavanam', Flat No. 202,
Seshasai Paradise, Vijayanagar Colony,
Khammam-507002.

**K. Yadav Reddy (Nikhileshwar)**
H.No. 2-2-647/185/107, Sharada Nagar,
Bagh Amberpet, Hyderabad-13.

**Kala Krishna**
105, Shivaleela Apts., 7-1-2,
Begumpet, Hyderabad.

**Kandalai Raghavacharyulu**
Ranga Prasad Residency, Flat No. 403,
Serilingampalli, Hyderabad-19.

**Dr. M. Dattatreya Sharma**
H.No. 20-1499/6/1, Rd. No.1,
West Kakatiya Nagar, Neredmet,
Secunderabad-56.

**Dr. M. Purushottama Charya**
616, Sri Ramachandra Enclave,
Ramagiri, Nalgonda.

**Mereddy Yadagiri Reddy**
Plot No. 51, Alkapuri Colony, MLG Road,
Nalgonda-508 001.

**Nagilla Ramasatry**
2-7-458, Excise Colony, Subedari,
Hanumakonda, Warangal.

**P.V. Rammohan Naidu**
103, Grand Apts., Aurora Colony, Road no. 3,
Banjara Hills, Hyderabad-34.

**Ponnam Ravichandra**
7-2-990, Mankamma Thota,
Karimnagar-505 001.

**Pramod Avadhani**
16-7-464/6, SBH Colony,
Azampura, Hyderabad-500024.

**Prof. G. Chennakesava Reddy**
Villa No. 5, Cyber Medows,
Opp. Jain Heritage School Road,
Masjid Banda, Kondapur, Hyd- 84.

**Prof. Rama Chandramouli**
11-24-498, Telephone Bhavan Lane,
Pochamma Maidanam Lane, Warangal.

**Prof. S.V. Rama Rao**
205, Sai Balaji Residency, Chitra Layout, LB
Nagar, Hyderabad-74.

**Punna Anajayya**
H.No. 6-2-954/2, Meerbagh Colony,
Hyderabad Road, Nalgonda-508 001.

**Dr. R. Surya Prakasha Rao**
FZ Om Residency, Uma nagar,
Medchal-501 401.

**Rayaprolu Ramana**
Journalist, B7, 2nd Floor,
Indian Bank Apartments, New Bakaram,
Gandhinagar, Hyderabad.

**S.Bhanu Sri Devi**
C/o Rajaseker, Plot no.115/2,
Mata laksmi Nagra, Saroor nagar, Hyd-35

**Shabnaviz Indira**
H.No. 34-39/3/4, Vivekananda Puram ,
Sainikpuri, Secunderabad-94.

**Shabnaviz Venkata Rangarao**
H.No. 34-39/3/4, Vivekananda Puram ,
Sainikpuri, Secunderabad-94.

**Sreedhar Beechuraju**
G-1, Rajamannar Residency,
H.No. 8-3-222/B/7/10, D-31,
Madhuranagar, Ameerpet, Hyd-38.

**Sriramoju Hara Gopal**
202, Medha Residency, Near Old Lions Club
Hospital, West Maredpally, Secunderabad-26.

**Tummuri Ram Mohan Rao**
H.No. 11-5-173, Sreet No.5,
Rayancha Avenue, Feerzadi Guda, Uppal,Hyd.

**Undrala Rajesham**
20-105/28, Vinayaka Nagar, Siddhipeta,
Medak District.

**V. Chennaiah (Doraveti)**
F 1- 101, SLB Nilayam,
H.No.1-4-938/2/A, Bakaram,
Musherabad,
Hyderabad-20.

**V. Padma**
Journalist, Krishi TV,
Centre for Sustainable Agriculture,
Nargarjuna Nagar, Tarnaka, Hyderabad.

**V. Shanthi Prbodha**
H.No. 3-6-69/402, Venkat Rama Towers ,
Sky Line Center, Basheer Bagh, Hyd - 29.

**V.K. Premchand**
11-4-654/2, Red Hills, Near Nilofar Hospital,
Lakadi-ka-pul, Hyderabad-4.

**V.R. Vidyarthi**
2-7-1083, Kanakadurga Colony, Vaddepalli,
Warangal.

**Vadla Sailu Chary**
S/o. Malliah, Uttulur(V),
Peddashankarmpet(M), Medak(Dist)-502 271.

**Vajhala Sivakumar**
Sivananadalahari', 1-20-198/2, Gokul Nagar,
Venkatapurama, Secunderabad-500050.

**Varala Anand**
8-4-641, Hanuman Nagar, Karim Nagar.

**Vedartham Madusudana Sharma**
Opp. MRO Office, Raju Street, Koppalur Post,
Nagar Kurnool-509 102.

**Velichala Kondala Rao**
11-4-654/2, Red Hills, Near Nilofar Hospital,
Lakadi-ka-pul, Hyderabad-4.


**Venu Sankoju**
5, LIGH, Housing Board Colony, Rajeev Park,
Nalgonda - 508 001.




ಡಾ. ಸಿ. ನಾರಾಯಣ ರೆಡ್ಡಿ



కొండా లక్ష్మణ్ బాపూజీ




పొట్లపల్లి రామారావు



రామానంద తీర్థ




ఆర్. విద్యాసాగర్‌రావు



గడియారం రామకృష్ణ శర్మ





ప్రొ. జి. రామ్‌రెడ్డి


కొమర్రాజు వెంకట లక్ష్మణరావు






యం.ఎల్. జయసింహ

పల్లా దుర్గయ్య




ధవళా శ్రీనివాసరావు

నటరాజ రామకృష్ణ

రాజబహద్దూర్ వెంకటరామిరెడ్డి

ముకురాల రామిరెడ్డి




కుమ్రం భీం

కోదాటి నారాయణరావు




పాలకుర్తి ఐలమ్మ

కాపు రాజయ్య



ఇల్లిందల సరస్వతీ దేవి



ఆరుట్ల కమలాదేవి



ఈశ్వరీబాయి



బొమ్మ హేమాదేవి






చుక్క సత్తయ్య

సిరికొండ వెంకటరావు





రాజన్‌బాబు

అలిశెట్టి ప్రభాకర్





బి.యస్. నారాయణ

రావి నారాయణరెడ్డి





రావెల్ల వెంకట రామారావు

జ్వాలాముఖి






శంకర్

మచ్చ వీరయ్య





జస్టిస్ కుమారయ్య

యం.యస్. ఆచార్య



దొడ్డి కొమురయ్య



సిద్దప్ప వరకవి




చందా కాంతయ్య



భూపతి కృష్ణమూర్తి



కాల్వ బాలయ్య



చొప్పకట్ల చంద్రమౌళి



ఆనందరావు తోట




వేముల పెరుమాళ్ళు





అనుముల కృష్ణమూర్తి

అజిత్





కాళోజీ రామేశ్వరరావు

వేముగంటి నరసింహాచార్యులు





దేవులపల్లి వేంకటేశ్వరావు

భానుప్రకాష్






కేశనకుర్తి వీరభద్రాచారి

సైబ పరందాములు




చిలువేరు రామలింగం

సాహు

గూడ అంజయ్య

గుమ్మన్నగారి లక్ష్మినరసింహాశర్మ

## *Our Sincere Thanks to....*

**Sri ESL Narsimhan**
Hon'ble Governor
Telangana State

**Sri Ch. Vidyasagar Rao**
Hon'ble Governor
Maharashtra State

**Sri Swamy Goud**
Hon'ble Chairman
Legislative Council

**Sri S. Madhusudana Chary**
Hon'ble Speaker,
Legislative Assembly

**Sir Kadiyam Srihari**
Hon'ble Deputy Chief Minister

**Sir Mahamood Ali**
Hon'ble Deputy Chief Minister

**Smt. Kalvakuntla Kavitha**
Hon'ble M.P.
Nizamabad

**Sri Pocharam Srinivas Reddy**
Hon'ble Minister for
Agriculture & Co-operation

**Sri T. Hareesh Rao**
Hon'ble Minister for Irrigation

**Sri K.T.Rama Rao**
Hon'ble Minister for IT & MAUD

**Sri S P Singh, IAS**
Chief Secretary

**Sri S. Narsinga Rao, IAS**
Principal Secretary to Hon'ble CM

**Sri B.V.Paparao, IAS (Retd.)**
Hon'ble Advisor


**Sri B.P. Acharya, IAS**
Prl. Secretary, Planning

**Sri C. Parthasarathi, IAS**
Prl.Secretary Agrl. & Coopn.

**Sri Bhoopal Reddy, IFS (Retd.)**
Spl. Secretary to Hon'ble CM

**Sri Deshapathi Srinivas**
OSD to Hon'ble Speaker

**.... Harikrishna Mamidi.**



డైరెక్టర్
**భాషా సాంస్కృతిక శాఖ**
కళాభవన్, రవీంద్రభారతి,
హైదరాబాద్

ISBN : 978-81-936345-7-8